Author of Highest
Number of Novels In Telugu



సూర్యదేవర రవి మోహన రావు

యాత్ర-1

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author

సూర్యదేవర రామ్‌మోహనరావు

యాత్ర-1

(మొదటి భాగము)

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

YATRA - I

(Serialised in "Swathi" Weekly)

By

SURYADEVARA RAM MOHANA RAO
Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Navanirman Colony, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
MADHU PRIYA PUBLICATIONS
Machavaram, Vijayawada - 520 004
Phone : 9441194605
E-mail : madhupriyapublications@gmail.com

First Edition : **2018**

Price : ₹ **130.00**

Cover Design :
BAPU

Printers :
SRI CHAITANYA OFFSET PRINTERS
Vijayawada-2

యాత్ర-1

ఒకే వేటు.

పస్‌న తెగి జలజలమని శబ్దం చేస్తూ నేలకూలింది పచ్చటికొమ్మ. శబ్దం వింటూనే ముందుపోతున్న వృద్ధయోగి చివ్వున వెనుతిరిగి చూశాడు.

ఆయన చూపుల తీక్షణతను చూసి కంగారుపడుతూ ఆయన్ని అనుసరిస్తున్న సేవకులిద్దరూ అక్కడే ఆగిపోయారు. ఒకడి చేతిలో ఉంది పొడవాటి కత్తి. వాడు నరికిన కొమ్మ నేలమీద అడ్డంగా పడుంది.

"వృక్షో రక్షతి రక్షిత:!, అన్నారు పెద్దలు. మూర్ఖా. ఆ వృక్షశాఖ నెందుకు నరికావు?" ప్రశాంతవదనంతో అడిగాడాయన.

"గురువుగారూ... ఇది దారికి అడ్డంగా ఉంది. అందుకని...." నసిగాడు నరికినవాడు.

"నేను కొమ్మ కిందనుంచి దూరివచ్చాను గదా. రాలేకపోయారా? పక్కకు తప్పుకోవడానికి అవి పశువులు కాదు, పచ్చని చెట్లు. మనమే తప్పుకుపోవాలి. వృక్షము యొక్క అంగములు శాఖలు. ఆకులు వాటికి ఆహారాన్నందిస్తాయి. కొమ్మ నరికితే పచ్చటి ఆ కొమ్మ ఎండిపోతోంది. వృక్షానికి ఆహారం తగ్గుతుంది. మిమ్మల్ని ఆకలితో మాడిస్తే ఆకలి బాధ ఏమిటో మీకు తెలుస్తుంది. చెట్లనుగాని కొమ్మలనుగాని నరకటం మహా పాప కార్యం. అవసరమైతే తప్ప కత్తి వాడకూడదు. ఇది కీకారణ్యం.

మనమే దారి చూసుకుపోవాలి. అర్థమైందా?" మేఘ గంభీర స్వరంతో పలిందాయన గొంతు.

బుద్ధిమంతుల్లా తలాడించారు ఇద్దరూ.

ఆ ఇద్దరిలో ఒకడు ఆయన కారు డ్రైవరు. కత్తి పుచ్చుకుంది వాడే. అతడి పేరు కాశి. రెండోవాడు ఆయన సేవకుడు. పేరు పులికొండయ్య. స్థానిక గిరిజనుడు. రంపచోడవరం అటవీప్రాంతంలోని చెట్టు, పుట్ట, కొండ, కోన అన్నీ వాడికి తెలుసు.

ఇంకా చెప్పాలంటే అతడి తండ్రి పులిమల్లు కూడా కట్టెదుట వున్న ఆ గురుస్వామి దగ్గరే పనిచేశాడు. ఆయన గతించాక ఆయన స్థానంలో పులి కొండయ్య పనిచేస్తున్నాడు.

అప్పటికి సూర్యోదయమై ఎంతోసేపు కాలేదు. అది దట్టమైన రంపచోడవరం అటవీప్రాంతం. అడవి మీద మంచు పరదాలింకా కన్పిస్తున్నాయి. శీతాకాలం ఆరంభరోజులవి. పక్షుల కిలకిలారావాలతో వాతావరణం ఆహ్లాద భరితంగా ఉంది. చల్లటి శీతల గాలులు వీస్తున్నాయి.

చెట్ల గుబురు కొమ్మల్ని చీల్చుకుని లేత సూర్యకిరణాలు పొగమంచులో దూసుకొస్తున్న దృశ్యం నయనమనోహరంగా ఉంది. ఆకులమీద మంచు బిందువులింకా మంచి ముత్యాల్లా మెరుస్తూనే ఉన్నాయి.

ఎదురుగా వున్న స్వామి సామాన్యుడు కాదు. ఆరడుగుల ఆజానుబాహుడు.

చూడ్డానికి ఎనభై దాటని వృద్ధుడిలాగానే ఉన్నాడు గాని ఆయన వయసు నూట అయిదు సంవత్సరాలంటే ఎవరూ నమ్మరు. కాని అదే నిజం. తెల్లగా వెండి తీగల్లా ఉన్న జుత్తును లాగి తలమీద ముడివేసుకున్నాడు. నిడుపాటి గుబురు గడ్డం బొడ్డును తాకుతుంది.

కావిపంచె కట్టాడు. భుజం మీద కావితుండు వేసుకున్నాడు. చొక్కా ధరించలేదు. ఛాతీకి అడ్డంగా యజ్ఞోపవీతం ప్రకాశిస్తోంది. కుడిచేతిలో వెండి పొన్ను కర్ర, కాళ్ళకి కిర్రుచెప్పులు, మెడలో రుద్రాక్ష – తులసి – శ్రీగంధంతో కూడిన మాలలున్నాయి.

ఆయన శరీరం బంగారు వన్నెఛాయలో మెరిసిపోతోంది. కాని ఆ వంటి మీది చర్మం ఎక్కడా ముడతలు పడిన జాడ కన్పించదు.

మనిషి సన్నగా, పొడవుగా వున్నాడు. విశాలమయిన ఛాతీ, సన్నటి నడుం, కోటేరులాంటి ముక్కు, సూదంటురాళ్ళలా ఆకర్షించే చురుకైన చూపులు, శంఖంలా మెడ, తెల్లటి గుబురు కనుబొమలు, పాల భాగంలోని మూడు ముడతలు ఆయన విశేష అనుభవాల్ని చాటుతున్నాయి.

వందేళ్ళు దాటినా ఆ మహనీయుని నడుం వంగలేదు. కంటి చూపు తగ్గలేదు. ఒక్క పన్నుకూడా ఊడలేదు. నుదుట విభూదిరేఖలు భ్రూమధ్యంలో ఎర్రటి బొట్టుతో చూడ్డానికి కైలాసం నుండి దిగివచ్చి వనవిహారం చేస్తున్న కైలాసనాధుడా అన్నట్టు ఆశ్చర్యం గొలిపే అద్భుత రూపం ఆయనది.

ఆయన ఎవరు. ఎక్కడివాడనే సందేహం కలగవచ్చు. ఆయన పేరు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

ఆయన గురించి చెప్పాలంటే మాటలు చాలవు. అనేక విద్యలకు నిలయం ఆయన. పదిభాషలు అనర్గళంగా వ్రాయను, చదవను, మాట్లాడను తెలిసిన విద్వాంసుడు. గొప్ప ఆయుర్వేద వైద్యుడు. మంత్ర తంత్ర యంత్ర యోగసాధనలో దిట్ట. అద్భుతాలు సాధించిన అసాధారణమైన వ్యక్తి.

అడవిలోని ఆకు అలములన్నీ అయనకు కొట్టినపిండి. ఏ మూలికలు ఏ ప్రాంతంలో దొరుకుతాయో, ఏ సీజన్‌లో దొరుకుతాయో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలీదు.

స్వతహాగా ఆయుర్వేద వైద్య కుటుంబం నుంచి వచ్చినవాడు గావటం చేత నిత్యపరిశోధకుడు. ఆయుర్వేదంలో వివిధ ప్రయోగాల ద్వారా కొత్త మందుల్ని ఆవిష్కరిస్తుంటాడు.

ఆయన గొప్ప శివభక్తుడు. యోగసాధకుడు తపశ్శాలి. వేద వేదాంగాలు, అష్టాదశపురాణాలు, ఇతిహాసాలను ఔపోసపట్టిన విద్యాంసుడు. చూడ్డానికి సాధారణ సాధువులా వున్న ధన్వంతరీ అగ్నివేశాచార్యుల వారికి దేశవిదేశాల్లో మంచి పేరుంది. ఆయన రాసిన సుప్రసిద్ధ ఆయుర్వేద గ్రంథాలు అనేకం ఉన్నాయి.

ఆయన చేయి తాకితే చాలు ఎలాంటి రోగమైనా పారిపోతుందని చెప్పుకుంటారు. అయితే ఆయన దర్శనం దుర్లభం. చాలా అరుదుగా సామాన్యులకు కన్పిస్తుంటాడు. నిరంతర అన్వేషి, ఎప్పుడు, ఎక్కడ ఉంటాడో బంధువర్గానికిక్కూడా తెలీదు.

"ఏమిరా పులికొండయ్య?" ముందు నడుస్తున్న అగ్నివేశాచార్యులవారి పిలుపు విని ఉలికిపడ్డాడు సేవకుడు పులికొండయ్య. "అయ్యా, మీ వెనుకే వస్తున్నాం" అనరిచాడు వెంటనే.

చేతికర్రతో పొదలు, చిరుకొమ్మల్ని తప్పించి చకచకా ముందుకు సాగుతున్నాడాయన. కిర్రు చెప్పుల మోత, చేతికర్ర మువ్వల శబ్దాలకు సమీపంలోని పురుగుపుట్ర దూరంగా తొలగిపోతున్నాయి.

కురు వృద్ధుడైనా ఆయన నడకలో కొంచెంకూడా తడబాటులేదు. యువకుడిలా చరచరా నడుస్తున్నాడు.

"మీ నాయన బతికివున్న రోజుల్లో తనెప్పుడూ నాకు ముందే నడిచే వాడురా! నువ్వు వెనకబడిపోతున్నావ్. మీ నాయన హుషారు నీలో లేదు. ఎందుచేత?" నడుస్తూనే అడిగాడు ఆచార్యుడు. ఆయన ప్రశ్నకు ఎలా బదులివ్వాలో తెలీక తికమకపడ్డాడు పులికొండయ్య.

"అయ్యా. మా నాయన కాలం వేరు. మా కాలం వేరు. ఆ జవసత్వాలు ఇప్పుడెక్కడివి...."

"కాలాన్ని వేరు చేయకురా. ఏ కాలమైనా ఒక్కటే. మనం ఏది కోరుకుంటే అదే ఇస్తుంది. నన్ను చూడు. కాలాన్ని ఎదిరించి నిలబడలేదూ?..."

"మీతో మాకు పోలికా స్వామీ! మీరు కొండశిఖరం లాంటివారు– మేం కొండ కింద గులకరాళ్ళ వంటివాళ్ళం. మా నాయన అదృష్టవంతుడు. తను బతికినంతకాలం మీ సేవలోనే గడిపాడు. మీ అంతటి వారికి ముందు నడిచే యోగ్యత నాకు లేదు సామీ. అందుకే మీ వెనకే వస్తున్నా" అంటూ బదులిచ్చాడు పులి కొండయ్య.

"ఊ... నువ్వు మాటలతోనే ఒతికేస్తావురా. మీ నాయనకిన్ని మాటలు తెలీదు. యోగ్యత ఎవరికి వారు నిర్ణయించుకునేది కాదు.

ఎదుటివారు నిర్ణయించాలి. ఆమ్లవృక్షః సదాసేవ్యం, తచ్ఛాయ ఫల భక్షణం ఆయురారోగ్య శాంత్యర్థం, సేవనీయః బుధోత్తమైః అన్నారు"

శ్లోకానికి అర్థం తెలీక బుర్ర గోక్కున్నాడు పులి కొండయ్య. పక్కన నడుస్తున్న కాశి వంక చూశాడు. తనకూ తెలీదని బుర్ర అడ్డంగా ఊపాడు వాడు.

"అంటే అర్థం ఏంది సామీ?" ధైర్యం చేసి తనే అడిగేశాడు పులి కొండయ్య.

అడుగులు ముందుకు సారిస్తూనే బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు.

"బుధోత్తమైః అనగా ఉత్తములైన బుధులు. బుధులు అంటే జ్ఞాన వంతులు, తెలివైనవారని అర్థం. తెలివి వుంటే చాలదు. వారు మంచివారై ఉండాలి. ఆమ్లవృక్షం సదాసేవ్యం... అనగా సదా ఉసిరిచెట్టును పూజించాలని అర్థం. ఆమ్లవృక్షం అనగా ఉసిరిచెట్టు.

కాబట్టి ఈ శ్లోకార్థం ఏమంటే ఆయురారోగ్య వృద్ధిని కోరుకునేవారు సదా ఉసిరిచెట్టును పూజిస్తూ దానినీడలో ఉసిరిఫలాలను తింటూండాలని అర్థం.

కాబట్టి ఉసిరిలో రాచ ఉసిరి శ్రేష్ఠం. వీటిని తినే వారికి మధుమేహం, రక్తపోటు వంటివి దరిచేరవు. ఆరోగ్యాన్ని అందించే అద్భుతమైన చెట్టు ఉసిరిచెట్టు" అంటూ వివరించాడు.

"అర్థమైంది సామీ. మీరు ఉసిరిచెట్టు లాంటోరు. అందుకే మీ సేవలోనే జీవిస్తున్నాను" అన్నాడు పులికొండయ్య.

"ఉత్తినే జీవిస్తే చాలదురా మూర్ఖా. నమ్మకంతో జీవించాలి. నా మీద నమ్మకం ఉంటే నాకన్నా ముందు నడుస్తావ్. అలా వెనుకకాదు. నేనుండగా ఏ

పురుగూ నిన్నేమీ చేయదు. రా... నాకు ముందు నడువ్ చూద్దాం." ఆ మాటలతో పులికొండయ్యకి రోషం వచ్చింది.

"సామీ నన్ను రెచ్చగొడుతున్నారు. నాకెలాంటి భయమూ లేదని ఇప్పుడే... ఇప్పుడే నిరూపిస్తాను చూడండి" అంటూ చరచరా ముందుకెళ్ళాడు.

అయిదడుగులు వేశాడో లేదో అంతలో తనకన్నా వేగంగా తన పక్కన ఏదో జరజరా పాకటం చూసి అదిరిపడి "అయ్యబాబోయ్ పాము... పాము" అనరుస్తూ ఎగిరి వెనుక వస్తున్న కాశి మీద పడి వాటేసుకున్నాడు. ఆ అరుపు వినగానే అక్కడే ఆగి చివ్వున వెనుతిరిగి చూశాడు అగ్నివేశాచార్యుడు.

నిజంగానే పాము. పులికొండయ్య బెదిరిపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయిదు మూరల పొడవున నిగనిగ మెరుస్తున్న కృష్ణసర్పం. వాళ్ళిద్దరి పక్కగా రివ్వున వచ్చేస్తోంది.

ఎప్పుడైతే ఆచార్యుడు వెనుతిరిగి చూశాడో ఆ మరుక్షణం అది మంత్రం వేసినట్టు అక్కడే ఆగిపోయి చుట్టచుట్టుకుని మూడడుగుల ఎత్తున చేటంత పడగ లేపి ఆడనారంభించింది.

అంత పెద్ద సర్పాన్ని చూడగానే భయంతో కొయ్యబారిపోయి ఉన్న చోటే నిలబడిపోయారు సేవకులిద్దరూ. అయితే ఒక అద్భుతం కళ్ళ ముందు కన్పిస్తోంది ఇద్దరికీ.

అంతటి కృష్ణసర్పం తనను సమీపిస్తున్న ఆచార్యుడిని చూసి వినయంగా నమస్కరిస్తున్నట్టు పడగను నేలకు వాల్చి నెమ్మదిగా పైకి లేపింది.

"శివోహం! ఏమైందయ్యా పొద్దుటే ఇలా వచ్చావ్?" ఎవరో ఆప్తుడ్ని పలకరించినట్టు ఆ నాగాన్ని ఆప్యాయంగా పలకరించాడాయన.

నాల్కలు తాకుతూ ఆయన్నే చూస్తోందా ఉరగం. దాని రూపం చూస్తున్న సేవకులిద్దరికీ పై ప్రాణాలు పోయినంత భయంగా ఉంది.

ఏ క్షణంలో ఏం చేస్తుందోనని కంగారు. కాని ఆ వృద్ధ ఆచార్యునికి అది ఆటబొమ్మలా ఉంది. నిర్భయంగా వంగి పడగమీద చేయి ఉంచాడు.

"నీ ఆగడాలు తట్టుకోలేక ఆ మహేశుడు తన మెడలోంచి లాగి నిన్ను నేల మీద పడేశాడా? ఎవరికోసం వచ్చావయ్యా... నాకేమన్నా చెప్పాలను

కుంటున్నావా? పనిమీద పోతున్నాను. వెళ్ళిపోరాదూ?" అన్నాడు సర్పం వెళ్ళలేదు. ఉన్నట్టుండి కదిలింది. ముందుకొచ్చి ఆయన కాళ్ళను చుట్టుకొని వీపుమీదుగా భుజంమీదికెళ్ళి మెడను చుట్టుకొని తలమీద పడగనివిప్పింది. దీని చర్యతో అగ్నివేశాచార్యుడి ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్టు కన్పించింది.

ఆ నాగరాజు సూచనలు గ్రహించగల శక్తి ఆయనకుంది. ఆవేమీ తెలీని సేవకులు ఇద్దరూ శిరస్సున సర్పంతో నటరాజులా వెలిగిపోతున్న ధన్వంతరీ అగ్నివేశాచార్యులను చూసి పులకించిపోతూ సాష్టాంగపడి నమస్కరించారు. "సర్పరాజా... ఏమైందయ్యా. మా వాళ్ళకు ఎవరికి ఏమపకారం జరిగింది?" ఆందోళనతో పలికింది ఆచార్యుడి గొంతు.

అదే సమయంలో – డ్రైవరు కాశిభుజానవున్న బ్యాగ్‌లోంచి శాటిలైట్ ఫోన్‌మోగిన శబ్దం అందర్నీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.

*　　*　　*　　*　　*

అమ్మా, దేవమ్మ తల్లి. ఎక్కడున్నావమ్మా. నా మనవరాలు చచ్చిపోయేలా వుంది. త్వరగా బయటకు రా తల్లీ. అర్జంటుగా మావయ్యను పిలమ్మా...." బయటినుంచి దుఃఖభరితమైన పరిచిత స్వరం వింటూనే ఉలికిపడింది దేవమ్మ.

చేస్తున్న పనిని అలాగే వదిలేసి వేగంగా భవంతిలోంచి బయటికి పరుగెత్తుకొచ్చింది. ఆమెతోబాటే మనవరాలు శ్రావణి. మరికొందరు కూడా గబగబా బయటికొచ్చారు.

ఎదురుగా ఒక పెద్దాయన ఎనిమిదేళ్ళ పాపను చేతులమీద మోసుకొస్తూ గొల్లుమంటున్నాడు. ఆయన వెనుకే బంధుజనం కొందరు ఉరుకులు పరుగులమీద వస్తున్నారు.

పాప నోటివెంట సబ్బునురగలా నుచ్చలు గ్రక్కుతోంది. చూడగానే విషయం అర్థమైపోయింది దేవమ్మగారికి. పాపను పాము కరిచింది.

గబగబా వాకిట్లోకి వచ్చింది డెబ్భై సంవత్సరాలు దాటిన వయసులోని దేవమ్మ, వృద్ధుడి చేతుల్లోని పాపను చూసింది. పరిస్థితి చాలా విషమంగా ఉంది. పాపకళ్ళు తేలవేస్తోంది. నోటి వెంట నుచ్చలు వస్తున్నాయి. బ్రతుకుతుందోలేదో తెలీదు.

పాము కరిచి కూడా ఎక్కువసేపు అయినట్లులేదు. "వద్దంటే వినకుండా పూలకోసం సంపెంగ పొద వద్దకెళ్ళిందమ్మా. నాగపాము కాటేసింది."

"పామును చూశారా?" అడిగింది దేవమ్మ.

"కనబడిందమ్మా, గోధుమ త్రాచు" ఆయన వెంట వచ్చిన వాళ్ళలో ఒకరు చెప్పారు.

పాపను ఆరుగుమీద పరుండజేశారు. క్షణాల్లో చుట్టుపక్కల జనం చేరిపోయారు. అందరిలోనూ ఒకటే ఉత్కంఠత. పాప బతుకుతుందా!

ప్రశాంతమైన ఆ ఇంటి వాతావరణం ఒక్కసారిగా రణగొణధ్వనితో నిండిపోయింది.

పాప తాలూకు తాతగారి పేరు శివగోపయ్య. ఆయన దేవమ్మగారి బంధువర్గంలోవాడే. ముఖ్యంగా దేవమ్మ మావగారైన ధన్వంతరీ అగ్నివేశాచార్యులకు మిత్రుడు, కావలసినవాడు.

"కంగారు పడకయ్యా, సమయానికి మావగారూ ఊళ్ళోలేరు. అంతా ఈశ్వరేచ్ఛ. కాస్త స్థిమితంగా ఉండండి. మన ప్రయత్నం మనం చేద్దాం" అంటూ వేగంగా పెరట్లోకి వెళ్ళింది దేవమ్మ. అది తూర్పుగోదావరి జిల్లాలో ఒక మారుమూల ప్రాంతం. రాజమండ్రి నుండి రోడ్డు మార్గంగా కేశవరం దాటి ద్వారపూడి వద్ద వంతెన దాటి మండపేట చేరుకోవాలి.

అక్కడి నుండి ద్రాక్షారామం, రామచంద్రపురం మార్గంలో అయిదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే అక్కడ కుడిపక్కగా ఒక గ్రావెల్ రోడ్డు చీలిపోతుంది. ఆ రోడ్డులో మూడు కిలోమీటర్ల దూరం లోనకు వెళ్తే అక్కడుంటుంది మున్నలూరివారి అగ్రహారం. చుట్టూ పంటపొలాలు, పచ్చని తోటలనడుమ ఉన్న అందమైన చిన్న గ్రామం ఈ అగ్రహారం. ఒకప్పుడు అగ్రహారాలున్నా స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన మార్పుల కారణంగా నేడు అగ్రహారాలు కానరావు. కాని ఇప్పటికీ అగ్రహారంగా పిలవబడే ఊళ్ళు కొన్ని ఉన్నాయి. ఇక్కడా అదే జరిగింది.

అగ్రహారం నుండి కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు చెదిరిపోగా కొన్ని మిగిలేవున్నాయి. క్రమంగా ఇతర కులస్తులు కూడా ఇక్కడ చేరినా నేటికీ ఆ ఊరు మున్నలూరువారి అగ్రహారంగానే పిలవబడుతుంది.

ఒకప్పుడు మున్నలూరివారి పేరుమీదుగా వెలసి నందున అది మున్నలూరువారి అగ్రహారమైంది. జరిగిందేమంటే అయిదు తరాల క్రితం కృష్ణాజిల్లాలోని మున్నలూరు గ్రామంలో ధన్వంతరి వేదాచారి అనే గొప్ప ఆయుర్వేద వైద్యుడు ఉండేవాడు.

దేశంలో ఎక్కడా నయంగాని జబ్బుల్ని కూడా ఆయన నయం చేస్తాడని హస్తవాసి మంచిదని పేరుండేది. అప్పట్లో పిఠాపురం జమీందారుగారి బంధువు ఒకాయన ధవళేశ్వరంలో జమీందారీకి అనుబంధంగా పనిచేసేవాడు.

ఆయన తాతగారు అంతు చిక్కని వ్యాధితో బాధపడేవారు. ఎక్కడా తగ్గలేదు. ఎవరో చెప్పగా విని మున్నలూరు కెళ్ళగా నెల తిరక్కుండానే తాతగారి వ్యాధి నయమైంది. దాంతో ధన్వంతరి వేదాచారి పేరు మొదటి సారిగా బయట జిల్లాకు పాకింది.

ఆ తర్వాతి పరిణామాల్లో జమీందారుగారి అభ్యర్థనతో ధన్వంతరి వేదాచారి తూర్పు గోదావరి జిల్లాకు వలస వచ్చేశారు. ఆయనతో బాటే మరొ కొన్ని బ్రాహ్మణ కుటుంబాలూ వచ్చాయి.

జమీందారుగారు వారందరికీ ఇక్కడ స్థలాలిచ్చి అగ్రహారం నిర్మించి ఇచ్చారు.

ముఖ్యంగా ధన్వంతరి వేదాచారి జమీందారీ ఆస్థాన వైద్యుడు గావటంతో జమీందారు గారి అనుగ్రహంతో బాటు చుట్టుపక్కల ధనవంతుల వైద్యుడై బాగా ఆస్తులు, పొలాలు సంపాదించాడు.

మున్నలూరు నుంచి వలసవచ్చిన వారు గాబట్టి ఆ గ్రామాన్ని మున్నలూరి వారి అగ్రహారం అయింది. అదే వేదాచారి కుటుంబానికి ఇంటిపేరుగా మారిపోయింది. మున్నలూరు ధన్వంతరీ వేదాచారి గారికొడుకే మున్నలూరు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు. జరిగిన తరాలకు వారధి ఆయన.

అప్పట్లో ఆయన తమ్ములు ఇద్దరు, ఒక చెల్లెలు కలిసి వేదాచారి గారికి నలుగురు సంతానం. అగ్నివేశాచార్యుడు పెద్దవాడు. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయి పిల్లలు కలగడంతో కుటుంబం పెరుగుతూ వచ్చింది.

మున్నలూరు అగ్నివేశాచార్యుడి పెద్దకొడుకు ఆత్రేయ మహర్షి. ఆయన భార్య దేవమ్మ. కొంతకాలానికి పెద్దకొడుకు గతించడంతో పెద్దకోడలు దేవమ్మ మీద ఇంటి భారం పడింది.

ఇక ఏ విధంగానయితే నేమీ అగ్నివేశాచార్యుడి కొడుకులు, మనవలు, ముదిమనవలతో కూతుళ్ళ సంతానంతోసహా కలిపి యాభై కుటుంబాలపైనే వున్నాయక్కడ. ఏ కుటుంబానికి ఆ కుటుంబం సొంత ఇళ్ళు ఉన్నాయి.

కొన్ని కుటుంబాలు ఉద్యోగ రీత్యా బయటకు వెళ్ళినా వచ్చి పోతూనే వుంటారు. అగ్నివేశాచార్యుడే ఆ అగ్రహారానికి పెద్దదిక్కు. అధిపతి అంతా. ఆయన మాట అక్కడ వేదవాక్కు.

భర్తపోయిన తర్వాత నుంచి పిల్లల్ని చూసుకుంటూ మావగారి సలహాలు సూచనలతో దేవమ్మ కూడా ఆయుర్వేద వైద్యంలో కొంత ప్రావీణ్యం సంపాదించింది. మావగారు ఊళ్ళో లేనప్పుడు వైద్యం కోసం చుట్టుపక్కల నుంచి ఎవరొచ్చినా ఆవిడే చూస్తుంది.

చుట్టూ విశాలమైన కాంపౌండ్‌లో ఉన్న భవంతులన్నీ మున్నలూరి వారి కుటుంబాలవే. ఎంట్రన్స్ గేటుకి ఎదురుగా ఉండేది అగ్నివేశాచార్యుడి నివాసం. ఆ పక్క భవంతిలో కోడలు దేవమ్మ ఉండేది.

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఆవరణ ఇప్పుడు జనంతో నిండి పోయింది. ముక్కు పచ్చలారని పాప పాముకాటుతో ఏమైపోతుందోనని అంతా భయాందోళనలతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

"ఏమిటో ఈ పల్లెటూరి జనం. వీళ్ళ పిచ్చిగాని పాము కరిస్తే వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్ళాలిగాని ఇలా మందో మాకో వేస్తే తగ్గుతుందా? మంత్రాలకు చింతకాయలు రాలవు. ఆ పిల్ల బతకటం కష్టం" దారినపోతూ ఆగి చోద్యంచూస్తున్న పొరుగూరి కుర్రాళ్ళు ఇద్దరిలో ఒకడు కామెంట్ చేశాడు.

"ష్. నాతో అంటే అన్నావ్, ఎవరితోనూ అనమాక. చంపేస్తారు. ఈ అగ్రహారం గురించి, లోపలి వైద్యుల గురించి తెలిస్తే నువ్విలా మాట్లాడవు. చూస్తూండు ఏం జరుగుతుందో" అంటూ లోగొంతుతో హెచ్చరించాడు రెండోవాడు.

ఈ లోపల పెరట్లోకి వెళ్ళిన దేవమ్మ బయటికొచ్చింది. ఆ భవంతి వెనక పెరట్లో అద్భుతమైన అనేక మూలికలు పెంచబడుతున్నాయి. ఆవిడ బైటికొస్తూనే చేతిలోని ఆకుల్ని నలిపి పాపముక్కులో కొన్ని చుక్కలు, నోట్లో కొన్ని చుక్కలు పిండింది.

పాము కాటువేసినచోట కొన్ని చుక్కలు వేసింది. కొద్దిసేపటికి నోటి నుండి నుచ్చలు రావటం ఆగింది కాని పాపపరిస్థితి గడ్డుగానే ఉంది.

దేవమ్మ ముఖంలో ఆందోళన తొంగిచూసింది. ఈ లోపల మనుమరాలు శ్రావణి లోపలినుంచి సెల్‌ఫోన్ తెచ్చి ఇచ్చింది. వెంటనే ఒక నంబర్‌కు ఫోన్ చేసింది దేవమ్మ. ఇక్కడ ఫోన్ చేయగానే ఎక్కడో రంపచోడవరం లోతట్టు అటవీ ప్రాంతంలోని శాటిలైట్ ఫోన్ మోగటం ఆరంభించింది.

అగ్నివేశాచార్యుడి విశాల ఫాలభాగం ముడిపడింది. ఫోన్‌లో కోడలు దేవమ్మ చెబుతున్న విషయాన్ని ఆయన శ్రద్ధగా వింటున్నాడు.

ఆయన తలమీద పడగవిప్పి ఆడుతూ భుజాలమీద కృష్ణసర్పం అలాగే ఉంది. కోడలి మాటలతో అక్కడ మున్నలూరివారి అగ్రహారంలో ఇంటివద్ద పరిస్థితి అర్థమైంది తనకి కృష్ణసర్పం ఎందుకు అడ్డం పడిందో కూడా తెలిసిపోయింది.

"శివగోపయ్య నా మిత్రుడు" ఫోన్‌లో కోడలికి చెప్పాడు. "వాడి మనవరాలు శ్రద్ధ నాకూ మనవరాలే. వచ్చేముందు నా ఒడిలో కూచుని కబుర్లు చెప్పిన చిట్టితల్లికి ఇంత కష్టం రాకూడదు.

దాన్ని మనం బ్రతికించుకోవాలి. ఇప్పటి పరిస్థితిలో మందులతో పనికాదు. చాలాకాలంగా వదిలేసిన విద్యను ఇప్పుడు శ్రద్ధ కోసం ప్రయోగిస్తాను. కరిచిన పామును వెనక్కి రప్పించి విషం తీయిస్తాను. ఏం జాగ్రత్తలు తీసుకోవాలో నాకు తెలుసు. ఫోను ఒకసారి పాప చెవిదగ్గర ఉంచు" అన్నాడు.

తర్వాత రెండు నిముషాలపాటు ఫోన్‌లో ఏవో మంత్రాలు పఠించి తర్వాత లైన్ కట్‌చేశాడు.

ఇప్పుడు తూర్పు దిక్కుగా ముఖం ఉంచి ఉన్నచోటే కూచుని భుజాలమీది కృష్ణసర్పాన్ని జాగ్రత్తగా తీసి నేలమీద ఉంచాడు.

దాని బుసలు చూస్తుంటే దూరంగా ఉన్న సేవకులిద్దరికీ గుండెలు బేజారవుతున్నాయి.

"నువ్వెందుకు వచ్చావో ఇప్పుడు నాకు అర్థమైంది నాగన్నా... నీ ఉపకారం మర్చిపోలేనిది. ఇప్పుడు ఇంకో ఉపకారం కూడా నువ్వు నాకు చేయాలి. నువ్వు నాకు చేయగలవు. నీవల్లనే పని తొందరగా పూర్తవుతుంది.

మా పసిబిడ్డ ప్రాణాపాయంలో ఉంది. వెంటనే ఆ దుష్టసర్పాన్ని అక్కడికి పంపించి విషాన్ని వెనక్కి తీసుకోమను. ఇది నా ఆన" అంటూ అప్పటికప్పుడు చిన్న చీటీమీద ఒక యంత్రాన్ని గీచి దాన్ని మడిచి కృష్ణసర్పం తోకకు కట్టి వదిలాడు. అంతే మెరుపు వేగంతో పొదల్లోకి అదృశ్యమైందా పాము. తను లేచేవరకు పలకరించవద్దని సేవకులిద్దర్నీ హెచ్చరించి, మంత్ర ప్రయోగం చేస్తూ ధ్యానంలో ఉండిపోయాడు అగ్నివేశాచార్యుడు. పులికొండయ్య, కాశీ ఇద్దరూ పక్కన చెట్టుకిందకు పోయి కూచున్నారు.

(ఇక్కడ చాలాకాలంగా వదిలేసిన విద్యని ఇప్పుడు ప్రయోగిస్తాను అని అగ్నివేశాచార్యుడు చెప్పడంలో తగిన కారణం ఉంది. పామును వెనక్కి రప్పించటం అనేది గొప్ప మంత్రగాళ్ళు చేసేపని.

ఒక చీటిమీద యంత్రం రాసి తొండ మెడలో కట్టి వదులుతారు. ఆ తొండ కాటువేసిన పాము పడగమీద కూచుని తీసుకొస్తుంది.

తను వేసిన కాటుమీద తిరిగి కాటువేసి విషాన్ని వెనక్కు తీసుకుని వెళ్ళిపోతుంది పాము. అయితే తొండకి బదులు మరో పామునే చీటీకట్టి పిలిపించటం. అదీ సంఘటనా స్థలానికి సుదూరంలో ఉండి ప్రయోగించటం అంటే అది మహా మంత్రగాళ్ళకే సాధ్యం. ఇలాంటి సంఘటనలు ప్రత్యక్షంగా చూసిన వాళ్ళు గతంలో చాలామంది ఉన్నారు.

అగ్నివేశాచార్యుడు మహా వైద్యుడే కాదు, మహామంత్రవేత్త కూడా. ఐతే ఇలాంటి ప్రయోగాలు మంత్రగాళ్ళు అంత సులువుగా చేయరు. ఎందుకంటే నాగదోషం, నాగశాపం చాలా తీవ్రమైన ప్రభావం చూపుతాయి.

పామును వెనక్కి రప్పించినంత మాత్రాన సరిపోదు. విషం తీసుకున్నాక అది సురక్షితంగా తన స్థావరం చేసుకొనేవరకు బాధ్యత మంత్రగాడిదే.

పొరపాటున ఎవరన్నా ఈ లోపల ఆ పామును కొట్టి చంపితే ఆ దోషం మంత్రగాడి కుటుంబాన్ని నాశనం చేస్తుంది. అలా దెబ్బతిన్న మంత్రగాళ్ళున్నారు. అందుకే తెలిసినా కూడా పామును వెనక్కి రప్పించరు మంత్రగాళ్ళు. చాలా కాలంగా వదిలేసిన విద్య అని ఆచార్యుడనటంతో అర్థం ఇదే.)

* * * * *

ఎక్కడి వాళ్ళక్కడ శిలా విగ్రహాల్లా నిలబడిపోయి చూస్తున్నారు. అందరి చూపులు సర్ప ద్రష్ట అయిన చిన్నారి పాప శ్రద్ధమీదే ఉన్నాయి.

ఇది సాధ్యమా, కాటువేసిన పాము వెనక్కు వస్తుందా! విషం వెనక్కి తీసుకుంటుందా! ఇది జరిగే పనేనా? నమ్మశక్యం గావటంలేదే! ఎవరికి వారు తర్కించుకొంటున్నారు. అంతక్రితమే దేవమ్మగారు చేసిన హెచ్చరిక అందరి చెవుల్లోనూ మారుమోగుతోంది. ఉత్కంఠత కలిగిస్తోంది. మామగారు అగ్నివేశాచార్యుడితో మాట్లాడి ఫోన్ శ్రావణి చేతికిస్తూనే అందరికీ వినబడేలా హెచ్చరిక చేసిందావిడ.

"కాటు వేసిన పాము వచ్చి విషం తీసుకోబోతోంది. మీరు కంగారు పడకుండా ఎక్కడి వాళ్ళక్కడ నిలబడి ఉండండి. ఎవరూ కదలవద్దు.

పామును చూసి భయపడొద్దు. మంత్రానికి కట్టుబడిన పాము ఎవరినీ ఏమీ చేయదు. ఎవరూ కదలకూడదు" దేవమ్మగారి హెచ్చరిక సారాంశమది.

ఎప్పుడో పూర్వం ఇలా పామును రప్పించి విషం వెనక్కి తీయించే మంత్రగాళ్ళుండేవారని వినడమేగాని ప్రత్యక్షంగా చూసినవాళ్ళీ కాలంలో లేరు. అందుకే అందరిలో ఈ విషయం మరింత ఉత్కంఠ పెంచి ఊపిరి బిగబట్టి చూసేలా చేసింది. అది సాధ్యమేనా? ఏం జరగబోతోంది?

ఎవరికి వారు పాము ఎటునుంచి వస్తుందోనని నలువంకలా గమనించసాగారు. అరుగుమీద పరుండజేసిన చిన్నారి శ్రద్ధవద్ద ఎవరూ లేరు. అంతా ఎడంగా ఉన్నారు. పాప చూస్తే దొక్కలు ఎగరేస్తోంది. శరీరం కళతప్పి నలుపురంగు తిరుగుతోంది.

ఏం జరగనుంది? పాప బతుకుతుందా? ఆందోళనతో గుండె గొంతులో కొట్టుకుంటుండగా ఆత్రంగా గమనిస్తున్నారంతా. క్షణాలు బారంగా దొర్లి

పోతున్నాయి. నిముషం... రెండో నిముషం... మూడో నిముషం కూడా గడిచి పోతోంది. పాము రాలేదు. అంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

సరిగ్గా నాలుగో నిముషంలో ఆ మూలన ఎవరో చిన్నగా అరిచారు "అదిగో... అదిగదిగో పాము" అంటూ. వాడు అరిచేలోన పాము అరుగుపక్కగా వేగంగా మెట్ల వద్దకొచ్చేస్తూ కన్పించింది.

చరచరా మెట్లెక్కుతున్న పామును చూసి షాక్‌తో బిగుసుకుపోయారంతా. నోటమాట రాలేదు. మూడు మూరల పొడవున్న గోధుమ వన్నె త్రాచు మెరిసిపోతోంది. అంతా ఊపిరి తీసుకోవటం మర్చిపోయి విప్ఫారిత నేత్రాలతో చూస్తున్నారు.

వచ్చిన గోధుమత్రాచు అటూఇటూ ఎవరినీ గమనించలేదు. తిన్నగా చిన్నారి శ్రద్ధ పాదాలవద్దకు వెళ్ళి పడగ లేపి కొన్ని సెకన్లు ఆడింది. ఆ తర్వాత కుడి పాదం మీద ఎక్కడయితే కాటు వేసిందో అదే కాటుమీద తిరిగి కాటువేసింది. పడగ విసిరి కాటందుకుని అలాగే ఊండిపోయింది.

అంతా చోద్యం చూడ్డానికి తోసుకుని ముందుకు వస్తుంటే ఎవరూ కదలవద్దనీ. ఉన్నచోటే ఉండమని చేతులతో వారించింది దేవమ్మ. క్షణాలు గడిచిపోతున్నాయి. పాము కదలకుండా అలాగే ఉంది.

పాప తాతయ్య శివగోపయ్య కన్నీళ్ళతో దేవుని ప్రార్థిస్తూ చిత్తరువులా నిలబడి పాపను చూస్తున్నాడు. అయితే విషప్రభావంతో నలుపు తిరిగిన పాప శరీరం క్రమంగా యధా పూర్వస్థితికి రావటం ఆరంభించింది. ముఖంలో కళ వస్తోంది.

శరీరంలో విషం హరిస్తోందని స్పష్టంగా అర్థమవుతోంది అక్కడున్న అందరికీ. సరిగ్గా మూడో నిముషంలో విషాన్ని పూర్తిగా వెనక్కు తీసుకున్న గోధుమ త్రాచు పాప పాదం నుంచి కాటు వెనక్కితీసుకుని సొమ్మసిల్లి పక్కకు వాలిపోయింది. పాప ఇప్పుడు డొక్కలు ఎగరేయటం లేదు... నోటి నుంచి నుచ్చలు పూర్తిగా ఆగిపోయి శ్వాస నార్మల్ స్థితికి వచ్చి నిద్రపోతున్నట్టు పడుంది.

ఎప్పుడైతే పాము పక్కకు వాలిపోయిందో మరుక్షణం దేవమ్మ లోనకెళ్ళి ఒక గిన్నెలో గోరువెచ్చని పాలుపోసి తెచ్చి పాము సమీపంలో ఉంచింది. రెండు నిముషాల తర్వాత తేరుకున్న పాము చిన్నగా కదిలి లేచింది.

పక్కన గిన్నెలోని పాలు మొత్తం తాగి వెళ్ళిపోడానికి వెనుతిరిగింది. అది మెట్లు దిగి వచ్చిన దారినే వెళ్ళిపోతూండగా ఇద్దరు సేవకులు బాణాకర్రలతో ఆ పామును ఎవరూ ఏమీ చేయకుండా చూసేందుకు ఎస్కార్టుగా అనుసరించి వెళ్ళారు.

అప్పటిగ్గాని తాము చూసింది కలో నిజమో తెలీని భ్రమలో వున్న జనంలో చైతన్యం కలగలేదు. ఈ లోపల నిద్రపోతున్నట్టు పడున్న పాప శ్రద్ధలో కదలిక ఏర్పడి లేచికూర్చుంది. అంతే.

శివగోపయ్య ఆనందానికి అవధిలేదు. పాపను ఎత్తుకుని గుండెల కద్దుకుని ముద్దులాడాడు. పాప మగతగా తాత భుజం మీద వాలిపోయింది.

"అమ్మా దేవమ్మ తల్లీ! నీ మేలు మర్చిపోలేనమ్మా. అగ్నివేశాచార్యుడు నా మిత్రుడే కాదమ్మా. సాక్షాత్తు దేవుడు. దగ్గరుంటే ఆయన పాదాలు కడిగి నెత్తిన చల్లుకునేవాడ్ని. ఏమిచ్చి రుణం తీర్చుకోగలను...." అంటూ ఏడ్చేశాడు శివగోపయ్య.

"గోపయ్య బాబాయ్. మీరేం చెప్పాలనుకున్నా మావయ్య వచ్చిన తరువాత చెప్పుకోండి. ప్రస్తుతానికి ప్రమాదం తప్పిపోయినట్టే. దీని ఆయుష్షు గట్టిది" అంటూ పాప బుగ్గ పుణికి ముద్దాడింది దేవమ్మ.

"ఈ పూటకి జావకాచి ఇవ్వండి. భోజనం పెట్టొద్దు. ముఖ్యంగా పగలు నిద్రపోకుండా దగ్గరుండి చూసుకోవాలి. సాయంత్రం ఒకసారి నా వద్దకు తీసుకొస్తే మందులిస్తాను. అవి వాడితే చాలు. వెళ్ళిరండి. నేను మామయ్యగారికి ఫోన్‌లో చెప్తాలే" అంది.

సంతోషంతో శివగోపయ్య బంధువర్గం వెనుతిరిగారు. జరిగిన సంటనను చిత్ర విచిత్రంగా చెప్పుకుంటూ జనం కూడా చెదిరిపోనారంభించారు.

అదే సమయంలో శ్రావణి చేతిలో సెల్‌ఫోన్ మోగింది. అవతల అగ్నివేశాచార్యుడు లైన్లో ఉన్నాడు. దేవమ్మ జరిగిన విషయమంతా ఆయనకు వివరించటం ఆరంభించింది.

* * * * *

హైదరాబాద్... మల్కాజ్‌గిరి ప్రాంతంలోని ఒక శివాలయం. చాలా ప్రసిద్ధిచెందిన శివాలయం. ఆ రోజు సోమవారం గావటంతో గుడికి భక్తుల తాకిడి అధికంగానే వుంది. వారిలో ఇద్దరు యువకులు కూడా వున్నారు.

ఇద్దరిలో ఒకడి పేరు చరక్. వయసు పాతిక మించదు. ఆరడుగుల ఎత్తూ, తగిన లావు, పసిమి ఛాయలో చాలా అందంగా ఉన్నాడు. విశాల ఫాలభాగం అతడి వివేకాన్ని సూచిస్తోంది.

ఉంగరాల జుట్టు, కోలముఖం, కోటేరు వంటి ముక్కు, కలువరేకుల్లా పెద్ద కళ్ళు, కోరమీసం, ఎర్రటి అధరాలతో యువతుల్ని ఆకర్షించే స్ఫురద్రూపి అతను. చాలా చురుకైనవాడు.

రెండో వాడి పేరు కిరణ్. కాస్త పొట్టి, కాస్త లావుగా, చామనచాయలో వున్నాడు. ఇద్దరిదీ ఒకే వయసు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు. క్లోజ్ ఫ్రెండ్స్. ఇద్దరూ బ్రహ్మచారులే. కిరణ్ వాళ్ళిల్లు శివాలయం పక్క వీధిలోనే ఉంది.

చరక్ శివభక్తుడు. ఇక్కడి శివాలయం గురించి విని కిరణ్‌తోబాటు తొలిసారిగా నాలుగు రోజుల క్రితం దర్శనానికొచ్చాడు. అయితే నాలుగు రోజుల క్రితం శివాలయానికి వచ్చిన చరక్ వదలకుండా రోజూ ఉదయమే రావటం ఆశ్చర్యంగా వుంది.

అతను నేరుగా పొద్దుటే తమ ఇంటికి రావటం శివాలయానికొచ్చి దైవదర్శనం చేసుకున్నాక ఇటునుండి ఇటే కిరణ్‌తోబాటు ఆఫీసుకెళ్ళటం జరుగుతోంది. ఎంత భక్తి వున్నా రోజూ పదికిలోమీటర్లు బైక్ మీద వచ్చి ఇక్కడి నుండి ఆఫీసుకు రావటం అంటే ఇందులో ఏదో మర్మం ఉందని కిరణ్‌కి సందేహం... కాని తను అడగలేదు. అతను చెప్పలేదు.

కిరణ్ అనుమానించినదాంట్లో కూడా నిజం ఉంది. తొలి రోజు ఆలయంలో అడుగు పెట్టగానే చరక్‌ని ఆకర్షించిన విశేషం ఒకటి వుంది. అదేమంటే పూజారి రామాచారిగారి చిన్న కూతురు శుశ్రుత. ఇరవై రెండేళ్ళ ప్రాయంతో ఐదున్నరడుగుల ఎత్తు బంగారు బొమ్మ శుశ్రుత. అందమే తానుగా మతిపోగొట్టే సౌందర్యరాశి శుశ్రుత.

తాకితే మాసిపోతుందా అన్నంతగా పసిమిఛాయ మేని – అంగాంగం తీర్చి దిద్దినట్టు ఆరోగ్యంతో మిసమిసలాడే ఒళ్ళు – పిరుదులు దాటే నిడుపాటి కురులు – గుండ్రటి ముఖంలో చక్రాల్లాంటి కళ్ళు– శంఖంలాంటి పొడవు మెడ... తామరతూండ్లవంటి చేతులు – ఉన్నతమైన ఎదపొంగులు.

పిడికిట ఇమిడే నడుం – చూడగానే కావ్యనాయకిని తలపించే కమనీయ రూప లావణ్యం ఆమెది. ఆమెలో ఇదీ అని చెప్పలేని ఒక ఆకర్షణ, వింత సోయగం తొలిచూపులోనే చరక్‌ను ప్రేమలోపడేశాయి.

చరక్‌ను ఆకర్షించింది ఆమె అందం ఒక్కటే కాదు. ఆమెలో ఎక్కడా నేటి యువతలో కనిపించే పాశ్చాత్య నాగరికత పోకడలేదు.

చక్కగా లంగా, ఓణీలో పదహారణాల తెలుగు అమ్మాయిలా ఉంది. చేతుల నిండుగా గాజులు, సిగలో పూలు, కాళ్ళకు మువ్వలపట్టీలు. మెడలో సన్నటి గొలుసు. నుదుట బొట్టు. అమ్మాయి చాలా సింపుల్‌గా వుంది. మొదటి రోజు వచ్చినప్పుడు ఆమె గుడి లోపలున్న తండ్రి రామాచారితో ఏదో మాట్లాడి వెళ్తూ కన్పించింది. రెండో రోజూ ఆలయంలో కన్పించిందిగాని ఆమె చరక్‌ను గమనించలేదు.

కాని చరక్ చూపులు ఆమెను వెన్నంటుతూనే వున్నాయి. మూడో రోజు ఆమె చరక్‌ను గమనించింది. నాలుగోరోజూ గమనించింది. ఇవాళ అయిదో రోజు. కాని ఆవరణలోగాని, ఆలయంలోగాని ఆమె జాడ కనబడక నిరుత్సాహం చెందాడు చరక్.

"హరహర మహాదేవ – శంభో హరశంకర" లైన్లో దర్శనానికి వెళ్తూన్న భక్తుల శివనామస్మరణ బిగ్గరగా వినవస్తోంది. లైన్లోకి నడవకుండా దిక్కులు చూస్తున్న చరక్‌ని ఆశ్చర్యంగా చూశాడు కిరణ్.

"ఏమయిందిరా. లైన్లోకి పద...." హెచ్చరించాడు.

"అదే అర్థంగావటంలేదురా. ఈ రోజు గుడిలో మెరుపు లేదు"

"లేకపోవటం ఏమిటి? ఆఫీస్ టైమువుతోంది లైన్లోకి పద. శివదర్శన మైతే చాలు. లేటయితే మేనేజరు మనకి ఉరుములు మెరుపులు కూడా చూపిస్తాడు."

"మెరుపు కన్య దర్శనం ఏదిరా?"

"ఓర్నాయనో. నీకేదో అయింది. మెరుపు అంటావ్, మెరుపు కన్య అంటావ్. ఏమైందిరా నీకు?"

"ఒరే కిరణ్. నువ్వు ఎవరినన్నా ప్రేమించావా?"

"ప్రేమా. దాందేముందిరా, చాలామందిని ప్రేమించాను" అన్నాడు కిరణ్.

"నీ అంత విశాలహృదయం నాకు లేదురా. నేను రాముడిటైపు. అందుకే... నా సీతకోసం వెతుకుతున్నాను" అన్నాడు చరక్.

"అంటే... నేను హనుమంతుడ్నా... నీ సీతను వెదికి తేవాలా? ఓర్నాయనో. నిజంగానే నీకేదో అయింది. అర్జంటుగా పదరా బాబు. భూతవైద్యుడ్ని చూద్దాం" కంగారుపడిపోయాడు కిరణ్.

"అక్కర్లేదుగాని నాతో రా. అలా గుడివెనక్కి వెళ్ళొద్దాం" అంటూ అటు దారితీశాడు చరక్.

"గుడి వెనక ఏముందని? పూజారిగారి ఇల్లుంది" విసుగ్గా అరిచాడు కిరణ్.

"నా సీత అక్కడే ఉంది. చూడకుండా ఎలా ఉండగలను? ఇంతకీ వస్తావా, ఇక్కడే ఉంటావా?"

"రాక ఛస్తానా... ఇవాళ నీ మూలంగా నాకు పిచ్చెక్కటం ఖాయం. పద" విసుక్కుంటూనే అనుసరించాడు కిరణ్.

గుడి పక్క నుంచే వెనక్కి దారివుంది. వెనకవైపు ప్రహరీకి పురాతన చెక్క తలుపు ఒకటుంది. దానికవతల విశాలమైన ఆవరణలో చుట్టూ పూలు, ఫల వృక్షాల మధ్య ఒక పాతకాలం పెంకుటిల్లు ఉంది. అదే పూజారి రామాచారిగారి నివాస గృహం.

అనువంశికంగా వస్తున్న పూజారి వృత్తిగాబట్టి ఆలయానికి చెందిన ఆ ఇంట్లోనే నివసిస్తున్న ఆచారిగారికి వేరేచోట్ల ఇళ్ళు, భూములు ఉన్నాయి. అద్దెలు, ఇతర ఆదాయాలు బాగానే వస్తుంటాయి.

రామాచారిగారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు సంతానం. కొడుకు కూడా పూజారి వృత్తిలోనే ఉన్నాడు. మెదక్ ప్రాంతంలో ఏదో గుడిలో పనిచేస్తున్నాడు. అక్కడే ఉంటాడు. అతనికి పెళ్ళై ఇద్దరు పిల్లలు.

పెద్దకూతురు గోమతికి పెళ్ళయి ప్రస్తుతం అత్తారింట్లో సలక్షణంగా కాపురం చేసుకుంటోంది.

మూడోది శుశ్రుత. పెళ్ళి కావలసిన పిల్ల. రామాచారిగారు తగిన సంబంధం కోసం చూస్తున్నారు.

శుశ్రుత బాగా చదువుకున్నది. కొంతకాలము ఉద్యోగం, ఆ తరువాతే పెళ్ళి అంటోంది.

ఉద్యోగ ప్రయత్నంలో ఉంది. ప్రస్తుతం ఆ ఇంట్లో పూజారి రామాచారి, ఆయన భార్య కావేరి, కూతురు శుశ్రుత ముగ్గురే ఉంటున్నారు.

ఈ విషయాలన్నీ మూడు రోజుల ముందే సేకరించి ఉంచుకున్నాడు చరక్. పెరటితలుపు కొద్దిగా తెరిచాడు. కిర్రుమని చప్పుడు చేసింది.

ఆవరణలో తులసి మొక్కకు నీళ్ళు పోస్తున్న శుశ్రుత తలెత్తి చూసింది. చూస్తూనే ముఖం చిట్లించి స్టీలుబిందె కిందపెట్టి నిటారుగా నిలుచుంది.

అంతక్రితమే స్నానం చేసినట్టుంది. ధవళవస్త్రాల్లో వనకన్యలా మెరిసిపోతోంది. "హలో... ఎవరు మీరు ఎందుకొచ్చారు?" కోపంగా ప్రశ్నించింది.

"చాలా కోపంగా ఉంది. ఎవర్రా ఆ అమ్మాయి?" నసిగాడు కిరణ్.

"ఆ అమ్మాయే నా సీత" గొణిగాడు చరక్.

"తను సీతేమిట్రా... సత్యభామలా ఉంది. వెళ్ళిపోదాం రారా" అన్నాడు కిరణ్.

"ఏమిటా గుసగుసలు? అడుగుతోంది మిమ్మల్నే. చెవుడా?" శుశ్రుత శృతి పెంచి దబాయించటంతో మిత్రులిద్దరూ కాస్త కంగారుపడ్డారు.

చరక్ ధైర్యం తెచ్చుకుని చిన్నగా దగ్గి తలుపు బార్లా తెరిచి లోనకు అడుగుపెట్టాడు. "హలో... మా చెవులు చక్కగా పనిచేస్తున్నాయి. ఎందుకలా అరుస్తావ్. దాహానికి కాస్త మంచి తీర్థమిప్పిస్తే వెళ్ళిపోతాం" అన్నాడు.

"ఓహో! దాహానికి నీరు కావాలా? గుడిలో కుళాయి ఉంది. వెళ్ళి తాగొచ్చుగదా. ఇక్కడికెందుకు రావటం?" అడిగింది శుశ్రుత.

"హవ్వ! పవిత్ర బ్రాహ్మణవంశంలో పుట్టిన నన్ను అపవిత్రమగు కుళాయి నీరు తాగమందువా, అపచారం అపచారం."

"అంతా గ్రహచారం. నువ్వు బ్రాహ్మణుడివా, అలా చెప్తే నేను నమ్మాలా... నమ్మను."

"నమ్మించాలా... అయితే నా యజ్ఞోపవీతం చూసి చెప్పు." అంటూ జంధ్యం చూపించాడు చరక్.

"అయినా నమ్మను. జంధ్యం ధరిస్తే బ్రాహ్మణులైపోతారా? క్షత్రియులు, వైశ్యులు, విశ్వకర్మ బ్రాహ్మలు మరికొందరు ఇతర కులస్థులు కూడా జంధ్యధారణ చేస్తారు. అంతమాత్రాన వారు బ్రాహ్మణులు అవుతారా?" అనడిగింది పట్టుదలగా శుశ్రుత.

"హతవిధీ?" అంటూ నుదురు కొట్టుకున్నాడు చరక్. "తాగునీరడిగితే ఇన్ని పరీక్షలా. ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేరా?" అడిగాడు.

"లేరు. నేనున్నాను చెప్పు."

"నేను బ్రాహ్మణుడనని ఏ విధంగా నిరూపించుకోవాలి?" అన్నాడు.

"ఓ.కె... గాయత్రి చెప్పు"

"గాయత్రి ఎవరు? పక్కింటమ్మాయా?" అమాయకంగా అడిగాడు కిరణ్.

"ఎవరో తెలుసుకుని వచ్చి చెప్పండి. అవతల నాకు పనులున్నాయి" అంటూ పోబోయింది శుశ్రుత.

"హలో... ఏ గాయత్రి చెప్పమంటావ్. విష్ణు గాయత్రీ మంత్రమా. లక్ష్మీ గాయత్రీ మంత్రమా, గరుడ గాయత్రీ మంత్రమా, కృష్ణ గాయత్రీ మంత్రమా... లేక...."

"ఆగాగు. గాయత్రి చెప్పింది ఎవరు?"

"గాయత్రీ మంత్ర సృష్టికర్త విశ్వామిత్ర మహర్షి"

"ఆ గాయత్రినే చెప్పు."

"ఓం భూర్భువస్సువః ఓం తత్స వితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్" ఇది గాయత్రీ మంత్రం. జపమంత్రం.

ఉత్తమే శిఖరే జాతే భూమ్యాం పర్వతమూర్ధని।

బ్రాహ్మణేభ్యోఽభ్యనుజ్ఞాతా గచ్ఛదేవి యథాసుఖమ్॥ ఇది గాయత్రీ ప్రస్థాపనం.

పరబ్రహ్మ ప్రకాశాఢ్యాం శబ్ద బ్రహ్మ ప్రకీర్తితామ్, గాయత్రీం సర్వ దైవత్యాం తాం ధ్యాయే వేదమాతరమ్ ఇది గాయత్రీ స్తుతి.

నాస్తి గంగా సమం తీర్ధం న దేవః కేశవాత్పరః- గాయత్ర్యాస్తు పరం జప్యం నభూతం న భవిష్యతి-

అనగా గంగలాంటి తీర్ధం లేదు. విష్ణువుకన్నా గొప్పవాడు లేడు. గాయత్రికన్నను జపించదగిన గొప్ప మంత్రం లేదు. ఉండబోదు అని అర్ధం. చాలా, ఇంకా గాయత్రీ మంత్రాలు, వాటికి అర్ధాలు చెప్పాలా" అనర్గళంగా మంత్రాలు చెప్పిన చరక్‌ను విస్ఫారిత నేత్రాలతో అలా చూస్తూండిపోయింది శుశ్రుత.

"హలో, ఇప్పుడయినా నమ్ముతావా? మంచితీర్ధం ప్లీజ్" తిరిగి తనే అడిగాడు. శుశ్రుత ఏదో అభ్యంతరం చెప్పబోయింది. ఇంతలో "ఎన్నడీ సుశ్రుతా. యార్ కిట్టడీ పేశు కిట్టిరిక్కిరే?" అంటూ ఇంట్లోంచి ఒక తమిళగొంతు వినవచ్చింది.

ఈ సారి విస్తుపోవటం చరక్ వంతయింది. ఎందుకంటే స్వచ్ఛమైన ఆంధ్రా బ్రాహ్మణ గృహంలో స్వచ్ఛమైన తమిళమామి గొంతు. ఇదెప్పడి? చూస్తున్నంతలోనే చక్కగా కట్టుబొట్టు కలిగిన అయ్యంగార్ నడివయసు లేడీ ఒకావిడ బయటికొచ్చింది.

పైట భుజంమీదకు లాక్కొంటూ దగ్గరకొస్తున్న ఆవిడ ఎవరో మొదట చరక్‌కి అర్ధంకాలేదు. కాని ఆలోచించగా రామాచారిగారి భార్య కావేరి ఈవిడే కావచ్చనిపించింది. అంటే శుశ్రుత తల్లి.

"వణక్కం మామీ... ఉంగళైపార్తా అంద మారియమ్మనై పొర్తదు పోలిరుక్కు..." అంటూ తనూ తమిళంలోనే పలకరించి నమస్కరించాడు చరక్.

"మిమ్మల్ని చూస్తుంటే సాక్షాత్తూ అమ్మవారిని చూసినట్టుంది." అంటూ పొగడగానే ఆవిడ ముఖం సంతోషంతో వికసించింది.

"అడ. శుద్ధమాన తమిళ్ చొల్లు కేట్టు ఎత్తనైనాళొచ్చు. యార్ తంబినీంగ. యార్ వేండుం?" మురిసిపోతూ అడిగిందావిడ.

ఇదంతా చూస్తున్న కిరణ్‌కి నిజంగానే పిచ్చెక్కేలా అయింది. "ఓరి దేవుడో, ఇప్పటిదాకా వీళ్ళ తెలుగు గోలే భరించలేక చచ్చాను. ఇప్పుడు అరవగోల

వేరేనా! తర్వాత వచ్చి మంచి తీర్థం పుచ్చుకుందాం. ఆఫీస్ టైమవుతోంది పోదాం రారా" అంటూ గొణిగాడు.

"యారింద తంబి? ఎనానశొల్రా. నీంగయారు?" అడిగిందావిడ.

చరక్ గొంతు సవరించుకున్నాడు– "అమ్మా. మావాడు తమిళం తెలీక తికమకపడుతున్నాడు. మనం తెలుగులోనే మాట్లాడుకుందాం" అన్నాడు.

"అట్లనే తంబి... 'దేశభాషలందు తెలుగులెస్స' యన్నారు గదా. చెప్పు నాకు తెలుగు బాగానే వచ్చు" అంది ఆవిడ.

"థ్యాంక్స్ మామీ, నా పేరు చరక్. కౌండిన్య గోత్రం. బ్రాహ్మణ యువకుడిని. బ్రహ్మచారిని. వీడు నా ఫ్రెండ్ కిరణ్. ఒకే ఆఫీస్‌లో పనిచేస్తున్నాం. రోజు గుడికి వస్తుంటాం. దాహార్తికి కాస్త మంచితీర్థం అడిగాం... మీ అమ్మాయి...."

"అవునయ్యా. ఇది నా చిన్న కూతురు... పేరు శుశ్రుత. రొంబవాయాడి...."

ఆ మాటతో శుశ్రుతకు చురుక్కుమంది– "అమ్మా, నేను గయ్యాళినని చెప్పి పరువుతీయక. వీళ్ళని పంపించి వస్తా. నువ్వు లోనకు పద" అంది కోపంగా.

"నీ ఇరడి. నువ్వాగు.... నువ్వు చెప్పు తంబి...." అంది కావేరి.

"నన్ను మీరు తంబీ అన్నారు. నేను అక్కా అని పిలవచ్చా?"

"పిలు తంబీ. సంతోషం దానే"

"ఓరినాయనో. వీడు వరసకూడా కలిపేశాడు. రేపు మరదలినంటూ వెంటపడినా పడతాడు. దేవుడా. వీడ్ని త్వరగా పంపించెయ్" మనసులోనే విసుక్కొంటూ కొరకొరా చూస్తోంది శుశ్రుత.

"అక్కా, నాదో డౌటు...." అన్నాడు చరక్.

"నీ డౌట్లు తర్వాత. వాకిట్లో నిలబెట్టే మాట్లాడుతున్నావ్. ముందు కూర్చుని మంచి తీర్థం తీసుకోండి నాయనా, రండి" అంటూ పందిరికింద ఉన్న నవ్వారు మంచం వాల్చి కూర్చుండబెట్టి రెండు గ్లాసుల నీరు అందించింది ఆవిడ.

నీరు తాగి – "థ్యాంక్స్ అక్కా... ఈ అమ్మాయి మీ కూతురా... నీలాంటి మంచి అక్కకి ఇలాంటి పెంకిపిల్ల కూతురా... నమ్మలేకపోతున్నాను" అన్నాడు శుశ్రుతని మరింత ఊడికించే ఉద్దేశంతో.

"ఊ. అదేమడుగుతావ్ తంబి. అందుకే గదా తొందరగా పెళ్ళి చేసి పంపించేయాలనుకుంటున్నాం." అంది ఆవిడ.

"అమ్మా. పరువు తీస్తున్నావ్. నేను పెళ్ళే చేసుకోను పో" అంటూ లోనకెళ్ళిపోయింది శుశ్రుత.

"అదిసరే అక్కా, మీది లవ్‌మేరేజా? రామాచారిగారు తెలుగు, మీరు తమిళం...." వెళుతున్న శుశ్రుతను చూస్తూ అడిగాడు చరక్. ఆమె తిరిగి చూస్తుందనుకున్నాడు. చూడలేదు. "అదువా తంబీ...." అంటూ నవ్వేసింది కావేరి మామీ.

"మాది లవ్ మేరేజ్‌దా. ఎట్లాగంటే మేం కోయంబత్తూర్‌లో సెటిలైన ఆంధ్రా బ్రాహ్మణ కుటుంబం. అప్పట్లో మావారు చండీయాగం చేయటానికి ఇక్కడ బ్రాహ్మణులతో కోయంబత్తూరొచ్చారు. ఒకరినొకరు చూసుకున్నాం. లవ్వు అయిపోయింది.

మావాళ్ళకు ఆయన నచ్చారు. పెళ్ళిచేసి పంపించారు. ఉండు తంబీ. కాఫీ సొప్పిట్టు పోంగో" అంటూ ఆవిడ లోనకు పోబోతుంటే వారించాడు చరక్.

"మరోసారి వస్తానక్కా. ఆఫీస్ టైమవుతోంది వెళ్ళొస్తాం" అంటూ లేచాడు. వెళుతున్న చరక్‌ను చూస్తూ– 'నల్లపైయ్య' అనుకుంది మామీ– శుశ్రుత మాత్రం బయటకు తొంగిచూడలేదు.

* * * * *

చకచకా అడవిలో అడుగులు వేస్తున్నాడు అగ్నివేశాచార్యుడు. ఆయన్ని ఫాలో అవుతున్నారు సేవకులు ఇద్దరూ. పాప శ్రద్ధక్షేమమని ఫోన్‌లో కోడలు దేవమ్మ వివరించాక ఆయన స్థిమితపడి తిరిగి ప్రయాణం ఆరంభించారు. పొద్దుబాగా పైకి వచ్చింది. "ఏరా కొండయ్యా... మనం దారితప్పామా?" నడుస్తూనే అడిగాడు ఆయన.

"లేదు సామీ. కాస్సేపట్లో మడుగు వద్ద ఉంటాం" అన్నాడు వెనకే వస్తున్న పులికొండయ్య.

"నాకు తెలీక అడుగుతాను సామీ. మనం ఇంతకు ముందు వెదురు బదనిక, చింత బదనిక, మర్రి బదనిక ఇలా అడవంతా గాలించి అరడజను

బదనికల్ని సేకరించుకెళ్ళాం. ఇప్పుడు రావి బదనిక అంత అవసరమా? అసలీ బదనికల వలన నిజంగా ఉపయోగం ఉందంటారా?" తిరిగి తనే అడిగాడు.

"ఒరే సందేహప్రాణీ. ఈ సృష్టిలో తెలిసి ఉపయోగించుకుంటే ఉపయోగంలేని వస్తువంటూ ఏమీ లేదురా. బదనికలూ అంతే... ఒక్కో బదనిక వలన ఒక్కో ఉపయోగం ఉంటుంది.

మానవుని అదృష్టాన్ని మార్చగలిగిన – ఆరోగ్యాన్ని, కార్యజయాన్ని ఇవ్వగలిగిన మహిమాన్వితమయినవి. అరుదుగా లభించేవి ఈ బదనికలు. అయితే ఇప్పుడు నా అన్వేషణ అది కాదు. ఒక గొప్పదైన కార్యసాధన కోసం నిగూఢమైన మంత్ర విద్యకు అనుబంధంగా ఈ బదనికలు అవసరమయ్యాయి. నీకు చెప్పినా అర్థంకాదు" అంటూ బదులిచ్చాడాయన.

నిజంగానే ఆయన మాటలు అర్థంగాక డ్రైవరు కాశి, పులికొండయ్య ముఖముఖాలు చూసుకున్నారు. ముఖ్యంగా పులికొండయ్యకు చాలా విషయాలు తెలుసు. చాలాకాలంగా అగ్నివేశాచార్యుడి వద్ద పనిచేస్తున్నాడు. ఇప్పటికీ ఆయన మాటలు, చేతలు తనకి అర్థంకావు. ముఖ్యంగా ఈ అడవిలోనే ఆయనకి ఒక రహస్య స్థావరం ఉంది.

అక్కడ ఘనాపాటీలయిన మరో ఇద్దరు వైద్యులున్నారు. వీళ్ళంతా రహస్య పరిశోధనలో తలమునకలై వున్నారు. ఆయుర్వేదం మంత్రం తంత్రం అన్నీ కలగలిసిన విచిత్రమైన ప్రయోగాలేవో చేస్తూంటారు.

చూస్తుంటే ఒక్కోసారి వీళ్ళంతా పిచ్చోళ్ళా అన్పిస్తుంది తనకి. కాని అంతా మేధావులు, మహానుభావులు గాబట్టి వాళ్ళని పిచ్చోళ్ళుగా జమకట్టలేం. మూడు మాసాలుగా ఏకదీక్షగా పనిచేస్తున్నారంతా.

ఒక్కోసారి రాత్రిళ్ళు నిద్రపోరు. పనివాళ్ళచేత ఏవో లేపనములు నూరుస్తారు. మందులు తయారు చేయిస్తారు. వీటిని కర్రముక్కలు, చెక్కలు, అద్దాలకు పూసి ఏవో ప్రయోగాలు చేస్తుంటారు.

ఏదీ తమకు అర్థం కాదు. అడవిలోని రహస్య ప్రదేశంలో వైద్యులతో బాటు ఇద్దరు వంట వాళ్ళు, ఇద్దరు మందులు నూరటానికి పనివాళ్ళు కూడా ఉన్నారు.

అంతా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడూ అగ్నివేశాచార్యులు మాత్రం బయటకెళ్ళి వస్తుంటారు. అడవిలో తిరగడానికి ఒక జీపు, బయటకు వెళ్ళాలంటే ఒక కారెప్పుడూ సిద్ధంగా ఉంటాయి. డ్రైవరు మాత్రం కాశి ఒక్కడే. మౌనంగానే నడుస్తూ మరో ఇరవై నిముషాల ప్రయాణం తరువాత అంతా ఒక విశాలమైన మడుగు చెంతకు చేరుకున్నారు.

మడుగు తీరంలో అనేక వృక్షజాతులు శాఖోపశాఖలుగా విస్తరించి పెరిగి వున్నాయి. వీటి మధ్య పురాతనమైన ఒక అశ్వత్థ వృక్షం ఆకాశాన్నంటుతూ నిలబడి వుంది. అది ఏనాటి వృక్షమో ఎన్ని సంవత్సరాలుంటాయో అంచనా వేయటం కష్టం.

ఖచ్చితంగా వందల సంవత్సరాలపైనే ఉంటుంది వయసు. మాను చుట్టు కొలత సుమారు ముప్పై అడుగులు ఉండొచ్చు. ఆ చెట్టు కొమ్మల మధ్య ఏర్పడి వుంది చక్కటి బదనిక.

"అదిగో... అదిగదిగో సామీ నేను చెప్పినది అదే. నేను చూసినప్పటి కన్నా కాస్త పెద్దదైంది. ఇంకో నెల దాటితే రాలిపోతుందనుకుంటా" అంటూ చెట్టుపైన నేలకు ముప్పై అడుగుల ఎత్తులో రెండు శాఖల మధ్యన పుట్ట గొడుగులా ఏర్పడి లేత పసుపు రంగులో మెరుస్తున్న బదనికను చూపించాడు పులికొండయ్య. అగ్నివేశాచార్యుడు కింద నుంచే బదనికను పరిశీలనగా చూసి సంతృప్తిగా తలవూపాడు.

"భేష్‌రా కొండయ్యా. మనకి సరిపడు ప్రమాణము గల అద్భుతమైన బదనిక. అమిత శక్తివంతమైనది. వెంటనే తీద్దాం. ఏర్పాట్లు చేయండి" అంటూ అక్కడే ఒక రాతిబండమీద ఆసీనుడయ్యాడు.

క్షణాల్లో ఏర్పాట్లు ఆరంభించారు డ్రైవరు కాశి, పులి కొండయ్యలు. రావిచెట్టును మొదట శుభ్రం చేశారు.

గుప్పెడు బియ్యాన్ని పసుపుతో కలిపి అక్షింతలు చేశారు. బొగ్గులు మండించి నిప్పులు తయారుచేశారు. బదనికల్ని ఇష్టానికి తీయటం సాధ్యం కాదు. దోషంకూడా. తగిన జాగ్రత్తలు పాటించి పద్ధతిగా తీసుకోవాలి. పులి కొండయ్య మడుగులో దిగి తలస్నానం చేసి వచ్చి పొడిపంచె కట్టుకున్నాడు.

ఈలోపల అగ్నివేశాచార్యుడు చెట్టుమొదట శుభ్రం చేసినచోట పిండి ముగ్గుతో బదనికలు తీసే యంత్రం వేశాడు. మధ్యలో 'ఓం' అనే అక్షరం దానికి నాలుగు పక్కలా నాలుగు హ్రీం అనే అక్షరాలు వాటికి దిగువన ఓం హ్రీం క్లీం ఆవేశాయ అనే మంత్రం. ఇదే ఆ మంత్రం.

దిగువన రాసినది మహాసబ్జమంత్రం. సాధారణంగా ఒక్కో వృక్షానికి చెందిన బదనికను తీయటానికి ఒక్కో నక్షత్రం ఉంటుంది. రావి బదనికను ఉత్తరాభాద్ర నక్షత్రంలో తీసుకోవాలి. అందుకే వారం రోజుల తరువాత ఈ రోజు ఉత్తరాభాద్ర నక్షత్రంలో వారంతా ఇక్కడికి వచ్చారు.

అగ్నివేశాచార్యుడు రావి మాను మీద, యంత్రం మీద అక్షింతలు చల్లి ధూపంవేసి 'ఓం హ్రీం క్లీం ఆవేశాయ' అంటూ మంత్రాన్ని ముమ్మారు చెప్పి నమస్కరించి పులికొండయ్య చేత కూడా అలాగే చేయించాడు.

తర్వాత తన పైతుండును పులి కొండయ్య భుజంమీద వేసి 'జాగ్రత్తగా తీసుకురా' అంటూ పంపించాడు. నిజానికి ఇక్కడ అగ్నివేశాచార్యుడే చెట్టెక్కాలి. కాని వయసు రీత్యా ఆయనకి కష్టమే కాదు, ప్రమాదం కూడా.

అందుకే ఉత్తరీయం ఇచ్చి తన ప్రతినిధిగా పులి కొండయ్యను పంపించాడు. చెట్లు ఎక్కటంలో అనుభవజ్ఞుడు పులి కొండయ్య.

లాఘవంగా చెట్టెక్కి మూడు నిముషాల్లో కొమ్మల్లో ఉన్నాడు. బదనిక ఉన్నచోటుకు చేరుకున్నాడు. రెండు శాఖలమధ్య చక్కగా పెరిగిన బదనికను చూశాడు. లేత పసుపు రంగులో దోసిట ఇమడని సైజులో ముద్దగా మెరుస్తోంది. దాని కాడనుండి లేత పసుపు రంగులో చిక్కటి ద్రవం స్రవిస్తోంది.

బదనికను చేత్తో తాకితే చేయిమాడి బొబ్బలెక్కే అవకాశం ఉందని వాడికి తెల్సు. వెంట తెచ్చిన గుప్పెడు అక్షింతలు బదనిక మీద చల్లి నమస్కరించాడు.

పై తుండును బదనిక మీద వేసి పట్టుకుని కత్తితో మొదలుకు కోసి తీసుకుని మూటకట్టి జాగ్రత్తగా భుజాన వేసుకున్నాడు.

ఎంత సులువుగా చెట్టు ఎక్కాడో అంత సులువుగానూ, చకచకా చెట్టు దిగివచ్చి పైతుండుతో సహా బదనికను ముగ్గురి మధ్య ఉంచాడు.

అగ్నివేశాచార్యుడు తిరిగి బదనికమీద అక్షింతలు చల్లి ధూపదీప నైవేద్యం ఇచ్చి నమస్కరించి తిరిగి పైతుండులో బదనికను మూటగట్టి తన భుజాన వేసుకుని మరోసారి అశ్వత్థ వృక్షానికి నమస్కరించి వెనుతిరిగాడు. రావి బదనికను సేకరించుకోవటంతో వారికి వచ్చిన పని పూర్తయింది.

పులికొండయ్య కాశీ ఇద్దరూ అయన్ని అనుసరించారు. వచ్చిన దారినే ఒక గంట ప్రయాణం చేయగా మైదానం వద్ద పార్క్ చేసిన జీపువద్దకు చేరుకున్నారు. కాశీ జీపు స్టార్ట్ చేసి స్థావరం దిశగా పోనిచ్చాడు.

*　　*　　*　　*　　*

"నాన్నగారూ... నాకెందుకో ఈ ప్రాజెక్ట్ సక్సెస్ అవుతుందన్న నమ్మకం రాను రాను సన్నగిల్లుతోంది...." అన్నాడు పిల్లా శివరామ ముకుంద పాత్రుడు. తిరగేస్తున్న తాళపత్ర గ్రంధాన్ని పక్కనుంచి సాలోచనగా కొడుకు వంక చూశాడు పిల్లా గోవిందపాత్రుడు. వారిద్దరూ తండ్రీకొడుకులు.

తండ్రి వయసు సుమారు ఎనభై సంవత్సరాలు. ఆయుర్వేద వైద్యంలో ఘనాపాటి ఆయన. పూర్తి పేరు పిల్లా గోవిందపాత్రుడు. ఆయన కొడుకు వయసు నలభై సంవత్సరాలు. ఆయన కూడా గొప్ప ఆయుర్వేద వైద్యుడు. పేరు పిల్లా శివరామ ముకుందపాత్రుడు. వంశానుగతముగా ఆయుర్వేద కుటుంబం వీరిది.

ఎన్నో తరాలుగా వీరిది వైద్య వృత్తి, గత ఆరు వందల సంవత్సరాలుగా వీరి వంశస్థులు విజయనగర రాజులకు అనువంశిక ఆయుర్వేద వైద్యులు.

వీరి స్వస్థలం విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని చింతలపాలెం గ్రామం.

ఈ తండ్రీ కొడుకులు ఇద్దరూ ఆయుర్వేద వైద్యంలోనూ, ఆయుర్వేద మందుల తయారీలోనూ, కొత్త ఔషధాలు తయారు చేయటంలోనూ అద్భుత విజయాలు సాధించి గొప్ప పేరుప్రతిష్ఠలు పొందినవారు. ఎన్నో గ్రంధాలు చదివినవారు, జిజ్ఞాసువులు.

కొత్త విషయాలు తెలుసుకోవాలనే మెండైన ఆసక్తి కలవారు. భారత భాగవత రామాయణాది సకల ఇతిహాసాలు, పురాణాలు చదివినవారు. అందుకే ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు వీరిద్దరినీ తనకు సహాయకులుగా ఎంచుకున్నాడు.

ఆయన ప్రాజెక్టు గురించి విన్నాక ఆకర్షితులైన వీరిద్దరూ తమవంతు కృషినీ, సహాయ సహకారాల్ని అందించటానికి ఉత్సాహంతో అంగీకరించి ఇక్కడికి వచ్చి ఈ పరిశోధనల్లో పాలుపంచుకొంటున్నారు.

"ఎందుకు అలా అనుకుంటున్నావ్?" కళ్ళజోడు సవరించుకుని తలెత్తి కొడుకును చూస్తూ అడిగాడు గోవింద పాత్రుడు. వచ్చి ఎదురుగా కూర్చుని – పెదవి విరిచాడు ముకుందపాత్రుడు.

"తెలీదు. కాని మనమనుకున్న రిజల్టు కనిపించకపోవడంచేత కాస్త నిరాశ కల్గుతున్నట్టుంది" అన్నాడు.

కొడుకు మాటలు విని కాస్సేపు మౌనం వహించాడాయన. అవతల హాల్లో సేవకులు ఇద్దరూ కల్వంలో ఏవో మందులు నూరుతున్న శబ్దం వినబడుతోంది. ప్రశాంతంగా ఉంది వాతావరణం. అది అగ్నివేశాచార్యుడి రహస్య స్థావరం. లోతట్టు దట్టమైన అటవీ ప్రాంతంలో ఒక కొండగుట్ట నానుకుని ఉంది.

ఇది రహస్య స్థావరం అని ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే ఇప్పుడు తను చేస్తున్న ప్రయోగాలు, పరిశోధనలు బయటి ప్రంచానికి తెలీటం అగ్నివేశాచార్యుడకి ఇష్టం లేదు. తెలీకూడదు కూడా. తెలిస్తే మేలుకన్నా కీడు జరిగే అవకాశం ఉంది. అందుకే తమ కార్యకలాపాలను ఇక్కడ జరిపిస్తున్నాడాయన.

సుమారు నూట యాభై అడుగుల కొండగుట్ట పాదంలో గుహలా నిర్చించబడిన కట్టడమది. కొండ గుట్టమీదే కాదు. సువిశాలమైన గుహమీద కూడా దట్టంగా చెట్లు పెరగడం చేత అక్కడో స్థావరం ఉందనిగాని, మనుషులుంటున్నారని గాని అడవిలో సంచరించేవారికి తెలీదు.

గుహ ప్రవేశం దాటి డోర్ మూయగానే సమీపంలోకి వచ్చినవారు కూడా గుహని గుర్తుపట్టలేరు. వాహనాలు కూడా లోపలే ఉంటాయి. లోన కరెంట్ సౌకర్యం ఉంది. నిరంతరం కరెంట్ ఉత్పత్తి చేసే ప్లాంట్ లోపలే ఏర్పాటు చేశారు.

గుహలో నాలుగయిదు విభాగాలున్నాయి. వంటవాళ్ళు నివసించేది చివరి భాగములో ఉంది. మధ్య హాల్లో పరిశోధనా విభాగం ఉంది. దానికి ఇవతల

మందుల తయారీ నౌకర్లు ఉండేది. మొదటి విభాగంలో మిగిలిన వారుంటారు. అక్కడ చిత్ర విచిత్రమైన పరికరాలు. వస్తువులు ఎన్నో ఉన్నాయి.

"నిరాశ మనిషికి స్ఫూర్తిని ఇవ్వదు" ఉన్నట్టుండి పలికింది గోవింద పాత్రుడు గొంతు.

"మన పూర్వీకులు అలా అనుకుంటే కొత్త కొత్త ఆవిష్కరణలు వెలుగు చూసేవికావు.

అంత దేనికి.... భరద్వాజుడు, చరకుడు వంటి మహర్షులు వైద్య రంగంలో ఎన్నో ప్రయోగాలు చేసి ఫలితాలు సాధించకుండానే అద్భుతమయిన ఆయుర్వేద గ్రంధాలను అందించారా?... లేదు.

విసుగు, విరామం లేకుండా వైద్యరంగంలో ఎంతో కృషిచేసిన మహనీయులు వారు. ఏ రంగమైనా కృషి, పట్టుదల ముఖ్యం. ఎందుకు సాధించలేమనే పట్టుదలే అనుకున్నది ఓ రోజు సాధించడానికి కారణమవుతుంది. ఆచార్య అగ్నివేశాచార్యుడు సాధారణ వ్యక్తి కాదు నాయనా. సమకాలీన మహర్షి ఆయన.

ఆయుర్వేదంతోబాటు వేదాలను, పురాణ ఇతిహాసాలను ఔపోసన పట్టిన గొప్ప పౌరాణికుడు.

మంత్ర తంత్ర యంత్రాది అనేక విద్యల్లో నిష్ణాతుడు. అనేక విద్యలు తెలిసిన మహామనీషి. ఈ ప్రాజెక్టుమీద కన్నా ఆయనమీద నాకు నమ్మకమెక్కువ. ఖచ్చితంగా సాధించగలడు.

ఈనాడు భౌతికంగా మనిషి ఇతర గ్రహాల వరకు వెళ్ళి రాగల్గుతున్నాడు. ఇది సాధ్యమా అని శాస్త్రవేత్తలు సందేహించి వుంటే అది సాధ్యమయ్యేదే కాదు."

తండ్రి గోవిందపాత్రుని మాటలు కొడుకు ముకుందపాత్రునికి సంతృప్తి నివ్వలేదు.

"కాని నాన్నగారూ... ఇది ఆధునికయుగం. మంత్ర శక్తితో భూతకాలం లోకి తొంగిచూడడం అంత సులువు కాదనుకుంటాను" అన్నాడు.

"సులువని ఎవరన్నారు? శ్రమించాలి. ప్రయోగాలు చెయ్యాలి. ఫలితాలకోసం తపించాలి. అనుకున్నది సాధించడంకోసం తమ జీవితకాలాన్ని ధారపోసిన మహాత్ములెందరో ఉన్నారు.

శ్రమకు తగ్గ ఫలితం ఎప్పుడూ ఉంటుంది. తన సృష్టిలో భగంతుడు ఎన్నో రహస్యాలను ఉంచాడు. శోధిస్తేగాని అవి మనిషికి దొరకవు. ఈనాడు శాస్త్రవేత్తలు మనిషిని అంతరిక్షంలోకి గ్రహాంతర సీమలకు పంపిస్తున్నారు. సరిగ్గా ఇదే ప్రయత్నం ఆచార్యుడిది. ఇంతకన్నా ఎక్కువవే చెప్పాలి.

మనిషి నుండి ఆత్మను బయటకు రప్పించి గతకాలంలోకి పంపించి ఆయా కాలాల్లో ఏం జరిగిందో నిజాలు రాబట్టడం ఆయన లక్ష్యం. నాకు తెలిసింది ఇంతవరకే. కాని ఇంతకు మించి ఆయన మనసులో మరేదో లక్ష్యం ఉందని అనిపిస్తుంది.

అదేమిటో ఆయన చెప్పేవరకు మనకు తెలీదు. కాబట్టి ఇంకెప్పుడూ మనసులోకి సందేహాలు రానీకు.

మనం మనస్ఫూర్తిగా తోడ్పడితేనే ఆచార్యుడి శ్రమ ఫలిస్తుంది. నేనూ ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్నా.

ఆ క్షణాలు ఖచ్చితంగా అద్భుతంగా ఉంటాయి. ఒక మహాద్భుతాన్ని త్వరలోనే ఆవిష్కరిస్తాడాయన" అంటూ హితబోధ చేశాడు గోవిందపాత్రుడు.

సరిగ్గా ఇదే సమయంలో – అడవిలోకి వెళ్ళిన ఆచార్య అగ్నివేశుడు, వెంట వెళ్ళిన పులికొండయ్య, డ్రైవరు కాశి అంతా స్థావరంలోకి తిరిగివచ్చారు.

"ఆచార్యా! ఏమైంది? అశ్వత్థబదనిక లభించినదా?" లేచి ఎదురు వెళ్తూ అడిగాడు గోవిందపాత్రుడు.

"లభించినది గోవిందా. మన ప్రయోగాలు తుది దశకు చేరుకోనున్నాయి. ముందుసారిలా ఈ తూరి పవిత్రలేపనం తయారీలో తప్పులు దొర్లకూడదు. అష్టదిగ్బంధనం చేస్తాను. మనవాళ్లు ఎవరూ బైటకు పోకుండా చూడండి. అలాగే అనువైన కల్వం, మూలికలు, పొడులు అన్నీ సిద్ధం చేయండి.

నేను పూజలోంచి లేచి రావడానికి సుమారు మూడు గంటలు పడుతుంది. ఈ లోనంతా సిద్ధంగా ఉండాలి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మీరు నిశ్చింతగా పూజ గావించండి ఆచార్యా... అంతా సిద్ధంగా ఉంటుంది" భరోసా ఇచ్చాడు గోవిందపాత్రుడు. పది దినాల క్రితం ఇలాగే ఒక రావిబదనికను తెచ్చి పూజ చేస్తూండగా చివరి దశలో దీపం చెమ్మాయి బదనిక మీదపడి ఆ బదనిక పనికిరాకుండా పోయింది.

అదెలా పడిందన్నది ఇప్పటికీ అర్థంగాలేదు ఎవరికీ. ఆచార్యుడి మదిలో ఒక సందేహం ఉంది. ఏదో దుష్టశక్తి తనకు విఘ్నం కలిగిస్తోందన్నది ఆ సందేహం. కాని ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. ఆ సందేహ ఫలితమే అష్టదిగ్బంధనం చేస్తాననడం.

చకచకా ఎవరి పనులలో వారు మునిగిపోయారు. ఆచార్యుడు స్నానం చేసి మడిబట్టతో పూజలో కూర్చున్నాడు. అక్కడెదురుగా గణపతి, త్రిమూర్తుల అవతారమైన దత్తాత్రేయుడు, జగన్మాత మహాచండీ, ఆయుర్వేద మూల పురుషుడగు ధన్వంతరీ, వాయుపుత్రుడైన హనుమంతుడు వీరితో బాటు ఒక యక్షుని విగ్రహం కూడా అక్కడ ఉంది. ఆయన్ని 'మణిభద్ర యక్షుడు' అంటారు. ఇతడు యక్షుల్లో అగ్రగణ్యుడు. ప్రయాణాధిపతి.

పూర్వ కాలంలో మార్గమధ్యంలో అనేక చోట్ల ఈ మణిభద్ర యక్షుడి ఆలయాలు ఉండేవి. తమకు ఏ కష్టనష్టం వాటిల్లకుండా క్షేమంగా గమ్యం చేర్చమని బాటసారులు మణిభద్ర యక్షునికి పూజలు, కొలుపులు చేసిగాని ముందుకు సాగేవారు కాదు.

కాలానుగుణంగా వచ్చిన మార్పులలో ఈ యక్షుని స్థానాన్ని హనుమంతుడు ఆక్రమించాడు. హైవేల వెంట అనేక ఆంజనేయ ఆలయాలను నేడు మనం చూడొచ్చు. మణిభద్రుడ్ని ప్రజలు మర్చిపోయినా ఆయన ప్రభ ఏమీ తగ్గలేదు.

ఏ కాలంలోకి వెళ్ళాలన్నా ఈ యక్షుడు ద్వారం లాంటివాడు. ఈయన శక్తి సామర్థ్యాలు ఆచార్యుడికి తెలుసు. అందుకే ఆయన్ని ఉపాసించి ప్రసన్నం చేసుకుని తన వశంలో ఉంచుకున్నాడు.

ముందుగా హోమగుండలో పమిధలు రగిల్చి హోమాగ్నిని ప్రజ్వరిల్ల జేశాడు. స్వచ్ఛమైన ఆవునేతిని హోమాగ్నిలో వ్రేల్చుతూ ఇష్టదేవతా ప్రీత్యర్థం హవిస్సులు ఆర్పించి పూజచేశాడు. దీనికి గంట వ్యవధి పట్టింది. తర్వాత స్వర్ణాధి దేవతైన కుబేరుని ప్రసన్నం చేసుకుని మంత్రసిద్ధి పొందటానికి ధ్యానంలోకి వెళ్ళిపోయాడు. అలా పదినిముషాలు గడిచిందో లేదో – ఆయన ధ్యానానికి ఏదో అపశృతి.

పుజగదిలో ఎవరో సంచరిస్తున్న భ్రాంతి. సందేహము లేదు. అదృశ్య రూపంలో ఎవరో సంచరిస్తున్నారు. బహుశా గతంలో దీపం స్తంభాన్ని తోసి తన ప్రయత్నాన్ని అడ్డుకుంది కూడా ఇదే అదృశ్య శక్తి కావచ్చు. చట్టున కళ్ళు తెరిచాడాయన.

ముఖంలో క్రోధఛాయలు పొడచూపుతుండగా "ఎవరు నువ్వు? ఇక్కడ నీకేం పని?" అంటూ గద్దించాడు. ఆయన అరుపుతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అంతే. ఎక్కడివాళ్ళక్కడ చేస్తున్న పని ఆపి వేగంగా పూజగది గుమ్మంలోకి పరుగులెత్తుకొచ్చారు.

*　　*　　*　　*　　*

గుడి ముందు చరక్ తన బైక్ లాక్ చేసేసరికి ఉదయం ఎనిమిది గంటలైంది సమయం. శీతాకాలం పొగమంచులో రాజధానీ నగరం మునిగి పోయినట్టుందీ వేళ. ఎటుచూసినా తెల్లటి మంచుపరదాలు.

వర్షం పడినట్టు వీధులు తడిసిపోయి కనబడుతున్నాయి. పొగమంచు కారణంగా ఎనిమిది దాటుతున్నా సూర్యుడు కన్పించడంలేదు.

చలిచలిగా ఉంది వాతావరణం. గుడికి వస్తున్న భక్తుల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉంది.

పురాతనమయిన ఆ శివాలయంలో ఈ సీజన్‌లో అతి తక్కువమంది భక్తులు రావడం ఇదే తొలిసారి. శుశ్రుత గుడిలో ఉంటే పరవాలేదు.

ఇంట్లో ఉంటే కలవడం కష్టమే ఆమె తల్లి కావేరిముందు తను ఫ్రీగా మాట్లాడలేదు. కిరణ్ వెంటవుంటే కాస్త ధైర్యంగా ఉండేది. మూడు రోజులు సెలవుమీద ఊరెళ్ళాడు వాడు.

ఏది ఏమయినా ఈ రోజు శుశ్రుతకు తన లవ్ గురించి చెప్పేయాల్సిందే. ఆలోచిస్తూనే గోపుర ద్వారం దాటి ఆలయ ఆవరణలో ప్రవేశించాడు చరక్.

గుడి ఆవరణలోగాని గుడిలోగాని ఎక్కడా శుశ్రుత జాడలేదు. ఆమె తండ్రి పూజారి రామాచారి ఆలయ గర్భగుడిలో కూర్చుని భక్తులకు శఠగోపం పెట్టి తీర్థప్రసాదాలు ఇస్తున్నాడు.

ఈ మధ్య రోజూ గుడికి రావడంతో తనూ ఆయన దృష్టిలో పడ్డాడు. జనం లేరు గాబట్టి లోపలకు వెళ్ళడం బాగుండదు అనుకున్నాడు. అక్కడికీ

గుడికి ప్రదక్షిణాలు చేస్తున్న వంకతో రామాచారి ఇంటివంక తొంగితొంగి చూశాడు. ఎవరూ కన్పించలేదు. బయట ఎక్కడికైనా వెళ్ళుంటుందా? ఇంత పొద్దుటే ఎక్కడకు వెళ్తుంది? ఆలోచిస్తూనే నిరాశతో వెనుతిరిగాడు చరక్.

ఏమిటీ పిచ్చి? తనకే ఆశ్చర్యంగా ఉంది. వారం రోజులక్రితం వరకు ఆమె ఎవరో తను ఎవరో. కాని ఇప్పుడు? ఆమె తనకోసమే పుట్టిందనిపిస్తోంది.

ఒక్కరోజు ఆమెను చూడకపోయినా మనసులో ఏదో తీరని వెలితి. తియ్యటి బాధ. ప్రేమకు ఇంత బలం ఏమిటి? పుట్టిపెరిగాక ఎంతోమంది అమ్మాయిలతో తనకు పరిచయం ఉంది. చాలామంది తనకు లవ్ ప్రపోజ్ చేశారు. కాని ఎవరూ తనకు నచ్చలేదు. వారెవరినీ చూసినప్పుడు కలగని స్పందన తనకు శుశ్రుతను చూశాక కలిగింది. ఆ సౌందర్యం, మాటతీరు, ఒద్దిక ఒక టేమిటి ఆమె అణువణువు తనకు నచ్చింది.

తన ఆరాధ్యదేవత అయికూర్చుంది. ఏ ముహూర్తంలో ఆమెను చూశాడోగాని ఆమెకోసం మనసు పడుతున్న తపన తనకే తెలుసు. ఆమె ప్రేమను పొందని జన్మ వృధా అన్పిస్తోంది.

త్వరగా 'ఐలవ్‌యూ' చెప్పమని హృదయం తొందరపెడుతోంది. కాని గుడి వదిలి బయటకు రాదాయె. ఏకాంతం లభించదాయె... ఏం చేయాలి?

ఆలోచనల్లోపడి బైక్ వద్దకు చేరుకోవడమే గుర్తించలేదు చరక్. అంతలో – "ఏమిటి? వెదకడం అయిపోయిందా?" అంటూ పరిచితమగు తియ్యని గొంతు విని ఉలిక్కిపడి తిరిగి చూశాడు. ఎదురుగా శుశ్రుత!

తన వెనకే నీడలా వస్తున్నట్టుంది. తను గమనించనేలేదు.

ఉదయమే తలారా స్నానం చేసి వదులుగా జడవేసుకుని ముద్దమందారం ఒకటి తురిమి లంగా ఓణీలో అద్భుతంగా మెరిసిపోతూ మేలిమి పసిడి బొమ్మలా ఉంది. చేతిలో చిన్న పూలకొమ్మను పుచ్చుకుని వయ్యారంగా సమీపంలోకి వచ్చి నిలబడింది.

"ఏమంటున్నావ్?" అనడిగాడు వినబడనట్టుగా.

"వెదకడం అయిపోయిందా అంటున్నాను" తన మాటల్ని తిరిగి చెప్పింది శుశ్రుత.

అంత ఈజీగా దొరికిపోవడం అతడికిష్టం లేదు. తనకంట పడకుండా దాగి ఇంతసేపు తనను గమనించిందని అర్థమై కోపం కూడా వచ్చింది. అందుకే "అయిందిలే" అన్నాడు పొడిగా.

"కన్పించిందా?" కొంటెగా అడిగింది.

"ప్చ్... ఇంకా లేదు"

"ఏం లేదు?"

"అదే శుశ్రుతగారూ. శివలీల కన్పించడంలేదు అంటున్నాను."

ఆ మాటతో శుశ్రుతకి కోపం వచ్చింది. "శివ లీలలు అంత తేలిగ్గా కనబడవుగాని... వెళ్ళిపో" అంటూ చివ్వున వెనుతిరిగింది.

"శుశ్రుతా... ఆగు... ప్లీజ్" వెంటబడుతూ పిలిచాడు.

ముఖంలో అలక చూపిస్తూ అతడ్ని చూసింది శుశ్రుత. "శివుడికోసం వచ్చి నాతో కబుర్లేమిటి వెళ్ళెళ్ళు...." అంటూ మరో మాటకి ఛాన్సివ్వకుండా వడివడిగా వెళ్ళిపోయింది ఆమె.

నెత్తి కొట్టుకున్నాడు చరక్.

ఈ అమ్మాయిలోపట్టాన అర్థమైచావరు. నీ దర్శనంకోసమే నా వెదుకులాట అని ఫ్రాంక్‌గా చెప్పడానికి అహం అడ్డుపడింది. బయట పడకుండా ఏదోలా మేనేజ్ చేద్దామనుకున్నాడు. బెడిసికొట్టింది.

ఇప్పుడేం చేయాలి? ఇంటికెళ్తే? అమ్మో. అత్త కావేరి బుర్ర తినేస్తుంది. భక్తజనం లేరుగాబట్టి గుడిలోని మామ రామాచారి ఏ క్షణంలోనైనా బైటికి రావచ్చు. అంతా రసాభాస అయ్యే ప్రమాదం ఉంది. రేపెలాగూ ఆదివారం సెలవురోజు. రేపు కలవడం బెటర్. అప్పటికి శుశ్రుత కోపం కూడా శాంతిస్తుంది.

మరోసారి ఆలయంలోకి వెళ్ళే ప్రయత్నం విరమించుకుని తన బైక్ స్టార్ట్ చేశాడు చరక్. అతను వెళ్ళిపోవడం లోపల్నుంచి శుశ్రుత చూస్తూనే వుందని పాపం చరక్‌కు తెలియదు.

శుశ్రుత లేత పెదవులపైన మెరుస్తూనే వుంది ఓ చిలిపి దరహాసం.

* * * * *

"ఎవరు నువ్వు? ఇక్కడ నీకేం పని?" మరోమారు తీవ్ర స్వరంతో అడిగింది అగ్నివేశాచార్యుడి గొంతు.

ఏం జరుగుతోందో ఆయనెవరినుద్దేశించి అడుగుతున్నాడో తెలీక గుమ్మంలో నిలబడిన వారంతా ముఖముఖాలు చూసుకుంటున్నారు.

ముకుందపాత్రుడు కూడా పూజగదిలో అడుగుపెట్టడానికి సంశయిస్తున్నాడు.

ఒక్కసారిగా ఉత్కంఠత ఏర్పడింది అక్కడ. వారి ఆరాటం గమనించి నట్టున్నాడు. పద్మాసనంలోని ఆచార్యుడు తలతిప్పి ఓసారి అందర్నీ చూశాడు.

"మీరెవరూ లోనకు రావద్దు. ప్రమాదం. ఇక్కడో అదృశ్యశక్తి నా ముందు కుప్పిగంతులేస్తోంది. ఏం జరిగినా మీరు బయటే ఉండండి." అంటూ హెచ్చరించాడు. దాంతో ఉన్న ధైర్యం కూడా జారిపోయి ఆత్రంగా బయటే నిలబడి చూడసాగారు.

"మరోసారి హెచ్చరిస్తున్నాను. నీ ఉనికి నాకు తెలిసిపోయింది. నువ్వెవరివైనా నా ముందు కొచ్చి కనబడు." తిరిగి హెచ్చరించాడా అదృశ్య శక్తిని అగ్నివేశాచార్యుడు. అయినా ఫలితం లేకపోగా అగుపించని ఆ అదృశ్య శక్తి ఏదో బయటకు పారిపోయే ప్రయత్నం తీవ్రంగా చేస్తోంది. అది గాలిలో తిరుగుతున్న వేగానికి శంఖం ఊదినట్టు ధ్వని స్పష్టంగా విన్పిస్తోంది.

గది నలుమూలలా వస్తువులు కొన్ని ఎగిరి నేలమీద పడ్డాయి. భీతావహంగా ఉంది పరిస్థితి.

"మూర్ఖా! నా అష్టదిగ్బంధనంలో ఉన్నావు. ఈ గది దాటి పోవడానికి నీ శక్తి చాలదు. రా... నాముందుకు రా... ఇది ఆచార్య అగ్నివేశుడి ఆనతి" చివరి సారిగా హెచ్చరించాడాయన.

అయినా కూడా ఆయన ముందుకొచ్చే ధైర్యం లేనట్టు పారిపోయే ప్రయత్నంలోనే ఉందా అదృశ్యశక్తి.

"ఇలా నువ్వు దారికి రావుగాక. నీ ఖర్మ. నిన్ను ఆవాహన చేస్తున్నాను. వచ్చి హోమగుండం మీద నిలబడు. అదే నీకు సరైన శిక్ష" అంటూ ఏవో మంత్రాలు ఉచ్చరిస్తూ గుప్పెడు సాంబ్రాణి తీసి హోమగుండంలో వేశాడు. మరుక్షణం గప్పున ఎగసింది దట్టమయిన సాంబ్రాణి పొగ. ఆ వెనువెంటనే కెవ్వున ఒక ఆర్తనాదం గదిలో మారుమ్రోగింది.

ఆచార్యుడు మంత్రోచ్చారణ చేస్తూనే ఉన్నాడు. ఉన్నట్టుండి పొగలో ఒక ఆకారం ప్రత్యక్షమయింది. అస్పష్టమైన పురుషాకారం. గాజులా పారదర్శకంగా ఉంది. బాధతో మెలికలు తిరుగుతూ అరుస్తోంది.

మంత్రాలు ఆపి మరికొంత సాంబ్రాణి వేశాడు. పొగలోని రూపం ఆర్తనాదాలు చేస్తోంది.

"వేడి... ఒళ్ళంతా కాలిపోతోంది, నన్ను బయటకు తీయండి స్వామీ" కేకలు వేస్తోంది.

"ఇప్పుడైనా నువ్వెవరో చెపుతావా?" ఆ ఆకారాన్ని తీక్షణంగా చూస్తూ హుంకరించాడు అగ్నివేశాచార్యుడు.

"చెబుతాను స్వామీ. ముందు నన్ను బయటకు తీయండి. ఈ బాధ భరించలేను" పెద్దగా ఏడుస్తోందా రూపం.

ఆచార్యుడి మనసుకరిగింది. కొద్దిగా నీరు మంత్రించి సాంబ్రాణి పొగమీద చల్లాడు. మరుక్షణమే ఒక ఆకారం పొగలోంచి బయటకు దూకి ఆచార్యుడి ఎదుట చేతులు జోడించి నిలబడింది. అదే అస్పష్టమైన గాజులా పారదర్శకమైన పురుషాకారం.

"చెప్పరా... ఎవర్నువ్వు?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"నా పేరు విళంబి" చెప్పిందా రూపం.

"ప్రేతాత్మవా?"

"కాదు స్వామీ. నాకు శరీరం ఉంది."

"ఎక్కడ ఉంది?"

"జాజ్‌పూర్ సమీపంలోని కొండమీద"

వారిద్దరి సంభాషణ గడప బైటవున్న అందరికీ స్పష్టంగా వినబడుతోంది. ఆశ్చర్యంతో నోటమాట రావటంలేదు ఎవరికీ. ఎక్కడి జాజ్‌పూర్ ఎక్కడి రంపచోడవరం అడవులు? ఒరిస్సాలోని వైతరిణీనదీ తీరంలోని పురాతన నగరం జాజ్‌పూర్. తాంత్రిక విద్యలకు కేంద్రం. విళంబి అనే వీడు తన శరీరాన్ని వదిలి ఆత్మ రూపంలో వచ్చి తమ స్థానంలో సంచరిస్తున్నాడంటే ఇది వీడొక్కడి పనేనా లేక వీడి వెనుక ఎవరన్నా ఉన్నారా! ఆచార్యుడి ఆలోచనలు తీవ్రంగా ఉన్నాయి.

"శరీరం నుంచి ఆత్మను వేరుచేసి నిన్ను మా స్థావరానికి అంపకం చేసిన ఆ దుష్టాత్మ ఎవడు?" అడిగాడు.

"మా గురుదేవుడు స్వామీ" వెంటనే చెప్పిందా ఆత్మ.

"ఎవడు వాడు?"

"మహామాంత్రికుడు మరిడి సోమయ్య."

ఆ పేరు వింటూనే అగ్నివేశాచార్యుడి భృకుటి ముడిపడింది. ఎక్కడో విన్న పేరు. ఎవడు వీడు?

"కిందటిసారి దీపస్తంభాన్ని పడదోసి మా ప్రయత్నాన్ని అడ్డుకుని మా శ్రమని వ్యర్థపుచ్చింది నీవేనా?" అడిగాడు.

"అవును స్వామీ... నేను నిమిత్తమాత్రుడిని. నా దుశ్చేష్టలను క్షమించి నన్ను విడిచిపెట్టండి" అంటూ వేడుకుంది విళంబి ఆత్మ.

మాట్లాడుతూనే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు అగ్నివేశాచార్యుడు. ఒక్కసారిగా ఆయన మనోనేత్రంలో గతం మెదిలింది. తను కూడా మంత్ర విద్యలు అప్పట్లో జాజ్‌పూర్‌లోనే అభ్యసించాడు.

తను గురుదేవుడు మహర్షి కుండలినీ యోగి. సకల మంత్ర రహస్యాలు తెలిసిన మహాయోగి. ఆయన వద్ద విద్యనభ్యసించిన వారిలో శంకర్ సాహు ఒకడు. ఈ శంకర్ సాహు తన మిత్రుడు. ఇతను తర్వాత కాలంలో గురువుగా స్థిరపడ్డాడు.

తను మాత్రం తమ వంశ కులవృత్తి అయిన ఆయుర్వేదంలో స్థిరపడ్డాడు. అప్పుడప్పుడు తను శంకర్ సాహును చూడ్డానికి జాజ్‌పూర్ వెళ్ళేవాడు. అతను కూడా తమ మున్నలూరు అగ్రహారం వస్తుండేవాడు.

ఈ శంకర్ సాహు శిష్యుడే మరిడి సోమయ్య.

ఆయన శిష్యులంతా తనకూ పరిచయస్థులే. ముఖ్యంగా మరిడి సోమయ్య తమని అంటిపెట్టుకు నుండి తమ మాటల్ని ఆసక్తిగా వింటుండేవాడు. శిష్యుడేగాబట్టి దాపరికం లేకుండా శంకర్ సాహు తనూ నిగూఢమైన విషయాలు, తర్క మీమాంసలు ఎన్నో చర్చించుకునేవారు.

పదేళ్ళ క్రితం మిత్రుడు శంకర్‌సాహు మరణించాడు. ఆ తర్వాత తనూ ఎప్పుడూ జాజ్‌పూర్ వెళ్ళలేదు. ఈ మరిడి సోమయ్యకు ప్రస్తుతం యాభై

సంవత్సరాలు ఉండొచ్చు. తన వయసులో సగంలేదు వీడి వయసు. తనతో ఏమిటి వీడి పంతం? ఎందుకు తన శిష్యుడు విళంబిని పంపిస్తున్నట్టు? ఎంత ఆలోచించినా అగ్నివేశాచార్యుడికి బోధపడలేదు.

ఒకవేళ తన ప్రాజెక్టు గురించి వీడికి తెల్సిపోయిందా? తన ప్రయోగాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనే ఇలా విళంబిని అంపకం చేస్తున్నాడా? లేక తన పనుల్ని నాశనం చేయాలని పంపిస్తున్నాడా!

అసలేమిటి వీడి ఉద్దేశ్యం? ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఎంతో వ్యూహాత్మకంగా పకడ్బందీగా జరుగుతున్న పనులమీద కేవలం మాంత్రిక వృత్తిలో స్థిరపడిన మరిడి సోమయ్య దృష్టి పడిందంటే ఇది వాడు చేస్తున్న క్షమింపరాని అపరాధం.

వీడు ఎలా తెలుసుకోగలిగాడనే కన్నా ఇప్పుడు వాడ్ని ఎలా ఆపడమన్నదే తన ముందున్న ప్రధాన సమస్య. ఖచ్చితంగా వాడు క్షుద్రదేవతోపాసనతో క్షుద్రశక్తుల్ని వశపర్చుకొనుంటాడు. శరీరం నుంచి ఆత్మను బయటకు రప్పించి స్వకార్యానికి వినియోగించుకుంటున్నాడంటే వీడు సాధారణ మంత్రగాడు కాదు.

తను పాసించే దైవశక్తులకీ మరిడి సోమయ్య క్షుద్రశక్తులకీ బలపరీక్ష ఏర్పడనుందా! ఇంతవరకు రహస్యంగా సాగుతున్న తమ ప్రయోగాలు, వాటి లక్ష్యం గురించి బయటి ప్రపంచంలో ఎవరికీ తెలీదనే ధీమాలో ఒక భ్రమలో ఉంటూ వచ్చిన అగ్నివేశాచార్యుడ్ని ఈ సంఘటన కొంచెం కలవరపరిచింది.

"మహాత్మా నన్ను క్షమించి వదిలేయండి. ఇంకెన్నడూ రాను" విళంబి ఆత్మ ప్రాధేయపడ్డంతో తీవ్ర ఆలోచనలనుంచి బైటపడ్డాడు అగ్ని వేశాచార్యుడు.

"నువ్వు చేసింది మహాపరాధం. ఐనా నిన్ను క్షమించి వదిలేస్తాను. కాని నువ్వు చెప్పాల్సిన నిజాలు ఇంకొన్ని ఉన్నాయి. అవి చెప్పాలి."

"అడగండి స్వామీ. నాకు తెలిసింది చెపుతాను" అంది విళంబి ఆత్మ.

"ఇంతవరకూ మాగురించి ఏం తెలుసుకున్నావు. నీ గురువుకి ఏం చెప్పావు?" అడిగాడు.

''ఏమీ తెలుసుకోలేకపోయాను స్వామీ. మా గురువుతో ఏమీ చెప్పలేదు...." అంది విళంబి ఆత్మ.

"నిజంగా తెలీదా?"

"తెలీదు స్వామీ?"

"ఆత్మలు అబద్ధం చెప్పవు. నువ్వు చెపుతున్నావ్. అనేక మార్లు వచ్చి పోతూనే ఉన్నావ్. ఐనా ఏమీ తెలీదని తప్పించుకోజూస్తున్నావ్. ఇక నిన్ను క్షమించను. అక్కడ నువ్వు వదిలివచ్చిన నీ భౌతిక శరీరంలోని నవనాడుల్ని స్తంభింపజేసి నిర్జీవంగా మార్చేస్తాను. శరీరాన్ని శాశ్వతంగా కోల్పోయి ప్రేతాత్మవై ఆలమటించు!" అంటూ చేతిలోకి జలం తీసుకున్నాడు.

అంతే– "వద్దు స్వామీ. అంత శిక్ష వేయవద్దు. కనికరించండి. నిజం చెప్పేస్తా" అంది విళంబి ఆత్మ.

"చెప్పు"

"మా గురువుగారికి గురువు మీకు మిత్రుడు అయిన శంకర్‌సాహువారు బతికున్న కాలంలో వారితో మీరు ఎప్పటికయినా లోకంలో తిరిగి ధర్మాన్ని స్థాపిస్తా– ఈ దేశానికి అంతులేని సంపదనందిస్తా అంటూ చాలాసార్లు చెప్పడం విన్నారట.

లోకంలో ధర్మస్థాపనగాని, బీదరిక నిర్మూలన గాని మా గురువుగారికి ఇష్టంలేదు. ధర్మం నెలకొంటే తమలాంటి మంత్రవేత్తలకు పని ఉండదని బీదవారు ఉంటేనే ధనవంతుల చెప్పుచేతల్లో ఉంటారని ఆయన అభిప్రాయం. చిరాయువైన మీరు మీ ప్రయత్నాలేవో మీరు చేస్తుంటారని నమ్ముతున్నాడు.

ఆ ప్రయత్నాలేవో తెలుసుకోవటం కోసం నన్ను ఇక్కడికి పంపించారు. నేను వచ్చిపోతున్నానేగాని మీరు చేస్తున్న పనులు నాకర్థంగాక ఇక్కడ చూసింది చూసినట్టు మాత్రం చెప్పేవాడ్ని. మీ పనులకు విఘ్నాలు కల్పించమని సూచించింది కూడా మా గురువుగారే" అంటూ వివరించింది విళంబి ఆత్మ.

ఆ మాటల్ని నమ్మాడు అగ్నివేశాచార్యుడు. తమ ప్రయోగాల్లో కీలకాంశాలేవీ మాంత్రికుడు మరిడి సోమయ్యకు తెలీదని కొంత శాంతించాడు.

"నేను అష్టదిగ్బంధనం చేశాను. నువ్వు లోనకు ఎలా వచ్చావ్?"

"నేను పూజగదిలో ఉండగానే మీరు అష్టదిగ్బంధనం చేశారు స్వామీ. అందుకే తప్పించుకు బయటకు పోలేక ఉక్కిరిబిక్కిరయ్యాను."

"నిన్ను వెనక్కి పంపిస్తున్నాను. వెళ్ళిపోతావా?"

"వెళ్తాను స్వామీ."

"నేను చెప్పినట్టు చేస్తావా?"

"చేస్తాను స్వామీ."

"నీ శరీరంలో ప్రవేశించి లేవగానే నీ గురువు మరిడి సోమయ్య ముఖంమీద బలంగా అరచేత్తో చరవాలి. బలంగా... చేస్తావా?"

"చేస్తాను స్వామీ."

"ఇక వెళ్ళిపో"

మంత్రజలాన్ని విళంబి ఆత్మమీద చల్లగానే అది అదృశ్యమైంది. అంతవరకు జరిగిందంతా ప్రేక్షకుల్లా బయట నిలబడి చూస్తున్నారంతా పెద్ద ప్రమాదం తప్పినందుకు తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు.

అగ్నివేశాచార్యుడు పూజాపీఠం నుంచి లేచాడు. "ఆచార్యా. ఏం చేద్దాం? రేపటికి వాయిదా వేసుకుందామా?" లోపలికొస్తూ అడిగాడు పిల్లా గోవింద పాత్రుడు.

"లేదు గోవిందు. వాయిదా వేయనవసరం లేదు. నేను మరోసారి స్నానం చేసివచ్చి తిరిగి పూజ ఆరంభిస్తాను. మీ పనులు ఆపకండి. అన్నీ సిద్ధం చేయండి." అంటూ మరో ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా స్నానానికి వెళ్ళిపోయాడు ఆయన.

మనసులో సందేహాలున్నప్పటికీ వాటిని పక్కన పెట్టి అందర్నీ వారివారి విధుల్లోకి పంపిస్తూ తనూ వారి ననుసరించాడు డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడు.

*　　*　　*　　*　　*

ఆదివారం! అనురాధా నక్షత్రం అష్టమీ తిథి. మరీ ఉదయం వెళ్తే ఇంటిపనిలో ఉండి ఏదో వంకతో తప్పించుకుంటుందని శుశ్రుతను కలవడం కోసం కాస్త ఆలస్యంగా సుమారు పదిగంటల ప్రాంతంలో గుడికి చేరుకున్నాడు చరక్.

బైక్ లాక్‌చేసి లోపలకు పోతూండగా వెదకబోయిన తీగ కాళ్ళకే చుట్టుకున్నట్టు తనే బయటికి వస్తూ కనిపించింది శుశ్రుత. చుడీదార్ డ్రెస్‌లో తొలిసారిగా ఇవాళే ఆమెను చూస్తున్నాడు.

ఇంతవరకు ఎప్పుడు గుడికి వచ్చినా సాంప్రదాయ లంగా ఓణీ దుస్తుల్లోనే కన్పించేది. చక్కని డిజైన్‌తో కూడిన చుడీదార్ అద్భుతంగా ఉంది శుశ్రుత.

అసలీ బంగారు బొమ్మ ఏ డ్రెస్సు ధరించినా ఆ డ్రెస్‌కే సింగారం వస్తుందనిపిస్తోంది. ఆమె చేతిలో పెద్ద ప్లాస్టిక్ బుట్ట ఉంది. మార్కెట్‌కు బయల్దేరినట్టుంది. పైగా ఒంటిగా వస్తోంది. మనసు విప్పి మాట్లాడు కోవడానికి తనకు ఇంతకన్నా మంచి అవకాశం రాదు. ఆమెను చూస్తూ అలా బైక్ వద్దే ఆగిపోయాడు చరక్.

అతడిని చూసికూడా చూడనట్టు అతడి సమీపంలో నుంచే ముఖం మీద అల్లరి చేస్తున్న ముంగురుల్ని ముచ్చటగా సవరించుకుంటూ ముందుకు సాగింది శుశ్రుత.

'అబ్బాయిలంటే ఇంత అలుసా అమ్మాయిలకి? ఇది జాణతనం అనుకోవాలా, సొగసైన టెక్కు అనుకోవాలా అంతకుమించిన పొగరను కోవాలా? ఏమయినా అది ఆడతనానికే అలంకారమనిపిస్తోంది. ఆ మాత్రం బిగువుండా ల్సిందే.

ఎంతవరకు మౌనం పాటిస్తుందో అదీ చూద్దాం అనుకుంటూ తనూ ఆమె వెంట నడక ఆరంభించాడు. ఇద్దరూ కాస్త ఎడంగా – పక్కపక్కనే నడుస్తున్నారు. జంట చూడముచ్చటగా ఉంది. దారిపొడవునా అనేక జతల కళ్ళు ఆ ఇద్దర్నీ చూస్తున్నాయి. చరక్ కళ్ళు మాత్రం ఆమెనే చూస్తున్నాయి. ఆమె కనీసం కోపంగానైనా పలకరిస్తుందని ఎదురు చూశాడు.

అతను ఎవరో తెలీనట్టే నడుస్తోందామె. చూద్దాం. ఈ మౌనం ఎంతవరకో అనుకున్నాడు. అయితే మూడో నిముషంలోనే అతడి నిగ్రహం సడలిపోయింది. పలకరించకుండా ఉండలేకపోయాడు.

"మార్కెట్‌కా?" అడిగాడు.

చురచురా ఓ చూపు విసిరి – తిరిగి మౌనం వహించింది శుశ్రుత.

"అడుగుతోంది నిన్నే దేవీ... మార్కెట్‌కా?" మళ్లీ అడిగాడు.

"అవును మార్కెట్‌కే కాని... నా పేరు దేవి కాదు శుశ్రుత." అంటూ బదులు ఇచ్చింది.

"నా ఉద్దేశం శుశ్రుతాదేవి అని...."

"పొరపాటున నన్ను చూసి ఎవరో దేవి అనుకున్నావేమోనని...."

"ఏయ్. పొద్దుటే నా మీద అభాండాలేయకు. నాకు నువ్వు తప్ప ఏ దేవీ తెలీదు"

"నమ్మొచ్చా?"

"ప్రామిస్‌గా...."

"ఐనా పొద్దుటే నావెంట పడ్డావేమిటి? ఆయన్ని చూడ్డాని కొచ్చావ్‌గా. వెళ్ళు"

"ఎవర్ని చూడ్డానికి?"

"అదే. ఒళ్ళంతా విభూది పూసుకుని మెడలో పాము నడుముకి పులితోలు, ఒళ్ళంతా సగం తానై గౌరమ్మ ఉండగా నెత్తిమీద గంగమ్మను కూచోబెట్టుకున్నాడే... ఆయన్ని"

"ఓ... శివయ్యనా... నిన్ను నాకు చూపింది ఆయనేగా. ఆయన ఎప్పుడూ మనసులోనే ఉన్నాడు. ఇప్పుడు కూడా నీ వెంట పడమని ఆయనే చెప్పాడు."

"ఎందుకో...."

"నీ కూరగాయల బుట్ట మోయటానికి. ముఖం చూడు. అయినా అంత కోపం ఏంటి నీకు? నిన్న నీ కోసమే వచ్చాను. ఏదో కాస్త తమాషాకి శివుడ్ని చూడ్డానికన్నాను. ఆ మాత్రానికే అలిగి వెళ్ళిపోవాలా? నీకు ఐలవ్ యూ చెప్తామంటే ఛాన్సే ఇవ్వవే"

"ఇప్పుడు చెప్పావ్‌గా చాల్లే"

"చాలా! ఐలవ్ యూ చెప్పుకునే ప్లేసా ఇది? పబ్లిక్ రోడ్డుమీదా? చూడ్డానికి సుకుమారంగా ఉంటారు, మీ మనసు రాయికన్నా గట్టిది."

"అర్థమైందిగా, ఇకనయినా ప్రేమా దోమా అనకుండా వెళ్ళిపో."

"నేనంటే ఇష్టంలేదని చెప్పు. వెళ్ళిపోతాను" ఆమె బదులు చెప్పకుండా– ఎదురుగా వస్తున్న పూలపిల్లని ఆపింది. ఆమెవద్ద రంగురంగుల గులాబీలు అనేకం ఉన్నాయి. అరవిరిసిన అందమయిన గులాబీ ఒకటి తీసుకుంది. "ఎంత?" అడిగింది.

"రెండ్రూపాయలమ్మా" చెప్పిందా పూలపిల్ల.

"సరి. డబ్బులాయన ఇస్తాడు తీసుకో" అంటూ గులాబీని జడలో తురుముకుంటూ ముందుకు సాగింది శుశ్రుత. రెండు రూపాయలు ఇచ్చి పూల

పిల్లని పంపించి వడివడిగా తిరిగి ఆమెను చేరుకున్నాడు చరక్. "ఏ సంగతీ చెప్పవేమిటి?" ఆమె పక్కగా వెళ్ళి అడిగాడు చరక్.

"ఏ సంగతేమిటి?" ఎదురు ప్రశ్నించింది శుశ్రుత. "అదే. నేనంటే ఇష్టమా కాదా?"

"నా జడలో గులాబీ పువ్వు కొనిచ్చిందేగా? దీన్ని బట్టి నీకు ఏమీ అర్థంగావటంలేదా?" ముసిముసిగా నవ్వింది. చరక్‌కి అర్థమయింది.

ఏదో చెప్పబోతూ మాటను గొంతులోనే మింగేశాడు. ఎందుకంటే ఎదురుగా ఆమె తండ్రి రామాచారి సైకిల్‌మీద వస్తున్నాడు. మాటల్లో బడి ఆయన రాకను ఇద్దరూ గమనించలేదు. సైకిల్ దిగిన రామాచారి ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

"ఏం తల్లీ. మార్కెట్‌కా" అనడిగాడు.

"అవున్నాన్నగారు" అంది.

"ఆ బుట్ట ఇలా ఇవ్వు. నేను వెళ్ళి తెస్తాను. ఏం తెమ్మంది కావేరి?"

"వద్దులే నాన్నా . మీరు పదండి. మార్కెట్ దాకా ఎలాగూ వచ్చాగదా. నేను తెచ్చేస్తా" అంది శుశ్రుత.

"అదిసరి. ఈ అబ్బాయెవరు?" చరక్‌ను చూస్తూ అడిగాడాయన. ఇద్దరూ దొరికిపోవడంతో వెళ్ళాలో, ఆగాలో తెలిక అక్కడే నిలబడున్నాడు చరక్.

అప్పుడే చూస్తున్నట్టుగా చరక్‌ను ఎగాదిగా చూసింది శుశ్రుత. "తెలీదు నాన్నగారూ, వారం రోజులుగా వెంటపడుతున్నాడు. వద్దన్నా వినడంలేదు...." అంటూ తండ్రికి రిపోర్ట్ చేసి తనదారిన ముందుకు సాగింది.

"వచ్చేటప్పుడు రిక్షాలో వచ్చెయ్‌తల్లీ. బుట్ట నువ్వు మోయలేవు" వెనుక నుంచి అరిచాడు రామాచారి.

"అలాగే నాన్నగారూ!" తిరిగి చూస్తూ బదులిచ్చింది. చెప్పింది తండ్రి కయినా – ఆమె చిలిపి చూపులు చరక్ మీదే ఉన్నాయి. ఆమె పెదవులమీది కొంటెనవ్వు చూడగానే చరక్‌కి ఒళ్ళు మండిపోయింది. అనవసరంగా బుక్ అయిపోయాడీయనకి. ఏం క్లాస్ పీకుతాడో ఏమిటో ఖర్మ. 'శుశ్రుతా నన్ను ఇరకాటంలో పడేసిపోతావా.' మనసులోనే ఉడుక్కున్నాడు.

ఈ లోపల రామాచారి అతడ్ని చూస్తూ– "ఎమయ్యా. పరువుగా బతుకుతున్న సద్బ్రాహ్మణ వంశం మాది. సుగుణాలరాశి మా అమ్మాయి. అలాంటి పిల్లవెంటపడి వేధించడానికి మనసెలా ఒప్పిందయ్యా. అసలేమనుకుంటున్నావ్ నువ్వు?" అంటూ నిలదీశాడు.

చరక్ ఇబ్బందిగా చూశాడు. నడిరోడ్డు మీద ఆయనలా నిలదీస్తుంటే ఏం బదులు చెప్పాలో అర్థంకాలేదు. కాని ఆ ఇబ్బంది నుంచి వెంటనే తప్పించేస్తూ "ఏందీ? షాకయ్యావా?" అంటూ నవ్వేశాడు రామాచారి.

"మా అమ్మాయంతే. వట్టి అల్లరిపిల్ల నువ్వేం కంగారుపడకు. నాకంతా తెలుసులే" అన్నాడు.

చరక్ మనసు తేలికపడింది. అంటే... శుశ్రుత తమగురించి ఇంట్లో చెప్పి వుండాలి.

తనూ నవ్వేస్తూ– "బతికించారు థ్యాంక్స్ సార్. మా అమ్మాయి వెంట పడతావా అంటూ ఎక్కడ మీరు నావెంట పడతారోనని భయపడ్డాను" అన్నాడు.

"ఆహా నువ్వు చమత్కారివేనోయ్. ఇంట్లో ఎవరికీ నువ్వు నచ్చకపోతే అలాగే జరిగేది. శుశ్రుత మా ప్రాణమయ్యా. తనకి తల్లి దగ్గరకన్నా నా వద్దనే చనువెక్కువ. ఏదీ దాచదు. శుశ్రుతకు నువ్వంటే ఇష్టం."

"థ్యాంక్యూసార్... మీరన్నా తన మనసు ఏమిటో చెప్పారు...." అన్నాడు చరక్.

"అదేమిటి? తనింకా చెప్పలేదా?"

"చెప్తే నాకీ తిప్పలెందుకు సార్...."

"ఆగాగు. ముందా సార్ అనడం మానెయ్. ఏదోగా వుంది. వరసబెట్టి చక్కగా మావయ్యా అని పిలు. పెళ్ళికాలేదు గాబట్టి బాగుండదనుకుంటే ఎలాగూ మా ఆవిడ్ని అక్కా అని వరస కలిపావ్ గాబట్టి నన్ను బావా అని పిలు."

"అలాగే బావగారూ"

"ఇప్పుడు నచ్చావ్. అవునూ. నీ పేరేదో చతుర్... చక్రా... ఏదో చెప్పారే"

"చరక్.. చరక మహర్షి పేరు."

"అరుదయిన పేరు బాగుంది. కాని చూడు చరక్. మనం ఇలా రోడ్డు మీద మాట్లాడుకోవడం బాగోలేదు. ఓ పనిచెయ్యి. రేపు పదకొండు గంటలకి ఓసారి మా ఇంటికి రా... తీరిగ్గా మాట్లాడుకుందాం. నీ వివరాలు మాకు తెలియాలి గదా."

"మీరు చెప్పిన సమయంలో రావడం వీలుకాదండి. నేను ఆఫీసులో ఉంటాను. ఉదయం తొమ్మిదిలోపు ఎప్పుడు రమ్మన్నా వస్తాను."

"పదిగంటలవరకు నాకు తీరదే... గుడిలోనే ఉంటానాయె."

"పోనీ సాయంత్రం అయిదుగంటల తర్వాత?"

"అదీ కుదరదయ్యా. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటలకు గుడి మూసేవరకు గుడిలో ఉండాలి. ఓ పని చేద్దాం. వచ్చే ఆదివారం ఉదయం ఇదే టైమ్‌కి రా. ఇది ఓ.కె.గా?"

"అలా అన్నారు బాగుంది. కాని నా డ్యూటీ నాదే. ఉదయం ఎనిమిది గంటలకి వచ్చి శుశ్రుతను చూసి పోతుంటాను. మీరు కాదనకూడదు."

"అననులేవయ్యా. వెళ్ళిరా. నేను మార్కెట్ కెళ్తా"

"తను వచ్చేస్తానంది గదా!"

"మనలో మనమాట. నా కూతురని కాదుగాని మహా పిసినారి సుమా! రూపాయి వదులుకోవడానికి ఇష్టపడదు. రిక్షాకి డబ్బులు దండగని అంత బరువు బుట్టని తనే మోసుకొస్తుంది. దగ్గరుండి సైకిల్‌మీద తీసుకెళ్తాగాని నువ్వు వెళ్ళు" అంటూ సైకిల్ వెనక్కి తిప్పాడు రామాచారి. నవ్వుకుంటూ గుడివద్ద వదిలిన తన బైక్ వద్దకు నడక ఆరంభించాడు చరక్.

* * * * *

జాజ్‌పూర్! ఇదో పురాణ ప్రసిద్ధ నగరం. ఒరిస్సాలో వైతరిణీ నదీతీరాన ఉంది. ఈ నగరం అసలు పేరు విరిజాపురి. ఈ నగర ఆవిర్భావం వెనుక ఒక ఆసక్తికరమయిన గాథ ఉంది.

ఒకప్పుడు గయాసురుడనే రాక్షస రాజు ఉండేవాడు. ఇతను జన్మతః అసురుడైనా ఎంతో సాత్వికుడు. మిక్కిలి దైవభక్తి కలవాడు. పరోపకారమే ధ్యేయంగా ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలించేవాడు.

దానధర్మాలు విరివిగా చేస్తూ నిష్ఠతో ఎంతో పవిత్రంగా జీవించేవాడు. క్రమంగా ఇతని కీర్తిచంద్రికలు ముల్లోకాలకు వ్యాపించి ప్రసిద్ధుడయ్యాడు.

ఇలా ఉండగా మహర్షులంతా కలసి ఒక పవిత్ర యాగం తలపెట్టారు. ఆ స్థలం ఎంత పవిత్రంగా ఉండాలంటే గయాసురుడి హృదయమంత పవిత్రంగా ఉండాలని ఆశించారు. కాని ఎంత వెదికినా వీరికి అంతటి పవిత్ర స్థలం దొరకలేదు. ఈలోగా వీరి అన్వేషణ గురించి గయాసురుడికి తెలిసింది.

ఒక మహత్కార్యానికి దేహత్యాగం చేయడంకన్నా పుణ్యకార్యం ఏముంటుందని భావించి శరీర త్యాగానికి తన సిసిద్ధతను మహర్షులకు తెలియజేశాడు. ఆ విధంగా గయాసురుడు వైతరణీ నదీతీరాన దేహత్యాగం చేయగా ఆయన పాదాలు దక్షిణంగా సాగి ఆగినచోట పీఠికాపురమనే ఊరు వెలిసింది.

అదే నేటి పిఠాపురం. గయాసురుని శిరస్సు ఉత్తరంగా సాగి ఆగినచోట 'గయ' అనే గ్రామం వెలిసింది. అదే పాట్నా సమీపంలోని గయ. గయాసురుని పేరుమీద ఏర్పడింది. ఇక్కడే బోధి వృక్షం కింద గౌతమ బుద్ధునికి దివ్యజ్ఞానం కల్గినందున తర్వాతి కాలంలో ఇది 'బుద్ధగయ' అయింది.

సువిశాలంగా నదీ తీరాన విస్తరించిన గయాసురుని ఛాతీమీద మహర్షులు పవిత్రయాగం నిర్వహించారు. అప్పుడు ఆ యాగాగ్ని నుంచి ఒక 'పరిశుద్ధ అమ్మ' వారు ఉద్భవించింది. ఆవిడే విరజాదేవి. ఆ విరజామాతకు యాగం జరిగినచోటే ఒక అద్భుతమైన ఆలయం నిర్మించారు.

ఈ విరజాదేవి పేరు మీదనే అక్కడో ఊరు వెలసి విరజాపురిగా పిలువబడేది. కాలక్రమంలో ఈ విరజాపురమే జాజ్‌పూర్‌గా ప్రసిద్ధిచెందింది.

ఇదే క్లుప్తంగా జాజ్‌పూర్ ప్రాచీనగాథ. ఈ విరజామాత భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా సుప్రసిద్ధురాలు. కాలక్రమముగా ఈ ఆలయ పరిసరాలు మాంత్రికులకు తాంత్రికులకు ఆవాసాలుగా మారాయి. నేటికీ జాజ్‌పూర్ పరిసరాల్లో క్షుద్రపూజలు జరుగుతుంటాయి. చుట్టుపక్కల కొండ ప్రాంతాలు మంత్రగాళ్ళకు ప్రసిద్ధి. ఆ కొండగుట్టల్లో నీలోదరి అనే కొండగుట్ట ఒకటి ఉంది.

మహామాంత్రికుడైన మరిడి సోమయ్య నివాసం ఈ నీలోదరి గుట్టమీదే ఉంది. మరిడి సోమయ్య! పేరుకు తగ్గట్టే మనిషి భీకరాకారుడు. మనిషి అయిదున్నరడుగుల ఎత్తున నల్లగా లావుగా చూడ్డానికి తుమ్మమొద్దులా ఉన్నాడు. తెలుపు నలుపు కలగలిసిన చింపిరిజుత్తు. బవిరి గడ్డం, నల్లటి దుస్తులు, ఎర్రటి కుంకుమబొట్టుతో ఉగ్రరూపం.

కళ్ళు ఎప్పుడూ ఎర్రగా నిప్పుముద్దల్లా ఉంటాయి. చేతిలో ఆరడుగుల పొడవుండే మంత్రదండం ఒకటి ఎప్పుడూ ఉంటుంది. దానికి శునకతలాటం ఉంటుంది. భైరవోపాసకుడు. వెదురుబొంగు చీలుస్తున్నప్పుడు వెలువడే వికృత శబ్దంలాంటి గొంతు అతడిది.

చీకటిగుహలా వున్న ఒక హాలు చివర చెక్కబల్లమీద అచేతనంగా పడుంది శిష్యుడు విళంబి శరీరం. అక్కడ ఒక శిష్యుడు కాపలా ఉన్నాడు. అనేకమంది శిష్యులు వివిధ పనుల్లో బిజీగా ఉన్నారక్కడ. విళంబి శరీరంలో కదలిక ఏర్పడుతోంది. అదే సమయంలో పెద్ద పెద్ద అంగలతో అక్కడికి వచ్చాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

అతడి ముఖంలో అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తన శిష్యుడు విళంబి ఆత్మ వెనక్కి వచ్చేస్తోంది. మరికొద్దిరోజులు అక్కడే సంచరించకుండా వచ్చేస్తున్నాడు. ఆ విషయం యోగశక్తిలో తెలిసిపోయి నందునే అతడిలో అసహనం. సరిగ్గా అతడు వచ్చేసరికి విళంబి ఆత్మ స్వశరీరంలో ప్రవేశించి అతడు నిద్రనుండి లేచినట్టుగా లేచి కూర్చున్నాడు.

"ఏమయినదిరా? ఎందులకు మరలివస్తివి? నేను పిలిచేవరకు అచటనే ఉండమంటిని గదా" కోపంతో హూంకరించాడు మరిడి సోమయ్య.

విళంబి బదులు చెప్పకుండా దిగ్గునలేచి నిలబడి తన గురువు ముఖంమీదే బలంగా అరిచేత్తో కొట్టబోయాడు. ప్రమాదం గ్రహించి ఆ చేతిని ఒడిసి పట్టుకున్నాడు మాంత్రికుడు. స్పృహలో లేని ఉన్మాదిలా గింజుకుంటున్నాడు విళంబి.

"గురువుగారూ, ఏమయింది వీడికి?" పక్కనున్న శిష్యుల్లో ఒకడు అడిగాడు.

"వృద్ధ జంబుకం ఆచార్య అగ్నివేశుడికి వీడి ఉనికి తెలిసిపోయి నట్టుంది. వీడి ఆత్మను వెనక్కి పంపిస్తూ నా ముఖాన కొట్టమని ఆనతిచ్చినట్టున్నాడు."

"కొడితే ఏమవుతుంది గురువుగారూ?"

"ఏమవుతుందో నువ్వే చూడు" అంటూ విళంబి చేతిని లాగి ఆ శిష్యుడి ముఖంమీద చరిచాడు.

అంతే! కెవ్వుమంటూ భయంకర ఆర్తనాదం చేశాడా శిష్యుడు.

మాంత్రికుడి చేతిలోని విళంబి తెలివి తప్పిపడిపోయాడు. "అమ్మో... నా ముఖం... నా ముఖం కాలిపోతోంది దేవుడో. నేను ఈ బాధ భరించలేను. గురువుగారూ కాపాడండి" పెద్దగా ఆరుస్తూ బాధతో చిందులేస్తున్నాడా శిష్యుడు. మరిడి సోమయ్య తన మంత్రదండాన్నెత్తి ఏదో మంత్రం చెప్తూ శిష్యుడి తలమీద చిన్నదెబ్బ వేశాడు.

ఆ శిష్యుడి బాధ చిటికెలో మాయమైపోగా అక్కడే కూలబడి పోయాడు. అప్పటికే ఆలస్యమై మంటల్లో కాలినట్టు వాడి ముఖమంతా బొబ్బలు లేచిపోయాయి.

"పొండిరా. వీడ్ని తీసుకుపోయి ఉపచారం చేయండి" ఆజ్ఞాపించాడు. శిష్యులు ఆ శిష్యుడ్ని అక్కడి నుంచి తీసుకుపోయారు. అక్కడే బల్లమీద కూర్చుని – ఆలోచనలో మునిగిపోయాడు మాంత్రికుడు.

'ఆచార్యవర్యా! నువ్వు అసాధ్యుడివయ్యా. అనుకున్నది సాధించే అపూర్వ వ్యక్తిత్వం నీదని తెలుసు. కాని... నీ మనసులో ఏముంది? నీ ప్రయోగాల వెనుక మర్మం ఏమిటి? నీ లక్ష్యం ఏమిటి? ఏం సాధించ బోతున్నావ్? ఇవి నాకు తెలియాలి.

నా సందేహం నిజమైతే నువ్వు ఆశించే ధర్మసంస్థాపన అంత సులువు కాదు. జరగనీయను. నీవు దేశానికి అందించాలనుకుంటున్న సంపద మొత్తం నాకే కావాలి. ఆ సంపద కూడా నీకు దక్కనీయను.

అవి సాధించుకోవడానికి నువ్వు చేయతలపెట్టిన మహత్కార్యాలు ఏమిటో నాకు తెలియాల... వదల... అవేమిటో తెలుసుకోకుండా వదల...'

శిష్యుడు విళంబి పెద్దగా మూలుగుతూ కదలడంతో మాంత్రిక శిఖామణి మరిడి సోమయ్య ఆలోచనలు చెదిరిపోయాయి.

విళంబికి స్పృహ తెలిసింది. లేచినిలబడి గురువు ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. "క్షమించండి గురుదేవా, నాకు తెలీకుండా ఏమన్నా పొరపాట్లు చేసుంటే క్షమించండి" అంటూ దీనంగా వేడుకున్నాడు.

"చెప్పరా. అక్కడ ఏం జరిగింది? వాళ్ళంతా ఏం చేస్తున్నారు? నువ్వు ఏం చూశావు?" శాంత చిత్తుడై అడిగాడు మాంత్రికుడు.

జరిగిందంతా ఆత్మరూపంలో అక్కడ సంచరించి తను తెల్సుకున్నదంతా వివరించాడు విళంబి.

"మన గూఢచర్యం గురించి ఆచార్యుడికి తెలిసిపోయింది గురుదేవా, మరోసారి తమ ప్రాంతాల్లో సంచరిస్తే ప్రాణం తీస్తానంటూ నన్ను హెచ్చరించి వెనక్కి పంపించేశాడు. మీ ప్రయత్నాలు ఆపేయమని మీకు తన హెచ్చరికగా చెప్పమన్నాడు" అన్నాడు.

"ఆయన చెప్తే ఆపేస్తామా? ఘటనాఘటన సమర్థుడీ మరిడి సోమయ్య. ఆయన్ని అడ్డుకునే శక్తి సామర్థ్యాలు మాకూ ఉన్నవి. ఈసారి మరో ప్రయోగం చేస్తాను. పరకాయ ప్రవేశం ద్వారా ఏ పక్షిగానో వెళ్ళి అక్కడ కూర్చుంటే ఎవరూ అనుమానించలేరు."

"గురువుగారూ, ఇక నా వల్లకాదు. నన్ను పంపించవద్దు. వేరొకడ్ని పంపించండి" వేడుకున్నాడు విళంబి.

ఫెళ్ళున నవ్వాడు మరిడి సోమయ్య. "ఏమిరా భయపడితివా?... చూద్దాం. ఇంతకీ అక్కడ నీవు చూసిన వింతలేమిటి, ప్రయోగాలు ఏమి?" అనడిగాడు.

"పెద్ద పెద్ద కల్వంలందు ఏవో మందులు నూరడం పూయటం తప్ప వాళ్ళకి వేరే పనిలేనట్టుంది గురువుగారూ. అదో వింతకాదుగాని అప్పుడప్పుడూ అద్దంలో రంగులు మారడం వింతే. అసలు నాకు తెలీకడుగుతాను గురువుగారూ, నాలుగడుగుల వెడల్పు, ఏడడుగుల పొడవు ఉండే శవపేటిక లాంటి అందమైన బాక్స్ తయారు చేసి దానికి పైన గాజు తలుపు అమర్చారు. ఎదురుగా గోడకు అదే ప్రమాణంలో పెద్ద అద్దం అమర్చారు.

అంతే. వీటికే తిరిగి తిరిగి లేపనాలు పూస్తున్నారు పూజలు చేస్తున్నారు. ఆ మంత్రాల పెట్టెతో ఏం సాధించాలని గురువుగారూ?" ఉత్సుకత ధ్వనించే స్వరంతో అడిగాడు విళంబి.

"పిచ్చివాడా... అది నీకు ఏదో శవపేటికవలె అగుపించుటలో ఆశ్చర్యం లేదు. కాని అది అలాంటిది కాదు. అదో అద్భుతమగు కాలదర్శిని పేటిక."

"అంటే ఏమిటి గురువుగారూ. ఆ పెట్టెలో కూర్చుని ఎక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవచ్చా?"

"కాదు. భూతకాలంలోకి వెళ్ళొచ్చు. భవిష్యకాలంలోకి వెళ్ళొచ్చు. జరిగింది గాని, జరగబోయేది గాని ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవచ్చు. ఈ ప్రక్రియను గురించి నాకును సరిగా తెలియదుగాని కాలనాళిక అనే అద్భుతమయిన ప్రక్రియ ద్వారా ఆత్మను భూతభవిష్యకాలాల్లోకి పంపించ వచ్చని వినివున్నాను.

ఇది చాలా నిగూఢమగు పురాతన ప్రక్రియ. ఇది తెలిసిన వాళ్ళుగాని, ఆచరించి చూసినవాళ్ళుగాని ఇప్పుడున్నట్టు లేదు. ఇదే ప్రక్రియను గురించిన సమాచారం ఎంతో కొంత ఆచార్యుడి వద్ద ఉండే వుంటుంది. దాన్ని అమలు పరచి ప్రయోగాలు చేసి ఆ యోగాన్ని వశపరచుకునే ప్రయత్నమే ఆచార్యుడిది.

ఇది విజయవంతమైతే మానవుడు చంద్రమండలానికెళ్ళి తిరిగి వస్తున్నట్టుగా భూత భవిష్యకాలాల్లోకి వెళ్ళి జరిగింది, జరగబోయేది ప్రత్యక్షంగా వీక్షించి రావచ్చు. భూతకాలానికి అధిపతి విష్ణువు.

భవిష్య కాలానికి అధిపతి శివుడు. ప్రయాణాధిపతి మణిభద్ర యక్షుడు. ఈ యక్షుని విగ్రహాన్ని అక్కడ నువ్వు చూశానన్నావ్. రావిబదనికను వాడుతున్నారని చెప్పావు. వృక్షములందు అశ్వత్థ వృక్షం నేనే అన్నాడు శ్రీకృష్ణుడు. అలాంటి రావిచెట్టు బదనికను ఉపయోగిస్తున్నారంటే విష్ణు ప్రీత్యర్థమనుకోవాలి. అనగా ఆచార్యుడి ప్రయత్నం భూతకాల దర్శనం. సందేహంలేదు."

"అది సరిగురువుగారూ. జరిగిపోయిన కాలంలోకి వెళ్తే ఏమి లాభం? ఉపయోగమంటూ ఉందంటారా? ఇంత శ్రమపడి తెలుసుకుని ఏం చేస్తారు?"

"ఏం తెలుసుకోవాలని, ఏం చేయాలని? ఇవి తెలుసుకోవాలనే గదరా మా ప్రయత్నం. తెలుసుకుందాం. త్వరలోనే తెలుసుకుంటాం. తెలుసుకుని

ఆచార్యుడు ఏం సాధించదలుచుకున్నాడో అది నేను సాధిస్తాను. ఆచార్యుడ్ని గెలవనివ్వను."

"అలాగే గురుదేవా. కాని మరోసారి మాత్రం నన్నక్కడికి పంపించ వలదు."

"భయపడకు. ఈసారి మృణాళుడు వెళ్తాడు. పరకాయ ప్రవేశం చేయించి పక్షి రూపంలో అంపకం చేసెద. అప్పుడు ఎవరూ అనుమానించ లేరు. అవునూ... మృణాళుడు తిరిగి వచ్చాడా...! భువనేశ్వర్ వెళ్ళి మూడు దినాలైనది" ఒక శిష్యుడ్ని అడిగాడు మరిడి సోమయ్య.

"ఇంకా రాలేదు గురువర్యా" అన్నాడా శిష్యుడు.

"వెంటనే బయలుదేరి రమ్మని వాడికి ఫోన్ చేయండి...." అంటూ శిష్యులకు ఆనతిని ఇచ్చి అక్కడి నుంచి లేచి గుహాంతర్భాగములోకి వెళ్ళిపోయాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

* * * * *

స్నానానంతరం తిరిగి మడికట్టుకొచ్చి పూజలో కూర్చున్నాడు అగ్ని వేశాచార్యుడు. బయట ఆ యా విభాగాల్లో ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా ఉన్నారు. అప్పటికే మధ్యాహ్నము ఒంటిగంట కావస్తోంది సమయం.

పూజామందిరం తలుపులు బార్లా తెరిచే ఉన్నాయి. పూజాపీఠం మీద రాగిపళ్ళెంలో ఉంచిన రావిబదనికమీద పసుపు కుంకుమలు అక్షింతలు చల్లబడి వున్నాయి.

నాలుగు ఇటుకరాళ్ళ మధ్య హోమాగ్ని రగులుతూనే వుంది. ధూప దీప అగరు వాసనలతో పూజామందిరం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉంది. పూజ ముగించిన ఆచార్యుడు పూర్తిగా ధ్యానంలో నిమగ్నుడైపోయాడు. ఉదయం తీసుకున్న పాలుతప్ప ఆయన వేరే ఆహారం ఏమీ తీసుకోలేదు.

కఠోరదీక్షలో ధ్యానమగ్నుడై ఉన్నాడు. చాలా సేపటి తర్వాత– ఎందుకో అటుగా వచ్చాడు పిల్లా గోవింద పాత్రుడు. యధాలాపంగా పూజామందిరంలోకి చూసిన ఆయన స్థాణువై తన కళ్ళను నమ్మలేక అలాగే నిలబడిపోయాడు. పూజా మందిరంలో ఒక అద్భుతాన్ని చూస్తున్నాడు ఆయన... ఒక నమ్మలేని

నిజాన్ని వీక్షించాడు. ఒడలు పులకరించే అపూర్వ సంఘటన. ధ్యానపీఠం మీద పద్మాసనస్థితిలో ఉండాల్సిన అగ్ని వేశాచార్యుడు ఇప్పుడక్కడ లేడు. నేలనుండి సుమారు పదడుగుల ఎత్తున గాల్లో తేలుతున్నాడు.

అదే పద్మాసనస్థితిలో ఉండి తీవ్ర ధ్యానంలో మునిగి ఉన్నాడాయన. ఇలా ధ్యానయోగంలో మహర్షులు గాల్లోకి లేచి అంతర్ముఖంలో ఉండి తపస్సు చేస్తారని విన్నాడుగాని ఇంతవరకు చూసింది లేదు. ఆ అపురూప దృశ్యాన్ని ఇప్పుడు చూస్తున్నాడు.

గాలిలో తేలివున్న ఆ మహనీయుని ముఖమండలం తేజోమయంగా వెలిగిపోతోంది. ధూపదీప సాంబ్రాణి పొగలు ఆయన్ని పరివేష్టించి సుడులు తిరుగుతున్నాయి. ఒక అలౌకిక అసాధారణ దృశ్యాన్ని అలా చూస్తూ తన్మయంతో నిలబడిపోయాడు పిల్లా గోవింద పాత్రుడు.

సరిగ్గా అప్పుడే మరో విచిత్రాన్ని కూడా పిల్లా గోవిందపాత్రుడు గమనించాడు. రాగిపళ్ళెరంలో ఉంచిన రావిబదనిక తెచ్చినప్పుడు అది లేత పసుపు వర్ణంలో ఉంది. కాని ఇప్పుడది రంగు మారి పూర్తిగా బంగారు వన్నెగా మారిపోయి ప్రకాశిస్తోంది.

అందుండిన బంగారువన్నె జలం పళ్ళెరంలోకి ఊరుతోంది స్వర్ణజలం. అంటే బదనిక సిద్ధిపొందినట్టే. ఎంతటి అపూర్వ దృశ్యం? పారవశ్యంతో పులకాంకితుడై భక్తి భావంతో ఆ మహనీయునికి చేతులు జోడించాడు గోవింద పాత్రుడు.

'నువ్వు మహనీయుడవనుకున్నానుగాని మానవ రూపంలోని ఆ మహాదేవుడవని ఇప్పుడర్థమైంది ఆచార్యా. సందేహం లేదు. నీది ఆ దైవాంశ.

నీతోబాటు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోవడం నేను, నా కొడుకు చేసుకున్న అదృష్టం' అనుకుంటూ మరోమారు గాలిలో కూర్చుని తేలుతున్న అగ్నివేశాచార్యుడికి భక్తితో నమస్కరించి ఎంత నిశ్శబ్దంగా వచ్చాడో అంతే నిశ్శబ్దంగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు పిల్లా గోవింద పాత్రుడు.

మరో గంట సమయం కాలంలో మౌనంగా కరిగిపోయింది. అప్పటికి మున్నలూరు అగ్నివేశాచార్యుడు పూజామందిరం నుండి బయటి కొచ్చాడు.

ఆయన చేత్తుల్లో ఉంది రాగి పళ్ళెరం. ఆ పళ్ళెరంతోబాటు బదనిక స్వర్ణకాంతులతో ధగధగాయమానంగా ప్రకాశిస్తోంది. దాన్ని అతి భద్రంగా చేతుల్లో ఉంచుకుని నేరుగా బయట హాలునానుకుని కుడిపక్కగా ఉన్న మరో హాల్లోకి ప్రవేశించాడు.

అక్కడ పిల్లా గోవింద పాత్రుడు, ఆయన కుమారుడు పిల్లా శివరామ ముకుందపాత్రుడు, నలుగురు పనివాళ్ళు, పులి కొండయ్య, డ్రైవరు కాశి అంతా ఆయన రాకకోసమే ఎదురు చూస్తున్నారు.

పక్కనే పెద్దపెద్ద కల్వములు రెండు సిద్ధంగా ఉన్నాయి. వాటికి చక్కగా పూజ నిర్వహించి కుంకుమ బొట్లు తీర్చిదిద్దబడి ఉన్నాయి.

వాటి సమీపంలో చిన్న చిన్న పాత్రలలో అనేక మూలికా ఔషధులు సిద్ధంగా ఉంచబడ్డాయి.

అగ్నివేశాచార్యుడు ఒక కల్వంలోనికి రావి బదనిక స్వర్ణజలాన్ని పంపాడు. రెండో కల్వంలో బదనికను వేశాడు. పనివాళ్ళలో ఇద్దరు చెరో కల్వం వద్దకు వచ్చి నూరటానికి సిద్ధమై కూర్చున్నారు.

పాత్రల్లోంచి కొన్ని మూలికలు తీసి వాటిని ఒక కల్వంలో వేశాడు. మరికొన్నింటిని రెండో కల్వంలో వేసి 'గోవిందాయ నమః' అంటూ నమస్కరించాడు.

ఆయన సైగతో పనివాళ్ళు కల్వంలలో పొత్రాలను ఎక్కించి, నమస్కరించి నూరటం ఆరంభించారు. ఒక దివ్య ఔషధి లేపనానికి అంకురార్పణ జరిగింది.

"ఆచార్యా!" అంటూ దగ్గరకు వచ్చి పలకరించాడు పిల్లా గోవింద పాత్రుడు. ఏమిటన్నట్టు తిరిగి చూశాడు ఆచార్యుడు.

ఎంతో ప్రశాంతంగా ఆయన తేజోమయమగు నేత్రాలు కృపాదృష్టిని ప్రసరిస్తున్నాయి.

"ఇక ఇక్కడ పనులన్నీ మేం దగ్గరుండి చూసుకుంటాం ఆచార్యా. ఉదయం నుంచీ మీరేమీ ఆహారం తీసుకోలేదు. వెళ్ళి భోంచేసి ఒకింత విశ్రమించండి" అన్నాడు గోవిందపాత్రుడు.

"ఊ... కొంత విశ్రాంతి అవసరమే గోవిందా. మూడుదినాలు అవిశ్రాంతంగా శ్రమించి మర్దించినగాని ఈ దివ్యలేపనం తయారు కాదు.

రెండు దినాలు విడివిడిగా మర్ధించి మూడవ నాడు రెంటినీ కలిపి నూరాలి. ఇది ఒక యాగం వంటిది.

ఈ మూడు దినాలు మనమంతా చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ సమయంలో ఏయే ఔషధులు కలపాలో మీకు వివరించాను.

చిన్న పొరపాటు కూడా దొర్లకూడదు. మీరంతా జాగరూకులై ఉండాలి. ముకుందా... నీవును జాగ్రత్త. పర్యవేక్షణ లోపం ఉండకూడదు" అంటూ హెచ్చరించాడు అగ్నివేశాచార్యుడు.

"అలాగే ఆచార్యా. మీరు నిశ్చింతగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు ముకుందపాత్రుడు.

ఆ విధంగా ఎవరి పనులను వారికప్పగించి తగు జాగ్రత్తలు సూచించి తను భోంచేసి ఒకింత విశ్రాంతి కోసం తన మందిరం వైపు అడుగులు సారించాడు మున్నలూరు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

*　　*　　*　　*　　*

ఎవరైనా ప్రేమలో పడనంతవరకే బెట్టు, అలక్ష్యం, కోపం. పడ్డ తర్వాత అవన్నీ మంచులా కరిగిపోయి ప్రేమకోసం, ప్రేమించిన మనిషి కోసం తపన ఆరంభమవుతుంది. అదే విరహం. విరహంలో వున్న వారికి నిద్రరాదు, అన్నం సహించదు.

ఏ పనిమీదా ధ్యాస ఉండదు. ప్రస్తుతం శుశ్రుత అవస్థ అదే. సోమవారం ఉదయం చరక్ తనకోసం వస్తాడని ఆమెకు తెలుసు. ఇన్ని రోజులూ తన మనసులో మాట సూటిగా చెప్పకుండా ఉడికించింది.

ఇక ఆలస్యం చేయకుండా ఇవాళ చరక్ రాగానే తనే ముందు ఐ లవ్ యూ చెప్పాలనుకుంది. ఉదయమే చక్కగా తయారై గుడికి వచ్చి ఎదురు చూడనారంభించింది. ఇవాళ చలి అధికంగా లేదుగాని పొగమంచు తెల్లవారాక వచ్చింది.

సోమవారం శివాలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఎనిమిది గంటలు దాటింది. చరక్ జాడలేదు. క్రమంగా తొమ్మిదయింది. పదిగంటలు దాటింది. కాని చరక్ జాడలేదు.

శుశ్రుతకు కోపం వచ్చింది. అది కాస్తా క్రమంగా తాపంగా మారింది. ఏదో తెలీని బాధ. రోజూ వచ్చేవాడు ఇవాళ ఎందుకు రాలేదు.

తనమీద అలిగాడా... లేక నిన్న నాన్నగారు అతడ్ని ఏమన్నా అన్నారా? రావద్దని పంపించేశారా? పరిపరి విధాలా ఆలోచిస్తూ అక్కడే గుడిమెట్లమీద కూర్చుని చరక్ కోసం ఎదురుతెన్నులు చూడసాగింది.

ఈ లోపల గుడితలుపులు మూసి ఇంటికి పోబోతూ కూతుర్ని చూసి వచ్చి పక్కన కూర్చున్నాడు తండ్రి రామాచారి. "ఏమయింది? ఇవాళ చరక్ రాలేదు కదూ?" అడిగాడు.

అవుననన్నట్టు తలూపింది. గొంతు విప్పితే ఎక్కడ ఏడుపొచ్చేస్తుందో నని భయపడింది. చరక్ కోసం అంత కంతకూ ఆరాటం పెరుగుతోంది ఆమె మనసులో.

"ఏదో పనుండి రాలేకపోయుంటాడు. ఇక్కడికి వస్తే మన ఇంటికి రాకుండా ఉంటాడా. పద పోదాం" అనునయంగా పలికాడు.

"మీరు వెళ్ళండి నాన్నగారూ, తర్వాత వస్తాను. అంది చిన్నగా. ఆమె కళ్ళల్లో సుడితిరుగుతున్న కన్నీటిని, ఆమె గొంతులో బాధను గుర్తించాడు రామాచారి. చిన్నగా నవ్వి ఆమె తల నిమిరాడు.

"పిచ్చితల్లీ. ఇప్పుడేమయిందమ్మా. ఓ పూట అతను రానంతమాత్రాన ఇంత బాధపడిపోవాలా? రేపైనా వస్తాడుగా. లేమ్మా వెళ్దాం" అంటూ బుజ్జగించబోయాడు రామాచారి.

"నిన్న చరక్‌తో మీరు మాట్లాడారు. అతను మీతో గొడవపడ్డాడా నాన్నగారూ?" తన మనసులో సందేహాన్ని బయటపెట్టింది శుశ్రుత.

"అర్థమైందమ్మా. అతను గొడవపడ్డంకాదు. నేనే అతనంటే ఇష్టం లేక గొడవచేసి రావద్దని హెచ్చరించి పంపించి ఉంటానని నీ అనుమానం...."

"అది కాదు నాన్నగారూ...."

"ఏదైనా ఒకటేనమ్మా. నీకు అలాంటి సందేహం రావటం సహజం. చూడు తల్లీ నీకో విషయం చెప్పనా? ఆ కుర్రాడు మొదటిసారిగా గుడికి వచ్చినప్పుడు చూసి ఇంత చక్కనివాడు మాకు అల్లుడయితే ఎంత బాగుంటుంది అనుకున్నాను.

ఆ శంకరుడికి నేను చేస్తున్న సేవలు వృధాపోలేదు. మీ మనసులు కలిశాయి. ఇంతకన్నా సంతోషం ఏంకావాలి? నేను నీ తండ్రినమ్మా.

అతని కాళ్ళుకడిగి నిన్ను కన్యాదానం చేసి వైభవంగా పెళ్ళి జరిపిస్తాను. నిశ్చింతగా ఉండు. అతని వివరాలు తెలుసుకోవడం కోసం వచ్చే ఆదివారం రమ్మని చెప్పాను. ఏదో పనుండి ఈ పూట రాలేకపోయాడు. ఈ మాత్రానికే బెంగపడాలా?" నచ్చచెప్పాడు.

"సారీ నాన్నగారూ... మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను" బాధగా అంది.

"అయినా మనసులో ఇంతగా ప్రేమను పెంచుకుని ఆ కుర్రాడితో ఒక్కమాట చెప్పటానికేమైంది నీకు? పాపం నీ మనసులో మాట చెప్పటం లేదని అతను చాలా బాధపడ్డాడు తెలుసా? లేట్ చేయకుండా ఫోన్ చేసి కనుక్కో, విషయమేమిటో తెలిసిపోతుంది."

"అతని సెల్ నెంబర్ తెలీదు."

"తెలీదా! పోనీ నీ సెల్ నెంబరయినా తన దగ్గరుందా?" అడిగాడు రామాచారి.

"లేదు."

"బాగుందమ్మా. సెల్ నెంబరు తీసుకోలేదు. ఏ ఆఫీసులో పని చేస్తున్నాడో ఎక్కడ ఉంటాడో తెలీదు. ఏ కాలం పిల్లలు మీరు? అలా బయట చూడు.

ఒక్కో అమ్మాయి, అబ్బాయి ఫోన్ పట్టుకుంటే వదిలే పనిలేదు. నెట్ వర్క్ వాళ్ళని ఈతరం యూత్ పోషించేస్తోంది. మీరేమిట్రా అంటే ఇంకా శకుంతల దుష్యంతుల్లాగే ఉన్నారు" అంటూ తండ్రి పరిహసిస్తుంటే శుశ్రుత సిగ్గుపడుతూ "పొండి నాన్నగారూ" అంది.

"సర్లే తల్లీ. నువ్వేం దిగులుపడకు. ఏదో టైమ్‌కి రావచ్చు. లేదంటే అతని ఫ్రెండు కిరణ్ వాళ్ళ ఇల్లు పక్కవీధిలోనే ఎక్కడో ఉండాలి. నే వెళ్ళి అతన్నుంచి వివరాలు తెస్తాను. ఇక లోనకు పద" అంటూ నచ్చచెప్పి కూతుర్ని లోపలకు తీసుకెళ్ళాడాయన. అయితే ఆ రోజు చరక్ రానేలేదు. మరునాడు మంగళవారం కూడా రాలేదు. శుశ్రుతకు ఆందోళన అధికమైంది.

కూతురి బాధ చూడలేక రామాచారి పక్క వీధిలోని కిరణ్ వాళ్ళిల్లు వెదుక్కుంటూ వెళ్ళాడుగాని ప్రయోజనం లేకపోయింది. ఆ ఇంటికి తాళం పెట్టుంది.

వాళ్ళంతా ఎక్కడికి వెళ్ళారో ఎవరూ చెప్పలేకపోయారు. ఈ పరిస్థితిలో మూడోరోజు బుధవారం కూడా చరక్ జాడలేదు. అతడ్ని చూడక శుశ్రుతకు పిచ్చి వచ్చినట్టుంది. మనసంతా దిగులు.

ఆమెలో మనునుపటి ఉత్సాహం లేదు. ఏ పనీ చేయకుండా దిగాలుగా ఏదో మూలన కూర్చుంటుంది. వేళకు తినదు, నిద్రపోదు, ఎవరూ చూడకుండా తనలో తను కుమిలిపోతూంటుంది. మనిషి వాడిన పుష్పంలా తయారవుతోంది.

తల్లి దండ్రులెంత ధైర్యం చెప్పినా శుశ్రుతలో మార్పురాలేదు. కూతురి పరిస్థితి చూస్తుంటే కావేరి రామాచారి దంపతులకి భయంగా వుంది.

చరక్ ఏమైపోయాడు. ఎందుకు రాలేదు? ఇప్పుడు ఏం చేయాలి? ఎవరికీ అర్థంగావడం లేదు. ఈ పరిస్థితిలో నాలుగో రోజు ఉదయం – అనగా లక్ష్మివారం ఉదయం సడెన్‌గా గుడికి వచ్చాడు చరక్. అతన్ని చూడగానే పూజారి రామాచారికి ప్రాణం లేచివచ్చినట్టయింది.

హారతిపళ్ళెం పక్క పూజారికి అప్పగించి గబగబా బయటికొచ్చాడు. "అబ్బాయ్ చరక్. ఏం పనయ్యా ఇది? మూడు రోజులుగా నువ్వు ఏమయి పోయావ్, ఎక్కడికి వెళ్ళావ్?" అంటూ అడిగాడు.

"ఏమైంది బావగారూ, చిన్న ప్రాబ్లంవలన రాలేకపోయాను" తేలిగ్గా నవ్వేశాడు చరక్.

"నీకిది చిన్న ప్రాబ్లం కావచ్చయ్యా. మాకిక్కడ శుశ్రుత పెద్ద ప్రాబ్లమై కూర్చుంది."

"ఏమైంది? తను క్షేమమే గదా?"

"క్షేమమేగాని తన బెంగంతా నీగురించే. అసలెందుకు నువ్వు రావడం మానేశావో అది చెప్పు. నేనేదో నిన్ను తిట్టి పంపించేసి వుంటాను. అందుకే నువ్వు రావడంలేదని అమ్మాయి నన్ను అపార్థం చేసుకుని నాతో మాట్లాడం మానేసింది."

"ఓ మైగాడ్. అయాం సారీ బావగారూ. అసలేమైందంటే నాగపూర్ వెళ్ళిన నా ఫ్రెండ్ కిరణ్‌కి యాక్సిడంటయింది. విషయం తెలియగానే వాడి అమ్మా-నాన్నలతో కలసి నేనూ నాగపూర్ వెళ్ళాను."

"అరరె... ఇప్పుడెలా ఉంది అతడికి?"

"మేజర్ యాక్సిడెంట్. బలమైన దెబ్బలు. ఆపరేషన్ చేశారు. దేవుడి దయవల్ల ప్రాణాపాయం తప్పింది."

"అందుకే కిరణ్ వాళ్ళింటికి తాళం పెట్టుందా?"

"అవునండీ. వాళ్ళింకా అక్కడే ఉన్నారు. ఒక్కడే కొడుకుగావడంతో వాళ్ళ బాధ చెప్పరానిది. నేనే ధైర్యం చెప్పివచ్చాను. ఇంతకీ శుశ్రుత ఎక్కడ?"

"ఇంతసేపూ ఇక్కడే నీకోసం ఎదురుచూస్తూ కూర్చుని ఇప్పుడే ఇంటి కెళ్ళింది. నీమీద బెంగతో మనిషి సగమైపోయింది. వెళ్ళేవాడివి ఓ మాట చెప్పి వెళ్ళొచ్చుగా. వెళ్ళు ఇంట్లో ఉంటుంది.

హమ్మయ్య. నువ్వు రావడంతో నాకు సగం బెంగ తీరింది. ఇంటికెళ్ళు. శుశ్రుత సంతోషిస్తుంది. తిండి తిప్పలు మాని నీకోసం ఎదురు చూస్తోంది పిచ్చిపిల్ల" అంటూ ఉత్సాహంగా తిరిగి గర్భగుడిలోనికి వెళ్ళిపోయాడు రామాచారి.

చరక్ వెనుక ప్రహరీ డోర్ గుండా అవతలి రామాచారి ఇంటికి వెళ్ళాడు. అతను వెళ్ళేసరికి రామాచారి భార్య కావేరి ఏదో పనిచేస్తూ వాకిట్లోనే ఉంది. శుశ్రుత బయట ఎక్కడా లేదు. చరక్‌ను చూడగానే కావేరి ఎంతో సంతోషపడుతూ– "చరక్ తంబీ. నీదానా?.. మూణునాళా ఎంగేపోయిరు కేప్పా?" అనరిచింది.

"ఊరిక్కిపోయిరుందే అక్కా. అదనాలదా వరము డియలే. నల్లా ఇరుక్కీంగళా?" అడిగాడు చరక్.

"బాగున్నారా అంటావా... అదేంబాగులే తంబీ. ఈ పిల్ల దాంతో అవస్తయిపోనాది. నీకోసం ఎదురుచూసి చూసి దాని కళ్ళో కాయలు కాచాయనుకో. పిలుస్తానుండు. శుశ్రుతా... అమ్మాయ్ శుశ్రుతా. ఎవరొచ్చారో చూడవే. చరక్ వందుట్టా... చరక్ వచ్చాడే!" అనరిచింది పెద్దగా.

లోపల గదిలో వున్న శుశ్రుతకి తల్లి పిలుపు వినబడింది. చరక్ పేరు వినగానే ఒక్కసారిగా గుండెల్లో వేయి వసంతాలు విరిసినట్టయింది. గప్పున కళ్ళల్లోకి చిమ్మింది ఆనందం. చెంగున లేచింది.

నరనరాన ఉత్సాహం పొంగుతూండగా లేడికూనలా ముఖద్వారంలోకి పరిగెత్తుకొచ్చింది. చరక్‌ని చూస్తూ అక్కడే ఆగిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. అతడ్ని సరిగా చూడలేకపోయింది.

చరక్ ఆమెను చూస్తూండిపోయాడు. రామాచారి గారు చెప్పిందాంట్లో అసత్యం ఏమీ లేదనిపించింది. ముఖం వాడి తనువు శుష్కించి నీరసంగా... ఎండకు సోలిన కమలంలా ఉంది. ఈ మూడురోజుల్లోనే ఇంత మార్పా... ఆశ్చర్యపోయాడు.

మనసులో ఇంత ప్రేమ ఉంచుకుని ఎంత ఉడికించింది తనను. తనలోనూ ఆమె పట్ల విరహం ఉన్నా ఇంతగా తనని వేధించలేదు. అదో తీపి బాధగా అనుభవించాడు. కొన్ని యుగాల తరువాత ఇప్పుడే తిరిగి ఆమెను చూస్తున్నట్టుంది.

"శుశ్రుతా...." అంటూ పిలిచాడు. అంతే... ఆమె కళ్ళలో కోపం, ముఖంలో అలక తిరిగి తొంగిచూశాయి. చివ్వున వెనుతిరిగి లోనకెళ్ళి పోయింది.

"శుశ్రుతా... ప్లీజ్ ఆగు" అరిచాడు. అయినా ఆగలేదు. కావేరి ఫక్కున నవ్వేసింది.

"చూశావ్‌గా తంబీ దీని అలక. వెళ్ళు. ముందు దాని అలక తీర్చిరా, తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం" అంది.

ఇంతవరకు తను లోనకు వెళ్ళింది లేదు, సందేహిస్తూనే ఆగిపోయాడు. "అక్కా, నిజంగా ఇంట్లోకి వెళ్ళమంటున్నావా?" అనడిగాడు.

"అడనీ ఒన్ను. వెళ్ళు తమ్ముడూ. నేను చెపుతున్నా గదా. కాని జాగ్రత్త సుమా. కోపంలో కొట్టినా కొడుతుంది...." అని పరిహాసమాడుతూ తనే అతడ్ని తోసింది కావేరి.

డోర్ ముందు షూస్ విప్పి లోనకెళ్ళాడు చరక్. హాలు చివరగది ముందు అలిగిన సత్యభామలా నిలబడింది శుశ్రుత. అతను తనవైపు రాగానే గభాలున లోనకెళ్ళి తలుపు మూయబోయింది.

అంతకన్నా వేగంగా వెళ్ళి బోల్టు వేయకముందే తోసుకుని లోన అడుగుపెట్టాడు. అతడు లోనకు రాగానే తలుపు మూసేసింది శుశ్రుత.

"ఎందుకొచ్చావ్? నేను బతికానో చచ్చానో చూడ్డానికా?" అంది రుద్ధకంఠంతో. గేట్లు తెరిచిన ఆనకట్టలా ఆమె కళ్ళనుండి జలజలా రాలుతోంది కన్నీరు. వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకున్నాడు చరక్.

"ఏయ్. అన్యాయంగా మాట్లాడకు. అసలేం జరిగిందంటే..." అతడ్ని చెప్పనివ్వలేదామె.

"ఏమయినా కానీ. నాతో చెప్పివెళ్ళాలా... వద్దా?" అంటూ చరక్‌ని నిలదీసింది శుశ్రుత.

"చెప్పాల్సినంత చనువు నువ్వెప్పుడిచ్చావని...."

"ఇవ్వలేదా?.. ఇవ్వకుండానే ఇన్ని రోజులూ నాకోసం వచ్చావా? నువ్వేమయ్యావో తెలీక...." ఇక మాటలు రాక చిన్నగా ఏడ్చేస్తూ అతడి మీదకు వాలిపోయింది శుశ్రుత. గుండెల్లో ముఖం దాచుకుంటూ పూల చెండులా చేతుల్ని చుట్టిసింది.

తొలి కౌగిలి పరవశంలో పులకించిపోతూ ఆమెను కౌగిట బంధించేశాడు చరక్.

"సారీ... నీ మనసింత బాధపడుతుందనుకోలేదు. కిరణ్‌కి యాక్సిడెంటయి సడెన్‌గా వెళ్ళాల్సివచ్చింది" సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఉన్నట్టుండి ముఖం ఎత్తి అతడి కళ్ళలోకి చూసింది శుశ్రుత. ఆమె కనులు ఇప్పుడు జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి.

"ఇంకెప్పుడూ ఇలా చేయకు. నాతో చెప్పకుండా వెళ్ళకు. తట్టుకోలేను. ఐలవ్‌యూ చరక్. ఐలవ్‌యూ" అంటూ అతడి అధరాలమీద పెదవులు చేర్చి ముద్దు ఇచ్చింది. పరవశంతో పులకించిపోతూ ఆమెను తనివి తీరా ముద్దులాడాడు.

ఆర్తిగా ఒకరి కౌగిట ఒకరు ఒదిగిపోయి అలా ఎంతసేపు ఉండి పోయారో తెలీదు. ఇంతలో తలుపు చప్పుడైంది. "అమ్మ వచ్చినట్టుంది" అంటూ చటుక్కున కౌగిలి వదిలింది శుశ్రుత.

ముద్దులాటలో తన నుదుట కుంకుమ అతడి ముఖాన అంటుకుంది. ముసిముసిగా నవ్వుతూ పైటకొంగుతో అతడి ముఖాన్ని తుడిచి అప్పుడు తలుపు తీసింది. ఎదురుగా తల్లి కావేరి. ఆమె చేతిలో వేడి ఇడ్లీతో రెండు ప్లేట్లు.

"ఏంది? మీ అలకలు తీరాయా? తంబీ చరక్. నీ మీద బెంగతో ఇది తిండి సంగతే మర్చిపోయిందయ్యా. ఇద్దరూ టిఫిన్ తీసుకోండి" అంటూ టేబుల్ మీద ఉంచిందావిడ.

"వద్దక్కా" అన్నాడు మొహమాటంతో.

"నీకోసం కాదులే. దీనికోసమైనా తప్పదు. తెల్లారి ఇది కాఫీ కూడా తాగలేదు తెలుసా" అంటూ బయటకెళ్ళిపోయింది.

ఆ ఇంట్లో తొలిసారిగా శుశ్రుత కోసం టిఫిన్ తిని కాఫీ తాగాడు చరక్. శుశ్రుత మొబైల్ నెంబర్ తీసుకున్నాడు. తన మొబైల్ నెంబర్‌తోబాటు ఆఫీసు విజిటింగ్ కార్డుకూడా ఇచ్చి బయలుదేరాడు చరక్.

సాయంత్రం ఆఫీసునుంచి ఇటే వస్తానని అతను మాట ఇచ్చాకగాని అతడ్ని వదల్లేదు శుశ్రుత.

*　　*　　*　　*　　*

నీలోదరి కొండగుట్ట.

మహామాంత్రికుడు మరిడి సోమయ్య నివాసం. అతడికి సుమారు ఇరవైమంది శిష్యులున్నారు. వారిలో ప్రధాన శిష్యులు ముగ్గురు. ఒకడు విళంబి, రెండోవాడు మృణాళుడు. మూడోవాడు వికేశి.

ఈ ముగ్గురిలోను మాంత్రికునికి ఇష్టుడు అతి నమ్మకమైనవాడు మృణాళుడు. ఎప్పటికైనా వీడు తనంతవాడు అవుతాడని అతడి నమ్మకం. మృణాళుడి వయసు ముప్పై సంవత్సరాలుంటాయి. బలంగా దృఢమయిన శరీరం.

మహా మొండివాడు, ధైర్యస్థుడు, మంత్రశక్తులు అధికంగా వశపర్చు కున్నాడు. అప్పగించిన పనిని సమర్ధంగా నిర్వహించగలవాడు.

శిష్యుడు విళంబి ఆత్మను పంపించి ధన్వంతరీ అగ్నివేశాచార్యుడి చేతిలో పరాభవం చవిచూశాక కూడా మాంత్రికుడు మరిడి సోమయ్యలో పట్టుదల కొంచెం కూడా సడలిపోలేదు. ఆయన ఏం చేయబోతున్నాడు. ఆ ప్రయోగాల విశేషాలు తెలుసుకోవాలనే పట్టుదల మరింత అధికమయి పోయింది.

ఈసారి శిష్యుడు మృణాళుడిని పంపించడానికి సిద్ధం చేస్తున్నాడు. ఇందుకోసం వాడికి ప్రత్యేకంగా పరకాయప్రవేశ విద్యను బోధించాడు.

మంత్రశక్తుల్లో పంచశక్తులనే అయిదు శక్తులు ప్రత్యేకమయినవి, నిగూఢమయినవి. అందరికీ సాధ్యంకానివి. వాటిలో ఒకటి అదృశ్య శక్తి. అనగా కోరిన వెంటనే ఎవరికీ కనిపించకుండా మాయమైపోవటం. అదృశ్యుడు కావటమన్నమాట.

ఇలా ప్రత్యక్షం గావటం, మాయంగావటం దేవతలకు వెన్నతోపెట్టిన విద్య. ఈ విద్య కిన్నరులనే దేవజాతి నుంచి మంత్రరూపంగా మానవులకు

లభించిందంటారు. రెండోది అదృశ్య గమనశక్తి. అనగా ఇక్కడ మాయమై ఎక్కడికో వెళ్ళిపోవటం.

అదృశ్యశక్తిలో కంటికి కనబడరుకాని అక్కడే ఉంటారు. కాని అదృశ్య గమనశక్తిలో అదృశ్యంగావటంతోపాటు ప్రపంచంలో కోరినచోటుకు ఎక్కడికైనా చిటికెలో వెళ్ళిపోయి అక్కడ ప్రత్యక్షం కాగలరు.

ఈ శక్తి విద్యాధరులనే దేవతలనుంచి మంత్రశక్తిగా మానవులకు అందిందంటారు. కొందరు సిద్ధులు, యోగులు ఈ శక్తి కలిగి వుంటారు. అందుకే వీరు ఈ ఊళ్ళో కనిపించిన కొద్ది సేపటికి ఎక్కడో మరో ఊళ్ళో కన్పిస్తుంటారు.

మూడోది ఇచ్ఛాధర శక్తి. అనగా కోరిన రూపం ధరించగల శక్తి. దీనినే కామరూప శక్తి అనికూడా అంటారు. కామరూపులగు గంధర్వుల నుండి ఇది మంత్రశక్తిగా మానవులకు లభించిందంటారు. అయితే నాగశక్తి అంశలోని నాగుపాములు నూరేళ్ళు కాటువేయకుండా జీవించిన వాటికి శిరస్సున నాగమణి అనే దివ్యమణి ఏర్పడటంతోబాటు కోరిన రూపం ధరించగల ఇచ్ఛాధర శక్తి ఏర్పడుతుందట.

దట్టమైన అడవుల్లో అప్పడప్పుడూ ఇవి మానవరూపం దాల్చి దారితప్పిన బాటసారులను అడవినుంచి సురక్షితంగా దాటిస్తాయంటారు. వీటిమీద చాలా కథలు ఉన్నాయి.

ఈ ఇచ్ఛాధర శక్తికి సంబంధించిన గాధ మనకి మహాభారతంలో కన్పిస్తుంది. ఇచ్ఛాధర శక్తి కలిగిన ముని దంపతులు ఇరువురూ లేళ్ళరూపం ధరించి కామకేళిలో ఉండగా పాండురాజు అవి నిజమయిన లేళ్ళ జంట అనుకుని బాణం వేస్తాడు.

'దాంతో ఆ ముని దంపతులు సృష్టిలో మైథునం పారవశ్యంలోని ఏ జీవినీ హింసింపరాదన్న కనీస ధర్మం తెలీని మూర్ఖుడివి. నువ్వు స్త్రీని కూడిన తక్షణం మరణిస్తావని' శపించి కన్నుమూస్తారు. ఆ శాపఫలితమే పాండురాజు మరణం. ఇలా ఇచ్ఛాధరశక్తికి సంబంధించిన అనేక గాధలు, కథలు మనకు జానపద కథలు, పురాణ ఇతిహాసాల్లో కనిపిస్తాయి.

నాలుగోశక్తి ఆత్మశక్తి. అనగా ఆత్మ శరీరం నుంచి బయటికొచ్చి సంచరించి తిరిగి శరీరంలో ప్రవేశించటం. ఈ శక్తిని మానవులే మంత్రశక్తిగా యోగవిద్యతో సాధించుకున్నారంటారు.

అయిదోది పరకాయి ప్రవేశశక్తి. దీన్నే పరకాయ ప్రవేశవిద్య అంటారు. కాయం అనగా శరీరం. పరకాయం అనగా తనదిగాని ఇతర శరీరమని అర్థం.

ఈ విద్య తెలిసినవారు అవసర సమయంలో తన శరీరాన్ని మరుగున వదిలి, చచ్చిన మరో జీవి శరీరంలో ప్రవేశించి వెళ్ళి అనుకున్న పని సాధించాక తిరిగి ఆ పర శరీరాన్ని వదిలి స్వశరీరంలోకి చేరడం. దీన్నే పరకాయ ప్రవేశవిద్య అంటారు.

ఈ విద్య దానవులనుంచి మంత్రశక్తిగా మానవులకు లభించిందంటారు. ఈ విద్యకు సంబంధించిన గాధ మనకు ముఖ్యంగా భట్టి విక్రమార్కుల కథల్లో కనిపిస్తుంది. ఒక మగచిలుకను ఆడచిలుక చంపి పోతుండగా చూసి విక్రమార్కుడు తన శరీరాన్ని వదిలి మగచిలుక శరీరంలో ప్రవేశించి ఆ దుష్ట ఆడచిలుకను తరుముకువెళ్తాడు.

ఈ లోపల విషయం గ్రహించిన ఆయన మిత్రుడు ఇదే విద్యతో తన శరీరాన్ని వదిలి విక్రమార్కుడి శరీరంలో ప్రవేశించడంతో గందరగోళ మవుతుంది.

కాబట్టి ఇప్పుడు చెప్పుకున్న ఈ అయిదు శక్తులూ ఎంతో నిగూఢమైనవి, అరుదైన విద్యలు. అంతేకాదు. ఈ అయిదు శక్తుల్ని సాధించుకోవటం అంత సులువుకాదు. ఎంతటి గొప్ప గురువైనా వీటిలో ఏ ఒకటో రెండో విద్యల్ని మాత్రం అభ్యసింపగలిగి ఉంటాడు.

అతి రహస్యమగు ఈ విద్యలు ఉన్నాయంటే నేడు ఎవరూ నమ్మక పోవచ్చుగాని అవి తెలిసిన మహనీయులు మాత్రం ఇప్పటికీ నాగరిక ప్రపంచానికి బయట ఉన్నారన్నది మాత్రం నిజం. చాలా అరుదుగా వీరి ఉనికి బయట పడుతూంటుంది.

ప్రస్తుతం మాంత్రికుడు మరిడి సోమయ్య తన శిష్యుడు మృణాళుడిని ఈ విద్యతో ఆచార్యుడి స్థావరానికి పంపించబోతున్నాడు.

మృణాళుడు తను బయలుదేరటానికి సిద్ధంగా గురువు పాదాలకు నమస్కరించాడు. అతడ్ని లేపి ఆశీర్వదించాడు మరిడి సోమయ్య.

"మృణాళా! ఇప్పుడు నీవు చేయబోవు గూఢచర్యం సామాన్యమైనది కాదు. కురువృద్ధుని వంటివాడు గొప్ప యోగశక్తి సంపన్నుడు ధన్వంతరీ అగ్ని వేశాచార్యుడు. ఆయన కళ్ళుగప్పి అక్కడి స్థావరంలో సంచరించ బోతున్నావ్. విశేషాలు సేకరించనున్నావ్.

నీ ఉనికి అచట ఎవరికీ అనుమానాస్పదం గాకూడదు. ముఖ్యంగా ఎవరి కంటపడినా ఆచార్యుడి కంట మాత్రం పడకు. ప్రమాదం.

శత్రుస్థానంలో వున్నావని అనుక్షణం గుర్తుంచుకుని జాగరూకుడవై సంచరింపవలె. విజయుడవై తిరిగిరావలె. అర్థమైనదా?" అంటూ హెచ్చరించాడు.

"అర్థమైంది గురుదేవా. ఈ మృణాళుడి సామర్థ్యాన్ని మీరే చూస్తారుగా. ఇక సెలవు" అంటూ మరోసారి నమస్కరించి అచట తనకోసం ఉంచిన ప్రత్యేక కొయ్యబల్లమీద వెల్లకిలా పడుకున్నాడు మృణాళుడు.

గురువు సైగననుసరించి ఒక పంజరాన్ని తెచ్చి పక్క బల్లమీద ఉంచారు శిష్యులు. అందులో చచ్చి పడుందో రామచిలుక. ఈ కార్యం కోసమే కొంత సేపటి క్రితం ఆ చిలుకను పీకనొక్కి చంపేశారు.

మరిడి సోమయ్య తన మంత్రదండాన్నెత్తి మృణాళుడి శరీరాన్ని ఆపాదమస్తకం తాకించాడు. కళ్ళు మూసుకున్నాడు మృణాళుడు. అంతే–

కొన్ని సెకండ్ల వ్యవధిలోనే మృణాళుడు తన పరకాయ ప్రవేశవిద్యతో తన శరీరాన్ని వదిలి పంజరంలోని చిలుక శరీరంలో ప్రవేశించాడు.

చచ్చిన చిలుకలో తిరిగి కదలిక ఏర్పడింది. చివ్వున లేచి అరుస్తూ రెక్కలు తపతపలాడించింది.

ఆసక్తిగా ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న శిష్యులంతా ఆనందంతో పెద్దగా చప్పట్లు చరిచారు.

పరకాయ ప్రవేశవిద్యలో మరో విశేషం– ఆత్మ ఏ శరీరంలో ప్రవేశించినా దానికి తన స్వశరీరంతో బాటు గతమంతా గుర్తుంటుంది.

చిలుకను పంజరంలోంచి తీసి ముద్దాడాడు మాంత్రికుడు. "శభాష్ మృణాళా. క్షేమంగా వెళ్ళి లాభంగా రా!" అంటూ చిలుకను గాల్లోకి ఎగరేశాడు.

వారిమీద ఒక రౌండ్‌కొట్టిన రామచిలుక గవాక్షంగుండా బయటపడి అక్కడి నుండి నైఋతిదిశగా గగనసీమలో శరవేగంతో దూసుకుపో నారంభించింది.

* * * * *

అది ఆచార్య అగ్నివేశుడి స్థావరంలోని ప్రత్యేకమైన గది. విశాలమగు ఆ గది హాలు చివర కుడిపక్కగా ఉంది. ఆ గదిలో తూర్పు గోడకు సమీపంలో గది మధ్యలో ఉంది ఒక విచిత్రమగు పేటిక.

ఏడడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు, రెండడుగుల ఎత్తు కలిగి నాలుగు పక్కలా మంచం కోళ్ళ లాంటి నాలుగు కోళ్ళు తొమ్మిది అంగుళాల ఎత్తునున్నాయి. బాక్స్‌పైన అదే పరిమాణంలో గ్లాస్‌తో కూడిన డోమ్ ఒకటి మూతలా బిగించబడివుంది.

లోన తల తూర్పువైపు, పాదాలు పడమరవైపు ఉండి పడుకోవడానికి అనువుగా మెత్తటి పరుపు, తల దిండు ఉంచబడ్డాయి. ఆ బాక్సు మొత్తం చేవదేరిన పనస చెక్కతో ప్రత్యేకంగా తయారుచేయబడింది. ఎక్కడా మారుచెక్క వాడలేదు.

అంతేకాదు బాక్స్ చుట్టూ ఎగురుతున్న యక్షులు, యక్షకన్యల చిత్రాలు నగిషీగా చెక్కబడి అదో అద్భుత కళాఖండంలా ఉంది. ఆ బాక్స్ వెనుక తూర్పు గోడకు అంతే పరిమాణంలో అనగా ఏడడుగుల పొడవు నాలుగు అడుగుల వెడల్పున చెక్క ఫ్రేమ్‌లో బిగించబడిన పెద్ద సైజు అద్దం ఉంది.

ఆ అద్దానికి పై భాగంలో ద్వారపాలకుడిలా మణిభద్ర యక్షుని బొమ్మ పెద్దసైజులో బిగించబడి ఉంది. అద్దం ఫ్రేమ్‌కి ఉపయోగించిన కర్ర కూడా పనసచెక్క.

యక్షులకు ఇష్టమైన వృక్షం పనసచెట్టు. ఇష్టమయిన పండు పనసపండు. యక్షుల ప్రీత్యర్థం ఇలా పనసచెక్కను ఉపయోగించడం జరిగింది. ఇతవరకు ఆ మందసానికి, అద్దానికి అనేక పూజలు నిర్వహించారు. అనేక లేపనాలు తయారు చేసి పూతపూసి ప్రయోగాలు చేశారు.

ఒకే ఒక్కసారి ప్రయోగలోపం జరిగింది. దాన్ని సవరించి తిరిగి నిర్వహిస్తూ వస్తున్నారు. అనేక దశలు దాటి ప్రస్తుతం ప్రయోగం చివరిదశకు చేరుకుంది. స్వర్ణజల లేపనంతో అదికూడా ముగియనుంది.

ఇదికాస్తా సక్సెసయితే ఇక భూతకాలంలోకి నిరాటంకంగా వెళ్ళి రావచ్చు. అటు అద్దంలోను, ఇటు మందసంలోను కూడా అప్పుడప్పుడూ లేతవైన పసుపు, నీలం, ఊదారంగులు మారిమారి ప్రత్యక్షమై అదృశ్యమవుతున్నాయి. అవి విద్యుత్ కాంతులు కాదు.

ఆచార్యుడి మంత్ర తంత్ర యంత్ర ప్రయోగాల ప్రభావంతో తాముగా ఆవిర్భవించి అంతరిస్తున్న కాంతిరేఖలు. అవే భూతకాలంలోకి మార్గ దర్శకాలు. మూడు రోజులపాటు రావిబదనికతో చేర్చి దివ్యౌషధుల్ని ఏకబిగిన మర్దించి లేపనం తయారుచేయటం ఒక యాగంలా సాగింది. ఆ మూడు దినాలూ ఎవరికీ సరిగా కంటిమీద కునుకు లేదు.

రెండ్రోజులు విడివిడి రెండు కల్వాల్లో మర్ధించిన మిశ్రమాలను మూడోరోజు ఒకే కల్వంలోకి చేర్చి మొత్తం కలిపి ఆ రోజంతా చకటిపడేవరకు మర్దించడంతో ఆ పని ముగిసింది.

కాటుకలా మెత్తటి ఆ మిశ్రమాన్ని ఒక రాగి పాత్రలోకి తీసి దానికి కొన్ని తైలాలతోబాటు పన్నీరు చేర్చగానే అది స్వర్ణమయ కాంతులీనుతూ ద్రావణంలా తయారయింది. ద్రావణంతో వున్న ఆ రాగి పాత్రను పూజగదిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించాడు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

మరునాడు శుభ తిధి, శుభ నక్షత్రం గావటంతో ఉదయమే పవిత్రంగా స్నానాదికాలు చేసి పూజలు ముగించి మందసం వద్ద పూతపని ఆరంభించారు.

ఈ వ్యవహారం నడిచేప్పటికి వారం రోజులు పైనే అయింది. అప్పటికే మాంత్రికుడు మరిడి సోమయ్య పంపగా అతని శిష్యుడు మృణాళుడు చిలుకరూపంలో అక్కడికి చేరుకుని స్థావరం పరిసరాలలోనే సంచరిస్తూ అక్కడి పనుల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

ఆ చిలుక అప్పుడప్పుడూ లోపల ఎగురుతున్నా, వెంటిలేటర్లలో కూర్చున్నా కూడా దానిగురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రతిచోటా పశుపక్ష్యాదుల సంచారం సహజంగాబట్టి ఎవరూ ఆ చిలుకవైపు దృష్టి సారించలేదు. తయారయిన లేపన ద్రావణాన్ని రోజు విడిచి రోజుగా మూడు పూతల్లో పూర్తిచేయాలి.

మొదటి పూత అయ్యేసరికే మందసం ధగధగాయమానంగా స్వర్ణ కాంతులీనుతూ పుష్పక విమానంవలె గోచరింపసాగింది.

మధ్యాహ్నానికి తొలిపూత ముగించి అంతా అక్కడి నుండి బయటికి వెళ్ళిపోయారు.

పైన వెంటిలేటర్‌లో కూర్చుని అంతవరకు జరిగింది గమనిస్తూనే ఉంది రామచిలుక.

ఆ చిలుకలోని మాంత్రిక శిష్యుడు మృణాళుడికి చెప్పరాని సందేహాలు ఏర్పడుతున్నాయి.

వీళ్ళు నిర్వహించబోతున్న ప్రయోగాల సారాంశం ఏమిటి? విచిత్రమైన ఆ పెట్టెను దేనికి ఉపయోగించబోతున్నారు? అందులో ఏముంది? దాని మర్మం ఏమిటి? అక్కడ గోడకు అమర్చిన అద్దానికి, ఆ మందసానికి సంబంధం ఏమిటి? ఏమీ తెలీటంలేదు.

ఇక్కడ తన మంత్రశక్తులు ఏవీ పనిచేయడం లేదు. తన సందేహాలు తీరాలంటే కిందకు వెళ్ళి ఆ పెట్టెను దగ్గరగా పరిశీలించాల్సిందే.

అందులోకి విచిత్రమైన కాంతులు వచ్చిపోతున్నాయి. అవేమిటో కూడా తెలుసుకోవాలి. అంతా బయటికి వెళ్ళిపోయారు. తను దగ్గరగా ఆ పెట్టెను చూడ్డానికి ఇదే సరైన సమయం.

కుతూహలం ఆపుకోలేక గదిలోకి ఎగిరిన రామచిలుకలోని మృణాళుడు సూటిగా వెళ్ళి ఆ మందసం మీది గ్లాస్ డూమ్‌పైన వాలబోయాడు. అది ఎంత పొరబాటో చివరి క్షణంలోగాని అతడికి అర్థం కాలేదు. వాలీవాలకముందే ఎవరో తనను ఒడిసిపట్టుకుని విసిరి గోడకు కొట్టారు.

కంటికి ఎవరూ కనబడలేదు. కాని ఆ విసురుతో చివ్వున వెళ్ళి గోడకు కొట్టుకుని బాధతో పెద్దగా అరుస్తూ కిందపడింది చిలుక. ఆ మందసానికి యక్షశక్తులు కాపలావున్న సంగతి తెలీక మృణాళుడు దెబ్బ తిన్నాడు. అసలే గుప్పెడు పిట్ట రామచిలుక.

గోడకు కొట్టుకోగానే ఒళ్ళు హూనమై వెంటనే లేవలేకపోయింది. ఈలోపల– ఆ సమీపంలోనే బయట హాల్లో వున్న డాక్టర్ పిల్లా శివరామ ముకుంద పాత్రుడు గదిలోంచి చిలుక అరుపులు విని ఆశ్చర్యపోయాడు. గబగబా లోనకు వచ్చాడు.

అతను వచ్చేసరికి అప్పుడే శక్తి కూడదీసుకుని తడబడుతూ లేచిన రామచిలుక వెంటిలేటర్ వైపు ఎగిరిపోతూ కనిపించింది. అది నేలమీద పడ్డచోట సన్నటి నెత్తుటి చారతోబాటు ఊడి రాలిపోయిన కొన్ని ఈకలూ కనిపించాయి.

ఈ సంఘటన అతనిలో ఆలోచనలు రేకెత్తించింది. కాయో పండో ఏమీలేని ఈ గదిలోకి రామచిలుక ఎందుకు వచ్చినట్టు?

ఇదేదో అసాధారణ విషయం అనుకుంటూ వెంటిలేటర్ మీది చిలుకను మరోమారు చూశాడు. ఆయన చూపుల నుంచి తప్పించుకుంటూ అది బయటికి ఎగిరిపోయింది. అది సాధారణ చిలుకలా అనిపించలేదు ముకుందపాత్రుడికి.

ఈ విషయాన్ని ఆచార్యుడికి చెప్పాలా వద్దా అని ఆలోచిస్తూ కాస్సేపు అక్కడే నిలబడ్డాడు.

చివరికి మరోసారి గమనించేవరకు చెప్పకూడదని నిశ్చయించుకుంటూ తలుపులు దగ్గరగా మూసి బయటికి వెళ్ళిపోయాడు.

*　　*　　*　　*　　*

ఆదివారం ఉదయం. పదిగంటల తరువాత శివాలయానికి వచ్చాడు చరక్. అతనికోసం ఆలయ మండపంలోనే ఎదురు చూస్తోంది శుశ్రుత. అతడ్ని చూడగానే చివ్వున లేచి ఎదురొచ్చింది.

ఆమె అందం ఏ రోజుకారోజు కొత్తగానే కన్పిస్తుంది చరక్‌కి. ఇవాళ సాంప్రదాయంగా చీర జాకెట్టు ధరించంలో షోకేస్‌లో బొమ్మలా ఆమె అందం కట్టిపడేస్తోంది.

"ఏమిటింత లేటు? నాన్నగారు నీ కోసమే ఎదురు చూస్తున్నారు తెలుసా?" అంది అతడు బైక్‌దిగ్గానే.

"ఏయ్ నేను టైమ్‌కే వచ్చాగాని నువ్వేంటి ఎక్కడికో బయలుదేరి నట్టున్నావ్?" కొంటెగా అడిగాడు.

"అవును. ఈ రోజు చరక్ నన్ను బయటకు తీసుకువెళుతున్నాడు" తనూ చమత్కారంగా బదులు ఇచ్చింది శుశ్రుత.

"లేదు లేదు నువ్విలాంటి పేచీపెట్టకు. మీ డాడీతో మాట్లాడి వెళ్ళిపోతాను. అంతవరకే... మనం రేపు సాయంత్రం బయటకు వెళ్దాం. ఓ.కె.నా...?"

"నాకు ఓ.కె.కాదు. ఇవాళ ఆదివారం. భోంచేశాక మనం బయటికి వెళ్తున్నాం. అంతే."

ఇద్దరూ మాటల్లోనే ఇంటికొచ్చేశారు.

అరుగుమీద కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న రామాచారి చరక్‌ను చూడగానే పుస్తకం మూసి పక్కనపెట్టి నవ్వుతూ ఆహ్వానించి ఎదురుగా చైర్ చూపించాడు. శుశ్రుత లోపలకి వెళ్ళి గడపలో నిలబడి చూడసాగింది. "ఏదో పుస్తకం చదువుతున్నట్టున్నారు...?" అని ఆయన పక్కన పెట్టిన పుస్తకాన్ని చూస్తూ అడిగాడు చరక్.

"అవునయ్యా చరక్. వెరీ ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్. నా ఫ్రెండ్ ఒకాయన చదవమని ఇచ్చాడు.

ద్వారకానగరం మీద ఎన్నో పరిశోధనలు చేసి ఆ నగరం నీట మునిగింది వాస్తవమని ప్రపంచానికి చాటిచెప్పిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రొఫెసర్ షికారిపూర్ రంగనాధరావుగారు రాసిన గ్రంథం. నువ్వు కూడా చదవాల్సిన పుస్తకం" అంటూ పుస్తకాన్ని చరక్‌కి ఇవ్వబోయాడు రామాచారి. చరక్ తీసుకోలేదు.

"నేను చదివేశానండి... బుక్ పేరు 'ది లాస్ట్‌సిటీ ఆఫ్ ద్వారకా' కదూ?" (The Last City of Dwaraka) అన్నాడు చరక్.

"చదివేశావా... అయితే నీకూ ఇలాంటి వాటిమీద ఇంట్రెస్ట్ ఉందన్న మాట. ఈ పుస్తకం మీద నీ అభిప్రాయం ఏమిటి?" కుతూహలంగా అడిగాడు ఆయన.

"ఈ విషయంలో నాకన్నా మా తాతగారికి ఎక్కువ ఇంట్రెస్ట్ ఉంది. చాలా పరిశోధించాడు ఆయన. అయినా మీరడుగుతున్నారు గాబట్టి నా అభిప్రాయం చెపుతాను.

ద్వారకమీద జరిగింది సమగ్ర పరిశోధన అంటే ఒప్పుకోలేనండి. ఇది నా మొదటి పాయింట్. దీని గురించి తర్వాత మాట్లాడుకుందాం.

రెండోది మీరీ పుస్తకం ఎంతవరకు చదివారో తెలీదు. ద్వారకా నగరాన్ని మయుడు నిర్మించి ఇచ్చాడని చెప్పబడింది. అది సరికాదు."

"అంటే... శ్రీకృష్ణుని కోసం ద్వారకా నగరాన్ని నిర్మించి ఇచ్చింది మయుడు కాదా?" ఆశ్చర్యంగా అడిగాడు రామాచారి.

"కాదండి" అన్నాడు చరక్.

ఇంతలో సెగలు గక్కుతున్న అందమయిన కప్పుల్లో కాఫీతో కావేరి రావడంతో తాత్కాలికంగా వారి సంభాషణకి బ్రేక్ పడింది.

"మీరు అసలు విషయం వదిలేసి ఏదో మాట్లాడుకుంటున్నారు...." అంది. అసలు విషయం అంటే ఇక్కడ చరక్ వివరాలు అడగటంలేదని.

కావేరి లోపలకు పోతూ గడపవద్ద వున్న కూతురు శుశ్రుతను పిలిచింది.

"వాళ్ళేదో లోకాభిరామాయణంలో పడిపోయారు గాని మనకెందుకు. నువ్వు రా. గారెలు నూనెలోవేసి తియ్యాలి. వచ్చి సాయం చెయ్యి" అంది. ఆమెతో శుశ్రుత కూడా వంటగదిలోకి నడిచింది.

"ద్వారకను నిర్మించింది ఎవరు?"

"మనం దేనికైనా ప్రామాణికంగా తీసుకోవలసి వస్తే వ్యాసభారతాన్ని తీసుకుంటాం. అదే కరక్ట్. అయితే వ్యాసులవారు మహాభారతాన్ని ఒక చక్కటి కథాగమనంతో నాటి సంఘటనల్ని సజీవపాత్రల్ని ఒక ఇతిహాసంగా చక్కగా మలిచి మనకందించారు.

ఈ క్రమంలో ఆయన కథాగమనానికి ఎంతవరకు అవసరమో అంతవరకే సంఘటనలను తీసుకుని మిగిలిన వాటిని వదిలేశారు. అలా వదిలివేయబడిన సంఘటనలు నేటికీ మనకు స్థలపురాణాల్లోను, స్థానిక గాధల్లోను, జానపద గాధల్లోను కన్పిస్తాయి.

వాటి ప్రస్తావన వ్యాసభారతంలో ఎక్కడా కన్పించదు. కాని ఆ యా గాధలు ఒకతరం నుండి మరోతరానికి అందుతూ నేటికీ విన్పిస్తూనే ఉన్నాయి.

భారత భాగవతాల్లో లేని సంఘటనల గురించి మనం చాలా కథలు వింటూంటాం. అని కల్పించబడినవని కొందరి అభిప్రాయం. కాని అవి కల్పనలు కాదన్నది నిజం. ఇది భారత భాగవతాల్లో దేనిగురించి మాట్లాడుకోవాలన్నా ముందుగా గుర్తుంచుకోవలసిన విషయం."

"మరి ద్వారక నిర్మాణం సంగతేమిటి?"

"ద్వారక తన రాజధానీ నగరం. ఒకరు నిర్మించడం ఏమిటి? ఆ నగరాన్ని వాసుదేవుడే తన సొంత వాస్తు సిద్ధాంతంతో నిర్మింపచేశాడు"

ఆ మాటలకు ఆశ్చర్యంగా చూశాడు రామాచారి "అంటే... కృష్ణవాస్తు అని ఒకటుందని ఎవరో చెప్పగా విన్నాను. అది ఇదేనా?" నమ్మలేనట్టు అడిగాడు.

"కరక్టుగా ఊహించారు. శ్రీకృష్ణుడు అంటే సాక్షాత్తూ ఆ శ్రీహరియని అందరికీ తెలిసిందే.

అలాంటి పరమాత్మ కోరితే మయుడు ద్వారకను నిర్మించి ఇచ్చేవాడే. మయుడు మయబ్రహ్మ, విశ్వకర్మ బ్రాహ్మణులకు మూలపురుషుడు. వాస్తుశాస్త్రానికి, చేతివృత్తులకు ఆద్యుడు.

సాక్షాత్తూ సూర్యనారాయణునకు తన కూతురు సంజ్ఞాదేవిని ఇచ్చి పెళ్ళిచేసిన మామగారు. మహాశక్తి మంతుడు. అలాంటి మయుడు నగరాన్ని నిర్మించి ఇస్తే అది శాశ్వతమయ్యేది. కాని అలా శాశ్వతంగావటానికి ఇక్కడ అవకాశం లేదు. అదే సమస్య."

"మాధవుడు తలిస్తే అసాధ్యం ఉంటుందా... సమస్య ఏమిటి?"

"ధర్మం వేరు. ధర్మ సూక్ష్మం వేరు. ధర్మంకన్నా ధర్మ సూక్ష్మాన్ని గ్రహించడం కష్టం. ఉదాహరణకి స్త్రీ బాల, వృద్ధులను వధింపరాదని ధర్మశాస్త్రం చెబుతోంది.

సకల ధర్మాలు తెలిసినవాడు అయివుండి కూడా శ్రీకృష్ణుడు పసితనంలోనే పూతన అనే రాక్షస స్త్రీని వధించాడు. తనకన్నా వయస్సులో చాలా పెద్దవాడు, స్వయానా మేనమామ కంసుణ్ణి వధించాడు.

స్వయానా మేనత్త కొడుకైన శిశుపాలుడు తనను నిందిస్తూ నూరు తప్పులు చేశాడని శిశుపాలుడ్ని వధించాడు. అవి అధర్మాలు కావని సహేతుకమని ధర్మసూక్ష్మం తెలిసినవారికే అర్థమవుతుంది.

గోపాలుడి న్యాయం చాలా ఖచ్చితమయినది, ధర్మబద్ధమయినది. ఒకరి స్థలాన్ని ఎవరన్నా ఆక్రమిస్తే ఆయన క్షమించడు. రేపల్లె సమీపంలో ఆ ఊరికి చెందిన అందమైన మడుగు వుంది.

గోపాలకులు తమ పశువులను ఆ మడుగులో కడిగేవారు. అలాంటి మడుగుని కాళిందుడనే పాము సకుటుంబసమేతంగా ఆక్రమించి పశువుల్ని తరిమి గోపాలుర్ని భయభ్రాంతుల్ని చేసింది.

వెంటనే కృష్ణుడు కాళిందుడి పడగమీద నాట్యం చేసి గర్వం అణచి, ఆ సర్పం కుటుంబంతో సహా మడుగు వదిలిపోయేలా చేసి తిరిగి గోపాలకులకు ఆ మడుగును అప్పగించాడు.

ఇది అంతా కూడా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే మనం ఒక స్థలాన్ని తొంభైయేళ్ళకు లీజుకు తీసుకున్నాం అనుకుందాం. అది లీజు సమయంవరకే మన హక్కు భుక్తంగా ఉంటుంది. లీజు గడువు ముగియగానే దాన్ని వదులుకోకతప్పదు.

ఆ స్థలంమీద హక్కులు తిరిగి స్థలం సొంతదారునకు లేదా అతని కుటుంబీకులకు వెళ్ళిపోతాయి.

ద్వారకా నగర నిర్మాణం జరిగిన ప్రాంతం శ్రీకృష్ణుని సొంత భూమి కాదు. లీజుకు తీసుకున్న భూమి" అంటూ చెప్పటం ఆపాడు చరక్.

"నీ అభిప్రాయం ఏమిటో నాకు సరిగా అర్థంగావటంలేదు చరక్. కాస్త విపులంగా చెప్పరాదూ?" అని అడిగాడు.

"ద్వారక నిర్మాణం గురించి చెప్పుకునేముందు అసలు శ్రీకృష్ణునికి కొత్తగా నగరం నిర్మించుకోవలసిన అవసరం ఏమొచ్చిందో తెలుసుకోవాలి.

అధర్మంగా వ్యవహరిస్తున్నాడని తన మేనమామ కంసుణ్ణి చంపి మధురకు ఉగ్రసేనుడ్ని (Meternal Grand Father) రాజుని చేశాడు శ్రీకృష్ణుడు.

ఇది తెలుసుకున్న కంసుడి మామ, మగధ సామ్రాజ్యానికి రాజయిన జరాసంధుడు శ్రీకృష్ణుడి మీద ఆగ్రహోదగ్ధుడయ్యాడు.

తన మిత్రుడు కాలయవనుడితో కలిసి మధుర మీద దండయాత్ర చేశాడు. ఓడిపోయి తిరిగి మగధకి వెళ్ళిపోయాడు. అయినా తన పగను మర్చిపోలేదు జరాసంధుడు. మరలా యుద్ధానికి వచ్చాడు. మరలా ఓడిపోయాడు. ఇలా 17 సార్లు శ్రీకృష్ణుడి మధురమీద దండయాత్ర చేశాడు జరాసంధుడు.

శ్రీకృష్ణులవారికి కూడా విసుగొచ్చింది. యాదవ సామ్రాజ్య ప్రజలు అభద్రతాభావంతో కాలం వెళ్ళదీస్తున్నారని గ్రహించాడు. ఏ రాజ్యంలోనైనా ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండటమే కాదు. ధైర్యంగా ఏ భయం లేకుండా నిశ్చింతగా ఉండాలి.

ఈ నిశ్చింత రాజే కల్పించాలని శ్రీకృష్ణుడు అనుకున్న మరుక్షణం తన రాజధానిని మార్చాలనే నిర్ణయం తీసుకుని ఓ సుముహూర్తాన తన రాజ్యప్రజలతో సౌరాష్ట్ర (గుజరాత్) సముద్రతీరానికి చేరుకుని విశ్వకర్మని ప్రార్థించాడు. విశ్వకర్మ ప్రత్యక్షంకాగా గోమతినది ఏడు పాయలుగా చీలి రత్నాకర్ సముద్రంలో (అరేబియా సముద్రం – Gulf of Kutch) కలిసే ప్రాంతాన్ని చూపించి ద్వారకను నిర్మించి ఇవ్వమని అడిగాడు శ్రీకృష్ణుడు.

విశ్వకర్మ మందహాసంతో 'నీకు బంగారు ద్వారకనే నిర్మించి ఇస్తాను కృష్ణా', కాని నువ్వు చూపించిన స్థలం అనువయినది కాదు. సముద్ర నారాయణుడ్ని అడిగి ఈ సముద్రం మధ్య 12 యోజనాలు తీసుకోమని చెప్పి అదృశ్యమయ్యాడు విశ్వకర్మ.

శ్రీకృష్ణులవారు సముద్రనారాయణుడ్ని ప్రార్థించగా ఆయన ప్రత్యక్షమై సముద్రం మధ్య అంటే తీరానికి దూరంలో సముద్రం మధ్య, అంటే తీరానికి దూరంలో సముద్రం మధ్య 12 యోజనాల భూమిని లంకలా తేల్చి శ్రీకృష్ణులవారికిచ్చారు.

ఆ వెంటనే విశ్వకర్మ కేవలం బంగారం, రత్నాలు, వజ్రాలు, పచ్చలు. వెండితో అత్యంత సుందరమైన శతృదుర్భేధ్యమయిన ద్వారకా నగరాన్ని నిర్మించి ఇచ్చాడు. ఆ వెంటనే శ్రీకృష్ణులవారు ముందుగా సముద్ర నారాయణుడికి గుడి నిర్మించి తన భక్తిని చాటుకున్నాడు. ఇది మహాభారతం మౌసల పర్వంలో వివరించబడింది.

శ్రీకృష్ణుడు అడగ్గా సముద్ర నారాయణుడు ఒడ్డు నుంచి సముద్రాన్ని 12 యోజనాలు వెనక్కి తీసుకోగా బైటపడిన భూమిపై మయుడు ద్వారకని నిర్మించి శ్రీకృష్ణుడికి ఇచ్చాడనేది రంగనాథ్‌రావ్‌గారు తన గ్రంథంలో రాశారు. ఏదేమైనా శ్రీకృష్ణులవారికి ఇష్టమైన నగరాలు మూడు ద్వారక, మధుర, బృందావనం. ద్వారక ఒక నగర దేశం (City State).

ఉత్తరం సంకోధర నుంచి దక్షిణంలో ఓక్‌మడి వరకు, తూర్పున పిండాతవరకు, 30 నుంచి 40 మీటర్ల ఎత్తున విశాలమైన కొండలమీద ద్వారక విస్తరించి ఉండేదని మౌసలపర్వం చెబుతోంది. గోమతి తీరాన ఇప్పుడు ఉన్న ద్వారక ఎనిమిదవది.

ఏడు విభాగాలుగా నిర్మించబడిన ద్వారక ఆ నగరం చుట్టూ శత్రుదుర్భేధ్యమయిన ఎత్తయిన గోడ నిర్మింపబడింది. తీరభాగం నుండి నగర వాకిలి వరకు రహదారి ఏర్పరిచారు. ఈ దారితప్ప నగరప్రవేశానికి మరో మార్గంలేదు. కోటలు, పేటలు అన్నీ లోపలే.

నగరాన్ని పరివేష్టించి ఉన్న గోడవెంట సైనికుల గస్తీ ఉండేది. సముద్ర మార్గంగా వచ్చి ఎవరు దాడి చేయాలన్నా వారి రాక ముందే తెలిసిపోయేది. ఆ విధంగా జరాసంధుని దాడులనుండి తన ప్రజలకు రక్షణ కల్పించాడు కృష్ణుడు" వివరించాడు చరక్.

"ఇంతకీ ద్వారక ఎందుకు మునిగిపోయిందో చెప్పలేదు" అంటూ గుర్తుచేశాడు రామాచారి.

"శత్రు దుర్భేధ్యంగా ఉండేందుకు కృష్ణపరమాత్మ తనకోసం, తన యాదవ ప్రజలకోసం స్వీయ వాస్తు ప్రకారం నిర్మించుకున్న నగరం అది. నగర నిర్మాణం జరిగిన స్థలానికి యజమాని సముద్రుడు.

దానికి లీజు గడువు శ్రీకృష్ణుడు అవతారం చాలించనంతవరకే. ఆయన అవతారం చాలించడంతో గడువు ముగుస్తుంది. లీజు కాలం అయిపోవడం వల్ల సముద్రుడు తన భూభాగాన్ని వెనక్కి తీసుకుంటాడు.

అంటే ద్వారక మునిగిపోతుంది. ఆ విషయం కృష్ణునికి తెలుసు గాబట్టి ముందే కొందరిని హెచ్చరించి ఉంచాడు.

శ్రీకృష్ణుని నిర్యాణం జరిగిన వారం రోజులకు సముద్రుడు తనిచ్చిన స్థలాన్ని చిన్నగా వెనక్కి తీసుకుంటూ ద్వారకను ముంచేశాడు. ఆ మరుసటి రోజు నుంచి కలియుగం ఆరంభమైంది. కొన్ని పురాణాల్లో కృష్ణుడు అవతారం చాలించిన రోజునుంచే కలియుగం ఆరంభమైనట్టు చెప్పబడింది. తన కోసం తనే కొన్ని వాస్తుదోషాలతో కృష్ణుడు నిర్మించుకున్న నగరం ద్వారక."

"మరి ద్వారక స్థలాన్ని సముద్రుడు వెనక్కు తీసుకున్నాడని అంటున్నావు సరే. కాని ఆ సమయంలో గొప్ప సునామీ ఏర్పడి రాక్షస అలలు దాడిచేసి నగరాన్ని ముంచేశాయంటారే."

"మౌసల పర్వంలో ద్వారక నీటమునిగిన సంఘటనను అర్జునుడు వర్ణిస్తాడు. ఆ విషాద సంఘటనకు అతను ప్రత్యక్ష సాక్షి. తీరాన్ని తాకి వెనక్కి

పోయే అలలతో కూడిన సముద్రం ఒక్కసారిగా తన ప్రకృతి ధర్మం వదిలి చెలియలికట్టను దాటి ద్వారక నగర వీధుల్లోకి ప్రవేశించింది. అందమయిన నగర వీధుల వెంట సముద్రజలం పొంగిపొరలుతోంది.

నగరములోని కోటలు, పేటలు సుందరమైనవన్నీ నీట మునిగి పోతున్నాయి. ఒకదాని వెంట ఒకటిగా నీట మునిగిపోతున్న అందమైన కట్టడాలను చూస్తున్నాను. కొన్ని ఘడియలు కాలవ్యవధిలోనే అంతా ముగిసిపోయింది. ద్వారక జలగర్భంలోకి వెళ్ళిపోయింది. ద్వారక ఇప్పుడు తన పెద్ద తటాకంలా కన్పిస్తోంది.

నగరం ఆనవాళ్ళనేవి ఎక్కడా అగుపించడంలేదు. ఇక శ్రీకృష్ణుని ద్వారకా నగరం అనేది ఒక పేరు, ఒక జ్ఞాపకం మాత్రమే అని అన్నాడు అర్జునుడు. ద్వారక మునుగుతుండగానే అర్జునుడు శ్రీకృష్ణుడి మనవడ్ని తనతో హస్తినాపురానికి తీసుకువెళ్ళాడు.

ద్వారక మునిగిపోవడానికి ప్రత్యక్ష సాక్షులు అర్జునుడు ఒక్కడే కాదు, కృష్ణుని అష్టభార్యలు, ఆయన కొడుకులు, మనుమలు, ఇంకా యాదవులు అంతా చూశారు. నగరాన్ని ఖాళీచేసి కాందిశీకుల్లా బయటి కొచ్చారు వారంతా. కళ్ళముందే ద్వారక మునగడం చూస్తూ కొందరు గొల్లున ఏడ్చారు.

కొందరు తెలివితప్పి పడిపోయారు. ఆ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అర్జునుడు. రాక్షస అలలు విరుచుకుపడి ద్వారకను ముంచేశాయని చెప్పలేదు, పడవలోకి నీరు ప్రవేశించే కొద్దీ అదెలా పూర్తిగా మునిగిపోతుందో అలా సముద్రజలం నగరవీధుల్లో ప్రవహించిందన్నాడు.

అంటే ఏమిటి? సముద్రంలోంచి ఒక దీవిగా పైకి తేలివున్న భూభాగం తిరిగి కృంగిపోవడం ఆరంభించగానే పళ్ళెంలోకి నీరు ప్రవేశించినట్టు నగరం మీదకు నీరు దూసుకువచ్చింది.

అంటే నగర నిర్మాణం కోసం పైకిలేపి అందించిన భూభాగాన్ని తిరిగి సముద్రుడు లోనకు తీసుకోవడంతో నగరం జలసమాధి అయింది. ఆ సంఘటనలో మునిగింది ద్వారకమాత్రమే. వేరే ఏ దుర్ఘటనా జరగలేదు" ఆగాడు చరక్.

"ప్రామాణికం అంటూ ఏమీ చెప్పలేనుగాని ద్వారక మునిగిన సమయంలో ఒక జలప్రళయం ఏర్పడిందని, సముద్రం రాక్షస అలలతో ఉత్తర తీరంవైపు విరుచుకుపడిందని, కెరటాలు హిందూ కుష్ పర్వతాల వరకు ఎగసి దూసుకు వెళ్ళాయని, దాని ఫలితంగా అలలవెంట ఎగసివచ్చిన ఇసుక తీర భూములమీద మేటలు వేసి ఎడారిగా మార్చేసిందని విన్నాను.

అంతవరకు పచ్చగా కళకళలాడే అక్కడి దేశాలు మరు భూములుగా మారిపోయాయట. ఆ సమయంలో ఇసుకమేటల కింద కప్పబడి సరస్వతీ నది అంతర్వాహినిగా మారిందని ఆ నదీతీర నగరాలు, గ్రామాలు నాశనమయ్యాయని అంటారు. మరి ఈ విషయం కరక్టు కాదంటావా?"

"మీరు చెప్పే జలప్రళయానికీ ద్వారక మునిగిపోవడానికీ ఎలాంటి సంబంధం లేదు. ద్వారక నిశ్శబ్దంగా సముద్ర జలాల్లోకి కృంగిపోయింది. ద్వారక మునిగిన పదిపన్నెండేళ్ళ తర్వాత మీరు చెప్పిన ఒక జలప్రళయం సంభవించి వుంటుంది.

కలియుగారంభ కాలంలో సరస్వతీనది భూమిపైనే ప్రవహించే దనటం నిజం. ఈ నదీ ప్రవాహంలో అనేక సరస్సులు ఏర్పడటం చేత ఇది సరస్సుల నదిగా పేరుపొందింది.

ఈ నదీప్రస్తావన చివరిగా మనకు మహాభారతంలో కన్పిస్తుంది. ఉదాహరణకి తీర్థయాత్రా సమయంలో పార్థుడు సరస్వతీ నదీతీరంలోని అనేక నగరాలు, పుణ్యక్షేత్రాలు దర్శించినట్టు చెప్పబడింది.

అలాగే కురుక్షేత్ర సంగ్రామ కాలంలో... సంగ్రామం అంటే గుర్తు వచ్చింది అతిరథ మహారథులు, మహాయోధులు పాల్గొన్న ఆ మహాసంగ్రామంలో పాల్గొనని మహావీరులు ఇద్దరున్నారు. వారెవరో చెప్పగలరా?"

"నాకు తెలిసి బలరాముడు యుద్ధరంగానికి వెళ్ళలేదు. రెండో వీరుడు ఎవరో తెలీదు" అన్నాడు.

"రెండోవాడు బభ్రువాహనుడు. అర్జునుడికి నాగకన్య ఉలూచికి పుట్టినవాడు. మహావీరుడు. పాండవ పక్షాన యుద్ధంచేసి కౌరవుల్ని ఓడించాలని ఎంతో ఆశపడ్డాడు. కాని ఎవరూ అతన్ని తమపక్షాన యుద్ధం చేయమని ఆహ్వానించలేదు.

చిన్నప్పుడే అతడ్ని అర్జునుడు తన మామగారైన నాగరాజుకు దత్తత ఇచ్చేశాడు. దత్తు వెళ్ళినవాడు పిలవటం ధర్మంకాదని ధర్మరాజు పిలవలేదు. వాళ్ళే పిలవనప్పుడు మనం పిలవటం బాగుండదని దుర్యోధనుడూ పిలవలేదు.

అలా బభ్రువాహనుడు యుద్ధక్షేత్రంలోకి రాలేదు. ఇక బలరాముడు కురుపక్షపాతి. శిష్యుడు దుర్యోధనుడు అంటే అభిమానం.

యుద్ధ రంగంలో ప్రవేశిస్తే కౌరవపక్షాన యుద్ధం చేయాలి. కాని అక్కడ తమ్ముడు కృష్ణుడు పాండవ పక్షాన ఉన్నాడు. కాబట్టి ఆయన కూడా యుద్ధానికి దూరంగా ఉన్నాడు. ఆ సమయంలో బలరాముడు తీర్థయాత్రలు చేస్తూ అయనకూడా సరస్వతీ తీర పుణ్యక్షేత్రాలను దర్శించినట్టు చెప్పబడింది.

మహాభారతం ప్రకారం కురుక్షేత్ర సంగ్రామం తర్వాత ముప్పై సంవత్సరాలకు ద్వాపరయుగం ముగిసి కలియుగం ఆరంభమైంది.

ద్వారక మునిగినప్పుడుగాని, శ్రీకృష్ణ నిర్యాణానంతరంగాని సరస్వతీ నది భూమిపైనే ప్రవహించింది. సందేహం లేదు. కలియుగారంభంలో అభిమన్యుడి కొడుకైన పరీక్షిత్తు మొదటి ప్రభువు.

పట్టాభిషేకం జరిగిన ఆరు మాసాలకు తక్షకుడనే పాముకరిచి మరణించగా ఆయన కొడుకు ఏడేళ్ళ వయస్సు బాలుడు జనమేజయుడ్ని రాజుగా ప్రకటించారు. జనమేజయుడు యుక్తవయస్కుడై పట్టాభిషిక్తుడయ్యాక తన తండ్రి మరణానికి కారణమయిన నాగులమీద ప్రతీకారంతో సర్పయాగం చేశాడు.

ఈ యాగానికి వ్యాసులవారు వందలాది మంది ఆయన శిష్యులూ వచ్చారు. ఆ యాగానంతరం వ్యాసులవారు భవిష్యత్తరాలకోసం మహాభారతాన్ని భాగవతాన్ని రాయగా ఆయన శిష్యులు అష్టాదశ పురాణాల్ని రాసి లోకానికి అందించారు. కలియుగారంభకాలంనాటి సంఘటనలు ఇవి.

జలప్రళయం ప్రస్తావన మనకి పురాణాల్లో కనిపిస్తుంది. కాబట్టి కలియుగం ఆరంభమయిన పదిపన్నెండేళ్ళకు భూమిపైన అనేక చోట్ల జలప్రళయాలు సంభవించాయని చెప్పుకోవచ్చు.

అంటే జనమేజయ మహారాజుకి సుమారు ఇరవై సంవత్సరాల ప్రాయం ఉండగా లోకాన్ని అతలాకుతలం చేసిన జలప్రళయాల్లో ఒకటి.

అరబ్బు కడలిలో సంభవించి అది ఉత్తర భూభాగాల దేశాలపైన విరుచుకుపడి ఆప్రాంతాన్ని మరుభూములుగా మార్చేసింది. అప్పుడే సరస్వతీ నదికూడా అంతర్వాహినిగా మారిపోయింది.

మయాన్ జాతివారి లాంగ్ క్యాలెండర్ కూడా ఈ విషయాన్నే ధృవపరుస్తోంది. ఆ కాలంలో అమెరికాలో కూడా జల ఉత్పాతాలు సంభవించాయి" అంటూ వివరించాడు చరక్. రామాచారి మరో సందేహాన్ని బయటపెట్ట బోతుండగా లోపల్నుంచి వచ్చిన ఆయన భార్య కావేరి అడ్డుకుంది.

"తమ్ముడూ, ఆయనతో కూర్చుంటే టైమ్ కూడా తెలీదు. లోపల శుశ్రుత ఎదురుచూస్తోంది. వెళ్ళి భోంచేయండి. మేం తర్వాత భోంచేస్తాం. బయటికి వెళ్ళాలంటోంది శుశ్రుత...." అంటూ చరక్‌ను లోపలకు పంపించేసింది. చరక్, శుశ్రుతలు భోంచేసి సినిమాకు బయలుదేరి వెళ్ళిపోయారు.

"ఇంతకీ అబ్బాయి వివరాలడిగి తెలుసుకున్నారా లేదా." భోంచేస్తూండగా భర్తకు గుర్తుచేసింది కావేరి. అసలు విషయం వదిలేసిన సంగతి అప్పటికిగాని రామాచారికి గుర్తురాలేదు.

"అరరే. ఆ సంగతే మర్చిపోయాను సుమా. సాయంత్రం వస్తారుగా, అడుగుతాలే...." అన్నాడాయన.

"అప్పుడు మీరు గుడిలో ఉంటారాయె... వచ్చే ఆదివారమన్నా వివరంగా కనుక్కోండి...." అని హెచ్చరించింది కావేరి.

* * * * *

"ఆచార్యా! ఇక్కడొక రామచిలక అనుమానాస్పదంగా సంచరిస్తోంది గమనించారా?" చిన్నగా అగ్నివేశాచార్యుడి పక్కకొచ్చి లోగొంతుతో అడిగాడు డాక్టర్ పిల్లా ముకుందపాత్రుడు.

మొన్న జరిగిన సంఘటన ఆయన ఇంకా మర్చిపోలేదు. ఈ విషయాన్ని తండ్రి గోవిందపాత్రుడితో కూడా చెప్పాడు. ఆయనకూడా ఈ విషయాన్ని ఆచార్యుడి దృష్టికి తీసుకువెళ్ళటం మంచిదన్నాడు.

ముకుందపాత్రుని మాటలకు అగ్నివేశాచార్యుడి భృకుటి ముడిపడింది. "ముకుందా... ఏమంటున్నావ్? రామచిలకా!" అని అడిగాడు.

"అవును ఆచార్యా" అంటూ లోగొంతుతో జరిగిందంతా వివరించాడు ముకుందపాత్రుడు.

ఈ రోజు కాలనాళిక యంత్రానికి రెండో విడత స్వర్ణజలం పూత యిస్తున్నారు. అంతా ఆ గదిలోనే ఉన్నారు. పైన వెంటిలేటర్‌లో నక్కి కూర్చుని తొంగి తొంగి చూస్తూ అక్కడి పనుల్ని గమనిస్తోంది చిలక.

ఇవాళ కూడా దాని ఉనికిని చేష్టల్ని గమనించాకే ఈ విషయాన్ని ఆచార్యుడి దృష్టికి తీసుకువచ్చాడు ముకుందపాత్రుడు. ఆ మాటలు విన్నాక చూసీచూడనట్టుగా తనూ వెంటిలేటర్ వైపు దృష్టి సారించాడు ఆచార్యుడు. చిలక కన్పించింది.

ఇది అసాధారణ విషయంగానే తోచింది ఆచార్యుడికి. బయట అడవిలో ఎన్నో పక్షిజాతులున్నాయి.

తమ స్థావరంలోని చెట్లకొమ్మల మీదే సంచరిస్తాయి. కాని అవేమీ ఇలా లోనకు రావటం అరుదు. ఏదన్నా పొరపాటున వచ్చినా వెళ్ళిపోతాయిగాని లోన తిష్టవేసుకుని తమ చర్యల్ని పరికించవు. పూజలో కూర్చుంటేగాని ఈ చిలక గొడవ ఏమిటో తెలీదు.

"మీరంతా మీమీ పనుల్లో ఇక్కడే ఉండండి. చిలకజోలికి పోవద్దు. నేను కాస్సేపు పూజామందిరంలోకి వెళ్ళొస్తాను" అని చిన్నగానే చెప్పి అక్కడి నుండి బయటికి వచ్చి నేరుగా పూజామందిరంలోకి చేరుకున్నాడు. హోమాన్ని రగిల్చి సాంబ్రాణి పొగవేసి ధ్యానంలో కూర్చున్నాడు.

పరకాయ ప్రవేశ విద్యతో చిలక శరీరాన్ని ఆశ్రయించి వెంటిలేటర్‌లో కూర్చుని గమనిస్తున్న మాంత్రికుడు మరిడి సోమయ్య శిష్యుడు మృణాళుడు ముకుందపాత్రుడు ఏదో చెప్పటం, అగ్నివేశాచార్యుడు అక్కడి నుండి బయటకు వెళ్ళటం అంతా చూస్తూనే ఉన్నాడు. ఏమైంది? ఆచార్యుడు ఎందుకు బయటికెళ్ళాడు? తనను గమనించి ఉంటాడా?

"వెళ్ళిపో...! కాస్సేపు బయట చెట్లకొమ్మల మీదకు పోయి తిరిగిరా, ఏదో ప్రమాదం ముంచుకురాబోతున్నట్టుంది. బయటకు పో" అంటూ మనసు తొందరచేయనారంభించింది.

అయినా అక్కడ్నుంచి కదల్లేదు మృణాళుడు. తన వద్దా మంత్రశక్తులు న్నాయన్న ఒక అహంకారం ఆ చిలకను అక్కడ్నుంచి వెళ్ళకుండా ఆపేసింది.

ఆచార్యుడు తిరిగివస్తే అప్పుడు చూద్దాంలే అనుకుంటూ మనసు హెచ్చరికల్ని పక్కనపెట్టి వెంటిలేటర్‌లోనే కూర్చుంది. ఈ లోపల – పూజగదిలో ధ్యానంలో కూర్చున్న అగ్నివేశాచార్యుడికి ఆ చిలక ఏమిటో మనోనేత్రంలో తెలిసిపోయింది.

ముకుందపాత్రుడి సందేహం నిజమయింది. శిష్యుడు విళంబి ఆత్మను పంపించి భంగపడ్డా ఆ నీచుడు మరిడి సోమయ్యకు బుద్ధిరాలేదు.

ఈ సారి మరో శిష్యుడిని పరకాయ ప్రవేశశక్తితో చచ్చిన చిలుకలో ప్రవేశపెట్టి అంపకం చేశాడు.

ఈ సారి కాస్త గట్టిగా బుద్ధి చెప్పకపోతే వీళ్ళని ఆపటం కష్టం. తమ ప్రయోగాలు తుది దశకు చేరుకుంటున్న ఈ దశలో దృష్టిని అటు మళ్ళించి శత్రువ్యూహాల్ని కనిపెట్టడం కష్టం. ఇక వీళ్ళను ఉపేక్షించటమో, క్షమించటమో క్షేమం కాదు.

అగ్నివేశాచార్యుడి కళ్ళలో అశాంతి పొడచూపింది. అంతే– సగం కాలిన ఒక సమిధను హోమాగ్నిలో నుంచి బయటకు తీశాడు. దాన్ని అభిమంత్రించి వదలగానే ఎవరో పట్టుకున్నట్టు ఆయనకు అభిముఖంగా గాల్లో నిలబడిందది.

జాన పొడవు ఉండి ఒక చివర కణకణ మండుతున్న నిప్పు ఎర్రగా చూస్తోంది.

"పో... ఆ చిలుకలోంచి వాడు తప్పుకొనకముందే కాల్చి బూడిద చేసెయ్. ఆ దుష్టుడ్ని వదలక. వెళ్ళూ" అంటూ ఆజ్ఞాపించాడు అగ్ని వేశాచార్యుడు.

మరుక్షణం సమిధ కణకణ జ్వలిస్తూ పైకి వదిలిన తారాచువ్వలా రివ్వున పూజామందిరం నుంచి బయటకు దూసుకెళ్ళింది. అది పగబట్టిన ఆగ్నేయాస్త్రంలా కాలనాళిక ఉన్న గదిలోంచి వెంటిలేటర్‌వైపు సాగింది. చేస్తున్న పనులు ఆపి ఆశ్చర్య సంభ్రమాలతో పైకి దూసుకువెళ్తున్న సమిధను గమనించారంతా.

అందరికన్నా ముందుగా గమనించింది వెంటిలేటర్‌లోని రామచిలుక. గురిపెట్టి వదిలిన బాణంలా తనవైపు ఎగసివస్తున్న సమిధను చూడగానే చిలుక శరీరంలోని మృణాళుడికి మతిపోయింది.

అది ఏ మంత్రమో, ఏ తంత్రమో, ఏ ప్రభావంతో ఆ సమిధ తానుగా తనవైపు వస్తోందో అర్థంకాలేదు గాని అది తనను తాకిన మరుక్షణం చిలక శరీరంతోపాటు తనూ కాలిపోతాడని అర్థమైంది.

అలాగని చిలుక శరీరం నుంచి తప్పుకుందామంటే ఇప్పటికిప్పుడు మరో చచ్చిన జీవి శరీరం ఎక్కడ దొరుకుతుంది? అయినా కూడా తనకు తెలిసిన ఒకటి, రెండు మంత్రశక్తుల్ని ప్రయోగించి ఆ సమీధను అడ్డుకోవాలని చూశాడు.

ఆ ప్రయోగాన్ని తిప్పికొట్టే శక్తి తనకు చాలదని అర్థమైపోయింది. గాలిలో కొద్దిసెకన్లు ఆగినట్టే ఆగి తిరిగి ఆ సమిధ ముందుకు కదలగానే దివ్వున లేచి వెంటిలేటర్ నుండి బయటగాల్లోకి ఎగిరిపోయాడు. అంతా క్షణాల్లో జరిగి పోయింది.

మేగ్నెటిక్ మిస్సైల్ టార్గెట్‌ను వెంబడించినట్టుగా చిలుక వెంటపడింది పొగలు చిమ్ముతున్న సమిధ. అది తనను వదిలేలా లేదని అర్థంకాగానే పై ప్రాణాలు ఎగిరిపోయినంత పనైంది మృణాళుడికి.

రెక్కలలోని శక్తినంతా ప్రయోగిస్తూ దిక్కులుపట్టి ఎగిరిపోసాగాడు. అయినా ఆ సమిధను వదిలించుకోవటం అంత సులువుగా కన్పించలేదు.

క్రమంగా ఆచార్యుడి స్థావరం నుండి దూరంగా చాలా దూరం వచ్చేశాడు. అంతకంతకూ సమిధ తనను సమీపించటం మృణాళుడిలో ఆందోళన ఒక్కసారే వందరెట్లు పెరిగిపోయింది.

ఈ ప్రమాదం నుంచి బయటపడాలంటే అర్జంటుగా చిలుక శరీరాన్ని వదిలేసి– మరో శరీరంలోకి వెళ్ళిపోవాలి. మనసు హెచ్చరికల్ని లెక్క చేయకుండా అక్కడే కూర్చుని ఎంత తప్పు చేశాడో ఇప్పుడు అర్థమవుతోంది.

"భళారే ఆచార్యా! నీ శక్తి యుక్తులు ఆమోఘం. నన్ను గమనించి కూడా గమనించని చందాన బయటికెళ్ళి ఈ సమిధను ప్రయోగించి నా ప్రాణం మీదికి తెచ్చితివే. ఇప్పుడేమిటి దారి నాకు.

ఈ ప్రమాదం నుంచి నా గురువు నన్ను బయట పడేయగలడేమో, కాని యమపాశంలా వెంటబడిన ఈ సమిధనుంచి తప్పించుకొంటూ–

వందల మైళ్ళ దూరంలోని నీలోదరి కొండగుట్టను చేరుకోవటం అసాధ్యం. కాబట్టి వెనక్కిపోయి అగ్ని వేశాచార్యుడి కాళ్ళమీద పడి శరణు వేడుకుంటే ప్రాణాలు దక్కుతాయేమో, అంత పనిచేసి గురుద్రోహం చేయలేడు. నాకేమిటి దారి?"

వినువీధిలో రివ్వున ఎగురుతూనే పరిపరివిధాలా ఆలోచిస్తున్నాడు మృణాళుడు. ఏదన్నా మృతకళేబరం కన్పిస్తుందేమోనన్న ఆశతో అడవిమీద సాగుతూనే దిగువకు పరికిస్తూనే వున్నాడు.

అంతలో అతడి అదృష్టమా అన్నట్టుగా దిగువన ఒక సెలయేటి పక్క బీడులో చచ్చిన అడవి కుక్క శరీరం ఒకటి కన్పించింది. దాన్ని చూడగానే మృణాళుడుకి ప్రాణం లేచివచ్చినట్టయింది.

అంతే – ఇంక ఏమీ ఆలోచించకుండా ఎగురుతున్నవాడు ఎగురుతున్నట్టే చిలుక శరీరంలోంచి తప్పుకుని పరకాయ ప్రవేశ విద్య ద్వారా శునక శరీరంలోకి వెళ్ళిపోయాడు మృణాళుడు.

ఎప్పుడైతే అతను తప్పుకున్నాడో చిలుక మృతదేహం గిరికీలు కొడుతూ నేలకు జారుతూండగా కణకణ మండుతున్న సమిధ రివ్వున వచ్చి దాన్ని తాకింది.

తాకిన మరుక్షణం చిలుక శరీరం భగ్గునమండి బూడిదై గాల్లో కలిసిపోయింది. దానితోపాటు సమిధ నేలకు జారి సెలయేటి నీటిలో పడి ఆరిపోయింది. అంతటితో సమిధ ప్రయోజనం ముగిసింది. శునక శరీరంలో చేరి ప్రాణాలు దక్కించుకున్న మృణాళుడు బ్రతుకు జీవుడా అనుకుంటూ లేచి నిలబడ్డాడు. చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయింది అతడికి.

చివరి క్షణంలో చిలుక శరీరంలోంచి బయటపడకుంటే దాంతోపాటు తన ఆత్మకూడా ఉనికి కోల్పోయేది. తను చేరిన శునకం రెండు వర్ధాల అడవి కుక్కల దాడిలో చనిపోయి ఉండాలి.

అది ఉదయమే జరిగివుండాలి. శరీరం బలంగానే వుందిగాని గాయాలు మంట పుట్టిస్తున్నాయి.

బాధకు తట్టుకోలేక కాస్సేపు వాగునీటిలో ఈతకొట్టి ఒడ్డెక్కాడు. ఒక చెట్టునీడన కూర్చుని తన పరిస్థితిని అంచనా వేసుకున్నాడు. ఇప్పుడేం చేయాలి? మృణాళుడి ముందున్న ప్రశ్న ఇది.

ఎలాగూ తప్పించుకున్నాడు కాబట్టి మరోసారి వెనక్కి ఆచార్యుడి స్థావరానికి వెళ్ళటమా, ధైర్యం చాలటములేదు... జరిగిందానికే ప్రాణాలు పాదాలలోకి వచ్చాయి.

అదృష్టం ఉండబట్టి తప్పించుకోగలిగాడు గాని లేదంటే తన ఉనికి కోల్పోయేవాడు. మరోసారి వెళ్ళేంత ధైర్యం లేదు. వెనక్కి తిరిగి నీలోదరి గుట్టకు వెళ్ళిపోవటం మంచిది. అయితే శునక శరీరంలో ఉండి వెళ్ళాలంటే నెలతిరిగినా చేరుకోలేడు.

ఏదో పక్షి శరీరాన్ని ఆశ్రయించుకొని ఆకాశమార్గంలోనే ప్రయాణం చేయాలి.

శునకంగా తిరుగుతూ అడవిలో వెదుకులాడుతున్న మృణాళుడికి పొద్దు పడమరవాలే వేళకి చచ్చిన కొంగ శరీరం ఒకటి పొదల్లో కనిపించింది.

చచ్చికూడా ఎక్కువసేపు అయివుండదు. తక్షణం శునక శరీరాన్ని వదిలి కొంగ శరీరంలోకి పరకాయ ప్రవేశం చేసి రివ్వున గగనమార్గానికి ఎగిరాడు.

మబ్బులవెంట ఈశాన్య దిశగా శరవేగంతో నీలోదరి గుట్టకు ఎగిరి పోనారంభించాడు.

* * * * *

మున్నలూరి వారి అగ్రహారం.

ఉదయం ఎనిమిదిగంటల ప్రాంతం. రాత్రి కొద్దిగా వానపడింది. తెల్లవారేసరికి పొగమంచుతో వాతావరణం చలిచలిగా ఉంది. ఊరంతా ప్రశాంతంగా ఉంది. పూలు కోస్తున్న దేవమ్మగారి వద్దకు బిరబిరా వచ్చి తనూ పూలు కోయనారంభించింది మనుమరాలు శ్రావణి.

చరక్ ఆవిడకు కొడుకు కొడుకు. మనవడైతే, శ్రావణి కూతురు కూతురు, మనమరాలు, చరక్‌కి మరదలవుతుంది. విరిసీ విరియని గులాబీలా లంగా, ఓణీలో చందనపు బొమ్మలా ఉంది శ్రావణి.

మనమరాలి వరస చూడగానే ఏదో కోపంలో ఉందని అర్థమయి పోయింది దేవమ్మగారికి. "ఏమిటే పొద్దుటే ఇలా వచ్చావ్?" అని అడిగింది దేవమ్మ.

"ఏం లేదు" అంది పొడిగా.

"ఏదో ఉందని నీ బుంగమూతే చెపుతోంది. ఎవరితో పోట్లాడి వచ్చావ్?" అంది.

"అదేం లేదు."

"మరేంటో చెప్పు."

"రాత్రి బావ కల్లోకి వచ్చాడు."

"వచ్చి? నీ జడ లాగాడా బుగ్గగిల్లాడా! ఏమంటాడేం?" తనూ సరదాగా అడిగిందావిడ.

శ్రావణి నెత్తి కొట్టుకుంది. "అయ్యో, అంత అదృష్టము కూడానా? ఇంకో పిల్లతో చెట్టాపట్టాలేసుకు తిరుగుతున్నట్టు కలొచ్చింది."

"తిరగనీ. నీకేమిటే బాధా?"

"బాధ కాదా? మరి నా సంగతేమిటి?"

"ఏయ్. నీ వయసు పదహారు. వాడి వయసు పాతికేళ్ళు, సుమారు పదేళ్ళ వ్యత్యాసం. ఐనా నీకింకా పెళ్ళీడు రాలేదు. వాడి మీద కలవరింత లేమిటే. వాడి గురించి ఆలోచన మానేసి బుద్ధిగా చదువుకో."

"వాడు నన్ను ఇష్టపడితే గాని, నా చదువు బుర్రకు ఎక్కదు" అంది.

"ఎందుకు ఎక్కదే. వెధవ్వేషాలు నువ్వాను. వాడు నీ గురించి పట్టించుకోడు. నువ్వు వాడ్ని మర్చిపోవు" కసురుకుంది దేవమ్మ.

శ్రావణి కూడా రోషంగానే చూసింది.

"ఎలా మర్చిపోతాను అమ్మమ్మా. ఇంకో ఐదేళ్ళు ఆగరా మొద్దూ... నాకన్నా నాలుగేళ్ళు ముందు పుడితే చాలన్నాను. వింటేగా! నాకన్నా పదేళ్ళు ముందే పుట్టి నన్నేడిపిస్తున్నాడు దొంగబావ. నాకేం తక్కువ? ఈ క్షణం పెళ్ళి చేస్తే చాలు. చక్కగా కాపురం చేసుకోగలను తెలుసా?" అంది.

"నాకు తెలీదులేమ్మా" అంటూ వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకుంది దేవమ్మ.

అది గమనించి మరింత ఉడుక్కుంటూ...

"ఎందుకా నవ్వు...? పదమూడు, పధ్నాలుగేళ్ళకే ఆ కాలంలో పెళ్ళి చేసుకున్నవాళ్ళు ఎంతమంది లేరు?" నిలదీసింది శ్రావణి.

"ఇదిగో. ఆ కాలం వేరమ్మాయ్. ఇప్పుడు మైనారిటీ తీరకుండా పెళ్ళి చేయటం నేరమని చట్టం ఉంది. నీకు ఇరవై యేళ్ళు నిండితేనే పెళ్ళి అదీ నువ్వు చరక్‌ని ఒప్పించుకోగలిగితే. అనవసరంగా మా మీద నిందలు వేయకు" కోసిన పూలు సజ్జలో పోస్తూ నచ్చచెప్పింది దేవమ్మ. కాని ఆమె మాటలు శ్రావణికి ఏమాత్రం నచ్చలేదు.

* * * * *

ఆదివారం ఉదయం.

ఈ రోజు తొమ్మిదిగంటలకే – గుడికి చేరుకున్నాడు చరక్. అతను వచ్చేసరికి సింపుల్‌గా తయారై గుడి మెట్లమీదే అతడికోసం ఎదురుచూస్తోంది శుశ్రుత.

"ఏమిటిక్కడ కూర్చున్నావ్?" తనూ ఆమె పక్కనే కూర్చుంటూ అడిగాడు చరక్.

"నీకోసమే" అంది.

"అది తెలుస్తూనే వుంది. ఏమిటి విశేషమని!"

"ఇటునుంచి ఇటే మనం బయటికిపోదాం పద"

"లేచిపోదామనా... అంత ఖర్మ మనకేమిటి?"

"ఛ... నా ఉద్దేశం అదికాదు."

"నువ్వు ఇలా అలిగితే నాకు ఏమీ అర్ధంకాదు గాని విషయం సరిగా చెప్పు"

"ఏంది చెప్పేది? నువ్వు మా నాన్నగారితో కూర్చుంటే మీకు టైమ్ తెలీదు. కిందటి ఆదివారం ఉదయం నుండి భోజనం వేళదాకా మీ ముచ్చట్లు సరిపోయాయి. ఇప్పుడేమిట్రా అంటే నీకోసం ఎదురుచూస్తూ ఈ పూట ఇంట్లోనే ఉన్నారాయన."

"మరి గుడిలో పూజాదికాలు?"

"అవన్నీ ముగించి మిగిలిన బాధ్యత ఇంకో పూజారికి వప్పగించి వచ్చేశారు."

"సో... నీ బాధ నాకు అర్థమైంది. మనం బయటికెళ్ళటం లేటవుతుందని ఆలోచిస్తున్నావుగాని మీ నాన్నగారు ఎంత ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారో ఆలోచించటంలేదు. అదీగాక నా వివరాలేవీ ఇంకా మీ వాళ్ళకు చెప్పలేదు" అన్నాడు.

"అయితే ఏం చేద్దాం?"

"నువ్వలా చిన్నబోతే నేను చూసి తట్టుకోలేను డియర్. కాస్త ప్రశాంతంగా ఆలోచించు. మధ్యాహ్నం నుంచి మనకు బోలెడు టైమ్ వుంది చాలదా. ఈ పూట మీ డాడీతో గడిపేస్తాను. వివరాలు చెప్పినట్టూ వుంటుంది, ఆయన సందేహాలు తీర్చినట్టూ ఉంటుంది. సరేనా?" నచ్చచెప్పాడు.

ఆమె ముఖం మాడ్చుకుంది. నవ్వేస్తూ ముఖం తనవైపు తిప్పుకున్నాడు. "శుశ్రుతా! ఆలోచించు. మనకు ఇంకా పెళ్ళికాలేదు. నా వివరాలూ మీ వాళ్ళకి తెలీదు. అయినా నామీద గల నమ్మకంతో నిన్ను వెంట తీసుకెళ్తుంటే వాళ్ళు అభ్యంతరం చెప్పటంలేదు.

చనువిచ్చారు కదాని వాళ్ళని అలక్ష్యం చేయటం, చెప్పకుండా నిన్ను బయటకు తీసుకెళ్ళటం తప్పు కదూ. వాళ్ళ సంతోషం తర్వాతే మన సంతోషాలూ, సరదాలూను. ఓకే? ఇంటికెళ్దాం" అంటూ లేచాడు.

"ఓకే. నువ్వింతగా చెప్తున్నావు కాబట్టి సరే అంటున్నాను. ఎక్కువసేపు సోది పెట్టుకోకుండా త్వరగా ముగిస్తే తొందరగా బయటికెళ్దాం" అంటూ హెచ్చరించి లేచింది శుశ్రుత.

'ది లాస్ట్ సిటీ ఆఫ్ ద్వారకా' చదువుతూ అరుగు మీదే కూర్చునున్నాడు రామాచారి. చరక్‌ను చూడగానే ముఖమంతా నవ్వుపులుముకుంటూ "రావయ్యా చరక్. నీకోసమే ఎదురు చూస్తున్నాను. అలా కూర్చో" అంటూ ఎదురుగా కుర్చీ చూపించాడు.

"ఏమిటి విశేషం?" కూచుంటూ అడిగాడు చరక్. అతనివెంట వచ్చిన శుశ్రుత మౌనంగా లోనికి వెళ్ళిపోయింది.

"ద్వారకమీద జరిగిన పరిశోధనలు సమగ్రం కాదంటూ కిందటి వారం ఒక బాంబుపేల్చి వెళ్ళిపోయి ఇప్పుడు ఏమిటి విశేషమని నన్నే అడుగుతావా?

ఇదేం బాగాలేదు. ఆ వివరాలు నువ్విప్పుడు చెప్పాల్సిందే. నేను వినాల్సిందే" అన్నాడు పట్టుదలగా ఆయన.

"వద్దులెండి. అక్కయ్య వింటే గొడవ చేస్తుందేమో" అన్నాడు మొహమాటంగా చరక్.

అంతలో కాఫీ కప్పులతో ఆవిడే బయటికొస్తూ- "మీరిద్దరూ అసలు మేటర్ వదిలేసి ఏదేదో మాట్లాడితే ఎట్టాతంబీ. ఆయన కబుర్లలో పడితే గుర్తుండదుగాని ఇప్పుడు మీరేం మాట్లాడుకోవాలన్నా ముందుగా నీ వివరాలు చెప్పాల్సిందే" అంటూ చెరో కాఫీ కప్పు అందించింది. విసుగ్గా భార్య వంక చూశాడు రామాచారి.

"ఓసినీ అసాధ్యం కూల. వాళ్ళిద్దరూ ఎలాగూ పీకల్లోతున ప్రేమలో కూరుకుపోయారు. వివరాలదేముంది ఎప్పుడైనా తెలుసుకోవచ్చుగా?" అన్నాడు రామాచారి.

"ఇప్పుడు తెలుసుకుంటే తప్పేందంట? చూడు తమ్ముడూ ఆయన మాటలు పట్టించుకోకు. ఎంతైనా ఆడపిల్లవాళ్ళం. ఆ మాత్రం తెలుసుకోవాలని మాకూ ఉంటుందిగదా?" అంది కావేరి.

"కరక్ట్ అక్కా. బావగారూ ఇంకేం మాట్లాడకండి. ముందుగా నా వివరాలు చెప్తా. ఆ తర్వాత ఎలాగూ మీ సందేహాలు తీరుస్తా. ఓకేనా?" అన్నాడు చరక్.

"తప్పుతుందా. మీ అక్కా తమ్ముడు ఒకటయ్యాక. అలాగే, ముందు కాఫీతాగు" అన్నాడు రామాచారి.

"మా ముత్తాతగారు శ్రీ ధన్వంతరీ అగ్నివేశాచార్యులవారు."

"ఆగాగు...." అంటూ చరక్ మాటలకు అడ్డువచ్చేశాడు రామాచారి. ఆయన ముఖం వెలిగిపోతోంది ఆనందోద్వేగంతో.

"ఎవరు?... మీ ముత్తాత ఎవరు?" అని అడిగాడు రామాచారి నమ్మలేనట్టు.

"మాది మండపేట దగ్గర్లోని మున్నలూరి వారి అగ్రహారం. మా ముత్తాతగారు శ్రీ ధన్వంతరీ అగ్నివేశాచార్యులవారు. ఆయుర్వేద వైద్యులు. ఎన్నో పరిశోధనలు చేసి ఎన్నో వైద్యగ్రంథాలు రాశారు. సకల శాస్త్రాలు చదివిన వేదపండితులు, మనదేశంలోనే శతాధిక వృద్ధుల్లో మొదటివాడాయన.

ఆయన్ని చూసినవారు వయసును జయించిన 'మహర్షి' అంటారు. ఇక మా తాతగారు ఆయుర్వేద చింతామణి శ్రీ వాగ్భటాచార్యులవారు. ప్రస్తుతం ఆయన లేరు. పదేళ్ళక్రితం పరమపదించారు. మా నాయనమ్మ దేవమ్మగారున్నారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా మా కుటుంబాల్లో మంచి చెడులన్నీ ఆవిడే చూసుకుంటుంది. ఆవిడ మాట మాకు వేదవాక్కు.

ఇక మా తండ్రిగారు ధన్వంతరీ ఆర్యభట్టుగారు. తల్లి లక్ష్మీదేవి. అక్క సింధూర, నేను ఇద్దరే సంతానం. అమ్మా-నాన్న అక్కా - బావతోపాటు అమెరికాలోని ఒహియో రాష్ట్రం, క్లీవ్‌లాండ్ నగరంలోని యూనివర్సిటీ హాస్పిటల్స్‌లో ఉంటూ మన ఆయుర్వేదానికి విదేశాల్లో ప్రాచుర్యం తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

నేను పెరిగింది మా నాయనమ్మ దేవమ్మగారి వద్దనే. కాబట్టి ఆవిడ నాకు తల్లి తర్వాత తల్లివంటిది. ఆస్తులు పంచుకున్నా మా కుటుంబాలన్నీ విడిపోలేదు. ఆ ఊళ్ళో సగం మావాళ్ళే ఉంటున్నాం.

ఇంటికి వచ్చిన ఎవరికైనా నాయనమ్మ ఉచితంగా వైద్యం చేసి పంపిస్తుంది. మా కుటుంబాలు అన్నిటికీ మా ముత్తాత అగ్నివేశాచార్యుల వారు గాడ్‌ఫాదర్ లాంటివారు. ఇక ఆస్తిపాస్తుల విషయమంటారా, నేను దారితప్పి వైద్య వృత్తిలో గాకుండా సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడ్డాను. నా జీతం నెలకు నలభైవేలు...."

"చాలు... చాలు... ఇక చాలు బాబూ" అంటూ కళ్ళలో ఆనంద బాష్పాలు చిమ్ముతూండగా చరక్ చేతులు పట్టుకున్నాడు రామాచారి.

మరోపక్క కావేరి కూడా చేష్టలు దక్కి చరక్‌ని సంభ్రమంగా చూస్తోంది. ఆ దంపతులిద్దరికీ నమ్మశక్యంగాని విషయంగా ఉందిది. ఇక గడపలోన ఉన్న శుశ్రుత అయితే షాక్‌తో అలాగే ఉండిపోయింది.

మున్నలూరి అగ్రహారం గురించి, అగ్నివేశాచార్యుల వారి గురించి దేశంలో తెలియనివారెవరు... అంత గొప్ప కుటుంబములోకి చరక్ ద్వారా తను కోడలిగా అడుగుపెట్టనుందా! ఏ జన్మలోని వరం ఇది? ఒడిలో వజ్రాన్ని గుర్తించనట్టు తమతో ఉన్న అతన్ని గుర్తించలేకపోయారు.

"ఇంక ఏమీ చెప్పకు చరక్. నువ్వు అగ్నివేశాచార్యుల వారి ముదిమనవడి వని తెలీగానే మీ కుటుంబ నేపధ్యం అర్ధమైపోయింది. పదిజన్మలెత్తినా మీవంటి సంబంధం నా కూతురికి తేలేను. ఇది శుశ్రుత అదృష్టం. ఆ మహనీయుడు కులాసాయేనా? వారి దర్శనానికి వీలవుతుందా...?" అంటూ ఆనందంతో తల మునకలవుతూ అడిగాడు రామాచారి.

"ప్రస్తుతం వీలుకాదు. ఆయనేవో ఓషధుల వేటలో రంపచోడవరం అడవులలో ఉన్నారు. ఆయన ఇంటికి రాగానే నాకు తెలుస్తుంది. అప్పుడు తప్పకుండా నేను మిమ్మల్ని పరిచయం చేస్తా" అన్నాడు చరక్.

"సంతోషం బాబూ, అమ్మాయితో మీరు బయటికి వెళ్ళాలనుకుంటు న్నట్టున్నారు. భోంచేసి బయలుదేరండి" అని రామాచారి లేవబోతుంటే వారించాడు చరక్. "బావగారు ఇదేం బాగాలేదు" అన్నాడు.

"ఏం బాగాలేదు?"

"అదే. వివరాలు చెప్పగానే నన్నో వి.ఐ.పి.ని చూసినట్టు చూడ్డం. భోజనానికి ఇంకా చాలా టైముంది. మీ మనసులో సందేహాలు తీర్చే వెళతాను. మాట్లాడుకుందాం కూచోండి. అక్కా, నా వివరాలు చెప్పేశాను ఏమన్నా సందేహాలు ఉంటే అడుగు" అన్నాడు నవ్వుతూ.

"తమ్ముడూ ఇది నిజంగా నీ మంచిమనసు. నీలాంటి తమ్ముడు లభించటం నా అదృష్టం. నా కూతురు శుశ్రుత చేసుకున్న పుణ్యం"

"అక్కా, మరీ నన్ను పొగడమాకండి. శుశ్రుత లాంటి అమ్మాయి దొరకటం నా అదృష్టం" అంటూ శుశ్రుత వంక చూశాడు.

ఆమె సిగ్గుపడుతూ లోనకెళ్ళిపోయింది. రామాచారి కల్పించుకుంటూ "సరిసరి సందేహం తీరిందిగా. నువ్వు కూడా వెళ్ళి భోజనం ఏర్పాట్లు చూడండి. అల్లుడుగారూ, నేనూ కాసేపు మాట్లాడుకుంటాం" అన్నాడు భార్య కావేరితో రామాచారి.

"చెప్పండి మీ సందేహం ఏమిటి?" అడిగాడు.

"దర్యాప్తు సమగ్రంకాదని ఎలా అంటున్నావు? అంతటి మేధావులు తప్పు చేస్తారా...!" అన్నాడు రామాచారి.

"తప్పు చేశారని నేను అనటంలేదు. సాధ్యా సాధ్యాలనేవి కొన్ని ఉంటాయి. వారికి సాధ్యమయినంత వరకే చేశారు. అంతకుమించి చేయలేక పోయారంటాను."

"నాకేమీ అర్థంకాలేదు"

"మీరు భారత భాగవతాలు చదివారుగా?"

"రెండు మూడుసార్లు చదివుంటాను"

"అయితే ఓసారి ద్వారక వర్ణన గుర్తుతెచ్చుకోండి"

కళ్ళు మూసుకుని ఆలోచించాడు రామాచారి.

''ఉన్నది ఉన్నట్టు చెప్పలేనుగాని, ద్వారకను ఒక స్వర్ణపురిగా అభివర్ణించారని మాత్రం చెప్పగలను. రాత్రివేళ సౌధాలమీది బంగారుతాపడం–

కాంతులు సముద్రజలాల్లో ఉదయకాంతుల్లా ప్రతిఫలించేవట. రోజుకి మణుగు బంగారాన్ని ఇచ్చే శమంతకమణి కృష్ణుడి వద్ద ఉండగా ద్వారకకు బంగారానికి లోటేముంది?"

"మరి అంతటి స్వర్ణపురి ఏమైంది? అక్కడ మనవాళ్ళు రాళ్ళు రప్పలు తప్ప ఏం సేకరించారు? అక్కడో నగరం సముద్రంలో కలిసిపోయిందనడానికి గుర్తుగా ఓడల లంగరులు – లంగరు గొలుసులు, శిధిలగృహాల పునాదిరాళ్ళు, నగరాన్ని చుట్టి నిర్మించిన గోడల తాలూకు బండరాళ్ళు, ఏవో మట్టిపాత్రలు, లోహపాత్రలు, కొయ్యబొమ్మలు ఇలాంటివేగా – ఇంతకు మించి గొప్ప ఆధారాలేమన్నా దొరికాయా? లేదే"

"దొరకలేదుగాబట్టి అది ద్వారక కాదనా?"

"నా ఉద్దేశం అదికాదు"

"మరేమిటి?"

"ద్వారక మునిగిపోయింది వాస్తవం అనడానికి కొన్ని ఆధారాలను కనిపెట్టారు గాని, అసలు ద్వారక వరకు వారు చేరుకోలేదంటాను. సీ బెడ్ నుండి ఇంకా లోతులో ఆ నగరం కప్పబడివుండాలి.

అపురూపమైన భవంతులు, కోటలు, పేటలు బంగారు తాపడంతో కూడిన కట్టడ శిఖరాలూ అన్నీ భూమి పొరల్లోనే ఉన్నాయి. వీటిని చేరాలంటే చుట్టూ

కంచెకట్టి సముద్రజలాల్ని వేల అడుగులు లోతు బైటకు తోడి మట్టిని తొలగిస్తేగాని సాధ్యపడదు.

మన టెక్నాలజీ అంతవరకు అభివృద్ధి చెందలేదు ఇంకా. కాబట్టి మనవాళ్ళు దొరికినవాటితోనే తృప్తిపడ్డారు. అందుకే దర్యాప్తు సమగ్రం కాదన్నాను" అన్నాడు చరక్.

"అంటే – అసలు ద్వారక వేల అడుగుల సముద్రం అడుగు నుందంటావా?"

"అలకాపురితో సమమైన, అందమైన నగరంగా ఒకచోట వర్ణింప బడిందంటే ఆ నగరశోభల్ని ఊహించుకోవచ్చు. ద్వారక గోమతీ నదీ తీరంలో నిర్మింపబడినట్టు రాశారు. అది సరికాదు."

"అంటే ఆ నదికీ, ద్వారకకూ సంబంధము లేదంటావా?" అడిగాడు.

"సంబంధం ఉంది. కాని నదీ తీరానికీ, ద్వారకా నగరానికీ సంబంధం లేదు అంటాను. తీరానికి మైలుదూరం లోపల సముద్రం మధ్య దీవిమీద నగరం నిర్మింపబడినట్టు మన ఇతిహాసాలు చెపుతున్నాయి. పరిశోధకులూ అది కరక్టని నిర్ధారించారు.

ద్వారకా పట్టణం గోమతీనది సముద్రంలో కలిసే చోటుకి ఎడంపక్కగా మైలు దూరంలో సముద్రం మధ్యలో ఉంది. గోమతీ నదీ తీరంలో ఉన్నది ద్వారక ఓడరేవు మాత్రమే.

అంటే తీరానికి వచ్చే ఓడలు ద్వారక ఉన్న దీవిని చుట్టి గోమతీ తీరంలోని ఓడరేవును చేరుకునేవి.

ఈ ఓడరేవుకు బయట ఎడంగా మెయిన్‌ల్యాండ్ నుండి ద్వారకవరకు బలమైన రాతిగోడలు నిర్మించి వాటి మధ్యన మట్టిపూడ్చి విశాలమయిన రహదారి ఉండేది. ఈ దారికి అటూ ఇటూ ఉన్న రాతిగోడల్ని సముద్ర అలలు తాకిపోయేవి. ఆలమందలు తిరిగినా, రథాలు పరిగెత్తినా, గుర్రాలు దౌడు తీసినా, ప్రజలు రాకపోకలు సాగించినా ఈ రహదారితప్ప ద్వారక నగరంలోకి మరో దారి లేదు.

రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత సైనికులు నగర వాకిలి మూసివేస్తే తిరిగి తెల్లవారుఝామునే తెరిచేవారు. ఈ దారిన సాగిపోయేవారికి కుడిపక్కగా ఓడరేవు అక్కడ లంగరు వేసిన అనేక తెరచాప ఓడలు కనువిందు చేసేవి.

ఈ రేవునుంచి విదేశీ వర్తకం అధికంగా సాగేది. అలాగే విదేశీ నౌకలు కూడా అనేకం వస్తుండేవి.

విదేశీ వర్తకులకు ద్వారకా ప్రాంతం స్వర్గధామంలా ఉండేది. తీరం ఎక్కి కొంతదూరం పోగానే అంతా అటవీ ప్రాంతం. ఆలమందలే కాదు, ఏనుగులు, దుప్పి, లేళ్ళు అనేక వృక్షజాతులు అడవిలో స్వేచ్ఛగా తిరిగేవి. ఇక మన పరిశోధకుల అంచనా ఈ నగరం ఉత్తరాన సుంకోదర (BET DWARAKA) వరకు, దక్షిణాన ఓక్‌మాడివరకు, తూర్పున పిండాతారక అనబడే ప్రాంతంవరకు విస్తరించి వుండేదని, ఇదికూడా సరైన నిర్ణయంకాదు.

నగర బహిర్భాగాలను నగరంతో చేర్చగలమా? జలదుర్గంలాగా ద్వారక ఒక జలనగరి.

చుట్టూ సముద్రం మధ్యలో నిర్మింపబడింది. మెయిన్‌ల్యాండ్‌తో ఒక్క రహదారి తప్ప మరేవిధంగానూ దీనికి సంబంధం లేదు.

మీరు చెప్పే సుంకోదర గాని, ఓక్‌మాడి గాని, పిండాతారక సముద్రతీర భూభాగాలు. వీటిని ద్వారకతో కలిపి చెప్పలేం. ఇక ఓడరేవు ఎక్కడున్నా ఆ పరిసరాల్లో చిన్న ఊరు ఉంటుంది.

సరుకు రవాణాకు లేదా ఎగుమతికి తెచ్చే సరుకుల బండ్లు, వర్తకులు, విదేశీ పర్యాటకులవంటివారి కోసం అక్కడ కొన్ని వసతులు కూడా ఏర్పరచి వుంటారు. కాబట్టి ఓడరేవు ఉన్న సుంకోదర ప్రాంతంలో ఒక గ్రామం అభివృద్ధి చెంది వుండొచ్చు.

అలాగే దక్షిణాన తీరం వెంట మత్స్యకారుల కాలనీలు, చేతి వృత్తులవారి నివాసాలు, అలాగే ఓడలు లేదా పడవల తయారీ మరమ్మతుల కోసం తీరప్రాంతం అభివృద్ధి కావచ్చు.

కాబట్టి తీర ప్రాంతానికి కూడా కలిపి మొత్తం ద్వారకా నగరం అనటం సహేతుకం కాదు, తీరప్రాంతం ద్వారకా నగరానికి అనుబంధమే కాని అసలు ద్వారక తీరానికి దూరంగా సముద్ర మధ్యంలోనే ఉందని మర్చిపోకూడదు" అంటూ చెప్పటం ఆపాడు చరక్.

రామాచారి మనసు చరక్ మాటలకు ద్వారక వెంటే ఊహల్లో విహరిస్తోంది. ఆ విషయాలు వింటుంటేనే ఒక అలౌకికమైన ఆనందం ఆయన్ని కుదిపేస్తోంది.

"ద్వారకా నగరం గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే. ఎందుకంటే అలనాటి ద్వారకాపురిని మనం చూడలేదు. చూద్దామన్నా ఆ నగరం ఇప్పుడు భూమిపైన లేదు.

మనం చేయగలిగిందల్లా మన ఇతిహాసాలు చెప్పిన విషయాలను మన పరిశోధకులు ఆ నగరంగురించి పరిశోధించి తెలుసుకున్న విషయాలను బేరీజు వేసుకుని ఇలా ఉండివుండొచ్చు అని ఒక అంచనాకు రావటమే.

నాకు తెలిసి ఈ నగరం ఏడు భాగాలుగా నిర్మింపబడింది. ఒక్కో విభాగాన్ని దృఢమయిన గోడలు వేరుచేస్తాయి. ఈ ఏడు కక్ష్యలు, వాటికి వాకిళ్ళు, ద్వారాలు, ఈ కక్ష్యల మధ్యనే పంటపొలాలు, నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు, వినోద ప్రాంతాలు, క్రీడాప్రాంగణాలు, పరిపాలనా పరమయిన ఏర్పాట్లు, సైనిక శిబిరాలు గస్తీ మొదలైనవి ఉండేవి.

ఈ కక్ష్యలు దాటి మధ్యకు వెళితే అక్కడ శ్రీకృష్ణులవారి కోట. అంతఃపురాలు, రాజోద్యానవనాలు, శ్రీకృష్ణుని సుధర్మ సభ అనే దర్బారు ఉంటాయి.

మన హిందూశాస్త్రాలు చెప్పే విషయాల్ని– యుగ ప్రమాణాల్ని, పంచాంగం లెక్కల్నిగాని వీళ్ళెందుకు ప్రమాణంగా తీసుకోరో బోధపడదు.

విదేశీయుల్ని అలా ఉంచి ఎంతో చదువుకున్న మనవాళ్ళు కూడా విదేశీయులు చెప్పే కాకి లెక్కల్ని పట్టుకుని వేలాడుతున్నారు.

ఒకడేమో వేదాలు క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాలనాటివి అంటాడు. ఒకడేమో క్రీస్తు పూర్వం పదిహేనో శతాబ్దంలో భారతం జరిగిందంటాడు.

రామాయణం జరిగిందనటమే అవాస్తవమంటాడు మరొకడు. ఎందుకు ఇలా అర్ధం పర్ధంలేని చెత్తరాసి గందరగోళపరుస్తున్నారో అర్ధంకాదు.

ఈ మధ్యనే ఒక ప్రబుద్ధుడు రాసిన ఇంగ్లీషు పుస్తకం చదివాను. ప్రపంచమతాల గురించి, వాటి ఆవిర్భావం గురించి చెప్పుకు వచ్చాడు. ఆయన పేరు మిర్‌ట్లీలంగ్లే. ఆ పుస్తకం పేరు ఎ బుక్ ఆఫ్ బిలీవ్స్.

ఈయన ఎక్కడివాడో హిందూ మతం గురించి, నమ్మకాల గురించి ఎంతవరకు తెలుసో తెలీదు. ఈయనంటాడు ఒక గురువంటూ లేని మతం హిందూమతం. కాబట్టి గురువులేని దీన్ని ఒక మతంగా విశ్వసించలేం అంటాడు. కరెక్టా?"

"ఎవడా పిచ్చివెధవ... వాడ్ని తెచ్చి గంగానదిలో ముంచి తీస్తే మతమంటే ఏమిటో అర్థమవుతుంది. హిందూ మతానికి గురువులు లేరా, గురుపరంపరను లోకానికి అందించిందే హిందూమతం. ఈ మతానికి ఒకరా ఇద్దరా, ఎందరు గురువులు లేరు.

సప్తఋషులు గురువులు కాదా, ముందు తరాలకు అద్భుతమైన వైదిక గ్రంథాలను అందించినవారు గురువులు కాదా... నేటికీ ఈ మతాన్ని ప్రబోధిస్తున్న సాధు సన్యాసులు, మతపెద్దలు అంతా గురువులు కాదా?" ఆవేశంగా చెప్పాడు రామాచారి.

"కరక్టు. ఇలాగే వాళ్ళేదో తెలిసీ తెలీకుండా పిచ్చిరాతలు రాయటం, అదే నిజమని మనవాళ్ళు తలూపటం విచిత్రంగా ఉంది. పైగా ఆ బుక్ రాసిన తను క్రీస్తు భక్తుడనని, క్రీస్తు మార్గంలో నడిచేవాడినని చెప్పుకున్నాడు. ఇలాంటి విషయాలు చెప్పేవాళ్ళెప్పుడూ తటస్థంగా ఉండాలి. లేకపోతే మిగిలినవాటికి ద్రోహం చేసినట్టవుతుంది."

"అంతేగదా... వాళ్ళకేం తెలుసని పిచ్చి రాతలు రాయటం?"

"సో... నేనేమంటానంటే ప్రాచీన నగరాలు లేదా పురాతన వస్తువులమీద అధ్యయనం చేసేప్పుడు ఆయా చరిత్ర గాథలను దృష్టిలో పెట్టుకోవాలి.

ఉదాహరణకి ద్వారక అన్వేషణలో లభించిన వస్తువుల్ని కార్బన్ టెస్ట్‌కు పంపించగా అవి క్రీస్తుపూర్వం మూడువేల నుండి పదివేల మధ్యకాలం నాటివిగా తేలిందని అంటున్నారు.

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్య విషయం గోమతీనది. ఈ నదికి ఒరవడి ఎక్కువ.

వేలాది సంవత్సరాలుగా ఎగువనున్న మట్టిపొరల నుంచి నదిలో కలిగే డెబ్రిస్, ఒండ్రుమట్టితోపాటు సముద్రంలోకి వచ్చిపడుతుంది. అలా వచ్చిన వాటిలోని వస్తువులు అనేక కాలాలు నాగరికతలకు సంబంధించినవై ఉంటాయి.

అవన్నీ ద్వారక మునిగిపోయిన ప్రాంతంలో దొరికాయిగాబట్టి అవి ద్వారక అవశేషాలని లెక్కించటం కరక్టా?"

"కాదుగా... అదెలా కుదురుతుంది?" సుమారుగా కలియుగం అయిదువేల వందనుండి అంతకు పూర్వం రెండువందల సంవత్సరాల మధ్య కాలాన్ని కార్బన్ పరీక్షలో సూచించినవాటిని మాత్రమే మనం ద్వారక అవశేషాలుగా గుర్తించాలి." అన్నాడు రామాచారి.

"కరక్టుగా చెప్పారు. ఇవన్నీ ఆలోచించే నేను ఈ దర్యాప్తు సమగ్రం కాదన్నాను" అన్నాడు నవ్వుతూ చరక్.

"అరటిపండు ఒలిచి ఇచ్చినట్టు ఎంత చక్కగా చెప్పావయ్యా. ఆ ముత్తాతకి ముదిమనవడివన్పించావ్" అన్నాడు రామాచారి. అంతలో బయటి కొచ్చిన కావేరి భోజనాలకి పిలవటంతో అంతటితో సంభాషణ ముగించి లోనకు నడిచారు ఇద్దరూ.

* * * * *

నీలోదరి కొండగుట్ట...

మహామాంత్రికుడు మరిడి సోమయ్య తన నివాసంలో దెబ్బతిన్న జంబూకంలా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు శిష్యుడు మృణాళుడు.

అతడి వెనక విళంబి, వికేశి శిష్యులిద్దరూ ఉన్నారు. మిగిలిన శిష్యులు దూరంగా ఉన్నారు.

చివరి క్షణంలో చిలక శరీరం నుంచి తప్పుకుని ప్రాణాలు కాపాడుకున్న మృణాళుడు శునక శరీరంలోచేరి, తర్వాత కొంగ శరీరాన్ని ఆశ్రయించాడు. అయినా అతడి గగన ప్రయాణం సులువుగా సాగలేదు. దారిలో గాలి వాన కారణంగా ఆ రాత్రంతా ఒక చెట్టు గుబురు కొమ్మల్లో చలికి వణుకుతూ గడిపాడు. మరునాడు సాయంకాలానికి ఎలాగో నీలోదరి చేరుకున్నాడు.

కొంగ శరీరాన్ని వదిలి తన నిజశరీరంలో ప్రవేశించి జరిగిందంతా గురువుకు నివేదించాడు.

తన రెండో ప్రయత్నం కూడా బెడిసికొట్టడంతో మరిడి సోమయ్య చాలా అసహనంగా ఉన్నాడు. ఏం మాట్లాడ్డానికి శిష్యులకు ధైర్యం చాలటం లేదు.

"గురుదేవా... ఈ సారి నన్ను పంపించండి. ఎలా గొలా మరిన్ని విశేషాలు తెలుసుకుని వస్తాను" నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ అడిగాడు శిష్యుడు వికేశి.

తల అడ్డంగా ఊపాడు మరిడి సోమయ్య. పచార్లు ఆపి ముగ్గుర్నీ సాలోచనగా చూశాడు.

"ఇక మీవల్లకాదురా. లాభంలేదు. మన ప్రయత్నాలు ఆచార్యుడికి తెలిసిపోయాయి. జాగ్రత్తపడిపోయాడు. ఇప్పుడు మనం చేయగలిగింది ఏమీలేదు. కొంతకాలం మౌనంగా ఉండటం మంచిది. మనముందు రెండే మార్గాలున్నాయి.

ఆయన ప్రయత్నాలు ఏమిటో ఆ చెక్క మందసంతో ఆయన ఏం సాధించబోతున్నాడో మనకు తెలియాలి లేదా వారి ప్రయత్నాలను మనం సమూలంగా నాశనం చేయాలి.

మొదటిది ఎలాగూ చేయలేకపోయాం. రెండో దానికి కొంత సమయం పడుతుంది. సరయిన సమయంలో సరైన దెబ్బకొట్టి నేనేమిటో నిరూపిస్తాను. ఇక దీని గురించి మర్చిపోయి మీమీ పనులు చూడండి" అని చెప్పి అక్కడ్నుంచి లోనకు వెళ్ళిపోయాడు.

*　　*　　*　　*　　*

కాలనాళిక మందసం...!

భూతకాలదర్శిని...

అదో అద్భుతం...

మంత్ర తంత్ర యంత్ర సమన్వితమైన అపూర్వ ఆయుర్వేద వైద్య దినుసుల మిశ్రమాలతో అహోరాత్రాలు కష్టించి తయారుచేసిన దివ్యపేటిక.

అగ్నివేశాచార్యుల మేధస్సు నుండి ఆవిర్భవించిన గొప్ప యంత్రం. దానికి మూడో పూత స్వర్ణజలం కూడా విజయవంతంగా ముగియటంతో అది మరింతగా దివ్య స్వర్ణకాంతులతో మెరిసిపోతోంది.

చివరిగా ప్రత్యేక హోమం చేసి పూజాదికాలు కూడా నిర్వహించి మరో భద్రయక్షుడ్ని యంత్రంలోకి ఆవాహన చేసి తృప్తిపర్చటం కూడా అయింది.

"ఆచార్యా, మన ప్రయత్నం ఫలించిందా? మీ కల సాకారం అయినట్టేగా?" అంతా ముగిశాక కుతూహలంగా అడిగాడు ముకుంద పాత్రుడు.

ఆచార్యుడు తల పంకించాడు.

"లోపాలన్నీ సరిచేసుకుంటూ దివ్యమగు ఈ కాలనాళిక మందసాన్ని తయారుచేయటంలో నాకు సహకరించిన మీ అందరికీ ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీటంలేదు. మీ సహకారం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

ఎక్కడో పురాతన తాళపత్రంలో అరకొరగా దొరికిన కొన్ని ఆధారాలను పట్టుకొని మార్పులు చేర్పులతో ఎన్నో ప్రయోగాలు చేస్తూ చివరకు దీన్ని సాధించుకోగలిగాం. ఇక పరీక్షించి చూడ్డం మిగిలింది.

దీనికి రేపు ఉదయం ముహూర్తంగా నిర్ణయించాను. ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు చక్కటి తిథి, నక్షత్రం కుదిరాయి" అన్నాడు అగ్నివేశాచార్యుడు ఆనందంగా.

"ఇంతకీ ముందుగా దీన్ని ఎవరు పరీక్షింపబోతున్నారు ఆచార్యా?" కుతూహలం ఆపుకోలేక అడిగాడు ముకుందపాత్రుడు.

ఒక్కక్షణం ఆలోచించాడు అగ్నివేశాచార్యుడు.

"ఇది రిస్క్‌తో కూడిన పని. దీని గురించి ముందు వెనకలు తెలుసు కోకుండా ఒకరి ప్రాణాల్ని బలిపెట్టలేను. ముందుగా నేనే దీన్ని పరీక్షిస్తాను" అన్నాడు.

"మీకెందుకు స్వామీ శ్రమ. మీ కోసం ప్రాణం ఇచ్చినా అది మా అదృష్టమనుకుంటాం. నేను వెళ్ళొస్తాను స్వామీ. నన్ను పంపించండి" అని అన్నాడు పులికొండయ్య.

"అవును ఆచార్యా! ఆలోచించండి. వయసు రీత్యా అయినా మీరీ సాహసం చేయుట మంచిదికాదు" అంటూ సూచించాడు గోవిందపాత్రుడు.

అగ్నివేశాచార్యుడు మందహాసం చేస్తూ అందర్నీ చూశాడు. "నామీద అభిమానంతో మీరింతగా చెపుతున్నా అంగీకరించలేను. ఇందులో ఎవరు బడితే వాళ్ళని పంపించటం కూడా సాధ్యంకాదు.

దీనికీ కొన్ని విధి విధానాలు, నిబంధనలు ఉన్నాయి. కాబట్టి నేనే ముందుగా పరీక్షించటం ధర్మం. రేపే ఆ శుభముహూర్తం" అంటూ మరోమాటకు అవకాశం ఇవ్వకుండా అక్కడ నుంచి తన పూజామందిరం వైపు వెళ్ళిపోయాడు ఆయన. అందరూ బయటకు వచ్చాక ఆ గది తలుపులు బిగించి తనూ బయటకు బయలుదేరాడు గోవిందపాత్రుడు.

* * * * *

అదేపనిగా సెల్‌మోగుతుంటే బైక్‌ను పక్కన చెట్టు నీడకు తీసి ఆపాడు చరక్.

వెనక కూచున్న శుశ్రుత బైక్ దిగింది.

సెల్ తీసి చూశాడు. అవతల లైన్లో ఉంది శ్రావణి. ఈ వాగుడు కాయతో పెట్టుకుంటే బుర్ర తినేస్తుంది. అయినా ఈ టైమ్‌లో ఫోన్ చేసిందేమిటి? విసుక్కుని ఫోన్ కట్టేయబోతూ చివరి క్షణంలో మనసు మార్చుకుని ఆన్‌చేశాడు. పక్కనున్న శుశ్రుత అంతా గమనిస్తూనే వుంది. కాస్త దగ్గరగా జరిగింది.

"హాయ్ బావా... నువ్వు సిమ్‌లు మారుస్తుంటే పట్టుకోలేననుకున్నావా. దొరికిపోయావు చూడు" అవతల ఉత్సాహంగా అరిచింది శ్రావణి.

"గొప్ప పనిచేశావుగాని ఎందుకే ఫోన్ చేశావు?" అడిగాడు చరక్.

"నీ కోసమే... మాట్లాడాలనిపించింది."

"ఏం మాట?"

"ఏదో ఒకటి"

"మాట్లాడు"

"ఎలా ఉన్నావు బావా?"

"ఎప్పటిలాగే ఉన్నాను చాలా. జేజి తాతయ్య ఇంటికి వచ్చారా?"

"రాలేదుగాని ఏంది బావా నువ్వు ప్రేమగా ఒక్కటీ మాట్లాడవు. కట్టె విరిచినట్టు మాట్లాడతావు. ఫోన్ చేస్తే ఎలా ఉన్నావని నన్ను అడక్కుండా తాతయ్య గురించి అడుగుతున్నావు చూడు...." అంది.

"ఎలా ఉన్నావ్?"

"ఏం చెప్పను బావా. ఆకలి ఉండదు. ఏమీ తినబుద్ధి కాదు. ఏ పనీ చేయబుద్ధి కాదు. చీకటి పడితే భయం వేస్తోంది. జ్వరం వస్తుందని..."

"ఇలా అయితే నీ చదువు కొండెక్కినట్టే – అర్జంటుగా ముందు డాక్టర్‌కి చూపించుకో...."

"నువ్వే నా డాక్టర్‌వి. వచ్చి చూడొచ్చుగా"

"అంత తీరిక లేదుగాని, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నట్టున్నాయ్. ఒళ్ళు దగ్గరుంచుకుని బుద్ధిగా చదువుకో, బై...!" అన్నాడు చరక్.

"బావా... బావా"

"ఏమిటే?"

"ఓ ముద్దియ్యవా?"

"ముద్దు కాదు, ఇంటికి వచ్చాక మొట్టికాయలే ఇస్తాను" అంటూ లైన్ కట్‌చేశాడు.

"ఎవరీ మరదలు?" చరక్ ఫోన్ జేబులో వేసుకోగానే అడిగింది శుశ్రుత.

"ఎవరో అయితే ఎందుకు చేస్తూందిలే. నా మరదలు శ్రావణి" అంటూ బైక్ స్టార్ట్ చేయబోయాడు.

బైక్ కీ తీసుకుని కోపంగా చూసింది శుశ్రుత.

"నాకు పోటీగా నీకో మరదలుందని ఎందుకు చెప్పలేదు?" సీరియస్‌గా అడిగింది.

"చెప్పాల్సినంత విశేషం ఏముంది? నవ్వు అడగలేదు, నేను చెప్పలేదంతే"

అలిగి దూరంగా పోయి నిలబడింది శుశ్రుత.

ఆమెకు కోపం వచ్చిందని అర్ధమైంది.

బైక్ స్టాండ్‌వేసి దగ్గరకు వెళ్ళాడు చరక్.

"ఏయ్. చీటికీ మాటికీ ఈ అలకలేమిటి చిరాగ్గా? రా పోదాం" పిలిచాడు.

"నీకు చిరాగ్గా ఉండవచ్చు... నాకు ఒళ్ళుమండుతోంది. సొంత మరదలు... వదులుకుంటుందా...." ఆమె కళ్ళలో దూకటానికి సిద్ధంగా వుంది కన్నీరు.

చరక్ ఫక్కున నవ్వుతూ– "ఏమిటీ పిచ్చి? మరదలు ఉందిగాని మా మధ్య ఏమీలేదు. అది ఇంటర్ చదువుతోంది. తెలిసీ తెలీని వయసు. నాకన్నా బాగా చిన్నపిల్ల. దానికి నేనంటే ఇష్టం. ఆ చనువుతో అల్లరి చేస్తుంది. నాకు దానిమీద ఎలాంటి ఉద్దేశం లేదు. నన్ను నమ్ము" అంటూ నచ్చజెప్పాడు.

"నిజంగానా?"

"అవును"

"అయితే ఈసారి తను ఫోన్‌చేస్తే ఫోన్ నాకు ఇవ్వు. మాట్లాడతాను"

"ఎందుకూ? గోల గోల చేసి ఇప్పుడే మనగురించి మా వాళ్ళందరికీ టాంటాం చేసేస్తుంది. అలిగింది చాలు... ఇక పద పోదాం" అంటూ బైక్ స్టార్ట్‌చేశాడు.

శుశ్రుత కూర్చోగానే బైక్ వేగంగా పరుగుతీసింది.

* * * * *

పిల్లా గోవిందపాత్రుడు, శివరామ ముకుందపాత్రుడు లిద్దర్నీ మాత్రం లోనకు పిలిచి మిగిలినవారిని బయటే ఉండమని చెప్పి గది తలుపులు మూశాడు అగ్నివేశాచార్యుడు.

కాలనాళికలో ప్రవేశించి – గతకాలంలోకి వెళ్ళబోతున్నాడాయన. అందుకే ఈ జాగ్రత్తలు.

"నాకు తెలుసు వాళ్ళకీ ఈ ప్రయోగం ఏమిటో చూడాలని వుంటుందని. కాని ఊహించని విధంగా నాకేమన్నా జరిగితే కంగారుపడి యక్షశక్తుల్ని తాకి ప్రాణంమీదికి తెచ్చుకుంటారు.

ఈ మందసాన్ని యక్షశక్తులు రక్షిస్తుంటాయి. అజాగ్రత్తగా తాకితే వాటి ఆగ్రహాన్ని రుచి చూడాలి. అందుకే వాళ్ళని బయట ఉంచేశాను" వివరిస్తూ పైతుండు తీసి నడుముకి బిగించాడు అగ్నివేశాచార్యుడు. మందసంలో ప్రవేశించటానికి ఇంకో మూడు నిముషాల వ్యవధిమాత్రమే ఉంది.

"నేను చెప్పేమాటలు శ్రద్ధగా వినండి. అలా కూర్చుని ఈ మంత్రాక్షతలు దగ్గర వుంచుకోండి" అంటూ అక్షతలున్న పళ్ళాన్ని టీపాయ్ మీదుంచాడు. పక్కనే చెరోకుర్చీలో కూర్చున్నారు తండ్రీ కొడుకులు. తిరిగి వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"భూతకాలంలోకి వెళ్ళిన నేను తిరిగి నా శరీరంలో చేరటానికి ఒకరోజు పట్టొచ్చు. వారంరోజులు పట్టొచ్చును. నేను మందసంలో ప్రవేశించిన మూడవ నిముషంలో నా ఆత్మ బయటకు రావటం మీరు చూస్తారు.

మందసం పై నుంచి మాయాదర్పణంలో ప్రవేశించి అదృశ్యమవుతాను. అంటే ప్రయోగం విజయవంతమైనట్టే. అలా కాకుండా మూడో నిముషం నా ఆత్మ మీకు కన్పించలేదంటే లోపం ఏదో జరిగిందని అర్థం.

అప్పుడు ఈ అక్షింతలు మందసం మీద చల్లి డోమ్ తెరవండి. నేను లేచి బయటికొచ్చేస్తాను. అవిఘ్నంగా నేను భూతకాలంలోకి వెళ్ళిపోతే ఇక మీరు కంగారుపడాల్సింది లేదు. లేచి బయటకెళ్ళి తలుపులు మూసేయండి.

నేనుగా వచ్చి తెరిచేవరకు తలుపులు తెరవకూడదు. ఇటు తొంగి కూడా ఎవరూ చూడకూడదు. అర్థమైందిగా?" వివరించాడాయన గంభీరంగా.

ఏమిటీ అద్భుతాలు...?! వింతలు...?! వేల సంవత్సరాల క్రితం మరుగునపడిన మంత్ర, తంత్ర, యంత్రాలు, పంచశక్తులు...

ఈ రోజుల్లో తిరిగి వాటికి జీవం పోసిన అగ్నివేశాచార్యులు ఈ కాలం నాటివారేనా?! తండ్రీ కొడుకులకి కొద్ది క్షణాలు ఏం అర్థంకాలేదు.

వెంటనే తేరుకుని "అర్థమైంది ఆచార్యా... ఈసారి మనకి అపజయం ఉండదు. కాని ఒక్కటే కోరిక. మీరు భూతకాలంలో ఏం చూడాలనుకుంటున్నారో తెలుసుకోవాలనుంది" అడిగాడు గోవిందపాత్రుడు.

"నాటి ద్వారకాపురిని చేరుకుని Human Divine అయిన శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకుని వచ్చేస్తాను. ఇది నా కోరిక. నా ఆశయమంటూ వేరే ఉంది. అది సాధించటానికి మనం సరిపోము. చూద్దాం... ముహూర్త సమయమైంది. వెళ్ళొస్తాను" అంటూ కదిలాడు అగ్నివేశాచార్యుడు.

గోవిందపాత్రుడు ముకుందపాత్రుడు ఇద్దరూ కుర్చీల్లోంచి లేచి చూడసాగారు ఊపిరి బిగబట్టి.

అగ్నివేశాచార్యుడు ముమ్మారు మందసానికి ప్రదక్షిణ చేసి నమస్కరించి డోమ్‌ని పైకి లేపి మందసంలో అడుగుపెట్టి తండ్రీకొడుకుల్ని ఆశీర్వదించాడు. వెల్లకిలా పడుకుంటూ డోమ్ మూసుకున్నాడు.

లోన చక్కటి పరుపు, దిళ్ళమీద వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకున్న ఆచార్యుడ్ని స్పష్టంగా గ్లాస్ డోమ్ గుండా చూస్తున్నారు తండ్రీ కొడుకులు. క్షణాలు భారంగా దొర్లుతున్నాయి.

డోమ్ లోపల విచిత్రమైన వెలుగు రేఖలు ఆవిర్భవించి కాస్సేపటికే ఆచార్యుడి శరీరాన్ని కన్పించకుండా చేశాయి. సరిగ్గా మూడో నిముషంలో జరిగిందా అద్భుతం. డోమ్‌పైన ఆచార్యుడి ఆత్మ స్వరూపం లేచి నిలబడింది.

అది అలా గాలిలో నడుచుకుంటూ గోడకు ఉన్న విచిత్ర దర్పణంలో ప్రవేశించింది. అందులోని కాంతి రేఖల మధ్య ఆయన అదృశ్యం కావటం చూడగానే ప్రయోగం విజయవంతమైనట్టు గ్రహించి ఆనందంతో ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారిద్దరూ. సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యారు.

అగ్నివేశాచార్యుడు భూతకాలములోనికి వెళ్ళిపోయాడు. కొన్ని వేల సంవత్సరాలు వెనక్కి ప్రయాణిస్తున్నాడు. ఆ ఊహే ఆ తండ్రీ కొడుకులను ఉద్వేగభరితులను చేసింది. ఇక ఆయన తిరిగి వచ్చిన తరువాత విశేషాలు తెలీదు.

ఇద్దరూ మౌనంగా గది బయటకు వచ్చేశారు. వచ్చేముందు మందసంలోకి చూసిన ఇరువురికీ పరుపు మీద సుఖనిద్రలో ఉన్నట్టు కన్పించాడు ఆచార్యుడు. బయటికి వచ్చి గది తలుపులు మూసి తమ కోసం ఎదురుచూస్తున్న మిగిలినవాళ్ళను తీసుకుని హాలు బయటకు నడిచారు.

*　　*　　*　　*　　*

అగ్నివేశాచార్యుని దివ్యాత్మ కాలప్రవాహంలో వెనక్కి దూసుకు పోతోంది. అద్దంలో ప్రవేశించినప్పుడు ఉన్న వెలుగు రేఖలు ఇప్పుడు లేవు. ఎన్నో వెలుగు రేఖలను దాటి చిక్కటి చీకట్లలోకి వచ్చేశాడు. ఎటు చూసినా చీకటి. కటిక చీకటి.

ఆ చీకట్లలో ఎటు పోతున్నాడో ఎక్కడికి పోతున్నాడో కూడా తెలీదు. ఎవరో తనను లాక్కుపోతున్నట్టు, కాంతికంటే వేగంతో వెళ్ళిపోతున్నాడు. భయమంటే తెలీని అగ్నివేశాచార్యుడు కూడా ఆ క్షణాల్లో భయాందోళనలకు గురయ్యాడు. వృద్ధప్రాణం ఆ వేగాన్ని తట్టుకోలేకపోతోంది. ఉక్కిరిబిక్కి రవుతూ బిక్కు బిక్కుమంటూ ఏవో శూన్యలోకాల్లో చీకటి రాజ్యాల్లో ఒంటరి పక్షిలా దూసుకుపోతున్నట్టుంది.

అలా ఎంత సమయం గడిచిందో కూడా తెలీదు. అంతలో ఎగువన ఏవో వెలుగు కిరణాలు గోచరించాయి. అంతే!... ఆ తర్వాత ఏం జరిగిందో ఆయనకి తెలీదు. కళ్ళు తెరిచేసరికి తను ఎక్కడో ఎత్తయిన ప్రదేశంలో ఒక వటవృక్ష ఛాయలో తిన్నెమీద పడున్నట్టు మాత్రం గ్రహించాడు.

ఏదో సుదీర్ఘమైన కలనుంచి మేల్కొన్నట్టు లేచి కూర్చుని ఆ ప్రదేశాన్ని, పరిసరాల్ని గమనించాడు ఉద్వేగాన్ని అదుపులో ఉంచుకుంటూ.

సూర్యుడు నడిమింట వెలిగిపోతున్నాడు.

ఎదురుగా దట్టమైన అటవీ ప్రాంతం. అందులో మందలు మందలుగా తిరుగాడుతున్న గోవులు కన్పిస్తున్నాయి. లేగదూడలు చెంగు చెంగున గంతు

లేస్తున్నాయి. ఎదురుగా విశాలమైన రహదారి వుంది. ఆ దారిన ఎడ్ల బండ్లు కొన్ని సాగిపోతున్నాయి.

పాదచారులు కొందరు వీటిననుసరిస్తున్నారు. ఎద్దుల మువ్వల చప్పుడు కర్ణపేయంగా వినవస్తోంది. ఆ బాటకు అతిసమీపంలోనే చెట్టుకింద వున్నాడు తను. తన వెనక చాలా దూరంలో సువిశాలమయిన సముద్రం కన్పిస్తోంది.

ఉత్తరంగా పోతున్న తెరచాపల ఓడలు రెండు కనిపిస్తున్నాయి.

చెట్లకొమ్మలమీద కిలకిలారావాలతో పక్షులు సందడి చేస్తున్నాయి. అగ్నివేశాచార్యుడికి గతమంతా గుర్తుంది. తను మందసంలో ప్రవేశించేటప్పుడు ఎలా వున్నాడో అదే రూపురేఖలతో, అదే దుస్తులు ధరించి వున్నాడు.

విచిత్రం... తనిప్పుడు ఆత్మకాదు. సశరీరంతో ఉన్నాడు. ఏమిటీ వింత? ఏమిటీ మాయ?, తను ఇప్పుడు ఎక్కడున్నాడు?, ఇది ఏ కాలం?

సమాధానం దొరకని అనేక ప్రశ్నలాయన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. చీకట్లలో దూసుకొస్తూండగా దూరంగా ఏవో వెలుగు రేఖల్ని చూశాడు. అంతే తరువాత ఏం జరిగింది తెలీదు.

స్పృహలోకి వచ్చేసరికి ఇక్కడ ఉన్నాడు. మధ్యలో ఏం జరిగింది! అంతా విచిత్రంగా ఉంది.

వర్తమానకాలం నుండి భూతకాలంలోకి వచ్చిన తనే ఇప్పుడు ఏది అసలు కాలమో తెలీక తికమకపడుతున్నాడు. తను ఇక్కడివాడేనేమో! భవిష్యత్తు గురించి కలగంటూ ఇప్పుడే లేచాడేమో. లేకుంటే తను ఇలా సశరీరంతో ఎలా ఉంటాడు?

నిజమే. కాని ఈ శరీరానికి పునాది అంతా భవిష్యత్ కాలంలోనే వుంది. తనవాళ్ళు అంతా అక్కడే ఉన్నారు. తనకు అంతా గుర్తుంది. మరి ఏమిటీ విచిత్రం.

* * * * *

అహా... ఏమి ఈ కాలమహిమ. అక్కడ ఉన్నప్పుడు ఇది భూతకాలం అయింది. ఇక్కడికి రాగానే అది భవిష్యకాలం అయింది. అయిదువేల సంవత్సరాలు వెనక్కి ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నాడు.

దారిన పోతున్న వారి వేషభాషలు, తీరు చూస్తుంటే ఇది ద్వాపర యుగంలాగే తోస్తోంది.

ఆలమందలను చూస్తుంటే తను ఇప్పుడు ద్వారకాపురి పరిసర ప్రాంతాల్లో ఎక్కడో ఉన్నట్టుగా వుంది. ఆకలవుతోంది. ఏమన్నా తినాలి. లేచి నిలబడ్డాడు.

ఇంతకీ తనిప్పుడు ఆత్మా... లేక మనిషా! ఉన్నట్టుండి సందేహం ఏర్పడింది ఆగ్నివేశాచార్యుడికి. అంతలో ఆ సందేహం కూడా తీరిపోయింది.

ఎవరో గోపబాలుడు ఒకడు లేగదూడను తరుముకొంటూ తనవైపే వస్తున్నాడు. సుమారు పన్నెండేళ్ళ బాలుడు. నీలవర్ణంవాడు. విశాలనేత్రాలు కలవాడు.

తలకు తుండుచుట్టుకుని చెంగుచెంగున పరుగెత్తుకొస్తూ– "ఇదిగో పెద్దాయనా. కాస్త ఆ లేగను పట్టుకో. ఒకటే దుడుకు చేస్తోంది పట్టుకో" అంటూ అరిచాడు. ఆ భాష తెలుగు కాదు.

దేవనాగరి, మరో భాష ఏదో కలగలిసిన భాష. కొన్ని పదాలు అర్థమవుతున్నాయి. కొన్ని అర్థం కావటంలేదు. అయితే తను ఆత్మకాదు మనిషి అని అర్థమైంది. తను సశరీరంతో కన్పిస్తున్నాడు. చెంగు చెంగున దూకుతూ వస్తున్న కపిలవర్ణం లేగను ఒడిసి పట్టుకుని ఆ గోపబాలునికి అప్పగించాడు.

ఆ బాలుడు లేగను ప్రేమగా ముద్దాడి "రేయ్ బసవా. దుడుకు సేయకూడదురా. అమ్మ నీకోసం వెదుకుతోంది పో... త్వరగాపో" అంటూ వెనక్కి వదిలాడు. అంతే వచ్చినంత వేగంగానూ ఆ లేగ రహదారిని దాటి ఆలమందలోని తన తల్లిని వెదుక్కుంటూ పరుగు తీసింది.

ఆ బాలుడ్ని సంభ్రమంగా చూస్తున్నాడు అగ్ని వేశాచార్యుడు. శిఖిపించం లేదుగాని, ఇతడూ ఆ శిఖిపించమౌళిలాగే ఉన్నాడు. నీలవర్ణం మేనిఛాయలో ముద్దొస్తున్నాడు. ఎంత చూసినా తనివి తీరని ముగ్ధసౌందర్యంతో మెరిసి పోతున్నాడు.

"ఎవరు బాబూ నువ్వు...?" అంటూ దేవనాగరిభాషలో అడిగాడు.

"నేను ఎవరయితే ఏంగాని నువ్వెవరో చెప్పుతాతా, చూడ్డానికి గడ్డం, మీసాలతో మహర్షివలె వున్నావు. ఎక్కడివాడివి...? ఎక్కడికి ప్రయాణం...." అంటూ ఎదురు ప్రశ్నించాడా బాలుడు.

"నా పేరు అగ్నివేశాచార్యుడు నాయనా. ద్వారకా నగరం సందర్శించాలని ఆ కృష్ణపరమాత్మ దర్శనం చేసుకోవాలని వచ్చా" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మా ద్వారకను చూడాలి. అంతేకదా. నువ్వు నాతోరా... అన్నట్టు ఆకలితో ఉన్నట్టు ఉన్నావు. ఈ పండ్లు తిను" అంటూ రెండు పండ్లను అగ్నివేశాచార్యుడి చేతిలో వుంచాడు.

"చాలా సంతోషం బాబూ. మీ ద్వారకావాసులు దయామయులు" అంటూ పండ్లు తినటం ఆరంభించాడు. అవి ఏ జాతి ఫలాలో ఆయనకి అర్థం కాలేదుగాని అద్భుతమైన రుచిగా వున్నాయి.

ఆయన తింటున్నంతసేపూ పక్కన కూర్చుని కాళ్ళు ఊపుతూ, మురళి వాయిస్తూ కూర్చున్నాడా బాలుడు.

గోపాలకులు చాలామంది మరళీనాదంతో వినోదిస్తూంటారు కాబట్టి ఆ విషయాన్నంతగా పట్టించుకోలేదు ఆచార్యుడు. కాని ఆ మురళీనాదం అలౌకిక ఆనందాన్ని కలిగిస్తోంది. పరవశంతో వింటూ పండ్లు ఆరగించాడు అగ్ని వేశాచార్యుడు.

అంతలో ఒక గోపబాలుడు ఒక ముంతలో పాలు తీసుకొచ్చాడు. మొదట గోపబాలుడు ఆ ముంతను అందుకుని ఆచార్యుడికి అందించాడు.

"చాలా బడలికగా ఉన్నావు. తాగు తాతా. కమ్మటి పాలు. శక్తి వస్తుంది" అన్నాడు.

కాదనకుండా తాగేశాడు అగ్నివేశాచార్యుడు. అమృతతుల్యంగా ఉన్న ఆ క్షీరాన్ని తాగగానే ఆకలి తీరిపోయింది. నిజంగానే శరీరంలో నూతన జవసత్వాలు ఏర్పడినట్టయింది.

"బాలుడివయినా అతిధి సత్కార్యాల్లో గొప్ప మనసయ్యా నీది. సుఖీభవ" అంటూ ఆశీర్వదించాడు.

నవ్వాడా గోపాలకుడు. "మరేమనుకున్నావ్ తాతా... నువ్వొచ్చింది ద్వారకకు. అతిధిమర్యాదలు మా తరువాతే ఎవరైనా, నీకు నేనో బహుమానం ఇవ్వాలనుకుంటున్నాను. ఏమివ్వను...?" అంటూ క్షణం ఆలోచించి తన కుడికాలి వెండి తొడియం తీసి అగ్నివేశాచార్యుడి కుడికాలికి స్వయంగా తొడిగాడు.

"వద్దుబాబూ" అంటూ వారించబోయాడాయన.

"ఉంచు తాతా... ఇది నీకు రక్షగా ఉంటుంది. ఇక బయలుదేరు. ద్వారకను చూడాలన్నావుగా. నాతో రా...." అంటూ బయలుదేరాడా బాలుడు. అతన్ని అనుసరించాడు అగ్నివేశాచార్యుడు. ఇద్దరూ రహదారిమీది కొచ్చారు. వారిని దాటుకుంటూ కొన్ని గుర్రాలు ఎగువకు పరుగు తీశాయి.

కొందరు బాటసారులు ఎదురొస్తూ మహర్షిలా వున్న అగ్ని వేశాచార్యుడికి నమస్కరించి పోతున్నారు.

మురళి వాయిస్తూ, గంతులేస్తూ రాళ్ళురప్పల్ని తన్నుకుంటూ తన ముందు అల్లరి చేస్తున్న గోపబాలుడ్ని ముచ్చటగా చూస్తున్నాడు అగ్ని వేశాచార్యుడు. అలా ఎగువకు కొంతదూం వెళ్ళగానే–

అక్కడి నుండి చిన్న కొండవాలు దిగువకు పోతోంది. దిగువనుండి ఆ బాట ఎగువన సముద్రతీరానికి పోతోంది. ఉత్కంఠభరితుడై అలాగే నిలబడి పోయాడు అగ్నివేశాచార్యుడు. తను తీరానికి ఒక కిలోమీటరు దూరంలో వున్నట్టు ఊహించాడు.

ఎదురుగా అవతల సువిశాలమైన నీలి సముద్రం గోచరిస్తోంది. తీరానికి కొంత దూరం లోపల ఒక చక్కని దీవి. ఆ దీవిమీద అతి సుందరమైన నగరం. తీరం నుండి ఆ దీవివరకు విశాలమైన బాట ఒకటి సముద్రాన్ని రెండు పాయలుగా వేరుచేస్తోంది.

ఇంతకు ముందు తమను దాటిపోయిన ఆశ్వికుల అశ్వాలు ఆ బాటమీద ద్వారకకు దౌడుతీస్తూ కన్పించాయి. కుడిపక్కగా ఓడరేవులో కొన్ని ఓడలు నిలిచి వున్నాయి. తెరచాపలు లేపి రెండు ఓడలు సముద్రం మీదకు సాగిపోతున్నాయి.

తీరంవెంట అనేక కాలనీలు కన్పిస్తున్నాయి.

ఇక ద్వారకా నగరం!

దూరంనుండి చూస్తుంటేనే నయనానందకరంగా ఉంది. ఎత్తయిన కట్టడాలమీద బంగారు పూతను తాకి సూర్యకాంతి ప్రతిఫలిస్తోంది. దూరంనుంచే ఇంత అందంగా ఉన్న ఆ నగరం దగ్గరకు వెళ్ళి తిరిగి చూస్తే ఇంకెంత బాగుంటుందో గదా.

నగరాన్ని చుట్టి కోటగోడలా అనేక ప్రహరీలుగోచరిస్తున్నాయి. వాటి మధ్య ఎన్నో సమున్నత సౌధాలు, రాచబాటలు, ఉద్యానవనాలు, పచ్చటి పొలాలు.

పరవశంతో అలా చూస్తూండిపోయాడు అగ్నివేశాచార్యుడు. కంటతడి... వింతయిన ఆనందోద్వేగం... రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

ఉద్వేగం ఊపేస్తోంది.

ఎప్పటి ద్వాపరయుగం? ఎక్కడి ద్వారక...? అదిగో ద్వారక... ఆలమందలవిగో... గొంతెత్తి స్తుతించే కోట్ల గొంతులు, కలికాలంలో... అదిగో... అదే స్వర్ణద్వారక... ఆహా... ఏమి నా భాగ్యం కృష్ణభగవాన్... ఎంతటి కరుణయ్యా... నామీద నీకు...!!! అంతలో ఉన్నట్టుండి కళ్ళు గిర్రున తిరిగినట్టయ్యింది.

ఏం జరిగిందో అర్ధంగాక పక్కనున్న గోపబాలుని భుజంమీద చేయి వేసి నిలదొక్కుకోవాలని చూశాడు. ఆ గోపబాలుడు ముగ్ధమనోహరంగా నవ్వుతూ– 'వెళ్ళిరా తాతా' అంటున్నాడు. ఇప్పుడా గోపబాలుని శిరస్సున చుట్టిన తుండులో గుచ్చబడిన నెమలిపింఛం గోచరించింది. అంతే– తర్వాత ఏం జరిగిందో తెలీదు. పూర్తిగా తెలివితప్పిపోయాడు. తిరిగి స్పృహ కలిగేసరికి కారుచీకటి.

చిమ్మచీకట్లలో కాంతివేగంతో ఎటో వెళ్ళిపోతున్నాడు. ఏం జరిగిందీ అర్ధంకాలేదు. తన కోరిక పూర్తిగా తీరకుండానే వెనక్కి వెళ్ళిపోతున్నాడా, లోపం ఎక్కడ జరిగింది.

ఇంతా చేసి ద్వారకను చూశాడు గాని ఆ కృష్ణపరమాత్మ దర్శనము కాలేదే. ఒకవేళ ఆ గోపబాలుడు... చివరి క్షణంలో అతడి శిరస్సున నెమలిపింఛం కనిపించింది. అతడే కృష్ణుడా... పక్కన ఎవరో చిన్నగా నవ్వినట్టు తోచి ఆయన ఆలోచనలు చెదిరిపోయాయి. కళ్ళు చికిలించినా చిమ్మచీకట్లలో ఏమీ కనిపించలేదు. కాని సందేహించలేదు.

తనతోబాటే పక్కన ఎవరో ప్రపయాణిస్తున్నారు. ఎవరు? ఆత్మరూపంలో ఉన్నా, తొలిసారి కొంచెం తడబడింది అగ్నివేశాచార్యుడి మనసు.

"ఎవరు?... ఎవరది?" అని అడిగాడు.

ఆయన గొంతు ఆయనకే వినబడలేదు. కాని వినబడినట్టుగా అవతలినుంచి సమాధానం వచ్చింది.

"ఇంకా అర్ధంకాలేదా... ఆచార్యా! నిన్ను భూతకాలంలోకి తీసుకు వెళ్ళింది నేనే. తిరిగి వర్తమానంలోకి తీసుకువస్తోందీ నేనే" అంటూ.

అగ్నివేశాచార్యుడు కళ్ళు చికిలించి చూశాడు. చీకట్లో చీకటిగా కలిసిపోతూ, ఒక నల్లటి దృఢమైన ఆకారం, తన పక్కనే వస్తోంది.

తనతోబాటే ఎన్నో చీకటిలోకాల్ని అధిగమిస్తోంది. అగ్నివేశాచార్యుడికి అర్థమయిపోయింది తనవెంట వస్తున్నది మణిభద్ర యక్షుడు.

"మణిభద్రయక్షా!" పిలిచాడు.

"లెస్స గ్రహించితివి ఆచార్యా" బదులిచ్చాడు.

"నా కోరిక తీరకుండానే తిరుగు ప్రయాణం ధర్మమా" అడిగాడు.

"కోరిక తీరిందిగా"

"ఎలా?"

"నీవు ఏమి కోరుకున్నావో గుర్తుతెచ్చుకో, ద్వారకా పురిని చేరుకుని గోపాలుని దర్శించుకుని రావటమేగా నీ కోరిక. శ్రీకృష్ణులవారి నిర్ణయాలు ఖచ్చితంగా ఉంటాయి. ఎంత కోరితే అంతే అనుగ్రహిస్తారు. నీవు ద్వారకాపురిని చేరుకుని చూశావు... గోపాలునీ దర్శించావు...." ఆ గోపబాలుడే శ్రీకృష్ణులవారు.

శ్రీకృష్ణపరమాత్ముని దర్శించాలని కోరకుండా గోపాలుని దర్శనం అడిగావు. అందుకే గోపాలుని రూపంలో దర్శనం ఇచ్చారాయన.

"ఇప్పుడు మన ప్రయాణము ఎక్కడికి?"

"వర్తమానంలోకి. నన్ను ఆరాధించినవాడిగా నీతో మాత్రమే ఇలా సంభాషిస్తున్నాను. ఈ ప్రయాణాలకు వృద్ధశరీరాలు తట్టుకోలేవు. శరీరం నుండి ఆత్మ తొలగినతరువాత వృద్ధ శరీరంలోని జీవనాడులు త్వరగా కృశించి మరణం సంభవిస్తుంది.

అందుకే నిన్ను వెనక్కి పంపించేస్తున్నాను. యవ్వనములోని యువకులే ఈ ప్రయోగాలను తట్టుకుంటారు. ఆచార్యా! అతిగోప్యమగు ఈ విషయాన్ని మనసులో ఉంచుకుంటావని ఆశించెద...." అంటూ మరికొన్ని విషయాలు చెప్పి మవునం వహించాడు మణిభద్రయక్షుడు. అంతే–

ఆ తర్వాత ఫెళ్ళున ఏవో వెలుగురేఖలు ముఖాన్ని తాకటంతో అగ్ని వేశాచార్యుడి ఆత్మ మగతలోకి సోలిపోయింది. తిరిగి కళ్ళు తెరిచేసరికి శరీరంలో ఉన్నాడు. మందసంలోని స్వశరీరంలో నిద్రనుంచి మేల్కాంచినట్టు కళ్ళు తెరిచాడు.

కొద్దిక్షణాల వరకు ఏం జరిగింది, ఏమిటి ఏదీ గుర్తు రాలేదు అగ్నివేశాచార్యుడికి. క్రమంగా జరిగిందంతా గుర్తుకు వచ్చింది. తను ద్వారకా నగరం వరకు వెళ్ళాడు.

గోపబాలుడి పరిచయం, పండ్లు తినటం, పాలు తాగటం, అతనితో నడవటం, ద్వారకాపురిని దూరం నుంచి చూడటమంతా గుర్తుకు వచ్చింది. ఆ బాలుడు తన కుడికాలి తోడాను తీసి తనకు ధరింపచేశాడు. ఈ విషయం గుర్తురాగానే చటుక్కున లేచి కూచుని తన కుడిపాదం వంక చూసుకున్నాడు. ఆశ్చర్యం....! ఒక అద్భుతాన్ని చూస్తున్నట్టుగా అలా చూస్తూండిపోయాడు.

తన కుడిపాదం మీద వెండి తోడా ఉంది. తనకు రక్షగా ఉంటుందని ఆ గోపబాలుడు తొడిగిన తోడా... గోపబాలుడేమిటి... సాక్షాత్తూ ఆ గోవిందుడే... మాధవా... మధుసూదనా...

ఈ విధంగా అనుగ్రహించావా తండ్రీ అనుకుంటూ మనసులో కృష్ణపరమాత్మను తలుచుకుంటూ ఆ తోడాకు నమస్కరించి లేచాడు. మందసంమీది గ్లాస్ డూమ్‌ని తొలగించుకుని బయటికి వచ్చి తిరిగి దాన్ని మూశాడు.

ఆ మందసానికి, మణిభద్రయక్షుని తలచుకుని భక్తితో నమస్కరించి ఇవతలికొచ్చాడు. గోడ గడియారం సాయంకాలం అయిదుగంటల్ని సూచిస్తోంది. డేటు మారలేదు. తను ఉదయం మందసంలో ప్రవేశించాడు. సాయంకాలానికి తిరిగి వచ్చేశాడు.

అంటే ఇంచుమించు రెండుచోట్లా ఒకే సమయం గడిచింది.

ఆలోచిస్తూ గది తలుపులు తెరుచుకుని బయటికి వచ్చాడు అగ్ని వేశాచార్యుడు. అక్కడ తనను చూసి ఆశ్చర్యపోతున్న ఎవరితోనూ మాట్లాడకుండా నేరుగా తన పూజామందిరంలో ప్రవేశించి తలుపులు మూసుకున్నాడు.

* * * * *

ఆ రోజు ఉదయం చరక్ ఆఫీసులో ఉండగా సడెన్‌గా ఊరునుంచి ఫోన్ వచ్చింది. నాయనమ్మ దేవమ్మగారు ఫోన్ చేశారు. "ఎక్కడ ఉన్నావ్‌రా?" అడిగిందావిడ.

"ఆఫీసులో ఉన్నాను. ఏమయింది నాయనమ్మా సడెన్‌గా ఫోన్ చేశావ్. అంతా క్షేమమే గదా!" ఒకింత ఆందోళన చెందుతూ అడిగాడు. ఇంతవరకు ఆవిడ ఎన్నడూ పగటివేళ ఫోన్ చేయలేదు.

"అంతా క్షేమమేరా, నువ్వేం కంగారుపడకు. జేజి తాతయ్య ఇంటికి వచ్చి రెండ్రోజులయింది." ఆమె గొంతు కాస్త తడబడింది.

"తాతయ్యకు ఎమయింది? ఎలా వున్నారు?" వెంటనే అడిగాడు. ఆమె బదులు చెప్పటానికి సందేహిస్తున్నట్టుగా మౌనంగా ఉండిపోయింది.

చరక్‌లో ఆందోళన పెరిగిపోయింది. "చెప్పు... నాయనమ్మా. జేజి తాతయ్య ఎలా ఉన్నారు...?" తిరిగి అడిగాడు.

"బాగానే ఉన్నార్రా. కాని ఏమైందో అర్థంగావడంలేదు. వచ్చినప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడ్డంలేదు. ఒంటరిగా ఉంటున్నారు. గది వదిలి బయటకు రావటంలేదు. పాలుతప్ప ఆహారం ఏమీ తీసుకోవటంలేదు. మనసులో ఏదో దిగులు పెట్టుకున్నట్టు కన్పిస్తున్నారు.

ఎవరు ఏమడిగినా చెప్పడంలేదు. మాకు ఎందుకో భయంగా ఉందిరా. ఆయన దగ్గర నీకే చనువు ఎక్కువ. నువ్వు వస్తే మనసులో ఏముందో చెబుతారేమో. నీకు వీలవుతుందా? వెంటనే బయలుదేరి రాగలవా...?" ప్రాధేయపడుతున్నట్టు అడుగుతోంది ఆమె.

"వస్తాను నాయనమ్మా. ఆయన కన్నా ఇక్కడ పని ఎక్కువ కాదు నాకు. మీరేం కంగారు పడకండి. తాతయ్యకి ఏం కాదు. ఆఫీసుకు సెలవు పెట్టి ఈ పూటే బయలుదేరుతున్నాను...." అభయమిస్తున్నట్టు చెప్పాడు.

"ఇవాళ వచ్చేస్తావుగా?" అడిగిందావిడ.

"రాత్రి ఏదో టైమ్‌కి వచ్చేస్తా"

"సరి. జాగ్రత్త. నీకోసం ఎదురు చూస్తూంటాం"

ఫోన్ పెట్టేసిందావిడ. జేజి తాతయ్యకు దిగులేమిటి? పదిమందికి ధైర్యం చెప్పే వ్యక్తి. ఎప్పుడూ ఇలా జరగలేదు. అయినా ఆయనకి దిగులేమిటి? ఇంటికి వెళ్తేగాని విషయం ఏమిటో బోధపడదు.

వెంటనే ఆఫీసుకు సెలవుపెట్టేసి బయటికొచ్చేశాడు చరక్. అప్పటికి టైమ్ ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. బయలుదేరబోతుండగా శుశ్రుత గుర్తొచ్చింది. చెప్పకుండా ఊరెళ్ళిపోతే గొడవ చేసేస్తుంది. కిందటిసారి అనుభవం ఇంకా తాను మర్చిపోలేదు. వెంటనే శుశ్రుతకు ఫోన్ చేశాడు.

"చెప్పు చరక్. ఆఫీసునుంచేనా?" అడిగింది ఆమె.

"లేదు... ఊరు నుంచి ఫోన్ వచ్చింది. ఊరు వెళుతున్నా"

"ఏమైంది?"

''ఏం కాలేదు, మా జేజి తాతయ్య ఇంటికి వచ్చారట. నన్ను చూడాలంటున్నారట. జస్ట్ వన్‌వీక్‌లో వచ్చేస్తా" అన్నాడు.

"అయితే నేనూ వస్తాను."

"ఇప్పుడు కాదులే శుశ్రుతా...."

"సరిసరి. అటునుంచి అటే వెళ్ళిపోతే నువ్వు తిరిగొచ్చేవరకు నిరాహారదీక్ష చేస్తాను"

"శుశ్రుతా ప్లీజ్...."

"చెప్పేది విను చరక్ ప్లీజ్. గుడిముందు ఎదురు చూస్తూంటాను. త్వరగా రా" అంటూ లైన్ కట్‌చేసింది శుశ్రుత. ఇక ఎంత చెప్పినా ఈ అమ్మాయి వినదని అర్థమైపోయింది. నేరుగా శివాలయానికి వెళ్ళి శుశ్రుతను కలసి పరిస్థితి వివరించి ఆమెను బుజ్జగించక తప్పలేదు. అలాగే రామాచారి, కావేరి దంపతులతో కూడా తను ఊరు వెళుతున్నట్టు చెప్పివచ్చేస్తుంటే భోంచేశాక గాని వాళ్ళు అతన్ని వదల్లేదు.

అప్పటికే టైమ్ రెండుగంటలు దాటింది. అక్కడ్నుంచి మూడు గంటలకి రూమ్ చేరుకుని బట్టలు సర్దుకుని ప్రయాణమయ్యేసరికి నాలుగు గంటలు.

ఆటోలో సికింద్రాబాద్ వచ్చి దొరికిన బస్ ఎక్కి కూర్చున్నాడు. బస్సు బయలుదేరేసరికి సాయంకాలం అయిదు గంటలు దాటింది సమయం.

* * * * *

మానవజాతి ఆవిర్భావకాలం నుండీ ప్రజాహితం కోరి ప్రజాక్షేమం కోసం పాటుపడిన తమ జీవితాలను ధారపోసిన మహానుభావులెందరో ఉన్నారు.

మనిషి మేధస్సుకు పదునుపెట్టడం ఆరంభించాక కొత్త కొత్త ఆవిష్కరణలు ఎన్నో వెలుగుచూసి వాడుకలోకి వచ్చాయి.

ఈ రోజు మనం అనుభవిస్తున్న ప్రతి సౌకర్యం వెనుకా ఒక మేధావి మేధస్సు, అకుంఠితదీక్ష ఉన్నాయి. సమాజంలోని అన్ని రంగాల్లోను ఈ మహనీయులు కన్పిస్తారు. కాదంటే కొందరు లాభాపేక్షతో కృషి చేస్తారు. కొందరు నిస్స్వార్థంతో చేశారు. అంతే తేడా.

శ్రీ ధన్వంతరీ అగ్నివేశాచార్యుల వంటివారికి స్వార్థంతో పనిలేదు. లోకకళ్యాణమే వారికి ముఖ్యం. వైద్యరంగానికి ఆయన అందించిన సేవలు అనితరసాధ్యం. ఇక మంత్ర తంత్ర యంత్ర విద్యల్లో అజేయుడు. సకల వేదాలు, పురాణాలు, ఇతిహాసాలను ఔపోసన పట్టిన పురాణికుడు.

అలాంటి ఆచార్యునికి ఒక లక్ష్యం ఉంది. అదేమిటో ఇంతవరకు ఎవరితోనూ చెప్పలేదు. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం ఒక అద్భుత యంత్రాన్ని తయారు చేశాడు. అదే కాలనాళిక మందసం. మంత్ర తంత్ర యంత్రమూలికా సమన్వితమైన ఆ యంత్రాన్ని ఆయనే స్వయంగా పరీక్షించాడు.

అంతా సవ్యంగా ఉంది. కాని తన మనసులోని ఆశయం నెరవేరడానికి ఇప్పుడు తన వయసే అడ్డంకి గావటంతో ఒక్కసారిగా ఆయన్ని నిలువునా నిరుత్సాహం ఆవరించింది. దీనికి పరిష్కారం అర్థంకాలేదు. తన ఆశయసాధన కోసం మరొకరి ప్రాణాన్ని పణంగా పెట్టలేడు గదా.

చిన్న పొరబాటు చాలు ప్రాణాలు పోగొట్టుకోవడానికి. ఇప్పుడిక తను చేయగల్గిందేమీలేదు. ఈ విషయంలో తనకు సహకరించిన డాక్టర్ గోవిందపాత్రుడు, డాక్టర్ ముకుందపాత్రుడు, ఇతర సిబ్బంది అందరినీ సముచిత రీతిన సత్కరించాడు.

అవసరమయినపుడు ఫోన్ చేస్తా అని చెప్పి వారి వారి స్వస్థలాలకు పంపించాడు. డ్రైవర్ వాళ్ళందర్నీ జీప్‌లో తీసుకువెళ్ళి దింపివచ్చాడు.

ఈ లోపల అగ్నివేశాచార్యుడు తమ స్థావరం ఎవరికంటా పడకుండా దిగ్బంధనం చేసి కొన్ని అదృశ్యశక్తుల్ని కాపలా ఉంచి తనూ బయలుదేరాడు. దారిలో కోరుకొండ సమీపంలో తమదైన పురాతన ఎస్టేట్ భవంతి ఒకటి ఉంది. ఎస్టేట్‌లో పామాయిల్ తోటలు, నిమ్మ, జామతోటలు, మామిడితోటలు ఉన్నాయి.

ఆ ఎస్టేట్‌ను కనిపెట్టుకుని నమ్మకమైన కుటుంబాలు కొన్ని ఉన్నాయి. అంతా వాళ్ళే చూసుకుంటూ భద్రంగా ఆదాయాన్ని ఆయనకు అందజేస్తారు. ఎప్పుడో ఆయన వయసులో ఉండగా ధవళేశ్వరం జమీందారు నుండి కొనుగోలు చేసిన ఎస్టేట్.

దీనిగురించి ఆయనకు తప్ప ఆయన కుటుంబంలో ఎవరికీ తెలీదు. దీన్ని అంత గోప్యంగా ఉంచుకున్నాడాయన. అందుకు బలమైన కారణం ఉంది.

వారు ప్రయాణిస్తున్న జీప్‌ను ఆ ఎస్టేట్ భవంతి ముందు వదిలి అక్కడున్న కారులో సాయంత్రానికి మున్నలూరువారి అగ్రహారం చేరుకున్నారు.

వచ్చినప్పట్నుంచి ఆయనలో వచ్చిన మార్పుని కోడలు దేవమ్మగారు గమనిస్తూనే వుంది. అందుకే మనవడు చరక్‌ని వెంటనే రమ్మని ఫోన్ చేసిందావిడ. డ్రైవర్ కాశినుంచి కొంత విషయం సేకరించాలని చూసినా అది సాధ్యపడలేదు.

రంపచోడవరం అడవుల్లో విషయాలు ఏవీ పొరబాటున కూడా అతను నోరు జారడు. ఆచార్యుడి ఆదేశాన్ని మీరటం జరగదు. అది శిలాశాసనంలా అమలు జరగాల్సిందే.

*　　*　　*　　*　　*

హైదరాబాద్‌లో నిన్న సాయంత్రం బస్‌లో బయలుదేరిన చరక్ రాత్రంతా ప్రయాణించి రావులపాలెం సెంటర్‌లో బస్ దిగేసరికి తెల్లారిపోయింది. అక్కడి నుండి ఆటోలో మున్నలూరివారి అగ్రహారం ఇంటికి చేరుకునేసరికి తెల్లారి ఎనిమిది గంటలయింది.

నిన్న సాయంత్రం భోంచేయలేదు. అందుకే వస్తూనే ముందుగా స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. నాయనమ్మ వడ్డించిన వేడి వేడి ఇడ్లీలు తిన్నాడు.

చరక్, జేజి తాతయ్యను కలవడానికి బయలుదేరాడు. రెండంతస్తుల ఆ భవంతి వెనుకే విశాలమయిన కుటీరంలాంటి ఒక చక్కటి నిర్మాణం ఉంది. లోన ప్రత్యేక పూజగదితోబాటు అన్ని వసతులూ ఉన్నాయి. ఆయన అనుమతి లేకుండా ఎవరూ లోనకు వెళ్ళరు.

డ్రైవరు కాశి బాడీగార్డ్‌లా అక్కడే ఉంటాడు. అయితే ఒక్క చరక్ విషయంలో మాత్రం అతను ఆపడు. మిగిలిన కుటుంబసభ్యులుగాని, ఇతరులు గాని ఎవరు వచ్చినా లోనకు వెళ్ళి చెప్పి ఆయన అనుమతిస్తేనే పంపిస్తాడు.

చరక్‌ను చూడగానే లేచి నమస్కరించాడు కాశి.

"ఏరా... ఏమయింది జేజి తాతయ్యగారికి?" అడిగాడు.

"తెలీదు సార్" అన్నాడు వాడు. "తెలిసినా నువ్వు చెప్పవురా. నాకు తెలుసుగా" అంటూ లోనకు నడిచాడు. చరక్ డోర్‌లోకి వెళ్ళేసరికి– లోన విశాలమైన గదిలోని డబుల్‌కాట్ బెడ్‌మీద అటు తిరిగి పడుకునున్నాడు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

ఆయనకోసం ఉంచిన వేడిపాల గ్లాసు టేబుల్‌మీద అలాగేఉంది. కాసేపు ఆయన్ను చూస్తూండిపోయాడు చరక్. ఏమైందీ...? తనలో తను తర్కించు కున్నాడు.

నూటపాతికేళ్ళ అతిరథమహారథుని వంటి ఈ కార్యసాధకునకు బెంగా... దిగులా... ఎందుకు? నమ్మబుద్ధిగావటంలేదు. రంపచోడవరం అడవుల్లో ఏదో జరిగివుండాలి. అదేమిటో తెలిస్తేగాని విషయం బోధపడదు. డ్రైవరు కాశికి తెలిసేవుంటుంది.

తెలిసినా వాడు చెప్పడు. అదేమిటో తెలియాలంటే తానుగా ఆయనే చెప్పాలి.

"జేజి తాతగారూ" చిన్నగా పిలిచాడు.

ఆయన నిద్రపోవడంలేదు. ఓసారి తల తిప్పి చూసి తిరిగి ఎప్పటిలా పడుకున్నాడు. ఆయన ముఖంలో ఎలాంటి భావమూ లేదు. మనిషి కలతచెంది నట్టు చూడగానే అర్థమవుతోంది. మునిమనవడిని లోనకు రమ్మనిగాని, వద్దనిగాని ఆయన పిలవలేదు. అయినా తనే లోనకెళ్ళి పక్కన నిలుచున్నాడు.

"జేజీ... ఇదేం బాగలేదు. లేవండి చెప్తాను" తిరిగి పిలిచాడు. అయినా కదల్లేదాయన.

"ఇలాగయితే నాక్కోపం వచ్చేస్తుంది. కితకితలు పెట్టేస్తాను. తెలుసుగా" హెచ్చరించాడు చరక్.

"ఊ... పనీపాటా వదిలేసి నువ్వెందుకొచ్చావ్‌రా ఇప్పుడు? ఎవర్రా నిన్ను పిలిచింది?" వెల్లకిలా తిరుగుతూ అడిగాడాయన. అలా తిరుగుతుంటే మెడలోని రుద్రాక్షలు చప్పుడు చేశాయి.

"ఒకరు పిలవాలా. మీరిలా ఉంటే నాకు తెలీకుండా ఉంటుందా? మీరు లేచి కూర్చోండి"

"వద్దులేరా... నన్నిలా వదిలెయ్"

"వదలను. ఎలా వదులుతాను? మీ తర్వాతేగా మేమంతా. ఎవరిమీద మీ కోపం?" అన్నాడు చరక్.

"ఇది కోపం కాదులేరా?"

"మరి దిగులా... నేనుండగా మీరు దిగులు చెందాల్సిన పనేమిటి?

ముందు లేవండి, చెప్తాను" అంటూ చనువుగా చేయిపట్టుకు లాగాడు చరక్.

"ఒరే భడవా. గట్టిగా లాగకురా, మంచం మీంచి పడగలను. చెప్తే వినవు గదా. ఆగు" అంటూ చిన్నగా లేచి కూర్చున్నాడాయన.

"అది కాదురా చరక్...."

"వినను ఏదికాదో తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం. ముందు పాలు తాగండి. తాగాలి. అంతే!" అంటూ మూతతీసి పాలగ్లాసు అందించాడు. ఆ ఇద్దరి అనుబంధం అలాంటిది.

పెద్ద కుటుంబీకుడాయన. ఎందరో బతిమాలినా వినని ఆ ముత్తాతగారు మునిమనవడు చేత్తో అందించగానే గ్లాసు అందుకుని మారం చేయకుండా తాగేశాడు.

"ఇప్పుడు చెప్పండి జేజి... ఎందుకు ఇలా ఉన్నారు ఏమైంది?" పక్కన కూర్చుంటూ అడిగాడు. ఆయన్ని అభిమానంతో జేజి తాతయ్యకు బదులు జేజి అని పిలవడం చరక్ అలవాటు. భారంగా నిట్టూర్చాడు అగ్నివేశాచార్యుడు.

"వదిలెయ్‌రా. నూటపాతికేళ్ళు గడిచిపోయాయి. మహా బతికితే మరో అయిదారేళ్ళు ఉంటానేమో. ఈ వయసులో ఆశయాలూ, తాపత్రయాలూ అవసరమా! కాదంటే ఆశయం నెరవేరకుండానే పోతానేమోననే బాధ మనసులో ముల్లులా గుచ్చుతోంది. అంతే" అంటూ నిట్టూర్చాడు అగ్నివేశాచార్యుడు.

"ఏమిటి జేజి. దీనికే ఇంత బాధపడాలా?" అన్నాడు తేలిగ్గా చరక్.

"బాధ ఉండదా? జీవితాశయం సాకారం కావట్లేదు. పడ్డశ్రమ అంతా వృధా అవుతోందని తెలిశాక బాధ ఉండదా?"

"ఎందుకు బాధ? నేను లేనా? మీ జీవితాశయాన్ని నేను నెరవేరుస్తాను. అదేమిటో నాతో చెప్పండి" అన్నాడు చరక్.

"చెప్పినంత తేలిక కాదురా ఇది. అవసరమైతే ప్రాణాలు బలిపెట్టాలి."

"జేజి... మీకోసం... నా ప్రాణాలిచ్చయినా సాధిస్తాను. చాలా?" అన్నాడు చరక్.

అనుమానంగా చూశాడు అగ్నివేశాచార్యుడు.

"ఏరా ఈ మాట నువ్వు మనస్ఫూర్తిగానే అంటున్నావా?" అనడిగాడు.

"డౌటా?... ప్రమాణం చేయనా?"

"వద్దులేరా. నీమీద నమ్మకము ఉంది. ఇప్పుడు నీ కోసం అర్జంటుగా ఓ మాంచి అమ్మాయిని చూడాలి" "అమ్మాయా...."

"అవును. మనం ఏం చేయాలన్నా ముందు నీ పెళ్ళి జరగాలి"

'ఓర్నాయనో. ఈ ముసలాయన బొటనవేలికి, బట్టతలకి ముడేస్తున్నాడు. నా పెళ్ళికీ, ఈయన ఆశయసాధనకి సంబంధం ఏమిటో' అది గ్రహించినట్టు నవ్వేస్తూ "సంబంధం ఏంటని అడక్కు. అదంతే, ముందు నీ పెళ్ళి జరగాల్సిందే" అన్నాడు.

తెల్లబోయి చూశాడు చరక్. తనమనసులో మాటలు ఆయనెలా గ్రహించాడు. "మనసులో ఏమనుకున్నా పసిగట్టేస్తారా మీరు?" అనడిగాడు.

"సందేహమా? జీవితంలో ఎందరో మనుషుల్ని, మనస్తత్వాల్ని చూసినవాడ్ని. ఆ మాత్రం నీ మనసులో మాట గ్రహించలేనా?" బదులిచ్చాడు ఆచార్యుడు.

"ఓ.కె. జేజి. ఎలాగూ పెళ్ళి ప్రస్తావన తెచ్చారు గాబట్టి ఆ విషయాలు మాట్లాడుకునేముందు మీ ఆశయం ఏమిటి, అది సాధించడానికి నేనేం చేయాలి. డిటెయిల్డ్‌గా చెప్పండి."

"చెప్పబడదు" కట్టె విరిచినట్టు వెంటనే బదులిచ్చాడాయన. "సందర్భాను సారం వివరాలు చెప్పబడును. అంతేరా. ముందు నీ పెళ్ళి తర్వాతే మిగిలిన విషయాలు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

చరక్ ఆలోచించాడు. ఎలాగూ సందర్భం వచ్చింది గాబట్టి శుశ్రుత గురించి, తమ ప్రేమ గురించి ఆయనతో చెప్పాలని నోటి చివరివరకు వచ్చిన

మాటను టక్కున మింగేశాడు చరక్. కారణం ఎదురుగా ధుమధుమలాడుతూ వస్తున్న శ్రావణి. డ్రైవరు కాశీని తోసేస్తూ అనుమతి లేకున్నా విసవిసా లోనకొచ్చేస్తోందా అమ్మాయి.

"అయ్యా. అమ్మాయిగారు నా మాట వినకుండా వచ్చేస్తున్నారండి" అంటూ రిపోర్ట్ చేశాడు కాశీ.

"సరిసరి. నువ్వెళ్ళు" అన్నాడు ధన్వంతరీ అగ్నివేశాచార్యుడు.

"ఏమిటే. కాసేపు ఆగలేకపోయావా?" నవ్వుతూ అడిగాడు శ్రావణిని.

"ఎందుకు ఆగాలి జేజితాతా. బావను మీ దగ్గరే కూర్చోబెట్టుకున్నారుగా" అంటూ వచ్చి చరక్ పక్కన కూర్చుంది శ్రావణి.

"నేనేమీ నీ బావని కట్టి కూర్చోబెట్టలేదే. వాడొస్తే తీసుకెళ్ళు. నా మీద నిష్ఠూరాలెందుకు?"

"నిష్ఠూరం కాదు. కోపం"

"ఎందుకో...."

"నా గురించి మీరేం పట్టించుకోవడంలేదుగా. అయినా మీరు వెళ్ళమనందే బావ వస్తాడేమిటి?"

"ఇప్పుడేమిటే నేను రావాలి అంతేగదా?" అడిగాడు చరక్.

"అవును.రా పోదాం" అంటూ లేచింది శ్రావణి.

"తాతగారితో కొంచెం మాట్లాడి వచ్చేస్తానుగాని నువ్వు పద. తోటలో వెయిట్ చెయ్యి" చెప్పాడు.

"నిజంగా వస్తావా?"

"వస్తానంటున్నాగా. నువ్వు పద."

"సరి... త్వరగా రావాలి" ఎంత హడావిడిగా వచ్చిందో అంతే హడావిడిగా చెంగు చెంగున దూకుతూ బయటికెళ్ళిపోయింది శ్రావణి.

"ఏరా. ఇది నిన్నొదిలేలాలేదు. ఈడు జోడు కాదని ఆలోచిస్తున్నాను. నీ అభిప్రాయమేమిటి? చేసేసుకుంటావా?" సాలోచనగా మునిమనవడ్ని అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"లేదు జేజిగారు. నాకు ఆ ఉద్దేశం లేదండి" వెంటనే బదులు ఇచ్చాడు చరక్.

"కాని దానికి ఉందిగదా. నువ్వంటే పిచ్చి దానికి" అన్నాడు అగ్నివేశా చార్యుడు.

"నేను నచ్చచెప్పుకుంటా. ఇంతసేపు తనుందని మీతో చెప్పలేదు. మీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు చరక్.

అగ్నివేశాచార్యుడి కనుబొమలు ముడిపడ్డాయి. "ఏ విషయం?" అడిగాడు.

పర్సులోంచి శుశ్రుత ఫోటో తీసి ఆయనకిచ్చాడు చరక్. "ఈ అమ్మాయి ఎలా ఉందో చెప్పండి" అని అడిగాడు చరక్.

ఫోటోలోని శుశ్రుతను చూడగానే ఆయన ముఖం వికసించింది. ఒక నిముషం పాటు చూస్తూనే ఉన్నాడు. మనవడి అభిప్రాయం ఆయనకి అర్థమైంది.

"అమ్మాయి చాలా బాగుందిరా. నీకు తగిన జోడీనే. ఎవరీ పిల్ల?" ఫోటో తిరిగి ఇచ్చేస్తూ అడిగాడు అగ్నివేశాచార్యుడు.

చరక్ మౌనం దాల్చాడు.

"అడుగుతోంది నిన్నేరా. ఏమన్నా విషయం ఉంటే చెప్పు. ప్రేమించు కున్నారా?" అడిగాడు.

అవుననన్నట్టు తలూపాడు చరక్.

"మనవాళ్ళే. హైదరాబాద్. తండ్రి పేరు రామాచారి. శివాలయంలో పూజారి. తల్లి కావేరి. వారికి కొడుకు, కూతురు ఇద్దరే సంతానం. కొడుకు పెళ్ళయింది. ఏదో ఊళ్ళో పూజారిగానే స్థిరపడ్డాడు. శుశ్రుత బాగా చదువుకుంది. మంచి అమ్మాయి.

మేం ప్రేమించుకున్నాం. మీరు ఆశీర్వదిస్తే ఈ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాను. ఇప్పుడు ఈ విషయం చెప్పకూడదనుకున్నాను. ఎలాగూ పెళ్ళి ప్రస్తావన వచ్చింది గాబట్టి చెప్పేశాను" మనసులో మాటని బయటపెట్టేశాడు చరక్.

శ్రద్దగా విని మౌనంగా తల ఊపాడాయన.

"ఆగాగు... అమ్మాయి పేరు ఏమన్నావ్?" ముఖం వంక చూస్తూ అడిగాడు.

"శుశ్రుత" చెప్పాడు చరక్.

"చక్కటి పేరు. ఈ రామాచారి ఎవరోగాని ఆయుర్వేదం కొంతయినా తెలిసిన వాడైవుండాలి. ఆయుర్వేద వైద్య విధానానికి పితామహులనదగ్గ మన పూర్వీకుల గురించి అవగాహన కలవాడు. అందుకే నవీన శస్త్ర చికిత్సకు ఆద్యుడయిన శుశ్రుత మహర్షి పేరును తన తనయకు పెట్టుకున్నాడు. ధన్యుడు.

నీది చరక మహర్షి పేరు. ఆమెది శుశ్రుత మహర్షి పేరు. బాగుంది. ఇందులో అభ్యంతరమంటూ ఏమీలేదు. కాదంటే అమ్మాయిని చూడ్డానికి హైదరాబాద్ వరకు రాలేను. అన్నట్టు మీ జాతకబలం కూడా ఓసారి పరిశీలిస్తే మంచిది."

"ఏ దోషంలేదు జేజితాతగారూ. రామాచారి గారు చూశారు. అయినా మీకూ చూపించాలని శుశ్రుత జాతకం తెచ్చాను. బ్యాగ్‌లో ఉంది."

"శుభం. ఇక ఆలస్యమెందుకు. వాళ్ళని ఇక్కడికే బయలుదేరి రమ్మను. వారికోసం ఒక ఇల్లు కేటాయించి కావలసిన ఏర్పాట్లు చేద్దాం. ఈ నెల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఏకంగా వివాహం జరిపించి వెళ్తారు ఏమంటావ్?" అంటూ ఉత్సాహంగా తన అభిప్రాయం చెప్పాడాయన.

ఆయన ఏమంటారోననే ఇంతసేపూ సందేహించాడు చరక్. ఆయన ఓ.కె.అనగానే సంతోషపడిపోతూ హుషారుగా లేచాడు.

"మీరేమంటే అదే జేజిగారూ. మీరు ఆర్డర్‌వేయండి. చకచకా పనులు జరిగిపోతాయి. ఇవాళే వాళ్ళకి ఫోన్ చేస్తాను. ఇక మీరు ఏ దిగులూ ఉంచుకోకూడదు మరి" హెచ్చరించాడు.

"నువ్వొచ్చావ్ గదరా. నా దిగులు అంతాపోయింది. ఆకలిగా ఉంది. టిఫిన్ పంపించమని చెప్పి వెళ్ళు" అన్నాడాయన.

స్వయంగా తనే ఆ ముత్తాతగారికి టిఫిన్ తీసుకెళ్ళి అందించి అటునుంచి అటే శ్రావణి కోసం తోటలోకి వెళ్ళాడు చరక్.

చరక్ వెళ్ళేసరికి – కోపంలో దొరికిన ప్రతి పువ్వుని తుంచి చించి పడేస్తూ పొన్నచెట్టు కింద శ్రావణి అసహనంగా తిరుగుతోంది. అతడ్ని చూడగానే పరుగెత్తుకొస్తూ "ఏమిటింత లేటు బావా?" అనడిగింది.

"నా లేటు సంగతి అలా ఉంచు. ముందు నువ్వు కూర్చో చెప్తాను" అంటూ ఆమెను కూర్చుండజేసి ఎదురుగా కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పవే. అసలు ఏమిటి నీ సమస్య?" అడిగాడు చరక్.

"నువ్వే నా సమస్య" అంది శ్రావణి.

"నన్ను పెళ్ళిచేసుకోవని చాలా బెంగగా ఉంది. చెప్పు బావా. నన్ను చేసుకుంటావా లేదా?" సూటిగా అడిగేసింది శ్రావణి.

"నీకు నిజంగా పెళ్ళిమీదే ధ్యాసా లేక నేను వేరే అమ్మాయికి సొంతమవు తానని బాధా?" తనూ సూటిగానే ప్రశ్నించాడు చరక్.

"నిజం చెప్పాలంటే రెండోది కరెక్ట్" బదులిచ్చింది శ్రావణి.

"కదా... నీకు పెళ్ళీడు రావాలంటే నేను ఇంకో అయిదేళ్ళు ఆగాలి. అది సాధ్యంకాదు గాబట్టి నువ్వు అనవసరంగా నా మీద ఆశలు పెంచుకోవద్దు"

"అదికాదు బావా...."

"చెప్పేది పూర్తిగా విను. నువ్వంటే నాకు చాలా ఇష్టం. కాని ఆ ఇష్టం పెళ్ళికోసం కాదు. నీ క్షేమం కోసం. నువ్వు బాగా చదువుకుని పైకి రావాలి. అది ముఖ్యం. ఇక నీకు పెళ్ళీడు వచ్చేసరికి నాకన్నా మంచి మొగుడొస్తాడు. నేనే సెలక్ట్‌చేసి మీ పెళ్ళి జరిపిస్తాను. అందుచేత ఇక నా గురించి ఆలోచించ కుండా చదువుకో. అర్థమైందా?" వివరించాడు.

ఆ మాటలు వినగానే శ్రావణి ముఖం వాడిపోయింది. దూకబోతున్న కన్నీళ్ళని ఆపుకుని ముఖం దించుకుంది. ఆమెను చూస్తుంటే చరక్ మనసూ బాధపడుతోంది. తనంటే ఈ పిచ్చి పిల్లకి ఎందుకింత ప్రేమ? బుజ్జిగిస్తున్నట్టు ముఖం తనవైపు తిప్పుకుని ఆమె కళ్ళు తుడిచాడు. "ఇదే వద్దనేది. దేనిమీదా మనం అతిగా ఆశపడకూడదు. అది దక్కలేదంటే ఇలాగే బాధపడాలి. నా మాట విను" నచ్చచెప్పాడు.

"నిజం చెప్పు బావా. ఎవరినన్నా ప్రేమించావా?" ఉన్నట్టుండి అడిగింది. తెలివైంది, గ్రహించేసింది.

"ఊ" అన్నాడు పొడిగా.

"ఎవరా అదృష్టవంతురాలు?"

"శుశ్రుత. ఫోటో ఉంది చూస్తావా?" నువ్వు ఓ.కె. అంటేనే మా పెళ్ళి" శుశ్రుత ఫోటో చూపించాడు. కాసేపు ఫోటోను చూస్తూ మౌనంగా వుండిపోయింది శ్రావణి. ఏమనుకుందో ఏమో గాని ఫోటో తిరిగి ఇచ్చేస్తూ "ఓ.కె. బావా, నువ్వు ఇంతగా చెప్తున్నావు గాబట్టి నేను డ్రాపయిపోతాను.

శుశ్రుత బాగుంది. పెళ్ళి చేసుకో" అంది శ్రావణి.

"థ్యాంక్స్ శ్రావణి" మనసులోంచి పెద్ద భారం తొలగిపోయినట్టు ఫీలౌతూ ఫోటోని పర్సులో పెట్టుకున్నాడు.

ముత్తాతగారు ధన్వంతరీ అగ్నివేశాచార్యుల సలహా మీద తను పనిచేస్తున్న ఆఫీసుకి ఆరుమాసాలు లాంగ్ లీవ్ పెట్టేశాడు చరక్.

అగ్నివేశాచార్యుడు ఇప్పుడు ఎప్పటిలాగే చాలా హుషారుగా తిరుగుతున్నాడు.

* * * * *

ముత్తాతగారికీ తనకి మధ్య జరిగిన సంభాషణను చాలాగోప్యంగా వుంచాడు చరక్. ఆఖరికి నాయనమ్మ దేవమ్మగారితో కూడా ఏ సంగతీ చెప్పలేదు.

అలాగే శుశ్రుత గురించి కూడా ముత్తాతగారికి, తనకు తప్ప ఎవరికీ తెలీకుండా జాగ్రత్తపడ్డాడు. శ్రావణికి తెలిసినా ఎవరికీ చెప్పలేదు. కాని తమకు సమీపంలోనే ఒక ఇంటిని ఖాళీ చేయించి శుభ్రంచేసి రంగులు వేయించడం చూస్తుంటే తమకు తెలీంది ఏదో జరుగుతుందని మాత్రం బంధువర్గంలో సందేహాలు ఆరంభమయ్యాయి.

ఇక ఉండబట్టలేక దేవమ్మగారు మనుమడు చరక్‌ను నిలదీసింది.

"ఏరా దగ్గరుండి మరీ ఆ ఇంటి పనులు చూస్తున్నావ్. నీకు తెలీకుండా ఏదీ ఉండదు. నిజం చెప్పు. జేజితాతగారు ఉద్దేశ్యం ఏమిటి? ఏ విశేషం జరగబోతోంది?" అనడిగింది.

ఇంకా నాయనమ్మ వద్ద దాచటం ఇష్టంలేక శుశ్రుత ఫోటో చూపించేశాడు చరక్. విషయమంతా చెప్పాడు.

"అమ్మాయి లక్షణంగా ఉంది" ఫోటో చూడగానే కామెంట్ చేసిందావిడ. తిరిగి తనే అడిగింది. "ఎప్పుడు వస్తున్నారు వీళ్ళు?" అంటూ.

"మూడు రోజుల్లో వస్తున్నారు నాయనమ్మా"

"జేజితాతగారు ఏమన్నారు?"

"ఆయన ఓ.కె. చేశాకే ఆయన సలహామీదే ఈ ఏర్పాట్లు. శుశ్రుత వచ్చాక అందర్నీ ఒకేసారి ఆశ్చర్యపరచాలని ఇంతవరకు చెప్పలేదు. వేరే ఉద్దేశం కాదు. కోప్పడకు" అన్నాడు చరక్.

"కోపం కాదురా. ఇంత పెద్ద శుభకార్యం పెట్టుకుని ఎవరికీ చెప్పకుండా ఏం చేద్దామని? కనీసం వచ్చిన పిల్లకి ఎర్రనీళ్ళు దిష్టితీసి పోయటానికైనా సిద్ధంగా ఉండాలిగా. ఇంతకీ ఈ విషయం శ్రావణికి తెలుసా?

"తెలుసు. తిక్కది. ఎంతో నచ్చచెప్పాక కాని కాంప్రమైజ్ కాలేదు."

"అందుకేనా అది మూతి బిగించుకు తిరుగుతోంది" అంటూ నవ్వేసింది దేవమ్మ.

"సరిసరి. విషయం చెప్పావ్‌గా, నేను చూసుకుంటాలే. వెళ్ళి పనులు చూడు" అని లోనకు వెళ్ళిపోయింది దేవమ్మ.

రామాచారి కుటుంబం కోసం రెండంతస్థుల ఆ మేడ సర్వాంగ సుందరంగా సింగారించబడి కొత్త ఫర్నీచర్‌తో కళకళలాడనారంభించింది.

ఈ లోపల – అక్కడ హైదరాబాద్‌లో రామాచారి కుటుంబం కూడా ప్రయాణ హడావుడిలో బిజీగానే ఉన్నారు. చరక్ ఇలా సడెన్‌గా బయలుదేరి రమ్మని ఫోన్ చేయడంతో వాళ్ళకి కాలు, చేయి ఆడ్డం లేదు. శుశ్రుత అయితే ఒకటే హైరానాపడుతోంది, అక్కడంతా ఎలా ఉంటుందో ఏమిటోనని.

మొదట తమ బంధువర్గంలో కొందరినయినా వెంట తీసుకెళ్ళాలని ఆలోచన చేశాడు రామాచారి. తమ బంధువుల్లో చాలామందికి చరక్ తెలుసు. అతడిని తమ ఇంటివద్ద చూసున్నారు. అయితే కావేరి మాత్రం ఒప్పుకోలేదు. "వెళ్తోంది కొత్తచోటు. ముందుగా మనమేవెళ్దాం.

అక్కడకి వెళ్ళిన తర్వాత మిగిలింది ఆలోచిద్దాం" అంటూ సలహా ఇచ్చింది. రామాచారికి ఆమె సలహా నచ్చింది.

రామాచారి భార్య కూతుర్ని తీసుకుని రెండు సూట్‌కేస్‌లతో రాజమండ్రిలో రైలు దిగేసరికి ఉదయం ఎనిమిది గంటలు.

స్వయంగా కారు తీసుకుని చరక్ స్టేషన్ కొచ్చాడు. వారికోసం ప్లాట్ ఫారం మీద రెడీగా ఉన్నాడు.

"ప్రయాణం బాగా సాగిందా?" అంటూ ఒక సూట్‌కేస్ అందుకున్నాడు. శుశ్రుత తనూ కళ్ళతోనే పలకరించుకున్నారు. ఆమె చిరునవ్వు చాలు, ప్రపంచాన్నే జయించవచ్చనిపిస్తుంది.

పలకరింపులు అవగానే అంతా స్టేషన్ బయటికొచ్చారు. వారికోసం తనే కారు తీసుకొచ్చాడు చరక్. వెనుకసీట్లో రామాచారి దంపతులు, ముందుసీట్లో చరక్ పక్కన శుశ్రుత కూర్చున్నారు.

కారు రాజమండ్రి నుంచి బయలుదేరింది. సిటీ దాటగానే పంటపొలాలు, పండ్లతోటలు, ఆ పల్లెపట్టు వాతావరణాన్ని సంభ్రమంగా చూస్తోంది శుశ్రుత.

కారు కేశవరం దాటగానే కుడిపక్క కాలువపైన బ్రిడ్జి. ఆ బ్రిడ్జి మీదుగా మండపేట రూటు. కారు బ్రిడ్జి మీదకు తిరుగుతుండగా ఎడమపక్కగా ఎగువన గుళ్ళను చూశాడు రామాచారి. "అక్కడ ఏవో గుళ్ళు ఉన్నాయి. ఏమిటవి చరక్?" అనడిగాడు.

"అదే ద్వారపూడి బావగారూ, దేవాలయాలకు ప్రసిద్ధి. పెద్ద శివలింగం, గొప్ప అయ్యప్పస్వామి గుడి అవీ ఉన్నాయి" చెప్పాడు చరక్.

"ద్వారపూడి గురించి విన్నాను. ఎప్పుడూ మేం బెజవాడ దాటి ఇటురాలేదు. ఇక్కడ ప్రసిద్ధ ఆలయాలను దర్శించాలి" అన్నాడు రామాచారి.

"తప్పకుండా. పంచారామాల్లో రెండు ఇక్కడే ఉన్నాయి. ద్రాక్షారామం భీమేశ్వరుడు, సామర్లకోట సోమేశ్వరుడు.

ఇంకా రాలిమోహినీ ఆలయం, కోటిపల్లి – చల్లంగి, ముక్తేశ్వరం అటు అప్పనపల్లి వెంకటేశ్వరాలయం ఇలా చాలా పుణ్యక్షేత్రాలు ఉన్నాయి.

అటు విశాఖపట్నం వెళ్తే సింహాచలం వరాహ నరసింహస్వామి, ఇటు పశ్చిమ గోదావరి పాలకొల్లు క్షీరారామం, భీమవరం భీమారామం ఇవన్నీ చూడతగ్గ క్షేత్రాలే బావగారూ.

మా డ్రైవరు కాశీకి ఇవన్నీ కొట్టినపిండి. వాడితో పంపిస్తాను. తిరిగి చూద్దురుగాని" అంటూ వివరించాడు చరక్.

* * * * *

ఎనిమిదిన్నర గంటలకి కారు మున్నలూరు వారి అగ్రహారం చేరుకుంది. కారు గేటుదాటి అగ్రహారం గృహసముదాయాల్లోకి రాగానే ఇళ్ళలోని బంధువర్గ మంతా బిలబిలా వచ్చేశారు. రామాచారి కుటుంబం కోసం సిద్ధపరచివుంచిన ఇంటి ముందు నాయనమ్మ దేవమ్మగారు మరికొందరు ముఖ్యమైన స్త్రీలు సిద్ధంగా ఉన్నారు. వారితోబాటు శ్రావణి అక్కడే ఉంది.

వచ్చినవారిలో ఎక్కువ శాతం స్త్రీలు, పిల్లలూను. చరక్‌కు కాబోయే భార్యను చూడాలని ఎంతో ఆరాటంతో చూస్తున్నారంతా.

ముందుగా చరక్ కారుదిగి వెనుక డోర్ తెరవగానే రామాచారి దంపతులు కారు దిగారు. ఎదురుగా అంతమందిని ఒకేసారి చూడగానే తెలీని కంగారు ఏదో వారిని గాబరాపెట్టింది. బంధువర్గం ఎదురు చూడొచ్చుగాని ఇంతమందిని ఊహించలేదు వారు. స్త్రీ బాలవృద్ధులంతా అక్కడే వున్నారు.

ఒక కుదురులోంచి వచ్చిన కుటుంబాలు అవన్నీ. ఒకే మాట ఒకే బాటమీద ఉంటారు. అగ్రహారంలోనే కాదు అగ్రహారం వెలుపల ఊళ్ళోనూ అగ్నివేశాచార్యుడి మాటకు తిరుగులేదు.

దేవమ్మగారు చెప్పింది అంతా విని తీరాల్సిందే. అంత పద్ధతిగా ఉంటుంది ఆ గ్రామం. అందరికళ్ళు శుశ్రుత కోసం ఎదురు చూస్తున్నాయని చరక్‌కి తెలుసు. ఫ్రంట్‌డోర్ తెరిచాడు. ఒకింత సిగ్గుపడుతూ ఒద్దికగా కారు దిగింది శుశ్రుత. ఆమెను చూడగానే అందరి కళ్ళు ఒక్కసారిగా జిగేల్‌మన్నాయి.

సాంప్రదాయమైన చీర, జాకెట్‌లో శుశ్రుత సింపుల్‌గా, అద్భుతంగా ఉంది. చూస్తున్న అందరి మనసుల్లోనూ సంతృప్తి కనిపిస్తోంది.

"చరక్, శుశ్రుతలది అద్భుతమైన జోడీ. ఇంత వరకు మన అగ్రహారంలో ఇంత ముచ్చటైన జంటను చూళ్ళేదు" అని గుసగుసలు పోసాగారు.

"ఒరే అమ్మాయిని అక్కడే ఆగమనరా" అంది ఆర్డరు వేస్తున్నట్టు దేవమ్మ గారు.

"ఆవిడే మా నాయనమ్మ దేవమ్మగారు" శుశ్రుతకు వినబడేట్టు చిన్నగా గొణిగాడు చరక్.

ఎర్రనీళ్ళ పళ్ళెంతో సిద్ధంగా వున్న ఒక ముత్తైదువ కళకళలాడుతోంది. ఏభైపైన వయసు. ఆవిడ చిరునవ్వుతో వచ్చి శుశ్రుతతోబాటు చరక్‌కీ కలిపి దిష్టి తీసి అవతలకు పట్టుకెళ్ళి పారబోసి వచ్చింది.

దేవమ్మగారు ముసిముసిగా నవ్వుతూ ఇద్దరి వద్దకు వచ్చింది. "నన్ను ఆశీర్వదించండి అమ్మమ్మా" అంటూ వరుస కలిపేసి వినయంతో, శ్రద్ధతో ఆవిడ పాదాలకు నమస్కరించింది శుశ్రుత.

ఆవిడ మురిసిపోతూ "దీర్ఘాయుష్మాన్ భవ. శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు. లే... లే తల్లీ" అంటూ భుజాలు పట్టి లేపింది.

శుశ్రుత వినయవిధేయతలు చూడగానే అందరి ముఖాల్లోనూ తృప్తి కన్పించింది. రామాచారి దంపతుల్ని కూడా పరిచయం చేశాడు చరక్. అలాగే మరికొందరు ముఖ్యమైన పిన్నిలు, బాబాయ్‌లు, పెద్దమ్మ వరుసయ్యే వారిని పరిచయం చేశాడు. కాని అక్కడే ఉన్న శ్రావణిని ఇంకా పరిచయం చేయలేదు. ఉడుక్కొంటూ చిన్నగా దగ్గి ముందుకొచ్చింది శ్రావణి.

"ఏం బావా? అందరినీ పరిచయం చేస్తున్నావ్. నన్ను పరిచయం చేయవా?" చరక్‌ను నిలదీసింది.

"నీ పరిచయం అక్కర్లేదు. నాకు తెలుసు. నువ్వు శ్రావణి" అంది శుశ్రుత.

ఇప్పుడు శ్రావణి ఆశ్చర్యపోయింది. "అక్కా, ఏమో అనుకున్నానుగాని నువ్వు నాకన్నా ఇంటిలిజెంట్‌వి. కనిపెట్టేశావ్" అంది. అంతా నవ్వుకున్నారు.

"చరక్" అంటూ పిలిచింది దేవమ్మ.

"వీళ్ళని నిలబెట్టే మాట్లాడుతున్నాం. లోనికి తీసుకెళ్ళు. ప్రయాణం చేసి అలసిపోయుంటారు.

జేజితాతగారు పూజలో ఉన్నారు. ఓ రెండు గంటలు పోయాక ఆయనవద్దకు తీసుకెళ్ళు. తర్వాత నా వద్దకి తీసుకురా. ఈ లోపల నీళ్ళు స్నానాదికాలు చేసి రెడీ అవుతారు. వెళ్ళండి.

ఏయ్ శ్రావణీ. అక్కా అంటూ వరుస కలిపేశావ్‌గా. అక్కను లోనకు తీసుకెళ్ళు. పదండర్రా. కొద్దిరోజులిక్కడే ఉంటారుగా. ఇక రోజూ చూద్దురుగాని పదండి" అంటూ తమ భవంతికి బయలుదేరిందావిడ.

అంతా చెదిరిపోతూండగా చరక్, రామాచారి దంపతుల్ని లోనకు తీసుకెళ్ళాడు. వెనుకే శుశ్రుత, శ్రావణిలు అనుసరించారు.

కారు డిక్కీలోని సూట్‌కేస్‌లు రెంటినీ అంతకు ముందే నౌకరు ఇంటిలోన పెట్టేశాడు.

*　　*　　*　　*　　*

రంపచోడవరం అడవులు.

సమయం పన్నెండు గంటలు. పొద్దు నడిమింట ప్రకాశిస్తోంది. స్థానిక గిరిజనులు తిరిగే కాలిబాట మీద నడుచుకుంటూ వస్తున్నాడో యువకుడు. అతడి దుస్తులతీరు విచిత్రంగా ఉంది. గారడీ విద్యలు ప్రదర్శించేవాడిలా ఉన్నాడు.

వయసు ముప్పైలోపు ఉంటుంది. రెండు రోజులుగా వాడు ఆ పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తున్నా వాడికి గమ్యం ఎక్కడో తెలీడంలేదు.

ఆ యువకుడు ఎవరో కాదు, మాంత్రికుడి మూడో శిష్యుడు వికేశి.

మరిడి సోమయ్య తన మంత్రశక్తితో కొన్ని విషయాలు గ్రహించగలిగాడు. ముఖ్యంగా అడవిలోని స్థావరం వద్ద ఇప్పుడు ఎవరూ లేరని తెలిసిపోయింది. అగ్నివేశాచార్యుడు మిగిలినవారు తమతమ నెలవులకు వెళ్ళిపోయారు. స్థావరాన్ని శోధించాలన్నా, విచిత్ర మందసం విశేషాలు తెలుసుకోవాలన్నా ఇదే సరైన సమయం అన్పించింది.

కాని... ఆచార్యుడు అసాధ్యుడు. అంతటి అరక్షిత స్థితిలో స్థావరాన్ని వదిలిపోయుంటాడనుకోవడం అవివేకమే. ఏదో ఏర్పాటుచేసే ఉంటాడు. ఆ మర్మం ఏమిటో తెలుసుకోకుండా నేరుగా తను రంగంలోకి దిగటం అవివేకమవు తుంది. కాబట్టి ముందుగా ఎవరో ఒక సమర్థుడ్ని అక్కడికి పంపించి విశేషాలు తెలిశాక తను వెళ్ళడం మంచిదనిపించింది. అందుకు సమర్థుడని భావించి వికేశిని పంపించాడు.

తనకు ముందువెళ్ళి భంగపడి వచ్చిన విళంబి, మృణాళుడు ఇరువురి నుంచి స్థావరం ఆనుపాన్లు గుర్తులు అడిగి తెలుసుకుని బయలుదేరిన వికేశి రాజమండ్రిలో రైలుదిగి ఒకజీప్ మాట్లాడుకుని కావలసిన ఏర్పాట్లు చేసుకుని అడవిలోకి వచ్చాడు. డ్రైవరుతో సహా జీప్‌ని ఎగువన వాగుపక్కన వదిలి తను కాలినడకన వచ్చాడు.

వాళ్ళు చెప్పిన గుర్తులయితే కరక్టుగానే ఉన్నాయి గాని ఆ ప్రాంతంలో అన్నీ చెట్టుచేమలే కన్పించాయి. స్థావరం తాలూకు కట్టడాల జాడే లేదు.

కళ్ళకు అంజనం పెట్టుకుని గాలించినా అది కన్పించకపోవడం ఆశ్చర్య పరుస్తోంది. ఒకవేళ తను దారి తప్పాడేమోనని చిన్న డౌటు. అది తీరాలంటే ఎవడో ఒకడు స్థానిక గిరిజనుడ్ని సంప్రదించాలి.

అలాంటి వాడికోసం వెదుకుతుండగా ఎగువన పెద్ద వెదురుడొంక పక్కన వెదురుబియ్యం సేకరిస్తూ కన్పించాడు ఇరవై ఏళ్ళ కుర్రాడు. దుస్తుల తీరును బట్టి గిరిజనబాలుడని అర్థమవుతోంది.

వాడిని చూడగానే ప్రాణం లేచివచ్చినట్టయింది వికేశికి. వడివడిగా అటు నడిచాడు. దూరం నుంచే వికేశిని గమనించాడా కుర్రాడు. చేస్తున్న పని ఆపి కొత్త ముఖాన్ని పట్టిపట్టి చూడసాగాడు.

"ఏంది దొరా. ఎవరు నువ్వు? ఈ అడవిలో ఏం పని?" అనడిగాడు దగ్గరకు రాగానే.

"అందరం ఏదో పనిమీద వచ్చేవాళ్ళమేరా. నీ పేరేంది?" ఆ కుర్రాడ్ని అడిగాడు వికేశి.

"నా పేరు రామబాణం దొరా"

"రామబాణమా...." నవ్వాడు వికేశి.

"అవున్దొరా. బద్రాసలం రాములోరిమీద బక్తితో మా అయ్య పెట్టిన పేరు"

"ఇంతకీ నువ్వేం చేస్తున్నావిక్కడ?"

"వెదురుబియ్యం తీస్తున్నా దొరా!"

"నువ్వేనా ఇంకెవరన్నా ఉన్నారా!"

"నేనే దొరా, ఇంకా ఉన్నారుగాని అదో దూరంగా ఆ గుట్టెనక కుంకుళ్ళు, చింతపండు సేకరిత్తున్నారు" అన్నాడు రామబాణం.

"సరిసరి. తీసిన వెదురుబియ్యం చాలుగాని కాస్సేపలా కూర్చో. కబుర్లు చెప్పుకుందాం" అంటూ పక్కన చిన్న రాతిబండ మీద కూర్చున్నాడు వికేశి.

"నీతో మాటలేంది దొరా. ఏమన్నా సాయం కావాల్నా? అడగరాదూ?" అన్నాడా కుర్రాడు.

"భలేవాడివిరా. ఈ దిక్కు మాలిన అడవిలో మూడు రోజుల తర్వాత కనిపించిన మనిషి నువ్వు. చాలా ఆనందంగా ఉంది తెలుసా? రా కూర్చో. కాస్త మందుకొట్టి చీకుముక్కలు తిందాం." అంటూ తన బ్యాగ్‌లోంచి ఖరీదైన మందుబాటిలు, దోరగా కాల్చిన మాంసం ముక్కల పార్శిలు తీశాడు.

ఉదయమే రెండు అడవికోళ్ళను కొట్టి చీకులు తయారుచేశాడు తను. వాటిని చూడగానే – ఆ కుర్రాడికి నోరూరింది. "ఇది మా యిప్పసారా కన్నా బాగుంటుందా దొరా?" అనడిగాడు.

"తాగి చూడు. అద్భుతంగా ఉంటుంది."

"అయితే వత్తుండా దొరా. కొంచెం ఆగండి" అంటూ వెనక్కి వెళ్ళాడు వాడు. అంతవరకు సేకరించిన వెదురుబియ్యాన్ని మూటగట్టి పక్కనుంచి ఒక పలుకురాయిని అందుకున్నాడు.

అడవుల్లో వెదురుడొంకలు ఎలా వుంటాయో అక్కడ సంచరించి వచ్చినవారికి బాగా తెలిసే వుంటుంది. వెదురుడొంక అంటేనే చాలా ప్రాంతాన్ని ఆక్రమించి ఉంటుంది. బాగా ఎదిగిన వెదురుగడలు సుమారు వందనుంచి నూటయాభై అడుగుల వరకు ఎత్తు ఉంటాయి. ఒక్కో గెడ కణుపులో ఒక బస్తా ధాన్యం పట్టేంత లావుగా కూడా ఉంటాయి.

సువిశాలంగా చాలా ప్రాంతాన్ని ఆక్రమించి ఉండే ఈ వెదురుడొంకలు త్రాచుపాములకు నెలవై ఉంటాయి. వాటి ఒడుపు సులువు తెలీకుండా డొంకలోకి వెళ్ళడం ప్రమాదం. సంవత్సరానికోసారి వెదురు గడలు కంకులు వేసి బియ్యం తయారవుతాయి.

చాలా రుచిగా ఉంటుంది వెదురు బియ్యం అన్నం. ఈ వెదురుబియ్యం సేకరించి దాచుకుని పండుగలు, పబ్బాలకు వినియోగిస్తుంటారు.

ఈ వెదురుడొంకలో బాగా పెరిగిన గెడమీద చప్పుడు చేస్తే అది అడవిలో చాలాదూరం వినబడ్డమే గాక ప్రతిధ్వనిస్తుంది.

రాతిముక్కను తీసుకున్న ఆ కుర్రాడు ముదురు గెడమీద టకటకా చప్పుడు చేశాడు.

కాస్సేపటికి ఎగువ నుంచి అలాంటి శబ్దమే వినవచ్చింది. కుర్రాడు చకచకా ఓ నిముషంపాటు వెదురుడొంక మీద కొట్టి ఇవతలకి వచ్చాడు.

"ఏంలేదు దొరా. నేను బువ్వతినే యేలకి పోకుంటే మా అయ్య కంగారుపడి వచ్చేత్తాడు.

లేటవుతుందని సెప్పినా" అంటూ వచ్చి వికేశి ఎదురుగా పచ్చికమీద కూర్చున్నాడు.

"ఏందిరా. అలా కొడితే మీ అయ్యకి తెలిసిపోతుందా" నమ్మలేనట్టు అడిగాడు వికేశి.

"తెలుత్తాది దొరా. ఆ గుట్టెనకే మా వాళ్ళున్నారు" అన్నాడు నవ్వుతూ రామబాణం.

నమ్మాడు వికేశి. కాని అది సరికాదని తెలిస్తే ఏం చేసేవాడోగాని రామబాణం తమ కోడ్ భాషలో వర్తమానం పంపింది పులి కొండయ్యకి. 'కొత్త మనిషి వచ్చాడు. అనుమానంగా ఉంది. విప్పసారా పట్రా' అని సందేశమిచ్చున్నాడు.

వికేశి రెండు ప్లాస్టిక్ గ్లాసుల్లో మందుపోసి నీళ్లు కలిపి ఒకటి ఆ కుర్రాడికిచ్చి తనొకటి తీసుకున్నాడు. చీకుముక్కలు ఎదురుగా ఉంచాడు.

కొన్ని గిరిజన తెగల్లో తల్లీపిల్లా కుటుంబంలోని అంతా కల్లుతాగటం, మందు తాగటం చాలా కామన్ విషయం. అలవాటుంది గాబట్టే రామబాణం ఎత్తిన గ్లాసు దించకుండా గటగటా విస్కీ తాగేసి రెండు చీకుముక్కలు నోట్లో వేసుకున్నాడు.

"ఓరి నీ దుంపతెగ. అంత స్పీడేమిట్రా. స్లోగా కొంచెం కొంచెం తాగాలి" హితబోధ చేస్తున్నట్టు చెప్పాడు వికేశి.

"కొంచెం కొంచెం మాకు అలవాటు ఉండదు దొరా. ఒకేసారి... ఐనా అబ్బే! ఇది మా యిప్పసారాకు మించి గొప్పగా ఏం లేదు దొరా" అన్నాడు.

"యిప్పసారా అంటే దేంతో చేస్తార్రా?"

"యిప్పచెట్టు పువ్వు... తియ్యగా, తిక్కగా మాకమ్మగా ఉంటుంది దొరా. ఆ పువ్వు ఊరబెట్టి తీస్తాం గాని దొరా. సూడ్డానికి అదోలా ఉన్నారు. ఆ మద్దె కోరుకొండ తిరనాళ్ళకెళ్ళినప్పుడు జూసినా. మీలాగే బట్టలేసుకుని ఒకడు బలేగారడీ జేసిండు. మీరు కూడా జేత్తారా?" అమాయకంగా అడిగాడు. నవ్వాడు వికేశి. "గారడీ చూత్తావా? ఏం కావాలో అడుగు" అంటూ తిరిగి రెండు గ్లాసుల్లోనూ విస్కీ వంచి వాటర్ కలిపాడు.

"ఏదో ఒకటి జేసి సూపించండి దొరా. వెదురు డొంక యెక్కకండానే నాకు మరింత యెదురుబియ్యం కోసియ్యండి చూద్దాం" అంటూ తన గ్లాసు అందుకున్నాడు రామబాణం.

"అదెంత పనిరా. మంత్రం వేస్తే చింకాయలే కాదు వెదురుబియ్యం కూడా రావలసిందే. చూస్తావా?" అంటూ కుడిచేయి గాల్లో ఆడించి ఏదో మంత్రం చదివాడు. అంతే... వెదురుడొంకలోంచి గుత్తులు గుత్తులుగా వెదురుబియ్యం కంకులు తాముగా వచ్చి ఆ కుర్రాడి ముందు రాశి పడ్డాయి.

అది చూడగానే తాగింది దిగిపోయింది వాడికి. తన ముందున్నవాడు సామాన్యుడు కాదని అర్థమైపోయింది. రెండో గ్లాసు కూడా గటగటా తాగేసి పక్కనపెట్టాడు. "మీ గారడీ చాలా గొప్పగుంది దొరా" అన్నాడు చీకుముక్క నములుతూ.

"ఇంతకీ ఈ కోనలో మీకేం పని దొరా?" కూపీలాగుతున్నట్టు అడిగాడు.

"ఏం లేదురా. అగ్నివేశాచార్యుడు గారని మా గురువులు. నీకు తెలుసా?"

"ఏదీ... పొడుగ్గా ఉంటారు. గడ్డం మీసాలు వందేళ్ళపైనే ఉంటాయి. ఆ పెద్దాయన గురించా...."

"అవున్రా. ఆయనే... తెలుసా?"

"అయ్యబాబోయ్. ఆయన తెలీకపోడం ఏంది దొరా. మా అందరికీ దేవుడాయన. ఆ సాములోరు ఇప్పుడు ఇక్కడ లేరుగా"

"లేకున్నా ఫరవాలేదు. ఆయన ఉండే చోటు చూపించు. ఆయన వచ్చేవరకూ అక్కడుంటాను"

"అట్టనే దొరా. మనకి దగ్గరే ఉందా చోటు. నేను చూపిస్తాలెండి" అభయమిస్తున్నట్టు చెప్పాడు.

అంతలో అలికిడైతే – తిరిగి చూశారిద్దరూ. చేతిలో విప్పసారా బాటిల్ పుచ్చుకుని ఒక వ్యక్తి తమ వైపే వస్తున్నాడు.

అతను అగ్నివేశాచార్యులవారి కుడిభుజం, నమ్మినబంటు అయిన పులి కొండయ్య.

రామబాణం వెదురుకర్రమీద రాయితో కొట్టి ఇచ్చిన సిగ్నల్ అందుకుని వెంటనే బయలుదేరి వచ్చేశాడు. వికేశికి అతనెవరో తెలీదు.

"ఏంది మావా ఎందాకా పోతుండావ్?" ఏమీ తెలీనట్టు పలకరించాడా కుర్రాడు.

"ఇక్కడేరా డేగల మర్రిదాకా పోతుండాగాని ఇక్కడేందిరా మీటింగు. ఎవరీ దొర?" తనూ ఏమీ తెలీనట్టు అడిగాడు పులి కొండయ్య.

"మన సాములోరి తాలూకంట మావా. వారి మకాం జూపిత్తే ఆయన వచ్చేవరకు ఆడ ఉంటాడంట. దొరకి భలేగారడీ తెలుసు మావా. దొంక ఎక్కకండానే మంత్రం పెడితే ఈ యెదురుకంకులన్నీ అవే వచ్చి పడ్డాయ్ తెలుసా? చేతిలో ఏంది మావా. యిప్పసారానా. తే మావా. మన యిప్పసారా అంత గొప్పదా అంటున్నాడు. కాస్త పోసివ్వు రుచిజూత్తాడు దొర"

"అదెంత భాగ్యంరా పోసివ్వు" అంటూ బాటిల్ అందించాడు పులి కొండయ్య.

వికేశికి ఎక్కడా చీమతలకాయంత అనుమానాని క్కూడా అవకాశం ఇవ్వలేదు ఇద్దరూ. వికేశి కూడా విప్పసారా టేస్ట్ చూడాలన్న కోరికతో వెనకాముందు ఆలోచించలేదు. చూడ్డానికి మంచినీళ్ళలా వున్న విప్పసారాను తేలిగ్గా తీసుకుంటూ రెండు గ్లాసులు తాగేశాడు. తాగిన కొద్ది నిముషాల్లోనే తిలివితప్పి పడిపోయాడు. ఆ తర్వాత ఏం జరిగిందో...

* * * * *

రామాచారి కుటుంబం స్నానాదికాలు ముగించి బట్టలు మార్చుకుని రెడీ అయ్యేసరికి వారికోసం వేడివేడి టిఫిన్ ఎదురుచూస్తోంది. అంతా టిఫిన్లు తీసుకుని కాఫీలు తాగారు. చరక్‌తో బాటు శ్రావణి కూడా దగ్గరుండి చూసుకున్నారంతా.

శుశ్రుత మెడలో సన్నటి బంగారు గొలుసు, చెవులకు రవ్వల దిద్దులు. అంతే ఎక్కువేమీ నగలు వేసుకోకుండా చీర, జాకెట్‌లో సింపుల్‌గానే తయారైంది.

ముత్తాతగారి పూజాదికాలు ముగిసి ఆయన ఉపాహారం కూడా తీసుకున్నాక ఆయన దర్శనార్థం రామాచారి కుటుంబాన్ని వెంటబెట్టుకుని తీసుకెళ్ళాడు చరక్. వారు వెళ్ళేసరికి తన నివాసంలో హాల్లోనే సోఫాలో కూర్చునున్నాడు అగ్నివేశాచార్యుడు.

చిరునవ్వుతో అందర్నీ వీక్షించాడు. ఆయన్ను చూడగానే దైవదర్శనం అయినంత ఆనందంతో రామాచారి దంపతులు పులకించిపోయారు. సవినయంగా ఆయనకు పాదాభివందనం చేశారు.

"దీర్ఘాయుష్మాన్‌భవ. ఇష్టకామ్యార్థసిద్ధిరస్తు. లేవండి" అంటూ వాత్సల్యంతో ఇద్దర్నీ ఆశీర్వదించాడు అగ్నివేశాచార్యుడు.

"తమ గురించి వినడమేగాని ఇంతవరకు దర్శన భాగ్యం కలగలేదు. మిమ్మల్ని చూస్తుంటే సదా నేను అర్చించే ఆ సదాశివుణ్ణి చూస్తున్నట్టుంది.

ఈ విధంగా మా కోరిక తీరింది" వినయంగా చేతులు కట్టుకుని నిలబడి పలికాడు రామాచారి.

"అందరిలోనూ శివాంశ ఉంది నాయనా, భక్తి కలవారిలో అది ప్రస్ఫుటమవుతుంది. అంతా ఆయన అనుగ్రహం. ఎవరెవరిని ఎప్పుడు కలపాలో ఆయనకు తెలుసు. అలా కూర్చోండి. రా తల్లీ. ఇటు రా" అంటూ చేయి ఊపి శుశ్రుతను పిలిచాడు.

ఎదురుగా సోఫాలో వినయంగా కూర్చున్నారు రామాచారి దంపతులు.

శుశ్రుత బిడియంగా చూస్తుంటే చరక్ ఆమెను ముందుకు తీసుకొచ్చాడు. ఇద్దరూ కలసి ఆయన పాదాలు తాకి నమస్కరించారు.

"శీఘ్రమేవ కళ్యాణమస్తు" అంటూ ఆ జంటను ఆశీర్వదించారాయన. "సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మి మా ఇంట అడుగుపెట్టినట్టుంది తల్లీ నిన్ను చూస్తుంటే. రా ఇలా కూర్చో" అంటూ శుశ్రుతను తన పక్కన కూర్చోపెట్టు కున్నారాయన.

అంతా గమనిస్తూనే వుంది శ్రావణి. బుంగమూతి పెట్టి "జేజితాతగారూ ఇదేం బాగలేదండి" అంది.

"ఏంటే? నీకేం బాగలేదు?" ఒకింత పరిహాసంగా నవ్వుతూ మనవరాలిని అడిగాడు అగ్నివేశాచార్యుడు. "అస్సలు బాగాలేదండి. అక్కనైతే ఎంచక్కా ఆశీర్వదించారు. మరి నన్నెప్పుడన్నా అలా ఆశీర్వదించారా? పైగా తిడతారు" అంది నిష్ఠూరంగా.

"అదేమిటే. అల్లరేగాని నువ్వెప్పుడన్నా ఇంత ఒద్దికగా పాదాభివందనం చేసి ఆశీర్వచనం అడిగావా? గడుగ్గాయి. పైగా నిష్ఠూరం వేరే. రా... ఇలారా"

అంటూ పిలిచి ప్రేమగా ముదిమనవరాలిని రెండో పక్క కూర్చోబెట్టుకుని మురిపెంగా జుత్తు నిమిరాడు.

"రామాచారీ. నేను ఉంటానో లేదో గాని చరక్ పెళ్ళి తర్వాత మా ఇంట జరిగే శుభకార్యం దీని పెళ్ళేనయ్యా. మా అందరి కంటిపాప ఇది" అన్నాడు.

ఆ మాటకు కంటనీరు పెట్టుకుంటూ వటవృక్షం లాంటి ఆ ముత్తాత భుజం మీదకు మారాంగా వాలిపోయి చేతులు చుట్టేసింది శ్రావణి.

"మీరలా అనకండి జేజితాతగారు. నాకు ఏడుపొస్తుంది. నా పెళ్ళికూడా మీ చేతులమీదుగా జరగాల్సిందే" అంది శ్రావణి.

"అవునండి జేజి తాతగారు... మీరలా మాట్లాడితే మాకు బాధగా ఉంటుంది...." అన్నాడు చరక్.

'పిచ్చోళ్ళారా. నామీద ప్రేమతో అలా అంటున్నారు గాని మీకు తెలీదా? పండుటాకులు రాలిపోవటం ప్రకృతిధర్మం. ఆ ధర్మాన్ని ధిక్కరించే అధికారం మనిషిగా పుట్టిన ఆ దేవుడికే లేదు.

మనమెంత. కాదంటే పండిపోయినా కొమ్మనంటిపెట్టుకొనుండే తిక్క ఆకులాంటాడ్ని. అందుకే మా తరం వాళ్ళంతాపోయినా నేనింకా బతికే ఉన్నాను.

మా అమ్మగారు నాకు ఏ వరం ఇవ్వలేదు గాని తల్లి గంగాదేవి నుంచి స్వయంమరణాన్ని వరంగా పొందిన భీష్మాచార్యుడివంటి వాడ్ని. భయపడకండి. ఇంకా కొంతకాలం మీ మధ్యనే ఉంటాను. చేయవలసిన పనులు ముగించే వెళ్తాను.

ఈ సృష్టిలో వ్యర్థజీవి అంటూ ఏదీలేదు. ప్రతి జీవినీ సకారణంగానే పుట్టిస్తున్నాడు దేవుడు. ఆ యా జీవులు వాటికి నిర్దేశించిన పనులు కాగానే తిరిగి తీసుకుపోతుంటాడు.

''పునరపి జననం, పునరపి మరణం.'' జీవుడు తిరిగి తిరిగి పుడుతుంటాడు. ఛస్తుంటాడు. వారి వారి పాప పుణ్యాలే వారి జన్మలని నిర్దేశిస్తాయి.

'చినిగిన వస్త్రాన్ని వదిలి కొత్త వస్త్రాన్ని ఏ విధంగా ధరిస్తామో అలాగునే జీవుడు కూడా ఒక శరీరాన్ని వదిలి మరో శరీరాన్ని ధరిస్తాడు' అంటాడు సాక్షాత్తూ

ఆ కృష్ణపరమాత్మ గీతలో. కాబట్టి మనం వయసుతో వచ్చే అన్ని దశల్నీ ఆనందంగా అనుభవించాలి గాని భయపడి బాధపడకూడదు."

అగ్నివేశాచార్యుని మాటలు పూర్తిగాకుండానే ఆయన సెల్‌ఫోను మోగడం ఆరంభించింది.

మాటలు అంతటితో ఆపి-ఫోన్ అందుకున్నారు అగ్నివేశాచార్యులు.

* * * * *

అవతల లైన్లో ఉంది నమ్మినబంటు పులికొండయ్య.

రంపచోడవరం అడవి నుంచి శాటిలైట్ ఫోన్ ద్వారా ఫోన్‌చేశాడు. ఆ ఫోన్‌ను వాడివద్దే వదిలేసి వస్తుంటాడాయన. ఏదన్నా ముఖ్యమైన సమాచారం ఉంటే ఫోన్ చేయటానికి. తమ స్థావర ప్రాంతాన్ని ఓ కంట కనిపెట్టి ఉండటం వాడి డ్యూటీ.

"ఏరా. ఏమైంది?" నొసలు ముడివేస్తూ అడిగాడాయన.

"సామీ. ఓ ముఖ్యమైన సమాచారం మీకు చెప్పాలి. అందుకే ఫోన్‌చేసినా" అటునుంచి పులికొండయ్య గొంతు విన్పించింది.

"చెప్పు, ఏమిటా సమాచారం?"

"సామీ... ఇక్కడ ఒక ముప్పైలోపు వయసున్న యువకుడు మన తావు వెదుకులాడుతూ తిరుగుతుండాడు. మంత్రగాడిలా ఉన్నాడు.

మా రామ బాణం వాడ్ని ఒడుపుగా పట్టి తెలివితప్పించినాడు. నోట్లో గుడ్డలుకుక్కి మన తావుకి లాక్కొచ్చి చెట్టుకు కట్టేసుంచినాం. ఇప్పుడు ఏం చేయమంటారు సామీ?" అంటూ అవతలి నుంచి జరిగింది వివరించాడు వాడు.

అంతా విని గాభరా చెందాడు ఆచార్యుడు.

"ఓరి మీ అసాధ్యం కూల. చూసి రమ్మంటే కాల్చివస్తారేంరా. అనుమానించతగ్గ వాళ్ళు కనిపిస్తే గమనించి ఫోన్ చేయమన్నానుగాని ఇవేం పనుల్రా"

"అదికాదు సామీ...."

"చాలు. చెప్పింది విను. ఇప్పటికే ఎక్కువ చేశారు. వాళ్ళు మంత్రగాళ్ళు. మీ కట్లు వాళ్ళని ఆపలేవు. స్పృహలోకి వచ్చాడంటే మిమ్మల్ని మంత్రం పెట్టి

చంపేస్తాడు. చాలా ప్రమాదం. మీరా పరిసరాల్లో ఉండకుండా వెంటనే దూరంగా వెళ్ళిపొండి. వాడి కంటికి కన్పించకూడదు. అర్థమైందా?"

"అయింది సామీ. ఇప్పుడే యెల్లిపోతాం"

"నేను వెంటనే బయలుదేరివస్తున్నాను. ముందు మీరిద్దరూ అక్కడ్నుంచి వెళ్ళిపొండి త్వరగా" అంటూ హెచ్చరించి లైన్ కట్‌చేసి లేచాడు. వింటున్న అందరికీ ఏదో ప్రాబ్లం జరిగిందని అర్థమవుతోంది. కాని ఏం జరిగిందో తెలీదు.

"జేజి తాతగారూ ఏమైంది?" వెంటనే అడిగాడు చరక్.

"ఏం లేదురా. చిన్న ప్రాబ్లం. నేను వెంటనే రంపచోడవరం వెళ్ళాలి. రాత్రికి గాని, రేపు ఉదయం గాని వచ్చేస్తాను" చెప్పాడు.

"నేను రానా?"

"అక్కర్లేదు. అరే కాశీ బండితియ్యరా" అనరిచాడు. బయట సిద్ధంగా వున్న డ్రైవర్ కాశీ కారు తీసుకురావటానికి పరుగెత్తాడు.

"రామాచారి, మనం సాయంత్రం ఓసారి కూర్చుని వీళ్ళ జాతక చక్రాలు బాగోగులు మరోసారి పరిశీలించాక అందుకు తగ్గట్టుగా భేషయిన వివాహ ముహూర్తం నిర్ణయిద్దామనుకున్నాను. కాని ఇప్పుడు వీలుకాదు.

రేపు నేను వచ్చాక కూర్చుందాం. ఏమీ అనుకోవద్దు." అంటూ రామాచారి నుద్దేశించి పలికాడు. అప్పటికే లేచి నిలబడ్డారంతా.

"ఎంత మాట? ఇందులో అనుకోవలసింది ఏమీలేదు. మీమాట మాకు శిరోధార్యం. మీరు వచ్చాకే ఆ పనులు చూద్దాం. వెళ్ళిరండి" అన్నాడు రామాచారి. అంతలో కారు గుమ్మంలోకొచ్చింది.

"మీకు ఇక్కడ ఏ లోటూ రాదు. మొహమాట పడకండి" అంటూ చెప్పి చరచరా వెళ్ళి కార్లో కూర్చున్నాడు అగ్నివేశాచార్యుడు.

కారు వేగంగా బయలుదేరి వెళ్ళిపోయింది. రామాచారి ఫ్యామిలీతో నాయనమ్మ దేవమ్మగారి వద్దకు బయలుదేరాడు చరక్.

* * * * *

జాజ్‌పూర్ (విరిజాపురి). నీలోదరి కొండగుట్ట. మాంత్రికుడు మరిడి సోమయ్య నివాసం. ఈ రోజు ఎన్నడూ లేనంత అసహనంగా ఉన్నాడతను.

అందుక్కారణం అతడి అనుంగుశిష్యుల్లో మూడోవాడగు వికేశి. మరిడి సోమయ్య టెన్షనంతా వాడి గురించే. ఏమయ్యాడు వాడు?

ఫోన్ చేస్తే ఎందుకు లిఫ్ట్ చేయటంలేదు. ఇదే ఆలోచన అతడ్ని కుదురుగా ఉంచటంలేదు. అతడ్ని సమీపించడానికే భయపడుతూ శిష్యులంతా దూరంలోనే ఉండిపోయారు.

విళంబి, మృణాళుడు ఇద్దరే గురువు ఆనతికోసం ఎదురుచూస్తూ దగ్గర్లో నిలబడున్నారు.

అగ్నివేశాచార్యుడి స్థావరం వద్ద ఇప్పుడు ఎవరూ లేరుగాబట్టి వెళ్ళి పరిస్థితి గమనించి వీలైతే లోనకు వెళ్ళి ఆ విచిత్ర మందసాన్ని పరీక్షించి రిపోర్ట్ చేయటం కోసం తన అనుమతితోనే వికేశి బయలుదేరివెళ్ళాడు. రెండు రోజులు ఆ ప్రాంతాన్ని వెదుకు లాడుతూ బాగానే రిపోర్ట్ చేశాడు.

ఇవాళ ఉదయమూ చేశాడు. అక్కడ ఏమీ కన్పించడం లేదని ఫోన్‌చేస్తే కళ్ళకు అంజనం పెట్టుకుని చూడమని సలహా ఇచ్చాడు. అంతే ఆ తర్వాత ఏమైంది. ఎలా ఉన్నాడు ఏవిధమైన రిపోర్టు లేదు.

వాడి దగ్గరున్న శాటిలైట్‌ఫోన్‌కి ఫోన్ చేస్తే రింగవుతోంది గాని లిఫ్ట్ చేయడం లేదు. వాడి పరిస్థితి ఏమిటో అర్థంగావటంలేదు. అదే మరిడి సోమయ్య టెన్షన్. అలాగని ఏ మంత్రంతోనూ వాడి జాడ తెలుసుకోవటం కూడా కష్టంగా ఉంది.

ఏమైంది వాడికి? అదే అర్థంగావటంలేదు. "పోనీ... ఏదో విధంగా నేనక్కడికి వెళ్ళి పరిస్థితి తెలుసుకు రమ్మంటారా గురుదేవా?" అడిగాడు మృణాళుడు.

"వద్దురా" అన్నాడు వెంటనే మరిడి సోమయ్య.

"చూద్దాం. చీకటిపడేలోన వాడు ఫోన్ చేయాలి. లేదా ఫోన్ లిఫ్ట్‌చేయాలి. రెండూ జరగలేదంటే వాడేదో ప్రమాదంలో ఉన్నాడనే అర్థం. రాత్రికి ఏదో ఒక నిర్ణయం చేద్దాం" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

* * * * *

తెలివితప్పిన వికేశికి తిరిగి మూడు గంటల తర్వాత గాని స్పృహరాలేదు.

తెలివి వచ్చినా ఇంకా ఒళ్ళు తూలుతోంది. కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ఒళ్ళంతా నొప్పులు. నోట్లో గుడ్డలు కుక్కి తనను కదలకుండా చెట్టు మొదట్లో కూర్చోబెట్టి బలంగా కట్టేశారు. ఎందుకిలా చేశారు.

విప్పసారా రుచి చూపిస్తామని అందులో కొంత మత్తుమందుకూడా కలిపినట్టున్నారు. అందుకే తాగిన కొద్దిసేపటికే ఒళ్ళు తెలీకుండా మత్తుగా పడిపోయాడు. వాళ్ళు కన్పిస్తే జీవితంలో ఎందుకు వీడితో పెట్టుకున్నామా అని కుళ్ళికుళ్ళి ఏడ్చేంతగా శిక్షించి ఉండేవాడు.

కాని వాళ్ళిద్దరూ ఆ పరిసరాల్లో ఎక్కడా కనిపించడంలేదు. పారి పోయుంటారు వెధవలు. అదృష్టం తన బ్యాగ్ జోలికి పోలేదు వాళ్ళు. పక్కనే ఉంది. చూస్తుంటే వాళ్ళిద్దరూ తనని చాలాదూరం మోసుకొచ్చి ఇక్కడ బంధించి నట్టుంది. అంత అవసరం ఏమొచ్చింది వాళ్ళకి? డబ్బు, వస్తువుల కోసమంటే అవన్నీ భద్రంగానే కన్పిస్తున్నాయి. పైగా ఈ చోటు ఆచార్య అగ్నివేశుడి స్థావరంలాగే ఉంది.

ఎందుకంటే తన మిత్రులు విళంబి, మృణాళుడు ఇద్దరూ చెప్పిన గుర్తులు కన్పిస్తున్నాయి. నిన్న కూడా తనీ ప్రాంతం వరకు వచ్చిపోయాడు. ఇక్కడ కట్టడం అదృశ్యం కావటం అంటే ఇందులో అగ్నివేశుడి తంత్రం ఏదో ఉండి ఉండాలి. ఈ విషయంలో గురువుగారి సలహా తీసుకోవడం మంచిది.

ఆలోచిస్తూనే అతి కష్టంమీద నోట్లో గుడ్డల్ని బయటకు నెట్టగలిగాడు. కట్లు బలంగా ఉండి తెంచుకోవడం సాధ్యంకాలేదు. శక్తినంతా కూడదీసుకుని ఏదో మంత్రం చదివాడు. మరుక్షణం – తాముగా తెగి కింద పడ్డాయి కట్టిన అడవితీగలు.

లేచి నిలబడే ప్రయత్నం చేశాడు. మూడు నిముషాల తర్వాత ఎలాగో నిలదొక్కగలిగాడు. కాళ్ళు చేతులు ఆడించి తల విదిలించగానే మత్తు చాలావరకు దిగిపోయింది.

పక్కనున్న తన బ్యాగ్ అందుకుని అందులోంచి శాటిలైట్ ఫోన్ తీశాడు. తన గురువు మరిడి సోమయ్యకు ఫోన్‌చేశాడు. వెంటనే లైన్ కలిసింది. తనను ఎవరో ఇంతసేపూ బంధించి ఉంచారంటే గురువు కోప్పడతాడని ఆ విషయం

దాచి తను స్థావరం గుర్తులున్నచోట ఉన్నాడని అక్కడ చెట్టుచేమలు తప్ప కట్టడమేదీ కన్పించడంలేదని రిపోర్ట్ చేశాడు.

అంతా విని– "ఏమిరా? నీ మెదడు మొద్దుబారినదా బుద్ధి మందగించి నదా?" అనరిచాడు గురువు మరిడి సోమయ్య.

ఆ మాటలకి వికేశి భయపడిపోయాడు. విప్పసారాదెబ్బకి నిజంగానే తనకు బుద్ధి మందగించి ఏదో విషయం మర్చిపోయినట్టున్నాడు "క్షమించండి గురుదేవా. నా కర్తవ్యం ఏమిటి?" అడిగాడు.

"ఒరే మందబుద్ధి. నీకు వెళ్ళేటప్పుడే అన్నీ వివరంగా చెప్పాను. కొన్ని మందులు అవీ ఇచ్చి పంపాను. గుర్తులేదా? నీ సంచిలో అదృశ్యదర్శిని అనే అంజనం ఉంటుంది చూడు. అది కళ్ళకు కాటుకలా ధరిస్తే అదృశ్యరూపంలో వున్నవన్నీ కన్పిస్తాయి.

అగ్నివేశాచార్యుడు అసాధ్యుడు. ఆ మహావృద్ధుడు అరక్షితస్థితిలో ఆ చోటు వదిలిపోడు. ఆయన తీసుకున్న జాగ్రత్తలేమిటి, చేసిన ఏర్పాట్లేమిటి తెలుసుకోకుండా ముందుకెళ్తే ప్రమాదం. హెచ్చరికగా ఉండు. ఓ గంట తర్వాత నేను ఫోన్‌చేస్తాను" అంటూ లైన్ కట్‌చేశాడు గురువు.

"సరే గురుదేవా" అంటూ ఫోన్ ఆఫ్ చేసి తిరిగి సంచీలో పెట్టుకున్నాడు. పక్క అరలోంచి కొన్ని డబ్బాలు తీసి అందులోంచి ఆకుపచ్చరంగులోని అంజనం గల డబ్బీని తీసుకుని మిగిలినవి లోనపడేశాడు. అదే అదృశ్యదర్శినీ అంజనం.

చూపుడువేలుతో కొద్దిగా అంజనం తీసి డబ్బీని మూతపెట్టి లోన పడేశాడు. వేలినున్న అంజనాన్ని కాటుకలా రెండు కళ్ళకు పెట్టుకుని ఒక నిముషం కనురెప్పలు మూసి ఉంచి తెరిచాడు. ఆశ్చర్యం.

క్షణం క్రితం వరకు అక్కడ ఏమీ కనిపించని చోట ఇప్పుడు అంత దూరంలో చెట్లమధ్య ఎత్తుగా సువిశాలమైన పాతభవంతి ఒకటి దర్శనమిస్తోంది. ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంది. ఎవరూ తిరుగుతున్న జాడగాని, కాపలా ఉన్నట్టుగాని లేదు.

తలుపులు, కిటికీలు అన్నీ మూసిఉన్నాయి. ముఖ ద్వారానికి బోదురుకప్ప సైజులో పెద్దతాళం కప్ప వేలాడుతోంది. ఆశ్చర్యంతో తలమునకలయిపోయాడు వికేశి. "భళి అగ్నివేశాచార్యా! మీ మంత్రశక్తి అమోఘం. ఉన్నవి లేనట్టు లేనివి

ఉన్నట్టు భ్రమింపచేయగలశక్తి మా గురువుగారికి ఉందోలేదో గాని ఇదే తొలిసారి చూస్తున్నాను" అంటూ మెచ్చుకున్నాడు.

ఈ విషయాన్ని వెంటనే ఫోన్‌లో గురువు మరిడి సోమయ్యకు రిపోర్ట్ చేద్దామనుకున్నాడు. చేస్తే పరిస్థితి ఎలా ఉండేదోగాని అక్కడి ఆనుపాన్లు తెలుసుకున్నాక చేయొచ్చులేని వెంటనే మనసు మార్చుకున్నాడు. అది ఎంత పొరబాటో కొద్దిసేపట్లోగాని అర్థం కాలేదు. స్థావరం కన్పించిందన్న సంతోషంలో– వడివడిగా అటు అడుగులు వేశాడు. భవంతికి ఏభై అడుగుల సమీపం వరకు వెళ్ళిపోయాడు. ఏమీకాలేదు. కంటికి ఎవరూ కనిపించలేదు.

అగ్నివేశాచార్యుడు కావలి ఉంచిన శక్తులుకూడా అదృశ్యరూపంలోనే ఉన్నాయిగాని వాటిని చూపించడానికి వాడికళ్ళకుపెట్టిన అంజనానికి శక్తి చాలదు.

ఆ విషయం తెలీక మరోరెండడుగులు ముందు కెళ్ళాడు. అంతే. ఏదో కనబడని అదృశ్యశక్తి తనను పట్టి విసిరేస్తున్నట్టుగా చివ్వున గాల్లో అంత ఎత్తుకు లేచి కెవ్వున అరిచాడు. వాడి అరుపు పూర్తిగాకముందే వాడి శరీరం గాల్లో మహావేగంతో గిరికీలు కొడుతూపోయి ఏ చెట్టు దగ్గర నుంచి బయలుదేరాడో ఆ చెట్టు మానుకు బలంగా గుద్దుకుని నెత్తురు కక్కుతూ బోర్లాపడిపోయాడు. పడిన కొద్దిక్షణాల్లోనే వాడి ప్రాణాలు ఎగిరిపోయాయి.

* * * * *

అగ్నివేశాచార్యుడు కోరుకొండ ఎస్టేట్ భవంతిని చేరుకుని అక్కడ కారువదిలి జీప్‌లో తను స్థావరం చేరుకునేసరికి సాయంత్రం నాలుగున్నర గంటలైంది సమయం. అక్కడికి చేరుకునేసరికే తెలీని ఆందోళనకు గురైవుంది ఆయన మనసు. జరగకూడని అనర్థం ఏదో జరిగిందనే అనుమానం మనసును పట్టి పీడిస్తోంది. చివరకు అదే నిజమైంది.

పులి కొండయ్య, రామబాణం ఇరువురినీ ఆ ప్రాంతం వదిలి వెళ్ళిపొండిరా అని ఫోన్‌లో చిలక్కి చెప్పినట్టు చెప్పాడు. అయినా వాళ్ళు అక్కడే ఉన్నారు.

మాంత్రికుడు మరిడి సోమయ్య ప్రియశిష్యుల్లో ఒకడైన వికేశి ఒంటిమీద గాయాలతో నెత్తుటిమడుగులో చచ్చిపడున్నాడు. ఆయన ఎంత మాత్రం ఊహించని పరిస్థితి ఇది. ఏం జరిగిందో అర్థంగాక వాళ్ళిద్దర్నీ కోపంతో చూశాడు అగ్నివేశాచార్యుడు.

"ఏమిరా? నేను చెప్పిందేమిటి మీరు చేసిందేమిటి? ఈ చోటు వదిలిపొండిరా అని చేప్తే ఏకంగా వీడ్ని మత్తులో ఉండగానే కొట్టిచంపేశారా?" అనరిచాడు.

"అయ్యయ్యో. లేదు సామీ, మేం వీడ్ని చంపలేదు" అనరిచాడు కంగారు పడిపోతూ పులి కొండయ్య.

"అవును సామీ. మేం చంపలేదు" అంటూ కొండయ్య మాటల్ని బలపరిచాడు రామబాణం.

"మరయితే ఏం జరిగింది? ఎవరు వీడిని చంపింది?" ఉత్కంఠభరితు డవుతూ అడిగాడాయన.

పులి కొండయ్య చేతులు జోడించాడు. "సామీ మీ మాట మేం మీరగలమా! మా సేమంకోరేగదా మీరట్టా సెప్పినారు. ఫోన్‌లో మీతో మాట్టాడిన యెంటనే మేమిద్దరం వేగిరం దూరంగా అదో ఆ మద్ది సెట్టు పక్కన పొదల్లోకి పోయికూచున్నాం. ఏం జరుగుద్దో చూద్దామని" అన్నాడు పులి కొండయ్య.

"ఇంతకీ ఏం జరిగింది?"

"మీరు సెప్పింది నిజమైనాది సామీ" బదులిచ్చాడు రామబాణం.

"అవును సామీ. ఆడు రెండు గంటల తర్వాత తెలివిలోకి వచ్చేసినాడండి. వచ్చాక నోట్లో గుడ్డలు తీసేసుకున్నాడు. ఏం మంత్రం సెప్పిండో గాని మేం కట్టిన కట్లు వాటంతటవే పటపటా తెగిపోయాయండి. సానా కోపంగా మాకోసం అటూ ఇటూ జూసినాడు సామీ. మేం అగపడలేదాడికి.

తర్వాత ఒళ్లు విరుసుకుని కాళ్ళు చేతులు జాడించుకుని బ్యాగులోంచి సాటిలైటు ఫోన్ తీసి ఎవరితోనో కాస్సేపు మాట్లాడినాడు. తర్వాత చిన్న డిబ్బీతీసి కళ్ళకు కాటుక పెట్టుకున్నాడు.

అది పెట్టుకున్నాక మన తావు కనబడిందో ఏందో గాని సామి గబగబా అటెల్లినాడండి. దగ్గరలోకి పోగానే ఏమైందోగాని కెవ్వుమన్నాడండి. ఎవరో యిసిరేసినట్టు అంతెత్తున గాల్లోకి లేచి గిరికీలు కొడుతూ వచ్చి ఈ సెట్టును గుద్దుకుని పడిపోనాడు సామీ.

అంతే పడ్డోడు మళ్ళీ లేవలేదు. ఓ గంటసేపు ఆగి ఏమైనాడో సూద్దామని వచ్చాం. ఇలా నెత్తుటిలో పడి చచ్చున్నాడు. ఇదే జరిగింది సామీ" అంటూ వినయంగా చెప్పుకొచ్చాడు పులికొండయ్య.

ఆ మాటలు వినగానే– "వీడు నేనుండిన కావలి శక్తులకి బలయి పోయాడు. బొత్తిగా అనుభవరాహిత్యమే వీడి ప్రాణం తీసింది. వీడు చనిపోయి ఎంత సేపవుతుంది?" అనడిగాడు.

"రెండు గంటలపైనే సామీ" అన్నాడు రామబాణం. అంతలో వికేశి తాలూకు శాటిలైట్ ఫోన్ మోగటం ఆరంభించింది.

ఒక్క పది సెకన్లు ఆగి ఫోన్ అందుకున్నాడు అగ్నివేశాచార్యుడు. ఆన్ చేయగానే బగ్లర్ అలారం మోగినట్టు మాంత్రికుడు మరిడి సోమయ్య గొంతు అటునుంచి కోపంగా వినవచ్చింది.

"ఎక్కడ చచ్చావురా చవట. చెప్పిందేమిటి నువ్వు చేస్తోంది ఏమిటి? ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ తియ్యవు. ఏమైపోయావురా ఇంతసేపు? నిన్ను చంపినా పాపం లేదు...." పిచ్చికాకిలా అరుస్తున్నాడు.

మౌనంగా విన్నాడు అగ్నివేశాచార్యుడు. బదులు పలకలేదు. వాడికి అనుమానం వచ్చినట్టుంది. "ఏరా... మాటాడవేమి?... వికేశి...." పిలుస్తున్నాడు.

"నీ శిష్యుడు వికేశి చనిపోయాడు" బరువుగా పలికింది అగ్నివేశాచార్యుడి గొంతు.

అవతల మరిడి సోమయ్యకు పెద్దషాకు. "ఏమిటి? ఏమంటున్నావ్?" అరిచాడు.

"నీ శిష్యుడు వికేశి చనిపోయాడు." ఆచార్యుడు గొంతు పెంచి చెప్పాడు.

"నో... నేన్నమ్మను. వాడు చనిపోవడం ఏమిటి? ఎవరు? నువ్వెవరు?" మాంత్రికుడి గొంతులో తడబాటు తొంగిచూస్తోంది.

"నువ్వు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం. నీ శిష్యుడు చనిపోయాడు. నేను అగ్నివేశాచార్యుడ్ని మాట్లాడుతున్నాను" అవతల మాంత్రికుడు మరిడి సోమయ్యకు ఇది మరోషాక్. "ఆచార్యా మీరు... మీరేనా?"

"అవును నేనే" అన్నాడు ఆచార్యుడు.

"వాడ్ని మీరు... చంపేశారా...!"

"ఈ ఆచార్యుడు ప్రాణంపొసేవాడే గాని తీసేవాడుకాదు. అలా అనుకుంటే ఇంతకుముందు నువ్వు పంపిన శిష్యులిద్దరిలో ఒక్కడూ ప్రాణాలతో నీ వద్ద కొచ్చేవాళ్ళు కాదు"

"అయితే ఇదెలా జరిగింది? వికేశి ఎలా మరణించాడు?"

"కరెంటు తీగని తెలీనికాకి తాకినా, తెలిసిన మనిషి తాకినా ఫలితం ఒక్కటే... మరణం. నా స్థావరం గుట్టు మట్లు తెలుసుకోవడానికి అర్భకుల్ని పంపించి వాళ్ళ ఉసురుపోసుకున్నావ్. నా స్థావరం అరక్షితమని ఎలా అనుకున్నావ్?" అవతల మరిడి సోమయ్యకు నోటమాటలేదు. మౌనంగా ఉండిపోయాడు.

"నీ శిష్యుడు వికేశి అనుభవరాహిత్యమే వాడి ప్రాణం తీసింది. కంటికి నా స్థావరం కనబడనంతవరకు ఆ చోట ఎక్కడ తిరిగినా వాళ్ళకేమీకాదు. కాని చూడ్డం జరిగాక అక్కడ ఎవడు అడుగుపెట్టినా నేనుంచిన కావలిశక్తులు చంపేస్తాయి.

అదృశ్య దర్శిని కాటుకధరించి నా స్థావరాన్ని చూసిన వికేశి వెనకాముందు ఆలోచించకుండా లోనకెళ్ళి చూడాలని దగ్గరకెళ్ళి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇప్పుడు వీడి శవాన్ని ఏం చేయమంటావో చెప్పు. వెనక్కి తీసుకెళ్తావా, ఇక్కడే పూడ్చి పెట్టించేయనా?"

ఒక్క క్షణకాలం నిశ్శబ్దం తర్వాత– అటునుంచి మాంత్రికుడి గొంతు వినిపించింది. "ఆచార్యా. నా గురుదేవుడు శంకర్‌సాహువారికి మిత్రులు మీరు. కాబట్టి మీరు కూడా నాకు గురుదేవుని కిందే లెక్క. నా ప్రణామములు స్వీకరించండి" అన్నాడు.

"నీ నక్క వినయాలు కట్టిపెట్టి అసలు విషయానికి రా. నువ్వెందుకు నా వెంటపడుతున్నావ్. నా నుంచి ఏమాశిస్తున్నావో చెప్పు" కట్టె విరిచినట్టు కటువుగా అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"క్షమించండి గురువుగారూ! మీరేవో కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. అవేమిటో తెలుసు కోవాలని నా ఆశ. మీరెలాగూ చెప్పరు. కాబట్టి మీ ప్రయత్నాలు మీరు చేసుకోండి. నా ప్రయత్నాలు నేను చేసుకుంటాను. మన మధ్య శతృత్వం

లేదు. మీ మనసు కష్టపెట్టి ఉంటే క్షమించండి" తనూ అంటీ అంటని విధంగా చమత్కారంగా మాట్లాడాడు మాంత్రికుడు.

అంతా విని పెద్దగా నిట్టూర్పు విడిచాడు అగ్నివేశాచార్యుడు. "నువ్వెంత గొప్ప మాంత్రికుడివైనా నా ముందు అర్భకుడివి. మంత్రాలతోబాటు తంత్రం కూడా తెలిసుండాలి. అది నీకు లేదు.

అలాగే అకారణంగా ఇతరుల ప్రాణాలు తీసే అధికారం కూడా నీకు లేదు. ఇకనయినా నీ పిచ్చి ప్రయత్నాలు మానుకోకపోతే భవిష్యత్తులో నష్టపోయేది నువ్వే. నా చేతిలో నువ్వు చావకూడదనే కోరుకుంటాను" గట్టిగా హెచ్చరించాడు.

అటునుంచి మరిడి సోమయ్య నవ్వు వినిపించింది. అది పరిహాసమో, గర్వాతిశయమో మరేదో ఆచార్యుడికి అర్థం కాలేదు. "గురువుగారూ... నా చావుని చూడ్డం అంత తేలిక కాదుగాని నా శిష్యుడు వికేశి శవాన్ని వెనక్కి పంపించేయండి."

"ఎవరు వస్తున్నారు?"

"ఎవరూ రానక్కర్లేదు. ఆ ప్రాంతానికి దగ్గర్లోనే ఎక్కడో మావాడు వచ్చిన జీపు డ్రైవరు ఉంటాడు. వికేశి దగ్గర డబ్బు వాడ్ని తీసుకోమని చెప్పి శవాన్ని తెలీకుండా జీప్‌లో మూసి ఉంచి వైజాగ్ రైల్వేస్టేషన్ వద్దకు తీసుకురమ్మని చెప్పండి.

అక్కడ నా మనుషులు శవాన్ని తీసుకుని వాడిని వెనక్కి పంపించేస్తారు. సెలవు. ఏదో ఒక రోజు తమ దర్శనం చేసుకుంటాను" అవతల లైన్ కట్ చేశాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

అగ్నివేశాచార్యుడి ఆనతితో పులి కొండయ్య, రామబాణం ఇద్దరూ ఎగువన అడవిలో గాలించి వాగు చెంత జీపుడ్రైవర్ని పట్టుకున్నారు. విషయం చెప్పి వాడిని స్థావరం వద్దకు తీసుకొచ్చారు. మొదట శవాన్ని తీసుకెళ్ళటానికి వాడు ఒప్పుకోలేదు.

కాని వికేశి బ్యాగులోని డబ్బు చూడగానే సంతోషంగా ఒప్పుకున్నాడు. ఆ విధంగా తగిన జాగ్రత్తలతో పులి కొండయ్య, రామబాణం ఇద్దరూ మాంత్రికుడి శిష్యుడు వికేశి శనాన్ని జీపులోకి చేర్చి శవం బయటకు కనబడకుండా చెట్ల ఆకులు, గడ్డి కప్పారు.

డ్రైవరు జీప్ తీసుకువెళ్ళిపోయాడు. అప్పటికే కనుచీకటి పడుతోంది.

పులి కొండయ్యకు జాగ్రత్తలు చెప్పి వాళ్ళనీ గూడేనికి వెళ్ళిపొమ్మని చెప్పి అగ్నివేశాచార్యుడు జీప్‌లో తిరుగు ప్రయాణమయ్యేసరికి బాగా చీకటి పడింది.

*　　*　　*　　*　　*

ఆకాశం మబ్బులుపట్టి వర్షంపడే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షం పడితే అడవిదారుల్లో ప్రయాణం కష్టం. అదీ రాత్రివేళ మరీ కష్టం.

సాధ్యమైనంత త్వరగా జీప్‌ను పరుగెత్తిస్తున్నాడు కాశీ.

"అయ్యా. పెద్దవర్షమే పడేలావుంది. రాత్రికి మనం కోరుకొండ ఎస్టేట్‌లో ఆగి ఉదయం వెళ్ళడం మంచిదేమో" దారిలో తన అభిప్రాయం చెప్పాడు.

పక్కనే సీటుకు జేరబడి రిలాక్స్‌డ్‌గా కళ్ళుమూసుకుని దీర్ఘాలోచనలో ఉన్న అగ్నివేశాచార్యుడికి ఆ మాటలు విన్పించలేదు. రెండోసారి పిలిచాక జాగ్రదవస్థకు వచ్చి కళ్ళు తెరిచాడు. కాశీ మాటలు విని బయట పరిస్థితి గమనించాడు.

ఉరుములేవుగాని ఆకాశం విడవకుండా మెరుస్తోంది. ఇప్పుడిప్పుడే వానజల్లు దిగుతోంది. దాంతో బాటే గాలి విసురుకూడా ఆరంభించింది. అడవంతా నల్లని కాటుక పూసినట్టు చిమ్మచీకట్లలో ఉంది.

జీపు ఇంజను సౌండ్‌కి బాటమీది చిన్నా పెద్దా అడవి జంతువులు పక్కలకు పరుగులు తీయడం హెడ్‌లైట్ల కాంతిలో స్పష్టంగా కనిపిస్తోంది. "భయపడాల్సిందేమీ లేదు. త్వరగా అడవి దాటి రోడ్డును చేరుకుంటే చాలు. తర్వాత ఆలోచిద్దాం" అని చెప్పి తిరిగి కళ్ళుమూసుకున్నాడు అగ్నివేశాచార్యుడు.

రాత్రి ఎనిమిదిగంటలకు జీపు అడవిలోంచి వచ్చి హైవే ఎక్కేవరకు చెప్పుకోతగ్గ వాన కురవలేదు. కాని ఆ తర్వాతనుంచి కుండపోతగా కురవనారంభించింది. గాలి విసురు కూడా పెరిగింది. చలిగాలి జివ్వున వీస్తోంది. హైవే ఎక్కినా ఆ గాలి వానకి జీప్ వేగం పెంచలేదు కాశీ.

జీప్‌లో ఉన్నది సామాన్యమైన వ్యక్తికాదు. లేటయినా సురక్షితంగా గమ్యం చేర్చటం తన బాధ్యత. పరిస్థితి గమనిస్తూనేవున్న అగ్నివేశాచార్యుడు అప్పుడు నోరు విప్పి చెప్పాడు.

"కంగారుపడకు. జాగ్రత్తగాపోనీ. రాత్రికి ఎస్టేట్‌లో ఆగి ఉదయం బయలుదేరదాం" అంటూ. డ్రైవరు కాశీ తలూపి – జీప్‌వేగం కాస్త పెంచాడు.

* * * * *

మున్నలూరివారి అగ్రహారం. ఇక్కడ సాయంత్రం నాలుగుగంటలకే ఆకాశం నల్లటి మబ్బులతో నిండిపోయి అయిదుగంటలకే వర్షం మొదలయి పోయింది.

చలితో ఈదురుగాలులూ ఆరంభించాయి. ఇటు దక్షిణభాగంనుంచే మబ్బులు ఉత్తరంవైపు వ్యాపించడంచేత అటు రంపచోడవరం వైపు రాత్రి ఏడుగంటల తర్వాత ఆలస్యంగా వాన మొదలయింది.

ఈ వర్షానికి ముందే ఎవరో ఫ్రెండ్‌ని కలవడం కోసం బైక్‌మీద కాకినాడ వెళ్ళిన చరక్ ఎంతకీ వాన తగ్గే సూచన లేకపోవడంతో ఆ వానలో తడుస్తూనే రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి తిరిగివచ్చాడు.

కొత్తచోటు... అదీ వచ్చినతొలిరోజు, శుశ్రుత ఎలా ఉందోనని అతడి ఆరాటం. ఇంటికి రాగానే స్నానం చేసి పొడిదుస్తులు ధరించి నాయనమ్మ దేవమ్మ గారిచ్చిన వేడివేడి కాఫీ తాగాడు. రామాచారి కుటుంబానికి భోజనం గంటక్రితమే పంపించినట్టు ఆవిడ చెప్పడంతో అతడి ఆత్రుత ఒకింత అణగింది.

అయినా వెళ్ళి పరామర్శించి వద్దామని "భోంచేసి వెళ్ళరా" అంటూ నాయనమ్మ పిలుస్తున్నా "వచ్చి భోం చేస్తాలే" అంటూ గొడుగు వేసుకుని వాళ్ళున్న ఇంటికి వానలో బయటుదేరాడు.

రాత్రి గడిచేకొద్దీ వాన పెరుగుతోందేగాని ఎక్కడా తగ్గే సూచన కన్పించడం లేదు. దీనికి తగ్గట్టే వాన మొదలయిన అరగంటలోపే కరెంట్‌పోయి ఊరంతా చిమ్మచీకట్లలో మునగదీసుకునుంది. గ్రామీణ ప్రాంతాల్లో వానరాకడ చెప్పొచ్చేమోగాని కరెంట్ రాకడ చెప్పగలిగినవాడెవడూ లేడు.

కొన్ని ఇళ్ళలో ఛార్జింగ్ లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని ఇళ్ళలో కొవ్వొత్తులతో కాలక్షేపంచేస్తున్నారు.

చరక్ వెళ్ళేసరికి రామాచారి కుటుంబమంతా హాల్లోనే ఉన్నారు. శ్రావణి కూడా అక్కడే ఉంది.

రెండు ఛార్జింగ్ లైట్లు వెలుగుతున్నాయి.

టీపాయ్ మీద ఎందుకైనా మంచిదని కొవ్వొత్తులు కూడా సిద్ధంగా ఉంచబడ్డాయి.

పోర్టికోలోకి రాగానే గొడుగు మూసి పక్కన పెట్టి లోన అడుగుపెట్టాడు. శుశ్రుత వంక చూశాడు. ఆమె చూసీచూడనట్టు ముఖం పక్కకు తిప్పుకుంది. ఆమె అలిగిందని అర్థమవుతోంది.

"రావయ్యా చరక్. ఎంతసేపయింది వచ్చి? వానలో తడిశావా?" అంటూ చిరునవ్వుతో పలకరించాడు రామాచారి.

"సారీ అనుకోకుండా కాకినాడ వెళ్ళి వర్షానికి దొరికిపోయాను. సమయానికి జేజితాతగారూ ఇక్కడ లేరు. మీరేమనుకుంటారోనని టెన్షన్‌తో వానలో తడుస్తూనే ఇంతక్రితమే వచ్చాను" అన్నాడు జరిగిందానికి నొచ్చుకుంటూ.

"భలేవాడివోయ్. ఎందుకు టెన్షన్? మాకిక్కడ ఏ లోటు. ఈ పూట భోజనం కూడా చేసేశాం. మా కూతురిలాగే అమ్మాయి శ్రావణి మమ్మల్ని దగ్గరుండి చూసుకుంటోంది. వానలో తడిసివచ్చావ్. జలుబు చేస్తుంది. జాగ్రత్త. రా కూర్చో" అంటూ పిలిచాడు.

"రా తమ్ముడూ. మాకే లోటూ జరగలేదు. రా... ఇక్కడ కూర్చో..." అంటూ తను భర్త పక్కనుంచి లేచి అవతలి సోఫాలో కూర్చుంది.

రామాచారి పక్కన కూర్చున్నాడు చరక్. అప్పుడు కూడా అతడి వంక చూడలేదు శుశ్రుత. ఆమెను పట్టించుకోకుండా శ్రావణిని చూస్తూ – "ఏమిటే నువ్వింకా ఇంటికెళ్ళలేదా?" అనడిగాడు.

ఆమాటకి సర్రున కోపం ముంచుకొచ్చింది శ్రావణికి. "ఏం బావా? నీకసలు బుద్ధుందా? వీళ్ళు వచ్చిందే ఈ రోజు. వదిలేసి నీపాటికి వెళ్ళిపోతావా? ఈ వానలో అమ్మమ్మ బయటికి రాలేదాయె. ఎవరు వీళ్ళని గమనించుకునేది? ఇప్పుడొచ్చి ఇంటికెళ్ళలేదా అంటున్నాడు చూడు.

ఈ వానలో నౌకరుచేత భోజనం కేరియర్లు పట్టించుకొచ్చి వీళ్ళకి దగ్గరుండి వడ్డించింది ఎవరనుకుంటున్నావ్?" దబాయించింది.

"అవును తమ్ముడూ. శ్రావణి ఉండగా మాకిక్కడ ఏ ఇబ్బందీరాదు. నువ్వు టెన్షన్ పడక్కర్లేదు" అంది.

"సరి సరి. ఎనిమిది దాటింది టైము. అత్తయ్య కోప్పడుతుంది నామీద. నే వచ్చేశాగా. నువ్విక ఇంటికెళ్ళిపో" అన్నాడు శ్రావణితో.

మరోసారి కోపం వచ్చింది శ్రావణికి. "చూడక్కా బావ. ఇంటికి పొమ్మంటున్నాడు గాని నువ్వు భోంచేశావా అని అడిగాడా!" అంటూ శుశ్రుతకి రిపోర్ట్ చేసింది.

"ఓ.కె. ఓ.కె. గొడవచేయకు, నువ్వు భోంచేశావా?" అని అడిగాడు చరక్ శ్రావణిని.

"ఊఁఅక్క పక్కన కూర్చుని నేనూ భోంచేసేశాను"

"అయితే లేటెందుకు. బయలుదేరు"

"ఎలా? ఉన్న ఒక్క గొడుగూ నేను తీసుకుపోతే ఇక్కడ వీళ్ళకి అవసరం ఉండదా? పైగా చీకట్లో ఒక్కదానినీ వెళ్ళాలంటే భయం"

విసుగుతో నుదురు రుద్దుకుని-లేచాడు చరక్.

"అయితే పద. నా గొడుగులో తీసుకెళ్ళి దించేసి వస్తాను" చెప్పాడు.

"అలా అన్నావ్ బాగుంది. అక్క నీమీద కోపంగా ఉంది. అటునుంచి అటే ఇంటికెళ్ళక వచ్చి వీళ్ళకి కనబడివెళ్ళు. అందరికీ బై. పొద్దుటొస్తాలే" అని చెప్పి బయలుదేరింది శ్రావణి.

* * * * *

చరక్ వెనక్కి వచ్చేసరికి-హాల్లో రామాచారి, కావేరి ఇద్దరే కన్పించారు. చక్కగా ముచ్చట్లాడుకుంటున్నారు. శుశ్రుత అక్కడ కనబడలేదు. నీళ్ళు ఓడుతున్న గొడుగును పోర్టికోలేనే వదిలి కాళ్ళు తుడుచుకుని లోనకొచ్చాడు.

"బావగారూ. శుశ్రుత ఎక్కడ?" రామాచారిని అడిగాడు చరక్.

"అది నీమీద అలిగినట్టుందయ్యా. మీరటువెళ్ళగానే మేడమీది తన గదిలోకి పోయి పడుకుంది"

"సరి. నేనూవెళ్ళొస్తా. ఇంకా భోంచేయలేదు. రేపు కలుద్దాం" అంటూ వచ్చినవాడు వచ్చినట్టే వెనుతిరిగాడు చరక్.

అదిచూసి చటుక్కునలేచి ఇవతలికొచ్చాడు రామాచారి. "ఆగవయ్యా బాబు! నువ్విలా వెళ్ళిపోతే అది నిద్రపోకుండా రాత్రంతా ఏడుస్తూ కూర్చుంటుంది. దాని సంగతి నీకు తెలీదా? తనతో ఓ మాట చెప్పివెళ్ళు" అన్నాడు.

"అవును తంబీ. ఓసారి పలకరించి వెళ్తేనే బాగుంటుంది" అంది కావేరి.

వాళ్ళమాట కాదనలేక అయిష్టంగానే మేడమీదకు బయల్దేరి శుశ్రుత బెడ్‌రూమ్ ముందుకెళ్ళాడు.

లోన టేబుల్‌మీద క్యాండిల్ ఒకటి వెలుగుతూ గదిని ప్రకాశవంతం చేస్తోంది.

బయట వర్షంజోరు ఏమాత్రం తగ్గలేదు. ఈ రాత్రికి కరెంట్ వస్తుందన్న నమ్మకం లేదు. కడుపులో ఆకలి కరకరలాడుతోంది. దేవుడా. ఈ అమ్మాయి నన్ను త్వరగా వదిలేట్టు చూడు స్వామీ.

గదిలోకి తొంగిచూశాడు. డబుల్‌కాట్‌మీద వెల్లకిలా పడుకుని దీర్ఘాలోచనలో ఉంది శుశ్రుత.

బ్లూకలర్ నైటీలో క్యాండిల్ లైట్‌లో ఏంజిల్‌లా మెరిసిపోతోంది. చరక్ రాకను గమనించి అలకతో అటు తిరిగి పడుకుంది.

వెళ్ళి ఆమెపక్కన కూర్చుని భారంగా నిట్టూర్చాడు. "నీకు బాగా కోపం వచ్చిందని తెలుసు. అడగాల్సిందేమన్నా వుంటే త్వరగా అడిగి, తిట్టాల్సిందేమన్నా వుంటే తిట్టి నన్ను త్వరగా పంపించేస్తే సంతోషిస్తాను. ఎందుకంటే ఆకలి. ఇంతవరకు భోంచేయలేదు నేను" అక్కడి గోడకో, సోఫాకో చెప్తున్నట్టుచెప్పాడు.

"నేనెవర్ని సాధించటానికి. వెళ్ళు. త్వరగా వెళ్ళి భోంచెయ్యి" తనూ ముఖం తిప్పకుండానే పొడిపొడిగా బదులిచ్చింది శుశ్రుత.

"మళ్ళీ ఇదొకటా. నువ్వుగాకపోతే ఎవరు సాధిస్తారని... అసలు నీ అలక దేనిగురించి? నాకు తెలియాలిగా"

"ఏం తెలియాలి? హైదరాబాద్‌లోనే బాగుండేది. టైమ్‌కి వచ్చేవాడివి. నచ్చినచోట సాయంకాలాలు సరదాగా తిరిగేవాళ్ళం. ఇక్కడంతా కొత్త. వచ్చినరోజే నన్నొదిలేసి పోయి రాత్రికొచ్చావ్.

నాకెలా వుంటుంది. అయినా మరదలు గుర్తు చేసింది గాబట్టి వెనక్కొచ్చావ్. లేదంటే వెళ్ళిపోయి పొద్దుటొచ్చేవాడివేమో!" అంది.

"అది గుర్తుచేస్తే రావటం ఏమిటి? నాకు తెలీదా. ఓ.కె. సారీ. అయిందేదో అయింది.

ఇక మీదట ఇలా జరగదు. ఓ.కె.నా?... ఇటు తిరుగు" అంటూ భుజంమీద చెయ్యేశాడు చరక్.

చేతిని తోసేసింది.

"ఈ అలకలేమిట్రా బాబు చచ్చిపోతున్నాం. తిరుగు. ఇటు తిరుగుతావా లేదా?" అంటూ ఆమె భుజంపట్టి లాగి వెల్లకిలా తిప్పాడు అంతే. రెండు చేతులూ అతడి మెడకి చుట్టేసి తన పగడాల పెదవులతో ముద్దులిచ్చేసింది.

మూడు నిమిషాలు బిగికౌగిళ్ళు వేడి ముద్దులతో మైమరచిపోయారు.

"సారీ చెప్పాగా. ఇంకా దేనికి కోపం" ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"దీనికోసమే" అంటూ కొసరు ముద్దిచ్చి నవ్వింది శుశ్రుత.

"ఆఁ!" తెల్లబోయాడు.

"కాదా? నువ్వు రాగానే పళ్ళికిలించి మాట్లాడితే టాటా బైబై చెప్పి వెళ్ళిపోయేవాడివి. అలిగితేగాని అబ్బాయిగారు నాకోసం రారని తెలుసు"

"ఇదో టెక్నిక్కు!... అబ్బో మీ అమ్మాయిల దగ్గర ఇంకా ఎన్నిరకాల టెక్నిక్‌లున్నాయేమిటి?"

"బోలెడుంటాయి. అయినా చెప్పేస్తారేమిటి. లే. భోంచేద్దూగాని" అంది శుశ్రుత.

"భోజనమా... ఇక్కడా" అన్నాడు.

"నేనేమీ తినేయలేదు. నీకోసం ఆకలి దాచుకున్నాను. కలసి తిందామని. శ్రావణి చూడకుండా మనకోసం విడిగా భోజనం తీసుంచాను. లే ఇక"

"అదికాదు శుశ్రుతా. నాయనమ్మ నాకోసం ఎదురుచూస్తూంటుంది. వెళ్ళాక మళ్ళీ భోజనం అంటుంది..." అని అన్నాడు.

"అనదు. 'అమ్మమ్మా, చరక్ కోసం ఎదురు చూడొద్దు పడుకోండి. తనిక్కడ భోంచేసి వస్తాడు' అని ఫోన్ చేసి చెప్పేశాను" అని నవ్వింది.

"ఊఁ. ఏదో అనుకున్నాను. మావాళ్ళతో బాగానే కలసిపోయావు" అంటూ లేచాడు చరక్. ఇద్దరూ బెడ్‌దిగి కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చారు.

శుశ్రుత టేబుల్‌మీద రెండు కంచాలుంచి వడ్డించింది. ఇద్దరూ కబుర్లుచెప్పుకుంటూ భోజనం చేసే సరికి రాత్రి పదిగంటలు కావచ్చింది సమయం. అప్పటికీ వర్షం తగ్గే సూచనలేవీ కన్పించలేదు. అతడితో బాటు

కింద హాల్లోకి వచ్చింది శుశ్రుత. రామాచారి దంపతులు తమ గదిలోకెళ్ళిపోయి చాలాసేపయింది.

గొడుగువేసుకుని చరక్ కూడా వెళ్ళగానే వీధి తలుపులు బిగించి మేడమీదకు నడిచింది శుశ్రుత.

* * * * *

నీలోదరి కొండగుట్ట దిగువన-ఒత్తుగా పెరిగిన చెట్లమధ్య విశాలమయిన స్థలం. మాంత్రికుడు మరిడి సోమయ్యతోబాటు అతడి శిష్యులు, ఇంకా నౌకర్లు అంతా సుమారు ఏభైమంది వరకు విషణ్ణవదనాలతో అక్కడే వున్నారు. వాళ్ళంతా వికేశి శవం రాకకోసం ఎదురుచూస్తున్నారు.

నిన్న సాయంత్రం మొదలైన వర్షం ఈ రోజు ఉదయం పదిగంటలకుగాని ఆగలేదు. అయినా ఆకాశం తెరిపివ్వలేదు. మబ్బులు అలాగే ఉన్నాయి. ఈదురుగాలులు వీస్తున్నాయి.

కొండప్రాంతంలో ఇసుక నేల కావటంచేత ఎంత వానపడినా త్వరగా ఇంకిపోయి కాలికి మాత్రం మట్టి అంటదు. ఆపైన నేలంతా పచ్చిక పరచుకునుంది.

నిన్న చీకటిపడుతూండగా రంపచోడవరం అడవిలో వికేశి శవాన్ని తీసుకుని జీపులో డ్రైవరు బయలుదేరగానే ఇక్కడ మరిడి సోమయ్య ఆ శవాన్ని వైజాగ్ నుంచి తీసుకురావటానికి శిష్యులు మృణాళుడు, విళంబిలను పంపించాడు. వాళ్ళిద్దరూ వ్యాన్‌లో వైజాగ్ బయలుదేరివెళ్ళారు. అప్పటికే వర్షం మొదలయింది.

రాత్రంతా దేశంలో అనేక ప్రాంతాల్లో భారీగా వర్షంపడుతూనే ఉంది. దాంతో ఆలస్యంగా తెల్లవారుజామున అయిదుగంటలకు వికేశి శవాన్ని వైజాగ్ రైల్వేస్టేషన్ సమీపంలోకి తీసుకొచ్చి మృణాళుడు, విళంబిలకు ఒప్పగించాడు జీప్ డ్రైవరు.

ఆ శవాన్ని తమ స్కార్పియోలో నీలోదరికి తీసుకొస్తున్నారు వాళ్ళు.

ఉదయం పదకొండు గంటలకు వర్షం నిలిచిపోగానే మరిడి సోమయ్య తనవాళ్ళతో గుట్ట దిగొచ్చి శిష్యుడి శవాన్ని ఖననం చేయడానికి స్థలాన్ని ఎంపికచేసి గొయ్యి తవ్వించి తగిన ఏర్పాట్లతో సిద్ధంగా అక్కడ ఎదురుచూస్తున్నాడు.

సరిగ్గా మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకి స్కార్పియో వ్యాన్ అక్కడికి ఫర్లాంగు దూరంలోని గుట్టదిగువ పల్లపుప్రాంతంలోని చెట్లవరకు చేరుకుంది. అక్కడ్నుంచి వ్యాన్‌లోనకు రావటం కష్టం.

వ్యాన్ ఆగినచోట మరో బృందం రెడీగా వుంది. డప్పులు బాకాలతో అక్కడ అట్టహాసంగా ఉన్నారంతా. మృణాళుడు, విళంబి వ్యాన్ దిగి భోరున ఏడుస్తూ అక్కడే కూర్చుండిపోయారు.

వచ్చినవాళ్ళలో కొందరు వ్యాన్‌లోంచి వికేశి శవాన్ని దించారు.

పాడె కట్టారు. కుంకుమ చల్లారు. శవంమీద కొత్త వస్త్రం వేసి నలుగురు పాడి లేపారు.

ఫెళ్ళున డప్పులమోత, బాకాల హోరులో శవాన్ని మోసుకుంటూ మాంత్రికుడు మరిడి సోమయ్య ఉన్న తావుకి తీసుకొచ్చాడు. సిద్ధంగా తీసి ఉంచిన గోతి పక్కన శవాన్ని దించారు.

మరిడి సోమయ్య, శిష్యుడి శవం పక్కన కన్నీళ్ళతో కూలబడి అలా చూస్తూండిపోయాడు. శిష్యుడి మరణంతో అతని మనసు నిప్పుల కుండలా మండిపోతోంది.

"అరే చూడండ్రా వీడ్ని. అనాథగా పదేళ్ళబాలుడిగా నాకు దొరికాడు. వీడి చలాకీతనం చూసి శిష్యుడ్ని చేసేసుకున్నాను. ఎంతో గొప్పవాడవుతాడను కున్నాను. అప్పుడే వీడికి నూరేళ్ళు నిండిపోయాయి.

అరేయ్ ఆచార్యా. అప్పుడే అయిందనుకోకు. ఇంతకింత నీమీద ప్రతీకారం తీర్చుకుంటా. దుఃఖంతో నీ ముసలిగుండె పగిలిపోయేలా చేస్తా. చచ్చిన నా శిష్యుడిమీద ఒట్టు" అంటూ ఆవేశంతో అరిచాడు.

మృణాళుడు అతన్ని ఓదార్చుతూ పక్కకు తీసుకెళ్ళాడు. ఎవరెంత బాధపడినా-పోయిన వికేశి ఇక తిరిగిరాడు. సకల లాంఛనాలతో అక్కడ వికేశి శవాన్ని ఖననం చేసి శవాన్ని పాతిపెట్టిన గుర్తుగా ఎత్తుగా మట్టిదిబ్బ చేసి అక్కడినుంచి వెనుతిరిగారంతా.

వాళ్లంతా నిష్క్రమించిన కొద్దిసేపటికి నల్లటి బొంతకాకి ఒకటి రివ్వున వచ్చి ఆ మట్టిదిబ్బమీద వాలింది. అది కావు కావుమని గొంతు పగిలేలా అరుస్తూనే వుంది. అదే వికేశి ఆత్మ. కాకి రూపంలో అక్కడ కారాడుతోంది.

* * * * *

రాత్రివర్షానికి కోరుకొండ ఎస్టేట్ భవంతిలో స్టేచేసిన అగ్నివేశాచార్యుడు ఉదయం వర్షం తగ్గేవరకు ఆగాడు. పూజాధికాలు అక్కడే ముగించుకుని బయలుదేరి మధ్యాహ్నం భోజనం వేళకు మున్నలూరువారి అగ్రహారం స్వగృహానికి చేరుకున్నాడు.

ఆ విషయం చరక్ వచ్చి చెప్పిన తర్వాత రామాచారి కుటుంబానికి తెలిసింది. అప్పటికే వాళ్ళంతా భోజనాలు చేశారు. వర్షం తగ్గినా ఆకాశంలో మబ్బులు అలాగే ఉండి సూర్యుడు కన్పించడంలేదు. వాతావరణం చలి చలిగా ఆహ్లాదభరితంగా ఉంది.

రాత్రంతా వానలో తడిసిన చెట్టు చేమలు కడిగిన ముత్యాల్లా మరింత పచ్చగా మెరుస్తున్నాయి.

మేడమీద గదిలో కావేరి, శుశ్రుత తల్లీకూతుళ్ళిద్దరూ తీరిగ్గా కూర్చుని పూలు మాల కడుతున్నారు.

దిగువన హాల్లో రామాచారి చరక్ లిద్దరే మిగిలారు. అగ్నివేశాచార్యుడు ఇంటికొచ్చాడని తెలియగానే ఆత్రం కొద్దీ "ఇప్పుడు వెళ్ళి జేజి తాతగార్ని కలవచ్చా?" అనడిగాడు.

"తొందరేముంది? ఆయన ఇప్పుడేగా వచ్చారు. భోజనంచేసి విశ్రాంతి తీసుకున్న తర్వాత తనే కబురుచేస్తారు. అప్పుడు వెళ్ళొచ్చు. నేను మళ్ళీ వస్తాను. ఈలోపల మీరూ రిలాక్సవ్వండి" అంటూ వెళ్ళిపోవడానికి లేచాడు.

"ఆగాగు" అనరిచాడు రామాచారి "చెప్పింది వినవయ్యా... ముందిలా కూర్చో, చెప్తాను"

"ఓ.కె. కూర్చున్నాను. చెప్పండి" అంటూ ఎదురుగా కూర్చున్నాడు.

"చెప్పడానికేముంది. నువ్వే చెప్పాలి"

"నేనా"

"అవును నువ్వే. నాకింకా కొన్ని ధర్మసందేహాలు ఉన్నాయి. అవి నువ్వు తీర్చాలి"

"నాకు తెలీకపోతే?"

"ఆ పెద్దాయన్నే అడుగుతాను. వారికి అన్నీ తెలుసుకదా"

"అంత పని చేయకండి. ఆయనకి అనుగ్రహం కలిగినా ఆగ్రహం కలిగినా మనం తట్టుకోలేం. అడగండి. నాకు తెలిసినంతవరకు మీ సందేహాలు తీర్చే ప్రయత్నం చేస్తాను"

"దశావతారాల్లో రామావతారం, కృష్ణావతారం రెండూ ఆ లక్ష్మీవల్లభునివే గదా. కాని ఆ రెండు అవతారాల ప్రయోజనాలర్థంకావడం లేదయ్యా"

"మీకు అర్థంగానిదేమిటో చెప్పండి"

"చెప్తాను. వీటికిముందు వామనావతారం వచ్చింది గదా?"

"అవును. ఇంతకీ సందేహం ఏమిటి?"

"వామనావతారంలో ఇంతింతైవటుడింతై అన్నట్టు తన రూపాన్ని విశ్వమంతా వ్యాపింపజేసి ఒక పాదంతో భూమిని, ఒకపాదంతో ఆకాశాన్ని ఆక్రమించుకుని తన మహారూపాన్ని ప్రదర్శించాడు. అలాగే కృష్ణావతారంలో పసితనంలోనే మన్ను తిన్న సాకుతో తల్లి యశోదకు పదునారు భువన భాండాలను అంగట్లో చూపించాడు. చిటికెనవేలితో గోవర్ధన గిరిని లేపాడు.

శ్రీమన్నారాయణుడిగా తన ఆయుధాలయిన సుదర్శనచక్రం – నందకం అనే ఖడ్గం–గద–శంఖం వీటిలో చక్రాన్ని ప్రయోగించి శిశుపాలుని శిరస్సు ఖండించాడు. కదనక్షేత్రంలో అర్జునుడికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

ఇలా ఆయన లీలామానుషరూపుడై ఉంటూనే ఆ యా సందర్భాల్లో తన ఆయుధాల్ని, బలాన్ని, విశ్వరూపాన్ని చూపాడు.

కాని రామావతారంలో ఇవేమీ కనబడవు. ఎందుచేతో రామబాణం అనే ఒక్కబాణంతోనే అవతారమంతా నడిచింది. ఆఖరికి రామరావణ యుద్ధంలో కూడా అంతటి శివభక్తుడైన రావణాసురునిక్కూడా తన విశ్వరూపం చూపలేదే. ఈ రెండు అవతారాల్లోనూ ఆ శ్రీమహావిష్ణువు ఇంత భిన్నంగా ప్రవర్తించడంలో మర్మం ఏమిటి?"

"అవతారలక్ష్యం దుష్టశిక్షణే అయినా ఏ అవతార లక్ష్యం ఆ అవతారానికి ఉంది. రామావతారం పూర్తిగా కుంటుంబపరమైనదైతే కృష్ణావతారం పూర్తిగా రాజకీయపరమైంది"

"అవతారాలు వేరుగాని రెండింటిలోను సెంటర్‌పాయింట్‌గా రాక్షస సంహారం దుష్టశిక్షణ సాగిందిగదా?"

"రామావతారానికి పునాది ఏమిటి? కుటుంబం. అది దశరథ మహారాజు కుటుంబం. ఆయనకు ముగ్గురు భార్యలు, నలుగురు కొడుకులు, వారిలో పెద్దకొడుకు శ్రీరామ చంద్రుడు.

ఒక ఇంటికి పెద్దకొడుకు ఎలా ఉండాలో మనం శ్రీరామచంద్రునిలో చూడవచ్చు. తండ్రి ఆనతి మీరని కొడుకు, తనకు పధ్నాలుగేళ్ళు వనవాసం విధించినా పినతల్లిని పల్లెత్తుమాటనని శాంతమూర్తి.

రాజ్యాన్ని గడ్డిపోచలా త్యజించి భార్యతో అడవి కేగిన ఆదర్శమూర్తి. తమ్ముల క్షేమం కోరే అన్న, స్నేహితులను ఆదరించే సుగుణాభిరాముడు.

అలాగే తన భార్యను ఎత్తుకెళ్ళిన రావణాసురుని అంతుచూసిన మహావీరుడు. అంతేనా వృద్ధశబరి ఎంగిలి ఫలం ఆరగించిన భక్త వత్సలుడు. వృద్ధుల యందు కనికరం, దయ కలిగినవాడు. ఇక కుటుంబంలో అన్నపట్ల తమ్ములు ఎలా ఉండాలో లక్ష్మణ భరత శత్రుఘ్నుల ద్వారా విశదమవుతుంది.

అలాగే భర్తను అనుసరించే భార్యగా భర్త కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఆదర్శమహిళగా ఎన్నికష్టాలయినా సహించి బిడ్డల్ని ఆదర్శంగా తీర్చిదిద్దే తల్లిగా ఆ సాధ్వీమణి సీతమ్మలో అనేక సుగుణాలు కన్పిస్తాయి. అందుకే సీతారాములు ఆదర్శదంపతులయినారు. ప్రతి ఇంటా కొలువయ్యారు.

ప్రతిచోటా వారికి ఆలయాలు కట్టి ప్రతి ఏటా సీతారామ కళ్యాణం వైభవంగా జరిపిస్తున్నారు భక్తులు. ఇక నమ్మినబంటు హనుమంతుని యందు సీతారాముల వాత్సల్యం ఇంతా అంతా కాదు.

కాబట్టి రామాయణానికి మూలాధారం కుటుంబ నేపధ్యం ఒక రాజకుటుంబం. ఆ కుటుంబంలోని సభ్యులు వారి వ్యక్తిత్వాలు, పరిణామాలు ఇవన్నీ మనకి రామాయణంలో కన్పిస్తాయి.

శ్రీరాముడి మహోన్నత వ్యక్తిత్వమే ఆయన్ని గొప్ప ఆదర్శపురుషుడ్ని చేసింది. ఆయన సాగించిన దుష్టశిక్షణ ఆయనను మహావీరుడిగా నిలిపింది.

రామాయణకావ్యంలో మనకి కన్పించే రెండో కుటుంబం రావణాసురుడి కుటుంబం. ఆయన పులస్త్యబ్రహ్మ మనుమడు. గొప్ప మేధావి. గొప్ప పండితుడు, సకల ధర్మాలు తెలిసినవాడయినా తల్లి తరఫు రాక్షసమూకలకు నాయకుడయ్యాడు.

అతని భార్య మండోదరి, మహాపతివ్రత. కొడుకుల్లో చెప్పుకోతగ్గవాడు మేఘనాధుడు. తమ్ములు విభీషణ, కుంభకర్ణులు, చెల్లెలు శూర్పణఖ గొప్ప కుటుంబం. కాని ఏం లాభం. కుటుంబ పెద్ద మూర్ఖుడైతే ఆ కుటుంబం ఎలా నాశనమవుతుందనే దానికి రావణాసురుడు ఉదాహరణ.

ఇలా రామాయణానికి మూలాధారం కుటుంబ నేపధ్యం అని చెప్పటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇక్కడ దుష్టశిక్షణ అనేది రెండో అంశం మాత్రమే. ఇలా కుటుంబాలలోని వ్యక్తులు వారి మనస్తత్వాలు పరిణామాలు ఇవన్నీ రామాయణంలో కనిపిస్తాయి.

తమిళంలో ఓ సామెత ఉంది. 'ఇన్రుపోయ్ నాళైవాఁ' అని. అంటే ఇవాళకి వెళ్ళిపోయి తిరిగి రేపు రా అని అర్ధం. బాకీకోసం తిప్పేవాళ్ళమీద ఈ సామెతని వ్యంగ్యంగా ప్రయోగిస్తుంటారు.

యుద్ధక్షేత్రంలో సూర్యాస్తమయానికి అలసిపోయిన రావణాసురుడ్ని చూసి ఇవాళకి యుద్ధం చాలు. వెళ్ళి విశ్రాంతి గైకొని రేపురా అంటాడు రాముడు. అంతేగాని అలసిపోయినవాడిని వధించే ప్రయత్నం చేయడు. అంతటి ఉదారమనసు రాముడిది.

మండోదరికి వైధవ్యం ప్రాప్తించకుండా నివారించేందుకు రావణకాష్టం ఎప్పటికీ ఆరకుండా వరమిచ్చిన దయామయుడు రాముడు.

కాబట్టి కుటుంబనేపధ్యంతో సాగిన రామాయణ గాధలో దుష్టశిక్షణనూ చూడొచ్చు. మీరన్నట్టు ఒక్క రామబాణంమీదే నడిచింది గాధ.

ఎక్కడా తన విశ్వరూపంగాని మహిమలుగాని ప్రదర్శించాల్సిన అగత్యం ఈ అవతారంలో అవసరం లేకపోయింది"

"కైకేయి శ్రీరాముడిని పధ్నాలుగేళ్ళ వనవాసమే ఎందుకు కోరింది. ఏ పదో లేదా ఇరవై సంవత్సరాలనో కోరి ఉండొచ్చుగా"

"శ్రీరాముడు పుట్టింది త్రేతాయుగం చివరి పాదంలో, ఆ యుగధర్మాన్ని అనుసరించి ఎవరయినా తనకు హక్కుభుక్తమైనట్టి రాజ్యం మీదగాని, ఆస్తుల మీదగాని, ధనకనక వస్తువాహనాలు గాని–

వాటి నుంచి పధ్నాలుగు సంవత్సరాలు దూరంగా ఉన్నట్టయితే వాటిమీద తనకు గల సర్వహక్కుల్నీ శాశ్వతంగా కోల్పోవలసి వుంటుంది.

అంటే... పధ్నాలుగేళ్ళు వనవాసం చేసి రాముడు తిరిగివచ్చినా రాజ్యం భరతుని చేయిజారకూడదన్న చెడు తలంపుతోనే కైకేయి రాముడ్ని పధ్నాలుగేళ్ళ వనవాసం కోరింది."

"నువ్వు చెప్పిన ప్రకారం పధ్నాలుగేళ్ళు వనవాసం చేసిన రాముడికి రాజ్యం దక్కకూడదు గదా. కాని తిరిగివచ్చి సింహాసనం ఎక్కి పరిపాలన సాగించి రామరాజ్యం అనిపించుకున్నాడుగా. ఇదెలా సాధ్యపడింది?" అడిగాడు రామాచారి.

"మీరు భరతుడ్ని మర్చిపోతున్నారు. తాతగారి రాజ్యం నుంచి అయోధ్యకు తిరిగి రాగానే జరిగిన పరిణామాలు తెలుసుకుని చాలా బాధపడ్డాడు. అరణ్య వాసంలోని రాముని వద్దకొచ్చి జరిగినదాంట్లో తన తప్పులేదని రాజ్యానికి వచ్చి సింహాసనం అధిష్ఠించమని అన్నను ఎంతో వేడుకున్నాడు. కాని పితృవాక్య పరిపాలన జరిగి తీరాల్సిందే.

వెనక్కి రానన్నాడు రాముడు. అలా అయితే నీ ప్రతినిధిగా ఉండి పరిపాలనా బాధ్యత వహిస్తాను.

రాజ్యం నీదే. నీ పాదుకలిమ్మని అర్ధించి ఆ పాదుకల్ని భక్తితో శిరస్సున ఉంచుకుని అయోధ్యకు చేరాడు భరతుడు.

తనకు మారుగా అంటే తల్లికైకేయి కోరికమేరకు తాను పట్టాభిషిక్తుడు గాకుండా అన్న శ్రీరాముని పాదుకల్ని సింహాసనం మీద ఉంచి తను రాముని ప్రతినిధిగా ఆ పధ్నాలుగేళ్ళు రాజ్యభారం వహించాడు భరతుడు. అన్నపట్ల భరతుని విశ్వాసం, ప్రేమానురాగాలు అంత గొప్పవి.

కాబట్టి రాముడు అరణ్యవాసంలో వున్నా రాజ్యం రాముడి పరిపాలనలో ఉన్నట్టే లెక్క. అందుకే అరణ్యవాసం ముగించుకుని అయోధ్యకు రాగానే సింహాసనం అధిష్ఠించాడు శ్రీరామచంద్రుడు."

"మహాభారతంలో పాండవులు పన్నెండు సంవత్సరాల వనవాసం ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికి కూడా ఇలాంటి యుగధర్మం ఏదన్నా ఉందా?" అడిగాడు రామాచారి.

"కృష్ణావతారం వచ్చింది ద్వాపరయుగం చివరి పాదంలో. ద్వాపర యుగధర్మాన్ని అనుసరించి పైన చెప్పిన విధంగా తన రాజ్యానికి గానీ,

ఆస్తిపాస్తులకు గానీ పదమూడేళ్ళు దూరంగా వున్నవారు వాటి మీద తమ సర్వహక్కుల్నీ శాశ్వతంగా కోల్పోతారు.”

“అంటే యుగం మారేసరికి ఒక సంవత్సరం తగ్గిందన్నమాట.”

“అవును. అలాగని డైరెక్టుగా పదమూడేళ్ళు వనవాసం అంటే రాజ్యకాంక్షతో కుట్ర చేశారనే చెడ్డపేరు వస్తుందని భావించి ఇక్కడ శకుని చిన్న మెలిక పెట్టాడు. దాని ప్రకారం జూదంలో ఓడిన పాండవులు పన్నెండేళ్ళ వనవాసంతోపాటు, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసి వస్తే రాజ్యం తిరిగిస్తాం.

ఒకవేళ అజ్ఞాతవాసంలో పట్టుబడితే తిరిగి పన్నెండేళ్ళు వనవాసం, ఒక సంత్సరం అజ్ఞాతవాసం చేయాలన్నాడు. అజ్ఞాతవాసంలో ఎక్కడ వున్నా పట్టుకుని తిరిగి వనవాసాలకు పంపించి పాండవులకు రాజ్యం దక్కకుండా చేయడం ఇందులో వ్యూహం.

కాని అజ్ఞాతవాసం ముగిసిన మరునాడు గాని కౌరవులు పాండవుల్ని పట్టుకోలేకపోయారు. అందుకే వారి రాజ్యం వారికి ఇప్పించడం కోసం శ్రీకృష్ణుడు రాయబారం నడపాల్సివచ్చింది.

ఇక మనం వున్న ఈ కలియుగధర్మం ప్రకారం పన్నెండేళ్ళు ఆస్తికి దూరంగా వున్న వాళ్ళు ఆ ఆస్తిమీద తమ హక్కుల్ని కోల్పోతారు. అది ఈ మధ్య కాలం వరకు నడిచింది. ఇటివలే సుప్రీంకోర్టు కలియుగ ధర్మాన్ని కొట్టిపడేసి ఎన్నేళ్ళు ఎవరి అధీనంలో ఉన్నా స్వంతదారే అధిపతి అని తేల్చింది” వివరించాడు చరక్.

“మహాభారతం రాజకీయనేపధ్యంగా సాగిందన్నావ్” అడిగాడు రామాచారి.

“అడుగడుగునా భారతగాధలో కన్పించేది రాజకీయ కుట్రలు, కుతంత్రాలు. రాజ్యంకోసం దాయాదుల పోరు. పాండవుల్ని రాజ్యానికి దూరంగా ఉంచటం కోసం కౌరవులు చేసిన మోసాలు, ద్వేషాలు, కుట్రలు ఇవన్నీ తెలిసినవేగా. కృష్ణుడు పాండవపక్షపాతి అంటారుగాని అది తప్పు. కృష్ణుడు ధర్మపక్షపాతి. ఆ అవతార లక్ష్యమే దుష్టశిక్షణ, ధర్మసంస్థాపన. ధర్మం పాండవుల పక్షాన ఉంది గాబట్టి పాండవపక్షపాతి అయ్యాడు” అన్నాడు చరక్.

"అదెలాగో నాకు అర్థంకాలేదు. భారతం చదివినా విమర్శనాత్మకంగా చదివే అలవాటులేదు నాకు. అందుకే ఈ ధర్మసూక్ష్మం నాకు బోధపడ్డంలేదు. నాకే కాదు చాలామందికి ఈ సందేహం ఉంటుంది.

పెద్దకొడుగ్గా రాజ్యం ధృతరాష్ట్రుడిదై ఉండగా తమ్ముడు పాండురాజు ఎలా రాజవుతాడు. రాజ్యం పాండవులకెలా సొంతమవుతుంది? ఆ లెక్కన పాండవులు రాజ్యకాంక్ష అధర్మం కదా?"

"అవడానికి ధృతరాష్ట్రుడు పెద్దవాడే అయినా పుట్టు గ్రుడ్డివాడు, అంధుడు. ఆ కాలంలో జన్మతః గాకుండా వ్యక్తిగత అర్హతలను కూడా పరిగణనలోకి తీసుకుని కాబోయే రాజును నిర్ణయించేవారు.

ఆ విధంగా చూసినప్పుడు భీష్మద్రోణాదిపెద్దలు చేసిన నిర్ణయం ప్రకారం ధృతరాష్ట్రుడు పెద్దవాడయినా గ్రుడ్డివానికి రాజ్యార్హత లేదు.

ఎందుకంటే అతను అంధుడు గాబట్టి యుద్ధాలు చేయలేడు. రాజ్యాన్ని, ప్రజలను కాపాడలేడు. కాబట్టి వీరుడు గాబట్టి తమ్ముడైన పాండురాజునే రాజుగా నిర్ణయించి పట్టంకట్టారు. ఈ నిర్ణయం ధృతరాష్ట్రునికీ ఆమోదయోగ్యంగానే జరిగింది.

పాండురాజు స్వతహాగా మహావీరుడు. శత్రువుల్ని హతమార్చాడు. అనేక యుద్ధాలు చేసి రాజ్యాన్ని విస్తరించాడు. కాని అతడికున్న ఒకే ఒక వ్యసనం వేట. అప్పుడప్పుడూ మృగయావినోదియై సపరివారంగా అడవులకు వెళ్ళి కొద్ది రోజులు మకాం చేసి అడవి మృగాల్ని వధించేవాడు.

అలాంటప్పుడు హస్తినలో సింహాసనం ఖాళీగా ఉండకూడదు గాబట్టి తన రాజప్రతినిధిగా అన్న ధృతరాష్ట్రుణ్ణి తన స్థానంలో సింహాసనం మీద కూర్చోబెట్టి వెళ్తుండేవాడు.

అటు ధృతరాష్ట్రునికి నూరుగురు కొడుకులు ఇటు పాండురాజుకు అయిదుగురు కొడుకులు కలిగారు. వాళ్ళంతా పసివాళ్ళుగా ఉండగా ఈ దశలోనే ఒక ఘోరం జరిగింది.

అడవిలో కామరూపవిద్యతో లేళ్ళ జంటగా మారి సరససల్లాపాల్లో వున్న మునిదంపతులను నిజంగా లేళ్ళు అనుకుని బాణాలు వేశాడు పాండురాజు. స్త్రీని కూడితే మరణిస్తావంటూ మునిదంపతులు శాపం ఇచ్చి మరణించారు.

ఈ శాపవశాన కొద్దిరోజుల్లోనే పాండురాజు మరణించాడు. పాండురాజు మరణించినప్పుడు పసివాళ్ళయిన పాండవుల సంరక్షణ భారాన్ని కుంతికి అప్పగించి మాద్రి భర్త శరీరంతో సహగమనం చేసింది.

ఇక తర్వాత పరిణామాల్లో పాండవులు పసివాళ్ళు గాబట్టి వాళ్ళు పెద్దయ్యాక ధర్మరాజుకు పట్టాభిషేకం జరిపించాలని, అంతవరకు సింహాసనం మీద రాజప్రతినిధిగా ధృతరాష్ట్రుడే కొనసాగాలని పెద్దలు చేసిన నిర్ణయం. కాబట్టి అక్కడ ధృతరాష్ట్రుడు రాజప్రతినిధే గాని రాజు కాదు.

కాని కౌరవులు పెద్దవాళ్ళయ్యేకొద్దీ పాండవుల మీద ద్వేషం పెంచుకుని వారిని అడ్డు తొలగించుకోవాలని రాజ్యకాంక్షతో ఎన్నో కష్టనష్టాలకు గురి చేశారు. కాబట్టి రాజ్యం పాండవులదేగాని కౌరవులదికాదు.

ధర్మం వారి పక్షాన ఉంది గాబట్టి యదుకుల నందనుడు పాండవపక్షపాతి అయ్యాడు.

కురుక్షేత్రంలో జరిగిందంతా అధర్మయుద్ధమే నంటూ వాదిస్తారు కొందరు. నిజమే.

కాని అధర్మాన్ని ఆరంభించిందే కౌరవులు. దుష్టశిక్షణ కోసం ధర్మం తప్పినా తప్పు లేదనే అంటాడు కృష్ణుడు. ముల్లును ముల్లుతోనే తీయాలి. ఎదుటి వారు ధర్మం తప్పినప్పుడు మనం ధర్మబద్ధంగా ఉంటే ప్రయోజనం లేదుగా.

మీరు శివభక్తులు గదా ఏదో శివతత్వం గురించి సందేహాలు అడిగారంటే అర్థం వుంది. కాని ఈ రామాయణ భారతాలమీద ఇంట్రస్టేమిటి? ఇన్ని సందేహా లేమిటి?" అనడిగాడు చరక్.

"సర్వం తెలిసినవారు శివకేశవులకు భేదం లేదంటారు. ఇది మొదటి కారణం.

రెండోది రామరావణ యుద్ధం ముగిసిన తర్వాత రావణ వధ వలన సంక్రమించిన బ్రాహ్మణహత్యా పాతకం నుంచి బయటపడ్డానికి మొదటి శివలింగాన్ని రామేశ్వరంలో ప్రతిష్ఠించాక అక్కడి నుండి అయోధ్య చేరేవరకు దారి పొడవునా అనేక శివలింగాల్ని ప్రతిష్ఠించాడు రాముడు.

అవన్నీ నేటికీ శ్రీరామలింగేశ్వర శివాలయాలుగా ప్రసిద్ధమైనవి. నేను పూజారిగా పనిచేస్తున్న ఆలయంలో శివలింగం కూడా శ్రీరామ ప్రతిష్ఠితమే.

కాబట్టి స్వతహాగా శివభక్తుడయినా శివకేశవులందు భేదభావం నాకు లేదు. అందుకే రామాయణ మహాభారతాల్లో తెలీని విషయాలను తెలుసుకోవాలనే కోరిక నాకు ఎప్పుడూ ఉంటుంది" విషయం బయటపెట్టాడు రామాచారి. అప్పటి కింకా రామాచారి భార్య కావేరితోబాటు శుశ్రుత, శ్రావణి అంతా మాలలు కడుతూ మేడమీదే వున్నారు.

వారి నవ్వులు కింద హాల్లోకి విన్పిస్తున్నాయి. "అవునూ ద్రౌపది, కర్ణుడు కూడా తనకు ఆరో భర్తగా ఉంటే బాగుండునని ఆశపడిందంటారు. నిజమా!" రామాచారి అడిగాడు.

"భారతంలో అలా ఎక్కడా లేదు. ద్రౌపది అగ్నిసంభవ. అయోనిజ. యాగాన్ని నుంచి పుట్టిన పునీత. మహా పతివ్రత.

ఆవిడకు కలలో కూడా అలాంటి ఆలోచనలేదు. ఇది కేవలం కల్పితం. ఐతే పెద్దకొడుకు కర్ణుని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకోవడానికి కుంతీదేవి కర్ణుడితో అంటుంది 'నాయనా నువ్వు పాండవపక్షాని కొస్తే సింహాసనం నీదే అవుతుంది.

ధర్మరాజుతో సహా అంతా నీకు సేవ చేస్తారు. ద్రౌపదికి ఆరోభర్త కాగలవు' అని. కాని కర్ణుడు సామాన్యుడా... సూర్యపుత్రుడు. ఆయన తల్లి ప్రలోభాలకు లొంగకుండా స్నేహధర్మాన్నే పాటించి చివరివరకు దుర్యోధనుని పక్షానే ఉన్నాడు"

"అసలు కురుక్షేత్ర యుద్ధానికి మూలకారకులు ఎవరనే విషయంలో పలుసందేహాలు ఉన్నాయి. వ్యాసుల వారు భారతం రాసుకెళ్ళిపోయారు గానీ ఇదీ కారణమంటూ ఎక్కడా చెప్పలేదు. కొందరేమో ద్రౌపది కారణమంటారు. కొందరేమో శకుని కారణం అంటారు. కొందరేమో కృష్ణుడే కారణం అంటారు. ఏది నిజం?"

"ధృతరాష్ట్రునికి వందమంది కొడుకులు. వారు దారితప్పుతున్నారని తెలిసీ పుత్ర వాత్సల్యంతో చిన్నప్పుడే వాళ్ళను కట్టడి చేయకపోవడం ఆయన తప్పు. భీష్మాది ప్రముఖుల హెచ్చరికల్ని కూడా పట్టించుకోకుండా పుత్ర వాత్సల్యంతో మౌనం వహించిన ఫలితం చివరకు ఆయనకు పుత్రశోకాన్నే మిగిల్చింది" అన్నాడు చరక్.

సరిగ్గా అప్పుడే డ్రైవరు కాశీ లోనకు వచ్చాడు. కాశీ ఉత్తినే రాడు. ఏదో కబురు తెచ్చే ఉంటాడు.

"ఏమిట్రా ఇలా వచ్చావ్?" జేజితాతగారు పిలిచారా?" అడిగాడు చరక్.

"అవునండి. రామాచారి గారిని మాత్రం వెంట తీసుకురమ్మన్నారండి" చెప్పాడు.

"ఓ.కె. జాతకాలు పరిశీలించేటప్పుడు ఎవరూ దగ్గరుండకూడదు. మీరు బయల్దేరండి" అన్నాడు రామాచారితో. వెంటనే రామాచారి– పంచాంగంతోపాటు శుశ్రుత జాతకం కూడా తీసుకుని కాశీ వెంట బయలుదేరి వెళ్ళిపోయాడు.

* * * * *

అగ్నివేశాచార్యుని నివాసం... ఆయనతోబాటు రామాచారి ఇద్దరే ఉన్నారు. అబ్బాయి చరక్, అమ్మాయి శుశ్రుత జాతకబలాల్ని చాలాసేపు నిశితంగా పరిశీలిస్తూ కూర్చున్నారు.

రామాచారి అప్పటికే ఒక ముహూర్తం నిర్ణయించాడు. అనూరాధా నక్షత్రయుక్త మీనలగ్నాన్ని వివాహ ముహూర్తంగా నిశ్చయించేశాడు.

ఆ ముహూర్తం పక్షంరోజుల తర్వాత వస్తుంది. కాని ఆ ముహూర్తాన్ని అవుననికాని కాదనిగాని అనకుండా ఇంకా లోతుగా జాతకాల్ని అధ్యయనం చేస్తూ మౌనంగా ఉండిపోయాడు మున్నలూరు అగ్నివేశాచార్యుడు. ఆయన ఆంతర్యమేమిటో అర్థంగాక దిక్కులు చూస్తున్నాడు రామాచారి.

ముహూర్తాలు చూడ్డంలో రామాచారికి హైదరాబాద్‌లో మంచిపేరు ఉంది. అయినా కూడా తను చూసిన ముహూర్తాన్ని అగ్నివేశాచార్యుడు ఎందుకు సందేహిస్తున్నాడో బోధపడ్డంలేదు.

సుమారు ఇరవై నిముషాల తర్వాత తలెత్తి రామాచారి వంక చూశాడాయన–

"అయ్యా, ఈ ముహూర్తం బాగాలేదంటారా?" అనుమాన నివృత్తి కోసం అడిగాడు రామాచారి.

"ముహూర్త దోషం లేదయ్యా... నువ్వు కరక్టుగానే చెప్పావ్. కాని ముహూర్తాన్ని మార్చితే ఎలా ఉంటుందాని ఆలోచిస్తున్నాను. ఎందుకంటే ఇరువురి

జాతకాల్లోనూ చిన్న చిన్న లోపాలు ఉన్నాయి. ముఖ్యంగా అమ్మాయి జాతకం ప్రకారం భర్తనుండి కొంతకాలం పాటు వియోగం, విరహబాధలు ఉన్నాయి.

అలాగే అబ్బాయి జాతకం ప్రకారం కొంతకాలం కన్పించకుండాపోయి తిరిగి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. జీవితంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా అధిగమించాలంటే అమ్మాయి జాతకం మరెంతో బలోపేతం కావాలి. అందుకు అనువైంది రేవతీ నక్షత్ర యుక్త మిథునలగ్నంగా భావిస్తున్నాను.

మీరు పెట్టిన ముహూర్తానికి మరో పదిరోజుల తర్వాత ఉందీ ముహూర్తం. అర్ధరాత్రి దాటాక రెండున్నర గంటలకు వస్తుంది. ఓసారి నువ్వూ పరిశీలించు. మరీ హడావుడి లేకుండా మనకి ఇరవై అయిదు రోజులు టైమూ కలిసొస్తుంది. ఆలోచించు" అంటూ తన అభిప్రాయం చెప్పాడు.

ఆయన ఉద్దేశం విని ఆశ్చర్యంతో తలమునకలైపోయాడు రామాచారి. అసలీ మహానుభావునికి తెలీని విద్య ఉందా అన్పించింది. నూటపాతికేళ్ళ వృద్ధ సింహం ఆయన. ఎక్కడా పళ్ళూడలేదు. నడుం వంగలేదు. చూపుమందగించలేదు. చర్మం కాస్త వడలినట్టు కన్పిస్తుంది. ఆయన అపారమేధస్సును సూచిస్తూ నుదుట మూడు ముడుతలు మాత్రం కన్పిస్తున్నాయంతే.

సాధారణంగా వివాహముహూర్తాలు నిర్ణయించేటప్పుడు వధూవరుల నక్షత్రాలు, పేరు, బలాలు, పొంతనాలు, ముహూర్తం ఇవే చూస్తారు.

కాని వధూవరుల జాతకాల్ని భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని ముహూర్తం చెప్పడం అగ్నివేశాచార్యుల వంటి పెద్దలకే చెల్లింది.

స్త్రీ జాతకాన్ని బట్టి పురుషుని జాతకం ఉంటుంది. కాబట్టి అమ్మాయి జాతకానికి బలం చేకూర్చే ముహూర్తాన్ని కోరుతున్నాడాయన.

ఇక ఆర్యూచేయకుండా ఆయనకు ఓ నమస్కారం పెట్టేశాడు రామాచారి. "అయ్యా, తమరి మాటకు తిరుగుంటుందా! భేషుగ్గా ఉంది. ఈ ముహూర్తాన్నే ఖాయం చేసేద్దాం" అన్నాడు ఉత్సాహంగా.

"అయితే ఆలస్యమెందుకు? ఇరువురి తరపున రెండు లగ్న పత్రికలు రాయండి. రేపే తాంబూలాలు మార్చుకోవచ్చు. శుభలేఖలు వేయించి అటు మీ బంధువర్గానికీ, ఇటు మావాళ్ళకి పంపించేస్తే ఓ పనైపోతుంది. పెళ్ళి పనుల్లో పడితే తీరికుండదు.

తెలుసుగా, నా మనమడు ఆర్యభట్టు అతని భార్య శ్రీలక్ష్మి – చరక్ తల్లి దండ్రులు. అమెరికాలో ఉంటున్నారు. శుభలేఖ వాళ్ళ పేరుమీద ఉండాలి. నా ఆశీస్సులు మాత్రం రాయి చాలు."

"చిత్తం"

"మరో ముఖ్య విషయం రామాచారి"

"అయ్యా, సెలవీయండి"

"ఇది మూడురోజుల పెళ్ళి"

"మూడు రోజుల పెళ్ళా!"

"అవును. మూడురోజుల పెళ్ళే. ఒకప్పుడు పెళ్ళి అంటే వారంరోజులు జరిపించేవారు. తర్వాత అది అయిదు రోజులకు మారింది. ఆ తర్వాత మూడు రోజులకు కుదించారు. రానురాను అదీ కుదించుకుని ఒక్కరోజు పెళ్ళిగా మారింది. ఇప్పుడదీ మారిపోయి అన్నీ ముహూర్తాల పెళ్ళిళ్ళు అయిపోయాయి"

"అవునండి అతిథులు ముహూర్తానికి ఓ గంట ముందు వెళ్ళడం, తెచ్చిన బహుమతి ఇచ్చేసి, వధూవరులమీద నాలుగు అక్షింతలు చల్లి భోంచేసి వెళ్ళి పోవడం. అంతా యాంత్రికంగా మారిపోయింది. వచ్చే బంధుజనం అలాగే వస్తున్నారు. ఇలా ముహూర్తం పెళ్ళిళ్ళకీ తక్కువేమీ అవడం లేదండి. లక్షలు ఖర్చుజరుగుతోంది. మరి మూడురోజుల పెళ్ళంటే."

రామాచారి సందేహం గ్రహించి నవ్వాడు అగ్నివేశాచార్యుడు. "రామాచారీ జరుగుతోంది నా మునిమనవడి పెళ్ళయ్యా. ఉభయగోదావరి జిల్లాలతో పాటు అటు కృష్ణా, ఇటు విశాఖవరకు ఎవరూ ఎక్కడా జరిపించనంత గ్రాండ్‌గా జరిపిస్తాను.

మా అగ్రహారం తూర్పున ఉన్న మా ఇరవై ఎకరాల్లో పందిళ్ళు వేయించి వివాహవేదిక కట్టించి అక్కడే వివాహం చేస్తాం. ఆ మూడు రోజులు వచ్చిన బంధుమిత్రులే కాదు, మా మున్నలూరులో ఎవరింటా పొయ్యి వెలగకూడదు. అందరికీ పందిళ్ళలోనే భోజనాలు, ఈ పెళ్ళి చాలా రోజులు అందరికీ గుర్తుండేంత గ్రాండ్‌గా జరుగుతుంది. శుభలేఖల్లో వివాహం మూడు రోజులని రాయడం మర్చిపోకు."

"అలాగే స్వామీ. రాసింది మీరు ఓ.కె. చేశాకే ప్రింటింగ్‌కు పంపిద్దాం. నాదో మనవి...."

"చెప్పు రామాచారి?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"నేనోసారి హైదరాబాద్ వెళ్ళిరావాలనుకుంటున్నాను"

"అర్థమైందయ్యా. నువ్వేమీ ఖర్చుపెట్టక్కర్లేదు. అంతా మేం చూసుకుంటాం చాలా?" అన్నారు.

"తమదయ స్వామీ. కాదనడం లేదు. కాని భగవంతుడి దయవలన నాకూ కాస్త ఉంది. ఉన్నదాంట్లోనే వధూవరులకి బట్టలు, నగలు అవీ తెచ్చుకుంటాను. మేం శివాలయానికి చెందిన పెంకుటింట్లో ఉంటున్నాం. కాని సిటీలో రెండు భవనాలున్నాయి. ఒకటి మా అబ్బాయికి, రెండోది శుశ్రుతకి అనుకున్నాం...." అన్నాడు రామాచారి.

"ఓ.కె. ఓ.కె. మీ సంతోషాన్ని నేనూ కాదనను. పెళ్ళి ఖర్చుల గురించి నీకే దిగులూ వద్దు. సంతృప్తికరంగా మీ లాంఛనాలు మీరు కానివ్వండి. శుభలేఖలు కూడా రానీ. వచ్చాక వాటిని వెంటతీసుకెళ్తే స్వయంగా ఆహ్వానించినట్టు ఉంటుంది అందర్నీ."

"చిత్తం అలాగే చేద్దాం" అంటూ అప్పటికప్పుడు లగ్న పత్రికలు రాయడం ఆరంభించాడు రామాచారి.

వివాహమనేది స్త్రీ పురుషుల్లో ఒక మధురమైన ఘట్టం. ఎన్నో ఆశలు ఎన్నో కోరికలు, మరెన్నో ఊహలతో యవ్వనంలో అడుగుపెట్టిన యువతీ యువకులు ఆ మధురక్షణాలకోసం తపిస్తూ ఎదురు చూస్తూంటారు. వివాహం కాగానే వారు వైవాహిక జీవితంలో అడుగుపెడతారు.

వధూవరుల అభిప్రాయాలు, అభిరుచులు, మనస్తత్వాలు, ఆలోచనలు ఒకటిగా ఉంటే వారి జీవితాంతం నందన వనంలా సాగిపోతుంది. పట్టు విడుపులతో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో పంతాలకుపోకుండా ఒకరినొకరు అనుసరించిపోతేనే సంసారం.

అలా కాకుండా భిన్న మనస్తత్వాలు భిన్నాభిప్రాయాలు, పంతాలు, పట్టింపులకు పోయి ఈ పనికి మాలిన మొగుడు దొరికాడేమిటాని అమ్మాయి, ఈ గయ్యాళితో జీవితమంతా ఎలా వేగాలి దేవుడాని అబ్బాయి స్పర్ధలు పెంచుకొని

సంసారాన్ని నరకం చేసుకుంటారు. కొందరు తప్పదని సర్దుకుపోతూంటారు. కొందరు డైవర్స్ తీసుకుని విడిపోతుంటారు.

ఇలాంటి సమస్యలు రాకూడదనే ముహూర్తాలు చేసేటప్పుడు వధూవరుల పొంతనాలు కూడా జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయిస్తారు. అయితే సొంత కారణాల వలన పెద్దలు వీటికి ప్రాధాన్యతనివ్వకుండా పంతుళ్ళచేత ముహూర్తాలు పెట్టిం చేస్తుంటారు.

గణపొంతన చూడ్డం వలన వధూవరుల గుణదోషాలు ముందే తెలిసి పోతాయి. వధూవరుల జన్మ లేదా నామనక్షత్రాన్ని అనుసరించి వారి రాశి తెలుస్తుంది. రాశినిబట్టి గణనిర్ణయం, నాడి నిర్ణయం, జంతునిర్ణయం జరుగు తుంది.

ఇది చాలా ముఖ్యమైన విషయం. కాని దురదృష్టవశాత్తూ చాలామంది దీన్ని పక్కన పెట్టేసి ముహూర్తాలు పెట్టించేస్తున్నారు. చాలామందికి వీటి వివరాలు తేలీదు. పంతుళ్ళూ విశదంగా చెప్పరు.

గణాల్లో దేవగణం, రాక్షసగణం, మనుష్యగణం అని మూడు విధాలయిన గణాలుంటాయి.

నక్షత్రం రాశిని బట్టి జాతకుడు ఏ గణానికి చెందినవాడో తెలుస్తుంది. ఆ యా గణాల్ని అనుసరించి నాడి- జంతువులు తెలుస్తాయి.

అలాగే ఆదినాడి - మధ్యనాడి - అంత్యనాడి అని మూడురకాల నాడు లుంటాయి. అలాగే గణాన్నిబట్టి జంతు నిర్ణయం ఉంటుంది.

జంతువులు గుర్రం, పాము, పిల్లి, మేక, దున్న, లేడి, సింహం, ఏనుగు, కుక్క, కోతి, ఎలుక ఇలా గణాన్ని అనుసరించి వస్తాయి.

జన్మ లేదా నామనక్షత్రాన్ని అనుసరించి ఈ గణపొంతన నిర్ణయం జరుగు తుంది. ఏకనాడి - ఏకగణం విరోధి జంతువులు కలిగిన వధూవరులకు వివాహం జరిపించరాదు. ఏకనాడి అనగా వధువుది మధ్యమ నాడి, వరుడిది మధ్యమ లేదా ఆది లేదా అంత్యనాడి అయి ఉండకూడదు. భిన్నంగా ఉండాలి.

అలాగే ఇద్దరూ ఒకే గణానికి చెందినవారై ఉండరాదు. అంటే దేవ- రాక్షస- మనుష్య గణాలతో భిన్నగణాలకు చెందినవారై ఉండాలి.

ఇంకా సఖ్యత గల జంతువర్గంవారై ఉండాలి గాని విరోధి జంతువులై ఉండకూడదు. విరోధి జంతువులంటే సింహం-ఏనుగు, పులి-మేక, పాము-ముంగిస, పిల్లి - ఎలుక, కుక్క-కోతి... ఇవి పరస్పర జన్మవైరం కలిగిన జంతువులు.

ఉదాహరణకి వధూవరులు గణపొంతనంలో పాము ముంగిసగా ఉన్నారనుకొందాం. అలాగే ఇద్దరూ దేవగణానికి చెంది అంత్యనాడి కలిగి ఉన్నారనుకుందాం. ఆ వధూవరులకి వివాహం జరిపిస్తే వారి సంసారం ఎప్పుడూ కొట్టుకోవడం, తిట్టుకోవడంతోనే సరిపోతుంది. సంసారంలో అభివృద్ధి ఉండదు.

కొందరు పెద్దలయితే ఈ గణపొంతనం మూడింటిలో ఒకటి తప్పినా కనీసం రెండు అనుకూలంగా ఉంటే చాలు పెళ్ళిచేయొచ్చంటారు. కాబట్టి ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని పరిశీలించాకే ముహూర్త నిర్ణయం జరుగుతుంది.

ప్రేమ వివాహాలు అధికశాతం విఫలంగావటానికి కారణం ఇదే. ఆకర్షణకి, జీవితానికి గల తేడా ఏమిటో వివాహం తర్వాతగాని వారికి అర్థం గావటంలేదు.

చరక్, శుశ్రుతల పేర్లు వారి వారి జన్మ నక్షత్రాల్ని అనుసరించి పెట్టిన పేర్లుకావు. తమకు నచ్చిన విధంగా ఆ పేర్లు పెట్టడం జరిగింది.

కాబట్టి వారి పేర్లను పరిగణనలోకి తీసుకోకుండా జన్మ నక్షత్రాల్ని అనుసరించి పరిశీలించినప్పుడు సకల అంశాలు చక్కగా అమరి ఉన్నాయి.

శుశ్రుత దేవగణమైతే చరక్ మనుష్య గణానికి చెంది వున్నాడు. శుశ్రుత అంత్యనాడి కాగా, చరక్ ఆది నాడి, ఇక జంతువులను గమనిస్తే శుశ్రుత లేడి, చరక్ గుర్రం, ఇలా అన్నీ భిన్నంగా ఒద్దికగా ఉన్నాయి.

ఇక ఇరువురి జాతకాల్లోనూ చెప్పుకోదగ్గ దోషాలూ తక్కువే. ఇవన్నీ చూస్తే అగ్నివేశాచార్యుడు వారి వివాహానికి రేవతీ నక్షత్రయుక్త మిథునలగ్నాన్ని ఖాయపర్చి లగ్నపత్రికలు రాయించి శుభలేఖలకు పంపించారు. అదేరోజు రాత్రి ఆయన అమెరికా ఫోన్ చేసి చరక్ తల్లిదండ్రులకు జరిగిందంతా వివరించి పెళ్ళి గురించి మాట్లాడాడు. వారు ఎంతో సంతోషించారు.

పెళ్ళికి పది రోజులముందే తామంతా బయలుదేరి వస్తున్నట్టు చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో నిశ్చితార్థం జరిపించాలని అగ్నివేశాచార్యుడు తొలుత

భావించాడు. కాని పదిరోజుల ముందే అబ్బాయి తల్లి దండ్రులిక్కడ ఉంటారు గాబట్టి అప్పుడే జరిపించే విధంగా అభిప్రాయం మార్చుకున్నాడు.

నిశ్చితార్థం అనగా ఈ వధూవరులకు వివాహం నిశ్చయింపబడి తాంబూలాలు మార్చుకొనడమైనది అని తెలిపే ఒక చిన్న కార్యక్రమం.

కొందరు దీన్ని కూడా ఆడంబరంగా ఘనంగా జరిపిస్తున్నారీ మధ్య. ముఖ్యంగా ఆ రోజు కొత్త పళ్ళెంలో కొబ్బరికాయ, తాంబూలం, నూతన వస్త్రాలు ఉంచి వధూవరుల తల్లి దండ్రులు అందరి సమక్షంలో పళ్ళాలు మార్చుకుంటారు.

తల్లి దండ్రులు అందుబాటులో లేని పక్షంలో పెద్దనాయన లేదా బాబాయి వరసయ్యే దంపతులు కూర్చుని పళ్ళెం అందుకుంటారు.

చరక్ తల్లిదండ్రులే అమెరికా నుంచి వస్తున్నారు గాబట్టి వేరేవారితో పని లేకుండా వారి సమక్షంలోనే జరిపించాలని నిశ్చయించారు.

అగ్నివేశాచార్యుడు శుభలేఖలు వేయించడంతోనే మున్నలూరి వారి అగ్రహారంలో పెళ్ళి పనుల హడావుడి మొదలైంది. అగ్రహారంలో అంతా బంధువర్గమే గావడంతో తలో పనీ భుజాన వేసుకుని రంగంలోకి దిగారు. ఇక ఊళ్ళో జనానికి అగ్నివేశాచార్యుడు దేవుడితో సమానం. పిలవకుండానే పెళ్ళి పనుల్లో పాలు పంచుకోసాగారు.

స్వీట్లు తయారు చేయడంలో అమలాపురం పక్కన అల్లవరం ఫేమస్. స్వీట్ల తయారీ సప్లై మొత్తం కాంట్రాక్టు వారికి అప్పగించేశారు. అలాగే వంట వాళ్ళకీ అల్లవరం ప్రసిద్ధే. అల్లవరంతో బాటు నరసాపురం పక్కన మత్స్యపురి, కృష్ణాజిల్లాలో రెండు ఊళ్ళనుంచి వంటవాళ్ళను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక రావుల పాలెం అవతల రాలిగ్రామానికి పక్కన నారికిమిల్లి అటు తణుకు దగ్గర్లోని పెరవలి గ్రామాలు పచ్చళ్ళకు ప్రసిద్ధి. ఆ సెక్షన్‌కు అక్కడి నుండి ఏర్పాట్లు జరిగాయి.

లేటెస్ట్ పద్ధతులేవీ అగ్నివేశాచార్యునికి నచ్చవు. అంతా సాంప్రదాయ బద్ధంగా జరగాలి. పాతకాలం వంటకాలు, సాంప్రదాయ పిండి వంటకాల రుచులు నేటితరాలకు తెలియాలనేది ఆయన ఆకాంక్ష. అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లూ సాగుతున్నాయి.

ఇక బట్టల విషయానికొస్తే చరక్ పెళ్ళిసూట్లు హైదరాబాద్‌లో ఆర్డరివ్వగా వధువు పెళ్ళి చీరలు కంచినుంచి ఖరీదైన సిల్కుచీరలు ఏర్పాటు చేయడం జరిగింది. పొందూరు ఖద్దరు ఫేమస్.

ఇక పక్కన రాజమండ్రి వస్త్రలత ఉండనే ఉంది. దేవమ్మగారి ఆధ్వర్యంలో బంధువర్గం స్త్రీలకు చీరలు అవీ ఏర్పాటు చేయడం జరుగుతోంది.

అలాగే మండపేట బ్యాండుమేళంతోపాటు రాష్ట్రంలోనే నంబర్‌వన్ అనతగ్గ మరోరెండు బ్యాండు మేళాలు భజంత్రీల ఏర్పాటు జరిగింది.

ఈలోపల పోస్ట్‌లో వెళ్ళే శుభలేఖలు వెళ్ళిపోతున్నాయి. కొందరికి స్వయంగా చరక్ వెళ్ళి శుభలేఖ లిచ్చి ఆహ్వానించి వస్తున్నాడు.

రామాచారి తమ శుభలేఖలతో రెండ్రోజుల క్రితమే బయలుదేరి హైదరాబాద్ వెళ్ళాడు.

మరోపక్క పనివాళ్ళు ఇరవై ఎకరాల కొబ్బరితోటను నేల శుభ్రం చేసి, చదునుచేసి పందిళ్ళు లేపడానికి అనుకూలంగా మారుస్తున్నారు.

వివాహ మండపం వేదిక అద్భుతంగా తీర్చిదిద్దడానికి దానికి సంబంధించిన వారు వచ్చి చూసుకుని అంచనాలు వేసుకు వెళ్ళారు.

ఇంకో పక్క పెళ్ళిలో విందుభోజనాల తయారీకి అవసరమైన బియ్యం, పప్పులు, వంటనూనెల డబ్బాలు లారీల్లో వచ్చి దించటం ఆరంభమైంది. ఇలా రోజు రోజుకీ పెళ్ళిపనులు ఊపందుకుంటున్నాయి.

అక్కడ అమెరికాలో కూడా చరక్ తల్లిదండ్రులు అక్కాబావ వారి ఇద్దరు పిల్లలు అంతా ఇండియా బయలుదేరే హడావుడిలో ఉన్నారు.

ఈ పరిస్థితిలోనే ఓ రోజు – ఎందుకో బయటి కొచ్చిన దేవమ్మగారి దృష్టి గేటు సమీపంలో తచ్చాడుతున్న ఓ యువకుడిమీద పడింది. వాడికి పాతికేళ్ళు మించి ఉండవు. మనిషి కాస్త నల్లగా, పొడుగ్గా, బక్కగా ఉన్నాడు. మాసిన గడ్డం, చింపిరి జుత్తు, నలిగిన దస్తులు, కాళ్ళకు అరిగిపోయిన చెప్పులు, చూడ్డానికి దైన్యంగా ఉన్నాడు.

అతడ్ని ఇంతకుముందెన్నడూ చూసిన గుర్తులేదు. చూస్తే ఆకలితో ఉన్నట్టు అయ్యోపాపం అనిపిస్తున్నాడు. ఆ కుర్రాడ్ని చూసి దేవమ్మగారి మనసు కరిగింది.

"ఒరేయ్ అబ్బీ ఇలా రారా" అంటూ పిలిచింది. గబగబా దగ్గరకొచ్చి– వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు వాడు.

"నీ పేరేమిట్రా?" అడిగిందావిడ.

"అమ్మా! నా పేరు అప్పన్నండి. సింహాసిలం అప్పన్న పేరండి" ఎంతో వినయంగా బదులిచ్చాడు వాడు.

"ఏరా, నిన్నెప్పుడూ మా ఊళ్ళో చూసిన గుర్తులేదే. ఏ ఊరు నీది? ఇక్కడికి ఎందుకొచ్చావ్? మా గేటుదగ్గర ఏం పన్రా నీకు?" అడిగింది దేవమ్మ.

"అమ్మా. మాది సానాదూరనుండి. తూరుపునుంచొచ్చినా. శికాకుళం జిల్లా పాలకొండ ఉంది గదండి. ఆ పాలకొండ దగ్గర మంగళాపురం మా ఊరండి. వర్షాల్లేక మా ఊళ్ళో పనుల్లేవండి.

కట్టాలకు తట్టుకోలేక సుడిగాలికి కొట్టుకొచ్చిన కాగితం ముక్కలా ఈ ఊరు వచ్చిపడ్డానండి.

మూడు రోజులైంది ఏ పుణ్యాత్ముడయినా పని చూపించకపోతాడా, గుప్పెడు అన్నం దొరక్కపోతుందాని ఆశతో తిరిగానండి. మారాజులెవరికీ దయకలగలేదు. బువ్వతిని రెండ్రోజులైనాది. కళ్ళు తిరుగుతున్నాయి. ఎవరో అన్నారండి ఇక్కడ పెళ్ళిపనుల్లో నీకు ఏదో పని దొరుకుతుంది పోయి అడగరా అని.

నాకిక్కడ ఎవరూ తెలీదండి. ఎవర్ని అడగాలో తెలీక దిక్కులు జూత్తా నిలబడ్డాను తల్లీ. మా అవ్వలాంటిదానివి. కనికరం చూపి పట్టెడన్నం పెట్టిస్తే మీరేం పనిజెప్పినా జేత్తానండి" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు అప్పన్న.

వాడ్ని చూస్తే జాలేసింది దేవమ్మగారికి. వాడి దీనపరిస్థితీ అర్థమైంది. లోకంలో అన్ని బాధలకన్నా ఆకలిబాధ మహాచెడ్డది. ఎవరూ ఆకలితో ఉండ కూడదు. అందుకే అన్నిదానాలకన్నా అన్నదానం గొప్పదన్నారు పెద్దలు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం.' అన్నం ప్రాణాలు నిలుపుతోంది. ప్రాణం వుంటేనే మనిషి మనుగడ సాగుతుంది.

ఏమీ చెప్పలేదావిడ. వెంటనే పని మనిషిని పిలిచి అప్పన్నకు కడుపు నిండా భోజనం పెట్టించి తన వద్దకు తీసుకురమ్మని లోనకు వెళ్ళిపోయింది. అప్పన్న సమస్య తీరింది. పనిమనిషితో వెళ్ళి పెరట్లో కూర్చుని ఆకునిండా

అన్నం, కూరలు పెట్టించుకుని సుష్టుగా భోంచేశాడు. తర్వాత దేవమ్మగారి ఎదుట నిలిచాడు. "ఏరా? నమ్మకంగా పనులు చేస్తావా?" అడిగిందావిడ.

"చేస్తానమ్మా"

"జీతం ఎంత కావాలి?"

"అమ్మా భుక్తిగడవడం కోసమొచ్చినోడ్ని. ఇంతని ఏమడగను తల్లీ. మీ ఇష్టం. పొద్దుటే కొంచెం టిఫిను, రెండు పూటలా భోజనం పెట్టి ఖర్చులకి మీరేమిచ్చినా తీసుకుంటాను. అలాగే రెండు జతల పాతబట్టలిప్పిస్తే తొడుక్కుంటానమ్మా" అన్నాడు అప్పన్న.

"అయితే ఇక్కడే ఉండు. పెరట్లో షెడ్డులో మా పనివాళ్ళతోబాటు ఉండొచ్చు. నువ్వు ఏం పనులు చేయాలో మా రంగయ్య చెప్తాడు" అంటూ అక్కడ ఇంటిపనులు వంటపనులు, తోటపనులు, గోవుల సంరక్షణచూసే వృద్ధ నౌకరు రంగయ్యను పిలిచి అప్పన్నను అప్పగించిందావిడ. పని దొరకడమే మహాసంతోషంగా రంగయ్యను అనుసరించాడు అప్పన్న.

రూపంచూసి గుణాన్ని, మనిషిని చూసి మనసును అంచనావేయడం కష్టమంటారు.

ఇప్పుడు అప్పన్న విషయంలో దేవమ్మగారు చూపిన ఉదారగుణం ఎంత వరకు కరెక్టో రానున్న కాలమే చెప్పాలి. ఏ ప్రమాదాలు తేనున్నదో కూడా కాలమే చెప్పాలి.

*　　*　　*　　*　　*

చెప్పినట్టుగానే వివాహానికి పదిరోజులముందే చరక్ తల్లిదండ్రులైన ఆర్య భట్టాచార్యుడు, శ్రీలక్ష్మి వారి కూతురు, అల్లుడు వారి పిల్లలు అంతా అమెరికా నుంచి మున్నలూరివారి అగ్రహారం వచ్చి చేరుకున్నారు. వారితోబాటు కొందరు ఫారిన్ మిత్రులు కూడా ఈ వివాహాన్ని చూడాలని, అగ్నివేశాచార్యుని దర్శించాలని బయలుదేరివచ్చారు.

తమ కాబోయే కోడలు శుశ్రుతను చూసి అంతా సంతోషించారు. కొడుకు, కోడలు కోసం అమెరికా నుంచి వారు ఎన్నో బహుమతులు తెచ్చారు. ఇక డబ్బు సంగతి చెప్పక్కర్లేదు. వారి రాకతో పెళ్ళిపనులు మరింత ఊపందుకున్నాయి.

ఇక వివాహం మూడు రోజులూ మున్నలూరి వారి అగ్రహారం ఒక తిరునాళ్ళగా మారింది. రామాచారి కొడుకు, కోడలు, వారి పిల్లలు వారం ముందే రాగా, పెళ్ళినాటికి బంధువులంతా నాలుగు బస్సుల్లో వచ్చారు. చరక్ ఆఫీసుస్టాఫ్ ప్రత్యేకబస్‌లో వచ్చారు. వచ్చినవారికి వసతులతోబాటు ఏ లోటూ లేకుండా అన్ని ఏర్పాట్లూ చక్కగా జరిగాయి.

కళాతోరణంలాంటి అద్భుతమైన వేదికమీద చరక్, శుశ్రుతల వివాహం రంగరంగవైభవంగా జరిగింది. సమీపకాలంలో తిరిగి ఇంత గొప్ప వివాహాన్ని మళ్ళీ చూడలేమేమో అన్నంత ఘనంగా మూడు రోజుల పెళ్ళి వేడుకలు జరిగాయి.

తాముంటున్న భవనంలోనే చరక్, శుశ్రుతలకు శోభనవేడుకలు జరిపించిన రామాచారి కుటుంబం నూతనదంపతులను తీసుకుని హైదరాబాద్ ప్రయాణమైంది. వెళ్ళేముందు– జేజితాత అగ్నివేశాచార్యుని ఏకాంతంగా కలుసుకున్నాడు చరక్.

"నాయనా చరక్. ఆ అమ్మాయికి ఏ ముచ్చటా తీరకుండా నిన్ను నా వెంట తీసుకెళ్ళడం ధర్మంకాదు. కాబట్టి నువ్వు అత్తారింట్లో పక్షంరోజులుండిరా.

వచ్చేముందు కొన్ని పనులవలన తిరిగిరావడం కాస్త ఆలస్యంగావచ్చని, కంగారుపడొద్దని, ఫోన్‌కి అందుబాటు కాకపోవచ్చు, నేను ఫోన్ చేస్తానంటూ ముందే అమ్మాయికి జాగ్రత్తలు చెప్పిరా.

పొరబాటున మనం ఒక కార్యార్థం వెళ్తున్నట్టుగా ఆమెతో చెప్పకు" అంటూ జాగ్రత్తలు చెప్పి పంపించాడు అగ్నివేశాచార్యుడు.

* * * * *

శంభులింగ మహాపాత్రో! ఇతను ఒరిస్సాకు చెందిన ఎమ్.పి. స్వస్థలం భువనేశ్వర్. ఇతను సెంట్రల్ రవాణా మినిష్టర్ కూడా.

పేరుకు తగినవిధంగానే శంభులింగ మహాపాత్రో మహా శివభక్తుడు. స్థానిక ప్రజలకు ఆరాధ్య నాయకుడు. ఎక్కడ చూసినా ఆయన ఉంటున్న అధికార పార్టీతో బాటు ఆయన చిరునవ్వుతో ముకుళిత హస్తాలతో నమస్కరిస్తున్నట్టు ఫ్లెక్సీబేనర్లు ఆయన నియోజకవర్గంలోనే కాదు బయటా దర్శనమిస్తాయి.

మనిషి అయిదడుగుల పదంగుళాల ఎత్తున ఎర్రగా లావుగా చాలా బలిష్ఠమైన దేహదారుఢ్యంతో ఆకర్షణీయంగా ఉంటాడు. వయసు సుమారు

అరవై సంవత్సరాలు. జుత్తుకి మీసాలకి నిగనిగలాడే నల్లని రంగు వేసుకుని ఇప్పటికీ యవ్వనంలో ఉన్నట్టే కన్పిస్తాడు.

బుర్రమీసాలు, నుదుట విభూతిరేఖలు, తెల్లటి ఖద్దరు జుబ్బా, పైజామా ఆయన ప్రత్యేకత. చాలా తక్కువగా మాట్లాడతాడు. చూపులు చాలా తీక్షణంగానూ, ఆలోచనా భరితంగానూ ఉంటాయి. సదా శివ నామస్మరణ చేస్తుంటాడు.

భక్తులు ఆయనో గొప్ప శివభక్తుడంటారు. పేదలు ఆయన్ని దేవుడిగా భావిస్తారు. రాజకీయపక్షాలు ఆయనో గొప్ప రాజకీయ నాయకుడంటారు. ఆయనకి దానకర్ణుడనే పేరు కూడా ఉంది. సాయంకోరి ఎవరు వచ్చినా లేదనకుండా సాయం చేస్తాడు. అలాగే ఈ చేత్తో ఇచ్చి ఆ చేత్తో తీసుకోవడం కూడా శంభులింగ మహాపాత్రోకి వెన్నతో బెట్టిన విద్య.

అయితే అతడి నిజరూపం తెలిసిన వాళ్ళుమాత్రం శంభులింగ మహాపాత్రోని మించిన దుర్మార్గుడు ఒరిస్సాలోనే కాదు ఇండియాలోనే కాదు ప్రపంచంలో మరెక్కడా ఉండడని చెప్తారు.

శంభులింగ మహాపాత్రో రెండో పార్శ్వం ఇది. అతను ఎంత భక్తుడో అంతకంత క్రూరుడు, దుర్మార్గుడు. ఎంతటి దానకర్ణుడో అంతకంత దోపిడీదారు. శంభులింగ మహాపాత్రోకు ధనదాహం ఎక్కువ.

ఒరిస్సా స్టేట్‌లో అతడికి లేని వ్యాపారమంటూ లేదు. పార్టీలోనూ, సెంట్రల్ గవర్నమెంట్‌లోనూ తన పలుకుబడి పదవిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందుతూనే ఇటు ప్రజల్ని దోపిడీ చేస్తుంటాడు.

పదవి, వ్యాపారం రెండూ అతడికి రెండు ప్రాణాలు. కోట్లకు కోట్లు కూడబెట్టుకున్నా అతడికి తృప్తిలేదు. రాజకీయ శత్రువుల్నిగాని, వ్యాపార విరోధుల్నిగాని అతడు క్షమించడు. అలాగే తన చీకటి వ్యాపారకోణాల్ని, కుట్రల్ని ప్రజల ముందుకు తెచ్చే మీడియా వర్గాన్ని వదిలిపెట్టడు. నవ్వుతూనే గొంతు కోయించేస్తాడు. ఎక్కడా అతని పేరు బయటికిరాదు. వచ్చినా సాక్ష్యాలుండవు. పైగా ప్రత్యర్థుల్ని చాలా సహజమరణంలా ప్లాన్డ్‌గా చంపటం అతడి మనుషులకు అలవాటు.

అలాగే ప్రత్యర్థుల్ని తనవైపు తిప్పుకోవడానికి దెబ్బ తీయడానికి శంభులింగ మహాపాత్రో మంత్రశక్తిని కూడా వాడుకుంటాడు. ఆ మంత్రశక్తే మాంత్రికుడు

మరిడి సోమయ్య. మరిడి సోమయ్య శక్తిసామర్థ్యాలమీద శంభులింగ మహాపాత్రోకి అపారమైన నమ్మకం. అలాగే అతడి కోసం మరిడి సోమయ్య కూడా చాలా క్షుద్రకర్మలు నిర్వహించాడు.

అతడు కోరిన డబ్బు ఇవ్వడానికి శంభులింగ మహాపాత్రో వెనుకాడడు. మరిడి సోమయ్య భువనేశ్వర్ వస్తే శంభులింగ మహాపాత్రోని కలవకుండా వెళ్ళడు.

భువనేశ్వర్ సిటీలిమిట్స్‌లో జాజ్‌పూర్ వెళ్ళే మార్గాన కొబ్బరితోటలో ఒక విలాసవంతమైన గెస్ట్ హౌస్ ఉంది. అది శంభులింగ మహాపాత్రో అనుచరుడి పేరుమీద ఉంది గాబట్టి అతనా గెస్ట్‌హౌస్‌కి వచ్చిపోయే విషయం ఎవరికీ తెలీదు.

ప్రస్తుతం వారిద్దరూ ఆ గెస్ట్‌హౌస్‌లో రిలాక్స్‌గా కూర్చుని మందు కార్యక్రమంలో ఉన్నారు.

"అవునూ... నీ శిష్యుడు వికేశి మరణించాడని విన్నాను. ఎలా జరిగింది?" ఉన్నట్టుండి గుర్తుచేసుకుని అడిగాడు శంభులింగ మహాపాత్రో.

గ్లాసు ఖాళీచేసి పక్కనపెట్టి విచారంగా చూశాడు మరిడి సోమయ్య. "వాడి విషయమే చాలా బాధగా ఉంది పాత్రో. వాడు గుర్తొస్తే చాలు తనను కాపాడుకోలేని నా అసమర్థత మీద నాకే అసహ్యం వేస్తుంది. ఏం చేస్తాం. ఎంతో పైకిరావలసిన కుర్రాడు. అనుభవం లేక ప్రాణాలు పోగొట్టుకున్నాడు" అన్నాడు బాధగా.

"ఏం జరిగింది సోమయ్యా. వాడు చాలా తెలివైన వాడేగదా!" సందేహంతో అడిగాడు శంభులింగ మహాపాత్రో. పెదవి విరిచాడు మరిడి సోమయ్య.

"ప్చ్. తెలివితేటలు వేరు, అనుభవం వేరు. నువ్వు ఎప్పుడన్నా, ఎక్కడన్నా ధన్వంతరీ మున్నలూరు అగ్నివేశాచార్యులవారి పేరు విన్నావా?"

"ఆఁ ఎప్పుడో, ఎక్కడో విన్న గుర్తు, ఇంతకీ ఎవరాయన?" అడిగాడు శంభులింగ మహాపాత్రో.

"పరోక్షంలో కూడా మనం గౌరవం ఇచ్చి మాట్లాడాల్సిన గొప్పవాళ్ళు కొందరుంటారు. అటువంటి వారిలో ప్రథముడు ఈయన."

"అబ్బో. అంత గొప్పవాడా?"

"అవును. గొప్పవాడే. నాకు మా గురుదేవునితో సమానమైనవాడు. ఆయన్ని గౌరవిస్తే మనల్ని మనం గౌరవించు కున్నట్టు"

"ఓ.కె.వారు ఎవరు ఎక్కడ ఉంటారు. నువ్వు చెప్పబోయే విషయానికీ, వారికీ సంబంధం ఏమిటి?"

"సంబంధం ఉంది పాత్రో, చెప్తాను గాని ముందు ఇది చెప్పు. నేటి భారతావనిలో వయోవృద్ధుల్లో మొదటి స్థానంలో ఉన్న వ్యక్తి ఒకరు ఉన్నారు.

ఆయన తెలుగువారు. ఆంధ్రాలో ఉంటారు. ఆయన గురించి తెలుసా? రాజకీయ నాయకుడిగా ఇలాంటి విషయాలు తెలుసుకునేంత తీరిక నీకుండదు. నేను చెప్పినట్టు వయోవృద్ధుల్లో మొదటి స్థానంలో వున్న కురువృద్ధుడే ఈ అగ్నివేశాచార్యుల వారు. నూటపాతికేళ్ళ మహావటవృక్షం లాంటి వ్యక్తి.

వారికి తెలీని విద్యంటూ ఒకటుందని అనుకోను. ఆరు భాషల్లో కోవిదుడు. ఆయుర్వేదాచార్యుడు. నిత్య పరిశోధనల్లో అనేక కొత్తమందులు కనిపెట్టినవాడు. అనేక వైద్యగ్రంధాలు రాసిన రచనా కారుడు. మంత్ర తంత్ర యంత్ర విద్యల్లోమేటి. నిరంతర అన్వేషకుడు.

ఆయన తరం వాళ్ళంతా పోయినా ఏదో ఇంకా సాధించాలని నేటికీ బతికే వున్న మృత్యుంజయుడు. ఇలా ఆయనగురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది" అంటూ క్షణం చెప్పడం ఆపాడు మరిడి సోమయ్య.

ఆ మాటలు శ్రద్ధగా విన్నాక శంభులింగ మహాపాత్రోలో కుతూహలం రెట్టింపయి మరింత ఆసక్తిగా చూశాడు. "నిజంగా ఆయనంత మహనీయుడైతే నేనూ ఓసారి దర్శనం చేసుకోవలసిందే" అన్నాడు.

"తొందరపడకు. కరెంటు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. అలాగని పొరపాటున తాకితే మనం మాడిమసైపోతాం.

ఆయన కరెంటులాంటివాడు. అది తెలీకే నా శిష్యుడు వికేశి ఆయన ప్రయత్నాల్లోకి తొంగిచూసి ప్రాణాలు పోగొట్టుకున్నాడు" అంటూ జరిగిందంతా ఎమ్.పి. శంభులింగ మహాపాత్రోకి విశదంగా వివరించాడు మరిడి సోమయ్య.

ఆ మాటల్ని మందుగ్లాసు కూడా మర్చిపోయి ఆశ్చర్యపోతూ విన్నాడు మహాపాత్రో. "సో... నీ గురువులాంటి అగ్నివేశాచార్యునితో నీకు శత్రుత్వం ఏర్పడింది. అంతేకదూ?" అనడిగాడు.

"ఒక విధంగా అంతే. కాని ఆయన మీద, ఆయన వయసుమీద, ఆయన మేధస్సుమీద నాకు ఎనలేని గౌరవం" అన్నాడు మరిడి సోమయ్య.

"ఉంటుంది. కాని గౌరవం వేరు, శత్రుత్వం వేరు. నా శత్రువర్గాల్లో నేను గౌరవించిన గొప్పవాళ్ళు కూడా ఉన్నారు. కాని క్షమించలేదే! శత్రువు గదా. చంపించేశాను. చాలామందిని... ఇదీ అంతే. అవకాశం వస్తే నువ్వూ ఆ పనిచేస్తావ్. నాకు తెలుసు. మంత్రశక్తిలో నీ కన్నా గొప్పవాడంటావా?"

"చాలా... మంత్రతంత్రం యంత్రశక్తుల్ని ఔసోసన పట్టినవాడు. కాదంటే నేను క్షుద్రశక్తుల్ని వశపర్చుకున్నాను. ఆయన దైవశక్తుల్ని వశపర్చుకున్నాడు. ఆయన్ని జయించడం అంత సులువు కాదు."

"ఇంతకీ ఆ చెక్కపెట్టెతో ఆయన ఏం సాధించాలనుకుంటున్నాడు"

మరోసారి పెదవి విరిచాడు మరిడి సోమయ్య "ఖచ్చితంగా అయితే తెలీదు. కాని భూతకాలంలోకి వెళ్ళే ప్రయత్నమని మాత్రం గ్రహించాను" అన్నాడు.

"ఏమిటి? భూతకాలమా" అంటూ ఘెళ్ళున నవ్వాడు శంభులింగ మహాపాత్రో.

"భూతకాలం, దయ్యాలకాలం, పిశాచాలకాలం. మతిపోయిందా? అసలు అలాంటి కాలమంటూ ఒకటుందా? అయినా ఆ కాలంలోకి వెళ్ళి ఏం చేస్తారాయన? దయ్యాలు, పిశాచాలతో నాట్యం చేద్దామనా?" నవ్వుతూనే వెటకారంగా అడిగాడు.

"నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావ్ మహాపాత్రో. భూతకాలమంటే దయ్యాలు, పిశాచాలకాలంకాదు. గతకాలం... జరిగిపోయిన కాలం. కాలగర్భంలో కలసిపోయిన కాలమని అర్థం" సీరియస్‌గా వివరించాడు మరిడి సోమయ్య.

ఈసారి మరింతగా – ఆశ్చర్యానికి లోనయ్యాడు శంభులింగ మహాపాత్రో–

"అంటే... చరిత్రలోకి?" సందేహంగా అడిగాడు.

"నువ్వు చరిత్రకాలం అనుకో, పురాణకాలం అనుకో. గతించిన కాలం అనుకో... నిస్సందేహంగా ఆ కాలంలోకి" అన్నాడు మరిడి సోమయ్య.

తెరిచిన నోరు మూయటం మర్చిపోయి– అలా చూస్తూండిపోయాడు శంభులింగ మహాపాత్రో.

"ఇదెలా సాధ్యమనుకుంటున్నావు? రాకెట్‌లో సూర్యమండలంలోకి వెళ్తున్నాడను, ఒప్పుకుంటాను. రాకెట్‌లో... అదేమి... పాలపుంత... దాన్ని చుట్టి రాబోతున్నాడను నమ్ముతాను.

కాని గతంలోకి అంటే... ఎక్కడుందది? కరిగిపోయింది. మట్టిలో కలసి పోయింది. ముగిసిపోయిన కాలం. అది తిరిగొస్తుందా? మా ఖారవేలుణ్ణి, మీ శ్రీకృష్ణదేవరాయల్ని, అక్బరు చక్రవర్తిని నాటి రాజ్యాల్ని, రాజుల్ని, ప్రజల్ని, వారి జీవనవిధానాల్ని, దర్శించగలమా... నోనోనో... ఇంపాజిబుల్ సోమయ్యా.

ఊహలు నిజమవుతాయా? అసలు అలాంటి ప్రయత్నమే వృధా."

"ఇది సంభవమే"

"ఏంటి?... నీ నమ్మకానిక్కారణాలేంటి?"

"కారణం ఉంది. అగ్నివేశాచార్యుడు అసాధ్యాలను సుసాధ్యం చేయగల మేధావి. అసంభవాలమీద ప్రయోగాలు చేసి సమయాన్ని వృధా చేయడు"

"నో... నో... కేవలం ఆయనమీద నమ్మకంతోనే నువ్వింతగా సమర్థిస్తున్నావంటే నమ్మను సోమయ్యా... నీకు నమ్మకం కలిగించిన అంశాలు ఏవో ఉన్నాయి. వికేశి మరణానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? వివరంగా చెప్పు" అనడిగాడు సాలోచనగా శంభులింగ మహాపాత్రో.

మరిడి సోమయ్య మరోగ్లాసు ఖాళీచేసి మహాపాత్రో వంక గంభీర వదనంతో చూశాడు.

"పురాతనకాలంలో మనదేశంలో ప్రయాణదేవతగా ప్రసిద్ధుడైన ఒక యక్షుడున్నాడు. ఒకప్పుడు రహదారుల వెంట ఆయన ఆలయాలు ఉండేవి. నీకు తెలుసా?" అనడిగాడు.

తల అడ్డంగా ఊపాడు శంభులింగ మహాపాత్రో. "చరిత్రకారుల్నో, పురాణికుల్నో అడగాల్సిన ప్రశ్న నన్నడుగుతావేమిటి సోమయ్యా. డబ్బు సంపాదించడం ఎలా అనడుగు చెప్తాను.

మర్డర్ చేయించడం ఎలా అనడుగు చెప్తాను. అంతేగాని ఇలాంటి యక్ష ప్రశ్నలు వేస్తే నాకెలా తెలుస్తాయి? నువ్వే చెప్పు" అన్నాడు విసుగ్గా.

"అతని పేరు మణిభద్ర యక్షుడు. ప్రయాణదేవత. సురక్షితంగా గమ్యం చేరుస్తాడని ప్రయాణంలో ఉన్నవారు ఆయన ఆలయాల్లో పూజలు చేసి ప్రార్థించుకుని ప్రయాణాలు చేసేవారు.

ఈ మణిభద్ర యక్షుడు వర్తమానకాలం మాత్రమే కాదు, భూతభవిష్య కాలాలకు అవలీలగా ప్రయాణించి రాగల సమర్థుడు.

అంత సులువుగా ఎవరికీ వశం కాడు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం అగ్నివేశాచార్యుల వారు ఈ మణిభద్రయక్షుని వశపర్చుకుని యక్షశక్తుల్ని కూడా సాధించడం జరిగింది.

"భూతకాలదర్శిని" అనే కాలనాళిక మందసాన్ని తయారుచేశాడు. దాని సాయంతో చంద్రమండలానికి వెళ్ళొచ్చినంత సులువుగా మనిషి భూతకాలంలోకి వెళ్ళిరావచ్చు.

నా శిష్యులు తెచ్చిన ఇన్‌ఫర్మేషనిది. నా శిష్యుడు విళంబి ఆత్మరూపంలో వెళ్ళి అగ్నివేశాచార్యుని స్థావరంలో సంచరించాడు. పరకాయ ప్రవేశవిద్యతో మృణాళుడు చిలకలో ప్రవేశించి వెళ్ళి అక్కడ చుట్టివచ్చాడు. వాళ్ళక్కడ చూసిన విన్నదాన్ని బట్టి నాకు అర్థమైన విషయాలివి.

ఆయన ప్రయోగం విజయవంతమయింది. పరీక్షలో భాగంగా ఆచార్యుడే స్వయంగా ఓసారి భూతకాలంలోకి వెళ్ళివచ్చాడు. పిదప తాత్కాలికంగా స్థావరాన్ని మూసి ఇంటికెళ్ళిపోయాడు.

ఆచార్యుడి మనసులో ఏముందో ఎవరిని ఎక్కడికి పంపించబోతున్నాడో తెలియాల్సి ఉంది.

ఏది ఏమైనప్పటికీ అగ్నివేశాచార్యుని ఆశయాన్ని మాత్రం నెరవేరనివ్వను. ప్రతీకారం తీర్చుకుంటాను" అన్నాడు స్థిరంగా.

"ఆగాగు సోమయ్యా. కాస్త వివరంగా చెప్పు. ఆయనకో ఆశయం ఉందా? ఆశయసాధనకోసమే ఇదంతా చేస్తున్నాడా? ఆయన ఆశయమేమిటి?"

"లోకంలో ధర్మసంస్థాపన గావించడం"

"ధర్మం... ఎక్కడుందది? పాపం, పుణ్యం, నీతి, అవినీతి, ధర్మం, అధర్మం ఇలా ఆలోచించి ధర్మంగా ఉండాలనుకునేవాళ్ళు లోకంలో ఈ రోజు బతకలేక అసమర్థులనిపించుకుంటున్నారు.

కలిధర్మం, అధర్మం పాదరసంలా లోకవ్యాప్తమైపోతోంది. ఎలా చేస్తాడు ధర్మసంస్థాపన? దేవుడు దిగి రావాలి" అన్నాడు శంభులింగ మహాపాత్రో.

"మహాపాత్రో. ఒక విషయం నువ్వు మర్చిపోతున్నావ్. కలియుగం అయిదువేల సంవత్సరాలు దాటిన తర్వాత లోకంలో వచ్చే మార్పు లేమిటో చెప్పిన శ్రీ వీరభ్రహ్మేంద్రస్వామిని నాటి ప్రజలు ఓ పిచ్చివాడి కింద చూశారు.

ఈయన పిచ్చిగాని వర్ణవ్యవస్థ పోతుందా! భయం లేకుండా ఆకాశంలో మనుషులు ఎగురుతారా... తెరమీద బొమ్మలాడుతాయా... జంతువుల్లేకుండా బండ్లు పరుగెడతాయా, చోద్యంగాని ఇవి జరిగే విషయాలేనా" అని హేళన చేశారు.

నమ్మేవాళ్ళు నమ్మారు. నమ్మనివాళ్ళు నమ్మలేదు. కాని అవే విషయాలు నేడు మన కళ్ళముందు జరుగుతున్నాయి. అంతా ఆయన చెప్పినట్టే జరుగుతూ వస్తోంది. కాబట్టి దేన్నీ అసంభవం అని కొట్టిపారేయలేం. లోకంలో ధర్మసంస్థాపన, భారత దేశాన్ని సుసంపన్నం చేయటం, కలిధర్మంతో లోకం భ్రష్టుపట్టకుండా ఆపటం ఇలా ఏవేవో ఆశయాలున్నాయి అగ్నివేశాచార్యుల వారికి. అవి సాధించే ప్రయత్నంలో ఉన్నాడు."

"కాని ఎలా?... ఎలా? విచిత్రమయిన ఆశయం, నెరవేరని ఆశయం. చూడు సోమయ్యా ఒక ప్రక్క మాలాంటి రాజకీయ నాయకులు – మరోపక్క పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, గుత్తేదార్లు, ఐ.ఎ.ఎస్.లు, పవర్‌బ్రోకర్స్, తొంభై శాతం మంది ప్రభుత్వోగులు, కార్పొరేటర్ నుంచి కేంద్రమంత్రి వరకు ఇలా ఎందరో అవినీతిపరులు ఎక్కడికక్కడ అందిందంతా దోచేసి విదేశీ బ్యాంకులు నింపుతుంటే ఈ వృద్ధ మహాపురుషుడు తన కలను ఎలా సాకారం చేస్తాడు? అది నిజం కావచ్చని నీవెలా నమ్ముతున్నావ్"

"నమ్మాలి... తప్పదు."

"అదే ఎలా అంటున్నానయ్యా. అగ్నివేశాచార్యుల వారు తను చేసిన కాలనాళిక మందసంద్వారా ఏ వేదకాలానికో, రామాయణ కాలానికో మహాభారత కాలానికో లేక సప్తర్షుల కాలానికో వెళ్ళిపోయాడనుకుందాం. ఇక్కడి కలిధర్మం నాశనం గావించడానికి అక్కడికెళ్ళి ఏం చేయాలని? అక్కడి నుంచి ఏదైనా మంత్రదండం తెస్తాడా?" ఒకింత ఆత్రంగా అడిగాడు శంభులింగ మహాపాత్రో.

"కావచ్చు" అన్నాడు నిర్లిప్తంగా మరిడి సోమయ్య. "మంత్రదండమే గదాని నువ్వు తేలిగ్గా తీసిపారేయనక్కర్లేదు. దుష్టులైన క్షత్రియరాజులమీద ఇరవై

ఏడుసార్లు దాడులు చేసి అందర్ని ఊచకోత కోసి ధర్మం తిరిగి స్థాపించిన పరశురాముని మంత్ర దండమే అయితే అది? పదితలల రావణాసురుడ్ని వధించిన శ్రీరాముని రామబాణమైతే?

శిశుపాలుని శిరస్సు ఖండించిన శ్రీకృష్ణుని చక్రాయుధమైతే....”

“ఓయబ్బో... ఊరికే భయపెట్టకయ్యా. విషయానికి రా” అన్నాడు శంభులింగ మహాపాత్రో.

“ఇదీ విషయమే గదా మహాపాత్రో! విను. భూమిపైన ధర్మం నశించిన ప్రతిసారీ దుష్టశిక్షణ నిమిత్తం భగవంతుడు అవతరిస్తూ వచ్చాడు. అలా తొమ్మిది అవతారాలు రాగా పదో అవతారం కల్కి భగవాన్ అవతారం.

భవిష్యత్తులో కలియుగం మూడోపాదంలోనో, నాలుగోపాదంలోనో వస్తుందంటారు.

ఇలా భగవంతుడు అవతరించినా, భగవదంశలో జన్మించిన వారైనా ఈ భూమ్మీద తమకార్యం ముగిశాక తాము వాడిన ఆయుధాలను, ఇతర వస్తువుల్ని భూమ్మీదే వదిలిపోయారు.

ఆ వస్తువులు ఎక్కడో ఉండే ఉండొచ్చు. ఇందులో విశేషం ఏమంటే వాటి శక్తి ఇప్పటికీ అలాగే ఉంటుంది. అలాంటి వాటిలో ఏ ఒక్కటయినా పట్టుకుని భూతకాలం నుంచి తేగలిగితే ఆయన ఆశయం నెరవేరినట్టే, దుర్మార్గుల ఆట కడుతుంది.

అక్రమార్కులకు శిక్షలు తప్పవు. అన్యాయపరుల అంతు చూడబడుతుంది.”

“ఆగాగు. అదే జరిగితే మనలాంటివాళ్ళ పరిస్థితి ఏమిటి? మట్టికొట్టుకు పోవాల్సిందేనా?” అడిగాడు శంభులింగ మహాపాత్రో.

“అంతేగా మరి” అన్నాడు మరిడి సోమయ్య. “ఈ అనంతకాల ప్రవాహంలో మనం ఇసుకరేణువులో వందోవంతు కూడా కాదు. మనం ఆపినా ఆపకపోయినా జరిగేది జరక్కమానదు. కాని నా ప్రయత్నం నేను చేసి అడ్డుకుంటాను.

అంతేకాదు నా శిష్యుడు వికేశి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటాను. ఆ ఇంట్లో అగ్నివేశాచార్యునికి అమిత ఇష్టమైనవారిలో ఒకరిని చంపేస్తాను. ఆ

మరణంతో మానసికంగా దెబ్బతిని తన ప్రయత్నం ఆపేయొచ్చు... వదల... ప్రతీకారం వదల...."

"ఊహు... తప్పు...." అన్నాడు మహాపాత్రో.

"ఏమి? ప్రతీకారం తప్పెలా అవుతుంది?" ఒకింత విసుగ్గా అడిగాడు మరిడి సోమయ్య.

"తప్పే అంటాను సోమయ్యా. నువ్వు తెలివైనవాడివే గాని అప్పుడప్పుడూ నీ బుద్ధి మందగించిపోతుంది. ఆలోచించు. ఒకడు బంగారం అన్వేషణలో ఉన్నా డనుకుందాం.

వాడి ప్రయత్నాలకు అడ్డం పడ్డం లాభమా లేక వాడు బంగారంతో తిరిగివస్తుండగా దోచుకుపోవడం లాభమా?"

"రెండోదే కరెక్టనుకో. కాని...."

"అనుకోవడం కాదు. అదే కరెక్టు. తెలివైన పని. భూతకాలంలోంచి అగ్నివేశాచార్యుడు ఏంతెచ్చినా లేదా తెప్పించినా దానివిలువ ఫారెన్ మార్కెట్‌లో నేడు కోటానుకోట్ల విలువ ఉంటుంది. ఆ పైన తెచ్చిన ఆయుధం లేదా వస్తువు ఏదైనా గాని దాన్ని ప్రయోగించడం మనుషుల వలన అవుతుందా? మళ్ళీ ఆ దేవుడే దిగిరావాలి.

ఉదాహరణకి రామబాణం తెచ్చాడనుకుందాం. ఆ బాణాన్ని ఎవరు ప్రయోగించగలరు? కాబట్టి అగ్నివేశాచార్యులవారు అనుకున్నది సాధించినా దాని వలన ఫలితం మాత్రం శూన్యం.

కాని అదే మనచేతికొస్తే కోట్లు సంపాదించగలం. అర్థమైందా? ఒప్పుకుంటావా?"

శంభులింగ మహాపాత్రో మాటల్ని అంగీకరిస్తూ – తల ఊపాడు మరిడి సోమయ్య.

"మొత్తానికి వ్యాపారవేత్తవన్పించావ్ మహాపాత్రో. కాని నా ఆవేశం... దాన్నెలా చల్లార్చటం!...

పగ... వికేశి మరణానికి ప్రతీకారం. ఇవి ఏం కావాలి?" అడిగాడు మరిడి సోమయ్య.

"అది ఇప్పుడు కాదు. అగ్నివేశాచార్యులు అనుకున్నది సాధించాక, ఆ వస్తువులేవో మన చేతికొచ్చాక... కాబట్టి అంతవరకు ఈ పగలు, ప్రతీకారాలను మూటగట్టి పక్కనపడెయ్.

ఇంతకీ అగ్నివేశాచార్యుని కదలికలు నీకెలా తెలుస్తున్నాయి? మంత్ర శక్తితోనా?"

"మంత్రశక్తులు అన్ని సందర్భాల్లోనూ సాధ్యంకాదు. అదీ మంత్ర తంత్ర యంత్రవేత్త అగు అగ్నివేశాచార్యుల వద్ద అసలు పారవు. అందుకే నా మనిషి ఒకడ్ని నమ్మకంగా ఆయన వద్ద చేర్పించాను.

డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడంటే ఆచార్యుడికి ఎంతో నమ్మకం. కొద్ది రోజులు ఆ డాక్టర్ వద్ద పనిచేశాక ఆయన రికమెండేషన్‌తో అగ్నివేశాచార్యుని వద్ద పనిచేస్తూ అక్కడే ఉన్నాడు. పాపం ఆ డాక్టర్‌కీ వాడు నా మనిషని తేలీదు. వాడిద్వారా ఎప్పటికప్పుడు నాకు సమాచారం అందిపోతూవుంటుంది."

"వెరీ గుడ్. చాలా మంచిపని చేశావ్"

"అగ్నివేశాచార్యునితో పోటీపడాలంటే నేనింకా కొన్ని శక్తులను వశపర్చు కోవాలి"

"పోటీపడు... తగ్గకు... ఈ విషయంలో నీ వెనుక నేను ఉన్నాను. ఎంతడబ్బయినా నేనిస్తాను. ఖర్చులకి వెనుకాడాల్సిన పనిలేదు. భూతకాలం నుంచి వాళ్ళు ఏం తెచ్చినా అవి నాక్కావాలి. ఓ.కె.నా?"

"ఓ.కె. ఇక నేను బయలుదేరతాను. చీకటి పడకముందే జాజ్‌పూర్ చేరుకోవాలి" అంటూ లేచాడు మరిడి సోమయ్య.

కారు వరకు వచ్చి అతన్ని సాగనంపాడు శంభులింగ మహాపాత్రో.

* * * * *

"జేజితాతగారూ! మనం ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం? రంపచోడ వరమా?" పక్కన కూర్చున్న అగ్నివేశాచార్యుని అడిగాడు చరక్. చరక్ హైదరాబాద్ నుంచి వచ్చి మూడు రోజులయింది. శుశ్రుతను పుట్టింట్లోనే వదలివచ్చాడు.

తిథి వారం, నక్షత్రం చూసుకుని మునిమనవడ్ని వెంట నిడుకొని కోరుకొండ వద్ద ఎస్టేట్ భవంతికి బయలుదేరాడు అగ్నివేశాచార్యుడు.

డ్రైవరు కాశీ కారు నడుపుతున్నాడు. ఇద్దరూ వెనుక సీట్లో ఉన్నారు. అప్పటికే రాజమండ్రి వదిలింది కారు. చాలా సేపటిగా మౌనంగా ఉన్నాడు చరక్.

చరక్ ఆలోచనలు శుశ్రుతవైపు పరుగు తీస్తున్నాయి. పెళ్ళయిన ఈ పదిహేను రోజులూ తామిద్దరూ స్వర్గసుఖాలు అనుభవించారు. ఆమె తన అణువణువునా నిండిపోయింది.

తమ ప్రేమ ఇంతగా విజయవంతం అవుతుందని ఊహించలేదు. లోకంలో అన్ని జంటల ప్రేమలూ ఇంతగా విజయవంతమైతే ఎంత బాగుంటుంది. శుశ్రుతను వదిలిరావటం మనసులో బాధగానే ఉన్నా తప్పదు. జేజితాతయ్యకు మాటిచ్చాడు. మాటకు కట్టుబడక తప్పదు. చాలాసేపు తర్వాత ఇక ఉండబట్టలేక అడిగాడు చరక్.

అందుకు– "ప్రస్తుతం రంపచోడవరం వెళ్ళడం లేదు. అక్కడికి వెళ్ళే లోపల నువ్వు చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయి" ప్రశాంతంగా బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు. అయితే ఎక్కడికో మాత్రం చెప్పలేదు. చరక్ అడగనూ లేదు.

కారు క్రమంగా కోరుకొండను సమీపిస్తోంది. ఉన్నట్టుండి కారు ఎడమ పక్కకు తిరిగింది. ఎదురుగా రంగుమాసిన కోటగోడలా ఎత్తయిన గోడ– అటూ ఇటు రాతిస్తంభాలమీద అమర్చిన స్వాగతం ఆర్చికిందుగా గ్రావెల్ రోడ్ వెంట ముందుకు పరుగు తీసింది కారు. చరక్‌కి ఈ చోటు కొత్త.

అందుకే ఆశ్చర్యంతో చూస్తున్నాడు. అంత దూరంలో పురాతన హవేలీ వంటి ఎత్తయిన భవంతి ఒకటి ఠీవిగా, గంభీరంగా దర్శనమిస్తోంది.

రంగు మాసిన ఆ భవంతికి కుడిపక్క కాస్త దూరంలో పనివాళ్ళ నివాసమైన రెండు మూడు క్వార్టర్లు కాస్త కొత్తగా కన్పిస్తున్నాయి. తాళ్ళ మీద ఆరేసిన ఎగురుతున్న బట్టిల్ని బట్టి అక్కడ మనుషులు నివసిస్తున్నట్టు తెలుస్తోంది.

చుట్టూ ఎటు చూసినా ఏపుగా పెరిగిన పండ్ల తోటలు కనువిందు చేస్తున్నాయి. ఆ ప్రాంతమంతా తనకు కొట్టినపిండి అన్నట్టు కారును సరాసరి భవంతి ముందుకు పోనిస్తున్నాడు డ్రైవరు కాశీ.

చరక్ ఎప్పుడూ ఈ చోటుకు రాలేదు. ఈ తోటలు ఎవరివో కూడా తెలీదు. మునిమనవడి ఆశ్చర్యాన్ని గమనిస్తూ చిన్నగా నవ్వాడు అగ్నివేశాచార్యుడు.

భవంతి పోర్టికోలో కారు ఆగింది. జేజితాతగారు, మునిమనవడు కారు దిగారు. డ్రైవరుకాశీ కొంతదూరంలోని షెడ్డువైపు కారును తీసుకుపోయాడు. ఇక ఉత్కంఠతను భరించలేక, "జేజిగారూ, ఎవరిదీ తోట? ఇక్కడికెందుకొచ్చాం?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడు చరక్.

"ఇక్కడ కొంత పనుంది గాబట్టి వచ్చాం. ఈ భవంతి చుట్టూ వందెకరాల తోటలు, ఈ ఎస్టేట్ ఎవరివోకావు. మనవే" బదులిచ్చాడు ఆచార్యుడు.

"మనవా...?!" షాక్ తిన్నట్లు చూశాడు చరక్.

"అవును. మనవే. మన కుటుంబాల్లో ఎవరికీ తెలీని రహస్యమిది. ఇప్పుడిది తెలిసిన రెండోమనిషి నువ్వే" అన్నాడు ఆచార్యుడు. నమ్మలేకపోతున్నాడు చరక్.

"ఆశ్చర్యంగా ఉంది జేజిగారూ. మాకు తెలీకుండా ఈ ఎస్టేట్‌ని ఎప్పుడు కొన్నారు?" అడిగాడు.

"పిచ్చోడా! ఇప్పుడు కొనటం ఏమిట్రా. నా మనవడు అంటే మీ నాన్న పుట్టకముందే ఎప్పుడో కొన్నది. అప్పట్లో ధవళేశ్వరం జమీందారుగారు మా స్నేహం కొద్దీ ఎంతో కొంత ఇచ్చి ఈ ఎస్టేట్ తీసుకోమంటే తీసుకున్నాను. రిజిస్ట్రేషన్‌తో సహా నాలుగువేలు అయింది. ఇప్పుడీ ఎస్టేట్ విలువ వందల కోట్లు.

దీనికి దాయాదుల పోరు ఉండకూడదని అలాగే నా ఏకాంతానికి భంగం ఉండకూడదని ఆలోచించి ఉద్దేశపూర్వకంగానే ఈ ఎస్టేట్‌ని రహస్యంగానే ఉంచేశా. నేను నా జీవితకాలంలో సేకరించిన పురాతన తాళపత్ర వైద్యగ్రంధాల భాండాగారమిది. లోనకురా చూద్దువు గాని" అంటూ భవంతిలోకి దారి తీశాడు అగ్నివేశాచార్యుడు.

అప్పటికే భవంతి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. లోనకు అడుగు పెడుతూండగానే డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు ఎదురువచ్చాడు. సగౌరవంగా అగ్నివేశాచార్యునికి నమస్కరించాడు.

"ఎప్పుడొచ్చావ్ నువ్వు?" పరామర్శించాడు అగ్నివేశాచార్యుడు.

"నిన్న మీరు ఫోన్ చేసిన వెంటనే బయలుదేరి వచ్చేశా" అన్నాడు గోవింద పాత్రుడు.

"మంచిది. ముకుందపాత్రుడు రాలేదా?"

"రెండ్రోజులు ఆగి వస్తాడు"

మాట్లాడుతూనే అంతా లోనకు వచ్చేశారు.

"ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి గోవిందా?" అగ్నివేశాచార్యుని ప్రశ్న.

"అంతా సవ్యంగా జరుగుతుంది ఆచార్యా. మేం చూసుకుంటాంగా" అంటూ భరోసా ఇచ్చాడు గోవిందపాత్రుడు.

"అన్నట్టు చరక్. వీరు డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడుగారు. వీరి అబ్బాయి డాక్టర్ ముకుందపాత్రుడు"

"జేజిగారూ! నాకు గుర్తుంది. పెళ్ళిలో వీరిని చూశాను" అన్నాడు నవ్వుతూ చరక్.

"నామీద కొండంత అభిమానంతో ఏం కావాలన్నా వచ్చి దగ్గరుండి సాయం చేస్తుంటారు. నా బిడ్డల్లాంటివారు"

"అంతా తమ అనుగ్రహం ఆచార్యా. మీతో ఉండటం మా అదృష్టం. మీరు మాట్లాడుతూండండి. నేనోసారి శరభడ్ని కలిసొస్తాను. కొన్ని దినుసులు ఇంకా రావాలి"

"శరభడు ఎక్కడున్నాడు?"

"వాళ్ళంతా ఎస్టేట్ చివర పనసతోటలో పనులు చేస్తున్నారు ఆచార్యా. నేవెళ్ళొచ్చేస్తాగా" అంటూ బయటికెళ్ళిపోయాడు గోవిందపాత్రుడు.

"ఇక్కడి పనివాళ్ళంతా రెండుతరాలుగా ఈ ఎస్టేట్‌నే నమ్ముకుని నమ్మకంగా బతుకు తున్నారు. నాకు ఎంతో నమ్మకమైనవాళ్ళు. వాళ్ళలో శరభడు ఒకడు. రా. భవంతి పైభాగం చూద్దూగాని" అంటూ చరక్‌ని పై అంతస్థులోని హాల్లోకి తీసుకెళ్ళాడు అగ్నివేశాచార్యుడు.

ఎక్కడ చూసినా పురాతనపద్ధతిలో ఆముదం దీపాలు, ఆముదం దీపాలతో ప్రకాశించే కాగడాలు – ఇవే దర్శనమిస్తున్నాయి. లోన ఫర్నీచర్ కూడా ఈ కాలంది కాదు.

అంతా పురాతనకాలానికి చెందిన కళాత్మకమైన నగిషీలతో మతిపోగొడు తోంది. దిగ్భ్రమకు లోనయ్యాడు చరక్. "జేజిగారూ... ఏమిటండీ ఇది. ఇంత భవంతికి కరెంట్ లేదంటే ఆశ్చర్యంగా ఉంది. ఆముదం దీపాలా ఈ కాలంలో కూడా!"

"ఆముదం అమృతతుల్యమైంది నాయనా. ఈ రోజుకీ అమ్మాయిల కళ్ళకు అందాన్నిచ్చే కాటుక తయారుచేయడానికి ఆముదం ఉండాల్సిందే. కాటుక కళ్ళకు అందాన్నే కాదు, కంటిచూపును బాగా ఉంచుతుంది. ఆముద దీపకాంతులు పరిశుద్ధమైనవి. ఆ కాంతిలో మనసు ప్రశాంతంగా ఉంటుంది.

మనసులోకి ఎటువంటి ఇతర ఆలోచనలు రాకుండా ఏకాగ్రతనిస్తుంది. ఆముదం దీపకాంతిలో నిద్రిస్తే ఎలాంటి పీడకలలు రావు.

మనసుకు ప్రశాంతత, సుఖనిద్ర లభిస్తుంది. కనీసం బయటి ప్రపంచానికి దూరంగా ఇక్కడ ఉన్న రోజులయినా ఆ పాతరోజులు గుర్తుంచుకుని అనుభవంతో ఉండాలని ఈ భవంతికి కరెంటు తీసుకోకుండా ఆముదం దీపాలనే వినియోగిస్తున్నాను"

అక్కడ హాల్లో అటూ ఇటూ గోడలకు వేలాడుతున్న తైలవర్ణ చిత్రాలుకొన్ని చరక్‌ను ఆకర్షించాయి.

అక్కడ ప్రతి అణువు ప్రతి వస్తువు కూడా ఆశ్చర్యపరిచే విధంగానే ఉన్నాయి. కాలం ఒక వంద సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయినట్టనిపించింది.

ఒకపక్కనున్న పెయింటింగ్స్ ఆయుర్వేద వైద్యానికి మూలపురుషులన తగ్గవారివి. అశ్వనీ దేవతలు – భరద్వాజుడు – ఇంద్రుడు – శుశ్రుతుడు– చరకుడు – అగ్నివేశుడు– ఇలా వారిపేర్లు రాయబడి, ఆ మహర్షులు ఆ చిత్ర పటాల్లో జీవకళ ఉట్టిపడుతూ కట్టెదుట సాక్షాత్కరించినట్టుంది.

అలాగే రెండోపక్క గోడకు వరుసగా వున్న చిత్రపటాల్లో మొదటిది ధన్వంతరీ శ్రీ మాధవాచార్యునిది. ఆయన్ని అలా చూస్తూండిపోయిన చరక్ భుజం తట్టాడు అగ్నివేశాచార్యుడు.

"ఆయన మా తండ్రిగారు మాధవా చార్యుడు. తొలిసారిగా ధవళేశ్వరం జమీందారుగారి అభ్యర్థనతో కృష్ణాజిల్లా మున్నలూరు గ్రామంనుంచి ఇటు వలస వచ్చింది ఆయనే. మున్నలూరివారి అగ్రహార నిర్మాణకర్త ఆయనే. అప్పటికే నేను పుట్టాను. మూడేళ్ళ వయసు ఉండొచ్చు అప్పటికి.

ఇక ఆ రెండో తైలవర్ణచిత్రం ఎవరో నేను చెప్పక్కర్లేదు. అది నేనే. ఆ తర్వాత ఉన్నవి నా కొడుకులు వాగ్భటాచార్యుడు, ఆచార్య చింతామణి. వాగ్భటాచార్యుడు నీకు తాత, ఆయన కొడుకు నీ తండ్రి ఆర్యభట్టాచార్యుడు.

నాలుగో చిత్రం – అంటూ అక్కడున్న తైలవర్ణచిత్రాలు మరికొన్నింటిని కూడా వివరించాడు.

అవి చూశాక లోన గదుల్లోకి వెళ్ళగానే తీవ్రమైన దిగ్భ్రాంతికి లోనయ్యాడు. రెడు గదుల్లో ర్యాక్‌లనిండా లెక్కలేనన్ని తాళపత్ర గ్రంధాలు. అవన్నీ ఆయుర్వేద వైద్యానికి చెందినవే. ఎందరో సిద్ధులు, మహర్షులు, ఆయుర్వేదం కోసం పాటుపడిన రాజవైద్యులు తమ అనుభవాలతో వివరించి రాసిన అమూల్య గ్రంథాలు.

అవి చాలవన్నట్టు మరోపక్క పూర్వకాలానికి చెందిన కాగితం అచ్చు గ్రంథాలు వేరే. వాటిని చదవటానికి ఒక జీవితకాలం చాలదనిపించింది. వాటిని సేకరించటానికి అగ్నివేశాచార్యుడు పడిన శ్రమను తలచుకుంటే మతిపోయింది.

అక్కడే డ్రాయింగ్‌రూమ్‌లో అగ్నివేశాచార్యుని ఎదురుగా కూర్చున్నాడు చరక్. “నా నుంచి మీరేం ఆశిస్తున్నారో అర్ధం గావటంలేదు. నేనేం చేయాలో అర్ధం కావటంలేదు. ఈ ఎస్టేట్‌ను ఇంత రహస్యంగా ఎందుకుంచారో అర్ధం గావటంలేదు”

“నీకోసమే....” చరక్ మాటలకు అడ్డొస్తూ చెప్పాడు అగ్నివేశాచార్యుడు.

“నా కోసమా....” విపరీతమయిన ఆశ్చర్యానికి లోనయ్యాడు చరక్.

“అవును. నీకోసమే. చాలా కాలం క్రితమే నీకోసం తీసుకున్న నిర్ణయం ఇది.

దీన్ని నాలాగే యధాతధంగా కాపాడుకుంటూ వస్తావన్న నమ్మకం నాది. అందుకే దీన్ని నీ చేతుల్లో ఉంచబోతున్నాను....”

“కాని జేజితాతయ్యా....”

“నీకు అన్నీ అర్ధంగావటానికి కొంత సమయం పడుతుంది. ఒకేసారి తెలుసుకోవాలని చూడక. మనసు చంచలమవుతుంది.

ఒకటొకటిగా నేనే నీకు వివరంచగలను. ముఖ్యంగా నేనో మహత్కార్యాన్ని తలపెట్టాను. దాన్ని సాధించుకోవాలంటే నా వయసు అడ్డంకి. కాబట్టి నా వారసుడిగా నువ్వు సాధించి పెట్టాలి.”

“ఓ.కె. జేజిగారు. కాని దానికి నేనేం చేయాలి?”

"ముందుగా మణిభద్రుడనే యక్షదేవుడ్ని వశంచేసుకోవాలి. రేపు చీకటితోనే ఆ కార్యక్రమం మొదలవుతుంది. వేకువనే ఏడురంగుల ఏడు బిందెల నీళ్ళతో తలస్నానం చేసి పిదప శుద్ధోదకంతో స్నానమాచరించాక నేను చెప్పే మంత్రాన్ని నిష్ఠతో జపించాలి.

రోజుకు పదివేలసార్లుగా పదిరోజులు జపిస్తే లక్షజపం పూర్తై మణిభద్ర యక్షుడు నీకు వశమవుతాడు. ఆ పదిరోజులు పాలు, పండ్లు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి.

పదకొండో రోజు మణిభద్రుని ప్రసన్నం చేసుకోవడానికి ఆ రోజంతా దివ్యహోమం చేసి పదకొండు మంది బ్రాహ్మలకు భోజనాలు పెట్టి సంభావనలిచ్చి పంపించాలి. ఇది పూర్తయితే నువ్వు భూతకాలంలోకి ప్రయాణించడానికి అర్హుడవు కాగలవు."

"భూతకాలమా... అదేమిటి?" పిచ్చెత్తిపోయి చూశాడు చరక్.

అదేమిటో అగ్నివేశాచార్యుడు క్లుప్తంగా వివరించాడు. అప్పటికి విషయం కొంత బోధపడింది చరక్‌కి. ఇందులో ప్రమాదమేమిటో మాత్రం బోధపడలేదు.

"రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళ్ళినవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేదు. దీనికీ అంతే. చిన్న పొరపాటు కూడా ప్రాణాంతకమవుతుంది. అదెలాగో తర్వాత చెప్తాను" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"ఇంతకీ భూతకాలంలో ఎక్కడికి వెళ్ళాలి. ఏం చేయాలి?" అన్నాడు చరక్.

"హోమం ముగిసిన మరునాడు మనం రంపచోడవరం వెళ్తున్నాం. వెళ్ళబోయేముందు ఏకాంతంలో నీకా విషయాలు చెప్తాను" ఈ లోపల తోటలో కెళ్ళిన డాక్టర్ గోవిందపాత్రుడు శరభద్ని వెంటబెట్టుకు రావడంతో ఇక అక్కడ పనులు ఊపందుకున్నాయి.

* * * * *

హైదరాబాద్‌లో పుట్టింట్లో ఉండిపోయిన శుశ్రుతకు అక్కడ క్షణం ఒక యుగంలా ఉంది. చరక్ వెళ్ళినప్పట్నుంచి ఏమీ తోచదు.

నిరంతరం అతడి ధ్యాసే. ఏదో కోల్పోయినట్టు మనసులో దిగులు. అసలైన విరహం అంటే ఏమిటో శుశ్రుతకు ఇప్పుడు అర్థమవుతోంది.

ఈ వారంరోజుల్లోనే చరక్‌ను చూసి యుగాలు గడిచినంత వేదన కలుగుతోంది. అతడే లోకమనుకున్న తను అతడికి దూరంగా ఎలా ఉండగలదు?

మున్నలూరి వారి అగ్రహారం వెళ్ళిన మూడు రోజులు మాత్రం ముప్పూటలా ఫోన్ చేశాడు. తను ఫోన్ చేస్తే టక్కున బదులిచ్చేవాడు. అలాంటిది నాలుగు రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంచేశాడు. ఎక్కడున్నాడు ఏం చేస్తున్నాడు ఏమీ తెలీదు.

కొద్ది రోజులు ఫోన్‌కి అందుబాటులో ఉండనంటే ఏమో అనుకుంది. ఏదో టైమ్‌లో లైన్ కలుస్తుందనుకుంది. కాని ఇదేమిటి? ఎవరికి ఫోన్ చేయాలి? ఎవరిని అడగాలి? మున్నలూరి వారి అగ్రహారానికి ఫోన్ చేస్తే నవ్వుతారని భయం... బిడియం.

ఒకరితో చెప్పుకోలేని స్థితి.

అదే సమయంలో బయట చిన్న అలికిడయినా చరక్ వచ్చాడన్న భ్రాంతి. బయటకు పరుగుతీసి చూస్తూంటుంది. చిరుగాలి చెంపల్ని తాకగానే పక్కన చరక్ వున్నాడనే తపన.

ఇలాగే పదిరోజులు భారంగా దొర్లిపోయాయి. రోజులు గడుస్తున్నాయి కాని చరక్ నుంచి ఫోన్‌లేదు. ఇక ఇలాకాదని పదకొండోరోజు శ్రావణి సెల్‌కి ఫోన్ చేసింది. వెంటనే లైన్లోకొచ్చింది శ్రావణి. "హలో అక్కా బాగున్నావా? ఇన్ని రోజులకి నేను గుర్తొచ్చానన్న మాట" అంది తన సహజధోరణిలో శ్రావణి.

"నిన్నేం మర్చిపోలేదుగాని అక్కడ బావ ఉన్నాడా?" అడిగింది శుశ్రుత.

"ఛీ పో అక్కా. బావ నా దగ్గరెందుకుంటాడేమిటి?"

"ఏయ్ కోతి, పరాచికాలాపు... బావ ఇంటి దగ్గరున్నాడా చెప్పు" అంది శుశ్రుత.

"ఓహో. ఫోన్ శ్రీవారికోసమేగాని నాకోసం కాదన్న మాట" అంది శ్రావణి.

"వారం రోజులుగా చరక్ ఫోన్ చేయడంలేదు. స్విచ్ఛాఫ్ చేశాడు. నాకేమీ అర్థం గావటంలేదు. అసలు తను... మున్నలూరివారి అగ్రహారంలోనే ఉన్నాడా ఎక్కడికయినా వెళ్ళాడా!"

"వెళ్ళాడు"

"వెళ్ళాడా... ఎక్కడికి?"

"తెలీదు. మాజేజితాతయ్యగారు, బావను వెంట తీసుకెళ్ళారు. కొద్ది రోజులవరకు ఫోన్‌కి అందుబాటులో ఉండము. మీరు కంగారుపడొద్దని చెప్పే వెళ్ళారు కాబట్టి...." అంది శ్రావణి.

"అయితే కంగారుపడాల్సిందేమీలేదంటావా?"

"కంగారా... దేనికి? బావ వెళ్ళింది ఎవరితో. మా జేజితాతగారితో. ఏదో పనిమీద వెళ్ళారు. కొద్దిరోజుల్లో వచ్చేస్తారు" చెప్పింది శ్రావణి.

"నాకిక్కడ ఏమీ తోచటంలేదు శ్రావణీ. నేనూ అక్కడికి వచ్చేద్దామనుకుంటున్నాను"

"అంత పని మాత్రం చేయకు. కొత్తగా పెళ్ళయిన అమ్మాయి కాపరానికి రావాలంటే ఎన్ని సాంప్రదాయాలున్నాయో తెలుసా? అసలే మా అమ్మమ్మ దేవమ్మ గారికి చాదస్తం ఎక్కువ. బావ తిరిగి రాగానే నీకు ఫోన్ చేయమని చెప్తాను. ఓ.కె. అనసరంగా బెంగపెట్టుకుని ఆరోగ్యం పాడుచేసుకోవద్దు" శుశ్రుతకి ధైర్యం చెప్పి లైన్ కట్ చేసింది శ్రావణి.

శ్రావణితో మాట్లాడిన తర్వాత – కొంతలో కొంత ఊరట లభించింది శుశ్రుతకు.

* * * * *

"దేవజాతుల గురించి నీకేం తెలుసు?" ఆ రాత్రి మరోసారి చరక్‌ను మేడమీది డ్రాయింగ్ రూమ్‌లో ఏకాంతంగా కూర్చోబెట్టుకుని ప్రశ్నించాడు అగ్నివేశాచార్యుడు.

కనుచీకటి పడుతుండగానే పనివాళ్ళు భవనమంతా దేవదారు కొరకంచు (మండకుండా నిప్పుతో ఉండే కట్టె) వాటిమీద ఎండిన వేపాకు పొడితో ధూపం వేసి పిదప సాంబ్రాణి పొగవేసి దోమలు బయటకు పోగానే కిటికీలు, తలుపులు మూసేశారు.

చీకటిపడగానే భవంతిలో ఆముదం దీపాలు వెలిగించారు. ఆ వెలుగు కళ్ళకు ఆహ్లాదభరితంగా ఉంది. అక్కడక్కడా దేవదారుకట్టెల దివిటీలు గోడలకు గుచ్చబడ్డాయి. తెల్లవారుజామునే చరక్‌కు అగ్నివేశాచార్యుడు మణిభద్రయక్షుని వశపర్చుకోవడానికి మంత్రోపదేశం చేయాల్సివుంది.

జేజితాతగారి ప్రశ్నకు ఆశ్చర్యంగా చూశాడు చరక్. మనసులో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. అయినా నిగ్రహించుకుంటూ–

"నాకు సరిగా తెలీదు జేజిగారు. ఏవో గంధర్వులని, యక్షులని అంటారు" అన్నాడు.

"దేవజాతులు అయిదు. ఇవి ప్రధానదేవతలకు అనుబంధ జాతులు. వీరూ దేవతలే.

మహాభారతంలో గంధర్వుల, యక్షుల ప్రస్తావన మనకి కన్పిస్తుంది. కాగలకార్యం గంధర్వులే తీర్చారు– యక్షప్రశ్నలు వద్దు అనే ఈ రెండు సామెతలూ మనకి మహాభారతం నుంచి ఏర్పడినవే.

ఈ దేవజాతులు గంధర్వులు, యక్షులు, విద్యాధరులు, కిన్నెరులు, కింపురుషులు. వీరిలో గంధర్వులు గానప్రియులు. బాగా పాడేవారిని గానగంధర్వుడు అంటారు. యక్షులు హాస్యప్రియులు. విద్యాధరులు నాట్యప్రియులు, కిన్నెరులు కామప్రియులు, కింపురుషులు వాద్యప్రియులు.

మణిభద్రుడు యక్షజాతికి చెందినవాడు. మిక్కిలి చతురుడు, కొంటెవాడు, చిలిపివాడు. అంత సులువుగా వశం కాడు. ధ్యానభంగం చేయటానికి నీ దృష్టి మరల్చే అనేక ప్రయత్నాలు చేస్తాడు.

గాలివాన శబ్దాలు నీ చెవుల్ని హోరెత్తించవచ్చు. తెలిసినవాళ్ళు పిలిచి నట్టు పిలుస్తాడు. అది నా గొంతు కావచ్చు. నీ భార్య శుశ్రుత గొంతు కూడా కావచ్చు. కంగారుపడి ధ్యానంలోంచి బయటకొస్తే కథ తిరిగి మొదటికొస్తుంది. ధ్యానం ఆరంభించిన మూడోరోజు నుంచే నీకీ గొడవ మొదలవుతుంది. దృఢచిత్తంతో పదిరోజుల్లో లక్షజపం పూర్తిచేయాలి. చేయగలవా?"

"చేస్తాను జేజిగారు. మీ కోసం మణిభద్రుడు ఎంత అల్లరి చేసినా తట్టుకుని సాధించి వశపర్చుకుంటాను" అన్నాడు చరక్.

"మణిభద్రుని వశపర్చుకుని నేనేం చేయాలి?"

"ద్వారకా నగరానికి వెళ్ళిరావాలి" చాలా ప్రశాంతంగా బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు.

ఆయన సమాధానం విని అదేదో జోక్‌లా ఫక్కున నవ్వాడు చరక్. "ఏమిటిది జేజిగారూ. గుజరాత్ తీరాన వున్న ద్వారక వెళ్ళిరావటానికి రైళ్ళు, బస్సులు, విమానాలు ఎన్ని లేవు? అక్కడికి వెళ్ళటానికి ఈ మంత్ర తంత్రాలు అవసరమా. మణిభద్రయక్షుని సాయం కావాలా?" అడిగాడు.

"అక్కడికి రైళ్ళు, బస్సులు, విమానాలు ఇవేవీ వెళ్ళలేవు నాయనా, ఒక్క మణిభద్రయక్షుడే తీసుకెళ్ళగలడు. నువ్వనుకుంటున్నట్టు అది నేడు మనం చూసే ద్వారకాపట్టణం కాదు. నాటి ద్వాపరయుగంలోని శ్రీకృష్ణపరమాత్ముని భూలోక స్వర్గం అనదగిన సుందర ద్వారకాపురి."

షాక్‌తో తెరిచిన నోరు మూయటం మర్చిపోయాడు చరక్. ఏం చెప్తున్నాడీయన? అలనాటి ద్వారక? ఎక్కడ ఉందది? నీట మునిగిపోయింది గదా. ఐదు వేల సంవత్సరాల క్రితం కలియుగారంభంలో నీట కలిసిన ద్వారకాపురిని తిరిగి చూడ్డమా. అది సాధ్యమయ్యే పనేనా. ఓరినాయనో. ఇదసలు సంభవమా?

"జేజిగారూ... మీరేం చెప్తున్నారు...." చరక్ ఏదో అనబోతుంటే అతడి మాటలకు అడ్డు వస్తూ–

"నేను నిజమే చెప్తున్నాను నాయనా. కంగారుపడకు. నేను చూసివచ్చాను. ఇప్పుడు నిన్ను పంపించే ప్రయత్నంలో ఉన్నాను. కలలో కూడా ఊహించని అదృష్టాన్ని నీకు కల్పిస్తున్నాను.

నా మాటలు విశ్వసించు. అంతా సవ్యంగా జరుగుతుంది" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

మరోమారు షాక్‌కి గురయ్యాడు చరక్. తను అనుకున్నది సాధించటానికి వయసు అడ్డంకి అంటూ తన సాయం కోరితే ఇదేదో మంత్రసంబంధమైన వ్యవహారమో లేక మరేదో అనుకున్నాడు.

ఇప్పుడిప్పుడే ఆయన అంతరంగం కొద్దికొద్దిగా విశదమవుతోంది. ఇప్పుడు కూడా ఆయన పూర్తి సమాచారం ఇవ్వడంలేదు. కాని... ద్వారకను చూడ్డం ఏమిటి? ఇదెలా సంభవం?

"జేజితాతగారూ... నిజంగా మీరు ద్వారకా నగరాన్ని దర్శించారా?" అడిగాడు చరక్.

"దర్శించాను నాయనా!"

"శ్రీకృష్ణులవారిని కన్నులారా చూశారా?"

"చూశాను. కాని ఆ క్షణం ఆయనే కృష్ణపరమాత్మని నాకు తెలీదు. అతిగా ఆత్రపడకు చరక్. నా మాటలమీద విశ్వాసం ఉంచు. నిన్నక్కడికి

పంపించేముందు అన్నీ వివరంగా చెప్తాను. ద్వారకాపురిని చూసి గోపాలుని దర్శనం చేసుకురావాలని కోరుకున్నాను.

నా కోరికలో లోపంవల్ల నగరాన్ని దూరం నుంచి మాత్రమే చూడగలిగాను. గోపబాలుడి రూపంలో శ్రీకృష్ణుడు నావద్దకొచ్చాడు. గుమ్మపాలు తాపించాడు. నాతో నడిచాడు.

ఇదో... నా కుడికాలికి ఉన్న వెండి తొడియం స్వయంగా ఆయన తొడిగిందే. అక్కడికి వెళ్ళాలంటే శరీరాన్నిక్కడ వదిలి ఆత్మరూపంగా వెళ్ళాలి.

వయసుడిగినవారి శరీరం నుంచి ఆత్మ వేరుపడితే ఆ శరీరం ఎక్కువ కాలం ఆగదు. నవనాడులు స్తంభించి జీవచైతన్యం కోల్పోయి తిరిగివచ్చిన ఆత్మ ఆ శరీరంలో ప్రవేశించడానికి పనికిరాకుండా పోతుంది. అందుకే ఈ పనికి యువకులే అర్హులు.

నీ సాయం కోరింది అందుకే. కాబట్టి ఇక ఇతర ఆలోచనలు మనసులో ఉంచకు. నిశ్చింతగా ఉండు. సందర్భానుసారం నీకు అన్నీ వివరంగా చెప్పే పంపిస్తాను. కాని వెళ్ళేలోపల నువ్వు ఇంకో పనిచేయాలి. ఆనాటి యాదవరాజ్యంలోని ప్రజల భాష ఇది కాదు. దేవనాగరి, గుజరాతీభాషలు, మరికొన్ని అర్ధం గాని పదాల మిశ్రమంగా ఉంటుంది.

కాబట్టి ఆ రెండుభాషల్ని కొంత నువ్వు అధ్యయనం చేయాల్సివుంది. ఈ విషయంలో పిల్లా గోవింద పాత్రుడుగారు నీకు సాయం చేస్తారు."

"ఏడు బిందెలు, ఏడు రంగుల నీళ్ళ స్నానం. ఇది ఎందుకోసం?"

"యక్షులు నలుపురంగుని ఇష్టపడతారు. చీకటి రాత్రులు వారికి అనుకూలం. నిశాచరులు, అలాగని వెలుగులోకి అస్సలు రారని అర్ధంకాదు. సప్తవర్ణాల కలయికే వెలుగురేఖలు. ఏడుబిందెల రంగునీళ్ళ స్నానంతో వెలుగు నుంచి శుద్ధోదకస్నానంతో చీకటిలో ప్రవేశించి మణిభద్రయక్షుని ప్రీత్యర్ధం జపం ఆరంభించనున్నట్టు దీనికి సంకేతం.

ముఖ్యంగా మణిభద్రయక్షుని విషయంలో విధిగా ఇది పాటించాకే మంత్ర జపానికి ఉపక్రమించాలి. విధివిధానాలు పాటించకుండా నువ్వు ఎంతగా జపించినా ఆ మహానుభావుడు వశం కాడు.

వెళ్ళి పడుకో. వేకువనే మనం లేవాల్సిఉంది" అంటూ లేచాడు అగ్నివేశాచార్యుడు.

అప్పటికే రాత్రి పదిగంటలు దాటింది సమయం. ఎవరి గదుల్లో వారు నిద్రకుపక్రమించారు.

* * * * *

అనుకున్న విధంగానే – వేకువజామునే కార్యక్రమం మొదలయింది. భవంతి వెనుకభాగంలోని విశాలప్రాంతంలో చరక్ స్నానం కోసం ముక్కాలిపీట ఉంచబడింది. చుట్టూ దేవదారు కట్టెలు దివిటీల్లా మండుతూ ఆ ప్రాంతాన్ని ప్రకాశవంతం చేస్తున్నాయి. పనివాళ్ళు వరసగా రంగునీళ్ళతో నింపిన ఏడుబిందెల్ని ఉంచారు.

చరక్ కాలకృత్యాలు తీర్చుకుని శుచియై ఒంటికి టవలు చుట్టుకురాగానే అగ్నివేశాచార్యుడు అతడి నుదుట నల్లటి బొట్టు ధరింపజేసి మంత్రోచ్ఛాటన చేస్తూ దిష్టితీసి అతడ్ని ముక్కాలి పీటమీద కూర్చుండజేశాడు.

పిల్లా గోవింద పాత్రుడు అక్కడి పనుల్ని పర్యవేక్షిస్తున్నాడు. అగ్ని వేశాచార్యుని సూచనల మేరకు రంగునీళ్ళ బిందెలలో ఏవో కొన్ని ఔషధాల పొడులు చల్లారు. ఈ పనులు ముగియగానే మొదటి బిందెగా ఎర్రనీళ్ళు చరక్ తలమీద గుమ్మరించారు. ఒక్కపక్క మంత్రపఠనం సాగుతూనే ఉంది.

రెండో విడతగా పసుపునీళ్ళు, మూడో విడతగా నీలంరంగు నీళ్ళు, నాలుగో విడతగా ఊదారంగు నీళ్ళు చరక్‌ను అభిషేకిస్తున్నాయి వరుసగా.

ఆ శిరస్నానంలో చరక్‌లో తనకే తెలీని ఉత్తేజం ఏర్పడుతోంది. క్రమంగా ఏకాగ్రత ఏర్పడుతోంది. ఏడుబిందెల అభిషేకం పూర్తయింది. చివరిగా శుద్ధోదక స్నానం కూడా ముగియగానే నలుపురంగు పొడి దుస్తులు ఇవ్వబడ్డాయి.

ఆ దుస్తుల్ని ధరించాక చరక్‌ను రావివృక్షం వద్దకు తీసుకెళ్ళి తిన్నెమీద కూర్చుండ జేశాడు అగ్నివేశాచార్యుడు. రావిచెట్టు అంటే అశ్వత్థవృక్షం.

వృక్షములందు అశ్వత్థవృక్షం తానే అంటాడు గీతలో కృష్ణ పరమాత్మ.

అటువంటి రావిచెట్టు యక్షులకు ప్రీతికరమైంది. యక్షులు రావివృక్షాన్ని ఆశ్రయించి ఉంటారని లోకోక్తి. అందుకే ఆ చెట్టుకింద చరక్‌ను కూర్చోబెట్టాడు

అగ్నివేశాచార్యుడు. పక్కన కూర్చుని మణిభద్రయక్షుని మూలమంత్రాన్ని, జపమంత్రాన్ని కూడా చెవిలో ఉపదేశించాడు. జపమాలను చేతికిచ్చాడు.

"నాయనా చరక్. జపసంఖ్య లక్ష మించినా ఫరవాలేదు గాని లక్షకు తగ్గకూడదు కాబట్టి జపమాల పదిసార్లు తిప్పితే వెయ్యి పూర్తయినట్టు. కాబట్టి రోజుకి వందసార్లు జపమాల తిరిగితే పదివేలు దాటినట్టు. ఇది గుర్తుంచుకుని విడవకుండా జపాన్ని కొనసాగించు.

ఈ పదిరోజులు పాలు, పండ్లు మాత్రమే నీకు ఆహారం. ఇక ఆరంభించు" అంటూ లేచాడు. చరక్ పద్మాసనంలో కూర్చుని కళ్ళు మూసుకుని ధ్యానం ఆరంభించాడు.

రెండోరోజునే చరక్ మణిభద్రయక్షుని ఆరడిని గమనించాడు. తీవ్రధ్యానంలో ఉన్న తన మీదుగా జిల్లున శీతలగాలులు వీస్తున్నాయి.

కాస్సేపటికి తన చుట్టూ ఎవరో నడుస్తున్న పాదధ్వని – ఎవరిదో విచిత్రమైన నవ్వులు. అయినా కూడా తన ఏకాగ్రతను చెదరన్వివేలేదు చరక్.

ఇలా అయిదు రోజుల వరకు మణిభద్రుడు అనేక కొంటె పనులు చేసి చరక్‌ను అతడి ధ్యాసను మళ్ళించాలని చూశాడు. అప్పుడప్పుడూ గాజుల సవ్వడి, ఆ వెంటనే పద మంజీరాల సద్దు, అంతలోనే ఏనుగుల ఘీంకారాలు, అకస్మాత్తుగా గుర్రాల సకిలింపులు, గిట్టలశబ్దాలు. అవి తనమీదికే దూసుకొస్తున్నాయనే భీతి గొలిపే ధ్వనులు. ఎవరో పిలుస్తున్న పిలుపులు. చరక్ వేటికీ భయపడలేదు. దిగ్విజయంగా పదిరోజులూ ధ్యానంతో జపసంఖ్య పూర్తిచేశాడు.

ఆ మరునాడు హోమం నిర్వర్తించబడింది. హోమం ఒక పగలంతా సాగింది. చరక్ ఆ రోజంతా ఉపవశించాడు. పదకొండుమంది బ్రాహ్మలు హోమ నిర్వహణలో పాల్గొన్నారు. ఆ విధంగా విధివిధానంగా హోమం కూడా నిర్వర్తించడంతో మణిభద్రయక్షుడు చరక్‌కి వశమయ్యాడు.

ఇది జరిగిన మరో పదిరోజులవరకు అంతా ఎస్టేట్ భవంతిలోనే ఉన్నారు. పిల్లా గోవిందపాత్రుడి ద్వారా దేవనాగరి-గుజరాతీ భాషాధ్యయనంతో ఆ భాషలమీద కొంత అవగాహన పెంచుకున్నాడు చరక్. ఇక మరునాడు రంప చోడవరం అడవిలోని స్థావరానికి బయలుదేరతారనగా అగ్నివేశాచార్యుడు చరక్‌కి సెల్ ఇచ్చాడు.

"అక్కడ శుశ్రుత నీకోసం బెంగపడుతూ వుంటుంది. ఇక్కడి నుంచి మనం కదిలితే ఇక ఫోన్ చేయడం కుదరదు. ఓసారి అమ్మాయితో మాట్లాడి ధైర్యం చెప్పు. ఇంకోనెల వరకు ఫోన్‌కి వీలుకాదని చెప్పు. ధైర్యంగా ఉంటుంది" అన్నాడు.

"థ్యాక్యూ జేజితాతయ్యా" అంటూ ఫోన్ అందుకున్నాడు చరక్. చరక్ గొంతు వింటూనే దుఃఖం ఆపుకోలేక ఫోన్‌లోనే ఏడ్చేసింది శుశ్రుత. ఆమె ఎందుకేడుస్తోందో అర్థంగాక చరక్ కంగారుపడ్డాడు.

"ఏయ్... ఎందుకేడుస్తావ్. అక్కడంతా బాగానే ఉన్నారుగా?" అడిగాడు.

"అంతా బాగానే ఉన్నారు. నేనే బాగలేను" అంది వెక్కివెక్కి పడుతూ.

"ఏమైంది? ఒంట్లో బాగాలేదా?"

"మనసు బాగలేదు. పెళ్ళిచేసుకుంది వదిలేసిపోవడానికా... నలుగురూ నన్ను చూసి నవ్వుతున్నారు"

"అది కాదు శుశ్రుతా...."

"మాట్లాడకు. నీ కోసం క్షణం ఒక యుగంలా ఎదురుచూస్తున్నాను. తెలుసా?"

"బెంగపెట్టుకున్నావా?" నవ్వితే ఉడుక్కుంటుందని బలవంతంగా ఆపుకున్నాడు.

"ఉండదా? నిన్ను చూడాలనుంది. చూడాలంతే. అర్జంటుగా బయలుదేరి వచ్చెయ్" అంది శుశ్రుత.

"నాకూ రావాలనే ఉంది. ప్రామిస్‌గా. ప్రతిక్షణం నువ్వే గుర్తొస్తున్నావు తెలుసా?"

"నాకు తెలీదు. వస్తున్నావా లేదా?"

"నువ్విలా హఠం చేయకు. అవతల జేజితాత గారితో పని. సారీ. రాలేను. వేళకు భోంచెయ్యి.

రావటానికింకా నెలరోజులు పడుతుంది. ఫోన్ చేయలేను. కొండకోనల్లో ఎక్కడో ఉంటాను. పనులు పూర్తికాగానే రెక్కలు కట్టుకుని నీముందు వాలతాను. సరేనా?" నలభైనిముషాలు భార్యతో మాట్లాడి ఒప్పించి అప్పుడు లైన్ కట్‌చేశాడు చరక్.

* * * * *

దివ్యస్వర్ణకాంతులతో – పుష్పకవిమానంలా మెరిసిపోతున్న కాలనాళిక మందసాన్ని చూసి ఉత్కంఠభరితుడై చిత్తరువులా అలా చూస్తూ నిలబడిపోయాడు చరక్. అసలు రంపచోడవరం దట్టమైన అటవీప్రాంతంలోని ఆ స్థావరానికి చేరుకున్నప్పుడే ఒక షాక్‌తిన్నాడు చరక్. ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్టు అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూశాడు.

కోరుకొండ ఎస్టేట్ భవంతినుండి వారందరూ రెండు జీపుల్లో ఉదయమే బయలుదేరారు. అందులో ఒక జీపు అగ్నివేశాచార్యుడు అడవికి ఎప్పుడు వెళ్ళినా తీసుకెళ్ళేది. రెండోది ఎస్టేట్ భవంతి అవసరాలకోసం ఉపయోగించేది.

అగ్నివేశాచార్యుడి వెంట చరక్, పిల్లా గోవింద పాత్రుడు, పిల్లా శివరామ ముకుంద పాత్రుడు, నౌకరు అప్పన్న అంతవరకే. వారంతా ఒకే జీప్‌లో ఉన్నారు. దాన్ని చరక్ డ్రైవ్ చేస్తుండగా రెండో జీప్‌ను డ్రైవర్ కాశీ నడుపుతున్నాడు. అతని వెంట ఎప్పుడూ వచ్చే ఇద్దరు వంటవాళ్ళు స్థావరంలోకి అవసరమైన ఉప్పులు, పప్పులు రేషన్ తీసుకొస్తున్నారు.

జేజితాతగారు దారిచెప్తుంటే తన జీప్‌ను ముందు పోనిస్తున్నాడు చరక్. రెండోజీపు అనుసరించి వస్తోంది. సుమారు పదకొండు గంటల ప్రాంతానికి స్థావరం సమీపాల్లోకి చేరుకున్నాయి జీప్‌లు రెండూ. "ఆపు నాయనా. జీప్‌ను ఇక్కడే ఆపు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"ఇక్కడా" అంటూ చుట్టూ చూసిన చరక్‌కి అక్కడంతా చెట్టు చేమలతో కూడిన అడవి తప్ప నివాసయోగ్యమైన షెడ్లుగాని, ఇళ్ళుగాని కన్పించలేదు.

"ఇక్కడా జేజిగారు?" అనుమానంగా అడిగాడు.

"అవున్రా. ఇక్కడే ఆపు. ముందుకు పొవద్దు"

"ముందుకుపోతే ఏమవుతుంది?"

"ప్రాణాంతకమవుతుంది"

చరక్‌కి ఏమీ అర్థంకాలేదు. జీప్‌ను ఆపాడు. "ఇక్కడ ఏమీలేవు జేజి తాతయ్యా" జీపు దిగుతున్న జేజితాతను అడిగాడు.

"అన్నీ వస్తాయి. అంతా ఇక్కడే ఉండండి. నేను పిలిచేవరకు రావద్దు" అంటూ హెచ్చరించి ముందుకు సాగాడు. అంతలో రెండో జీపుకూడా వచ్చి ఆగింది. చరక్ ఆలోచిస్తున్నాడు. ఏం చేస్తారిక్కడ? గుడారాలు నిర్మిస్తారను

కోవడానికి వెంట అలాంటి పరికరాలేమీ తేలేదు. మరెందుకిక్కడ ఆగినట్టు? వెళ్తున్న జేజితాతను చూస్తూ మనసులోని సందేహాలను అణచుకున్నాడు.

పక్కనున్న పిల్లా గోవింద పాత్రునిగాని, ఆయన కుమారుడు పిల్లా శివరామ ముకుంద పాత్రునిగాని అడిగితే చెప్తారేమో. వారికి తెలిసే ఉంటుంది. కాని తినబోతూ రుచి అడగడం దేనికి. చూద్దాం ఏం జరుగుతుందో అనుకుంటూ మౌనంగా ఉండిపోయాడు.

ఒంటరిగా ముందుకు సాగిన అగ్నివేశాచార్యుడు తన చేతికర్రను గాల్లో ఆడిస్తూ తను విధించిన అష్టదిగ్బంధనాన్ని తొలగించాడు. యక్షశక్తుల్ని ఉపసంహరించాడు. అంతే–చరక్ షాక్‌తో కొయ్యబారిపోయాడు. అది మాయో మంత్రమో లేక తంత్రమో గాని అంతవరకూ చెట్టు చేమలే గోచరించిన ఆ ప్రాంతంలో ఇప్పుడు ఒక సువిశాలభవనం ప్రతక్షమైంది.

అదే అగ్నివేశాచార్యుని స్థావరం. దాని ప్రధాన ద్వారం ముందు నిలబడి అందర్నీ రమ్మని చేయి ఊపి పిలుస్తున్నాడాయన. ఊహకి అందని ఈ మాయాజాలాన్ని ప్రత్యక్షంగా చూసి – నిశేష్టుడయ్యాడు చరక్.

"ఓరి నాయనో... ఓరి దేవుడో... ఏం మాయరా ఇది? ఏం వింతరా ఇది. మీకు ఈ విద్యలు కూడా వచ్చా జేజితాతగారూ...." అని మనసులోనే గొణుక్కుంటూ జీపును ముందుకు పోనిచ్చాడు చరక్.

స్థావరంలో ప్రవేశించి అంతా ఎవరిపనుల్లో వారు నిమగ్నం కాగానే, చరక్‌ను వెంటబెట్టుకుని హాలు చివరి గది తాళం తీశాడు అగ్నివేశాచార్యుడు. ఎవరినీ అటురాకుండా చూడమని బయట అప్పన్నను కాపలా ఉంచి చరక్‌ను లోనకు పిలిచి తలుపులు మూశాడు.

అక్కడ ధగధగాయమానంగా ప్రకాశిస్తున్న కాలనాళిక మందసాన్ని చూసిన చరక్ పరిస్థితి అది ఇదీ అని చెప్పలేని ఒక వింత అనుభూతికి లోనయ్యాడు. అతడి ఆశ్చర్యాల్ని అతడికే వదిలి ప్రశాంతంగా దగ్గరలోని కుర్చీలో కూర్చున్నాడు అగ్నివేశాచార్యుడు. రెప్పవాల్చటం మర్చిపోయి – ఆ మందసాన్ని చూస్తున్నాడు చరక్. ఏమిటీ విచిత్రం?

ఈ మందసాన్ని ఏ లోహంతో తయారుచేశారు? బంగారమా... పసిడి వన్నెలున్నా పసిడి కాదనిపిస్తోంది. అంతకుమించి మరేదో పదార్థంతో తయారు చేసుండాలి. పసిడికి ఈ దివ్యకాంతులెక్కడివి.

దీనికి గ్లాస్‌డోమ్ ఉన్నదే... లోన పరుపు దిండు ఒక్కమనిషి మాత్రం పడుకోవడానికి అనువుగా సెట్ చేశారు. ఎదురుగా గోడకు నిలువెత్తున ఆ అద్దం? అసలది అద్దమేనా? అద్దమైతే ఎదురుగా ఉన్నవన్నీ అందులో ప్రతిఫలించాలి గదా... లేదే.

అది చీకటి నింపుకున్నట్టు నల్లగా ఉందేమిటి? అందులో వచ్చిపోతూ రంగులు మారుతున్న కాంతులెక్కడివి. అవి విద్యుద్దీపకాంతులు కావే... ఏమిటీ మాయాజాలం? మంత్రశక్తిలో ఇన్ని మహిమలు, వింతలు ఉన్నాయా...

ఈ మందసాన్ని యక్షశక్తులు సంరక్షిస్తున్నాయా! ఇది భూతకాలంలో కోరిన చోటుకు నిజంగా చేరుస్తుందా? నమ్మదగ్గ విషయమేనా... కాని నమ్మి తీరాలి. ఎందుకంటే చెప్పింది జేజితాతగారని తను గర్వంగా చెప్పుకునే ముత్తాత అగ్నివేశాచార్యులవారు.

ఆలోచిస్తూనే అయోమయంగా అగ్నివేశాచార్యుని వంక చూశాడు చరక్. ఆయన చిద్విలాసంగా నవ్వుతున్నాడు. దగ్గరకు రమ్మని చేత్తో సైగచేశాడు.

"ఆశ్చర్యపోయింది చాలు. వచ్చి కూర్చో. మనం చాలా మాట్లాడుకోవాలి. అసలు కథ ఇప్పుడే మొదలవుతోంది" అన్నాడు.

మౌనంగా వచ్చి ఆయన ఎదురుగా – మరోకుర్చీలో కూర్చున్నాడు చరక్.

"చూశావుగా నాయనా? ఇదే కాలనాళిక మందసం. నా శక్తియుక్తులు సర్వం ధారపోసి, అనుభవాన్ని రంగరించి తయారుచేసిన దివ్యపేటిక. ఇదే నిన్ను భూతకాలంలోకి తీసుకెళ్తుంది. రేపు ఉదయం నీ ప్రయాణం కాబట్టి నీవు అడగదలుచుకున్న ప్రశ్నలు ఇప్పుడు అడుగు. సందేహ నివృత్తి చేస్తాను" అన్నాడు ప్రశాంతవదనంతో అగ్ని వేశాచార్యుడు.

కొద్ది క్షణాల వరకు – మౌనంగా ఉండిపోయాడు చరక్. ప్రశ్నలు మనసులో సుడిగుండాల్లా పరిభ్రమిస్తున్నాయి.

మరెన్నో సందేహాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎక్కడ్నుంచి ఆరంభించాలో అర్థంగావటం లేదు. "యు ఆర్ గ్రేట్ జేజితాతగారూ. ఇంతకు మించి మిమ్మల్ని ఎలా అభినందించాలో నాకు తోచటంలేదు. మీ వలన మన 'మున్నలూరి' వారి వంశం తరించింది. నిజంగా మీరు మహనీయులు. మీ మునిమనవడినై జన్మించడం నా పూర్వజన్మ సుకృతం.

ఇప్పుడు ముందుగా నాకో విషయం చెప్పండి. అసలు ఇలాంటి పరికరాన్ని తయారు చేయాలనే ఆలోచన మీకెలా వచ్చింది? అదీ ఈ వయసులో"

"సమకాలీన దేశపరిస్థితులు ఏం బాగాలేవు. ఈ పరిస్థితులు మారాలి. మార్చాలి అనే ఒక ఆలోచననుంచి పుట్టుకొచ్చిందే ఈ కాలనాళికమందసం" అన్నాడు

"అర్థంకాలేదు జేజిగారు."

ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి – "మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఈ దేశజనాభా ఎంతో నీకు తెలుసా?" అనడిగాడు.

"తెలీదు"

"నేడు జనాభా ఎంతో అదయినా తెలుసా?"

"నూట ఇరవై కోట్లు"

"ఇప్పటికి అరవై అయిదు సంవత్సరాల క్రితం బ్రిటీషర్లు దేశంవదిలి పోయేనాటికి దేశజనాభా ముప్పైకోట్లు. ఈ అరవై ఐదేళ్ళలోనూ అది నూట ఇరవై కోట్లు దాటింది అంటే జనాభా నాలుగు రెట్లు పెరిగింది అనుకుందాం. స్వతంత్రం వచ్చేనాటికి మనదేశంలో కాసు బంగారం ధర ముప్పై రూపాయలు. అదిప్పుడు ముప్పైవేలకు చేరుకుంటోంది.

అంతర్జాతీయ మార్కెట్‌ననుసరించి బంగారం, వెండి ఇతర వస్తువుల ధరలు పెరగడం ఆశ్చర్యం కాదు. కాని దేశీయ ఉత్పత్తుల ధరలు పెరగడం ఆశ్చర్యం కాని దేశీయ ఉత్పత్తుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా ఎందుకు పెరిగి పోతున్నాయి?

జనాభా పెరిగిందంటున్నారు. పెరిగిన జనాభా పనులు చేయడం లేదా? ఉత్పత్తులు తయారు చేయడం లేదా? ఎక్కడికి పోతోంది డబ్బంతా? దేశాన్ని ఎంత దోచేస్తే అంత గొప్పవాడనుకునే నీచభావం ప్రజల్లో పాదుకొల్పింది ఎవరు?"

అగ్నివేశాచార్యుని ఆవేశపూరితమైన మాటలు వింటూ ఆశ్చర్యపోయాడు చరక్. జేజితాతగారిలో మరో కొత్తకోణాన్ని చూస్తున్నాడిప్పుడు. "జేజిగారూ. మీరు దేశం గురించి, ప్రజల గురించి కూడా ఆలోచిస్తారా?" ఉత్కంఠత నిండిన స్వరంతో అడిగాడు చరక్.

"ఎందుకు ఆలోచించను? నా లోకం ఏదైనా ఇది నా దేశం, ఈ ప్రజలు నా వాళ్ళు. నా నరనరాన ఎప్పుడూ దేశభక్తి ఉంది. నీకో విషయం తెలుసా? మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికే నా వయసు సుమారు అరవైయ్యేళ్ళు. ఆనాడు తూర్పు గోదావరి జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల్లో నేనూ ఒకడిని. జైల్లోకెళ్ళాను. లాఠీదెబ్బలు తిన్నాను.

నాడు మా అందరి భావన ఒకటే. బ్రిటీషర్లు మన దేశాన్ని దోచేస్తున్నారు. వాళ్ళనుంచి స్వతంత్రం పొంది మనదేశాన్ని మనమే పరిపాలించుకోవాలి. అప్పుడే రైతులు బాగుంటారు. దేశంలో పేదరికం పోతుంది. దేశం అభివృద్ధి చెందుతుంది.

ప్రపంచదేశాల్లో తిరిగి భారతావని సగర్వంగా తలెత్తుకుంటుంది. ఒక పవిత్రభావన అది. నిస్స్వార్థంగా ప్రజలంతా మహాత్మాగాంధీ వెనుక నిలిచి గెలిచారు. స్వాతంత్ర్యం సాధించారు.

కాని జరిగిందేమిటి? పేదవాడు పేదవాడుగానే మిగిలిపోయాడు. ధనవంతుడు మరింత ధనవంతుడు అయ్యాడు. కులమతరహితమై సమతాభావం నిండిన ఒక నూతన ప్రపంచాన్ని నిర్మించాలని ప్రజలంతా ఆశించారు. ఆ ఆశయం నెరవేరలేదు సరికదా కులపిచ్చి, మతపిచ్చి, వర్గపిచ్చి ఇలా అనేక రుగ్మతలు సమాజాన్ని జలగల్లా పట్టిపీడిస్తున్నాయి.

మనది పేదదేశం. పేదరిక నిర్మూలనం అంటూనే దేశాన్ని ఇబ్బడి ముబ్బడిగా దోచేస్తున్న నాయకులు ఎక్కువైపోయారు. అభివృద్ధి ఫలాలు పేదవాడికి అందడం లేదు. మధ్యలోనే కొల్లగొట్టబడుతున్నాయి.

దేశం తెల్లదొరలచేతినుంచి నల్లదొరల చేతికొచ్చి నలిగిపోతోంది. దోచేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చింది సామాన్యుడికికాదు. కండబలం, అంగబలం, అధికారబలం వున్నవాడిదే రాజ్యంగా మారిపోయింది" అంటూ క్షణం ఆగాడు అగ్నివేశాచార్యుడు.

"అవును జేజితాతయ్యా... పరిస్థితులు చూస్తుంటే చాలా బాధని పిస్తుంది.పోగాపోగా కూర్చుంటే పన్ను నిలబడితే పన్నులావుంది.

యాగాణిపనికి ఏడు రూపాయలు ఖర్చు చూపించి జేబులు నింపుకునే నాయకులు, అధికారులు పెచ్చుమీరిపోయారు. రోజుకో చట్టం, రోజుకో రూలు.

ఉన్న చట్టాల్లో లోపాలు సరిచేయకుండా కొత్తచట్టాలు జనం నెత్తిన రుద్దుతున్నారు. మొన్నటిదాకా రేషన్‌కార్డులన్నారు. ఇప్పుడు ఆధార్‌కార్డులంటున్నారు.

రేపు ఏమంటారో తెలీదు. ప్రజలకు వీటికోసం ఆఫీసుల చుట్టూ తిరగటమే పనా. అన్నిటినీ వ్యాపారమయం చేసేస్తున్నారు. ప్రజల్లోనూ ధనదాహం పెరిగి పోయింది. చట్టాల గురించి మాట్లాడేవాళ్ళు బాధ్యతల గురించి పట్టించుకోవడం లేదు.

చుక్కలనంటే ధరల మధ్య సామాన్యుడు బతకలేకపోతున్నాడు. కోట్లాది ప్రజలు కడుతున్న పన్నులు ఎటుపోతున్నాయో తెలీటంలేదు. దేశాన్ని దోచుకొని జైలు కెళ్ళిన వాళ్ళకు సానుభూతిపరులు... మద్దతు... ఓట్లు... సీట్లు... ఈ పరిస్థితుల్ని ఎవరూ మార్చలేరా జేజిగారు?" అడిగాడు చరక్.

"మార్చలేరు" స్థిరంగా పలికాడు అగ్నివేశాచార్యుడు. "కలి ప్రభావం. మ్లేచ్ఛులు, దుర్మార్గులు, అవినీతి పనులు, అహంకారులు, పాపభీతి లేనివాళ్ళదే ఆధిక్యం. నీతికి విలువలేదు. ధర్మానికి దారిలేదు. పుణ్యం అనే మాటకి అర్థం తెలీకుండా పోతోంది. ఇందులో ఎవరి స్వార్థం వారికుంది."

"అవును జేజిగారు. ప్రజల జీవనసరళి ఆలోచనాధోరణి ఇంత త్వరగా మార్పుచెందటం, అరాచకాలు ప్రబలడం ఆశ్చర్యంగా ఉంది. అమ్మాయిల మీద ఆసిడ్ దాడులు – భర్తను చంపే భార్యలు, భార్యల్ని చంపే భర్తలు, తల్లిదండ్రుల్ని హింసించే కొడుకులు, ఆస్తులకోసం అన్నదమ్ములే నరుక్కు చస్తున్నారు.

ఎక్కడ చూసినా మానవతప్పిదాలతో ఘోరరోడ్డు ప్రమాదాలు. జీవిత మంతా బిడ్డల అభివృద్ధికోసం పాటుపడిన తల్లిదండ్రుల్ని వయసుడిగిన కాలంలో వృద్ధాశ్రమాలకు తరలించి చేతులు దులుపుకుంటున్నారు. మానవత్వం క్రమంగా నశిస్తోందా అన్పిస్తోంది.

యువతకు దిశామార్గం నిర్దేశించేవాళ్ళు లేరు. చదువులు చెప్పిస్తున్నారు. సంస్కారం చెప్పడంలేదు. యువతీయువకులు దారితప్పి డ్రగ్స్‌కి, మత్తుపానీయాలకి అలవాటు పడుతున్నారు. దేశంలో ఎక్కడచూసినా స్కామ్‌లు, కుంభకోణాలు, శిక్షలంటే భయం లేకపోవడమే ఈ పరిస్థితులకి కారణమనుకుంటాను"

"శిక్షలపట్ల భయంపోవడం ఒక్కటే కాదు, ఇంకా అనేక కారణాలు ఉన్నాయి"

"ఈ పరిస్థితులిలా కొనసాగాల్సిందేనా?"

"రాజ్యాలు స్థాపించిన చక్రవర్తి అయినా చచ్చాక కావలసింది రాజ్యం కాదు, కేవలం ఆరడుగుల నేల మాత్రమే అని తెలిసికూడా డబ్బుపిచ్చితో పిచ్చి కుక్కల్లా తయారై ప్రజల జీవితంతో ఆడుకుంటున్న నాయకులున్నంత వరకూ పరిస్థితులిలాగే ఉంటాయి.

దేశం ఇంకా ఆధ్వాన్నంగా మారుతుంది. ఎందరు పోరాడినా ప్రయోజనం ఉండదు. ప్రజల్లో మార్పురావాలి. అప్పుడు వాళ్ళే అవినీతి పరుల భరతం పడతారు. లేదా భగవంతుడు మరోసారి అవతరించి ఈ సమస్యను పరిష్కరించాలి."

"జేజితాతగారు దేశపరిస్థితులు మార్చటంకోసమే ఆ ఆలోచననుంచే ఈ కాలనాళిక మందసం ఆవిర్భవించిందని చెప్పారు. దీనికీ నన్ను ద్వారకాపురికి పంపించడానికి ఏదన్నా సంబంధం ఉందా?"

"నేటి దేశకాలపరిస్థితుల్ని మార్చి స్వర్ణ భారతావనిని చూడాలంటే మానవ ప్రయత్నాలు పనికిరావు. దైవశక్తి మాత్రమే దాన్ని సాధించగలదు. ఇది నా నమ్మకం. ఒక్క మనదేశమేకాదు. ప్రపంచాన్నే మార్చగల దివ్యశక్తులున్నాయి" అన్నాడు.

చరక్‌కి జేజితాతగారి మాటలు వింటుంటే మతిపోతోంది. ప్రపంచాన్నే మార్చగల శక్తులున్నాయా?

"ధర్మసంస్థాపన కోసం ఆ వైకుంఠవాసుడు అవతారపురుషుడై అనేకమార్లు భూమిపైన సంచరించాడు. దశావతారాల్లో ఒక్క కల్కి అవతారం తప్ప మిగిలిన తొమ్మిది అవతారాలు జరిగిపోయాయి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"జేజిగారూ. దశావతారాల్లో జీవపరిణామ క్రమం ఉందంటారు. నిజమేనా?"

"నిజమే నాయనా. దశావతారాలు జీవపరిణామక్రమాన్ని సూచిస్తాయి. వాటి గురించి చెప్పుకునే ముందు నీకో నిగూఢమైన విషయం ఒకటి చెప్తాను విను. శ్రీమహావిష్ణువు అవతారపురుషునిగా అవతరించిన ప్రతిసారి ధర్మసంస్థాపనకు కొన్ని ఆయుధాలు, ఉపకరణాలు వినియోగించాడు.

తిరిగి వైకుంఠం వెళ్ళిపోయేటప్పుడు వాటిని తనతో తీసుకెళ్ళలేదు. భూమి మీద వస్తువులు భూమికే సొంతం గాబట్టి మానవధర్మాన్నే పాటించి వాటిని భూమాత వశం చేసి నిష్క్రమించాడు.

శ్రీ మహావిష్ణువు ఆయుధాలు తెలుసు గదా. సుదర్శన చక్రం, నందకం అనే ఖడ్గం, గద. వీటిలో కృష్ణావతారంలో మాత్రమే సందర్భానుసారం చక్రాయుధం ప్రయోగించాడు. నందకమనే ఖడ్గాన్ని కల్కి అవతారంలో వినియోగిస్తాడు. కాబట్టి చక్రాయుధం మాత్రమే శ్రీహరితో వైకుంఠం చేరుకుంది.

రామావతారంలోని కోదండం అనే విల్లు, రామబాణం వీటిని అవతార పరిసమాప్తిలో ఇక్కడే వదిలేశాడు. కృష్ణావతారంలో ఉపకరణాలను భూమిపైనే వదిలేశాడు. ఇందులో పరశురామావతారం ఉంది. పరశువు అంటే గండ్రగొడ్డలి. ఆయన విల్లు, అంబులు కూడా శక్తివంతమైనవి. ఐతే ఆయన చిరంజీవి. చిరంజీవులు పధ్నాలుగు మందిలో ఆయన ఒకడు.

మహేంద్రగిరి పర్వతం మీద ఆయన నేటికీ ఉన్నాడు. కాబట్టి ఆయన ఆయుధాలు ఆయనవద్దే ఉన్నాయి. ఇలా ఆ యా అవతారాల్లో ఉపయోగించిన వస్తువులు మహా... మహా... శక్తివంతమైనవి.

మొదటి అవతారం మత్స్యావతారం. మత్స్యం పూర్తిగా నీటిలోనే పుట్టి పెరిగే జీవి. ఈ అవతారం వచ్చేనాటికి కేవలం దేవతలు, రాక్షసులు వారిమధ్య వైషమ్యాలేగాని మానవజాతి ఆవిర్భావం జరగలేదు. భూమి అంతా జలమయంగా ఉన్న కాలం. ఇది జీవకోటి ఆవిర్భావం నీటిలో ఆరంభమైందనేందుకు సూచిక.

రెండో అవతారం కూర్మావతారం. తాబేలు ఉభయచరం. నేలమీద, నీటిలోను కూడా జీవించగలదు. ఈ అవతారం వచ్చేనాటికి సముద్రగర్భం నుంచి భూభాగాలు గాల్లోకి లేచాయి.

చెట్టుచేమలు, గడ్డిజాతులు ఏర్పడుతున్న కాలం. సముద్రం నుంచి జీవులు నేలమీదకు వ్యాపించడం ఆరంభమైన సమయం. మూడోది వరాహఅవతారం. పంది పూర్తిగా నేలమీద మాత్రమే జీవించగల జంతువు. ఈ అవతార సమయానికి భూమిపైన జంతుజాలం అభివృద్ధి చెందుతోందని అర్థం.

ఇక నాలుగో అవతారం నారసింహావతారం. నరుడు, సింహం కలగలిసిన రూపం. ఈ అవతారమే ఒక విశిష్టమైనది. ఈ అవతారం వచ్చేనాటికి మానవ జాతి ఆవిర్భావం ఆరంభమైందని అనుకోవచ్చు. ఐతే ఇలాంటి విచిత్రమైన అవతారం ధరించాల్సినవసరం ఎందుకొచ్చింది? తన అన్న హిరణ్యాక్షుడ్ని వరాహ

అవతారమెత్తి శ్రీమహావిష్ణువు వధించాడన్న కోపంతో హిరణ్యకశిపుడు బ్రహ్మ గురించి ఘోర తపస్సు చేసి విచిత్రమైన వరాన్ని పొందాడు.

తనకు దేవతలనుంచిగాని, రాక్షసుల నుంచిగాని, నరుల నుంచి గాని, జంతువుల నుంచిగాని, ఇంకా నేలమీదగాని, నీటిలోగాని, ఆకాశంలోగాని, పగలు గాని, రాత్రిగాని ఇంకా అస్త్రశస్త్రాలనుంచి గాని చావు లేకుండా పొందిన వరం అది. ఈ వరగర్వంతో శ్రీమహావిష్ణువును సంహరించడానికై వైకుంఠం మీదికే దాడిచేసిన గర్విష్టి. ప్రజలు తననే దేవుడిగా పూజించాలని శాసించిన ఘనుడు.

అలాంటివానికి ప్రహ్లాదుని రూపంలో కొడుకే విష్ణుభక్తుడై శత్రువైనాడు. శ్రీహరి సర్వాంతర్యామి అయితే ఈ స్తంభంలో చూపించు అంటూ కొడుకు మీది కోపంతో రాతిస్తంభాన్ని కొట్టినప్పుడు ఆ స్తంభంలోంచి నరసింహమూర్తి అవతరించి హిరణ్యకశిపుడ్ని వధించాడు.

ఆయన ఉగ్రనారసింహుడు. పూర్తిగా నరుడు కాదు – జంతువు కాదు. ఆయన స్తంభంనుంచి వచ్చిన సమయం అసురసంధ్యవేళ. అంటే అది పగలు కాదు, రాత్రి కాదు, సంధ్యాసమయం. హిరణ్యకశిపుడ్ని గాల్లోగాని, నేలమీద గాని, నీటిలో గాని సంహరించలేదు. తన తొడమీదవేసి గుండెలు చీల్చి చంపాడు.

అస్త్రశస్త్రాలు ఉపయోగించలేదు. వాడి అయిన తన గోళ్ళనే ఆయుధాలుగా వాడాడు. కాబట్టి ఆ విధంగా బ్రహ్మదేవుడిచ్చిన వరానికి భంగం కలగకుండా విచిత్రమైన నరసింహ అవతారం ధరించి దుష్టుడైన హిరణ్యకశిపుడ్ని సంహరించాడు శ్రీహరి.

ఇక అయిదో అవతారం వామనావతారం. ఈ వటుడి అవతారం వచ్చే నాటికి మానవజాతి అభివృద్ధి చెంది ఆవాసాలేర్పడుతున్న కాలం. కాని రాజ్యాలు అప్పటికింకా ఏర్పడి ఉండకపోవచ్చు.

ఈ అవతారంలో కూడా ఆయుధాలు ధరించలేదు వామనుడు. మూడు అడుగుల స్థలం అర్థించి ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి మూడో అడుగుతో బలిని పాతాళానికి అణగదొక్కాడు, ఇంత వాడింతై వటుడింతై అంటారు ఇందుకే.

ఈ అవతారకాలానికి మానవజాతి పూర్తిగా అభివృద్ధి చెంది నగరాలు, రాజ్యాలు ఏర్పడి ఉన్నాయి. ఆ తర్వాత వచ్చినవి వరుసగా పరశురామావతారం, రామావతారం, కృష్ణావతారం, బుద్ధావతారం. ఒక్క బుద్ధావతారంలో తప్ప మిగిలిన మూడు అవతారాల్లోను ధర్మసంస్థాపనకు ఆయుధాలు ధరించాడు" అంటూ సుదీర్ఘమైన తన ప్రసంగాన్ని కాస్సేపు ఆపాడు అగ్నివేశాచార్యుడు.

ఆయన చెప్పిన తీరు విశ్లేషణలను బట్టి ఆయన అంతరంగం అర్ధమైనట్టే అన్పిస్తోంది చరక్‌కి. కాని ఖచ్చితంగా ఏమాశిస్తున్నాడో అర్ధంగావటంలేదు. తనను ద్వారకాపురి పంపించడంలో జేజితాతగారి ఆంతర్యం ఏమిటి? ఏం కోరుకుంటున్నాడీయన?

"అంటే జేజిగారూ... మాధవుని ఆయుధాలు ఇంకా ఈ భూమ్మీదే ఉన్నాయంటారా?"

"సందేహమే అక్కర్లేదు. ఉన్నాయి. దైవం చేతులు తాకిన ఆ ఉపకరణాలు శిధిలంకావు నాయనా. భూదేవి వాటిని సంరక్షిస్తూనే ఉంటుంది. ధర్మసంస్థాపనకు నాందిగా కురుక్షేత్ర యుద్ధారంభంలో శ్రీకృష్ణపరమాత్మ పూరించిన పాంచజన్యం అనే శంఖం. అది నాక్కావాలి. ఆ శంఖాన్ని పూరిస్తే దిక్కులు పిక్కటిల్లే ఆ శంక నాదానికి దుర్మార్గులు గుండెలు పగిలి చస్తారు.

అక్రమార్కులు దిక్కులు పట్టిపోతారు. దుష్టులు తమలో తాము నరుక్కు చస్తారు. భూమ్మీద ధర్మం స్థాపించబడి తిరిగి మానవత్వం వికసిస్తుంది. ఇక నాక్కావలసిన రెండో వస్తువు శ్రీకృష్ణుని కరభూషణమై సదా ఆయన వెంటవున్న ఆ లాలామానుషరూపుని పిల్లనగ్రోవి. ఆ మురళి నాక్కావాలి.

మహాద్భుతము, మిక్కిలి మహిమాన్వితం అయిన దేవ మురళి అది. ఆ మురళీనాదం వింటే చాలు పశువులు క్షీరధారలు కురిపిస్తాయి. దేశంలో పశుగణాభివృద్ధి గణనీయంగా అభివృద్ధి చెంది అలనాటి గోసంపద, ఆ వైభవం పునరావృతం అవుతుంది.

ఒకప్పుడు ఆలమందలు స్వేచ్ఛగా నడయాడిన దేశం మనది. గోసంపద అనేవారు. ఎన్ని గోవుల్ని సంపాదించుకుంటే అంత సంపన్నుడు ఆ కాలంలో.

గో సంపద, పశుసంపద దేశంలో ఈతి బాధల నుండి ప్రజల్ని కాపాడుతుంది.

ఈ రోజు దుక్కుటెద్దులు గాని ఎడ్లబండ్లను గాని చూద్దామంటే కనబడటం లేదు. మనకి పశుగణాభివృద్ధిశాఖ అని ఒకటుంది. అది ఎక్కడుందో కూడా సామాన్యుడికి తెలీదు. పశువుల్ని లారీలకొద్దీ కబేళాలకు తరలిస్తున్నా పట్టించుకునే నాధుడు లేడు.

గో సంపద క్షీణదశలో ఉంది. ప్రతి హిందువు పవిత్రంగా భావించే గోజాతిని నిర్దాక్షిణ్యంగా వధించేస్తున్నారు. ఆనాడు దేశంలో గోవు తొక్కని భూభాగాలు లేవు.

అది పాండురాజు మరణించిన సమయం. చనిపోయేముందు కొడుకులు అయిదుగుర్ని పిలిచి తనశవాన్ని దహనం చేయవద్ధని, అంతా పంచుకు తినేయమని చెప్పాడు.

తింటే ఏం జరుగుతుందో కృష్ణుడికి తెలుసు. ఆయనేదో మరణ సమయంతో మతిభ్రమించి అలా చెప్పాడుగాని, శవాన్ని పీక్కుతినడానికి మీరేమన్నా అడవి మనుషులా, నరమాంసభక్షకులా? చాల్చాల్లే గాని శవదహనానికి ఏర్పాట్లు చేయండి అని అడ్డం పడ్డాడు. పాండురాజు శవాన్ని దహనవాటికకు చేర్చారు. ఏర్పాట్లు ఓ పక్క జరుగుతున్నాయి.

సహదేవుణ్ణి తండ్రి శవం వద్ద కాపలా ఉంచారు. సహదేవుడు బాల్య చాపల్యంతో తండ్రి వేలి ఉంగరాన్ని తీసుకోబోతుంటే అది రాలేదు.

పంటితో లాగినప్పుడు శవం వేలిచర్మం చిట్లి కసరు గొంతులోకి పోయింది. దాంతో సహదేవుడికి ఎవరెక్కడున్నారు, ఏం జరుగుతోంది, అంతా తెలిసిపోనారంభించింది.

వెంటనే కృష్ణుడు వచ్చాడు. "నా మాట మీరి తప్పు చేశావ్ సహదేవా. నీకు అన్నీ తెలిసి పోతున్నాయి. కాబట్టి నీకు తెలిసిన విషయాన్ని ఎవరన్నా అడిగితే చెప్పాలి. అడక్కుండా నీ అంతట నువ్వే చెప్తే నీ తల పగిలి చప్తావ్" అని శాపమిచ్చాడు.

దీనికి సహదేవుడు బాధపడలేదు. "సరేబావా. నీ శాపాన్ని స్వీకరిస్తున్నాను. ప్రతిగా నాకో వరం కావాలి. మా పాండవ వంశంలో ఎవరు చచ్చినా వారిని గోవు తొక్కని ప్రదేశంలో దహనం చేయాలి" అనడిగాడు.

కృష్ణుడు సరేనన్నాడు. ఇంతవరకు బాగానే ఉంది కాని– ఈ లోకంలో గోవు తొక్కని చోటు అదెక్కడుంది? సహదేవుడు ఆ వరాన్ని ఎందుకు కోరాడు? గో సంచారం ముల్లోకాల్లోనూ ఉంది గదా.

మరి అలాంటప్పుడు గోవు తొక్కని చోటు ఎక్కడుంది? ఆ కిటుకు ఏమిటో రుక్మిణీదేవి చెప్పేవరకు కృష్ణపరమాత్మకీ తెలీలేదు. జరిగింది వినగానే రుక్మిణీదేవి నొచ్చుకుంటూ "ఏమిటి స్వామీ. వైకుంఠానికి పోకుండా శాశ్వతంగా భూలోకంలోనే ఉండిపోదామనుకుంటున్నారా. పాండవ వంశాన్ని కాపాడ్డమే మీ పనా?" అంది.

"ఏమైంది దేవీ పొరబాటు జరిగిందా?" అనడిగాడు కృష్ణుడు.

"పెద్ద పొరబాటే చేశారు స్వామీ. లోకంలో గోవు తొక్కనిచోటు ఒకేచోటు. అది లక్ష్మీదేవిగా నా నివాసమైన మీ హృదయమందిరం. ఆ వంశంలో ఎవరు పోయినా మీ గుండెలమీద దహనం చేయాలి. కాబట్టి వాళ్ళలో ఎవరూ మరణించకుండా చూసుకోవలసిన బాధ్యత మీమీద పడింది."

"అరరే. తీరా మాటిచ్చేశాను దేవీ. ఇప్పుడెలా?"

"ఇప్పుడైనా మించింది లేదు. పాండవులవరకే మీ బాధ్యత. మిగిలిన వంశీకులతో మీకు సంబంధం లేదు. వెంటనే వెళ్ళి సహదేవునితో చెప్పండి. నీకిచ్చిన వరం మొదళ్ళకేగాని చిగుళ్ళకు వర్తించదు అని" అంటూ సలహా ఇచ్చింది రక్మిణీదేవి.

వెంటనే వెళ్ళాడు శ్రీకృష్ణుడు. తండ్రి దినకార్యం హడావుడిలో వున్న సహదేవుని పిలిచి "ఇదిగో బావా. నీవడిగిన వరం మొదళ్ళకే గాని చిగుళ్ళకు వర్తించదు సుమా. గుర్తుంచుకో" అన్నాడు.

పని హడావుడిలో వున్న సహదేవుడూ పట్టించుకోకుండా 'సరేలే బావా' అన్నాడు.

ఆ విధంగా ఆ వరాన్ని సరిచేయటం వలన గొప్ప ప్రమాదం తప్పింది గాని లేదంటే ఆ వంశం ఉన్నంత వరకు తిరిగి వైకుంఠం చేరగలిగేవాడు కాదు శ్రీకృష్ణుడు. అదే ప్రకారం శ్రీకృష్ణ నిర్యాణం తర్వాత పాండవులు గతించారు. గాని కృష్ణుడు ఉన్నంతవరకు పంచపాండవులు అయిదుగురిలోనూ ఎవరూ మరణించలేదు. కృష్ణుడనే రక్ష వారికుంది గాబట్టి.

ఎందుకిది చెప్పానంటే ఆనాడు ఆలమందలు దేశమంతా తిరిగేవి అని చెప్పటం కోసం. కాబట్టి ఆ కృష్ణమురళిని తిరిగి ప్రతిష్ఠించాలని కోరుకుంటున్నాను." అంటూ క్షణం ఆగాడు అగ్నివేశాచార్యుడు.

"ఈ రెండు వస్తువులేనా ఇంకేమన్నా ఉన్నాయా జేజి తాతయ్యా?" అని అడిగాడు చరక్, అగ్నివేశాచార్యుడిని.

"ఇంకో రెండు ఉన్నాయి. అవి ఒకటి శమంతకమణి, రెండు శ్రీకృష్ణుని కిరీటాన్ని సదా అలంకరించి ఉండే నెమలిపింఛం. అవి రెండూ కావాలి. శమంతక మణి సత్రాజిత్తురాజుకు సూర్యప్రసాదితమైన మణిహారం.

వినాయకచవితి వ్రతకథలో ఈ గాధ తప్పని సరిగా చదువుతారు. రోజుకు పది బారువాల బంగారాన్ని ప్రసాదించే ఈ శమంతకమణి పుట్టింటి అరణంగా తనకూతురు సత్యభామతోబాటు కృష్ణునికి అర్పించుకున్నాడు సత్రాజిత్తు.

ద్వారకాపురి స్వర్ణమయం గావటం వెనుక – ధనవంతమైన దేశంగా విలసిల్లటం వెనక ఈ శమంతకమణి పాత్ర ఎనలేనిది. ఈ శమంతకమణి జాడతెలుసుకుని తేగలిగితే మనదేశ దారిద్ర్యం తొలగిపోతుంది. ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారు. దేశానికి బంగారు భవిష్యత్తు సిద్ధిస్తుంది" అన్నాడు.

"జేజితాతగారూ... ఆ శమంతకమణి ఇప్పటికీ బంగారం ఇస్తూనే ఉంటుందంటారా. అదే నిజమైతే ఇన్ని వేలసంవత్సరాల కాలంలో తను ప్రసాదించిన బంగారంతో భూమండలమంతా నిండి పోవాలి గదా?"

"నిండదు. ఎందుకంటే ఈ శమంతకమణి సూర్యుని ఉదయకిరణాలు సోకినప్పుడు మాత్రమే పనిచేస్తుంది. ఎక్కడో భూమిపొరల్లో చీకటి కడుపున ఉన్న శమంతకమణి ఇప్పుడు పనిచేయదు. నాయనా దాన్ని తిరిగి వెలుగులోకి తెచ్చి శుద్ధిచేసి విశేషపూజలు నిర్వహిస్తే అప్పుడు బంగారాన్ని ప్రసాదిస్తుంది"

"ఓ.కె. జేజితాతయ్యా! ఒప్పుకుంటాను. కాని నెమలిపింఛం అన్నారు. అదిప్పటికీ శిథిలంగాకుండా ఉంటుందా" అన్నాడు చరక్.

"ఖచ్చితంగా చెప్పలేను గాని ఉంటుందనే అనుకుంటున్నాను. శ్రీకృష్ణుని కిరీటాన్ని ఆ సమయంలో ఎక్కడో స్వర్ణపేటికలో భద్రపర్చి ఉంటారు. ఆ పేటిక లభిస్తే కిరీటంతోబాటు నెమలిపింఛం కూడా భద్రంగా ఉంటుంది. ఈ నెమలి ఫించం వలన దేశానికి పట్టిన సకల గ్రహపీడలు, దోషాలు తొలగిపోతాయి.

నేను ఈ నాలుగింటిని కోరుకుంటున్నాను" అంటూ తన అభీష్టాన్ని వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"నెమలి ఈకను గమనిస్తే దానిమీద ఒక కన్ను ఉంటుంది నెమలికన్ను. కన్నులాగే ఉంటుంది. కాని కన్నుకాదు. అలాగే నేను మానవరూపంలో మీ మధ్య ఉన్నాను, కాని మానవుడ్ని కాను. సర్వాంతర్యామిని. సకలం సదా వీక్షిస్తూనే ఉంటాను అని తెలియజెప్పటం కోసమే శిఖిపించమౌళి అయ్యాడు.

దీనికి మరో వివరణ కూడా ఉంది. నెమలిపింఛ ధారణ ఆరంభించింది స్వయంగా కృష్ణుడు కాదు. నేలమీద పాకే బాలుడిగా ఉన్నప్పుడే అద్భుతమగు మహిమల్ని చూపుతూ అందర్నీ ఆకర్షించేవాడు కన్నయ్య. గోపస్త్రీలు ఎంతో ఇష్టంగా ఎత్తుకు తిప్పేవారు. యశోద వారిని వారింపలేకపోయేది.

ఎవరి కన్ను ఎలాంటిదో తన కన్నయ్యకు ఏ చెడుదిష్టీ సోకకూడదని ఏ గ్రహదోషం ఉండకూడదని స్వయంగా యశోద, కన్నయ్యకు నెమలిపింఛధారణ ఆరంభించింది. కన్నవారు దేవకీవసుదేవులయినా పెంచినవారు నందయశోదలు.

వారి అపారమైన ప్రేమకు గుర్తుగా తల్లి యశోద మీద అభిమానంతో వయసుకొచ్చేకొద్దీ నెమలిపింఛధారణను ఒక అలవాటుగా మార్చుకున్నాడు కృష్ణుడు. అవతార పరిసమాప్తి వరకు శిఖిపించమౌళిగానే ఉన్నాడు. ఆ తల్లి యశోద అంటే అంత ప్రేమ కృష్ణపరమాత్మకు. ఇదే అసలు విషయం" అని వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"ఓ.కె. జేజితాతయ్యా. నేను ద్వారకాపురి వెళ్ళి మీరడిగిన నాలుగూ వెదికి పట్టుకుని తేవాలి. అంతే గదా?" అనడిగాడు.

తల అడ్డంగా ఊపి నవ్వాడు అగ్నివేశాచార్యుడు. "అది నువ్వనుకున్నంత తేలికకాదు చరక్. వాటి ఆచూకీ తెలుసుకోవటం సులువు కానేకాదు."

"మరెలా జేజితాతయ్యా?"

"ఎలాగో కూడా ఎవరూ చెప్పలేరు. ప్రయత్నించాలి. అంతే. ద్వారకాపురి వెళ్ళాక నీ ప్రయత్నాలు సానుకూలం కావాలంటే ముందు ఆనాటి అదీ పామరభాష కూడా తెలుసుకోవాలి.

వారి వేషభాషలు, ఆచార వ్యవహారాలు, పద్ధతులు అన్నీ తెలుసుకుని యాదవ ప్రజల్లో ఒకడిగా కొద్దిరోజులు గడిపి రావాలి. అంటే రేపు నువ్వు

వెళ్ళేది 'ట్రయల్ రన్' లాంటిది. కనీసం రెండు మాసాలపాటు ఉంటేనే పరిస్థితులు పట్టుబడతాయి. తిరిగి అన్వేషణ కోసం వెళ్ళాలి"

"అర్థమైంది జేజిగారు. నేను మణిభద్రయక్షుని కోరుకునేప్పుడు ఏ కాలంలో వెళ్ళాలని కోరుకోవాలి?" అడిగాడు చరక్.

"చెప్తాను. కురుక్షేత్ర యుద్ధం జరగటానికి ఓ పదేళ్ళు ముందు కాలంలో అక్కడుంటే బాగుంటుందనుకుంటున్నాను"

"అంటే పాండవులు అరణ్యవాసంలో ఉన్న కాలమన్నమాట" అన్నాడు చరక్.

"మనకి హస్తినతోనో, కురుపాండవులతోనో పనిలేదు చరక్. మన లక్ష్యం శమంతకమణి, పాంచజన్యం, మురళి, నెమలిపింఛంతో శ్రీకృష్ణులవారి కిరీటం. ఇవే ముఖ్యం"

"ఒకవేళ నేనక్కడ ఉన్న సమయంలో హస్తినకు వెళ్ళాల్సివస్తే?"

"అది పరిస్థితుల్నిబట్టి ఆలోచించుకుని నిర్ణయించుకో. కాని నిన్ను నువ్వు రక్షించుకుంటూ జాగ్రత్తగా ఉండాలి"

"ఉంటాను జేజిగారు. చివరిగా నాదో సందేహం. ఈ కాలనాళిక మందసం చిరకాలం ఇలా ఉండి పోతుందా?" అడిగాడు చరక్.

"ఉండదు" స్థిరంగా బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు.

"ఇందులో ప్రాణాపాయం ఉందన్నాను గుర్తుందా? ఈ కాలనాళిక మందసం నా సృష్టి. నేను ఉన్నంత వరకే ఉంటుంది. నేను తుదిశ్వాస విడిచిన మరుక్షణం యక్షులు దీన్ని సర్వనాశనం చేసిపోతారు" అన్నాడు.

ఆ మాటలకు అప్రతిభుడు అయ్యాడు చరక్. భయంతో రోమాలు నిక్క బొడుచుకున్నాయి. ఒకవేళ తను ద్వారకాపురిలో ఉండగా ఇక్కడ జేజి తాతయ్య కన్నుమూస్తే తన పరిస్థితి ఏమిటి? ఊహించటానికే భయం వేసింది చరక్‌కు. అరచేతులు చెమటలు పట్టి వెన్ను వణికింది.

అదే జరిగితే తను వర్తమానం నుండి శాశ్వతంగా భూతకాలంలోనే ఉండిపోతాడు. అప్పుడు తన ప్రాణంలో ప్రాణం శుశ్రుత ఏం కావాలి? అతడి భయాన్ని అర్థం చేసుకున్నట్లు ఒకింత మందహాసం చేస్తూ– "భయపడకు చరక్. నా లక్ష్యసాధన ముగిసేవరకు ఈ కట్టెలో ఊపిరి ఆగదు. పద" అంటూ లేచి

చరక్ భుజంమీద చేయివేసి బయటకు నడిచాడు అగ్నివేశాచార్యుడు. తలుపులు మూసి తాళం వేశాడు అప్పన్న.

* * * * *

మరునాడు ప్రభాతవేళ. అగ్నివేశాచార్యుని స్థావరంలో ఇదీ అని చెప్పలేని ఒకస్తబ్ధత నెలకొనిఉంది. ఒక అద్భుతం జరగనుంది.

ఇప్పుడు మునిమనవడు చరక్‌ను కాలనాళిక మందసం ద్వారా భూతకాలంలోకి పంపించబోతున్నాడు. అగ్నివేశాచార్యునితోబాటు చరక్, వారి వెంట పిల్లా గోవిందపాత్రుడు, పిల్లా శివరామముకుంద పాత్రుడు ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్ళి తలుపులు మూశారు.

బయట డ్రైవరు కాశీ, నౌకరు అప్పన్న, పులి కొండయ్య, ఇంకా వంట వాళ్ళు అంతా గుమిగూడి ఈ అద్భుతం గురించే గుసగుసలుగా చెప్పుకుంటూ ఉండిపోయారు. లోన అగ్నివేశాచార్యుడు కాలనాళిక మందసానికి యధావిధిగా పూజాదికాలు నిర్వహించి మణిభద్రయక్షుని అర్చించాడు.

* * * * *

చరక్ వేకువనే స్నానాదికాలు ముగించుకుని శుచియై అగ్నివేశాచార్యుని సూచనల మేరకు వదులుగా ఉండే పైజామా జుబ్బా ధరించి ప్రయాణానికి సిద్ధమైవచ్చి ఉన్నాడు. అగ్నివేశాచార్యుడు మునిమనవడు చరక్ నుదుట బొట్టు పెట్టి కాలనాళిక మందసానికి, మణిభద్రయక్షునికి ప్రణామం చేయించాడు. ఆ గది అంతా ధూపదీపాలతో ప్రకాశవంతంగా ఉంది. ముహూర్తసమయం సమీపించగానే జేజితాతయ్య పాదాలకు నమస్కరించాడు చరక్.

మునిమనవడ్ని ఆశీర్వదించి లేపి కళ్ళలోకి అభిమానంగా చూశాడు అగ్నివేశాచార్యుడు. ఆ సమయంలో ఇరువురి కళ్ళలోను నీరు సుడితిరిగింది. జేజితాతను కౌగిలించుకున్నాడు చరక్. అతడి వెన్నుతట్టి ధైర్యం చెప్పాడు అగ్నివేశాచార్యుడు.

"అంతా శుభం జరుగుతుంది. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రా నాయనా" అన్నాడు.

పిదప తమకు ఎంతో సాయపడుతున్న తండ్రీ కొడుకులు పిల్లా గోవింద పాత్రులవారికి, పిల్లా శివరామ ముకుందపాత్రుల వారికీ కూడా నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నాడు చరక్.

గ్లాస్‌డోమ్ లేపి లోన ప్రవేశించడానికి ఉద్యుక్తుడయ్యాడు చరక్.

"నాయనా చరక్. చెప్పిన విషయాలు గుర్తున్నాయి గదా. పొరబాటు జరక్కుండా చూసుకో. భద్రంగా వెళ్ళిరా" అంటూ చివరిసారిగా హెచ్చరించాడు అగ్నివేశాచార్యుడు. అలాగే అన్నట్టు తలూపి కాలనాళిక మందసంలో ప్రవేశించాడు చరక్.

గ్లాస్‌డోమ్‌ని యథాప్రకారం మూసుకున్నాడు. తల దిండుమీద తల ఉంచి పరుపుమీద వెల్లకిలా పడుకుని రెండు చేతులూ గుండెల మీద ఉంచుకుని కళ్ళు మూసుకున్నాడు.

ఏకాగ్రతతో మణిభద్రయక్షుని స్మరించుకుని – "ఓ త్రికాల సంచారా... కురుక్షేత్ర యుద్ధం జరగటానికి ఓ పది సంవత్సరాల ముందు కాలంలో కొంత కాలం శ్రీకృష్ణపరమాత్ముని ద్వారకానగరంలో నివసించి రావాలనుకుంటున్నాను. నన్ను ద్వారకాపురికి చేర్చు. నా అభీష్టాన్ని దయతో నెరవేర్చు" అని వేడుకుని కళ్ళు మూసుకున్నాడు.

అలా కళ్ళు మూసిన పది సెకన్లలోపే– గాఢనిద్రావస్థకు వెళ్ళిపోయాడు చరక్. అంతలోనే ఏమైందో తెలీదు. కళ్ళు తెరిచేసరికి తను గాల్లో తేలుతున్న అనుభూతికి లోనయ్యాడు. ఆ అనుభూతి నుండి తేరుకొనకముందే తను కాలనాళిక మందసం నుండి గ్లాస్ డోమ్ తెరవకుండానే విచిత్రంగా దానిపైకి చేరుకున్నాడు. కంగారుపడి మందసంలోకి తొంగిచూశాడు. ఆశ్చర్యం, తన శరీరం మందసంలోనే ఉంది.

గాఢనిద్రలో ఉన్నట్టు పడుంది. ఏం జరుగుతోంది? ఆలోచించే వ్యవధి లేదు. ఎవరో తనను లాక్కుపోతున్నట్టుగా గాల్లో నడుస్తూ గోడకి ఉన్న అద్దంలో ప్రవేశించాడు. చరక్ ఆత్మ సూక్ష్మశరీరంతో మందసంలోంచి ఒక జ్యోతిరూపంగా పైకిరావటం చూస్తూండగానే చరక్ సూక్ష్మరూపం, నిజరూపం సైజులోకి మారింది. నేరుగా గాల్లో నడుచుకుంటూ పోయి గోడకున్న నిలువుటద్దంలో ప్రవేశించి అదృశ్యమైంది.

కొన్ని క్షణాలపాటు అద్దంలో ప్రతిఫలిస్తున్న కాంతులు ఆగిపోయి నల్లని చీకటిగా మిగిలిపోయింది అద్దం. తర్వాత యథాప్రకారం రంగుల కాంతులు ప్రతిఫలించటం ఆరంభించాయి. అంతవరకు చూసి లేచాడు అగ్నివేశాచార్యుడు.

ఓసారి మందసాన్ని సమీపించి గ్లాస్ డోమ్ గుండా లోపల పరుపుమీద నిద్ర పోతున్నట్టు పడి ఉన్న మునిమనవడి దేహాన్ని ఆప్యాయంగా చూసుకుని వెనుతిరిగాడు.

"గోవిందా! పదండి, ఇక మనకిప్పట్లో ఇక్కడ పనిలేదు. చరక్ భూతకాలం లోకి సుదూర ప్రయాణంలో ఉన్నాడు. ఎవరూ ఈ గదిలోకి రాకుండా తాళం పెట్టి ఇరవై నాలుగు గంటలూ గది బయట ఎవరో ఒకరు కాపలా ఉండేలా చూడాలి. పదండి" అంటూ బయటకు దారితీశాడు అగ్నివేశాచార్యుడు.

* * * * *

అద్దం గుండా లోన ప్రవేశించిన చరక్ వాయు వేగ మనోవేగాలతో ప్రయాణిస్తున్నాడు. ఆత్మగామారినా కూడా అతనికి అంతా గుర్తుంది. మస్తిష్కం యధావిధిగా పనిచేస్తోంది.

అద్దంలోని వెలుగురేఖల్ని దాటగానే తను చీకట్లలోకి విసిరివేయబడినట్టు ఏదో అదృశ్యప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నట్టు దూసుకుపోతూనే ఉన్నాడు.

ఇందులో తన ప్రమేయం లేదు. తన ప్రయత్నం లేదు. ఎవరు తీసుకు పోతున్నారో ఎటుపోతున్నాడో కూడా తెలీని తిమిరాంధకారంలో కొట్టుమిట్టాడు తున్నాడు. కంటిముందు చిక్కటి చీకటి. ఎక్కడా వెలుగురేఖ జాడలేదు.

ఆత్మ తల్లి గర్భంలో ప్రవేశించేముందు ఇలా చీకట్లను చీల్చుకునేవస్తుందా? మరణించిన వారి ఆత్మలు ఇలాగే చీకట్లలో ప్రయాణం చేసి స్వర్గానికో నరకానికో చేరతాయా? భూమి పుట్టినప్పట్నుంచి జరిగిన భూతకాలంలోని చరిత్ర మొత్తం ఈ నిబిడాంధకారంలోనే నిక్షిప్తమై ఉందా? స్వర్గమంటే ఈ చీకట్ల అంచున చివరెక్కడో ఉందా? ఆత్మాగమనాగమనాలు ఇలా చీకట్లలోనే సాగుతాయా?

ఈ ఒంటరితనం, ఈ చీకటి, ఈ గమనవేగం, భయమంటే తెలీని తననే భయకంపితుడ్ని చేస్తున్నాయ్. ఇంతకీ అసలు మణిభద్రయక్షుడు ఎక్కడ? తనతోనే వస్తున్నాడా? జేజితాతయ్య చెప్పారు గాబట్టి ఖచ్చితంగా తన ముందో వెనుకో ఉండే ఉంటాడు.

ఇంతకీ తనిప్పుడు బతికివున్నట్టా, చనిపోయినట్టా? ఏమో... బహుశా ఈ ప్రశ్నకు ఎవ్వరూ బదులు చెప్పలేరనుకుంటా. బతికి ఉంటే మందసంలోని తన శరీరం కోమాలో వున్నట్టు... ఇంతకీ ఏం జరగబోతోంది?

ఆహాఁ జేజితాతయ్యా! ఏం పరిస్థితి కల్పించావయ్యా. నీ మేధాశక్తి నెలా కొనియాడాలో తెలీటంలేదు. ఎక్కడి హైదరాబాదు, ఎక్కడి మున్నలూరి వారి అగ్రహారం, ఎక్కడి కోరుకొండ.

హైదరాబాద్‌లో హాయిగా ఉద్యోగం చేసుకుంటూ ప్రేమించి పెళ్ళి చేసుకున్న శుశ్రుతతో హాయిగా సుఖంగా కాపరం చేసుకోకుండా నన్నిలా పంపించావే... నేను నిజంగానే ద్వారకాపురి చేరగలనా? తిరిగి నా శరీరంలో ప్రవేశించి మీ అందర్నీ చూడగలనా? నా ప్రాణంలో ప్రాణం అయిన శుశ్రుతని పొందగలనా?"

చరక్ ఆలోచనలు ఓ కొలిక్కిరాలేదు. ఎంత సమయం గడిచిందో తెలీదు. అంతలో వెలుగు రేఖ చమక్‌మంటూ అతడి కళ్ళను తాకింది. ఉత్కంఠ భరితుడై కళ్ళు చించుకుని ఆ వెలుగు రేఖదిశగా వీక్షించసాగాడు. ఆలోచనలు చెదిరి పోయాయి. ధ్యాస ఆ వెలుగురేఖమీద పడింది.

చాలా వేగంగా దగ్గరవుతోంది. అనేక వెలుగు రేఖలుగా మారుతోంది. అది దగ్గరయ్యే కొద్దీ చరక్ కళ్ళు మగతగా మూతలు పడసాగాయి. ఆ వెలుగును చూడలేకపోతున్నాయి. అమితవేగంతో ఆ వెలుగు వైపు వెళ్ళిపోతున్నాడు.

మగతగా కళ్ళు మూతలు పడిపోయాయి. తర్వాత ఏం జరిగిందో తెలీదు. కొంతసేపటికి తను ఎక్కడో దబ్బున నేలమీది పచ్చికలో పడ్డం మాత్రం గుర్తుంది అంతే...

*　　*　　*　　*　　*

చరక్‌కు స్పృహ తెలిసేసరికి – సూర్యుడు నడిమింట ఉన్నాడు. చెట్ల గుబురు కొమ్మలమధ్యన దోబూచులాడుతున్నాడు.

అసలేం జరిగింది? తను ఎక్కడున్నాడు? ఏమీ అర్థంగావటంలేదే. తన పేరేమిటి? ఊరేమిటి. ఇది ఏ ప్రాంతం? ఎక్కడికొచ్చాడు.

మానసిక సంఘర్షణలో కొట్టుమిట్టాడుతూ లేచి నిలబడి పరిసరాల్ని గమనించాడు.

చుట్టూ అనేక వృక్షజాతులు, లతలు, పొదలు కన్పిస్తున్నాయి. తన వెనకే దిగువన ఒక వాగు ప్రవహిస్తోంది. ఎగువన వాగునుంచి గొల్లపడుచులు కొందరు కడవలతో నీరు తీసుకుపోతున్నారు.

సమీపంలో ఎక్కడో పిల్లలు ఆడుకుంటున్నట్టు వారి అరుపులు, కేకలు విన్పిస్తున్నాయి. గాలి వాటున మృదుమధురమైన మురళీ నాదం ఒకటి చెవులకు అమృతంలా సోకి మనసును పరవశింపచేస్తోంది. దాంతోపాటుగా మరోపక్క నుంచి గోవుల అంబారవములు మెడలో గంటల సద్దు వినవస్తున్నది.

ఆలోచించేకొద్దీ ఒకటొకటిగా గుర్తొస్తున్నాయి. తన పేరు చరక్. అవును. చరక్ నామధేయం తనది. తన జేజితాతగారు అగ్నివేశాచార్యులవారు. తను కలియుగం అయిదువేల నూట ముప్పై ఒకటో సంవత్సరం వాడు. కలియుగం క్రీస్తు జననం తరువాత 2013 నుంచి వచ్చినవాడు. తనకు వివాహమైంది. తన భార్య శుశ్రుత. తను సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.

ద్వారాకాపురిని చూడ్డం కోసం తన జేజితాతగారు తయారుచేసిన కాలనాళిక యంత్రం ద్వారా ద్వారకాపురికి చేరుకున్నాడు. తన శరీరం అక్కడ కాలనాళిక మందసంలో ఉంది. అదే నిజమైతే తిరిగి తనకీ శరీరం ఎలా వచ్చింది? అది కలా... లేక ఇది కలా? ఏది నిజం? ఇది నిజంగా తన శరీరమేనా?

చేతులు గిల్లుకు చూశాడు. బాధ తెలుస్తోంది. బుగ్గ గిల్లి చూసుకున్నాడు. నొప్పి తెలుస్తోంది. కాలనాళిక మందసంలో ప్రవేశించిన అవే పైజామా, జుబ్బా దుస్తులు ఇప్పుడు తన ఒంటిమీద ఉన్నాయి. అటు సూర్యుడు కన్పిస్తున్నాడు ఇటు ప్రకృతి తెలుస్తోంది. అంటే... ఇదే నిజమా? అదంతా కలా?

సుదీర్ఘమైన కలగన్నాడా? ఇంతకీ ఇది ద్వాపర యుగమా, కలియుగమా... అయిదు నిమిషాల మానసిక సంఘర్షణ తర్వాత గాని వాస్తవంలోకి రాలేక పోయాడు చరక్. తను భ్రమపడుతున్నాడు. ఇది కలియుగం కాదు, ద్వాపరయుగం.

కలియుగం నుంచి వెనక్కి ద్వాపరంలోకి వచ్చాడు. తన జేజితాతగారి ఆశయం నెరవేర్చే ప్రయత్నంలో భాగంగా ఇక్కడికొచ్చాడు. తనకి అదే శాశ్వతం గాని ఇదికాదు.

ఇంతకీ తను మణిభద్రయక్షుని ద్వారకాపురికి చేర్చమని కోరుకుంటే ఎటూగాని చోటుకి చేర్చాడేమిటి? అంటే ఇక్కడికి దగ్గరలోనే ద్వారకాపురి ఉండి ఉండాలి. ఓసారి తను ఏంకోరుకున్నాడో గుర్తు చేసుకున్నాడు చరక్.

"ఓ త్రికాల సంచారా! కురుక్షేత్ర యుద్ధం జరగటానికి ఓ పది సంవత్సరాల ముందు కాలంలో చరక్ అనే నేను కొంతకాలం శ్రీకృష్ణ పరమాత్ముని ద్వారకా నగరంలో నివసించి రావాలనుకుంటున్నాను. నన్ను ద్వారకాపురికి చేర్చు...."

ద్వారకాపురికి చేర్చమని కోరుకున్నాడు గాబట్టి ద్వారక పొలిమేరల్లో ఎక్కడికో తెచ్చి తనను పడేశాడు. అదే ద్వారకపురంలోకి చేర్చమంటే తీసుకొచ్చి నగర మధ్యంలో ఏ పదిమంది పౌరుల మధ్యనో పడేసి ఉండేవాడు. అలా జరిగుంటే తను చాలా ఇబ్బందులు పడేవాడు.

ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? ద్వారక ఎటువుందో ఎవరిన్నా అడిగి తెలుసుకుని అటు సాగిపోవాలి. తను ఉదయం కదా ప్రయాణం ఆరంభించాడు.

ఇప్పుడు మిట్టమధ్యాహ్నం భోజనం వేళగా ఉంది. ఆకలి ఆరంభించక ముందే ఏదన్నా సురక్షితమైన ప్రాంతం చేరుకోవాలి. అంతకన్నా ముందు ఇక్కడి మనుషుల్ని ఓసారి గమనించాలి.

చేతికందిన చక్కగా పండిన జామపండు ఒకటి కోసుకుని తింటూ తనున్న ఎత్తుప్రదేశం నుండి ఏటవాలుగా దిగుతూ వాగుతీరం చేరుకుని తీరంలోని చెట్లమాటుగా కాస్త ముందుకు నడిచాడు.

అక్కడికి దగ్గరలోని చెట్లనీడన ఆడుకుంటున్న కొందరు గోపబాలురు కన్పిస్తున్నారు.

వారి మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి. ఒక పొద మాటున చేరి నిశితంగా గమనించాడు.

చాలా ఆరోగ్యంగా, బలంగా, దృఢంగా ఉన్నారు బాలురందరూ. చిన్న పిల్లాడి నుంచి బాగా ఎదిగిన వారివరకు అంతా మోకాలివరకు పంచెకట్టులో ఉన్నారు. చేతుల్లేని అంగీ ధరించారు. దానికి ఎడంపక్క కట్టుకోడానికి మూడుచోట్ల తాళ్ళు ఉన్నాయి.

కొందరు అంగీ ధరించలేదు. వారిలో ప్రతిఒక్కరి చెవులకు దిద్దులు, కుడికాలికి తోడా కనబడుతోంది. ముఖ్యంగా వారి హెయిర్‌స్టయిల్... కొందరు జుత్తును పెంచి లాగివెనుక ముడివేసుకున్నారు. కొందరు గుండు కొట్టి కుడిమితో ఉన్నారు. కొందరు పిలకబాగా పెంచి పిలక చివర మందారపువ్వు వేల గట్టారు. వారిలో కొందరు కర్రబిళ్ళ ఆడుతున్నారు. కొందరు ఏనుగు తొండం కాయలు

(ఇవి రెండుగుల పొడవున వెడుల్పుగా గట్టిగా కత్తుల్లా ఉంటాయి) వాటితో ఉత్తుత్తి కత్తిసాము ఆట ఆడుకుంటున్నారు. మరికొందరు ఒంటికాలితో దూకుడు ఆటలో ఉన్నారు. ఇలా వారంతా ఆటల రంధిలో పడి పరిసరాల్ని పట్టించుకునే స్థితిలో లేరు.

పావుగంట గమనించిన తర్వాత వారి పామరభాషలో కొన్ని పదాలు మాత్రం అర్థమయ్యాయి చరక్‌కి. అది దేవనాగరి, గుజరాతీ మరికొన్ని అర్థం తెలీని పదాలు కలగలిపిన భాష.

వారిముందు కెళ్ళి వివరాలడగాలనుంది చరక్‌కు. కాని సంకోచం కదలనీయడం లేదు. అందుకు ప్రధాన కారణాలు రెండు. ఒకటి దుస్తులు, రెండోది జుత్తు, నీట్‌గా క్రాఫ్‌చేయించుకుని ఉన్నాడతను.

దేశాచారాలు విదేశీయుల్ని ఇట్టే పట్టిచ్చేస్తాయి. ఏం చేయాలి? ఆలోచిస్తున్న చరక్‌కి అదృష్టమా అన్నట్టు – ఒక గొలపిల్లవాడు కొట్టిన బిళ్ళ గింగిరాలు తిరుగుతూ ఎగిరివచ్చి చరక్ వున్న పొదకు సమీపంలో పడింది. దానికోసం ఓ పన్నెండేళ్ళ బాలుడు అటుపరుగెత్తుకొచ్చాడు. తల మాత్రం పొద వెనుక నుంచి బయటపెట్టి ఆ కుర్రాడ్ని చూశాడు చరక్.

వంగి బిళ్ళతీసుకుంటూ ఆ బాలుడు అప్పుడు గమనించాడు చరక్‌ని.

ఆశ్చర్యంతో అతడి కళ్ళు విశాలమయ్యాయి. "ఎవరు నీవు? ఇచట ఏమి చేయుచుంటివి?" అనడిగాడు. అతడి భావం అర్థమవుతోందిగాని భాష అర్థం గావటంలేదు.

అయినా ప్రయత్నించి చూద్దామని– "వాగులోకి స్నానానికి దిగితే దుస్తులు నీట కొట్టుకుపోయాయి. బదులు రాలేదు" అన్నాడు.

అచ్చమైన దేవనాగరి, గుజరాతీ కలిపిన చరక్ మాటలు ఆ బాలుడికి కొంత వరకు అర్థమయ్యాయి. జాలిగా చూశాడు. హమ్మయ్య అనుకున్నాడు చరక్.

"అయ్యో పాపము. నీ వద్ద దుస్తులు లేవా?" అని అడిగాడు బాలుడు.

"లేవు బాలకా. నాకు సరిపడా ఓ జతదుస్తులు ఇచ్చి పుణ్యం కట్టు కొనుము" కొంచెం ఆ బాలుడి స్టయిల్‌ను అనుకరించి దీనంగా అర్థించాడు చరక్.

"అటులయిన ఇచటనే యుండుము. సుడిలో గృహమునకేగి దుస్తులు తెచ్చి ఇచ్చెద" అంటూ వెనుతిరిగాడా బాలుడు.

"బాలకా మాట" పిలిచాడు చరక్.

"ఏమది అపరిచితుడా?"

"ఏమియును లేదు. నా విషయము నీతోటి బాలురకు చెప్పకుము. పరిహసింతురు."

"అటులనే" అని నవ్వుకుంటూ పరుగుతీశాడా బాలుడు. దగ్గరలోనే ఒక పల్లెగాని, జనావాసంగాని ఉండి ఉంటుందనుకున్నాడు చరక్.

చెప్పినట్టే కొద్ది సమయంలోనే ఆ బాలకుడు చరక్ వద్దకొచ్చాడు. "ఇవి మా సోదరుని దుస్తులు. నీకు సరిపోవును. ధరింపుము" అంటూ ఒక పంచె, ఒక అంగీ చేతికిచ్చాడు.

"చాలా సంతోషం. నీ పేరేమిటి?" దుస్తులు అందుకుంటూ అడిగాడు చరక్.

బాలుడికి అర్థం కాలేదు. "నీ నామధేయమేమి?" వారి పద్ధతిలో అడిగాడు. బాలుడికి అర్థమైనది.

"మదీయ నామధేయము కుందుడు. ఆ కృష్ణస్వామియే గదా మా ప్రభువు. దైవం. అందుకే మదీయ మాతాపితలు నాకు ఆ ముకుందుడి నామము ఉంచినారు" అన్నాడు.

"ఓరి నాయనో... ఇక్కడున్నంతకాలం ఈ ప్రజలతో ఇలా గ్రాంధికం మాట్లాడవలసిందేనా?" అని మనసులో గొణుక్కుంటూ పొదల వెనక్కి వెళ్ళి దుస్తులు మార్చుకున్నాడు చరక్. తన పైజామా జుబ్బాలను ఒక పొద లోనకు పడేశాడు.

సరదాపడి అప్పట్లో జేజితాత అగ్నివేశాచార్యుని వద్ద పంచెకట్టడం నేర్చుకున్నాడు. అదిప్పుడు బాగా ఉపయోగపడింది. అంగీ ధరించి పక్క తాళ్ళు కట్టుకోగానే ఇప్పుడు కొంత మనశ్శాంతి ఏర్పడింది. అతను వెనక్కి వచ్చేసరికి కుందుడు ఇంకా అక్కడే ఉన్నాడు.

చరక్ ఒడ్డు, పొడుగు, అందాన్ని విభ్రాంతుడై అతన్ని గమనిస్తున్నాడు. "బహుసుందరంగా ఉంటివన్నా. ఈ దుస్తులు నీకు సరిపోయినవి. నిన్ను అన్నా అని పిలువవచ్చునా?" అడిగాడు కుందుడు.

"పిలు తమ్ముడూ. నీవొనరించిన ఉపకారము మరువలేనిది" అన్నాడు చరక్.

"నీ నామధేయమేమి?" అడిగాడు కుందుడు.

"నన్ను చరక్ అందురు"

"చరక్?"

"అవును... చరక్"

"చరక్... బహువిచిత్రమగు నామధేయము. ఎచటనుండి వచ్చితివి?"

"పరదేశిని. ఇచట పని దొరకునని వచ్చితి"

"మావలె నీ చెవులకు దిద్దులు లేవేవి? నీ జుత్తు అసహ్యముగా అలా కత్తిరించుకున్నావెందులకు? మీ దేశంలో మాలా జుత్తు పెంచుకోరా?"

"కత్తిరించుకొనుట మా ఆచారము"

"మీ ఆచారమునిచట పరిహసింతురు. ఈ చిరువస్త్రము తలకు చుట్టుకొనుము" అంటూ తన భుజాన తుండుగుడ్డను కూడా తీసిచ్చాడు కుందుడు. ఇదీ ఒకందుకు మంచిదేలే అనుకుంటూ తుండును తలకు చుట్టుకున్నాడు చరక్.

ఇద్దరూ పొదల మాటునుండి – ఆరుబయటకు వచ్చారు. "కుందా?" పిలిచాడు చరక్.

"చెప్పన్నా. వేరేమైనా కావలయునా?" అడిగాడు కుందుడు.

"ఏమియు వలదు తమ్ముడూ. నీ వెచట యుందువు. ఈ బాలు రందరూ ఎచటివారు?"

"అదో... ఆ చెట్లగుబురు వెనుక పల్లెయే మా నివాసము. మేము ఆ పల్లెవాసులము" అన్నాడు కుందుడు.

"అటులనా. మీ పల్లెనుండి ద్వారకాపురి ఏ దిశయందున్నది?" అడిగాడు చరక్.

"భానుడు అస్తమించు దిశయందున్నది" అది పశ్చిమదిశలో ఉందని– చరక్ గ్రహించాడు.

అయినా స్థిరపరుచుకోవడానికి "పశ్చిమదిశయందా?" అనడిగాడు. దానికి తెలీదనకుండా అవుననే సమాధానమిచ్చాడు కుందుడు.

"అటులయిన ద్వారకకు మీ పల్లె ఏ దిశయందున్నది?" తిరిగి అడిగాడు చరక్. "ప్రాక్ దిశయందు. ఇది కూడా తెలియదా?" నవ్వాడు కుందుడు. (ప్రాక్ దిశ అనగా తూర్పుదిక్కు)

"ఇంకను నీకు అవగతము కాలేదా? ద్వారకాపురి నుండి హస్తినకు బోవు రాజమార్గానకు దవ్వులనే కలదు మా పల్లె. ఇంతకూ నీవు ద్వారకకు పోవుచున్నావా, ద్వారక నుండి వచ్చుచున్నావా?"

"సందేహము వలదు బాలకా. ద్వారకకు పోవుచుంటిని. రాజమార్గము చేరుటకు మార్గము జెప్పుము. పోయి వచ్చెద"

"అన్నా, భోజనం వేళ అయినది. మా పల్లెకు రమ్ము. మా ఇంట అతిధ్యము స్వీకరించి ఒకింత సేదదీరి సాయం సమయమున బయలుదేరుము. రమ్ము" అంటూ చేయిపట్టుకున్నాడు కుందుడు. కాదనలేక పోయాడు చరక్.

తనకీ ఆకలి బాధ తెలుస్తోంది. ఇద్దరూ అక్కడికి దగ్గరలోని పల్లెకు నడక ఆరంభించారు.

"ద్వారకాపురి విశేషములేమి కుందా? శ్రీకృష్ణులవారు, బలరాములవారు క్షేమమే గదా?" ఏదో ఒకటి ఆడగాలి గాబట్టి యధాలాపంగా అడిగాడు చరక్.

ఒకరి మాటలు ఒకరికి సగం సగమే అర్ధమవుతున్నాయి. అయినా వారి సంభాషణకు అవి అడ్డంకి గావటంలేదు. చరక్ ప్రశ్న విని సగర్వంగా చూశాడు కుందుడు.

"ఏమంటివి అన్నా. క్షేమములా... సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడే మా శ్రీకృష్ణులవారు. వారి అన్న బలరామ ప్రభువులు. వారికి క్షేమములకు కొరవా! ఇక విశేషములందువా... వచ్చు పున్నమినాటి నుండి శ్రీకృష్ణులవారి జన్మతిధియగు అష్టమి వరకు తొమ్మిది రోజులు మా ద్వారకలో వసంతోత్సవములు వైభవంగా జరగనున్నవి. చూచి తీరవలె" అన్నాడు.

అంటే వసంతోత్సవాలు దగ్గరపడుతున్నాయన్న మాట. సరైన సమయంలోనే తనిక్కడకు చేరుకోగలిగాడు. ఆ సమయంలో బలరామకృష్ణుల్ని ఇతర యోధానుయోధులు ఎందరినో చూడవచ్చు. ఇంత కన్నా అదృష్టం వేరే ఉంటుందా?

కుందుడు ఉండే పల్లె చాలా చిన్నది. ఇళ్ళు తలోచోటా విసిరేసినట్టున్నాయి. ప్రతి ఇంటిచుట్టూ సుమారు ఎకరం ఖాళీస్థలం ఉండటమే అందుక్కారణం.

ఆ స్థలంలో అనేక ఫలవృక్షాలు, పూలమొక్కలు పెంచబడి మధ్యలో గుండ్రంగా వృత్తాకారంలో నిర్మించిన రాతి కట్టుబడి ఇళ్ళు.

కుందుడి తల్లిపేరు కనకవల్లి. ఆమెకు మగపిల్లలు, ఆడపిల్లలు కలిపి పదిహేను మంది సంతానం. కుందుడు ఆఖరివాడు. నలుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అయిపోయాయట. కూతుళ్ళు ముగ్గురూ కాపరాలకు వెళ్ళిపోయారు. కోడళ్ళు, కొడుకులు, పెళ్ళికావలసిన పెద్దపిల్లలు అంతా పొలంలో పనులకెళ్ళిపోయారు. మిగిలిన పిల్లలు ఆటలకెళ్ళి ఇంకా రాలేదు. కుందుడే చరక్‌ను తీసుకుని ముందుగా వచ్చాడు.

ఆవిడ్ని చూస్తే అంతమంది బిడ్డల తల్లి అంటే ఎవరూ నమ్మరు. అంత ఆరోగ్యంగానూ బలంగానూ ఉందా తల్లి. ఇంతవరకు తను గమనించిన మరో ముఖ్య విషయం–

తనే ఆరడుగుల ఎత్తు ఆజానుబాహుడు. కనకవల్లి తనకంటే ఎత్తు ఉంది. మగవాళ్ళు ఎంత ఎత్తు ఉండొచ్చు? ఇంకా ఎవరూ తనకు ఎదురుపడలేదు. అదే నిజమైతే వాళ్ళముందు తనే పొట్టివాడు అవక తప్పదు. కురుసామ్రాజ్యంలో కౌరవులు, పాండవులు ఎంత ఎత్తుంటారు?! అసలే క్షత్రియులు యుద్ధవిద్యల్లో ఆరితేరినవాళ్ళు.

అతిధిగా వచ్చిన చరక్‌ను కన్నతల్లిలా ఆదరించింది కనకవల్లి. నాలుగు రకాల పిండివంటలు, పదిరకాల కూరలు పచ్చళ్ళతో భోజనం వడ్డించింది. ఆ యింట్లో కంచాలు, చెంబులు బిందెలు కూడా వెండిపాత్రలు. ఇక కనకవల్లి ధరించిన బంగారు నగల గురించి చెప్పనక్కర్లేదు. మహాలక్ష్మిలా ఉంది.

జొన్నరొట్టె విరిచి పేరిన నెయ్యి వేసిన పప్పులో ముంచి తింటుంటే ఆ కమ్మదనం వర్ణింపనలవికానిది. ఇక గడ్డపెరుగు అమృతతుల్యంగా ఉంది. ఇంత చక్కటి భోజనం కలికాలంలో లభించే ఛాన్సే లేదనిపించింది.

ఆహాఏమి ఈ యాదవరాజ్యంలో ప్రజల అదృష్టం. ఏమి ఈ వైభవము. భోంచేయగానే కనకవల్లి వద్ద సెలవు తీసుకుని బయలుదేరాడు చరక్.

"బిడ్డా. ఏ తల్లి కన్నబిడ్డడివో నాయనా. నీకే సాయం కావాలన్నా మా ఇంటికి రా. మా ఇంటాయన నిన్ను జాచిన ముదమందెదరు" అంటూ వెనకనుండి అరిచిందావిడ. కుందుడు కొంతదూరం సాగనంపడానికొచ్చి ద్వారకాపురి వెళ్ళు రాజమార్గమును చూపించి వెనక్కి వెళ్ళిపోయాడు.

* * * * *

సువిశాలమైన మార్గం అది. హస్తినాపురి వరకు వెళ్తుందట కుడిపక్కగా బోతే. ఎడం పక్కగా బోతే కూతవేటు దూరంలోనే ద్వారకాపురి ఉందట. అయినా కూడా తక్కువలో తక్కువ అయిదు కిలోమీటర్లు దూరం ఉండొచ్చని ఊహించాడు చరక్.

రాజమార్గం పొడవునా అటు ఇటూ ఎత్తైన వృక్షాలు పెంచబడి చెట్ల నీడన ఎండతాపం తెలియకున్నది.

మార్గం వెంట గుంపులు గుంపులుగా వర్తకులు బాటసారులు నడచి పోతున్నారు. ఎడ్లబండ్లు సాగిపోతున్నాయి. రథాలు, గుర్రాలు ఎదురవుతున్నాయి. చరక్ వాళ్ళ ఎత్తు చూస్తూనే స్తంభించిపోయాడు. ఎవరూ 13, 14 అడుగుల ఎత్తుకి తక్కువ లేరు.

ద్వారకాపురి దిశగా నడక ఆరంభించాడు చరక్. నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. ఏ కాలంలో అయినా ప్రజాజీవనాన్ని శాసించేది ధనం. అది లేకుంటే బతుకు లేదు. తనొచ్చి ఇక్కడ పడ్డాడు. తన చేతిలో చిల్లి గవ్వలేదు. ఏదో కుందుడి పుణ్యమాని అతిధిగా ఆ ఇంట ఈ పూట గడిచిపోయింది. సాయంత్రం ఏం చేయాలి? ఎక్కడ తినాలి, ఎక్కడ పడుకోవాలి?

చరక్ ఆలోచనలు ఉన్నట్టుండి ఆగిపోయాయి. అతడు వెళ్తున్న మార్గంలో ఎడంపక్క ఒక ఎత్తయిన శాలివృక్షం నీడలో తిన్నెమీద కూర్చునున్నాడు సాధువు.

సుమారు డెబ్భై సంవత్సరాల వయసుంటుంది. జుత్తు జడలుకట్టి గడ్డం మీసాలు పెరిగి నుదుట విభూదిరేఖలు కావిపంచె కట్టుకుని విగ్రహంలా కూర్చునున్నాడు. చేతిలో త్రిశూలం ఉంది.

శివ భక్తుడు గావచ్చు. దూరం నుంచే ఏకదీక్షగా తనవంక చూస్తున్నా డాయన. సమీపంలోకి రాగానే చిరునవ్వు నవ్వుతూ దగ్గరకు రమ్మని చేత్తో సైగ చేస్తున్నాడు. ఎందుకో చరక్ ఒళ్ళు జలదరించింది. దగ్గరకు వెళ్ళడమా వద్దాని సందేహించాడు.

ఇలాంటి మహనీయుల ముందు తను అబద్ధాలు చెప్పలేడు. చెప్పక పోయినా వారికి తెలిసిపోతుంది. తను కలియుగం నుంచి ద్వాపరయుగంలోకి వచ్చినట్టు కనిపెట్టే ప్రమాదం ఉంది.

కాబట్టి వెళ్ళకపోవడమే మంచిదనిపించింది. ఆయన రమ్మని సైగచేస్తున్నా చూసీచూడనట్టు తలవంచుకుని నడక వేగం పెంచి ముందుకు సాగిపోయాడు చరక్. మరికొంత దూరం ముందు కెళ్ళేసరికి గుర్రాలమీద సవారీచేస్తూ కొందరు యువకులు ఎదురయ్యారు. అవి చరక్‌ను దాటిపోయాయి.

చరక్ గమనించలేదుగాని ఒక గుర్రంమీది యువకుడు చరక్‌ను తదేక దృష్టితో చూడసాగాడు.

చరక్‌ను దాటగానే అశ్వాన్ని నిలువరించి వెనక్కి తిప్పి "బావా" అని పిలిచాడు.

నడిచిపోతున్న చరక్ ఆ పిలుపు విన్నాడు. తనను కానట్టు వడివడిగా నడవసాగాడు. అంతలో "బావా... నిన్నే బావా... ఆగు" అంటూ రెండోసారి కూడా పిలవటంతో యధాలాపంగా తిరిగిచూశాడు చరక్. సందేహం తీరిపోయింది. ఆ గుర్రం మీది యువకుడు పిలుస్తోంది తననే. ఇదేమి చోద్యము?

ఆశ్చర్య సంభ్రమాల మధ్య తలక్రిందులైపోయాడు చరక్. యుగంగాని యుగంలో, కాలంగాని కాలంలో, దేశంగాని దేశంలో తన వెంటపడుతున్న ఈ బావమరిది ఎవడ్రా బాబు. ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నాడో. ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ నడకవేగం పెంచాడు చరక్. ఆ అశ్వం తనను సమీపించే సమయానికి బాటసారుల గుంపులో చొరబడి అతనికి కనబడకుండా తప్పించుకున్నాడు.

ఆ యువకుడు బాటసారుల గుంపును చుట్టి గుర్రాన్ని పరుగెత్తించి చరక్‌ని గానక, వచ్చినవాడు వచ్చినట్టే వెనక్కిపోకుండా తిరిగి తన అశ్వాన్ని వేగంగా ద్వారకాపురి దిశగా పరుగెత్తించాడు.

ఆ అశ్వం కనుమరుగు అవగానే తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ బాటసారుల గుంపులోంచి బయటపడి నడక వేగం పెంచాడు చరక్.

* * * * *

"అదిగో ద్వారక... అలమందలవిగో...."

గయోపాఖ్యానం నాటకం నుంచి పద్యాన్ని గుర్తుచేసుకుంటూ స్తబ్ధుడై ఉన్నచోటనే అలా నిలబడి పోయాడు చరక్. అక్కడికి ద్వారక కన్పిస్తోంది. బాటకి

ఇరువైపులా మందలు మందలుగా పచ్చికలో తిరుగుతున్న ఆలమందలూ కన్పిస్తున్నాయి.

ఏ ఆవును చూసినా ఏ గోవును చూసినా ఆరోగ్యంతో అందంగా మిసమిస లాడుతున్నాయి.

ఒక్కో గోవు ఒక కామధేనువులా అలరారుతోంది. సముద్ర తీరానికి సుమారు మైలు దూరంలోని ఎత్తయినచోట నాలుగు రహదారుల కూడలి ఉంది.

అక్కడికి చేరుకోగానే ఒక్కసారిగా కళ్ళముందు సాకారమైన ద్వారకాపురిని గాంచి ఒడలు పులకరించి కళ్ళవెంట ఆనందబాష్పాలు పొంగుతుండగా మాధవుని తలచుకుని ద్వారకాపురికి నమస్కరిస్తూ అక్కడే నిలబడిపోయాడు చరక్.

అతడి మస్తిష్కంలో అనేక ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. అప్పటికి పొద్దు పడమటకు వాలింది. సమయం సాయంత్రం మూడు గంటలు కావచ్చు. దినకరుని ఎండ ద్వారకాపురిలోని గోపురాలమీది మణిమయ బంగారు తొడుగులమీద ప్రతిఫలించి కనులకు మిరుమిట్లు గొలుపుతూ ఒక సూర్యుడు అస్తమయానికి పోతుంటే మరో సూర్యుడు ఉదయిస్తున్నాడా అనే భ్రమ కలిగిస్తోంది.

అద్భుతమైన ఆ దృశ్యాన్ని చూస్తూ చరక్ మనసు సంతోషంతో ఉరకలు వేస్తోంది. అగ్నివేశాచార్యుడు గుర్తుకొస్తున్నాడు. ఏ మానవుడూ కలలో కూడా చూడలేని ద్వాపరకాలాన్ని ద్వారకాపురిని, ఆలమందల్ని, నాటి మనుషుల్ని, వాహనాల్ని నా కట్టెదుట నిలిపినావే. ఆహాఁ జేజి తాతయ్యా. ఎంత అదృష్టాన్ని కల్పించావయ్యా నాకు. నీవెంత గొప్పవాడివి.

ఆ విశ్వామిత్రమహర్షి త్రిశంకు మహారాజు కోసం త్రిశంకు స్వర్గాన్ని నిర్మిస్తే, నువ్వు నాకోసం ద్వాపరయుగాన్నే తిరిగి కళ్ళముందుకు తెచ్చావ్. ధన్యుడ్ని జేజి తాతయ్యా. ఈ పుణ్యభూమిలో కాలుమోపిన నా పూర్వజన్మ సుకృతం ఎంత గొప్పది? ఓహోహో... ఏమి ఈ మహాద్భుతము.

జేజితాతయ్య ఇంతవరకే ద్వారకానగర పొలిమేరన ద్వారకను వీక్షించి వెనక్కి వచ్చుంటాడు. కాని తను... ద్వారకానగరంలో ప్రవేశించబోతున్నాడు. అదృష్ట మంటే తనదే గదా!

ఈ మార్గంలోనే శ్రీకృష్ణ సందర్శనార్థం ధర్మరాజు భీమార్జున నకుల సహాదేవులు ద్వారకకు రథాల్లో ప్రయాణించి ఉంటారు?

కురుక్షేత్ర సంగ్రామంలో తనపక్షాన సాయంచేయమని అర్థించడానికి మానధనుడు సుయోధన సార్వభౌముడూ ఇటే ద్వారకకు వెళ్ళుంటాడు గదా.

అర్జునుని భార్య సుభద్ర పెరిగి పెద్దయి పార్థుని వివాహమాడి వెడలినది ఈ నగరం నుంచే గదా. అంతేనా! కృష్ణభగవానుడి గురుదేవుడు సాందీపుడు, కృష్ణుని సహాధ్యాయి బాల్యమిత్రుడు అయిన కుచేలుడు ఆర్థికసాయం ఆశించి కృష్ణదర్శనార్థం నడచి వచ్చినది ఈ నేలమీదే గదా.

మహర్షులు, యోగులు, పురాణప్రసిద్ధపురుషులు నడయాడిన మార్గంలో తనిప్పుడున్నాడే. కలియుగంలో ఏ మానవునికీ దక్కని అదృష్టం తనకు దక్కినదే... ఓ మాధవా... రుక్మిణీవల్లభా... రాధామానసచోరా... లీలామానుషవేషధారీ... ఓ ముకుందా పరమాత్మా.

నీ అనుమతి లేకుండా కలియుగం నుంచి ద్వాపరయుగాని కొచ్చి నీ ద్వారకానగరంలో ప్రవేశించబోతున్నాను తండ్రీ. నామీద ఆగ్రహింపక కనికరించు. ఇక్కడున్నన్ని రోజులు నీవే నాకు రక్ష. పాహి... పాహిమాం' అనుకుంటూ చేతులు జోడించి భక్తితో ద్వారకాపురికి నమస్కరించాడు చరక్.

బాటసారులు ఎందరో వెళ్తున్నారు, వస్తున్నారు. ఎడ్లబండ్లు, రథాలు కూడా ప్రయాణించాయి. రథాలకు బండ్లకు కంచు, ఇత్తడిలోహాలు, లోహపు తొడుగులే వాడబడుతున్నాయి. ఇనుము ఉక్కు సంబంధమైన వేవీ కన్పించలేదు. మరి కత్తులు, ఈటెలు బాణాల వంటి ఆయుధాలను ఏ లోహంతో చేస్తారో.

చీకటిపడకముందే ద్వారకలో ప్రవేశించాలన్న తలంపుతో తిరిగి నడక ఆరంభించాడు చరక్. గాలిరివ్వున వీస్తోంది. సముద్రగాలి క్షణానికోవిధంగా ఉంటుంది. కెరటాల హోరు వినబడుతోంది.

తీరం నుండి ద్వారక ఉన్న దీవికి చేర్చే మార్గం గీత గీసినట్టు నేరుగా కనబడుతోంది. గాలికి తల తుండు ఎగిరిపోకుండా బలంగా చుట్టుకున్నాడు. అది ఎగిరిపోతే తన గుట్టు బయటపడుతుంది.

జుత్తు కత్తిరించుకున్న తనను వింతగా చూసి నవ్వుతారు. సందేహిస్తారు. కాబట్టి తుండు విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ బాటసారులతో కలసి మౌనంగా ముందుకు సాగాడు చరక్. క్రమంగా తీరం దగ్గిర పడుతోంది. ఎదురుగా ద్వారకకు తీరం నుండి అనుసంధానంగా నిర్మించబడిన విశాలమైన రాతిమార్గం చేరువ వుతోంది. తను ఊహించినట్టు అది చిన్న మార్గం ఏమీ కాదు. పది లారీలు ఒకేసారి పక్కపక్కనే పోగలిగినంత విశాల నిర్మాణం.

సముద్రాన్ని రెండుగా చీలుస్తూ దీవివరకు నిర్మించబడివుంది. దానికి ఎడంభాగంలో దూరంగా తీరంలో మత్స్యకారుల నివాసగృహాలు వారి పడవలు గోచరిస్తున్నాయి. తాళ్ళమీద ఆరేసిన వలలు గాలికి ఎగురుతున్నాయి. కుడిపక్క అదే పెద్ద ఊరులాగే ఉంది. పొడవునా అనేక గృహాలు పెద్ద పెద్ద షెడ్లు దర్శనమిస్తున్నాయి. అక్కడ పడవలు, పెద్ద ఓడల తయారీ సాగుతోంది.

కార్మికుల నివాసాలూ అక్కడే ఉన్నాయి. అక్కడికింకా ఎగువన ఓడరేవు కనబడుతోంది. తీరంలో నిలిచిన ఓడలు వాటి తెరచాపల్ని చూడగలుగుతున్నాడు చరక్. దానికి అవతల గోమతీనది సముద్రంలో కలిసే సంగమప్రాంతం ఉండి ఉండాలి.

ఈ విషయంలో ద్వారకమీద అనేక పరిశోధనలు చేసి ద్వారక నీట మునిగింది నిజమని ససాక్ష్యాలతో ప్రపంచానికి చాటిన ప్రొఫెసర్ షికారిపూర్ రంగనాధరావు గారిని అభినందించాలి. ఆయన చెప్పిన విషయాలనేకం తనిక్కడ చూస్తున్నాడు.

అలాగే తీరం నుండి సముద్రం మీదికి బాట ఆరంభమైన చోట ఒక పక్కగా తీరంలో ఒక ఎత్తయిన దేవాలయం దర్శనమిస్తోంది. అది ఎవరిదో అర్థంకాలేదు. అటూ ఇటూ చూసి ఒక వృద్ధుడి పక్కకు చేరాడు చరక్. "అయ్యా, ఆ కనబడు ఆలయమెవరిది?" వారి భాషలోనే అడిగాడు.

ఆ వృద్ధుడు చరక్‌ను ఎగాదిగా చూశాడు.

"తొలిసారిగా ద్వారకకు వచ్చుచున్నావా?" ప్రశ్నించాడు. "అవును"

"పరదేశివా?"

"అవును" "నీ భాష సరిగా లేదేమి?"

"చెప్పితినిగదా. పరదేశిని" "మీదే భాష?"

"ఇది నా ప్రశ్నకు ప్రత్యుత్తరము గాదు"

వృద్ధుడు నవ్వి భుజం తట్టాడు. "తప్పుగా అనుకోవద్దులే యువకుడా. నాక్కాస్త చాదస్తము అధికము"

"ఆ ఆలయము సముద్రనారాయణుల వారిది. అడిగిన వెంటనే నగర నిర్మాణానికి సముద్రంలో స్థలమిచ్చిన ఉదారుడాయన. అందుకే మా కృష్ణ భగవానుడు ఆ సముద్ర నారాయణునికి ఇచ్చట ఆలయం నిర్మించారు. నగర ప్రవేశానికి వెళ్ళే వారు ఆయనను దర్శించుకొని వెళ్ళుట ఇచటి యాచారము. కాని అనేకులు పాటించుటలేదు.

ద్వాపరం ముగిసి కలి ప్రవేశించు కాలము సమీపించుచున్నది గదా. మానవులందు ఇప్పటి నుండియే మార్పు కానవచ్చుచున్నది" అంటూ మరోమారు నవ్వి తన దారిన ముందుకు పోయాడు వృద్ధుడు.

సముద్ర నారాయణుని ఆలయం కలియుగంలో నేటికీ ఉన్నమాట నిజమే.

ఓసారి ఆ స్వామిని దర్శించుకొని వెళ్ళాలనుకుంటూ అటు చూసి విశ్శేష్టుడై వేగంగా పక్కకు తిరిగాడు చరక్. ఇంతకుముందు దారిలో తనను బావా అని పిలిచిన ఇరవైయ్యేళ్ళ యువకుడు అదే గుర్రం మీద అచట ఉండి ద్వారకవైపు రాతిబాట మీద ప్రవేశిస్తున్నవారిని పరిశీలిస్తున్నాడు.

తను చాలదన్నట్టు మరో ఇద్దరు యువకుల్నీ తీసుకొచ్చాడు. వాళ్ళంతా అశ్వారూఢులై ఉన్నారు. చరక్ గుండెలు దడదడలాడాయి. వాళ్ళ చేతుల్లో పడితే కొత్తచిక్కులు ఏమొస్తాయో తెలీదు. కనుచీకటి పడేవరకు అటు ఓడరేవు ప్రాంతంలో సంచరించివస్తే మంచిదనుకుంటూ దారి మార్చి ఓడరేవు మార్గాన్ని పట్టాడు.

మహాభారతకాలం నాటి దేశకాల పరిస్థితులు తెలియాలంటే ముందుగా నాటి దేశ నైసర్గిక స్వరూపం గురించి కొంత తెలుసుకోవాలి. సుమారు అయిదు వేల నూట ముప్పైఐదు సంవత్సరాల క్రితం 5,130 సం॥ దేశ నైసర్గిక రూపం విశాలమైంది. ముఖ్యంగా దక్షిణ భారత దేశం కూడా ఉత్తరభారతంలాగే సువిశాలంగా వెడల్పు కలిగి ఉండేది– తూర్పు, పడమరలకు.

కలియుగారంభ కాలం తర్వాత ప్రకృతిలో చోటుచేసుకున్న పరిణామాల క్రమంలో బంగాళాఖాతంలో తరచూ ఏర్పడే తుఫానుల తాకిడికి దక్షిణ భారత తూర్పు తీర ప్రాంతమంతా కోతకు గురై తరిగిపోతూ సముద్రంలో కలసిపోవడం వలన వెడల్పు తగ్గిపోయి నేడు మనం చూస్తున్న షేపులో ఉంది. దీన్ని బలపరిచే ఒక అద్భుతమైన సాక్ష్యం కూడా ఉంది.

మహాబలిపురం తీరంలోని గుడి పల్లవరాజుల శిల్ప సంపదకేకాదు, గుడికీ ప్రసిద్ధే. ఈ గుడి ఏ కాలంలో ఎవరు కట్టారో, దాని చరిత్ర ఏమిటో ఖచ్చితంగా చెప్పగలిగినవాళ్ళు ఇప్పుడు లేరు.

అతి ప్రాచీనమైన గుడి. లోన శివలింగం వంటి ఆరడుగుల రాతిస్తంభం మీద ఒకవైపు శివుడు, మరోవైపు కేశవుడు చెక్కబడి ఉంటారు.

ఈ గుడిలో పూజలు జరగవు. పురాతన ఆలయంగా వచ్చి సందర్శించి పోతుంటారు సందర్శకులు.

పూర్వం ఎప్పుడో కలియుగం ఆరంభమైన కొంతకాలం తర్వాత, సముద్ర తీరం నుండి యోజనానికి ఒక్కటి చొప్పున అలాంటివి వరుసగా ఏడు గుళ్ళను నిర్మించారట. ఏడో గుడి కూడా సముద్రంలో మునిగినప్పుడు భూమిపైన పెను విపత్తు ఏర్పడుతుందని చెప్పారట. అదే విధంగా కాలప్రవాహంలో ఒక్కోగుడి సముద్రంలో మునిగిపోతూ ఆరుగుళ్ళు పోగా చిట్టచివరి ఏడో గుడి ఇప్పుడు మనం చూస్తున్న గుడి.

ఈ గుడి కూడా పందొమ్మిది వందల ఎనభైతొంభై దశకాల మధ్యనాటి వరకూ సముద్రంలో కలసిపోయే పరిస్థితికి చేరువైపోయింది. సముద్ర కెరటాలు గుడి రాళ్ళను తాకి నీళ్ళు లోన శివలింగం మీదకు చెదిరి పడేవి. పర్యాటకులూ తడిసేవారు.

గుడి కృంగిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రమాదం గ్రహించిన తమిళనాడు ప్రభుత్వం వెంటనే గుడికి ఎడంగా తీరం వెంట ఒక కాంక్రీట్ గోడను లేపి మట్టితో నింపి గుడిని మరమ్మత్తులతో బాగుచేయించగా ఇప్పుడు మనం చూస్తున్న మహాబలిపురం గుడి దర్శనమిస్తోంది. జలగర్భంలో మునిగిన ఆరుగుళ్ళూ నేటికీ ఉన్నాయని సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పుడు చేపల పడవమీద పోతుంటే అవి కన్పిస్తుంటాయని జాలర్లు చెప్తుంటారు.

కాబట్టి దక్షిణ భారతం కూడా ఆ కాలంలో విశాలమైన భూభాగాలతో అలరారేది. ఇక మహాభారత కాలంనాటికి అంటే ద్వాపరం చివరికాలంలో దేశంలో చిన్నాపెద్ద అనేక రాజ్యాలుండేవి. వాటిలో నగర రాజ్యాలుకూడా ఉండేవి. ఒక నగరం దారి పరిసరాల్లో చిన్న పల్లెలు, గ్రామాలు ఆ సమీప అరణ్యాలు మాత్రమే రాజ్యంగా కలిగివుండే అతిచిన్న దేశాలు.

అప్పటికి ప్రపంచవ్యాప్తంగా చూస్తే హిందూమతం తప్ప మరో మతమంటూ లేదు. బౌద్ధమతం, క్రీస్తు మతం, షింటో మతం, యూదుమతం ఇలా ఇప్పుడున్న వాటిలో ఏ ఒక్క మతమూ లేదు. ఉన్నది హిందూ మతం ఒక్కటే. ఇంకా చెప్పాలంటే హిందూమతం అనేది ఒక మతం కాదు. ప్రకృతితో మానవుడు మమేకమై దైవాన్ని తెలుసుకుని అనుసరిస్తూ ఆచరిస్తూ వచ్చిన భక్తి మార్గంలోని పద్ధతులు.

వాటినే తర్వాతకాలంలో హైందవమని, హిందూ మతమని అన్నారు. ఆనాడు ఎర్రసముద్ర తూర్పు తీరం నుంచి ఆసియా ఖండం అంతటా ఉన్నది హిందూమతం మాత్రమే.

దీని ఛాయలు నేటికీ చైనా, థాయ్‌లాండ్, మలేషియా, కాంబోడియా, మంగోలియా, నేపాల్, భూటాన్, మయన్మార్, లావోస్, వియత్నాం, సింగపూర్, బ్రూనె, ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్, నార్త్ అండ్ సౌత్ కొరియా, ఇండోనేషియా వంటి దేశాల్లో చూడొచ్చు. హిందూ ఆలయాల్ని కూడా చూడొచ్చు.

ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ఆలయం ఒకప్పుడు కాంభోజ దేశంగా పిలవబడిన నేటి కంబోడియా దేశంలో ఉందని, చైనాలో కూడా ప్రాచీన హిందూ ఆలయాలున్నాయని చాలామందికి తెలీదు.

గల్ఫ్ దేశాల్లో త్రవ్వకాల్లో అనేక హిందూదేవతా ప్రతిమలు బయటపడటం గురించి కూడా చాలామందికి తెలీదు. ఆ కాలంలో ఆటవికులు, సంచారతండాలు, కొండకోనలు, రాళ్ళు రప్పలకు దేవుడిపేరుతో జంతుబలులిచ్చి కొలుపులుచేయటం జరిగేది. ఇప్పటికీ మనలో ఈ ఆచారం ఉంది. వారి పూజల్ని మనం ఒక మతంగా చెప్పుకోలేం.

దేశంలో కురుసామ్రాజ్యం పెద్దది. సుయోధనుడు సార్వభౌముడయ్యాక అనేక దేశాధిపతుల్ని ఓడించి సామంతుల్ని చేసుకున్నాడు.

కురుసామ్రాజ్యం తర్వాత చెప్పుకోతగిన పెద్ద దేశం యాదవరాజ్యం. ఆనాటి రాజ్యాల గురించి చెప్పుకోవాలంటే ముందుగా గాంధార దేశం గురించి చెప్పుకోవాలి. ధృతరాష్ట్రుని భార్యగాంధారి. గాంధార దేశ రాజకుమారి.

ఈ గాంధార దేశమే నేటి ఆఫ్ఘనిస్తాన్. గాంధార శబ్దమే కాంధహార్ అయింది.

విదర్భ... నేటి అరుణాచల్ ప్రాంతమే విదర్భ దేశం. రుక్మిణీదేవి ఆ దేశ రాకుమారి. అంగదేశం- నేటి బీహార్ ప్రాంతమే నాటి అంగదేశం. ఈ అంగరాజ్యానికి కర్ణుని రాజును చేయటం ద్వారా దుర్యోధనుడు కర్ణుడ్ని తనమిత్రుడ్ని చేసుకున్నాడు.

అలాగే వంగదేశం- ఇది నేటి బెంగాలు ప్రాంతం. కళింగదేశం- ఇది నేటి ఒరిస్సా ప్రాంతం. కాంభోజదేశం-నేటి కంటోడియా. ఘూర్భరదేశం-ఇది నేటి బర్మాప్రాంతం. నేపాళదేశం-నేటి నేపాల్. పాంచాల దేశం - నేటి పంజాబ్. ఇంకా మాళవ - చేది- మత్స్య-విరాట వంటి అనేక చిన్న దేశాలుండేవి. తర్వాతి కాలంలో మాళవదేశం సామ్రాజ్యంగా విస్తరించింది నాటికి అది చిన్నదేశమే.

దక్షిణాదిన చెప్పుకోతగ్గ ఒక దేశం ఉండేది. అదే నేటి కేరళ ప్రాంతం. అప్పట్లో ఇది స్త్రీల రాజ్యం. అన్ని దేశాల్లోను పితృస్వామ్యం అమల్లో ఉంటే- అక్కడ మాత్రం మాతృస్వామ్యం ఉండేది. ఈ ఆచారాన్ని ఇప్పటికీ కేరళలో చూడొచ్చు. పెత్తనమంతా తల్లిదే.

తండ్రి బాధ్యత సంపాదించటం వరకే. ఆస్తిపాస్తులన్నీ తల్లిపేరనే ఉంటాయి. ఆడపిల్ల అత్తారింటికెళ్ళినట్టు కొడుకులు అత్తారిళ్ళకు వెళ్ళిపోతారు.

ఆనాటి స్త్రీ సామ్రాజ్యానికి ప్రమీలారాణి రాణిగా ఉండేది. ఆమె పురుషద్వేషి. ఆ దేశంలో ఆడాళ్ళు మగాళ్ళను లెక్కచేయకుండా నానాబాధలు పెట్టేవారు. ఈ ప్రమీలారాణిని తమిళంవారు అల్లిరాణి అంటారు. మగాళ్ళని లెక్కచేయకుండా శాసించినట్టు మాట్లాడే స్త్రీని అల్లిరాణితో పోల్చి చెప్పుకుంటా రక్కడ.

పురుషద్వేషి అయిన ఈ ప్రమీలారాణి గర్వం అణచి బుద్ధిచెప్పడం కోసం కృష్ణార్జునులు మారువేషంలో ఆ రాజ్యంలోకి వెళ్ళటం, ప్రమీలా అర్జునుల ప్రణయంతో ప్రమీలార్జునీయంగా ఒక ప్రణయగాధే ఉంది.

ఇక ఆంధ్రులు ఎప్పటివారు? వారు కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నారా లేదా అనే సందేహం కలగటం సహజం. ఆంధ్రప్రాంతంతో పాండవులకు ప్రత్యేక అనుబంధం ఉంది. విశ్వామిత్రుని కొడుకుల్లో అంధకుడు, పుళిందుడు అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారిలో అంధకుని సంతతే ఆంధ్రులు. పుళిందుని సంతతి పుళిందులు.

ఆంధ్రులు పుళింద జాతివారితో కలసి అక్షునదీ తీరంలో నివసించినట్టుగా తైత్తరీయ బ్రాహ్మణం చెప్తోంది. (ఈ అక్షునది ఇప్పుడుందా ఉంటే ఏ పేరుతో పిలవబడుతోందో తెలిసినవారు ఉంటే దయచేసి తెలుపగలరు)

ఆంధ్రజాతి, పుళిందజాతి కూడా అభివృద్ధి చెంది రాజ్యాలు నిర్మించు కున్నారు. తర్వాత పరిణామాల్లో జరిగిన యుద్ధాల్లో ఓడిపోయిన పుళిందజాతివారు ఆంధ్రజాతిలో మమేకమైపోయారు. ఆంధ్రసేనలు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో పాల్గొన్నమాట అక్షరాలా నిజం.

ఇక పాండవులకు ఆంధ్రప్రాంతంతో గల అనుబంధం ఏమిటి...? లక్క గృహదహనం నుండి ప్రాణాలతో తప్పించుకుని బయటపడ్డ తర్వాత ఇక్కడ ఉంటే కౌరవులనుంచి తమకు ప్రాణహాని తప్పదని భావించింది కుంతీదేవి. శ్రీకృష్ణుని సలహామేరకు పాండవులు దూరంగా దక్షిణభారతం వైపు వచ్చి 'ఏకచక్రపురం' చేరుకున్నారు.

ఈ ఏకచక్రపురం ఆంధ్ర ప్రాంతం. 'కరిపురం' అనే గ్రామం సమీపంలోనే ఈ ఏకచక్రపురం ఉండేది. ఆ నగరాన్ని ద్రుపద రాజు పరిపాలించేవాడు. పాండవులు బ్రాహ్మణవేషధారులై భిక్షాటన చేస్తూ కొంతకాలం ఇక్కడ ఉన్నారు.

ఏకచక్రపురం ఉండగా రెండు ముఖ్యమయిన ఘట్టాలు జరిగాయి. వాటిలో ఒకటి బకాసుర వధ, రెండోది ద్రౌపది వివాహం. ఏకచక్రపురం వచ్చేసరికి పాండవులు యుక్తవయస్కులై ఉన్నారు. మహా బలాఢ్యుడు భీమసేనుడు. (భీమసేనుడి ఎత్తు 24 అడుగులపైనే అని చారిత్రక ఆధారాలు)

బిడ్డల ఆకలి తల్లికి తెలుసంటారు. ఎవరికి ఎంత ఆకలో కుంతీదేవికి తెలుసు. భిక్షాటనతో తెచ్చిన వాటిలో స్వయంపాకం చేశాక మొత్తాన్ని ఒక పళ్ళెరంలో పరిచి అందులో సగం ఒక వాటా చేసి మిగిలిన సగాన్ని తనతో కలిపి అయిదు వాటాలు చేసి వడ్డించేది కుంతీదేవి. సగం వాటా భీముడిది.

ఇలా ఉండగా అప్పటికే ఏకచక్రపురం ప్రజలు బకాసురుడనే రాక్షసుని మూలంగా అగచాట్లు పడుతున్నారు. ఊరిమీదపడి దొరికినవాళ్ళను దొరికినట్టు చంపి తినిపోతున్నాడు. ఈ బాధపడలేక ఆ రాక్షసుడితో ఒక ఒప్పందం చేసుకున్నారు.

దాని ప్రకారం రోజూ ఒక బండెడు కుంభంతో బాటు, ఇంటికో మనిషి. ఆ ఎడ్లబండిని తోలుకుని బకాసురుని వద్దకెళ్ళగా, వాడు ఆ మనిషిని, ఎడ్లను, భోజనాన్ని తృప్తిగా ఆరగించేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు కుంతీదేవి ఉంటున్న ఇంటి పక్క బ్రాహ్మణ కుటుంబం వంతు వచ్చింది. భర్తలేడు. ఉన్న ఒక్క కొడుకును బకాసురుడు తినేస్తే తన గతి ఏమిటని ఆ గృహస్తురాలు గోలుగోలున విలపిస్తుంటే కుంతీదేవి జాలిపడింది.

"అమ్మా బాధపడకు. నీకు ఒక్కడే కొడుకు. నాకు అయిదుగురు కొడుకులు. వారిలో ఒకడ్ని పంపిస్తాను. ధైర్యంగా ఉండు" అని ఓదార్చింది.

బ్రాహ్మణ యువకునికి మారుగా భీమసేనుడ్ని పంపి ఆ బకాసురుడ్ని వధించి ఏకచక్రపురాన్ని కాపాడమని చెప్పింది.

కుంభంతో ఉన్న బండితీసుకుని బయలుదేరాడు భీమసేనుడు. అసలే భిక్షాటనచేసి తెచ్చుకున్న భోజనంతో అర్ధాకలితో మాడుతున్నాడు భీముడు. బండెడు కుంభం, అందులో అనేక పిండివంటలు, మధురభక్ష్యాలు చూడగానే నోరూరింది భీముడికి.

ఆకలి భగ్గుమంది. ఇక ఊపేక్షించకుండా బండెడు భోజనం స్వాహాచేసి అదే బండిలో హాయిగా గురకపెట్టి నిద్రపోయాడు. ఖాళీబండిని చూసి బకాసురుడు ఆగ్రహంతో వేసిన రంకెలకు భీమసేనుడు లేచాడు. అంతే ఇద్దరికీ ఘోరయుద్ధం జరిగింది.

వృక్షాలను పెకలించి కొట్టుకున్నారు. బండరాళ్ళతో మోదుకున్నారు. ఆ భయంకరమైన యుద్ధంలో భీముడు బకాసురుడ్ని వధించాడు.

ఆ విధంగా బకాసురుడ్ని వధించి భీముడు విజయం గాంచిన చోట భీమ విజయపురి అనే ఒక ఊరు ఏర్పడి కాలక్రమంలో అదే భీమిలీ అయింది. వైజాగ్ సమీపంలోని భీమిలీ అదే.

బకాసురవధకి ఇక్కడ అత్యంత ప్రాధాన్యత ఉంది. భీమసేనుడు, బకాసురుడు, జరాసంధుడు, విరాటరాజు బావమరిది కీచకుడు, దుర్యోధనుడు ఈ అయిదుగురూ ఏకనక్షత్ర జనితులు. అంటే ఒకే నక్షత్రంలో పుట్టినవారు.

ముందుగా ఎవడయితే ఒకని చేతిలో చనిపోతాడో మిగిలినవారు కూడా వాని చేతిలోనే మరణిస్తారని విధి. అదే విధంగా బకాసురుని తర్వాత, జరాసంధుని తర్వాత కీచకుడ్ని చివరిగా కురుక్షేత్ర సంగ్రామం చివర దుర్యోధనుడ్ని వధించాడు భీముడు.

ఏకచక్రపురమందుండగా జరిగిన రెండో అతి ముఖ్యఘట్టం ద్రౌపది వివాహం.

ఏకచక్రపురాన్ని పరిపాలిస్తున్న ద్రుపదమహారాజుకి ద్రౌపది ఒక్కతే కూరుతు. ద్రుపదుడి కుమార్తె గాబట్టి ద్రౌపది అన్నారు. ద్రౌపది మహాసౌందర్యవతి. అయోనిజ, అగ్నిసంభవ. యాగాగ్నినుంచి పుట్టి ద్రుపదుడి కుమార్తె అయింది.

అటువంటి ద్రౌపదికి యుక్తవయసు రావటంతో వివాహం చేయాలని సంకల్పించాడు ద్రుపదుడు. ఆమె అందానికి తగ్గట్టే ఒక మహావీరునికిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాడు. అందుకే స్వయంవరం ప్రకటించకుండా వరపరీక్ష ఏర్పాటు చేశాడు.

నేలమీది పళ్ళెరంలోని నీటిలోకి చూస్తూ పైన యంత్రానికి గిరగిర తిరిగే మత్స్యయంత్రాన్ని ఎవరయితే బాణంతో ఛేదిస్తారో వానికిచ్చి ద్రౌపది వివాహం జరిపిస్తానంటూ ప్రకటించాడు.

ఎందరో యోధానుయోధులు పోటీకి వచ్చినా ఎవరూ మత్స్యయంత్రాన్ని కొట్టలేకపోయారు.

కాని బ్రాహ్మణవేషంలోని అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని గెలుచుకున్నాడు.

అన్నదమ్ములయిదుగురూ సంతోషంగా ద్రౌపదిని తాముంటున్న ఇంటికి తీసుకొచ్చారు. కుంతీదేవి లోన ఏదో పనిలో వుంది "అమ్మా నీకోసం ఓపండు తెచ్చాను. వచ్చి చూడమ్మా" అని పిలిచాడు పార్థుడు. విషయం తెలీని కుంతీదేవి "ఎప్పటిలాగే అయిదుగురూ పంచుకుతినండి" అంది.

ఆ మాటతో అంతా అప్రతిభులైపోయారు. అది సత్యకాలం. నోటి మాటకున్న విలువ వాళ్ళకు తెలుసు. పొరబాటు జరిగినా ఆచరించక తప్పదు.

విషయం తెలిసి కుంతీదేవి బాధపడినా తప్పదు గాబట్టి ద్రౌపది కూడా అంగీకరించడంతో ఆ విధంగా ఏకచక్రపురంలో అన్నదమ్ములు అయిదుగురూ ద్రౌపదిని వివాహం చేసుకున్నారు.

ద్రౌపది పాంచాలి అయింది. పంచభర్తృకఅయింది. ఏకచక్రపురం ఆంధ్ర ప్రాంతం రాజ్యంగాబట్టి ద్రౌపది ఆంధ్రుల ఆడపడుచు.

ద్వాపరయుగం చివరి శతాబ్దం మధ్యకాలంలో అప్పటికే ఎన్నో సంఘటనలు జరిగిపోయాయి. మాయాజూదంలో ఓడిపోయిన పాండవులు అరణ్య వాసంలో ఉన్నారు. సుభద్ర తన కొడుకు అభిమన్యుడితో పుట్టిల్లయిన ద్వారకాపురిలో ఉంది.

కురుసామ్రాజ్యం దుర్యోధనుడి పాలనలో ఉంది. యాదవరాజ్యంలోని ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారు. అటువంటి తరుణంలో కలియుగంలోంచి చరక్ అనే యువకుడు ద్వాపరయుగంలో ద్వారకాపురికి వచ్చి చేరుకున్నాడు.

*　　*　　*　　*　　*

అదే విచిత్రం. విధి లిఖితం, గతజన్మలబంధం. అతడికంతా గందర గోళంగా ఉంది. అది చాలదన్నట్టు 'బావా' అంటూ ఓ యువకుడు మధ్యలో తయారయ్యాడు. అతడి నుంచి తప్పించుకోవటం కోసం ద్వారకాపురికి వెళ్ళే సముద్రబాటను వదిలి తీరం వెంట ఓడరేవు వైపు కదిలాడు గదా!

దారిపొడవునా చేతివృత్తి పనుల్లో నిమగ్నమై వున్న అనేకమంది స్థానిక ప్రజల్ని చరక్ చూస్తున్నాడు. ఎవర్ని చూడు పదడుగుల పైమాటేగాని తగ్గరని పిస్తోంది.

అంతకన్నా పొడవున్నవారు కూడా అక్కడక్కడా కనబడుతున్నారు. తనలా ఆరడుగుల పురుషులు ఎక్కడా లేరు. ఇక స్త్రీల సరాసరి ఎత్తు ఆరడుగుల పైనే ఉన్నారు. ప్రతిఒక్కరు ఎంతో ఆరోగ్యంగా, బలంగా, దృఢంగా ఉన్నారు. సుందరాంగులు సుఖ సంతోషాలతో ఉన్నారు. స్త్రీ బాల వృద్ధులతో సహా ఎవర్ని చూడు ఏదో పనిలో ఉన్నవారేగాని, తినికూర్చుని ఇచ్చకాలతో కాలక్షేపంచేసే సోమరుల జాడే లేదు.

ఈ రోజు భారతదేశంలో స్త్రీ, పురుషులు సుమారుగా 37 కోట్ల 62 లక్షల మంది ఏ పని లేకుండా, పని ఉన్నా చేయకుండా సోమరిపోతుల్లా తిని, తొంగొంటున్నారట. అక్కడి ప్రజల్ని గమనిస్తున్న చరక్‌కి కలికాలంలో నేటి స్త్రీ పురుషుల్ని తలచుకుంటే నవ్వొస్తోంది. ఎంత భిన్నంగా వుంది.

ఎంతటి వ్యత్యాసం? ద్వాపరంతో పోలిస్తే కలియుగం స్త్రీ పురుషులు ఎత్తు మాత్రమేకాదు దృఢత్వం తగ్గిపోయి బలహీనమైపోయారు.

సుఖపడ్డానికి అలవాటుపడటంతో ఏం తిన్నా అరగని జీవితాలయి పోయాయి.

వారి మనస్తత్వాలూ కుచించుకుపోయాయి. దయ, జాలి, కరుణ, ప్రేమ, దానధర్మాలు మచ్చుకు లేవు. ఎలాగైనా సంపాదించు-సంపద ఉన్నవాడే గొప్పవాడు. విలువలు దిగజారిపోయాయి.

యాదవరాజ్యం అంటే అక్కడ యాదవులే ఉంటారనుకున్నాడు. కాని అన్ని వర్ణాల ప్రజలు ఇక్కడ సుఖశాంతులతో జీవిస్తున్నారు. దారిపొడవునా కమ్మరి-కుమ్మరి-మేదరి-వండ్రంగి-కంసాలి ఇలా అనేక చేతి వృత్తులవారిని చూస్తున్నాడు. ప్రతిఒక్కరు ఏదో పని చేస్తున్నవారే. కలికాలం ప్రజల్లా టీవీలకు అతుక్కుపోయి శ్రమను శరీరకష్టాన్ని మర్చిపోయి బిపి షుగర్ జబ్బులు తెచ్చుకుని బాధపడేవారిక్కడ లేరు.

చెక్కలతో నిర్మించిన పెద్దపెద్ద షెడ్లవద్ద పడవలు, ఓడ నిర్మాణపనుల్లో అనేకమంది కార్మికులు వివిధ పనుల్లో ఉన్నారు. అది కూడా దాటి మరికొంచెం దూరం ముందుకు సాగాడు.

అంతలో దారిపక్కన ఒక ఇంటిముందు అనేకమంది గుంపు చేరి కన్పించారు. వారి మధ్యనుంచి ఎవరిదో బాధామయ ఆర్తనాదాలు విన్పిస్తున్నాయి. అది మగగొంతు, దాంతోబాటు ఒక ఆడగొంతు కూడా ఏడుస్తోంది.

"అయ్యో, ఎంత కష్టం వచ్చింది. వైద్యులవారిని పిలవండి... ఏదో ఒకటి చేసి నా భర్తను కాపాడండి" అని అందర్నీ దీనంగా వేడుకుంటోంది.

వారికి వాటిల్లిన కష్టం ఏమిటో చరక్‌కు అర్థం కాలేదు. ఏం జరిగుంటుంది? అతనెందుకంత బాధననుభవిస్తున్నాడు? వీళ్ళంతా ఏమీ చేయకుండా చోద్యంచూడ్డం ఏమిటి? గుంపువద్దకెళ్ళాడు చరక్.

అక్కడున్న వాళ్ళలో ఓ నడివయసు వ్యక్తి తమవద్ద కొస్తున్న చరక్‌ను చూస్తూ ఆశ్చర్యపోయాడు. వినయంగా నమస్కరిస్తూ "తప్పుకోండి... తప్పుకోండి" అంటూ గుంపును పక్కకు చెదరగొట్టాడు.

గుంపు మధ్య ఒక ముక్కాలిపీటమీద సుమారు ముప్పై సంవత్సరాల యువకుడొకడు కూర్చుని బాధకు తట్టుకోలేక ఆక్రందనలు చేస్తున్నాడు. అతడి ఎడం కాలిపిక్క తెగి మామిడిపండు బద్దలా వేలాడుతూ నెత్తురోడుతోంది.

ఇది జరిగి కూడా ఎక్కువ సమయం కాలేదు. ఆ ఇల్లు మేదరివారిది. చుట్టూ తట్ట, బుట్ట, గంప, చేపలు మొదలగు గృహోపకరణాలు కొత్తగా చేసినవి దొంతలుగా పేర్చబడున్నాయి.

"వెదురుగెడను బద్దలుగా చీలుస్తుంటే పొరబాటున కత్తి జారి పిక్క తెగినాది సామీ...." చరక్‌కి నమస్కరించిన వ్యక్తే జరిగింది వివరించాడు.

ఆ యువకుడ్ని చూస్తే జాలేసింది చరక్‌కు. "ఓర్చుకొనుము... బాధను ఓర్చుకొనుము... నుడిలో వచ్చెద" అంటూ అక్కడ్నుండి వేగంగా కదిలాడు చరక్.

అక్కడికి సమీపంలోనే అనేక పొదలు కన్పిస్తున్నాయి. వేగంగా వెళ్ళి ఆ పొదల్లో దూరాడు చరక్. కాస్సేపు వెదుకులాడాక ఒకపొద పక్కన అతనిక్కావలసిన మొక్క కన్పించింది.

భూమికి రెండడుగుల ఎత్తు పెరిగి అరచేయంత ఆకులు కలిగివుంది. ఆకుల మీద ఎర్రటిచార కన్పిస్తోంది. దీనిపేరు అగ్నిప్రభ.

గాయాలు మాన్పుటలో అద్భుతమగు శక్తిగల మొక్క. దీని గురించి అందరికీ తెలీదు.

ఆ చెట్టు నుంచి అయిదు ఆకులు తుంచుకుని వచ్చినదారినే వేగంగా వెనక్కు మళ్ళాడు. మూడు ఆకుల్ని అరచేతిలో వేసి బాగా నలిపి గాయంమొత్తం తడిసేలా పసరు పిండాడు. వేలాడుతున్న కండను యథాప్రకారం మూసి పైన నలిపిన ఆకులపిప్పిని ఉంచి దానిపైన మిగిలిన రెండు ఆకుల్ని మూసి పలుచని వస్త్రభాగం చుట్టి కట్టుకట్టాడు.

అగ్నిప్రభ ఆకుపసరు తగలగానే బాధితుడి బాధఅంతా మంత్రం వేసినట్టు మాయమైపోయింది. నెత్తురు స్రవించడం ఆగిపోయింది. బాధితుని ఆక్రందనలు

నిలిచిపోయాయి. అతని కంట్లో ఆనందబాష్పాలు నిలువగా చేతులెత్తి నమస్కరించాడు.

"ఇక భయం వలదు. విశ్రాంతి గైకొనుము. నేటికి అయిదవ దినమున కట్టు విప్పి జూడుము. తెగిన గాయం జాడ కూడా తెలియదు. పోయి వచ్చెద" అంటూ అతడి భుజం తట్టి తన దారిన బాటమీదకు వచ్చేశాడు చరక్.

"ఎవరీ వయస్కుడు. వయసును మించిన అనుభవమువలెనున్నది. సమయమునకు దైవమువలె వచ్చినాడు" ఎవరిదో స్త్రీ గొంతు.

"అయ్యో. ఈతడు తెలియదా? మన రాజవైద్యులు వల్లభాచార్యులవారి పుత్రుడు. చతురుడు" తనకు నమస్కరించినవాని గొంతు.

"లెస్స పలికితివి. రాజవైద్యులపుత్రునకు వైద్యము తెలియకుండునా?" మరో గొంతు.

"అటులయిన ఇదేమి చిత్రము. నడు కడలినందు ఓడ పగిలి ఇతడు మరణించినాడని తెలిసినదే... పక్షము దినములుగా వల్లభాచార్యుల వారి గృహము విషాదమందున్నదే. ఇతనేమి ఇచట తిరుగుచున్నాడు?" మరో కొత్త గొంతు.

వెళ్తున్న చరక్ చెవులకు ఆ మాటలు స్పష్టంగానే విన్పిస్తున్నాయి. మరోసారి ఆలోచనల్లో కూరుకుపోయాడు. ఏమిటి వీళ్ళంతా? తనను చతురుడంటున్నారు. వల్లభాచార్యుల కొడుకంటున్నారు.

సముద్రంలో చనిపోయాడంటున్నారు. ఏమిటిదంతా? వల్లభాచార్యుడు ద్వారకాపురి రాజవైద్యుడా! ఇదేమి సరికొత్త వింత. బహుశా ఆ చతురుడు ఎడవోగాని తన పోలికలతో ఉండుంటాడు. అందుకే వీళ్ళంతా తనను చూసి పొరబడుతున్నారు.

"బావా!" అంటూ తనవెంటబడుతున్న యువకుడూ ఇలాగే పొరబడు తున్నట్టున్నాడు.

అంతలో ఒక విషయం గుర్తొచ్చి – ఉలికిపాటు చెందాడు చరక్. వాళ్ళయితే తనను చూసి రాజవైద్యుడు వల్లభాచారి కొడుకు చతురుడనుకుని పొరబడ్డారు సరే. కాని తనేమిటి.

తను వైద్యం చేయటం ఏమిటి? తనేమన్నా వైద్యుడా? ఆయుర్వేదం చదివాడా! నాటు వైద్యం తెలుసా? లేదే... వంశానుగతంగా వస్తున్న మన వృత్తి

వైద్యం నేర్చుకోరా అని జేజితాత అగ్నివేశాచార్యులవారు శతపోరినా తను పట్టించుకోలేదే.

"సిటీలో సాఫ్ట్‌వేర్‌లో జాబ్ చేసుకుంటూ హాయిగా ఉంటున్నవాడ్ని. నాకెందుకు జేజిగారూ ఈ వైద్యం. నాకు వంటబట్టదు వదిలేయండి" అని తప్పించుకున్నాడు.

అలాంటి తనేమిటి ఒక క్షతగాత్రునికి వైద్యం చేయటం ఏమిటి? చెట్ల పేర్లే సరిగా తెలీని తనకు 'అగ్నిప్రభ' అనే మొక్క ఉందని అది గాయాలను అద్భుతంగా మాన్పుతుందని ఆ క్షణంలో విచిత్రంగా అలా గుర్తురావటం ఏమిటి? దాన్ని ఎలా ఉపయోగించాలో తెలీటం ఏమిటి?

దాన్ని ఉపయోగిస్తే గాయం తాలూకు మచ్చకూడా కనబడదని తనకు ఎలా తెలిసింది? ఆయుర్వేదం గురించి కనీస పరిజ్ఞానం కూడా లేని తనకు ఆ సమయానికి ఈ చిట్కావైద్యం ఎలా గుర్తొచ్చింది? అంతా మాయగా ఉందే. ఒకవేళ తనే ఆ వల్లభాచార్యుని కొడుకు చతురుడా ఛ... అదే నిజమైతే తను కలియుగంలోంచి ద్వాపరంలోకి వచ్చిందంతా కలవుతుంది. కాని కల కాదే. తనకంతా గుర్తుంది. బహుశ అగ్నివేశాచార్యుని మునిమనవడిగా తన రక్తంలోనే వైద్యవృత్తి ఉంది గాబట్టి అలా ఉంది గాబట్టి అలా గుర్తొచ్చిందేమో. ఆలోచనలు ఓ కొలిక్కిరాకముందే– ఓడరేవు ప్రాంతాన్ని చేరుకున్నాడు చరక్. సాయంకాలం నాలుగు గంటలు కావస్తోంది సమయం. అలవాటులో పొరబాటుగా ఆ సమీపంలో టీస్టాల్ ఏదన్నా ఉంటుందేమోనని పరికించి అంతలోనే అలాంటివి ఈ కాలంలో ఉండవని గుర్తొచ్చి తనలో తనే నవ్వుకున్నాడు.

కావలసినంత పాలు, పెరుగు, జున్ను, వెన్న, మజ్జిగలు తీసుకోవటమే గాని ద్వాపరవాసులకు పిచ్చి అలవాట్లు లేవు.

చరక్ వెళ్ళేసరికి ఓడరేవు ప్రాంతం చాలా హడావుడిగా వుంది. సువిశాలమైన తీరంలో సహజసిద్ధంగా ఏర్పడిన రేవు. అటు కుడిపక్కగా ఉరకలు వేస్తూ కడలిలో సంగమిస్తోంది గోమతీనదికి సంబంధించిన ఓ పాయ. సముద్ర పక్షులు ఆ ప్రాంతమంతటా కాపాడుతున్నాయి. తెరచాపలు దించిన ఓడలు రెండు రేవులో ఠీవిగా నిలబడున్నాయి.

ఒక ఓడ తెలుపు రంగులో ఉండి ఓడ ముందు భాగంలో హంస తల ఎత్తి చూస్తున్నట్టు చెక్కబడుంది. రెండో ఓడ నలుపు రంగులో ఉండి దానిముందు భాగంలో గ్రద్ద తల మలచబడింది.

నలుపురంగు ఓడ రోమాపురికి (రోమ్ నగరం–ఇటలీ) చెందినది. రెండో ఓడ స్థానికంగా ద్వారకాపురికి చెందిన పెద్ద బేహారికి చెందినది. రెండు ఓడలు ఎంతో అందంగాను, పెద్దవిగాను ఉన్నాయి. వాటి తెర చాప కొయ్యల కిరకిర శబ్దాలు తీరం మీదికి స్పష్టంగా విన్పిస్తున్నాయి.

రోమాపురి నుండి వచ్చిన ఓడనుండి రేవుకార్మికులు సరుకు దించు తుంటే, ద్వారకకు చెందిన ఓడలోకి ద్వారక దేశపు సరుకు లోడ్ చేస్తున్నారు.

ఆ సమీపంలోనే పెద్దపెద్ద రెల్లుగడ్డి ఆవాసాల్లోకి ఎడ్లబండ్ల మీద వచ్చిన సరుకును చేరుస్తున్నారు. ఆ సరుకంతా వ్యాపారులు విదేశాలకు తీసుకెళ్ళేదే. తమ సరుకుతోబాటు వ్యాపారులు ఓడల్లో ఆ యా దేశాలకు వెళ్ళి వ్యాపారం చేసుకుని తిరుగు ప్రయాణంలో అక్కడి సరుకు కొనితెచ్చుకుంటూ వుంటారు. ఎక్కడ ఏ వస్తువులకు డిమాండ్ వుందో తెలుసుకుని ఆ యా వస్తువులతో వ్యాపారం చేస్తూంటారు.

ఆ కాలంలో విదేశాలతో వ్యాపారమంటే చాలా శ్రమతో కూడుకున్న పని. ఇల్లు వదిలాక ఎప్పటికి తిరిగివస్తారో తెలీదు. దారిలో ప్రమాదవశాత్తూ ప్రాణం పోయినా ఆ విషయం చాలాకాలం వరకు ఇంటికి తెలిసేది కాదు.

అయినప్పటికీ కూడా అనేక శ్రమదమాదులకు ఓర్చుకుని విదేశీ వర్తకం చేసిన ఆనాటి బిడారులు, వర్తకులు సముద్రమార్గాల్లో తిరిగే బేహారులే భారత దేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటింది.

అక్కడి సరంగులు, కళాసీలతోను, స్థానికులతోను మాట్లాడాడు చరక్. వచ్చిన ఈ ఒకరోజులోనే అక్కడి భాష తెలిసిపోయింది చరక్‌కి.

చక్కగా సంభాషించగలుగుతున్నాడు. అర్థం చేసుకోగలుగుతున్నాడు. మాట్లాడేకొద్దీ 'దేవనాగరి' భాషతో తనకెంతో పరిచయం వున్నట్టు తోచసాగింది. వారిలాగే మాట్లాడగలుగుతున్నాడు.

అక్కడి వర్తకుల మాటల్నిబట్టి ఎక్కువ వ్యాపారం చైనాతోను (ఆ కాలంలో చైనాను చీనాదేశం అనేవారు. చీనీ చీనాంబరం అనేమాట మనకు పరిచితమే.

చీనీ అంటే చక్కెర, చీనాంబరం అంటే చైనా వస్త్రం, పట్టువస్త్రం. పట్టుగూళ్ళ నుండి పట్టుదారం తీసి పట్టువస్త్రాలు తయారుచేయటం కనిపెట్టింది చైనీయులే. ప్రాచీనకాలం నుండి చక్కెర, పట్టువస్త్రాలు, పింగాణి పాత్రలు దిగుమతి అయ్యేవి.

ఇక్కడి నుండి నూలు వస్త్రాలు, సుగంధద్రవ్యాలు, నారవస్తువులు, చెక్క కళాకృతులు, రాతిశిల్పాలు, సుగంధ పరిమళాలు అందమైన పిల్లల ఆటబొమ్మలు చైనాకు వెళ్ళేవి) ఆ తర్వాత రోమాపురితోను (రోమ్ నగరం – ఇటలీ) సింహళదేశం (నేటి శ్రీలంక)

యవన దేశ రాజధాని యోధపురి (యోధపురి ఏథెన్స్ నగరం, గ్రీస్. ఈ గ్రీస్‌ని యవనదేశమని, గ్రీకులను యవనులని పిలిచేవారు) ఇంకా నీలనదీ పరీవాహక ప్రాంత దేశాలు.

(నీలనది – నైలునది–ఈజిప్ట్) ఉత్తర ఆఫ్రికా ప్రాంత దేశాలవరకే వ్యాపారులు పరిమితమయ్యేవారు. దక్షిణ ఆఫ్రికా తీరం వెంట నరమాంసభక్షకుల బెడద ఉన్నందున అటు వెళ్ళేవారు కాదు. ఇంకా తూర్పు ఆసియా దేశాలయిన మలయాదేశం (నేటి మలేషియా)

దాని పరిసరదేశాలతోను భూమార్గంగా వ్యాపారం సాగినట్టే సముద్ర మార్గంగానూ వ్యాపారులు ఆయా దేశాలకు వెళ్ళివస్తున్నారు. అక్కడి వ్యాపారులు ఆయా దేశాలకు వెళ్ళివస్తున్నారు అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చేవారు. భారత ఖండాన్ని చుట్టి ద్వారకాపురిలాగే అనేక రేవుపట్టణాలున్నాయి. ఆంధ్రతీర ప్రాంతంలో ఘంటశాల (దీన్ని విదేశీయులు 'కంటకోస్స' అనేవారు. కోరంగి, కళింగపట్నం ఆ కాలం ప్రసిద్ధ ఓడరేవులు)

ఆలోచిస్తూనే ఓడరేవు ప్రాంతమంతా తిరిగి చూశాడు చరక్. ఓడ సరంగులనడిగి వారి అనుమతితో ఓడల్లోకి వెళ్ళి నాటి ఓడల నిర్మాణం వాటి తీరుతెన్నులు పరిశీలించాడు. కలియుగం నేడున్న అధునాతన భారీ యంత్ర ఓడలతో పోలిస్తే ఇవి చాలా చిన్నవే.

కాని వీటి నిర్మాణంలో ఎంతో నిర్మాణకౌశలం వుంది. గాలివాటు లేక తెరచాపలు పనిచేయనప్పుడు దిగువ గుండ్రని కంతల వెనక అటుకొందరు ఇటు కొందరు బలాఢ్యులు కూర్చుని తెడ్లు వేస్తూ ఓడ ముందుకు పయనించటానికి ఆటంకం లేని ఏర్పాట్లు ఉన్నాయి.

చరక్ ఇవన్నీ తిరిగి చూస్తుండగానే సూర్యుడు పశ్చిమ సముద్రజలాల్లోకి అదృశ్యం కానారంభించాడు. రాత్రి అవుతోంది. తనిప్పుడు ద్వారకాపురికి బయలుదేరితే అక్కడికి చేరుకునేసరికి రాత్రి మొదటిజాము దాటిపోతుంది. నగర వాకిళ్ళు మూసేస్తారు. కాబట్టి ఈ రాత్రికిక్కడే గడిపి ఉదయం బయలుదేరటం మంచిదనిపించింది.

ఇతర ప్రాంతాలనుంచి, విదేశాలనుండి వచ్చే వర్తకులు, ప్రయాణీకుల సౌకర్యార్థం రేవుప్రాంతంలో అనేక సత్రాలున్నాయి. భోజనం ఉచితంగా పెడతారు. ఉండేందుకూ రుసుము లేదు.

అది భోజనాన్ని విక్రయించే కాలం కాదు. అన్నదానం మహా దానంగా భావించే కాలం. గృహస్తులు కూడా అతిథి అభ్యాగతులకు భోజనం పెట్టాకే తాము భోంచేసే నిష్టాగరిష్టులు.

ఓడరేవుమీద పన్నుద్వారా వచ్చే ఆదాయంలో కొంత ఈ సత్రాల నిర్వహణకు కేటాయించబడుతుంది. రాత్రి అవగానే ఒక సత్రంలో భోంచేసి అక్కడే సత్రం ఉప్పరిగె (మిద్దె) మీదకు చేరుకున్నాడు చరక్.

సత్రం వాళ్ళిచ్చిన చాపదిండు పరుచుకుని కూర్చున్నాడు. చుట్టూ పండు వెన్నెల. అక్కడ కూర్చుని చూస్తూంటే ఓడరేవు పరిసరాలు ఓడలు రేవులోని ఎత్తయిన దీపస్తంభం (లైట్‌హౌస్) దూరంగా ద్వారకా నగరం దీపకాంతులు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

చంద్రకాంతి పడి ద్వారకాపురి సౌధాలమీది మణిమయ బంగారు కాంతులు సముద్రజలాల్లో ప్రతిఫలిస్తూ నిజంగానే ఆ సాగరజలాల్లో మరో చంద్రోదయమవుతోందా అనే భ్రాంతిని కలిగిస్తున్నాయి.

భారత భాగవతాల్లోని వర్ణనలకి ఇవన్నీ అతికినట్టు సరిపోతున్నాయి గదా! ఆహాఁ ఏమి ఈ ద్వారక అందం. ఏమి ఈ సుందర మనోహర దృశ్యం.

పరవశంతో పరిసరాలను మరచిచూస్తున్న చరక్ పక్కన, తన చాపదిండు వేసుకుని కూర్చున్నాడో నడివయస్కుడు. అతని పేరు పీతాంబరుడు. అవంతీపుర బేహారి. వ్యాపారనిమిత్తం రోమాపురి వరకు వెళ్తున్నాడు. అతని సేవకులిద్దరు అప్పటికే నిద్రపోయారు. సాయంత్రం చరక్‌తో అనేక విషయాలు చెప్పి సందేహాలు తీర్చింది ఈ పీతాంబరుడే.

"ఏమి నాయనా నిద్రపోకుంటివి? ఇంటివద్ద బంధు జనులు గురుతువచ్చు చున్నారా?" అడిగాడు పీతాంబరుడు.

కాని తనభార్య శుశ్రుత. తన నాయనమ్మ దేవమ్మ, జేజితాతయ్య అగ్ని వేశాచార్యులు అంతా గుర్తొస్తున్న మాట నిజమే. కాని ఈ ద్వారక అందాలు ఆ బాధను మరపింపజేస్తున్నాయి. "నీ పేరేమంటివి?" అడిగాడు పీతాంబరుడు.

"చరక్" చెప్పాడు.

"అనగానేమి? ఆ చరకమహర్షుల వారి నామధేయమా?"

"అవును. మీకు చరకమహర్షులు వారు తెలియునా?"

"తెలియదు నాయనా. కాని వింటిని. వారు పాండవ మధ్యముడు. అర్జునులవారి సహాధ్యాయిగదా. శ్రీకృష్ణులవారి సందర్శనార్థమే ద్వారకకూ వచ్చి పోవుదురని ఆలకించితిని"

ఆ మాటలు వినగానే – చరక్ మనసు కొన్ని క్షణాల పాటు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది. చరక మహర్షులవారు ఈ కాలం వారేనా! వారు పార్థుని సహాధ్యాయా... ద్వారకకు వచ్చిపోవుదురా. ఆయుర్వేద పితామహులన దగ్గవారిలో ఒకరయిన ఆ చరక మహర్షుల దర్శనభాగ్యం కలిగినచో అంతకన్నా అదృష్ట ముండునా? "ఎద్దియో దీర్ఘాలోచనయందుంటివి. ఏమదినాయనా?" పీతాంబరుని పలకరింపుతో ఆలోచనల నుంచి బయటికొచ్చాడు చరక్.

"చరకులవారు ద్వారక వచ్చిపోవుట నిక్కమా?" అడిగాడు చరక్. "నిక్కముగానే వచ్చిపోవుదురని వింటిని. ఏమి?"

"వారి దర్శనభాగ్యం కలుగునాయని చిన్న ఆశ" "నీ ఆశ ఫలించవలెనని ఆశించెద"

"నాదో సందియము!"

"వచింపుము నాయనా. ఏమది?"

"శ్రీకృష్ణులవారిని దర్శించితిరా?"

"ఆహాఁ"

"వారు లీలామానుషరూపుడని సాక్షాత్తూ ఆ శ్రీహరి ఎనిమిదో అవతారమని అనుకొనుచున్నారు జనులు. మీరు నమ్ముచుంటిరా?"

"యాదవులు నమ్ముచున్నారు. యాదవరాజ్య ప్రజలు నమ్ముచున్నారు. వారు ప్రత్యక్షంగా వేణుమాధవుని లీలలు వీక్షించినవారు గావున నమ్ముచున్నారు. బయట రాజ్యాలవారిలో నమ్ముువారున్నారు నమ్మనివారున్నారు. నమ్ముువారిలో నేనును ఒకడును. మదీయ ప్రగాఢ నమ్మకము ఆ గోపాలుడు ఆ శ్రీహరియే. గాకున్నచో ఆ తేజస్సు, ఆ ఆకర్షణ, ఆ సౌందర్యము ఎక్కడివి.

ఇక నమ్మనివారందువా అంత దేనికి ఆ మధుసూదనులవారి బంధువర్గం లోనివారే చాలామంది నమ్మటం లేదే. మేనల్లుడు శిశుపాలుడు నమ్మకచెడి, వారి చక్రాయుధానికి బలైనాడు గదా.

కృష్ణప్రభువు ఆ శ్రీహరియే. సందియమే లేదు. వారి యాదవరాజ్యం సదా సుభిక్షం. 'నా ప్రజలంతా నీతివర్తనులై ఉండవలె. ధర్మాన్ని పాటించవలె.

వ్యాపారులు ధర్మబద్ధంగా వ్యాపారం చేయవలె. ధర్మసంస్థాపనే నా ధ్యేయం. అందుకు భిన్నంగా చరించువారు కఠినాతికఠినంగా శిక్షింపబడుదురు అని శ్రీకృష్ణ ప్రభువులవారే ప్రకటించి వున్నారు"

"ఇంతకీ ఇక్కడ ప్రభువు ఆ బలరాములవారా, శ్రీకృష్ణులవారా?"

"యాదవరాజ్య ప్రభువు బలరాములవారు. సందియము వలదు. కాని బలరాములవారు సోదరుడు శ్రీకృష్ణులవారి మాట జవదాటరు. తమ్ముని శక్తి యుక్తులు, బలపరాక్రమాలమీద అంతటి విశ్వాసము బలరాములవారికి. కావున శాసనము ఎవరిపేరున వచ్చినను ఆ ఇరువురి అనుమతి పొందవలసినదే.

యాదవ రక్షకుడు శ్రీకృష్ణులవారే గాని బలరాములవారు కాదని యాదవులకు తెలియును. అందుకే పేరుకు యాదవరాజ్యాధిపతి బలరాముల వారయినా యాదవప్రజలు శ్రీకృష్ణులవారినే తమ ప్రభువుగా భావించెదరు" అంటూ అసలు విషయాన్ని వివరించాడు పీతాంబరుడు.

ఆ రాత్రి వెన్నెట్లో సత్రం మిద్దె మీద సుఖంగా నిద్రపోయాడు చరక్. మరునాడు వేకువనే పీతాంబరునితోబాటు లేచి గోమతీ తీరానికి వెళ్ళాడు.

కాలకృత్యాలు తీర్చుకుని పవిత్రమగు గోమతీనదీ తోయములందు స్నాన మాచరించి సంధ్య వార్చుకున్నారు. చరక్ వద్ద మార్చుకొనుటకు మారు దుస్తులు

లేవని గ్రహించి పీతాంబరుడు తన దుస్తుల్లో ఒక జత కొత్తనూలు పంచె, అంగీ చరక్‌కు ఇచ్చాడు.

* * * * *

విడిచిన దుస్తులు గాలికి ఆరేవరకు ఉండి వాటిని ఒక సంచిలో వేసుకుని భుజాన తగిలించుకుని తిరిగి సత్రానికి చేరుకున్నారు ఇద్దరూ. సత్రంలో గడ్డ పెరుగుతో ఇచ్చిన చద్ది తిని బయలుదేరాడు చరక్.

పీతాంబరుడు వెళ్ళాల్సిన రోమాపురి ఓడ రేపు ఉదయంగాని బయలు దేరదు.

కాబట్టి అంతవరకు పీతాంబరుడు రేవువద్ద ఉండక తప్పదు. అతనికి కృతజ్ఞతలు తెలుపుకుని వచ్చిన దారినే చరక్ బయలుదేరేసరికి బారెడు పొద్దెక్కి ఉదయం మంచు తెరలు కరిగిపోనారంభించాయి.

గోమతీనది ఏడు పాయలుగా చీలి అరేబియా సముద్రంలో కలుస్తున్న ప్రాంతంలో పక్కపక్కన అమరివున్న ఏడుదీవుల సముదాయం 'ద్వారక' అని ప్రొఫెసర్ షికారిపూర్ రంగనాధరావు తన పరిశోధనా గ్రంధంలో పేర్కొన్నారు.

ఓడరేవు ప్రాంతం నుండి వచ్చిన దారినే చరక్ సముద్ర నారాయణుని ఆలయాన్ని చేరుకునేసరికి అదృష్టవశాత్తూ అక్కడ తనకోసం నిన్నటి యువకుడు గాని అతని మిత్రుల జాడగాని లేదు. తేలిగ్గా ఊపిరి తీసుకుని ఆలయంలోనికి వెళ్ళి సముద్ర నారాయణుని దర్శించుకుని ఒడ్డుకు మైలుదూరంలో సముద్రం మధ్య ఉన్న ద్వారక వైపు సాగిపోసాగాడు.

ద్వారకను చుట్టి సమున్నతంగా – మొదటి ప్రాకారం కన్పిస్తోంది. ప్రాకార వాకిలి ద్వారాలు బార్లా తెరిచే వున్నాయి. రాత్రి రెండోజాములో మూసిన ఆ తలుపుల్ని తెలతెలవారుతూండగా కావలిభటులు తెరుస్తారు. ఇప్పుడూ అచట కావలి భటులున్నారు.

ఈటెలు, కృపాణధారులైవున్నారు. కాని ఎవరినీ శోధించుటలేదు. పౌరులు, సందర్శకులు, వాహనాలు నిరాటంకంగా రాకపోకలు జరుగుతున్నాయి. ఏదన్నా సమస్య వచ్చినప్పుడే వారు కలుగజేసుకుంటారట.

అలాగే ప్రతి కక్ష్యకు వాకిలి సమీపంలో ధర్మసత్రాలున్నాయి. వాకిళ్ళు మూయబడి అక్కడే చిక్కుబడినవారు రాత్రికి ఇబ్బందిపడకుండా ఆ ధర్మసత్రాల్లో హాయిగా ఉచిత భోజనం చేసి రాత్రికి మజిలీ చేసుకునే వెసులుబాటు ఉంది.

ఆహాc ఏమి ధర్మ పరిపాలన...

తొలివాకిలి దాటి లోన ప్రవేశించిన చరక్ తనకు కుడిపక్కన పచ్చిక బీళ్ళలో తిరుగాడుతున్న వేలాది ఆలమందల్ని చూశాడు.

రెండో ప్రక్క కనుచూపుమేర పచ్చని పంటపొలాలు దర్శనమిచ్చాయి.

ఆ పొలాలలో ఆడుతూ పాడుతూ పనులు చేసుకుంటున్న రైతుల్ని చూశాడు. వారి జానపదపాటలు మధురంగా వినవస్తున్నాయి.

క్రమంగా రెండో ప్రాకార వాకిలిని చేరుకున్నాడు చరక్. లోన ప్రవేశించగానే ఎటుచూసినా పండ్ల తోటలు పచ్చని కూరగాయలు, పంటలు, పూల తోటలు కడురమణీయమై కనువిందు చేస్తున్నాయి. పూలసౌరభాలు మనసును ఆహ్లాదపరుస్తున్నాయి.

పుష్పప్రియుడు, సదా పుష్పమాలాలంకృతుడు ఆ కృష్ణ భగవానుడు.

ఆయన నగరంలో పూలకి కొదవా. ఎటుచూసినా ఆ తోటల్లో స్త్రీ పురుషులు ఎందరో పనుల్లో నిమగ్నమై కన్పిస్తున్నారు. అవన్నీ చూసుకుంటూ చాలా సేపటికి మూడో ప్రాకార వాకిలిని చేరుకున్నాడు చరక్.

తొలి ప్రాకారానికి మాత్రమే ఒకటే వాకిలి. మెయిన్ ల్యాండ్ నుండి నగరానికి రావాలంటే సముద్రం మీద కట్టిన రాతిబాట ఒకటే దారి. చుట్టూ సముద్రంలో మరో దారి లేదు. కాని లోన మిగిలిన కక్ష్యలను వేరుచేస్తూ నిర్మించబడిన ప్రాకారాలన్నిటికీ నాలుగు దిక్కులా నాలుగు నగరవాకిళ్ళు ఉన్నాయట.

ప్రజలు తిరగటానికి అనువుగా ఆ యా ప్రాకారాలను అనుసరించి రహదారులు, కాలిబాటలు కూడా ఉంటాయట. తోటి ప్రయాణీకులు చెప్పుకుంటుంటే విన్నాడు చరక్. అక్కడి ఏర్పాట్లు గమనించి దిగ్భ్రాంతి చెందుతున్నాడు చరక్.

ఎంతటి పటిష్ఠమైన రక్షణ ఏర్పాట్లు? శత్రువులు ద్వారకను ముట్టడిస్తే మొదటి ప్రాకారం వాకిలి యొక్క దృఢమైన తలుపుల్ని మూసేస్తారు. ప్రాకారం

మీద సైనికుల గస్తీ ఉంటుంది. ముట్టడి ఎంతకాలం సాగినా ద్వారకలోని పౌరజీవనానికి ఎలాంటి భంగం కలగదు. బయటినుంచి నగరానికి సరుకులు రావలసిన అవసరం లేదు.

అవసరమగు ఆహారభద్రత అక్కడ ఉంది. మొదటి ప్రాకారం దాటగలిగినా శత్రువులు రెండో ప్రాకారం దాటలేరు. పోతే జరాసంధుణ్ణి భీమసేనుడు వధించడంతో యాదవరాజ్యానికి శత్రుబెడదా పూర్తిగా తొలగిపోయి నట్టే.

ఆలోచిస్తూనే మూడో నగరవాకిలి చేరుకున్నాడు చరక్. వెళ్ళేకొద్దీ కక్ష్యలో మధ్యదూరం తరగడం గమనిస్తున్నాడు. మూడో కక్ష్యలో విసిరేసినట్టుగా ఎటుచూసినా అనేక గృహసముదాయాలు కన్పిస్తున్నాయి. అవన్నీ రైతులు, పనీపాటా చేసుకునేవారు, వివిధ చేతి వృత్తులవారి కాలనీలుగా గుర్తించాడు చరక్.

అక్కడి ప్రజలంతా ఎంతో ఆరోగ్యంగానూ, నిష్కల్మషులుగాను కన్పిస్తున్నారు. వారిమధ్య తనను ఊహించుకుంటే గలీవర్ యాత్రల్లో పొడవు మనుషుల మధ్య చిక్కిన గలీవర్ గుర్తొచ్చి నవ్వొస్తోంది చరక్‌కి. క్రమంగా నాలుగో ప్రాకారవాకిలి దాటాడు.

నాలుగు – ఐదు మధ్య ప్రాకారాల మధ్య ప్రాంతంలో అనేక చేతివృత్తుల వారి గృహసముదాయాలు, నగరంలో పనులు చేసుకునేవారు, చిన్న చిన్న వ్యాపారులకు చెందిన గృహాలు విడివిడిగా తలో చోటా కన్పిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఆ ప్రాంతంలో ఉన్నవన్నీ లేబర్ కాలనీలుగా చెప్పుకోవచ్చు. అక్కడ పేదవాళ్ళు ఉంటున్నారనుకుంటే పొరబాటే.

పేదవాళ్ళనుకునేవాళ్ళే అక్కడ లేరు. ఆర్థిక సమస్యలు కష్టాలేమిటో వారికి తెలీదు. అంతా ఏ సమస్యలూ లేకుండా హాయిగా జీవిస్తున్నవారే.

అయిదు ఆరు ప్రాకారాల మధ్య ప్రాంతం అంతా ఇంచుమించుగా నగర రక్షకదళాలకు చెందిన సైనికుల అధీనంలో ఉంది. సైనిక శిబిరాలు, సైన్యాధిపతుల భవనాలు కన్పిస్తున్నాయి.

ఆరోప్రాకారం నుండి ద్వారకాపురి నగర వాతావరణం ఆరంభమవు తోంది. ఆరు ఏడు ప్రాకారాల మధ్యనే నగరమంతా ఇమిడివుంది. ఏడో ప్రాకారం వరకే నిరాటంకంగా ఎవరయినా వెళ్ళొచ్చు.

ఏడో ప్రాకారం వాకిలి దాటగానే లోన ద్వారకాపురి కోట రాచనగరు రాజబంధువుల గృహాలు ఆరంభమౌతాయి. అక్కడ నిరంతరం కావలి ఉంటుంటుంది. చీమలోనికి వెళ్ళాలన్నా కావలివారు శోధించి తగిన అనుమతి ఉంటేగాని వదలరు.

ఇక నగరశోభను చూడ్డానికి చరక్‌కు రెండు కళ్ళూ చాలడంలేదు. ఎటు చూసినా సమున్నతమగు చలువరాతి మేడలు, గుళ్ళు, గోపురాలు వాటి పైన మణిమయబంగారు తొడుగులు, విశాలమగు రాచబాటలు, ఉద్యానవనాలు, జలయంత్రాలు...

ఆహాఁ ఏమి ఈ నగర శోభ. ఈ నగర నిర్మాణం 'మయబ్రహ్మ' ఆధ్వర్యంలో జరక్కుంటే ప్రాకారాల నిర్మాణానికి పెద్దపెద్ద రాళ్ళను, భవన నిర్మాణాలకు చలువరాళ్ళను సముద్రం మధ్య దీవికి ఎవరు తేగలరు?

నగరమంతా దీర్ఘచతురస్రంలో ఉంది. నగరాన్ని చుట్టి ఉన్న రక్షణ ప్రాకారాలన్నీ కూడా దీర్ఘచతురస్రంగా నిర్మించబడినవే. పురవీధుల్లో తిరిగే పౌరుల్లో ఒంటిమీద బంగారంలేని మనిషి ఒక్కడు చూద్దామంటే కన్పించటంలేదు. కొందరు స్త్రీల ఒంటిమీదయితే కేజీలకొద్దీ బంగారు నగలున్నాయి.

అక్కడ అంగడివీధుల్లో అనేక రకాల వస్తువులు, నూలు, పట్టువస్త్రాలు, రాశులు పోసిన రత్నాలు, ముత్యాలు అమ్ముతున్నారు. ఆయుధాల విక్రయశాలలు, వ్యసాయ పనిముట్లు, పశువుల పలుపు తాళ్ళు అమ్మే అంగడులు దర్శన మిస్తున్నాయి.

అసలు ఆ ఏడుదీవుల్ని అనుసంధానం చేస్తూ ఈ నగర నిర్మాణం ఎలా సాగిందనేది చరక్‌కి ఎంత ఆలోచించినా అంతుచిక్కటంలేదు. ఇక సాధారణంగా ఇలాంటి దీవిమీద మంచినీటి సమస్య ఉంటుంది. కాని ఇక్కడా సమస్యేలేదు. ఎక్కడ తవ్వినా కొబ్బరినీళ్ళ వంటి మంచినీరు బావుల్లో లభ్యమవుతుంది.

అంతేకాదు నగరాన్ని చుట్టి అనేక నీటిబుగ్గలు ఉన్నాయి. వాటి నుండి సెలయేళ్ళలా నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. అది గంగాదేవి అనుగ్రహమట.

కృష్ణవాస్తు ప్రకారం శ్రీకృష్ణులవారే నగర నిర్మాణం చేయించినట్టు విన్నాడు. కాని అది సరికాదు.

ఈ విషయంలో ప్రొఫెసర్ షికారిపూర్ రంగనాథ్ గారి అభిప్రాయమే కరెక్టు. ఈ సుందరనగరాన్ని 'మయుడే' నిర్మించాడు. అయితే భవిష్యత్తు తనకు

ముందే తెలుసు గాబట్టి మయబ్రహ్మకు చెప్పి వాస్తుదోషం ఉండేలా శ్రీకృష్ణులవారే మయుడిచే నగర నిర్మాణం చేయించాడేమో... అక్కడి ధనవంతుల చలువరాతి భవంతులు చూస్తుంటే మతిపోతోంది.

చాలా సేపటి తర్వాత చరక్‌కి ఉన్నట్టుండి ఒక సందేహం ఏర్పడింది. ఈ సుందరనగరితో తనకు ముందే పరిచయం ఉన్నట్టు వీధులవెంట ఇలా తిరుగుతున్నాడేమిటి? ఇంత అందమైన పట్టణాన్ని ఇంతటి వైభవాన్ని కలలో కూడా చూడలేదే! మరింత నిర్భయంగా ఎలా తిరుగ గలుగుతున్నాడు. ఆ రాచనగరును, కోటను చూస్తుంటే ఎప్పటికైనా బలరామ, శ్రీకృష్ణులవారి దర్శన భాగ్యం కలుగుతుందా అన్పిస్తోంది.

ద్వారకాపురి వీధులన్నీ ఎంతో విశాలంగానూ, పరిశుభ్రంగానూ తీర్చి దిద్దినట్టున్నాయి.

అలా తిరిగి చూస్తున్న చరక్‌కి నగరంలో అనేక చెరువులు, ఉద్యానవనాలు వీధులకిరువంకలా అనేక వృక్షజాతులు కనువిందు చేస్తూ ఏది సాధారణ వీధి ఏది రాచబాటో తెలియడంలేదు.

కాలినడకన అలా తిరిగిచూస్తూ క్రమంగా ద్వారకకోట, రాచనగరు, అంతఃపురాలు ఉండే ఏడో కక్ష్యవరకు వెళ్ళిపోయాడు చరక్. అక్కడ కోట గుమ్మం వద్ద కావలివాండ్రు ఎవరినీ లోనికి అనుమతించుటలేదు. తగిన అనుమతి వున్నవారు, తెలిసిన వారినే వదులుతున్నారు. తనకా అవకాశం లేదు గాబట్టి అక్కడినుండే వెనుతిరిగాడు చరక్.

ఒక వీధిలో ప్రవేశింపగానే అక్కడ బాట పక్కనే ఒక కొలను, ఆ కొలను నిండుగా కలువలు రమణీయంగా కన్పించాయి. కొలను ఒడ్డున అనేక వృక్ష జాతులున్నాయి. ఒక చూతవృక్షచాయలో (మామిడి చెట్టు) తిన్నెమీద ఒక సన్యాసి అగుపించాడు. ఆయన్ని చూసి దిగ్భ్రాంతి చెందాడు చరక్.

నిన్న కుందుడి ఇంట భుజించి ద్వారక మార్గంలో వస్తుండగా దారిలో శాలివృక్షచాయలో అగుపించిన వృద్ధుడు, త్రిశూలధారి. కావిపంచె, నెరిసిన గడ్డం, మీసాలు, ఇప్పుడు కూడా ఆయన తననే చూస్తున్నాడు. పరిచయస్థుడిలా నగుమోముతో దగ్గరకు రమ్మని చేయి ఊపి సైగ చేస్తున్నాడు.

ఓరినాయనో. ఈ మహనీయుడు ఎవరోగాని ఈయనా తనని వదిలేలా లేడే. దగ్గరకు వెళ్తే ఏం తంటా వస్తుందో ఏమో... వచ్చిన కార్యము గాకుండా వేరే పనీ చూడను. వెళ్ళను గాక వెళ్ళను అనుకుంటూ వడివడిగా ఆయన్ని దాటి ముందుకెళ్ళిపోయాడు.

ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళిపోయాకగానీ– చరక్ మనసు కుదుట పడలేదు. ఏమి ఈ నగరశోభ? ఏమి ఈ ద్వారకావాసుల అదృష్టము. భూలోక వైకుంఠమువలె అలరారుచున్నదిగదా. నగరమంతా చూడవలెనన్న పక్షము దినములైనను చాలవేమో.

సూర్యుడు పడమర వాలుతూండగా ఆకలి గుర్తొచ్చింది చరక్‌కు. ఒక సత్రంలో భోజనం చేసి ఒకింత విశ్రాంతి తీసుకుని తిరిగి వీధిలోకొచ్చాడు.

నగరవాసుల్లో కొందరు తనను విచిత్రంగా చూస్తున్నారు. కొందరైతే నమస్కరించి పోతున్నారు. ఏమిటిది? వీళ్ళకి తను ముందే తెలుసా? తనిక్కడికి రావటం ఇదే తొలిసారిగదా! తను తెలియడం ఏమిటి? లేదు లేదు. బహుశా తను ఆ 'చతురుడి' పోలికలతో ఉన్నందున వచ్చిన సమస్య ఇది. చతురుడు అనగానే బావా అంటూ వెంటబడ్డ యువకుడు గుర్తొచ్చి ఉలిక్కిపడ్డాడు చరక్. అదృష్టమే. ఇంతవరకు వాళ్ళెవరూ తగల్లేదు.

ఆలోచిస్తూ ఒక వ్యాపారకూడలివైపు వీధిమలుపు తిరిగాడు చరక్. అలా తిరుగుతూండగానే అతనికి ఎదురొచ్చేశాడు 'బావా' అంటున్న యువకుడు. అతడ్ని చూడగానే పారిపోవాలనిపించింది చరక్‌కి.

అందుకు అవకాశం లేకుండా ఆ యువకుని మిత్రులు కొందరు చరక్‌ను కవర్ చేసి నిలబడ్డారు. చరక్‌కు ఏం చేయాలో తోచక – తల పట్టుకుని అలాగే నిలబడిపోయాడు.

చరక్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇప్పుడేం చేయాలి? తప్పిపోయిందను కుంటే మళ్ళీ వచ్చిపడిందీ ప్రమాదం. ద్వారకాపురి మొత్తం ఉదయం నుంచి తన కోసం గాలిస్తూనే ఉన్నట్టున్నారు వీళ్ళు.

ఇప్పుడు తప్పించుకొని ప్రయోజనం లేదు. ఏదో విధంగా నచ్చజెప్పకపోతే తిరిగి తిరిగి తన కాళ్ళకు అడ్డంపడుతూనే వుంటారు వీళ్ళు.

వీళ్ళమూలంగా నలుగురి దృష్టిలో పడితే చాలా ప్రమాదం. ఎక్కువ సేపు ఒకే చోట ఉండటం కూడా మంచిది కాదు. ఎవరో ఒకరు తన గుట్టు పసిగట్టే అవకాశం ఉంది. అసలే ఇది మహాపురుషులు, సిద్ధులు, యోగులు తిరిగే నగరి. తను కలియుగం నుండి ద్వాపరకు వచ్చినట్టు తెలిస్తే తనను వెనక్కి పంపించేయవచ్చు.

అప్పుడు తన జేజితాత అగ్నివేశాచార్యులవారు పడిన శ్రమకు అర్థం లేకుండాపోతుంది.

"ఏమిది బావా... ఏం నీ పంతము? ఏమి జరిగినది? ఓడ ప్రమాదము నుండి బయటపడినవాడివి ఇటుల పరదేశిలా తిరుగనేటికి? దుఃఖము నుండి మన రెండు కుటుంబములు ఇంకను తేరుకొనలేదు. అక్క నీ కొరకు విలపించు చున్నది. గృహమునకేగుదము. రమ్ము బావా" ఎంతో వినయంగా పలికాడా యువకుడు.

'ఓర్నాయనో చంపుతున్నావ్‌రా బామ్మర్దీ' అని మనసులోనే విసుక్కొంటూ పైకి ముఖం నిండా చిరునవ్వు పులుముకుని ఆ యువకుడ్ని చూశాడు చరక్. మీసాలు కూడా సరిగా మొలవని – రెండు పదుల బాలాకుమారుడతను. "నీ నామధేయమదేమి?" అని అతన్ని అడిగాడు చరక్. ఆ ప్రశ్నకు ముఖముఖాలు చూసుకున్నారంతా.

ఆ యువకుడు బాధగా చూశాడు. "మదీయ నామధేయము? అదియును మరిచితివా బావా? మరచితివా లేక కినుక వహించి మరచినటుల నటించుచుంటివా!" నొచ్చుకొంటూ అడిగాడు.

"మరపు లేదు మాయలేదు" ఆపి కాస్త కటువుగా అడిగాడు చరక్.

"మదీయ నామధేయము ధాత" చెప్పాడతడు.

"చూడుము ధాతబాలకా. నీవనుకొను నీ బావను నేను కాను" అన్నాడు చరక్.

"అనృతము వలదు బావా. మదీయ బావ చతురుడివి గాకున్నచో ఎవరు నీవు?"

"నేను వేరు... నీ బావ చతురుడు వేరు"

"అయ్యో! ఏమి ఈ దౌర్భాగ్యము. హతవిధీ. సంకటము గడచి వచ్చితివను సంతసము నిలువకున్నదే. ఏమిచేయుదు? అక్కకును నీకును నిశ్చితార్థమైనది.

నీల నదీతీరదేశము వరకు వెళ్ళి మరలివచ్చి వివాహము జేసుకొందునని మాటిచ్చి వెడలితివే. అక్కను, అక్క ప్రేమను మరచితివా....”

“నీవు పొరబడుచున్నావు బాలకా. నీవు వచించునది ఏమియు నాకు తెలియదు. నీ అక్కయును తెలియదు. నేను నీ బావను కాను. మదీయ నామధేయము చరక్”

“చరక్?”

“అవును చరక్”

“నిక్కముగా చరక్‌నా?”

“నిక్కముగా”

“పుట్టుమచ్చలతో సహా మా బావ చతుర్ మాదిరిగానే ఉంటివి గదా”

“మనిషిని బోలిన మనుషులుందురు”

“నమ్మశక్యముగా కున్నదే. నీవు చతురుడనే. ఎంతమాత్రము సందియము లేదు. జరిగిన ఓడ ప్రమాదమందు నీ తలకు బలమైన దెబ్బ తగిలి గతము మరచినట్టున్నావు. నీ పితృదేవుడు వల్లభాచార్యులవారు గొప్ప వైద్యులు. వారికింకను నీవు బ్రతికి వచ్చిన విషయము దెలియదు. మా గృహమునకు రాకున్నా మీ గృహమునకేగుదము రమ్ము”

చరక్‌కి ఎలా నచ్చచెప్పాలో అర్ధంగాక ఒకింత విసుగ్గా చూశాడు. అప్పటికే సమీపంలోని కొందరు పౌరుల దృష్టి వీరిమీద పడింది. ఆ సమీపంలోనే ముగ్గురు ద్వారకాపురి గూఢచారులు ఉండి వీరి వివాదమేదో అర్ధంగాక చూస్తున్నారు. చరక్‌కు వెంటనే అక్కడి నుండి పారిపోవాలనుంది.

“అయ్యో... ఎంత చెప్పినను నా పలుకులు విశ్వసింపవేల బాలకా. నేను మీ చతురుడను కానయ్యా” అంటూ కసురుకున్నాడు చరక్.

అంతలో చిత్రంగా – ఓ పెద్ద గాలితెర వీచింది. ఆ విసురుకు చరక్ తలకు చుట్టుకున్న తుండుగుడ్డ జారిపడింది. జుత్తు కత్తిరించబడిన అతడి తలను చూసి ఆ యువకులు మొదట నివ్వెరపోయారు. వెనువెంటనే పెద్దగా నవ్వడం ఆరంభించారు.

ధాతకూడా పడీపడీ నవ్వసాగాడు. కంగారుపడిపోతూ చరక్ వేగంగా వంగి తుండుగుడ్డ అందుకుని తిరిగి తలకు చుట్టుకున్నాడు.

"ఏమిది బావా... ఇది ఏ దేశయాచారము ఇటుల జుత్తు కత్తిరించు కొనుట...." వస్తున్న నవ్వు ఆపుకుంటూ అడిగాడు ధాత.

మరికాస్సేపు అక్కడే ఉంటే ప్రమాదమని చరక్ గ్రహించాడు. మరో మాటకు అవకాశం ఇవ్వకుండా తనవెనుక వున్న ఇద్దరు యువకుల్ని పక్కకు తోసి అవతలకు ఉరికి కాలి కొద్దీ పరుగు ఆరంభించాడు. అతడ్ని వదిలే ఉద్దేశం ఆ యువకులకు లేదు. ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ గుర్రాల నధిరోహించి చరక్ వెంటపడ్డారు. సమీపంలోనే వున్న గూఢాచారులు ముగ్గురూ ఆలోచనలో పడిపోయారు. "ఆ యువకుడు రాజవైద్యులు వల్లభాచార్యులవారి తనయుడు చతురుడే గదూ?" ఒకడు అడుగుతున్నాడు.

"అవును అతనే. అవును కాని ఆ జుత్తు కత్తిరించుకొని ఉండుట సందేహింపజేయుచున్నది" అన్నాడు రెండో వాడు.

"అవును. అతను చతురుడు కాదనుకొందును. అదే రూపురేఖలు కలిగిన విదేశీ గూఢచారిగావచ్చును. సమీపముగా కరటదేశ గూడచారులు సంచారము ద్వారకలో తెలియుచున్నది. మీరిరువురును ఆ యువకుని అనుసరించి పోయి నిక్కము తెలుసుకొని రండు. వేగిరం పొండు" అన్నాడు మూడోవాడు.

వెంటనే ఆ ఇరువురు గూఢచారులు చరక్‌ను వెదుకులాడుతూ అతను పారిపోయిన మార్గాన్ని అనుసరించడం ఆరంభించారు.

* * * * *

ద్వారకాపురి సందుగొందుల వెంట పరుగులు తీస్తున్నాడు చరక్. అశ్వాలమీద వెంటబడిన యువకుల్ని ఎలాగో తప్పించుకుని చాలాసేపటి తర్వాత ఒక రాజమార్గం సమీపంలోని భవంతి అరుగుమీద ఆయాసం తీర్చుకుంటూ కూర్చున్నాడు.

"వీళ్ళ దుంపతెగ. వీళ్ళెక్కడ దొరికార్రా బాబు. అరె. నేను కాదురా మొర్రో అంటున్నా విన్పించుకోరే" మనసులోనే ఉడుక్కుంటున్నాడు.

అది రాజమార్గం గాబట్టి – కాస్త రద్దీగానే ఉంది. ఎవరిదారిన వారు పౌరులు వీధిలో తిరుగాడుతున్నారు. వచ్చేపోయే వాహనాలను, గుర్రాలమీది ఆశ్వికులను చూస్తున్నాడు. ఆ ప్రాంతంలోని ఎత్తయిన భవన సముదాయాలు, వాటి సొగసులు చూస్తుంటే అది ధనవంతుల నివాస ప్రాంతంలా వుంది.

అటుగా వస్తున్న ఏ అశ్వం గిట్టలసద్దు విన్నా ధాత అతడి మిత్రబృందం వస్తున్నారేమోనని ఉలిక్కిపడుతూ ముఖం చాటుచేసుకోసాగాడు చరక్. ఆలోచనల్లో చరక్ ఉండగానే– జోడుగుర్రాలు పూన్చిన రథం ఒకటి – ఆ మార్గంగా వస్తూ కన్పించింది. ఆ రథాన్ని చూస్తూ అచ్చెరువొందాడు చరక్. అదేమి రథం?

దేవరథమా... దేవతా స్త్రీలు ఎవరైనా శ్రీకృష్ణ సందర్శనార్థం ద్వారక వీధుల్లోకి వచ్చారా!

ఎంత సుందరంగా ఉంది! అంతవరకు ముఖం చాటుచేసుకున్న చరక్ ఆ రథాన్ని, దాని సొగసుల్ని చూడకుండా ఉండలేకపోతున్నాడు.

అది ధనవంతులు, రాణివాసపు స్త్రీలవంటి వారు ప్రయాణించు రథం. దానికి కదంతొక్కుతున్న బలిష్టమైన రెండు ధవళాశ్వాలు పూన్చబడి వున్నాయి. ఇద్దరు పురుషుల్ని ఒకే గుద్దుతో పడగొట్టగల బలశాలి ఐన ఒక నడివయసు స్త్రీ ఆ రథానికి చోదకురాలిగా కూర్చునుంది.

రథం బాడీ మొత్తం పల్లకి షేపులో ఉంది. ఇరువంకలా పట్టుపరదాలు వేలాడుతున్నాయి. రథానికి గల నగిషీ అంతా బంగారుమయంగా ఉంది. రథ చక్రాలు సన్నగా దృఢంగా ఉండి వాటికీ బంగారు తొడుగులున్నాయి. మణిమయ స్వర్ణకాంతులతో మెరిసిపోతోంది రథం. అద్భుతము, అతి సుందరము అగు ఆ రథాన్ని చూస్తుంటే దీనిముందు బెంజికార్లు ఎందుకు పనికొస్తాయి అన్పించింది చరక్‌కు.

బలిష్టమగు ఆ అశ్వాలను చూస్తుంటే వాయువేగ మనోవేగంతో పరుగెత్తే అశ్వాల గురించి కథల్లో చదివింది నిజమేనేమో అన్పిస్తోంది. ఒక్కసారి... ఒకే ఒక్కసారి అలాంటి రథంలో ప్రయాణం చేయగలిగితే ఎంత బాగుంటుంది అన్పించింది. చూపులు తిప్పుకోలేక అలా చూస్తూండి పోయాడు చరక్.

అంతలో– అతడి సమీపంలోకి రాగానే – చటుక్కున ఆగిపోయింది రథం. అశ్వాలు సకిలించి కదం తొక్కుతూ నిలబడిపోయాయి.

రథాన్ని నడుపుతున్న స్త్రీ చరక్‌నే పరిశీలనగా చూడసాగింది. చరక్‌కి ఏమీ అర్థంకాలేదు. ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

'ఓరి దేవుడా. ఇదేం గోలరా తండ్రీ. ఇంతవరకు అబ్బాయిలే వెంటబడి తరిమారు. ఇప్పుడు అమ్మాయిలు తరుముకొస్తారా. ఏమిటలా చూస్తోందావిడ.

పారిపోవటం బెటరా...' ఎటూ తేల్చుకోలేక అవసరమైతే రన్నింగ్ అందుకోవడానికి సిద్ధపడుతూ ఆ రథం వంక చూడసాగాడు.

అంతలో రథం పరదా పక్కకు తొలగింది. ఒక సుకుమారమగు పాదం రథం మెట్టుమీద వాలింది. పాలమీగడవంటి చర్మకాంతి, లేత తమలపాకు లాంటి పాదం. ఆ పాదానికున్న అందెచూస్తూ చూపు తిప్పుకోలేకపోయాడు చరక్. పాదమే ఇంత అందంగా ఉన్నదే ఇక ఆ కోమలాంగి ఎంతటి సౌందర్యవతో గదా...

ఎవరామె... ఇచట ఎందులకు రథము నిలిపినది. తను కూర్చున్న తిన్నె తాలూకు భవంతిలోనికి పోవుటకా... ఆలోచిస్తున్నాడు చరక్. ఈ లోపల రథంలోంచి ఆ యువతి క్రిందకు దిగింది. ఆమెను చూస్తుంటే ఒక దేవకన్య భువికి దిగివచ్చిందా అన్పిస్తోంది. మెరుపుతీగ వంటి సౌందర్యం. గాగ్రాచోళీలాంటి దుస్తులు ధరించి వుంది.

ముఖం తెలీకుండా చున్నీతో పల్చటి ముసుగు వేసుకుంది. అయిననేమి ఏమా సౌందర్యము...

ఆరడుగులకు ఏమాత్రం తగ్గని ఎత్తు, లతవంటి శరీరాకృతి, సన్నటి నడుం, ఆకారమే ఇంత అందంగా ఉంటే ఇక ఆ ముఖపద్మం ఎంత సొగసుగా ఉంటుందో గదా...

ఆ క్షణంలో చరక్ మనసు పారిపొమ్మని హెచ్చరిస్తున్నా లెక్కచేయకుండా ఆ నవమోహనాంగిని అలా చూస్తూండిపోయాడు. ఆమె రథం వద్దనుండి కదిలింది. కాలి అందెలు, కరకంకణాలు రవళిస్తుండగా గబగబా వచ్చి చరక్ చేయి పట్టుకుంది. కుసుమ కోమలమైన ఆ చేయి తాకగానే చరక్ నరాలు జివ్వుమన్నాయి. మెదడు మొద్దుబారిపోయింది.

"ఏమిటా చూపులు కొత్తగా. మరల పారిపోవు ఆలోచనయా. నాతో రమ్ము" అతన్ని రథంవైపు లాక్కుపోసాగింది.

"అయ్యో, ఏమి ఈ విపరీతము. నా చేయి వదులుము నీవెవరివో నాకు తెలియదు" విడిపించుకోబోయాడు చరక్. ఆమె వదల్లేదు.

"ష్... తెలియదని ఎంతకాలము తప్పించుకు తిరిగెదవు. నీవు నా చతురుడవని నాకు తెలుసు. పదుగురు జూడకమున్నే రథము నధిరోహింపుము" అందా సుందరి.

"నేను చతురుడగాను సుందరీ నన్నొదులుము" అర్ధించాడు.

"వదులుటయా... కల్ల. ముందు పద చెప్పెద" అంటూ చరక్‌ని రథములోకి తోసి వెనకే తనూ ఎక్కి కూర్చుని పరదా మూసిందా సుందరి.

"త్రిజటా!" రథచోదకురాలిని పిలిచింది.

"వచింపుము దేవీ. ఏమి ఆనతి? సోదరుడు ధాతవారు అశ్వారూఢులై యిటే విచ్చేయుచున్నారు" అని ముందుభాగంలో అశ్వాల కళ్ళెములు పట్టి కూర్చున్న స్త్రీ పలికింది.

"ధాతతో చెప్పుము. బావను తోడ్కొనిబోవుచుంటి. రథమును మన ఉద్యానవనమునకు బోనిమ్ము" అంటూ ఆజ్ఞాపించిందా సుందరి. త్రిజట అనే ఆ రథ చోదకురాలు ధాతతో అలాగే చెప్పి వారిని పంపించి రథాన్ని వెనక్కు తిప్పి పరుగెత్తించింది. జరిగిందంతా ఆ సమీపంలోకి వచ్చి గమనించిన ద్వారకాపురి గూడచారులిరువురూ అక్కడి నుంచి వెనుతిరిగారు.

* * * * *

కలియుగం! నందన నామ సంవత్సరం, క్రీస్తు శకం 2013 మార్చినెల, అయిదో తారీకు, సోమవారం రంపచోడవరం అడవుల్లోని అగ్నివేశాచార్యుని స్థావరం. అప్పటికి చరక్ ద్వాపరయుగం నాటి ద్వారకాపురికి వెళ్ళి వారం రోజులవుతోంది. స్థావరంలో అగ్నివేశాచార్యునితోబాటు పిల్లా గోవిందపాత్రుడు మిగిలిన వారంతా అక్కడే ఉన్నారు.

అగ్నివేశాచార్యుడు ఎక్కువ సమయం తనపూజా మందిరానికే పరిమితమవుతున్నాడు. పూజలు, తపోధ్యానంలో కాలం గడుపుతున్నాడు. అప్పుడప్పుడూ కాలనాళిక మందసంగల గదిలోనికెళ్ళి మందసంలోని మునిమనవడు చరక్ శరీరాన్ని ఆప్యాయంగా దర్శించివస్తున్నాడు.

పిల్లా గోవిందపాత్రుడు "బాధపడుతున్నారా" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశారు.

"మానవమాత్రులం గదా. ఎంత యోగి అయినా సిద్ధుడయినా భవబంధాలకు అతీతంగా ఉండలేము. నా చరక్‌ను తలచుకుంటే ఒకింత గర్వంగానూ ఉంది. ఒకింత బాధగానూ వుంది.

ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అందమైన భార్య. అచ్చటా ముచ్చటా ఏమీతీరలేదు. కేవలం నా ఆశయ సాధనకోసం, నా లక్ష్యం నెరవేర్చటం కోసం హాయిగా చేసుకుంటున్న ఉద్యోగం వదిలి, ప్రాణంలో ప్రాణమైన భార్యను వదిలి అందరికీ దూరంగా సాహసంతో ద్వారకానగరికెళ్ళాడు.

అక్కడ హైదరాబాద్‌లో శుశ్రుత వేయికళ్ళతో వీడికోసం ఎదురు చూస్తోంది. చాలా గర్వంగానూ ఉంది. అదే సమయంలో వీళ్ళని విడదీసి నందుకు బాధగాను ఉంది" అంటూ మనసులో మాటను బయటపెట్టాడు అగ్నివేశాచార్యుడు.

"బాధపడకండి స్వామీ. మీ పట్టుదల, కృషి చరక్‌లోనూ ఉన్నాయి. విజయంతో త్వరలో తిరిగివచ్చేస్తాడు" అన్నాడు ఓదార్పుగా గోవిందపాత్రుడు.

"నిజమేనయ్యా. కాని ఎప్పటికి తిరిగివస్తాడో ఎన్ని రోజులు పడుతుందో, ఎన్నినెలలు పడతాయోతెలీదే... కొద్ది రోజులు ద్వారకలోఉండి రావాలి. నేను చెప్పిన విషయాలు బాగా ఆకళింపు చేసుకుని గమనించి తిరిగి రావటానికి టైమ్‌పడుతుంది. చూద్దాం" అంటూ భారంగా నిట్టూర్చి వెనుతిరిగాడు అగ్నివేశాచార్యుడు.

"యోగశక్తి ద్వారా చరక్‌తో అనుసంధానమయ్యే అవకాశం లేదా గురువు గారూ?" అని ఆయన్ని అనుసరించి బయటికి వస్తూ ప్రశ్నించాడు పిల్లా గోవింద పాత్రుడు.

"ఉంది. కొంచెం కష్టమేగాని సాధించవచ్చు. కాని ఇప్పుడే ఆ పనిచేసి వాడ్ని డిస్టర్బ్ చేయకూడదని ఆలోచిస్తున్నాను" బదులిచ్చాడు అగ్ని వేశాచార్యుడు. ఆ గదికి ఎప్పటిలా తాళం వేయబడింది.

ఇదే సమయంలో బయట ఆవరణలో ఒక సంఘటన చోటు చేసుకుంది. ఎందుకో బయటికొచ్చిన అప్పన్నకు అంత దూరంలో చెట్లనీడన ఒంటరిగా నిలబడి శాటిలైట్‌ఫోన్‌లో ఎవరితోనో సంభాషిస్తూ కన్పించాడు డ్రైవరు కాశీ.

వాడలా మాట్లాడ్డం చాలాసార్లు గమనించాడు అప్పన్న. ఏమిటి వీడు? ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నాడు? తనకు ఎవరూలేరని ఒంటరిగాడినని అంటుంటాడు. ఇదేమిటో తెలుసుకోవలసిందే అనుకుంటూ ఏదో పనిఉన్నట్టు డ్రైవర్ కాశీవైపు అడుగులు సారించాడు.

ఫోన్‌లో సంభాషిస్తున్న డ్రైవర్ కాశి దూరం నుంచే అప్పన్న రాకను గమనించాడు. కంగారుగా ఫోన్‌లో ఏదో చెప్పి వెంటనే ఫోన్ ఆఫ్ చేయటమే కాదు, దాన్ని భుజానవున్న తోలుసంచిలోకి తోసేశాడు. వాడి తీరు చూస్తే ఏదో తప్పు చేస్తున్నాడని అనుమానం కలిగింది అప్పన్నకు. డ్రైవరు కాశి ఏమీ జరగనట్టే అప్పన్నకు ఎదురు వస్తూ– "ఏమిట్రా అప్పన్నా. ఎక్కడికి బయలు దేరావ్?" అంటూ పలకరించాడు.

"ఆ ఏంలేదన్నా. వాగు పక్క అరటిచెట్లలో చక్కెర కేళి గెల చూశాను. మరీ ముగ్గేవరకు ఉంచితే కోతులు ఉంచవు. వెళ్ళి నరుక్కొద్దామని పోతుండాను. అది సరి. నీకు వెనకాముందు ఎవరూ లేరన్నావు గదా?" అడిగాడు అప్పన్న.

"అవున్రా. ఒంటరివాడ్ని" అన్నాడు కాశి.

"పెళ్ళయిందా?"

"పెళ్ళయితే పెళ్ళాంతో కాపరం జేసుకోకుండా ఇక్కడెందుకుంటారా మొద్దూ" అన్నాడు డ్రవర్ కాశి.

"పోనీ లవరు?"

"ఛ. అదేం లేదులే'

"ఏం లేనప్పుడు ఆ ఫోన్‌లో గుసగుసలేందిరా యెదవ. మనలో మనమాట. ఎవరికీ చెప్పన్లే. శాటిలైటు ఫోనులో సీక్రెట్‌గా మాట్లాడు తున్నావంటే నీకు లవరు ఉండే ఉంటుంది. అవునా?" విషయం సేకరణకు ప్రయత్నించాడు అప్పన్న.

డ్రైవరు కాశి కాస్త సిగ్గుపడుతూ – చెప్పనా వద్దా అన్నట్టు చూశాడు. "ఓరి నీ సిగ్గు చిమడ. సిగ్గుపడింది చాలుగాని చెప్పరా" అంటూ నవ్వాడు అప్పన్న.

"నీ దగ్గర దాపరికం ఏందిగానిరా అప్పన్నా. నాకో లవరు ఉన్నమాట నిజమే" అన్నాడు కాశి.

అది విని కళ్ళు విశాలంగా చేసి అబ్బురంగా వాడ్ని గమనించాడు అప్పన్న.

"నా లవరు వైజాగ్‌లో ఉంటుంది. ఉంచుకున్నా. నేనంటే పడిఛస్తుంది. సానా అందంగా ఉంటుంది తెలుసా? పేరు దమయంతి"

"నువ్వంటే పడిఛస్తుంది. కాని నువ్విక్కడ, అదక్కడ. వెళ్ళినప్పుడంతా జేబు ఖాళీచేస్తుంది. ఓరి సన్నాసీ పెళ్ళి జేసుకోవాలిగాని ఇవేం వెధవపనుల్రా. నీ ఇల్లు ఒళ్ళుగుల్లయిపోద్ది. ఇవి కలసిరావుగాని ఒగ్గెయ్" అన్నాడు అప్పన్న.

"ఒగ్గెయ్... అదేం మాటరా?"

"మా తుర్పుసైడు వదిలెయ్ అనడానికి ఇలానే ఒగ్గెయ్ మంటార్లే. నా మాటిని వదిలెయ్. అంతే" అంటూ గండ్రగొడ్డలి భుజాన వేసుకుని వాగు దిశగా వెళ్ళిపోయాడు అప్పన్న.

వెళ్తున్న అతన్ని చూసి నవ్వుకొంటూ – జీప్‌వైపు కదిలాడు డ్రైవర్‌కాశి. వెళ్తున్నాడేగాని అప్పన్న మనసు కాశి గురించే ఆలోచిస్తోంది. తనసలే అనుమానం పురుగు. ఏ విషయాన్నయినా ఒకటికి రెండుసార్లు ఆలోచించకుండా వదలడు. కాశి చెప్పిందాంట్లో ఎంతవరకు నిజం వుందో ఊహిస్తున్నాడు.

నిజంగా వాడు తన లపాకితో మాట్లాడింది నిజమైతే తనను చూసి అర్జంటుగా ఫోన్ ఆపేయాల్సిన అవసరం ఏమొచ్చింది. పైగా ఖరీదైన శాటిలైటు ఫోను వాడికి అవసరమా? వాడి దగ్గర ఆ ఫోనున్న సంగతి బహుశా తనకు తప్ప స్థావరంలో ఎవరికీ తెలీదు. అసలే ఇది రహస్యస్థావరం. గురువు గారు వచ్చేముందే తనకు ఎన్నో జాగ్రత్తలు చెప్పారు.

ఒకవేళ వాడు చెప్పింది అబద్ధమైతే నిజం ఏమై ఉంటుంది? ఇక్కడి విషయాలు రహస్యంగా శత్రువులకి చేరవేస్తున్నాడా. అదే నిజమైతే ఇక్కడందరికీ ప్రమాదమే గదా!

ఊహుc కాశి దగ్గర ఏదో రహస్యముంది. ఓ కంట వాడ్నికనిపెట్టాలి. అదేమిటో తెలుసుకునేవరకు ఎవరికీ చెప్పకూడదు. ఆలోచిస్తూనే వాగు వద్దకు చేరుకున్నాడు అప్పన్న.

*　　*　　*　　*　　*

రాజమార్గంలో నెమ్మదిగా పరుగు తీస్తోంది రథం. గుర్రాల గిట్టల శబ్దం లయబద్ధంగా విన్పిస్తోంది. పరదాలోన రథంలో ఎవరున్నారో బయటికి తెలీదు. కాని లోన కూర్చుంటే బయట అంతాస్పష్టంగా సీత్రూ గ్లాస్‌లా కన్పిస్తోంది.

అసలు ఏ టెక్నిక్ ఉపయోగించి ఆ బట్ట తయారు చేశారో చరక్‌కి అంతుబట్టలేదు. కూర్చుంటే దూదిలో కూరుకుపోతున్నంత మృదువుగా ఎదురు బదురుగా రెండు సీట్లున్నాయి పొడవుగా. కాని ఆమె ఎదురుగా కూర్చోలేదు. చరక్ సరసనే అతడికి హత్తుకొని కూర్చునుంది. చరక్ చేయి ఇంకా ఆమె చేతిలోనే ఉంది.

బయటికి చూస్తూ– తీవ్రంగా ఆలోచిస్తున్నాడు చరక్. రథం సొగసుకు ముగ్ధుడై ఒక్కసారి ఇలాంటి రథంలో పయనిస్తే ఎంత బాగుంటుందో అనుకున్నాడు. ఖర్మగాకుంటే అనుకున్న కొద్దిక్షణాల్లోనే వచ్చి రథంలో పడాలా! సందేహం తీరిపోయింది.

ఈమె ఎవరో కాదు. ధాత నామధేయం కలిగిన ఆ కుర్రాడి అక్క. పేరేమిటో తెలీదుగాని తనుకూడా రంగంలోకి దిగి రథంలో తిరుగుతూ తనకోసం గాలిస్తోందని తెలిస్తే ముందే జాగ్రత్తపడేవాడు. అనవసరంగా ఇరుక్కుపోయాడు. ఏం చేయాలి?

ఓరకంట ఆమె వైపు చూశాడు. మేలిముసుగులోంచి ఆమె తననే చూస్తోంది. చేయి వెనక్కు తీసుకోబోయాడు. మరింత గట్టిగా పట్టుకుందామె. కుసుమకోమలి ఆమెచేతికి ఇంతబలం ఎక్కడిదో అర్థం కాలేదు.

ఆమె శరీరసుగంధం మనసును చంచలపరుస్తోంది. ఆరడుగుల అతివ. అతిలోకసుందరి. నగరంలో గొప్ప ధనికుని కూతురై ఉంటుంది. తన వెంట పడ్డం ఏమిటి. తనే ఆరడుగుల హైటు. తనకన్నా ఒకటి రెండంగుళాలు పెచ్చే వుంటుంది. ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? ఈ సుందరాంగి బారి నుంచి తప్పించుకోవటం ఎలా? ఐనా ఆమేలిముసుగు కూడా తీయొచ్చుగా. ముఖార విందాన్ని దర్శించి పారిపోవచ్చు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు చరక్.

"ప్రియుడా... ఏమియా దీర్ఘాలోచన?" పలకరించిందా సుందరి. వీణ మీటినట్టు మృదుమధురమైన స్వరం.

"కనికరముతో కరము వదిలిన ముదమునందెద దేవీ" అన్నాడు.

"ఎందులకు ప్రియుడా. మరల పారిపోవుటకా... వదల" అంటూ మరింత గట్టిగా అతని చేతిని పట్టుకుందా సుందరి.

"పారిపోను. సందేహము వలదు. కరము విడువుము" నవ్వాడు. అయినా చేతిని వదల్లేదామె–

"నీవు పట్టవలసిన కరమును నేను పట్టితినే... నీకేమియు గతము గుర్తు రావటములేదా ప్రియుడా.

మన ప్రేమ మనం విహరించిన సంధ్యాసమయములు...." అడిగింది. పెదవి విరిచాడు చరక్.

"నేను నీ ప్రియుడనుగానుగా. గుర్తు రాదు" అన్నాడు. నిజంగానే చరక్‌కు ఏమీ గుర్తురావటంలేదు.

"అటులనుడువుట పాడియగునా ప్రియుడా! అనృతము లేల? ఈ అలకలు కినుకలు ఎందులకు? ఏమి జరిగినదో వచింపుము" అంది ఆ సుందరి బాధగా.

"జరుగుటకే మున్నది. ఇష్టపూర్వకముగానే ఆ కాలము నుండి ఈ కాలమునకు వచ్చి నీ చేత జిక్కితి" అన్నాడు చరక్.

"నీ పలుకులు కడు విచిత్రముగనున్నవే. మది చెడినదా మనసు విరిగినదా. ఇదియే గదా మననగరి. ద్వాపరకాలమందే ఉంటిమి గదా. మాటల గారడీలు జేసి నన్ను మోసగింపజాలవు. నీవే నా ప్రియుడు చతురుడవు. ఇది నిక్కము" అంటూ అతడి చేతిని బుగ్గలకు ఆన్చుకుని ప్రేమాతిశయంతో అరచేత తన పగడాల పెదవులాన్చి ముద్దాడింది.

నునువెచ్చని ఆ స్పర్శకు – చరక్ మనసు తత్తరపడింది. ఏవో లోకాల్లో విహరించింది. 'ఇదేం సమస్యరా దేవుడా! ఈ మగువకు ఏమి చెప్పి నమ్మించ వలెనో తెలియుటలేదే. కింకర్తవ్యం?...' ఆలోచిస్తున్నాడు. అసలు విషయం ఈమెతో చెప్పేస్తే వదులుతుందేమో. కాని అలా తన గుట్టు తనే బయటపెట్టు కుంటే కొత్త సమస్యలు రాకుండా ఉంటాయా? ఇది ఏమి సంకటమో తెలియ కున్నదే.

"ఈ మేలిముసుగు ఇదేల తరుణీ? తొలగించిన నీ ముఖారవిందమును వీక్షింపనగును గదా!" ఏదో ఒకటి చెప్పాలి గాబట్టి అలా అన్నాడు.

ఆమె శబ్దం వచ్చేలా ఒకింత నవ్వింది.

"నీవు జూడని ముఖారవిందమా ఇది? తొందరేలనో... కొంచెము తాళుము" అంది.

మాటల్లోపడి గమనించలేదుగాని- అప్పటికే రథం ఉద్యానవనములో ప్రవేశించింది. ఒక చలువరాతి మండపం ముందు ఆగింది.

"దేవీ... మణిమండపమును జేరితిమి. ఏమి ఆనతి?" రథచోదకురాలు త్రిజట గొంతు వినిపించింది. చరక్ చేయిపుచ్చుకుని రథం దిగిందా అతివ. ఆమెతోబాటు దిగాడు చరక్. ఆమె త్రిజటను చూస్తూ- "మాకు ఏకాంతము గావలె" అంది.

"చిత్తము దేవీ" అంటూ త్రిజట, రథం దూరంగా వెళ్ళిపోయింది. ఇరువురూ మణిమండపములో ప్రవేశించారు. సువిశాలమగు చలువరాతి మండపం అది. దాని స్తంభాలు అతి సుందరంగా మలచబడి శిల్పకళతో ఆకర్షిస్తున్నాయి. ఆ మండపం అవతల తామరకొలను వుంది. ముకుళించిన అనేక పద్మాలు కనువిందు చేస్తున్నాయి.

చుట్టూ రమణీయమగు ఉద్యానవనం. ఏకాంతంలో వారిరువురూ కొలనువైపు మండపం మెట్ల మీద నిలబడున్నారు. ఆమె చరక్ చేతిని వదలడం లేదు. ఇక్కడో విచిత్రాన్ని కూడా గమనించాడు చరక్. తను ఆరడుగుల ఎత్తు అనుకుంటున్నాడు. అది కలియుగంలో మాట. ఇప్పుడు ఆరున్నరడుగుల ఎత్తు ఉన్నాడు.

ఆమె పక్కన నిలబడితే తన కన్నా మూడంగుళాలు ఎక్కువే ఉన్నాడు. బహుశా కాలధర్మాన్నిబట్టి ఈ మార్పు వచ్చిందేమో అన్పించింది.

"ప్రియుడా! ఎన్నియో సంధ్యా సమయములు మనమీ మణిమండపమున గడిపితిమి. ఎన్ని ఊసులు, ఎన్ని చిలిపిపనులు గురుతున్నదా?" చరక్ చేయి వదిలి అడిగిందా సుందరి.

"గురుతు వచ్చుటకు నేను చతురుడనుగాను దేవీ" అన్నాడు. అంతే- చటుక్కున తన మేలిముసుగును తొలగించిందామె. మబ్బు తొలగి చంద్రోదయ మైనట్టు ముసుగునుండి బయటపడిన ఆమె ముఖ సౌందర్యం గాంచి విభ్రాంతి చెందాడు చరక్.

అచ్చెరువుతో అవాక్కయినాడు. ఆహా... ఏమి ఈ సౌందర్యము... ఏమి ఈ సోయగము... రెప్పవాల్చితే ఆ అందమంతా ఎక్కడ చెదిరిపోతుందో గదా అన్నట్టు అలా మైమరచి చూస్తూండిపోయాడు.

'మనసా... అదుపులో నుండుము. పరవశంలో ఆమె వశం కావలదు సుమా... ఈమె పరకన్య. నేను వివాహితుడను. మరువకుము' తన మనసును హెచ్చరించాడు.

ఈమె గంధర్వకన్యయా? గాకున్న మానవులకు ఇంత అందం ఎక్కడిది. ఏమా ముఖతేజస్సు.

ఏమా కనుల సోయగం. విశాలనేత్ర – పద్మాక్షి– మీనాక్షి – కమలనయన– ఊహు.

ఈ వర్ణనలేవియు ఆమె కనుల అందాలను ప్రతిఫలించలేవు. నాసిక సంపంగివలె నున్నదే... అవి బుగ్గలా వెన్నముద్దలా... చెక్కుటద్దాలలో నీడ ప్రతిఫలిస్తున్నదే.

తేనెలూరు ఆమె లేతపెదవులు జాతి పగడాలను తలపించుచున్నవి.

శంఖమును బోలిన మెడభాగము, సుందరమగు కంఠసీమలో మణి మయరత్న సువర్ణహారముల కాంతులు ఆమె ముఖసోయగాలను ఇనుమడింప జేస్తున్నవే. ముక్కున ముక్కెర, చెవులకు కర్ణాభరణాలు నుదుట పాపిటపిందె, జడగంటలు... ఒకటేమిటి స్వర్ణమయంగా సర్వాభరణభూషిత ఆమె.

ఇంతటి అందగత్తెలు భువిలో ఉన్నారా అనిపించి తనను తాను మర్చిపోయి ఆ ఆరడుగుల అతివ అందాన్ని చూస్తూండిపోయాడు.

ఆ చతురుడు ఎవడోగాని ఈమెను ఎడబాయుట నిజముగా అతడి దురదృష్టమే అన్పించింది.

పలకదేరిన శరీరాకృతి – కుచోన్నతి– ఆ యవ్వనగిరులభారాన్ని ఎటుల సహింపనోపునోయనునట్లు సన్నటి నడుము – విశాలమగు కటిభాగం– బలమైన ఊరువులు – ఆమెలోని ప్రతి అణువు, ప్రతి అంగము ఆ సృష్టికర్త ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్ది ఆడతనం అందాలన్నిటినీ ఈమెకే సొంతం చేశాడా అన్పిస్తోంది.

"నీకు ఏవి గురుతురాకున్నను నా ముఖము గురుతుండవలె. చెప్పుము చతురా. నేనును గురుతులేనా?" కనులలో సుడితిరుగుతున్న కన్నీటిని అదుపు జేసుకుంటూ డగ్గుత్తికతో ప్రశ్నించిందామె.

తల విదిలించి–బాధగా చూశాడు చరక్. ఏమని చెప్పగలడు? కలియుగం లోంచి ఇప్పుడే వచ్చినవాడు తను. ఇక్కడ ఏం జరిగింది ఈ అందాలరాశి

ఎవరు ఆ చతురుడు ఎవరు, ఏమీ అర్థంగావటంలేదే! కాని ఆమె దీనవదనాన్ని చూస్తుంటే మనసు ఎందుకో కలత చెందుతోంది. చాలా బాధగా ఉంది.

నోటితో గుర్తులేదని చెప్పలేక– తల అడ్డంగా ఊపాడు తెలీదని. అంతే– ఇక క్షణం కూడా ఆగకుండా తన చేతులతో అతడి ఛాతీని చుట్టుకుపోతూ ఛాతీలో ముఖం దాచుకుని ఒక్కపెట్టున ఏడ్చేసింది.

"ఇదియేమి సంకటము. ఇదియేమి విపరీతము. మన ప్రేమకు పరీక్షయా... ఏమనుకొందును ప్రియుడా. నన్ను మరచితివా! నా వలపును, మన ప్రేమను మరచినావా... వలదన్నను వినకుండా ఆ నీలదేశము (నీగ్రోల రాజ్యం) నకేల ఏగవలె? నడు కడలినందు ఓడయేల మునగవలె.

బ్రతికివచ్చిన నీవు గతము మరచుటేల? ఇది విధి వైపరీత్యమా, మన ప్రారబ్ధమా తెలియకున్నదే.

నీవు ఇటులనే నిరాదరించిన నాకు ప్రాణత్యాగము కన్న వేరు మార్గము లేదు" అంటూ ఓపలేని మోహావేశంతో అతడి అధరాలను గాఢంగా ముద్దాడింది. ముఖమంతా ముద్దులతో నింపేసింది.

ఆమె బిగికౌగిట ఉక్కిరిబిక్కిరై కొద్దిక్షణాలు వివశుడైపోయాడు చరక్. అతడి కళ్ళలోను చెమ్మ తిరిగింది. ఆమె తనూలతను తన గుండెలకు హత్తుకోకుండా ఉండలేకపోయాడు.

ఆ గాఢపరిష్వంగంలో ఒక గమ్మత్తు గజిబిజి చేస్తోంది. ఏదో లీలగా తెలిసీ తెలీని గతం గోచరిస్తోంది. ఆమె తనదే. ఎన్నడో పోగొట్టుకున్న బంధం తిరిగి చేజిక్కినటుల ఒక లీలామాత్రపు ఛాయ హృదయకవాటాన్ని తడుతోంది.

తమ మధ్య పూర్వబంధం ఏదో ఉంది. లేకున్న ఇంత గాఢానుబంధం సాధ్యంకాదు.

ఆమె వెన్నుతట్టి ధైర్యం చెప్పి– కన్నీరు తుడిచాడు చరక్. తన ముఖాన్ని ముద్దులాడితేగాని– అతన్ని వదల్లేదామె. "కలతచెందకు సుందరీ. మనం చాలా ముచ్చటించవలె. కూర్చొనుము" అంటూ ఆమెను మణిమండపం మెట్ల మీదే కూర్చుండజేసి తను పక్కన కూర్చున్నాడు చరక్.

"నీ నామధేయమేమి?" అడిగాడు.

"అయ్యో!" అంటూ నుదురు కొట్టుకుందామె. "అదియును మరచితివా" అంది.

"ఉత్తినే చెప్పుము"

"మిత్రవింద"

"మిత్రవింద?"

"అవును. మిత్రవిందనే"

"శ్రీకృష్ణులవారి అష్టభార్యల్లో ఒకరు మిత్రవింద గదా!"

"అవును. లోకమున ఒకే పేరుతో ఎందరు లేరు?' "అదియును నిజమే సుమా. అవునూ... మీ తండ్రి గారు ఎవరు?" అడిగాడు చరక్.

"వారి పేరునూ మరచితివా?" మిత్రవింద చూపుల్లో కోపం కన్పించింది.

"మరచితినంటిని గదా. కోపమేల. ఏమి జరిగినదో తెలిసినచో అంతా జ్ఞప్తికివచ్చునని నా ప్రయత్నము" అని నచ్చచెప్పాడు చరక్.

"అటులనా. వినుము. నేను మిత్రవిందను. నా తమ్ముడు ధాత. మాకు పైన పదిమంది సోదరసోదరీ మణులు ఉన్నారు. వారిలో చాలామందికి వివాహములైనవి" అంది.

"ఓర్నాయనో. చాలా పెద్ద ఫ్యామిలీ" మనసులో అనుకున్నాడు చరక్. "తర్వాత?" అడిగాడు.

"మా తండ్రిగారు శివదేవగుప్తులవారు. బేహారి. విదేశీవ్యాపారములో ఎంతో సంపాదించినారు. మాకు మూడు ఓడలున్నవి. నగరంలోని ధనిక కుటుంబాల్లో మాదీ ఒకటి. ప్రస్తుతం వ్యాపారభారమంతా సోదరులే వహించు చున్నారు. వారందరి మధ్య అల్లారు ముద్దుగా పెరిగినదానను.

మా పక్క వీధియందే వల్లభాచార్యులవారి గృహం కలదు. వారి కనిష్ట కుమారుడు చతురుడవు నీవు. నీకు ముందు పదునాలుగురు సోదర సోదరీమణులు ఉన్నారు. మీది వృత్తిరీత్యా ఆయుర్వేద కుటుంబము. మీ తండ్రిగారు చరకమహర్షులవారి శిష్యులు. బలరామప్రభువుల వారి ఆస్థాన వైద్యులు."

"ఆగుము మిత్రవిందా... ఒకింత ఆగుము" అంటూ ఆమె మాటలు వింటున్న చరక్ ఆలోచనలో కూరుకుపోయాడు. ఏమిటిది? ఊహించటానిక్కూడా

సాధ్యంగావటంలేదే...! అక్కడ కలియుగంలోనూ తన కుటుంబం ఆయుర్వేద కుటుంబమే గదా!

ఇక్కడ ద్వాపరంలోనూ ఒక ఆయుర్వేద కుటుంబమా...? ఇంతకీ తను చతురుడా... చరకుడా... ఇది కాకతాళీయమా లేక గతజన్మలో తను చతురుడేనా!... కాకున్న ఇంతమంది పొరబాటుపడే అవకాశం ఉందా? కాని తనకేదీ గుర్తురావటం లేదే... ఊహుఁ గతజన్మ అయిఉండదు.

ఆ చతురుని పోలికలు తనలో ఉన్నందున వచ్చిన సమస్య ఇది. కాని... ఇక్కడా ఆయుర్వేద కుంటుంబంగావటంతో సందేహించాల్సివస్తోంది.

అలా అనుకున్నప్పటికీ ఆ క్షణంలో నిన్న క్షతగాత్రుని చూడగానే అగ్ని ప్రభ మొక్క ఎలా గుర్తొచ్చింది? దాని ఆకులతో వైద్యం ఎలా చేయగలిగాడు. అంతా గందరగోళంగా ఉందే. ఎటూ నిర్ణయంచుకోలేకపోతున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

"ప్రియుడా. ఓ ప్రియుడా! ఏమా యోచన?" మిత్రవింద పలకరింపుతో ఆలోచనల నుండి బయపడ్డాడు చరక్.

"అదేమియును లేదు. తదుపరి విషయములు దెలుపుము" అన్నాడు.

"తదుపరి... తదుపరి ఏమున్నది? మన ప్రణయమే గదా. మరచితివా. గత వసంతోత్సవములందు మన తొలిపరిచయం. ఇదే మణిమండపమున మనం ఏకాంతమున కలుసుకొని ప్రేమించుకొంటిమి. మన మధ్యదూతికగా వ్యవహరించి అనుసంధాన పర్చినది ఎవరో గురుతున్నదా? నా రధచోదకురాలు త్రిజట" అంటూ నవ్వింది మిత్రవింద.

"అవునూ... నేను వైద్యుడనా?" సందేహ నివృత్తి కొరకు అడిగాడు చరక్.

"ఆహాఁ సందేహమా? మీ పితృదేవుని శిక్షణ యందు పిన్నవయసు నందే ఘనవైద్యునిగా పేరు వడసితివి. మన ప్రణయము దెలిసిన మనపెద్దలును ముదముతో మనలనాశీర్వదించినారు.

నిశ్చితార్థమును జరిగినది. అంతలో ఎర్రసముద్ర తీరదేశ ప్రభువునకు వైద్యనిమిత్తం నీవు బోవలసి వచ్చి అటుకేగి మరలివచ్చిన పిదప పెండ్లి యాడుదునని బాసజేసి వెడలినావు.

పక్షము దినములైనది. అంతలో నడకడలియందు ఓడ ప్రమాదమున నీవు మరణించితివని కబురు తెలిసి, మేమంతా కృంగిపోతిమి" అంటూ అతడి భుజం మీద తలాన్చుకొని చెమర్చిన కళ్ళు తుడుచుకుంది మిత్రవింద. చరక్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

పరిస్థితి చూస్తుంటే – మిత్రవింద తనను వదిలేలా లేదు. ఆమె మనసు మారాలంటే తనెవరో ఏమిటో కాస్తయినా చెప్పాలి. లేకుంటే ఇక్కడ తను స్వేచ్ఛగా తిరగలేడు. అందువల్ల సమస్యలెదురైనా ఎదుర్కోకతప్పదు. భారంగా నిట్టూర్చి ఆమెవంక చూశాడు.

మిత్రవింద తన ముఖంలోకే చూస్తోంది. ఆ కళ్ళలో ఎంత ప్రేమ... ఎంత ఆరాధన... శుశ్రూతను మరపింపజేస్తోంది కదా...

ఆమె ముఖ సౌందర్యం చూస్తుంటే గొంతుదాటి మాట రావటంలేదు. "ప్రియుడా! గతము గుర్తుకొచ్చినదా?" అడిగింది మిత్రవింద.

"లేదు దేవీ... నాకేమియు తెలియుటలేదు. నీకో నిజము జెప్పెద వినుము" అన్నాడు.

"ఏమా నిజము?"

"నేను ఈ కాలపు చతురుడను కాను"

"మరి ఏ కాలము వాడివి?" విచిత్రంగా నవ్వుతూ ప్రశ్నించింది మిత్రవింద.

"కలికాలము వాడిని... నా పేరు చరక్"

"కలికాలము?... చతురా... నాతో చతురులాడకు సుమీ. కలగంటివా ఏమి? మనమింకను యుగసంధి యందే ఉంటిమి గదా. ఇంకను నలువది వత్సరములు గడిచినగాని కలియుగము ఆరంభము గాదు"

"అది నిజముగాదు మిత్రవిందా. నా పలుకులు విశ్వసింపుము. కలియుగము ఆరంభమై అయిదువేల నూటముప్పది వర్షములు గతించినవి. నేను తెలుగు వాడిని. నాది ఆంధ్రజాతి"

అతడి మాటలు విని– మిత్రవింద బిత్తరపోయింది. "ఏమంటివి చతురా? ఆంధ్రజాతా? అది యెచటయున్నది?" అంది.

"అటు తూర్పు సముద్ర తీరమున దక్షిణభాగ మందున్నది" అన్నాడు చరక్.

"నమ్మశక్యముగాకున్నది. అయిననూ నీ శిరమున ఆ వస్త్రభాగమేల చుట్టుకొంటివి?" అంటూ చటుక్కున అతడి తలతుండును లాగిపడేసింది మిత్రవింద. అంతే-చరక్ తలకట్టును జూచి చకితఅయింది. పిదప ముత్యాలు జాలువారుతున్నట్టు ఫక్కున పరిహాసముగా నవ్వింది.

"చతురా ఈ చోద్యమేమి? చక్కగా ఉంగరములు తిరిగి నీ భుజస్కంధ ములపై వ్రాలు సుందరమగు నీ శిరోజములు ఏమైనవి? నీ జుత్తు కత్తిరించిన ధూర్తులెవరు? ఓహో... ఇప్పుడు గదా జరిగినది అవగతమగుచున్నది"

"ఏం అవగతంబైనది?"

"పశ్చిమ సముద్రమున ఓడ ప్రమాదమునుండి బ్రతికి బయటపడిన నీవు ఎటులనో అటు తూర్పు సముద్ర తీరమునకు జేరి అచటగల ఆంధ్రదేశమున జొచ్చితివి. నీ దేవనాగరిభాష వారికి అర్థంగాక కుపితులై పరిహాసమున నీ శిగ దరిగియుందురు.

ఇంతటి పరాభవమును కప్పిపుచ్చుటకై నీవు చతురుడనుగాననుచూ కట్టుకథలు చెప్పుచుంటివి. చతురా, ఇక చాలును. నీవు క్షమించిననూ, నేను క్షమింపజాల. ఆంధ్రదేశము వెళ్ళుదము... తక్షణమే" అంది ఆగ్రహంగా. మిత్రవింద ఆవేశం చూసి ఠారెత్తిపోయాడు చరక్.

ఉన్న సమస్యలు చాలవని ఇదో కొత్త సమస్య. "అయ్యయ్యో, ఆగుము మిత్రవిందా. నీ శాపముతో పాపము ఆంధ్రక్షురకులను వేధించుట పాడిగాదు. వారిని క్షమింపుము. ఈలాగున జుత్తు కత్తిరించి క్షురకర్మ గావించుట ఆ దేశాచారం" అంటూ మిత్రవిందను వారించి గొప్ప ప్రమాదాన్ని తప్పించాడు చరక్. మిత్రవింద శాంతించి ఏదో చెప్పబోయింది. అంతలో అనేక అశ్వాల గిట్టల చప్పుడు కలకలం వినబడి ఆ ఇరువురి ఏకాంతానికి భంగం కలిగింది. ఉద్యానవనంలోకి చూసిన ఇద్దరికీ అనేక అశ్వాలు, రథాలు దుమ్ముతెరలు రేపుతూ తామున్న మణిమండపంవైపు దూసుకురావటం కన్పించింది.

మిత్రవింద సోదరుడు ధాత ఇచ్చిన సమాచారంతో చతురుణ్ణి చూడ్డం కోసం సంతోషంతో అటు చతురుని తండ్రి వల్లభాచార్యులవారి కొడుకులు, కోడండ్రు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాండ్రు-

ఇటు మిత్రవింద తండ్రి శివదేవగుప్తుని కుటుంబము అంతా సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా వచ్చేశారు. ఆడువారు పిల్లలు రథాల్లో రాగా పురుషులు అశ్వాల మీద విచ్చేశారు.

చరక్ చేయందుకుని ఆనందంతో మణిమండపం ముందుభాగానికి తీసుకొచ్చింది మిత్రవింద.

వచ్చినవారిలో ఒక్కరూ తనకు తెలీదు. దూరంలో ఉండగానే మిత్రవింద ఎవరెవరో చెప్పటం వలన కొంత తెలుసుకోగలిగాడు. సుడిగాలిలా వారు అంతా వాహనాలు దిగి తమను చుట్టుముట్టడంతో చరక్‌కి ఊపిరి ఆడలేదు.

వృద్ధుడైన వల్లభాచార్యులవారు, ఆయన భార్య తనను తమ కుమారుడు చతురుడే అనుకుని కౌగిలించుకొని విలపిస్తుంటే చరక్ కళ్ళలోనూ అప్రయత్నంగా నీరు నిలిచింది. అమెరికాలో ఉంటున్న తన తల్లిదండ్రులు ఆర్యభట్టాచార్యుడు, శ్రీలక్ష్మీలు కళ్ళముందు మెదిలారు.

*　　*　　*　　*　　*

కలియుగం – ప్రస్తుతకాలం. జాజ్‌పూర్ దగ్గరలోని నీలోదరి కొండగుట్ట. మహామాంత్రికుడు మరిడి సోమయ్య నివాసం. భూగర్భంలోని సువిశాలమైన హాలు. అక్కడ క్షుద్రపూజావేదిక వద్ద గాఢమైన పూజలో ఉన్నాడు మరిడి సోమయ్య. విద్యుద్దీపాలకు మారుగా అక్కడ దివిటీలు ప్రకాశిస్తూ ఆ ప్రాంతాన్ని వెలుగుతో నింపుతున్నాయి.

ఎదురుగా వేదికమీద – నిలువెత్తున ఎనుబోతు తల కలిగిన విచిత్రమైన క్షుద్రదేవతా విగ్రహం ఒకటి భారీగా నిలబడుంది. దాని మెడలో మానవ కంకాళాలు వేలాడుతున్నాయి. బలి తాలూకు చిందిన జంతువుల నెత్తురు, కుంకుమలో ఎర్రగా బీభత్సంగా ఉందా విగ్రహం. సామాన్యులు చూస్తే భయపడి జ్వరం తెచ్చుకునేంత భీకరంగా కన్పిస్తోంది.

ఎదురుగా పెద్ద హోమగుండంలో – కణకణ రగులుతున్నాయి నిప్పులు. అందుండి దట్టమైన సాంబ్రాణి పొగలు సుడులు తిరుగుతూ పైకి లేస్తున్నాయి. మరిడి సోమయ్య పక్కనే ఒంటిమీద గోచీ తప్ప మరే ఆచ్ఛాదనా లేని వృద్ధ అఘోరా ఒకడు ఒంటికాలిమీద నిలబడి భీకరంగా మంత్రాలు చదువుతున్నాడు.

వెదురుబొంగు చీలుస్తున్నట్టు చాలా వికృతంగా ఉందా గొంతు. తెల్లగా జడలు కట్టిన జుత్తు, గడ్డం, మీసాలు కలిగి బక్కగా ఉన్నా బీభత్సంగా ఉన్నాడు అఘోరా. అతని పేరేమిటో మరిడిసోమయ్యకు మాత్రమే తెలుసు.

అగ్నివేశాచార్యుని గెలిచి దెబ్బతీయడానికి మరిడి సోమయ్య, అఘోరా సలహాతో మహిషశక్తిని వశపర్చుకునేందుకు తీవ్రంగా పూజలు చేస్తున్నాడు.

అఘోరా కూడా ఆ పూజలో పాల్గొని మరిడి సోమయ్య చేత నిర్వహింప జేస్తున్నాడు. దూరంగా నిలబడిన శిష్యులు వారికి అవసరమైనవి అందిస్తూ సాయం చేస్తున్నారు. ఉదయం నుండి అయిదు గంటలుగా ఏకదీక్షగా ఆ పూజలు అలా కొనసాగుతూనే ఉన్నాయి.

సమయం గడిచిపోతూనే ఉంది. ఒక దుర్మార్గుడు శక్తివంతుడైన ఒక మాంత్రికుడు, పగ ద్వేషంతో రగిలిపోయే మరిడి సోమయ్యలాంటివాడు పగబట్టిన దుష్టసర్పం కన్నా ప్రమాదకారి. తన శిష్యుడు వికేశి మరణానికి కారణమైన అగ్నివేశాచార్యుని మీద నరనరానా విషం నింపుకొని ప్రతీకారేచ్ఛతో రగిలి పోతున్నాడు.

అందుకే ఒక మహాశక్తి, మహిషశక్తిని వశం చేసుకోవడానికి కఠోర నియమాలతో సాధన చేస్తున్నాడు.

అప్పటికే క్రమంగా భోజనవేళ మించిపోతోంది. శిష్యులంతా ఆకలి బాధతో ముఖముఖాలు చూసుకుంటున్నారు. సుమారు ఒంటిగంటా ముప్పై నిమిషాలకు పూజ ముగిసింది. వెంటనే నెత్తురు మాంసాదులతో కలసిన ఒక కుంభం అన్నాన్ని తెచ్చి నైవేద్యంగా విగ్రహం ముందుంచారు.

తర్వాత – శిష్యులతో సహా అంతా బయటికి వచ్చి ఆ హాలు తలుపులు మూశారు. "గురువుగారూ... మహిషశక్తి వశంగావటానికి ఇంకెన్ని రోజులు పడుతుంది?" ఆత్రం అణచుకోలేక అఘోరాను ప్రశ్నించాడు మరిడిసోమయ్య.

"సోమయ్యా. అది నీ నిష్ట, అదృష్టం మీద ఆధారపడుంది. మనం సమర్పించిన కుంభాన్ని మహిషశక్తి ఆరగించటం ఆరంభించిన రోజు నుండి పక్షం దినముల లోన ఎప్పుడయినా వశం కావచ్చును. తొందరేల?" అంటూ బదులు ఇచ్చాడు అఘోరా.

అంతలో శిష్యుడు విళంబి సెల్‌ఫోన్ తెచ్చి గురువు మరిడి సోమయ్యకి ఇచ్చాడు. అవతల కేంద్రమంత్రి శంభులింగ మహాపాత్రో లైన్లో ఉన్నాడు.

"చెప్పు మహా పాత్రో. ఏమిటి విశేషాలు?" ప్రశ్నించాడు మరిడి సోమయ్య.

"విశేషాలు నువ్వుచెప్తే నేను వినాలి. అందుకే ఫోన్ చేశా. నీ పూజలు ఎంత వరకు వచ్చాయి?" అవతలినుంచి శంభులింగ మహాపాత్రో గొంతు గరగర లాడింది.

"పూజలు ఘనంగా జరుగుతున్నాయి పాత్రో. ఇప్పుడే పూజ ముగించి బయటికి వస్తున్నాను. కొద్ది రోజుల్లోనే ఒక మహాశక్తి నా వశంగాబోతోంది. అప్పుడు చూడు. శతాధిక వృద్ధుడు ఆ అగ్నివేశాచార్యుణ్ణి ఓ ఆట ఆడిస్తాను. దెబ్బకు దెబ్బగా ప్రతీకారం తీర్చుకుంటాను. నా ప్రియశిష్యుడు వికేశి మరణానికి బదులు తీర్చి వాడి ఆత్మకు శాంతి కలిగించెద" ఆవేశంతో నోరు జారుతున్న మరిడి సోమయ్యకి అడ్డుకట్ట వేస్తూ–

"మళ్ళీ ఆరంభించావా నీ ప్రతీకారగోల? చెప్పింది గుర్తులేదా నీకు? ఎంతసేపూ అవే మూర్ఖపు ఆలోచనలా?" అంటూ అవతలి నుండి కటువుగా వినబడింది శంభులింగ మహాపాత్రో గొంతు.

దాంతో మరిడి సోమయ్య ఆవేశంమీద నీళ్ళు చిలకరించినట్టయింది. వాస్తవంలోకి వస్తూ "సారీ మహాపాత్రో... నా బాధ అలాంటిది. కొంచెం ఆవేశపడ్డాను" అన్నాడు సంజాయిషీగా.

"కొంచెం కాదు. ఎక్కువే పడ్డావ్. అసలేమనుకొంటున్నావ్ నువ్వు. లక్షలకు లక్షలు నీ పూజలకు ఖర్చుచేస్తోంది నీ పగలు, ప్రతీకారాలు తీర్చుకోడానిక్కాదు. నువ్వు అగ్నివేశాచార్యుని కట్టడి చేయటానికి ఎన్ని శక్తులైనా సంపాదించుకో. కాని... వాటిని ఇప్పుడే ప్రయోగించి దురుపయోగం చేయకూడదు. మనం అనుకున్నవి సాధించుకున్నాక నీ ఇష్టం. అర్థమైందా?" హితబోధ చేస్తున్నట్టుగా పలికింది శంభులింగ మహాపాత్రో గొంతు.

"అర్థమైంది మహాపాత్రో. ఈ విషయంలో ఇక నువ్వు నిశ్చితంగా ఉండొచ్చు" అన్నాడు మరిడి సోమయ్య.

"ఇంతకీ అగ్నివేశాచార్యుని స్థావరంలో పరిస్థితులేమిటి? ఆయన ముని మనవడు. అతని పేరేమిటి?" "చరక్...."

"అతన్ని భూతకాలంలోకి పంపించాడంటివి గదా... తిరిగివచ్చాడా ఇంకా లేదా?"

"అక్కడ ఉంటున్న నా మనిషి ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటున్నాడు మహాపాత్రో. ఆ చరక్ అనే యువకుడింకా ఆ మందసంలోనే శవంలా పడున్నాడట. అతడి ఆత్మ ఏ కాలంలో తిరుగుతోందో గాని ఇంకా తన శరీరంలోకి తిరిగిరాలేదట"

"వెళ్ళి వారం దాటిపోయింది గదా. ఇంకా తిరిగి రాలేదా?"

"రాలేదు. వస్తేగాని ఏం తెచ్చాడో మనకి తెలీదు. తెలీగానే నీకు ఫోన్ చేస్తాను"

"మంచిది. నీ మనిషిని అచట జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండమను. చరక్ మందసం నుండి బయటకు రాగానే ఆ కబురు మన చెవికి చేరిపోవాలి"

"తప్పకుండా తెలుస్తుంది మహాపాత్రో. నేనే తక్షణం నీకు ఫోన్ చేస్తాను"

"మంచిది. నా మాటలు గుర్తుంచుకొని వ్యవహరించు. ఉంటాను" అంటూ అవతల లైన్ కట్ చేశాడు శంభులింగ మహాపాత్రో.

* * * * *

కళ్ళాలు బిగించి అశ్వాన్ని దౌడుతీయిస్తున్న చరక్ దూరంలో ఉండగానే వృక్షఛాయలో తిన్నెమీది సాధుపుంగవుని గమనించాడు. ఆయన తనకు కనిపించుట ఇది మూడవసారి. తొలిసారి ద్వారక వచ్చు మార్గమున దర్శన మిచ్చాడు.

మలిసారి ద్వారకలో ఒక చూతవృక్షఛాయలో అగుపించి తనను చేరబిలిచాడు. ఇది మూడవసారి. ఇప్పుడును అదియే తీరు. తనను గాంచినతోడనే ఆయన ముఖంలో దరహాస చంద్రికలు. చేయెత్తి చేరరమ్మని సైగచేయుచున్నాడు.

ఒకింత సందేహించాడు చరక్. ఒక్కసారి చెంతకు వెళ్ళి మాట్లాడితే– అన్పించింది. కాని రెండుసార్లు పిలిచినా వెళ్ళనివాడు ఇప్పుడు మాత్రం వెళితే ఏం బాగుంటుంది? మనసు అంగీకరించలేదు.

ఒక నిర్ణయం తీసుకొనులోపలే అశ్వం ఆప్రాంతాన్ని దాటి ముందు కొచ్చేసింది.

క్రమంగా అది మొదటి ప్రాకార వాకిలిని గూడా దాటి రాతిబాట మీదుగా సముద్రం దాటుతూ తీరంవైపు దూసుకు పోసాగింది.

మూడు రోజుల క్రితం సంగతి – మణిమండపంలో మిత్రవింద తను ఏకాంతంలో ఉండగా బంధువర్గమంతా మూకుమ్మడిగా వచ్చేశారుగదా. తను చతురుడు కాదు చరక్ అని తనకు తెలుసు.

కాని అంతమంది తనే చతురుడని నమ్ముచుండ– వారిని కాదని ఒప్పించ గల శక్తి చరక్‌కి లేదు. వచ్చిన పని సానుకూలమగుటకు కొద్దిరోజులు చతురునిగా ఉండిపోతే తప్పేంలేదనిపించింది. అందుకే మౌనంగా ఉండిపోయాడు. వారి వెంట బయలుదేరాడు.

తిరుగు ప్రయాణంలో కూడా మిత్రవింద, చరక్‌ని రథంలో తనపక్కనే కూర్చోబెట్టుకుంది. అంతా రాజ వైద్యుడు వల్లభాచార్యులవారి గృహము చేరుకున్నారు. రథం దిగిన ఇరువుర్నీ అక్కడే ఉండమని చెప్పి చతురుని తల్లి ఎర్రనీళ్ళు తెచ్చి స్వయంగా దిష్టితీసింది.

"ఏ చెడు దృష్టి మీ మీద ప్రసరించినదో ఏమో... ఇన్ని దినములు ఎడబాటును, మిక్కిలి దుఃఖమును అనుభవించితిరి. ఆ చెడుదృష్టి తొలగిపోవలె. మీరిరువురును విడిపోని బంధంగా ఇటులనే ఉండవలె" అంటూ ఆ నీళ్ళను తీసుకెళ్ళి దూరంగా పారబోసింది. మిత్రవింద తల్లిదండ్రులు అన్నలు, బంధువర్గం అంతా గృహము ముంగిట నుండియే సెలవుతీసుకుని పక్కవీధిలోని తమ గృహమునకు వెడలిపోయారు. మిత్రవింద మాత్రం చరక్ వెంటే లోనకొచ్చింది.

ఆ పరిసరాల్ని నిశితంగా గమనించినాడు చరక్. అది కోట సమీపమందే వున్న ధనవంతుల నివాస ప్రాంతం. ప్రతిగృహము అక్కడ సువిశాల ప్రాంగణములలో నిర్మింపబడినవే. గృహముల పై భాగములందు రత్నఖచిత మణి మయ స్వర్ణ తాపడముల కాంతులు ధగధగాయమానంగా ప్రకాశిస్తున్నాయి.

వల్లభాచార్యుని గృహము మూడు అంతస్థులు కలిగి చలువరాతి నిర్మాణంతో అదే ఒక రాజమందిరంలా శోభిస్తోంది. సువిశాలంగా వున్న ఆ భవంతి కుడిపార్శ్వంలో రథశాలలు, అశ్వశాలలు, ఎడం పార్శ్వంలో గోశాల కనువిందు చేస్తున్నాయి.

ఆ గృహమునకు వెనుకభాగమున రెల్లుగడ్డితో కప్పిన పెద్దచావడి ఉంది. అక్కడ ఆయుర్వేద ఘన వైద్యుడగు వల్లభాచార్యుని శిష్యులు, పనివాండ్రు వివిధ రకాల మందులు తయారుచేస్తూ తీరిక లేకుండా ఉన్నారు. కొందరు లేహ్యములు వండుతున్నారు.

కొందరు పుటాలు పెడుతూంటే కొందరు కల్వాల్లో నూరి భస్మాలు చేస్తున్నారు. కొందరు నూరిన మందును మాత్రలుగా చుట్టి ఆరబెడుతున్నారు.

కొందరు తయారైన మందులు చెక్కపాత్రలు వంటివాటిలో భద్రం చేస్తున్నారు. వివిధ రకాల ఆయుర్వేద ఔషధాలను తయారుచేసి నిల్వ ఉంచి తగు సమయంలో ఉపయోగిస్తూంటారక్కడ.

చరక్ ద్వారకానగరంలో ప్రవేశించినప్పటి నుండి నగర నిర్మాణాన్ని అక్కడి ఇళ్ళను, వసతులను గమనిస్తూనే ఉన్నాడు. నగరవీధులన్నీ తీర్చిదిద్దినట్టున్నాయి. మంచినీటి వసతితోబాటు మురుగునీటి పారుదలకూ తగు ఏర్పాట్లున్నాయి.

వీధుల్లో ఎక్కడా చెత్త కనబడదు. కలికాలం నవీనయుగంలోలా అక్కడ పాలిమర్– ప్లాస్టిక్ సంచుల వాడకంగాని, పేపర్ల వాడకంగాని, చుట్ట, బీడీ, సిగరెట్, పాన్, గుట్కా, ఖైనీ లాంటివి తయారీగాని, వాడకం గానీ ఏమీ లేని సత్యకాలం అది.

గోడలకు వాల్‌పోష్టర్లు కూడా కనబడవు. చరక్ ఆలోచిస్తున్నాడు. ఢిల్లీ, బెంగుళూరు, బొంబాయి, హైదరాబాద్ వంటి నగరాలు కూడా ఇంతలా పరిశుభ్రంగా ఉంటే ఎంత బాగుంటుంది అన్పించింది. గాలి కలుషితం కాదు. నీరు కలుషితం కాదు, ఆహార పదార్థాల్లో కల్తీ లేదు. కాబట్టే ద్వాపరంలోని వీరంతా ఇంత ఆరోగ్యంగాను, బలంగాను, ఎత్తుగాను ఉన్నారు.

చరక్, మిత్రవింద వెంట ఆ ప్రాంతమంతా చుట్టి చూశాడు. ఇక ఆ భవంతిలోపల ఎటుచూసినా కన్ను చెదిరే విలాసవస్తువులు ఆకర్షణీయంగా ఉన్నాయి. అన్నీ చెక్కతోను, వెండి బంగారాలతో తయారుచేసినవే. వాటిని కళాత్మకంగా మలిచినతీరు ఆ నగిషీ పనితనం చూస్తూంటే ప్రపంచమంతా

గాలించినా ఇలాంటి పనివారు కలియుగంలోని ఆధునికకాలంలో మచ్చుకైనా కనబడరనిపించింది.

* * * * *

భవంతిలో ఎన్నో గదులు, మరి ఎన్నో నడవాలు. పెద్ద కుటుంబం గాబట్టి పెళ్ళయిన అందరికీ వారి వారి గదులు కేటాయించబడ్డాయి. వాటినే మందిరా లంటారు. చివరిగా మిత్రవింద, చరక్‌ను ఒక శయనమందిరంలోకి తీసుకెళ్ళింది.

అది మూడో అంతస్థులో వీధివైపు ఉంది. "ప్రియుడా... ఈ మందిరము గురుతున్నదా? గురుతు లేదనకు సుమీ. ఏలయన ఇది ఒరులదిగాదు. నీ శయనమందిరం" అంది.

ఆ మందిరంలో అడుగుపెట్టగానే– ఎందుకో తనకు తెలీకుండానే– చరక్ ఉద్విగ్నభరితుడయ్యాడు. ఒడలు పులకరించింది.

గుండెల్లో ఏదో అలజడి. పోగొట్టుకున్నదేదో తిరిగి లభించినట్టు తెలీని ఆనందం ఏదో గుండె లోతుల్లో కెరటంలా మోదుకుంటోంది. మిత్రవింద చేతిని విడిపించుకుని ముందుకు నడిచాడు.

ఇది ఏమి విచిత్రం? తను ఎన్నడూ అడుగుపెట్టని ఈ శయన మందిరంలోకి రాగానే తన మనసెందుకు తడబడుతోంది. ఎందుకు ఇంత ఆనందపరవశం కలుగుతోంది. ఆహా ఈ మందిర శోభ తిలకించడానికి రెండు కళ్ళు చాలటంలేదే. ఎక్కడ చూసినా బంగారుమయంగా ఉంది.

ఏ వస్తువును తాకినా అది బంగారమో, వెండియో తప్ప మరోటిలేదే.

కళాత్మకమైన విలాస వస్తువులు, అలంకరణ వస్తువులు ఎన్నో చక్కగా అమర్చబడి మణిమయకాంతులతో ప్రకాశిస్తున్నాయి. పగలే ఇటులుండ రాత్రివేళ దీపాలెందుకు?

శయనమందిర మధ్యంలో రాజులు, రాణులు శయనించు హంసతూలిక వంటి విశాలతల్పం, చుట్టూ పట్టుపరదాలు... ఇది చతురుని శయనమందిరమా! ఆహా చతురా. ఏమి అదృష్టమయ్యా నీది! ఎంతటి వైభోగమయ్యా నీకు.

చరక్‌కి నోటమాట రావటంలేదు. మందిర గవాక్షాల చెంత నిలబడితే దిగువన పురవీధులు కోట ప్రాకారద్వారము కన్పిస్తున్నాయి.

వెనుతిరిగిన చరక్ దృష్టి అప్రయత్నంగా అక్కడ గోడకు వేలాడుతున్న పెద్ద చిత్రపటం మీద పడింది అంతే– చిత్తభ్రమ ఏర్పడినట్టుగా చూపుతిప్పుకోలేక పోయాడు. కనుదోయి విశాలమైంది.

ఒక్కసారిగా నరాలు తెగిపోయేంత ఉత్కంఠత చోటుచేసుకుంది. రోమాలు నిక్కబొడుచుకుని గుండె గొంతులో కొట్టుకోవడం ఆరంభించింది.

ఆ చిత్రపటంలో ఉన్నది ఎవరోకాదు. తనే. భుజాల మీద పడుతున్న చక్కటి ఉంగరాల జుత్తు తప్ప అన్ని విధాలా అచ్చుగుద్దినట్టు అంతా తన పోలికే. చేత్తో కుంచెపట్టి వేసిన వర్ణచిత్రం.

ఇదెలా సంభవం? ఎక్కడో కలియుగంలో పుట్టిన తన చిత్రపటం ఈ ద్వాపరంలో ద్వారకాపురిలోఎలా ఉంది? వీరంతా తను చరక్ అంటే నమ్మకుండా చతురుడని ఎందుకనుకుంటున్నారో ఇప్పుడు అర్థమవుతోంది. ఆ చిత్రపటంలోని చతురుని రూపురేఖా విలాసాలన్నీ తనవే. ఒక్కక్షణం అది తన చిత్రపటమే యనుకొని తనే బిత్తరపోయాడే... వీళ్ళంతా తనను చతురుడనుకోవడంలో తప్పు ఏముంది.

పక్కన చేరిన మిత్రవింద గోముగా అతడి భుజంమీద ముఖంవాల్చి మందహాసంతో– "ఆ చిత్రపటంలో ఉన్నది నీవేగదా... ఇంకను కాదందువా?" అనడిగింది. "కాదనియందునా?" తనూ నవ్వాడు.

"పరిహాసము చాలును. నీవే నా చతురుడవు" అంటూ గాఢాలింగనముతో మోమున మోముచేర్చి ముద్దాడింది. చరక్‌కి అర్థమైపోతోంది. వీరు సత్యకాలపు వారు. పొరబడే అవకాశమే లేదు.

తను చతురుడిలాగే ఉన్నాడు. వీళ్ళంతా అదే నమ్మికతో ఉన్నారు. అంటే ఈ నగరంతో తనకు తెలీని గత అనుబంధం ఏదో ఉంది. అది తెలిస్తేగాని తను సమాధానపడలేడు. కాని తనకు వివరించి సమాధానపర్చువారెవరు?... అంతవరకు తను చతురుడని అంగీకరించడం తప్ప మరో దారిలేదు.

సాయంకాలమవుతుండగా మిత్రవింద తన రథంలో పక్కవీధిలోని తమ ఇంటికెళ్ళిపోయింది. మిత్రవింద పుట్టింట్లో ఎంత చనువుగా ఉంటుందో ఇక్కడా అంత చనువుగా ఉంటుందని చరక్‌కి అర్థమైపోయింది. నిశ్చితార్థం జరిగి

పోయింది. ఆ పైన ప్రేమించుకున్న జంట గాబట్టి మిత్రవిందకు రెండిళ్ళలోనూ ఎదురులేదు.

* * * * *

చరక్ ఆ రాత్రి వల్లభాచార్యుల కుటుంబసభ్యులందరితో కలసి భోజనం చేశాడు. మొదటి సారిగా కుందుడి తల్లి కనకవల్లి వడ్డించిన భోజనం తిన్నాడు. అక్కడికీ ఇక్కడికీ పెద్ద తేడా ఏమీ కనబడలేదు. సామాన్యులయినా, ప్రముఖులయినా అందరూ ఇక్కడ ఒకేవిధంగా భోంచేస్తున్నారు.

తినే ఆహారంలో సగం పాలు, పెరుగు, వెన్న, జున్ను తప్పనిసరి. పండ్లు తప్పనిసరి. జొన్న రొట్టెలు, ఇతర తృణధాన్యాలతో చేసిన పిండివంటలు. జొన్నరొట్టె పట్టుతేనెలో ముంచుకొని తింటుంటే అమృతంలా ఉంది. రాత్రి భోజనాలయ్యాక ఇద్దరు నౌకర్లతో చరక్ వద్దకొచ్చాడు వల్లభాచార్యుడు.

"నాయనా చతురా. నీ జుత్తు సమస్యను నేను పరిష్కరించెద. కలత నొందకు" అంటూ కూర్చోబెట్టి నల్లటి చిక్కటి ద్రవపదార్థాన్ని నౌకర్లకు అందించాడు. వారు దాన్ని చక్కగా చరక్ జుత్తు కుదుళ్ళకు బాగా పట్టేట్టుగా నౌకర్లు రాసి మర్దించి చివరగా తలకు గుడ్డ చుట్టి కట్టుకట్టారు. ఆ తలకట్టుతోనే రాత్రికి నిద్రపోయాడు చరక్.

ఉదయం లేచేసరికి తల బరువుగా అన్పించింది. నౌకర్లు వచ్చి చరక్‌ను స్నానాలగదిలోకి తీసుకెళ్ళారు. కూర్చోబెట్టి తలగుడ్డ విప్పేశారు. అట్టకట్టి నట్టున్న తలమీద గోరువెచ్చని నీటితో కాస్సేపు మర్దించి పిదప వేడినీటితో అభ్యంగన స్నానం చేయించారు. చేతికి ఒత్తుగా తగులుతున్న జుత్తును అప్పుడు గమనించాడు చరక్.

గమనించగానే తీవ్రమయిన దిగ్భ్రాంతికి లోనయ్యాడు. తన కళ్ళను నమ్మలేకపోయాడు.

ఇదేమి మాయ? ఇదేమి మంత్రం? మాయా కాదు మంత్రమూ కాదు. వల్లభాచార్యుడు కొడుకు జుత్తు పెరగడం కోసం అప్పటికప్పుడు తయారుచేసి వాడిన మందు ప్రభావం. చరక్ జుత్తు రాత్రికి రాత్రి రెండు జానలు పెరిగి వంకీలు తిరిగి నల్లగా నిగనిగలాడుతోంది. నీరు నిశ్చలంగా ఉన్న నీటితొట్టెలో తన రూపు చూసుకొన్న చరక్‌కి కెవ్వున అరవాలనిపించింది. తనిప్పుడు చరక్ కాదు.

చతురుడే చక్కగా క్షవరం చేయబడిన తన తలకట్టు పోయి ఉంగరాల జుత్తు వచ్చేయటంతో చతురుడి నుండి తనను వేరుచేసే ఆ ఒక్క అంశమూ తొలగిపోయింది. ఇప్పుడు చతురుడికీ, తనకూ భేదమే లేదు.

ఎంతటి శక్తివంతమైన కేశతైలం... ద్వాపరంలో ఎవరికీ బట్టతల లేదు. ఆయుర్వేద ఔషధాల్లో ఇంతటి మహిమ గూడా ఉందా. ఈ కిటుకు ఒక్కటి తెలిస్తే కలియుగంలో ప్రస్తుత కాలంలో జుత్తు వేగంగా పెరగటానికి ఈ మందు కనిపెట్టగలిగినవాడు రాత్రికి రాత్రి కోటీశ్వరుడయిపోతాడు.

బట్టతల వాళ్ళుండరు. జుత్తు తెల్లబడటం, రాలిపోవడం ఉండవు. మిత్రవింద ప్రకారం చతురుడు కూడా ఆయుర్వేదవైద్యుడే గదా. తను గతజన్మలో చతురుడై ఉన్నది నిజమైతే ఈ వైద్యవిధానాలు ఔషధాలు అన్నీ తనకు గుర్తుండాలే. కానీ ఏదీ గుర్తు లేదేమి? తన భ్రమగాని తను చుతురుడు గాకపోవచ్చు. చతురుడు వేరు చరక్ వేరు. ఆ విధంగా జుత్తు సమస్య కూడా తొలగిపోవటంతో ఏ సంకోచం లేకుండా తిరగగలుగుతున్నాడు చరక్. ఎవరెవరో పలకరిస్తున్నారు. కాని వారెవరూ తనకు గుర్తులేరు. నోరు విప్పకుండా చిరునవ్వుతో సమాధాన మిస్తున్నాడు.

వల్లభాచార్యుని ఇంట చేరగానే చరక్ జీవన విధానమే పూర్తిగా మారిపోయింది. ధనవంతమైన కుటుంబం. నూలు వస్త్రాలకు బదులు పట్టు వస్త్రాలు ధరిస్తున్నాడు. జేబులో ఎప్పుడూ బంగారు నాణాలు ఉంటున్నాయి. చెవులకు కుండలాలు, ఒంటిమీద మణిమయకాంతులతో మెరిసే స్వర్ణాభరణాలు.

ఆ రోజు ఉదయం మిత్రవిందను నొప్పించలేక ఆమె ఆహ్వానాన్ని తిరస్కరించకుండా ఆమె ఇంటి కెళ్ళాడు. ఆమె తండ్రి శివదేవగుప్తుడు. ఆయన భార్య వారి పిల్లలు అంతా ఎంతో మర్యాదలతో చరక్‌ను సాదరంగా ఆహ్వానించారు.

ఆ పూట వారితో కలసి భోజనం చేశాడు. విశ్రాంతిగా ఏకాంతంలో కూర్చున్నప్పుడు మిత్రవింద మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పింది చరక్‌కి.

బలరామప్రభువులు ఆస్థాన విదూషకుడు. శ్రీకృష్ణుల వారి ప్రియచెలికాడు అయిన వసంతయ్య ఈ మిత్రవిందకు స్వయానా మేనమామయట. వయసులో పెద్దవాడయినప్పటికీ ఆయనకు చతురుడంటే గొప్ప అభిమానమట.

వసంతయ్యకు కోటలోను, రాచనగరులోను అంతఃపురాల్లో గూడా భుటులు అడ్డుచెప్పరు. శ్రీకృష్ణులవారి చెలికాడు కాబట్టి వసంతయ్యకు అంత చనువుందక్కడ. ఆయనవెంట ఎక్కువ తిరిగే చతురునికీ అవన్నీ సుపరిచితాలే. బలరామకృష్ణులూ తెలుసట.

ప్రస్తుతం శ్రీకృష్ణులవారు ద్వారకలో లేరు. రాధాదేవిని చూడ్డంకోసం బృందావనం వెళ్ళగా ఆయన వెంట వసంతయ్యా వెళ్ళాడట.

చతురుడు క్షేమంగా తిరిగివచ్చిన విషయం తెలిస్తే వసంతయ్య ఎంతో ఆనందిస్తాడట.

ఇంకో నాలుగు రోజుల్లో వసంతోత్సవాల ఆరంభానికి ముందు శ్రీకృష్ణుల వారు ద్వారక చేరుకుంటారట. వారి వెంట వసంతయ్యా వస్తాడట.

ఈ విషయాలన్నీ వింటున్న చరక్‌కు నమ్మశక్యం గావటంలేదు. లేచి చరక్ చేయిపుచ్చుకుంది మిత్రవింద. "నాతో రమ్ము ప్రియుడా. నీ ప్రియనేస్తమును జూపించెద" అంది.

చరక్‌కి అర్థంకాలేదు. తనకి ఇక్కడ నేస్తాలు ఎవరున్నారని? "ఎక్కడికి?"

"నీవే అడిగెదవని ఆశించితి. నీవు అదియును మరచినట్లుంటివి. నినుగాంచిన నీ ప్రియనేస్తం ఆనందించును. రమ్ము" అంటూ చరక్‌ను తనతో నడిపించింది మిత్రవింద, విషయం చెప్పకుండా ఇద్దరూ అశ్వశాలకు చేరుకున్నారు.

అక్కడ అనేక అశ్వాలున్నాయి. వాటికి ఎడంగా, ప్రత్యేకంగా కట్టబడిఉందో పవనాశ్వం. ముఖాన తెల్లటి మచ్చతో బలిష్టంగా ఎత్తుగావున్న ఎరుపురంగు అశ్వం. చరక్ చూడకముందే అది అతడ్ని చూసింది. ఆనందంతో కదంతొక్కుతూ ముందు కాళ్ళు పైకి లేపి బిగ్గరగా సకిలించింది. ఉలిక్కిపడ్డాడు చరక్.

"జూచితివా ప్రియుడా. నీ అశ్వము నిన్ను గుర్తుపట్టినది. నీవు గుర్తించ లేకున్నావు" అంది పరిహాసంగా మిత్రవింద.

ఇద్దరూ అశ్వసమీపంలోకి వచ్చారు. "ఇది నా అశ్వమా!" ఉత్కంఠభరిత స్వరంతో అడిగాడు.

"అవును. ఇది నీ పవనాశ్వమేగదా. పేరు కళ్యాణి"

"కళ్యాణి?"

"అవును. కళ్యాణి. నీవు ఓడలో బయలుదేరక ముందు నా అభ్యర్థనమేరకు దీనినిచట ఉంచి వెడలితివి. నావలెనే ఇది కూడా నీకొరకు బెంగటిల్లినది. నేనే దీన్ని సంరక్షణ చేయిస్తూ ఓదార్చుచుంటి" అంటూ అశ్వం వద్దకు చరక్‌ను తీసుకెళ్ళింది మిత్రవింద.

"కళ్యాణీ. జూచినవటే నీ చతురుని జాణతనము. మనల మరచినటుల ఎటుల నటించుచున్నాడో!" అంటూ అశ్వం వీపు తట్టి జూలు నిమిరింది మిత్రవింద.

చరక్‌ని సమీపించటంకోసం – కదం తొక్కుతోంది అశ్వం. కాని దాన్ని సమీపించడానికే – భయంగా ఉంది చరక్‌కి. పుట్టి పెరిగాక తను టీవీలోను, సినిమాల్లోను గుర్రాలను చూడ్డమేగాని వాటితో తనకు ప్రత్యక్ష అనుభవంగాని అనుబంధంగాని ఏమీ లేదు.

కనీసం రేస్‌కోర్సులకెళ్ళి ప్రత్యక్షంగా గుర్రం పందాలను చూసిన అవనుభవం కూడా లేదు. పైగా ఈ అశ్వాల ముందు కలియుగ అశ్వాలు ఎందుకు పనికొస్తాయి. ఈ అశ్వాలు చాలా పొడవుగా, ఎత్తుగా బలిష్టంగా ఉన్నాయి. సాధారణంగా మనుషులు మోసపోవచ్చునేమోగాని జంతువులు మోసపోవు. వాటిని ఎవరూ మోసపుచ్చలేరు.

ఏ వేషంలో ఉన్నా తమ యజమానిని గుర్తుపట్టేస్తాయి. కళ్యాణి అనే ఈ అశ్వం తనను జూచి ఇంతగా ఆనందిస్తోందంటే... ఇదేలా సంభవం? నిజంగానే తను చతురుడా? మరోసారి ఆలోచనలో పడిపోయాడు చరక్. "ప్రియుడా, అశ్వము చెంతకు రమ్ము. నీ హస్తస్పర్శకు ఇది ఎదురుచూచుచున్నది" పిలిచింది మిత్రవింద.

"చెంతకా... నాకు భయము" అన్నాడు కొంచెం కంగారుగా చరక్.

"భయమా!... ఇంకను ఏమా నటన? ఇక జాలును. నీవు ఘనవైద్యుడివే గాదు యుద్ధవిద్యలందును మేటి వీరుడవని నాకు తెలియదా ఏమి?" అంటూ వచ్చి అతడి చేయిపట్టి అశ్వంవద్దకు లాక్కెళ్ళింది మిత్రవింద. కంగారును అణచుకుంటూ అశ్వం వెన్ను తట్టాడు. ముఖం నిమిరాడు.

ఆశ్చర్యం... అశ్వం కళ్ళలో ఆనందబాష్పాలు జాలువారాయి. కాస్సేపు చరక్ తన పక్కనుంటేగాని అశ్వం కుదుటపడలేదు.

ఈలోపల పనివాళ్ళను పిలిచి అశ్వానికి కళ్ళాలు బిగించి జీను వేయించింది మిత్రవింద. అశ్వాన్ని అశ్వశాల నుండి ఆరుబయటకు తీసుకొచ్చారు.

"ప్రియుడా... కడుదినములైనది. నీవు అశ్వముపై స్వారీజేయ జూడ మనసగుచున్నది. అశ్వమునధిరోహింపుము" అంది మిత్రవింద.

"నేనా!..." బిత్తరపోయాడు చరక్.

"అవును. నీవే" అంది మిత్రవింద.

"అయ్యయ్యో. నావల్లకాదు. ఈ విద్య నాకు తెలీదే. బైక్‌లు తోలమను, కార్లు నడపమను, కంప్యూటర్ ఆపరేట్ చేయమను చిటికెలో చేస్తానుగాని గుర్రాలను తోలటం నావల్లకాదు" అలవాటులో పొరబాటుగా తెలుగు భాషలో నోరుజారాడు చరక్.

మిత్రవిందకు ఒక్కమాట కూడా అర్థంకాలేదు. బిత్తరపోయి చూసింది. "ప్రియుడా. ఏమనుచుంటివి? బైకులు, కారులూ... అవి ఏవిధమగు జంతువులు? ఎచట యుండును?" అనడిగింది.

వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకున్నాడు చరక్. "అవేమిటో చెప్పినా నీకు అర్థముగాదులే దేవీ" అన్నాడు తన పొరబాటు గ్రహించిన చరక్.

గుండెల్లో బెరుగ్గా ఉన్నప్పటికీ మిత్రవిందను నిరుత్సాహపర్చటం ఇష్టం లేక ఒక్కసారైనా గుర్రం ఎక్కి పరువు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కళ్ళాలు అందుకున్నాడు, కాని దాన్ని ఎలా ఎక్కాలో కూడా తెలీదు. అంతలో పనివాడు అశ్వం తాడు విప్పాడు. చరక్ కోసం రికాబును పట్టుకున్నాడు.

చరక్ రికాబులో పాదం ఉంచాడు. అంతే – ఊహించని విధంగా చెంగున లేచి గుర్రం జీనుమీద కూర్చుని కళ్ళాలు బిగించాడు. అశ్వాన్ని అధిరోహించగానే అశ్వంమీద స్వారీ తనకు అనుభవమే అన్పించసాగింది. ముందుకు అదిలించాడు.

మిత్రవిందతోబాటు అచటి వారంతా ఉత్సాహభరితులయి చూస్తూండగా అశ్వాన్ని అశ్వశాల చుట్టూ మూడుసార్లు పరుగెత్తించాడు. దాంతో చరక్‌లో తనకే తెలీని ఒక ఉత్సాహం ఏర్పడింది. గుర్రాన్ని మిత్రవింద ముందు ఆపాడు.

"కంగారువలదు దేవీ. అశ్వముపై కొంత దవ్వువెడలివచ్చెద" అన్నాడు.

"తడవు సేయకు ప్రియుడా. వేగిరం రావలె" అంది మిత్రవింద. గుర్రాన్ని ద్వారక వీధుల్లో దౌడు తీయించాడు చరక్. ఆ విధంగా అశ్వంమీద బయలుదేరిన చరక్‌కు దారిలో ఒక ఆలోచన కలిగింది.

ఆ రోజు కాలినడక మూలంగా ద్వారక పరిసరాలను సరిగా చూడలేక పోయాడు. ఇప్పుడు వెళ్ళి అవన్నీ చూసిరావాలని తోచింది. వెంటనే అశ్వాన్ని రాజమార్గం పట్టించి ద్వారక వెలుపలికి దౌడు తీయించాడు.

అలా వస్తున్నవాడు మార్గంలో ఆ సాధుపుంగవుని మూడోసారి చూడ్డం జరిగింది. ఆయన ముందులాగే చెంతకు రమ్మని పిలుస్తున్నా పట్టించుకోకుండా ముందుకెళ్ళిపోయాడు. రాతిబాట మీదుగా సముద్రాన్ని దాటి ఇంకా ఎగువకు వెళ్ళిపోయాడు.

అశ్వాన్ని నేరుగా తీరంమీది ఎత్తయిన చోట ఎక్కడయితే తను నిలబడి తొలిసారిగా ద్వారకాపురిని దర్శించాడో అదే చోటకు పోనిచ్చి అక్కడ అశ్వాన్ని వెనక్కితిప్పి నిలిపాడు.

అలా అశ్వంమీద కూర్చుని చూస్తున్న చరక్‌కు కళ్ళముందు ఒక సుందర దృశ్యం ఆవిష్కరింపబడింది. అజ్ఞాత చిత్రకారులు ఎవరో ముందు తరాలకోసం రంగుల కుంచెలతో చిత్రించిన ద్వారకాపురి, దాని పరిసరాల సుందర వర్ణచిత్రంలా ఉంది. మరోసారి చరక్‌కు రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

ఒడలు పులకరించింది, అణువణువూ ఉద్విగ్నభరితమై మనసు ఆనందపరవశం చెందుతోంది. తనేమిటి? ద్వారకాపురిని చూడటం ఏమిటి? మానవ మాత్రులకు సాధ్యమయ్యే పనేనా ఇది? తనకు ఏ దేవుడిచ్చిన వరం ఇది?

తన జేజి తాతయ్య తన అపూర్వ మేధాశక్తితో తనను ఒక కార్యార్థం ఇటకు పంపించినా, ఈ నగరంతో తనకు గత అనుబంధమేదో లేకపోతే రెండు కుటుంబాల ఆదరణ, మిత్రవింద ప్రణయం, పరిచయస్థులైన పురజనులు ఏమిటిదంతా.

ఎలా సాధ్యం... సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడైన శ్రీహరి దశావతారాల్లో ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణ భగవానుడు (ఆయన పుడమిపై అవతరించింది కూడా అష్టమి తిథియందే) కొలువున్న నగరాన్ని తను చూడ్డమే కాదు, నగరంలో

నివసించడం ఏ జన్మసుకృతం ఇది? ఆ కృష్ణపరమాత్మ కరుణ లేకుండానే తనిటకు రాగలిగాడా... పులకాంకితుడై ఆ రాధామాధవునికి చేతులెత్తి నమస్కరించాడు.

ఆహా! నీటమునిగిన ద్వారకాపురి గురించి ఎన్నో పరిశోధనలు చేసి ప్రపంచానికి చాటిన షికారిపూర్ రంగనాథ్ రావుగారి జన్మ ధన్యం గదా... చూడాలి, వారి పరిశోధనా ఫలితాలు ఇక్కడి వాస్తవాలను ఓసారి సరిచూడాలి. తను ఊహించినదానికి భిన్నమైన అంశాలేమిటో కూడా గమనించాలి.

చుట్టూ నీలిసముద్రం, మధ్యలో ద్వారకానగరం అమరి ఉన్న దీవి, తీరాన్ని అనుసంధానం చేస్తున్న రాజమార్గపు రాతిబాట తీరం వెంట ఆవాసాలు, అటు ఓడరేవులో కొన్ని ఓడలు, తీరం వదిలి ద్వారకను చుట్టి దక్షిణంగా సాగిపోతున్న ఒక తెరచాపల ఓడ, తీరం వెంట ఎటుచూసినా పచ్చని ప్రకృతి... కొద్దిసేపు మైమరచి, అలా చూస్తూండిపోయాడు చరక్.

హస్తినవరకు సాగిపోయే ఆ మార్గంలో వాహనాలు, బాటసారుల రాకపోకలు యథావిధిగా ఉన్నాయి. ఒక బిడారుగుంపు (వర్తకుల సమూహం) రణగొణ ధ్వనితో ద్వారక దిశగా ఎగువనుంచి వస్తోంది.

ఆలోచిస్తూ అశ్వాన్ని తిరిగి సముద్ర నారాయణుని ఆలయం దిశగా పోనిచ్చాడు.

ద్వారక దీవినుండి తీరం రెండు మైళ్ళ దూరం ఉండొచ్చని కాలినడకన పోతూ భావించాడు.

అది తప్పని ఇప్పుడర్థమవుతోంది. ఒక మైలు దూరం (ఒకటిన్నర కిలోమీటర్ల దూరం) మించదు. తను పొరబాటుపడిన మరో అంశం దీనిమీద మయుడిచే నిర్మించబడిన నగరంతో ఆ దీవివరకే ద్వారకాపురి పరిమితమను కున్నాడు, కాని కాదు.

ఆ యా ప్రాంతాలకు విడివిడిగా పేర్లున్నప్పటికీ మొత్తం కలిపే హైదరాబాదు అంటున్నాం. అలాగే ద్వారకా దీవితోబాటు తీరప్రాంతంలోని భాగాలు కూడా ద్వారకాపురిగానే వ్యవహరింపబడుతోంది. ఓడరేవు తీరంలో గోమతీనది సమీపంలో ఉండగా దాన్ని 'ద్వారకా ఓడరేవు' అనే అంటున్నారు గదా.

ఆలోచిస్తూనే అశ్వాన్ని నేరుగా ఓడరేవు వైపు పోనిచ్చాడు. దారిలో ఆ రోజు తను వైద్యం చేసిన మేదరి గృహం వంక చూశాడు.

అతను చక్కగా ఇంటిముందు కూర్చుని పనిచేసుకుంటున్నాడు. కాలికి కట్టులేదు. అంటే అగ్నిప్రభ ఆకులు అద్భుతంగా పనిచేశాయనేగా అర్థం. ఎక్కడ అభ్యసించాడీ వైద్యవిధానాన్ని?

క్రమంగా ఓడరేవులో ప్రవేశించింది అశ్వం. ఆ పరిసరాల్లో ఆ రోజు తనకు కొత్త నూలువస్త్రాల జతను ఇచ్చిన పీతాంబరం అనే అవంతీ వ్యాపారి కనబడలేదు. రేవులో రోమాపురికి చెందిన ఓడ కూడా లేదు. అందులో వెళ్ళి పోయుంటాడు.

ఈ రోజు నాలుగు ఓడలు రేవులో లంగర్లు వేయబడున్నాయి. ఎప్పటి మాదిరిగానే ఆ ప్రాంతమంతా హడావుడిగా ఉంది.

ఓడరేవు ప్రాంతాన్ని దాటి – గోమతీతీరం వైపు వెళ్ళాడు చరక్. ఇక్కడ గోమతీనది ఏడుపాయలుగా చీలిపోయి ఏడుదీవులను వేరు చేస్తూ సముద్రంలో సంగమిస్తోంది. దక్షిణపాయను ఆనుకొని దక్షిణంగా ఉన్న తీరప్రాంతంలోనే ఓడరేవు ఉంది.

ఈ ప్రాంతం నుంచే సముద్ర మధ్యంగా ద్వారకా అసలు దీవిని అనుసంధానపరుస్తూ రాతిబాట ఉంది. కాబట్టి ఈ ప్రాంతానికి పూర్వద్వారా అని పేరు. అంటే ద్వారకాపురికి ద్వారం వంటి భాగమని అర్థం.

ఇక దక్షిణపాయనుండి రెండోపాయ మధ్య భాగంలో సువిశాలమైన దీవి ఉంది. ఆ దీవిపేరు ధేనుక. అతిపెద్ద బల్లకట్టు వంటి పడవమీద గుర్రంతో సహా గోమతీనదిని దాటుతూండగా పడవ నడిపే వ్యక్తిని అడిగి తెలుసుకున్నాడు చరక్.

ఆలోచిస్తున్న చరక్ మస్తిష్కంలో – మిగిలిన దీవుల పేర్లు కూడా గుర్తొస్తున్నాయి.

* * * * *

షికారిపూర్ రంగనాథ్ గారి గ్రంథాన్ని చదివాడు గాబట్టి తనకు గుర్తుంది. మిగిలిన దీవులు ఎగువకు ఉత్తరం వైపు వరుసగా సువర్ణతీర్థ, నారాయణపుర, నాగేశ్వరపుర, సంకోదర, ఆరంభద్వార, ఓక్‌మడి... ఈ దీవులను అనుసంధానం

చేస్తూ నది పాయలమీద పడవలు, తెప్పలు, డెంగీలవంటి సాధనాలు అనేకం ఉన్నాయి.

అన్ని దీవుల్లోనూ జనావాసాలు, చక్కటి ఆలయాలు ఉన్నాయి. ప్రతి దీవీ పచ్చని ఫలవృక్షాలు, తోటలతో కళకళలాడుతున్నాయి.

మొత్తం దీవుల్ని తిరిగి చూడాలంటే ఈ రోజు సరిపోదు. మూడు దీవుల్ని మాత్రం తిరిగిచూసి వెనుతిరిగాడు. తిరుగు ప్రయాణంలో అశ్వాన్ని పోనిస్తూనే ఆలోచిస్తున్నాడు చరక్. ఆలోచిస్తుంటే షికారిపూర్ రంగనాథ్‌గారి గ్రంధరచన వెనుక ఎంతటి కృషి ఉందో ఇప్పుడు అర్థమవుతోంది.

తన పరిశోధనల్ని ద్వారకాపురి వర్ణనలతో సరిపోల్చుకోవటం కోసం ఆ మహనీయుడు రిఫరెన్స్‌కి తీసుకున్న గ్రంధాలు తక్కువేమీ కాదు.

ఐత్రేయ అరణ్యక, భగవద్గీత, భవిష్యపురాణం, భాగవతం, బ్రహ్మవైవర్త పురాణం, బ్రాహ్మపురాణం, గార్గ్యసంహిత, గరుడపురాణం, హరివంశము, జైమినీ ఉపనిషత్, అగ్నిపురాణ, ఛాందోగ్య ఉపనిషత్, ఘటిజటక, జైన హరివంశము, యజుర్వేదము–

మహాభారత ఆదిపర్వము, పతంజలి విరచిత మహాభ్యాస, మౌసలపర్వం, మహాభారత సభాపర్వం, మహాభారతం ఉద్యోగపర్వం–

మనుస్మృతి, మత్స్యపురాణం, పద్మపురాణం, సాంఖ్యాయన సౌతసూత్ర, శిశుపాలవధ, స్కంద పురాణం, తైత్తరీయ అరణ్యక–

తీర్థకల్పతరు, వాయుపురాణం, విష్ణుపురాణం, కథక సంహిత, అష్టాధ్యాయి సూత్రపత, చుల్లనిద్దేశ, జ్ఞాతధర్మకథ, కౌసితకి బ్రాహ్మణ, అంగుటిని కాయ, చాందోగ్య ఉపనిషత్. ఇలా అనేక పురాతన గ్రంధాల్లో ఇతిహాసాల్లో ద్వారకాపురి దాని పరిసర ప్రాంతాల వర్ణనలు ఉన్నాయి. వీటన్నిటినీ సేకరించి చదివి వాటితో తన పరిశోధనల్ని సరిపోల్చటం అంటే సాధారణ విషయంకాదు. అదో మహాయాగం లాంటిది.

ఆ యాగాన్ని పరిపూర్ణం చేసి ద్వారక నీటమునగటం వాస్తవమని ప్రపంచానికి చాటిన షికారిపూర్ రంగనాథ్‌గారి జన్మ ధన్యం.

ఆయన తన గ్రంధంలో ఏమైతే చెప్పారో అవన్నీ ఇప్పుడు ప్రత్యక్షంగా తను చూస్తున్నాడు. ఇంతకన్నా తనకి వేరే భాగ్యం ఉంటుందా?

ఇక్కడ తనకు ఆశ్చర్యం గొలిపిన మరో అంశం ఉంది. రాతిబాటను దాటి మొదటి ప్రాకారాన్ని వాకిలి దాటుతుండగా దాని కుడిపార్శ్వంలో ప్రాకారం కొంత మేర దెబ్బతిని ఉంది. దాన్నింకా సరిచేయలేదు.

చూస్తే సమీపకాలంలోనే ఒక యుద్ధం జరిగి ఉంటుందని సందేహం ఉంది. అచట కావలిభటులను అడిగి తెలుసుకోవచ్చును. కాని అలా అడిగితే తను ద్వారకావాసికాదని వారు సందేహపడే అవకాశం ఉంది. మిత్రవిందనడిగి తెలుసుకోవాలి.

దీర్ఘాలోచనలో ఉన్న చరక్ ఆలోచనలన్నీ ఒక్క సారిగా చెదరిపోయాయి. ఉన్నట్టుండి అశ్వం నిలిచిపోవడమే అందుక్కారణం. అదలించినా అడుగు ముందుకు కదపలేదు అశ్వం. ఏం జరిగి ఉంటుంది? అశ్వం ఎందుకు నిలిచి పోయింది. సందేహిస్తూ పరిసరాలను చూసి – ఒక్క సారిగా ఉలిక్కిపడ్డాడు చరక్. ఒడలు గగుర్పాటు చెంది విచిత్రమగు ఒక అనుభూతి చెందుతూ అలా చూస్తూండిపోయాడు.

ఆలోచనల్లో గమనించలేదుగాని– అప్పటికే అశ్వం రెండు ప్రాకారాలమధ్య కక్ష్యలనుదాటి ముందుకొచ్చేసింది. వెళ్ళేటప్పుడు ఏ వృక్షఛాయలో కూర్చుని సాధువు తనను చేరబిలిచాడో సరిగ్గా ఆ వృక్ష సమీపంలో బాటమీద నిలబడి పోయింది అశ్వం. అదలించినా అక్కడే నిలబడింది.

తలతిప్పి చూసిన చరక్ కళ్ళకు – అదే తిన్నెమీద పద్మాసనస్థితిలో కన్పించాడా సాధువు. ఆయన ముఖమండలం తేజస్సుతో ప్రకాశిస్తోంది. పెదవులమీద అదే దరహాస చంద్రికలు. ఎప్పటివలెనే చేయి ఊపి చేర పిలుస్తున్నాడు. అశ్వం నిలిచిపోవటం వెనుక ఆయన ప్రభావం ఉందని గ్రహించాడు చరక్. వెళ్ళటమా వద్దాని సందేహించసాగాడు.

"నీకోసమే ఎదురుజూస్తుంటి నాయనా. అశ్వం ముందుకు కదలదు నేనే ఆగమంటిని. నన్ను జూడ నీకు భయమేల నాయనా. నీతో మాటాడవలె. ఇటు రమ్ము" అంటూ గంభీర స్వరంతో పిలిచాడు.

ఇక ఆయన తనను విడవడని చరక్‌కి అర్థమైపోయింది. అశ్వం దిగాడు.

ఏమైతే అయిందని ధైర్యం చేసుకుని అశ్వాన్ని వృక్షఛాయకు నడిపించి వదిలాడు. ఆయన ముందు కెళ్ళి పాదాలు తాకి భక్తితో నమస్కరించాడు. "అభీష్ట సిద్ధిరస్తు" అంటూ ఆశీర్వదించాడు సాధువు.

"నా అవివేకమును మన్నించండి స్వామీ. నా భయాలు నాకున్నవి. అందుచే మీరు పిలిచినా వచ్చుటకు జంకితిని. క్షమింపుడు" అన్నాడు వినయంగా నిలబడి. మృదువుగా నవ్వాడు సాధువు. "చరక్ నామధేయంగల నిన్ను తిరిగి కలికాలమునకు పంపించి వేయుదునని భయమందితివా?" అనడిగాడు.

ఒక్కసారిగా చరక్‌కి గుండె ఆగిపోయినంత పనైంది. నవరంధ్రాలు మూసుకుపోయినట్టయింది. కొద్దిక్షణాలపాటు మెదడు మొద్దుబారిపోయింది. ఏమిటిది? ద్వారకలో ఇన్ని రోజుల్లోనూ ఒక్కరు... ఒక్కరు కూడా తనను గుర్తించలేదే.

ఈ మహనీయునికెలా తెలిసిపోయింది. ఎంతటి శక్తిమంతుడు గాకుంటే తెలుసుకోగలిగివుంటాడు? ఈయన అనుగ్రహం లేకున్న తనకు ప్రమాదమే. ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆయన పాదాలమీద వాలిపోయాడు. చటుక్కున చరక్‌ను ఆపి లేపి తన పక్కన కూర్చోబెట్టుకున్నాడా సాధువు.

"భీతిల్లకుము బిడ్డా. నీ మంచికోరువాడనేగాని నీకు చెడు తలచువాడను గాను. నీ సంశయములన్నిటికీ నా వద్ద సమాధానములున్నవి. మనసు స్థిమిత పర్చుకొని కూర్చుండుము" అంటూ ధైర్యవచనాలు పలికాడు. ఆ మాటలు విన్నాక చరక్‌లో కొంత ధైర్యం ఏర్పడింది. ఇంతవరకు వచ్చాక ఇంకా దాపరికం అనవసరమనిపించింది.

"స్వామీ... సర్వం తెలిసినవారు. ఇంతకీ నేను ఎవరిని? చరక్కా, చతురుడనా?" అనడిగాడు.

"సందియమేల నాయనా! రెండునూ నీవే. గత జన్మలో చతురుడవు. ఈ జన్మలో కలియుగమున చరక్ నామధేయుడవు!"

చరక్‌కి నోటమాటరాలేదు. విస్మయానికి లోనయ్యాడు. ద్వారకాపురితో తనకు గతజన్మ అనుబంధం ఉంది.

"స్వామీ నేను చతురుడను అగునెడల గతము ఏల గురుతురాదు?"

"నేను జేరబిలిచినను నీవు నా వద్దకు రానైతివి గద" బదులిచ్చాడు సాధువు.

"ఆ కాలమున ఓడ ప్రమాదమున నేను మరణించితినా, బ్రతికి వచ్చితినా?"

"సందియమేల... మరణించితివి"

చరక్‌కి సాధువుమాటలు వింటుంటే బుర్ర గిర్రున తిరుగుతోంది. ఏనాటి మాట? సుమారు అయిదు వేల రెండువందల సంవత్సరాల క్రితం సంగతి (కలియుగానికి ముందు ద్వాపరాంతమున సంవత్సరాలు కలుపుకొనిన) ఇప్పుడు తను ద్వారకకు వచ్చేసరికి అదేకాలం నడచుట ఏమి? ఇదెలా సంభవం?

"ఆశ్చర్యము వలదు చరకా. నీవు మణిభద్రయక్షుని కోరిన కోరికలోనే ఆ కిటుకు ఉన్నది. గురుతుతెచ్చుకో. కురుక్షేత్ర యుద్ధమునకు పదివత్సరముల ముందు కాలమున గల ద్వారకాపురిలో యుండవలెనని కోరితివి గదా!" గుర్తు చేశాడు సాధువు.

అవునుగదా. తను అదేవిధంగా మణిభద్ర యక్షుని వేడుకున్నాడు. ఆ విషయం కూడా ఈ సాధుపుంగవునికి తెలిసిపోయినదే. వీరికి తెలీని విషయము లుండవా? "అయితే స్వామీ... నా మరణానంతరం నాడు మిత్రవింద జీవించినదా మరణించినదా... ఇప్పుడు జరుగునదెల్లా కలయా నిజమా. నాకేమియు అర్థమగుటలేదు స్వామీ" అన్నాడు.

"అర్థముగాదు నాయనా. దేవరహస్యము గదా. అయినను నీకో యదార్థము నెరింగించెద ఆలకింపుము" అంటూ చెప్పటం ఆరంభించాడు సాధువు.

"నీవు చతురునిగా ద్వారకలో పుట్టి పెరిగి యుక్త వయస్కుడవైనప్పటి సంగతి ఇది.

శ్రీకృష్ణులవారి చెలికాడు ఆస్థాన విదూషకుడు అయిన వసంతయ్య వయసులో నీకన్ననూ పెద్దవాడే అయిననూ ఆయనతో నీకు చెలిమి అధికము. నిను వలచిన మిత్రవింద ఆయన మేనకోడలే. ఆస్థాన వైద్యులు వల్లభాచార్యుల వారి కుమారుడివి, ఇంకనూ పిన్న వయసునందే ఘనవైద్యునిగా పేరు వడసితివి.

కావున పక్కన వసంతయ్యతోపాటు నీవును కోటలో రాచనగరులో నిరాటంకముగా సంచరించే వారు. ఒక దినమున ఎప్పటివలెనే మీరిరువురును బలరామ ప్రభువుల వ్యాయామశాలకు వెడలితిరి.

ఆ సమయమున బలరామప్రభువులు తన శిష్యులకు గదాయుద్ధమున మెళకువలు బోధించి ప్రదర్శించుచున్నారు. శ్రీకృష్ణులవారును ఆ సమీపమందే యున్నారు.

అంతలో గదను తిప్పుటలో పొరపాటున బలరామ ప్రభువుల భుజకండరం బెణకి విపరీతమగు సలుపు ఏర్పడినది. భరింపనలవిగాని నొప్పి. సరిగా ఆ సమయమున వచ్చిన నీవు బలరామ ప్రభువుల భుజమును మర్దించి చేతివ్రేళ్ళను నలిపి చిటికెన వేలును బట్టి చిత్రముగ లాగి వదిలితివి.

అంతియే... అంతటి వేదన చిటికెలోన మటుమాయమైనది. నీ యొక్క చాతుర్యమునకు మెచ్చిన బలరామప్రభువులు 'భళీ చతురా. నీ చాతుర్యము కడు శ్లాఘనీయము. మెచ్చితి. కోరుకొనుము. నీకొక్క వరంబొసగెద' యనిరి.

అత్తరి, నీవాశించినచో బంగారమో, మణిమాణిక్యములో, గోసంపదో, భూసంపదో, వస్తు వాహనములో కోరియుండవచ్చును. కాని అవి యేవియును కోరలేదు. విచిత్రమగు ఒక వరమడిగితివి.

"ప్రభూ తమదయవలనను శ్రీకృష్ణులవారి కరుణా కటాక్షముల చేతను మాకు ఏ లోటును లేదు. నాది ఒకటే కోరిక యున్నది. స్వర్గమును తలపించు ఈ ద్వారకాపురి నాకు అత్యంత ప్రీతికరమైనది.

పూర్వజన్మ సుకృతమున ఇక్కడ జనియించితి. మరుజన్మయందును నేను ఈ ద్వారకాపురిని జూడవలె. ఇట సంచరింపవలె. ఈ జన్మమున నేను పొంద లేనిదియున్నచో అది మరుజన్మయందైనా దక్కునటుల వరమొసంగి నన్ను కృతార్థుడ్ని జేయండి" అని వేడుకొంటివి. 'నీ అభీష్టము అసంగతము, అప్రస్తుతముగా యున్ననూ ఉత్సాహభరితులైయున్న బలరామప్రభువులు నీమీద గల వాత్సల్యంతో – 'సరి. నీవడిగిన వరంబొసగితి పో' అనినారు.

వసంతయ్య వెనుక నీవు వెడలిన వెనుక శ్రీకృష్ణ ప్రభువులవారు అగ్రజుని చెంత జేరి దరహాసమున – "అగ్రజా. ఆ చతురునకేదో వరంబొసగినటులున్నదే. ఏమది?" అని యడిగినారు. "పిచ్చివాడు. వరం కోరుకొమ్మనిన భోగభాగ్యము లేవియును కోరక కడు చిత్రమగు వరము కోరినాడు"

"కడుచిత్రమా... అటులయిన వినవలె. ఏమడిగినాడు?"

"మరుజన్మయందును తాను ద్వారకను జూడవలె. ఇట సంచరింపవలె, ఈ జన్మమున పొందలేనిది యున్నచో మరుజన్మమున దక్కునటుల వరమడిగి నాడు"

"నిజముగ కడు చిత్రమగు కోరిక... వరమనుగ్రహించితిరా"

"ఆహాఁ... మాట తప్పలేము గదా"

శ్రీకృష్ణులవారి పెదవులమీద దరహాసము మోమున పరిహాసము ద్యోతక మైనది.

అది గాంచిన బలరామప్రభువులు – "సోదరా, పరిహాసమేల, మేమను గ్రహించిన వరమున లోపమున్నదా?" అని యడుగ శ్రీకృష్ణులవారు – "లేదు అగ్రజా... చతురుడు సార్థకనామధేయుడనిపించుకున్నాడు. విధి తన నోటనే భవిష్యత్తు పలికించినదే... అది తలచి నవ్వితి" యనినారు.

"విధి తననోట పలికించినదా... ఏమిటి?" విభ్రాంతుడై బలరామ ప్రభువులు ప్రశ్నించారు. "చతురుడు అల్పాయుష్కుడు" శ్రీకృష్ణుల వారు దృఢస్వరముతో బదులిచ్చినారు.

"త్వరలో చతురునికి మరణము తప్పదు. ఈ జన్మమున అతడు పొందలేనిది వేరేదియో గాదు. అది అతని మనోహరి మిత్రవింద. వారి వివాహ పూర్వమే ఎడబాయుదురు. చతురుని మరుజన్మయనిన అది రానున్న కలికాలమున ఎన్నటికో... ఎచటనో...." సోదరుని పలుకులు ఆలకించి బలరామ ప్రభువులు కలతచెంది "సోదరా! చతురుని కర్మవశమును తప్పింపవలనుగదా?"

"విధిని తప్పింపజాలము అగ్రజా"

"ఇదేమిసంకటము. చతురుడు అసంబద్ధమగు వరమునుకోరనేల, సాధ్యా సాధ్యములు ఆలోచింపక మేము వరమొసంగుటయేల... పరిష్కారము దెలుపుము సోదరా. చతురుని బిలిపించి ఇచ్చిన వరమును ఉపసంహరింతునా?"

"బలరామప్రభువుల వరము అసంబద్ధమగునా... విధి వారి నుదుట ఏమి రాసినదో అటులనే జరుగును. మీ వరము భవిష్యకాలమున ఫలించును. కలత వలదు" అని బలరామ ప్రభువులకు మాట ఇచ్చారు శ్రీకృష్ణులవారు. ఆ విధముగా చతురుడు బలరామప్రభువులనుండి వరముపొందిన కొద్ది దినములకే ఓడ ప్రమాదమున మరణించినాడు" అంటూ వివరించాడు సాధువు.

అంటే గతజన్మలో తను చతురుడిగా ఉండగా పిన్నవయసునందే ఓడ ప్రమాదంలో మరణించడం వాస్తవమని చరక్‌కి అర్థమైంది.

అంతేకాదు నాడు బలరామప్రభువుల వర ప్రభావంచేత ఇన్నివేల సంవత్సరాల తర్వాత తిరిగి తను ద్వారకలో అడుగుపెట్టి ఇక్కడ వసించి సంచరింప గలుగుతున్నాడు.

తిరిగి నాటి తన మనోహరి మిత్రవిందను చేరుకో గలిగాడు. అంతా బాగానేఉంది. కాని గతమెందుకు తనకు గుర్తురావటంలేదు?

"స్వామీ గతము నాకు గురుతువచ్చునా? నాకంతా అగమ్య గోచరముగా యున్నది" అనడిగాడు.

"నావద్దకు వచ్చినావు గదా... కొంత తడవు ఓపిక పట్టుము. నీ మదిలో సందేహములున్నా యడుగుము. తీర్చెద" అన్నాడు సాధువు.

"నాకు వివాహమైనది స్వామీ. నా భార్య నామధేయము శుశ్రుత. అచట కలియుగమున నాకొరకు ఎదురుచూస్తున్నది. ఇప్పుడు నా పరిస్థితి ఏమి? శుశ్రుత కోసం మరలిపోదునా, మిత్రవింద కొరకు ద్వారకలోనే యుందునా?"

సాధువు గుంభనగా నవ్వాడు. 'పిచ్చివాడా... బలరాములవారిని వరము అడుగునపుడు తెలిసియడిగితివా! లేదే... విధి... విధి అటుల ప్రేరేపించినది. ఇప్పుడును అంతియే. నీ సమస్యకు విధిపరిష్కారము చూపగలదు. కలతయేల? నీ భార్య శుశ్రుత, మిత్రవింద అంశలో జన్మించినది. మిక్కిలి సౌందర్యవతి. ఇరువురిలో ఎవరినీ వదులుకొనజాలవు"

ఆయన మాటలు వింటుంటే చరక్‌కు నిజంగానే పిచ్చి ఎక్కుతున్నట్టుంది. శుశ్రుత, మిత్రవింద అంశలో జన్మించి యుండవచ్చు. కాని శుశ్రుతనిటకు తీసుకురాగలడా లేక మిత్రవిందను ద్వారకనుండి అచటకు తీసుకుపోగలడా. రెండును అసాధ్యములే గదా.

తనిప్పుడు ఎవరో ఒకరిని వదులుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నది వాస్తవం. అలా వదులుకో వలసివస్తే మిత్రవిందను వదులుకోవాలి. ఎందుకంటే తను వెనక్కి వెళ్ళకతప్పదు. జేజితాతగారి ఆశయాన్ని నెరవేర్చవలసిన బాధ్యత తనమీద ఉంది.

చరక్ సంకటస్థితిని గమనించినవాడై– ఆ సాధుపుంగవుడు మేఘగంభీర స్వరంతో– "చింతయేల నాయనా. నీ సమస్యను కాలమే పరిష్కరింపగలదు. వేరేమైనా సందేహములున్న యడుగుము" అన్నాడు.

ఆ మాటలతో కొంత ఊరట చెందాడు చరక్. అప్పుడొక విషయం అతడికి గుర్తుకువచ్చింది.

"స్వామీ తొలిప్రాకార ద్వారమున గమనించితి. కుడి పార్శ్వమున ద్వారభాగము కొంత శిథిలమైనది. దానిని అటులనే విడిచితిరి. ఏమి జరిగినది?" అడిగాడు.

సాలోచనగా వీక్షించాడు సాధువు. "అవును. దాన్ని అటులనే వదిలినారు. గత సంవత్సరమున ఇట పాండాజాతి సేనలు ద్వారకపై విరుచుకుపడినవి. ఆ సమయమున శ్రీకృష్ణులవారు ద్వారకయందు లేరు. ఆ ధైర్యముతోనే ఆ దుండగులు దాడి చేసినారు. భయంకర యుద్ధములో శత్రువులు తూర్పు ప్రాకార ద్వార పార్శ్వమును శిథిలంజేశారు. ఆ యుద్ధమందు తొలుత యాదవ సేనలు ఓటమికలైనవి.

సాత్యకి అలా చెదరిపోయిన యాదవసేనలను తిరిగి ఒకటిజేసి ఇనుమడించిన ఉత్సాహంతో యుద్ధాన్ని కొనసాగించినాడు. అంతలో శ్రీకృష్ణుల వారు ద్వారకకు తిరిగిరావటంతో బలరామప్రభువులు, శ్రీకృష్ణులవారు సాత్యకి ఇంకా పలువురు యాదవనాయకులసారథ్యంలో యాదవసేనలు పాండా జాతి సేనలను తరిమికొట్టినవి.

యుద్ధానంతరము నీవు జూచిన ప్రాకార శిథిల భాగము అటులనే వదిలివేయబడినది. అందుకు మొదటి కారణము మయుడి సారథ్యంలో దేవతలు నిర్మించిన ప్రాకారములు, మరమ్మతులు జేసినను తిరిగి కూలిపోవును, నిలువవు.

రెండవ కారణము భవిష్యత్తు తెలిసినవారగుటచే కృష్ణదేవులే దీనిని అటులనే వదిలివేయమని జెప్పిరి" అంటూ వివరించాడు సాధువు.

అంటే అర్థం ఏమిటి? ఎలాగూ రానున్న సంవత్సరాల్లో ద్వారక నీటమునుగుతుందని శ్రీకృష్ణుల వారికి ముందే తెలుసు గాబట్టి ఇక ప్రాకారభాగానికి మరమ్మతులు అనవసరమని భావించి అలాగే విడిచి పెట్టమని చెప్పివుంటారా? "అవగతంబైనది స్వామీ. మరొక్క సంశయము" అన్నాడు చరక్.

"ఏమా సంశయము?"

"ఇక్కడ సంకోదర, ధేనుక, సువర్ణ తీర్థ మొదలగు దీవులందును ఇటు ద్వారకాపురియందును శివాలయములు అనేకం ఉన్నవి. నీలకంఠమహాదేవ్– ఢింగేశ్వర మహాదేవ్, రామచంద్రాజీ, హనుమాన్‌జీ, శంకనారాయణ మొదలగు ఆలయాలను దర్శించితి.

సాక్షాత్తూ వైకుంఠవాసుడగు హరియే లీలామానుషవేషధారియై కృష్ణపర మాత్మగా ద్వారకలో కొలువుండ – ఇట శివాలయాలకూ ఇంత ప్రాధాన్యత ఎటుల వచ్చినది. మీరును శివభక్తులని తెలియుచునేయున్నది" అనడిగాడు.

చరక్ సందేహం విని– నర్మగర్భంగా నవ్వాడు సాధువు. "హరిహరులకు భేదంలేదునాయనా, ఇద్దరూ సమానమే. ఈ విషయమును సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణుల వారే అనేక సందర్భములందు ప్రవచించినారు– బ్రహ్మమానసపుత్రుడగు పులస్త్య బ్రహ్మ మనవడు రావణబ్రహ్మ.

ఆ రావణవధతో సంక్రమించిన బ్రహ్మహత్యాపాతకాన్ని కడుగుకొనుటకు ఆ శ్రీరామచంద్రులవారే భరతఖండమున అనేక శివలింగములు ప్రతిష్ఠించిరి. అందుకే ఇచట వైష్ణాలయములు శివాలయములును సమృద్ధిగ వున్నవి.

నేను ఇరువురను ఆరాధించువాడను. ఇంకా ఇక్కడ అంబాజీ, ఇచ్ఛాయి, శ్రీ అభయ, మమ్మాయి, హరసిద్ధి, నవదుర్గ, అద్వేశ్వరి, చంద్రభాగ, లునాయి, పద్మేశ్వరి, అష్టభుజ, విసోట, సీతల, అజయ అనే పదునాలుగు శక్తి గుడులున్నాయి. అవి కూడా చూడుము" అంటూ వివరించాడు.

"అయిననూ మరొక్క సందియము– హరుడగు సదాశివునకు మీసము లుండగా శ్రీహరికి ఏల మీసముండదు? వారి అవతారములందును మీస ముండదే. వరశురాములవారు బ్రాహ్మణవంశజుడగుటచే మీసములు లేవనుకున్నను వామనుడికి లేవు, రాములవారికీలేవు నేటి శ్రీకృష్ణులవారికీలేవు. ఎందులకు? చరక్ సంశయం విని– అంతటి గంభీరవదనుడయిన సాధుపుంగవుడు కూడా ఒక్కసారిగా పకాళించి నవ్వకుండా ఉండలేకపోయాడు.

తలచుకొని తలచుకొని కొన్ని విడతలుగా నవ్వి ఎటులో నవ్వు ఆపుకొని చరక్‌ని పసివాడ్ని చూస్తున్నంత ముచ్చటగా చూశాడు.

తన మీసాన్ని గడ్డాన్ని సవరించుకొంటూ నవ్వునాపి– "శ్రీకృష్ణులవారికి మీసము లేకున్ననేమి, వారి అగ్రజుడు బలరామప్రభువులకు మీసములు, గడ్డము ఉన్నవిగదా" అన్నాడు పరిహాసముగా, చరక్‌కి అర్థంకాలేదు.

"నాయనా సంశయములు అడుగుటలోను నీవు చతురుడవే సుమీ... మంచిప్రశ్న. హరునకు మీసములుండుట వాస్తవమే.

ఏలయన హరుడు లయకారకుడు గదా. నశింపజేయువాడు. దృఢచిత్తము గలవాడు. భోగభాగ్యములందు ఆసక్తి లేనివాడు. పులి చర్మాంబరధారి, ఫణిభూషణుడు. నందివాహనుడు. కావున దృఢచిత్తుడగు శంకరునకు మీసము కలదు.

శ్రీహరి స్థితికారకుడు అయినందున ఆయన చిత్తము కోమలమైనది. మృదుభాషి, పుష్పప్రియుడు, వైభోగప్రియుడు, మానినీచిత్తచోరుడు, భోగభాగ్యములతో ఆడంబరప్రియుడు, సాక్షాత్తు భోగకారకమగు ఆ లక్ష్మీదేవిని హృదయమున నిలుపుకొన్నవాడు.

సుకుమారుడు. మృదువగు శేషతల్పమున శయనించువాడు కావున మృదుస్వభావి అయిన శ్రీహరికిని మీసము లేదు. ఆయన అవతార క్రమంలోను మీసములు లేవు" అంటూ మరోసారి నవ్వాడా మహనీయుడు.

"స్వామీ వేరొక్క సంశయం. మా కలికాలమునకు చెందినది. గోమతీనది నుండి కడలితీరమున దక్షిణంగా పిండద్వారకయను ప్రాంతమున్నది.

అచట జనులు మరణించినవారికి తర్పణములు విడుచుట, పిండ ప్రదానము చేయుట మొదలగు కర్మలు ఆచరింతురు.

ఆ ప్రాంతమునకు పిండద్వారకయను పేరెటుల వచ్చినది. ప్రస్తుతము ఇట పిండద్వారకయనునది లేదు గదా?" అని ప్రశ్నించాడు.

ఎందుకో ఆ ప్రశ్న వినగానే ఆ మహనీయుని ముఖం మ్లానమైనది. చిరునవ్వు చెరిగిపోయింది. విషాదఛాయలు పొడచూపాయి.

అది గమనించిన చరక్ అడగకూడని ప్రశ్న అడిగానా అని సందేహ పడ్డాడు.

నిజంగా అడగకూడని ప్రశ్నే అది.

సాధువు ఒకింత తేరుకుని గంభీరంగా చరక్ వంక చూస్తూ– "మనం ద్వాపరయుగంలో ఉన్నాము. నీ ప్రశ్నలో భవిష్యత్తు ఉన్నది గాన, నిశ్చయముగా

నీ ప్రశ్నకు బదులీయరాదు. అయినను మాట ఇచ్చితి గావున నీ సందియము తీర్చెద.

"మీ కలికాలమునగల పిండద్వారక ఇప్పుడు కనబడదు. ఏలన– కురుక్షేత్ర యుద్ధానంతరం శ్రీకృష్ణులవారికి గాంధారి శాపకారణమున యాదవకులం క్షయము నొందిన ప్రాంతం అది.

యాదవులంతా శోకతప్తులై మరణించిన వారికి యచట తర్పణములు విడిచి పిండ ప్రదానము గావించిన ప్రదేశం.

యుగసంధి ముగిసి కలియుగారంభమున జరిగిన విషాద సంఘటన.

కావున నాటి నుండి అచట తర్పణములు విడిచి పిండప్రదానము గావించిన మరణించిన వారి ఆత్మలు శాంతించునను నమ్మకముతో కలియుగ జనులు ఆ ప్రాంతమును పిండద్వారకయనుచూ తర్పణములు విడుచుచూ అచట ఈ ఆచారమును పాటించుచున్నారు.

కావున ఇప్పటికాలమున పిండద్వారక నీకు అచట కానరాదు" అంటూ చెప్పకూడని నిగూఢ విషయాన్ని కూడా వివరించి చరక్ సంశయ నివృత్తి చేశాడు సాధువు. చివరిగా– "ఇంకేమీ సందియములు లేవుగా?" అనడిగాడు.

"కృతార్థుడ్ని స్వామీ. వేరేమియును లేవు" అని బదులిచ్చాడు చరక్.

"నీకు గతము గురుతువచ్చుటకు ముందే నీకొక హెచ్చరిక చేయవలసి యున్నది. అదేమనిన – నీవు ద్వారకలో ఎచట సంచరించినను సమస్య లేదు.

కాని పొరపాటునకూడా నీకు కోట ప్రాకార వాకిలి దాటి లోనకు బోవలదు. కారణమేమనగా– ప్రాకారపు లోపలికోట రాచనగరు సభాభవనం మొత్తం అంతటా కృష్ణశక్తి ఆవరించియున్నది.

నీవు మణిభద్రయక్షుని శక్తితో నిచటకు వచ్చితివి. నీవు లోన అడుగిడిన మరుక్షణం కృష్ణశక్తి ప్రభావమున మణిభద్రయక్షుని ప్రభావము నీపై తొలగిపోవును. అలా తొలగిన మరుక్షణం మణిభద్రయక్షుడు తిరిగి నిన్ను కలికాలమునకు గొనిపోగలడు.

కావున పొరపాటున కూడా కోట ప్రాకార వాకిలి దాటి లోనకు పోవలదు" అంటూ హెచ్చరించాడు. ఆ హెచ్చరిక విని – నిర్ఘాంతపోయాడు చరక్.

అంటే ద్వారకలో సంచరిస్తున్నంతవరకూ తను కోరినప్పుడే మణిభద్ర యక్షుడు తనను కలియుగంలోని తన శరీరంగల మందసంవైపు తీసుకుపోతాడు. కాని ప్రాకారవాకిలి దాటితే మాత్రం తను కోరకుండానే పట్టి లాక్కెళ్ళి కాలనాళిక మందసంలోని తన శరీరంలో పడేస్తాడు. ఆహాఁ ఇదేమి మెలిక.

ఇంకా నయం. ముందే తెలిసింది. చతురుడిగా తనను ఎవరూ అడ్డగించరన్న ధీమాతో ఇవాళో రేపో కోటలోకి వెళ్ళి రావాలనుకున్నాడు వెళ్తే కొంపమునిగేది. వచ్చిన కార్యం నెరవేరకుండానే మరలిపోయేవాడు.

తను శమంతకమణిని చూడాలి. పాంచజన్యం చూడాలి, శిఖిపించంతో శ్రీకృష్ణులవారి కిరీటాన్ని, వారి కరభూషణమైన మురళిని చూడాలి. వాటిని చూడకపోతే వచ్చి ప్రయోజనం ఏమిటి?

తను ఇక్కడి కొచ్చాక మిత్రవింద గురించి తెలిసింది. రాకముందు తెలీదు గదా. "అంతా తమ అనుగ్రహం స్వామీ. మీరు చెప్పినటులే నడచుకొనెద" అంటూ నమస్కరించి లేచాడు చరక్.

"ఇటు రమ్ము నాయనా" అంటూ చరక్‌ను తన ఎదురుగా నిలుచుండమని ఆ సాధువు చరక్ నుదుట విభూదిపూశాడు. తన చేతిని చరక్ శిరస్సున ఉంచి ఏదో మంత్రం చదివాడు. తర్వాత త్రిశూలం అందుకొని దాంతో అతని నుదుటను తాకించి వదిలాడు. అంతే–

కొన్ని క్షణాలపాటు ఏం జరిగిందీ చరక్‌కు గుర్తు లేకుండాపోయింది. తల దిమ్మెక్కిపోయి కళ్ళు బైర్లు కమ్మాయి. కళ్ళముందు కటిక చీకటి. మస్తిష్కం మొద్దుబారింది. అలాగే సాధువు ముందు మోకాళ్ళ మీద కూర్చుండిపోయాడు.

అంతలో – కళ్ళముందు ఏదో వెలుగురేఖ. మెదడులో ఏవో చీకటి తెరలు చీలి తెగి రాలిపోతున్న భ్రాంతి. గజిబిజిగా జ్ఞాపకాల పొరల్లో తెలీని అలజడి. అలా అదేస్థితిలో కొంతసేపు ఉండిపోయాడు. అంతలో క్రమంగా అతడి మనసు, శరీరం సాధారణ స్థితికి చేరుకోనారంభించాయి.

ముఖం తేజోవంతమైనది. మదిలో గతజన్మ స్మృతులు ఒక్కొక్కటిగా పొడచూపనారంభించాయి. ముందుగా ఒక సుందర వదనం గోచరించింది. అది ఎవరో కాదు... మిత్రవింద.

అంతలోనే మరోదృశ్యం. తను తన కళ్యాణి అశ్వం మీద వీధిలో అక్కడక్కడే తచ్చట్లాడుతున్నాడు. ఎదురుగా సౌధాగ్రమున గవాక్షం చెంత నిలబడి చిరునవ్వుతో తనను ఓరకంట చూస్తోంది మిత్రవింద. క్షణంలో అది చెదరిపోయి మరో దృశ్యం.

మణిమండపంలో మిత్రవిందతో తను ఏకాంతమున సరసవినోదాన ముచ్చట్లాడుకొంటున్న దృశ్యం. ఒకటొకటిగా గతజన్మ అంతా– చరక్‌కి గుర్తు కొచ్చేస్తోంది. "చతురా... నాయనా చతురా" సాధుపుంగవుని పిలుపుతో గతం నుండి బయటికొస్తూ– "స్వామీ" అంటూ తలెత్తి చూశాడు.

"గతజన్మ గురుతు వచ్చినదా? లెమ్ము. ఒకింత ఇట కూర్చొనుము" అంటూ పిలిచాడు.

మోకాళ్ళమీద కూర్చున్నవాడు లేచి – ఆయనకు ఎడంగా తిన్నెమీద కూర్చున్నాడు చరక్.

"తమ అనుగ్రహమున గతజన్మ తెలిసిపోయినది స్వామీ. అంతయు గురుతుకొచ్చి కనులముందు కదలాడుచున్నది. మిత్రవింద నా మనోహరి. నాప్రాణం. వెంటనే ఆమెను చూడవలె" అన్నాడు హృదయ చంచలనాన్ని అదుపుజేసుకొంటూ చరక్, ఉద్వేగాన్ని ఆపుకోలేకపోతున్నాడు.

"తొందరేల నాయనా. నిను వెదుకుచూ నీ మిత్రవింద ఈ మార్గమునే వచ్చుచున్నది" అన్నాడు మృదువుగా ఆ సాధువు.

"వచ్చుచున్నదా!"

"అవును. వచ్చుచున్నది. అటు జూడుము" అంటూ చేయెత్తి బాట ఎగువకు చూపించాడు.

వెంటనే చివ్వున లేచి నిలుచున్నాడు చరక్.

నిజంగానే ద్వారకాపురి నుండి ఒక రథం అటుగా దూసుకొస్తూ కన్పించింది. ధవళాశ్వాలు పూన్చిన రథం. రథచోదకురాలు త్రిజటగా గుర్తించగానే అది మిత్రవింద రథమని అర్థమైపోయింది.

"చతురా...." పిలిచాడు సాధువు.

"స్వామీ!" అన్నాడు తిరిగిచూసిన చరక్.

"మరొక్క విషయం తెలిపెద నాలకింపుము. నీవు గృహమునకేగిన పిమ్మట నీ జనకుడు వల్లభాచార్యుని ఆయుర్వేద తాళపత్ర భాండాగారము నొకపరి అవలోకించిన మరిన్ని విషయములు తెలియగలవు. గురుతు ఉంచుకొనుము"

"అటులనే స్వామీ"

రథం వారిని సమీపిస్తోంది. పొద్దు వాలుతున్నప్పటికీ ఎంతకూ చరక్ తిరిగిరానందున ఆత్రపడిన మిత్రవింద అతన్ని వెదుకుతూ స్వయంగా తనే బయలుదేరింది. గతజన్మ గుర్తులేనందున ఇంతవరకూ ఆమెను అర్థం చేసుకోవటంలో చరక్ తడబడ్డాడు.

కాని సాధుపుంగవుడు చరక్‌ను గతజన్మస్మృతి కలిగించటంతో ఇప్పుడు చరక్ మనసు మిత్రవిందను చూడాలని వేగిరపడుతోంది. ఆమెపట్ల ప్రేమాను రాగాలు వరదలా ముంచుకొస్తున్నాయి.

ఏనాటి ప్రేమ ఏనాటి ప్రణయం... నమ్మశక్యంగాదే. కాని నమ్మాలి. గతజన్మ తెలిశాక కూడా నమ్మకుండా ఎలా ఉండగలడు! నేరుగా వచ్చి ఆ సమీపంలో ఆగింది రథం. మిత్రవింద చరక్‌కు ఏమైందో ఏమిటోనని ఆత్రపడుతూ రథం దిగి వస్తోంది.

అంతే– ఇక నిలవలేకపోయాడు చరక్. సుడిగాలిలా దూసుకెళ్ళి మిత్రవిందను కౌగిట బంధించేస్తూ చిన్నగా ఏడ్చేశాడు. "క్షమింపుము... నన్ను క్షమింపుము మిత్రా. గతం మరచి నిన్ను గుర్తించలేక వేధించితిని. ఆ స్వామి కరుణతో ఇప్పుడు నాకు గతమంతయు గురుతు వచ్చినది. నువ్వు నా మిత్రవిందవు... నా ప్రాణానివి" అంటూంటే ఆ మాటలు విన్న మిత్రవింద కూడా ఆనందాతిశయంతో కన్నీరు నించుతూ హత్తుకుపోయింది.

ఆ ప్రేమజంటను చూస్తున్న రథం మీది త్రిజటకు, వృక్షఛాయలోని సాధువు కళ్ళలోను ఆనందబాష్పాలు నిలిచాయి. మిత్రవిందను సాధువు ముందుకు తీసుకొచ్చాడు చరక్. ఇద్దరూ ఆయనకు పాదాభివందనం చేశారు. "అభీష్ట సిద్ధిరస్తు" అంటూ ఆశీర్వదించాడు సాధువు. ఆయన వద్ద సెలవు తీసుకుని బయలుదేరారిద్దరూ.

ఈసారి అశ్వం మీద గాకుండా అశ్వం కళ్ళాలను మెడకు చుట్టి తను మిత్రవిందతో బాటు రథంలో కూర్చున్నాడు చరక్. రథం కదలగానే ఈలవేశాడు. అంతే, అశ్వం తానుగా రథాన్ని అనుసరించి దౌడు తీయనారంభించింది.

"ఆ మహనీయుడు ఎవరో నీకు తెలియునా?" తన ఒడిలో వాలిన మిత్రవింద ముంగురులు సవరిస్తూ అడిగాడు చరక్.

"వారిని 'శివయోగి' అందురు జనులు. అప్పుడప్పుడూ నగరవీధులందు కనబడుదురు" అంది మిత్రవింద.

అక్కడ చెట్టువద్ద నిలబడిన సాధువు శివయోగి దూరమవుతున్న ఆ రథాన్నే చూస్తూ తృప్తిగా నవ్వుకున్నాడు. రాజులు, చక్రవర్తులు ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడానికి, వారికి నాలుగు మంచి మాటలు చెప్పి సత్ప్రవర్తన కలిగించటానికి మారు వేషంలో సంచారం చేయటం అలవాటయిన విద్య. అలాగే ఈ సాధువు శివయోగి వేరెవరో కాదు.

సాక్షాత్తూ శ్రీకృష్ణులవారి అగ్రజుడు ద్వారకాపురి ప్రభువు ఐన బలరామ దేవులని రథంలో వెళ్తున్న మిత్రవిందకు గాని, చరక్‌కు గాని తెలీదు.

*　　*　　*　　*　　*

కలియుగం... క్రీస్తుశకం 2013 మార్చినెల రంపచోడవరం అడవులు, అగ్నివేశాచార్యుని స్థావర ప్రాంతం. ఏదో పనిమీద బయటికొస్తున్న పులి కొండయ్య అక్కడ ఒకచెట్టుచాటున నిలబడి తొంగితొంగి చూస్తున్న అప్పన్నను చూసి ఆశ్చర్యపడుతూ విషయమేమిటో తెలుసుకుందామని దగ్గరికెళ్ళాడు.

అది సాయంకాల సమయం. నిశ్శబ్దంగా అప్పన్నను సమీపించిన పులి కొండయ్య వాడు దీక్షగా చూస్తున్న వైపు చూశాడు. అక్కడేమీ కనబడలేదు. నిశ్శబ్దంగా అప్పన్న భుజంమీద చేయివేశాడు.

అంతే– అదిరిపడి కీచుమని అరుస్తూ – ఎగిరి పక్కకు దూకాడు అప్పన్న. వాడు ఎందుకు అరిచాడో అర్థం గాక కంగారుపడి తనూ వెనక్కి దూకాడు పులి కొండయ్య. అతన్ని చూసిన అప్పన్న 'థుథుథు' అని వెన్ను చరుచుకున్నాడు.

"ఓరి నీ అసాధ్యం కూల. ఎలుగుగొడ్డనుకుని జడుసుకుచచ్చాను గదరా కొండయ్యా. పిలిస్తే నీ సొమ్మేం పోయింది. అంత సద్దు లేకుండా వచ్చావ్?" అంటూ విసుక్కున్నాడు.

"నువ్వేదో నిక్కి నిక్కి జూత్తంటే ఏమో అనుకుని వచ్చినా. ఏం లేదే. ఇవేం వేషాలు నీకు?" ఎదురుదాడికి దిగాడు పులి కొండయ్య.

"ఏమీ లేదా... రా... అటు జూడు" అంటూ జబ్బపట్టి పులికొండయ్యను లాగి, అతడి ముఖాన్ని తను చూస్తున్న వైపు తిప్పి చూడమన్నాడు. అలా చూసిన కొండయ్యకు కొంతదూరంలో చెట్టుచేమల్లేని బయలు ప్రదేశంలో నిలబడి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్న డ్రైవర్ కాశి కన్పించాడు.

పులి కొండయ్య ముఖం తిప్పుకుని అప్పన్నతో "ఏరా అప్పిగా. నీకేమన్నా బుద్ధందా? ఆ కాశిగాడు ఎవరితోనో ఫోన్‌లో మాటాడుతున్నాడు. అంత మాత్రానికే ఏదో అక్కడ దేవకన్నెలు చిందేస్తున్నట్టు జూడమంటావే. ఛత్తేరి తిక్కనాయాలా" అంటూ విసుక్కున్నాడు.

ఆ మాటలకి అప్పన్నకు ఒళ్ళు మండింది. "ఓరి నీ... నువ్వు పులి కొండయ్యవి కాదురా. వట్టి గాలి కొండయ్యవి. కొంచెం కూడా బుర్ర పెట్టి ఆలోచింపవే... ఈ నట్టడివిలో మామూలు ఫోను పనిజేత్తందా?" కసురుకున్నాడు.

"అవుననుకో...."

"అనుకోడం ఏందిరా. పనిచేయవు. శాటిలైటు ఫోను గావాలె. అది నీ దగ్గిర, నా దగ్గిర ఉందా? ఆ మాటకొస్తే గురువుగారు అగ్నివేశాచార్యుల వద్దనే ఉన్నది. ఇంకెవరి దగ్గరా లేదు. కాని ఆ కాశిగాడి దగ్గరుంది. ఆ సంగతి నాకు తప్ప మీకెవరికీ తెలీదు. అప్పుడప్పుడూ ఇలా దూరంగా వచ్చి ఒంటరిగా నిలబడి ఆ ఫోన్‌లో మాటాడుతూంటాడు. అర్థమైందా?" అనడిగాడు.

ఆ మాటలు వింటూ తెల్లముఖం వేసుకుని చూశాడు పులి కొండయ్య. డ్రైవరు కాశిదగ్గర శాటిలైటు ఫోను, రహస్యంగా ఎవరితోనో మాట్లాడ్డం.. కొంచెం కొంచెం ఏదో బోధపడుతోంది వాడికి.

అయినా వాడు తన బంధువులెవరితోనో సంభాషింపవచ్చు గదా. దీని కెందుకు ఈ అనుమానం పురుగు అప్పన్నగాడు ఆరాటపడ్డం?

"ఒరే మొద్దు. నాకన్నా పెద్దోడివి. అనుభవం గలోడివనుకున్నాను గాని వూహు వొట్టి మట్టిబుర్రన్నా నీది. ఇంకా డౌటు కలగలేదా?" వెక్కిరించాడు అప్పన్న.

"అంటే ఏమిట్రా నీ ఉద్దేశం? ఆ కాశిగాడు ఏదో పెద్ద నేరంజేస్తున్నా డంటావా? వెధవడౌటూ నువ్వూను. వెళ్ళి అడక్కపోయావా?" అనడిగాడు పులి కొండయ్య.

"అదీ అయిందిలే. ఎవరన్నా తనవంక వత్తంటే చాలు గుసగుసలు పోతూ ఫోన్ సంచిలో పడేస్తాడు. అడిగితే వైజాగ్‌లో తనకో లవర్ ఉందంట.

దాంతో లవ్వంట. ఏరా. ఎప్పుడడిగినా నాకెవరూ లేరు ఒంటరిగాడ్ని అంటాడు గదా. ఇంత రహస్యంగా మన కంటబడకుండా దూరంగాపోయి ఏం మాట్లాడుతున్నట్టు, ఎవరితో మాట్లాడుతున్నట్టు. డౌటేలేదన్నా. వీడేదో ఎదవపని చేత్తున్నాడనే నా డౌటు"

అప్పన్న మాటలతో పులికొండయ్యకు బల్బు వెలిగినట్టయింది. నిజంగానే కాశి గురువు గారికి ద్రోహం చేస్తూ నమ్మకంగా ఉండి గోతులు తీస్తే మాత్రం వాడు క్షమార్హుడు కాడు.

చిన్న విషయమని అశ్రద్ధచేస్తే గురువుగారితోబాటు తామంతా చిక్కుల్లో పడాల్సివుంటుంది. అప్పన్న భుజం తట్టాడు పులి కొండయ్య. "ఉండాల్సినోడివిరా అప్పన్నా. వాడ్ని గమనిస్తూనే ఉండు. వీడి సంగతి మనం తేలుద్దాం" అంటూ అభినందించాడు.

ఇద్దరూ అక్కడి నుంచి వెనుతిరిగారు.

*　　*　　*　　*　　*

సరిగ్గా ఇదే సమయంలో – అక్కడ మున్నలూరి వారి అగ్రహారంలో ఒక సంఘటన చోటుచేసుకుంది. ఆ రోజు హైదరాబాద్ నుండి చరక్ మామగారు రామాచారి సడెన్‌గా మున్నలూరివారి అగ్రహారం వచ్చాడు. అతని రాక ఎవరూ ఊహించనిది.

ఒంటరిగానే వచ్చాడు. రామాచారి రాక వెనుక కారణం ఏమిటో దేవమ్మ గారు ఊహించగలిగినా కనీసం ముందుగా ఫోన్ కూడా చేయకుండా వస్తాడని అనుకోలేదు. ప్రస్తుతం ఇంటి పెద్దదిక్కుగా సమస్యల్ని చక్కదిద్దే భారం తనమీదే ఉంది.

ఏవైనా కుటుంబసమస్యలో, ఆలుమగల కీచులాటలో అయితే ఎలాగో సర్దిచెప్పొచ్చు. కాని ఆయన వచ్చింది అల్లుడు చరక్ కోసం. తను జేజితాతగారితో

వెళ్ళి నెలరోజులు దాటింది. శాటిలైట్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంచారు. ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో తెలీదాయె. ఇప్పుడు రామాచారికి ఏం చెప్పి పంపించాలి?

యధాప్రకారం మర్యాదలు జరిగాక రామాచారిని పలకరింపుగా అడిగారు దేవమ్మగారు. "ఏం నాయనా. ఇంటివద్ద అంతా కులాసాయే గదా! మీ ఆవిడ కావేరి, అమ్మాయి శుశ్రుత సౌఖ్యమేగా?" అంటూ పరామర్శించింది.

"అంతా సౌఖ్యమే తల్లీ. మా సమస్య అల్లుడు గారి గురించే" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ రామాచారి. "మిమ్మల్ని ఇబ్బందిపెట్టాలని రాలేదమ్మా. చెట్టున పండిన కాయ చెట్టుకు సొంతం కానట్టే ఆడపిల్లకీ పుట్టిల్లు సొంతం కాదు.

ఆపైన ప్రేమించి పెళ్ళిచేసుకున్న జంట. అల్లుడు గారు వచ్చేసి నెలా పదిహేను రోజులవుతోంది.

చరక్ కోసం ఎదురుతెన్నులు చూస్తూ శుశ్రుత తిండితిప్పలు మానేసి బెంగటిల్లుతోంది. ఇక చుట్టుపక్కల అమ్మలక్కల సూటిపోటి మాటలు భరించలేక పోతున్నాం.

మనుగుడుపు పెళ్ళికొడుగ్గా వచ్చి పెళ్ళాన్ని వదిలిపోయాడంటే ఏదో కారణం ఉంటుందని నలుగురూ నాలుగు రకాల వ్యాఖ్యానాలు. శుశ్రుత బాధ చూడలేక ఓసారి మీవద్దకొస్తే ఏదన్నా పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ఇలా వచ్చాను తల్లీ.

ఇలా ఇక్కడికొస్తున్న సంగతి ఇంట్లో చెప్పలేదు. చెప్తే శుశ్రుత వెంటబడి వచ్చేస్తుందని భయం. కొత్తగా పెళ్ళయిన అమ్మాయి లాంఛనాలూ అవీ ఆ పద్ధతు లేవీ తనకు తెలీదు.

అలానే ఇక్కడ ఏం జరుగుతోందో చరక్ ఎక్కడ ఉన్నాడో తెలీదాయె. ఇప్పుడు నేనేం చేయాలో చెప్పండమ్మా. వీలైతే అల్లుడు గారిని ఓసారి పిలిపిస్తే మాట్లాడి వెళ్ళిపోతాను" అంటూ వచ్చిన పని క్లుప్తంగా చెప్పేశాడు రామాచారి.

దేవమ్మగారికి ఈ పరిస్థితి సంకటమే అయినా జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చూసి ఎదురు నిలిచిన స్థితప్రజ్ఞురాలు. ఎక్కడా తడబడదు. వాక్కు పొల్లు పోనీదు.

"నీ బాధ నాకు అర్థమైంది రామాచారి. చరక్‌ను పెళ్ళిచేసుకున్నాక శుశ్రుత మా అమ్మాయేగాని మీ అమ్మాయికాదు. కాబట్టి మీ బాధలో పాలుపంచుకునే బాధ్యత మామీదా ఉంది.

కాని ఇది మన కుటుంబాలమధ్య సమస్యో, ఆలుమగల కీచులాటో కాదు. బాధ్యతల భారం. ఆ భారాన్ని ఇప్పుడు చరక్ మోస్తూ ప్రస్తుతం జేజి తాతగారు అగ్నివేశాచార్యుల వారి వెంట రహస్య ప్రాంతంలో ఎక్కడో ఉన్నాడు.

వారు తిరిగి రావటానికి ఇంకా కొద్ది రోజులు పడుతుంది. శాటిలైట్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉంచారంటే ఎంత జాగ్రత్తగా ఉంటున్నారో అర్థం జేసుకోవాలి. కాబట్టి మీరనుకున్నట్టు ఇప్పుడు చరక్‌ను పిలవటమో, ఫోన్‌లో మాట్లాడించటమో సాధ్యంకాదు.

ఈ పరిస్థితిలో మనం చేయగలిగింది ఒక్కటే పరిష్కారం– అమ్మాయి శుశ్రుత చరక్‌కోసం బెంగటిల్లుతోందంటున్నారు గాబట్టి. తీసుకొచ్చి మా దగ్గర వదిలేయండి.

అప్పుడు మీ చుట్టుపక్కలవారి నోళ్ళు మూతపడతాయి. మీ సమస్యా తీరుతుంది. శుశ్రుత మా మధ్యనుంటే పరిస్థితి నర్ధం జేసుకుంటుంది. తన బెంగా తీరుతుంది" అంటూ తన అభిప్రాయం వెల్లడించారు దేవమ్మగారు.

రామాచారి ఒకింత సందేహంగా చూశాడు. "అలా తీసుకురావటం సమంజసమా తల్లీ. లాంఛనాలూ, ఆచారాలంటూ ఉన్నాయి గద... నా అభిప్రాయం...." నసిగాడు.

"మన అభిప్రాయాలూ, ఆచారాలూ పక్కన పడెయ్ రామాచారి. ఇప్పుడు మనక్కావలసింది చరక్ తిరిగొచ్చే వరకు శుశ్రుత సంతోషంగా ఉండటం. అది మా మధ్య ఉంటేనే సాధ్యం.

కాబట్టి మీ భార్యాభర్తలిద్దరూ శుశ్రుతను తీసుకొచ్చి దించండి. మీరూ పదిరోజులు మాతో ఉంటే ఈ లోపల చరక్ రానే వచ్చేస్తాడు."

"అంతేనంటారా తల్లీ."

"ఇంతకు మించి మరోదారి లేదయ్యా రామాచారి. నా మాటవిను. నాలుగైదు రోజుల్లో మంచి ప్రయాణ తిథులు, శుభలగ్నాలు ఉన్నాయి. వెంటనే నేను చెప్పినట్టు చెయ్యి"

దేవమ్మగారి మాటలతో రామాచారికి ధైర్యం చిక్కినట్లైంది. శుశ్రుతను మున్నలూరి వారి అగ్రహారంలో అత్తారింట ఉంచటమే మంచిదనిపించింది. దాంతో దేవమ్మగారి వద్ద సెలవు తీసుకుని ఆ పూటే హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు రామాచారి.

* * * * *

ద్వాపరయుగం, ద్వారకానగరం, కనుచీకటి పడుతూండగా మిత్రవింద రథంలో ఆమె తండ్రి శివదేవగుప్తులవారి ఇంటికి చేరిన చరక్ అటు పిమ్మట తన అశ్వంమీద వల్లభాచార్యులవారి గృహానికి చేరుకున్నాడు.

సాధుపుంగవుడు శివయోగి చివరిగా చేసిన హెచ్చరిక తను మర్చిపోలేదు. తాళపత్ర గ్రంధాలు గల భాండాగారంలో మరిన్ని విశేషాలు తెలుస్తాయని చెప్పారాయన.

ప్రస్తుతం చతురునిగా తనకు గతమంతా గుర్తుకొచ్చేసింది. ఆ భాండాగారం తనకు కొత్తగాదు. తన ద్వాపరయుగ తండ్రిగారు వల్లభాచార్యుల వద్ద వైద్యవిద్య నభ్యసిస్తూ ఆ భాండాగారంలో అనేక గ్రంధాలను పఠించాడు. కాని అచట గల విశేషము ఏమున్నది?

అవేమిటో తెలుసుకోవాలని ఆత్రంగా ఉన్నా ఆ రాత్రి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఆ రాత్రి – తన శయనమందిరంలో పడుకున్నాడే గాని చరక్‌కి ఎంతకూ నిద్రపట్టలేదు. ఒక చిక్కు ప్రశ్న అతడి అంతరంగాన్ని వేధించ సాగింది. ఇప్పుడు తను ఎవరు?

తను కలియుగంలోని ఆర్యభట్టాచార్యులు శ్రీలక్ష్మిలకు సంతమాలేక ద్వారకలోని వల్లభాచార్య దంపతులకు సొంతమా. ఎవరిని తల్లి దండ్రులుగా స్వీకరించాలి?

ఈ చిక్కు ప్రశ్నలను సాయంకాలం ఆ సాధుపుంగవుడు శివయోగిని అడిగి సమాధానం పొందవలసింది. అంత క్రితం వరకూ తనకు గతజన్మ స్పృహలేదుగాబట్టి తను చతురుడు కాదని అతని పోలికలతో ఉన్నాడు గాబట్టి ఇక్కడంతా పొరబడుతున్నారని భావించాడు చరక్.

మనసారా వల్లభాచార్య దంపతుల్ని మాతాపితరులుగా అంగీకరించి పిలవలేకపోయాడు. కాని ఇప్పటి పరిస్థితి వేరు. తనకు గతజన్మ స్పృహ ఏర్పడింది.

అక్కడ చూస్తే కలియుగంలో తన తల్లిదండ్రులగు ఆర్యభట్టాచార్య దంపతులు జీవించే వున్నారు. ఇక్కడ ద్వాపరంలో ద్వారకాపురిలో వల్లభాచార్య దంపతులు వీళ్ళు జీవించేవున్నారు. ఏమిటీ వింత...?

ఆలోచనల మధ్య నిద్రకు దూరమై తల్పం దిగి శయనమందిర గవాక్షాల చెంత పచార్లు చేస్తూనే ఉన్నాడు చరక్. రాత్రి రెండోయామం కూడా గడచి పోయింది. కోటపై నుండి నగారా శబ్దం వినవస్తోంది. ద్వారకాపురి నిశ్శబ్ద నిశీధిలో మునిగివుంది. గగన తలం మేఘావృతమైన చంద్రుడు కనిపించటం లేదు. పురవీధుల్లో అక్కడక్కడా కాగడాల కాంతి కానవస్తోంది. కొన్ని గృహము లందు ఆముదం దీపాల కాంతులు మిణుకుమిణుకు మంటున్నాయి. వాతావరణంలో వర్షం వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. సముద్ర గాలులు ఆగిఆగి వస్తున్నాయి.

గాలి వాటున నగర రక్షకభటుల పారాహుషార్ కేకలును కర్ణాకర్ణిగా వినవస్తున్నాయి.

అలా ఎంతసేపు గడిపాడో చరక్‌కు తెలీదు. చివరికి ఎప్పటికో ఒక పరిష్కారం లభించింది.

చరాచర సృష్టిలో చావుపుట్టుకలకు ప్రధానహేతువు ఆత్మగదా. ఒక ఆత్మ శరీరం ధరించి నప్పుడు పుట్టుక, ఆ శరీరాన్ని విడిచినప్పుడు చావు ఏర్పడు తున్నాయి. ఆత్మ నీటిలో నశింపదు, అగ్నిలో దహింపబడదు. కత్తితో చీల్చబడదు.

మరణం శరీరానికే గాని ఆత్మకి చావులేదు అంటూ సాక్షాత్తూ ఆ కృష్ణభగవానుడే గీతలో అర్జునునికి బోధించాడు. ఆ విధంగా చూసినప్పుడు బంధుత్వం అనేది శరీర సంబంధమైనదేగాని ఆత్మసంబంధమైనది కాదు. తను అనగా తన ఆత్మ చరక్ నామధేయం గల శరీరంలో ఉన్నప్పుడు తన తల్లిదండ్రులు ఆర్యభట్టాచార్యులు శ్రీలక్ష్మి దంపతులు.

వారి తనయుడుగా వారు జన్మనిచ్చిన శరీరం ప్రస్తుతం రంపచోడవరం అడవుల్లోని జేజితాతగారి స్థావరంలో కాలనాళికమందసంలో ఉంది. ఆ శరీరం వదిలి తన ఆత్మ బయటికొచ్చేసింది కావున ఇప్పుడు అక్కడి బంధుత్వాన్ని పరిగణనలోకి తీసుకోవడం సరికాదు. తను తిరిగి చరక్ శరీరంలో ప్రవేశించాకే ఆ బంధుత్వాలు. ఇప్పుడు తన ఆత్మ చతురుడు నామధేయం గల శరీరాన్ని ధరించివుంది.

తనకు గతజన్మ స్మృతులు కూడా ఏర్పడ్డాయి. కాబట్టి ఇక్కడ చతురునిగా ఉన్నంతవరకు వల్లభాచార్యదంపతులే తన మాతాపితరులు. వారిని సేవించి పూజించాలి. వారి మాట తనకు శిరోధార్యం.

* * * * *

మరునాడు ఆలస్యంగా నిద్రలేచాడు చరక్. ఉదయపు పనులు, పూజాదికాలు ముగించుకుని తల్లి ప్రేమతో అందించిన ఉపాహారం తిన్నాడు. గోరువెచ్చని పెద్దలోటాడు పాలుతాగాడు.

తర్వాత తాళపత్రగ్రంథాలున్న భాండాగారానికి బయలుదేరాడు. ఇది ఆ భవంతి రెండో అంతస్థున వెనక తట్టున ఉంది. అక్కడి గవాక్షం నుండి (కిటికీ) చూస్తే దిగువన రెల్లుగడ్డి చావడి, అక్కడి పనివాళ్ళు మందుల తయారీ అంతా కన్పిస్తుంది.

చరక్‌కి గతజన్మ స్మృహ ఏర్పడింది గాబట్టి– ఆ గ్రంథ భాండాగారం తనకి కొత్తకాదు. చరక్ వెళ్ళే సరికి– ఏదో తాళపత్రగ్రంథం తిరగేస్తూ తండ్రి వల్లభాచార్యులవారు అక్కడే ఆసీనులై ఉన్నారు.

"పితృదేవులకు ప్రణామములు" అంటూ నమస్కరించాడు చరక్.

"చిరంజీవ చిరంజీవ... రమ్ము కుమారా. ఆసీనుడవు కమ్ము. నీకు కావలసిన గ్రంథమెయ్యది?" అంటూ అనునయంగా అడిగాడు వల్లభాచార్యులు.

"గ్రంథమెద్దియు వలదు పితామహా" బదులిచ్చాడు చరక్. "వేరేమి కావలయు?"

"ఏమియును వలదు. ఒకపరి ఈ భాండాగారమును దర్శించిపోవలెనని వచ్చితి" అంటూ చుట్టూ పరికించి చూడనారంభించాడు చరక్. అక్కడి వాతావరణం చూస్తుంటే తన జేజితాత అగ్నివేశాచార్యులవారి ఎస్టేట్ భవంతిలోని తాళపత్రాలుగల భాండాగారం గుర్తొస్తోంది. అదే వాతావరణం. ఆముదం దీపాలు.

దేవదారు కొయ్యల దివిటీలు. పగటివేళ గాబట్టి ఇప్పుడవి వెలుగుటలేదు. అలా పరికిస్తున్న చరక్ దృష్టి అప్రయత్నంగా అచటి గోడలకు వేలాడుతున్న వర్ణచిత్ర పటాలమీద పడింది. పాలకడలిలో ఉద్భవించిన ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి, తర్వాత చిత్రం అశ్వనీ దేవతలు, మూడోది భరద్వాజముని, శుశ్రుతుడు, చరకుడు వర్ణచిత్రాలు.

ఇవే చిత్రాలను ఇంతకుముందూ చూశాడు ఎక్కడ? చప్పున అతడి కళ్ళముందు మెదిలింది అక్కడ కలియుగంలో కోరుకొండ సమీపానగల తన జేజితాత అగ్నివేశాచార్యుల ఎస్టేట్ భవంతి. అక్కడా పై అంతస్థులోని లైబ్రరీలో ఇలాంటి వర్ణచిత్రాలు... ఇలాంటి కాదు... అచ్చు గుద్దినట్టు వీటిలాగే అవీ ఉన్నాయి.

అక్కడా ఇలాగే రెండోపక్క గోడకు వంశ ప్రముఖుల వర్ణచిత్రాలూ ఉన్నాయి. ఇక్కడా అదే విధంగా ఉన్నాయి. తలచుకునేకొద్దీ చరక్ నరనరానా ఉత్కంఠత నిండుకోసాగింది. ఏదో విశేషం లేకపోతే వర్ణచిత్రాలు ఒకేలా ఎందు కుంటాయి.

రెండో గోడకు వేలాడుతున్న చిత్రపటాలను గమనించాడు. ఆరంభంలో శుశ్రుతులవారి చిత్రం ఉంది. అటువైపు ఇటువైపు కూడా ఆయన చిత్రాన్ని ఉంచటంలో ఔచిత్యం బోధపడలేదు.

దాన్ని అనుసరించి చాలా చిత్రపటాలున్నాయి. చివరిగా ఉన్న చిత్రపటం తన తండ్రిగారు వల్లభాచార్యులవారిది. దానికి వెనుక మూడో చిత్రపటం ముందు చరక్ పాదాలు నేలకు అతుక్కుపోయాయి. ఒక్కసారిగా తల గిర్రున తిరిగి నట్లయింది.

కొద్దిక్షణాలపాటు మెదడు మొద్దుబారిపోయింది. ఆ వర్ణచిత్రం ఎవరిదోకాదు, తన జేజితాతయ్య అగ్నివేశాచార్యులవారిది. ఏవో చిన్న చిన్న మార్పులు తప్ప ఆ వర్ణచిత్రంలోని వృద్ధునికీ, అగ్నివేశాచార్యులవారికీ ఏ మాత్రం భేదం కన్పించటంలేదు. ఆ చిత్రం కింద ఉన్నపేరు. అగ్నిభట్టారకుల వారు అని రాసుంది.

అగ్నిభట్టారకుడు! అగ్నివేశాచార్యుడు! పేర్లలో కూడా ఇంత సామ్యమా. అక్కడ చరక్‌గా తనకు జేజితాతయ్య అగ్నివేశాచార్యులు ఉన్నట్టే, ఇక్కడ చతుర్‌గా తనకూ ఒక జేజి తాతయ్య అగ్నిభట్టారకులవారా... ఇదేమి విచిత్రం? ఇదేమి అనుబంధం!... విభ్రమతో వల్లభాచార్యుని వంక చూశాడు.

"ఏమి కుమారా? ముత్తాత అగ్నిభట్టారకులవారిని అంతదీక్షగా పరికించు చుంటివి?" దగ్గరకొస్తూ అడిగాడాయన.

"తండ్రీ!... వీరు మదీయ ముత్తాత అగ్నిభట్టారకులవారా!" విభ్రమనుండి తేరుకొంటూ అడిగాడు చరక్.

"ఇదియేమి ప్రశ్న కుమారా... నీకు తెలియదాయేమి? వారే నీకు ముత్తాత గారు. మన కుటుంబము ద్వారకాపురికి వలసరాకమున్నే మధుర స్వస్థలము. ద్వారక నిర్మాణానంతరం యాదవుల గూడి ఇటకు వచ్చితిమి" అన్నాడు వల్లభాచార్యులు.

ఆ మాటలు వింటున్న చరక్‌కు నిజంగానే మతిపోయినట్టయింది. మనుషులే కాదు, సంఘటనల్లో కూడా ఇంత దగ్గర పోలికా... అక్కడ కలియుగాన ఎక్కడి కృష్ణాజిల్లా మున్నలూరు గ్రామం?! ఎక్కడ మున్నలూరి వారి అగ్రహారం.

ఇక్కడ ద్వాపరంలో బ్రాహ్మణ కుటుంబం ద్వారకకు వలసవచ్చింది. ఈ కుటుంబ పెద్ద అగ్నిభట్టారకుడు. తను మరుజన్మలో చరక్‌గా పుట్టినట్టే ఈ జేజితాత అగ్నిభట్టారకుడే మరుజన్మలో అక్కడ అగ్నివేశాచార్యునిగా జన్మించాడా...

తమ ఇంట నేటికీ పది పాడి ఆవులు ఎప్పుడూ ఉంటాయి. ఇక్కడిలాగే తమ ఇంట ఆవుపాలే వాడకం. విద్యుత్ ఉపకరణాలు వచ్చినప్పటికీ ఉదయం కవ్వంతో పెరుగు చిలికి వెన్న తీయాల్సిందే.

పొడవాటి కర్ర చివర చెక్కతో చేసిన చిలక ఉండి దాన్ని ఒక రాటకు రెండు బంధాలు వేసి ఉంచుతారు. చిలకను పెరుగుబానలో ఉంచి కవ్వానికి తాడుచుట్టి రెండు కొసలను రెండు చేతులా పట్టి లాగి ముందు వెనుకలకు తిప్పుతుంటే చాలాసేపటికి పెరుగు చిలకబడి వెన్న వస్తుంది.

నేటితరంలో చాలామంది చూసిఉండే అవకాశమే లేదు. చేత్తో చిలికే చిన్న కవ్వాలు ఎక్కడన్నా కన్పిస్తుంటాయి. తమ ఇంట్లో నానమ్మే ఇప్పటికీ పెరుగు చిలుకుతుంది. లేదా శ్రావణిగాని, నౌకరు అమ్మాయిగాని ఆ పనిచేసి నానమ్మకు సాయం చేస్తారు.

కాని ఇక్కడ ద్వారకలో–ప్రతి ఇంటా ఉదయం కవ్వం శబ్దం వినబడాల్సిందే. ఉదయం తను అశ్వం మీద వాహ్యాళికి నగరంలోను, నగర పరిసరాల్లోను తిరిగి వస్తుంటే ఏ ఇంట చూసినా కూనిరాగాలు తీస్తూ వయ్యారంగా కవ్వం చిలికే యాదవ పడుచులే కన్పిస్తున్నారు. వీధులెంట కవ్వాలు చిలుకుతున్న శబ్దం తుమ్మెదల ఝంకారంలా విన్పిస్తూంటుంది.

తల్లి పొదుగు నుండి కడుపార పాలు తాగిన లేగలు వీధుల్లో చెంగు చెంగున గంతులు వేస్తూ కనువిందు చేస్తూంటాయి.

పాలకడలిని దేవతలు, దానవులు చిలికిన సందర్భాన్ని గుర్తుచేస్తూ మనకి చిలుకు ద్వాదశి అని ఒక పండుగ వస్తుంది. దీన్ని స్త్రీలు ఆచరిస్తారు.

రోట్లో బియ్యంపిండి ముద్దను చక్కెర, తేనె, పాలు, చెరకుగడముక్కలు వేసి పాటలు పాడుతూ రోట్లో దంచుతారు. రోట్లోంచి చిందిన పాలు ఎన్ని చుక్కలు మీదపడితే అన్ని సంవత్సరాలు వైకుంఠంలో నివసించే అదృష్టం వస్తుందని అంటారు.

పాలుగాని, పెరుగుగాని చిలకబడిన ఇంట చీడపీడలు, గ్రహబాధలు ఉండవు. ఆయుర్‌వృద్ధి, సంపద వృద్ధి, పాడిపంటల వృద్ధితో ఆ ఇల్లు భోగ భాగ్యాలతో తులతూగుతుందని నమ్మకం. ఆ నమ్మకంలో ఎంతో విశిష్టత ఉంది. ఎంతో బలం ఉంది.

సనాతన ఆచారాలను పాటిస్తున్నందునే యాదవులకు యాదవరాజ్యంలోని ప్రజలకు ఇంతటి వైభోగం, ఇంతటి సిరిసంపదలు లభిస్తున్నాయా అన్పిస్తోంది.

ఇక ప్రతి ఇంటా స్త్రీలు ఇలా కవ్వం చిలకటం, రోకళ్ళతో రోళ్ళలో దంచటం, తిరగలి విసరటం, రుబ్బురోళ్ళలో రుబ్బటం మూలంగా వారికి ఇదే ఒక వ్యాయామంగా ఉండి అంగపుష్టి, ఆరోగ్యపుష్టి లభిస్తున్నాయి. ఇక్కడ పూర్తిగా సుఖాలకు అలవాటుపడి బాధ్యతలను వదిలి తిని కూర్చునేవారు ఎవరూ లేరు.

ఇంటిపనులు ఎక్కువశాతం కన్నెపిల్లల చేతే నిర్వహింపచేస్తున్నారు. ఎదిగే వయసులో ఈ పనులమూలంగా అమ్మాయిలకు మంచి శరీరాకృతి, అంగ బలం, ఓర్పు, సహనం, బాధ్యతలు సిద్ధిస్తున్నాయి.

పురుషులకు పశుపోషణ, వ్యవసాయం, వృత్తివ్యాపకాలు, వ్యాపారాలతో బాటు వ్యాయామం, ఆటపాటలు ఉండనే ఉన్నాయి. ఆహా ఏమి ఈ ద్వారకా వాసుల అదృష్టము. ఇంతటి విశిష్టమైన ఆచారాలు, నమ్మకాలు, కట్టుబాట్లు, పశుసంపద అంతా కలియుగం ఆధునిక కాలం వచ్చేసరికి మంటగలిసిపోయాయే!

పుట్టింది సుఖపడ్డం కోసమేనంటూ వెర్రిమొర్రి ఆలోచనలతో బాధ్యతలు మరిచే ప్రజలకు అల్పాయుష్షు, అనారోగ్యాలు, అశాంతి, ఈతిబాధలు తప్ప ఒరిగింది ఏముంది? ప్రజలు ధర్మం తప్పితే ప్రకృతి ధర్మం తప్పుతుంది. ప్రజాక్షయం మొదలవుతుంది. విపరీతాలు చోటు చేసుకుని వింత పోకడలు మొదలై జన నశింపు ఆరంభమవుతుంది.

తన జేజి తాత అగ్నివేశాచార్యులవారు తిరిగి ధర్మ సంస్థాపన జరగాలని తపించటంలో అంతరార్థం ఇప్పుడుగదా తనకు బోధపడుతోంది.

ద్వారవతి లేదా ద్వారకాపురి, ద్వారక ఎలా పిలిచినా ఈ నగరం శ్రీకృష్ణుడు నిర్మింపజేసిందన్నది నిజం. అయితే కుశస్థలి ఏది అనే విషయంలో భిన్నాభిప్రాయాలు విన్పిస్తూంటాయి.

కుశస్థలి, ద్వారకాపురి రెండూ ఒకటేనని వాదిస్తారు కొందరు. అసలు కుశస్థలి అనే పేరు ఎలా వచ్చింది... కుశలు అనగా దర్భగడ్డి.

రామాయణ కాలంలో సీతా సాధ్వి, మహర్షి వాల్మీకి ఆశ్రమంలో కవలలకు జన్మనిచ్చినప్పుడు వారికి ఏఏ పేర్లు పెట్టాలని ఆలోచించిన వాల్మీకి వారు తన చేతిలోని దర్భను రెండుగా విరిచి మొదటిది కుశుడు అని, దాని లవం (శేషం) లవుడని ఆ విధంగా కుశలవులు అని నామకరణం చేయటం జరిగింది.

ఇక్కడ కుశస్థలి విషయాని కొస్తే- శ్రీరామచంద్రుల వారి కుమారుడైన కుశుడు కొంత కాలం ఇచట నివసించిన కారణంగా ఇది కుశస్థలి అయిందనేది ఒక గాధ. అలాగే మరో గాధ ఉంది.

ఒకప్పుడు సప్తరుషులు ఒక మహాయాగం తల పెట్టారు. ఆ యాగాన్ని ఒక అతి పవిత్రమైన స్థలంలో నిర్వహించాలనుకున్నారు. కాని ఎంత వెదికినా వారికి అలాంటి చోటు కనిపించలేదు. అప్పుడు వారంతా సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుని కలిసి తమకో పవిత్ర ప్రదేశాన్ని చూపమని వేడుకున్నారు.

వారి ప్రార్థన మన్నించిన శ్రీహరి ఒకదర్భను విసిరి దానిని అనుసరించి పొండి. అది ఎక్కడ పడుతుందో అదే మీ యాగమునకు అనువగు పవిత్రమైన స్థలం అన్నాడు. ఆ విధంగా శ్రీహరి విసిరిన దర్భ ముల్లోకాలు చుట్టి కుశము (దర్భ) ఇక్కడ పడింది.

ఆ విధంగా కుశము (దర్భ) పడిన స్థలం గాబట్టి ఇది కుశస్థలి అయిందన్నది మరో గాధ.

ఆ ప్రదేశంలో సప్తర్షులు దివ్యంగా యాగం నిర్వహించారు. తర్వాత కాలంలో కుశస్థలి జనావాస ప్రాంతంగా మారింది. అప్పట్లో నేటి గుజరాత్ ప్రాంతమే గాకుండా మరి కొన్ని ప్రాంతాలు కూడా యాదవ రాజుల పాలనలో ఉండేవి.

వీటిలో కుశస్థలి, మధుర ముఖ్యమైనవి. మొదట కుశస్థలి పేరుతో అక్కడ పట్టణం వెలిసింది. అది రైవతకుడు అనే అతని అధీనంలో ఉండేది.

అతని రాజధాని అది. ఒకసారి రైవతకుడు బ్రహ్మలోకం వెళ్ళి తిరిగి వచ్చేసరికి కుశస్థలి నగరాన్ని రాక్షసులు నాశనం చేశారు.

ప్రజలు తమ ఆవాసాలు వదిలి వెళ్ళిపోగా రైవతకుడు చింతించి కుశస్థలిని వదిలి విరక్తుడై అక్కడికి సమీపంలోని పశ్చిమ సముద్ర తీరంలోని పర్వతం మీద కొంతకాలం తపస్సు చేశాడు.

అతని పేరు మీదుగా ఆ పర్వతానికి రైవతక పర్వతమనే పేరు ఏర్పడింది. అటు తర్వాత కుశస్థలి అనార్ధుడనే యాదవరాజు వశమైంది. యాదవులు తిరిగి కుశస్థలిని నిర్మించుకున్నారు. కాని అనార్ధుడి బలహీనమైన యాదవసేనలు జరాసంధుని సేనల దురాగతాలకు తట్టుకోలేక పారిపోయారు.

ఆ విధంగా అనార్ధుడు ఓడిపోవటంతో కుశస్థలి మరోసారి నాశనమైంది. కాలంలో మగధప్రభువైన జరాసంధుడు మహాబలశాలి.

అపారమైన సైన్యం కలవాడు. అతనికి ఆది నుండి యాదవులతో శతృత్వం ఉంది. అది శ్రీకృష్ణుని మూలంగా మరింత పెరిగింది. శ్రీకృష్ణుడు పెరిగింది రేపల్లె నందయశోదలఇంట. తర్వాత రేపల్లెవాసులు అక్కడ పరిస్థితులు బాగోక బృందావన ప్రాంతానికి వలసవచ్చారు. ఇక్కడే శ్రీకృష్ణునికి రాధతో పరిచయం, ప్రణయం ఆరంభం.

యమునానది పరిసరాలతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. యాదవులు శ్రీకృష్ణుడి సారధ్యంలో మధురని వదిలేశాక ఏం జరిగిందనేది మరో వాదన ఉంది. యాదవులు మధురని వదిలేసి పశ్చిమంగా ప్రయాణించి కుశస్థలిని చేరుకున్నారు.

తమ రక్షణకు అది అనువుగా ఉందని ఎంచి కుశస్థలిని పునర్నిర్మించి తమ రాజధానిగా చేసుకున్నారు. అలాగే పశ్చిమతీరానికి ఇది ద్వారం వంటిదనే ఉద్దేశంతో కుశస్థలి పేరును ద్వారవతిగా మార్చారు.

కాని ద్వారవతిలో కూడా వారికి మనస్థిమితం లేకుండా చేశాడు జరాసంధుడు. వరుస దాడులతో విసిగిస్తూ వారికి, వారి గోసంపదకు రక్షణ

కరువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. జరాసంధుని సేనల దాడులను తిప్పికొట్టడంతోనే వారికి సరిపోయేది.

ఎందరో రాక్షసులను వధించిన శ్రీకృష్ణునకు జరాసంధుని చంపటం ఓ లెక్కా... ఆ పని ఎందుకు చేయలేదనే సందేహం కలగటం సహజం.

భీమ, బకాసుర, జరాసంధ, కీచక, దుర్యోధనులు అయిదుగురూ ఏకనక్షత్ర సంజాతులు. వీరిలో ఎవరయితే ముందుగా ఒకరిని చంపుతారో వాని చేతిలోనే మిగిలిన ముగ్గురికీ మరణం ఉంది.

కాబట్టి జరాసంధుణ్ణి ఒక్క భీమ సేనుడుమాత్రమే వధింపగలడు. ఆ పైన జరాసంధుడు వరగర్వితుడు. శరీరాన్ని ముక్కలు చేసినా తిరిగి అతుక్కుని పునర్జీవితుడయ్యేలాగా వరం పొందినవాడు.

కాబట్టి తగు సమయం వరకు కృష్ణుడు కూడా జరాసంధుణ్ణి ఏమీ చేయలేని పరిస్థితి.

కాబట్టి కుశస్థలిని పునర్నిర్మించి ద్వారపతిగా పేరు మార్చుకున్నా ఇక్కడా తమకు అనుకూలం కాదని గ్రహించిన యాదవులు అక్కడి నుండి సముద్రతీరానికి వచ్చేసి రైవతక పర్వతపాదంలో కొత్తగా మరో ద్వారవతీనగరాన్ని నిర్మించు కున్నారు.

రైవతక పర్వతం ఈ నగరానికి సముద్ర గాలుల నుండి రక్షణ కవచంలా నిలబడుండేది. అంటే యాదవులు నిర్మించుకున్న రెండో ద్వారవతి ఇది.

ఈ కాలంలోనే వీరు పాడుపడిన ఓడరేవును కూడా పునరుద్ధరించి సముద్ర మార్గంగా ఓడల మీద విదేశీ వాణిజ్యాన్ని అభివృద్ధిచేశారు. అంతకు ముందు అనార్ధుడి కాలంలో ఈ ఓడరేవు నిర్మాణం జరిగింది. అయితే ఇంత జేసినా జరాసంధుని దాడులు మాత్రం ఆగలేదు. ద్వారవతి ఆ దాడుల్లో పూర్తిగా నేలమట్టమైంది. ఇది ద్వారక నుండి హస్తినాపురికి వెళ్ళే మార్గంలో ఎత్తయిన మిట్ట ప్రాంతం దాటాక శిధిలకట్టడాలతో అడవిగా మారిన ప్రదేశం.

ఇక రెండో ద్వారవతిలో కూడా తమకు అనుకూలత లేదని గ్రహించాకే తమకు సురక్షితమైన రాజధాని కోసం, యాదవప్రజల రక్షణకోసం, జరాసంధుని

సేనల రాకముందుగానే తెలిసేవిధంగాను, శత్రువుల చొరబాటుకు ఆస్కారం లేని జలదుర్గం వంటి నగరాన్ని నిర్మించుకోవాలన్న ఆలోచన కలిగింది కృష్ణునికి.

ఆ తర్వాతనే సముద్ర నారాయణుని అర్ధించగా పన్నెండు యోజనాల వైశాల్యంగల (సుమారు మూడు వందల చదరపు మైళ్ళు) విస్తీర్ణంగల దీవిని పైకి లేపి సముద్రజలాలను వెనక్కు తీసుకుని ఆ దీవిని శ్రీకృష్ణునికి ఇచ్చాడు సముద్రుడు.

ఆ దీవిమీద మయుడు సహకారంతో నిర్మింపబడిందే ద్వారకాపురి. రైవతక పర్వతం వద్ద యాదవులు నిర్మించిన రెండో ద్వారవతి ప్రాంతమే ప్రభాస. రైవతక పర్వతం సముద్ర తీరంలో కాదు. సముద్రుడు ఇచ్చిన దీవిమీదే ఉంది. ద్వారకతో బాటు ఆ పర్వతం కూడా మునిగిపోయిందంటారు కొందరు.

ఇంకా ద్వారకాపురి మునిగిపోవడానికి ముందు శ్రీకృష్ణుడే నగరంలోని స్త్రీ బాలవృద్ధుల్ని పడవల మీద సముద్రం దాటి రైవతక పర్వతం మీదకు పంపించాడని మరోగాథ.

ఇలా ద్వారకానగరం విషయంలో భిన్న గాథలు అనేకం ఉన్నాయి. హరివంశం ప్రకారం కాలయవనుడు (జరాసంధుని మరో పేరు) మధురపై దాడి చేశాడు. కాని అప్పటికే యాదవులంతా శ్రీకృష్ణుని సారథ్యంలో మధురను ఖాళీ చేసి తమ ఆలమందలతో పశ్చిమతీరం దిశగా సాగిపోయారు.

*　　*　　*　　*　　*

యాదవులను వెంటబెట్టుకుని బయలుదేరిన శ్రీకృష్ణుడు తమ యాదవులకు పశువులకు తాగునీరు పుష్కలంగా పచ్చిక లభించు ప్రాంతాన్ని అన్వేషిస్తూ క్రమంగా పశ్చిమ సముద్రతీర ప్రాంతాలకు చేరుకున్నాడు. శ్రీకృష్ణుడు యాదవ ప్రజలను ఒక చక్కని ప్రదేశానికి చేర్చాడు. యాదవులు స్థిరపడినచోట పశువులకు సమృద్ధిగా పచ్చిక లభించు ప్రాంతం.

అక్కడ కొబ్బరిచెట్లు, ద్రాక్ష, నేరేడుచెట్లు అనేకరకాలయిన ఫలవృక్ష భరితమైన ప్రాంతం.

ఇది ద్రోణాచార్యుని అజ్ఞాతశిష్యుడు వేటగాడయిన ఏకలవ్యుని నివాస ప్రాంతం. ద్రోణాచార్యుడు కూడా కొంతకాలం నివసించిన ప్రాంతం.

ఇక్కడో నగర నిర్మాణం జరిగితే దేవతలు స్వర్గంలో నివసించినంత హాయిగా తన యాదవ ప్రజలు ఈ నగరంలో నివసించగలరని భావించాడు శ్రీకృష్ణుడు.

తన శత్రువైన జరాసంధుని ఎదుర్కొని యాదవులు సురక్షితంగా ఉండేందుకు తను ముందు చూపుతో శ్రీకృష్ణుడు ఎంపికచేసిన స్థలమిది.

ద్వారవతికి శంఖుస్థాపన చేశాక శ్రీకృష్ణుడు విశ్వకర్మ మయుడ్ని పిలిచి విశాలమైన వీధులు, ఆలయాలు, ఉద్యానవనాలతో తనకో చక్కని కోటను నిర్మించి ఇమ్మని కోరాడు.

ఆ విధంగా విశ్వకర్మ మయుడి ఆధ్వర్యంలో కోట నిర్మాణం పనులు ఆరంభమయ్యాయి.

తీరా కోట నిర్మాణ పనులు ఆరంభించాక– తన యాదవ ప్రజల కుటుంబాలన్నిటికీ ఆ కోట చాలదని గ్రహించిన శ్రీకృష్ణుడు సముద్రుని అడిగి మరో పన్నెండు యోజనాల విస్తీర్ణంగల భూభాగాన్ని తీసుకున్నాడు.

ఆ విధంగా స్థలసేకరణ తర్వాత విశ్వకర్మ యాదవుల కోసం గృహ సముదాయాలు, వారి విశ్రాంతి కోసం అనేక వనాలతో కూడిన ద్వారకాపురి నగర నిర్మాణం పనులు పూర్తిచేశాడు.

"నేను కట్టించి ఇచ్చిన ఈ నగరంలో ఓ నా యాదవ ప్రజలారా! మీరంతా సుఖశాంతులతో నివసించండి" అన్నాడు శ్రీకృష్ణుడు.

ఈ నగరప్రాకారాలు స్వర్ణకాంతులతో ధగధగాయమానంగా మెరిసి పోయేవి.

ఈ విధంగా ద్వారకానగరం లేదా ద్వారవతి గురించి హరివంశంలో వివరించబడింది.

ఇక మహాభారతం సభాపర్వం భీష్మపర్వాల్లో ద్వారక గురించి ఏం చెప్పబడింది? వనము అనగా అడవి. ఉపవనము అనగా పెంచబడిన ఉద్యానవనం. ఎవరయినా కొత్తగా ద్వారకవైపు వస్తూంటే అడవి దాటి నగరపరిసరాల్లోకి రాగానే సేదతీరటానికి అనేక ఉద్యానవనాలు కన్పించేవట.

దూరంలో ఉండగానే ద్వారకలోని గృహాల గోడలు, ప్రాకారాలు పగలు సూర్యకాంతిలోనో, రాత్రివేళ చంద్రకాంతిలో కూడా స్వర్ణకాంతులతో మెరిసిపోతూ కన్పించేవట.

మహాభారతంలో ద్వారకాపురి పన్నెండు యోజనాల పొడవు, ఎనిమిది యోజనాల వెడల్పు గలిగిన మహాసుందర నగరిగా పేర్కొనబడింది. నగరం మీదుగా కోటనుండి ఏడురాజమార్గాలు ఉండేవట. ఇలాగే ఘటజాతకంలో ఆసక్తికరమైన మరో విషయం ఉంది. శ్రీకృష్ణుని సోదరులు తొమ్మిది మంది. వారంతా అనేక రాజ్యాలు జయించి చివరకు ద్వారకలో స్థిరపడినట్టు ఘటజాతకంలో ఉంది.

బహుశా జరాసంధుని మరణానంతరం వీరు జైత్రయాత్ర చేసి కొన్ని రాజ్యాలు జయించి తిరిగి ద్వారక చేరుకొనుండాలి.

ద్వారక ఒకవైపున రైవతకపర్వతం, రెండో వైపున పశ్చిమ సముద్రం ఉన్నట్టు చెప్పటం వలన ఇది మిగిలిన పురాణాల వర్ణనలనుండి విభేదిస్తోంది.

ఏది ఏమైనప్పటికీ మహాభారతం, పురాణాలు, హరివంశం ఇవన్నీ ద్వారకను నాలుగు వైపులా సముద్రం గల దీవిగానే పేర్కొన్నాయి. హరివంశం ద్వారకను జలదుర్గం అంటోంది. మహాభారతం 'జలధి మధ్యస్థలే' అంటోంది.

ఆ ప్రాంతం మధుర ఫలవృక్షభరితమై అక్కడ ఆలమందలు, గేదెలు, ఏనుగులు, అడవి పందులు, జింకలు, కుందేళ్ళు యథేచ్ఛగా సంచరించేవట. ఇక్కడి నేల సారవంతమైన రాగిరంగు మన్నుతోను, రాళ్ళు రప్పలతో ఉండేదట.

ఈ విధంగా అసలు ద్వారక ఏదీ అనే విషయంలో మనకు పురాతన గ్రంధాలలోనే విభేదాలు కన్పిస్తున్నాయి. రైవతక పర్వతం ఏది? ఇది తీరాన ఉండేదా లేక ద్వారక దీవిమీద ఉండేదా తేల్చిచెప్పటం ఒక చిక్కుముడి.

ఆపైన శ్రీకృష్ణుడు తను నగర నిర్మాణానికి ముందుగానే ఒక దీవిని ఎంచుకుని ఆ దీవి మీద చోటు చాలదని అదనంగా ఆ దీవికి చేర్చి సముద్రుని భూభాగాన్ని కోరాడా లేక పూర్తిగా ఒక దీవిని అడిగి జలమధ్యంలో నగరనిర్మాణం సాగిందా! ఇదీ చిక్కుముడే.

కుశస్థలికి పక్కనే గోమతీనది ఏడుపాయలుగా చీలిపోయి పశ్చిమ సముద్రంలో సంగమిస్తోంది. అవతల కచ్‌ప్రాంతం ఈ నదీపరీవాహక ప్రాంతం వరకు విస్తరించివుంది. ఈ ప్రాంతపు ప్రాచీననామం సప్తద్వీపమండలం. ఏడు దీవుల ప్రాంతం.

(ఇంకావుంది)

మిగతా కథ 'యాత్ర' రెండవ భాగంలో చదవండి.

Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com

Author of Highest
Number of Novels In Telugu

సూర్యదేవర రక్త చరిత్ర



యాత్ర-2

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author

సూర్యదేవర రామ్మోహనరావు

యాత్ర-2

(రెండవ భాగము)

మధుప్రియ పబ్లికేషన్స్
మొగల్రాజపురం • విజయవాడ - 520 004

YATRA -2

(Serialised in "Swathi" Weekly)

By

SURYADEVARA RAM MOHANA RAO
Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Navanirman Colony, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
MADHU PRIYA PUBLICATIONS
Machavaram, Vijayawada - 520 004
Phone : 9441194605
E-mail : madhupriyapublications@gmail.com

First Edition : **2018**

Price : ₹ **130.00**

Cover Design :
BAPU

Printers :
SRI CHAITANYA OFFSET PRINTERS
Vijayawada-2

యాత్ర-2

వీటిలో నాలుగు దీవులు అరేబియా సముద్రం వైపుగా దక్షిణం నుండి ఉత్తరానికి అర్ధచంద్రాకారంలో పేర్చినట్టుండగా అవి దక్షిణం నుండి మొదటిది పూర్వద్వార, దీన్నే బెట్ ద్వారక అంటున్నారు. ఇది ఇంగ్లీషు అక్షరం ఎల్‌షేపులో ఉంటుంది. దీనిపైన ఉన్నది సువర్ణతీర్థ దీవి, దీనిపైన ఉన్నది ఆరంభద్వార దీవి, దానికి పైన చివరిగా ఉన్నది ఓక దీవి. మిగిలిన మూడు దీవుల్లో ధేనుకాదీవి.

పూర్వ ద్వార, సువర్ణ తీర్థదీవులకు కాస్త ఎడంగా లోపలి కుంటుంది. దానిపైన నారాయణపురదీవి, దానిపైన ఉండేది శంకోదర దీవి. ఈ విధంగా అమరిఉన్న సప్తద్వీపమండలం ద్వారకాపురి నిర్మాణానికి ముందు కాలం నుంచి ఉన్న ప్రాంతం.

వీటిలో పూర్వద్వారదీవి ఉత్తర కొసన ద్వారకానగర నిర్మాణం జరిగుండాలి లేదా సువర్ణ తీర్థదీవి, పూర్వ ద్వారదీవుల జలసంధి ప్రాంతంలో ఓడరేవు ఉండి ఎడం పక్కగా సముద్రమధ్య ఏర్పడిన ఎనిమిదో దీవి మీద ద్వారకానగర నిర్మాణం జరిగివుండాలి.

ఒకప్పుడు పూర్వద్వార (బెట్ ద్వారకా) దీవి దక్షిణంగా మెయిన్‌లాండ్‌తో అనుసంధానం కలిగి దీనిమీదకు భూమార్గం ఉండి ఉండాలి.

అప్పట్లో సముద్రమట్టం ఇప్పటికన్నా చాలా తక్కువ అంటారు పరిశోధకులు.

దీన్ని బలపరుస్తూ బెట్ ద్వారక సముద్రంలో మునిగిన భాగంలో అప్పట్లో శరవేగంతో రథాలు తిరిగిన బాటఛాయలు కన్పిస్తున్నాయంటారు.

కాబట్టి ద్వారక నిర్మాణం పూర్వదీవి ఉత్తర కొసకు జరిగిందా లేక, సముద్ర మధ్యంలోని మరో దీవి మీదకి జరిగిందా అనేదాన్ని నిర్ధారించడం కష్టం. కాని ఈ సప్తదీవుల ప్రాచీనతను బలపర్చే గాధ మత్స్యపురాణంలో ఉంది. ఆసక్తి కరమైన మరోగాధ కూడా ఉంది.

గార్గ్యసంహిత చెప్పే ప్రకారం – ఒకప్పుడు త్రైతేయుడనే మహాఋషి తీర్థయాత్రలు చేస్తూ ఈ దీవి ప్రాంతానికి వచ్చాడు. ఆ దీవి ఆయనకెంతో నచ్చింది. కొంత తడవు విహరించాక– ఒక అందమైన సరస్సు కన్పిస్తే త్రైతేయముని ఆ సరస్సులో స్నానానికి వెళ్ళాడు.

ఆయన స్నానం చేసి తిరిగివచ్చే లోపల – ఆయన శిష్యుల్లో ఒకడు గురువుగారి శంఖాన్ని దొంగిలించాడు. చాలా అరుదైన దక్షిణావృత శంఖం అది.

ఈ విషయం గ్రహించిన త్రైతేయముని ఆగ్రహించి "నువ్వు శంకువుగా మారిపోదువుగాక!" అంటూ శపించాడు. తప్పు తెలుసుకున్న శిష్యుడు గురువుగారి కాళ్ళ మీదపడి క్షమాభిక్ష అర్థించాడు. శాపాన్ని తొలగించమని వేడుకున్నాడు. కొంతసేపటికి త్రైతేయుడు శాంతించి శిష్యుడిమీద జాలిచూపాడు.

"శాపాన్ని ఉపసంహరించటం కుదరదుగాని శాపవిమోచన చెప్తాను విను. భవిష్యత్తులో శ్రీకృష్ణులవారు ఈ ప్రాంతానికి వస్తారు. వారి చేతులమీదుగా నీ శాపం తొలగిపోతుంది. అంతవరకు నీవు శంకురూపంలో కడలిలో సంచరించు" అన్నాడు.

ఆ విధంగా మహాముని త్రైతేయుడి శాపం వలన అతని శిష్యుడు ఇక్కడ శంకురూపం దాల్చాడు కాబట్టి ఈ దీవికి శంకోదర అనే పేరు వచ్చిందని గార్గ్యసంహిత చెప్తోంది. మరోగాధ ప్రకారం... శంఖాసురుడనే రాక్షసుడు బ్రహ్మ

ఆదమరచిన సమయంలో వేదాలను దొంగిలించి సముద్ర గర్భంలో దాచేశాడు. అప్పుడు బ్రహ్మ కోరినమీదట శ్రీహరి మత్స్యావతారుడై సముద్రంలో ప్రవేశించి శంఖాసురుడితో పోరాడి వధించి వేదాలను కాపాడి బ్రహ్మకు ఇవ్వటం జరిగింది.

అది కార్తీక శుక్లపక్ష పౌర్ణమినాడు జరిగింది. ఆ శంఖాసురుడి శరీరమే ఇక్కడ శంకోదర దీవిగా మారిందనేది ఆ గాధ. ఇది శ్రీహరి అవతారాల్లో తొలి అవతారమైన మత్స్యావతారగాధ.

బహుశా ఈ శంఖాసురుడి సంతతివారే మొదటి సారిగా రైవతకుడి రాజధాని కుశస్థలిమీద దాడులు చేసి రైవతకుడు బ్రహ్మలోకం నుండి తిరిగివచ్చే సరికి కుశస్థలిని నాశనం చేశారంటారు.

ఇందుకు ప్రధానకారణం శంఖాసురుడ్ని వధించింది శ్రీహరి. ఆ శ్రీహరి విసిరిన దర్భవచ్చి పడినచోటు కుశస్థలి. కాబట్టి రాక్షసులు కుశస్థలీ నగరాన్ని నేలమట్టం చేసి ప్రతీకారం తీర్చుకునుండొచ్చు.

శంకోదర దీవి కూడా శంఖాకారంలో ఉండే అతిసుందరమైన ప్రాంతం. శ్రీకృష్ణుల వారు తరచూ ఇక్కడికొచ్చి విహరించే ప్రాంతం. ఆయన అష్టభార్యల్లో ఇద్దరయిన సత్యభామాదేవి, జాంబవతిల నివాస అంతఃపురాలు ఈ దీవిమీదే ఉండేవట. శంఖాలన్నీ ఒకలా ఉండవు.

వీటిలో అరుదుగా లభించే దక్షిణావృత శంఖాలు ఉంటాయి. వీటిని తమిళంలో 'వలంపురి శంకు' అంటారు. ఇవి చాల ఖరీదైనవి కూడా. ఈ శంఖం ఇంట్లోఉంటే సకల చీడపీడలు, రోగబాధలు తొలగి ఐశ్వర్యం సిద్ధిస్తుందని ఒక నమ్మకం ఉంది.

ఆ విధంగా శంఖరూపంలో సముద్రంలో తిరుగుతున్న త్రైతేయుడి శిష్యుడికి శ్రీకృష్ణుని అనుగ్రహాన శాపం తొలగి శంఖం నుండి బయటపడి నిజరూపం పొందాడు. అతడు విడిచిన శంఖాన్నే శ్రీకృష్ణుడు తను పూరించే శంఖంగా చేసుకుని దానికి పాంచజన్య మని పేరుపెట్టారు. అది దక్షిణావృత శంఖం. పాంచజన్యం పూరిస్తే దిశలు దద్ధరిల్లి దుష్టులు, దుర్మార్గుల గుండెలు చెదిరిపోతాయి, ఆగిపోతాయి.

శ్రీకృష్ణులవారు నిర్మించుకున్న ద్వారకానగరం గల దీవి ఎక్కడ వుండేది? గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో గోమతీనది ఏడుపాయలుగా చీలిపోగా ఏర్పడిన

ఏడుదీవుల్లో ఒక దీవి ద్వారకా లేక ఆ సమీపాన సముద్రంలో ఏర్పడిన మరో దీవి ద్వారకనా? లేక ఏడుదీవుల్లోనూ ద్వారక విస్తరించివుందా!

శ్రీకృష్ణుడుకి కొత్తగా నగరనిర్మాణం కోసం ఎటుచూసినా పన్నెండు యోజనాల దూరం విస్తీర్ణం గల దీవి గోమతీనదీ దేవత ఇచ్చింది కాదు.

ఖచ్చితంగా అది సముద్రుడు ఇచ్చిన భూభాగం. కాబట్టి మెయిన్‌లాండ్‌కి కొంత దూరంలో సముద్రంలో ఏర్పడిన దీవి. దీంతో కలుపుకుంటే ఆ ప్రాంతంలో ఎనిమిది దీవులు ఉండేవి. ద్వారక మునిగిపోయింది గాబట్టి గోమతీ నది పరీవాహక ప్రాంతంలోని ఏడు దీవుల్నే అక్కడ చూడగలం. ఈ ప్రాంతాన్ని సప్తదీపగా పిలిచేవారు. ప్రస్తుతం దీన్ని ఓకమండలంగా వ్యవహరిస్తున్నారు.

సుమారు మూడు వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల దీవి అంటే చిన్న దీవి కాదు.

అక్కడున్న ఏడు దీవులకన్నా పరిమాణంలో పెద్దది. తీరానికి ఇది సుమారు మైలుదూరంలో ఉండేది. దీవి నుండి తీరాన్ని అనుసంధానం చేస్తూ విశాలమైన రాతిబాట రహదారిగా ఉండేది. ఈ బాట వెంట యాదవుల గోవులు, మహావేగంతో పరుగెత్తే అశ్వాలు. రధాలు, ఎడ్లబండ్లు సదా ద్వారకవైపు యధేచ్ఛగా రాకపోకలు సాగించేవి.

అంతేగాని తీరం నుండి పడవలమీద ద్వారకదీవికి రాకపోకలు జరగలేదు. రుక్మిణీదేవి ప్రేమను తెలపడానికి రాయబారిగా వచ్చిన పురోహితుడుగాని, కుచేలుడు గాని శ్రీకృష్ణుని సందర్శనార్ధం ద్వారక వచ్చినప్పుడు కూడా కాలినడకనే వచ్చారు. అలాగే దుర్యోధన సార్వభౌముడు, పాండవ మధ్యముడు పార్థుడు యుద్ధంలో సాయం కోరి వచ్చినప్పుడు కూడా రధాల మీదనే సరాసరి ద్వారకను చేరుకున్నారు.

ఐతే ద్వారకావాసులు విలాసవంతమైన బోట్లు, పడవలమీద సముద్రం మీద విహరిస్తుండేవారు. మత్స్యకారుల పడవలూ తిరిగేవి. అవి వేరు. కాబట్టి ద్వారకనుండి మెయిన్‌లాండ్‌ని అనుసంధానం చేసే రాతిబాట ఎక్కడ అనుసంధానమై ఉండేది అనే విషయానికి ఇదమిద్ధంగా ఆధారాలు లేవు.

అలాగే ఓడరేవు. ఇది భూమార్గానికి దగ్గరగా ఉంటుంది. దీవులమధ్య ఓడరేవు ఉంటే సరుకు రవాణా ఎగుమతి దిగుమతులకు చాలా కష్టం. ఇంతకీ యాదవులకు జరాసంధుని పీడ ఎప్పుడు విరగడైంది అనే సందేహం రావచ్చు.

రుక్మిణీదేవి అన్న రుక్మి, శిశుపాలుడు, జరాసంధుడు ముగ్గురూ మిత్రత్రయం. రుక్మి తన చెల్లి రుక్మిణిని శిశుపాలునికిచ్చి చేయాలనుకున్నాడు.

కాని రుక్మిణి శ్రీకృష్ణుని వరించటంతో రుక్మిణీ శ్రీకృష్ణుల కళ్యాణం ఆనాటి రాజకీయ పరిణామాలకి కారణమైంది. ఆ సందర్భంలో శ్రీకృష్ణుని చేతిలో ఓడిన రుక్మికి గర్వభంగమై శాంతించాడు. జరాసంధునికి యాదవులమీద కోపకారణాల్లో ఇదొకటి.

కంసుడి మరణానికే మండిపడుతున్న జరాసంధుడు ధర్మరాజు రాజసూయయాగ సందర్భంలో శిశుపాలుడి మరణంతో రెచ్చిపోతాడని శ్రీకృష్ణునికి తెలుసు. ఒకరాత్రి భీమసేనుణ్ణి వెంటబెట్టుకుని మగధ వెళ్ళాడు కృష్ణుడు.

భీముడి చేత జరాసంధుని యుద్ధానికి కవ్వింపజేశాడు. జరాసంధ, భీమసేనులకు భీకరయుద్ధం సాగింది. కాని భీమసేనుడు, జరాసంధున్ని రెండుగా చీల్చి పడేస్తున్నా అతను తిరిగి బ్రతకటంతో ఏం చేయాలో భీముడికి తోచలేదు.

అప్పుడు కృష్ణుడు ఒక గడ్డి పోచను రెండుగా చీల్చి కుడిభాగాన్ని ఎడం వైపు, ఎడమ భాగాన్ని కుడివైపునకు విసిరి కర్తవ్యాన్ని సూచించాడు.

అప్పుడు భీమసేనుడు రెట్టించిన ఉత్సాహంతో పోరాడి జరాసంధుని రెండుగా చీల్చి ఆ భాగాల్ని వ్యతిరేక దిశలో పడేశాడు. అవి తిరిగి దగ్గరయినా వ్యతిరేకంగా ఉన్నందున అతుక్కోలేదు. ఆ విధంగా జరాసంధుణ్ణి వధించడం జరిగింది. అప్పటి నుండి యాదవులు నిశ్చింతులు కాగలిగారు.

సువర్ణ ద్వీపం రుక్మిణీదేవికి అభిమాన ప్రదేశం. శ్రీకృష్ణులవారితో అచట విహరించేది. ఒకసారి తన పట్టపురాణి రుక్మిణీదేవి దాహం తీర్చటం కోసం ఈ ద్వీపం మీద బాణాన్ని ప్రయోగించి జలధార తీశాట్ట కృష్ణుడు. శ్రీకృష్ణులవారు అవతారం చాలించేనాటికి ఆయన వయసు నూటపాతిక సంవత్సరాలు.

అప్పటికి సుమారు ముప్పైసంవత్సరాల క్రితం కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. కాబట్టి కురుక్షేత్ర సంగ్రామం నాటికి ఆయన వయసు తొంభై పైనే...

కురుక్షేత్ర యుద్ధానికి పదేళ్ళ ముందు కాలానికి చరక్ ద్వారకలో అడుగు పెట్టాడు. అంటే ఇప్పుడాయన వయసు ఎనభైపైనే. ఇక కురుక్షేత్ర సంగ్రామంలోని అతిరథ మహారథుల వయసు ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఆ కాలంలో మానవుల సరాసరి ఆయుః ప్రమాణం నూట ఏభై సంవత్సరాలకు తగ్గదు. అందుచేత ద్వారక విషయంలో ఖచ్చితమైన ఆధారాలుగా చెప్పబడే వాటిలో స్పష్టతలేదు.

ఆ పైన ఇతిహాసాలు గాని, చారిత్రకాంశాలు గాని, వీటి గురించిన పరిశోధనలు, వాస్తవాలు, ప్రజల నమ్మకాలు ఇంకా కాలనిర్ధారణ ఎప్పుడూ విభేదిస్తుంటాయి. పచ్చిమ సముద్రంలో ఆ కాలంలో రత్నాలు అధికంగా లభించేవి. కాబట్టి దీన్ని రత్నాకర దధి అని, రత్న గర్భదధియని వ్యవహరించేవారు. పశ్చిమ తీరంలో పూర్వం నుంచీ 'రత్నగిరి' అని రత్నపురియనీ ఇలాంటి పేర్లతో నగరాలు, గ్రామాలు ఏర్పడటానికి కారణం ఇదే.

శ్రీకృష్ణులవారు తన కోట వెనుక ప్రాకారం వద్ద కట్టించిన కాళికమ్మవారి ఆలయం లోకప్రసిద్ధమైనది. ద్వారకలోనూ, ఆ పరిసరాల్లోనూ అమ్మవార్ల ఆలయాలు అధికంగా ఉండేవి. ఓకమండల ప్రాంతంలో అతిపురాతనమైన శక్తి ఆలయాలు పధ్నాలుగు ఉండగా వీటిని గుర్తించారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నరేంద్రమోడి ప్రత్యేక శ్రద్ధతో ఈ ఆలయాల్ని పునరుద్ధరింప జేయించటం చెప్పుకోతగ్గ విషయం.

ఉద్విగ్నభరితమై– ఉక్కిరిబిక్కిరవుతున్న మనసును అదుపుచేసుకున్నాడు చరక్. ద్వారకలో అడుగుపెట్టినప్పట్నుంచీ ఇలాంటి వరస విశేషాలకు, విచిత్రాలకు అలవాటుపడిపోయాడు.

కాని ఎంతగా మనసును అదుపుచేసుకున్నా తేరుకోలేకపోతున్నాడు. మాటలా... తమ మున్నలూరి వారి వంశమూలాలు శ్రీకృష్ణులవారి ద్వారకాపురిలో ఉన్నాయంటే నమ్మశక్యమేనా... ఆయుర్వేద వైద్యవృత్తి తమ వంశపారం పర్యంగా రావటానికి హేతువు ఏమిటో ఇప్పుడుగదా అర్థమవుతోంది.

కాని శుశ్రుత మహర్షులవారి చిత్రపటం ఆ వరుసలో ఉండగా ఇటు తమ కుటుంబ ప్రముఖుల వరుసలోనూ అదీ ప్రధమస్థానములంకరించటంలో... ఏదైనా విశేషం ఉందా? ఇదే విషయాన్ని తండ్రి వల్లభాచార్యుని అడిగినప్పుడు–

"కుమారా... ఓడ ప్రమాదానంతరము నీకు మరపు అధికరించినటుల యున్నది. నీకు తెలియని విషయమా ఇది? త్రేతాయుగమున నాటి అవతార

పురుషుడు శ్రీరామచంద్రులవారి సహాధ్యాయి అగు ఈ శుశ్రుత మహర్షులవారే మన వంశ మూలపురుషులు నాయనా!" అన్నాడు.

ఆ మాటలు వినగానే చరక్ రోమాంచితుడయ్యాడు. ఒక్కసారిగా నరాలు తెగిపోతున్నంత ఉత్కంఠత.

మూగవాడిలా కొద్దిక్షణాలు అలాగే ఉండిపోయాడు. అసలు ఈ ద్వారకాపురిలో ప్రవేశించినప్పటి నుండి కూడా ఏదోఒక విశేషం తనను ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంది. ఏనాటి త్రేతాయుగం. ఏనాటి ద్వాపరయుగం... కలియుగం లోని తమ వంశమూలాలు ద్వాపరంలో ద్వారకయందు ఉన్నాయనుకున్న క్షణంలోనే ద్వాపరం కూడా కాదు తమ వంశమూలపురుషుడు త్రేతాయుగంలోని శుశ్రుతమహర్షి అని తెలిశాక చరక్ మనస్థితి స్తంభించి పోయింది.

"కుమారా... ఏమైనది? ఆరోగ్య సమస్యయా?" అంటూ కించిత్తు ఆందోళిత మనస్కుడై ప్రశ్నించాడు వల్లభాచార్యుడు.

"లేదు జనకా... తమ అనుగ్రహమున ఆరోగ్య సమస్యలేమియు లేవు. శుశ్రుతులవారు, ఆయుర్వేదమున శస్త్రచికిత్సా విధానమును పరిచయంచేసిన ఆ మహర్షులవారు మన వంశమూల పురుషులంటే నమ్మశక్యముగాకున్నది. గర్వముగానూ యున్నది."

"కాని ఇదియే నిక్కము. శుశ్రుతులవారి వంశ పరంపర మనది. నాటి నుండి కూడా వంశానుగతంగా ఆయుర్వేదమే మన వృత్తిగా ఉన్నది.

కుటుంబంలో కొందరు వైదిక కర్మలయందు, వేదాధ్యయనము, యజ్ఞయాగాదులందు, ఆలయ అర్చకులుగను ఉన్నను ఒకరిద్దరు మాత్రం పూర్తి స్థాయి వైద్యునిగా శిక్షణపొంది ఆయుర్వేదాన్ని వంశానుగతంగా తీసుకొస్తూనే ఉన్నారు.

నా తరం వచ్చుసరికి తండ్రి, తాతల వద్ద ఆయుర్వేదం అభ్యసించిన పిమ్మట చరకమహర్షుల శిష్యుడనైతిని. అగ్నివేశుడు చరకులవద్ద నా సహాధ్యాయి.

మన వంశీకులు ఎందరో నేడు అయోధ్య అంగవంగ కళింగ మగధ హస్తిన గాంధార రాజ్యములందు ఘన వైద్యులుగా మన్ననలందుచున్నారు" అన్నాడు వల్లభాచార్యుడు. సాధువు శివయోగి తనను ఈ భాండాగారమున

దర్శించమనటంలో ఉద్దేశం చరక్‌కి ఇప్పుడు పూర్తిగా అర్థమైంది. తన వంశమూలాలు ఏమిటో ఎక్కడికి వ్యాపించి ఉన్నాయో తెలిసింది.

"కుమారా!" అంటూ వల్లభాచార్యుల పిలుపుతో ఆలోచనలనుండి బయట పడ్డాడు చరక్.

"జనకా, ఏమి ఆనతి?" అడిగాడు.

"శ్రీకృష్ణులవారు బృందావనము నుండి ద్వారకకు వేంచేస్తున్నటుల వర్తమానమందినది. పురజనులతో పాటు బలరామప్రభువులును సోదరునికి ఘనస్వాగత సత్కారములకు ఏర్పాట్లు జేయుచున్నారు.

మేము ఒకపరి కోటకు వెడలి బలరామ ప్రభువుల దర్శనము జేసిరావలె. నీవును వచ్చిన తోడ్కొనిపోదును. ప్రభువులు నిను జూడనుత్సాహపడుచున్నారు" అన్నాడు. ఆ విధంగా వల్లభాచార్యుడు పిలవగానే కుతూహలం కొద్దీ ఆయన వెంట తనూ వెళ్ళాలనుకున్నాడు చరక్. కాని మరుక్షణమే సాధువు శివయోగి హెచ్చరిక గుర్తువచ్చి కంగారుపడ్డాడు.

తను కోట ప్రాకారందాటి లోన అడుగుపెట్టలేడు. లోనకు వెళ్ళటం జరిగిందంటే మణిభద్రయక్షుడు తనను తిరిగి కలికాలంలోకి లాక్కుపోగలడు. ఆ విషయం గుర్తురాగానే వెళ్ళాలనుకున్న ఆలోచన విరమించుకొని "క్షమించండి జనకా. నేను రానువలను గాదు. భోజనవేళకు వత్తునని మిత్రవిందకు వాగ్దానము జేసితి" అంటూ తప్పించుకున్నాడు.

"అటులనే కుమారా!" అంటూ నవ్వాడు వల్లభాచార్యుడు. "మీ ఇరువురకును త్వరలో ముహూర్తము జూచి వివాహము జరిపించవలె. లేకున్న నిను గృహవశమున జూడ గష్టమగుచున్నది" అంటూ బయటికెళ్ళి పోయాడు. మరికొంత తడవు ఆ తాళపత్ర భాండాగారమందే ఆలోచనల మధ్య గడిపాడు చరక్. పిమ్మట తనూ అశ్వంమీద మిత్రవింద కోసం శివదేవగుప్తుల వారి గృహానికి బయలుదేరాడు.

వసంతోత్సవాలకు ఇంకా నాలుగు రోజులుందనగానే ద్వారకలో పండుగకళ వచ్చేసింది. అందుకు కారణం శ్రీకృష్ణులవారు ద్వారకకు ఆగమనం చేయటం. బృందావనం నుండి బయలుదేరిన శ్రీకృష్ణులవారి రథం ద్వారకకు వస్తోందన్న వార్త తెలిసిన మరుక్షణం నుండే ద్వారకాపుర వీధుల్లో హడావుడి

మొదలైంది. మామిడాకుల తోరణాలు, పూలతోరణాలు, పుష్పగుచ్ఛాలతో రాజమార్గం వెంట ఎక్కడికక్కడ స్వాగత తోరణాలు వెలుస్తున్నాయి.

అప్పటికే మేళతాళాలు, వందిమాగధులు, గోపస్త్రీలతో కూడిన బృందం ఒకటి కోట నుండి ఎగువన నాలుగో ప్రాకార వాకిలికి చేరుకుని శ్రీకృష్ణులవారి ఆగమనం కోసం ఎదురు చూస్తున్నారు. అంతక్రితమే స్వయంగా బలరామ ప్రభువులు మంత్రులు, యాదవ ప్రముఖులు, వర్తక ప్రముఖులు అంతా శ్రీకృష్ణుల వారిని స్వాగతించడానికి నాలుగవ ప్రాకార వాకిలి దిశగా సాగిపోయారు.

*　　*　　*　　*　　*

క్రమంగా రాజమార్గం పొడవునా సౌధాల మీద మార్గం ఇరువంకలా పురజనులు తండోపతండాలుగా శ్రీకృష్ణులవారిని చూసేందుకు, ఆయనకు స్వాగతం చెప్పేందుకు వరుసగా బారులు తీరుతున్నారు.

అశ్వంమీద పోతూ ఈ హడావుడి అంతా గమనిస్తూనే ఉన్నాడు చరక్.

చతురునిగా గతస్మృతి ఏర్పడినందున గతంలో శ్రీకృష్ణ బలరామ ప్రభువులను జూచిన జ్ఞాకాలు కలుగుతున్నాయి. ఇప్పుడు తిరిగి చూడవలెనన్న కాంక్షకలుగుతోంది.

శివదేవగుప్తుల గృహాన్ని చేరగానే అశ్వాన్ని అశ్వశాలలో వదిలి మేడమీదకు వెళ్ళాడు.

వల్లభాచార్యులవారి గృహము రాచవీధికి కాస్త లోపలి పక్కవీధిలో ఉండగా శివదేవగుప్తులవారి గృహము మాత్రము రాజవీధి నానుకోనే ఉంది. రెండో అంతస్థులో మిత్రవింద శయనమందిరం కూడా అటే ఉంది. చరక్ వెళ్ళేసరికి గవాక్షం చెంత నిలబడి వీధిలో హడావుడి చూస్తోంది మిత్రవింద.

ఈ రోజు మరింత సొగసుతో – మెరిసిపోతోంది.

ఆరడుగుల పాలరాతి శిల్పంలా ఉంది. సృష్టికర్త ఆమె సౌందర్యాన్ని జాగ్రత్తగా పాలమీగడతో మలిచాడా అన్పిస్తోంది. ముఖపద్మం ఎంత చూసినా తనివి తీరదు. అసలీమె కట్టుబొట్టు వేషధారణ, రూపలావణ్యం అంతా కలికాలం స్త్రీలనుంచి పూర్తిగా విభేదిస్తున్నాయి.

ఒంటిమీద ఎన్ని బంగారు ఆభరణాలు... చిత్ర విచిత్రమైన మణిమయ నగిషీలతో కూడిన ఆభూషణాలు, వాటిచేత చాలా కష్టం. వాటిని తయారు

చేయాలంటే కలికాలం అదీ ఆధునికకాలపు స్వర్ణకారులకు తాతలు దిగిరావాలి. అంతటి పనితనం ఆ ఆభరణాల్లో కన్పిస్తుంది. ఇక్కడ అవివాహితలగు కన్యలు శంఖాల గాజులనే ధరించటం వారి ఆచారం.

ఇప్పుడు మిత్రవింద చేతులక్కూడా శంఖపుగాజులే ఉన్నాయి. వయసు పెరిగిన స్త్రీలలో కూడా చీర కట్టడమనేది ఎక్కడోగాని కన్పించదు.

స్త్రీలు లంగా జాకెట్‌లు, చున్నీవంటి వస్త్రభాగాన్నే ధరిస్తారు. బయటకు వెళ్ళాల్సివస్తే ముఖం తెలీకుండా చున్నీనే ముసుగులా ధరిస్తారు.

"ప్రియుడా... ఇదియేమి కొత్తగా వీక్షించుచుంటివి?" అతడ్ని గమనించి వికసిత ముఖారవిందంతో సమీపించి అడిగింది మిత్రవింద.

"నీ సొగసును జూస్తుంటిని ప్రియా... ఇంతటి అందము కొరకు ఎన్ని జన్మలయినను ఎత్తవచ్చునని తోచుచున్నది" అంటూ ప్రేమగా ఆమెను బాహువులలో బంధించాడు చరక్.

మిత్రవింద గోముగా చరక్‌ను ముద్దాడింది. "ఎన్ని జన్మలయినను విడిపోక మనం ఇటులనే కలసియుండవలె" అంది.

"ఇక మనకు ఎడబాటులేదులే" అన్నాడు.

తీరా అనిన తర్వాతగాని తోచలేదు. మిత్రవిందకు ఏ భరోసాతో ఇలా హామీ ఇస్తున్నాడు? ఈమెకోసం తను ఇక్కడే ఉండిపోలేడు గదా. ఉండి శుశ్రుతకు అన్యాయం చేయలేడు. జేజితాత అగ్నివేశాచార్యులకిచ్చిన మాట తప్పలేడు.

తను కలికాలంలోకి వెళ్ళిపోతే ఈ ప్రేమమయి మిత్రవిందకు మరోసారి తను తీరని ద్రోహం చేసినట్టే గదా... ఈమె గతి ఏమిటి?

మనసు వేదనతో మూలుగుతుండగా ఆ వేణుమాధవునే తలచుకొంటూ "ఏమిటి స్వామీ నాకీ అగ్నిపరీక్ష. నాకో దారి చూపించలేవా?" అని వేడుకున్నాడు.

ఆ పూట మిత్రవిందతోపాటు – శివదేవగుప్తుని గృహమునందే భోజనం చేశాడు చరక్.

"శ్రీ కృష్ణ ప్రభువులవారు స్వాగత సత్కారాలందుకొని ద్వారకానగర ప్రవేశం చేస్తున్నా రహో!" ఒక వైతాళికుడు అశ్వారూఢుడై పురజనులను అప్రమత్తం చేస్తూ రాజమార్గం వెంట దూసుకెళ్తున్నాడు. ఎగువనుంచి నగారాకొమ్ముబూరలు, మేళతాళాల శబ్దాలు వినవస్తున్నాయి.

జయఘోష సముద్రఘోషలా విన్పిస్తోంది. రాజమార్గం ఇరువంకలా బారులు తీరిన పురజనులు అప్రమత్తులై మాధవుని రాక కోసం ఎదురు చూడసాగారు. శ్రీకృష్ణ ప్రభువు ప్రయాణిస్తున్న రథం పురప్రవేశం జేసేసరికే సాయంత్రం మూడుగంటలు దాటిపోయింది సమయం. దారిపొడవునా యాదవరాజ్య ప్రజలు నీరాజనాలు పడుతుంటే వారి అభిమానాన్ని వారింపలేక రథాన్ని మందగమనంతో నడుపవలసొచ్చింది.

నాలుగో ప్రాకారం వాకిలివద్ద వేచివున్న బలరామ ప్రభువులు సోదరుని కౌగిలించుకొని కుశలములడిగి ఆహ్వానించారు. పెద్ద ఎత్తున చేరిన పుర ప్రముఖులు, మంత్రులు అంతా జయజయ ధ్వానాలు చేశారు. హర్షాతిరేకంతో ఫెళ్ళున వాద్యఘోష ఆరంభమైంది. అక్కడి నుండి ఊరేగింపుగా నగరంలోకి బయలుదేరాడు రుక్మిణీవల్లభుడు. స్వాగత సత్కారాలు ఘనంగా జరిగాయి.

శ్రీకృష్ణులవారి రథానికి నాలుగు పవనాశ్వాలు పూన్చబడి ఉన్నాయి. సాత్యకి రథచోదకునిగా ఉన్నాడు. ఆ దివ్యరథం మణిమయ స్వర్ణకాంతులతో మెరిసిపోతోంది. ఇద్దరు ఆసీనులు గావటానికి వీలుగా మెత్తని ఆసనముండగా వెనక తట్టునుండి పాము పడగవలె వంపుతిరిగి ఎత్తుగా ముందుకు వాలిన భాగంలో నీడ కొరకు పెద్ద గొడుగులాంటి భాగం అమర్చబడి ఉంది.

ముత్యాలసరాలు, బంగారు జలతారులు, పగడాల తోరణాలతో అతిసుందరంగా అద్భుతంగా అది అలంకరింపబడివుంది. ఆ గొడుగు కింద నిలబడిన గోపదేవుడు ఎడమ చేత మురళి ఉండగా కుడిచేతిని లేపి అభయ ముద్రలో చిరునవ్వులతో ప్రజలను వీక్షిస్తూ ఆశీర్వదిస్తున్నాడు.

నుదుట కస్తూరి తిలకం, వక్షస్థలంలో కౌస్తుభం, గళసీమలో సుగంధములు వీచు పుష్పమాలిక, శిరస్సున శిఖిపింఛముతో మణిమయ కాంతులతో మెరయు కిరీటము... ఆ ఆజానుబాహుని దివ్యసుందర రూపం వర్ణింపనలవి కానిది.

ఆ నీలమేఘశ్యాముని తన్మయులై వీక్షిస్తూ పురజనులు పుష్పవర్షం కురిపిస్తున్నారు.

ఆ దివ్యమంగళ స్వరూపుని పక్కనే నిలబడున్నాడు ఆయన ఆంత రంగిక చెలికాడును, ఆస్థాన విదూషకుడును అగు వసంతయ్య పంచె అంగీ ధరించాడు. మెడలో వెండి కంటె, రెండు చేతులకూ బంగారు మురుగులు, కుడికాలికి

వెండి తోడయం ఉంది. చెవులకు కుండలాలు, ముక్కున నత్తు, తలమీద కురచజుత్తు ఉండి వెనక పొడవాటి పిలక ఉంది. కోటదిశగా శ్రీకృష్ణుల వారి ఊరేగింపు సాగుతోంది. వందిమాగధులు, మేళతాళాలు ముందు పోతూండగా వారి ననుసరించి కోలాట బృందాలు, భజనబృందాలు సాగుతున్నాయి.

శ్రీకృష్ణులవారి రధాన్ని అనుసరించి బలరామ ప్రభువులు తొమ్మిదిమంది అశ్వారూధులై అనుసరిస్తున్నారు. వారివెనుక పురప్రముఖుల అశ్వాలు, రధాలు సాగుతున్నాయి. ఇవిగాక నగర రక్షక విభాగానికి చెందిన అశ్వికదళం రక్షణగా రాచబాటకు ఇరువంకలా వస్తున్నాయి.

దారిపొడవునా భవంతులపై నుండి పడతులు పుష్పవర్షం కురిపిస్తున్నారు. బాటకిరువంకలా ద్వారకాపురి వాసులు హర్షాతిరేకంతో జయఘోషచేస్తున్నారు. క్రమంగా ఆ ఊరేగింపు కోటను సమీపిస్తోంది. అప్పటికి సూర్యుడస్తమించే వేళయింది.

అదేవీధిలో శివదేవగుప్తుని భవంతి రెండో అంతస్తులో మిత్రవిందతో కలసి నిలబడి 'న భూతో న భవిష్యతి' అన్నట్టుగా రంగరంగ వైభవంగా సాగుతున్న శ్రీకృష్ణ ప్రభువుల ఊరేగింపును వీక్షిస్తున్నాడు చరక్.

తన్మయంతో ఒడలు మరచి పులకించి చూస్తున్నాడు. రధంలో శ్రీకృష్ణుని దివ్యమంగళ స్వరూపాన్ని గాంచి "హే కృష్ణా! ముకుందా... మురారీ... మాధవా" అంటూ మనసులోనే శ్రీకృష్ణుని కీర్తిస్తున్నాడు.

అంతలో – సరిగ్గా శివదేవగుప్తుని గృహసమీపాన – ఊరేగింపు నిలిచి పోయింది. ఏం జరిగిందో అర్ధంకాగ ప్రజలు, ముఖముఖాలు చూసుకోసాగారు. చరక్, మిత్రవిందలూ అటే చూడసాగారు.

"కృష్ణా!... కన్నయ్యా... గోపాలా... ఎక్కడున్నావు తండ్రీ... ఒక్కసారి నా కోసం ఆగలేవా? గోవిందా" ఒక శతాధికవృద్ధురాలు చేతికర్ర తాటిస్తూ ఉన్నట్టుండి బారులు తీరిన పురజనుల మధ్యనుండి రాజమార్గంలోకి వచ్చేస్తూ అరిచింది. ఆమె పిలుపు రధంలోని శ్రీకృష్ణులవారి చెవిన బడింది.

సాత్యకి కళ్ళాలుబిగించి అశ్వాలను నిలిపాడు. కావలిభటులు ఆమెను పక్కకు లాగబోయారు. కాని శ్రీకృష్ణులవారి చేతిసైగను గమనించి ఆమెను రధం వైపు తీసుకొచ్చారు. రధాన్ని ఆపాడు సాత్యకి.

ఒక సాధారణ వృద్ధమహిళ అందునా చూపుసరిగా కనబడని ఆమెకోసం సాక్షాత్తూ ఆ వేణుమాధవుడు రథం దిగి వచ్చి ఆప్యాయంగా ఆమె చేయి అందుకోవటం సాధారణ విషయం కాదు.

"ఎవరు... ఎవరు నాయనా మీరు? మా కన్నయ్య వేనా!" సందేహ నివృత్తికోసం శ్రీకృష్ణుని చేతిని తడుముతూ అడిగిందామె.

"పిలిచినావు గదమ్మా. రాకయుందునా... నీ కన్నయ్యనే తల్లీ. సౌఖ్యములే గద?" ఎంతో ఆదరంతో పరామర్శించాడు మాధవుడు.

ఆమె కనులవెంట బొటబొటా కన్నీరు ప్రవహించింది. ఆనందంతో పరవశించింది.

"నీ అండ ఉండగా మాకు సౌఖ్యములకు కొదవాగిరిధరా... కొడుకులు, చక్కని కోడండ్రు, మనవలు మనవరాండ్రతో ఏ లోటూ లేకుండా ఉన్నాను తండ్రీ" అందా వృద్ధ స్త్రీ.

"మరి ఏల పిలిచితివమ్మా. ఏమి నీ కోరిక? వ్రేపల్లెలో మేము బాలునిగా ఉండగా మము చంకన వేసుకుని తిప్పిన మాతవు. నిను మరతునా... కోరుకొమ్ము... ఏమి కావలె?" అన్నాడు మాధవుడు.

"నా తండ్రి... మా నాయన... ఇన్ని బాధ్యతల యందు ఇంత గొప్ప నాయకునిగా ఎదిగినా, వ్రేపల్లెను, మమ్మును మరువని నీ గొప్పమనసును ఏమని పొగడుదును కృష్ణా. సాక్షాత్తూ ఆ శ్రీహరివి నీవుగాకున్న ఇంత జ్ఞాపకశక్తి ఎటులబ్బును.

తండ్రీ! చూపు మందగించిన మందభాగ్యురాలను, కనులార నీ దివ్యసుందర మంగళరూపమును జూడనెంచితి. చూపు ప్రసాదించు నాయనా" అంటూ తన కోరిక తెలిపిందా వృద్ధ స్త్రీ.

"అటులనే తల్లీ. నీకు దివ్యమగు చూపు ప్రసాదించితి" అంటూ శ్రీకృష్ణ ప్రభువు తన మురళిని ఒక్కసారి ఆమె కనులకు తాకించాడు.

అంతే– రెండుమార్లు రెప్పలల్లార్చిన వెంటనే ఆమె కనులముందు వెలుగు రేఖలు పొడచూపాయి.

క్రమంగా శ్రీకృష్ణులవారి ముఖారవిందం స్పష్టంగా గోచరించింది. ఆ శిఖిపింఛమౌళిని గాంచిన ఆనందాతిశయంలో ఆ వృద్ధురాలు పరవశించి పోయింది.

"ఆహా... పరమాత్మా... పరంధామా... నాకు చూపు ప్రసాదించి కృతార్థురాలిని జేసినావు తండ్రీ" అంటూ కీర్తించింది.

"నినుగాంచిన పిమ్మట ఇక ఈ లోకమును జూడ జాలనిక. తిరిగి చూపును తొలగించుము" అని రెండు చేతులూ జోడించి అర్థించింది.

శ్రీకృష్ణుని పెదవులమీద దరహాసం విరిసింది. "సర్వాంగే నయనం ప్రధానం... అలాంటి కనులకు తిరిగి చూపు ప్రసాదించితి... వలదందువా... లేదు తల్లీ... నీ ఆయుష్షు గట్టిది. చూపులేక వృద్ధాప్యమును గడంగుట కష్టతరము. నీ తుదిశ్వాస వరకు నీ చూపు ఇటులనే స్వచ్ఛముగ ఉండగలదు. సంతోషమే గద పోయి రమ్ము" అంటూ ఆశీర్వదించి వెనుతిరిగి రథాన్ని అధిరోహించాడు కృష్ణప్రభువు.

కళ్ళముందు జరిగిన ఈ చమత్కారమును ప్రత్యక్షంగా జూసిన పురజనులు జయజయ ధ్వానాలు చేశారు. ఆనందాతిశయంతో తనూ వారితో శృతి కలిపిందా వృద్ధురాలు. శ్రీకృష్ణులవారి ఊరేగింపు తిరిగి ముందుకు కదిలింది.

ఇదే సమయంలో వసంతయ్య రథం దిగి వెళ్ళటం సాత్యకి మాత్రమే గమనించాడు. అక్కడ శివదేవ గుప్తుని గృహముపైన గవాక్షం చెంత నిలబడిన చరక్ జరిగినదంతా చూస్తూనే ఉన్నాడు. అతని మనసులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. ఇప్పుడు ద్వారకలో – తను చూస్తున్నదంతా ఇప్పుడే జరుగుతోందా? లేక గతంలో జరిగిపోయిన రోజులు తిరిగి పునరావృతమవుతున్నాయా. వాస్తవం ఏమిటి? అనే కొత్త సందేహాలు తలెత్తసాగాయి. సాధు పుంగవుడు శివయోగి సెలవిచ్చినట్టు కిటుకంతా తను కోరిన కోరికలోనే ఉందన్నది సుస్పష్టం. ఆనాడు కడలిలో జరిగిన ఓడప్రమాదంలో తను మరణించింది నిజం.

ఆ వార్త తెలిసి అటు తనవారు వల్లభాచార్యుల కుటుంబం ఇటు శివదేవ గుప్తుల వారి కుటుంబం శోకతప్తులయిన మాట నిజం.

మిత్రవింద తనకోసం దుఃఖపడుతూ ఇదే చోట నిలబడి ఉండగా ఇలాగే శ్రీకృష్ణులవారి పురప్రవేశంలో ఊరేగింపు సాగివుండాలి. యాదృచ్ఛికమో, దైవఘటనో తెలీదుగాని తను సరిగ్గా చతురుని మరణానంతరం పక్షంరోజుల కాలానికి కలియుగం నుండి ద్వారకకు వచ్చాడు. ఇప్పుడు దృశ్యం మారింది.

తన సరసనే మిత్రవింద సంతోషంగా ఉంది. నాటివలెనే శ్రీకృష్ణులవారి ఊరేగింపు పునరావృతమవుతోంది. దీనికి అర్థం ఏమిటి?

చరిత్ర మారవచ్చు, పునరావృతంగానూవచ్చు. అన్నట్టుగా ఒక గీత మారి కొత్తగీతగా ఏర్పడుతోందా! ఒక చిత్రం కొంతమేర చెరిగి కొత్త చిత్రంగా తన రూపురేఖలు మార్చుకుంటోందా...

చరక్ ఆలోచనలు ఒక కొలిక్కి రాలేదు. దిగువన శ్రీకృష్ణులవారి రథము ఊరేగింపు రాజమార్గంలో ముందుకు సాగిపోతోంది. అంతలో అడుగుల చప్పుడు విన్పించి మిత్రవిందతో బాటు చరక్‌కూడా తిరిగిచూశాడు. వచ్చింది ఎవరో కాదు. శ్రీకృష్ణులవారి చెలికాడు వసంతయ్య. అతన్ని గాంచిన మరుక్షణం తమ గతపరియం కూడా చరక్‌కి గుర్తుకొచ్చేసింది.

మిత్రవిందముఖంలో సంతోషం తాండవిస్తోంది. "మావయ్యలకు అభివందనాలు విచ్చేయండి" అంటూ ఎదురు వెళ్ళి నమస్కరించి ఆహ్వానించింది మిత్రవింద.

"చిరంజీవ, మనోభీష్టసిద్ధిరస్తు" అంటూ ఆశీర్వదించాడు వసంతయ్య.

"బాబాయ్" అంటూ ఎదురువెళ్ళి వసంతయ్యను ఆలింగనం చేసుకున్నాడు చరక్.

"విచ్చేయండి బాబాయ్. కుశలమే గద. మీరు లేని ద్వారకలో సందడేలేదు సుమీ" అన్నాడు నవ్వుతూ. "ఆ రాధామాధవుని దయ ఉండ, మాకు కుశలములకు లోటేమి చతురా. మీ ఇరువురిని గవాక్షమున గనినంతనే ఇక సంతోషమోపజాలక ఓరికీ దెలుపకయే తేరుదిగి ఇటు వచ్చితి.

నీవు మరణించితివని దెలిసి శోకతప్తులమైతిమి. ఎటులనో ఓడ ప్రమాదమున గండము గడిచి సేమముగా ద్వారకజేరితివి.

ఇదియంతయు మా మేనకోడలు మిత్రవింద అదృష్టము" అంటూ నవ్వాడు. కొద్దిసేపు ముచ్చట్ల అనంతరం వసంతయ్య కొరకు వేడిపాలు తీసుకు రావటానికి కిందకు వెళ్ళింది మిత్రవింద.

వసంతయ్య మిత్రవిందకు మేనమామ గాబట్టి ఆ వరసన ఆయన్ని బాబాయ్ అని పిలవటం చతురుని అలవాటు. ఇప్పుడూ అలాగే పిలుస్తున్నాడు.

"బాబాయ్. నాదో కోరిక తీర్చగలవా?" ఎదురుగా కూర్చుంటూ అడిగాడు చరక్.

"ఒకటేమి పదికోరికలైనా తీర్చగలం. ఏమా కోరిక?" వసంతయ్య తన సహజధోరణిలో అడిగాడు.

"నాకు శ్రీకృష్ణులవారి శమంతకమణిని, పాంచజన్యమును జూడ ఆశ గలదు. అది...."

"ఇంతియేగద... అది యెంతపని. రేపు నా వెంట కోటకు రమ్ము. నీ కోరిక తీర్చెదను. శ్రీకృష్ణ ప్రభువు నా మాట కాదనరు" అన్నాడు వసంతయ్య.

"కాని బాబాయ్. కొద్దిరోజులవరకు నేను కోటలోపలికి రావలనుగాదు"

"ఎందువలన?"

"మా వివాహమునకు పూర్వము కోటలోనికి పోగూడదనుకొంటి"

"గొప్ప చిక్కే గద. నీవు రానియెడల నీ కోరిక తీర్చుట ఎటుల? నీవు జూడనెంచినవి సామాన్యమైనవా దెచ్చిచూపుటకు. ఉషోదయమగు లోపలే స్నానాదులు, పూజలు ముగించి బాలాదిత్యుని తొలికిరణాలు పుడమి పైకి ప్రసరించగనే శమంతకమణి ఆ కిరణములగాంచి పదిబారువల బంగారు నొసగును. పిమ్మట శమంతకమణిని లోన భద్రపర్చెదరు.

శ్రీకృష్ణులవారి శయనమందిరమున ఒక స్వర్ణ పేటిక గలదు. శమంతక మణి, పాంచజన్యం, కిరీటం, మురళి వీటిని ఆ పేటికయందే భద్రపర్చెదరు.

కావున నీవు కోటకు రాకున్న శమంతకమణి, పాంచజన్యములను నీవు ప్రత్యక్షముగ వీక్షింపజాలవు. ఆఁ... ఒక ఆలోచన"

"ఏమది?" "శమంతకమణి, పాంచజన్యములను రంగుల చిత్రించి దెచ్చి యిచ్చెద"

"చిత్రమా...." అంటూ నవ్వాడు చరక్.

"బాబాయ్. నీవు హాస్యములాడగలవు"

"చతురా... ఇప్పుడు నీవు నాతో హాస్యములాడుచున్నావు సుమీ. నేను గొప్ప చిత్రకారుడనని మరచితివా? నీ శయనమందిరములోన గల నీ వర్ణచిత్రము గీచి ఇచ్చినదెవరు? నేనుగాదా?

మా మిత్రవింద శయనమందిరమున గల ఆమె వర్ణచిత్రము ఎవరు వేసినది? నేనుగానా? కోటలో రాచనగరులో శ్రీకృష్ణులవారు వారి అష్టభార్యలు, ఇతరుల వర్ణచిత్రాలు ఎన్ని వేయలేదు"

వసంతయ్య గొప్ప చిత్రకారుడని అప్పుడు గుర్తొచింది చరక్‌కి. "బాబాయ్. ఏదో తమాషాకి అటులంటిని. అంతియేగాని నీ గురించి నాకు తెలియదా యేమి. అయినచో నా కొరకు శ్రీకృష్ణులవారి చిత్రంతోపాటు శమంతకమణి, పాంచజన్యం, శ్రీకృష్ణులవారి కిరీటం, వారి చేతియందుండు మురళి ఇవన్నియు చిత్రించి తేవలయును"

"అబ్బో. చాలా పనియున్నది. సరి. నాలుగు దినములలో వసంతోత్స వములు ఆరంభమగుచున్నవి. ఆ రోజు ఉదయమే నీవు కోరినవిధంగా చిత్రించి తెచ్చివ్వ గలను" మాటిచ్చాడు వసంతయ్య.

అంతలో మిత్రవింద వెండిలోటాలో పాలు తీసుకొచ్చింది. పాలు తాగి బయలుదేరాడు వసంతయ్య. ఆయన మాటల్నిబట్టి కోటగుమ్మం ముందు వేదిక వద్ద పురజనులనుద్దేశించి శ్రీకృష్ణులవారు ప్రసంగించే కార్యక్రమం ఉంది.

త్వరగా అక్కడికి చేరుకొనే ఉద్దేశంతో వడివడిగా అక్కడినుండి నిష్క్రమించాడు వసంతయ్య.

అప్పటికి సూర్యుడు అస్తమించాడు. శివదేవగుప్తుని ఇంట గాజుబుడ్లలోని ఆముదం దీపాలు, ఆవరణలో దేవదారు కట్టెలతో కూడిన దివిటీలను వెలిగిస్తున్నారు. శ్రీకృష్ణులవారి ప్రసంగం వినే ఉద్దేశం కొద్దీ చరక్ మిత్రవిందతో చెప్పి తనూ బయలుదేరాడు.

తను కోటగుమ్మందాటి లోనకు వెళ్ళలేడుగాని బైట నాలుగు వీధులమధ్య సభావేదికవద్ద నిర్భయంగా తిరగవచ్చు. చరక్ వీధిలోకొచ్చి-కాలి నడకనే కోటదిశగా సాగాడు. రాజమార్గం ఇరువంకలా ప్రజలు దివిటీలను ఉంచటంతో అవి జ్వాలాతోరణంలా ప్రకాశిస్తున్నాయి. ద్వారకావాసులంతా ఆ కూడళ్ళలోనే ఉన్నారా అన్పిస్తోంది. జనసందోహాన్ని తప్పించుకుంటూ ఎలాగో ముందుకు సాగాడు చరక్.

నాలుగు వీధుల కూడలిలో పెద్ద ఎత్తయిన రాతిస్తంభాల మండపం ఉంది. చరక్ ఇక ముందుకుపోలేక కొంతదూరంలోనే ఆగిపోయాడు.

"సర్వేజనా స్సుఖినో భవంతు! ఓ నా ప్రియమగు ద్వారకాపురి వాసులారా! ప్రియబంధువులారా అందరికీ శుభాశీస్సులు. ఎనలేని మీయొక్క ఆదరాభిమానములు మరువలేనివి, మరుపురానివి"

చరక్ జనాన్ని తప్పించుకుంటూ – సభావేదిక సమీపానికి చేరుసరికే – బలరామ ప్రభువుల ప్రసంగం ముగిసి, శ్రీకృష్ణ ప్రభువుల ప్రసంగం ఆరంభమైంది. బలరాముల వారిది మేఘగంభీర స్వరం.

శ్రీకృష్ణులవారిది శాంతగంభీరస్వరం, స్థిరచిత్తుడు, మందగమనుడు, మనోహరుడగు శ్రీకృష్ణుని, ఆయన ప్రసంగమును మంత్రముగ్ధులై వీక్షిస్తూ ఆలకిస్తున్నారంతా. బలరాములవారు పేరుకు తగ్గట్టే ఎత్తుగా, లావుగా పసిమివర్ణ మేనిఛాయతో మీసం, గడ్డంతో ఉన్నారు. శ్రీకృష్ణులవారు పొడవుకు తగ్గ లావు. సింహపు నడుము విశాలవక్షస్థలం, శాంతిగంభీరచిత్తుడు, నీలమేఘశ్యాముడు...

ఆయన కదులుతుంటే కరకంకణాలు ధ్వనిస్తున్నాయి. మురళిని ఇరుచేతులకు మార్చుకొనుచూ ప్రశాంత దృక్కులతో ప్రసంగిస్తున్నారు. (ఆ ప్రసంగ సారాంశం మామూలుభాషలో)

*　　*　　*　　*　　*

"ఓ ప్రియజనులారా! కాలధర్మానికి ఎవరూ అతీతులు కారు. మీరంతా ధర్మాన్ని తెలిసి నడుచుకోండి. ధర్మాన్నే ఆచరించండి. మీ నిత్య వ్యాపకాల్లో క్రయవిక్రయాలు, వ్యాపారాలు ధర్మబద్ధంగా నిర్వహించండి. అధర్మం ఎప్పుడూ నశిస్తుంది. ధర్మం నిలబడుతుంది.

సుఖశాంతులనిస్తుంది. దానధర్మాలను ఎన్నడూ మరువకండి. మనకు మిత్రులే కాదు, శత్రువులూ ఉన్నారు. ధర్మాన్ని అధర్మం నాశనం చేయాలని చూస్తుంది. కాని ధర్మం ఎప్పుడూ కాపాడబడుతుంది.

ధర్మసంస్థాపనే నా ధ్యేయము, నా లక్ష్యము, నా కర్తవ్యము. ఆనాడు మేము ధర్మజుని ఆహ్వానం మేరకు రాజసూయయాగంలో పాల్గొనుటకు మేము ఇంద్ర ప్రస్థ వెళ్ళిన అదనుజూచి అధర్ముడు ధూర్తుడు అగు మార్తికావతపు రాజు సాళ్వభూపాలుడు ద్వారక పైకి దండెత్తి వచ్చినాడు. ఏమైనది?

మా కుమారులు ప్రద్యుమ్నుడు, సాంబుడు, చారుధేష్ణుడు అతిరథ మహారథులగు మన యాదవ వీరులు సాళ్వుడి దాడిని విజయవంతంగా తిప్పికొట్టి అతడి పీచమణచి గర్వభంగం చేశారు.

అటుపిమ్మట ప్రాగ్ జ్యోతిష పురాధీశుడును (నేటి అస్సాం రాజధాని గౌహతి పూర్వనామం ప్రాగ్ జ్యోతిషపురం. అస్సాం ప్రాంతమే నరకాసురుడి రాజ్యం. ప్రాక్ దిశ అంటే తూర్పుదిక్కు.

తూర్పునగల జ్యోతిషపురమని అర్థం. ఇప్పటికీ అస్సాం రాజధాని సమీపంలోని కొండమీద అతిపురాతన మైన నక్షత్రశాల ఉంది. అక్కడ నిత్యం ఖగోళాన్ని పరిశీలించి గ్రహగతులను తెలుసుకొని భవిష్యత్తును చెప్పే మహాపండితులుండేవారట.

దుర్మార్గుడు ధర్మాన్ని చెరపట్టిన నరకాసురుడ్ని మేము వధింపగా పగబూనిన, నరకుని మిత్రుడు కరూషదేశరాజగు పండూరభూపతి మేము ద్వారకలోలేని సమయం జూచి అర్ధరాత్రి ద్వారకమీద తన సేనలతో విరుచుకుపడ్డాడు.

అది కూడా మీకు తెలుసు. ఆ నిశీధిలో, భీకర పోరాటంలో, మన యాదవసేనలు ఎంతో నష్టపోయాయి. చెదరిపోయాయి. కాని మేము ఇక్కడలేని లోటు రానీక మన సాత్యకి సాహసంతో తిరిగి మన యాదవసేనలను సమైక్యపరచి పండూరునిపై యుద్ధం కొనసాగించాడు.

ఏకలవ్యుడు ఉగ్రసేనుడ్ని, వాసుదేవుడ్ని, సారణుడిని ఓడించగా ఈ లోపల మేము నగరానికి చేరుకుని సాగించిన యుద్ధంలో దుష్టుడైన పండూరుని వధించి తిరిగి ధర్మాన్ని స్థాపించి మన ద్వారకను సురక్షితం చేశాము. పిమ్మట మన చిరకాల ప్రత్యర్థి అయిన జరాసంధుని వధింపజేసి ద్వారకను అజేయము గావించితిమి.

అయినప్పటికీ... ఓ నా ప్రియజనులారా... ఈ పుడమిపైన ఏదీ శాశ్వతం కాదు. ధర్మం ఒక్కటే శాశ్వతం. ధర్మోరక్షతి రక్షితః! ధర్మాన్ని మనం కాపాడుకుంటే ధర్మం మనల్ని కాపాడుతుంది.

మనం ప్రస్తుతం ద్వాపరం చివరిలో ఉన్నాము. త్వరలో ద్వాపరం ముగిసి కలియుగం ఆరంభంకానుంది. యుగసంధికి సమీపంలో ఉన్నాం. కలిప్రభావం ద్వాపరంమీదా ప్రసరిస్తోంది.

రాజులు ధర్మం తప్పుతున్నారు. ఇంతవరకు కనీవినీ ఎరుగని మహా సంగ్రామం ఒకటి రానుంది.

జనక్షయం తప్పదు. (కురుక్షేత్ర మహాసంగ్రామంలో పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నశించింది. అందులో పదకొండు అక్షౌహిణులు కౌరవుల పక్షాన, ఏడు అక్షౌహిణులు పాండవుల పక్షాన ఆ యుద్ధంలో పాల్గొని వీరమరణం చెందారు) కాబట్టి మీరంతా దృఢచిత్తులు కండి. ప్రలోభాలకు లొంగకండి. న్యాయబద్ధులై మెలగండి. ధర్మబద్ధులై ఉండండి.

అధర్మం పెచ్చుమీరిన ప్రతిసారీ దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు తిరిగి ధర్మాన్ని స్థాపించడానికి నేను అవతరిస్తూనే ఉంటాను"

ఈ విధంగా శ్రీకృష్ణులవారి ప్రసంగం దేవనాగరిభాషలో ఒక ఝరీప్రవాహంలా ఝంఝామారుతంలా సాగిపోతూనే వుంది. నిశ్శబ్దంగా ఉండి మంత్రముగ్ధులై ద్వారకవాసులంతా ఆ ప్రసంగాన్ని ఆలకిస్తున్నారు. ఆ ప్రబోధాలు వింటూ మైమరచిన చరక్ అంతరంగంలో ఆలోచిస్తున్నాడు.

"ఆహా...కృష్ణా... ముకుందా... పరంధామా... లీలామానుషరూపుడవై ఈ విధంగా ప్రసంగించి ధర్మాన్ని బోధించి జనులను చైతన్యపరుస్తున్నావా తండ్రీ... ఇందుకేనా గీతలో ధర్మసంస్థాపన గురించి అర్జునునికి అంత స్పష్టంగా బోధించావ్.

శ్లో॥ **యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత!**
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానాం సృజామ్యహమ్॥

శ్లో॥ **పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్।**
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

భగవద్గీతలోని ఈ శ్లోకాలు గుర్తుకొచ్చిన చరక్ అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి ఆ పరంధాముడికి నమస్కరించాడు.

వసంతయ్యకోసం చరక్‌చూశాడు గాని ఆప్రాంతాల్లో ఎక్కడా కన్పించలేదు. పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. శ్రీకృష్ణులవారి ప్రసంగం ముగియటంతో సభ ముగిసింది. అక్కడినుండి తిరిగివచ్చేప్పుడు ఇక తన అశ్వంకోసం శివదేవగుప్తుల ఇంటివైపు పోలేదు చరక్. కాలినడకనే అవతలివీధిలోని తమ వల్లభాచార్యుల వారి ఇంటికి చేరుకున్నాడు.

మరునాడు తను ప్రాతఃకాల పూజాదికాలు ముగించుకుని తయారై తన అశ్వం కోసం శివదేవగుప్తులవారి ఇంటికి వెళ్ళేసరికి మిత్రవింద తలారా స్నానంచేసి దంతపుదువ్వెనతో తల దువ్వుకుంటూ కడిగిన ముత్యంలా లేయెండలో మెరిసిపోతోంది.

మోకాళ్ళను తాకుతున్న పొడవుజుత్తు. "ప్రియుడా! ఉదయమందే బయలువెడలితివి. ఎటకు?" మందహాసంతో ప్రశ్నిస్తూ ఎదురువచ్చింది మిత్రవింద.

"నీ కొరకే సుమీ... నా అందాలరాణివి. నినుజూడ నా డెందము తహతహ లాడినది. కావున అరయవచ్చితి" అన్నాడు చరక్.

"ఆహాహాఁ... చతురుడువి గదా! చమత్కారములు పలుకుచుంటివి. అంతటి ప్రియమున్నచో రాతిరి సభా ప్రాంగణమునుండి ఇటు నాకడకు రాక, నేరుగా మీ గృహమునకు నడచిపోదువా? ఇపుడు అశ్వము కొరకు వచ్చితినని నుడువుము" అంది బుంగమూతితో నిష్ఠూరంగా. ఆ పలుకులు విని ఫక్కున నవ్వాడు చరక్. మరింత ఉడుక్కుంది మిత్రవింద.

"ఎందులకా పరిహాసము?" అంది.

"గాక మరేమి? అవివాహితులం. రేతిరి జాముల నేనిటకు వచ్చిపోవుట ఎవరైన గాంచిన పదుగురూ పరిహసింపరా?

కినుక ఏటికి దేవీ. నీవు మా హృదయమందేయుంటివిగదా. నిను గాంచి, పిదప అశ్వమును గొనిపోవనెంచియే ఇటకు వచ్చితి. ఒక పరి నగరమును చుట్టి రావలెనని బయలు వెడలితి" అంటూ ప్రేమగా ఆమె బుగ్గ మీటాడు చరక్.

"అటులయిన కొంచెము తాళుము. నేనును సింగారించుకొని వత్తును. నా రథమున పోయివత్తుము" అంది.

"చచ్చింది గొర్రె. నీతో తిరిగితే పనులయినట్టే" అలవాటులో పొరపాటుగా అచ్చతెలుగులో గొణిగాడు చరక్.

విడ్డూరంగా చూసింది మిత్రవింద. "చచ్చింది గొర్రె అనిన ఏమి? ప్రియుడా. ఇది ఏ భాష?" అనడిగింది.

ఆమె ఏకసంథాగ్రాహి. సందేహం లేదు– ఒక్కసారి వింటే చాలు ఏదయినా గుర్తుపెట్టుకుంటుంది. "ఇది తెలుగుభాష. నీకు తెలీదులే. చచ్చింది

గొర్రె అనిన అంతయు బాగుగనే యున్నదని అర్థము. సంధ్యాసమయమున నీ రథమున వాహ్యాళికి పోవుదము.

ఇప్పటికి నేను ఒంటిగనే పోయివత్తును" అన్నాడు. అబద్ధము జెప్పక తప్పదుగద.

"అటులైన నీ కొరకు ఎదురుజూచెద. ప్రియుడా. భోజనవేళకు ఇటకే రావలయు సుమీ" అంది మిత్రవింద, హెచ్చరిస్తున్నట్టు.

"ఓసి నీ ఎంకమ్మ... నన్నొదలవే నువ్వు... రాక తప్పుతుందా?" మళ్ళీ తెలుగులో గొణిగాడు.

"ఏమది? పరభాషలో భాషించితివి? నీ ఎంకమ్మ... నన్నొదలవే నువ్వు.. రాక తప్పుతుందా... అనిన ఏమి?" చిలకపలుకుల్లా మిత్రవింద తన మాటల్ని యధాతధంగా తనకే వప్పజెప్తుంటే చరక్‌కి నవ్వాగలేదు. నవ్వితే తను ఉడుక్కుంటుంది.

'ఒరే చరక్. నీకు కాస్త చతురోక్తులు ఎక్కువవుతున్నాయి. నోరు అదుపులో పెట్టుకోరా' అంటూ మనసులో తనను తానే హెచ్చరించుకొంటూ పైకి తమాషాగా నవ్వాడు. "తెలుగుభాషలో భాషించితి ప్రియా. భోజనమువేళకు తప్పక వత్తునని దీనికి అర్థము" అన్నాడు దేవనాగరిలో. మళ్ళీ అబద్ధం చెప్పక తప్పలేదు.

"అటులనా... పరభాష ఏల? మనదేవనాగరికన్నను మిన్నయాయది? పరభాష వలదు" అంది మిత్రవింద.

"అటులనే కానిమ్ము. పోయివత్తును" అంటూ వెనుతిరిగాడు చరక్.

అతడు అశ్వారూఢుడై చేతి వృత్తుల వారు నివసించు ప్రాంతాలవైపు అశ్వాన్ని పోనిచ్చాడు.

*　　*　　*　　*　　*

పద్మశాలీలు నివసించు ప్రాంతంలో ప్రతి ఇంటా మగ్గం నేస్తున్న శబ్దం విన్పిస్తోంది. రాట్నాలమీద నూలు వడుకుతున్నారు. కొన్నిచోట్ల బట్టలకు రంగుల డిజైన్లు అద్దుతూ కలంకారీ పని చేస్తున్నారు.

నూలువస్త్రాలు తయారుచేయటం ఎంత ప్రాచీనమైన వృత్తి, ఎంతటి కళో అర్థమవుతోంది.

పిన్నలు, పెద్దలు, స్త్రీ, పురుషులంతా తమ కులవృత్తిలో లీనమై శ్రద్ధగా పనిచేస్తున్నవారే.

అలాగే కుమ్మర్లు నివసించు ప్రాంతాల్ని దర్శించాడు. కుమ్మరి సారె ఎంత ప్రాచీనమైనదో అర్థమవుతోంది. సారె తిప్పి మట్టిని వివిధ ఆకృతులకు మలిచి తీసి ఎండలో ఉంచుతున్నారు.

కొందరు ఎండిన కుండల్ని చెక్కతో తట్టి షేపు చేస్తున్నారు. కొందరు కాల్చిన కుండల్ని, బానల్ని బయటకు తీస్తున్నారు. కొందరు వాటికి చక్కగా రంగులు వేస్తున్నారు.

ద్వాపరంలో ఇనుముకూడా వాడుకలో ఉంది. కమ్మర్లు కొలిమిలో కాల్చిన ఇనుమును సుత్తులతో కొట్టి కృపాణాలు, ఈటెలు, బరిసెలు, కత్తులు, గృహావసరాలకు వినియోగించు కత్తిపీటలు, వ్యవసాయ పనిముట్లు, కొడవళ్ళు తయారుచేస్తున్నారు.

ఇత్తడిపనివారు రాగి, ఇత్తడి, కంచు లోహాలతో గృహోపకరణాలు, అలంకారవస్తువులు, జగ్గులు, మగ్గులు, ఇత్తడి కూజాలు, పూలసజ్జలు మొదలగునవి, ఇంకా రాగికాగులు తయారుచేస్తున్నారు.

ఇంకా కొందరు శంఖాలను కోసి గాజులు తయారు చేస్తున్నారు. వాటికి ఆకర్షణీయమైన రంగులు అద్దుతున్నారు. శంఖాలను మలిచి చిన్న చిన్న అలంకరణ వస్తువులను తయారుచేస్తున్నారు.

అలా అలా తిరుగుతూ మళ్ళీ ఓసారి ఓడరేవు వరకు వెళ్ళాడు చరక్. ఆ ఉదయమే చీనాదేశం నుంచి వచ్చిన ఒక ఓడనుండి అనేకవస్తువులు దించుతున్నారు. వాటిలో ధాన్యము, నూనెలు, ఇతర వస్తువులు నిలవ ఉంచుకునే అతి పెద్దవైన పింగాణీ బానలు,

ఇంకా పింగాణీ లోటాలు, అలంకరణ వస్తువులు, పిల్లల ఆటబొమ్మలు, ఇంకా కొయ్యతో చేసిన ఆటబొమ్మలు, పట్టువస్త్రములు ఓడనుంచి రేవు కార్మికులు దించుతున్నారు.

పక్కనే మరో ఓడలోకి, ఇక్కడినుండి నూలు వస్త్రాలు, ఉన్నితో నేసిన కంబళ్ళు, తివాచీలు, పట్టు తేనె జాడీలు, మసాళా ద్రవ్యములు, సుగంధ ద్రవ్యాలు, తోలు వస్తువులు, అత్తరు సీసాలు కొన్నిరకాల తృణధాన్యాలు ఓడలోకి ఎగుమతి

చేస్తున్నారు. అవన్నీ చూసుకుంటూ ఎగువకు బయలుదేరిన చరక్, గోమతి నదీపాయల్ని దాటుకుంటూ సువర్ణతీర్థ, ఓకా, శంకోదర ద్వీపాలన్నీ చుట్టి చూశాడు. ఆలయాల్ని దర్శించాడు.

తిరుగు ప్రయాణంలో ఓడరేవు మీదుగా ప్రధాన భూభాగం చేరుకుని ద్వారక వెళ్ళు రాతిబాటకు వెళ్ళకుండా సముద్ర నారాయణుని ఆలయం దాటి తీరం వెంట ప్రభాసతీర్థం వరకు ప్రయాణించాడు.

(మొదట ద్వారవతీ నగరం) అక్కడి సుందరకట్టడాలను మనోహరమైన ఉద్యానవనాలను తిలకిస్తూ ఇంకా దిగువకు సోమనాథ ఆలయం వరకు వెళ్ళి అద్భుతమగు ఆ ఆలయాన్ని చూశాడు. సోమనాథుని దర్శించాడు.

స్వర్ణమయమైన ఆ ఆలయాన్ని గాంచి పులకించిపోయాడు. గజనీ మహమ్మద్ పదిహేడుసార్లు దండెత్తి వచ్చి దోచుకున్న ధనవంతమగు ఆలయం. ఇంతటి వైభవంగల ఆలయంగాబట్టే గజనీమహమ్మద్ అంతకు తెగించాడు అన్పించింది.

ఇవన్నీ చూసుకుని చరక్ ద్వారకకు తిరుగు ప్రయాణమయ్యేసరికి అక్కడే సంధ్యాసమయమైపోయింది. తను మధ్యాహ్నం భోజనం చేయని సంగతి అప్పటిగ్గాని గుర్తురాలేదు.

తనకోసం మిత్రవింద అక్కడ భోజనం మాని ఎదురుచూస్తుందని గుర్తు రాగానే శరవేగంతో అశ్వాన్ని ద్వారకవైపు పరుగులెత్తించాడు.

*　　*　　*　　*　　*

ఆరోజు పౌర్ణమిరోజు, వసంతోత్సవాలు ద్వారకలో రంగ రంగ వైభవంగా ఆరంభం కానున్న రోజు. అంతకుముందు రోజునుంచే ద్వారకలో పండుగ శోభ సంతరించుకుంది. వీధులన్నీ పచ్చని తోరణాలతో అలంకరింపబడ్డాయి. ఇళ్ళముంగిట ముత్యాల ముగ్గులు వెలిశాయి.

ఒక పక్క వసంత వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా సాగుతూండగా మరో పక్క ద్వారకాపురిలోని శివాలయాలు, రామాలయాలు, శక్తి ఆలయాలు కాళికాలయం అన్నిటా భక్తుల తాకిడి.

ఇదే సమయంలో పున్నమినాడు ఉదయమే హడావుడిగా వల్లభాచార్యుల వారి గృహమునకు వచ్చాడు శ్రీకృష్ణుల వారి చెలికాడు వసంతయ్య.

"చతురా... చతురా" అంటూ సరాసరి తన శయనమందిరానికొస్తున్న వసంతయ్యను జూసి సంతోషంతో ఆహ్వానించాడు చరక్. కూచోడానికి ఉచితాసనం చూపించాడు.

"కూచొనుటకు సమయమేది చతురా... ఆలయాల్లో పూజలకు శ్రీకృష్ణుల వారి వెంట వెళ్లవలసినవాడ. నీ కొరకు ఇటువచ్చితి. ఇంద. నీవడిగిన చిత్రములు, గైకొనుము" అంటూ మడతబెట్టిన ఒక పట్టువస్త్రమును తీసి చరక్‌కి అందించాడు వసంతయ్య.

ఆ వస్త్రమును మడతలు విప్పగానే– విభ్రాంతి చెందాడు చెరక్.

తెల్లటి సిల్కువస్త్రం మీద ఇంత చక్కగా వర్ణచిత్రములు వేయొచ్చని ఇది చూశాకే అర్థమవుతోంది. రెండడుగుల వెడల్పు, మూడడుగుల పొడవుగల పలుచని చిక్కని పట్టువస్త్రం. దానిమీద ఎడమభాగంలో శ్రీకృష్ణులవారి చిత్రం రంగుల్లో ఎంతో సహజంగా చిత్రించబడి వుంది.

నీలమేఘశ్యాముని కమనీయ రూపం. శిరస్సున నెమలిపింఛంతో కిరీటం, నుదుట కస్తూరి తిలకం, హృదయంమీద కౌస్తుభమణి, మెడలో పూలహారం, చేతమురళి ధరించినట్టుగా ఎంతో సహజంగా ఉందా రూపం.

పక్కన పైవరుసలో మొదట శమంతకమణిహారం చిత్రించబడింది. మెడలో ధరించేందుకు అనువుగా స్వర్ణహారము దిగువన పతకంలో శమంతకమణి అద్భుతంగా సహజంగా చిత్రించబడింది. దానిపక్కన దక్షిణావృతశంఖం పాంచజన్యశంఖం చిత్రించబడింది.

అలాగే శమంతకమణి దిగువన శిఖిపింఛంతో కూడిన శ్రీకృష్ణులవారి కిరీటము, పక్కన శ్రీకృష్ణులవారి కరభూషణమగు మురళి స్పష్టంగా బహు సుందరంగా చిత్రించబడి ఉన్నాయి. ఆ పట్టువస్త్రాన్ని భక్తితో కళ్ళకద్దుకొన్నాడు చరక్.

"చతురా. ఇపుడు నీకు తృప్తియేగద. నేను గొప్ప చిత్రకారుడనని నీవు అంగీకరించినట్టే గదా" అంటూ నవ్వాడు వసంతయ్య.

"బాబాయ్. ఏదో పరిహాసమునకుపుడట్లంటి. మనసులో ఉంచుకొన వలదు. నీవు గొప్ప చిత్రకారుడవు. నీ పరిచయమే నాకు మహద్భాగ్యం" అన్నాడు

చరక్. ఎంత హడావుడిగా వచ్చాడో అంతే హడావుడిగా వెళ్ళిపోయాడు వసంతయ్య.

చరక్ ఆ పట్టువస్త్రాన్ని భద్రంగా మడచి తన శయనమందిరంలోనే భద్రపరిచాడు.

ఆ రోజు నూతనవస్త్రాలు ధరించిన పురజనులు మధ్యాహ్నం వరకు ఇళ్ళలో వసంతుడికి పూజలు, ఆరాధనలు, పిదప గుళ్ళలో దైవదర్శనాలు విందు భోజనాలతో సంతోషంగా గడిపారు.

వయసు కన్యలు రంగు రంగుల దుస్తుల్లో చెంగు చెంగున గంతులు వేస్తూ సీతాకోకచిలుకల్లా తిరుగుతున్నారు. చరక్ కూడా మిత్రవిందతో వెళ్ళి కొన్ని ఆలయాలను దర్శించి వచ్చాడు.

ఇక వరసయిన యువతీయువకుల సరసాలకి, చతురోక్తులకి, వారి సందడికి అంతే లేదు. వీధులన్నీ కళకళలాడుతున్నాయి. ఇక బహిరంగ సామూహిక వేడుకలు సంధ్యాసమయంలో, కోటగుమ్మం వెలుపల అదే సభావేదిక వద్ద ఆరంభమయ్యాయి.

శ్రీకృష్ణులవారు వసంతుడి విగ్రహాన్ని ఆవిష్కరించి రంగులు చల్లడంతో వేడుకలు మొదలయ్యాయి.

ఆ వేడుకల్లో పాల్గొనడానికి మిత్రవింద సహితంగా అక్కడికొచ్చాడు చరక్. కొద్దిక్షణాల్లో ఇద్దరూ రంగులమయం అయిపోయారు.

పురవీధుల్లో యువతీయువకులు రంగుల బుక్కా చల్లుకోవటం, యువతులు యువకులమీద రంగునీళ్లు పోయటం, ఉరుకులు, పరుగులు, ఆనంద కోలాహలంగా ఉంది అంతటా. వాద్యఘోష అంబరాన్నంటుతోంది.

చంద్రోదయమయ్యేసరికి సభావేదిక వద్ద గోపస్త్రీల కోలాటం ఆరంభమైంది. ఎటుచూసినా ఆముదం దివిటీలు, దీపాలకాంతులు. పైన పున్నమిచంద్రుని బంగారు జిలుగువెలుగులు, శ్రీకృష్ణులవారూ గోపస్త్రీజనంతో చేరి ఆడుతూ పాడుతూ కోలాటం ఆరంభించటంతో అక్కడ ఆనందహేల వెల్లివిరిసింది.

చరక్, మిత్రవిందలు ముగ్ధులై ఆ కోలాటదృశ్యాన్ని చూడసాగారు. వారే కాదు పురజనులంతా నయనానందంగా వీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా చరక్ మనసులో జయదేవుని గీతం మెదిలింది.

కస్తూరీ తిలకం-లలాటఫలకే,
వక్షస్థలే కౌస్తుభం - నాసాగ్రే నవమౌక్తికం
కరతలే వేణుం - కరే కంకణం
సర్వాంగే హరిచందనంచ కలయన్
కంఠేచ ముక్తావళిం - గోపస్త్రీ పరివేష్టితో
విజయతే గోపాల చూడామణీ॥

ఆహా॥ జయదేవుడు ఎలా ఊహించి ఈ గీతం చెప్పాడోగాని ఎంత యథార్థంగా ఉందీ దృశ్యం.

పై నుండి దేవతలు కూడా ఈ సుందర దృశ్యాన్ని కనులారా చూస్తున్నారా అన్పిస్తోంది. రాత్రి రెండో యామంలో శ్రీకృష్ణులవారు, రాచ నగరునుంచి వచ్చిన స్త్రీ పురుషులు అంతా కోట లోపలకు వెళ్ళిపోయారు. చరక్, మిత్రవిందలూ గృహాభిముఖంగా బయలుదేరారు. ఐనా ద్వారకాపురి వీధుల్లో అంతటా వేడుకలు కొనసాగుతూనే వున్నాయి.

మరునాడు ఉదయం చాలా ఆలస్యంగా నిద్రలేచాడు చరక్. రాత్రి నడిరేయి వరకు వసంతోత్సవ వేడుకల్లో ఉన్నందున ఉదయమే లేవలేకపోయాడు. ఒకసారి మిత్రవిందను కలసి మాట్లాడాలనిపించింది. అందుకు తగిన కారణం కూడా ఉంది.

ఇక తను ద్వారకలో ఉండాల్సిన పనిలేదు. జేజి తాతయ్య అగ్ని వేశాచార్యుడు కోరిన నాలుగు వస్తువులతో బాటు అదనంగా శ్రీకృష్ణులవారి అసలు రూపం కూడా చిత్రించబడిన వస్త్రభాగం తన వద్ద ఉంది. ఇవి ఎవరూ సాధించలేనివి.

ఇక తను కలియుగంలోకి వెళ్ళిపోవచ్చు. కాని... మిత్రవింద. ఆ ప్రేమమయిని వదిలిపోడానికి మనసు రావటంలేదు. ఏం చేయాలనే చింత అతడ్ని వేధిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి జేజి తాతయ్య ఏదన్నా మార్గం చెప్పగలడేమో.

కాని తను వెళ్ళి తిరిగి రావాలన్నా మిత్రవిందను ఒప్పించాలి గదా. చెప్పి చూద్దాం అనే ఆలోచనతో బయలుదేరాడు. ఎందుకైనా మంచిదని

వసంతయ్య ఇచ్చిన వస్త్రభాగాన్ని మడచి తనదుస్తుల్లో భద్రంచేసుకున్నాడు. అయితే తను ద్వారకను వదిలి వెళ్ళిపోవాల్సిన పరిస్థితులు తనకు తెలీకుండానే సమీపిస్తున్నాయని ఆక్షణంలో చరక్‌కు తెలీదు.

చరక్, శివదేవగుప్తుల ఇంటికి చేరుకున్నాడు. అశ్వాన్ని అశ్వశాలలో వదిలి వచ్చేసరికి ఊహించని విధంగా అక్కడ ఆవరణలోని పొన్నచెట్టు ఛాయలో తిన్నెమీద సాధుపుంగవుడు శివయోగి కన్పించాడు.

*　　*　　*　　*　　*

త్రిశూలము నేలలోగుచ్చి నిలబెట్టబడి ఉంది. ఒక కాలు మడిచి కూచుని సాక్షాత్తూ ఆ శివుని తలపిస్తున్నాడు. అప్పటికే మిత్రవింద ఆ మహనీయుని గాంచి ఆటుపోతూ చరక్‌ను చూసి ఆగింది.

"ప్రియుడా! ఉదయము రాలేదేమి?" అంటూ గడుసుగా ప్రశ్నించింది.

"తీరలేదులే మిత్రవిందా... వాదులాటలేల. రమ్ము ఆ మహనీయుని దర్శింతము" అంటూ పొన్నచెట్టువైపు దారితీశాడు చరక్.

చరక్ మనసులో అనేక ఆలోచనలు సుడితిరుగుతున్నాయి. సర్వం తెలిసిన స్వామి. తన సమస్యకు ఏదన్నా పరిష్కారం చూపగలడా!

ఏదో చిన్న ఆశ... సమయానికి శివయోగి వారటకు రావడము శుభ సూచకమనిపించింది.

ఇరువురూ శివయోగివారికి పాదాభివందనం చేశారు. "ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు, లేవండి" అంటూ ఇరువురినీ ఆశీర్వదించాడు శివయోగి.

"స్వామీ. నేనుగా తమను వెదుకుతూ రావలసిన వాడిని. మీరే ఇట-కేతించుట అదృష్టమని భావింతును. నా సమస్యకో పరిష్కారం చూపగలరు" అంటూ ముకుళిత హస్తాలతో వేడుకున్నాడు చరక్.

నర్మగర్భంగా నవ్వాడు సాధువు శివయోగి.

"అన్ని సమస్యలకు పరిష్కారము చూపగల శక్తి కాలానికున్నది నాయనా. తొందరేల" అన్నాడు.

అంతలో- చరక్‌ను వెదుకులాడుతూ హడావుడిగా వస్తున్న వసంతయ్య మీద అందరి దృష్టిపడింది.

అంతను కంగారు కంగారుగా కాలినడకనే వస్తున్నాడు. ఆశ్చర్యంగా వసంతయ్యను అనుసరించి వెనకే వల్లభాచార్య దంపతులు ఇతర కుటుంబ సభ్యులు కూడా ఇటే వస్తున్నారు. ఏం జరిగిందో అర్ధంగాక బిత్తరపోయి చూస్తున్నాడు చరక్. మిత్రవింద ఆందోళన చెందుతూ అతడి చేయి పట్టుకుంది.

"చతురా... నువ్విక్కడున్నావా. నీకోసం మీ గృహమునకేగి ఇచటకు రావడమైనది" అన్నాడు వస్తూనే వసంతయ్య.

"ఏమైనది ఎందులకీ హడావుడి?" విషయమర్ధంగాక ప్రశ్నించాడు చరక్.

"ఇంకను ఏమి కావాలి. నీవు ద్వారకయందుండుట క్షేమకరముగాదు. కొంతకాలము నగరము వదిలి పొమ్ము" అన్నాడు వసంతయ్య.

"ఏమి జరిగినది?"

"నీ విటకు వచ్చునప్పుడు నీ జుత్తు కత్తిరింపబడి యున్నదా?" అన్నాడు వసంతయ్య.

"అవును"

"అదియే ప్రమాదహేతువైనది. నిన్ను గూఢచారులు గమనించినారు. శత్రుగూఢచారివని సందేహించారు. నగరమున శత్రుగూఢచారుల సంచార మున్నది. ఇరువురు పట్టుబడిరి.

వారి నాయకుడవు నీవని సందేహించి బలరామ ప్రభువులకు నివేదించినారు.

చతురుని వేషంలో ఇట జేరినావని నీమీద అభియోగము. ప్రభువులవారు నిన్ను బంధించమని ఆజ్ఞాపించారు. భటులు వచ్చు లోపలే నీవు ఇటునుండి వెడలిపోయి కొంతకాలం బయట ఉండుట మంచిది."

"కాని బాబాయ్...."

"నీవు నిరపరాధివేగావచ్చును. గాని అది నిరూపణ అగువరకు చెరసాల నుందువా? వలదు వలదు. బయలుదేరుము. ఈ వార్త తెలిసి అదో నా వెనకే అంతా వచ్చియున్నారు" అన్నాడు.

ఈ లోపల విషయం తెలిసి శివదేవగుప్తుల దంపతులు ఇతర కుటుంబ సభ్యులు అంతా బిలబిలా బయటికొచ్చేశారు. ఏం చేయాలో అర్ధంగాక–

శివయోగి వంక చూశాడు చరక్.

శివయోగి మందహాసం చేశాడు.

"నీ అభీష్టము నెరవేరు సమయము సమీపించినది నాయనా. సందేహమేలా? వసంతయ్య వచించినటుల నీవు వెడలిపోవుటే శుభము" అన్నాడు.

చరక్, మిత్రవింద వంక చూశాడు. ఆమె అతని చేయి వదలుటలేదు. ఆమె కళ్ళలో నీరు సుడి తిరుగుతోంది. "చతురా... నిను వీడి మనజాల. నేనును నీ వెంటవత్తును" అంది.

"అవున్నాయనా. మిత్రవింద నీకోసమే పుట్టింది. నీ వెడలినచో దీని దుఃఖమును జూడజాలము. మా గారాల పట్టిని వెంట దోడ్కొని పొమ్ము" అన్నాడు బాధను దిగమ్రింగుతూ శివదేవ గుప్తుడు. తనకీ తీసుకుపోవాలనే ఉంది. కాని ఎలా? ఇది గుర్రాలమీదో, రథాలమీదో ప్రయాణం కాదే! మణిభద్రయక్షుడు తనను మాత్రమే కలికాలమునకు తీసుకుపోగలడు. మిత్రవిందనెలా తీసుకెళ్ళటం?

నిస్సహాయుడిగా శివయోగి వంకచూశాడు చరక్. ఆ మహనీయుడు శిరస్సు పంకించాడు.

"నీ సంశయము తెలిసినది నాయనా. ఈ సమస్యను నేను – పరిష్కరించెద. నా అధీనమగు పంచశక్తులందు అదృశ్యశక్తి ఆత్మగమనశక్తియను రెండు శక్తులను మిత్రవిందకు ధారపోసెద.

వాటి ప్రభావమున ఆమెయు నీ వెంట పయనింపగలదు. అమ్మా మిత్రవిందా... ఇటురా తల్లీ" అంటూ మిత్రవిందను చేరపిలిచాడు.

తన కమండలంలోని పవిత్రోదకంతో తన చేతి నుండి మిత్రవింద చేతిమీదకు ధారపోసాడు.

పిమ్మట మిత్రవింద చెవిలో మంత్రోపదేశం చేసి ఎలా వినియోగించు కోవాలో తెలిపాడు.

ఈ లోపల– మిత్రవింద తండ్రి శివదేవగుప్తుడు గృహములోనికి పోయి రెండు పెద్ద చేతిసంచులతో తిరిగివచ్చాడు. ఒక సంచి నిండుగా మిత్రవింద దస్తులున్నాలు. రెండో సంచి నిండుగా మిత్రవింద ఏడువారముల స్వర్ణా భరణములు, రత్నములు, సువర్ణ నాణెములు ఉన్నాయి.

"పుత్రికా, మిత్రవిందా. పుట్టింటి నుండి రిక్తహస్తములు, కట్టిన వలువలతో పోగూడదు తల్లీ. ఇవి నీవి. వెంట తీసుకుపొమ్ము" అంటూ ఆ సంచుల్ని మిత్ర విందకు అందించాడు.

"చతురా! నీవెచట ఉన్ననూ మా ప్రాణములు నీయందే యుండును. మిత్రవిందను వివాహము జేసుకొని సుఖముగా యుండుము" అన్నాడు తండ్రి వల్లభాచార్యుడు.

చరక్‌కు వారందర్నీ వదిలిపోతున్నందుకు చాలా బాధగానే ఉంది. కాని తప్పదు. చరక్ మిత్రవందలు కన్నీరు తుడుచుకున్నారు.

వల్లభాచార్య దంపతులకు శివదేవగుప్త దంపతులకు పాదాభివందనం చేశారు. వసంతయ్యకూ పాదాభివందనం చేశారు. మిగిలిన అందరివద్దా వీడ్కోలు తీసుకున్నారు. "మీరిరువురును వేగిరము వెడలుట మేలు. ఏ క్షణమైనను రాజభటులిటకు రావచ్చును" అంటూ తొందరచేశాడు వసంతయ్య.

చివరిగా–సాధుపుంగవుడు శివయోగి పాదాలకు నమస్కరించారు చరక్, మిత్రవిందలు. పిదప శివయోగి సూచనమేరకు మిత్రవిందను గాఢంగా కౌగిలించు కున్నాడు చరక్.

మిత్రవింద ఇరుచేతులా సంచులను పట్టుకునే అతని మెడను కావిలించు కొని శివయోగి ఇచ్చిన మంత్రశక్తులను ప్రయోగించింది.

అదే సమయంలో చరక్ కనులు మూసుకుని మణిభద్రయక్షుని తలుచు కున్నాడు.

"ఓ త్రికాల సంచారీ మణిభద్రయక్షా. నన్ను తిరిగి కలియుగమున నా నిజశరీరమునకు చేర్చుము" అని ప్రార్థించాడు చరక్.

అంతే–ఏకకాలమున అక్కడి నుండి చరక్, మిత్రవిందలు ఇరువురూ అదృశ్యమయ్యారు.

* * * * *

కలియుగం–రంపచోడవరం అటవీ ప్రాంతం. అగ్నివేశాచార్యులవారి స్థావరం.

ఉదయం పదిగంటల సమయం. అంతక్రితమే అగ్నివేశాచార్యుల పూజాదికాలు ముగిశాయి. కాలనాళిక మందసంగల గదితలుపులు తెరిచి బయటే ఆగి అప్పన్నను పిలిచి గది ఊడ్చే పని వప్పగించారు. లోనికి పోయి గది చిమ్ముతున్నాడు అప్పన్న.

ఆ సమయంలో తండ్రీ కొడుకులయిన పిల్లా గోవిందపాత్రుడు, పిల్లా శివరామ ముకుందపాత్రులు ఇద్దరూ ఆ సమీపంలోనే ఉండి ఏదో విషయాన్ని చర్చించుకుంటున్నారు.

అప్పటికి చరక్ కాలనాళిక మందసంలో ద్వాపరయుగంలో ద్వారకా పురికి వెళ్ళి నెలా పదిహేనురోజులు దాటింది. అతను ఎప్పుడు తిరిగి వస్తాడో ఒక అంచనా వేయటం కూడా సాధ్యంగాని పరిస్థితి.

మునిమనవడి రాకకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నాడు అగ్నివేశాచార్యుడు. ఈ పరిస్థితిలోనే ఆ రోజు ఉదయం–

గది చిమ్ముతున్న అప్పన్న మందసంలో ఏదో అలికిడి గమనించాడు. చేస్తున్న పని ఆపి సమీపంగా వెళ్ళి డోమ్ గుండా లోనకు తొంగిచూశాడు. అప్పన్న గుండాగిపోయింది. కన్నురెప్పలు పడలేదు. నరాలు ఉన్నాయో చిట్లిపోయాయో తెలీదు.

లోన నిద్రపోతున్నట్టు కన్పించే చరక్ శరీరం కన్పించలేదు. దానికి బదులుగా ఎవరో పొడవాటి యువతి బోర్లాపడుకుని అటుఇటు కదలటం కన్పించింది. అంతే – కొద్దిక్షణాలు భయంతో బిగిసిపోయాడు. వెంటనే కెవ్వున అరిచి బయటికి పరుగెత్తాడు.

"బాబోయ్... మందసంలోకి ఏదో యక్షిణి... మోహిని చేరింది...." అనరిచాడు.

ఒక్కసారిగా అందరి దృష్టీ ఇటు మళ్ళింది. పారిపోతున్న అప్పన్నను చొక్కాపట్టి వెనక్కి లాగారు అగ్నివేశాచార్యులు. "మందసంలో మోహిని ఏమిట్రా వెధవా... ఏం చూశావ్. పద" అంటూ వాడ్ని తిరిగి లోనకు లాక్కొచ్చాడు.

ఈ లోపల విషయం ఏమిటో తెలుసుకోవాలని పిల్లా గోవింద పాత్రుడు, పిల్లా శివరామ ముకుంద పాత్రుడుకూడా లోనకెళ్ళారు.

వారిననుసరించి డ్రైవర్ కాశి, పనివాళ్ళు అంతా గదిలో జొరబడి పోయారు.

మందసంలోకి చూస్తూనే అగ్నివేశాచార్యుడు తీవ్రమైన దిగ్భ్రాంతికి లోనయ్యాడు. లోన ఒక అతిలోక సౌందర్యవతి అయిన యువతి డోమ్ మూలంగా పైకి ఎలా రావాలో తెలీక అవస్థపడుతోంది.

ఆమె కింద చరక్ అటూ ఇటూ కదులుతూ ఆమెతో ఏమో చెప్తున్నాడు. అంతటి స్థితప్రజ్ఞుడిక్కూడా కొంతసేపు కాళ్ళు, చేతులు ఆడలేదు.

ఇదెలా సంభవం... ద్వాపరకాలం ద్వారక నుంచి ఈ కాలానికి ఒక యువతి రావటమా...??? వచ్చేవాడు ఒంటరిగా కాక వెంట ఒక యువతిని కూడా తీసుకొచ్చాడని అర్థమైంది.

ఇదెలా సంభవమో అగ్నివేశాచార్యునికీ అంతుబట్టలేదు. డోమ్‌ని పైకి లేపి ఆమె బయటకు రావటానికి వీలుగా సాయం చేశాడు అగ్నివేశాచార్యుడు.

మిత్రవింద బెదురుచూపులు చూస్తూ మందసంలోంచి బయటికొచ్చి నిలబడింది. ఆమె చేతిలో ఆమె దుస్తులున్న సంచి వుంది. ఆమెను చూస్తున్న ఒక్కరికీ నోటమాట రాలేదు. అక్కడున్న వాళ్ళలో అగ్నివేశాచార్యులే పొడగరి.

ఆరడుగుల ఒక అంగుళం ఎత్తు ఆయన. అటువంటి అగ్నివేశాచార్యునికి సమానమైన ఎత్తు-పాలమీగడ వంటి చర్మ సౌందర్యం, పాలరాతి శిల్ప సుందరిలా ఉన్న మిత్రవింద సౌందర్యాన్ని చూసి ఆమె దేవకన్యా, యక్షకన్యా, గాంధర్వకన్యా అర్థంగాక మతిపోగొట్టుకొని చూస్తున్నారంతా.

ప్రతి ఒక్కరికీ పిచ్చి పట్టినంత పనైంది.

ఈ లోపల ఆమె ఏడువారాల నగలు, రత్నాలు, బంగారు నాణాలతో నిండిన సంచి తీసుకుని చరక్ కూడా మందసంలోంచి బయటికొచ్చాడు.

ఇంతవరకు మందసంలోని చరక్ ఒంటిమీద పైజామా, జుబ్బా ఉన్నాయి. కాని ఇప్పుడు వాటి స్థానంలో సిల్కుపంచె, అంగీ వచ్చాయి.

మందసం నుండి బయటకు రాగానే చరక్‌కి ఆకలి తెలుస్తోంది. అక్కడి వారంతా తనను ఎలా ఆశ్చర్యంగాను, విచిత్రంగానూ చూస్తున్నారో మిత్రవింద కూడా వారిని అంతే ఆశ్చర్యంగాను, విచిత్రంగానూ చూస్తోంది. ముఖ్యంగా అగ్నివేశాచార్యుని చూసి విభ్రాంతి చెందుతోంది.

"ప్రియుడా... మనము ఎచటికి వచ్చితిమి? ఇది ఏ లోకము? మీ ముత్తాతగారు అగ్నిభట్టారకులవా రిచట ఉన్నారేమి? వీరింకనూ జీవించియే ఉన్నారా?" చరక్‌ను దేవనాగరిభాషలో అడిగింది.

ఆ భాష అక్కడున్నవారిలో అగ్నివేశాచార్యులు పిల్లా గోవింద పాత్రుడు ఇద్దరికే అర్థమవుతోంది.

అదీ పూర్తిగా కాదు. కొంత కొంత.

"వారు అగ్నిభట్టారకులవారు కాదు... అగ్నివేశాచార్యులవారు" అన్నాడు నవ్వుతూ చరక్.

"చతురా... ఇప్పుడును చతురులాడుట తగునా? అగ్నిభట్టారకులవారే గదా...."

"ద్వాపరంలో అగ్నిభట్టారకులవారు. ఇది కలియుగం 2013. ఇప్పుడు వారు అగ్నివేశాచార్యుల వారు. నాకు ఇచటను వారే జేజి తాతగారు. రమ్ము. పాదాభివందనం చేయవలె" అంటూ మిత్రవింద చేతిలోని దుస్తుల సంచిని లాగి పక్కన ఉంచాడు.

చరక్‌తోపాటు ముందుకొచ్చి అగ్నివేశాచార్యుల వారికి పాదాభివందనం చేసింది మిత్రవింద. వారిని ఏమని ఆశీర్వదించాలో అగ్నివేశాచార్యునికి బోధపడలేదు.

"సుఖీభవ. లేవండి నాయనా" అంటూ ఇద్దర్నీ లేపాడు.

మిత్రవిందను చూస్తున్న షాక్ నుంచి ఇంకా ఒక్కరూ అక్కడ తేరుకోలేదు.

అగ్నివేశాచార్యుడు, చరక్, మిత్రవింద ముగ్గురూ సుమారుగా ఒకే హైట్‌లో ఉన్నారు. ఆరడుగుల యువతి ఈ లోకంలో ఉందా అన్పిస్తోంది.

"జేజిగారూ. మనం సాయంత్రానికి ఎస్టేట్ భవంతికి చేరుకోవాలి. మిగిలిన విషయాలు అన్నీ అక్కడ మాట్లాడుకుందాం.

కాస్సేపు మీతో ఇప్పుడు ఏకాంతంగా మాట్లాడాలి" అన్నాడు చరక్.

వెంటనే అంతా బయటకు నడిచారు.

చివరిగా పిల్లా గోవిందపాత్రుడు బయటికిపోతూ తలుపులు దగ్గరగా మూశాడు.

అగ్నివేశాచార్యుడు ఆమెకూ అర్థం కావాలని దేవనాగరిభాషలో ఇద్దర్నీ కూచోమన్నాడు. వాళ్ళు కూచున్నాక ఎదురుగా సోఫాలో కూచుని సాలోచనగా మిత్రవిందను చూశాడు. ఆమె అమాయకంగా చుట్టూ చూస్తోంది. కొత్తగా ఉంది ఆమెకు.

"చెప్పరా చరక్... వెళ్ళిన పని ఏమైనది? ద్వారకలో ఏం చూశావ్? ఏం జరిగింది. ఈ అమ్మాయిని చూస్తుంటే ద్వారకాపుర సుందరిలా వుంది. ఎవరీమె? వెంట ఎందుకు తీసుకొచ్చావ్?" అనడిగాడు.

తెలుగుభాష తెలీక–మార్చి మార్చి ఇద్దర్నీ చూస్తోంది మిత్రవింద. వింతగా అంతా కొత్తగా ఉందామెకి.

"జేజిగారూ... వెళ్ళిన పని విజయవంతంగా ముగిసింది. ఈ అమ్మాయి పేరు మిత్రవింద. గతజన్మలో ద్వారకాపురిలో నా ప్రియురాలు" అంటూ తను ద్వారకానగరికి వెళ్ళినప్పట్నుంచి జరిగిన విశేషాలన్నీ జేజితాతయ్యకు క్లుప్తంగా వివరించనారంభించాడు చరక్.

ఈ లోపల – స్థావరం బయట చేరి మిత్రవింద గురించి వింతగా తలోగ్రూపుగా నిలబడి చర్చించుకోసాగారు మిగిలినవారు.

"ఏరా అప్పన్నా ఆ అమ్మాయి ఎవరై ఉంటదిరా? దేవకన్యంటావా లేక మనలాగా మనిషేనంటావా?" అన్నన్నను అడుగుతున్నాడు పులి కొండయ్య.

"మనిషా... మతి ఉండే మాటాడుతున్నావా? ఓరినాయనో. మందసంలో ముందుగా జూసింది నేనేగదా. చూడగానే షాక్‌తో కాలు, చెయ్యి ఆడలేదు తెలుసా? ఆ రూపురేకలు, ఆ అందం చూశావా? అసలు అంత పొడవాటి ఆడపిల్ల లోకంలో ఉంటుందా?" అన్నాడు అప్పన్న.

"ఆ మాట నిజమేరో... ఆమె జుత్తు చూడు. ఎంచక్కా నల్లగా, నిగనిగలాడి పోతూ, ఒత్తుగా అబ్బో... మోకాళ్ళను తాకుతున్నట్టుంది.

ఆమె ఒంటి మీది నగలు, ఆమె ధరించిన దుస్తులే చిత్రవిచిత్రంగా ఉన్నాయి సుమా. అయితే దేవ కన్యేనంటావా?"

"సందేహమా?" అంటూ ఏదో చెప్పబోతూ టక్కున ఆగిపోయాడు అప్పన్న.

"ఏమైందిరా?" అంటూ అప్పన్న చూస్తున్నవైపు చూశాడు పులికొండయ్య. డ్రైవరు కాశీ స్థావరం నుంచి వడివడిగా, దూరంగా పోతూ కన్పించాడు.

"కొండయ్యా. నా అనుమానం నిజమైందిరా. ఇప్పుడు వాడు ఫోన్ తీసి ఇక్కడ జరిగిందంతా ఎవరికో రిపోర్టు చేస్తాడు చూడు" అన్నాడు.

కాశీ ధోరణి చూడగానే పులి కొండయ్యకూ సందేహం ఏర్పడింది. గతంలో విషయాలు అతడు మర్చిపోలేదు. అప్పన్న మొదట్నుంచి వాడ్ని అనుమానిస్తూనే ఉన్నాడు.

"అప్పన్నా... నీ అనుమానం నిజమేరా. ఈ రోజు వీడ్ని వదలకూడదు. వీడ్ని ఆధారంతో పట్టుకుని గురువుగారి ముందు నిలబెట్టాలి. పద.

వాడికి అనుమానం రాకుండా చెరోపక్క చాటుగా వెళ్ళి ఏం మాట్లాడతాడో చూద్దాం. పదపద" అన్నాడు. వెంటనే ఇద్దరూ అక్కడ్నుంచి చెరో పక్క పొదలను చాటు చేసుకుంటూ కాశీ వెళ్తున్నవైపు వేగంగా కదిలారు.

ఎవరన్నా తనను గమనిస్తున్నారేమోనన్న సందేహంతో అటూ ఇటూ చూసుకుంటూ స్థావరం నుండి కొంత దూరం వచ్చేశాడు డ్రైవర్ కాశీ.

చరక్ తిరిగి రావటం అదీ అప్సరలాంటి ఒక యువతిని తీసుకురావటం చూడగానే ఎప్పుడెప్పుడు ఈ విషయాన్ని మాంత్రికుడు మరిడిసోమయ్యకు రిపోర్ట్ చేద్దామా అని అతడు తొందరపడుతున్నాడు.

తను ఎవరో ఇంతవరకు ఇక్కడ ఎవరికీ తెలీదు. తెలిస్తే ప్రమాదమని తనకూ తెలుసు. కాని మాంత్రికుడు అందించే నోట్లకట్టలమీద ఆశ అతడ్ని అంతగా స్వామిద్రోహానికి పురిగొల్పుతోంది.

ఎవరూ తనవైపు రావటంలేదని చూట్టూ చూసి నిర్ధారణ చేసుకున్నాక ఒక చెట్టుచాటున నిలబడి సంచిలోంచి శాటిలైట్ ఫోన్ తీసి ఆన్‌చేశాడు.

క్షణాల్లో మాంత్రికుడు మరిడి సోమయ్య లైన్లోకొచ్చాడు. "చెప్పరా కాశీ. ఏమిటి సమాచారం. చరక్ తిరిగొచ్చాడా?" అవతలి నుంచి గరగరలాడింది మరిడి సోమయ్య గొంతు.

"ఇంతక్రితమే చరక్ తన శరీరంలో ప్రవేశంచి మందసం నుండి బయటికి వచ్చాడు" ఉత్సాహంగా చెప్పాడు.

"గుడ్... అయితే ఏదో తెచ్చి ఉండాలి. ఏం తెచ్చాడురా?" అడిగాడు మరిడి సోమయ్య.

"ఏమీ తేలేదు. వెంట ఒక అందాల భరిణను తెచ్చాడు" చెప్పాడు కాశీ.

"అందాల భరిణ... అంటే...."

"ఒక అందమైన అమ్మాయిని తీసుకొచ్చాడు. చూడ్డానికి దేవకన్యలా ఉంది."

"ఏమిరా కాశీ... ఏదో అనుకుంటే మరేదో జరిగినదేమిరా! నీవు నిజమే చెప్తున్నావా?"

"నిజం గురువుగారు. వాళ్ళిద్దర్నీ లోన గదిలో కూచోబెట్టుకొని అగ్ని వేశులవారు రహస్యంగా తలుపులు మూసి చర్చించుకుంటున్నారు. వెంటనే మీకు ఫోన్ చేశాను" అన్నాడు కాశీ.

కాశీ ఇంకేమో చెప్పబోతున్నాడు. అంతవరకు వాడు మాట్లాడిన మాటలు అటు పులి కొండయ్య, ఇటు అప్పన్నకూడా విన్నారు.

ఇక సహనం కోల్పోయాడు అప్పన్న. నమ్మక ద్రోహి మీద కోపం పొంగు కొచ్చి ఒక్క దూకులో కాశిమీదికొచ్చేశాడు. వాడి చేతిలోని ఫోన్ లాక్కుని స్విచ్ఛాఫ్ చేసేశాడు. ప్రమాదం గ్రహించగానే చట్టున డాగర్ తీశాడు కాశీ.

"రేయ్ అప్పన్నా. ఫోనిలా ఇవ్వు. లేదంటే ఛస్తావ్" అంటూ కోపంతో పొడవడానికి డాగర్‌ని పైకి లేపాడు. అదే సమయంలో దురుసుగా అడ్డం వచ్చిన పులికొండయ్య కాశీ చేతిని ఒడిసిపట్టి మెలితిప్పి భుజం మీద బలంగా ఒక్కటిచ్చాడు.

దెబ్బకు కెవ్వున అరిచాడు కాశీ. వాడి చేతిలోంచి డాగర్ జారిపోయింది. దాన్ని తీశాడు అప్పన్న. కాశీ ఠారెత్తిపోయాడు. పారిపోవాలని చూశాడు.

కాని పులికొండయ్య ఉడుంపట్టు ముందు కాశీ బలం ఎందుకూ పనిచేయ లేదు...

"నమ్మకద్రోహి. ఇక్కడి విషయాలన్నీ ఎవడికిరా రిపోర్ట్‌చేస్తున్నావ్? ఆ మాంత్రిక వెధవకేనా? చెప్పరా!" అంటూ కాశీ చెంపలు వాయించి రెండు చేతులూ వెనక్కి విరిచి కట్టేశాడు పులి కొండయ్య.

"ఇలాంటి ఎదవని బతకనీయకూడదు కొండయ్యా. ఈ డాగర్‌తోనే కసకసా పొడిచి చంపి ఇక్కడే పాతిపెట్టేద్దాం. నీకేం లోటు చేశార్రా గురువుగారు.

ఎవరికీ ఇవ్వనంత స్వతంత్రం నీకు ఇచ్చి సొంతమనిషిలా చూసుకున్నారే. ఆ దేవుడికి ద్రోహం చేస్తావా" అంటూ బలంగా నాలుగు గుద్దులు గుద్దాడు అప్పన్న. ఏమీ బదులు చెప్పలేక – తల దించుకున్నాడు డ్రైవర్ కాశీ.

వాడిని తిడుతూ స్థావరం వైపు లాక్కుపోయారు పులి కొండయ్య, అప్పన్న లిద్దరూ.

* * * * *

నీలోదరి కొండగుట్ట. మాంత్రికుడు మరిడి సోమయ్య స్థావరం.

కాశితో మాట్లాడుతూండగా సడెన్‌గా ఫోన్ లైన్ కట్‌గావటంతో నొసలు విరిచి విసుగ్గా చూశాడు సోమయ్య. కాశి చెప్పిన విషయం నమ్మబుద్ధిగావటంలేదు. తన అంచనా ఇలా తారుమారైందేమిటి?

వెళ్ళిన చరక్ రాముడిదో, కృష్ణుడిదో పవిత్రమైన ఆయుధాలో, మరోటో తెస్తాడనుకొంటే ఎవరో దేవకన్యలాంటి అమ్మాయిని తేవటం ఏమిటి? నిజమేనా... అయినా ఫోన్‌లైన్ కట్‌అయింది. ఏమైవుంటుంది?

ఎవరైనా అటు రావటం చూసి ఫోన్ ఆపివుంటాడా? మళ్ళీ ఫోన్ చేస్తాడా? కాసేపు ఎదురుచూసినా ఫోన్ రాకపోవటంతో తనే ఫోన్ చేశాడు. అటునుంచి ఫోన్ స్విచాఫ్ అని చెప్తోంది.

కాశీమీద కోపం కట్టలు తెంచుకుంది.

చెప్పేవాడు పూర్తి సమాచారం చెప్పకుండానే ఫోన్ ఆపేయటం ఏమిటి? ఏం చేయాలి వీడిని?... కాని అంతలోనే తిరిగి శాంతించాడు? ఏమో... అక్కడ ఏమైందో తెలీకుండానే వాడిమీద ఆగ్రహించి లాభం ఏముంది? ఏమాత్రం అవకాశమున్నా ఓసారి అగ్నివేశాచార్యుడి స్థావరాన్ని పరిశీలించటం మంచిది.

ఈ విధంగా ఆలోచించిన మరిడి సోమయ్య వెంటనే అంజనం వేసి స్థావరాన్ని వీక్షించే ప్రయత్నం చేశాడు. కాని సాధ్యం కాలేదు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అగ్నివేశాచార్యుడు తన స్థావరప్రాంతాన్ని పూర్తిగా అష్టదిగ్బంధనంలో ఉంచాడు.

మరిడి సోమయ్యకు అంజనంలో అక్కడంతా అడవితప్ప వేరేమీ కన్పించలేదు.

అసహనంలో మరిడి సోమయ్య ఉండగానే అతడ్ని ఎంకరేజ్ చేస్తున్న ఎమ్.పి... కేంద్రమంత్రి అయిన శుంభలింగమహాపాత్రో నుంచి ఫోన్ వచ్చింది.

"చెప్పండి పాత్రోజీ...." అన్నాడు మరిడి సోమయ్య విసుగును అదుపు జేసుకుంటూ.

"నువ్వు చెప్పాలి సోమయ్యా, ఏమన్నా సమాచారం తెలిసిందా? అగ్ని వేశాచార్యుని మునిమనవడు తిరిగి వచ్చాడా, ఇంకా లేదా?" అతని ఆత్రుత

అతనిది. వస్తే ఏం తెచ్చాడో తెలుసుకోవాలని, ఆ వెంటనే వాటిని ఎలా స్వాధీనం చేసుకోవాలో ప్లాన్ చేస్తున్నాడు.

కొద్దిక్షణాలపాటు ఏం చెప్పాలో మరిడి సోమయ్యకు అర్థంకాలేదు.

పూర్తి సమాచారం తనకే తెలీదు. ఇప్పుడు ఎవరో అమ్మాయిని వెంట తెచ్చాడు. అంతకుమించి ఏమీ తెలీదంటే శంభులింగ మహా పాత్రో తనని హేళన చేస్తాడు. తన మనుషుల్ని అసమర్థులంటాడు.

ప్రస్తుతానికి చెప్పకపోవటమే మంచిదనిపించింది. "ఇంతవరకు తిరిగి రాలేదనే సమాచారం పాత్రో. నా మనిషితో ఇంతక్రితమే మాట్లాడా. ఇవాళో రేపో రావచ్చనుకుంటున్నారట. వచ్చినట్టు తెలీగానే నేనే ఫోన్ చేస్తాను" అంటూ నమ్మపలికి ఫోన్‌లైన్ కట్ చేశాడు. మరిడి సోమయ్యకు కోపంగా ఉంది.

కోపాన్ని ఎవరిమీద చూపాలో తెలీటంలేదు. ఒక ప్రక్క అగ్నివేశాచార్యుని స్థావరం విశేషాలు పూర్తిగా తెలీకపోగా మరోపక్క తను ఆరంభించిన మహిష శక్తి పూజ ఇంకా పరిపూర్ణం కాలేదు.

ఇప్పుడిప్పుడే తాము నివేదిస్తున్న రక్తాన్నం మహిషశక్తి ఆరగించటం ఆరంభించింది. త్వరలో వశమవుతుందంటాడు అఘోరా. ఆ త్వరలో ఇంకెన్ని రోజులో అర్థంగావటంలేదు. ఆ శక్తి వశమైతేగాని తను అగ్నివేశాచార్యుని ముందు నిలవలేడు.

చరక్ తిరిగివచ్చాడని మాత్రం నమ్మకంగా తెలిసింది. కాబట్టి తన శిష్యుల్లో ఒకడ్ని ఆ ప్రాంతాలకు పంపించటం కన్నా ఇప్పుడు మరోదారి కన్పించటంలేదు. ద్వాపరయుగకాలంనాటి యువతిని ఎలా తీసుకురాగలిగాడు...?

ఆ యువతికి ఏవైనా అతీంద్రియశక్తులున్నాయా? కాలచక్రాల్నే అధిగమిస్తున్నారే... అగ్నివేశాచార్యుడే అసాధారణమైన వ్యక్తి అనుకుంటే... ఈ చరక్ అంతకంటే గొప్పవాడిలా ఉన్నాడే...?"

ఆలోచిస్తూ శిష్యుడు విళంబిని పిలుచుకురమ్మని ఒక శిష్యుడ్ని వెంటనే పంపించాడు.

* * * * *

తను ద్వారక చేరినప్పట్నుంచీ తిరిగి వచ్చేంత వరకు జరిగిన విషయాల్ని చాలా క్లుప్తంగా జేజితాత అగ్నివేశాచార్యునికి చెప్పాడు చరక్.

మిత్రవిందకు తెలుగుభాష అర్థంగాదు కాబట్టి అక్కడ ప్రేక్షకురాలిగా ఉండిపోయింది. వసంతయ్య రంగుల్లో చిత్రించి ఇచ్చిన వస్త్రభాగాన్ని దుస్తుల్లోంచి తీసి కళ్ళ కద్దుకుని దాన్ని జేజితాతకు అందించాడు.

దాన్ని అందుకుని కళ్ళకద్దుకుని "శ్రీకృష్ణా ముకుందా మురారి" అంటూ మాధవుడ్ని తలచుకుంటూ వస్త్రాన్ని విప్పిచూశాడు. ఆయన కనులు ఆనందంతోనూ, భక్తి భావంతోనూ మెరిశాయి. తన్మయుడైపోతూ దాన్ని యథా ప్రకారం మడిచి తిరిగి చరక్ చేతికిచ్చాడు.

"మనం ఎస్టేట్ భవంతికి వెళ్ళేవరకు దీన్ని భద్రంగా నీవద్దనే ఉంచు" అన్నాడు.

"అలాగే జేజిగారు, ముందు మిత్రవింద కోసం ఒక సూట్‌కేసుకావాలి. ఆమె దుస్తులు, నగలు భద్రం చేయాలి. నగల సంచిని అంతా చూడ్డం ఎంత మాత్రం క్షేమంకాదు. నేను దుస్తులు మార్చుకొని ఏమన్నా తినాలి. అలాగే ఓసారి శాటిలైట్‌ఫోనిస్తే హైదరాబాద్ ఫోన్ చేస్తాను. శుశ్రుత ఎలా ఉందో తెలుసుకోవాలి" గడగడా చెప్తున్న మునిమనవడ్ని చూసి నవ్వాడు అగ్నివేశాచార్యుడు.

"ఎందుకాతొందర? శుశ్రుత ఇప్పుడు హైదరాబాద్‌లో లేదు. నీకోసం బెంగపెట్టుకుందని తెలిసి దేవమ్మ ఆమెను మన మున్నలూరి వారి అగ్రహారానికి రప్పించింది. ప్రస్తుతం మన ఇంటనే ఉంది. ఆమె కోసం కంగారుపడాల్సిందేమీ లేదు.

ఎలాగూ ఇంటికెళ్ళబోతున్నాం కాబట్టి ఫోన్ చేయకుండా ఉంటేనే మంచి దనుకుంటాను. మిత్రవింద మూలంగా మీ మధ్య సమస్యలొచ్చే అవకాశం ఉంది" అంటూ నవ్వాడు.

"ఎందుకు జేజిగారు పరిహాసం?" అన్నాడు చరక్ ఉడుక్కుంటూ.

"ఏంలేదురా, మనవంశంలో ఇంతవరకు ఎవరికీ ఇద్దరు భార్యల వారసత్వం లేదు. అది నీ మూలంగా ఆరంభంకానుందని తెలిసేసరికి నవ్వొచ్చింది." అంటూ అగ్నివేశాచార్యుడు ఇంకా ఏమో చెప్పబోతూండగా ఉన్నట్టుండి బయట ఏదో కలకలం విన్పించింది. అదేమిటో తెలుసుకునే ఉద్దేశంతో చరక్ మిత్రవిందలను అక్కడే ఉండమని చెప్పి తను వెంటనే తలుపులు తీసి బయటికెళ్ళి తిరిగి యథాప్రకారం తలుపులు మూశాడు అగ్నివేశాచార్యుడు.

ఆయన బయటికెళ్ళగానే చరక్ వంక చూసింది మిత్రవింద. "ప్రియుడా... శుశ్రుత యనిన ఎవరు? మున్నలూరి వారి అగ్రహారమనిన యా అగ్రహారము ఎచటగలదు? గతములో ద్వారకయందే జెప్పితివి గద. వివాహమైనదని. అగ్రజా నామధేయము గదూ శుశ్రుత?" అంటూ దేవనాగరిలో ప్రశ్నించింది.

ఆ ప్రశ్న వింటూనే – అదిరిపడ్డాడు చరక్. నమ్మలేనట్టు మిత్రవింద వంక చూశాడు.

ఓరి నాయనో, ఈ అమ్మాయి ఏకసంతాగ్రాహి మాత్రమే కాదు. అరుదైన ధారణశక్తి, తెలివితేటలు ఈమె సొంతం. ఎక్కడో ద్వాపరాన ద్వారకాపురి యందు ఉండగా ఓసారి తనకు పెళ్ళయ్యిందనీ, తన భార్యపేరు శుశ్రుత అనీ చెప్పాడు.

ఇప్పుడు జేజీతాతగారు మాటలు వినగానే అది గుర్తుతెచ్చుకొని తనను ప్రశ్నిస్తోందంటే ఇది అసాధారణ విషయం. పైగా మున్నలూరి వారి అగ్రహారం అనేది ఒక ఊరిపేరు అనికూడా ఊహించేసింది.

అవుననన్నట్టు తలూపాడు. మిత్రవింద చేతిని అందుకుని – ప్రేమగా ముద్దాడాడు.

"నీకు శుశ్రుత మీద కోపంగాని, అసూయగాని లేవా?" లాలనగా అడిగాడు.

"అది ఏటికి ప్రియుడా కోపములు, అసూయలు? పురుషులు బహుభార్యలు కలిగియుండుట లోకాచారమే గదా" అంటూ నవ్వింది.

తనింకా ద్వాపరంలో ఉన్నట్టే ఆలోచిస్తోంది. నేటి కలికాలంలో ఒక పెళ్ళాంతోనే వేగలేక చస్తున్నారు పురుషులు. ఇద్దరైతే యాతనే... ఇక బహుభార్య లంటే వాడు చచ్చాడే...

"నాకు అక్క శుశ్రుతను గాంచవలెననియున్నది. ఎప్పుడు పోవుదము" మిత్రవింద ప్రశ్నలతో ఆలోచనల నుంచి బయటపడి చిన్నగా నవ్వాడు చరక్.

"రేపటి దినమున తప్పకపోవుదము. తొందరేల?" అన్నాడు.

"నాకో విషయం బాధగా యున్నది ప్రియుడా!" అంది మిత్రవింద.

"ఏమా విషయం. మీ వారందరినీ వదిలి నాతో వచ్చినందులకా?" అన్నాడు చరక్.

"లేదులేదు. అటులగాదు. తమ్ముడు ధాతయనిన నాకెంతో ఇష్టము. మనము వచ్చు సమయమున వాడు ఇంటలేడు. వాడికి చెప్పనేలేదు. చాలయు

నొచ్చుకొని యుండును" అంది బాధగా. ఆ మాట నిజమేగాని – ఈ విషయంలో తను చెప్పగలిగింది ఏదీలేదు గాబట్టి మౌనంగా ఉండిపోయాడు చరక్.

"ఇచట మనుజులు అటుల జుత్తు కత్తిరించుకొని యుంటిరేమి? నీవు ద్వారక తిరిగి వచ్చునపుడును ఇటులే జుత్తు కత్తిరించుకొని యుంటివిగా" మరో ప్రశ్న అడిగింది మిత్రవింద.

ఆమె ఈ ప్రశ్న అడిగాకగాని తన జుత్తు భుజాల మీద పడుతున్న సంగతి గుర్తురాలేదు చరక్‌కి. ద్వారకలో ఇది పద్ధతి. ఇప్పుడు అర్జెంటుగా తను క్షవరం చేయించుకోకపోతే తనను, తన వేషాన్ని చూసి ఎవరో నాటకాల రాయుడను కుంటారు.

"మిత్రా... మనమిపుడు కలియుగమునకు వచ్చితిమి. అనగా మీ ద్వాపరము నుండి భవిష్యకాలమునకు వచ్చితిమి. ఇచట పురుషులు ఈలాగునే జుత్తు కత్తిరించుకొని క్షురకర్మగావించుట యాచారము" అన్నాడు.

"అటులనా... మరి ఇచట పురుషులును, స్త్రీలును సరిసమానమగు పొడవుందురా? ఇచట గలవారంతా పొడవులేరేమి? వారి దుస్తుల తీరు వేరుగా ఉన్నదేమి?" అంది మిత్రవింద. ఆమె సందేహాలు విని నవ్వుకున్నాడు.

"మిత్రా... ఇచట స్త్రీలకన్నా పురుషులే పొడవుగా ఉందురు. నీవు ఇచటి స్త్రీలకన్నా పొడవు గనుక పురుషులతో సమానమగు పొడవున ఉన్నావు. కలికాలమున మానవులు ఇంతే. ద్వాపరమున మానవుల జీవన విధానము, ఆచారములు వేరు. ఇవి వేరు.

నీవు జూడవలసినవి, ఆశ్చర్యపోవలసినవి ఎన్నో విశేషములుకలవు. తొందరేల" అంటూ నచ్చజెప్పాడు. ఈ లోపల బయట– అగ్నివేశాచార్యుడు వెళ్ళేసరికి– పిల్లాగోవిందపాత్రుడు కోపంతో ఊగిపోతున్నాడు. ప్రక్కన ఆయన కుమారుడు శివరామముకుందపాత్రుడూ ఉన్నాడు. ఎదురుగా–

చేతులు వెనక్కివిరిచి కట్టబడిన స్థితిలో తల వంచుకొని నిలబడున్నాడు డ్రైవరు కాశి. వాడివెనక అప్పన్న, పులికొండయ్యలు ఉన్నారు. పని వాళ్ళూ చేరి పోయారు. అప్పటికే ఒక కోటింగ్ అయిపోయింది డ్రైవర్ కాశికి. "ఛీ. విశ్వాస ఘాతుకుడా. ఎంతో నమ్మకమైన వాడివని నిన్ను నమ్మి దైవంలాంటి గురుదేవుడికి రికమెండ్ చేసి ఇక్కడ డ్రైవరుగా ఉంచాను.

నీకేం తక్కువైందని మన శత్రువుకి ఇక్కడి విషయాలు చేరవేస్తున్నావురా?... మాట్లాడరా" అంటూ ఆవేశం ఆపుకోలేక కాశీని రెండు దెబ్బలు వేశాడు.

అంతలో అగ్నివేశాచార్యులు తమవైపు రావటం చూసి పక్కకు తప్పుకున్నారంతా.

"ఏమైంది? కాశీని ఎందుకు కొడుతున్నారు?' నిశితంగా అందర్నీ చూస్తూ అడిగాడు అగ్నివేశాచార్యుడు. పులికొండయ్య ముందుకొస్తూ–

డ్రైవరు కాశీని ఆయన ముందుకు తోశాడు.

"స్వామీ! మన అప్పన్న ఈడకొచ్చినప్పట్నుంచీ వీడ్ని అనుమానిస్తూనే వున్నాడు. ఇవాళ మాటువేసి పట్టుకున్నాం. ఇదో... ఈ శాటిలైట్ ఫోన్ వీడిదే.

మనదగ్గర నమ్మకంగా ఉంటూనే ఇక్కడి విషయాలన్నీ ఆ మాంత్రికుడు మరిడి సోమయ్యకు చేరేస్తున్నాడు. చరక్‌బాబు తిరిగివచ్చిన సంగతి, ఎవరో అమ్మాయిని వెంటతెచ్చిన సంగతీ అప్పుడే మాంత్రికుడికి ఫోన్‌లో చెప్పేశాడు."

అగ్నివేశాచార్యుడికి ముఖంలో కొద్దిక్షణాలు ఆశ్చర్యం తొంగిచూసింది. అంతకుమించి కొప్పడలేదు. ఆవేశపడలేదాయన. "చాలు... అర్థమైంది" అంటూ డ్రైవరు కాశీవంక చూశాడు. ఆయన ముఖంలోకి చూళ్ళేక తలదించేసుకున్నాడు వాడు.

"ఏరా... వీళ్ళు చెప్తోంది నిజమేనా? తప్పు చేశావా?" అనడిగాడు. అంతే– ఒక్కసారిగా భోరున ఏడుస్తూ – ఆయన పాదాల ముందు మోకాళ్ళ మీద కూచుండిపోయాడు. నోరువిప్పి ఒక్కమాటా మాట్లాడలేదు. వాడు ద్రోహం చేశాడని అర్థమైపోతోంది.

"ఇక వీడితో మాటలనవసరం గురువుగారూ. వీడ్ని క్షణం కూడా ఉంచ కూడదు. పంపించేద్దాం" అన్నాడు ఆవేశంగా గోవింద పాత్రుడు. శాంతంగా నవ్వాడు అగ్నివేశాచార్యుడు. "గోవిందా... వీడు తప్పు చేశాడని మనమూ తప్పు చేయకూడదు గదా.

నీ ఆవేశాన్ని తగ్గించు. ఇక వీడ్నేమీ అనవద్దు. వీడు చేసిన తప్పు కన్నా నాకు వీడుచేసిన, సేవలే అధికం. ఆపైన శత్రువని తెలిశాక దగ్గరే ఉంచాలి. దూరంగా నెట్టకూడదు. వీడు మనతోనే ఉంటాడు. కాని శిక్ష అనుభవించక తప్పదు" అన్నాడు.

అగ్నివేశాచార్యుని నిర్ణయం విని తెల్లబోయారంతా. అంత పెద్ద తప్పు చేసినా ద్రయివరు కాశీని పల్లెత్తు మాట అనలేదాయన. ఆ మాటలు విని పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు కాశీ. "మీరే శిక్ష వేసినా భరిస్తాను స్వామీ. పొమ్మనకండి. ఇక జీవితంలో ఎప్పుడూ మీకు ద్రోహం చేయను" అంటూ ఏడ్చేశాడు.

అప్పన్నను పిలిచి వాడి కట్లువిప్పి లేపి నిలబెట్టించాడు అగ్నివేశాచార్యుడు.

"కాశీ ఇప్పటినుండీ ఆరుమాసములవరకు ఎవరికీ ఏమీ చెప్పకుండా నీ నోటి మాట తీసేస్తున్నాను. ఎవరికీ ఏ సమాచారం వ్రాసి చూపకుండా నీ కుడిచేతి బొటనవ్రేలు చచ్చుబడేలా చేస్తున్నాను.

ఇదే నీకు విధించే శిక్ష. నీ వృత్తికి ఏ ఆటంకమూ రాదు. ఎప్పటిలా పనిచేసుకో" అంటూ నీటిని అభిమంత్రించి వాడిమీద చల్లాడు. అంతే–

కాశీకి నోటి మాట పడిపోయింది.

కుడిచేతి బొటనవేలు చచ్చుబడిపోయింది.

అందరివంక గంభీరంగా చూస్తూ– "ప్రతీకారం కన్నా క్షమాగుణం గొప్పది. కాశీ ఎప్పటిలాగే మనతో ఉంటాడు. ఎవరూ వీడ్ని ఏమీ అనకూడదు. కించపరచకూడదు. మనం సాయంకాలం కోరుకొండ ఎస్టేట్ భవంతికి వెళ్ళిపోతున్నాం. ఆ ఏర్పాట్లలో ఉండండి" అంటూ అందర్నీ హెచ్చరించి వెనుతిరిగాడు.

కాశీ వినయంగా ఆ శిక్షకు తలొగ్గి వెళ్తున్న అగ్నివేశాచార్యుని పాదాలకు నమస్కరించాడు.

ఆ తర్వాత తన శాటిలైట్ ఫోన్‌ని అందరిముందూ నేలకు విసిరి కొట్టి ధ్వంసం చేశాడు.

*　　*　　*　　*　　*

అగ్నివేశాచార్యుని పూజామందిరం.

అక్కడ అగ్నివేశాచార్యునికి ఒక పక్కగా మిత్రవింద – చరక్‌లు జంటగా కూచున్నారు. వారిరువురూ ద్వాపరం నుండి తిరిగివచ్చిన ఈ రోజు శుభప్రదమైన గురువారం. అందుకే ఆ ఇరువురి చేత శ్రీకృష్ణబలరామ ప్రభువులకు ప్రత్యేక పూజ చేయిస్తున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఇప్పుడు చరక్ చక్కగా క్రాపు చేయించుకుని ప్యాంటు, షర్టు ధరించి ఎప్పటిలా ఉన్నాడు.

మిత్రవింద తలారా స్నానంచేసి జుత్తు ముడివేసుకుని పొడిదుస్తులు ధరించివుంది. అసలు ఆమెచేత స్నానం చేయించడానికి చరక్ నానా అవస్థలు పడ్డాడు. ఆమె ఒంటిమీది నగలు వొలిచి చరక్‌కి ఇవ్వడానికే అరగంట సమయం పట్టింది.

మెడలోని రత్నహారాలు, భుజకీర్తులు, నడుం వడ్డాణం, నడుం వద్ద వేలాడు పక్కగొలుసు, పాపిట పిందె, చెంపకీర్తులు, ముక్కెర ఇలా ఒకటా రెండా, వాటన్నిటినీ ఒక టవల్లో చుట్టి ఆమెను లోనకు పంపిస్తే వెళ్ళినట్టే వెళ్ళి వెంటనే బయటికొచ్చేసింది.

"ప్రియుడా... ఏమిది స్నానశాల ఇంత చిన్నదిగా యున్నది? జలకమునకు పన్నీరును పుష్పములును లేవా? పూసుకొనుటకు పాలమీగడ ఏది? పసుపు ఏది? నలుగు సున్నిపిండి ఎక్కడ? తలస్నానమునకు నురగకాయలు లేవాయె. తల స్నానమెటులజేతును?" అంటూ నస ఆరంభించింది.

లోన సబ్బుంది, షాంపూ ఉంది. కావలసినన్ని చన్నీళ్ళు ఉన్నాయి. కాని ఆమెకు సబ్బులు, షాంపూలు తెలీదాయె. ఆమెకు వాటినెలా ఉపయోగించాలో చెప్పి ఇప్పటికిలా కానిమ్మని లోనకు పంపించేసరికి చాలురా దేవుడానిపించింది.

ఒక సూట్‌కేస్‌లో మిత్రవింద నగల సంచీ, ఆమె దుస్తులు అన్నీ సర్దిపెట్టి తాళం వేశాడు.

పూజామందిరంలో హోమగుండం రగల్చబడింది. అగరుధూపం, సాంబ్రాణి పొగలతో మందిరమంతా సువాసనలు నిండి భక్తిభావం నింపు తున్నాయి.

మందిరం తలుపులు మూసివున్నాయి. పిల్లా గోవిందపాత్రుడు, ఆయన కొడుకు శివరామ ముకుందపాత్రుడునే లోనకు పిలిచారు.

తను తెచ్చిన వస్త్రభాగాన్నీ చరక్ మిత్రవిందకివ్వగా ఆమె దాన్ని విడదీసి కళ్ళకద్దుకొని పూజాపీఠం మీద ఉంచింది. ఆమెచేతనే ఆ వస్త్రానికి పసుపుబొట్లు మూలలందు పెట్టించాడు అగ్నివేశాచార్యుడు.

ఆ వస్త్రభాగం మీద చిత్రించబడున్న శ్రీకృష్ణులవారి నిజరూపానికి పక్కన గల శమంతకమణి, పాంచజన్యం, కిరీటం, మురళీలను చూసి ముగ్ధులైపోతూ భక్తితో నమస్కరించారంతా.

గోవింద పాత్రుడు, శివరామముకుందపాత్రుడు తమ కళ్ళను నమ్మలేక పోతున్నారు. ఈ పూజలో పాల్గొనటం, ఆ వస్త్రభాగాన్ని చూడటం తమ అదృష్టంగా భావించారు.

అగ్నివేశాచార్యుడు తాను పక్కనుండి మిత్రవింద, చరక్‌లచేతనే ఈ పూజ చేయించడానికి తగిన కారణం ఉంది. చరక్‌ది ద్వారకతో గతజన్మ అనుబంధం కాగా మిత్రవింద అక్కడి యువతి. నేరుగా అందర్నీ చూసిన యువతి, ఆమె రెండు యుగాలకు వారధిలాంటిది కాబట్టి ఆమె చేతనే పూజ నిర్వహింపజేశాడు.

పూజ ముగిసేపరికి సాయంత్రం మూడుగంటలైంది. తర్వాత నుంచి స్థావరాన్ని మూసి ప్రయాణ ఏర్పాట్లకు హడావుడి మొదలైంది.

ఈసారి మిత్రవిందకు నగలన్నీ ఇవ్వలేదు చరక్. సింపుల్‌గా మెడలో ఒక హారం, చెవిదిద్దులు, ముక్కెర, ఉంగరాలు మాత్రం ధరింపజేశాడు. సామాన్లన్నీ కారు జీపుల్లోకి సర్దటం అయిపోయింది. అగ్నివేశాచార్యుడు తమ స్థావరాన్ని ఎప్పటిలా అష్టదిగ్బంధనం చేసేశాడు. కారుడిక్కీలో తమ సూట్‌కేస్‌లు ఉంచారు.

చరక్, మిత్రవింద అగ్నివేశాచారుడు, గోవింద పాత్రుడు, శివరామము కుందపాత్రుడు అంతా కారులోనూ, మిగిలినవాళ్ళు జీప్‌లోనూ ప్రయాణానికి సిద్ధమయ్యారు. అయితే వాహనాలవద్దకు రాగానే కారు జీప్‌లను వింతగానూ, ఆశ్చర్యంగానూ చూడనారంభించి మిత్రవింద, "ప్రియుడా... ఇవి ఏమి రథములు. వీటినిలాగు జంతువులేవి? అశ్వములా, వృషభములా?" అనడిగింది సందేహంగా.

"ఓరినాయనో... దారిపొడుగునా ఇలాగే నన్ను ప్రశ్నలతో బుర్రతినేలా ఉంది. జేజిగారూ, మీరైనా తన సందేహం తీర్చండి" అంటూ అరిచాడు చరక్. ఆమె ప్రశ్నలు, చరక్ విసుగు విని అగ్నివేశాచార్యుడు, పిల్లాగోవింద పాత్రుడు నవ్వుకున్నారు.

"పోరా భడవా... తనను తెచ్చుకుందే నువ్వు. సందేహాలు మేం తీర్చాలా. నీ తంటాలు నువ్వుపడు" అంటూ కారుడోర్ తెరిచి లోన కూచున్నాడు అగ్నివేశాచార్యుడు నవ్వుతూ. ఈ లోపల – వెనుకవున్న జీప్ ఇంజను స్టార్ట్ చేశాడు డ్రైవరు కాశీ. ఒక్కసారిగా పెద్ద శబ్దం చేస్తూ స్టార్టయింది ఇంజను. అంతే–

ఆ శబ్దం వింటూనే కెవ్వున అరిచి చరక్‌ను వాటేసుకుంది మిత్రవింద. ఏమైందో అర్థంగాక కంగారుపడి జీప్ ఇంజను ఆపేశాడు కాశీ. కారు ఎక్కిన అగ్నివేశాచార్యుడు కూడా కారు దిగిపోయాడు.

మిత్రవింద ఎందుకు అంతగా భయపడిందో మొదట చరక్‌కి అర్థం కాలేదు. కాసేపు అయోమయ పరిస్థితి నెలకొందక్కడ. ఆమె పిరికిది కాదనీ, చాలా ధైర్యంగల యువతి అని చరక్‌కు తెలుసు.

శత్రువుల దాడిని తిప్పికొట్టడంలో ద్వారకాపుర స్త్రీలు, పురుషులతో సమంగా పోరాడే పోరాటపటిమ వారిది. అలాంటి మిత్రవిందకి భయమా...

ఆమె వణకటం గమనించి, వెన్నుతట్టి జుత్తు నిమిరి ప్రేమగా కళ్ళల్లోకి చూశాడు.

"ఏమైంది మిత్రా... ఎందులకింత బేలతనము? ఏల భయము?" అంటూ లాలనగా అడిగాడు.

"ఇచట శార్దూల ఘర్జన వినవచ్చినది. ఈ వనమున సింహ, శార్దూలములు సంచరించుచున్నవి. వాటిని సంహరించుటకు మా వద్ద ధనుర్బాణములు గాని, బరిసెలుగాని లేవాయె. మీరు ఆ ఘర్జనలు వినలేదా?" అంటూ దేవనాగరిలో తన భయానికి కారణాన్ని వివరించింది మిత్రవింద.

అప్పటిగ్గాని ఆమె భయకారణం అర్థంకాలేదు. జీప్ ఇంజను స్టార్టింగ్ శబ్దం విని పులి గాండ్రిపు అనుకొని భయపడిపోయింది అంతగా.

అది విని అగ్నివేశాచర్యుడు, గోవిందప్రాతుడు కూడా నవ్వకుండా ఉండ లేకపోయారు.

"మిత్రా, నీ భయము అర్థరహితము సుమా. ఈ వనమున క్రూర మృగములు లేవు. నేనుండగా భీతిల్లపనియేమి? అది శార్దూల ఘర్జన గాదు. వాహన యంత్ర శబ్దము. ఈ వాహనములు జంతువులు లేకయే యంత్రసాయమున పరుగెత్తును.

భీతిల్లకుము. రమ్ము చూపెద" అటూ వెనుతిరిగి కాశీవంక చూస్తూ "ఒరే కాశీ, మా కారు బయలుదేరేవరకు జీప్ స్టార్ట్ చేయకురా నీకు పుణ్యముంటుంది" అనరిచాడు. అలాగే అన్నట్టు తలూపాడు కాశీ.

అప్పటికి మిత్రవింద భయం నుండి కాస్త తేరుకుంది. జంతువులు లేకుండా వాహనం పురుగెత్తుటేమి? ఇది ఏమివిచిత్రము. ఇది ఏమివింత? తనలో తను ఆశ్చర్యపోతోంది.

*　　*　　*　　*　　*

చరక్ కారు ఫ్రంట్ డోర్ తెరిచి ఆమెను ముందు సీట్లో కూర్చుండజేశాడు. తను అటు తిరిగి వచ్చి డ్రైవరు సీట్లో కూర్చున్నాడు. వెనక సీట్లో అగ్నివేశాచార్యుడు, గోవిందపాత్రుడు, శివరామ ముకుంద పాత్రుడు కూర్చుని డోర్ మూశారు. కారు ఇంజను స్టార్ట్ చేశాడు చరక్.

మిత్రవిందకు అమితాశ్చర్యంగా ఉంది. "భయపడకు మిత్రా, దీన్ని కారు అంటారు. పరుగెత్తుతుంది చూడు" అంటూ కారును ముందుకు దూకించాడు. కారు ముందు కదిలాక జీప్ స్టార్ట్ చేసి అనుసరించాడు డ్రైవర్ కాశీ.

మిత్రవింద ముఖంలోని విభ్రాంతినీ, విస్మయాన్నీ సృష్టంగా చూస్తున్నా రంతా. ఆమె చరక్ భుజాన్నీ వదలటంలేదు. వెనక్కుపోతున్న అడవినీ, చిన్న చిన్న అడవి జంతువులను పసిపాపలా చూస్తోంది.

"మిత్రా...." గోముగా పిలిచాడు చరక్.

"ఊఁ" అంది మిత్రవింద.

"ఈ వాహనము ఎటులున్నది?" అడిగాడు.

"అద్భుతము... చచ్చింది గొర్రె" అంది అచ్చతెలుగులో మిత్రవింద. ఆ పలుకులు విని ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారంతా.

తెలుగు భాషేతెలీని అమ్మాయి అచ్చ తెలుగులో "అద్భుతముగా చచ్చింది గొర్రె అంటే అందరికీ షాకే. చరక్ వింతగా తనను చూడ్డం చూసి– "ఏల నటుల వీక్షించుట? చచ్చింది గొర్రి యనిన తెలుగు భాషయందు అంతయూ బాగున్నదని అర్థము అని ద్వారకలో నీవేగదా నుడివితివి?" అంది గడుసుగా.

ఆ మాటలు వినగానే ఏం జరిగిందో ఊహించి వెనకసీట్లోని అగ్ని వేశాచారుడు, మిగిలిన వారు పకపకా నవ్వారు. తలపట్టుకున్నాడు చరక్.

ఎప్పటిమాట! ఎంతటి ధారణశక్తి! ఈమె బుర్రలో ఉన్నది మెదడా లేక కంప్యూటరా అన్పించింది.

"ఏరా చరక్. అమ్మాయితో అబద్ధాలు కూడా చెప్పావన్నమాట. అమ్మా మిత్రవిందా" అంటూ ఆమెతో దేవనాగరిలో చచ్చింది గొర్రి అనేమాట

ఊతపదమనీ, ఆ మాటకి అర్థం అంతా బాగుందని కాదు, గొర్రె చచ్చిందని అర్థం" అంటూ వివరించగానే మిత్రవిందకూ నవ్వాగ లేదు.

"చతురా... నాతో చతురాడినావుగదూ, మీ భాష తెలియదనేగా, నేనునూ మీ భాష అభ్యసించి అపుడు జెప్పెద" అంది గడుసుగా.

దారిలో కరెంటు స్తంభాలమీద తీగలను చూసి అవి ఏమిటి అంటుంది. ఆకాశంలో విమానం పోతుంటే చూసి దేవతలు విమానయానం చేస్తున్నారంటుంది. కోరుకొండ ఊరు చేరేసరికి అక్కడ గోడలమీద సినిమా వాల్‌పోస్టర్లను చూసి "అది ఏమి? ప్రాకారములపై చిత్రములు కన్పించుచున్నవి?" అంటుంది.

ఇలా దారిపొడవునా పసిపిల్లలా చరక్‌ను ప్రశ్నిస్తూనే ఉంది మిత్రవింద. హైవేలోకి వచ్చేసరికి కార్లు, బస్సులు, మోటార్‌సైకిళ్ళు, ఆటోలు, సైకిళ్ళు, రిక్షాలు అన్నిటినీ విభ్రాంతురాలై చూస్తూనేవుంది.

చివరకు ఇక్కడ మనుషులంతా పొడుగులేరేమి? ఆరోగ్యంగా, బలంగా లేరేమి? స్త్రీలు మరీ పొట్టిగా ఉన్నారేమి అంటూంటే – కొన్నిటికి అగ్నివేశాచార్యులు బదులిచ్చి చరక్‌కు శ్రమతప్పించాడు. కనుచీకటి పడకముందే అంతా ఎస్టేట్ భవంతికి చేరుకున్నారు.

* * * * *

ఆ రాత్రి!

గాలి ధారాళంగా వీచే కార్నర్ రూమ్‌లోని మెత్తటి పరుపుమీద ఆముదం దీపం కాంతిలో ప్రశాంతంగా నిద్రపోయింది మిత్రవింద.

ఆమె నిద్రపోయేవరకు చరక్ చేతిని వదల్లేదు. పక్కనే కూర్చున్నాడు. ఆమె మామూలు భోజనం తినదని తెలుసు. ఆమె కోసం జొన్నరొట్టె, పట్టుతేనె, చిక్కటి పాలు, పండ్లు ఏర్పాట్లుచేశారు.

కాని ఆమె మాత్రం పట్టుతేనెలో జొన్నరొట్టె ముంచుకుతిని పాలుతాగి, పడుకుంది.

మిత్రవింద నిద్రపోయాక తలుపులు దగ్గరగా మూసి బయటికొచ్చాడు చరక్. అప్పటికే కిందిగదుల్లో అంతా నిద్రపోయారు. జేజితాత అగ్నివేశాచార్యుని గదిలోకి వెళ్ళేసరికి ఆముదం దీపం కాంతిలో ఏదో గ్రంధం తిరగేస్తూ మెలుకూగానే ఉన్నాడాయన.

వచ్చి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

మునిమనవడ్ని చూడగానే గ్రంధాన్ని మడిచి పక్కన పెట్టాడు అగ్ని వేశాచార్యుడు. మనవడినే తదేకంగా చూడసాగాడు.

"ఏమిటి జేజిగారూ?" అడిగాడు చరక్.

"ఏం లేదురా. నెలా పదిహేనురోజులు ద్వారకలో ఉండివచ్చావు. ఆ బలరామకృష్ణుల్ని ప్రత్యక్షంగా చూశావు. ఎంత అదృష్టవంతుడివి. వయసులో పెద్దవాడినైపోయానుగాని లేదంటే పాదాలకు మొక్కాలనుందిరా" అన్నాడు.

"అంత మాటనకండి జేజిగారూ. ఇది మీరు నాకు ఇచ్చిన అదృష్టం. మీ ఆశయసాధన నా లక్ష్యం. నాకు ద్వారకతో గతజన్మ సంబంధం ఊహించని మలుపు. నాకేకాదు, గతజన్మలో నేను చతురుడిగా ఉన్నప్పుడు కూడా నా జేజి తాతగారు మీరే. అప్పుడు మీ పేరు అగ్నిభట్టారకులవారు.

మరో విషయం కూడా మీకు చెప్పాలి. మన మున్నలూరివారి వంశమూలాలు కృష్ణాజిల్లా మున్నలూరి గ్రామంలో ఉన్నాయనుకున్నాం కాని కాదు, మన వంశ మూలాలు ద్వాపరంలో ద్వారకలో ఉన్నాయి.

మన వంశమూలపురుషుడు శుశ్రుత మహర్షులవారు. అనువంశికంగా మీరూ, నేనూ, బహుశ మన కుటుంబాల్లోని మిగిలినవారు కూడా ఆయుర్వేద వైద్య కుటుంబాల్లోనే జన్మిస్తూ రావటం విశేషం.

చతురునిగా నా తండ్రి వల్లభాచార్యుడు గొప్ప ఆయుర్వేద వైద్యుడు. బలరామ ప్రభువుల ఆస్థాన వైద్యుడు కూడా. ఆయన చరక్ మహర్షులవారి శిష్యుడు. చరక్ మహర్షులవారి దర్శన భాగ్యం కలగలేదు. అదే కించిత్తు బాధగా ఉంది" అన్నాడు.

తను గతజన్మలో చతురుడిగా ఘనత వహించిన వైద్యుడన్న విషయాన్ని అగ్నివేశాచార్యునికి చెప్పలేదు. ఆయన ఎంత చెప్పినా వైద్యవృత్తిని అలక్ష్యం చేసి తను కంప్యూటర్స్‌కి వెళ్ళాడు. ఇప్పుడా విషయం చెపితే మళ్ళీ వైద్యం నేర్చు కోమంటాడని భయం.

చరక్ మాటలు విని-చిన్నగా నిట్టూర్చాడు అగ్నివేశాచార్యుడు. "అంతా ఈశ్వరేచ్ఛ. ఇంతకీ ఇన్ని రోజులున్నావు గదా. కుశస్థలి, ద్వారకాపురి రెండూ ఒకటేనా?" అడిగాడు.

"కాదు జేజిగారు. రెండూ ఒకటి కాదు, వేరువేరు. కాని దూరంలో మాత్రం లేవు.

చాలా దగ్గర ప్రాంతాలు. రెండూ ఒకటే అనుకోవడానికి తగిన కారణం కూడా ఉంది."

"ఏమిటా కారణం?" కుతూహలంగా అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"కుశస్థలి అంటేనే కుశుడు వశించిన భూభాగం లేదా దర్భపడిన భూభాగం జేజిగారూ.

అంతా అనుకుంటున్నట్టు పూర్వద్వార అనే బెట్ ద్వారక దీవే కుశస్థలి. అయితే దాన్ని కుశద్వీపం అనేవారుగాని కుశస్థలి అనరు.

ఉత్తరంవైపు గోమతీ నది, పశ్చిమంవైపు సముద్ర తీరం కలిగిన భూభాగమే కుశస్థలి. ఇంకా చెప్పాలంటే మీరు వెళ్ళినప్పుడు కొంత ఎత్తయిన చోట బాటమీద నిలబడి ద్వారకను చూశాననన్నారుగదా. ఆ మార్గం హస్తినకు పోయే రాజమార్గం.

అక్కడికి కాస్త ఎగువన అటవీ భాగంలో పాడుపడిన ఊరుంది. అదే కుశస్థలీ నగరం.

మొదట ఈ కుశస్థలీ నగరాన్నే పునర్నిర్మించి 'ద్వారవతి' అన్నారు. అనార్థుడి కాలంనుంచే దీన్ని కుశస్థలియనీ, ద్వార వతియనీ పిలిచేవారు.

కాబట్టి అక్కడివరకు 'కుశస్థలి' అన్నా. 'ద్వారవతి' అన్నా ఒకటే. కాని ఆ తర్వాత దీన్ని కూడా వదిలి తీరంలోని రైవతక పర్వతం చెంత రెండో ద్వారవతి నిర్మాణం జరిగింది. అదీ సురక్షితం కాదనుకున్న తర్వాత సముద్రుని అడిగి స్థలం తీసుకుని ద్వారకా నగర నిర్మాణం జరిగింది.

నాలుగు పక్కలా సముద్రం ఉండి మధ్యలో గొడుగులా విస్తరించివున్న దీవి. తీరాన్ని అనుసంధానం చేస్తూ సముద్రానికి అడ్డంగా విశాలమయిన రాతిబాట నిర్మాణం ఉంది. తీరానికి మైలు దూరంలో ఉందా దీవి.

తీరం నుండి దీవి మధ్యభాగానికి వెళ్ళేకొద్దీ ఎత్తు తెలుస్తుంది.

మధ్యలోని ఎత్తయిన ప్రదేశంలో శ్రీకృష్ణులవారి కోట రాచనగరు నిర్మాణం జరిగింది.

అంత ఎత్తు ప్రదేశంలో ఉన్నందునే కోట పైభాగంలోని మణిమయ స్వర్ణకాంతులు, ధనవంతుల భవంతులమీది స్వర్ణకాంతులు పగటివేళ, రాత్రి

వెన్నెట్లో కూడా ధగధగాయమానంగా ప్రకాశిస్తూ సముద్ర జలాల్లో ప్రతిఫలించి బడబాగ్ని పైకి లేస్తోందా అనే భ్రమ కలుగుతోంది.

నగరాన్ని చుట్టి ఏడు ప్రాకారాలున్నాయి. కోట నుండి నగరంలోకి ఏడు రాజమార్గాలున్నాయి.

వీటిలో ఒకటి నగరాన్ని దాటి తూర్పుగా ఏడో ప్రాకార వాకిలి నుండి రాతి బాటమీదుగా తీరభూభాగంవైపు పోతోంది.

ఆ మార్గం హస్తినాపురం వరకు పోతోంది. ఈ మార్గంలో ఆలమందలు, రథాలు, అశ్వాలు మనుషుల రాకపోకలతో ఎప్పుడూ సందడిగా ఉంటుంది. ఇక ద్వారకా దీవిపై శత్రువుల ముట్టడి జరిగినా నగర ప్రజలకు ఆహార నిల్వలకు కొదవలేదు.

దీనిమీదే పంటపొలాలు, పండ్లతోటలు పుష్కలంగా ఉన్నాయి. అక్కడ పురుషుల సరాసరి ఎత్తు 14 అడుగుల పైమాటే. స్త్రీలు అరడుగులు ఆపైన ఎత్తుంటారు....” అంటూ తను చూసిన విషయాల్ని చరక్ విరిస్తూంటే ఆసక్తిగా విన్నాడు అగ్నివేశాచార్యుడు. వెంటనే ఆయన నోటివెంట ఒక శ్లోకం వెలువడింది.

శ్లో॥ పురీమ్ ద్వారవతీ నామ సంప్రాప్తమ్ యా కుశస్థలి।
అనార్థో నామ దేశోబ్యూన్నగరీ చ కుశస్థలి॥

“ఇది మత్స్య పురాణంలోని శ్లోకం. దీని ప్రకారం యాదవులు ద్వారవతీ అనే పురాన్నీ లేదా కుశస్థలినీ సంప్రాప్తమే అంటే చేరుకున్నారని అర్థం.

ఇంకా ఏం చెప్తోందంటే అనార్థుడనే వాడి దేశానికి చెందిన నగరం కుశస్థలి అంటోంది. దీని ప్రకారం మొదట యాదవులు చేరుకున్న కుశస్థలీ నగరమే ‘మొదటి ద్వారవతి’ అని అర్థమవుతోంది” అన్నాడు.

చరక్ విభ్రమంతో జేజితాతను చూశాడు.

తను చదివిన మత్స్యపురాణంలోని శ్లోకాన్ని గుర్తు తెచ్చుకుని చెప్పటమంటే ఈ వయసులో కూడా ఆయన ధారణశక్తి ఎంత ఉన్నతంగా ఉందో అర్థమవుతోంది.

“జేజిగారూ, మీరు ఎప్పుడో చదివిన పురాణాలు, ఇతిహాసాల శ్లోకాలు ఇంకా గుర్తున్నాయా?” అనడిగాడు నమ్మలేనట్టు.

"మేము ఆ కాలం వాళ్ళమురా నాయనా, వేదాలే కంఠోపాఠంగా చదివిన వాడ్ని. ఇవి గుర్తుండవా. ఇదే విషయాన్ని వాయుపురాణం ఏం చెప్తోందంటే-

అనార్థో విషయో యస్య పురీ చాపి కుశస్థలీ"

ఇంకా

"ఆ జగామ యువ చైవ స్వామ్ పురీమ్ యాదవైర్వుతామ్,
కృతామ్ ద్వారవతీ నామా బహు ద్వారమ్ మనోరమామ్॥

"మరి ఈ విషయంలో వీరి వంశం ఏం చెప్తోంది జేజిగారూ?" కుతూహలంగా అడిగాడు చరక్.

"ద్వారకమ్ సమాసాద్యా వారి దుర్గమ్ జనార్థనా" అంటోంది. అంటే వాయుపురాణం ప్రకారం అనేక ద్వారములు కలిగి మనోహరంగా ఉండేది ద్వారవతీ నగరం.

హరివంశం ద్వారకను జలదుర్గం అంటోంది. ఇంకా ఏం చెప్తోందంటే **"సాగరా నుప విపులామ్ ప్రాగుదక ప్లవ షితలామ్ సర్వతో దధి మధ్యస్థామ్ అభేద్యమ్ త్రిదశోరపి."**

అంటే సాగరాన చుట్టూ సముద్ర మధ్యంలో మూడు ప్రక్కలా అభేద్యమై వుంది అంటోంది.

అంటే నీవు చెప్పినట్టే సముద్ర మధ్యంలో మూడు ప్రక్కలా సముద్రం, నాలుగో పక్క తీరానికి మార్గం ఉన్నందున మూడు ప్రక్కలా అభేద్యమంటోంది. నీవు చెప్పిన విషయాలు యధార్థమని ఈ శ్లోకాల వలన అర్థమవుతోంది.

ఇంకా హరివంశంలో **"తత్ర-రైవతకో నామా పర్వతో నాతి దూరతవో"** అనుంది.

అంటే రైవతక పర్వతం ద్వారవతికి సమీపంలో ఉందనేగా అర్థం అని చెప్పి కాసేపు కళ్ళు మూసుకుని ఏవో గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేశాడు అగ్ని వేశాచార్యుడు. వెంటనే ఇలా పలికాడు.

"మహాపురీమ్ ద్వారవతీమ్ పంచాసాద్భిర్ముఖ్యోర్యుతమ్।
ప్రవిష్టో ద్వారకామ్ రమ్యామ్ భాసయన్తామ్ సమస్తతః॥
అప్రమేయామ్ మహోత్సథామ్ మహాగాధ పరిప్లవామ్।

ప్రసాదావర సంపన్నామ్ శ్వేత ప్రాసాదశాలి నీమ్।।
తీక్ష్ణ యంత్ర శతఘ్నిభిర్యంత్ర జాలై సమన్వితామ్।
ఆయసైచ్ఛా మహాచక్ర ద్రర్సా ద్వారకోమ్ పురీమ్।।
అష్టోర్ధ సహస్రాణి ప్రాకారే కిలికిణి కినః।
సముచిత పతాకాని యథా దేవపురే తథా।।
అష్టయోజన విస్తీర్ణామ్ చలామ్ ద్వాదశాయతామ్।
ద్విగుణో పనివేశామ్ చ దదీర్య ద్వారకామ్ పురీమ్।।
అష్టమార్గా మహాకక్ష్యామ్ మహాషోడశ చత్వరామ్।
ఏవమ్ మార్గ పరిక్షిప్తామ్ సాక్షాదుశన, సాకృతామ్।।
ఊహానామంతరా మార్గాహ్వసప్తచైవ మహా పథమ్।।

కాబట్టి నువ్వు చెప్పిన విషయాల్ని ఈ శ్లోకాలు బలపరుస్తున్నాయి. ఇంచు మించుగా వర్ణనలూ సరిపోయాయి. కాబట్టి ఇక ఈ విషయాల్ని పక్కన పెడదాం. రేపు మనం ఇంటికి వెళ్తున్నాం. నీ ఉద్దేశమేమిటో చెప్పు" అన్నాడు.

ఉద్దేశం చెప్పమనగానే చరక్‌కి– ఎక్కడ లేని నీరసం ముంచుకొచ్చింది. మరొకప్పుడైతే భార్య శుశ్రుతను చూడబోతున్నందుకు ఎగిరి గంతేసేవాడు. ఇప్పుడా పరిస్థితి లేదు. మిత్రవిందను ఎక్కడ ఉంచాలి? శుశ్రుతకు ఇప్పుడే ఈ విషయం తెలిస్తే ఎలా స్పందిస్తుందో తెలీదు.

"అదే ఆలోచిస్తున్నాను జేజిగారూ! కొద్దిరోజులు మిత్రవిందను ఇక్కడే ఉంచితే బాగుంటుందనుకుంటున్నాను" అన్నాడు.

"ఉంచి? ఇంటికి ఇక్కడికి షటిల్ సర్వీసు చేస్తావా? అయినా నిన్నొదిలి మిత్రవింద ఉంటుందా? చూస్తున్నాగదా... అలాంటి పిచ్చి ఆలోచనలు చేయకు.

ఇక్కడ ఆ అమ్మాయికి సరైన తోడు ఎవరూ అమ్మాయిలు లేరు. పైగా తన అలవాట్లు, పద్ధతులు వేరే. అంచేత వెర్రిమొర్రి ఆలోచనలు చేయక రేపు మనతో బాటు మిత్రవింద వస్తుంది. ఇప్పుడు తనూ నా మనవరాలైంది. ఆ పిల్లకు పెద్దదిక్కు నేనే.

తనకి న్యాయం చేయాల్సిన బాధ్యత నామీద ఉంది. ఆపైన ముఖ్య విషయం ఏమంటే నువ్వీసారి వెళ్ళి నేనుకోరిన నాలుగు లేదా వాటిలో కొన్ని

తెచ్చేలోగ మన ఎస్టేట్‌లో నాలుగు ఎకరాలు చెట్లు నరికించి ఆలయ నిర్మాణానికి శంఖుస్థాపన చేయటం పని మొదలు పెట్టడం కూడా జరుగుతుంది.

తొలిపూజ మిత్రవింద ద్వారా జరగాలి. పిదప ఆ ఆలయంలోనే మీ వివాహం. అంతవరకూ జాగ్రత్తగా ఉండు. అర్థమైందిగా" అంటూ మనసులో మాట చెప్పాడు అగ్నివేశాచార్యుడు.

తనకి అర్థమైంది. కాని– మిత్రవిందకూ అర్థం కావాలిగా. "తాతగారూ నన్ను ఇరుకునబెట్టడం మీకు అలవాటైపోయిందండీ" అంటూ మనసులోనే ఉడుక్కుంటూ గంగిరెద్దులా తల వూపాడు జేజి తాతముందు చరక్.

అప్పటికే అర్ధరాత్రి సమీపించటంతో లేచి ఎవరి గదిలోకి వారు చేరుకుని నిద్రకుపక్రమించారు.

* * * * *

మరునాడుదయమే ముందుగా పిల్లా గోవింద పాత్రుడు. పిల్లాశివరామ ముకుంద పాత్రులిరువురూ ఎస్టేట్ భవంతివద్దే ఉన్న తమకారులో ఊరికి బయలు దేరారు.

అప్పటికింకా మిత్రవింద నిద్రలేవలేదు. అగ్నివేశాచార్యుడు, చరక్‌లు వారికి వీడ్కోలు చెప్పి పంపించాక మిగిలిన పనివాళ్ళను కూడా వారికివ్వాల్సిన జీతభత్యాలకన్నా అదనంగానే ముట్టజెప్పి, సంతోషపరిచి వారిస్వస్థలాలకు పంపించేశారు.

పులికొండయ్య వీరితో రాలేదు. అడవిలోని తమ గూడానికి నిన్నే వెళ్ళి పోయాడు. వెళ్ళినా స్థావర ప్రాంతాన్ని ఓ కంట కనిపెట్టి వుండటం వాడి డ్యూటీ. ఇక డ్రైవరుకాశీ, అప్పన్న ఇద్దరే వారితో మిగిలారు.

కొంతసేపటి తర్వాత చరక్ జేజితాతగారి గదిలోకి వెళ్ళేసరికి ఆయన ద్వారకాపురి స్వర్ణ నాణేలను పరిశీలిస్తూ కన్పించాడు. ఇవి మిత్రవిందవి కావు. చరక్ అంగీలో అతనితో వచ్చిన నాణాలు. రెండు దోసిళ్ళు ఉంటాయి. ఒక్కో నాణెం ఆరు గ్రాముల బరువుంటుంది. అన్నీ స్వచ్ఛమైన బంగారు నాణాలు.

ఒక నాణెంమీద ఒక ప్రక్కన శిఖిపించం ధరించి మురళి వాయిస్తున్న కృష్ణుడు, వెనక పక్క గోమాత చిత్రాలున్నాయి.

వేరొక నాణెంమీద ఒకపక్కన నాగలిభుజాన ధరించిన బలరాముడు (బలరాముని ఆయుధం నాగలి), రెండోవైపున అభయహస్తంతో కృష్ణుడు – మరో నాణెంమీద ఒక వైపున సముద్రవ్యాపారానికి గుర్తుగా ఓడబొమ్మ, రెండో పక్కన శంఖం ఉన్నాయి.

ఇలా అరడజను పైగా రకరకాల ముద్రలు కలిగిన నాణేలు అవి. కొన్ని గుండ్రంగానూ, కొన్ని నలుచదరంగానూ ఉండగా అన్నిటిమీద కామన్‌గా ఇవి ద్వారక నాణేలని తెలియటానికి అనువుగా దిగువన గరుడపక్షి చిహ్నం ఉంది.

"ఏమిటి జేజిగారూ, అంతదీక్షగా చూస్తున్నారు? అవన్నీ సువర్ణ నాణాలే, ద్వారకాపురి ఒక బంగారు నగరం" అన్నాడు.

అవుననన్నట్టు తలపంకించాడు అగ్నివేశాచారుడు. "అమ్మాయి మిత్రవింద లేచిందా?" అని అడిగాడు.

"ఆఁ లేచింది జేజిగారూ, ఇంత క్రితమే స్నానానికి వెళ్ళింది. అదే గోల. స్నానానికి పన్నీరులేదు, పుష్పాలు లేవు, నురగకాయలు (కుంకుళ్ళు) లేవంటుంది. ఎలాగో నచ్చచెప్పేసరికి చాలురా బాబూ అన్పించింది" అన్నాడు చరక్.

అగ్నివేశాచార్యుడు నవ్వాడు.

"ఆ అమ్మాయికి పన్నీరు కాదు, రోజూ నువ్వు పాలాభిషేకం చేసినా తప్పులేదురా. నీ వద్ద ఉన్నది ఈ రెండు దోసిళ్ళ నాణాలే. వీటి బంగారం ధర లక్షల్లోనే ఉంటుంది. కాని వీటి ప్రాచీనతా ప్రాధాన్యతని బట్టి ఇవి కోటానుకోట్ల విలువ చేస్తాయి.

అలాంటిది ఆ అమ్మాయి ఒక సంచినిండుగా ఏడువారాల నగలు, నాణేలు, వజ్రవైఢూర్యాలు తెచ్చింది. వాటి విలువ వేలకు వేల కోట్లు ఉంటుంది. మీకోసం ఆమె పుట్టింటివారిచ్చిన ఆరణం అది.

భద్రంగా కాపాడుకోవాలి. అమ్మాయి రెడీ అవగానే చెప్పు. మనం కూడా బయలుదేరటం మంచిది అన్నట్టు నీ ఫోన్ ఛార్జింగ్ పెట్టావా?"

"ఊఁ"

"ఓసారిలా ఇవ్వు"

సెల్‌ఫోన్ అగ్నివేశాచార్యునికి ఇచ్చాడు చరక్. "జేజిగారూ, మనం వెళ్ళేప్పుడు రాజమండ్రిలో వస్త్రలత వద్ద ఆగివెళ్దాం. మిత్రవిందకు చీరలు అవీ

తీసుకోవాలి. త్వరగా తనకు చీరలు కట్టడం నేర్పకపోతే ద్వారకా దుస్తుల్లో ఆమెనంతా వింతగా చూస్తారు" అన్నాడు.

"ఏదీ? మిత్రవిందకు చీర కట్టడం నువ్వు నేర్పుతావా? భడవా" అంటూ నవ్వాడు అగ్నివేశాచార్యుడు.

"అది ఆడవాళ్ళు చూసుకుంటారు. మనం వస్త్రాలతకు వెళ్తే మిత్రవిందను చూడ్డానికి జనం ఎగబడి ఎగ్జిబిషనైపోతుంది. అలాంటి ఆలోచనేమీవద్దు. మనం నేరుగా మన ఇంటికి పోతున్నాం.

మన భద్రయ్యకు ఫోన్‌చేస్తే ఒక కారు నిండా చీరలేసుకుని ఇంటికి తెస్తాడు. నచ్చినవి అక్కడే ఎంచుకుంటారు...." మాట్లాడుతూనే మున్నలూరివారి అగ్రహారం తమ ఇంటికి ఫోన్‌చేశాడు. వెంటనే కోడలు దేవమ్మ లైన్లో కొచ్చింది.

"అమ్మా, దేవమ్మ అక్కడంతా క్షేమమేగద?" అడిగాడు.

"అంతా క్షేమమే మామగారూ, మీరు ఎప్పుడు వస్తున్నారు? పాపం శుశ్రుత చరక్ కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తోంది" అంది దేవమ్మ.

"కాసేపట్లో మేమిక్కడ బయలుదేరుతున్నాం. మధ్యాహ్నం భోజన వేళకి ఇంటివద్ద ఉంటాం. చరక్ నాతో వస్తున్నాడు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మంచిది మామగారూ, ఈ మాట వింటే శుశ్రుత చాలా ఆనందిస్తుంది"

"మరో ముఖ్య విషయం దేవమ్మా"

"చెప్పండి మామగారూ...."

"మేం వస్తున్న విషయాన్ని ఇప్పుడే శుశ్రుతకు చెప్పొద్దు. కారణం ఉంది. మీరు మరో పని చేయాలి. మన అగ్రహారంలోని పుణ్యస్త్రీలందర్నీ ఆహ్వానించండి. ఎర్రనీళ్ళు దిష్టి తీయటానికి సిద్ధం చేయించండి. మన ఇంటికో కొత్త అతిథి వస్తున్నారు.

ఆ రోజు శుశ్రుత తొలిసారిగా మనింటికొచ్చినప్పుడు ఎంత ఘనంగా స్వాగతించారో అంత కన్నా ఘనంగా స్వాగతం పలకాలి. తోరణాలు కట్టించి ఆవరణ కళకళలాడాలి...."

"ఇంతకీ ఆ అతిథి ఎవరు మామగారూ?" సస్సెన్స్ భరించలేక అటు నుండి అడిగింది దేవమ్మ.

"ఆత్రుత ఎందుకమ్మా, వచ్చాక చూస్తారుగా, ముందా ఏర్పాట్లు చూడండి" అంటూ కొంచెం కూడా విషయాన్ని లీక్ చేయకుండా లైన్ కట్‌చేశాడు అగ్ని వేశాచార్యుడు.

ఆయన ఉద్దేశం చరక్‌కు అర్థమైంది. చివరిక్షణం వరకు మిత్రవింద గురించి ఎవరికీ తెలీకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. కాని తనకు ఓసారి శుశ్రుతతో మాట్లాడాలనుంది.

ఆమె తన భార్య. తనప్రాణం. మాట్లాడకుండా ఎలా ఉండగలడు? మనవడి మనసులో ఉద్దేశం గ్రహించినట్టున్నాడు. సెల్‌ఫోన్ తిరిగిస్తూ సీరియస్‌గా చూశాడు అగ్నివేశాచార్యుడు.

"నీ ఆత్రుత నాకు తెలుసు. అలాగని శుశ్రుతకు ఫోన్ చేసి మాట్లాడక. అంతా రసాభాస అవుతుంది జాగ్రత్త" అంటూ హెచ్చరించాడు.

"అలాగే జేజిగారూ. చేయను" అన్నాడు చరక్. ఉదయం సుమారు పదిగంటల ప్రాంతంలో అంతా ప్రయాణానికి సిద్ధమయ్యారు.

*　　*　　*　　*　　*

అల్పాహారం అక్కడే తీసుకున్నారు. మిత్రవింద ఆహారపు అలవాట్లు వేరుగాబట్టి ఇడ్లీ, దోసెలు ఏవీ ముట్టుకోలేదు. ద్రాక్షపళ్ళు ఇష్టంగా తింటుంది. కొద్దిగా జొన్నరొట్టె తిని పాలుతాగింది. కారు డిక్కీలో మిత్రవింద సూట్‌కేసుతో బాటు తనదీ అగ్నివేశాచార్యుల సూట్‌కేసులూ వుంచి తాళం వేశాడు చరక్.

రాత్రి చీకటిలో ఎస్టేట్ పనివాళ్ళు మిత్రవిందను సరిగా చూళ్ళేదు. ఇప్పుడు స్త్రీ, పురుషులంతా ఆమెను చూడ్డానికి వరసగా నిలబడ్డారు.

మిత్రవింద యధా ప్రకారం ముఖం తెలీకుండా చున్నీ ముసుగు వేసుకుని వచ్చి కారులో కూర్చుంది. పనివాళ్ళకు – జాగ్రత్తలు చెప్పి వచ్చి వెనక సీట్లో కూర్చున్నాడు అగ్నివేశాచార్యుడు.

చరక్ కారు స్టార్ట్‌చేసి బయటికి పోనిచ్చాడు.

ఈ సారి ఊళ్ళో జీప్ అవసరం ఉంటుందనే ఉద్దేశంతో జీప్‌ను తీసుకురమ్మన్నాడు అగ్నివేశాచార్యుడు. దాంతో డ్రైవరు కాశీ, అప్పన్నలు ఆ కారును ఫాలో అవుతూ వెనకే జీప్‌లో బయలుదేరారు.

*　　*　　*　　*　　*

ఒకసారి అగ్నివేశాచార్యుని స్థావరానికి ఆత్మరూపంలో వెళ్ళి భంగపడ్డాక మరోసారి వెళ్ళటానికి విళంబికి ధైర్యం చాలటంలేదు. కాని గురువు మరిడి సోమయ్య ఆనతి. కాదనలేడు.

వెంటనే స్థావర ప్రాంతాలకు వెళ్ళి అక్కడ ఏం జరుగుతోంది. ఆ కుర్రాడు చరక్ తీసుకొచ్చిన అమ్మాయి ఎలావుంది ఆమెతోబాటు ఏం తీసుకొచ్చాడు తెలుసుకురమ్మని సోమయ్య ఆర్డరు.

కాదంటే గురువుగారితో తంటా. అవునంటే అగ్నివేశాచార్యుడితో ప్రమాదం. ఎలా చచ్చేది? ఎంతగా విసుక్కున్నా తప్పదుగాబట్టి బయలుదేరాడు విళంబి. అయితే వాడికో ధైర్యం ఉంది.

తను ఆత్మగా వెళ్ళినప్పుడు అగ్నివేశాచార్యుడు తనను చూశాడు. ఇప్పుడు నిజరూపంలో కంటబడినా గుర్తుపట్టకపోవచ్చని గాఢనమ్మకం.

ఆ నమ్మకంతోనే అడవిలో ప్రయాణానికి అనుకూలంగా వుంటుందని బైక్ మీద నీలోదరి కొండగుట్టనుంచి బయలుదేరి సాయంత్రానికి కోరుకొండ చేరుకుని అక్కడే ఒక లాడ్జిలో స్టే చేశాడు.

నిజానికి వాడు లాడ్జికి చేరుకున్న అదేసమయానికి రంపచోడవరం అడవి నుంచి అగ్నివేశాచార్యుడి బృందం కోరుకొండ వచ్చేసి తమ ఎస్టేట్ భవంతిలో ఉన్నారు. ఆ విషయం విళంబికి తెలీదు.

మరునాడు ఉదయమే చక్కగా తయారై టిఫిన్ చేసి, మధ్యాహ్నానిక్కూడా టిఫిన్ పార్సిలు, బిస్కెట్లు, వాటర్‌బాటిలు తీసుకుని అడవిలోకి బయలుదేరాడు. అసలే మనిషి నలుపు. కాస్త లావుగా ఉండి కొద్దిగా గడ్డం పెరిగింది. కళ్ళకు నల్లద్దాల కళ్ళజోడు ధరించటంతో గతంలో చూసినవాళ్ళు చూసినా చప్పున గుర్తించటం కష్టం.

ఆ రోజు పగలంతా రంపచోడవరం అడవుల్లో బైక్ మీద గాలించినా అగ్నివేశాచార్యుని స్థావరం ఎక్కడుందో కనిపెట్టలేకపోయాడు. రాత్రికి కోరుకొండ లాడ్జికి వచ్చేసి మరుసటి దినం తిరిగి అన్వేషణ ఆరంభించాడు.

ఇంత వెదికినా స్థావరం కనబడలేదంటే స్థావరాన్ని అష్టదిగ్బంధనంలో ఉంచి అగ్నివేశాచార్యుడు ఇక్కడ్నుంచి వెళ్ళిపోయాడా? వెళ్ళిపోయి ఉండొచ్చన్న అనుమానం క్రమంగా బలపడసాగింది.

ఇలాంటి పరిస్థితిలోనే ఇక్కడికొచ్చిన తమ మిత్రుడు మరిడి సోమయ్య ప్రియశిష్యుడు వికేశికి ఎలాంటి గతిపట్టిందో గుర్తొచ్చి విళంబికి వెన్ను జలదరించింది. అయినా గాలింపు ఆపలేదు.

అలాటివన్నీ తిరగ్గా ఒకచోట పెద్ద మర్రిచెట్టు, దాన్ని ఆనుకునే పక్కన పెద్ద కొండరాయి, ఆ రాయి పక్కన రెండుపలవలతో ఎత్తుగా పెరిగిన బాదంచెట్టు కన్పించాయి.

అవి తనకి బాగా గుర్తు. వాటికి దక్షిణంగా స్థావరం ఉండాలి. కాని అక్కడంతా చెట్టుచేమలే కన్పిస్తున్నాయి. సందేహం లేదు.

ఎవరి కంటాపడకుండా స్థావరాన్ని దిగ్బంధించి ఇక్కడ్నుంచి వెళ్ళి పోయారు. ఎక్కడికి వెళ్ళుంటాడు? సొంత ఊరు ఏది? తీవ్రంగా ఆలోచిస్తున్న విళంబి అడుగుల చప్పుడు విని ఉలిక్కిపడి తిరిగి చూశాడు. ఒక వ్యక్తి అనుమాన ధృక్కులతో తనవైపు వస్తూ కన్పించాడు. వాడ్ని చూడగానే గుర్తుపట్టాడు విళంబి. వాడు పులికొండయ్య.

వాడికి తెలీని విషయం ఉండదు. కాని తను వాడికి తెలీదు. అంతేకాదు. వీడితో జాగ్రత్తగా ఉండాల్సిందే. తను మరిడిసోమయ్య మనిషని ఏ మాత్రం సందేహించినా కొంప ముంచేస్తాడు.

"ఎవర్నువ్వు? ఈ అడవిలో ఏంపని?" దగ్గర కొస్తూనే కాస్తఘాటుగా ప్రశ్నించాడు పులికొండయ్య. విళంబి కళ్ళజోడు తీసి జేబులో పెట్టుకుని అప్పటికప్పుడు ముఖంనిండా విషాదం పులుముకొంటూ పులికొండయ్య వంక ఎంతో దీనంగా, బాధగా చూశాడు.

"నా బాధ ఏమని చెప్పను ఎవరితో చెప్పుకోను. ఆ మహానుభావుడి దర్శనం లభించలేదు. రెండ్రోజులుగా ఈ అడవిదారుల వెంట కారాడుతున్నాను. ప్రయోజనం లేకపోయింది" అన్నాడు రుద్దకంఠంతో. పులికొండయ్యది అసలే జాలిగుండె.

విళంబిని చూస్తుంటే అతడేదో కష్టంలో ఉన్నాడనిపించింది. పైగా వాడు ఎవర్ని చూడాలనుకొంటున్నాడో అర్థంకాలేదు. "ఇంతకీ నువ్వు ఎవరి కోసం గాలిస్తున్నావ్? చూడ్డానికి సిటీ మనిషిలా వున్నావ్?" అనడిగాడు.

ముందే అగ్నివేశాచార్యుని కోసం అని చెప్తే పులికొండయ్య తన భుజం మీది బాణాకర్రతో బుర్ర పగలగొట్టేస్తాడని విళంబికి తెలుసు. పులికొండయ్య ఎంత మంచోడో కోపంలో అంతకంతగా చెడ్డోడు కూడా. అగ్నివేశాచార్యునికి నమ్మినబంటు.

"బాబూ మీరెవరోగాని ఈ దిక్కుమాలిన అడవిలో దేవుడిలా కనిపించారు. నా భార్య రోగిష్టిది. అదేం రోగమో అంతుబట్టడంలేదు. కాళ్ళు, చేతులు చచ్చు బడిపోయి మంచం దిగలేకపోతోంది.

పెద్దపెద్ద డాక్టర్లకు చూపించి లక్షలు ఖర్చుపెట్టినా లాభం లేకపోయింది. ఎవరో మీలాంటి పుణ్యాత్ముడు ఇలాంటి మొండి జబ్బుల్ని తగ్గించాలంటే ఆయుర్వేద సిద్ధ వైద్యులు అగ్నివేశాచార్యులవల్లే అవుతుంది. వారి కాళ్ళమీద పడమని సలహా ఇచ్చాడు.

మూలికల కోసం శిష్యులతో ఈ అడవిలో తిరుగుతుంటారని చెప్పాడు. అందుకే మూడురోజులుగా వారికోసం వెదుకుతున్నాను. ఇంతవరకు వారి దర్శనం కలగలేదు. నా భార్యంటే నాకు పంచప్రాణాలండి. దానికి బతికే యోగం ఉందో లేదో తెలీదు" అంటూ చిన్నగా ఏడ్చేసాడు.

విళంబి నటన ముందు–

అంతటి పులికొండయ్య కూడా బొక్కబోర్లాపడిపోయాడు. వాడి మాటలు నిజమేననిపించింది. అయినా ఇంకా ఎక్కడో చిన్న సందేహం.

"మరి ఆ స్వామి అడవిలో తిరుగుతారని చెప్పినోడు ఆయన సొంత ఊరు ఏదో చెప్పలేదా?" అనడిగాడు.

"అదే నా దురదృష్టమండి. అతను ఈ ప్రాంతం నుంచే తోటలకు నిమ్మ మొక్కలు తెచ్చి సప్లై చేస్తూంటాడు. బస్టాండ్‌లో అంతవరకే చెప్పాడండి. అంతలో బస్ రావటంతో వెళ్ళిపోయాడు. వివరంగా అడిగి తెలుసుకునే సమయం లేకపోయింది" అంటూ జేబు రుమాలుతో కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

అబద్ధం చెప్పినా అతికినట్టు సరిపోయింది.

పూర్తిగా వాడి మాటల గారడీలోపడి నమ్మేశాడు పులికొండయ్య.

"సరిసరి ఊరుకోవయ్యా. ఇంతకీ ఏ ఊరు నీది?" అడిగాడు.

"ద్వారకా తిరుమల అవతల జంగారెడ్డి గూడెమండి"

"నీ పేరు?"

"కిట్టయ్యండి"

"చూడు కిట్టయ్యా, నీ మాటలు వింటే నీకు పెళ్ళామంటే ఎంత ప్రేముందో అర్థమవుతోంది. బాధపడకు. ఆ సామి ఉండే తావు నేను జెప్తాను.

పోయి కాళ్ళమీద పడు. నీ పెళ్ళానికి జబ్బు తప్పక నయమవుతుంది"

"అంతకన్నా ఉపకారం ఉంటుందా? చెప్పండి. వారిని ఎక్కడ చూడొచ్చు?"

"వారు అడవి నుంచి స్వగ్రామం వెళ్ళిపోయారు. తిన్నగా మండపేట వెళ్ళు. అక్కడి నుండి రామచంద్రాపురం రూట్‌లో ఎవరినడిగినా మున్నలూరి వారి అగ్రహారానికి దారెటు ఉందో చూపిస్తారు.

అగ్నివేశాచార్యులవారు ఆ అగ్రహారంలోనే ఉంటారు. ఇక బాధపడక వెంటనే వెళ్ళు" అంటూ సలహా ఇచ్చాడు పులికొండయ్య.

ఆ మాట విని ఆనందించాడు విళంబి. తనకు కావలసిన అడ్రసు సులువుగా దొరికిపోయింది.

"సమయానికి దేవుళ్ళా కనబడి సాయం చేశారు. మీ మేలు మర్చిపోలేను. ఈ సిగరెట్ పాకెట్ తీసుకోండి." అంటూ ఖరీదైన తన సిగరెట్ పాకెట్‌ను పులికొండయ్యకిచ్చి బైక్ స్టార్ట్‌చేసి వెనుతిరిగాడు విళంబి.

వెళుతున్న బైక్‌నే చూస్తూ సిగరెట్ ముట్టించుకున్నాడు పులికొండయ్య. అడ్రసు చెప్పి తను తప్పు చేసిన సంగతి పులికొండయ్యకు ఆ క్షణంలో తెలీదు. ఒక మంచిపని చేసిన తృప్తితో సిగరెట్ దమ్ముకొడుతూ తనూ వెనుతిరిగాడు.

* * * * *

మున్నలూరి వారి అగ్రహారం...

అగ్నివేశాచార్యుని నివాసం.

లోన హడావుడి ఏమిటో బయట ఎవరికీ తెలీదు. ఆ మాటకొస్తే లోన హడావుడిచేస్తూ హైరానపడుతున్న దేవమ్మగారికీ తెలీదు. మామగారి ఆర్డరు అక్షరాలా పాటించాలిగాబట్టి అతిథిని ఆహ్వానించడానికి సకల ఏర్పాట్లతో సిద్ధంగా వుంది.

అగ్రహారంలోని యువతులు, స్త్రీలు, కన్యలు అంతా సింగారించుకొని గేటు సమీపంలో ఇంటిముందు గుమిగూడి ఉన్నారు.

అందరి ముఖంలోను ఆరాటం– ఉత్సుకత. వస్తున్నది ఎవరో ఒక్కరి ఊహకూ అందటం లేదు. చరక్ భార్య శుశ్రుతకూ తెలీదు. కాని భర్తను చూడబోతున్న ఆనందం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

ఇక శ్రావణి అయితే కారు వస్తోందో లేదో చూడ్డం కోసం లోపల్నించి గేటువరకు అక్కడి నుంచి లోనకు కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వుంది.

కొందరు పిల్లలయితే గేటు బయటే నిలబడి ఎగువకు చూస్తున్నారు.

అంతలో మలుపు తిరుగుతూ కన్పించింది కారు. దాని వెనకే జీప్ అంతే– "వచ్చేస్తోంది. కారు వచ్చేస్తోంది" అంటూ పెద్దగా అరిచారు పిల్లలు. శ్రావణి గేట్లోకి పరుగెత్తుకు వచ్చింది. లోన స్త్రీలంతా అలర్టయ్యారు. గేటువంక చూడసాగారు ఆత్రంగా.

అంతలో గేటు దాటి–

రివ్వున లోనకు దూసుకొచ్చింది కారు.

ఎడం పక్కకు తిరిగి, ఎడంపక్క బిల్డింగ్‌కు సమీపంలో రివర్స్ తిరిగి ఆగింది. నల్లద్దాల మూలంగా లోన ఎవరున్నదీ తెలీటం లేదు. ముందుగా డ్రైవింగ్ సీట్లోంచి దిగాడు చరక్. అతడి చూపులు శుశ్రుత కోసం వెదికాయి. నాయనమ్మ దేవమ్మగారి పక్కన నిలబడుంది శుశ్రుత.

భర్తను చూసిన ఆనందంలో ఆమె ముఖంలో వేయి మతాబులు ఒక్కసారిగా వెలిగినంత ఆనందం కన్పించింది. ఇద్దరూ కళ్ళతోనే పలకరించు కున్నారు. కాని... శుశ్రుత ముఖంలో ఈ ఆనందం ఎంతసేపు ఉంటుందో తెలీక మనసులో అతలాకుతలమైపోతున్నాడు చరక్.

గబగబా వెళ్ళి వెనక డోర్ తెరిచాడు.

అగ్నివేశాచార్యుడు గంభీరంగా కారు దిగాడు. ఈ లోపల లోనకొచ్చి ఒక పక్కగా ఆగిన జీప్‌లోంచి దిగి పరుగెత్తుకొచ్చాడు అప్పన్న.

చరక్ ఫ్రంట్‌డోర్ తెరిచి ఇక అక్కడ నిలవకుండా కారు వెనక్కి వెళ్ళి డిక్కీ తెరిచాడు. అప్పన్న సూట్‌కేస్‌లు దించసాగాడు. ఈలోన–

అందరి దృష్టి కారు ఫ్రంట్ డోర్ మీద పడింది. అగ్నివేశాచార్యుడు డోర్‌ని బార్లా తెరిచి–

"రామ్మా, కారు దిగు" అంటూ దేవనాగరి భాషలో పిలిచాడు.

మేలిముసుగుతో మిత్రవింద కారు దిగి నిలబడింది. డోర్ మూసాడు అగ్నివేశాచార్యుడు.

ఓసారి అందర్నీ పరిశీలనగా చూశాడు.

అక్కడున్న ఆడా, మగా మిత్రవిందను చూస్తూనే డీప్ షాక్‌కి లోనయ్యారు. యువతి అని తెలుస్తోంది. కాని ఇంత ఎత్తా...? చూస్తుంటే చరక్‌కంటే ఎత్తులా ఉంది. ప్రపంచంలో ఎక్కడన్నా ఇంత ఎత్తున్న అమ్మాయి ఖచ్చితంగా ఉండదు.

అసలీమె ఎవరు? ఎందుకొచ్చింది....?!

స్త్రీలు, పురుషులు శిలావిగ్రహాల్లా నిలబడి ఉన్నారు.

మిత్రవిందను చూస్తున్న ఆశ్చర్యం అందరి కళ్ళలోనూ స్పష్టంగా కన్పిస్తోంది. అదే సమయంలో తన ముసుగులోంచి ఓరకంట అందర్నీ గమనిస్తోంది మిత్రవింద. వారిలో చరక్ భార్య శుశ్రుత ఎవరో గుర్తించటం ఆమెకంత కష్టం కాలేదు. అప్పటికే శుశ్రుత కళ్ళలో ఏవో సందేహ ఛాయలు కదులాడటం గమనించి చిన్నగా నవ్వుకుంది.

ఇక అక్కడున్న వారిలో దేవమ్మగారితో సహా అంతా తాము చూస్తున్నది కలో, నిజమో అర్థంగాక చిత్తభ్రమ ఏర్పడినట్టు చూస్తున్నారు.

ఎవరీ అమ్మాయి?

ఎక్కడికక్కడ మలిచినట్టున్న శరీరాకృతి, తాకితే మాసిపోతుందా అన్పించే ఫెయిర్ కలర్- ఎంతగా అంటే ఆమె నీరు తాగుతుంటే గొంతులో ఆ నీరు కన్పిస్తూందా అన్పించేంత స్వచ్ఛత. ఆమె గాజు బొమ్మా, పాలరాతి శిల్పమా... ఆ జుట్టేమిటి అంత బారున మోకాళ్ళను తాకుతోందే.

వేషం చూస్తే ఈ కాలం యువతిలా లేదే... ఒంటి మీద నగలు, వజ్ర వైఢూర్యాలు పొదగబడి ఎండకు జిగేల్‌మంటున్నాయి.

ముఖం తెలీకుండా ఆ ముసుగేమిటో, ఈమె దేవకన్యా, గంధర్వ కన్యా? వేరెవరన్నానా! మానవ కన్యల్లో అయితే ఇంత అందగత్తెలుంటారా! సాధారణ యువతి అయితే ఇంతటి సౌందర్యం, ఇంతటి ఠీవి ముఖంలో ఆ కళాకాంతులు సాధ్యమా!

రెండు చేతులకు ఒత్తుగా అవేమిటి?

శంఖపు గాజులా... ఈ కాలంలో ఎవరు వాడుతున్నారు? పాదాలకు వెండి మువ్వల పట్టీలున్నాయి. స్వచ్ఛమైన ముత్యాలువేసి తయారుచేసిన మువ్వలు పాదం కదిపితే ఘల్లుమంటున్నాయి.

బంగారు ఆభరణాలను నడుం ఆపై భాగం నడుంపక్క భాగాన మాత్రమే వాడతారు. ఎందుకంటే బంగారం లక్ష్మీనివాసం. అటువంటి బంగారాన్ని ఏ

రూపంలోనూ మలినాలు వెడలు నడుం దిగువన అలంకరించుకోరాదని శాస్త్రం. అందుకే నడుం దిగువన వెండి ఆభరణాలనే అలంకరించుకుంటారు.

ఇక ఇప్పుడంటే స్త్రీలు ఫ్యాషన్‌గా పాదాలకు వెండి పట్టీలుకూడా వాడుతున్నారు. పూర్వాచారమైతే కన్యలు మాత్రమే వెండిపట్టీలు ధరించే వారు. వివాహితుల పాదాలకు బోలుగా ఉండి లోన ముత్యాలుగాని, రత్నాలుగాని పోసిన అందెలు, వాటి పైన బరువుగా ఉండే బేడీలను ధరించేవారు.

కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మనం ఇలా అందెలు, బేడీలు ధరించిన స్త్రీలను చూడొచ్చు. ముఖ్యంగా రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో గ్రామీణ స్త్రీలు వీటిని ధరిస్తూనే వున్నారు. ఈ అమ్మాయి ఎంతో ఆచారవంతురాలిగా ఉందే.

అయినా ఎప్పుడో పూర్వం ఇలా స్త్రీలు ముఖం కనబడకుండా మేలిముసుగు వేసుకునేవారు. ఇవన్నీ ఇప్పుడు ఎవరు పాటిస్తున్నారు?

పురుషులతో సమంగా స్త్రీలు పోటీపడుతున్న ఈ కాలంలో కూడ ఇలాంటి యువతులున్నారా! ఇంతకీ రూపమే ఇంత అద్భుతంగా ఉందే... ఇక ఆ ముఖ సౌందర్యం ఎంత గొప్పదోగదా. దిగ్భ్రాంతితో ఎవరి ఆలోచనల్లో వారు తల్లకిందులై పోతున్నారు.

అంతలో–దేవమ్మగారు ముందుకొచ్చారు.

మిత్రవింద ఎదురుగా నిలబడి– ఆమె మేలిముసుగును నెమ్మదిగా తొలగించారు.

అంతే–మరోమారు అందరి కళ్ళు కనురెప్పలు వేయటం మర్చిపోయారు. కళ్ళముందు మెరుపుతీగె మెరిసినట్టయింది. హరివిల్లు ప్రత్యక్షమైనట్లుంది. ఆహా! ఏమా అందం... ఏమా వర్ఛస్సు. కోటేరులా తీర్చిదిద్దినట్టున్న సంపెంగ నాసిక, ముక్కెర మీద పొదిగిన రత్నాలకాంతులు ఆమె పగడాల అధరాల మీద మెరుస్తున్నాయి. చెంపగొలుసు కెంపుల కాంతులు బుగ్గలమీద ప్రతిఫలిస్తున్నాయి.

విశాల నేత్రాలు, శంఖం లాంటి మెడ ఆ మెడను అలంకరించిన పచ్చలహారం. నిజంగానే ఆమె నీరు తాగుతుంటే గొంతులో ఆ నీరు కన్పిస్తోంది. మిత్రవింద నునుసిగ్గుతో దేవమ్మగారిని చూస్తోంది.

మిత్రవింద భుజాల వరకే ఎత్తుండటంతో దేవమ్మగారు తలపైకెత్తి ఆమె ముఖాన్ని చూడాల్సి వస్తోంది. ఎక్కడి స్త్రీలు అక్కడ– ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

చీమ చటుక్కుమన్నా విన్పించేంతగా నిశ్శబ్దం చోటుచేసుకుందక్కడ. ఎవరీ అందాల బొమ్మ. ఎవరు... ఎవరు... ఎవరికి వారే తర్కించుకుంటున్నారు గాని ఒక్కరూ పెదవి విప్పటం లేదు.

ఈ పరిస్థితిలో దేవమ్మగారు– "ఎవరు... ఎవరు తల్లీ నీవు?!" అంటూ తెలుగులో అడిగింది.

పక్కనున్న అగ్నివేశాచార్యుడు–

చిరునవ్వుతో చూస్తున్నాడంతా.

దేవమ్మగారి మాటల్ని దేవనాగరిలో మిత్రవిందకు చెప్పాడు. మిత్రవింద తల కొంచెం వంచి దేవమ్మను చూస్తూ– "నేను... నేను ప్రాచీన స్త్రీని... కన్యను" అంది మంద్రస్వరంతో.

"నీ పేరేమిటి?" "మిత్రవింద"

"ఎక్కడినుంచి వచ్చావ్? దేవలోకమా, గంధర్వ లోకమా? మానవ లోకమేనా...?"

దేవమ్మ ప్రశ్నలు మిత్రవింద జవాబులు అగ్నివేశాచార్యుడు తర్జుమాచేసి విన్పిస్తున్నాడు. అక్కడికే ఎక్కువ. అంతకుమించి ప్రశ్నలువేస్తే విషయం పదిమందికీ తెలిసిపోయే ప్రమాదం ఉంది.

"ఇక్కడికి ఎందుకొచ్చావ్?" అంటూ అడగనే అడిగింది దేవమ్మ. మిత్రవిందకు అర్ధంగాక అగ్నివేశాచార్యుని వంక చూసింది.

ఆ ప్రశ్నను దేవనాగరిలోకి తర్జుమా చేయకుండా వదిలేసి– "దేవమ్మా, ఇంటికొచ్చిన అతిథిని వాకిట్లో నిలబెట్టే ప్రశ్నలగటం మర్యాదకాదు గదా!

ముందు దిష్టితీసి హారతివ్వండి" అంటూ కర్తవ్యం గుర్తు చేశాడు. కారు డిక్కీదగ్గర నిలబడిన చరక్ అంతా వింటూనే వున్నాడు. ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు. మిత్రవింద దేవమ్మగారి చివరి ప్రశ్నకు బదులు చెప్తే శుశ్రుత రియాక్షన్ ఎలా ఉండేదో...

కాని ప్రమాదం తప్పింది. అయితే ఆ ప్రమాదం ఎలాగో వచ్చిపడనుందని తెలీలేదు.

మిత్రవిందకు దిష్టితీయటానికి ఎర్రనీళ్ళ పళ్ళెంతో ఒకామె ముందు కొచ్చింది. అగ్నివేశాచార్యుడు తల తిప్పి చరక్‌వంక చూశాడు. "ఒరే. సూట్‌కేసులు

అప్పన్న దించుతాడు గాని నువ్విటురా" అన్నాడు. "చెప్పండి జేజిగారు" అంటూ దగ్గరకొచ్చాడు చరక్.

"చెప్పటం ఏమిట్రా నీ ముఖం. నువ్వలా దూరంగా వుంటే ఎలా. ఆగమ్మా. వీళ్ళిద్దరికీ కలిపి దిష్టితీయండి" అంటూ చరక్‌ను లాగి మిత్రవింద పక్కన నిలబెట్టాడు.

* * * * *

గతుక్కుమన్నాడు చరక్. గుండె లబ్‌డబ్‌మంటూ కొట్టుకోవడం ఎక్కువైంది. ఐపోయింది. దీంతో తమవిషయం శుశ్రుతకు తెలిసిపోవడం ఖాయం. ఆమెవంక చూడాలంటేనే బెదురుగా ఉంది. అందుకు తగ్గట్టే మిత్రవింద అతడి చేయి అందుకొని, మరింత దగ్గరకు జరిగింది.

"మీ జంట బాగుంది. మీరలా కిందిచూపులు చూస్తేకాదు. ఇటు చూడండి" అంది దిష్టి తీస్తున్నావిడ. ఇద్దరూ పళ్ళెం వంక చూశారు.

మూడుసార్లు దిష్టి తీసి పారబోయటానికి గేటు బయటకు వెళ్ళిందావిడ.

చరక్ కదలబోతుంటే– "ఇంకా అవలేదు. అక్కడే నిలబడు" అన్నాడు కరుగ్గా అగ్నివేశాచార్యుడు.

"ప్రియుడా. ఇచట యువతులందు సోదరి శుశ్రుత ఎవరో తెలుపనా?" అంది చిన్నగా మిత్రవింద. దేవమ్మగారు పక్కకు వెళ్ళగానే తిరిగి మేలి ముసుగు వేసుకుంది.

అంతదూరంలో ఉన్న శుశ్రుతముఖంలో చకచకా అనేక భావాలు కదులాడటం ఆరంభమైంది. కళ్ళలో అనుమానపు ఛాయలు ఆమె ముఖారవిందంలో ఆనంద ఛాయలు ఆవిరై క్రమంగా రోషకషాయత నేత్రాలు అరుణవర్ణం దాల్చుతున్నాయి. ఆమె ముఖ భావాల్ని గమనించి – కంగారు పడుతూనే మిత్రవింద ప్రశ్నకు అనాలోచితంగా ఊకొట్టాడు చరక్.

మిత్రవింద ఉత్సాహంగా చూసింది.

"అదో...ధవళవస్త్రములు ధరించి ఇచ్చోట యువతులందరి కన్నను మిన్నయగు దేహసౌందర్యముతో మన యిరువురను అనుమానదృక్కుల అవలోకించుచున్నదే అందమగు ప్రౌఢ. ఆమెయే అక్క శుశ్రుత" అంది. మిత్రవింద అంచనా నూటికి నూరుశాతం కరెక్ట్ గావటంతో మరోసారి విభ్రాంతుడయ్యాడు

చరక్. శుశ్రుత ఆకుపచ్చ అంచు కలిగిన లైట్‌డిజైన్ తెల్లచీర, జాకెట్ ధరించి జడలో మల్లెపూలదండ తురుముకునుంది. ఆమెను మించిన అందగత్తెలు అక్కడ ఎవరూలేరు. శుశ్రుతకు అనుమానం ఆరంభమైంది. ఆమె చూపులు వాడిగా వేడిగా ఉన్నాయి.

ఎంతటి నిశితపరిశీలనాశక్తి మిత్రవిందకు.

"అవును మిత్రా. తనే శుశ్రుత" అన్నాడు.

ఇంతలో మరో పుణ్యస్త్రీ హారతిపళ్ళెంతో వచ్చింది. ముద్దకర్పూరం పళ్ళెంలో వెలిగించి దాంతో మూడు సార్లు దిష్టితీసింది. ఆమె అటు వెళ్ళగానే నౌకరు ఒకడు దిష్టితీయటానికి బూడిదగుమ్మడికాయతో సిద్ధమయ్యాడు.

"ప్రియుడా!" పిలిచింది మిత్రవింద.

"ఏమి?" అడిగాడు.

"ఇదియేమి విచిత్రము? ఇచటి స్త్రీలిటుల లజ్జా రహితులై చరింపనేల? ఒకరును నావలె మేలిముసుగు ధరింపరేల?" అడిగింది.

చరక్ ఆమె సందేహంవిని నవ్వాడు."ఒకప్పుడు ఆచారములను పాటించెడివారు.

ఇది కలియుగమున...అందునా ఆధునిక యుగప్రభావము. వారిటులనే యుందురు" అంటూ బదులిచ్చాడు. నౌకరు ఇద్దరికీ గుమ్మడికాయ దిష్టితీస్తున్నాడు.

అటు అగ్నివేశాచార్చుడు కూడా ఈ జంటతో బాటు అటు శుశ్రుత ఫీలింగ్స్‌నీ గమనిస్తున్నాడు. ప్రస్తుతం ఒక భర్తకు ఒకే భార్య అనే సంస్కృతి నడుస్తోంది. ఎక్కడో అరుదుగా ఇద్దరు భార్యల భర్తలు కన్పిస్తుంటారు.

ఏ ఆడపిల్లా తనకోసవతి వస్తోందంటే అంగీకరించదు. శుశ్రుత కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఆమె తప్పకుండా కోపగించి గొడవచేస్తుంది.

విషయాన్ని దాచి ఎప్పుడో గొడవపడ్డంకన్నా అదేదో ఇప్పుడే తెలిసేలా చేసి సమాధానపర్చటం మంచిదనే ఉద్దేశంతోనే ఇద్దరికీ కలిపి దిష్టి తీయించాడు తను. ఇపుడు శుశ్రుత ఎలా స్పందిస్తుందో చూడాలి.

అగ్నివేశాచార్యుని ఆలోచనల్లో ఆయన ఉండగా ఇటు కోడలు దేవమ్మగారికీ అంతా అయోమయంగా ఉంది. చూడ్డానికి వేషభాషలు ఎవరో గుజరాతీ మారుమూలప్రాంతం మార్వాడీ అమ్మాయిలా ఉన్నా గొప్ప సౌందర్యవతి.

చూస్తూంటే చరక్ ఈ అమ్మాయి ప్రేమలో పడినట్టున్నారు. అదే నిజమైతే శుశ్రుతకు అన్యాయం జరిగినట్టే.

తెలిసి తెలిసీ మామగారు ఇలా ఎందుకు చేస్తున్నారు? ఇదీ విషయమని ఆయనా ఏమీ చెప్పటం లేదు. ఏం జరగనుందో అర్థంగావటంలేదే.

ఇపుడు అగ్రహారంలో అందరికీ ఈ అమ్మాయి గురించి ఏమని చెప్పాలి? తనలో తను మల్లగుల్లాలు పడిపోతోందామె. అక్కడేవున్న చరక్ మరదలు శ్రావణికీ ఏమీ అర్థంగాక దయ్యంపట్టినట్టు చూస్తోంది. ఇక శుశ్రుత అయితే – ఆమెకు ఏడుపు ఒక్కటే తక్కువ. భర్తను చూసిన ఆనందమంతా ఆవిరైపోగా ఆ స్థానాన్ని దుఃఖం ఆక్రమించుకుంది. మనస్తాపం గొంతులో కొట్టుమిట్టాడుతోంది. గమ్మడికాయ దిష్టి తీయటం కూడా అయిపోయింది. తన గుండె పగిలినట్టె ఆ గుమ్మడికాయనూ పగలకొట్టడానికి నౌకరు గేటుబయట వీధిలోకి తీసుకెళుతున్నాడు.

అంతవరకే చూడగలిగింది శుశ్రుత. ఆపైన అక్కడ ఒక్కక్షణం కూడా నిలవలేకపోయింది.

పైటచెంగుతో కళ్ళువత్తుకొంటూ గిరుక్కునతిరిగి ఇంట్లోకి పరుగెత్తింది. ఆమె వెళ్తున్న తీరుచూసి ఠారెత్తిపోయాడు చరక్. ఏ అఘాయిత్యం చేసుకుంటుందోనని భయమేసింది అంతే!... మిత్రవిందతో కూడా చెప్పకుండా శుశ్రుత వెనకే పరుగెత్తాడు.

వెళ్తున్న ఇద్దర్నీ చూస్తూ చిన్నగా నవ్వుకున్నాడు అగ్నివేశాచార్యుడు. సందేహం లేదు. భార్యా భర్తల మధ్య పెద్ద చిచ్చు రగులుకోనుంది. పాపం చరక్. ఎలా సమర్థించుకుంటాడో ఏమిటో అన్పించింది. కోడలు దేవమ్మవంక చూశాడు.

"ఈ అమ్మాయిని ఆ ఇంటికి తీసుకెళ్ళమ్మా. నేను తర్వాత వస్తాను" అని చెప్పి అందర్నీ చూస్తూ– "మీ సందేహాలు నాకు అర్థమవుతున్నాయి.

ఈ అమ్మాయి పేరు మిత్రవింద. గుజరాతీ అమ్మాయి. మన చరక్‌ను ప్రేమించి వెంటవచ్చేసింది. త్వరలో చరక్‌ను పెళ్ళిచేసుకుంటుంది. చరక్‌కి శుశ్రుత, మిత్రవింద ఇద్దరు భార్యలు. నేను వీళ్ళను ఆశీర్వదించటానికి తగిన కారణం ఉంది. నేను ఏ పనైనా న్యాయాన్ని, ధర్మాన్ని, ధర్మ సూక్ష్మాన్ని గౌరవిస్తూ

చేస్తాను. అది మీ అందరికీ బాగా తెలుసు. ఏది ఎందుకు జరిగిందో సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది.

మిత్రవింద తనవాళ్ళందర్నీ వదిలేసి వచ్చింది. ఇకనుంచి ఆమెకు అన్నీ మనమే. ఆమెకు మన భాషరాదు. మీరు తనను పరాయిదానిలా చూసి బాధపెట్టకూడదు. ముఖ్యంగా శ్రావణీ, మిత్రవిందకు తోడుగా ఉండే బాధ్యత నీది. ఇక వెళ్ళిరండి" అన్నాడు.

వచ్చిన అగ్రహారం స్త్రీలకు ఆ మాటలు కొంత అర్థమయ్యాయి, కొంత అర్థంకాలేదు.

మిత్రవింద మానవకన్య అంటే ఎవరికీ నమ్మబుద్ధికాలేదు. చాలా సందేహాలున్నాయి.

కాని నోరు తెరిచి అగ్నివేశాచార్యుని అడిగే ధైర్యం ఎవరికీ లేదు. తమ సందేహాలను దిగమింగి వెను తిరిగి గృహోన్ముఖులయ్యారు స్త్రీలంతా.

అగ్నివేశాచార్యుడు వెనుతిరిగి – శుశ్రుత ఇంటివైపు అడుగులేశాడు.

తనవెనకే చరక్ రావటం చూసి–వీధి తలుపులు వేసేయబోయింది శుశ్రుత. వాటిని తోసుకొచ్చేశాడులోనకి. అయినా దొరక్కుండా వేగంగా పడగ్గదిలో దూరి–తలుపులేస్తుంటే ఆ ప్రయత్నం కూడా భగ్నం చేసి లోనకొచ్చేశాడు. పారిపోడానికి అవకాశంలేకుండా డోరేసి అడ్డంగా నిలబడ్డాడు.

ఇక ఏం చేయాలో తెలీక రెండు చేతులతో ముఖం కప్పుకుని బెడ్‌మీద కూలబడి ఏడుస్తూండిపోయింది. ఆమె ఏడుస్తుంటే చరక్ కళ్ళలోనూ నీరు సుడి తిరిగింది. మనసుకు బాధగా వుంది. కాని ఎలా ఆరంభించాలో, ఏమనిసచ్చచెప్పాలో అర్థంగావటంలేదు. "శుశ్రుతా...ప్లీజ్. నేను చెప్పేది విను..." ఎలాగో గొంతు విప్పాడు.

"ఏం చెప్తావ్?" బెడ్ దిగి కళ్ళు తుడుచుకుని కోపంగా నిలదీసింది శుశ్రుత.

"చెప్పు చరక్. ఏం చెప్తావ్. నాకన్నా అందంగా ఉందిగా... నాకన్నా పొడుగ్గా ఉంది. నచ్చింది. అందుకని వెంటతెచ్చుకున్నానంటావా?

పెళ్ళికిముందు అందంగా ఉన్నావని నాచుట్టూ తిరిగావ్. పెళ్ళయి పోయింది. ఇప్పుడు నేను పాతబడి పోయాను. కొత్తగుర్రాన్ని తెచ్చుకున్నావ్. ఇక నేనెందుకు? ఇక్కడ నాకేం పని?"

"అది కాదు శుశ్రుతా..."

"కాకపోవడమేంటి... అదే... నాకు తెలిసి నేను నీకేలోటూ చేయలేదు. పెళ్ళయి పక్షం రోజులు కలిసున్నాం. నీకోసం విరహంతో వేయికళ్ళతో ఎదురుచూస్తుంటే నువ్వు ఎవరో వగలాడిని వెంటేసుకొచ్చావ్..."

"ఆమె వగలాడికాదు శుశ్రుతా... మిత్రవింద"

"ఏదో గోవింద... అది నాకవసరమా?"

"నా మాట వింటావా?" అంటూ దగ్గరకు తీసుకోబోయాడు. దొరక్కుండా పక్కకు దూకేసింది. "నన్ను తాకొద్దు. ఏం చేస్తానో నాకే తెలీదు" అరిచింది.

తమ పునస్సమాగమం ఇంత సమస్యాత్మకం అవుతుందనుకోలేదు.

ముందు శుశ్రుతలో కోపం, ఆవేశం తగ్గాలి. తగ్గితేగాని శాంతంగా తన మాటలు వినదు. ఏం చేయాలి? కళ్ళు తుడుచుకుంది శుశ్రుత.

"నువ్వు నా ప్రేమను నా నమ్మకాన్ని దెబ్బతీశావ్. ఇంకా నేనిక్కడ ఉండటం అవసరమా... వెళ్ళిపోతాను. నా తరపున న్యాయం అడగటానికి నాకిక్కడ ఎవరున్నారని... అమ్మానాన్న దగ్గరికి వెళ్ళిపోతాను. మీరు సుఖంగా ఉండండి. దైవంలాంటి జేజితాతగారూ మిమ్మల్ని సమర్థించాక ఇంకెవరు నా తరపున మాట్లాడతారు..." వెక్కివెక్కి ఏడుస్తూనే సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకోవటం ఆరంభించింది శుశ్రుత.

ఆమెకు ఎలా నచ్చచెప్పాలో తెలీక తలపట్టుకున్నాడు చరక్. ఇంతలో అగ్నివేశాచార్యుడు లోనకొచ్చాడు. పడగ్గదివంక చూడగానే పరిస్థితి అర్థమై పోయింది. "మీరు గొడవపడ్డం అయిపోతే ఓ సారిలా బయటకు రండి. మాట్లాడాలి" అంటూ హాల్లో సోఫాలో కూర్చున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఎంత కోపం ఉన్నా అగ్నివేశాచార్యుని మాటను కాదనే ధైర్యం శుశ్రుతకు లేదు. చరక్ కన్నా ముందే చరచరా బయటికొచ్చి ఎదురుగా నిలబడింది. పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

వెనకే బయటికొచ్చిన చరక్ ఓ ఛైర్ లాక్కుని ఎడంగా కూర్చున్నాడు.

ఇంతలో ముందుగా మిత్రవింద, ఆమెకి వెనుకే దేవమ్మ, ఆమెను అనుసరించి శ్రావణి లోనకొచ్చేశారు. ఈ సమయంలో శ్రావణి ఇక్కడ ఉండటం మంచిదా కాదాని చరక్ సందేహించాడు.

కాని అగ్నివేశాచార్యుడికి మనవరాలిమీద, ఆమె తెలివితేటల మీద అపారమైన నమ్మకం ఉంది. రహస్యాల్ని ఎవరికీ చెప్పదు.

"శ్రావణీ... తలుపులు మూసిరా" అన్నాడు స్థిరంగా. శ్రావణి వీధితలుపు మూసివచ్చి– అగ్నివేశాచార్యునికి కాస్త ఎడంగా కూర్చుంది.

దేవమ్మ శుశ్రుతను సోఫాలో తన పక్కన కూర్చో బెట్టుకుంది. మిత్రవింద నిలబడే ఉంది. ఈ సమావేశం తన గురించేనని ఆమెకు తెలుసు. కాని తనకు వీరి భాష తెలీదాయె.

అపుడు అగ్నివేశాచార్యుడు "మిత్రవిందా! ఇటురా తల్లీ. ఇలా నా పక్కన కూర్చో" దేవనాగరిలో పిలిచాడు. మిత్రవింద ఆయనకు రెండో పక్కన కూర్చుంది. మేలిముసుగు తొలగించుకుంది. అంతా తమవారేనని నమ్మకం కుదిరితేనే అలా ముసుగు తొలగించుకోవటం జరుగుతుంది. "అమ్మా శుశ్రుతా..." పిలిచాడు అగ్నివేశాచార్యుడు.

ముఖం పైకెత్తి చూసింది శుశ్రుత.

"నీ భర్తమీద నీక్కోపం రావటం సహజమే. కాని ఏం జరిగిందో కూడా తెలుసుకోవటం ముఖ్యం. ఇన్ని రోజులూ నీ భర్త ఎక్కడున్నాడో నీకు తెలుసా?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"జేజితాతగారూ. చరక్ మీతోనే ఉన్నాడు గదా" అంది అమాయకంగా శుశ్రుత.

"లేదమ్మా. నాతోనూ లేడు. మీరెవరూ నేను చెప్పేది నమ్మలేరు. కాని నమ్మక తప్పదు. నా జీవితంలో నేనెప్పుడూ అసత్యాలు ఆడలేదు. కనుక నేనిప్పుడు చెప్పేది మీరందరూ నమ్మితీరాలి.

చరక్ ఇంతకాలం నాతో లేడు. ద్వాపరయుగంలోని శ్రీకృష్ణపరమాత్ముని ద్వారకానగరంలో ఉన్నాడు. బయటివాళ్ళతో చెప్పినట్టు నీతో అబద్ధం చెప్పలేను గదా. ఈ అమ్మాయి మిత్రవింద మీరునుకుంటున్నట్టు గుజరాతీ గ్రామీణ యువతికాదు. అలనాటి ద్వారకా నగరానికి చెందిన యువతి"

ఒక్కసారి అందరూ తీవ్రమైన దిగ్భ్రాంతికిలోనయ్యారు. ద్వాపరయుగపు ద్వారకానా...?! నిజమేనా?! చెబుతున్నది జేజి...

"కాని ఆ ద్వారక సముద్రంలో మునిగిపోయింది గదా... దాని గురించి చదివాను" అని అనుమానంగా అడిగింది శుశ్రుత.

"నేను చెప్పేది ద్వారక నీటమునగక ముందు కాలం సంగతి. అంటే సుమారు అయిదువేల నూట డెబ్భై అయిదు సంవత్సరాల క్రితం నాటి మాట. గతజన్మలో చరక్, చతుర్ నామధేయంతో ద్వారకలో పుట్టి పెరిగినవాడు.

మిత్రవిందా ద్వారకాపురిలో పుట్టి పెరిగింది. ఇద్దరూ శ్రీకృష్ణభగవానుని, బలరామ ప్రభువునీ నేరుగా దర్శించినవారు, మాట్లాడినవారు. వీళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు.

పెద్దలు పెళ్ళికి నిశ్చితార్థం కూడా జరిపారు. కాని పెళ్ళికిముందే ఓడ ప్రమాదంలో చతుర్ మరణించటంతో అక్కడితో గతజన్మ అలా విషాదంగా ముగిసింది. తరువాత ఇంత కాలానికి చతుర్ మరుజన్మగా మా ఇంట పుట్టి చరక్‌గా పెరిగాడు.

ఇప్పుడు చరక్ అదేకాలానికి ద్వాపరలోని ద్వారకలో ప్రవేశించటంతో తిరిగి వీళ్ళప్రేమ కొనసాగింది. ఇదంతా వింటుంటే నీకు ఇదేదో కల్పితగాథలా తోచవచ్చు. కాని ఇదే నిజం. నేను తయారుచేసిన కాలనాళిక మందసం ద్వారా ఇది సాధ్యపడింది. తిరిగి వచ్చేప్పుడు మిత్రవిందను వెంట తీసుకురాక తప్పలేదు.

ఇది బయట ఎవరికీ తెలీకూడని నిగూఢరహస్యం. బయట మనకి శత్రువులున్నారు. వాళ్ళకి తెలిసినా ప్రమాదమే. పోలీసులకు, ప్రభుత్వానికీ తెలిసినా ప్రమాదమే. ఇక పురాతన స్త్రీ అనగానే మిత్రవిందను చూడ్డానికి జనం క్యూకడతారు.

ప్రభుత్వం ఎంక్వయిరీలంటూ వేధిస్తుంది. మనం ప్రశాంతంగా ఉండలేం. కాబట్టి ఈ రహస్యాన్ని మీ గుండెల్లోనే దాచుకోవాలి.

ముఖ్యంగా శుశ్రుతా... నీ భర్త చరక్ విషయంలో నువ్వు పొరబడకూడదు. వాడు సామాన్యవ్యక్తి కాదు. దైవాంశసంభూతుడు. పుడమిమీద తిరిగి ధర్మ సంస్థాపనచేసి మహోన్నతుడు కానున్నాడు.

నీవు, మిత్రవింద వాడికి రెండు కళ్ళు... ఏ కంటినీ వదులుకోలేడు. మిత్రవింద నీ సోదరి అనుకొని ఆదరించు. ఆమెకు మనం తప్ప ఎవరూలేరు. ఇకనైనా గొడవ ఆపేస్తావుగా?" అనడిగాడు శుశ్రుతని.

దేవమ్మ, శ్రావణి, శుశ్రుతకు తల గిర్రున తిరుగుతున్నట్లయిపోయింది. కాలనాళిక మందనం ఏమిటి... దానిలో భూతకాలంలోకి వెళ్ళటం ఏమిటి?

అప్పుడు అక్కడ ప్రేమించిన అమ్మాయిని 2013 కలికాలంలోకి తీసుకురావటం ఏమిటి...?!!

కాని చెబుతున్నది జేజిగారు... నమ్మక తప్పదు. ఈ కాలంలో ఇలాంటి అద్భుతాలా...? శుశ్రుత బదులుచెప్పకుండా మౌనం వహించింది. తర్వాత– "లేదు జేజి తాతయ్యగారూ... నేను పుట్టింటికి వెళ్ళిపోదామనుకుంటున్నాను" అంది స్థిరంగా.

భాష తెలియదుగాని ముఖకవళికల్నిబట్టి మాటల భావాల్ని అర్థం చేసుకునే శక్తి మిత్రవిందకు ఉంది. ఉన్నట్టుండి లేచి "అరవిందా...." అంటూ మృదువుగా పిలిచింది. ఆ పిలుపువిని ఉలిక్కిపడ్డారంతా.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. అరవింద... ఎవరీ అరవింద? మిత్రవింద ఎవర్ని ఇక్కడ అరవింద అని పిలుస్తోంది? మిత్రవింద చూపుల్నిబట్టి ఆమె పిలిచింది శుశ్రుతనే అని గ్రహించి మరింత విభ్రాంతులయ్యారు. ఈ మలుపేమిటో అర్థంగాక చరక్ పిచ్చిగా చూస్తున్నాడు.

కాని మిత్రవింద పిలుపు వింటూనే కొరడాదెబ్బ తిన్నట్టు ఉలిక్కిపడింది శుశ్రుత.

ఆ పిలుపు ఆమె చెవులనుండి జ్ఞానేంద్రియాల్లో ప్రవేశించి మారుమోగ సాగింది. అదే గొంతు... అదే పిలుపు... తమ ఎక్కడో విందీ... ఎక్కడ... అరవింద... ఎవరిపేరు? మతిపోయినదానిలా లేచినిలబడి మిత్రవిందవంక చూడసాగింది. మిత్రవింద చిరునవ్వుతో వచ్చి– శుశ్రుత ఎదురుగా నిలబడింది.

"నేను... నేను శుశ్రుతను... అరవిందెవరు?" చిన్నగా గొణిగింది శుశ్రుత. అగ్నివేశాచార్యుడు కూడా ఆశ్చర్యపోతూ లేచి పక్కకొచ్చాడు. శుశ్రుత మాటల్ని దేవనాగరిలో మిత్రవిందకు చెప్పాడు.

మిత్రవింద ఇక మాట్లాడలేదు. తన కుడిచేయి ముందుకు చాపి బొటన వేలిని శుశ్రుత భ్రూమధ్యంలో ఉంచి కళ్ళుమూసుకుని ఆత్మశక్తిని ప్రేరేపించింది. శుశ్రుతకు కళ్ళు అరమూతలు పడ్డాయి. ఒక్కసారిగా కళ్ళముందు చిమ్మచీకటి ఆవరించింది.

కొద్దిక్షణాల తర్వాత ఆమె కళ్ళముందు ఒక దృశ్యం ఆవిష్కృతమైంది. జోడు గుర్రాల రథంలో ఇద్దరు కన్యలు వాహ్వాళిపోతున్నారు. ఒకామె వయసు పదహారేళ్ళు, రెండో ఆమె వయసు పన్నెండేళ్ళు. ఎవరా ఇద్దరు? శుశ్రుత కళవళపడుతోంది.

వాళ్ళు ఎవరో కాదు. పెద్దమ్మాయి మిత్రవింద, రెండో అమ్మాయి తను. సందేహంలేదు. తనే... ఇప్పుడు దేవనాగరిలోని ఆ యువతుల సంభాషణ తనకి అర్థమవుతోంది. దేవకన్యల్లా ఉన్నారిరువురూ.

"అరవిందా!" మిత్రవింద పిలుపు.

"ఊ" అంది అరవింద.

"చెల్లీ... ఏమియా దీర్ఘాలోచన?"

"అక్కా.. నీవు వరించువాడెవడైనను ముందుగా నాకు తెలుపవలె" అంది అరవింద.

"ఏలకో...."

"నీకన్నను ముందుగా నేనే వాడిని వరించి వివాహమాడెద" అంది అరవింద.

"ఏమా వింతకోరిక? వగలాడి" చెల్లెలి నెత్తిమీద మొట్టి నవ్వింది మిత్రవింద.

అంతలోనే ఆ దృశ్యం అదృశ్యమైంది.

వేరొక దృశ్యం గోచరించింది.

జోడుగుర్రాలమీద ఇద్దరు కన్యలు పోటాపోటీగా సవారీ చేస్తున్నారు. ఒకామె వయసు పద్దెనిమిది. రెండో ఆమె వయసు పదహారు. వారిని అనుసరించి వేరొక అశ్వం మీద పధ్నాలుగేళ్ళ బాలుడు వస్తున్నాడు. అశ్వాల గిట్టల నుండి ధూళి ఎగసిపడుతోంది.

శుశ్రుతకు అర్థమైపోతోంది.

ముందుగా పోతున్న అశ్వంమీద ఆరవింద, అంటే తను. రెండో అశ్వం మీద అక్క మిత్రవింద. మూడో అశ్వం మీద తమ్ముడు ధాత... తామంతా ద్వారకలోనే మిక్కిలి ధనవంతుడగు శివదేవగుప్తుని సంతానం. తాము ప్రయాణిస్తున్నది ద్వారక నుండి హస్తినాపురం వెళ్ళు రాజమార్గం. అప్పుడప్పుడూ ఇలా వాహ్వాళికి రావటం తమ అలవాటు.

"ఏయ్ అరవిందా... ఆగుము...." తన అశ్వాన్ని నిలువరిస్తూ అరుస్తోంది మిత్రవింద. కాని అరవింద ఆగలేదు. ధాత తన అశ్వాన్ని ఆపాడు.

అరవింద తన అశ్వాన్ని మరింత వేగంగా దౌడు తీయించింది. ఆ అశ్వం మలుపు తిరుగుతూండగా ఎదురుగా ఒక జోడు గుర్రాల రథం

దూసుకొచ్చింది. అరవింద అశ్వం రథ అశ్వాల్ని ఢీకొంది. ఊహించని విధంగా అరవింద అశ్వం నుండి ఎగిరి దగ్గరలోని రాతిబండమీద పడింది. నెత్తురు మడుగు. అంతే. పడిన అరవింద ఇక లేవలేదు.

వెనకే వచ్చిన మిత్రవింద, ధాతలు తనమీదపడి రోధిస్తున్నారు. అప్రయత్నంగా కళ్ళు తెరిచింది శుశ్రుత. ఆమె కళ్ళనుండి బొటబొటా ప్రవహించింది కన్నీరు. మిత్రవింద తన చేతిని వెనక్కి తీసుకుంది.

"అక్కా...." అంది ఆర్తిగా శుశ్రుత.

"లేదు లేదు. ఇప్పుడు నీవు నాకు అక్కవి. నేను నీకు చెల్లిని. నీ జన్మ మారినదిగదా. నా అంశతో మరల జన్మించి నే వలచినవాడిని వివాహమాడి పంతము నెరవేర్చుకొంటివి గదా. ఇక మనమధ్య తగవులేల?

ఏ యుగమందైనను లోకమున మానవజన్మలన్నియు గతజన్మల సంబంధముననే ఏర్పడును. ఇక అలకమానుట మేలు" అంది మిత్రవింద.

శుశ్రుతకు ఇప్పుడు దేవనాగరి అర్థమవుతోంది. కాని మాట్లాడలేదు. "నన్ను, నా అవివేకాన్ని క్షమించవే" అంటూ మిత్రవిందను కౌగిలించుకొని ఏడ్చేసింది శుశ్రుత. అలా కాస్సేపు ఏడుస్తూనే ఉన్నారు.

ఆ ఇద్దర్నీ వింతగా చూస్తూండిపోయారంతా. విషయం ఏమిటో అగ్ని వేశాచార్యుడు ఒక్కడికే అర్థమైంది. చరక్‌కి కూడా అర్థంకాలేదు. ఏమైతేనేం వాళ్ళిద్దరూ ఒక అవగాహనకొచ్చారు, చాలు అనుకున్నారు అంతా. ఇక్కడ చరక్‌కి అర్థంకాకపోవటానికి కారణం వుంది. చతుర్‌గా గతజన్మలో అతను మిత్రవిందను ప్రేమించునాటికి మూడేళ్ళ క్రితమే అరవింద మరణించింది. కాబట్టి అతనికి అరవింద తెలీదు.

సమస్య తేలిగ్గా పరిష్కారమైనందుకు అంతా సంతోషంగా ఊపిరి తీసుకున్నారు.

అగ్నివేశాచార్యుడు మిత్రవిందను దేవమ్మగారితో ఆ ఇంట్లో ఉంచాలను కున్నాడు. కాని శుశ్రుత ఒప్పుకోలేదు. మేడమీద గదిని మిత్రవింద కోసం ఏర్పాటు చేసింది. మిత్రవింద ఒంటిమీద కొద్దిగా నగలు మాత్రం ఉంచి మిగిలిన ఏడువారాల నగలు, సువర్ణనాణాలు, వజ్రవైడూర్యాది సంపదనంతా చరక్, అగ్ని వేశాచార్యుని నివాసం అండర్ గ్రౌండ్‌లోని పెద్ద ఐరన్ సేఫ్‌లో భద్రం చేశాడు. ఆ రోజే ఈ కాలం నగలు, చీరలకు ఆర్డర్ చేశాడు చరక్. ఆ విధంగా మిత్రవింద

కూడా మున్నలూరివారి అగ్రహారంలో ఏ ఆర్భాటం లేకుండా శుశ్రుత ఇంట సెటిలయింది.

* * * * *

ఆ రోజు మున్నలూరివారి అగ్రహారంలో ఒక కొత్త బిచ్చగాడు ప్రవేశించాడు. ఆ బిచ్చగాడు ఎవరో కాదు. మాంత్రికుడు మరిడి సోమయ్య శిష్యుడు విళంబి. వాడు రంపచోడవరం అడవిలో పులికొండయ్య మూలంగా అగ్నివేశాచార్యుని విలాసం తెలుసుకుని ఆ రోజే నేరుగా మండపేట వచ్చేశాడు.

అక్కడ ఒక లాడ్జిలోదిగాడు. తను మామూలుగా అగ్రహారంలో ప్రవేశించి నందువలన ప్రయోజనం ఏమీలేకపోగా తనను ఎవరన్నా గుర్తుపడితే ప్రమాదం. పైగా తను వెళ్ళేది ఆ మహావ్యక్తి అగ్నివేశాచార్యుని చూడ్డానిక్కాదు. తగిన ఇన్ఫర్మేషన్ కోసం.

ఆ పైన ఆ డ్రైవరు కాశిగాడు చెప్పిన అందమైన యువతి ఎవరో తెలుసు కోవటం కోసం. తర్వాత అగ్నివేశాచార్యుని భవిష్యకార్యక్రమాలు ఏమిటో తెలుసు కోవటం. ఇవి సాధించాలంటే తను బిచ్చగాడిలా వేషం మార్చుకొని వెళ్ళటం మంచిదనిపించింది.

మరునాడు తన బైక్‌ను లాడ్జిలోనే వదిలేసి ఆటోలో వచ్చి దారిలో దిగి పోయాడు. తన వేషాన్ని బిచ్చగాడిలా మార్చుకుని కాలినడకన అగ్రహారంలో ప్రవేశించాడు. అతుకుల ప్యాంటు, అరిగిపోయిన చెప్పులు, చినిగిన చొక్కా, తలకో తుండుగుడ్డ, కాలు కొద్దిగా అవిటి వాడిలా ఈడుస్తూ అగ్రహారంలో భిక్షాటన ఆరంభించాడు విళంబి.

ముఖ్యంగా బ్రాహ్మణ అగ్రహారాన్ని చుట్టివున్న గోడ, ఎంట్రన్స్ ద్వారం పరిసరాల్లోనే సంచరిస్తూ గేటు వైపు ఓ కన్ను వేసుంచాడు. లోన తిరుగుతున్న డ్రైవరు కాశీని గుర్తించాడు. కాని తొందరపడి గేటు దాటి లోపలకి అడుగు పెట్టలేదు.

* * * * *

వచ్చినరోజునుంచే మిత్రవిందకు అక్కడి వాతావరణం ఆ భవంతులు, వాటి నిర్మాణం అంతా వింతగా అన్పించింది. "గృహములు ఇంత చిన్నవిగా

యున్నవేమి? ఇచట చలువరాతి మందిరములు లేవా? ఆముదపు దివిటీలు, దీపములు ఏవి?

రేతిరికి వెలుతురెటుల వచ్చును. అటవీభూములు, ఉపవనములు ఆలమందలు ఎవ్వి? ఈ కాలపు మనుజులు ఎటుల జీవించుచున్నారు?" ఇలాంటి ప్రశ్నలతో చరక్‌ను బుర్రతింటూనే ఉంది. ఓపిగ్గా ఆమె సందేహాలు తీర్చే ప్రయత్నం చేశాడు.

మిత్రవింద కోసం ఏర్పాటు చేసిన గదిలో అటాచ్డ్ బాత్‌రూంలో స్నానానికి ఏర్పాట్లుచేసింది శుశ్రుత. మిత్రవింద స్నానానికి వెళ్ళగానే– శుశ్రుతను కౌగిట బంధించేశాడు చరక్. గువ్వలా భర్తబాహువుల్లో ఒదిగిపోయింది శుశ్రుత. "రాత్రి వరకు నువ్విలా అల్లరిచేయకుండా ఉంటేమంచిది. అక్క కంటబడకూడదు" అంది గోముగా.

"ఓసినీ... నాకింకా బుర్రకెక్కలేదే. తనేమో నిన్ను అక్కా అంటోంది. నువ్వేమో తనని అక్కా అంటున్నావ్. అసలు మీ ఇద్దరి సంబంధమేంటి?"

"ఏముంది? ముందుగా నీ భార్య నయ్యాను గాబట్టి ఆ విధంగా తనకు నేను అక్కవరసే గదా?" కౌగిలి విడిపించుకుంటూ చెప్పింది శుశ్రుత.

"మరి నువ్వెందుకు మిత్రవిందని అక్కా అంటావ్. చెల్లీ అనొచ్చుగదా" అన్నాడు చరక్.

"ఎలా అనగలను? మిత్రవిందకు తోడబుట్టినదాన్ని గదా" అర్ధంగాక చరక్‌కి పిచ్చెక్కినట్టయింది.

"ఓర్నాయనో... ఒసే... అదే నా బ్రుర తింటుందంటే నువ్వంతకన్నా తింటున్నావే. తనకి నువ్వు తోబుట్టువేంటి? తను ద్వారాకావాసిగదా...." అన్నాడు చరక్.

"ద్వారక వెళ్ళినవాడివి. అరవింద గురించి తెలుసుకోలేదా?"

"మధ్యలో అదొకటి. ఎవరా అరవింద?"

"నేనే...."

"నువ్వా...."

"అవును నేనే ద్వారకలో శివదేవగుప్తులవారికి పద్దెనిమిదిమంది సంతానంలో పదహారోది అక్క మిత్రవింద. దాని తర్వాత పుట్టిన పదిహేడో సంతానం నేనే అరవిందను. ఆఖరివాడు తమ్ముడు ధాత"

చరక్‌కి బుర్రగిర్రున తిరిగినంత పనైంది. శుశ్రుత మాటలే నిజమైతే ద్వారకలో అరవింద తనకు ఎందుకు కనబడలేదు? గతజన్మ జ్ఞాపకాలు ఏర్పడిన తర్వాత కూడా అరవింద గురించే వినలేదే...

"అదే నిజమైతే ఇంతకాలం మన పరిచయంలో ఈ విషయం నువ్వు నాకెందుకు చెప్పలేదు?" కాస్త అసహనంగానే అడిగాడు.

ఆ మాటలకి ఫక్కున నవ్వింది శుశ్రుత. "చరకా... అనవసరంగా నువ్వు తికమకపడుతున్నావు. ద్వారక వెళ్ళకముందు నీకు గతజన్మ గుర్తుందా? లేదుగా? అలాగే నాకూ లేదు. అక్క మిత్రవింద నాకు పూర్వజన్మ జ్ఞానం కలిగించటం వలన తెలిసింది"

శుశ్రుత మాటలు వింటుంటే– ద్వారకలో తనతో సాధుపుంగవుడు శివయోగి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. "నీ భార్య మిత్రవింద అంశతో జన్మించినది. కలతచెంద పనిలేదు" అన్నాడు.

ఆ మాటలకు అర్థం ఇదేనేమో. ఆలోచిస్తూనే శుశ్రుత మాటల్ని వింటున్నాడు.

"అందరిలోనూ అక్క, నేనూ, తమ్ముడు ధాత ముగ్గురం చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళం. మా ముగ్గురికీ హార్స్‌రైడింగ్ అంటే చాలాఇష్టం. మాగాళ్ళతో సమంగా అక్కా, నేనూ గుర్రాలను దూకించగలం.

అక్కా, నువ్వు ఎవడ్ని వరించినా నాకు చెప్పాలి సుమా. ఎందుకంటే నీకన్నా ముందుగా వాడ్ని నేనే పెళ్ళిచేసుకుంటా అంటూ అక్కని ఉడికించి మొట్టి కాయలు తినేదాన్ని. ఎంతో హ్యాపీగా ఉండేవాళ్ళం. కాని విధి మమ్మల్ని చూసి ఓర్వలేకపోయింది.

ఆ రోజు సాయంకాలం – నా పదహారో ఏట అశ్వ ప్రమాదంలో నేను చనిపోయాను. ఆ తర్వాత మూడేళ్ళకు మిత్రవింద నీకు పరిచయమైంది. కాబట్టి ద్వారకలో నా గురించి నీకు తెలిసే అవకాశం లేదు.

బహుశా అక్కడే మీ వివాహం జరిగి ఉంటే నా గురించి తెలిసేదేమో. కాని ఓడ ప్రమాదరూపంలో విధి నిన్ను కూడా బలితీసుకుని అక్క జీవితాన్ని విషాదంలో ముంచేసింది.

చరక్... మనం మాట్లాడే మాటకున్న విలువ చాలా గొప్పది. ఒక్కోసారి మనం సరదాగా అనుకున్నా కూడా ఆ మాటలు ఏదో కాలంలో నిజమవుతాయి.

అందుకు నేనే ఓ ఉదాహరణ. మిత్రవింద కన్నా నేనే ముందుగా నిన్ను పెళ్ళి చేసుకున్నాను" అంటూ వివరించింది శ్రుశ్రుత. అంతా విని పెద్దగా నిట్టూర్చాడు చరక్.

"పోన్లే నాకో శ్రమ తప్పింది. ఇప్పుడు నీకూ దేవనాగరిభాష వచ్చు గాబట్టి మిత్రవిందకు త్వరగా మన తెలుగుభాష నేర్పు" అన్నాడు.

"నాకు దేవనాగరి తెలుసని ఎవరన్నారు?" అంది.

"ఒకరనాలా ఏమిటి? నువ్వు మిత్రవిందతో దేవనాగరిలో సంభాషించడం విన్నాను గదా"

"అది అక్క చేతి మహత్యం. నాకు గతజన్మ గుర్తొచ్చింది. కాని ఆ భాష మాట్లాడటం అంత తేలిక్కాదు. అర కొరగా గుర్తున్నా ఈ కాస్సేపట్లోనే మర్చే పోయాను. కాబట్టి దేవనాగరి తెలిసిన నీవుగాని, జేజితాతగారు గాని మిత్రవిందకు తెలుగుభాష నేర్పాలి" అంది.

చరక్ గాఢంగా నిట్టూర్చాడు. "సరి సరి. మా తంటా లేవో మేంపడతాం గాని బుర్ర వేడెక్కిపోయింది కాస్త కాఫీ ఇస్తావా?" అనడిగాడు.

"వెళ్ళి హాల్లో కూర్చోతెస్తాను" అంటూ కిచెన్‌లోకి వెళ్ళింది శ్రుశ్రుత.

చరక్ వచ్చి హాల్లో కూర్చుని– టీవీ ఆన్ చేశాడు. టీవీలో "మాయాబజార్" సినిమా వస్తోంది. "లాహిరి లాహిరి లాహిరిలో ఓహో జగమే ఊగెనుగా తూగెనుగా...." శశిరేఖా అభిమన్యులు వెన్నెట్లో పడవ మీద విహరిస్తూ పాడుకుంటున్నారు.

ఇంతలో స్నానం ముగించిన మిత్రవింద సింపుల్‌గా తయారై జడ అల్లుకొంటూ మెట్లు దిగివచ్చింది. చరక్ వద్దకొస్తూ– "ఎచటి నుండీ మధుర గానము? ప్రియుడా. గంధర్వులు పాడుచున్నారా? వారికి మీ తెలుగుభాష తెలియునా?" అంటూ వచ్చి చరక్ సరసన సోఫాలో కూర్చుంది.

చరక్ టీవీ వంక చూపించాడు. మిత్రవింద టీవీని విచిత్రంగా చూసింది. "ఇదియేమి వింత... పేటికలో స్త్రీ, పురుషులు పాడుచున్నారు. ఇది మంత్రాల పేటికయా?" అంది ఆశ్చర్యపోతూ.

"ఇందు మాయలు, మంత్రములు ఏమియును లేవు. దీన్ని టెలివిజన్ అనెదరు. విద్యుత్‌తో పని చేయును. మనకు దృశ్యములను చూపించును, శబ్దములను వినిపించును. ఇది మాయాబజార్ అనెడు సినిమా...."

"సినిమా అనిన ఏమి?"

"దృశ్యకావ్యము. ఇది శశిరేఖా అభిమన్యుల వివాహగాధ ఇతివృత్తం" దేవనాగరిలో ఓపిగ్గా వివరించాడు.

"ఓహో... ఇందు చిత్రములు తెలుపు నలుపు వర్ణముల కదులుచున్న వేమి?" అడిగింది.

"ఇది బ్లాక్ అండ్ వైట్ సినిమా. అనగా తెలుపు, నలుపు వర్ణముల చిత్రము"

"అభిమన్యులవారు తెలుసు. మనము ద్వారక నుండి వచ్చుసరికి వారు ద్వారకయందే ఉన్నారుగదా. పాండవులు అరణ్యవాసమున వున్నందున సుభద్రా దేవి తనయుడు అభిమన్యుని తోడ్కొని ద్వారక పుట్టింటికి వచ్చియున్నది. కాని... ఈ శశిరేఖ ఎవరు?"

"శశిరేఖ బలరామ ప్రభువుల కుమార్తె, అభిమన్యునికి మరదలే గదా...."

"ఇదియేమి చోద్యము. చతురా! ఏల ఈ చతురములు? బలరామ, రేవతీదేవి దంపతులకు శశిరేఖయను కుమార్తె లేదు గదా. ఈ శశిరేఖ ఎచట నుండి వచ్చినది? అభిమన్యులవారికింకను వివాహము కాలేదు గదా. నేటి మానవులు ఇటుల కల్పితగాధలతో జనులను వినోదపరచుచున్నారా?

తలపట్టుకున్నాడు చరక్.

నలభై సంవత్సరాల క్రితం ఎప్పుడో ఒక బెంగాలీ చిత్రం స్ఫూర్తితో శశిరేఖ పాత్రను సృష్టించి అద్భుతంగా తీసి విజయవంతమైన సినిమా "మాయా బజార్" ఇప్పుడు మిత్రవింద వచ్చి శశిరేఖ ఎక్కడ్నుంచి వచ్చిందంటూ గోలచేస్తే ఏం చెప్పాలి, ఎలా చెప్పాలి?

ఒక ట్రేలో అందమైన రెండు మగ్గుల్లో కాఫీ, ఒక మగ్గులో వేడిగా చిక్కని పాలతో వచ్చిన శుశ్రుత అతడి అవస్థచూసి నవ్వుతూ మిత్రవిందకు పాలమగ్గు అందించి చరక్‌కు కాఫీ ఇచ్చి తనొకటి తీసుకుని ఎదురుగా కూర్చుంది.

"నా అవస్థచూస్తే నీకు నవ్వొస్తోందా? ప్రశ్నలమీద ప్రశ్నలతో బుర్ర తినేస్తోంది. నీ అక్కకి నువ్వే సమాధానాలు చెప్పుకో" అంటూ లేవబోయాడు చరక్.

అతడి చేయిపట్టి వెనక్కి లాగింది మిత్రవింద.

"నా సందేహములకు నీవే సమాధానములు చెప్పవలె. అక్క శుశ్రుతమీద కోపమేల?" అంది.

"ఓర్నాయనో... వినలేక ఛస్తున్నాను. శుశ్రుతా, ఎవరో ఒకరు సర్దుకుపోతే బాగుంటుంది. తనూ నిన్ను అక్కా, అని, నువ్వు తనను అక్కా అని... ఇదేం బాగోలేదు. చూడు మిత్రవిందా! ఇది కలికాలము.

కల్పనలు సహజము. శ్రీకృష్ణప్రభువుల గాథలు సినిమాలుగాను, నాటకాలుగాను, కథలుగాను అనేకములు గలవు. మనకు వాస్తవాలు తెలిసినా చెబితే జనం నమ్మరు. కాబట్టి ఈ విషయమును విడిచిపెట్టుము" అన్నాడు.

"అటులనే పరిత్యజించెద ప్రియుడా... కాని వీరు ఎవరు? ఆహాఁ మన శ్రీకృష్ణ ప్రభువుల పోలికలు వీరిలో ద్యోతకమవుచున్నవి. ఎవరీ నటుడు?"

"మాయాబజారు సినిమాలో శ్రీకృష్ణుని వేషంలోని ఎన్.టి.రామారావుని తన్మయంతో చూస్తూ ప్రశ్నించింది మిత్రవింద. "వారా... వారు నందమూరి తారక రామారావుగారు. గొప్పనటులు"

"మన శ్రీకృష్ణులవారికన్నను కాస్త పొడవు తగ్గియున్నను వారిహావ భావములు, వాచకము కడురమ్యములైయొప్పుచున్నవి. మందగమనుడు, శాంత గంభీరవదనము, కొంటెచూపులు... ఓహో... ఏమి ఇది... అంతయు ఆ గోపీవల్లభునే తలపించుచున్నారే"

"అందుకే ఆ మహనీయుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌముడయ్యాడు. శుశ్రుతా కాస్సేపు వుంటే ఎన్.టి.రామారావుగార్ని చూడాలంటుందేమో. ఆయన పోయి చాలాకాలమైంది. అయినా కృష్ణగాథ సినిమాలు చూస్తే ఏదో వంకపెట్టి ఇలాగే పేచీ పెడుతుంది."

రామారావుగారి "లవకుశ" సినిమా డివిడిలో వేసి చూపించు. సినిమాలు చూసయినా త్వరగా తెలుగు నేర్చుకుంటుంది" అంటూ ఖాళీ మగ్గు టీపాయ్‌మీద ఉంచి అక్కడ్నుంచి లేచి బయటికొచ్చేశాడు చరక్.

* * * * *

మరునాడు ఉదయం ఒక విచిత్రం జరిగింది. మిత్రవింద స్నానాదికాలు ముగించుకొని కిందకువచ్చేసరికి శుశ్రుత కిచెన్‌లో ఏదో పనిలోఉంది. మిత్ర విందకు ఈ కాలం సబ్బులు, షాంపూలు నచ్చని వని తెలీటంతో నిన్నే ఆమె స్నానానికి అవసరమైన నలుగుపిండి, పసుపు, పాలమీగడ, కుంకుడుకాయలు వంటి పాతకాలం వసతులన్నీ ఏర్పాటుచేసింది శుశ్రుత.

మిత్రవింద బాత్‌రూమ్ ఆమె పద్ధతులకనుగుణంగా మార్చబడింది కాబట్టి ఏ సమస్యా లేకుండా పన్నీటి స్నానం చేసి తయారై మేడదిగి వచ్చింది మిత్రవింద. అంతలో శ్రావణి రావటంతో ఆ అమ్మాయి చేయి పుచ్చుకుని బయటకు లాక్కొచ్చేసింది.

మిత్రవింద ఏదో చెప్తోంది. దేవనాగరి శ్రావణికి తెలీదు. శ్రావణి ఏదో చెప్తోంది. మిత్రవిందకి తెలుగురాదు. శ్రావణికి పిచ్చెక్కినట్టయింది కాని మిత్ర విందమాటల్లో దేవమ్మ పేరు వినబడ్డం గమనించి నేరుగా మిత్రవిందను దేవమ్మ గారి వద్దకు తీసుకెళ్ళింది. వాళ్ళిద్దరూ వెళ్ళేసరికి వంటగదిలో కవ్వం చిలుకుతోంది దేవమ్మ. ఆ ఇంటి నిర్మాడుకు కట్టిన కవ్వంతో తాడులాగుతూ పెరుగు చిలికే ఆచారమే ఇప్పటికీ ఉంది.

చక్కటి రంగులద్దిన బానలో పెరుగును కవ్వం చిలుకుతున్న శబ్దం చెవులకింపుగా ఉంది. కవ్వాన్ని చూడగానే మిత్రవింద ఉత్సాహంతో పరుగెత్తి దేవమ్మ గారి చేతులనుండి కవ్వం తాళ్ళు అందుకుంది "అమ్మమ్మా... మీరలా కూర్చోండి. పెరుగు నేనుచిలుకుతాను" అంది. దేవనాగరి దేవమ్మగారికి అర్థం కాలేదు. శ్రావణికి బొత్తిగా తెలీక అయోమయంగా చూస్తోంది.

"పొద్దుటే ఈ పిల్లని ఇటు తీసుకొచ్చావేమిటే?" శ్రావణిని అడిగింది దేవమ్మ కంగారుపడిపోతూ.

"నేనెక్కడ తీసుకొచ్చాను. తనే లాక్కొచ్చింది" అంది బుంగమూతిపెట్టి శ్రావణి.

ఈ లోపల మిత్రవింద అటూఇటూ ఊగుతూ వయ్యారంగా కవ్వం చిలకటం ఆరంభించింది. ఆమె తాళ్ళను లాగుతున్న విధానమే వేరుగాఉంది. పెరుగు బానలో మోతలు సృష్టిస్తోంది కవ్వం. చూస్తున్నదేవమ్మ, శ్రావణిల కళ్ళ ముందు అలనాటి గోపికలు మెదులుతున్నారు. ఒకపాట అందుకుంది మిత్రవింద. దేవనాగరిలో పాడుతున్న ఆ పాట-భాష అర్థంగాకపోయినా వీనుల విందుగా ఉంది.

"ఏమే శ్రావణీ... ఏ రోజన్నా నువ్విలా కవ్వం చిలికి నాకు సాయం చేశావటే... చూడవే... మిత్రవింద ఎంత చక్కగా చిలుకుతోందో" అంది దేవమ్మ మురిసిపోతూ.

"పో అమ్మమ్మా... తను గోపమ్మ కాబట్టి అలవాటు. ఈ కాలం పిల్లలం. ఇవన్నీ మాకెలా తెలుస్తాయి" అంది నిష్ఠూరంగా శ్రావణి.

వాళ్ళిద్దరూ అక్కడే కూర్చుని పెరుగు చిలుకుతున్న మిత్రవిందను అబ్బురంగా చూడసాగారు. మిత్రవింద చేతిలోకవ్వం బొంగరంలా అటూ ఇటూ శరవేగంతో తిరుగుతోంది. ఎంత వేగంగా అంటే పెరుగు బుసబుసా పైకి పొంగుతున్నట్టు లేస్తోంది. ఆమె నోటినుండి వెలువడుతున్న పాట అంచెలంచెలుగా ఆ ఇంటి నుండి బయట గాలిలో వ్యాపిస్తోంది.

ఆ ఇంటి వెనుక భవంతిలోనే అగ్నివేశాచార్యుని నివాసం. ఆయన అప్పుడే స్నానాదికాలు ముగించుకొని వచ్చి పూజలో కూర్చోబోతూ మధురమైన ఆ దేవనాగరి భాష పాటవింటూ తన్మయుడై భక్తిభావంతో పులకిస్తూ బయట వరండాలో కొచ్చాడు. ఆ పాటలో శ్రీకృష్ణ మహిమలు, మురళీ స్వరాలు, ఆలమందలు, గోపికల గడుసుతనాలు, వ్రేపల్లె వర్ణన, ద్వారకాపురి వర్ణన, కృష్ణుని పిల్లనగ్రోవి గొప్పదనం అద్భుతంగా వర్ణింపబడుతోంది.

క్రమంగా – బానలో పెరుగు చిలకటం పూర్తిగావస్తోంది. ఒక పాదం కాస్త లేపి ఒక పాదం కాస్తఅదిమి అటుఇటు ఊగుతూ కవ్వం తాళ్ళులాగుతున్న మిత్రవిందని, ఆమె సాగసుల్ని, ఆమె పాటను మైమరచి దేవమ్మ, శ్రావణి కూర్చున్న వాళ్ళు కూర్చున్నట్టే ఉండి అలా చూస్తూండిపోయారు.

ఇంతలో – "అంబా" అంటూ బయట గోవుల ఆరుపులు మొదలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు. ఆలమంద అరుపుల్లా వినబడుతున్నాయి. ఉలికిపడి ముఖముఖాలు చూసుకున్నారు దేవమ్మ, శ్రావణిలు. "ఏమిటే... పెరట్లో ఉండాల్సిన ఆవులు వీధి పక్క అరుస్తున్నాయేమిటి?" అనుమానంగా అడిగింది దేవమ్మ.

"నాకు మాత్రం ఏం తెలుసు నాయనమ్మా. చూసొస్తానుండు" అంటూ లేచి బయటికి పరుగెత్తింది శ్రావణి.

ఈ లోపల కవ్వం చిలకటం ఆపింది మిత్రవింద. పాట కూడా ఆపింది.

కవ్వాన్ని తీసి వెన్న కడిగి పక్కనపెట్టి కుడిచేతిని బానలో ఉంచి వెన్నను సుద్దచుట్టి తీస్తుంటే దేవమ్మగారి చూపులు విభ్రాంతితో విశాలమయ్యాయి.

మతిపోయింది. ఎందుకంటే ఎప్పుడూ తను తీసేవెన్నకు రెట్టింపు వెన్న మిత్రవింద చేతుల్లో వుంది.

ఇదేమి విచిత్రం. ఇది మిత్రవింద చేతి మహిమా... పాట మహిమా... అదేమిటో అర్థమయ్యేలోపే మిత్రవింద వెన్నను గిన్నెలో వేసి చేతులు మేలివస్త్రానికి తుడుచుకుంటూ ఇవతలికి వచ్చింది.

ఇంతలో– "అమ్మమ్మా... త్వరగా... తొందరగా" అంటూ బయటినుంచి శ్రావణి పిలుపు వినబడి అటు పరుగెత్తింది దేవమ్మ.

బయట ఆవుల అంబారవాలు వినగానే మిత్రవింద ముఖం ఒక్కసారిగా వికసించింది. చెంగున లేడికూనలా తనూ పరుగెత్తింది అటు.

బయటకు వస్తూనే దేవమ్మగారు చిత్తభ్రమ ఏర్పడినట్టు అలా గుమ్మంలోనే నిలబడిపోయింది. పెరటిశాలలో ఉండాల్సిన తమ పదహారు గోవులు, వాటి లేగలు అన్నీ కట్టుతాళ్ళు తెంచుకుని వచ్చేసి తమ గుమ్మం ముందు నిలబడి ఎవరికోసమో వెదుక్కొంటూ అరుస్తున్నాయి.

పశువుల ఆలనాపాలనా చూసే రంగయ్య, ఇద్దరు పాలేర్లు ఎదురుగా నిలబడున్నారు. అరుగు మీద నాలుగు కడవల పైగా పాలబిందెలు.

"రంగన్నా... ఏమి... ఏమైందిరా?" తడబడుతూ అడిగింది దేవమ్మ.

"ఏం చెప్పనమ్మా మాకే అర్థంగావటంలేదు. పాలు పితుకుతుంటే ఏదో అర్థంగాని పాట వినిపించింది. అది వింటూ ఎన్నిపాలిచ్చాయో గోవులకే తెలీదు. చివరికి కట్టుతాళ్ళు తెంచుకుని ఇటు పారొచ్చినాయి" అన్నాడు రంగన్న.

విచిత్రం ఏమంటే తమ గోవులే కాదు సమీప ప్రాంతాల్లోని అనేక గోవులు కూడా కట్టుతాళ్ళు తెంచుకుని తమ గేటుగుండా లోనకు పరుగు లెత్తుకురావటం కన్పించి మతిపోగట్టుకున్నారంతా. వాటి సొంతదారులైనవాళ్ళు వాటి వెనకే పరుగులెత్తుకొస్తున్నారు.

ఈ వింత ఏమిటో చూడ్డంకోసం మున్నలూరి వారి అగ్రహారం జనం తరలిరావటం మొదలైంది.

ఈలోపల– బయటికి వచ్చిన మిత్రవింద ఆ గోవుల్ని చూసి ఆనందంతో ముందుకు పోబోతుంటే కంగారుపడి ఆమె చేయి పట్టి ఆపింది దేవమ్మ.

"అవి ఏం చేస్తాయో తల్లీ... నువ్వు ఆ గోవులవైపు వెళ్ళమాక" అంది భయంగా.

అప్పటికే అక్కడికి వచ్చిన అగ్నివేశాచార్యుడు– "దేవమ్మ, అవి ఆ అమ్మాయిని ఏమీచేయవు. ఆమెను వెళ్ళనీ" అన్నాడు.

మిత్రవింద దేవమ్మ చేతిని విడిపించుకుని గోవులముందుకు వెళ్ళిపోయింది.

ఆమెను చూడగానే వచ్చిన గోసంతతి తోకలు లేపి తలలు ఊపుతూ ఆనందంగా చూడనారంభించాయి. మిత్రవింద సంతోషంగా వాటిని తాకి ముఖాలు నిమిరి ముద్దాడింది.

"ఏమిటి? మీరంతా ఆ నల్లనయ్య వచ్చినాడనుకుని కానవచ్చితిరా. వచ్చినది నేను మిత్రవిందను. మీ జాతికి తిరిగి మంచిరోజులు రానున్నవి. గోపాలుని కరుణ మీమీద ఎప్పుడూ యున్నది. వారు మిమ్ములను మరువరు. నేను ఇచటనే యుందును. సంతోషముగా మీ మీ తావులకు మరలిపొండు" అంటూ దేవనాగరిలో హితోపదేశం చేస్తున్నట్టు గోవులతో మాట్లాడుతోంది మిత్రవింద.

అవతల ఇంటిముందు నిలబడిన శుశ్రుత, చరక్‌లు కూడా ఆ దృశ్యాన్ని మతిబోయి చూస్తున్నారు. గోవులు ఒకదాని తర్వాత ఒకటి ప్రేమగా మిత్రవిందను స్పృశిస్తున్నాయి. ఆమె చేయి నిమరగానే కదులుతున్నాయి. ఆవరణలో ఎటుచూసినా గోవులే కన్పిస్తున్నాయి.

పరిస్థితి గమనిస్తున్న అగ్నివేశాచార్యుడు వెంటనే– "అరే రంగన్నా పోండిరా. మన తోటలో పండిన అరటిగెలలు ఎన్ని వుంటే అన్నీ తెగనరికి తీసుకురండి. త్వరగా" అంటూ ఆర్డర్ వేశాడు.

క్షణాలమీద పనులు జరిగాయి. అక్కడికి దగ్గరలోనే ఉన్న అరటితోటమీద పడ్డారు నౌకర్లు. పండిన గెలలు నరికినవి నరికినట్టు తెచ్చేస్తున్నారు.

"అమ్మా మిత్రవిందా. నిను చూడవచ్చిన అతిథుల్ని ఉత్తినే పంపించటం బాగుండదుగదా. నీ చేత్తో కదళీఫలాల్ని తినిపించు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

ఆ విధంగా మిత్రవింద అందిస్తున్న అరటిపళ్ళు తింటూ ఆనందంతో వెనుతిరిగాయి గోవులు. ఎక్కడి నుండి వచ్చాయో అక్కడికే మరలిపోసాగాయి.

గ్రామస్తులు కొందరు – "అయ్యా, ఈ వింతేమిటో అర్థంగావటంలేదు సామీ. ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇవాళ గోవులు పాలదిగుబడి అధికంగా ఇవ్వటమే కాదు. కట్టుతాళ్ళు తెంచుకుని మీ వాకిట్లోకి వచ్చాయంటే ఇంత అద్భుతాన్ని ఎప్పుడూ చూళ్ళేదు.

మీ ఇంట ఉన్న ఆయమ్మ సామాన్యురాలు కాదు. గోవులపాలిట దేవతా" అంటుంటే అగ్నివేశాచార్యుడు నవ్వి– "మీరు మరీ పొగడకండి. నా మనవరాలు

మిత్రవింద అడుగుపెట్టిన వేళావిశేషం. ఆమె కృష్ణభక్తురాలు. అందుకే ఇలా జరిగింది" అంటూ వారిని నమ్మించి పంపించాడు.

ఆ రోజు సాయంకాలమే మిత్రవింద వచ్చిన సందర్భంగా ఊళ్ళోని స్త్రీలందరికీ పసుపుకుంకుమలు, ఒక స్టీలుగిన్నె, జాకెట్టు, అరటిపళ్ళు, స్వీట్లు పంచిపెట్టించింది దేవమ్మ. మిత్రవిందకు ఎలాంటి దోషం తగలకూడదని.

* * * * *

విళంబి గోవుల పుణ్యమాని ఆ రోజు ఉదయమే మిత్రవిందను చూడగలిగాడు. ఆమె సాధారణయువతి కాదని, అసలు ఈ కాలం అమ్మాయి కూడా కాదని అర్థమైపోయింది అతనికి.

గురువు మరిడి సోమయ్యకు జరిగింది, తను చూసింది అంతా ఫోన్‌లో రిపోర్ట్ చేశాడు. మరికొద్ది రోజులు ఇక్కడే ఉండి కావలసిన సమాచారం సేకరించుకొనే వస్తానని కూడా చెప్పాడు.

బిచ్చగాడి వేషంలో గ్రామంలో తిరిగి అడుక్కోవడం తిరిగి తిరిగి వచ్చి అగ్నివేశాచార్యుని గృహం ఎదురుగా గేటు బయట కూర్చుని అన్నం తింటూ ఓ కంట కనిపెట్టి ఉండటం డ్యూటీ అయింది.

డ్రైవరు కాశీ జీపులో ఏదో టైమ్‌లో బయటికిపోయి వస్తున్నాడుగాని విళంబిని గుర్తుపట్టలేదు. వాడికి మాట పోయిందని తెలిసి విళంబి కూడా పలకరించకుండా ఉండిపోయాడు.

* * * * *

రెండోరోజు సాయంకాలమే మిత్రవింద కోసం అనేక చీరలు, నగలు రప్పించబడ్డాయి. కంచి, బెనారస్, పట్టుచీరలు అనేక ప్రింటెడ్ చీరలు అనేకం తీసుకొచ్చారు.

"నీకు నచ్చినవి తీసి ఉంచు" అంటూ వాటిని ఎంచుకునే బాధ్యతని శుశ్రుతకే వదిలేసింది మిత్రవింద.

"మిత్రా నీ ఎత్తుకి ఆరుమూరల చీర సరిపోదు. ఏ రకం అయినా, రెండు చీరలు తీసుకో.

ఆ రెంటినీ కలిపితేనే సరిపోతాయేమో... మరిపొడవో... ఏం అర్థం కావటంలేదు.

ఏది ఏమైనా నువ్వు చీరకడితే కళ్ళు తిరిగి ఎక్కడ పడిపోతానోనని భయముగా యున్నది. అంత అద్భుతసౌందర్యం నీది. నీకేమి కావలయునో నీవే ఎంచుకొనవచ్చును గదా" దేవనాగరి భాషలో అడిగాడు చరక్.

"ప్రియుడా... నాకు తెలీక కాదు సుమా. నేను ప్రాచీన యువతిని. ఈ కాలపు నూతన దుకూలములుగాని (వస్త్రములు) ఆభూషణములుగాని ఏవి నేరుగా ధరించినను నాలోని ప్రాచీనత తొలగిపోయి నేనును నేటి సాధారణయువతిగా మారిపోదును. అటుల జరుగరాదు" అంది.

"ఏమి? సాధారణ యువతివయితే నష్టం ఏమున్నది. నచ్చినవి ఎంచుకుని ధరింపవచ్చు గదా" గొణిగాడు. అయినా మిత్రవిందకు అర్థమైపోయింది.

"ప్రియుడా... ఇప్పుడు నీవే గదా నాలోకము. నిను కాపాడుకొను బాధ్యత నాపై యున్నది. మన వివాహ పర్యంతమైనను నేనిటుల ఉండవలె. అలా ఉండవలె నన్న ముందుగా అరవింద (శుశ్రుత) ధరించి విడిచిన పిదప నేను ధరింపవలె. అందుచే ఆ దుస్తులను ఎంచుకొను బాధ్యతను తనకే విడిచితి" అంటూ అసలు విషయం వివరించింది.

చరక్ ఆలోచిస్తుంటే ఆమె మాటలు చాలా నర్మగర్భంగా ఉన్నాయని పించింది. తనను కాపాడుకోవాలంటోందేమిటి? కొండంత అండగా తనకు జేజి తాతయ్య ఉండగా తనకు వచ్చే కష్టాలేమున్నాయని?

మిత్రవింద మాటల్ని బట్టి శుశ్రుత ఒకసారి కట్టి విడిచి ఉతికి చలువచేస్తే అవి పాతబడినట్టు వాటిని తనుధరిస్తే తన ప్రాచీనతకి ఇబ్బంది లేదంటోంది. దీనివల్ల తనకొచ్చిన నష్టం ఏముంది. ఎలాగో ఇప్పటి పద్ధతిలో చీరలు కడతానంటోందిగదా అని మనసును సరిపెట్టుకున్నాడు చరక్.

*　　*　　*　　*　　*

సరిగ్గా ఇదే సమయంలో

అక్కడ నీలోదరి కొండగుట్ట మీద మరిడిసోమయ్య శిష్యుడు విళంబి ఫోన్‌లో చెప్పిన విషయాలు వినగానే ఆలోచనలో మునిగిపోయాడు.

ఎవరా యువతి? అంతటి సౌందర్యవతా?

ఎక్కడి నుండి చరక్ ఆమెను తీసుకొచ్చాడు? ఆమె పాట పాడితే గోవులన్నీ కట్టు తెంచుకుని ఆమె వద్ద కొచ్చాయా... నిజమేనా? నమ్మవచ్చా... ఊహఁ ఒకసారి ఆమెను చూడాలి.

చూశాకగాని ఆమె ఎవరో ఒక అంచనా వేయటం మంచిది. ఈ విధంగా ఆలోచించిన మరిడి సోమయ్య ఒకసారి మున్నలూరి వారి అగ్రహారం వెళ్ళిరావాలని నిశ్చయించుకున్నాడు.

* * * * *

"అక్కా! ఇటు రమ్ము" హాల్లోని మిత్రవింద అచ్చ తెలుగులో శుశ్రుతను పిలిచింది.

"అక్కా ఇప్పుడేగా అచ్చులన్నీ రాసిచ్చి దిద్దమన్నాను. మళ్ళీ ఏమిటి?" అంటూ కిచెన్‌లోంచి అరిచింది శుశ్రుత.

అక్కడే వున్న శ్రావణి– "ఓరి దేవుడో" అనరిచింది. "మీ వరస నాకేమీ అర్థమై చావట్లేదక్కా. అయినా అక్కా... ఈ మిత్రవిందక్క ఏమిటి తాటిచెట్టులా, ఎలక్ట్రిక్ పోల్‌లా ఆరడుగుల ఒక్క అంగుళం... ముఖంలోకి చూసి మాట్లాడాలంటే తలంతా పైకి ఎత్తి మాట్లాడవలసివస్తోంది.

మెడంతా ఒకటే నొప్పి... ఇది సరే... అదేమో నిన్ను అక్కా అంటుంది. నువ్వేమో దాన్ని అక్కా అంటావ్. నాకు పిచ్చెక్కేలా ఉంది" అని శుశ్రుతకు పక్క నుండి సాయం చేస్తూ విసుగంతా గొంతులో నింపుకుని అరిచింది శ్రావణి.

"నీకేమిటే. నీ బావకే పిచ్చెక్కుతోంది మా వరస చూసి. తనూ మారదు. నేనూ మార్చుకోను. వెళ్ళు. ఏంటోచూడు" అంది కూరలు తరుగుతూ శుశ్రుత.

మిత్రవింద వచ్చి మూడోరోజు ఇది. హాల్లో కూర్చున్న మిత్రవిందకు పెద్ద పలకమీద తెలుగు అక్షరాలు, అచ్చులు రాసిచ్చి, దిద్దమని చెప్పి వచ్చింది శుశ్రుత. వచ్చి అయిదు నిముషాలు కాలేదు పిలుస్తోంది.

తెలుగు పదాలు గుర్తుపెట్టుకొని చిన్న చిన్న మాటల్ని చిలకపలుకుల్లా అప్పుడే మాట్లాడేస్తోంది మిత్రవింద. అప్పటికి చరక్ బయటికి వెళ్ళి ఇంకా రాలేదు.

"ఊc తప్పుతుందా తల్లీ" అంటూ లేచి హాల్లోకి వెళ్ళిన శ్రావణి అదిరిపడుతూ– "అక్కా... రా రా... త్వరగా" అనరిచింది.

శుశ్రుతకు ఏమీ అర్థంగాక – చేస్తున్న పని ఆపేసి లేచి గబగబా హాల్లోకి వచ్చింది.

మిత్రవింద చేతిలో పలక ఉంది. కాని తను రాసి ఇచ్చిన అక్షరాలు లేవు. వాటి స్థానంలో అందంగా అవే అక్షరాలు తిరిగి రాయబడున్నాయి.

"ఏయ్ శ్రావణీ... చెరిపేసి మళ్ళీ రాసిచ్చావా?" శ్రావణిమీద కోప్పడింది శుశ్రుత.

"ఊరుకో అక్కా.. నే వచ్చింది ఇప్పుడే గదా" అంది అమాయకంగా శ్రావణి.

"అంటే... అప్పుడే ఇవన్నీ మిత్రవిందకు వచ్చేశాయా?" ఆశ్చర్యపోతూ అంది.

"ఆ...ఆ...ఇ...ఈ...." అంటూ అచ్చుల్ని చక్కగా వప్పగించేసి- "ఇవి వచ్చేసినవి. తర్వాత ఏమి... రాసివ్వు" అంది మిత్రవింద.

"అయ్యబాబోయ్. అక్కా. నమ్మకు ఈ ఎత్తు అక్క మనల్ని మాయచేస్తోంది" అనరిచింది శ్రావణి.

శుశ్రుత మొత్తం చెరిపేసి- తిరిగి రాసి చూపించమంది అనుమానం తీరక. అక్షరం తప్పు లేకుండా తిరిగి రాసి చూపించింది మిత్రవింద.

"వామ్మో... ఓరిదేవుడో... ఇలా అయితే తెలుగు భాష మొత్తాన్నీ సాయంత్రంలోపే నువ్వు నమిలిమింగేసేలా ఉన్నావ్ తల్లో. ఇంత జ్ఞాపకశక్తా... నాకు కళ్ళు గిర్రున తిరుగుతున్నాయ్" అంటూ మిత్రవింద పక్కన కూలబడి పోయింది శ్రావణి.

ఆ అమ్మాయి చెప్పిందాంట్లో అసత్యం లేదనిపించింది శుశ్రుతకి. పక్కన కూర్చుని ఓపిగ్గా చెప్పాలే గాని ఒకటిరెండ్రోజుల్లోనే మాట్లాడటం, చదవటం, రాయటం కూడా నేర్చేసుకుంటుంది.

"ఓ.కె. ఎలాగూ కూర్చున్నావ్‌గా. హల్లులు కూడా రాసివ్వు.

ఈ లోపల వంటపనిచూసివస్తాను" అంటూ ఆ బాధ్యతను శ్రావణికే వప్పగించింది శుశ్రుత.

ఇదే సమయంలో బయట డ్రైవరు కాశీ జీప్‌ను తీశాడు. ఏదో పనిమీద మండపేట వెళ్ళిరావటానికి బయలుదేరాడు.

జీప్ గేటు దాటుతూండగా అటుగా వస్తున్న బిచ్చగాడిమీద వాడి దృష్టి పడింది.

రెండు మూడు రోజులుగా ఇక్కడే తిరుగుతున్నాడు. ఎవడీ కొత్తబిచ్చగాడు అనుకుంటూ కాస్త పరిశీలనగా చూసి అదిరిపడ్డాడు.

వీడు మాంత్రికుడి శిష్యుడు విళంబికదూ... బిచ్చగాడి వేషంలో ఇక్కడ తిరుగుతూ ఆనుపాన్లు గమనిస్తున్నాడా... వీడింత దూరం వచ్చాడంటే ఇది మామూలు విషయం కాదు.

ఏ ఘోరం జరగనుందో ఏమిటో.

ఇప్పటికే ఆ మహనీయుడికి ద్రోహం చేసి శిక్ష అనుభవిస్తున్నాడు. తెలిసి కూడా ఈ విషయం చెప్పకపోతే తప్పవుతుంది. తప్పు చేసినా ఈ రోజు వీళ్ళందరి మధ్య తలెత్తుకు తిరగగలుగుతున్నాడంటే ఇది ఆ స్వామి అనుగ్రహం.

మొదట జీప్‌ను వెనక్కి తిప్పి లోనకెళ్ళి ఈ విషయాన్ని అగ్నివేశాచార్యుల వారికి నివేదించాలనుకున్నాడు. కాని నోటిమాట చేతరాత పోగొట్టుకుని ఇప్పుడెలా ఆయనకు చెప్పటం!

తిరిగివచ్చాక ఏదో ఒకటి చేయాలనుకుంటూ జీప్‌ను ముందుకే పోనిచ్చాడు డ్రైవర్ కాశీ.

ఎదురువస్తున్న విళంబికి కాశీ తనను గుర్తుపట్టేశాడని అర్థమైపోయింది. జీప్ ఆపమని సైగ చేస్తూ దారికి అడ్డం వచ్చేశాడు.

జీప్ ఆపాడు కాశీ. జీప్ ఎక్కబోతున్న విళంబిని వెనక్కి తోసేశాడు.

"ఒరే మీ మూలంగా నా గొంతు పోయింది. బొటన వేలు చచ్చుబడింది. ఇంకా ఏం కావాల్రా. పోరా. నన్నొదిలేయండి" అనే అర్థం వచ్చేలా సైగలతో వివరించి ఓ దండం పెట్టేసి జీప్‌ను ముందుకు దూకించాడు. వెళ్తున్న జీప్‌నే చూస్తూ కాస్సేపు అక్కడే నిలబడిపోయాడు విళంబి.

కాశీ సైగల్ని అర్థం చేసుకున్నాడు. అంటే వీడు గురువుగారికి కోవర్ట్‌గా పని చేస్తున్నాడని అగ్నివేశాచార్యుడికి తెలిసిపోయి శిక్షించాడన్నమాట.

కాని శిక్షించి బయటికి పంపించక తనవద్దే ఎందుకుంచుకున్నట్టు? విళంబికి అర్థంకాలేదు. కాని ఇక కాశీ వల్ల తమపనులు కావని మాత్రం అర్థమైంది. ఆలోచిస్తూ అగ్రహారం గేటువైపు అడుగులేశాడు.

* * * * *

అగ్రహారం కాంపౌండ్ గేటు చాలా పెద్దది. అగ్రహారాన్ని చుట్టూ వున్న కాంపౌండ్ గోడకు ఉత్తర దక్షిణభాగాల్లో మరో రెండు చిన్న గేట్లు ఉన్నాయి. లోపల ప్రధాన వీధినానుకొని నాలుగు వీధులున్నాయి.

అన్నీ బ్రాహ్మణ కుటుంబాలే. వారిలో అధికభాగం అగ్ని వేశాచార్యుని కుటుంబానికి చెందిన మున్నలూరి వారే. ఈ అగ్రహారం కాంపౌండు బయటి ఊరంతా ఇతర వర్ణాలవారి గృహాలున్నాయి.

కాబట్టి అగ్రహారంలోకి రాకపోకలన్నీ ప్రధాన గేటునుండే సాగుతాయి. గేటు ముందు ఊళ్ళోకి పోయే ప్రధానరహదారి ఉంది. గేటుకు ఎడంపక్కన ఎప్పటిదో ఒకపెద్ద నిద్రగన్నేరుచెట్టు శాఖోపశాఖలుగా విస్తరించి చక్కటి నీడనిస్తుంది.

ఆ గేటుకు ఎదురుగా లోన కాస్తదూరంలో దేవమ్మగారు నివసించే భవంతి ఉంది. దానికి వెనకతట్టు డాబా అగ్నివేశాచార్యుని నివాసం.

దేవమ్మగారి భవంతికి ఎడంపక్క కాంపౌండ్‌లో చిన్నతోట... దీనికి వెనుక పక్కన పశువుల చావడి ఉన్నాయి. తోటలో కూరగాయల పాదులేకాదు. అనేక ఓషధి మొక్కలు కూడా పెంచబడుతున్నాయి.

ఆ భవంతి ముందునుండి ఎడంపక్కకు తిరిగి మళ్ళీ కుడి పక్కగా అగ్రహారం ప్రధానవీధి ఉంది. ఈ వీధినానుకునే చరక్, శుశ్రుతల భవంతి ఉంది.

ఏదో పని ఉండి దేవమ్మగారు బయటికొచ్చారు. ఆమె వెనకే తోక ఊపుకొంటూ బయటికొచ్చింది ఆవిడ పెంపుడుకుక్క టామీ.

ఒళ్ళంతా బొచ్చుతో తెల్లగా దూదిమూటలా ఉండి ముద్దొస్తోంది.

కాని అది మొరిగిందంటే పిడుగుల వర్షం పడుతున్నట్టుండి ఎదుటి వాళ్ళని ఠారెత్తిస్తుంది.

దేవమ్మగారు బయటకు రావటం చూసిన విళంబి గేట్లోనే నిలబడి– "అమ్మా... మాదాకవళం తల్లీ... ఓ ముద్ద అన్నం ఉంటే పెట్టండి తల్లీ. ఆకలిగా ఉంది. టిఫినైనా ఫరవాలేదు" అనరిచాడు.

వాడ్ని చూసి ముఖం చిట్లించింది దేవమ్మ. "ఏరా... ఊరిబయట ఉండి అరవరా. అక్కడికొచ్చి బిచ్చమేస్తారు. అడుక్కోవడం కూడా తెలీని వెధవ. ఎవడ్రా నువ్వు?" అనరిచింది.

"లోనకు రావచ్చా తల్లీ" టామీవంక అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఏరా... వస్తే ఛస్తావా?"

"అది కాదమ్మా... మీ కుక్కను చూస్తే నాకు భయం" అన్నాడు విళంబి.

"నువ్వు మంచోడివైతే అది నిన్నేం చేయదు. చెడ్డోడివైతే గొంతు పట్టేస్తుంది"

"అమ్మో అసలే అడుక్కునే బతుకైపోయింది. నన్నిలా ఉండనీ తల్లో" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోబోయాడు విళంబి.

దేవమ్మగారు నవ్వుతూ– "ఒరే పిచ్చివెధవా. కుక్క నిన్నేంచేయదు లోనకురా. వచ్చినవాడ్ని ఉత్తి చేతులతో పంపించే అలవాటు మాకు లేదు.

"టామీ నువ్వు లోనకు పద" అంటూ కుక్కను తీసుకుని లోనికెళ్ళిపోయిందావిడ.

విళంబి లోనకొచ్చి వాకిట్లో నిలబడ్డాడు. వాడి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. సమీపాల్లో ఎక్కడన్నా అగ్నివేశాచార్యుడు ఉన్నాడేమోనని వాడి కళ్ళు వెతుకుతున్నాయి. ఆయన జాడలేదు.

మూడు నిమిషాల తర్వాత పనిమనిషి వచ్చి మూడు గారెలు, అరడజను ఇడ్లీలు, చట్నీ అన్నీ వాడి గిన్నెలోవేసి వెళ్ళింది.

ఇంతలో అటుగా అగ్నివేశాచార్యుడు రావటం గమనించిన విళంబి తేలు కుట్టినట్టు ఉలిక్కిపడి ఆయన కంటబడకముందే వడివడిగా గేటు దాటి బయటికి వెళ్ళిపోయాడు.

అప్పుడే బయటికొస్తున్న అగ్నివేశాచార్యుడు విళంబిని గమనించలేదు. ఒంటిమీద పంచె, పైతుండు మాత్రం ఉన్నాయి. చేతిలో ఎప్పుడూ ధరించే చేతికర్ర ఉంది. కిర్రుచెప్పులు శబ్దం చేస్తూండగా నేరుగా చరక్ శుశ్రుతలుండే ఇంటివైపు అడుగులేశాడు అగ్నివేశాచార్యుడు.

వీధి తలుపులు తెరిచే ఉన్నాయి. చెప్పులు బయట విడిచి ఆయన లోన కెళ్ళేసరికి చరక్ హాల్లో పచార్లు చేస్తూ కన్పించాడు. వేరెవరూ లేరక్కడ.

జేజి తాతగార్ని చూసి నవ్వుతూ ఎదురువచ్చాడు.

"రండి జేజిగారూ సమయానికొచ్చారు కూర్చోండి" అన్నాడు.

"ఏమిట్రా విశేషం. అమ్మాయిలిద్దరూ ఎక్కడా?" చుట్టూ చూస్తూ అడిగాడు.

"వస్తారు జేజిగారూ. మీరు కూర్చోండి" అన్నాడు చరక్.

అగ్నివేశాచార్యుడు సోఫాలో కూర్చుంటూ–

"నేన్నీ కోసమే వచ్చారా. భోజనం చేసిన తర్వాత ఓసారి నా వద్దకు రా. మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి" అన్నాడు.

"అలాగే జేజిగారూ. మీరు భోజనం చేసి విశ్రాంతి తీసుకోగానే అప్పన్నను పంపించండి. వస్తాను" అంటూ తనూ కూర్చున్నాడు చరక్.

"ఇంతకీ వీళ్ళిద్దరూ ఎక్కడా...." అనుమానంగా అడిగాడు అగ్ని వేశాచార్యుడు.

"వస్తున్నారు జేజిగారూ. అటు మెట్లపైకి చూడండి" అన్నాడు చరక్.

అటు చూసిన అగ్నివేశాచార్యుడు వెంటనే చూపు మరల్చలేకపోయాడు. ఇక చరక్ అయితే రెప్పవాల్చటం మర్చిపోయాడు. సరిగ్గా అప్పుడే మెట్లమీదకు వస్తోంది మిత్రవింద. ఆమెకు అటూ ఇటూ శుశ్రుత, శ్రావణిలు వస్తున్నారు.

మిత్రవింద నేటిపద్ధతుల్లో చీర, జాకెట్టు ధరించడం ఇక్కడ విశేషం. మిత్రవింద చీరకడితే బాగుంటుందను కున్నారు గాని ఇంత బాగుంటుందని ఊహించలేదెవరూ.

ఎర్రంచుతో కూడిన చిలుకాకుపచ్చ కంచిపట్టుచీర జాకెట్టు ధరించింది. నిన్న శుశ్రుత కట్టి విడిచిన కొత్త చీర అది. నగలు కూడా ఆమె ధరించినవే. కొత్తవి ధరించనన్న తన మాటకు కట్టుబడే ఇప్పుడీ చీర, జాకెట్టు నగలు ధరించింది మిత్రవింద.

చీర కట్టడంలో శుశ్రుతకు సాటిరారెవరూ. తనే మిత్రవిందకు దగ్గరుండి కట్టించి వుంటుంది.

శుశ్రుతే అందంగా ఉంటుంది. అంతకు రెట్టింపు అందం మిత్రవింద. అంతా ఉన్నారు గాని లేకపోతే అమాంతం మిత్రవిందను కౌగిట బంధించి ముద్దు లివ్వాలనుకున్నాడు చరక్.

ముగ్గురూ మెట్లు దిగివచ్చారు. నేరుగా అగ్నివేశాచార్యుని ముందు కొచ్చింది మిత్రవింద. వంగి ఆయన పాదాలు తాకి నమస్కరించి– "నన్వాశీర్వదించండి జేజితాతయ్యా" అంది.

"సుఖీభవ. లే తల్లీ" అంటూ ఆమె భుజాలు పట్టిలేపాడు అగ్ని వేశాచార్యుడు.

"ఈ చీరలో నిన్ను చూస్తుంటే ఆ శ్రీమహాలక్ష్మి, ఆ సరస్వతీమాత ఇద్దరూ నీరూపంలో నా ముందు సాక్షాత్కరించినట్టుందమ్మా. చల్లగా వర్ధిల్లు" అన్నాడు.

"మరి నాకు పాదాభివందనం చేయవా?" అడిగాడు కొంటెగా చరక్.

"చేస్తాను ప్రియుడా. మన వివాహం ఎప్పుడో చెప్పు" అంది నవ్వుతూ మిత్రవింద.

ఏం చెప్తాడు? తనకు తెలిస్తేగా చెప్పడానికి.

మిత్రవింద తెలుగు మాట్లాడటం, ఆ విషయాన్ని కాస్త ఆలస్యంగా గ్రహించి అబ్బురంగా చూశాడు అగ్ని వేశాచార్యుడు.

"నాకు తెలుసమ్మా. ఇంకో నాలుగు రోజుల్లో తెలుగుభాషనే ఔపోసన పట్టేస్తావ్. అమ్మా శుశ్రుతా, మిత్రవిందను దేవమ్మ వద్దకి తీసుకెళ్ళండి, సంతోషిస్తుంది" అన్నాడు.

సరేనంటూ అమ్మాయిలు ముగ్గురూ బయటకి నడిచారు. "ఏరా... నా హెచ్చరికలు పాటిస్తున్నావా లేదా?" సూటిగా చరక్‌ను చూస్తూ అడిగాడు అగ్ని వేశాచార్యుడు. చరక్‌కి అర్ధంగాక బుర్ర గోక్కున్నాడు. ఆయన చేసిన హెచ్చరికలు చాలానే ఉన్నాయి. వాటిలో దేని గరించి అడుగుతున్నాడు?

"జేజిగారూ. మీరిలా తలాతోక కత్తిరించి అడిగితే నాకర్ధం కాదండి. సూటిగా విషయం చెప్పండి" అన్నాడు చరక్.

"మిత్రవిందను అపవిత్రం చేయకురా భడవాని హెచ్చరించా గదరా. ఆ హెచ్చరికను పాటిస్తున్నావా అని అడుగుతున్నాను" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"నాకైతే పాటించాలని లేదండి. కాని తను పాటిస్తుంది"

"ఎమిట్రా తిక్క సమాధానాలు... నిజం చెప్పు"

"జేజిగారూ. నిజం చెప్పాలంటే ఆ అందాన్ని చూస్తూ... మగాడన్నవాడు ఎవడైనా ఆగగలడా? నేను ఆగుతున్నాను. నా సంగతలా ఉంచండి. అదో తిక్కది. తన ప్రాచీనత ఇప్పుడే తొలగిపోకూడదంటుంది.

శుశ్రుత కట్టి విడిచిన చీరలు నగలే ధరిస్తానంటుంది. చూశారుగా. మిత్రవింద కట్టిన చీర నగలు నిన్న శుశ్రుత ధరించినవి. పైగా ఏమిటంటే... నిన్ను కాపాడుకోవాలి గదా అంటుంది.

మగాడ్ని, నన్ను తను కాపాడ్డం ఏమిటో అర్ధం కాదు. నాకన్నా తనే ఎక్కువ జాగ్రత్తలు పాటిస్తూ నాకు దూరంగా ఉంటోంది.

ఆ పైన శుశ్రుత ఎలాగూ మా మధ్య ఉందిగాబట్టి ఈ విషయంలో మీరు కంగారుపడాల్సిందేమీ లేదు" అంటూ భరోసా ఇచ్చాడు.

చరక్ మాటలు అగ్నివేశాచార్యుని ఆలోచింపచేస్తున్నాయి. మిత్రవిందకు భవిష్యత్తు తెలుస్తోందా! ఈమెకు మానవాతీతశక్తులు ఉన్నాయా?!.

ఎలా? తను ఆమెను పవిత్రంగా ఉంచమనటంలో ఉద్దేశం ఆమె ద్వారకావాసిని గాబట్టి ఆలయ నిర్మాణం ప్రతిష్ఠ అంతా ఆమె చేతులమీదుగా

జరిపించాలని. కాని చరక్ మాటల్నిబట్టి చూస్తుంటే ఆమె కేవలం ప్రాచీన స్త్రీ మాత్రమే కాదు, ఆమెలో మరేదో అద్భుతం దాగి ఉందనిపిస్తోంది.

అదేమిటో కాలమే చెప్పాలి. "మంచిది... శుశ్రుత, నువ్వు సమకాలికులు. భార్యాభర్తలు. మీకు ఎలాంటి అభ్యంతరాలూ లేవు.

మిత్రవింద విషయంలో జాగ్రత్త. ఆమె అభీష్టాన్ని మీరకు. ఆమెను స్వచ్ఛంగా అలానే ఉంచు"

అగ్నివేశాచార్యుడు మాట్లాడుతూనే ఉన్నాడు. అంతలో సమీపంలో ఎక్కడి నుంచో ఫెళపెళా వికృత శబ్దాలతో ఏదో విరిగిపడిన చప్పుడు, ఆ వెనకే జనం కేకలు వినవచ్చాయి.

ఏం జరిగిందో అర్థంగాక చరక్, అగ్నివేశాచార్యులు ముఖముఖాలు చూసుకున్నారు. అదేమిటో తెలుసుకునేందుకు వడివడిగా బయటికొచ్చారు.

విళంబి గేటు బయట నిద్రగన్నేరు చెట్టునీడన కూర్చున్నాడు. దేవమ్మ గారింట అడిగితెచ్చుకున్న గారెలు, ఇడ్లీలు బొచ్చెలో ఉన్నాయి.

నీళ్ళ బాటిలు పక్కన పెట్టుకుని నెమ్మదిగా టిఫిను తింటూ ఓ కంట గేటు లోనకు గమనిస్తూ ఆలోచిస్తున్నాడు.

డ్రైవరు కాశీ వలన ఇక తమకు ఏ ఉపయోగం లేదని అర్థమైపోయింది. వాడు ఫోన్‌లో గురువు గారికి చెప్పిన మాటల్నిబట్టి చరక్‌వెంట తీసుకొచ్చిన యువతి మిత్రవింద అని గ్రహింపయింది.

నిన్న ఆమె పాట పాడితే ఊళ్ళో గోవులన్నీ పరుగులెత్తుకు రావటం తన కళ్ళారా చూశాడు.

ఆ తాతామునిమనవళ్ళ తర్వాత ప్లాను ఏమిటి? ఏం చేయబోతున్నారు. ఆ విషయాలు తెలుసుకోకుండా తను ఈ ఊరు వదిలి ప్రయోజనం లేదు. తనకు కావలసింది ఇక్కడి విశేషాలు కాదు.

అగ్నివేశాచార్యుడి కార్యాచరణ పథకాల రహస్యం చెప్తేనే సంతోషించి తనను అభినందిస్తాడు. అది తెలుసుకోవాలంటే ఏదో ఒక మాయ చేయక తప్పదు. ఏం చేస్తే బాగుంటుంది!

విళంబి ఆలోచనలు ఒక కొలిక్కి రాకముందే అతడి చూపులు దేవమ్మగారి ఇంటివైపు పోతున్న ముగ్గురు యువతులమీదపడింది. వాళ్ళని గుర్తుపట్టాడు.

ఆ ముగ్గురిలో చిన్నమ్మాయి చరక్ మరదలు శ్రావణి, రెండో యువతి చరక్ భార్య శుశ్రుత.

చాలా పొడుగ్గా వున్న మూడో యువతి మిత్రవింద. చీరకట్టులో మిత్ర వింద‌ను చూడగానే విళంబికి గుండె ఆగినంత పనయింది. నరాలు భగ్గున వేడెక్కాయి. "ఆహా ఏమందంరా బాబు. మెరుపు తీగలా ఉంది. దూరం నుంచి చూస్తేనే మతిపోతోందే.

ఆ అందాన్ని ఒక్కసారి దగ్గరగాచూస్తే...." చూడాలనే చిలిపి ఆలోచన కలిగింది విళంబికి.

కాని మనసు తటపటాయించింది. ఆమె అందరిలాంటి సాధారణ యువతి కాదు.

పాట పాడితేనే పశువులు లగెత్తుకొచ్చాయి. తను మంత్రం పెడితే ఫలిస్తుందా... అనవసరంగా చిక్కులో పడతాడేమో... ఛఛ. అదేంలేదు, అయినా ఓసారి పరీక్షిస్తే ఆమెలో మానవాతీతశక్తులేమన్నా ఉంటే తెలుస్తుంది.

విళంబి తర్జనభర్జన పడేలోపలే అమ్మాయిలు ముగ్గురూ దేవమ్మగారి భవంతి మెట్లను సమీపిస్తున్నారు. ఇక ఆలస్యం చేయలేదు విళంబి. ముందు వెనకలు ఆలోచించకుండా మిత్రవిందమీద సమ్మోహనమంత్రం ప్రయోగించి "రా... గేటువద్దకు రా" అంటూ చేతిని గాల్లో ఊపాడు.

అక్కడ మెట్లమీద కాలుపెట్టబోతున్న మిత్రవింద ఎత్తిన పాదాన్ని ఎత్తినట్టే ఉంచి అక్కడే నిలబడిపోయింది. "ఆగిపోయావే రా అక్కా" మూడు మెట్లెక్కిన శుశ్రుత వెనుతిరిగి పిలిచింది.

"మీరు పదండి. వస్తున్నాను" అంది మిత్రవింద. "రా అక్కా కలిసే వెళ్దాం" అంది శ్రావణి.

"ఇక్కడేదో దుష్టసర్పం పొంచి ఉంది. దాని సంగతి చూడాలి. మీరు త్వరగా లోనకెళ్ళండి" మిత్రవింద కరుగ్గా హెచ్చరించింది.

శుశ్రుత, శ్రావణిలు ఏం జరిగిందో అర్థంగాక దేవమ్మగారిని పిలుచుకు రావటానికి వేగంగా లోనకెళ్ళారు. వాళ్ళిద్దరూ గడపదాటి లోనకెళ్ళగానే గిరుక్కున వెనుతిరిగింది మిత్రవింద. నెమ్మదిగా గేటు వైపు అడుగులు సారించింది.

గేటుబయట వున్న విళంబి, మిత్రవింద ఇటు రావటం చూడగానే ఆనందంతో మురిసిపోయాడు. తన మంత్రశక్తి ముందు ఆమె నిలవలేక వశమై వచ్చేస్తోందనుకున్నాడు.

పదడుగులు ముందుకొచ్చిన మిత్రవింద అక్కడే ఆగిపోయింది. ఆమె ఆగటం గమనించి విళంబి సందేహిస్తూనే గేటునుంచి చెట్టుకింద వెనక్కి జరిగాడు. ఇంతలో మిత్రవింద ఉన్నచోటే నిలబడి అరనిముషం కళ్ళు మూసుకుని తెరిచింది.

నేరుగా గేటు బయట నిద్రగన్నేరు కొమ్మల వంకచూసింది. అంతే, ఒక్కసారిగా పదివేల ఓల్టుల కరెంటు తాకినట్టు అంత పెద్దచెట్టు జవజవలాడింది. దాని శాఖల్లోని బలమైన ఎండుకొమ్మనుంచి జలజలా నిప్పురవ్వలు ఎగసాయి.

ఒక్కసారిగా వికృత శబ్దాలతో ఫెళఫెళమంటూ ఎండుకొమ్మ విరిగి దబ్బున నేలమీద విరుచుకుపడింది. కొమ్మ విరిగిన శబ్దం చుట్టుపక్కల వాళ్ళని అలర్ట్ చేసింది. ఏం జరిగిందో తెలీక పరుగులెత్తుకు రాసాగారు. ఈలోపల–

ఎప్పుడైతే చెట్టుపై నుంచి నిప్పురవ్వలు ఎగసాయో అప్పుడే విళంబికి పై ప్రాణాలు ఎగసినంత పని అయింది. కొమ్మ విరుగుతున్న శబ్దం వింటూనే పక్కకి పరుగు తీశాడు. ఒక్కక్షణం ఆలస్యమైవున్నా అంతటి పెద్ద కొమ్మకింద నలిగి పచ్చడై ఉండేవాడు.

అక్కడికీ ఒక సన్నటి ఎండుకొమ్మ పారిపోతున్న విళంబి వీపుమీద బలంగా తాకింది. కెవ్వున అరిచి బోర్లాపడిపోయాడు. అంతే... పడ్డవాడు లేచి తిరిగి చూడకుండా ఎగువకు పరుగుతీశాడు.

పరుగులెత్తుకొచ్చిన ఊరిజనం విరిగిపడిన కొమ్మను చూసి మ్రాన్పడి పోయారు.

ఎలా చూసినా మూడడుగుల చుట్టుకొలత గల దృఢమైన కొమ్మ. ఇద్దరు మనుషులు రెండు గంటలు కష్టపడి నరికితే గాని పడని బలమైన కొమ్మ.

చిటపట నిప్పురవ్వలు లేవటం ఏమిటి, కాలికింద పడ్డం ఏమిటి? ఏమీ అర్థంగాక చోద్యం చూడనారంభించారు. కొమ్మ విరిగినచోట ఇంకా కాలుతూ పొగలు లేస్తూన్నాయి. ఈ గందరగోళంలో విళంబిని ఎవరూ పట్టించుకోలేదు.

చెట్టుకొమ్మ విరిగిపడిన వికృతశబ్దాలు వింటూనే అగ్నివేశాచార్యుడు, చరక్‌లు బయటికొచ్చారు. వారికి దేవమ్మగారి వాకిట్లో ఒంటరిగా నిలబడిన మిత్రవింద కన్పించింది. ఆమె గేటువైపు చూస్తోంది.

అంతలో లోపల్నుంచి దేవమ్మ, శుశ్రుత, శ్రావణిలు హడావుడిగా బయటకు రావటం కన్పించింది. వారంతా వాకిట్లోని మిత్రవిందను లోనకు తీసుకుపోసాగారు.

చరక్‌కి ఏమీ అర్థంగాక అగ్నివేశాచార్యుని వంక చూశాడు. గేటు బయట గుంపుగా చేరిన జనం గగ్గోలుగా అరవటం వినవస్తోంది.

"జేజిగారూ. మీరిక్కడే ఉండండి. ఏం జరిగిందో చూసొస్తాను" అంటూ వడివడిగా గేటువైపు సాగాడు చరక్. ఇంటి తలుపులు మూసి వెనకే తనూ బయలు దేరాడు అగ్నివేశాచార్యుడు.

కొందరు గ్రామస్తులు చరక్‌కి ఏం జరిగిందో చెప్తున్నారు. ఆ మాటలు ఎంతవరకు నిజమో చరక్‌కి అర్థంగావటంలేదు.

తమ గేటు సమీపంలో ఎక్కడా హైవోల్టేజి కరెంట్ లైన్లు కూడాలేవు. అంత లావుకొమ్మ చిటపట నిప్పుర్వలు ఎగసి విరిగిపడ్డం అంటే ఇదేమి వింతో అర్థం గావటంలేదు.

వెనకే వచ్చిన అగ్నివేశాచార్యుడూ జరిగింది విన్నాడు. చెట్టును, విరిగిన కొమ్మను పరికించాడు.

చరక్ గేటుకు అడ్డం లేకుండా కొమ్మను పక్కకు లాగిస్తున్నాడు.

ఆలోచిస్తున్న అగ్నివేశాచార్యుడికి అస్పష్టంగా ఏం జరిగుంటుందో ఒక స్పష్టత ఏర్పడుతోంది.

"కొమ్మ విరక్కముందు ఈ చెట్టుకింద ఎవరన్నా ఉన్నారా?" అనుమానంగా అడిగాడు.

"ఉన్నాడు స్వామీ. అదృష్టవంతుడు. వెధవ బతికిపోయాడు. ఈ మధ్యనే కొత్తగా బిచ్చగాడొకడు ఊళ్ళో తిరుగుతున్నాడండి.

వాడు అడుక్కుతెచ్చుకున్నవి మీ గేటుపక్కనే కూర్చుని తింటూంటాడండి. ఇప్పుడూ ఇక్కడే కూర్చుని తింటూండగా కొమ్మ విరుగుతున్న చప్పుడు విని అదాటున లేచి తప్పించుకు పోయాడండి" ప్రత్యక్షసాక్షి ఒకడు జరిగింది వివరించాడు.

"పొండి. ముందా బిచ్చగాడు ఎక్కడున్నాడో వెదికి తీసుకురండి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

అక్కడ ఆయన మాటకు తిరుగులేదు. బిచ్చగాడి కోసం కొందరు యువకులు పరుగులు తీశారు. కాని అప్పటికే ఆ బిచ్చగాడు ఊరి పొలిమేర దాటివెళ్ళిపోయాడన్న సంగతి వాళ్ళకి తెలీదు.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన గంట తర్వాత డ్రైవరు కాశీ మండపేట నుండి తిరిగొచ్చాడు. తెచ్చిన సరుకులు అప్పగించాక సరాసరి అగ్నివేశాచార్యుని వద్దకెళ్ళాడు.

"ఏమిట్రా" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

నోట మాటలేనందున వెర్రిగా అరుస్తూనే కాశీ ఏదో చెప్తున్నాడు. అగ్ని వేశాచార్యునికి అర్థంగావటంలేదు. ఇలా కాదనుకున్నాడు కాశీ.

వాడికి మరిడి సోమయ్య శిష్యుడు విళంబి. బిచ్చగాడి వేషంలో మన గేటు ప్రాంతంలో తిరుగుతున్నాడని చెప్పాలనివుంది.

అంతక్రితమే గేటు దగ్గర జరిగిన సంఘటన వాడికి తెలీదు. అటూ ఇటూ చూసి ఒక స్కెచ్ పెన్ను అందుకున్నాడు. దాన్ని ఎడంచేత్తో పట్టుకుని ఒక కాగితం మీద అతికష్టంగా "విళంబి... బిచ్చగాడు...." అని వంకరటింకరగా రాసి చూపించాడు. అది చాలు అర్థంగావటానికి.

నిజానికి గేటు బయట బిచ్చగాడు ఎవడో అగ్నివేశాచార్యునికీ ఇంతవరకూ తెలీదు. ఇప్పుడు కాశీ మూలంగా వాడు మరిడి సోమయ్య శిష్యుడు విళంబి అని తెలిసింది. కాశీ భుజం తట్టి అభినందించాడు అగ్నివేశాచార్యుడు.

* * * * *

అదేరోజు రాత్రి! మండపేటలోని లాడ్జి గది... రాత్రి పదిగంటలయినా– ఇంకా నిద్రపోలేదు విళంబి. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇప్పటికింకా గుండెదడ తగ్గలేదు. జరిగింది తలచుకుంటే చాలు వెన్ను జలదరించి అరచేతులు చెమటలు పట్టేస్తున్నాయి. జరిగిన సంఘటన మర్చిపోలేక పోతున్నాడు.

"అమ్మమ్మా, ఎంత ఘోరం... తృటిలో తప్పిపోయింది గాని లేకపోతే తను ఆ కొమ్మకిందే శవమైపోయేవాడు. ఓర్నాయనో! అగ్నివేశాచార్యుడే నిప్పను కొంటే అంతకుమించిన బడబాగ్నిలా ఉందీ అమ్మాయి. ఓ మైగాడ్. అంత అందమైన యువతిలో ఇంతటి శక్తి నిక్షిప్తమై ఉందా...?

ఆమె చూపులకు అంతటి శక్తి ఎలా వచ్చింది? తృటిలో అంత పెద్ద కొమ్మ ఫెళఫెళా విరిగిపడిందే! అరే చరక్... ఆ పిల్లను ఏ లోకం నుంచి తెచ్చావ్‌రా బాబూ. అగ్గికి గాలితోడయినట్టు అగ్నివేశాచార్యుడికి ఈ మహాశక్తి తోడయింది గదరా" ఆలోచిస్తున్నాడు.

తనను తను తిట్టుకుంటున్నాడు. అయినా తనకి బుద్ధిలేదు. దూరం నుంచి మిత్రవిందను చూస్తున్నాడు. చూసి ఊరుకోవచ్చుగా.

దగ్గరగా చూడాలనే వెధవ కోరిక ఏమిటి? తను చేసింది కూడా చాలా చిన్న ప్రయోగం. సమ్మోహనశక్తిని ప్రయోగించి గేటువద్దకు రప్పించాలని చూశాడు.

అంతే... ఆమె వశంగాకపోగా తన ఉసురుతీయాలని చూసింది. ఆమెలో ఇంతశక్తి ఉందని తెలిస్తే పొరపాటున కూడా మంత్రప్రయోగం చేసేవాడు కాదు. వామ్మో... ఆమె సామాన్యురాలు కాదు.

అయిందేదో అయింది. ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? ఈ విషయాన్ని గురువుగారికి రిపోర్ట్ చేయటంవలన తిట్లు తినటం తప్ప మరో ప్రయోజనం ఉండదు. అలాగని చాపచుట్టి వెనక్కి వెళ్ళిపోదామన్నా మనస్కరించటంలేదు.

ఏదో ఒకటి సాధించకుండా చేతగానివాడిలా నీలోదరికి తిరిగివెళ్తే అందరికీ లోకువైపోతాడు. ప్రస్తుతానికి భిక్షగాడి వేషానికి స్వస్తి పలకాల్సిందే.

ఈపాటికే చెట్టుకింద బిచ్చగాడి గురించి అగ్నివేశాచార్యుడికి తెలిసిపోయి వుంటుంది. మళ్ళీ అదే వేషంలో అక్కడ అడుగుపెడితే జనం తనను లాక్కుపోయి అగ్నివేశాచార్యుని ముందు నిలబెడతారు. వేషం మార్చాలి. తప్పదు.

ఉన్నట్టుండి విళంబికి మరో సందేహం కూడా ఏర్పడింది. మిత్రవింద తను ఎవరో తెలిసే దెబ్బ తీసిందా లేక సమ్మోహనశక్తిని ప్రయోగించినందువల్ల మాత్రమే తనకు బుద్ధిచెప్పటానికి అలా చేసిందా!

ఈ సందేహానికి సమాధానం కనుక్కోవడం అంత సులువనిపించడంలేదు. కాని మిత్రవింద చెప్పకుండా ఉంటుందా అగ్నివేశాచార్యుడికి. అసలు ఆమెలో అంత శక్తి ఉన్న సంగతి ఆచార్యుడికి తెలుసా?

చాలాసేపు తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు విళంబి. ఈసారి పిచ్చివాడి వేషంలో మున్నలూరి వారి అగ్రహారంలో ప్రవేశించాలనుకున్నాడు.

*　　*　　*　　*　　*

కంప్యూటర్ గదిలోంచి ఫోటో ప్రింటవుట్లు తీసుకుని పక్కన జేజితాత అగ్నివేశాచార్యుని గదిలో ప్రవేశించాడు చరక్. తను ద్వారక నుండి తెచ్చిన క్లాత్‌మీది శ్రీకృష్ణులవారి చిత్రం తాలూకు ఫోటోలవి. జేజి తాతగారి కోరిక మేరకు డిజిటల్ కెమెరాతో ఫోటోలు తీసి ప్రింట్లు వేశాడు.

"జేజిగారూ. మీరడిగినఫోటోలు" అంటూ నాలుగు ఫోటోలని అగ్ని వేశాచార్యునికిచ్చాడు. అన్నీ కార్డుసైజులో ఒకేలా ఉన్నాయి. చాలా బాగున్నాయి.

"నేనోసారి ఇంటికెళ్ళొస్తాను" అడిగాడు.

"ద్వారక ఎప్పుడెళ్తున్నావ్?" ఎదురు ప్రశ్నించాడు అగ్నివేశాచార్యుడు.

"నేను వెళ్ళడం ఏమిటి? మీరు ఎప్పుడు పంపిస్తే అప్పుడు వెళ్తాను" అన్నాడు చరక్.

"ఒరే... నీ మనసు మిత్రవిందవైపు పోతున్నట్టుంది. అందుకే నా మాటల్ని నువ్వు సరిగ్గా అర్థంచేసుకోవడం లేదు. నా ఉద్దేశం ఇక్కడ ఎప్పుడు బయలు దేరతావని కాదు. ఏ సమయానికి ద్వారకలో ఉండాలనుకుంటున్నావని" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"అదేదో సూటిగా చెప్పొచ్చుగదా. మధ్యలో మిత్రవింద ఏం చేసింది? శుశ్రుత, శ్రావణిల దగ్గర తెలుగు నేర్చుకుంటోంది" అన్నాడు చరక్.

"సరిసరి. కూర్చో. మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి"

"తర్వాత మాట్లాడుకోవచ్చుగా జేజిగారూ... అయినా ఇప్పుడీ ఫోటోలు ఎందుకు? వీటినిప్పుడే బయట పెట్టడం మంచిదంటారా?"

"ముందు కూర్చో చెప్తాను" ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు చరక్.

"చెప్పండి" అన్నాడు.

"నేను రేపు మన ఎస్టేట్ భవంతికి వెళ్ళిపోతున్నాను. నెలరోజుల వరకు అక్కడే ఉంటాను" చెప్పాడు అగ్నివేశాచార్యుడు. కూర్చున్నవాడు తిరిగి లేచి నిలబడ్డాడు చరక్.

"వచ్చి నాలుగు రోజులవలేదు. మళ్ళీ ఎస్టేట్‌కా...

ఏమిటిది జేజిగారూ. ఏమిటి తొందర. పది రోజులు ఆగి వెళ్ళొచ్చుగా" అన్నాడు.

"వెళ్ళాలిరా, తప్పదు" అన్నాడు ప్రశాంతంగా అగ్నివేశాచార్యుడు. "వయసవుతోంది గదా. పనులు త్వరగా ముగించాలని తొందరగా వుంది కూర్చో" అన్నాడు. ఆయన మాటలు చరక్‌కి అర్థంగావటంలేదు. ఆలోచిస్తూ తిరిగి కూర్చున్నాడు.

"ఈ ఫోటోలు మీడియా వాళ్ళకివ్వటానికో, బయట పెట్టడానికోకాదు, ఈ చిత్రం ఎక్కడిదో కూడా ఎవరికీ చెప్పం" అన్నాడు.

"ఓ.కె. భద్రంగా దాచుకోండి కాని ఎస్టేట్‌లో ఏం పని?" అడిగాడు చరక్.

"ఎస్టేట్‌లో మెయిన్‌రోడ్ నానుకొని తూర్పు దక్షిణాలుగా వున్న ప్రాంతంలో నాలుగు ఎకరాల తోటను నరికించి చదును చేయించాలి.

ఎల్లుండినుంచి పని మొదలవుతోంది. నీవు ద్వారక నుండి తిరిగివచ్చేసరికి ఆలయనిర్మాణ పనులు జోరుగా సాగుతూంటాయి.

నా మిత్రులు తమిళనాడు నుండి పెరుమాళ్ స్థపతి, శ్రీశైలం నుండి శంకరనారాయణ స్థపతి ఇద్దరూ వస్తున్నారు. ఈ ఫోటోలు వారికోసం. శ్రీకృష్ణ ప్రభువులు విగ్రహం తయారీకి.

అంతేకాదు వాళ్ళిద్దర్నీ కొందరు శిష్యులతో ద్వారక పంపిస్తున్నాను. అక్కడ ద్వారకాధీష్ ఆలయాన్ని (హరిమందిర్ ఆలయం) పరిశీలించి స్కెచ్‌లు వేసుకుని తెస్తారు.

అలాంటి ఆలయ నిర్మాణమే ఇక్కడ చేపట్టబోతున్నాం. నాగొంతులో ఊపిరి ఆగేలోపల ధర్మసంస్థాపన, ఆలయనిర్మాణం రెండూ జరిగిపోవాలి. ఇప్పటికే నూటపాతికేళ్ళు బ్రతికాను. ఇంకెంత కాలమో చెప్పలేను. అందుకే ఈ తొందర"

అగ్నివేశాచార్యుని మాటలు విని బాధగా చూశాడు చరక్. లేచి పక్క కొచ్చి కూర్చుని ఆయనచేయి అందుకున్నాడు. "జేజి తాతయ్యా... మీరలా అనకూడదు. మీ ఆశయం సిద్ధించేవరకు మీరు క్షేమంగా ఉంటారు. మీ లక్ష్యాన్ని నేను నెరవేరుస్తాను. తప్పుగా ఏమన్నా మాట్లాడితే క్షమించండి" అన్నాడు.

మునిమనవడి జుట్టునిమిరి ప్రేమగా నుదురు ముద్దాడాడు అగ్ని వేశాచార్యుడు.

"కాలం మనకోసం ఆగదు. సకాలంలో పనులు ముగించాలంటే మనం శ్రమించాలి.

ఎంత ఖర్చయినా ఆలయ నిర్మాణం ఆగరాదు. ధర్మసంస్థాపన జరిగితీరాలి."

"జరుగుతుంది జేజిగారూ. నన్ను నమ్మండి. కాదంటే ఆ మరిడి సోమయ్య లాంటి క్షుద్రమాంత్రికుడి వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురు కావచ్చు"

"మనల్నేమీ చేయలేరు. ఆ విషయం మర్చిపో. అన్నట్టు చరక్ నాకో విషయం ఇప్పటికీ సరిగ్గా అర్థంకాలేదు. మరోసారి చెప్పు"

"ఏ విషయం జేజిగారూ?"

"ద్వారక నుండి నువ్వంటే మణిభద్రయక్షుని సాయంతో వెనక్కి వచ్చావ్. కాని నీ వెంట మిత్రవింద ఎలా వచ్చింది?"

"చెప్పానుగా జేజిగారూ... సాధువు శివయోగి, మిత్రవిందకు కొన్ని శక్తులు ధారపోశాడని...."

"ఏమిటవి గుర్తుందా?"

పదిసెకన్లు ఆలోచించాడు చరక్.

"బాగా గుర్తు ఉంది. నా వద్ద గల పంచశక్తుల్లో ఆత్మశక్తిని, ఆత్మగమన శక్తిని రెంటినీ ధారపోస్తున్నాను" అని ధారపోసి మిత్రవింద చెవిలో మంత్రోపదేశం చేశాడు" అన్నాడు చరక్.

అగ్నివేశాచార్యుడు ఆలోచనలో పడ్డాడు.

ఆత్మశక్తి తిరుగులేనిది. ఆత్మగమనశక్తి అంటే శరీరాన్ని వదిలి ఆత్మ ఎక్కడికైనా వెళ్ళిరాగలదు. ఐతే తన అనుమానం కరక్టయితే ఈ రెండు శక్తులే కాదు. మరికొన్ని శక్తుల్ని కూడా ఆ శివయోగి, మిత్రవింద వశం చేసుండాలి. సందేహం లేదు.

చెట్టుకొమ్మ విరిగిపడ్డానికి మిత్రవిందే కారణం. గేటు బయటి నుంచి విళంబి, మిత్రవింద మీద ఏదో ప్రయోగం చేసుండాలి. అందుకే మిత్రవింద అలా చేసింది. లేకపోతే విళంబి గురించి ఆమెకు అసలు తెలిసే అవకాశమే లేదు.

"ఏమిటి జేజితాతగారూ ఆలోచిస్తున్నారు?" చరక్ ప్రశ్నతో ఆలోచనల నుంచి బయటపడ్డాడు అగ్నివేశాచార్యుడు. మిత్రవిందలోని అసాధారణ శక్తుల గురించి చరక్‌తో చెప్పలేదు.

"ఏం లేదురా. నిన్న చెట్టుకొమ్మ విరిగిన సంఘటన గుర్తొచ్చింది. రేపు నేను బయలుదేరుతున్నాను" అన్నాడు.

"ఎలా? జీపులోనా, కారులోనా! ఎందుకంటే మిత్రవిందను తీసుకుని రేపు ద్రాక్షారామం, ముక్తేశ్వరం కోటిపల్లి వెళ్ళొద్దామంటోంది శుశ్రుత. మాకు కారయితేనే వసతిగా ఉంటుంది. అందుకని...."

"అర్థమైంది. కాని నేను కారు తీసుకెళ్తున్నాను. డ్రైవరు కాశీ నాతో వస్తున్నాడు. అప్పన్న ఇక్కడే ఉంటాడు. మీ ప్రయాణాన్ని మూడు రోజులు వాయిదా వేసుకోండి.

మీకోసం కొత్త బెంజ్‌కారు ఆర్డర్ చేశాను. అది గురువారం మనింటి ముందుంటుంది.

కొత్తకారుకు వాహనపూజలు చేయించినట్టూ ఉంటుంది. మీరు గుళ్ళు చుట్టివచ్చినట్టూ ఉంటుంది" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

కొత్తకారు అనగానే ఉత్సాహంగా చూశాడు చరక్. "థ్యాంక్యూ జేజిగారు. మీరు చెప్పినట్టే చేస్తాం" అన్నాడు.

ఇంతలో – దేవమ్మగారి కుక్క టామీ నిశ్శబ్దంగా వచ్చి చరక్ సమీపంలో ఒకపక్కగా తోకముడిచి బుద్ధిగా కూర్చుంది. దాన్ని ఇద్దరూ గమనించలేదు.

*　　*　　*　　*　　*

"ఓరినాయనో... ఎక్కడ్నుంచి వస్తున్నార్రా వీళ్ళు. నిన్నటిదాకా కొత్త బిచ్చగాడు తిరిగాడంటే, ఇవాళ ఎవడో కొత్త పొచ్చోడు తయారయ్యాడు.

కొట్టినా కొడతాడు. చేతిలో కర్ర ఉంది. తప్పుకోండి" అనరిచాడు మున్నలూరి వారి అగ్రహారంలోని పౌరుడొకడు.

అది ఉదయం సుమారుగా పదిగంటల ప్రాంతం. కూలి నాలి చేసుకునే జనం హడావుడిగా పొలాలకు వెళ్తున్న సమయం. అప్పుడు తిరిగి అగ్రహారంలో ప్రవేశించాడు విళంబి. ఈ సారి విళంబి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నడివయసు పిచ్చాడిలా ఉన్నాడు.

ఒత్తుగా పెరిగిన గడ్డం, మీసాలు దుమ్ముధూసరితో నిండిన చింపిరి జుత్తు, ఒంటిమీద పీలికలైన దుస్తులు, చేతిలో పొడవాటి చెట్టుకొమ్మ ఒకటుంది. చాలా దూరం నుంచి నడిచొస్తున్నట్టుగా మోకాళ్ళవరకు ఎర్రధూళి. పాదాలకు అరిగిపోయిన రెండురకాల చెప్పులు, పళ్ళికిలించి పిచ్చిచూపులు చూస్తూ వాడు వీధిలోకి వస్తుంటే జనం భయపడి తొలగిపోతున్నారు. చంకన ఉన్న చిన్న జోలెను పదే పదే చూసుకుంటూ తనలో తను మాట్లాడుకుంటూ కాస్సేపు వీధుల్లో అటూ ఇటూ తిరిగాడు విళంబి.

తర్వాత నేరుగా వచ్చి అగ్రహారం గేటు ఎదురుగా రోడ్డు అవతల అరుగు మీద కూర్చున్నాడు.

ఎవరి పనుల్లో వాళ్ళు హడావుడిగా ఉండటంతో వాడ్ని ఎవరూ పట్టించుకోలేదు.

చూసీచూడనట్టుగా కాంపౌండ్‌లోనకు చూశాడు. బయట ఎవరూ కనబడటంలేదు. తనకు ఏదో ఒక సమాచారం తెలియాలంటే ఎవరో ఒకర్ని లోనకు పంపించాలి. ఎవర్ని పంపిస్తే బాగుంటుంది? తల బరుక్కుంటూ చెట్టు కొమ్మల్లోకి చూశాడు. అరడజను కోతులు కొమ్మల వెంట తిరుగుతూ కన్పించాయి. కోతిని పంపిస్తే ఎలా ఉంటుంది? ఊహు పంపించేది ఏదయినా సహజంగా ఉండాలి.

కోతులో, పిల్లులో లోనకు రావటం చూస్తే బయటికి తరిమేస్తారు. పోనీ... చిలకను పంపిస్తే? చిలకకోసం అతడి చూపులు గాలిస్తుండగా అదృష్టం కొద్దీ దేవమ్మ గారి బొచ్చుకుక్క టామీ వాకిట్లోకి వస్తూ కన్పించింది. వాకిట్లో గింజలు ఏరి తింటున్న ఉడతల్ని తరుముతూ చెలగాటమాడసాగింది.

ఇక ఆలస్యం చేయలేదు విళంబి. సమీపంలో ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని టామీకి మంత్రం ప్రయోగించాడు. మంత్ర ప్రభావంతో శవమైన టామీ గిరుక్కున తిరిగి నేరుగా పిచ్చోడి వేషంలోని విళంబి వద్దకు పరుగెత్తుకు వచ్చేసింది.

అది రాగానే దానికో బిస్కెట్ ఇచ్చాడు విళంబి. అది బిస్కట్ తింటూండగా తన జోలెలోంచి దారం కట్టిన తెల్లటి పూసలాంటి వస్తువును తీశాడు. పెద్దసైజు గోలీకాయ ప్రమాణంలో ఉందది.

దాన్ని టామీ మెడలో కట్టాడు. బయటికి కనబడకుండా బొచ్చులోకి సర్దేసి– "పోరా... నేరుగా అగ్నివేశాచార్యుని గదిలోకి పోయి నిశ్శబ్దంగా కూర్చో పో" అంటూ చేతిని గాల్లో ఊపాడు. అంతే– ఎలా వచ్చిందో అలాగే తిరిగి గేట్లోకి పరుగెత్తింది టామీ.

విళంబి, కుక్కమెడలో కట్టింది వైర్‌లెస్ ట్రాన్స్‌మిషన్ సెట్టు. దానికి పదిహేను అడుగుల దూరం లోంచి ఎలాంటి శబ్దాలు వచ్చినా ప్రసారం చేసేస్తుంది. దాని రిసీవింగ్ బగ్ విళంబి వద్ద ఉంది. దాన్ని చెవిలో పెట్టుకుని

ఫలితం కోసం ఎదురుచూడసాగాడు విళంబి. చూస్తూండగానే టామీ ముందున్న భవంతి లోంచి వెనక్కి అదృశ్యమైంది.

* * * * *

కాస్సేపటికి ముందుగా అగ్నివేశాచార్యుని గొంతు శాంతగంభీరంగా వినవచ్చింది– "మీకోసం కొత్త బెంజికారు ఆర్డర్ చేశాను. అది గురువారం మనింటి ముందుంటుంది. కొత్తకారుకు వాహన పూజలు చేయించినట్టూ ఉంటుంది. మీరు గుళ్ళు చుట్టినట్టూ ఉంటుంది" అంటున్నాడు.

"థ్యాంక్యూ జేజిగారు. మీరు చెప్పినట్టే చేస్తాం" అది చరక్ గొంతు.

ముత్తాత, మునిమనవడు ఒకచోటే ఉన్నారు. ఎంతో కొంత ఇన్ఫర్మేషన్ దొరక్కుండా ఉండదు. ఉత్సాహంగా చెవులు రిక్కించాడు విళంబి.

"సరి. ఇక ఈ విషయాల్ని పక్కన పెడదాం. మనం కోరుకున్న నాలుగు వస్తువులు గుర్తున్నాయిగా?" సూటిగా చూస్తూ చరక్‌ను ప్రశ్నించాడు అగ్నివేశాచార్యుడు.

"వాటినెలా మర్చిపోతాను జేజిగారూ. శమంతకమణి. శిఖిపించం, పాంచజన్యం, మురళి.

నాలుగూ తేవాలనే నా ప్రయత్నం. కాదంటే నేను ఏ సమయానికి ద్వారకలో అడుగుపెడితే పని సానుకూలమవుతుందో ఆలోచించాలి.

ఇంతకు ముందే మీకు చెప్పాను. నేను కోటగుమ్మం దాటి లోన అడుగు పెట్టడం సాధ్యం కాదు...."

"అర్థమైంది. కాస్త ఆలోచిస్తే ఏదో మార్గం దొరక్కపోదు. సరిగ్గా ఇప్పటికి నెలా పదిహేనురోజుల తర్వాత ఏకాదశికి దివ్యమైన ముహూర్తం ఉంది. నీ ప్రయాణానికి ఆ ముహూర్తాన్ని ఖాయపర్చాను. నేను ఎస్టేట్‌కు వెళ్ళి కూర్చుంటే మనం చర్చించుకోవడానికి అవకాశం ఉండదు"

ఏదో చెప్పబోతూ టామీని చూసి ఆగాడు చరక్. యధాలాపంగా చూసినా– ఏదో స్ఫురించి ఆశ్చర్యపోయాడు చరక్. "జేజిగారూ... టామీని చూశారా... మీరంటే భయపడి ఛస్తుంది. మీరిటుంటే అటు పారిపోతుంది. అలాంటిది ఇంత బుద్ధిగా వచ్చి మనదగ్గర కూర్చుందేమిటండీ" అన్నాడు చరక్.

అగ్నివేశాచార్యుడు టామీ వంక చూశాడు. నదురు బెదురు లేకుండా అలా కూర్చునే చూస్తోందది. అది కూర్చున్నతీరు, ఆ చూపులు అసహజంగా ఉన్నాయి. మామూలుగా అయితే ఇది పొరపాటున కూడా ఇటురాదు. ఏమైంది దీనికి? "చరక్... నాకేదో సందేహంగా ఉంది. దాన్ని పట్టుకో చెప్తాను" అన్నాడు అగ్నివేశాచార్యుడు సోఫాలోంచి లేస్తూ.

చరక్ లేచి వెళ్ళి టామీని పట్టుకోబోయాడు. అది పారిపోబోతుంటే తలమీద ఒక్కటిచ్చి ఒడిసిపట్టుకున్నాడు చరక్. చేతికి గోలీలా ఏదో తగిలింది.

ఏమిటిది అనుకుంటూ దాన్ని బయటకు లాగి చూసి అదిరిపడ్డాడు. "జేజిగారూ. మన మాటల్ని ఎవరో వింటున్నారు" అనరిచాడు.

అంతవరకే విన్నాడు విళంబి. టామీ దొరికిపోవడంతో గుట్టు బయటపడిపోయిందని అర్థమైంది. అయితేనేం. తనకు తెలియకూడని విషయాలే తెలిశాయి. చాలు. ఏ క్షణంలోనయినా వాళ్ళు బయటకు రావచ్చు. వాళ్ళ కంట పడకముందే తను పారిపోవడం మంచిది. ఈ సారి కన్పిస్తే అగ్నివేశాచార్యుడు తనను భస్మం చేసేస్తాడు.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు విళంబి. పిచ్చి గంతులు వేస్తూ ముందుకు పరుగెత్తాడు.

ఇంతలో ఒక ట్రాక్టరు అతడ్ని దాటిపోయింది. వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా ట్రాక్టర్ తొట్టి వెనక పరుగెత్తి పైకి ఎక్కేసి కూర్చున్నాడు.

ట్రాక్టర్ వీధిమలుపు తిరిగింది. పిచ్చివాడి వేషంలోని విళంబి అక్కడి నుండి నిష్క్రమించిన రెండో నిముషంలో అగ్నివేశాచార్యుడు, చరక్‌లు వడివడిగా గేటు వద్దకొచ్చారు. కాని అక్కడ గేటు దగ్గరగాని, రోడ్డు అవతలగాని ఎవరూ కనబడలేదు.

చరక్ అనుమానంతో రోడ్డు దాటి వెళ్ళి అరుగుమీద చూశాడు.

అక్కడ ఒక గుడ్డ జోలి కనబడింది. నేలమీద పడున్న హియరింగ్ బగ్ దొరికింది.

"ఏమైందిరా... ఏమిటిది?" దగ్గరకొస్తూ అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఇది హియరింగ్ బగ్ జేజిగారూ. ఆ వెధవ ఎవడో ఇక్కడే కూర్చుని మన మాటలు విన్నాడు.

టామీ దొరికిపోయిందని తెలీగానే ఉడాయించాడు. ఒక్క నిముషం ఆగండి" అంటూ కాస్త దూరంలో వున్న సోడా బంక్ వద్దకు పరుగెత్తాడు చరక్.

చరక్‌ను చూడగానే బంక్‌లో వ్యక్తి గౌరవంగా బయటికొచ్చాడు. "ఏమైంది సార్. మీరిలా వచ్చారేమిటి?" అనడిగాడు.

"ఏం లేదు. మా గేటు ఎదురుగా అరుగుమీద ఎవరు కూర్చున్నారో చూశావా?"

"వాడా... ఎవడో కొత్త పిచ్చోడు సార్. ఇంతక్రితం వరకు అక్కడే ఉండాలి. ఎటుపోయాడో పనిలో ఉండి గమనించలేదండి"

"పిచ్చోడా...."

"అవునండి పిచ్చోడే కొత్తగున్నాడు. ఎవడో తెలీదు. ఇంతకీ ఏమైంది సార్...?"

"ఏం లేదులే" అంటూ వెనక్కి వచ్చేశాడు చరక్.

"జేజిగారూ. ఇక్కడో కొత్త పిచ్చోడు ఇంత క్రితం వరకు తిన్నెమీద కూర్చున్నట్టు బంకువాడు చెప్తున్నాడు. ఎటు పోయాడో చూళ్ళేదట" అన్నాడు.

"సందేహం లేదు. ఇది వాడిపనే" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"ఎవడు వాడు?"

"నిన్నటివరకూ బిచ్చగాడి వేషంలో తిరిగినవాడు, మాంత్రికుడు మరిడి సోమయ్య శిష్యుడు విళంబి. పిచ్చాడిలా కొత్త వేషంలో వచ్చి మన మాటలు విన్నాడు. టామీ దొరికిపోగానే మన కంటపడకుండా పారిపోయాడు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"ఇప్పుడెలా జేజి తాతయ్యా. నేను ద్వారక నుండి ఏం తేవాలనుకుంటు న్నానో వాడికి తెలిసిపోయింది. వాడ్ని ఆపలేమా?"

"అంత శ్రమ అవసరమా?"

"అది కాదు నా ఉద్దేశం...."

"వాళ్ళు ఎంత ఎక్కువ తెలుసుకుంటే అంతకంత వాళ్ళకే ప్రమాదం. ఇప్పుడేమైందని. తెలుసుకుని వాళ్ళు మనల్నేమీ చేయలేరు. వెళ్ళనీ... ఇక వాడీ పరిసరాలకు రాడు. పద. భోజనం వేళైంది.

ఇంటికెళ్ళు అమ్మాయిలిద్దరూ నీకోసం ఎదురు చూస్తూంటారు. రాత్రికి నా వద్దకు రా. ప్రశాంతంగా చర్చించుకుందాం. వెళ్ళు" అంటూ బయలుదేరాడు అగ్నివేశాచార్యుడు.

* * * * *

"ఏమిట్రా అప్పుడే వెనక్కి వచ్చేసినావ్.

నేనే ఇవాళో రేపో అక్కడికి రావాలనుకుంటున్నాను...." తన ముందు కొచ్చిన శిష్యుడు విళంబిని చూసి గంభీరంగా అడిగాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

"ఏమిటి గురుదేవా. మీరు... మున్నలూరి వారి అగ్రహారానికా... ఏందుకు?" అనడిగాడు కంగారుగా విళంబి.

"ఎందుకేమిట్రా నీవు జూచిన ఆ అందాల సుందరి... పేరేమి? మిత్రవింద అని గదూ చెప్పినావ్? ఆ మిత్రవింద అందాలను, పరువాలను మేమును జూడవలదా?" అంటూ మీసం తిప్పి నవ్వాడు మరిడి సోమయ్య.

గురువుగారి వరసచూసి ఏదో సంకటంలో పడేలా ఉన్నాడనిపించి మరింత కంగారుపడ్డాడు విళంబి. "వద్దు గురువుగారూ, అలాంటి ఆలోచన పెట్టుకోకండి. నామాట వినండి" అంటూ హెచ్చరించాడు.

"తర్వాత వింటాగాని ఇంతకీ వెళ్ళినపని ఏమైంది? ఎదైనా ఉపయోగపడే సమాచారం తెచ్చినావా?"

"ప్రాణాలకు తెగించి మరీ సాధించి తెచ్చాను. మనం ఏకాంతంలో మాట్లాడుకోవటం మంచిదనుకుంటాను" అక్కడే వున్న అఘోరాను, ఇతర శిష్యుల్ని చూస్తూ చెప్పాడు విళంబి.

"సరి పద"

విళంబిని తీసుకుని తనవైపు అడుగులు సారించాడు మరిడి సోమయ్య. అక్కడే వున్న అఘోరా కూడా వారితో బయలుదేరాడు.

అతను తమతో రావటం విళంబికి ఇష్టంలేదు. కాని గురువులాంటివాడు గాబట్టి మరిడి సోమయ్య అతన్ని వారించలేదు.

తలుపు మూశాక ముగ్గురూ మూడుసోఫాల్లో కూర్చున్నారు. విళంబి తను బయలుదేరి వెళ్ళినప్పట్నుంచి జరిగిందంతా గురువుగారికి వరసగా వివరించాడు. మున్నలూరివారి అగ్రహారం విశేషాలూ చెప్పాడు. ముఖ్యంగా మిత్రవింద గురించి.

అంతా విని చప్పగా పెదవి విరిచాడు అఘోరా.

"ఇదేమాత్రం నమ్మదగ్గ విషయంగా లేదు" అన్నాడు అఘోరా వెంటనే.

"ఏ విషయం?" విళంబి ప్రశ్న.

"అదేరా... ఒక ఆడపిల్ల కళ్ళెర్రజేస్తే చెట్టుకొమ్మ విరిగిపడ్డం" అన్నాడు అఘోరా.

"అంటే నేను అబద్ధం చెప్పానని మీ ఉద్దేశమా?" అఘోరా పరిహాసాన్ని అవమానంగా భావిస్తూ రోషంగా అడిగాడు విళంబి.

"లేదురా... కల్పించి చెప్పావంటున్నాను" అన్నాడు అఘోరా.

"రెంటికీ తేడా ఏముంది? తెలిసీ తెలీకుండా ఆ అమ్మాయి గురించి మీరిలా తేలిగ్గా మాట్లాడటం సరికాదు. జరిగింది చెప్పాను. నమ్మటం, నమ్మకపోవడం మీ ఇష్టం" అన్నాడు విళంబి.

"సరిసరి. ఈ విషయంలో వాదులాటలు అనవసరం" అంటూ మధ్యలో కల్పించుకున్నాడు మరిడి సోమయ్య. "చెప్పు. ఇంతకీ నువ్వు తెచ్చిన విలువైన సమాచారం ఏమిటి?" అంటూ తిరిగి తనే అడిగాడు.

"అక్కడికే వస్తున్నాను గురువుగారూ. ఎప్పుడనేది ఖచ్చితంగా తెలీదుగాని తొందరలోనే మరోసారి చరక్ ద్వారకాపురికి వెళ్ళబోతున్నాడు.

సందేహంలేదు. అతను మిత్రవిందను ద్వారక నుండే తీసుకొచ్చాడు. ఆమె సౌందర్యదేవత.

చూడవలసిందేగాని చెప్పనలవి కాదు. బహుశా అంత పొడవుండే యువతుల్ని మనం చూడలేం. ఆరడుగులపైమాటే...

ఈ కాలపు అమ్మాయి కాదు. చూపు... నడక... హావభావాలలో ఏదో తెలీని విలక్షణత...."

"తర్వాత?"

"ఈసారి వెళ్ళినప్పుడు ద్వారకనుండి నాలుగు వస్తువుల్ని తేవాలను కుంటున్నాడు" ఆ మాటకి మరిడి సోమయ్య ఉద్వేగంతో ముందుకు వంగాడు.

"శ్రీకృష్ణుడి శమంతకమణిహారం, శిఖిపించం, పాంచజన్యం, మురళి"

విళంబి మాటలువిని– పగలబడి నవ్వాడు అఘోరా. అసలే వికృతమైన గొంతు. నవ్వితే ఆ కర్కశధ్వనికి చెవి కర్ణభేరీలు పగిలిపోతాయనిపిస్తుంది.

ఈసారి విళంబి కాదు, మరిడి సోమయ్యే విసుగ్గా అఘోరా వంక చూశాడు.

"గురూజీ! ఆ నవ్వుకి అర్ధం ఏమిటి?" అనడిగాడు.

"మరి నవ్వక ఏంచేయను సోమయ్యా. విలువైన సమాచారమంటే అదెంత గొప్పదో అనుకున్నాను. నీ శిష్యుడేం చెప్తున్నాడో నీకయినా అర్ధమవుతోందా?" అంటూ మళ్ళీ నవ్వాడు అఘోరా.

"అర్ధంకాలేదు. మీకు ఏమి అర్ధం అయిందో చెప్పండి" అన్నాడు మరిడి సోమయ్య.

"నీ మెప్పుకోసం వీడు కట్టుకథలు విన్పిస్తున్నాడు. ఆ అమ్మాయిని ద్వారక నుంచి తీసుకొచ్చాడంటే కావచ్చనుకున్నా. తిరిగి ద్వారక వెళ్తాడంటే దాందేముంది ఇక్కడ రైలెక్కి అక్కడ దిగుతాడనుకుందాం. కాని శ్రీకృష్ణుడి కిరీటమట? పాంచజన్య మట?

శమంతకమణి? మురళి? ఏంటిది? అవేమన్నా అంగట్లో సరుకా వెళ్ళి కొనితెచ్చుకోడానికి?

వేలసంవత్సరాల క్రితం ద్వారక నీటమునిగింది. శ్రీకృష్ణుడి ఆభూషణాలు ఏమయ్యాయో తెలిసిన చరిత్రకారులెవరూ లేరు.

అయినా అవి తెచ్చి ఏం చేసుకుంటారు...."

"ఇక ఆపు అఘోరా...." అసహనంగా అరిచాడు మరిడి సోమయ్య.

అఘోరా అలా అమాయకంగా మాట్లాడుతుంటే సహించలేకపోయాడు. నిజానికి అఘోరాకి తెలిసింది మరిడిసోమయ్యకు అగ్నివేశాచార్యుడితో శత్రుత్వం ఉందని మాత్రమే.

అంతకుమించి ఏ విషయాన్నీ అతను అడగలేదు. మరిడి సోమయ్య చెప్పనూలేదు. "మీకు తెలీదు. కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా పరిహసించటం మంచిదికాదు" అన్నాడు కోపాన్ని అదుపుచేసుకుంటూ.

"నా శిష్యుల్ని నేను నమ్ముతాను. ఎందుకంటే వాళ్ళు అబద్ధం చెప్పరు.

విళంబి మాటలు సత్యదూరాలు కావు, వాస్తవాలు... మీరనుకుంటున్నట్టు ఆ అమ్మాయి మిత్రవింద నేటి కలికాలపు ద్వారకాయువతి కాదు.

ద్వాపరయుగం చివరిలో నీటమునగకముందు రోజుల్లోని ద్వారకాపట్టణ యువతి. నాటి శ్రీకృష్ణబలరాముల్ని, యాదవుల్ని స్వయంగా చూసిన అమ్మాయి. ఇప్పుడు సజీవంగా చరక్ వెంట వచ్చిందంటే ఆమెలో ఏ శక్తులూ లేకుండానే వచ్చిందా?

ఏం మాట్లాడుతున్నారు మీరు? వాడు... ఆ చరక్ సామాన్యుడు కాదు. నాలుగు వస్తువుల్ని తెచ్చినా తెస్తాడు. నిజంగా తెస్తే ఏం జరుగుతుందో తెలుసా? మీకు తెలీదు. శవాలతో సావాసం చేసి శ్మశానాల్లో తిరుగుతూ ఎప్పుడూ మంత్ర సిద్ధుల గురించే దీక్ష వహించే మీకు ఇలాంటి లౌకికవిషయాలు తెలీదు.

శమంతకమణి రోజుకి పదిబారువల బంగారాన్ని ఇస్తుంది. అది వచ్చిందంటే మనదేశాన్నిమించిన ధనవంతమైన దేశం మరోటి ఉండదు.

శిఖిపింఛం... అదీ శ్రీకృష్ణుడు ధరించిన నెమలి పింఛం తెస్తే ఈ దేశానికి ఎలాంటి అరిష్టాలు, గ్రహపీడలు ఉండవు. శ్రీకృష్ణునికాలంలో యాదవులు ఎంత సుఖశాంతులతో బతికారో అలా బతగ్గలరు. కలిప్రభావం పల్చబడిపోతుంది.

నిత్యజయంగా ఉంటుంది.

ఇక మురళి... సంగీతం వినే పశువులు సాధారణ పశువులకన్నా అధిక పాలదిగుబడి నిస్తున్నాయని పరిశోధకులే అంటున్నారు.

మురళిగానమంటే గోవులకు ప్రీతి.

ఇక ఆ కృష్ణుడి మురళిని తేవటం జరిగితే దేశంలో పశుసంపద వృద్ధి పొందుతుంది. పాడిపంటలకు కొదవ ఉండదు. దేశం సస్యశ్యామలమవుతుంది. ప్రజల్లో ఈర్ష్యాద్వేషాలు నశిస్తాయి.

ఇక పాంచజన్యం. శ్రీకృష్ణుడి శంఖం. ధర్మసంస్థాపన. తన పాంచజన్యం పూరించి కురుక్షేత్ర సంగ్రామం నడిపించి ధర్మసంస్థాపన చేశాడు.

అలాంటి పాంచజన్యం పూరించడం జరిగితే మీలాంటి, నాలాంటి మనమెంత? దేశంలోని దుష్టులు, దుర్మార్గులు, అక్రమార్కులు, అవినీతిపరులు అంతా మట్టికొట్టుకుపోవాల్సిందే.

మీరనుకుంటున్నట్టు అవి అమ్ముకోడానిక్కాదు తెచ్చేది. ధర్మాన్ని తిరిగి నిలపటంకోసం అగ్నివేశాచార్యుడు చేస్తున్న ప్రయత్నమిది.

మీరనుకున్నట్టు చరక్ వెళ్ళేది ఈనాటి ద్వారకకాదు. అలనాటి ద్వారకాపురి" అంటూ మరిడి సోమయ్య చెప్తుంటే చిత్తభ్రమ కలిగినట్టు అలా చూస్తూండిపోయాడు అఘోరా.

మహిషశక్తిని వశపర్చుకోడానికి చేస్తున్నపనులకి కారణం అగ్ని వేశాచార్యుని మీద ద్వేషం అనుకున్నాడు గాని దీనివెనుక ఇంత సమాచారం ఉందని తెలీదు. అదే సమయంలో మరో విషయం కూడా అఘోరాకి గుర్తొచ్చింది.

"బాగానే ఉంది సోమయ్యా, ఈ విషయాలేవీ నాకు తెలీక మాట్లాడా. సరే, ఏం తెచ్చినా తన సొంతం చేసుకోవాలని పదేపదే నీకు ఫోన్లు చేస్తున్నాడే శంభులింగ మహాపాత్రో, అతనికి వీటిని సొంతం చేస్తావా?" అనడిగాడు అఘోరా.

"తెస్తేగా సొంతం చేయటానికి. అవి తేవటం జరిగితే మనలాంటివాళ్ళ మనుగడే పోతుంది. ఆ శంభులింగ మహాపాత్రో కూడా నశిస్తాడు.

ధర్మం నాలుగు పాదాల నడిచినకాలం కృతయుగం. మూడు పాదాల నడిచిన కాలం త్రేతాయుగం. అందుకే అంతటి సీతమ్మవారిమీద అపవాదు పడింది. ఇక ద్వాపరయుగం వచ్చేనాటికి ధర్మం రెండు పాదాలే ఉంది.

ఇప్పుడు కలియుగంలో కలిప్రభావం వలన భ్రష్టుపట్టి ధర్మదేవత ఒక్క పాదంతో కుంటుతోంది. దీన్ని మార్చి, కలిప్రభావాన్ని నాశనం చేసి తిరిగి ధర్మం నిలబెట్టాలన్నది అగ్నివేశాచార్యుని సంకల్పం.

ఆ సంకల్పానికి విఘాతం కలిగించకపోతే మనం ఉండం. అర్ధమైంది గదా... ఇక ఈ విషయాన్ని వదిలి త్వరగా నాకు మహిషశక్తి వశమయ్యేలా చూడండి చాలు. ఎప్పుడు ఏం చేయాలో నేనాలోచిస్తాను" అన్నాడు మరిడి సోమయ్య.

"గురువుగారూ... మరో విషయం...." అన్నాడు విళంబి.

"ఏమిటది?"

"అగ్నివేశాచార్యుడు రెండ్రోజుల్లో మున్నలూరి వారి అగ్రహారం నుంచి నెలరోజులపాటు ఎక్కడికో వెళ్తున్నాడు. మీరు మిత్రవిందను చూడ్డానికెళ్ళాలను కుంటే నాలుగు రోజులు ఆగి బయలుదేరటం మంచిది. అప్పటికి అగ్ని వేశాచార్యుడు అక్కడ ఉండడు" అన్నాడు విళంబి. అర్ధమైనట్టు తలపంకించాడు మరిడి సోమయ్య.

*　　*　　*　　*　　*

"ఓమ్... కృష్ణం వందే జగద్గురుమ్" నడిపే వాడు, నడిపించేవాడు ఆ మాధవుడొక్కడే. మన సంకల్పం లోకకళ్యాణం కోసం కాబట్టి ఆయన సహకారం మనకి ఉంటుంది.

మనం కంగారుపడాల్సిందేమీ లేదు. చర్చించుకుంటే ఏదో ఒక మార్గం దొరుకుతుంది. ఏమన్నా సందేహాలుంటే అడుగు" అంటూ రిలాక్స్‌డ్‌గా సోఫాకి జేరబడ్డాడు అగ్నివేశాచార్యుడు.

అప్పటికి రాత్రి ఎనిమిదిగంటలు దాటింది సమయం. ముందుగా అనుకున్నట్టే భోంచేయగానే మిత్రవింద, శుశ్రుతలతో చెప్పి జేజి తాతవద్ద కొచ్చేశాడు చరక్. ఎదురుగా సోఫాలో కూచున్నాడు.

తమకు కావలసిన నాలుగింటిని సంపాదించాలంటే ఏ సమయంలో ద్వారకకు వెళ్ళటం మంచిది అనేది ఇప్పుడు చరక్ ముందున్న ప్రధాన సమస్య. ఏదో ఒకటి మాట్లాడుకుంటేనే పరిష్కారం దొరకొచ్చు.

"జేజిగారూ, కాసేపు భారతభాగవతాల్లోని ప్రధాన ఘట్టాల గురించి చెప్పుకుందామా?" అడిగాడు.

"తప్పకుండా... ఇంతకీ నువ్వేం తెలుసుకోవాలనుకుంటున్నావ్?"

"శ్రీకృష్ణుని జీవితంలో ముఖ్య ఘట్టాలు చెప్పండి"

"కృష్ణజననం... అదే ఓ అద్భుత ఘట్టం"

"శ్రీకృష్ణుని జీవితాన్ని మూడు దశలుగా చెప్పుకోవచ్చు. మొదటి దశ బాల్యం. చెరశాలలో దేవకీ, వసుదేవుల తనయుడిగా పుట్టి, వ్రేపల్లెలోని నందయశోద దంపతులకు పెంపుడు కొడుగ్గా చేరటం, పూతన, శకటాసురుడు మొదలగు రాక్షస సంహారం, కాళీయమర్దనం, గోవర్ధనగిరినెత్తి గోకులాన్ని రక్షించటం, యమునా తీరంలో గోపికలతో విహరించటం ఇవన్నీ బాల్యం, కౌమార దశల్లోని విశేషాలు.

* * * * *

"శ్రీకృష్ణుడిలోని నాయకత్వ లక్షణాల్ని యాదవులు గ్రహించగలిగారు. ఐతే తన మేనమామ కంసుని వధించి తన తల్లిదండ్రులైన దేవకీవసుదేవుల్ని చెరవిడిపించటంతో కృష్ణుని జీవితంలో రెండో దశ ఆరంభమైంది. అదే నాటి సాంఘిక, రాజకీయ జీవితం. కంసవధతో మధుర యాదవుల వశమైంది గానీ, శిశుపాల, జరాసంధ మొదలగువారితో శత్రుత్వం ఏర్పడింది"

"శిశుపాలుడు శ్రీకృష్ణుడి మేనత్త కొడుకే గదా, బంధువై ఉండి కూడా శత్రుత్వం దేనికి?" అడిగాడు చరక్.

"శిశుపాలుని వైరానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటి కారణం కంసవధ. రెండో కారణం తను చేసుకోవాలనుకున్న రుక్మిణిని శ్రీకృష్ణుడు ఎత్తుకెళ్ళి వివాహం చేసుకోవటం. అసలు శిశుపాలుని జన్మవృత్తాంతమే విచిత్రమైనది.

అతను శ్రీకృష్ణుని తండ్రి వసుదేవుని చెల్లెలి కొడుకు. అంటే స్వయంగా శ్రీకృష్ణునికి మేనత్తకొడుకు. అతను పుట్టినప్పుడే నాలుగు చేతులతో వికార రూపునిగా పుట్టాడు. తమ బిడ్డగురించి తల్లిదండ్రులు బాధపడుతూండగా మీరు బాధపడాల్సిన పని లేదు.

ఎవరు ఈ బాలుడ్ని ఎత్తుకున్నప్పుడు రెండు చేతులూ అదృశ్యమై సాధారణ బాలుడిగా మారిపోతాడో అతని చేతిలోనే వీడికి మరణం ఉంటుంది" అని అశీరవాణి హెచ్చరించింది.

ఇక తమ బిడ్డ మామూలు బాలుడిగా మారాలన్న ఆశతో తల్లిదండ్రులు తమ ఇంటికొచ్చిన అతిథులందరికీ ఎత్తుకోమని తమ బిడ్డనిచ్చేవారు. రోజులు గడుస్తున్నాయిగాని శిశుపాలుడిలో ఏ మాత్రం మార్పు లేదు. ఇలా ఉండగా ఒకసారి బాలురైన బలరామకృష్ణులు మేనత్తను చూడవచ్చారు. బలరాముడు శిశువును ఎత్తుకున్నాడు. శిశువు మారలేదు.

ఎప్పుడైతే కృష్ణుడు ఎత్తుకున్నాడో మరుక్షణం నాలుగు చేతుల్లో రెండు అదృశ్యమయి శిశుపాలుడు అందమైన బలుడిగా మారిపోయాడు.

అప్పుడు మేనత్త కన్నీళ్ళతో జరిగిందిచెప్పి– "కృష్ణా... వీడ్ని నీ చేతులతో చంపుతావా? నాకు పుత్రభిక్షపెట్టవా" అనడిగింది. అప్పుడు కృష్ణుడు నవ్వుతూ–

"అత్తా, వీడు నాకు మిత్రుడైతే రక్షింపబడతాడు. శత్రువైతే నీ కోసం తొంభై తొమ్మిది తప్పుల్ని క్షమిస్తాను. కాని నూరో తప్పుచేస్తే క్షమించను. వీడ్ని జాగ్రత్తగా పెంచు...." అంటూ అభయమిచ్చాడు.

అందుకే మేనత్తకిచ్చిన మాటకోసం శిశుపాలుడి ఆగడాల్ని భరిస్తూ వచ్చాడు కృష్ణుడు అని వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"తర్వాత?" అడిగాడు చరక్.

"కంసుడ్ని చంపటంతో శత్రువులు ఏర్పడ్డారనుకున్నాంగదా. ముఖ్యంగా జరాసంధుడు, మగధరాజ్యానికి రాజు. అంటే నేటి బీహారు ప్రాంతం. మధుర ప్రాంతాన్ని "వ్రజనాడు" అనేవారు.

జరాసంధుడి క్రూరత్వం, అతడి దాడులు ప్రజప్రాంత ప్రజలు భరించలేని పరిస్థితి ఏర్పడింది. శత్రువు జరాసంధుడు మహాబలవంతుడు.

అనేకసార్లు మధురమీద దాడులు చేసి యాదవుల్ని చికాకుపరిచాడు. ఒకసారైతే కృష్ణుడు జరాసంధుని ఓడించి కూడా క్షమించి వదిలేశాడు.

అయినా తన దాడులు ఆపకుండా మరింత సైన్యబలంతో ముట్టడిస్తూనే వచ్చాడు. దీంతో యాదవులు ఇక మధుర ప్రాంతం తమకు క్షేమం కాదని భావించారు. హరివంశం ప్రకారమైతే యాదవులు మధురను విడిచి సౌరాష్ట్రదిశగా (దారుకావనం వైపు) వలస పోయేముందు యాదవ కులపెద్దల సమావేశం జరిగింది. అప్పుడు వికుద్రుడు అనేవాడు–

"ప్రజ ప్రాంతం (మధుర పరిసరాలు) మన యాదవులకు చాలినంతగా లేదు.

బలరామకృష్ణుల మీద జరాసంధుడు శత్రుత్వం పెంచుకోనున్నాడు. కాబట్టి బలరామకృష్ణులు మధురను వదిలి ఎక్కడన్నా స్థిరపడితేనే ఈ దాడులు ఆగవచ్చు" అంటూ వాదించాడు.

అయితే వికుద్రుడు వాదించినట్టుగా బలరామ కృష్ణులు మాత్రమే మధురను వదల్లేదు. వారి వెంట యాదవులంతా వలసగా బయలుదేరారు.

పశ్చిమ సముద్రతీరం వెంట సుమారు నలభై ఎనిమిది యోజనాల విస్తీర్ణం గలిగిన ప్రాంతం దారుకావనం. ఈ దారుకావన ప్రాంతాన్ని చాలా పవిత్రంగా భావిస్తారు. ఈ వనంలో ఎందరో మునులు, మహర్షులు తపస్సు చేసేవారు. మునివాటికలు ఉండేవి.

వానప్రస్థాశ్రమం స్వీకరించేవారు ఈ ప్రాంతాని కొచ్చేవారు. ఈ దారుకావనం సోమనాథ ఆలయానికి దిగువ ప్రాంతంనుండి ఎగువన ఉత్తరంగా సప్తద్వీపమండలం వరకు విస్తరించివుండేది.

సప్తద్వీపమండలం సముద్ర భాగమా, గోమతీనదీ భాగమా అని చూస్తే ఇక్కడ గోమతి ఏడు పాయలుగా చీలి సముద్రంలో కలవటం చేత ఆ నదీపాయల మధ్య ఏర్పడినవే ఈ "ఏడు దీవులు" అని కొందరు అభిప్రాయపడుతుంటారు.

సముద్రం భూభాగంలోకి చొచ్చుకొచ్చిన ప్రాంతాన్ని "సముద్రకయ్యలు" అంటారు. సముద్రం బూభాగంలోకి చొచ్చుకురాగా ఏర్పడిన ఒరవడికి అక్కడ ఏడు దీవులు ఏర్పడ్డాయి.

అక్కడే గోమతీనది కూడా ఈ సముద్ర కయ్యలోకి ప్రవహించి ఈ దీవులు మధ్యగా సముద్ర జలాల్లో కలుస్తోంది. కాబట్టి ఆ దీవులు సముద్ర ప్రాంతంలోనే ఉన్నాయి. పూర్వనామం "భృగుకచ్ఛ."

భృగుమహర్షి కొంతకాలం తన శిష్యులతో సంకోదర దీవిమీద ఉండి. తపస్సు చేసుకోవటం వలన దీనికి భృగుకచ్ఛ అని పేరు వచ్చింది. ఇక్కడే కుశుడు అనే రాక్షసుడు భృగుమహర్షి తపస్సుకు విఘ్నాలు కల్గిస్తూ శాపానికి గురయ్యాడు. కాబట్టి సంకోదర దీవిమీదే "కుశస్థలి" ఉందని మరో గాథ ఉంది.

శ్రీకృష్ణులవారు ఈ భృగుకచ్ఛ నుండి సముద్రం మీద విహార నౌకలో దక్షిణంగా ప్రభాసవరకు, ఆపైన సోమనాథవరకు విహార యాత్ర చేసేవారట. నువ్వు ప్రభాస తీర్థ వెళ్ళావుగదా, అక్కడ ఓడరేవు చూశావా?" అనడిగాడు అగ్నివేశాచార్యుడు.

"చూశాను జేజిగారూ, అశ్వం మీద సోమనాథ ఆలయం వరకు వెళ్ళొచ్చాను. ద్వారకలాగే ప్రభాస వద్ద చక్కని ఓడరేవు ఉంది. అక్కడి నుండి ప్రత్తి-నూలు వస్త్రాలు, తోలువస్తువులు ఎగుమతి అవటం చూశాను అన్నాడు చరక్.

"మనకి ద్వారక గురించి తెలుసుకోవాలంటే భారత భాగవతాలు, హరివంశం, మత్స్యపురాణం, పద్మపురాణం ఆధారాలు. వీటిలోనే కొన్ని విషయాల్లో స్పష్టతలేదు. ఇక ఈ విషయాలు వదిలేస్తే నీ మనసులో ఏముంది, ఇంకా ఏం తెలుసుకోవాలనుకుంటున్నావో చెప్పు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"నాకు ఉపయోగపడే సమాచారం తెలియాలంటే ద్వారక నీట మునగటానికి ముందు, ఆ తర్వాత జరిగిన సంఘటనలు తెలియాలి. అప్పుడే కలియుగంలో మీరాశించే ధర్మసంస్థాపన ఆశయం కోసం ద్వారకాపురిలో ఆ పవిత్రమైన వస్తువుల్ని ఎలా సాధించాలో తెలుస్తుంది...." అన్నాడు చరక్.

కొద్దిక్షణాలు కళ్ళుమూసుకుని తెరిచాడు అగ్నివేశాచార్యుడు. "నీవు చదవని భారత, భాగవతాలు కాదుగదా, నేను చెప్పటం అవసరమా?" అనడిగాడు.

"మీరు చెప్తుంటే నేను ఆలోచించుకోడానికి అవకాశం ఉంటుందని" అన్నాడు చరక్.

"మనం ముందే అనుకున్నట్టు శ్రీకృష్ణుని జీవితంలో బాల్యం తొలిదశ అనుకుంటే, కంసవధనుండి కురుక్షేత్ర సంగ్రామంవరకు తిరుగులేని నాయకునిగా ఎదగటం రెండోదశ ఇక్కడ బావమరుదులైన కృష్ణార్జునుల విశిష్ట స్నేహం చెప్పుకోదగింది.

అర్జునుడు నరుడు– కృష్ణుడు నారాయణుడు. ఈ నరనారాయణులు చేరి అద్భుతాలు సాధించారు. కురుక్షేత్రంలో ధర్మరాజుకు విజయం చేకూర్చటం ద్వారా ధర్మస్థాపన చేశారు.

కురుక్షేత్ర యుద్ధం తర్వాత కూడా సుమారు ముప్ఫైఆరు సంవత్సరాల వరకు శ్రీకృష్ణుడు తన అవతారం చాలించలేదు. యుద్ధానంతర జీవితాన్ని మూడో దశగా చెప్పుకోవచ్చు.

ఈ దశలో శాపాలు, ప్రతిశాపాలు, జీవితం ప్రశాంతంగా కొడుకులు, కోడళ్ళు, మనవలు, ముదిమనవళ్ళతో గడచినా చివరి ఘట్టంలో విషాదం తప్పలేదు" అంటూ చెప్పటం ఆపాడు అగ్నివేశాచార్యుడు.

"రాజ్యం వీరభోజ్యం అన్నారు. బలవంతుడిదే రాజ్యం అన్నారు. రాజుల మధ్య యుద్ధాలు సహజం గదా. అలాంటప్పుడు శ్రీకృష్ణుడు ధర్మసంస్థాపన చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది?" అనడిగాడు చరక్.

"ద్వారక నిర్మాణం నుంచి కురుక్షేత్ర యుద్ధం వరకు జరిగిన ముఖ్య ఘట్టాల్ని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. అధర్మంగా ప్రవర్తించటం ఎంత తప్పో అధర్మాన్ని సమర్థించటం కూడా అంతే తప్పవుతుంది. ఎందరో శిశువుల్ని నిర్దాక్షిణ్యంగా వధింపజేసిన శిశు హంతకుడు కంసుడు.

అలాంటి దుష్టుణ్ణి వధించినందుకు సంతోషింపకపోగా శిశుపాల జరాసంధులు కృష్ణుడిమీద పగ పెంచుకున్నారు. అంటే వాళ్ళు అధర్మాన్ని సమర్థిస్తూ ధర్మం తప్పారు. అలాగే మగధను విస్తరించి పెద్ద సామ్రాజ్యం చేసి చక్రవర్తి కావాలన్నది జరాసంధుని దురాశ.

అకారణంగా సైన్యబలాన్ని పెంచుకుని తరచూ దాడులు చేసేవాడు. అలాంటివాణ్ణి చంపించటం ధర్మమే కదా. అకారణ వైరంతో దాడిచేసిన పందూరకుణ్ణి (పౌండ్రకుడు) వధించటం ధర్మమే కదా.

పదహారువేలమంది కన్యలను చెరపట్టి ఉంచిన దుష్టుడు నరకాసురుణ్ణి వధించటం ధర్మమే కదా. కాని అధర్మపరులు ధర్మాన్ని సమర్థించకపోగా పగా ద్వేషం పెంచుకుని తరచూ దాడులు చేయసాగారు.

రాజులు స్వార్థపరులై ప్రజాక్షేమాన్ని విస్మరించారు. ఇక ఆ కాలంలో అధర్మం ఎంతగా పెచ్చుమీరిందంటే కౌరవులు నిండుసభలో ద్రౌపదిని అవమానించారు. మాయాజూదంలో రాజ్యాన్ని లాక్కుని పాండవుల్ని అరణ్య వాసానికి పంపించారు.

ఆ విధంగా కౌరవులు పాండవులకు చేసిన అన్యాయాలు అనేకం ఉన్నాయి. భీష్మ ద్రోణాది కురువృద్ధులున్నా – న్యాయం తెలిసిన కర్ణుడున్నా అంతా భృత్యధర్మానికి కట్టుబడి కౌరవపక్షానే ఉన్నారు.

ఇక పుత్రవాత్సల్యం సర్వం తెలిసిన ధృతరాష్ట్రుని చేతుల్ని కట్టేసింది. దుర్యోధనుడు చక్రవర్తి గాబట్టి అనేకమంది రాజులు అతని అధర్మాన్నే సమర్థిస్తున్నారు. ఈ పరిస్థితులు చక్కబడి తిరిగి ధర్మం నెలకొనాలంటే యుద్ధం తప్ప మరో మార్గం కనిపించలేదు.

అందుకే పరిస్థితుల్ని కురుక్షేత్రంవైపు నడిపించాడు కృష్ణుడు. మాధవుడు నాటి రాజకీయ చదరంగం తెలిసిన మహామేధావి. ఈ రోజు రాజకీయ నాయకుడంటే ప్రతిపనిలోనూ తన పర్సంటేజ్ చూసుకునేవాడు. లంచాలు మరిగి డబ్బు గడించేవాడు.

మాటల గారడీతో ప్రజల్ని వంచించి తన ఆస్తుల్ని కూడ గట్టుకునేవాడుగా మారిపోయింది. కాని నాటి రాజకీయం ఇలాంటిది కాదు. శ్రీకృష్ణుని రాజకీయ చతురత ఎంతగొప్పదో చిన్న ఉదాహరణ చెప్తాను.

యుద్ధం అనివార్యమని తేలిపోయింది. యుద్ధంలో తమ పక్షాన సాయం చేయమని కోరడానికి పాండవ మధ్యముడు అర్జునుడు వచ్చాడు. సుయోధన సార్వభౌముడూ వచ్చాడు. ఒకరిది ధర్మం. ఒకరిది అధర్మం. అయినా ఇద్దరూ తనకు కావలసినవారే. ఎవరినీ అసంతృప్తిగా పంపించకూడదు.

మరో ముఖ్య విషయం దుర్యోధనుడు తన అన్న బలరాముడికి ప్రియ శిష్యుడు. యుద్ధ క్షేత్రంలో అడుగు పెట్టడమంటూ జరిగితే ఆయన దుర్యోధనుడి పక్షానే యుద్ధం చేస్తాడు.

దుర్యోధనుణ్ణి రిక్తహస్తాలతో పంపిస్తే బలరాముడు మనస్తాపం చెందవచ్చు. ఏం చేయాలి? అదే మాధవుని రాజకీయ చతురతకు పరాకాష్ట.

"మీ ఇద్దరూ కావలసినవాళ్ళే. ఎవర్నీ కాదనలేను. కాబట్టి మా యాదవ సేనలు ఒకపక్క, నేను మరోపక్క రెండు భాగాలు చేస్తున్నాను. నేను ముందే చెప్తున్నాను. నేను ఆయుధంపట్టి యుద్ధం చేయను.

కాబట్టి ఎవరికేం కావాలో కోరుకోండి. ముందుగా వచ్చింది పార్థుడు. నీవు చక్రవర్తివి గాబట్టి ఒకరికి చెప్పాల్సిన అవసరం లేదు. కాని పార్థుడు అన్న ధర్మరాజుకి సమాధానం చెప్పుకోవాలి. అందుచేత మొదటి అవకాశాన్ని పార్థునికిస్తున్నాను" అన్నాడు.

"నీవు ఆయుధం పట్టక్కర్లేదు బావా, నా రథసారథివై నన్ను నడిపిస్తే చాలు. నాకు నీవే కావాలి" అంటూ కృష్ణుణ్ణి కోరుకున్నాడు అర్జునుడు.

"పిచ్చివాడా, ఆయుధం పట్టని కృష్ణుణ్ణి రథంలో కూచోబెట్టుకొని ఏం చేస్తాడు. నాకు సైన్యం కావాలి అనుకున్న దుర్యోధనుడు యాదవసైన్యాలను కోరుకున్నాడు.

ఆ విధంగా శ్రీకృష్ణుని తంత్రం ఫలించింది. తను పాండవ పక్షాన ఉండటం, అన్న బలరాముడు యుద్ధ క్షేత్రానికి రాకుండా ఆపటం కృష్ణుని ఉద్దేశం. అది నెరవేరింది. తమ యాదవ సేనలు కౌరవుల పక్షాన యుద్ధం చేయటం బలరాముడికి సంతోషమే.

కాని తను యుద్ధక్షేత్రంలో కొస్తే తమ్ముడు కృష్ణుడు పాండవపక్షాన ఉంటాడు. తమ్ముడికి వ్యతిరేకంగా యుద్ధం చేయలేడు. అందుకే కురుక్షేత్ర సంగ్రామం అప్పుడు బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళిపోవటం జరిగింది. అదీ రాజకీయ చతురత అంటే"

"అర్థమైంది మరి శాపాల మాటేమిటి?" అడిగాడు చరక్.

"అనేక శాపాలున్నప్పటికీ ఇక్కడ మనం ప్రధానంగా చెప్పుకోవాల్సింది గాంధారి శాపం. కురుక్షేత్ర యుద్ధం ముగిసింది. జనక్షయం జరిగింది. కౌరవులు అంతమయ్యారు. పుత్రశోకంలో ఉన్న గాంధారీ, ధృతరాష్ట్రులను పలకరించి ఓదార్చడానికొచ్చాడు కృష్ణుడు.

అప్పుడు గాంధారి – "నువ్వెన్నయినా చెప్పు కృష్ణా, నీవు తలచుకుంటే ఈ ఘోరయుద్ధం జరిగేది కాదు. కురుక్షేత్రం జరిపి నాకు పుత్రశోకం మిగిల్చావ్. తప్పదు. నా కొడుకులు ఎలా నశించారో అలాగే కురుక్షేత్రం జరిగిన ముప్పై సంవత్సరాల తర్వాత నీ యదువంశం కూడా నశిస్తుంది. ఇది నా శాపం" అంటూ శపించింది. ఈ శాపం ముప్పై ఆరు సంవత్సరాల తర్వాత ఫలించింది.

"యదువంశం నశిస్తుంది అనటంలో అర్థం శ్రీకృష్ణునితో కలిపే గదా?" అడిగాడు చరక్.

"అదేగా జరిగింది. కృష్ణపరమాత్మ అవతారం చాలించింది కూడా అప్పుడే. ద్వాపరం ముగిసి కలియుగం ఆరంభకాలంలోని సంఘటనలవి. ఒకటా రెండా... అకారణంగా కలహించుకొని యాదవ యువకులు మరణించారు. బలరామ కృష్ణులు ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయారు. ద్వారకలో ఏం జరగనుందో తెలీని విషాద పరిస్థితి. హస్తిన నుంచి పార్థుడ్ని రప్పించారు.

ద్వారక నీటమునిగింది. దోపిడీ దొంగలు యాదవుల మీద పడి బంగారం, ధనం దోచుకుపోయారు... ఈ విషయాలన్నీ మహాభారతం మౌసలపర్వంలో స్పష్టంగా వివరించబడింది. "ద్వారక మునగటానికి కొద్ది రోజులముందు నుంచి ఏం జరిగిందో మరికాస్త వివరంగా చెప్పండి" అనడిగాడు చరక్. "అప్పుడే నా రెండో అనంతయాత్ర, ఆధ్యాత్మిక యాత్ర సఫలమవుతుంది."

"శాపవశంగా కృష్ణుని కొడుకు సాంబుడి కడుపున రోకలి (ముసలం) పుట్టింది. యాదవ యువకులు దాన్ని బలరాముడికి చూపించి జరిగింది చెప్పారు. ఇది ద్వారకకు అరిష్టం. ఇక్కడ ఉంచకూడదు. దూరంగా తీసుకెళ్ళి అరగదీసి సముద్రంలో కలిపేయండి" అని సలహా ఇచ్చాడు.

యువకులు ఆ రోకలిని ద్వారకకు దూరంగా తెచ్చి ఉత్తర తీరంలో దాన్ని అరగదీసి అరగదీసి సముద్రంలో కలిపేశారు. చివరకు సన్నటిబద్దలా అరిగిపోయిన రోకలిభాగం మిగిలింది. దాన్ని అక్కడే ఇసుకలో పడేసి

వెళ్ళిపోయారు. ఆ ముక్క అటుగా వచ్చిన భిల్లుడికి దొరికింది. బాణంలా ఉంది వేటకు పనికొస్తుందనుకుని దాన్ని తన అమ్ములపొదిలో వేసుకుని వెళ్ళాడు.

రోకలి అరగదీసి కలిపినచోట తీరం వెంట తుంగగడ్డి పెరగటం ఆరంభించింది. రోజులు గడుస్తున్నాయి.

యుగసంధి దగ్గరపడింది. యాదవులు తమ కులదేవతలకు కొలుపులు, పూజలు చేయటానికి సముద్రతీరానికొచ్చారు. కలిప్రభావంతో వారిలో చాలా మార్పు కన్పించింది. కొలుపులు, పూజలకు మద్య మాంసాదులను ఉపయోగించారు.

యాదవయువకులు మద్యం సేవించి మాంసం తిన్నారు. అసందర్భ ప్రేలాపనలతో ఒకరినొకరు దూషించుకోనారంభించారు. కోపావేశాల్లో ఏం చేస్తున్నారో తమకే తెలీదు. తీరంలో ఎత్తుగా పెరిగిన తుంగ ఊచల్ని పెరికి కొట్టుకోనారంభించారు. అది తాకినవాడు వెంటనే మరణిస్తున్నారు. వందలు, వేల యువకులు అలా కొట్టుకొని చనిపోసాగారు.

అదే సమయంలో బలరాముని రధం అటుగా వచ్చింది. జరుగుతున్న ఘోరాన్ని కళ్ళారా చూశాడు. గాంధారి శాప ప్రభావమని అర్ధమైంది. నివారించలేని ఘోరం. రధాన్ని వదిలి మనస్తాపంతో కాలినడకన ప్రభాస సమీపవనాల దిశగా నడిచిపోయాడు.

అటుపిమ్మట శ్రీకృష్ణుని రధం వచ్చింది. ఎటు చూసినా అక్కడ యాదవ వీరుల శవాలు... ఇంకా కొందరు కొట్టుకుని ఛస్తూనే ఉన్నారు. అన్న బలరాముని రధం అక్కడుంది. కాని ఆయన జాడతెలీలేదు. అవతారం చాలించాల్సిన సమయం దగ్గరపడిందని అర్ధమైంది. తనూ రధాన్ని అక్కడే వదిలి బలరాముడు వెళ్ళిన దిశగా కాలినడకన బయలుదేరాడు. అడవిలో ఒకచోట అశ్వత్థ వృక్షం కింద పద్మాసనస్థితిలో కూర్చున్న బలరాముడు కన్పించాడు. శ్రీకృష్ణుడు చూస్తూండగానే ఆదిశేషువు బయటికొచ్చి ఆ పరంధాముడికి నమస్కరించి వైకుంఠం వైపు గగనానికి వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణుడు ఇంకా ముందుకు చాలా దూరం నడిచాడు. అక్కడ వృక్షచ్ఛాయలో ఒక గుబురు పొదలోకి వెళ్ళి పచ్చిక మీద విశ్రాంతిగా పడుకున్నాడు.

కాలు మీద కాలు వేసుకుని ఊపుతూ ఆలోచనా ముద్రలో ఉండిపోయాడు. సరిగ్గా అప్పుడే భిల్లుడు అటుగా వచ్చాడు.

వాడికి పొదలో లేడి ఒకటి పచ్చికమేస్తున్నట్టు తోచింది. నీలమేఘ శ్యాముడు మాధవుడి పాదం తెలుపు. పాదాన్ని ఊపుతుంటే లేడి శిరస్సులా అన్పించింది. వెంటనే భిల్లుడు బాణం సంధించి వదిలాడు. అది మామూలు బాణం కాదు. రోకలి అరగదీయగా మిగిలిన బాణం షేపులోని బద్ద.

అది సూటిగా వెళ్ళి మాధవుని అరికాలిలో గుచ్చుకుంది. గాంధారి శాపం శ్రీకృష్ణుడినీ వదల్లేదు. ఇక బాణం పాదంలోనే గుచ్చుకోవటానికి అదో శాపం.

భిల్లుడు లేడికోసం పొదలోకొచ్చి చూడగా తను ఎంత పొరబాటు చేశాడో అర్థమైంది. భోరున ఏడుస్తూ కూలబడిపోయాడు. బొటబొటా కన్నీరు విడిచాడు. "పిచ్చోడా. ఎందుకురా ఏడుస్తావ్?" కృష్ణుని ప్రశ్న. "తమను బాణంతో కొట్టిన పాపిని స్వామీ. ఇంతకన్నా ఘోరపాతకం ఉంటుందా?" అంటూ బావురుమన్నాడు భిల్లుడు.

"దెబ్బకు దెబ్బ కావాలని గతజన్మలో నీవు కోరుకున్న వరమే గదరా ఇది?" "నేనా...."

"అవును నువ్వే... మా రామావతార సమయంలో నీవు వాలివి. చెట్టు చాటునుంచి కొట్టానని దెబ్బకు దెబ్బ కావాలని మరణసమయంలో అడిగావ్. కృష్ణావతారంలో నీ కోరిక తీరుతుందని వరమిచ్చాను. నీ కోరిక తీరిందిగా" అన్నాడు కృష్ణుడు.

"అయ్యో తండ్రీ. తెలీని మూర్ఖత్వంతో వానరుడిగా ఆ జన్మలో అలా కోరిఉంటాను. కాని ఈ పాప కార్యం నా చేతులమీదుగా జరిగిందే" అంటూ విలపించాడు భిల్లుడు. కృష్ణుడు వారించాడు.

"నీకే పాపం అంటదు. నేను అవతారం చాలిస్తూ చివరిగా చూస్తోంది నిన్నే. నీకు శుభమవుతుంది.

నా భౌతిక శరీరానికి కాపలాగా నువ్వు ఇక్కడే ఉండు. రెండు మూడు రోజుల్లో మమ్మల్ని వెదుకుతూ పాండవ మధ్యముడు ఇటుగా వస్తాడు. వానికి జరిగింది చెప్పి నా శరీరాన్ని వప్పగించు" అంటూ ఆ పరమాత్మ అవతారం చాలించాడు.

ఇక అక్కడ ద్వారకలో పరిస్థితి ఎలా ఉందంటే ఇక్కడ కృష్ణుడు అవతారం చాలించిన మరుక్షణం అక్కడ సముద్రంలో కెరటాల హోరు పెరిగింది.

ఎగసిపడుతున్న కెరటాలు ద్వారకావాసుల్ని విభ్రాంతికి గురిచేస్తున్నాయి. ఇదిలా ఉంటే అక్కడ యాదవ వీరుల మరణవార్త ద్వారకకు చేరింది.

స్త్రీ బాలవృద్ధులు రోధిస్తూ యువకుల శవాల వద్దకు చేరుకున్నారు. ఎక్కడ చూసినా విషాదం గుండెల్ని పిండుతోంది.

ఈ విపత్కర పరిస్థితుల్లోనే బలరామ కృష్ణులు కన్పించటం లేదనే వార్త గుప్పుమంది ద్వారకలో. దుశ్శకునాలు పొడచూపుతున్నాయి.

*　　*　　*　　*　　*

సముద్ర తీరంలో అకారణంగా మరణించిన యాదవ కుల వీరులకు అక్కడే శవసంస్కారాలు నిర్వహించి శ్రాద్ధకర్మలతో పిండతర్పణాలు విడిచారు ద్వారకవాసులు. బలరామకృష్ణులను అన్వేషిస్తూ వెళ్ళిన సైనికులు రిక్తహస్తాలతో తిరిగివచ్చారు. ద్వారకలో స్త్రీబాలవృద్ధులు తప్ప యువకులే కానరావటంలేదు.

పరిస్థితుల్ని గమనిస్తున్న రుక్మిణీదేవి ద్వారకలో పరిస్థితుల్ని వివరిస్తూ వెంటనే అర్జునుని పంపించమని హస్తినాపురానికి వర్తమానం పంపింది. ఆ వార్తవిన్న తక్షణం పార్థుణ్ణి ద్వారకకు పంపించాడు ధర్మరాజు.

పార్థుడు ద్వారక చేరేసరికే మూడురోజులు గడిచిపోయాయి. ద్వారక వాలసులకు ధైర్యం చెప్పి బలరామకృష్ణుల్ని వెదుకుతూ బయలుదేరాడు అర్జునుడు.

మూడురోజుల తర్వాత ముందుగా బలరాముని భౌతికదేహాన్ని, తర్వాత శ్రీకృష్ణుని పార్థివ శరీరాన్ని చేరుకోగలిగాడు.

భిల్లుడు చెప్పిన మాటల్ని బట్టి శ్రీకృష్ణుడు అవతారం చాలించి అప్పటికే ఆరోరోజని గుర్తించాడు. గతంలో శ్రీకృష్ణుడు చేసిన హెచ్చరిక గుర్తొచ్చింది.

"బావా నేను అవతారం చాలించిన ఏడోరోజున ద్వారక నీటమునిగి పోతుంది. ద్వారకను ఖాళీచేయించి అందర్నీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చే బాధ్యత నీదే" అన్నాడు. అంటే రేపటికి ఏడోరోజు. తెల్లవారితే ద్వారక నీట మునిగిపోతుంది.

ఈ విషయం గుర్తురాగానే భిల్లుని అక్కడే కాపలా వుంచి వెనుతిరిగాడు అర్జునుడు. అశ్వంమీద తిరిగి ద్వారకను చేరుకునేసరికి వాతావరణం మారి పోయింది. ఆకాశం మబ్బులు పట్టి వర్షసూచనలు కన్పిస్తున్నాయి. ఈదురు గాలులు ఆరంభించాయి.

సముద్ర అలలు భీకరంగా లేస్తున్నాయి. భూమిలోంచి వింతశబ్దాలు పుడుతున్నాయి. ఈ పరిస్థితిలో బలరామకృష్ణులు ఇక లేరని చెప్తే ద్వారక వాసులు కదలరని తెలుసు.

రేపు సూర్యోదయానికి ద్వారక మునిగిపోతుంది. అందర్నీ నగరం వదిలివచ్చేయమని బలరామ, శ్రీకృష్ణులు చెప్పారు. వాళ్ళిప్పుడు ప్రభాస ప్రాంతంలో ఉన్నారని అబద్ధం చెప్పాడు.

ఈ వార్త ద్వారకలో దావాగ్నిలా క్షణాల్లో వ్యాపించింది. ప్రజలంతా ప్రయాణ సన్నాహాల్లో మునిగిపోయారు. ద్వారకలోని ఆలమందల్ని ప్రధాన భూభాగం వైపు తరమసాగారు కొందరు.

సముద్రకెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ ద్వారక వాసుల్ని భయ భ్రాంతుల్ని చేస్తున్నాయి.

ఆ రోజు అమావాస్య శుక్రవారం. తెల్లవారితే శనివారం. ఆకాశం దట్టంగా మబ్బులు పట్టి ఈదురుగాలులతోపాటు సన్నటి వానజల్లు ఆరంభమైంది.

దివిటీలు, కాగడాలు వెలిగించుకుని ఇళ్ళనుంచి కావలసిన దుస్తులు, బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులు, ఆహారధాన్యాలు, వంటపాత్రలు ఒకటే మిటి తాము మోయగలిగినన్ని, కావిళ్ళతో తీసుకెళ్ళ గలిగినన్ని, రథాల్లోను, బండ్ల మీద, గుర్రాలమీద సరిపడా సామాను ఎక్కించేస్తున్నారు.

సిద్ధమైనవాళ్ళు చీకటిపడిన కొద్దిసేపటికే నగరం వదలటం ఆరంభించారు. ఒకరి తర్వాత ఒకరు కుటుంబాలకు కుటుంబాలు పిల్లపాపలతో వర్షంలో తడుస్తూనే ప్రయాణం చేస్తున్నారు.

ద్వారకవాసులే కాదు, రాచనగరులోని స్త్రీ బాల వృద్ధులు కూడా ప్రయాణమయ్యారు. బారులు తీరి కాలినడకన వాహనాలమీద సాగిపోతూనే ఉన్నారు. దుఃఖంతో భారమైన గుండెలతో స్వర్గంలాంటి ద్వారకను వదల్లేక వదల్లేక వదిలిపోసాగారు.

అర్జునుడు ఆ వర్షంలో తడుస్తూనే అశ్వంమీద నగరమంతా సుడిగాలిలా తిరిగి ప్రజల్ని ఖాళీ చేయించాడు. శ్రీకృష్ణుని అష్టభార్యలు, ఇతర రాచనగర స్త్రీ బాలవృద్ధులకోసం అనేక రథాలు సిద్ధం చేయబడ్డాయి. ఆ రథాల్లోకి అంతులేని సంపద కూడా చేర్చబడింది.

ద్వారక కోశాగారంలో ఎంతో ధనరాశులున్నా ఏం చేయలేని పరిస్థితిలో దాన్నలాగే వదిలేశారు.

అంతా నగరాన్ని వదిలేశారన్న నమ్మకం కలిగిన తర్వాత చివరిగా తన అశ్వాన్ని కూడా తీరం వైపు పోనిచ్చాడు పార్థుడు. ఆ విధంగా ద్వారకను కదిలి వచ్చిన యాదవులంతా తెలతెలవారేసరికి తీరానికి యోజనం దూరంగా వెళ్ళి పోయారు.

అప్పటికి వర్షం తగ్గి మబ్బులు తొలగి సూర్యోదయమైంది. వెనుతిరిగి చూశారంతా.

సూర్యుని తొలికిరణాలు ద్వారకమీద పడుతూండగా ఒక్కసారిగా నగరం సముద్రంలోకి కృంగిపోవటం ఆరంభమైంది. నగరవీధుల్లో సుడులు తిరుగుతూ ప్రవహించింది సముద్రజలం. చూస్తూండగానే ప్రాకారాలు ఎత్తయిన సౌధాలు కోటలు, పేటలు సమస్తం కనుమరుగైపోయాయి.

ద్వారక ఉన్నచోట ఒక తటాకంలా సముద్ర జలంతో నిండిపోయింది. ఆ ఘోరం చూస్తూ "హా దైవమా... హతవిధీ. ఏదీ మా ద్వారక" అంటూ స్త్రీ బాలవృద్ధులు గుండెలు బాదుకుని రోధించారు. వారిని ఓదార్చి అందరినీ ప్రభాసవైపు నడిపించాడు అర్జునుడు" అంత వరకూ చెప్పి చరక్‌వంక చూశాడు అగ్నివేశాచార్యుడు.

"ఇంతకుమించి తర్వాత గాథను మనం చెప్పుకోవాల్సిన అవసరం లేదనుకుంటాను" అన్నాడు అగ్నివేశాచార్యుడు. "చాలు జేజిగారు. ఇది చాలు" అంతవరకూ ఆసక్తిగా వింటూ కూర్చున్న చరక్ బదులిచ్చాడు.

"శ్లో" ఏతే ఘోర మహోత్పాతా ద్వార్వతామ్ యమ కేతవః
ముహూర్తమపి నస్థేయమత్ర నో యదుపుంగవా
స్త్రీయో బాలచ్చ వృద్ధాచ్చ సంకోదరమ్ వ్రజన్వితః

వయం ప్రభాసమ్ యాశ్యామో యత్ర ప్రత్యక్ సరస్వతి।।

అని భాగవతంలో చెప్పబడింది.

మహాభారతం మౌసలపర్వంలో – **ఇమాంచ నగరిమ్ సద్యాహి ప్రతియాతె ధనుంజయె ప్రాకారాత్తాలకోపేతమ్ సముద్ర ప్లావయిష్యతి।।** అని చెప్పబడింది.

భాగవతంలో – **"ద్వారకామ్ హరిణాత్యక్తమ్ సముద్రోప్లావయత్ క్షణాత్, వర్జయిత్వా మహిరా"** అని చెప్పబడింది. కాబట్టి ద్వారక ఏ ఆర్భాటం లేకుండా జలసమాధి అయిపోయిందనేది మనకి అర్ధమవుతోంది" అంటూ ముగించాడు అగ్నివేశాచార్యుడు.

"కలియుగ ఆరంభకాలం సరిగ్గా ఎప్పుడంటారు? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి.

మన పురాణాలు, ఇతిహాసాల్లో కూడా ఈ తేడాలు గమనించవచ్చు. శ్రీకృష్ణ అవతార పరిసమాప్తి రోజు నుంచి ఆరంభమైందా? ద్వారక నీటమునిగిన రోజు నుంచి ఆరంభమైందా? వారం రోజులు వ్యత్యాసం కన్పిస్తుంది మనకు"

"ఖచ్చితంగా చెప్పలేం. నా ఉద్దేశప్రకారమైతే ఆ పరంధాముడు కృష్ణావతారం చాలించిన రోజునే కలియుగం ఆరంభమైంది. యాదవ కుల క్షయం జరిగిందీ ఆ రోజే. ద్వారక మునిగిపోనుందని సూచనలు ఆరంభమైంది కూడా ఆ రోజే. కాబట్టి అదే ప్రామాణికంగా తీసుకోవాలి. ఆయన తన నూట ఇరవై ఆరో సంవత్సరంలో అవతారం చాలించాడు"

"అంటే ఇంచుమించు మీదీ అదే వయసుగదూ?"

"అదేరా నా భయం. ఊపిరిపోయేలోన అనుకున్నది సాధించగలనా లేదా అని" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"నన్ను భయపెట్టకండి జేజిగారూ. మనం సాధిస్తాం. మీరింకా మాతో చాలా కాలం ఉండాలి. చివరిగా ఒక ముఖ్యమయిన సందేహం ఉంది. అడగనా?"

"నీ సందేహాలు తీర్చటం కోసమే ఈ సమావేశం. సందేహించక అడుగు"

"ఏం లేదు జేజిగారూ. ద్వారకలోని కోటలో కృష్ణశక్తి ఆవరించి ఉంటుందని కోటగుమ్మం దాటి లోపలకు పోవద్దని సాధువు శివయోగి నన్ను హెచ్చరించాడని చెప్పాను గదా"

"అవును...."

"శ్రీకృష్ణులవారు అవతారం చాలించిన తర్వాత కూడా అక్కడ కృష్ణశక్తి ఉంటుందా?"

"నువ్వెందుకీ ప్రశ్న అడుగుతున్నావో అర్థమైంది చరక్. ఆ పరమాత్మ అవతారం చాలించగానే అంతటి ద్వారకానగరమే మునిగిపోయింది. ఇక కృష్ణశక్తి ఉంటుందా... ఉండదు. నిరభ్యంతరంగా నీవు కోట లోపలికి వెళ్ళొచ్చు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మాధవుడు ద్వారకను వదిలివెళ్ళేప్పుడు శిరస్సున కిరీటం, చేతిలో మురళి ఉన్నాయా?"

"దీనికి ఖచ్చితంగా చెప్పగల ఆధారాలు ఎక్కడా లేవు. కాని ఖచ్చితంగా వాటిని ధరించి ఉండరని మాత్రం చెప్పగలను. ఎందుకంటే భవిష్యత్తు తెలిసిన పరంధాముడాయన.

తను ఎంతో ఇష్టంగా నిర్మించుకున్న ద్వారక నీట మునగనుంది. యాదవకుల క్షయం జరగనుంది. ద్వారకవాసులు ఆనాడు జరాసంధునికి భయపడి మధురను వదిలి ఎలా వలసవచ్చారో అదే పరిస్థితి ఇప్పుడు పునరావృతం కానుంది. ద్వారక ప్రజలు కాంది శీకులుగా బయటకు వలసపోనున్నారు.

ఈ విషాదకర పరిస్థితుల మధ్య ద్వారకను వీడినప్పుడు శ్రీకృష్ణుడు కిరీటధారియై మురళి చేబూని వెళ్ళే అవకాశమే లేదు"

"చాలు జేజిగారూ. నాకీ ఇన్ఫర్మేషన్ చాలు. ద్వారక మునిగిపోవడానికి ముందురోజు అది అమావాస్య శుక్రవారం అన్నారు కదూ! ఆ రోజు ఉదయానికి నేను ద్వారకలో ఉంటే చాలు"

''మరీ అంత ముందురోజేమిటి? సముద్రుడు వారంరోజులు సమయమిచ్చి ద్వారకను ముంచాడు" "జేజిగారూ. నేను వెళ్ళేది మనక్కావలసిన నాలుగు వస్తువుల్ని దొంగిలించటానిక్కాదు. ద్వారక వాసులు నగరాన్ని ఖాళీచేస్తున్న సమయంలో ఎవరూ ఏదీ పట్టించుకోరు. ఆ సమయాన్నే నేను ఉపయోగించుకుంటాను" అన్నాడు చరక్.

"సరి నీ ఇష్టం. కాని కార్యం సాధించాలి. అయితే చాలా క్లిష్టసమయంలో నువ్వు ద్వారకలో ఉంటావ్. ఏ మాత్రం పొరపాటు జరిగినా నగరంతోపాటు నీవూ మునిగిపోతావ్. వెనక్కి రావటం కష్టమవుతుంది. చాలా జాగ్రత్తగా ఉండాలి"

"అలాగే జేజిగారూ. మీరు అనుకున్న ముహూర్తంలోనే నేను ద్వారకకు వెళ్తాను" తాతాముని మనవలు మరొకాస్సేపు చర్చించుకున్నారు. అప్పటికే చాలా రాత్రి అవటంతో అగ్నివేశాచార్యుని వద్ద సెలవు తీసుకుని, తమ ఇంటి వైపు వెళ్ళిపోయాడు చరక్.

చెప్పినట్టుగానే మరునాడు ఉదయం డ్రైవరు కాశీని తీసుకుని కోరుకొండ ఎస్టేట్ భవంతికి వెళ్ళిపోయాడు అగ్నివేశాచార్యుడు.

మిత్రవింద వచ్చినప్పట్నుంచి ఇంట్లోనే ఉంది. అగ్రహారం గేటు దాటి బయటికెళ్ళలేదు.

సాయంత్రం ఓసారి ఆమెను బైక్‌మీద తీసుకెళ్ళి చుట్టుపక్కల ప్రాంతాలు చూపించాలనుంది చరక్‌కి. కాని శుశ్రుత అభ్యంతరం చెప్పింది.

"ఏమిటంత తొందర? ఎల్లుండి ఎలాగూ కొత్త కారు వస్తుందిగా. దాంట్లో ఎలాగూ వెళ్తాం.

అక్కడి గుర్రాలు, రథాలే గాని బైక్‌మీద కూర్చోటం తెలీదు" అంది.

"అంటే నీ ఉద్దేశం ఏమిటి? దాన్ని పడేస్తాననా?"

"అవును. నువ్వు పడేయకపోయినా తనే పడిపోతుంది" అంది శుశ్రుత.

"ఆల్రెడీ నాతో లవ్‌లో పడిపోయిందిగా. ఇంకెక్కడ పడుతుంది? నీ అక్కని భద్రంగా తీసుకొచ్చే పూచీ నాది"

టీవీ చూస్తూ వారి మాటలు వింటున్న మిత్రవింద ఉన్నట్టుండి లేచింది "ప్రియుడా... లవ్ అనగానేమి?" అనడిగింది.

'ఓసి నీ ఎంకమ్మ. వారం తిరక్కుండానే తెలుగు భాషను అరగదీసి తాగేశావ్. ఇక ఇంగ్లీషు అంతుచూద్దామనా?' అనుకుంటూ "మిత్రా ఏంలేదు, లవ్ అనగా పిచ్చి" అన్నాడు చరక్.

అక్కడే ఉన్న శుశ్రుత "కాదు కాదు" అనరిచింది. "అక్కా, చరక్ మాటలు నమ్మకు. అబద్దం చెప్తున్నాడు" అంది శుశ్రుత.

"అబద్ధమనిన ఏమి?" "అనృతము"

"ఏమిది చతురా, నాతో అబద్ధములేల? లవ్ అనగా ఏమి?" అడిగింది మిత్రవింద.

"లవ్ అనగా అందం"

"మళ్ళీ అబద్ధం చెప్తున్నాడక్కా. నమ్మకు. లవ్ అంటే ప్రేమ" అంది శుశ్రుత.

"అవునా... ప్రియుడా... నీవు కొంటెవాడివి" అంటూ చరక్ మీదకు వాలి బుగ్గమీద ముద్దిచ్చింది. పనిలో పనిగా ఆమెను కౌగిట బంధించాలను కున్నాడు చరక్. అంతలో డోర్‌లో ప్రత్యక్షమయ్యాడు అప్పన్న. చట్టున మిత్రవిందను వదిలేశాడు.

ముసిముసిగా నవ్వుకుంటూ లోనకెళ్ళి పోయింది శుశ్రుత. ఆమెనను సరించింది మిత్రవింద. "ఏమిట్రా ఇలా వచ్చావ్?" అడిగాడు అప్పన్నని చరక్.

"పెద్దమ్మగారు పిలుస్తున్నారండి" చెప్పాడు అప్పన్న. పెద్దమ్మ అంటే వాడి దృష్టిలో దేవమ్మగారు.

"ఎవర్ని? మా ముగ్గురినా?"

"లేదండి. మిమ్మల్ని మాత్రమే పిలవమన్నారండి" అన్నాడు అప్పన్న.

"అర్జంటా?"

"అవునండి. డ్రైవర్ కాశీ లేడు గదా. ఏవో సరుకులు కావాలట. జీప్ తీసుకుని మండపేట వెళ్ళి రావాలి" అన్నాడు అప్పన్న.

"ఏరా... నువ్వు డ్రైవింగ్ నేర్చుకుంటే సమస్య ఉండదు గదా?"

"ఎవరికి? నాకా మీకా?"

"ఓరి... నీకూ తెలివితేటలు పెరిగిపోయాయిరో పద" అంటూ అప్పన్న వెంట వెళ్ళాడు చరక్. దేవమ్మ గారిచ్చిన లిస్టు తీసుకుని వచ్చేసరికి జీపులో డ్రైవరు పక్క సీట్లో కూర్చునుంది మిత్రవింద. వెనకే సంచులు తెచ్చిన అప్పన్న కూడా ఆమెను చూశాడు.

"ఏయ్ మిత్రా. నువ్వెక్కడికి. జీప్‌లో కూర్చోలేవు. ఇంటికి పద" అన్నాడు చరక్.

"రానివ్వండి సార్. అమ్మాయిగారు మన ప్రాంతం చూళ్ళేదు గదా" అంటూ వెనకనుంచి జీప్ ఎక్కి కూర్చున్నాడు అప్పన్న.

"నువ్వు నోరుముయ్యరా. శుశ్రుతకి తెలిస్తే గోలచేస్తుంది. మిత్రవిందా, నా మాట విను ఇంటికెళ్ళిపో" ప్రాధేయపడ్డాడు చరక్. అయినా జీప్ దిగలేదు మిత్రవింద. "మీతో వస్తున్నాను పద" అంది స్థిరంగా.

ఇక తప్పదని జీప్ స్టార్ట్ చేశాడు చరక్. గేటు దాటి పరుగు ఆరంభించింది జీప్. దారిలో మిత్రవింద ఏదో ఒకటి మాట్లాడుతోందని చూశాడు. ఆమె పెదవి విప్పలేదు. సీరియస్‌గా ఏదో ఆలోచిస్తోంది. క్రమంగా గ్రావెల్ రోడ్డు దాటి మండపేట రామచంద్రపురం మెయిన్ రోడ్డు ఎక్కింది జీప్.

ఎగువనొక మలుపు సమీపిస్తుండగా ఉన్నట్టుండి చరక్ వంక చూసింది మిత్రవింద. "చతురా... వాహనాన్ని పక్కకు తీసి ఆపు" అంది. ప్రస్తుతం తెలుగులోనే చక్కగా మాట్లాడేస్తోంది మిత్రవింద.

"ఇక్కడా... ఎందుకు?" సందేహంగా అడిగాడు చరక్.

"ముందు చెప్పింది చెయ్యి" హెచ్చరిగ్గా పలికింది మిత్రవింద. అయిష్టంగానే జీప్‌ను పక్కకు తీసి చెట్టునీడన ఆపాడు చరక్.

మిత్రవింద జీప్ దిగుతుందేమో అనుకున్నాడు. కాని ముభావంగా అలా కూర్చునే ఉంది. ఎగువనుంచి ఏదో లారీ వస్తున్న శబ్దం వినవస్తోంది.

"ఏమైంది?" వెళ్దామా?" అడిగాడు.

"ఒక నిముషం ఆగుము" అంది.

సరిగ్గా అదేసమయంలో అటునుంచి వస్తున్న లారీ ఒకటి దూకుడుగా మలుపులోకి వచ్చేసింది. అది వస్తున్న తీరుచూసి అదిరిపడ్డాడు చరక్, అప్పన్నలు. డ్రైవర్ తప్పతాగి ఉన్నాడా, మరేదన్నా ప్రాబ్లమా తెలీదుగాని ఆ లారీ రోడ్డుమీద అడ్డదిడ్డంగా తూగుతూ భూతంలా వచ్చేస్తోంది.

మలుపు తిరగ్గానే దూకుడుగా దూసుకెళ్ళి రోడ్డుకి అటుపక్కవున్న పెద్ద చింతమానును ఢీకొట్టి తల్లకిందులుగా తిరగబడిపోయింది లారీ. లోన డ్రైవరు, క్లీనర్లు ఆర్తనాదాలు దారుణంగా వినవచ్చాయి. అది చూసి భయంతో కెవ్వున అరిచాడు అప్పన్న, చరక్‌కి అరచేతులు చెమటలు పట్టేశాయి.

తమ జీప్ ముందుకెళ్ళి ఉంటే ఏం జరిగేదో ఊహిస్తేనే వెన్ను జలదరించింది. మిత్రవింద మాట వినకుండా మలుపులోకి వెళ్ళుంటే ఖచ్చితంగా పెద్ద ఆక్సిడెంటయి తమజీప్ ముక్కలు చెక్కలయ్యేది.

కళ్ళముందు జరిగిన సంఘటనకి చలించిపోతూ షాక్‌నుంచి తేరుకుని మిత్రవిందవంక చూశాడు.

ఆమె ఏమీ జరగనట్టే ప్రశాంతంగా కూర్చునుంది. తొలిసారిగా చరక్‌లో అనుమానం మొదలైంది. మిత్రవిందకు భవిష్యత్తు తెలుస్తోందా? "ప్రియుడా. ఎక్కువ ఆలోచనలేల? వాహనమును పోనిమ్ము" అంది మిత్రవింద.

"ఇక్కడ ప్రమాదం జరుగుతుందని నీకు ముందే తెలుసా?" అడిగాడు.

మిత్రవింద సమాధానం చెప్పకుండా గుంభనగా నవ్వి ఊరుకుంది. అప్పటికే యాక్సిడెంట్ స్పాట్‌కి జనం పరుగులెత్తుకొస్తున్నారు. వాహనాలు నిలిచిపోయి సాయం చేయటానికి దిగుతున్నారు ప్రయాణీకులు. చరక్ జీప్‌ను ముందుకు పోనిచ్చాడు.

"సార్. ఇవాళ అమ్మాయిగారి వల్ల మనము, మన జీపు క్షేమంగా ఉన్నాం. ఎందుకు ఆగమన్నారోగాని మనకి పెద్ద ప్రమాదం తప్పింది" వెనుకనుంచి అన్నాడు అప్పన్న.

కాస్సేపట్లోనే జీపు మండపేట చేరుకుంది. తాము ఎప్పుడూ సరుకులు తీసుకునే పెద్ద షాపు సమీపంలో జీప్ ఆపాడు చరక్. చరక్, అప్పన్నలు జీప్ దిగారు. ఒక మాజా బాటిల్ కొనితెచ్చి మిత్రవిందకిచ్చాడు చరక్. "జీప్‌లోనే కూర్చుంటావా?" అడిగాడు.

"ఊ" అంది.

అప్పన్నతో షాపు వైపు నడుస్తూండగా చరక్‌కి రాకూడని అనుమానమే వచ్చింది. "అప్పన్నా. మిత్రవింద నీకు కనబడుతోంది గదా?" అనడిగాడు.

"అయ్యబాబోయ్. అలా అడిగారేంది సార్. అమ్మాయిగారు లక్షణంగా కనబడుతుంటేనూ" అన్నాడు అప్పన్న.

"మరి ఇక్కడి జనం గుడ్డివాళ్ళా. ఒక్కరూ జీప్ వంక చూడ్డంలేదేమిటి?" చరక్ ప్రశ్న విన్నాక– అప్పన్నకీ అనుమానం వచ్చింది. మిత్రవింద అసాధారణ యువతి. గొప్ప సౌందర్యవతి.

అంతటి అందాలరాశి జీప్‌లో కూర్చుంటే జనం చూడ్డానికి ఎగబడ కుండా ఉంటారా? కాని ఎవరూ చూస్తున్నట్టు లేదే. "మీ డౌటు నేను తీరుస్తాను ఉండండి సారూ" అంటూ ఎదురొస్తున్న ఓ కుర్రాడ్ని ఆగి "ఏరా. ఆ జీప్‌లో ఎవరన్నా ఉన్నారా?" అనడిగాడు.

వాడు అప్పన్నని పిచ్చాడ్ని చూసినట్టుగా ఎగాదిగా చూశాడు.

"ఏంది? నీకేమన్నా దయ్యాలు కన్పిస్తున్నాయా? నా కళ్ళు బాగానే ఉన్నాయి. అందులో ఎవరూలేరు" అంటూ తన దారిన వెళ్ళిపోయాడు.

ఆ మాటలు వినగానే– అప్పన్నకు పిచ్చిపట్టినట్టయింది. నెమ్మదిగా చరక్ పక్కకెళ్ళి– "సార్. మీ అనుమానం కరెక్టే. అమ్మాయిగారు మనకి మాత్రమే కనబడుతోంది. ఎవరిని అడిగినా జీప్‌లో ఎవరూ లేరంటున్నారు" అంటూ గొణిగాడు అప్పన్న.

"సరి. ఆ విషయం వదిలేసి పని చూడు" అన్నాడు చరక్.

అవసరమైన సరుకులన్నీ కట్టించుకుని లెక్క చూసుకుని ఇద్దరూ జీప్ వద్దకొచ్చేసరికి ఈ సారి వాళ్ళకీ మిత్రవింద కన్పించలేదు. "అయ్యబాబోయ్. అమ్మాయిగారు కన్పించడంలేదండి" అనరిచాడు అప్పన్న.

మిత్రవింద తాగిన ఖాళీ మాజాబాటిలు జీప్‌లో దొర్లుతోంది.

చరక్ కంగారుపడలేదు. కట్టించిన సరుకుల మూటలు జీప్‌లో పడేసుకుని తిరుగుప్రయణమయ్యారు. జరిగిందంతా కళ్ళారా చూసిన అప్పన్నకి పిచ్చిపట్టినట్టుంది.

"అదేంటి సార్ ఇలా వచ్చేస్తున్నాం. అమ్మాయిగారు ఎక్కడికెళ్ళారో ఏమిటో కాసేపు ఆగాల్సింది" అన్నాడు.

"నువ్వెందుకురా టెన్షన్ పడతావ్. ఇంటికెళ్ళిపోయుంటుంది" అన్నాడు తాపీగా చరక్. జీప్ ఇంటికి రాగానే ఆపి, సామాన్లు దించమని అప్పన్నకు చెప్పి వడివడిగా తమ ఇంటికెళ్ళాడు చరక్.

అతను వెళ్ళేసరికి మిత్రవింద తీరిగ్గా హాల్లో కూర్చుని సుశ్రుత కొసరి కొసరి వడ్డిస్తున్న జున్ను తింటూ కన్పించింది. ఏం జరిగిందో చూడాలని వెనకే వచ్చిన అప్పన్న లోన మిత్రవిందను చూసి కెవ్వుమన్నాడు.

"ఏరా. నీకేం చెప్పాను? సామాన్లు దించమన్నా గదా. నీకిక్కడ ఏం పని? పో" అంటూ కసురుకున్నాడు చరక్.

"అది కాదు సార్. అమ్మాయిగారు... ఇక్కడ...." నసిగాడు అప్పన.

"చూశావ్‌గా... ఇంటికొచ్చేసింది నువ్వెళ్ళు" అన్నాడు చరక్.

అక్కడ నుండి తలబరుక్కుంటూ వెళ్ళిపోయాడు అప్పన్న.

"ఏంటి చరక్... వాడు ఏమంటున్నాడు?" అనడిగింది శుశ్రుత.

"ఏదో అనటం కాదు. భయపడి ఛస్తున్నాడు. ఏయ్ మిత్రా. మాతో వచ్చిందానివి జీప్‌లో మేం వచ్చేవరకూ ఉండొచ్చుకదా. ఎందుకొచ్చేశావ్?" అనడిగాడు మిత్రవిందను. అతడి మాటలు విని– అమాయకంగా చూసింది మిత్రవింద. శుశ్రుతకి ఆ సంభాషణ ఏమీ అర్థంకాలేదు.

"తను మీతో రావటం ఏమిటి. నాతో ఇక్కడే ఉందిగా" అంది శుశ్రుత.

"అలా చెప్పక్కా, నేను ఇల్లు వదిలివెళ్ళానా ఏమి?" అంది దీర్ఘం తీస్తూ మిత్రవింద.

చరక్‌కి చుర్రుమంది. "మిత్రా... నన్ను అబద్ధం చెప్పొద్దని చెప్పి ఇప్పుడు నీవు అబద్ధం చెప్తున్నావ్. నీవు మాతో రావటంవల్లే గదా పెద్ద ప్రమాదం తప్పింది. నువ్వు మాతో వచ్చావనటానికి అప్పన్న సాక్షి. నిజం చెప్పు" నిలదీశాడు.

"ఏమో... వచ్చానేమో" అంది నవ్వుతూ.

"అక్కా. నువ్వు నాతోనే ఇక్కడే ఉన్నావ్‌గా" అని అరిచింది శుశ్రుత.

"పోన్లేవే. వాళ్ళు భ్రమపడుతున్నట్టున్నారు. కాదనటం ఎందుకు? చతుర్‌కీ జున్నంటే ఇష్టం. ఇవ్వు, కాస్త చల్లబడతాడు"

మిత్రవింద మాటలకి చరక్‌కి నిజంగానే కోపం వచ్చింది. "మిత్రా నువ్వేదో దాస్తున్నావ్. మీ ఇద్దరూ నన్ను ఫూల్‌ని చేయాలని చూడకండి" అంటూ కోపంతో మేడమీదకు వెళ్ళిపోయాడు.

"అక్కా... ఫూల్ అనగా ఏమి?" శుశ్రుతని అడిగింది.

"ఏమో తల్లీ. మీ మాటలు నాకేమి అర్థమైచావట్లేదు. ఫూల్ అనగా ఇంగ్లీష్ భాషలో తెలివి తక్కువ వాడు, అమాయకుడు, దద్దమ్మ ఇలా అర్థాలు వస్తాయి.

చరక్ నీ మీద అలిగినట్టున్నాడు. వెళ్ళిచూడు" అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది శుశ్రుత.

మిత్రవింద లేచి మేడమీదకు వెళ్ళేసరికి రూఫ్‌గార్డెన్‌లోని తూగుటుయ్యాల మీద కన్పించాడు చరక్. వెనక్కి జేరబడి ఊగుతూ కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాడు. గాజుల శబ్దానికి కళ్ళు తెరిచాడు. ముసిముసి నవ్వులతో అతని సరసన కూర్చుంది మిత్రవింద. "చతురా... అలక ఏల?" అంది.

"అలక కాదు. కోపం. పీకదాకా నీ మీద కోపం ఉంది. నాతో కూడా నిజం చెప్పవా? ద్వారక నుంచి వచ్చేటప్పుడు నీలో ఏ శక్తులూ లేవు. ఇప్పుడు

నీలో ఏవో అద్భుతశక్తులు కన్పిస్తున్నాయి. ఇక్కడ శుశ్రుత వద్ద కూర్చునే నీ మరో రూపాన్ని మా వెంట పంపించావ్. యాక్సిడెంటవుతుందని నీకు ముందే తెలుసు. నన్ను కాపాడ్డం కోసమే వచ్చావ్...."

"అర్థమైంది గదా... ఇక గొడవెందుకు?"

"గొడవ కాదు. నేను తెలుసుకోకూడదా? నీలో ఈ శక్తులు ఎలా వచ్చాయ్?"

"అంతా ఆ బలరామప్రభువుల కరుణాకటాక్షం"

"ఏదీ... ఆ రోజు ద్వారకలో నన్ను శత్రుగూఢచారిగా సందేహించి బంధించమని సైనికులను పంపిన ఆ బలరామప్రభువులా...."

"అవును. బలరామప్రభువులే. ఎవరికీ అనుమానం రానివిధంగా నన్ను నీతో పంపించటం కోసం అలా చేశారు. మనల్ని ఆశీర్వదించి తన శక్తుల్ని నాకు ధారపోసి నన్ను నీతో పంపిన సాధుపుంగవుడు శివయోగి ఎవరను కుంటున్నావు? వారు మారువేషంలోని బలరామప్రభువులు."

చరక్‌కి మబ్బు వీడిపోయినట్టయింది. తనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయనిపించింది. "ఈ విషయం నీకు ద్వారకలోనే తెలుసా?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగాడు.

"అప్పుడు తెలీదు. వారు స్వప్నమందు సాక్షాత్కరించి చెప్పాకే నాకు తెలిసింది" అంది మిత్రవింద. చరక్‌కి నోటమాటరాలేదు. ఈ విషయంలో తనెంత అమాయకంగా ఉన్నాడో ఇప్పుడు కదా అర్థమవుతోంది.

జేజితాత అగ్నివేశాచార్యుడు అప్పుడే చెప్పారు. ఆ సాధువు బలరామ ప్రభువులు కావచ్చని. ఆయన సందేహమే నిజమైంది "ఇదంతా ఎందుకు?" మళ్ళీ అమాయకంగానే అడిగాడు చరక్.

మిత్రవింద భారంగా నిట్టూర్చింది. "చతురా... ద్వారకలో ఆనాడే మనకు నిశ్చితార్థమైంది. అంటే సగం పెళ్ళయిపోయినట్టే. విధి మనల్ని విడదీసింది.

వేల సంవత్సరాలు నీకోసం ఎదురు చూశాను. నీకు జన్మమారింది. అయినా దైవం కరుణతో మనల్ని కలిపింది. అయితే పరిస్థితులు బాగాలేవు.

నిన్ను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది గదా. మరోసారి నీ వియోగాన్ని తట్టుకోలేను.

ఆపైన నీ మూలంగా కలియుగాన ధర్మసంస్థాపన జరగాల్సివుంది. జేజి తాతగారి ఆశయాన్ని సిద్ధింపజేయటంలో సహకరించమని బలరామ ప్రభువులు స్వప్నంలో ఆదేశించారు.

వారి కరుణతోనే నాలో ఆ దివ్యశక్తుల్ని వశం చేసుకోగలుగుతున్నాను" అంటూ వివరించింది మిత్రవింద.

"మరి నాకే శక్తులూ అక్కర్లేదా?"

"అక్కర్లేదు" అంది స్థిరంగా మిత్రవింద.

"నీకు ఒక పక్క పెట్టనిగోడలా జేజితాత అగ్ని వేశాచార్యుల అండ ఉంది. మరోపక్క నేనున్నాను. నీ నీడను కూడా ఎవరూ తాకలేరు" అంది.

"ఈ విషయాలన్నీ శుశ్రుతకి తెలుసా?"

"తెలీదు" అని చెప్పింది మిత్రవింద.

"మిత్రా" అంటూ ప్రేమాతిశయంతో మిత్రవిందను కౌగిట బంధించి ఆమె పగడాల అధరాలను చుంబించాడు చరక్.

అదే రోజు రాత్రి– ఏదో పనిమీద బయటికెళ్ళిన చరక్ తొమ్మిదిగంటల తర్వాత ఇంటికి వచ్చాడు. "మిత్రవింద ఎక్కడ?" భోంచేస్తూండగా అడిగాడు.

"రాత్రికి పాలు, పండ్లేగా తీసుకుంటుంది. ఇవాళ త్వరగా నిద్రొస్తోం దంటూ ఎనిమిదింటికే తన గదికి వెళ్ళిపోయింది" అంది.

"పాలు తాగిందా?" గుర్తుచేశాడు.

"మర్చేపోయాను చూశావా. పండ్లు తిని వెళ్ళింది. పాలు తర్వాత ఇమ్మంది. భోజనం చేస్తుండు. ఇచ్చివస్తాను" అంటూ చరక్ భోజనం చేస్తూండగా తను ఒక పెద్దమగ్గులో వేడిగా చిక్కటి పాలు తీసుకుని మేడమీదకు వెళ్ళింది శుశ్రుత.

శుశ్రుత వెళ్ళేసరికి మిత్రవింద గది తలుపులు మూసివున్నాయి. గదిలో బెడ్‌లైటు వెలుగుతోంది. ఏం చేస్తోంది అప్పుడే నిద్రపోయిందా అనుకుంటూ కిటికీ రెక్క కొంచెం తెరిచిచూసింది. అంతే చూడగానే మ్రాన్పడిపోయింది.

ఒక్కసారిగా శరీరమంతా నిలువునా పులకించినట్టయింది. లోన-బెడ్‌పక్కన కింద తుంగచాప పరచి దానిమీద పద్మాసనస్థితిలో యోగనిష్ఠలో ఉంది మిత్రవింద. ఆమె ఒంటిమీద ద్వారకనుంచి తెచ్చుకున్న దుస్తుల్లోంచి లంగా ఓణీ ధరించి ఉంది.

ఆమె ముఖమండలం దివ్యప్రకాశంతో వెలిగిపోతూ సాక్షాత్తూ అమ్మవారు ప్రత్యక్షమయ్యారా అన్పిస్తోంది. ఏమా దివ్యతేజస్సు... దేవకన్యలా మెరిసిపోతోంది. ఉదయం చరక్ అంత గొడవ చేశాడంటే ఉత్తినే కాదు. తను చెప్పింది నిజమే.

మిత్రవింద తనతో ఇక్కడే ఉండి మరోపక్క జీప్‌లో వెళ్ళి ఉంటుంది. సందేహంలేదు.

చరక్‌కి ఎంతవరకు తెలుసోగాని మిత్రవిందలో అద్వితీయమైన యోగశక్తులేవో ఉన్నాయి. ఆమె యోగనిష్ఠకు భంగం కలిగించకూడదు అనుకుంటూ చప్పుడు గాకుండా పాలగ్లాసు లోపలుంచి ఎలా వెళ్ళిందో అలాగే నిశ్శబ్దంగా కిందకు వచ్చేసింది.

*　　*　　*　　*　　*

"గురుదేవా. ఎందుకైనా మంచిది. మరొక్క మారు ఆలోచించుకోండి" గురువు మరిడి సోమయ్యను హెచ్చరించాడు శిష్యుడు విళంబి.

అది నీలోదరి కొండగుట్ట... మరిడి సోమయ్య నివాసం. మాంత్రికుడు సోమయ్య తన మరోశిష్యుడు మృణాళుడ్ని వెంటబెట్టుకుని మున్నలూరి అగ్రహారం వెళ్ళే ప్రయాణంలో ఉన్నాడు. "ఏ విషయంరా ఆలోచించుకోమంటున్నావ్?" విళంబి వంక విసుగ్గా చూస్తూ ప్రశ్నించాడు మరిడి సోమయ్య.

"అదే గురువుగారూ, మున్నలూరి వారి అగ్రహారం వెళ్ళే ఆలోచన" నసిగాడు విళంబి.

"ఏమిట్రా సోది... పిచ్చివెధవా. వెళ్తే ఏమవుతుంది? మాకేమిట్రా భయం?"

"భయమే గురువుగారూ. నిప్పును మూటగట్టాలని చూస్తున్నారు. మన ఒళ్ళే కాలుతుంది. ఆ పిల్ల సామాన్యురాలు కాదు. నిప్పు"

"ఎంత నిప్పయినా నా మంత్రశక్తి ముందు మంచుముద్దయిపోతుందిరా" అన్నాడు మరిడిసోమయ్య.

"ఏమవుతుందో ఏమిటో... స్త్రీల జోలికెళ్ళిన వాడెవడూ బాగుపడలేదు గురువుగారూ.

అంతటి రావణాసురుడు ఏమయ్యాడు? భస్మాసురుడు ఏమయ్యాడు?

నరకాసురుడు ఏమయ్యాడు? బాలనాగమ్మను ఎత్తుకెళ్ళిన మాయలఫకీరు ఏమయ్యాడు...."

"ఏమయ్యాడంటూ నా మీద నీ వెధవ ప్రశ్నలేమిట్రా చచ్చువెధవా. నన్ను చూస్తే రాక్షసుడిలా కన్పిస్తున్నానా? వాళ్ళలా చేతకాని వాడ్ననుకుంటున్నావా?

ఇంకొక్క మాట మాట్లాడితే నిన్ను చితగ్గొట్టి చెట్టుకు వేలాడదీస్తా. అపశకునపక్షి. అయినా నేను వెళ్ళేది ఆ ద్వారకా సుందరి కోసం మాత్రమే అని ఎలా అనుకున్నావ్ రా?"

"అంటే గురువుగారూ...."

"ఆ అగ్నివేశాచార్యుడు ధర్మసంస్థాపనంటూ కలవరిస్తున్నాడు గదరా. ఆ ముసలాడి కల ఫలించాలంటే చరక్ బతికుండాలిగా. ఆ చరక్‌నే చంపేస్తే ఫినిష్, ధర్మమూ లేదు, సంస్థాపనా లేదు" అంటూ ఒక్కసారిగా ఫెళ్ళున నవ్వాడు మరిడి సోమయ్య.

విళంబి విస్తుపోయి చూశాడు. మరోమాట అడగటానికో, చెప్పటానికో వాడికి నోరుపెగల్లేదు. ఎందుకో తెలీదుగాని ఈ విషయంలో తమ గురువు పగటికలలు కంటున్నాడనిపించింది.

"ఏమిటి? ఆ కుర్రాడ్ని చంపేద్దామనా?" ఈ ప్రశ్న అడిగింది విళంబి కాదు, అక్కడే వున్న అఘోరా.

"అవును. ఆ కుర్రాడ్ని చంపి ఆ మిత్రవిందని ఇక్కడికి తెచ్చుకుంటాను.

నా రాణిని చేసుకుంటాను" అంటూ మరోసారి మీసం తిప్పాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

"అవును. వినాశకాలే విపరీతబుద్ధి అంటే ఇదే" గొణుక్కున్నాడు విళంబి. ఇక గురువు తన మాట వినడని వాడికి అర్థమైపోయింది.

"ఈ పని ఎప్పుడో చేయాల్సింది సోమయ్యా. నేనూ వెంటరానా. నా మంత్రశక్తితో చరక్‌కి శూన్యం పెట్టి క్షణాల్లో ప్రాణం తీస్తా" అన్నాడు అఘోరా.

"అప్పుడు అగ్నివేశాచార్యుడు మనకి తద్దినం పెడతాడు. ఎవరికీ అనుమానం రానివిధంగా ఆ చరక్‌ను లేపాలంటే మంత్రశక్తి కాదు, యంత్రశక్తి అవసరం. రివాల్వర్‌తో ఒక్క బుల్లెట్‌చాలు వాడి ప్రాణం తీయటానికి"

"ఎందుకైనా మంచిది రమ్మంటే నేనూ వస్తాను"

"పెళ్ళికిపోతూ పిల్లిని చంకనెత్తుకెళ్ళినట్టు వీడెందుకురా బాబూ...." మృణాళుడు గొణుక్కున్నాడు. నిజానికి తమవెంట అఘోరా రావటం మరిడి సోమయ్యకూ ఇష్టంలేదు.

అందుకే– "మీరు కూడా మాతోవస్తే ఎలా గురువుగారూ ఇక్కడ మహిష శక్తికి పూజలు నిర్విఘ్నంగా ఎవరు చూస్తారు? మీరు ఆ పనిలో ఉండండి. ఈ లోపల మేం వచ్చేస్తాం" అంటూ బయలుదేరాడు.

వ్యాన్‌లో మరో శిష్యుడు స్టీరింగ్ తీసుకున్నాడు. వాడి పేరు గంగారాం.

వాడి పక్కన మృణాళుడు కూర్చున్నాడు. మరిడి సోమయ్య వెనుకసీట్లో కూర్చున్నాడు. ఉదయం తొమ్మిదిగంటలకు నల్లని వ్యాన్ నీలోదరి కొండగుట్ట నుండి వైజాక్ దిశగా బయలుదేరింది.

*　　*　　*　　*　　*

గురువారం ఉదయం సరిగ్గా పదిగంటలకు రాజమండ్రి నుండి షోరూమ్ వాళ్ళు కొత్త బెంజికారును తెచ్చి డెలివరీ ఇచ్చి వెళ్ళారు. లేత ఆకుపచ్చరంగులో పూలరథంలా అందమైన కారు.

ముందుగా ఇంటివద్దనే పురోహితుడిచేత మణిభద్రయక్షుడి పేర కారుకి పూజలు చేయించి కొబ్బరి కాయ కొట్టించాడు చరక్.

తమతోబాటు దేవమ్మగారిని రమ్మని పిలిస్తే "వయసైంది నాయనా మీతో తిరగలేను. మీరు వెళ్ళిరండి" అందావిడ.

మిత్రవింద, శుశ్రుతతోబాటు తమకు సాయంగా అప్పన్నను కూడా తీసుకుని కొత్తకారులో బయలుదేరాడు చరక్. ముందుగా మండపేట వెళ్ళి అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో కారుకి పూజలు చేయించారు.

తర్వాత ద్వారపూడి వైపు బయలుదేరారు. దారి పొడవునా పచ్చటి పొలాలు, తోటలు, కాలువలు, పశుపక్ష్యాదులను చూస్తూ వినోదిస్తోంది మిత్రవింద.

కారు మెత్తగా దూసుకుపోతోంది.

"మిత్రా కొత్తకారు ఎలా ఉంది?" పక్కనే కూర్చున్న మిత్రవిందను అడిగాడు చరక్. అమ్మాయిలిద్దరూ ఫ్రంట్ సీట్లోనే చరక్ పక్కన కూర్చున్నారు. అప్పన్న వెనుకసీట్లో ఉన్నాడు.

చరక్ ప్రశ్న విని నవ్వింది మిత్రవింద. "ఇది నా రథముకన్నను వేగముగా పోవునా?" అంది ఉత్సాహంగా. ఆ మాటలు విని అదిరిపడ్డాడు అప్పన్న.

"అమ్మబాబోయ్ తల్లో... చరక్ బాబుని రెచ్చగొట్టకు. కారు గాల్లో తేలి పోతుంది.

ఆయన దూకుడుకి ఈ రోడ్లు ఆగవు. అసలే ఇది కొత్తకారు" అనరిచాడు.

అయినా స్పీడ్ పెంచాడు చరక్. స్పీడోమీటరు నూట యాభైచూపించి ఏభైకి దిగేసరికి కారు ఎనిమిది కిలోమీటర్లు దాటేసి ద్వారపూడి వంతెనమీద ఉంది. ద్వారపూడిలో ప్రసిద్ధ ఆలయాలు శివాలయం, అయ్యప్ప ఆలయం, వెంకటేశ్వర ఆలయాల్ని దర్శించి అక్కడ్నుంచి నేరుగా సామర్లకోట వెళ్ళారు.

పంచారామాల్లో ఒకటయిన సోమారామంలో సోమేశ్వరస్వామిని దర్శించుకుని కాకినాడ వైపు ప్రయాణించారు. మిత్రవింద శుశ్రూతలకు చాలా ఆనందంగా ఉంది.

ముఖ్యంగా మిత్రవిందకు ఇదంతా కొత్తలోకం గాబట్టి ప్రతిదీ విడ్డూరంగా చూస్తూ వినోదాల్ని, ఆనందాన్ని పొందుతోంది.

ముఖ్యంగా కాకినాడ వీధుల్లో జనసందోహాన్ని చూసి ఎంతో ఆశ్చర్య పోయింది. ఆ కాలంలో ఇంత జనాభా ఇన్నిరకాల వసతులు ఎక్కడివి? బీచ్‌రోడ్‌కి వెళ్ళగానే సముద్రంలోని ఓడల్ని చూసి బుగ్గన వేలేసుకుని మరీ పసిపిల్లలా చూసింది.

"చతురా. ఒక నగరమే కదిలిపోతున్నట్టుంది. అదేమి?" అనడిగింది.

"ఇది తూర్పుసముద్రం. ఆ కాలంలో దీన్ని "మహోదధి" అనేవారు. ఇప్పుడు బంగాళాఖాతం అంటున్నారు. అవి ఈ కాలం ఓడలు" అన్నాడు.

"వాటికి తెరచాపలు ఏవి?"

"అవి ఆ కాలంలోని ఓడలు. ఇవి ఈ కాలం ఓడలు. యంత్రాల సాయంతో నడుస్తాయి"

బీచ్‌రోడ్‌లోనే ఓ చోట కారాపాడు చరక్. అప్పటికి భోజనం వేళయింది. వెంట తెచ్చుకున్నవి భోజనం చేసి తిరిగి బయలుదేరేసరికి రెండు గంటలు దాటింది సమయం. కోటిపల్లి వెళ్ళి రావటానికి సమయం చాలదనే ఉద్దేశంతో రామచంద్రా పురం మార్గంలో ద్రాక్షారామం బయలుదేరారు. కారు రామచంద్రాపురం దాటగానే "సార్. ఓ విషయం మీరు గమనించారా?" అనడిగాడు వెనుక సీట్లోని అప్పన్న.

"ఏ విషయం రా?"

"మన వెనుక దూరంగా ఒక నల్లటి వ్యాన్ వస్తోంది చూడండి" అన్నాడు అప్పన్న.

"అవును. ఎవరిదో నల్లరంగు స్కార్పియో వ్యాను. ఏమైంది?" అన్నాడు చరక్.

"ద్వారపూడి వదిలినప్పట్నుంచి గమనిస్తూనే ఉన్నాను. అది మన వెనుకే తోకలా వస్తోంది"

"రానీ... మనలాగే వాళ్ళు గుళ్ళు చుడుతున్నట్టున్నారు" అన్నాడు చరక్.

"అదేం లేదు. ఆ కారులో ఎవరున్నారో తెలీదు. ఏ గుడి దగ్గర ఆగినా కారులోంచి ఒక్కరూ కిందకు దిగిందిలేదు. కాని మనల్ని అనుసరించే వస్తున్నారు"

అప్పన్న ఆ మాట అనగానే చరక్‌లోనూ సందేహం ఏర్పడింది. అయినా తమను ఫాలో అవ్వాల్సిన అవసరం ఎవరికుందని. వాళ్ళ పనిమీద వాళ్ళు వస్తున్నట్టున్నారు అనుకున్నాడు.

కారు ద్రాక్షారామం చేరుకునేసరికి సాయంత్రం నాలుగు గంటలైంది. పార్కింగ్‌లో అడ్డదిడ్డంగా ఆగున్నాయి చాలా కార్లు. తమ కారును ఒక పక్కగా ఆపాడు చరక్. అంతా కారు దిగారు. కారు లాక్‌చేసి గుడిలోకి బయలుదేరారంతా.

గుడి సమీపంలో చాలా అంగళ్ళున్నాయి. కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పువ్వులు తీసుకుంటూ ఒక అంగడిముందు ఆగింది శుశ్రుత. అప్పన్న పక్కన నిలబడ్డాడు.

కాస్త ఇవతలగా చరక్, మిత్రవిందలు నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ లోపల స్కార్పియో వ్యాన్ వచ్చి ఒక చోట ఆగింది. వ్యాన్‌లో ఉన్నది మాంత్రికుడు మరిడి సోమయ్య, వాడి శిష్యుడు మృణాళుడు.

"చూస్తావేమిరా. సరిగ్గా రేంజ్‌లో ఉన్నాడు చరక్. కాల్చిపారేయ్" వెనుక సీట్లోంచి హెచ్చరించాడు మరిడి సోమయ్య.

రివాల్వర్ తీసి సైడ్ అద్దం దించి చరక్‌కి ఎయిమ్‌చేశాడు మృణాళుడు. అంతలో అటుపక్క వున్న ఎర్రరంగు కారు చరచరా ముందుకొచ్చి మృణాళుడికి అడ్డంగా నిలబడింది.

"ఒరే శుంఠా. కారుని వెనక్కి తీశావేంరా?" వ్యాన్ నడుపుతున్న శిష్యుడు గంగారాం మీద అరిచాడు మరిడి సోమయ్య.

"నేనెక్కడ వెనక్కి తీశాను గురువుగారూ. ఆ కారే ముందుకు వచ్చింది" అన్నాడు గంగారాం.

"కారులో ఎవరూ లేరు. తానుగా ముందుకు ఎలా వచ్చింది?" ఆశ్చర్యం వ్యక్తంచేశాడు మృణాళుడు.

"పల్లానికి దొర్లుకొచ్చివుంటుంది. వ్యాన్‌ని ముందుకు పోనీ" తొందర చేశాడు మరిడిసోమయ్య.

గంగారాం తమ వ్యాన్‌ని ముందుకు తీసి ఆపాడు.

అక్కడ చరక్‌తో మాట్లాడుతోందే గాని– మిత్రవింద ఓ కంట వ్యాన్‌ని గమనిస్తూనే వుంది.

ఆ విషయం చరక్‌కి కూడా తెలీదు. మృణాళుడు తిరిగి రివాల్వర్‌ని చరక్ వైపు గురిచేశాడు.

వేలు ట్రిగ్గర్ మీదకు పోతోంది.

అంతలో ఎటునుంచి వచ్చిందో నల్లగా భూతంలా వున్న ఊరకుక్క ఒకటి అటుగా వచ్చింది.

వచ్చీరావటమే ఎగిరి చేయి చాపి రివాల్వర్‌ని ప్రయోగించబోతున్న మృణాళుడి చేతిని పట్టేసింది.

కోరల్లాంటి పళ్ళు మణికట్టువద్ద దిగబడి బాధతో కెవ్వున అరిచాడు వాడు. చేతిలోంచి రివాల్వర్ జారిపోయింది.

చేతిని విదిలించినా ఆ కుక్క వదలకుండా ఉడుంపట్టు పట్టేసింది.

దాంతో వెనుక సీట్లోని మరిడి సోమయ్య తన మంత్రదండంతో ఆ కుక్క తలమీద ఒక్కటిచ్చాడు. దెబ్బకు తల పగిలి చచ్చి కిందపడిందది.

నెత్తురు ఓడుతున్న చేత్తో బాధగా అరుస్తున్నాడు మృణాళుడు.

వెంటనే డ్రైవింగ్ సీట్లోని శిష్యుడు గంగారాం జేబురుమాలు తీసి గాయానికి కట్టు కట్టసాగాడు.

ఈ లోపల– డోర్ తెరుచుకుని కిందకు దిగిన మరిడి సోమయ్య కింద పడిన రివాల్వర్ అందుకుని చరక్‌కోసం చూశాడు.

అప్పటికి వాళ్ళంతా గుళ్ళోకిపోతూ కన్పించారు. చరక్ వెనుక నడుస్తున్న మిత్రవింద ఓరకంట అతడ్ని గమనిస్తూ చిన్నగా నవ్వుకుంది.

"ఛ... మంచి అవకాశం పోయిందే. పాడుకుక్క సమయానికి ఇది ఎక్కడ నుంచి వచ్చిందిరా" అంటూ కోపంపట్టలేక దాన్ని కాలితో తన్నాడు.

"వాళ్ళెలాగూ ఇటే తిరిగి వస్తారుగా గురువుగారూ.

మీరే కాల్చిపారేయండి వాడ్ని" అంటూ సలహా ఇచ్చాడు గంగారాం.

"నా చేయి గురువుగారూ. బాధభరించలేకపోతున్నాను. అది పిచ్చి కుక్కో ఏమిటో ఖర్మ వెంటనే డాక్టర్ దగ్గరకి పోదామండి" అరుస్తున్నాడు మృణాళుడు.

"ఈ మాత్రానికే నీకేమీ పిచ్చెక్కదుగాని కాస్త ఓర్చుకో.

వాడ్ని చంపటం ఆ పిల్లని మనతో తీసుకుపోవటం జరిగిపోవాలి.

ఆహా! ఏమందం ఏమి చందం. దేవకన్యలా ఉంది గదరా. మిత్రవింద ఇక నా సొంతం. అంతే" అంటూ వ్యాన్‌లో కూర్చుని చరక్ కోసం ఎదురు చూడసాగాడు సోమయ్య.

మాంత్రికుడు మరిడి సోమయ్య మిత్రవిందను చూశాడు. అయినా కూడా జరిగిన రెండు సంఘటనలూ యాదృచ్ఛికంగా జరిగాయనుకున్నాడు గాని అవి మిత్రవింద ప్రభావమని ఊహించలేకపోయాడు.

సుమారు ఒక గంట ఎదురుచూసిన తర్వాత చరక్‌తో బాటు అంతా బయటికొస్తూ కన్పించారు. వాళ్ళంతా తమ కారువైపు వస్తున్నారు.

మాంత్రికుడు మరిడి సోమయ్య రివాల్వర్‌ని చరక్‌కి గురిచేశాడు.

ఈ సారి కూడా అతన్ని దురదృష్టం వెక్కిరించింది. వెనుక ఆగివున్న లారీ ఒకటి ముందుకు కదిలింది.

* * * * *

ట్రిగ్గర్ నొక్కే లోపలే ధడాలున వెనుక నుంచి వ్యాన్‌ని గుద్దుకుంది.

వ్యాన్‌లో వాళ్ళకి దిమ్మతిరిగి కళ్ళు బైర్లు కమ్మినంత పనైంది. చరక్ సంగతి వదిలేసి – "ఎవరు... ఎవడ్రా ఆ డ్రైవర్ వెధవ. మా వ్యాన్‌ని డ్యామేజ్ చేస్తావ్" అనరుస్తూ వ్యాన్ దిగి వెనక్కి వెళ్ళిచూశాడు.

చూస్తే ఏముంది? లారీలో డ్రైవర్ లేడు. వ్యాన్ వెనక భాగం సొట్టపడింది.

లారీ హెడ్‌లైట్లు పగిలాయి. తిరిగి చూసిన మరిడి సోమయ్యకు చరక్ బెంజ్‌కారు బయలుదేరివెళ్ళిపోతూ కన్పించింది.

లారీ డ్రైవర్, క్లీనర్ పరుగెత్తుకొస్తున్నారు. వచ్చీ రావటమే "మీకసలు బుద్ధుందా వెనుక లారీ ఉందని తెలీదా. వ్యాన్‌ని రివర్స్ తీసి మా లారీని గుద్దుతారా. హెడ్‌లైట్లు పోయాయి. డ్యామేజ్ కట్టి కదలండి" అంటూ పెద్దగా అరవటం ఆరంభించాడు డ్రైవర్.

* * * * *

ఆ రోజు రాత్రి– మండపేటలోని ఒక లాడ్జిగదిలో, గురుశిష్యులు ముగ్గురూ కూర్చున్నారు. ద్రాక్షారామం నుంచి మండపేట చేరుకునేసరికి చీకటి పడింది. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృణాళుడి కుక్క కరిచిన చేతికి వైద్యం చేయించాక లాడ్జికి చేరుకుని సెటిలయ్యారు.

చరక్‌ను చంపాలన్న తమ ప్రయత్నాలకు అడ్డంకులు ఏర్పడటం మరిడి సోమయ్యను చాలా అసహనానికి గురిచేసింది.

"అరే మృణాళా! నాకిప్పటికీ అర్థంగావటం లేదురా. చరక్ చాలా గట్టి పిండంరా. అందుకే బతికిపోయాడు. లేకపోతే మన మూడు ప్రయత్నాలూ విఫలంగావటం ఏమిటి!" అన్నాడు శిష్యుల్ని చూస్తూ.

"గురువుగారూ... మనం అనుకుంటున్నట్టు అవి యధాలాపంగా జరిగిన సంఘటనలు కావు" అన్నాడు మృణాళుడు.

"మరేమై ఉంటుందిరా? ఏ శక్తి మనకి అడ్డం పడివుంటుంది" అని అడిగాడు మరిడిసోమయ్య.

"మిత్రవింద అనే శక్తి"

"నేనొప్పుకోను. ఆ అందాల బొమ్మకు అంత శక్తి ఎలా వస్తుంది"

"లేదు గురువుగారూ. విళంబి మనల్ని ముందే హెచ్చరించాడు. ఆ మిత్రవింద మనల్ని గమనించింది. చరక్‌కి రక్షణకవచంలా నిలబడింది. కారు నా గురికి అడ్డురావటం ఆమె ప్రభావమే.

నా చేతిని కరిచిన కుక్క ఆమె ప్రభావమే. వెనుక నుంచి లారీ గుద్దటం ఆమె ప్రభావమే." మృణాళుడి మాటలు విని – కాస్సేపు ఆలోచనలో మునిగి పోయాడు మరిడి సోమయ్య. క్రమంగా మిత్రవింద కారణం కావచ్చన్న అనుమానం బలపడనారంభించింది అయినా– ఎంతటి పురాతన స్త్రీ అయితే మాత్రం ఆమెలో ఇంతటి శక్తి ఎలా వచ్చింది? తాము ఫాలో అవుతున్న సంగతి చరక్‌కే తెలీదు.

అలాంటిది ముక్కుముఖం తెలీని తమను గుర్తించి తమ ప్రయత్నాన్ని గుట్టుచప్పుడు గాకుండా అడ్డుకోవడం అంటే ఇది మామూలు విషయం కాదు. మరిడి సోమయ్య దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

గంగారాం, గురువును చూస్తూ– "ఏంది గురువుగారూ దీనికింత ఆలోచన. ఆ చరక్‌ను చంపటం ఎంత పని?" అన్నాడు.

"గురువుగారూ. వీడికి మందెక్కువైనట్టుంది. పోయి పడుకోమనండి" అన్నాడు మృణాళుడు విసుగ్గా.

"లేదు లేదు. నాకు మందు ఎక్కువ కాలేదు" అన్నాడు గంగారాం.

"అయితే చరక్‌ను చంపటానికి నీ దగ్గరేదన్నా అయిడియా ఉందా?" మరిడిసోమయ్య అడిగాడు.

"గురువుగారూ, ఆ పిల్ల... మిత్రవింద పక్కనుంటేనే గదా చరక్‌ను కాపాడుతుంది. పక్కన లేదనుకోండి. ఎలా కాపాడుతుంది?"

"అయితే?"

"ఏదో టైమ్‌లో అగ్రహారంలోంచి చరక్ ఒంటరిగా బయటికి రాకుండా ఉండదు గదా ఊరి బయట కాపువేస్తే ఏదో సమయంలో దొరికిపోతాడు.

ఒక్క బుల్లెట్ చాలు. అయినా మూడురౌండ్లు కాల్చి చచ్చాడని నిర్ధారణ కాగానే వచ్చేయటమే. వెరీ సింపుల్ గురువు గారూ. రేపు నన్ను పంపించండి. సాయంత్రం లోపు పని ముగించుకునొచ్చేస్తాను" అన్నాడు హుషారుగా.

మరిడి సోమయ్య, మృణాళుడి వంక చూశాడు. "ఇదేదో బాగున్నట్టుంది గురువుగారూ. రేపు వీడ్ని పంపించండి. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ సలహా ఇచ్చాడు మృణాళుడు.

* * * * *

"ఏయ్ మిత్రా... మిత్రవిందా... ఆగు... ప్లీజ్" అరుస్తూనే గబగబా మెట్లు దిగి పారిపోయి వస్తున్నాడు చరక్. కాస్త పొడవాటి జామ కొమ్మ ఒకటి పుచ్చుకుని వెనకే తరుముకొస్తోంది మిత్రవింద.

అప్పుడే పెరట్లోంచి హాల్‌లోకి వస్తున్న శుశ్రుత ఏం జరిగిందో అర్థంగాక ఇద్దరినీ వినోదంగా చూస్తూ నిలబడింది.

చరక్ వేగంగా సుశ్రుత వెనక్కి వచ్చేశాడు. "దాన్ని ఆగమని చెప్పవే. కొట్టినా కొడుతుంది" శుశ్రుతను రిక్వెస్ట్ చేశాడు.

"నువ్వు తిన్నగా ఉండవుగా. ఏదో కొంటెపని చేసే ఉంటావ్. అందుకే దానిక్కోపం వచ్చింది" అంది నవ్వుతూ శుశ్రుత.

"ఛఛ... నేను చాలా బుద్ధిమంతుడ్ని తెలుసా? నేనుగా ఏమీ చేయలేదు"

"అయితే తను చేసిందా?"

"ముందుదాన్ని ఆపవే నీకు పుణ్యం ఉంటుంది"

"అక్కా. చతురుడి ఆగడాలు ఎక్కువైపోతున్నాయి. కొంటెవాడు, తుంటరి వాడు. నువ్వు తప్పుకోవే. కొడితేగాని నాకోపం తీరదు" వస్తూనే నడుంమీద చేతులు ఉంచుకుని అరిచింది మిత్రవింద.

"ఇంతకీ ఏం చేశాడక్కా?" అనుమానంగా అడిగింది సుశ్రుత.

"నీతో ఏం చేస్తున్నాడో... నాతోనూ అదే చేయాలని చూస్తున్నాడక్కా"

మిత్రవింద ఆరోపణ వింటూనే– నోరు తెరిచి– ఆశ్చర్యంగా చరక్ వంక చూసింది శుశ్రుత.

అదిరిపడ్డాడు చరక్. "ఓర్నాయనో... అలా కోపంగా చూడకే. నమ్మకు. దాని మాటలు అస్సలు నమ్మకు. కావాలనే నన్నిరికించేస్తోంది. అసలు జరిగింది అదికాదు" అనరిచాడు చరక్.

"మరేం జరిగింది?" పైటచెంగు బొడ్లో దోపి సీరియస్‌గా నిలదీసింది శుశ్రుత.

"నేను గదిలోకి వెళ్ళేసరికి అంత బారు జుత్తును చక్కగా జడ అల్లుకుంది"

"అయితే?"

"పక్కన మల్లెపూల చెండు ఉంది. జడలో తురుమ మంది. తనే చెప్పింది. అవునో కాదో అడుగు"

"తర్వాత ఏమైంది?"

"మల్లెపూల సువాసన కాస్త మత్తెక్కిస్తుంది గదా. పూలు తురిమి జడవాసన చూడగానే ఆగలేక ప్రేమతో కాస్త కౌగిలించి ముద్దు పెట్టుకున్నానంతే"

"అంతేనా... ఇంకేమీ చేయలేదా? నీ చేతులు చేసిన అల్లరి గురించి చెప్పవే... చతురా... నిజం చెప్పుము" జామకొమ్మచాపి బెదిరిస్తూ అడిగింది మిత్రవింద.

"నేనేం అల్లరి చేయలేదు. నీవే వశం తప్పి...." నసిగాడు చరక్. "చాలు. ఇంకేం వద్దు"

"నాకంతా అర్థమైంది. తను మన మధ్య ఉండగా, మీ ఇద్దరికీ ఇంకా పెళ్ళిగాకుండా ఈ పరిస్థితిలో"

"ఓహో... ఈ పరిస్థితిలో...."

"మనిద్దరం కలసికాపరం చేయటం పద్ధతికాదు. మీ ఇద్దరిలో ఎవరు వశం తప్పినా అక్కకి వ్రతభంగమవుతుంది" అంది శుశ్రుత.

"అందుకని?"

"ఈ రోజు నుంచి ఎవరి గది వాళ్ళది. అంతే"

"వామ్మో ఇదెక్కడి న్యాయం... నేనొప్పుకోను అంతే" అన్నాడు చరక్.

"ఒప్పుకోవాలి అంతే. అక్కతో నీ పెళ్ళి అయ్యాకే. అంతవరకు బుద్ధిగా ఉండాల్సిందే. మరోమార్గం లేదు. అక్కా నువ్వు కూడా అస్సలు అలుసివ్వమాక. అసలే మహాతుంటరి" అంటూ జామకొమ్మలాగి అవతల పడేసి మిత్రవింద చేయి పుచ్చుకుని కిచెన్ వైపు లాక్కుపోయింది శుశ్రుత.

"గోవిందా... గోవిందా!" అంటూ సోఫాలో కూలబడిపోయాడు చరక్.

మిత్రవింద వెనక్కి తిరిగి– అతడ్ని జాలిగాచూస్తూ– నవ్వింది. "మిత్రా... నిన్నూ...." అంటూ ఉడికిపోతూ లేచాడు. మిత్రవింద గబగబా శుశ్రుతకన్నా ముందే కిచెన్‌లోకి పరుగెత్తింది.

"కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిందంటారు ఇదే. ఈ అమ్మాయిలతో ఎలా వేగాల్రా బాబూ. ఇక తనకి పడకసుఖం అటకెక్కినట్టే" అనుకుంటూ తిరిగి చూసేసరికి డోర్‌లో పళ్ళికిలిస్తూ కన్పించాడు అప్పన్న.

తమ మాటలు వాడు వినేశాడేమోనని డౌటు "ఏరా నువ్వెప్పు డొచ్చావ్‌రా?" అనడిగాడు చరక్.

"ఇప్పుడే సార్" అన్నాడు వాడు. దొంగనవ్వు చూస్తే ముందేవచ్చాడని అర్థమైపోతోంది.

"ఎందుకు వచ్చావ్?" విసుగ్గా అడిగాడు చరక్.

"పెద్దమ్మగారు మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారండి" అన్నాడు అప్పన్న.

"నానమ్మ పిలిచిందా. ఎందుకు?"

"కాకినాడ వెళ్ళి రమ్మన్నారండి. రెండు కిలోల కాకినాడ కాజాలు, రెండు కిలోల లడ్డూలు, రెండు కిలోల జాంగిరీ తేవాలండి. డబ్బులిచ్చారండి. మనిద్దర్నీ బైక్‌మీద వెళ్ళొచ్చేయమన్నారు"

"అర్జంటుగా స్వీటు ఎవరికిరా? శ్రావణి కూడా ఇక్కడ లేదు"

"అగ్రహారంలో ఏ ఇంటశుభకార్యమొచ్చినా స్వీట్లు ఇవ్వటం పెద్దమ్మగారికి అలవాటే గదండి.

రెండో వీధిలో పంతులు గారమ్మాయి పెద్దమనిషయింది గదండీ...." అన్నాడు అప్పన్న.

చరక్ మరేం అనలేదు. ఇద్దరూ బైక్‌మీద కాకినాడ బయల్దేరారు.

మామూలుగా అయితే లోనకెళ్ళి శుశ్రుత, మిత్ర విందలకు చెప్పి బయలు దేరటం అలవాటు. కాని ఇంతకుముందే జరిగిన గొడవతో వాళ్ళమీద కోపంతో చెప్పకుండానే బైక్ స్టార్ట్ చేశాడు.

మున్నలూరివారి అగ్రహారం నుండి మెయిన్‌రోడ్డు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. గ్రావెల్ రోడ్డయినా బాగానే ఉంటుంది.

ఊరు వదిలి సగం దూరం వస్తూండగా సడెన్‌గా రోడ్డుమీద ప్రత్యక్ష మయ్యాడు ఆగంతకుడు. వాడి తీరుచూస్తే ఉదయం నుంచి తమ కోసం వాడక్కడ కాపువేసుక్కూచున్నాడనిపిస్తోంది.

కాని వాడిని ఎప్పుడూ చూసిన గుర్తులేదు.

సుమారు తన వయసే ఉండొచ్చు.

అది కూడా కాదు. వాడిచేతిలో రివాల్వర్ ఉంది. అది తమ వంక గురి చేయబడుంది.

"ఆపు... బైక్ ఆపు...." కరుగ్గా అరిచాడు వాడు.

"వద్దు సార్. వాడి చేతిలో రివాల్వరుంది. వేగంగా పోనీండి" వెనక వున్న అప్పన్న భయంతో అరిచాడు.

"వెనుకనుంచయినా వాడు కాల్చేస్తాడు రా" అన్నాడు చరక్.

"అయితే వెనక్కి తిప్పండి పారిపోదాం"

"అంత టైమ్ లేదు" అంటూ బైక్ స్లో చేశాడు చరక్. ఆగంతకుడికి పదడుగుల ఇవతలగా ఆగింది బైక్. అప్పన్న భయంతో బైక్ నుంచి దూకి-వచ్చిన దారినే దూరంగా వెనక్కి పరుగెత్తాడు.

"చరక్ నువ్వేనా?" కటువుగా అడిగాడు యువకుడు.

"నేను కాదు. ఆ పారిపోతున్న వాడు చరక్" అబద్ధం చెప్పాడు.

"కాదు. నిన్న నేను నిన్ను చూశాను. నువ్వు చరక్. ఆ పారిపోతున్నవాడు మీ నౌకరు"

"తెలుసు కదా. ఈ మీటింగ్ దేనికి?" అడిగాడు చరక్.

"నిన్ను చంపటానికి. ఇష్టదైవాన్ని ప్రార్థించుకో. కాల్చేస్తాను"

చరక్ బైక్ దిగి స్టాండ్ వేశాడు. "చూస్తున్నావుగా. నిరాయుధుడ్ని. ఇప్పుడయినా కాల్చొచ్చు.

కాస్సేపాగయినా కాల్చొచ్చు. కాని కాల్చేముందు మనిద్దరికీ గొడవేమిటో, నువ్వెందుకు నన్ను చంపబోతున్నావో నాకు తెలియాలి గదా.

కనీసం నీ ముఖం కూడా ఎప్పుడూ చూసిన గుర్తులేదే. తొందరగా చెప్పేశావనుకో, వెంటనే నువ్వు నన్ను చంపి వెళ్ళిపోవచ్చు. టకటకా చెప్పెయ్ మరి"

చరక్ మాటలు ఆ యువకుడి మీద – మంత్రంలా పనిచేశాయి.

చరక్‌ను కనబడగానే కాల్చేస్తానని గురువు దగ్గర బీరాలు పలికినవాడు కాస్తా చరక్ మాటల గారడీలో ఆ పని చేయకుండా ఆగాడు. చచ్చేవాడి చివరి కోరిక తీర్చటం న్యాయమన్పించింది.

"అసలు నిన్నే నువ్వు చావాల్సినవాడివిరా. ద్వారపూడి నుంచి నిన్ను ఫాలో అయ్యాం. సామర్లకోటలో సాధ్యంకాలేదు. కాకినాడ వీధుల్లో మీ కారును మిస్సయి చివరకు బీచ్ రోడ్‌లో పట్టుకున్నాం. మీరు బయలుదేరిపోయారు.

ద్రాక్షారామంలో గుడిదగ్గర వేసేయాలనిచూస్తే మా వాడి గురికి దానికదే ఒక కారు ముందుకొచ్చి అడ్డంబడింది. రెండో ప్రయత్నంలో ఓ వీధికుక్క వాడి చేయి కరిచింది.

మా గురువుగారు కాల్చబోతే వెనుక ఆగున్న లారీ మా వ్యాన్‌ని వచ్చి గుద్ది చెడగొట్టింది.

అదృష్టవంతుడివి. ఆ మిత్రవింద పక్కనుంది గాబట్టి నిన్న బతికిపోయావ్. మావాడు కుక్క కరిచిందానికి బొడ్డుమీద ఇంజక్షన్ చేయించుకుని చేతికి కుట్లు వేయించుకోవాల్సివచ్చింది. ఇక ఇప్పుడు తప్పించుకోలేవు" అంటూ నవ్వాడు వాడు.

వాడి మాటలు వింటుంటే నిన్న తమ కారును ఫాలో చేసిన నల్లని స్కార్పియో వ్యాన్ చరక్ కళ్ళముందు మెదిలింది. తనకు తెలీకుండా నిన్న తన వెనక ఇంత గోల జరిగిందా! మిత్రవింద వీళ్ళ బారి నుంచి తనను కాపాడిందా ఐతే వీళ్ళెవరు?

"ఏరా... నీ పేరేమిటి?" అడిగాడు.

"గంగారాం."

"చూడు గంగారాం. ఇంతకీ మీరెవరు? ఎంతమంది వచ్చారు? ఆ సంగతి చెప్పవేమిటి?"

"ఇంకా అర్థంకాలేదా? మహా మాంత్రికుడు మరిడి సోమయ్య మా గురువు. మృణాళుడు నేను ఆయన శిష్యులం. నిన్ను చంపటం కోసమే జాజ్‌పూర్ దగ్గర నీలోదరి కొండగుట్ట నుండి బయలుదేరి వచ్చాం. ఇంకా ఏం చెప్పాలి?"

చరక్‌కి మబ్బు వీడిపోయింది. ఐతే తనను ఎందుకు చంపాలను కుంటున్నారో అర్థంకాలేదు.

తల తిప్పి అప్పన్నకోసం చూశాడు. వాడు ఎక్కడో ఫర్లాంగు దూరం పారిపోయి ఆగి భయం భయంగా ఇటే చూస్తున్నాడు. గంగారాంను చూశాడు. ఎత్తిన రివాల్వర్‌ను దించటంలేదు వాడు.

పరిసరాల్లో ఎక్కడా మనిషన్నవాడు లేడు. పక్కన కొబ్బరితోటలో కొన్ని ఆవులు పచ్చిక మేస్తున్నాయి. వాటిలో నల్లని కర్రావు ఒకటి మెడలో గంట చప్పుడు చేస్తూండగా మోరచాపి ఇటే చూస్తోంది.

"ఇంకేం వద్దు నాకు అర్థమైపోయింది గాని చివరిగా ఈ ఒక్కప్రశ్నకు బదులు చెప్పు చాలు. తర్వాత కాల్చెయ్" అన్నాడు.

"అడుగు ఏమిటది?" ఉత్సాహంగా అరిచాడు గంగారాం. చరక్‌ను చంపి గురువు మెప్పును పొందబోతున్న ఆనందం వాడి ముఖంలో కన్పిస్తోంది.

"ఏం లేదు. అసలు నీ గురువు ముఖమే నాకు తెలీదు. అలాంటిది ఆయన నన్ను ఎందుకు చంపటం? నా చావునెందుకు కోరుకుంటున్నాడు?"

"అంత లోతు విషయాలు నాకు తెలీదుగాని ఇక చచ్చిపో... టైమై పోయింది" అంటూ రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కాడు గంగారాం. "ధన్" మంటూ శబ్దం వచ్చింది. చివరిక్షణంలో ఎగిరి పక్కకు దూకాడు చరక్. బుల్లెట్ చరక్ భుజాల్ని రాసుకుంటూ పోయింది. రెండోరౌండ్ షూట్ చేయబోయాడు గంగారాం. కాని వాడికా అవకాశం రాలేదు. సమీపంలోని కర్రావు కన్ను మూసి తెరిచేలోన వచ్చి గంగారాంని కొమ్ముల మీద ఎత్తి అవతలకు విసిరేసింది.

ఊహించని పరిణామానికి భయంతో కెవ్వున అరిచాడు గంగారాం. వాడి రివాల్వర్ ఎగిరివచ్చి చరక్ కాళ్ళదగ్గర పడింది.

జరిగిన సంఘటనకి బాధితుడు గంగారాం మాత్రమే కాదు. చూస్తున్న చరక్ కూడా దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వాడ్ని ఎత్తి కిందపడేయటంతో వదల్లేదా ఆవు. కొమ్ములతో నేలమీద దొర్లించి దొర్లించి కాళ్ళతో మట్టిగించేస్తుంటే బాధతో గావు కేకలు పెట్టాడు గంగారాం.

ఒంటో ఎముకలు విరిగాయో కండలు చితికాయో తెలీదుగాని క్షణాల్లోనే వాడి పరిస్థితి దారుణంగా మారిపోయింది. బట్టలు చినిగి పీలకలై రక్తసిక్త

మయ్యాయి. అంతటితో చాలనుకుందో ఏమిటోగాని ఆ గోమాత వాడ్ని వదిలేసి తన దారిన కొబ్బరితోటలోని మిగిలిన ఆవుల వద్దకు పరుగెత్తింది.

బాధతో అరుస్తూ నేలమీద పొర్లిగింతలు పెడుతున్న గంగారాంని కొద్దిక్షణాలు ఆశ్చర్యంతో చూస్తూండిపోయాడు చరక్. అతనికేమీ అర్థం గావడం లేదు.

ఇది కూడా మిత్రవింద పనేనా? తనను కాపాడడం కోసం ఒక సాధారణ ఆవు రావటం ఏమిటి?

రివాల్వర్ పేలితే బుల్లెట్ ప్రాణం తీస్తుందని ఆవుకి తెలుసా? అసలు తనను కాపాడాలన్న ఆలోచన దానికి ఎలావచ్చింది?

దీని వెనుక ప్రేరణ ఎవరు? మిత్రవింద ఇంట్లోనే ఉంది గదా. ఎక్కడో ఉండి కూడ తన కదలికల్ని ఎలా తెలుసుకుంటోంది. లేక అదృశ్యరూపంలో తనని నీడలా అనుసరిస్తోందా!

మిత్రవింద తన పక్కన లేకపోతే సులువుగా తనను చంపేయవచ్చని ఇక్కడ కాపుకాశాడు వీడు. కాని పక్కనలేకపోయినా వాడికి పరాభవం తప్పలేదు. "మిత్రా... ఏయ్ మిత్రవిందా... ఎక్కడున్నావ్?" సందేహ నివృత్తికి పిలిచి చూశాడు.

సమాధానం రాలేదు గాని అతడి చెవులకు వీణ మీటినట్టు మృదువైన మిత్రవింద నవ్వు విన్పించింది. అంతే– చరక్ అనుమానం తీరిపోయింది. ఇది మిత్రవింద మాయాజాలమే.

వంగి కాళ్ళదగ్గర పడున్న రివాల్వర్ తీసుకున్నాడు. గంగారాం వద్దకెళ్ళి రివాల్వర్ గురిపెట్టాడు.

వాడు ప్రాణభయంతో రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు. శక్తిలేదుగాని వుంటే లేచిపారిపోయేవాడే. "నిజం చెప్పరా. నిన్ను ప్రాణాలతో వదిలేస్తాను. నీ గురువు నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నాడు?" అడిగాడు చరక్.

"నన్ను నమ్ము సరైన కారణమైతే నాకు తెలీదు కాని అగ్నివేశాచార్యుల వారి ఆశయమేదో ఉందట. అది జరక్కుండా ఆపాలంటే నిన్ను చంపేయటమే మార్గమని అందుకే చంపాలనుకుంటున్నట్టు తెలిసింది"

"నిన్ను చంపి మిత్రవిందను ఎత్తుకెళ్ళే ఉద్దేశంతో వచ్చాడు" అని మాత్రం చెప్పలేదు. చెప్తే చరక్ ఎలా స్పందించే వాడో తెలీదు.

కాని గంగారాం మాటల్ని నమ్మాడు.

దీన్నిబట్టి చూస్తే మరిడి సోమయ్యకు తమ విషయాలు చాలానే తెలుసని అర్థమతోంది.

"ప్రస్తుతం వాడు ఎక్కడ ఉన్నాడు?? అడిగాడు చరక్. "మండపేట లాడ్జిలో"

"సరి. వెనక్కిపోయి వాడితో చెప్పు. తక్షణం ఈ ప్రాంతం వదిలిపొమ్మను. లేదంటే మీరెవరూ తిరిగి నీలోదరికి ప్రాణాలతో పోలేరు" ఇంతలో పారిపోయిన అప్పన్న వెనక్కి తిరిగి వచ్చాడు. తమ బైక్ మీద కాకినాడ బయలుదేరారు ఇద్దరూ.

*　　*　　*　　*　　*

కోరుకొండ... ఎస్టేట్ భవంతి...

అప్పటికే నాలుగు ఎకరాల స్థలంలో చెట్లన్నీ నరికి తొలగించారు. భూమిలోని భాగాల్ని కూడా నరికి, కోసి వాటిని తొలగించి భూమిని చదునుచేసే పనిలో అనేక మంది కూలీలు బిజీగా ఉన్నారు.

భవంతిలోని హాల్లో సోఫాలో కూర్చునున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఆయనకి ఎదురుగా సోఫాలో కూర్చునున్నారు ఇద్దరు వ్యక్తులు. ఇద్దరూ మహాశిల్పులే.

ఆ ఇద్దరిలో ఒకరు తమిళనాడుకు చెందిన స్థపతి పెరుమాళ్. ఆయన వయసు డెబ్భై సంవత్సరాలు.

ఐదున్నరడుగుల ఎత్తున కాస్త లావుగా ఉన్నాడు. గడ్డం మీసాలు జుత్తు ముగ్గుబుట్టలా తెల్లబడిపోయాయి. నుదుట కుంకుమ బొట్టుతోబాటు విభూది రేఖలు ధరించాడు. తెల్లటి సిల్కు లుంగీ, షర్టు ధరించి చాలా సింపుల్‌గా ఉన్నాడు. ఇప్పటికీ ఆయనకి కళ్ళజోడుతో పనిలేదు. పనిపట్ల అంకిత భావం కలిగిన గొప్ప శిల్పి.

రెండోవ్యక్తి కాస్త చామనచాయగా ఆరడుగుల పొడవున సన్నగా ఉన్నాడు. ఇంచుమించు పెరుమాళ్ స్థపతి వయసుంటుంది. అచ్చమైన ఆంధ్రాపద్ధతిలో మల్లుపంచె, సిల్కు జుబ్బా ధరించి కళ్ళజోడు పెట్టుకున్నాడు. నుదుట కుంకుమ బొట్టు చాలా ప్రశాంతంగా, నీట్‌గా ఉన్నాడు.

ఆయనే శ్రీశైలానికి చెందిన శంకర నారాయణ స్థపతి. గొప్ప శిల్పా చార్యుడు. ఆ ఇద్దరి శిష్యులు అరుగురు బయట వెయిట్ చేస్తున్నారు.

అప్పటికే ఆలయనిర్మాణానికి ఉద్దేశించిన తోటలోని స్థలాన్ని పరిశీలించి వచ్చారు.

ఇప్పుడు అగ్నివేశాచార్యుడు ఇచ్చిన శ్రీకృష్ణులవారి ఫోటోలు చెరొకటి ఇచ్చున్నాడు. ఆ ఫోటోని ఇద్దరూ పరిశీలనగా చూస్తున్నారు.

"ఇది చాలా అరుదైన చిత్రం. ఇలాంటి చిత్రాన్ని ఇంతవరకూ నేను ఎక్కడా చూళ్ళేదు ఆచార్యా" అన్నాడు శంకరనారాయణ స్థపతి.

"చెప్పండి ఆచార్యా... ఈ చిత్రం ఎక్కడిది?" అన్నాడు పెరుమాళ్ స్థపతి.

"మీరే కాదు. ఎవరూ చూసి ఉండరు. ఎందుకంటే ఇది చాలా అరుదైన చిత్రం. శ్రీకృష్ణప్రభువుల అసలు రూపం గల చిత్రం. ఇది ఎలా వచ్చిందని అడగొద్దు. ఇది మనవద్ద ఉందనీ ఎవరికీ చెప్పొద్దు.

మీ వద్ద భద్రంగా ఉంచాలి. ఇదే ముఖవర్చస్సుతో ఆలయంలోని మూలవిరాట్టు విగ్రహం తయారవ్వాలి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"ఆచార్యా! మీరేమో ఇప్పుడు ద్వారకలో ఉన్న ద్వారకాదీష్ గుడిలా ఉండా లంటున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం ఉత్తరాది ఆలయ నిర్మాణాలశైలికి దక్షిణాది ఆలయ నిర్మాణాలశైలికి తేడా ఉంటుంది. మీకు తెలీని విషయం కాదు.

మన దక్షిణాది శైలిలోనే ఆలయ నిర్మాణం జరిగితే బాగుంటుందేమో ఆలోచించండి" అన్నాడు శంకరనారాయణ స్థపతి.

"నాకు తెలుసయ్యా. అలా అనుకుంటే కేరళ ఆలయాల శైలి మరీ భిన్నం గదా. ఇంటికీ గుడికీ తేడా తెలీదు. ఆ యా ప్రాంతాలను బట్టి నిర్మాణశైలి ఉంటుంది. కాని నేను కోరేది వేణుగోపాలుడి ఆలయమో, రాధాకృష్ణుల ఆలయామో కాదు. "ద్వారకాధీష్" ఆలయం. కాబట్టి అలాగే నిర్మాణశైలీ ఉండాలి.

నేను గతంలో ద్వారక వెళ్ళినప్పుడు ద్వారకాధీష్ ఆలయాన్ని దర్శించాను. ఆలయం గోమతీనదీ తీరం నుండి 56 మెట్లు ఎక్కి లోన ప్రవేశించాలి.

ద్వారకాధీష్ మూలవిరాట్టు పశ్చిమాభిముఖంగా ఉంటాడు.

ఇక్కడ మనం నిర్మించే ఆలయంలో తూర్పు అభిముఖంగా అనుకూలంగా ఉంటుంది. అందువల్ల సమస్యలేమన్నా వుంటాయా?" అడిగాడు అగ్ని వేశాచార్యుడు.

"సమస్యలని కాదుగాని, వాస్తవాన్ని మనం చర్చించాలి గదా. ఆలయ పుష్కరిణి కూడా తప్పనిసరిగా తూర్పుముఖంగానే ఉండాలి. ఇకపోతే ఇక్కడ స్థలాన్ని అనుసరించి ఎలా ఉంటే బాగుంటుందో చెప్తున్నాను.

అయితే ఇక్కడ మీరు ఓ విషయం గమనించారో లేదో, మీ స్థలాన్ని ఆనుకుని పక్కన సుమారు ఎకరం వరకు మెయిన్‌రోడ్డును ఆనుకుని వున్న పెద్ద నీటిగుంట నిరుపయోగంగా ఉంది. మీరు గనుక పంచాయితీ నుండి ఆ గుంటను కొనుగోలు చేస్తే దాన్ని చుట్టూ రాతికట్టడంతో చక్కని పుష్కరిణిగా అభివృద్ధి చేయవచ్చు" అన్నాడు శంకరనారాయణ స్థపతి.

"ఈ సలహా బాగుంది. అలాగే చేద్దాం. ఈ ఆలయం దక్షిణాదిన ద్వారకాధీశుని మొదటి ఆలయం అవుతుంది. స్వామిని తూర్పుముఖంగానే ప్రతిష్ఠించాలి. ద్వారకలోని ద్వారకాధీశ్ ఆలయ సముదాయంలో ఇంకా దేవకీజీ ఆలయం– పురుషోత్తమ్‌జీ ఆలయం, ప్రద్యుమ్న ఆలయం– వేణుమాధవ్ ఆలయం ఇంకా మరికొన్ని ఆలయాలున్నాయి.

అయితే మనమిక్కడ నిర్మించేది ఒక్క ద్వారకాధీశ్ ఆలయం మాత్రమే. అదే ప్రధానాలయం.

ఆలయ సముదాయం కాదు. ద్వారకానగర అధిపతి ఆ శ్రీకృష్ణ భగవానుడు, ద్వారకాధీశుడు మహా మహా శక్తివంతుడు. ప్రస్తుతం మన లక్ష్యం ద్వారకాధీష్ ఆలయ నిర్మాణం వరకే.

ఇక చిన్న చిన్న గుడులు, ఆలయ క్షేత్ర పాలుడు ఎవరనే విషయాలు తర్వాత ఆలోచిద్దాం. ఆలయం ద్వారకలాగే ఉండాలి.

మూలవిరాట్టునుబట్టి ఎత్తు, చుట్టుకొలతలు, ముఖమండపం, గర్భగుడి పరిమాణం ఇవన్నీ ఆగమశాస్త్ర ప్రకారం నిర్ణయించి నిర్మించాల్సింది మీరు. ఎక్కడా వాస్తుదోషం ఉండకూడదు" అంటూ వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"ఆచార్యా... మేం ద్వారక వెళ్ళి పూర్తి సమాచారంతో తిరిగిరాగానే ఆ విషయాలు చర్చిద్దాం" అన్నాడు శంకరనారాయణ స్థపతి.

"అలాగే చేద్దాం... మీ ప్రయాణానికి ఏర్పాట్లన్నీ సిద్ధంగా ఉన్నాయి. కాస్సేపట్లో మినీ బస్ వస్తుంది. క్షేమంగా వెళ్ళి లాభంగా రండి...." అన్నాడు అగ్నివేశాచార్యుడు. ఇద్దరూ అంగీకారంగానే తలవూపారు.

"భవిష్యతరాలు ద్వారకను మర్చిపోకూడదన్న ఆలోచనతో శ్రీకృష్ణుని మునిమనవడు వజ్రనాభుడు ఇప్పుడున్న ద్వారకను నిర్మించాడు. అలాగే ద్వారకాధీష్ ఆలయాన్ని నిర్మింపజేశాడు. ఆలయ సముదాయంలో శ్రీకృష్ణులవారి తల్లి దేవకీజీ ఆలయాన్ని, ప్రద్యుమ్నజీ ఆలయాన్ని ఇంకా మరికొన్నిటిని కట్టించాడు. అప్పట్నుంచి తిరిగి ద్వారకాపురి ప్రశస్తిలోకి వచ్చింది.

మీకు తెలుసో లేదో ఇప్పుడు వున్న ద్వారకాధీశ్ ఆలయం ఎనిమిదోది. అంటే కాలక్రమంలో ఆలయం శిధిలం కాగానే ఎనిమిదిసార్లు తిరిగి తిరిగి పునర్ నిర్మింపబడుతూ వచ్చింది"

"ఆచార్యా, శ్రీకృష్ణుని కొడుకుల్లో ప్రద్యుమ్నుడు ప్రముఖమైనవాడు. ప్రభావతీ ప్రద్యుమ్నుల ప్రణయగాధ మనకు తెలుసు. అలాగే మనవడు అనిరుద్ధుడు కూడా ప్రముఖుడే. ఉషా అనిరుద్ధుల ప్రణయగాధ లోక ప్రసిద్ధం. శ్రీకృష్ణుని కొడుకులు, మనవళ్ళలో ఇంకా ప్రముఖులు ఎవరన్నా ఉన్నారా?" అడిగాడు స్థపతి శంకర నారాయణ.

"లేకేం శంకరనారాయణా. చాలామంది ఉన్నారు. కాని నువ్వు శ్రీకృష్ణుని కొడుకు సాంబుణ్ణి మర్చిపోతున్నావ్. సాంబుడికి చెప్పుకోతగ్గ ప్రణయగాధ ఉన్నట్టు లేదు. కాని ప్రముఖంగా చెప్పుకోవలసిన వాడు. శ్రీకృష్ణుని అష్టభార్యల్లో ఒకరయిన జాంబవతి కొడుకు. అష్ట భార్యల్లో అందరూ క్షత్రియ కన్యలు కాగా ఒక్క జాంబవతి మాత్రం క్షత్రియకన్య కాదు. జాంబవంతుని పెంపుడు కూతురు.

ప్రద్యుమ్నాది ఇతర కుమారులు అంతా మహావీరులు. సాంబుడూ వీరుడేగాని ఆకతాయిలతో చేరి అల్లరిచిల్లరగా తిరిగేవాడు.

పెద్దలయెడ గౌరవభావం ఉండేది కాదు. ఒకసారి ఏకాంత సమయంలో తన మందిరంలో ప్రవేశించిన సాంబుడిమీద ఆగ్రహించిన కృష్ణుడు నీ అవిధేయత

క్షమించరానిది. మహావ్యాధిగ్రస్తుడివి కమ్మని శపించాడు. మహావ్యాధి అనగా కుష్ఠువాధి.

ఇదే విధంగా శ్రీ కృష్ణుని శాపవశాన కుష్ఠువ్యాధి గ్రస్తుడయిన మరో ప్రముఖ వీరుడు ద్రోణాచార్యుని కుమారుడైన అశ్వత్థామ. పాండవ వంశాన్ని నిర్వీర్యం చేయాలన్న దుర్బుద్ధితో ఉత్తర గర్భస్థ శిశువుపై బాణ ప్రయోగం చేసి శాపగ్రస్తుడయ్యాడు.

నిజానికి అశ్వత్థామ చిరంజీవుల్లో ఒకడు. తనకు చిరంజీవి అగు కొడుకును ప్రసాదించమని శివుని వరమడిగి అశ్వత్థామను కుమారుడిగా పొందాడు ద్రోణుడు. కృష్ణశాపవశాన అతను చిరంజీవైనా కలియుగాంతం వరకు మహావ్యాధితో బాధలుపడక తప్పదు.

ఇక సాంబుడి విషయానికొస్తే తండ్రి మాధవుని సలహామేరకు శాపవిమోచన కోసం కాశీ వెళ్ళి అక్కడ సూర్యనారాయణ మూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిష్ఠతో తపస్సు చేయగా సూర్యుడి అనుగ్రహంతో అచట ఒక జలాశయం ఏర్పడింది.

సూర్యుని ఆనతిమేరకు సాంబుడు ఆ జలాశయంలో స్నానం చేయగా అతని కుష్ఠువ్యాధి తొలగి ఎప్పటిలా పూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. ఆ విధంగా తండ్రి శాపంనుంచి విముక్తి పొందగలిగాడు.

ఇప్పటికీ కాశీలో సాంబుడి సూర్య దేవాలయం ప్రసిద్ధమయినది. అచటి జలాశయాన్ని సూర్యకుండ్ అంటారు. ఆ జలాశయం నీటిలో చర్మవ్యాధుల్ని కుదిర్చే అద్భుతగుణముందని నిరూపించబడింది.

నేటికీ ఎందరో చర్మవ్యాధిగ్రస్తులు అచటి "సూర్యకుండ్"లో స్నానం చేసి సూర్యనారాయణమూర్తిని దర్శించి అర్చిస్తుంటారు.

సాంబుణ్ణి గుర్తుంచుకోవలసిన మరో ముఖ్య సంఘటన– ఈ సాంబుడి నుండే ముసలం పుట్టి (రోకలి) యాదవ కులక్షయానికి కారణమైంది.

లోక ప్రసద్ధమయిన ఈ ఘటన గురించి మీకు ప్రత్యేకించి చెప్పక్కర్లేదను కుంటాను" అంటూ వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులు ఓడిపోయారు. అందుకు కారణం యుద్ధానికి ముందు బలి సరిలేనందువల్లే ఓడిపోయారంటారు"

"ఈ విషయాన్ని కొన్ని పురాణాలు ప్రస్తావించాయి పెరుమాళ్ అనుకున్నట్టు బర్బరీకుడ్ని తామే ముందు బలిస్తే గెలిచేవారేమో. కాని కృష్ణుని మాయాజాలంతో బర్బరీకుడ్ని పాండవుల పక్షాన బలివ్వటం జరిగింది.

అయితే కేవలం బలి కారణంవలనే విజయాన్ని పొందలేదు పాండవులు. ధర్మపక్షపాతి అయిన కృష్ణుడు తమపక్షాన ఉన్నందున గెలిచారు.

"అవునూ. మీరు గతంలో ద్వారక వెళ్ళారు గదా. అప్పుడు అక్కడ హర్షద మాత ఆలయాన్ని దర్శించారా...?" అని అడిగాడు అగ్నివేశాచార్యుడు.

అగ్నివేశాచార్యుని ప్రశ్నవిని– ముఖముఖాలు చూసుకున్నారిద్దరూ.

"ఆ అమ్మవారి పేరు కూడా వినలేదు" అన్నాడు శంకరనారాయణ.

"ద్వారక నుండి అరవై కిలోమీటర్ల దక్షిణంగా ఒక కొండమీద ఉంది ఈ హర్షదమాత ఆలయం. చాలా శక్తివంతమైన అమ్మవారు. పురాతన దేవత.

ఈ అమ్మవారి పేరున తమ బిడ్డలకు పేర్లు పెట్టుకుంటారు. ఈ అమ్మవారి ఆలయం వున్న కొండ దిగువన సూర్యదేవాలయం కూడా పురాతన ప్రసిద్ధమయినది. ఇక్కడికి సమీపంలోని వర్తునది వచ్చి అరేబియా సముద్రంలో కలుస్తుంది.

ఇక హర్షదమాత స్థలపురాణం ప్రకారం సరికాసురుడనే రాక్షసుడు సముద్రం మీద సంచరిస్తూ సముద్రయానం చేసే యాదవుల్ని బాధించి నానా ఇబ్బందులకు గురిచేసి వినోదించేవాడు.

వాడి బాధలు పడలేక యాదవులు శ్రీకృష్ణునికి మొరపెట్టుకోగా ఆయన సరికాసురుడ్ని వధించాడట. అలా రాక్షసుని సంహరించటంలో ఈ అమ్మవారు హర్షదమాత శ్రీకృష్ణులవారికి సాయం చేసిందట.

స్వయంగా ఆ మాధవుడే ఆ కొండమీద అమ్మవారికి ఆలయం నిర్మింప జేశాడని స్థలపురాణ గాథ. వర్తునది ఎడమపక్క తీరంలో "మియాని" అనే ఊరు ఉంది. ఇది అతిపురాతన చరిత్ర కలిగిన ఊరు.

పూర్వం ఇది సముద్ర దొంగలకి ఆవాసంగా ఉండేది. వాళ్ళు అపహరించిన ఓడల్ని వర్తునది గుండా మియానికి తీసుకునివచ్చి వాటిలోని సరుకు దించుకున్నాక ఓడల్ని అక్కడే నదిలో ముంచేసేవారట.

కాలక్రమంలో మియాని దేవాలయాల నగరంగా ప్రసిద్ధిచెందింది. పూర్వం గుప్తుల కాలంలోను సోలంకి కాలంలోని ఎన్నో గుడులు ఇతర ఆధారాలను పందొమ్మిది వందల అరవై ఎనిమిదిలో వచ్చిన సునామీ తుడిచేసింది. దాంతో మియానికి చెందిన చాలా ప్రాచీన చరిత్ర మరుగునపడిపోయింది.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే ద్వారక వెళ్తే చూడాల్సింది ద్వారక ఒకటే కాదు. చుట్టుపక్కల ప్రసిద్ధి చెందిన ఆలయాలు, చరిత్ర ప్రసిద్ధి చెందిన స్థలాలు అనేకం ఉన్నాయి.

ద్వారక నుండి ప్రభాస తీర్థందుగా సోమనాథ ఆలయంవరకు ప్రయాణించినా చాలు. ఎన్నో పుణ్యక్షేత్రాల్ని దర్శించవచ్చు. చూడాలనుకుంటే ఒక వారం ఆగి అన్నీ చూసిరండి.

మీకోసం బస్ ఏర్పాటు చేశాను. డబ్బుకి సమస్య లేదు గాబట్టి, హ్యాపీగా చూడండి. అలాగని ఆలస్యము చేయవద్దు.

నేను మీకోసం ఎదురు చూస్తూ ఇక్కడే ఉంటాను. ఫోన్‌లో టచ్‌లో ఉండండి" అంటూ అన్ని విషయాల్ని విపులంగా వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"ఆచార్యా... మీరు మాకు ఇంతగా చెప్పాలా. ముందు వెళుతున్న పని చూశాకనే సమయము ఉంటే మిగిలిన క్షేత్రాలు దర్శించివస్తాం" అన్నాడు శంకర నారాయణ.

అంతలో బయట మినీ బస్ వచ్చిన అలికిడి వినబడింది. అంతా బయలు దేరారు.

అగ్నివేశాచార్యుడు బయటికి వచ్చాడు. పెరుమాళ్ స్థపతి, శంకర నారాయణ స్థపతి బస్ ఎక్కారు. వారి శిష్యులు తమ లగేజీని బస్ డిక్కీలోకి చేర్చి తరువాత వాళ్ళుకూడా బస్ ఎక్కారు.

వారిని సాగనంపి బస్ గేటుదాటేవరకూ ఆగి వెను తిరిగాడు అగ్ని వేశాచార్యుడు.

* * * * *

"పరాభవం... సహింపరాని ఘోరపరాభవం. చచ్చు వెధవలు. చేతగాని దద్దమ్మలు. మీలాంటి శిష్యులను నమ్ముకుంటే నాకు ఇలాంటి పరాభవాలు తప్పవు...." అటూ ఇటూ పచార్లు చేస్తూ– కోపంతో శిష్యులమీద అరుస్తున్నాడు మరిడి సోమయ్య.

అతడి అరుపులతో తమకు సంబంధం లేనట్టు ఒకపక్క మృణాళుడు. మరోపక్క గంగారాం సోఫాలకు జేరబడి నేలమీద కూర్చునున్నారు. మృణాళుడు కుక్క కరిచిన చేతిగాయంతో బాధపడుతున్నాడు. గంగారాంకి ఒళ్ళంతా బ్యాండేజీలున్నాయి.

ఆటోలో లాడ్జికి తిరిగివచ్చిన గంగారాం పరిస్థితి చూడగానే వెంటనే వాడ్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి ట్రీట్‌మెంట్ ఇప్పించారు. జరిగిందంతా గురువుకి నివేదించాడు గంగారాం. మరిడి సోమయ్య ఓటమిని తట్టుకోలేక అరుస్తున్నాడు.

"కోప్పడకండి గురువుగారూ, జరిగిందాంట్లో మా ప్రయత్న లోపం లేదని మీకూ తెలుసు...." అన్నాడు మృణాళుడు నెమ్మదిగా.

"కోప్పడకుండా ఎలా ఉండమంటావ్‌రా!" పెద్దగా అరిచాడు మరిడి సోమయ్య.

"నువ్వు చూస్తే కుక్కచేత కరిపించుక్కూచున్నావ్. వీడు చూస్తే ఆవుచేత కుమ్మించుకుని వచ్చాడు. ఎందుకు పనికొస్తారు మీరు? ఆ చరక్ నిక్షేపంగా బతికేవున్నాడు. ఇందుకేనా మనం వచ్చింది...." అని అన్నాడు మరిడి సోమయ్య ఆగ్రహంగా.

"ఆ మాటకు వస్తే మీ ప్రయత్నం కూడా ఫెయిలయింది. ఏం చేస్తాం? నన్నడిగితే మనం బయలుదేరిన ముహూర్తమే సరిలేనట్టుంది గురువుగారూ" అని అన్నాడు గంగారాం.

"అవును. ఆ అఘోరా పెట్టిన ముహూర్తం గదా. అందుకే ఇలా అఘోరించింది" అంటూ గంగారాంని సమర్థించాడు మృణాళుడు.

"అయితే ఏం చేద్దాంరా. వెనక్కి వెళ్ళిపోయి మరోసారి వద్దామంటారా? చచ్చువెధవల్లారా, ఓడిపోయి ఏ ముఖం పెట్టుకుని వెళ్తాంరా?"

"అదికాదు గురువుగారూ...."

"ఇంకేం చెప్పకండి. పరిస్థితి చూస్తూంటే ముందు మనం అంతు చూడాల్సింది ఆ చరక్‌ని కాదు, మిత్రవిందని. ఆ పిల్ల రక్షగా ఉండగా వాడ్ని

మనం ఏమీ చేయలేం. ముందు ఆ అమ్మాయిని బంధించి ఆ తర్వాత చరక్‌ని చంపాలి. ఇక మీవల్లకాదు.

రేపు ఉదయం స్వయంగా నేనే బయలుదేరతాను. మిత్రవిందను పట్టి బంధించి తెస్తాను. నా మంత్రశక్తి ప్రభావం ఏమిటో మిత్రవిందకు తెలిసిరావాలి. ఉదయం చీకటితోనే మున్నలూరివారి అగ్రహారం వెళ్తున్నాం. మీరూ నాతో వస్తున్నారు." అన్నాడు.

*　　*　　*　　*　　*

ఆ రోజు–

తెలతెలవారుతున్న వేళ.

మున్నలూరివారి అగ్రహారం ఇంకా నిద్రమత్తులోనే ఉంది. వేసవి ఆరంభ దినాలు మొదలయిపోయాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గుతూ గాలి పొడిబారుతోంది. కాని చిరుగాలులు ఆహ్లాద భరితంగా వీస్తున్నాయి.

ఆ సమయంలో–

ఒక జంగమదేవర అగ్రహారంలో ప్రవేశించాడు. గంట వాయించి శంఖం ఊదుతూ ప్రతి ఇంటి ముందూ భిక్ష అడుగుతున్నాడు.

"సంక్రాంతి నెల్లో రావలసిన జంగమయ్య ఇప్పుడు వచ్చాడు ఏమిట్రా బాబు నిద్రలు పాడుచేయటానికి" అంటూ మంచాలు దిగకుండానే విసుక్కుంటున్నారు కొందరు.

భిక్ష వేసినవాళ్ళు వేస్తున్నారు. లేనివాళ్ళు లేదు. మూడు వీధులు తిరిగిన జంగమయ్య తొలి వెలుగు విచ్చుకొంటున్న వేళకి చరక్ ఇంటిగుమ్మం ముందు ఉన్నాడు. "భవతి భిక్షాందేహి" అంటూ గంట కొడుతూ బిగ్గరగా శంఖం ఊదాడు.

అప్పటికింకా తన గదిలో గాఢనిద్రలో ఉన్నాడు చరక్. శుశ్రుత అన్నంత పనీ చేసింది. ఎవరి గది వాళ్ళకి కేటాయించేసింది. దిగువన హాలునానుకొని ఎడం పక్క గది శుశ్రుతది, కుడిపక్క గది చరక్‌ది.

తెల్లారి ఏడైతేగాని లేచే అలవాటు చరక్‌కి లేదు. అగ్నివేశాచార్యుడు అగ్రహారంలో ఉంటే మాత్రం ఆయనకి భయపడి ఆరుగంటలకే లేచిపోతాడు.

శుశ్రుతకు తెల్లవారుజాము ఐదుగంటలకే లేచే అలవాటు. ముందుగా ఇల్లు వాకిలి శుభ్రం చేసుకుని వంటసామాన్లు తోమి సర్దుకున్నాక స్నానం చేసి

పూజముగించేసరికి ఉదయం ఆరుగంటలు దాటుతుంది. ఇక అప్పుడు వంటపనులు ఆరంభిస్తుంది.

పనిమనిషిని కాలు పెట్టనివ్వదు. తన పనులు తనే చేసుకోవటం అలవాటు. కిచెన్‌లో ఉన్న శుశ్రుత బైట జంగమయ్య అరుపులు విని స్టీలు పాత్రలో సోలెడు బియ్యం తీసుకుని భిక్షం వేయటానికి హాల్లోకొచ్చేసరికి విచిత్రంగా హాల్లో మిత్రవింద కనబడింది.

"అక్కా... ఏమిటే పొద్దుటే లేచిపోయావు. వస్తానుండు" అంటూ వీధి గుమ్మంవైపు పోతుంటే ఆపింది మిత్రవింద. "ఆగక్కా, నేవెళ్ళి భిక్షం వేసొస్తాగానీ కాస్త వేడి పాలు రెడీ చేసుంచు. ఆకలిగా ఉంది" అంటూ స్టీలు పాత్ర తను తీసుకుంది.

"సరి, త్వరగా రా...." అని అంటూ తిరిగి వంటగదిలోకి వెళ్ళిపోయింది సుశ్రుత.

మిత్రవింద వీధితలుపు తెరిచింది.

ఎదురుగా వాకిట్లో ఉన్న జంగమయ్యను చిరునవ్వుతో వీక్షిస్తూ బయటికి వచ్చింది.

అతను ఎవరో మిత్రవిందకు తెలుసు. వాడు నిజమయిన జంగమదేవర కాదు. ఆ వేషంలో వచ్చిన మాంత్రికుడు మరిడి సోమయ్య. భిక్ష వేయటానికి మిత్రవింద రావటం తన అదృష్టంగా భావించాడు వాడు. భిక్ష స్వీకరించటానికి జోలె చాపాడు.

మిత్రవింద జోలెలో బియ్యం పోసి స్టీలుపాత్రను అరుగుమీద ఉంచి– "జంగమయ్యా, నన్ను ఆశీర్వదించు" అంటూ నమస్కరించింది.

"సుఖీభవ" అంటూ ఆశీర్వదించిన జంగమయ్య వెంటనే తన మంత్ర దండం తీసి మిత్రవింద శిరస్సును తాకిస్తూ ఏదో మంత్రం చదివాడు. అంతే– కన్నుమూసి తెరిచేలోన మిత్రవింద ఒక అందమైన కుక్కపిల్లగా మారిపోయింది.

తెలతెలవారుతున్న వేళగాబట్టి ఈ సంఘటనను ఎవరూ చూడలేదు. విజయగర్వంతో వంగి కుక్కపిల్లను ఎత్తుకున్నాడు మరిడి సోమయ్య. కుక్కపిల్ల "కుయ్‌కుయ్" మంటూ తప్పించుకోవడానికి గింజుకుంటోంది.

"ఏమిటే మిత్రవిందా, ఇప్పటికైనా నా శక్తి ఏమిటో అర్థమయింది గదా, మన స్థావరానికి చేరేవరకు బుద్ధిగా ఉండు" అంటూ ఆ కుక్కపిల్లను తన జోలెలో వేసుకుని వడివడిగా గేటువైపు అడుగులు సారించాడు.

ఈలోపల– వేడిపాలు మిత్రవిందకోసం కాచి వుంచింది సుశ్రుత. కాని భిక్షం వేయటానికి వెళ్ళి ఎంతకూ లోనకు రాకపోవటంతో అనుమానం వచ్చి "అక్కా.. అక్కా" అని పిలుస్తూ బైటికొచ్చి చూసింది.

చూస్తే ఏముంది? అక్కడ జంగమదేవరా లేడు, మిత్రవిందా లేదు. అరుగుమీద ఖాళీ స్టీలు పాత్ర కనిపించింది. భిక్షం వేసి ఎక్కడికి వెళ్ళింది?

శుశ్రుత గబగబా మేడమీద గదిలోనికి వెళ్ళి చూసింది. అక్కడ మిత్రవింద లేదు. మళ్ళీ బయటికొచ్చింది. ఒకరిద్దర్ని అడిగిచూసింది. తమకు తెలీదన్నారు. శుశ్రుతలో కంగారు మొదలైంది.

వచ్చినవాడు నిజంగా జంగమదేవరేనా? లేక ఎవడన్నా మాయల మరాఠీ అయివుంటాడా... అయినా మిత్రవిందను మాయ చేయటం సాధ్యమా... ఏం జరిగి వుంటుంది? ఎక్కడికి వెళ్ళుంటుంది? శుశ్రుత పరుగున వెళ్ళి చరక్‌ను నిద్రలేపింది.

మిత్రవింద కన్పించటంలేదనగానే ఉలిక్కిపడ్డాడు చరక్. శుశ్రుత నుంచి జరిగిన సంఘటన వినగానే చప్పున ముఖం కడుక్కుని బట్టలేసుకున్నాడు.

"నేవ్వేం కంగారుపడకు. ఆ జంగమయ్య ఎటువెళ్ళాడో నేను చూసొస్తాను. ఎందుకయినా మంచిది. ఈ లోపల నువ్వు నాయనమ్మవద్దకు వెళ్ళి జరిగింది చెప్పు. వెంటనే జేజితాతకు ఫోన్ చేయమను" అంటూ సలహా ఇచ్చి బైక్ స్టార్ట్ చేశాడు.

శుశ్రుత దేవమ్మగారి వద్దకు పరుగెత్తింది. మిత్రవిందకేదో కీడు జరిగిందనే భయం. శుశ్రుతను నిలువనీయటంలేదు. కళ్ళలో నీరు సుడి తిరుగుతోంది. జరిగింది వినగానే దేవమ్మగారు వెంటనే మామగారు అగ్నివేశాచార్యునికి ఫోన్‌చేసి వివరంగా చెప్పింది.

అంతా విని నవ్వాడాయన.

"మిత్రవింద అగ్నిలో కాలిన బంగారమంత శుద్ధమైనది. హోమద్రవ్యంలా పవిత్రమైనది. యోగశక్తిలో అజేయమైనది. ఆమె గురించి అనవసరంగా వాళ్ళను కంగారుపడొద్దని చెప్పు. ఈ లోపల ఏం జరిగిందో నేను తెలుసుకుంటాను" అంటూ సలహా ఇచ్చాడు.

అదే విషయాన్ని చెప్పి శుశ్రుతకు ధైర్యం నూరిపోసింది దేవమ్మ. మిత్ర విందను గాలిస్తూ జంగమయ్య కోసం బయలు దేరిన చరక్ అగ్రహారంలోనూ, బయటా వీధులన్నీ తన బైక్‌మీద తిరిగి చూశాడు. ఎక్కడా జంగమయ్య జాడలేదు.

ఎవరినడిగినా తెలీదంటున్నారు. అప్పటికే బాగా తెల్లారిపోతోంది. ఇది ఖచ్చితంగా ఆ మరిడి సోమయ్యపనే అని చరక్ నమ్మకం. వాడే జంగమయ్య వేషంలో వచ్చి మిత్రవిందను మాయజేసి ఉండాలి. అయినా మిత్రవిందను మించిన శక్తి వాడికెక్కడిది?

పరిపరివిధాలా ఆలోచిస్తూ బైక్‌ను ఊరి బయటకు దూకించాడు చరక్. ఒక మలుపు తిరుగుతూండగా ఎగువ నుంచి భయంకరమైన ప్రేలుడు శబ్దం ఒకటి వినవచ్చింది. అదిరిపడి అటు చూసిన చరక్‌కి రోడ్డు మధ్యలో భగభగ మంటల మధ్య తగలబడిపోతూ కనిపించింది స్కార్పియో వ్యాను.

ఆ వ్యాను సమీపంలో నిలబడుంది మిత్రవింద. ఆమెకు ఎదురుగా జంగమయ్య. ప్రేలుడు శబ్దమింకా దిక్కులవెంట మారుమోగుతూనే వుంది. అప్రయత్నంగా బైక్‌ను దూరంలోనే ఆపేశాడు చరక్.

జంగమయ్య వేషంలోని మరిడి సోమయ్యకు చాలా ఆనందంగా ఉంది. ఇంత సులువుగా మిత్రవింద తన మంత్రశక్తికి లోబడి కుక్కపిల్లగా దొరికి పోతుందనుకోలేదు.

ఇక ఆమె అడ్డు తొలగిపోయినట్టే. చరక్‌ని తుదముట్టించటం ఇక క్షణాల మీద పని. ముందు కుక్క పిల్లగా మార్చిన మిత్రవిందను ఆమె కోలుకోకుండా అన్నివిధాలా దిగ్బంధించి ఆ తర్వాత చరక్ సంగతి చూడాలి. ఆలోచిస్తూనే అగ్రహారం గేటుదాటి ఊరిబయటకు నడిచిపోసాగాడు.

గ్రామ పొలిమేరలో ఆగుంది మరిడి సోమయ్యకు చెందిన స్కార్పియో వ్యాన్. శిష్యులు మృణాళుడుగాని, గంగారాం గాని డ్రైవింగ్ చేయగల స్థితిలో లేకపోవడంతో స్వయంగా తనే వ్యాన్‌ని డ్రైవ్ చేసుకొచ్చాడు మరిడి సోమయ్య.

వ్యాన్‌ను ఊరి పొలిమేరలోనే ఉంచి తను జంగమయ్య వేషంలో మున్నలూరి వారి అగ్రహారంలోకి కాలినడకన ప్రవేశించాడు. వచ్చిన పని

పూర్తయింది గాబట్టి వడివడిగా వ్యాన్‌వద్దకు సాగిపోతున్నాడు ఉత్సాహంగా. బాగా తెల్లారిపోతోంది.

* * * * *

కొత్త జంగమయ్య ఎవరో అర్ధంగాక – వింతగా చూస్తున్నారు కొందరు. క్రమంగా ఊరు దాటేశాడు మరిడి సోమయ్య. ఒక మలుపు తిరగ్గానే అంత దూరంలో కన్పించింది తన స్కార్పియోవ్యాను. వడివడిగా నడుస్తున్న వాడు కాస్తా ఉన్నట్టుండి ఆగాడు. తన భుజాన జోలె క్రమంగా బరువెక్కుతున్నట్ట నిపించింది. జోలెలోకి చూశాడు.

బుద్ధిగా పడుకునుంది కుక్కపిల్ల. జోలె ఎందుకు బరువనిపిస్తోంది? నిజంగా బరువెక్కిందా లేక తనలా భ్రమపడుతున్నాడా. ఆలోచిస్తూనే తిరిగి నడక ఆరంభించాడు. నడిచే కొద్దీ జోలె బరువెక్కనారంభించింది.

త్వరగా వ్యాన్‌ని చేరుకోవాలని వడివడిగా అడుగు లేస్తున్నాడు. కాని అడుగులు తడబడుతున్నాయి.

క్రమంగా అది అంత భారీమనిషి మరిడి సోమయ్యకే మోయలేని బరువనిపించసాగింది. అయినా నడక ఆపడంలేదు. జోలెలో ఉన్నది కుక్కపిల్ల మాత్రమే. ఉండేకొద్దీ ఎందుకింత బరువైపోతోంది?

ఇది ఎవరి పని? మిత్రవింద కుక్కపిల్లగా మారాక ఇక ఆమె శక్తులేవీ పనిచేయకూడదే... ఆలోచిస్తున్నాడు. క్రమంగా మరిడి సోమయ్య శరీరమంతా చెమటలు కారటం ఆరంభించాయి. కాళ్ళు తడబడుతున్నాయి.

జోలె తగిలించిన కుడిభుజం కుంచించుకుపోతోంది. తను కుక్కపిల్లను కాదు, పెద్ద బండరాయిని మోస్తున్నట్టుంది. ఒకసారి జోలె నేలమీద ఉంచితే కుక్కపిల్ల తిరిగి మిత్రవిందగా మారిపోతుంది. అలా జరక్కూడదు.

అంత బరువునూ మోయలేక మోస్తున్నాడు.

తన మంత్రశక్తులన్నీ ప్రయోగించాడు. ఫలితం లేకపోగా అంతకంతకూ జోలె బరువు పెరుగుతుందే కాని తరగటంలేదు. అప్పటికే వ్యానుకు ఇరవై అడుగుల దూరంలోకి వచ్చేశాడు.

కాని మరిడి సోమయ్యకు పాదం కదలటంలేదు. గజగజ వణుకుతోంది శరీరం. అంతలో– భుజాన జోలె తెగి దబ్బున కిందపడింది. నేలమీదకు దొర్లిన

కుక్కపిల్ల తక్షణం మిత్రవిందగా మారిపోయింది. మారుతూనే పరిహాసంగా పగలబడి నవ్వసాగింది.

మరిడి సోమయ్య ముఖం అవమానంతోనూ, కోపంతోనూ కందగడ్డలా అయింది. ముఖాన పట్టిన చెమటల్ని పైతుండుతో తుడుచుకొంటూ నిప్పుకణికల్లా ఎర్రబడిన కళ్ళతో ఉరిమి చూశాడు. "ఏమిటే ఆ మిడిసిపాటు? నాతోనే పరాచికములా... ఏయ్ మిత్రవిందా" అంటూ మంత్రదండాన్ని మరోసారి ప్రయోగించబోయాడు.

మరుక్షణం మిత్రవింద అరచేయి మరిడి సోమయ్య చెంపను ఛెళ్ళు మనిపించింది. దెబ్బకు కళ్ళు పచ్చబడి ముఖం తిరిగి కిందపడినంత పనైంది మరిడి సోమయ్యకు. ఒక ఆడపిల్ల చేతికి అంత బలం ఎక్కడిదో అర్థంగాక ఎలాగో నిలదొక్కుకుని బిత్తరపోయి చూశాడు. ఆరడుగుల ఆ ముద్దుగుమ్మ మోమున ఇప్పుడు కోపాగ్ని ప్రజ్వరిల్లుతోంది.

"ఏమిరా మూర్ఖమానవా! ఇంకనూ నా శక్తి నీకు అర్థము కాలేదా? నీ మంత్రశక్తికి వశమగు బేలను కానురా. ద్వారకావాసిని. నీ క్షుద్రశక్తితో యోగశక్తిని మూర్ఖొనుట మూర్ఖత్వం. అగ్రహారమందు నిను పరాభవించిన పదుగురికీ తెలియునని వెరగంది నీ మంత్రశక్తికి వశమయినట్లు నటించితి.

ఏమేమి? నా ప్రియుని జంపజూచిన మిన్నకుందునా? నీ తెంపరితన మునకు, ఇక్కడే నిను జంపి శిక్షింపగలదానను. కాని నీలాంటి తుచ్ఛుని ఉసురు దీసిన పాపము నాకు వలదు. నీ శిష్యులకు జరిగిన పరాభవము జూచి కూడా నను బంధింప వచ్చిన నీకీ పరాభవము చాలును. నిన్ను క్షమించితి పొమ్ము" అంది మిత్రవింద. ఆ మాటలకు మరిడి సోమయ్య అహం దారుణంగా దెబ్బతింది.

ఒక ఆడపిల్లచేతిలో మహామాంత్రికుడనైన తనకీ పరాభవాన్నీ సహించలేక పోతున్నాడు. రిక్తహస్తాలతో వెనుతిరగ మనసంగీకరించుటలేదు.

"మిత్రవిందా! ఏమీ నీవు నన్ను క్షమించుటయా. ఈ పరాభవము సహించి నేను వెనుతిరుగుటయా. ప్రతీకారము కొరకు నా గుండె దహించుకుపోతోంది. ఈ క్షణమే నిన్ను దారుణ అగ్నికీలల భస్మీపటలం గావించెద" అనరుస్తూ మంత్ర దండం లేపాడు.

అంతే... ఆ మరుక్షణమే– మిత్రవింద చుట్టూ భయంకర అగ్నిజ్వాలలు భూమినుంచి ఎగశాయి. ఐతే మిత్రవింద భయపడలేదు. చిరునవ్వుతో చూడగానే లేచిన అగ్నికీలలు అలాగే అంతరించిపోయాయి.

"ఓరి మూర్ఖా! వ్యర్థ ప్రయత్నములేల? ఇక నిను శిక్షింపక వదల. ఇప్పుడు నీ వాహనమును నాశనము చేసెద. నీవంత శక్తివంతుడవైనచో కాపాడుకొనుము" అంటూ కళ్ళుమూసి తెరిచి స్కార్పియో వ్యాన్ వంక చూసింది. అంతే– భూన భోంతరాలు ఏకమయినట్టు– ఒక్క పెట్టున పిడుగు తాకినట్టు భయంకర విస్ఫోటనంతో నల్లని ఆ స్కార్పియో వేను తునాతునకలుగా ప్రేలిపోయింది. దట్టమైన మంటలు పొగలు సుడులు తిరుగుతూ పైకి లేచాయి. దిక్కుల వెంట ప్రేలుడు శబ్దం మారుమోగుతూనే ఉంది.

మిత్రవింద ఎదుట నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు మరిడిసోమయ్య. తన వాహనాన్ని కాపాడుకోలేకపోయాడు. కళ్ళముందు జరిగిన సంఘటనకి కొయ్యబారిపోయాడు. మిత్రవింద వ్యాన్‌ను చూసింది గాబట్టి సరిపోయింది. అదే తనను చూసి వుంటే క్షణంలో బూడిదయ్యేవాడని తలుచుకుంటేనే అతడి వెన్ను జలదరించింది.

"అవివేకి. నేనిచ్చిన అవకాశమును దుర్వినియోగము చేసుకొని వాహనమును పోగొట్టుకొంటివి. ఇక నీ ప్రాణములు దక్కవలెనన్న పరుగెత్తుము. ఎగువన రహదారిని చేరువరకు పరుగెత్తుము. పొమ్ము. ఈ ప్రాంతమున ఇక నీవు అగుపించకూడదు. పోయి ప్రాణములు రక్షించుకొనుము" అంది.

ఆ మాటలతో మరిడి సోమయ్య అదిరిపడ్డాడు.

అగ్నిజ్వాలలు వెదజల్లుతున్న వ్యాన్ చక్రాలు తనవైపు కదలటం ఆరంభించాయి. వాటిని అపగల మంత్రశక్తి ఏమిటో కూడా అర్థం కాలేదు. ప్రాణభయంతో కాలికొద్దీ రోడ్‌వెంట పరుగు ఆరంభించాడు. పగబట్టి సర్వాల్లా చక్రాలు నాలుగూ తగలబడుతూ పోటీపడి అతడ్ని తరమనారంభించాయి. వెనక నుండి మిత్రవింద నవ్వు అతడికి చాలా దూరం విన్పిస్తూనే వుంది. దూరం నుంచే ఇదంతా గమనిస్తున్నాడు చరక్.

అతను మలుపుతిరక్కముందే వ్యాన్ ప్రేలుడు శబ్దం విన్నాడు. మలుపులోకి వచ్చేసరికి మిత్రవిందను, ఆమె ఎదురుగా జంగమదేవరను గమనించి అక్కడే

బైక్ ఆపాడు. వాడు ప్రాణభయంతో పరుగుతీస్తూంటే వెనకే వ్యాన్ చక్రాలు తగలబడుతూ తరుముకెళ్ళటం చూశాక బైక్ స్టార్ట్‌చేశాడు. నేరుగా మిత్రవింద ముందుకెళ్ళి బైక్‌ని వెనక్కి తిప్పాడు.

"చతురా... నీవేల వచ్చితివిటు?" ఏమీ జరగనట్టే నవ్వుతూ పలకరించింది మిత్రవింద.

"ఏలనా?... పనిలేక... పొద్దుటే నిద్ర పాడుచేసింది గాక ఏంటని అడుగుతోంది చూడు... రా కూచో" అన్నాడు కోపంగా.

"నేనా... నేనేంజేశాను?" అడిగింది.

"ఏం చేశావా... ఏమున్నా ఇంట్లో చెప్పిరావాలిగదా. నీపాటికి వచ్చేశావ్. ఆ పిచ్చిది నువ్వేమయ్యావోనని కంగారుపడి నా నిద్ర పాడుచేసి లేపింది. ఆ జంగమయ్య ఎవడో నువ్వెక్కడికెళ్ళావో తెలీక ఊరంతా తిరిగి ఇటొస్తున్నాను. ఈ పాటికి జేజితాతయ్యకు ఫోన్ చేసి చెప్పేవుంటారు. రా పోదాం" అన్నాడు.

"ఆ జంగమయ్య ఎవడో తెలుసుకోవా?" అడిగింది.

"ఇంకెవడు. ఆ మాంత్రికుడు మరిడి సోమయ్య అయివుంటాడు. బుద్ధి చెప్పావ్‌గా. ఇక రా. వాడో పిచ్చి వెధవ. నిప్పని తెలిసే నిన్ను పట్టుకోవాలని చూస్తున్నాడు. ఓరోజు ఒళ్ళు కాలి చస్తాడు. అయినా ఆ పనేదో ఇప్పుడే చేసుండొచ్చుగా పీడాపోయేది"

"ప్రియుడా, ఎవరి పాపములు వారినే దహించును. మనకేల? అయినను ఈ విషయము జేజి తాతయ్యకు తెలుపవలసిన అగత్యమేమి?" అంటూ బైక్ మీద చరక్ వెనక కూచుంది.

"ఈ మాటేదో నీ అక్కనడుగు... జరుగు. వెనక్కి జరిగి కూచో" హెచ్చరించాడు.

"ఇలా కూచున్న నష్టమేమి?" అంటూ కావాలనే అతడి వీపును మరింత హత్తుకొని కూచుంది.

ఇబ్బందిగా చూశాడు చరక్. "మిత్రా... ఇదేమి అల్లరి. నీ పుణ్యమాని సంసారసుఖానికి ఎలాగూ దూరంగా ఉన్నాను. నువ్విలా కవ్విస్తే నాకేది దారి?"

నవ్వింది మిత్రవింద. "నవ్వకు. నాకు చాలా కోపంగా ఉంది తెలుసా!" అన్నాడు.

"కోపమేల ప్రియుడా, ఓహో. అందుకే నాతో సరిగా మాటలాడకున్నావా? మనోనిగ్రహం ఉన్నా చాలును. ఏ వికారములు ఉండవు. పోవుదము పద ఇక"

"మనోనిగ్రహం... మీ ఇద్దరి మధ్యనా... పరీక్ష పెడుతున్నారుగదే. "ఖర్మ" అని విసుక్కుంటూ బైక్‌ను అగ్రహారం దిశగా పోనిచ్చాడు చరక్.

* * * * *

రిక్తహస్తాలతో ఆటోలో మండపేట లాడ్జికి తిరిగి వచ్చిన తమ గురువునూ అతడి భీకరరూపాన్నీ చూసి ఠారెత్తిపోయారు మృణాళుడు, గంగారాంలు.

బంగారంలాంటి తమ స్కార్పియోవ్యాన్ ఏమైందో, ఆటోలో ఎందుకు తిరిగివచ్చాడో, మున్నలూరి వారి అగ్రహారంలో ఏం జరిగిందో ఏమీ అర్థంకాలేదు వాళ్ళకి. కాని అక్కడ అగ్రహారంలో గురువుగారికి మిత్రవింద చేతిలో ఘోర పరాభవమే ఎదురయి వుంటుందని ఊహించారు.

అలాగని అడిగి తెలుసుకోవడానికి ధైర్యం చాల్లేదు. మరిడి సోమయ్యా చెప్పలేదు.

వచ్చీ రావటమే– "మనం లాడ్జి ఖాళీచేసి వెళ్ళిపోతున్నాం. ఎకౌంట్ సెటిల్‌చేసి బయలుదేరండి. ట్యాక్సీ దొరుకుతుందేమో చూడండి. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. డైరెక్ట్‌గా నీలోదరికి మాట్లాడండి. త్వరగా" అన్నాడు. అంతే–

ఆ విధంగా ముగ్గురూ ట్యాక్సీలో సాయంత్రం ఐదుగంటలకి నీలోదరికి చేరుకున్నారు. ట్యాక్సీ దిగుతూనే ఎవరితోనూ మాట్లాడలేదు మరిడి సోమయ్య. అక్కడ తనకు చెందిన బలిష్టమైన మూడు గుర్రాలు పచ్చిక మేస్తున్నాయి. జీన్స్ వేసివున్నాయి.

రోజూ శిష్యులు వాటిని ఓ గంట స్వారీ చేయిస్తుంటారు. నేరుగా అటుగా వెళ్ళిన మరిడిసోమయ్య నల్లటి కాలాశ్వాన్ని అధిరోహించి కళ్ళాలు బిగించి లగెత్తించాడు. ఈ లోపల–

మరిడి సోమయ్య అశ్వాన్ని ఎగువకు దౌడు తీయిస్తూనేవున్నాడు. మిత్ర విందమీద తన కోపాన్నంతా అశ్వం మీద చూపిస్తున్నాడు. నాలుగు కాళ్ళమీద గాలితో పోటీపడుతూ పరుగుతీస్తోందా గుర్రం. ఎటువెళ్తున్నాడో, ఎక్కడికెళ్తున్నాడో తెలీదు. గుర్రాన్ని దారిపొడవునా హింసిస్తూనే వున్నాడు. అర్ధగంట తర్వాత తిరిగి

వచ్చేసరికి అశ్వం నోటినుండి నురగలొస్తున్నాయి. అలసిపోయినట్టు తెలుస్తోంది. "సోమయ్యా, ఇకచాలు, దిగు. ఆ గుర్రం చచ్చేలా ఉంది" అనరిచాడు అఘోరా.

గుర్రాన్ని తిరిగి వెనక్కి తిప్పి పరుగెత్తించాడు సోమయ్య. కనుచీకటి పడింది. వెళ్ళిన గుర్రం తిరిగి రాలేదు. శిష్యులంతా ఆందోళనచెందుతున్నారు.

ఈ పరిస్థితిలో అశ్వం తిరిగి వచ్చింది. వచ్చీరావటమే అది నేలకు ఒరిగిపోయింది.

గుర్రం దిగిన మరిడి సోమయ్య "అది బతికితే చికిత్స చేయించండి. ఛస్తే అవతల పారేయండి" అంటూ చరచరా వెళ్ళిపోనారంభించాడు.

"ఇది చచ్చిపోయింది" వెనక నుంచి అఘోరా అరుపు విన్పించింది.

"మరిడి సోమయ్యా చచ్చాడనుకోండి. ఎవరూ నా వద్దకు రాకూడదు" గుట్టపైకి నడుస్తూనే అరిచాడు మరిడి సోమయ్య.

ఆ మాటలు విని షాకయ్యారంతా. అలా రావటం రావటం గుట్టపైకి వచ్చి వేపచెట్టుకింద కూర్చున్నవాడు మూడురోజులైనా చోటు వదల్లేదు. అతడ్ని సమీపించాలంటే శిష్యులకు భయంగా ఉంది. పరిస్థితి చూస్తున్న అఘోరా ఆ రోజు సాయంకాలం గుట్టపైకి వచ్చి మరిడి సోమయ్య సమీపంలో కూర్చున్నాడు.

"సోమయ్యా... ఎంతకాలమిలా?" అడిగాడు.

"తెలీదు" పొడిగా బదులిచ్చాడు మరిడిసోమయ్య.

"తెలీనప్పుడు ఈ నిరాహారదీక్ష దేనికి? స్నాన పానాలు లేవు. ఆహారం లేదు. ప్రాయోపవేశం చేస్తావా? చేస్తే సమస్యలు తీరతాయా?

శిష్యులు నిన్ను సమీపించాలంటే భయపడుతున్నారు. నీకు అవమానం జరిగింది. ఓడిపోయావు. బాధగానే ఉంటుంది. కాదనటం లేదు...."

"మామూలు బాధ కాదు అఘోరా, చనిపోవాలని వుంది. ఘోర అవమానం. మిత్రవింద చేతిలో ఇంతటి పరాభవం నేను ఊహించనిది"

"కొన్ని సంఘటనలు మన ఊహకి అందవు. అయితే ఏమైంది? కార్యసాధనకు ఓటమిని సవాల్‌గా తీసుకుంటాడు గానీ నీలా కృంగిపోడు. ముందు కిందకు పద. స్నానం చేసి దుస్తులు మార్చుకొని ఆహారం తీసుకో. అయినా మీ వెంట నేనూ వస్తానంటే వినకపోతివి" అన్నాడు అఘోరా.

"వచ్చినా ప్రయోజనమేమి? నీవల్ల ఏమయ్యేది? మిత్రవింద శక్తి అజేయమైనది. శిష్యుడు విళంబి వచ్చి చెప్పినప్పుడు నేనూ విశ్వసించలేదు. నువ్వూ పరిహసించావు. కాని ఆమె శక్తి ఏమిటో స్వయంగా చూశాను. ఆమె చరక్‌కి రక్షణకవచంలా ఉండగా వాడ్ని మనం ఏమీచేయలేం.

అందుకే అగ్నివేశాచార్యుడు నిశ్చింతగా ఎక్కడికో వెళ్ళికూర్చున్నాడు. ఈ పరాభవాన్ని నేను తట్టుకోలేకున్నాను"

"ఊఁ. నీ శిష్యుల్లాగే నీవూ నా శక్తిని సందేహిస్తున్నావని అర్థమైంది. అందుకే నీవల్ల ఏమయ్యేది అంటున్నావ్. సరి. ఇప్పుడే నా శక్తి ఏమిటో చూపించి నీ పరాభవానికి ప్రతీకారం చేస్తాను. ఒక్కక్షణం ఆగు" అంటూ అఘోరా కళ్ళు మూసుకున్నాడు. అతడి పెదవులు అస్పష్టంగా ఏవో మంత్రాలు పఠిస్తున్నాయి.

క్షణాలు భారంగా దొర్లుతున్నాయి. కుతూహలంగా అతడ్నే గమనిస్తున్నాడు మరిడి సోమయ్య.

సరిగ్గా మూడో నిముషం పెదవి విప్పాడు అఘోరా. మూసిన కళ్ళు వెనుక కొన్ని దృశ్యాలు కదిలిపోతున్నాయి. "వాళ్ళు ముగ్గురూ కొత్త బెంజ్ కారులో ప్రయాణం చేస్తున్నారు. కారుకింకా రిజిస్ట్రేషన్ నెంబర్ రాలేదు"

"అవును. అది చరక్‌కారు. ఆ కారునే మేం ఫాలో చేశాము" చెప్పాడు మరిడి సోమయ్య.

"కారుని చరక్ డ్రయివ్ చేస్తున్నాడు. అతడి సరసనే ఇద్దరు యువతులు ఉన్నారు. ఒక యువతి చాలా పొడవుగా ఉంది"

"అదే మిత్రవింద" అరిచాడు మరిడి సోమయ్య. "రెండో యువతి శుశ్రుత. చరక్ భార్య" చెప్పాడు. "ఇప్పుడే చేద్దాం. వాళ్ళ కారుని యాక్సిడెంటు చేసి చంపేయనా? వాళ్ళు ఏవో జోకులేసుకుని నవ్వుకొంటూ వాళ్ళ ధ్యాసలో వాళ్ళున్నారు"

"వాళ్ళు ఎక్కడికి వెళ్తున్నారు. ఎక్కడున్నారు?"

"అది తెలుసుకోవటం కష్టం"

"అయితే చంపెయ్. యాక్సిడెంట్ చేసి చంపెయ్" ఉత్సాహంగా అరిచాడు మరిడి సోమయ్య.

"నీ కోరిక తీరుస్తాను. కొంచెం ఓపిక పట్టు. వాళ్ళ మీద మోహనాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాను. వాళ్ళు గాఢనిద్రలోకి వెళ్ళిపోతారు" అంటూ అఘోరా మోహనాస్త్రాన్ని ప్రయోగించాడు.

* * * * *

ఆ ఉదయం మున్నలూరి వారి అగ్రహారం నుంచి జేజితాత అగ్ని వేశాచార్యునికి ఫోన్ చేశాడు చరక్. మధ్యాహ్నం భోంచేశాక శుశ్రుత, మిత్ర విందలను తీసుకుని కొత్తకారులో కోరుకొండ వస్తున్నట్టు చెప్పాడు. అగ్ని వేశాచార్యుడు రమ్మన్నాడు.

ఆ విధంగా అగ్నివేశాచార్యుని అనుమతి పొందాకే మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ముగ్గురూ కారులో బయలుదేరారు. చరక్ కారు డ్రయివ్ చేస్తుంటే పక్కన శుశ్రుత, వెనుక మిత్రవింద కూర్చున్నారు.

కారు సాయంత్రం అయిదుగంటల తర్వాత కోరుకొండను సమీపించింది. ఏవో కబుర్లు చెప్పుకొని నవ్వుకుంటున్నారు ముగ్గురూ.

ధ్యాసంతా ట్రాఫిక్‌మీద ఉంది. కారు తమ ఎస్టేట్‌ను సమీపించింది. అంతలో–

ఏమైందో అర్థంగాని– అకస్మాత్ మగత.

ముందుగా శుశ్రుత, ఆ వెనకే మిత్రవింద కూడా గాఢనిద్రలో ఒరిగి పోయారు.

చరక్‌కళ్ళు మూతలు పడిపోతున్నాయి. ఏదో జరుగుతోందని అర్థమై పోయింది. శక్తినంతా కూడదీసుకొని కారును ఎడం పక్కకు పోనిచ్చాడు. ఎస్టేట్ గోడ కూలగొట్టి లోన నాలుగు ఎకరాలు చదునుచేసిన ప్రాంతం ఉంది. బెంజ్‌కారు నేరుగా ఆ స్థలంలోకిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాహనాలేవీ ఎదురురాలేదు. స్టీరింగ్‌ని పక్కకు తిప్పి దానిమీదకు వాలిపోతూ తనూ గాఢ నిద్రలోకి వెళ్ళిపోయాడు చరక్. స్టీరింగ్ మీద వాలటంతో కారు హారన్ ఏకబిగిన చెవులు పగిలేలా మోగటం ఆరంభించింది. కారు గానుగెద్దులా ఆ ఖాళీస్థలంలో రౌండ్లు కొట్టనారంభించింది.

* * * * *

"భళారే చరక్. అసాధ్యుడివిరా" ఉన్నట్టుండి అరిచాడు అఘోరా. కనులు మూసుకుని అక్కడ జరుగుతున్నదంతా వీక్షిస్తూనే ఉన్నాడు.

"ఏమైనది?" అడిగాడు మరిడి సోమయ్య.

"నా మోహనాస్త్రానికి లొంగిపోయి మిత్రవింద, శుశ్రుతలిద్దరూ ముందే గాఢనిద్రలోకి వెళ్ళిపోయారు. చరక్ కూడా నిద్రలోకి జారుతూ ప్రమాదం నివారించటానికి కారు పక్కనున్న మైదానంలోకి పోనిచ్చాడు.

చరక్ స్పృహలో లేడు. కారు గానుగెద్దులా మైదానంలో తిరుగుతోంది" చెప్పాడు.

"మిత్రవిందకు స్పృహ రాకూడదు. వచ్చేలోపలే ఏదో ఒకటి చేసి వాళ్ళని చంపెయ్" ఉద్వేగభరితుడవుతూ అరిచాడు మరిడి సోమయ్య.

"సోమయ్యా, అగ్ని వేశాచార్యుడున్నాడని మర్చిపోతున్నావ్. ఆయనకు అనుమానం రానివిధంగా పని యాక్సిడెంట్‌తో ముగించాలనుకున్నాను. వీలు కాలేదు... చూద్దాం" అంటూ ఏవో మంత్రాలను పఠించి రెండు చేతులు నలిపి నోటికడ్డంగా ఉంచుకొని ఊదాడు. మరుక్షణం అతడి నోటినుండి చేతుల మధ్యగా భగ్గున బయల్వెడలిన అగ్నికీల ఒకటి మెరుపులా ఎగసి గాలిలో అదృశ్యమైంది.

* * * * *

అగ్నివేశాచార్యుడు ఎస్టేట్ భవంతిలో కూర్చుని చాలా సేపటిగా చరక్, మిత్రవింద, శుశ్రుతుల కోసం ఎదురుచూస్తున్నాడు. వాళ్ళింకా రాలేదు. ఆయన మనసెందుకో ఆత్రపడుతోంది.

ఏదో జరగబోతోందనే ఆందోళన అంతకంతకూ పెరుగుతోంది. ఓసారి యోగదృష్టితో వీక్షించాలని పద్మాసనంలో కూర్చోబోతూండగా అప్పుడు...

సరిగ్గా అప్పుడు... ఊహించని విధంగా, చెవులు పగిలేలా బయటి నుంచి కారు హారన్ సౌండ్ నాన్‌స్టాప్‌గా వినవచ్చింది. అగ్నివేశాచార్యుని భృకుటి ముడిపడింది. ఎవరిదా కారు, ఎక్కడి నుండా హారన్ శబ్దం.

అసహనంగా లేచి ఇవతలికి వస్తూండగా– లోనకు పరుగెత్తుకొస్తూ కన్పించాడు డ్రైవర్ కాశీ.

"ఏమయిందిరా? ఎవరిదా కారు?" గద్దించాడు అగ్నివేశాచార్యుడు. కాశీ వెర్రిగా అరుస్తూ సైగలు చేస్తున్నాడు. వాడికి మాటలు రావు.

అగ్నివేశాచార్యునికి అర్థంకాలేదు. వాడివెంట తనూ వడివడిగా బయటి కొచ్చాడు. సరాసరి ఖాళీ స్థలంవైపు ఆయన్ని తీసుకువెళ్ళాడు కాశీ.

దూరంలో ఉండగానే ఆ కారును గమనించాడు అగ్నివేశాచార్యుడు. స్టీరింగ్ మీద వాలిపోయి గాఢనిద్రలో ఉన్న చరక్‌ను చూడగానే ఏం జరిగిందో ఊహించేశాడు. కారు గానుగెద్దులా అదేపనిగా రౌండ్లు కొడుతూనే వుంది. ఆ కారు సమీపంలోకి రాగానే పరిస్థితి అగ్నివేశాచార్యునికి అర్థమైపోయింది. చరక్‌తో పాటు కారులో వాళ్ళమీద దారుణ ప్రయోగం జరిగింది. ఉన్నపళంగా వాళ్ళని నిద్రలోకి నెట్టి యాక్సిడెంటుచేసి చంపాలని చూశారు.

చరక్ చివరిక్షణంలో ప్రమాదం గ్రహించి కారుని ఇటులోనకు తెచ్చి హారన్‌మీద వాలిపోయి తనను అలర్ట్‌చేశాడు. ఈ ప్రయోగం చేసింది ఎవడు? మరిడిసోమయ్యకు ఇంత శక్తిలేదు.

ఆలోచిస్తూ శత్రువు ప్రయోగించిన అస్త్రాన్ని ఉపసంహరించబోతూ ఉలిక్కిపడి ఆగిపోతూ ఈశాన్య దిశగా ఆకాశం వంక చూశాడు. మెరుపుతీగలా దూసుకొస్తోంది అగ్నికీల. ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి కారుతో సహా ముగ్గుర్నీ సజీవదహనం చేయబోతున్నాడు. ముందీదారుణాన్ని ఆపాలి. "కాశీ... దూరంగా వెళ్ళు. దగ్గరగా ఎవరూ రావద్దు. వెళ్ళు" అనరిచాడు.

అప్పటికే కారు హారన్ సౌండ్ విని ఎస్టేట్ పనివాళ్ళు, ఇంకా బయటివాళ్ళు కొందరు ఏం జరిగిందో తెల్సుకోడానికి లోనకు పరుగులెత్తుకొస్తున్నారు.

అగ్నివేశాచార్యుని హెచ్చరికతో కాశీతోబాటు అంతా వెనక్కి పరుగెత్తారు. అగ్నివేశాచార్యుడు చేతి కర్రను పైకి లేపి ఏవో మంత్రాలు పఠిస్తూ అరచేతిని ముందుకు సాచాడు. ఈ శాన్యదిశగా గగనతలంలో అగ్నిరేఖలా దూసుకొస్తున్న ఆగ్నేయాస్త్రం క్రమంగా కారుని సమీపించేకొద్దీ భయంకర అగ్నిజ్వాలగా మారి కన్నుమూసి తెరిచేలోన కిందకు వచ్చేసింది.

అయితే చివరిక్షణంలో అగ్నివేశాచార్యుడు ఆ ఆగ్నేయాస్త్రాన్ని తన మంత్ర బలంతో కారుని తాకకుండా ఆపి తనవైపు రప్పించుకున్నాడు.

భయంకరమైన అగ్నిజ్వాలలు విచిత్రంగా అణగారిపోతూ వెనక్కి వచ్చి అగ్నివేశాచార్యుని అరచేతిలో వాలి హారతికర్పూరంలా జ్వలింపసాగింది.

మొదట ఆ ఆగ్నేయాస్త్రాన్ని ఉపసంహరించాలనుకున్న అగ్నివేశాచార్యుడు మరుక్షణమే మనసు మార్చుకొని అగ్నేయాస్త్రాన్ని ఉపసంహరించకుండా తన ఆధీనంలోకి తెచ్చుకొని అరచేతపట్టాడు.

పట్టిన వెంటనే ఆ అస్త్రాన్ని ప్రయోగించినవాడి మీదికి తిప్పికొడుతూ ఈశాన్యదిశగా ఊదాడు. అంతే– ఎంత వేగంగా వచ్చిందో, అంతే వేగంగా గగన సీమలోకి అదృశ్యమైందా అగ్నికీల.

*　　*　　*　　*　　*

నీలోదరి కొండగుట్ట. గుట్టమీది వేపవృక్షం. వృక్ష మూలంలో తిన్నెమీద కళ్ళు మూసుకొని అక్కడ కోరుకొండ ఎస్టేట్ భవంతి సమీపంలో జరుగుతున్నదంతా చూస్తున్నాడు అఘోరా.

పక్కన నిలబడిన మాంత్రికుడు మరిడి సోమయ్య అఘోరా చెప్పేది ఆసక్తిగా వింటున్నాడు. "కారులో ముగ్గురూ గాఢనిద్రలో అలాగే ఉన్నారు. ఆగ్నేయాస్త్రం కారును సమీపిస్తోంది. కానికాని" ఉన్నట్టుండి అఘోరా మాటలు తడబడ్డాయి.

"కాని... ఏమైంది అఘోరా... కారు తగలబడుతోందా?" ఉత్కంఠభరితుడవుతూ అరిచాడు.

"ఇంకా... లేదు సోమయ్యా... కాని... అగ్నివేశాచార్యుడు కారును సమీపిస్తున్నాడు. సందేహం లేదు. ఆయన అగ్నివేశాచార్యుడే"

"ఆయన ఎలా వచ్చాడు అక్కడికి?" అన్నాడు.

"అదే అర్థంగావటంలేదు. నా ప్రయోగాన్ని విఫలం చేస్తూ ఆగ్నేయాస్త్రాన్ని అరచేత ఒడిసిపట్టి...." అని ఏదో చెపుతూ మధ్యలో ఆపేశాడు.

మరిడి సోమయ్య అదిరిపడ్డాడు. నరాలు తెగిపోయేంత ఉత్కంఠత నరనరాన వ్యాపించగా, వ్యాకులపడిపోతూ– "అఘోరా... ఏమయింది. అరచేత ఒడిసిపట్టి అస్త్రాన్ని నిర్వీర్యం చేశాడా?" అరిచాడు.

"లేదు... ఓరి దేవుడా... అయిపోయాం" అనరుస్తూ చట్టున కళ్ళుతెరిచాడు అఘోరా.

తెరుస్తూనే– "సోమయ్యా... తప్పుకో... దూరంగా పరుగెత్తు" అనరుస్తూ తిన్నెపైనుంచి ఒక్కసారిగా దూకి మరిడి సోమయ్యను అవతలకు తోసి తనూ దూరంగా పరుగెత్తాడు. ఏం జరగబోతోందో అర్థం గాక అఘోరా వెనకే తనుకూడా

పరుగెత్తాడు మరిడి సోమయ్య. ఇద్దరూ పాతిక అడుగుల దూరం చెట్టు నుండి అవతలకు ఇంకా వెళ్ళుండరు.

అంతలో మెరుపు వేగంతో దూసుకొచ్చిన ఆగ్నేయాస్త్రం అఘోరాను తాకాల్సినచోట అతను లేకపోయేసరికి సూటిగా వేపచెట్టును తాకింది. అంతే– ఏనాటిదో అయిన ఆ పురాతన మహావేప వృక్షం ఒక్కసారిగా సమూలంగా భగ్గున మండింది.

భయంకరమైన అగ్నిజ్వాలలు వేడిమి, విస్ఫోటనంలా లేచి ఇరువురినీ తాకి ఎత్తి మరింత దూరంగా విసిరేశాయి. కిందపడి లేచి తిరిగి చూసిన ఇరువురికీ వేపచెట్టు మొత్తం తగలబడిపోతూ అగ్ని కీలలు, దట్టమైన పొగలు, ఆకాశానికి ఎగస్తూ అగ్నిగుండంలా దర్శనమిచ్చింది వృక్షం.

తాము ఇద్దరూ ఆ చెట్టుకిందే ఉండుంటే ఏం జరిగివుండేదో ఊహించుకొని వెన్ను జలదరించింది ఇరువురికీ. తగలబడుతున్న వృక్షాన్ని చూస్తూ చేష్టలుదక్కి కొయ్యబొమ్మల్లా ఉన్నచోటే స్థాణువులా నిలబడిపోయారు మరిడి సోమయ్య, అఘోరాలు ఇరువురూ కూడా.

* * * * *

ఆగ్నేయాస్త్రాన్ని తిప్పికొట్టిన అగ్నివేశాచార్యుడు ఆ మరుక్షణమే కారు మీద ప్రయోగింపబడిన అస్త్రాన్ని కూడా ఉపసంహరించాడు. ఎప్పుడైతే ప్రభావం తొలగిపోయిందో ఆ మరుక్షణమే గాఢనిద్ర నుండి మెలుకువ వచ్చేసింది చరక్‌కి.

స్పృహలోకి వచ్చిన తక్షణం స్టీరింగ్ నుంచి లేచాడు. అంతే. హారన్ మోగటం ఆగిపోయింది.

తక్షణం కారును ఆపేశాడు. వాటర్‌బాటిల్ అందుకుని తూలుతూ కారు దిగాడు.

తలంతా మొద్దుబారినట్టుండి కాసేపు ఏం జరిగిందీ కూడా చరక్‌కి గుర్తు లేకుండాపోయింది. సమీపంలో ఎవరున్నారో కూడా గమనించలేదు.

అక్కడే మోకాళ్ళమీద కూచుని చల్లటి బాటిల్ నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు. అంతలో కారులోంచి మిత్రవింద, ఆమె వెనకే శుశ్రుత నిద్రమత్తుతో జోగుతూ కారు దిగారు. చరక్ తన నీళ్ళబాటిల్‌ను వాళ్ళకి ఇచ్చి ముఖం తుడుచుకున్నాడు.

ఆ సమీపంలో నిలబడి–

వాళ్ళని చూస్తూనేవున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఆయన్ని ఆశ్చర్యపరుస్తున్న విషయం చరక్, శుశ్రుతలు సామాన్యులు. వాళ్ళదగ్గర ఏ శక్తులూ లేవు గాబట్టి వాళ్ళకి ముంచుకువచ్చే ప్రమాదం తెలీదు కాని... అన్నీ తెలిసిన మిత్రవిందకేమైంది?

అస్త్రానికి ఎలా లొంగిపోయింది? అసలీ అస్త్రాల్ని ప్రయోగించింది ఎవడు? ఆయన ఆలోచనలు ఓ కొలిక్కిరాకముందే యువతులిద్దరూ కూడా ముఖాలు కడుక్కుని మంచినీరు తాగారు.

"ఏమైందీ? ఏం జరిగిందీ" ముగ్గుర్నీ సమీపించి అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"అదే అర్థంగావటంలేదు జేజిగారూ. మా కారు ఈ సమీపంలోకి వచ్చేసరికి ఉన్నట్టుండి దారుణమయిన నిద్ర వచ్చేసింది. వాళ్ళిద్దరూ నిద్రలో సోలిపోయారు. నేనూ సోలిపోయాను.

ప్రమాదం గమనించి చివరి క్షణంలో కారుని ఇటుమళ్ళించాను. ఇప్పటికీ ఏమైందో అర్థంగావటంలేదు" అన్నాడు చరక్ లేచి నిలబడుతూ.

శుశ్రుత అయితే ఏం జరిగిందో అర్థంగాక ఇంకా అయోమయంగా అలా చూస్తూనేవుంది. మిత్రవింద మాత్రం అరమోడ్పు కళ్ళతో ఏదో ఆలోచిస్తోంది.

"జేజి తాతయ్యా, సమయానికొచ్చి మమ్మల్ని రక్షించారు. మీకెలా కృతజ్ఞత చెప్పుకోవాలో అర్థంగావటం లేదు" అంది.

"ప్రమాదం జరక్కుండా కారుని ఇటు మళ్ళించాను గదా" అన్నాడు చరక్.

"లేదు చతురా. అంతకుమించిన ప్రమాదం మనల్ని కారుతోసహా తగలబెట్టాలని చూశాడా నీచుడు. వాడు ప్రయోగించిన రెండు దారుణ అస్త్రాలను జేజి తాతగారు తిప్పికొట్టి మనల్ని రక్షించారు" అంది మిత్రవింద.

"వాడెవరో నా మేధస్సుకు అందటంలేదు తల్లీ. నీకేమైనా తెలుస్తోందా? మరిడి సోమయ్యేనా?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"కాదు. వాడితో చేరిన అఘోరా... ఇప్పుడే వాణ్ణి ఇచటకు రప్పించి శిక్షించెద...."

"వద్దు వద్దు. అలాంటి పని చేయకు...." అంటూ వెంటనే వారించాడు అగ్నివేశాచార్యుడు.

"పాపం పండినరోజు వాళ్ళే దహించుకుపోతారు. ఇందుకోసం మన శక్తుల్ని వృధాచేయాల్సిన పనిలేదు. కాని ఎప్పుడూ అప్రమత్తంగా వుండే నీవు ముందే గమనించకపోవటం ఆశ్చర్యంగా ఉంది"

"జేజి తాతగారూ ఇందులో ఆశ్చర్యపడుటకేమున్నది. మనం జాగ్రదవస్థలో ఉన్నప్పుడే ప్రమాదములు గ్రహించగలము. వాడు తెలివిగా మోహనాస్త్ర ప్రయోగంతో మమ్మల్ని గాఢనిద్రావశుల్ని చేశాడు.

నాచేత పరాభవం పొందిన మరిడి సోమయ్యను తృప్తిపర్చటం కోసం మా ముగ్గుర్నీ చంపాలని చూశాడు. తరువాతయినా వాడిని క్షమింపజాల" ఆగ్రహావేశాలతో అంది మిత్రవింద.

శాంతించమన్నట్లు చూశాడు అగ్నివేశాచార్యుడు.

*　　*　　*　　*　　*

పచ్చని ఆ మహా వేపవృక్షం– భయంకర అగ్ని జ్వాలల మధ్య– తగల బడుతూనే ఉందింకా. గుట్టపైన మంటల్ని గమనించి విళంబి, మృణాళుడు, గంగారాంలతో బాటు శిష్యులంతా గుట్టపైకి వచ్చేసి ఆ మంటల్ని గాభరాగా చూస్తున్నారు. ఏం జరిగిందో వాళ్ళెవరికీ తెలీదు. అవతల చీకట్లు ముసురు కుంటున్న వేళయినా ఎవరూ గుట్ట దిగలేదు.

వేపవృక్షం శాఖల్లోని తమ గూళ్ళను, ఆ గూళ్ళలోని తమ పిల్లల్ని కాపాడు కోలేక బాధగా అరుస్తూ తగలబడుతున్న చెట్టుచుట్టూ ఎగురుతున్నాయి పక్షులు.

"గురువుగారూ... చివరకు మీ ప్రయత్నం కూడా విఫలమైందిగదా" అన్నాడు బాధగా మరిడి సోమయ్య.

"అయితే ఏమైంది. మరో ప్రయత్నంలో విజయం సాధిస్తాం. నిన్ను పరాభవించిన మిత్రవిందకు ఆ చరక్‌కు సమస్య సృష్టించి నీకు కొంత ఊరట కలిగించాను. ప్రస్తుతానికి ఇది చాలు.

త్వరలో నీకు అజేయమయిన మహిష శక్తి వశం కానుంది. అది వశం కాగానే ఆ మిత్రవిందను బంధించి చరక్‌ను అంతం చేయగలవు. ఇక నీ నిరుత్సాహము వదలి ఇకనయినా నివాసమునకు పద" అన్నాడు అఘోరా.

"అప్పుడు కూడా... మహిషశక్తికి లొంగకుంటే ఏం చేయాలి? ఆ అగ్నివేశాచార్యుని ధర్మసంస్థాపన జరిగితీరుతుంది. పోతాం... అందరం... మనలాంటి వాళ్ళంతా నాశనమైపోతాం...."

"ఇది నీ ఒక్కడి సమస్యకాదు సోమయ్యా. ఆలోచించు. అగ్నివేశాచార్యుని లక్ష్యం గురించి ఆయన ప్రయత్నాల గురించి ఇంతవరకు తెలిసినవాడివి నీ ఒక్కడివి మాత్రమే. ఇక దాచి ప్రయోజనం లేదు. ఆ అగ్నివేశాచార్యుని ప్రయత్నాలను అడ్డుకోవాలంటే దుష్టశక్తులన్నీ సంఘటితం కావాలి.

ముందు మహిషశక్తిని వశం చేసుకో. తరువాత ఈ జాజ్‌పూర్ పరిసరాల్లోని మనలాంటి మాంత్రికులు ఎందరో ఉన్నారు. అందర్నీ సమావేశపరచి పొంచివున్న ప్రమాదాన్ని వివరించి వారి సలహా తీసుకుందాం. వాళ్ళ సహకారం కూడా మనకి ఉంటుంది. ఏమంటావ్?" అన్నాడు అఘోరా.

చివరిగా ఇచ్చిన అఘోరా సూచన– మరిడి సోమయ్యకు నచ్చింది. ఇక అభ్యంతరం చెప్పకుండా గుట్టదిగి తన నివాసంలోకి అడుగుపెట్టాడు. అతడ్ని అనుసరించి అంతా గుట్టదిగిపోయారు. కాని ఆ రాత్రి చిమ్మచీకట్లలో కూడా గుట్ట మీది వేపవృక్షం చాలాసేపు జ్వాజ్వల్యమానంగా తగలబడుతూనేవుంది.

*　　*　　*　　*　　*

అర్ధరాత్రి, కోరుకొండ ఊరంతా గాఢనిద్రలో ఉంది. కాని జర్నలిస్టు భీష్మనారాయణ మాత్రం నిద్రకు దూరమై తన డ్రాయింగ్ రూమ్‌లో అటూ ఇటూ పచార్లు చేస్తూనే వున్నాడు.

సాయంకాలం తను చూసిన సంఘటన ఇంకా మర్చిపోలేకపోతున్నాడు. ఆ సమయంలో రాజమండ్రి నుండి తన బైక్‌మీద ఇంటికి తిరిగివస్తున్నాడు.

అగ్నివేశాచార్యుని ఎస్టేట్‌ను సమీపిస్తుండగా లోన కారు హారన్ సౌండ్, జనం లోనకు పరుగెత్తి చోద్యం చూడ్డం గమనించి బైక్ ఆపాడు. ఏమిటో తెలుసుకునే ఉద్దేశంతో తనూ లోనకు వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే అగ్నివేశాచార్యులు అక్కడికి వస్తున్నాడు.

ఆ తర్వాత అక్కడ జరిగిన సంఘటనకి ప్రత్యక్ష సాక్షిగా తనూ అక్కడే ఉన్నాడు. తన వద్దగల డిజిటల్ కెమెరాతో అగ్నివేశాచార్యునీ, చరక్‌నీ, మిత్ర విందనీ, శుశ్రుతనీ ఫోటోలు తీశాడు. మిత్రవింద...???

ఆమె రూపం ఇంకా కళ్ళముందు మెదులుతూనే ఉంది. ఆరడుగుల ఆ సౌందర్యవతి ఎవరు? మానవ కన్యలా లేదు. ఆరు అడుగులు కాదు... ఇంకా ఎత్తే ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా 6.2 అడుగుల ఎత్తు వున్న స్త్రీ ఉన్నట్లు తనెక్కడా చదవలేదు, వినలేదు.

ఆమె ముఖంలో దైవకళ ఉట్టిపడుతోంది. ఆమె ఎక్కడి నుంచి వచ్చింది? చరక్‌తో ఆమె అనుబంధం ఏమిటి? అగ్నివేశాచార్యుని కుటుంబంతో ఆమెకి సంబంధం ఏమిటి? ఏమీ అర్థంగావటంలేదు.

తను ఒక నాస్తికుడు. ఆచారాలను, సాంప్రదాయాలను గౌరవిస్తాడుగాని దేవుడు, దయ్యాలంటే బొత్తిగా నమ్మకం లేదు. మంత్రాలు, తంత్రాల మీద అస్సలు నమ్మకం లేదు. హేతువాదుల్లాగే తనూ అలాంటివన్నీ అభూతకల్పనలని వాదించేవాడు. కాని ఈ రోజు కళ్ళముందు జరిగిన సంఘటన మతిపోగొట్టడమే కాదు. తననే మార్చేసింది.

వెళ్తున్న కారులో వాళ్ళు ఉన్నట్టుండి నిద్రపోవడం ఏమిటి? ఆ కారుని తగలబెట్టడానికి ఆకాశంలోంచి మెరుపులా మంటలు దూసుకురావడం ఏమిటి?

అగ్నివేశాచార్యుడు ఆ మంటలను అరచేతపట్టి తిప్పికొట్టడం ఏమిటి... కళ్ళముందు జరిగిన ఆ సంఘటనకి అర్థం ఏమిటి? మంత్రశక్తులు ఉన్నాయనా, లేవనా? ఉన్నాయనేగా... అగ్నివేశాచార్యుని కుటుంబంతో ఎవరికో శత్రుత్వం ఉంది.

ఎవరు వాళ్ళు? కొద్దికాలం కిందట అగ్నివేశాచార్యుడు ఎస్టేట్‌లో మునిమనవడు చరక్‌చేత పూజలు హోమాలు చేయించినట్టు తెలిసింది.

ఇవన్నీ దేనికి? ఎవరైనా వయసయితే కృష్ణా-రామా అంటూ ఓ పక్కన కూర్చుంటారు. కాని నూటపాతికేళ్ళ వటవృక్షంలాంటి అగ్నివేశాచార్యునికి విశ్రాంతి అంటూ ఉన్నట్టే తెలీదు. ఏదో లక్ష్యం కోసం ఆయన కృషిచేస్తున్నట్టు అనిపిస్తోంది.

ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఉద్దేశం ఏమిటి? కట్టబోయేది ఏ దేవుడి గుడో ఎందుకు చెప్పడంలేదు. ఇలా అసక్తికరమైన ప్రశ్నలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. కాని దేనికీ తనవద్ద సమాధానం లేదు. ఆలోచించే కొద్దీ– ఇది సాధారణ విషయంగా తోచడంలేదు భీష్మనారాయణకి.

తను సేకరించింది చాలా తక్కువ సమాచారం. తను చేయాల్సిన కృషి ఎంతో ఉంది. ఎస్టేట్ భవంతిలో ఏదో జరుగుతోంది. అదేమిటో తెలుసుకోనిదే తనకు నిద్రపట్టదు. ముఖ్యంగా మిత్రవింద గురించి మొత్తం తెలుసుకోవాలి. అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వస్తూ పెన్ను, ప్యాడ్ అందుకుని టేబిల్ ముందు కూర్చున్నాడు భీష్మనారాయణ.

*　　*　　*　　*　　*

"మీరేదో ఇక్కడ నాలుగు రోజులు ప్రశాంతంగా సంతోషంగా గడపాలని వచ్చారు. కాని ఇలా జరిగింది. గొప్ప ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇకనుంచీ చాలా అప్రమత్తంగా ఉండాలి" ఎదురుగా వున్న ముగ్గుర్నీ చూస్తూ గంభీరంగా పలికాడు అగ్నివేశాచార్యుడు.

అది రాత్రి తొమ్మిది గంటల సమయం. కరెంట్ కోత కారణంగా కోరుకొండ ఊరంతా చీకటిలో మునిగివుంది. చాలా ఇళ్ళలో ఛార్జింగ్ లైట్లతో కాలక్షేపం చేస్తుండగా వసతిగలవారి ఇళ్ళలో ఇన్‌వెర్టర్లతో ఫ్యాన్లు, టీవీలు యధావిధిగా పనిచేస్తున్నాయి.

అయితే ఎస్టేట్ భవంతిలో మాత్రం కరెంట్‌తో పనిలేదు. ఎప్పటిలాగే ఆముదం దీపాల కాంతులు ప్రకాశిస్తున్నాయి. ఆవరణలో దేవదారు కట్టెల దివిటీలు చీకట్లను తరుముతున్నాయి.

భోజనాలనంతరం మేడమీది తన డ్రాయింగ్ రూమ్‌లో మునిమనవడు చరక్, మిత్రవింద, శుశ్రుతలతో సమావేశమై ఉన్నాడు అగ్నివేశాచార్యుడు.

జరిగిన సంఘటనలను సమీక్షించుకుంటున్నారు. అగ్నివేశాచార్యుని మాటలకు స్పందిస్తూ– "క్షమించండి జేజి తాతగారు, ఇకమీదట ఇలాంటి పొరపాట్లు జరగనివ్వను" అంది మిత్రవింద.

"మీకు అర్థంగావటంలేదు. నా బాధ జరిగిన సంఘటన గురించి కాదు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మరి దేనిగురించి జేజిగారూ. ఇకమీదట అలర్ట్‌గా ఉంటామంటున్నాంగా" అన్నాడు చరక్.

"నీకు తెలీదురా అబ్బాయ్. మనం ఏమిటో, మన లక్ష్యం ఏమిటో, ఏం చేస్తున్నామో ఇవన్నీ బయటి ప్రపంచానికి తెలీకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఇంతవరకూ కాపాడుకుంటూ వచ్చాను.

కాని మూర్ఖుడు, దురాత్ముడు అయిన ఆ మరిడి సోమయ్య మూలంగా పరిస్థితులు చిందరవందర అయ్యేటట్టున్నాయి. ఈ రోజు జరిగిన సంఘటన మూలంగా జనం దృష్టి మనవైపు మళ్ళింది.

మీడియావాళ్ళ మూలంగా పత్రికల్లో వార్తా కథనాలు మొదలయితే మనం చాలా సమస్యలను ఎదుర్కోవాలి. అదే ఆలోచిస్తున్నాను" అంటూ అసలు విషయం బయటపెట్టాడు.

ఆ మాటలు వినగానే- చరక్ ఆలోచనలో పడిపోయాడు. జేజి తాతగారి మాటలు యధార్థమే గాని- ఆ సమయంలో ఇక్కడ మీడియావాళ్ళు ఎవరు ఉన్నారని? "జేజిగారూ, మీడియావాళ్ళని మీరు చూశారా?" అని అడిగాడు.

"దారినపోయేవాళ్ళు చాలామంది లోనకొచ్చారు. వేరే ఎవరన్నా యాదృచ్ఛికంగా వచ్చేరేమో తెలీదుగాని ఒకే ఒక్కడు... అతను ఇక్కడున్నాడు"

"ఎవరతను?"

"కోరుకొండ స్థానిక జర్నలిస్టు భీష్మనారాయణ. ఇంటర్వ్యూ కావాలంటూ రెండురోజుల క్రితం నా వద్దకొచ్చాడు. వీలు కాదన్నాను. ఏవో సందేహాలు అడిగి తెలుసుకుని వెళ్ళిపోయాడు.

అంతవరకే. పేపర్లకు నా గురించి రాయనని ప్రామిస్ చేశాడు. కాని... చెప్పలేం. మీడియావాళ్ళకు ఎప్పుడూ హాట్‌న్యూస్ కావాలి"

"డోన్ట్‌వర్రీ జేజి తాతగారు... రేపు నేను వెళ్ళి అతనితో మాట్లాడతాను" అన్నాడు చరక్.

"వద్దురా... కదిపితే కందిరీగలాంటి వాళ్ళు. మరింత రెచ్చిపోతారు. చూద్దాం. ఆ విషయం నాకు వదిలెయ్" అన్నారు.

"ఈ విషయం వదిలేస్తాం సరే జేజిగారూ. ఆ మరిడి సోమయ్య సంగతేమిటి? ఈ సమస్యలన్నిటికీ వాడే కదా మూలం? మీ ఆశయం సిద్ధించ కుండా చేయడం కోసం ఇప్పుడు వాడు నన్ను టార్గెట్ చేసుకున్నాడు. నన్ను చంపాలని ప్రయత్నించాడు.

స్వయంగా ఇద్దరు శిష్యులతో మండపేట వచ్చి లాడ్జిలో ఉండి నన్ను చంపటానికి విశ్వప్రయత్నం చేశాడు. మిత్రవిందను ఎత్తుకుపోవాలని చూశాడు. అలాంటివాణ్ణి మిత్రవిందా చంపకుండా వదిలేసింది. మీరూ ఉపేక్షిస్తున్నారు. వాణ్ణి కట్టడిచేయకుంటే సమస్యలు తప్పవు" అన్నాడు ఆవేశంగా చరక్.

"కాలం అన్ని సమస్యల్నీ పరిష్కరిస్తుంది. దైవబలం మనపక్క ఉన్నంత వరకు ఏ సమస్యకీ భయపడాల్సిన పనిలేదు. దివ్యశక్తుల్ని అనవసర విషయాలకు ఖర్చు చేసేస్తే అవసరానికి మిగలకుండాపోతాయి. నా మాటలు నీకన్నా మిత్ర విందకు బాగా అర్థమవుతాయి. ఆవేశం కాదు, ఆలోచన కావాలి అన్నాడు. చాలా పొద్దు పోయింది. రేపు మాట్లాడుకుందాం... వెళ్ళి నిశ్చింతగా నిద్రపోండి" అని అంటూ లేచాడు అగ్నివేశాచార్యుడు.

*　　*　　*　　*　　*

చరక్ గత కాలంలోకి వెళ్ళి ఏం తెచ్చినా వాటిని సొంతం చేసుకుని విదేశీ మార్కెట్‌లో అమ్మి కోట్లాది రూపాయలు సొంతం చేసుకోవాలని సమయం కోసం నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నవాడు శంభులింగ మహాపాత్రో...

అటువంటి శంభులింగ మహాపాత్రో– ఆ రోజు అకస్మాత్తుగా తన మనుషులు పదిమందిని వెంట బెట్టుకుని సరాసరి నీలోదరి కొండగుట్టకు రావడం మరిడి సోమయ్య శిష్యవర్గంలో చాలా చర్చనీయాంశమయింది.

"మహాపాత్రో... ఫోన్ కూడా చేయకుండా సడెన్‌గా విచ్చేశారు. సంతోషం. ఏమిటి విశేషాలు?" అతిధి మర్యాదల అనంతరం తిరిగి కూర్చున్నాక పరామర్శించాడు మరిడి సోమయ్య.

శంభులింగ మహాపాత్రో ప్రసన్నంగా లేడు. మనిషి చాలా గంభీరంగా, సీరియస్‌గా చూస్తున్నాడు. "విశేషాలు నీ దగ్గర ఉంచుకుని, నన్ను విశేషాలు అడుగుతావేమి సోమయ్యా?" అంటూ ఎదురు ప్రశ్నించాడు శంభులింగ మహాపాత్రో.

"విశేషాలా... నా దగ్గరా... ఏమున్నాయి? నాకేం అర్థంకాలేదు" అంటూ బదులిచ్చాడు మరిడి సోమయ్య.

"నిజంగానే అర్థంకాలేదా? లేక అర్థమయికూడా అర్థంకానట్టు నటిస్తున్నావా?"

"మనం సూటిగా మాట్లాడుకోవడం మంచిది మహాపాత్రో. మీరు ఏ విషయం గురించి మాట్లాడుతున్నారు?" అన్నాడు మరిడి సోమయ్య.

"మన ఒప్పందం మీరి నువ్వు చేస్తున్న పనేమిటి?"

"నేనేం చేశాను?"

"ఆ చరక్ ద్వారక నుండి పురాతన వస్తువులు ఏం తెచ్చినా అవి నాకు సొంతం కావాలని చెప్పాను. అంగీకరించావ్. నీకు లక్షలకొద్దీ ధనసాయం చేసి క్షుద్రపూజలు జరిపిస్తున్నాను. అవునా?"

"అవును. కాదని ఎవరన్నారు?"

"ఇంకా నటించకు. నీ పూజలు ఎంతవరకు వచ్చాయని అడగను. కాని ఆ చరక్‌ను చంపాలనే పాడు ఆలోచన ఎలా వచ్చింది? అలా చేయడం మన ఒప్పందానికి విరుద్ధం కాదా?" ఉచ్ఛస్వరంతో కోపంగా శుంభులింగ మహాపాత్రో అడుగుతుంటే మాంత్రికుడు మరిడి సోమయ్యకు గొంతులో పచ్చివెలక్కాయ అడ్డం పడినట్టయింది.

ఇంతవరకు తమ మధ్య ఉన్న ఈ విషయం శంభులింగ మహాపాత్రోకి ఎలా తెలిసిందో అర్థం కాలేదు. ఖచ్చితంగా తన శిష్యుల్లో ఒకడు ఎవడో శంభులింగ మహాపాత్రో మనిషయి ఉండాలి. లేకపోతే తెలిసే అవకాశమే లేదు. ఈ విషయం తర్వాత ఆలోచించాలి. ముందీ మూర్ఖుడికి ఏదో ఒకటి చెప్పి పంపించేయటం ముఖ్యం. "ఈ విషయం నీకెవరు చెప్పారని అడగను. కాని చరక్‌ను చంపాలని ప్రయత్నించి విఫలమైన సంగతి వాస్తవమే" అన్నాడు.

"అదే... వాడ్ని చంపితే మనకు లాభం ఏమిటి? అసలు చంపాలనే ఆలోచన ఎందుకొచ్చింది?"

"వాడ్ని చంపకపోతే మనలాంటివాళ్ళందరం ఛస్తాం గాబట్టి. ఆ అగ్ని వేశాచార్యుని సంకల్పం నెరవేరకుండా ఆపాలంటే చరక్‌ను అంతంచేయడం ఒక్కటే మార్గం. అందుకే నా ప్రయత్నం" అన్నాడు.

"మనం చావడం ఏమిటి? స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా?"

"శంభులింగ మహాపాత్రో. నాకు స్పృహ లేదనుకోవడం నీ పొరబాటు. అతడు తెచ్చే వస్తువులు సామాన్యమైనవి కావు...."

"ఆపవయ్యా సోమయ్యా" అనరిచాడు విసుగ్గా శంభులింగ మహాపాత్రో.

"లోకంలో పూర్వకాలపు మహామహులు వాడిన వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడోచోట ఎవరోకరికి దొరుకుతూనే ఉన్నాయి. అవి దొరికినవాళ్ళు ఛస్తున్నారా? ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు? చిన్నపిల్లల్ని భయపెట్టినట్టు నన్ను భయపెట్టాలని చూస్తున్నావే!

అంత దేనికి? పురాతన శివధనుస్సు ఎత్తి విరగ్గొడితే గాని శ్రీరాముడు సీతమ్మను చేపట్టలేకపోయాడు. ఆ ధనస్సును ఎత్తిన రాముడికేమైంది? ఏంకాలేదుగదా"

"మహాపాత్రో! నీ మాటలు అసందర్భంగా ఉన్నాయి. రాముడు అవతార పురుషుడు. ఆయనతో మనకి పోలికా...? అవతారపురుషుడు శ్రీకృష్ణుడు. ఆయన వస్తువుల్ని తాకే అర్హత కూడా మనకి, మనలాంటి పాపకర్ములకి లేదు. వాటి మూలంగా కలిధర్మం నశించి ధర్మసంస్థాపన జరుగుతుంది. ధర్మం తప్పిన జనులంతా చీమల్లా రాలిపోతారు...."

"ఆపవయ్యా సోమయ్యా. ఇంకా నన్ను నమ్మించాలనే ప్రయత్నం చేయకు. చరక్‌ను ప్రాణాలతో ఉంచాలి. ఆ వస్తువులేవో నాక్కావాలి. నాతో సహకరిస్తావా లేదా తేల్చిచెప్పెయ్"

'కష్టం... చాలా కష్టం. నేను తెలిసి మాట్లాడుతున్నాను. నీవు తెలీక మాట్లాడుతున్నావు. మన మధ్య సయోధ్య కష్టము. ఏమాత్రము అవకాశం చిక్కినా నేనా కుర్రాడ్ని అంతంచేయక మానను" తన నిర్ణయాన్ని స్థిరంగా పలికాడు సోమయ్య.

ఆ మాటలతో మహాపాత్రో కోపం హద్దులు దాటింది. చివ్వున లేచి నిలబడి నిప్పులు చెరిగే కళ్ళతో ఉరిమిచూశాడు. "అయితే ఇంతవరకు నేను నీకు అందించిన సాయం లక్షల్లో ఉంది. నా డబ్బు నాకు తిరిగిచ్చెయ్. వెళ్ళిపోతా. ఇక నుంచి నా సాయం నీకుండదు. డబ్బు సంగతి తేల్చు" అంటూ నిలదీశాడు.

ఆ మాటలకు ఘాటుగా స్పందిస్తూ– తనూ చివ్వున లేచి నిలబడ్డాడు మరిడి సోమయ్య "చిల్లి గవ్వ తిరిగివ్వను. ఇక నీవు వెళ్ళిపోవచ్చు" అన్నాడు సోమయ్య ఘాటుగా.

దాంతో శంభులింగమహాపాత్రో ముఖం కోపంతో కందగడ్డలా అయి పోయింది. "ఇదే నీ నిర్ణయమా?" అడిగాడు.

"అవును. ఇదే నా నిర్ణయం" అన్నాడు మరిడి సోమయ్య మొండిగా.

శంభులింగమహాపాత్రో విచక్షణాజ్ఞానాన్ని పూర్తిగా కోల్పోయాడు. ఎంతగా అంటే కట్టెదుట ఉన్నది మహామాంత్రికుడు మరిడి సోమయ్యనీ, తను అతని స్థావరంలో ఉన్నాడన్న విషయం కూడా మర్చిపోతూ–

"ఇంతవరకూ వచ్చాక నిన్ను క్షమించేది లేదు సోమయ్యా. నీకో గుణపాఠం నేర్పకుండా వదలను. నా నమ్మకాన్ని వమ్ముచేసిన నిన్ను క్షమించను.

అరేయ్. చూస్తారేం రా. వీడ్ని కాళ్ళు, చేతులు కట్టి లాక్కొచ్చి వ్యాన్‌లో పడేయండి. ఎవడు అడ్డొస్తాడో చూస్తాను" అంటూ తన మనుషులకు ఆర్డర్ వేశాడు. ఆ మాటతో అక్కడ ఉద్రిక్తపరిస్థితి చోటుచేసుకుంది. మరిడి సోమయ్య శిష్యులు ఆశ్చర్యంతో విచిత్రంగా చూస్తున్నారు. అఘోరా ఒక పక్క నిలబడి తమాషా చూస్తూ నవ్వుతున్నాడు.

కండబలాన్ని మాత్రమే నమ్ముకున్న సాధారణ మనుషులు వాళ్ళు. మరిడి సోమయ్యనేం చేయగలరు. కాదంటే సోమయ్య ఎలా స్పందిస్తాడనేది అఘోరా చూడాలనుకుంటున్నాడు.

శంభులింగమహాపాత్రో మనుషులు కరడుగట్టిన గూండాలు. ఉసిగొలిపితే మీదపడే వేటకుక్కల్లాంటి వాళ్ళు. అదే జరిగింది. వాళ్ళంతా ముందువెనకలు ఆలోచింపకుండా మరిడి సోమయ్యను బంధించడానికి మూకుమ్మడిగా ముందుకు దూకారు.

మరిడి సోమయ్య ఉన్న చోటనుంచి కదల్లేదు. సింపుల్‌గా తన మంత్రదండాన్నెత్తి ఏదో మంత్రం చదివాడు. అంతే ముందుకొస్తున్న వాళ్ళు వస్తున్నట్టే రౌడీలంతా క్షణం ఆగి గొర్రెలుగా మారి వెనక్కి తిరిగి శంభులింగ మహాపాత్రో మీద పడి కుమ్మటం ఆరంభించారు. ఊహించని ఆ పరిణామానికి అదిరిపడ్డాడు శంభులింగమహాపాత్రో.

పందెం పొట్టేళ్ళలా అవి తనమీద దాడిచేస్తుంటే బాధతో పిచ్చిగా అరుస్తూ ఎలాగో తప్పించుకుని మరిడి సోమయ్య వెనక్కి పరుగెత్తుతూ– "ఆపు... ఆపు. నువ్వు చెప్పినట్టు వింటాను" అనరిచాడు.

మరిడి సోమయ్య వాళ్ళను ఆపాడు.

"మహాపాత్రో. నా శక్తిసామర్థ్యాలు తెలిసి కూడా మూర్ఖంగా ప్రవర్తించావు. అయినా నిన్ను క్షమిస్తున్నాను. నానుంచి డబ్బు వసూలు చేయాలనే ఆలోచన విడిచిపెట్టు. వెళ్ళిపో" అన్నాడు.

"ఓ.కె. సోమయ్యా. పోలీసులతోనే కాదు. మంత్రగాళ్ళతో స్నేహంకూడా ముప్పు తెస్తుందని నాకిప్పుడు అర్థమైంది. ఓ.కె. ఇక బాకీ ప్రసక్తి వదిలేద్దాం. కాని... నా కోరిక నాదే. వదులుకోలేను.

మనం ఒక ఒప్పందానికొద్దాం. మన స్నేహాన్ని దృష్టిలో ఉంచుకొనయినా నువ్వు దీనికి అంగీకరించాలి" అన్నాడు శంభులింగ మహాపాత్రో.

మరిడి సోమయ్య క్షణకాలం ఆలోచించాడు "ఓ.కె. చెప్పు. ఎలాంటి ఒప్పందం అది?" అనడిగాడు.

"చరక్‌ను చంపాలనే నీ ప్రయత్నం నీది. నీకు నేను అడ్డురాను. అలాగే అతను తెచ్చే వస్తువులు సొంతం చేసుకోవాలనే ప్రయత్నం నాది. దానికి నువ్వు అడ్డురాకూడదు. ఇకనుంచి మనమధ్య ఎలాంటి లావాదేవీలూ ఉండవు. ఎవరి ప్రయత్నం వారిది. సరేనా?"

"సరి బ్రై చెయ్. నాకు అభ్యంతరం లేదు. ఇక బయలుదేరు" అన్నాడు మరిడి సోమయ్య.

తనవాళ్ళందర్నీ వెంటబెట్టుకుని అక్కడ్నుంచి వేగంగా వెళ్ళిపోయాడు శంభులింగ మహాపాత్రో. అంతవరకు మౌనంగా వున్న అఘోరా ముందుకొస్తూ "తప్పుచేశావ్ సోమయ్యా" అన్నాడు.

"పోనివ్వండి గురువుగారూ. ఆ దురాశాపరుడికి జరిగిన పరాభవం చాలు. ఇక మనవైపు కన్నెత్తి చూడడు" అన్నాడు మరిడి సోమయ్య.

ఈ లోపల– శంభులింగమహాపాత్రో నీలోదరి గుట్ట దిగివచ్చేసరికి అక్కడ అతడి వాహనాలు రెండు ఎదురుచూస్తున్నాయి.

అతడు తన కారులో కూర్చోగానే డ్రైవరు కారును పోనిచ్చాడు. వెనకే పెద్ద వ్యాన్‌లో గూండాలంతా ఎక్కి కూర్చుని ఆ కారుని ఫాలో అయ్యారు.

వాహనాలు పదినిముషాల్లోనే జాజ్‌పూర్ సిటీ సెంటర్‌లోకి వచ్చేశాయి. ఉన్నట్టుండి ఒకచోట తన కారు ఆపించాడు శంభులింగమహాపాత్రో.

వెనక వ్యాన్‌లోంచి ముగ్గుర్ని తన కారువద్దకు పిలిపించాడు. "ఏరా... ఈ రోజు నుంచి మీకు స్పెషల్ డ్యూటీ. మీలో ఒకడు మున్నలూరివారి అగ్రహారం వెళ్ళి అక్కడ తిష్టవేసి అగ్నివేశాచార్యుని ఇంటికి సంబంధించిన విశేషాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు నాకు ఫోన్ చేస్తుండాలి.

ఒకడు కోరుకొండ ఎస్టేట్ భవంతిని గమనిస్తూ నాకు రిపోర్ట్ చేస్తుండాలి. మూడోవాడు రంపచోడవరం అడవుల్లో అగ్నివేశాచార్యుని స్థావరం ఎక్కడో కనిపెట్టి అక్కడి విశేషాలు రిపోర్ట్ చేయాలి. శాటిలైట్ ఫోన్ పట్టుకెళ్ళాలి. ఎవరు ఎక్కడనేది మీరు నిర్ణయించుకోండి. ఇప్పుడే ఇక్కడ్నుంచే మీరు ఆంధ్రాకి వెళ్ళిపోతున్నారు. ఒక విషయం గుర్తుంచుకోండి.

అది మన ప్రాంతం కాదు గూండాయిజం చేయటానికి. ఒళ్ళు దగ్గ రుంచుకొని, వెళ్ళిన పనిమీద దృష్టిపెట్టండి. స్థానికులతో ఎలాంటి గొడవలు వద్దు. జాగ్రత్తగా ఉండండి" అంటూ వాళ్ళకి తలో ఏభైవేల రూపాయలు ఇచ్చి తన దారిన భువనేశ్వర్ దిశగా వెళ్ళిపోయాడు శంభులింగమహాపాత్రో.

అతడి మనుషులు ముగ్గురూ జాజ్‌పూర్‌లోనే తమకు కావలసినవి కొనుక్కుని ఆంధ్రాకు బయలుదేరి వెళ్ళిపోయారు.

* * * * *

"అక్కా! ఇది ఏమి ఫలము?" చేతిలోని ఎర్రటి యాపిల్ పండును చూపిస్తూ అడిగింది మిత్రవింద. అగ్నివేశాచార్యుడు ఎప్పుడో అరడజను యాపిల్ మొక్కలు తెప్పించి ఎస్టేట్ చివరి ప్రాంతంలో నాటించాడు. వాటిలో మూడు చనిపోగా, మూడు మొక్కలు వాతావరణాన్ని తట్టుకొని విచిత్రంగా పెరిగి పెద్దవయ్యాయి. ఎక్కువగాకున్నా ఎంతో కొంత ఫలసాయాన్ని అందిస్తున్నాయి.

శుశ్రుత, మిత్రవిందలు ఆ యాపిల్ చెట్లకింద ఉన్నారిప్పుడు.

ఎస్టేట్ కొచ్చిన మూడోరోజు ఇది. రెండు రోజులు ద్రాక్షతోట, బత్తాయి, పనసతోటలవైపు తిరిగి చూశారు. ఇవాళే ఇటుపక్కగా వచ్చారు. యాపిల్‌చెట్లను, పండ్లను ఆశ్చర్యంగా చూస్తోంది మిత్రవింద.

"అక్కా... ఇవి మూడూ యాపిల్ చెట్లు. ఈ ఎర్రటి పండ్లను యాపిల్‌పండ్లు అంటారు" తనో పండు కొరికి తింటూ వివరించింది శుశ్రుత.

"ఏమంటివి? దీని పేరేమి?"

"యాపిల్‌పండు"

"అటులనా... చాలా రుచిగా నున్నది" అంది పండు తింటూ మిత్రవింద. అంతలోనే ఏదో గుర్తుకొచ్చి– "అవునక్కా ఇంతటి మధురఫలములను మన ద్వారకయందు ఎన్నడూ చూడలేదేమి? మిగిలిన ఫలములు, ఫలవృక్షములు అన్నియు తెలిసినవే. ఇది మాత్రము తెలియకున్నదే"

"ఆ కాలంలో ఇవి ఎక్కడున్నాయో తెలీదుగాని అక్కా! ప్రస్తుతం ప్రపంచ మంతటా ఇవి చాలా పేరుపడ్డ ఫలములు"

ఆ సమీపంలోనే వున్న చరక్, ఎస్టేట్ వ్యవహారాలు చూసే రంగన్నలకు ఆ యువతుల సంభాషణ విన్నిస్తూనే ఉంది. "అయ్యా, నాకో సందేహం బాబూ. ఆ ఇద్దరమ్మాయిల్లో అక్క ఎవరు, చెల్లి ఎవరు? ఒకరి నొకరు అక్కా అనే పిలుచు కొంటున్నారే. రెండ్రోజులుగా ఎంత ఆలోచించినా నా మట్టిబుర్రకు అర్థమై చావట్లేదు" అనడిగాడు రంగన్న.

"ఆలోచించకు. బుర్ర చెడిపోతుందిగాని సమాధానం మాత్రం దొరకదు. మేం ఎల్లుండి వెళ్ళిపోతాం. మిత్రవిందకు ద్రాక్షపళ్ళంటే ఇష్టం. శుశ్రుతకు యాపిల్ ఇష్టం. నాన్నమ్మకు బత్తాయిపండ్లు ఇష్టం.

నాకు పనసపండ్లు ఇష్టం. మిగిలినవి నువ్వు ఏం పార్శిల్ కట్టిస్తావో గాని ఇవి మాత్రం తప్పకుండా ఉండాలి. వీళ్ళని నేను తీసుకొస్తాగాని వెళ్ళి పని చూసుకో" అన్నాడు చరక్.

"అలాగే బాబూ. చీకటిపడకముందే వచ్చేయండి" అంటూ హెచ్చరించి వెళ్ళిపోయాడు రంగన్న.

అంతలో దూరంగా తమను వెదుక్కుంటూ వస్తున్న అప్పన్నను చూడగానే నొసలు విరుస్తూ అక్కడే ఆగిపోయాడు చరక్.

"పెద్దయ్యగారు మిమ్మల్ని వెంటనే పిలుచుకు రమ్మన్నారండి" అన్నాడు అప్పన్న.

"ఏమిట్రా అంత అర్జంటు. ఏమైంది?" ఆశ్చర్యంగా అడిగాడు చరక్.

"నాకయితే తెలీదండి. కాని జడలు కట్టిన జుత్తు ఒళ్ళంతా బూడిద పూసుకుని త్రిశూలంలాంటి పొడవాటి కర్ర పట్టుకున్న గోచిపాత ముసలాయ నొకడు వచ్చున్నాడండి...." అన్నాడు అప్పన్న.

అప్పన్న మాటలు చరక్‌లో ఉత్కంఠత రేపుతున్నాయి. ఎవరా జడధారి? అఘోరా కాదుగదా... వాడు మరిడి సోమయ్య మనిషి.

జేజితాతగారి ముందుకు ఎందుకు వస్తాడు. అతను గాకపోవచ్చు. వేరెవరై ఉంటాడు.

అప్పన్న మాటలు పూర్తిగాకముందే మిత్రవింద, శుశ్రుతలు అక్కడి కొచ్చారు.

"ప్రియుడా, ముఖ్యఅతిథి ఒకడు వచ్చియున్నారు. పోవుదము రమ్ము" అంటూ పిలిచింది మిత్రవింద.

వచ్చినవాడు ఎవడో మిత్రవిందకు తెలిసిపోయిందని– చరక్ గ్రహించాడు. "ఆ సన్యాసికోసమేగా. ఎవడు వాడు?" అనడిగాడు.

"వాడు సన్యాసి కాదు" అంటూ నవ్వింది మిత్రవింద.

"నవ్వకు. నాకసలే టెన్షన్‌గా ఉంది. ఎవడు వాడు?" అడిగాడు చరక్.

"వచ్చింది ఎవరో చెప్పిన ఆశ్చర్యపోగలవు. వాడు అఘోరా. మాంత్రికుడు మరిడి సోమయ్య మనిషి"

మిత్రవింద నోట ఆ మాట వినగానే– పక్కన చిన్నబాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డాడు చరక్.

చివరకు తన సందేహమే నిజమైంది. "వాడెందుకొచ్చాడు? మనల్ని సజీవదహనం చేయాలని చూసిన దుష్టుడు. వాడికిక్కడ ఏం పని. జేజితాతగారు ఎందుకురానిచ్చారు. వాడ్ని ప్రాణాలతో వదలకూడదు. జేజిగారితో మాట్లాడతాను" అన్నాడు ఆవేశంగా.

అతడిమాటలకు స్పందిస్తూ మిత్రవింద "ప్రియుడా. ఏమి ఈ ఆవేశము? కోపమేల? వచ్చినవాడు శత్రువయినను రాయబారిని చంపుటయో అవమానిం

చుటయో ధర్మముకాదు. ఆ పైన నిర్ణయము తీసుకోవలసినది జేజితాత గారు. పోయి చూతము రండి" అంటూ భవంతి దిశగా దారితీసింది మిత్రవింద.

ఆమెను అనుసరించారు అంతా. అఘోరా రాకకు కారణం ఏమిటని దారిపొడవునా ఆలోచిస్తూనే ఉన్నాడు చరక్. కాని అతనికా విషయం అంతు బట్టలేదు. బహుశా మిత్రవిందకు తెలిసిపోయి వుంటుంది. కాని ఆమె చెప్పదు. క్రమంగా అంతా ఎస్టేట్ భవంతిని సమీపించారు.

*　　*　　*　　*　　*

దున్నపోతు తల కలిగిన మహిషశక్తుడి విగ్రహం భీకరంగా నిలువెత్తున నిలబడి ఉంది. ఎదురుగా నిప్పులగుండం జ్వలిస్తోంది. పక్కనే నెత్తురుకూడు కుంభం రాశిపోసివుంది.

ఎర్రని పూలమాలలు, పసుపు కుంకుమలతో జంతు బలినెత్తురు కలిసి అతిభయంకరంగా ఉంది మహిషశక్తుడి విగ్రహం. ఆ విగ్రహం కనులు ఎర్రగా నెత్తుటి వర్ణంలో జ్వలిస్తున్నట్టున్నాయి.

చాలారోజులుగా పూజలు చేస్తున్నా ఎంతకూ మహిషశక్తి వశంగాక పోవటం, ఆపైన వరస పరాజయాలతో విసిగిపోయివున్నాడు మరిడి సోమయ్య.

దాంతో ఆగ్రహోదగ్ధుడవుతూ మహిషుడితో తాడోపేడో తేల్చుకునే ఉద్దేశంతో ఏకాంతంగా పూజ ఆరంభించాడు. ఏవో మంత్రాలు చదువుతూ పెద్దగా అరుస్తూ గుప్పిళ్ళకొద్దీ సాంబ్రాణి నిప్పులమీద కొడుతుంటే దట్టమైన సాంబ్రాణి పొగలు ఆ ప్రాంతమంతా వ్యాపిస్తున్నాయి. నిప్పులగుండం నుండి అగ్గిరవ్వలు ఎగసిపడుతున్నాయి.

"మహిషా...." మహిషుడి విగ్రహాన్ని చూస్తూ పెద్దగా హుంకరించాడు మరిడి సోమయ్య.

"ఇంకా ఎంతకాలం కొనసాగించాలి ఈ పూజలు? కుంభాలకొద్దీ నెత్తురుకూడు నిత్యం స్వాహా చేస్తున్నావుగాని ఉలుకూ పలుకూ లేకుండా ఉంటివి.

అసలు నాకు వశమయ్యే ఉద్దేశం ఉందా లేదా? లేకుంటే చెప్పు. ఈ రోజుతో పూజలు ఆపేస్తాను. మాట్లాడు... మాట్లాడవేం?" కోపంతో కంఠనాళాలు తెగిపోయేంత బిగ్గరగా అరిచాడు.

అతడి అరుపులతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. ఆ మరుక్షణమే– మహిషుడి విగ్రహం కనులు ఎర్రగా నెత్తుటివర్ణంలో జ్వలింపనారంభించాయి.

మహిషుడి మాటలు గరగరలాడుతూ వినవచ్చాయి. "ఏమిరా నీ ఆవేశము... నన్ను సంతృప్తిపర్చకున్న ఎటుల వశమయ్యేద?" అంటూ మాటలు వినవచ్చాయి. మరిడి సోమయ్య కనులు విచిత్రంగా మెరిశాయి. ఎప్పుడైతే మహిషుడి మాటలు విన్పించాయో ఆ క్షణమే అతడి ఆవేశం అణగిపోయి నరాల వెంట భక్తిభావం వరదలా ప్రవహించింది.

"మహిషా... పాహిమాం పాహిమాం... ఇప్పటికైనా దయగలిగిందా శక్తిమంతా. నీవు సంతృప్తిచెంది నాకు వశము కావలెనన్న నేను ఏమి చేయవలె?

నీవు కోరినది సమర్పించి నిను సంతృప్తిపర్చెద" అంటూ ఆ క్షుద్రశక్తికి నమస్కరించాడు.

"నేను వశముకావలెనన్న నరబలి సమర్పించవలె" మహిషుడి మాటలు విన్పించాయి. ఆ మాటలు వినగానే మరిడి సోమయ్య ముఖం సంతోషంతో వికసించింది.

"అది ఎంత పని. ఇచట నా శిష్యులు అనేకమంది ఉన్నారు. నీవు కోరినవానిని బలి ఇచ్చెద" అన్నాడు.

"వారిలో ఎవరూ పనికిరారు"

"వేరేవరు కావలె?"

''వివాహముకాని సుక్షత్రియ రాచకన్యను బలిఇమ్ము. తక్షణం వశంకాగలను"

మహిషుడి కోరిక విని– మరిడి సోమయ్య విసుగ్గా చూశాడు. "రాజులు, రాచకన్యలు ఎక్కడున్నారు మహిషా. మీ క్షుద్రశక్తులింకా పాతకాలంలోనే ఉంటే మాలాంటివారి పరిస్థితి ఏమిటి?

రాజులు, రాచరికాలు పోయి నేడు ప్రజాప్రభుత్వాలు నడుస్తున్నాయి. నీ కోరిక తీర్చుట అసాధ్యము. వేరే కోరుకొనుము" అన్నాడు.

"అటులయిన ఒక దేవకన్యను దెచ్చి బలిమ్ము" అన్నాడు మహిషుడు.

"ఇదియును అసాధ్యమే. దేవకన్యను వెదకి పట్టుకొనుట ఎప్పటికి, నా సంకల్పము నెరవేరుట ఎప్పటికి... సుసాధ్యమగునుపాయము తెలుపుము"

"ఇది చివరి అవకాశము. ఇదియును అసాధ్యమనిన నేను ఎన్నటికీ నీ వశముగాను" అన్నాడు మహిషుడు.

"ఏమది తెలుపుము మహిషా" అన్నాడు సోమయ్య.

"నీవలెనే ఒక మహామాంత్రికుని బలి ఇచ్చిన తక్షణం వశమయ్యెద" అన్నాడు మహిషుడు.

"మాంత్రికుడు... ఎవడు వాడు... ఎక్కడున్నాడు" పిచ్చిగడ్డం దువ్వుకుంటూ తీవ్రంగా ఆలోచనల్లో మునిగిపోయిన మరిడి సోమయ్యకు కళ్ళ ముందు అఘోరా కన్పించాడు.

తక్షణం ఒక నిశ్చయానికొచ్చేస్తూ–

"మహిషా... ఇప్పుడే నీ కోరిక తీర్చెద. ఒక మహామాంత్రికుని వంటివాడినే బలిచ్చెద" అంటూ మరిడి సోమయ్య బయటకు కదలబోతూండగా అదే క్షణంలో లోపలికి వస్తూ కన్పించాడు అఘోరా.

"ఆహా! వెదకబోయిన తీగ కాలికి తగలటమంటే ఇదే" అనుకుంటూ "గురువుగారూ... రండి రండి" అంటూ ఆనందంతో ఎదురువెళ్ళి సాదరంగా స్వాగతించాడు అఘోరాని.

"ఏమి సోమయ్యా. చాలా ఉత్సాహముగా ఉన్నావ్. మహిషుడు వశమయ్యాడా?" అనడిగాడు అసలు విషయం తెలీని అఘోరా అమాయకంగా.

జిత్తులమారి మరిడి సోమయ్యకు తెలుసు. ఏ మాత్రం అఘోరా ధ్యాసమళ్ళినా తన మనసులో మాట పసిగట్టి ప్రతీకారం చేస్తాడు.

అందుకే అత్యుత్సాహం చూపుతూ– "గురువుగారూ, ఇన్ని రోజుల మనపూజలు చివరి అంకానికి చేరుకున్నాయి. ఒకటి రెండు రోజుల్లో నా వశమై నన్ను అజేయుడ్ని చేస్తానంటున్నాడు" అన్నాడు.

"అలాగా. సంతోషం. ఇంకేమి? పూజలు కొనసాగించు" అన్నాడు అఘోరా.

"రండి గురువుగారూ. నా మాటలుకాదు. మీరే మహిషుడికి ధూపం వేసి అడగండి. మీతో ఏం చెప్తాడో చూద్దాం. రండి త్వరగా" అన్నాడు మరిడి సోమయ్య.

"సరి. నీ ఆనందాన్ని కాదనలేనుగా. పద" అంటూ వచ్చి అగ్గిగుండం పక్కన నిలబడ్డాడు అఘోరా. గుప్పిళ్ళతో సాంబ్రాణి తీసుకొని రగులుతున్న నిప్పుల్లో వేస్తూ– "మహిషా...." అంటూ పిలిచాడు అఘోరా.

మహిషుడు బదులివ్వలేదు.

ఇంతలో– నిశ్శబ్దంగా అఘోరా వెనక్కి చేరిన మరిడి సోమయ్య పక్కనున్న జంతువుల్ని బలిచ్చే వేటకత్తిని అందుకున్నాడు.

ఒకే ఒక్క వేటు– "జై మహిషశక్తీ" అనరుస్తూ అఘోరా మెడ నరికేశాడు. తల పుచ్చకాయలా తెగి ఎగిరి నేల మీద పడి దొర్లింది.

ఎప్పుడైతే అఘోరా తల నరికి మహిషుడికి బలి ఇచ్చాడో మరుక్షణం అక్కడ కనులు మిరుమిట్లు గొలిపే వెలుగురేఖలు మెరిశాయి.

నిప్పులగుండంలో నిప్పుకణికలు ఎగిరి చెల్లాచెదురుగా పడ్డాయి.

ఎదురుగా వున్న మహిషుడి విగ్రహం పెద్దగా శబ్దం చేస్తూ తునాతున కలుగా ప్రేలిపోయింది. ఆ స్థానంలో నిజరూపంతో ప్రత్యక్షమయ్యాడు క్షుద్రుడైన మహిషశక్తుడు.

నల్లని బలిష్టమైన దేహం, ఎనిమిది అడుగుల ఎత్తున దున్నపోతు తల కలిగి శరీరమంతటా రోమాలు కలిగి ఎర్రని కనులతో ప్రత్యక్షమవుతూనే ఎనుబోతులా భీకరంగా రంకెవేశాడు.

అంతటి మరిడి సోమయ్యకే ఆ రంకె వినగానే వెన్ను జలదరించింది.

ఈ లోపల– తల తెగిన అఘోరా మొండెం నెత్తురోడుతూండగా తల పడినచోటువైపు ఐదడుగులు నడిచి దబ్బున కిందపడిపోయింది.

కాని చలనం ఆగలేదు. చేతులు పైకి, పైపైకి చాపి తన తలను చేతులతో అందుకున్నాడు. తలను తిరిగి తన మొండెంతో చేర్చి మంత్రదండాన్ని పైకి లేపాడు. అంతే– అఘోరా శిరస్సు మొండానికి ఎప్పటిలా అతుక్కుపోయింది. అచేతనస్థితిలో అలాగే కొంతసేపు ఉండిపోయాడు.

మహిషుడు ప్రత్యక్షంగావటంతో అఘోరాని ఇక గమనించలేదు మరిడి సోమయ్య. "సంతోషం... మహా సంతోషం మహిషా. నీ నిజరూప దర్శనంతో ధన్యుణ్ణయ్యాను" అన్నాడు మహిషుడితో.

"నీ పట్ల నేను ప్రసన్నుడనయ్యాను మానవా. ఈ క్షణమునుండి నేను నీ వశమైతిని. ఎప్పుడు తలచిన అప్పుడు నీకు అగుపించి నీ కోరిక తీర్చగలను" కర్కశంగా పలికాడు మహిషుడు.

"ధన్యుణ్ణి మహిషా. ఇకనుండి నా బలము, నా గర్వము, నా సర్వము నీవే. ధన్యుడ్ని" అన్నాడు మరిడి సోమయ్య.

ప్రత్యక్షమైన మహిషుడు అదృశ్యమయ్యాడు. మరిడి సోమయ్యకిప్పుడు చాలా సంతృప్తిగా పెద్ద పెద్ద అంగలు వేస్తూ బయటికెళ్ళిపోయాడు.

అతడెళ్ళిన మూడో నిముషంలో పునర్జీవితుడైన అఘోరా తిరిగి లేచాడు. ఒకసారి చుట్టూ చూశాడు.

మహిషుడి విగ్రహం తునాతునకలై ఉంది. చెల్లా చెదరుగా పడిన నిప్పు కణికలు ఇంకా రగులుకొంటున్నాయి.

ఆ ప్రాంతమంతా వెగటు వాసన వస్తోంది. చేసిన మోసం తలుచుకుంటే తన మీద తనకే అసహ్యంగా ఉంది అఘోరాకి. మనసు తీవ్రంగా వ్యధచెందు తోంది. ఇంత మోసమా... ఏమి ఈ పరాభవం.

గురువుగారూ అంటూ నోరారా పిలిచి తననే బలి ఇచ్చి మహిషుణ్ణి వశం చేసుకున్న మరిడి సోమయ్య తీరు క్షమించరానిది. వాడిమీద కోపం కట్టలు తెంచుకుంటోంది. కాని వివేకం వారిస్తోంది అవును...

పాలు పోసినా పాము విషాన్ని కక్కుతుందని తెలిసీ ఈ నీచుణ్ణి నమ్మి రావటం తన తప్పు.

ఎక్కడో స్మశానాల్లో సాటి అఘోరాలతో తిరిగే తను గత పరిచయాన్ని దృష్టిలో ఉంచుకొని మరిడి సోమయ్య కోరగానే సాయం చేయటానికొచ్చి ఘోర తప్పిదం చేశాడు.

వీణ్ణి నమ్ముకొని వీడికోసం చేయరాని పాపాలు చేశాడు. తనకీ అవమానం జరగాల్సిందే. ఇక ఒక్కక్షణం కూడా ఇక్కడ ఉండకూడదు. ఆ విధంగా ఒక నిర్ణయం తీసుకోగానే కోపావేశాలను అదుపులో ఉంచుకుంటూ వడివడిగా బయటికి నడిచాడు అఘోరా.

అతను బయటికొచ్చేసరికి మహిషశక్తి తన వశమైన విషయాన్ని శిష్యులకు వివరిస్తూ ఆనందంతో పొంగిపోతున్నాడు మరిడి సోమయ్య.

*　　*　　*　　*　　*

అకస్మాత్తుగా ఏమీ జరగనట్టే ప్రశాంతంగా బయటికొస్తున్న అఘోరాను చూసి ఒక్కసారిగా కొయ్యబారిపోయాడు. బలిపెట్టిన అఘోరా మరణించాడను కున్నాడు. కాని బతికి బయటికొస్తున్న ఆఘోరాని ఎలా ఊహించుకోవాలో తెలీక షాకయ్యాడు మరిడి సోమయ్య.

కాని అంతలోనే తేరుకున్నాడు. అఘోరా సామాన్యుడు కాడని తెలిసి కూడా అతడ్ని బలిచ్చాడు. ఏం చేస్తాడోనని కంగారుపడ్డాడు. కాని మౌనంగా తన దారిన వెళ్ళిపోతున్న అఘోరాని చూడగానే లేచి గబగబా దగ్గరకొచ్చాడు.

"గురువుగారూ క్షమించాలి... కరుణించండి... మహిషశక్తిని వశంచేసు కోవడానికి వేరే దారిలేక మిమ్మల్నే బలివ్వక తప్పలేదు. నన్ను క్షమించండి" అంటూ ప్రాధేయపడ్డాడు.

మరిడి సోమయ్యను ఒక విషపురుగును చూసినంత అసహ్యంగా చూశాడు అఘోరా. "నిన్ను క్షమించాను గాబట్టే శపించకుండా వెళ్ళిపోతున్నాను. దారి తప్పుకో" అన్నాడు ప్రశాంత వదనంతో.

"లేదు లేదు గురువుగారూ. మీరు మాతోనేఉండాలి. ఎక్కడికీ వెళ్ళాల్సిన పనిలేదు"

"ఆపరా నీ నక్కవినయాలు" ఘాటుగా స్పందిస్తూ అరిచాడు అఘోరా.

"ఇక్కడే ఉంటే అవసరానికి మరోసారి నన్ను బలిపశువును చేయొచ్చనా? అసంభవం. నేవెళ్ళిపోతున్నాను. నీలాంటి నీచుడితో చేయికలపటం ఎంత తప్పిదమో నాకు బాగా అర్థమైంది.

మరోసారి ఈ తప్పు చేయను. గురుస్థానంలోని నన్నే బలిపెట్టిన నీకన్నా నీచనికృష్టుడు బహుశా లోకంలో మరొకడుండడు. కాని... నా కళ్ళు తెరిపించావురా. అందుకు నిన్ను అభినందించాలి. ఇక మీదట నానుంచి ఎలాంటి సాయం నీకుండదు. నా కోసం ఎదురుచూడక" అంటూ తనదారిన మరిడి సోమయ్య పక్కనుంచే వడివడిగా బయటకు నడిచాడు.

ఎంతో ఆర్భాటంగా ఒకరోజు తమ గురువు మరిడి సోమయ్య వెంట నీలోదరికి వచ్చి తమతో ఉన్న అఘోరా ఇప్పుడు ఒంటరిగా గుట్ట దిగి వెళ్ళి పోతుంటే శిష్యులకు బాధనిపించింది.

"మీరు నిజంగానే తప్పుచేశారనిపిస్తోంది గురువుగారూ. అఘోరాని బలిచ్చి ఉండకూడదు" అన్నాడు మృణాళుడు.

"అవును గురువుగారూ. మహిషుడి వల్ల మీకెంత ఉపయోగం ఉంటుందో తెలీదు గాని అఘోరా వెళ్ళిపోవటం మాత్రం అంతకు మించిన నష్టమే" అంటూ మృణాళుడిని సమర్ధించాడు శిష్యుడు విళంబి.

"ఏమిరా? నాకే నీతులు చెప్తున్నారా? పొండి, వెళ్ళి పనిచూసుకోండి" అంటూ శిష్యులమీద అరిచి విసుగ్గా లోనకెళ్ళిపోయాడు మరిడి సోమయ్య.

*　　*　　*　　*　　*

సాయంకాలం సమయం.

నౌకరు అప్పన్నతో మాట్లాడుతూ కిందహాల్లోనే కూర్చునున్నాడు అగ్నివేశాచార్యుడు.

అంతకు చాలాసమయం ముందే మిత్రవింద, శుశ్రుతలను వెంట బెట్టుకుని ఎస్టేట్ తోటల వైపు వెళ్ళాడు చరక్. ఇంటి దగ్గర విషయాలను అప్పన్న వివరిస్తూంటే ఆసక్తిగా వింటున్నాడు అగ్ని వేశాచార్యుడు. సరిగ్గా ఆ సమయంలో–

సరాసరి లోనకొచ్చేస్తున్న ఒక సన్యాసిమీద అగ్ని వేశాచార్యుని దృష్టి పడింది. డ్రైవరు కాశీ ఆపాలని చూస్తున్నా ఆగకుండా నేరుగా వచ్చేస్తున్నాడతను.

నిజానికి అతను సన్యాసికాదు. జడలు కట్టిన జుత్తు బక్కపల్చని దేహం, ఒడలంతా బూడిదపూసుకొని త్రిశూలంలాంటి కర్రను చేత పట్టుకున్నాడు. అది

త్రిశూలం కాదు మంత్రదండమని గ్రహించడం కష్టం. ఒంటిమీద కావిరంగు గోచి తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. నుదుట ఉదయించే సూర్యుడిలా ఎర్రటి పెద్ద కుంకుమబొట్టు ఉంది. వయసు సుమారు డెబ్భై అయిదేళ్ళు ఉండొచ్చు. అతడ్ని ఎప్పుడూ ఎక్కడా చూసిన గుర్తు లేదు అగ్నివేశాచార్యునికి. ఈ జడధారికి తనతో పనేమిటి? ఆలోచిస్తూ అతడ్నే చూస్తున్నాడు.

డ్రైవరు కాశీ ఇప్పుడు మాట్లాడగలుగుతున్నాడు. వాడి నిజాయితీ గుర్తించాక వాడికి తిరిగి నోటిమాట, బొటనవేలు యధావిధిగా పనిచేసేట్టు అనుగ్రహించాడు అగ్నివేశాచార్యుడు. దాంతో వాడు ఎప్పటి కాశీలా చక్కగా మాట్లాడుతూ యధావిధిగా అన్ని పనులూ చేసుకోగలుగుతున్నాడు.

"ఇదిగో సన్నాసి. ఏంటయ్యా ఆ దూకుడు. ఆగు... అనుమతి లేకుండా లోనికివస్తే మా స్వామివారు క్షమించరు. ఆగుతావా లేదా?" అంటూ వస్తున్న జడధారికి అడ్డం వచ్చేశాడు కాశీ.

"కాశీ... ఆయన్ని రానివ్వు" ప్రశాంత వదనంతో పలికాడు అగ్నివేశుడు.

"అయ్యా... ఇతనెవరో...." కాశీ ఏదో చెప్పబోయాడు.

"ఎవరైనా కానీ... ముందు చెప్పింది వినరా. ఆయన మన అతిథి. అతిథిని ఆపకూడదు. వెళ్ళి పనిచూసుకో" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"చిత్తం" అంటూ కాశీ బయటికెళ్ళిపోయాడు.

ఆ జడధారి వచ్చీరావటమే– అగ్నివేశాచార్యుని పాదాలకు సాష్టాంగపడి పాదాభివందనం చేశాడు. "ఆచార్యా.. పాపిని... దుర్మార్గుడ్ని. అయినా నన్ను మీరు క్షమించేవరకు మీ పాదాలను వదలను" అన్నాడు వ్యధాపూరిత స్వరంతో.

అగ్నివేశాచార్యునికి మొదట అతనెవరో అర్థంకాలేదు. కొద్దిక్షణాలు కనులు మూసుకోగానే యోగదృష్టిలో వచ్చిన అతిథి ఎవరో అర్థమైపోయింది.

"అందర్నీ క్షమించేవాడు, దారి చూపించేవాడు ఆ మాధవుడొక్కడే నాయనా. మనచేతిలో ఏముంది. ముందులేచి అలాకూర్చో" అన్నాడు గంభీరంగా.

"లేదు ఆచార్యా. నా పాపాలకు నిష్కృతి లేదు. మీరు క్షమిస్తే గాని నా మనసు ఊరట చెందదు" అన్నాడు లేవకుండానే అతను.

"పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు. అపరాధివి, శత్రు మనిషివైనప్పటికీ నిన్ను క్షమిస్తున్నాను అఘోరా. ఇకనయినా లేచి కూర్చో"

అఘోరా లేచి అక్కడే కింద పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. "నేలమీద కాదయ్యా. లేచి సోఫాలో కూర్చో" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"శ్మశానాల్లో సంచరించే మృగాల్లాంటి వాళ్ళకు ఉచితాసనాలతో పనేముంది అగ్నివేశాచార్యా. అదీగాక మీముందు అంతటి మర్యాదకి అర్హుడను గాను. శత్రుశిబిరం నుండి వచ్చినవాడ్నని తెలిసీ సందేహించకుండా కూర్చో మన్నారు. ఇది చాలు నాకు" అన్నాడు అఘోరా.

"శత్రువైనను సమర్థుడిని సముచితంగా గౌరవించడం పరిపాటి. వారికి మర్యాద. శక్తిమంతుడివి, మహామంత్రవేత్తవి, అస్త్రశస్త్రాలు తెలిసినవాడివి. ఘటనా ఘటనా సమర్థుడివి. ఏదో విశేషం లేకుండా నా వద్దకు రావుగదా. మరిడి సోమయ్య నిన్ను రాయబారిగా ఏదన్నా సందేశం పంపించాడా?" సూటిగా విషయాని కొస్తూ అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఇప్పుడు నేను మరిడి సోమయ్య మనిషిని కాను ఆచార్యా. నా తప్పు తెలుసుకుని నా అంతట నేనే మీ దర్శనార్థం వచ్చాను. మంత్రశాస్త్రంలో ప్రయోగం, దానికి విరుగుడు రెండూ తెలిసిన మహామహులు మీరు. మేరుపర్వతంలాంటి వారు. మీకు తెలియనిదేముంది? ముఖ్యంగా నేను క్షమాపణలు అర్థించవలసిన వారు మరో ముగ్గురున్నారు. వారు ఎక్కడ?" చుట్టూ చూస్తూ అడిగాడు అఘోరా.

అగ్నివేశాచార్యునికి అర్థమైంది. వారి సంభాషణ అర్థంగాక అయోమయంగా చూస్తున్న అప్పన్న వంక చూసి– "వెళ్ళరా, చరక్‌తోబాటు అమ్మాయి లిద్దరూ ఎస్టేట్ తోటల్లో ఎక్కడో ఉంటారు. వెళ్ళి అర్జంటుగా వాళ్ళ నిక్కడికి రమ్మని చెప్పు" అన్నాడు.

"చిత్తం" అంటూ వెంటనే బయటకు పరుగెత్తాడు అప్పన్న. సాలోచనగా అఘోరా వంక చూశాడు అగ్నివేశాచార్యుడు.

"ఇప్పుడు చెప్పు అఘోరా. మరిడి సోమయ్య నెందుకు వదిలేశావ్?" అడిగాడు.

"కుక్కను పెంచితే విశ్వాసం చూపుతుంది. ఆవును పెంచితే పాలిస్తుంది. అదే పామును పెంచితే ఒకరోజు అది కాటు వేయకమానదు. ఈ సత్యాన్ని ఆలస్యంగా తెలుసుకున్నాను. తక్షణం వాడ్ని వదిలి వచ్చేశాను" బదులిచ్చాడు అఘోరా.

"మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి. ఏం తీసుకుంటావ్. పాలు పండ్లు– భోజనం...."

"ప్రస్తుతం ఏమీ వద్దు. మీ ఆదరణ చాలు"

"నీ అసలు పేరేమిటి?"

"అసలు పేరు మర్చిపోయి ఏళ్ళు గతించిపోయాయి. అడిగారు గాబట్టి చెప్తాను... నా పేరు వీరేంద్ర దోహా"

"ఎంతవరకు చదువుకున్నావ్?" అగ్నివేశాచార్యుని ప్రశ్న.

"విద్యలేనివాడు వింతపశువు అన్నాడో శతకకారుడు. నా దృష్టిలో విద్య ఉండి కూడా వివేకశూన్యుడు, ధర్మా ధర్మ విచక్షణ లేనివాడు, పాపభీతి తెలీనివాడు కూడా వింతపశువే. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను ఆచార్యా.

నాది స్వస్థలం ఒరిస్సాలోని రాయగడ సిటీ. ఆంధ్రా సరిహద్దు ప్రాంతం గాబట్టి ఆ ప్రాంతం వారికి ఒరియా, తెలుగుభాషలు ధారాళంగా తెలుసు. అలా నాకు రెండు భాషలు చిన్నప్పటినుంచే వచ్చు. ఆ కాలంలోనే బి.ఎ., బి.ఇడి చేసి హైస్కూల్లో మాష్టారిగా కొంతకాలం పనిచేశాను.

చిన్నప్పటినుండి గారడీవిద్యలు, మాయలు, మంత్రాలంటే ఇష్టం. అది రానురాను నాలో అధికమైపోయింది. పెళ్ళి చేసుకోలేదు. ఈ గారడీలు, ఇంద్రజాలం వంటివికాదు. నిజంగానే మహిమలు సంపాదించుకోవాలి. సిద్ధునిగానో, మహాయోగిగానో కావాలి. ఇంద్రభోగాలు అనుభవించాలి. అందరి కన్నా గొప్పవాడ్ని కావాలి. ఇలా చిత్రవిచిత్రమైన ఆలోచనలు" అంటూ నవ్వాడు అఘోరా.

"ఊ బాగుంది. తర్వాత ఏమైంది?"

"ఉద్యోగం వదిలేశాను. ఒకరోజు ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలేశాను. అంతే తర్వాత ఇంటిముఖం చూళ్ళేదు. నేనేమయ్యానో మా వాళ్ళకి తెలీదు. ఇప్పుడు రాయగడ వెళ్ళినా ఎవరెవరో ఎక్కడున్నారో గుర్తించడం కష్టం"

"తర్వాత?"

"దేశదిమ్మరిగా కొన్నాళ్ళు తిరిగాను. అప్పుడే తమిళం, బెంగాళీ, అస్సామీ భాషలు నేర్చుకున్నాను. నా అన్వేషణ సిద్ధయోగి అయిన ఒక గురువు. కాని నా దురదుష్టం. అలాంటి మహనీయుని దర్శనం లభించలేదు. ఇలా వుండగా అస్సాంలో తిరుగుతున్నప్పుడు బ్రహ్మపుత్రా నదీతీరపు కీకారణ్యంలో అఘోరాలతో పరిచయం ఏర్పడింది.

వారు నా గురించి తెలుసుకుని తమలో కలసిపొమ్మన్నారు. అంతే– అక్కడే నా జీవితం మలుపు తిరిగింది. అక్కడి అఘోరాలకు గురువు ప్రచండ అఘోరా. మహాయోగి, గొప్ప మంత్రవేత్త.

ఆ విధంగా నేను రుద్రగణాల్లో కలసిపోయి ప్రచండ అఘోరా శిష్యుడనై అఘోరాగా మారిపోయాను. ఒడలంతా బూడిదపూసుకొని శ్మశానాలవెంట తిరుగుతూ శవాలతో సావాసం చేశాను. మానవ కంకాళాలలో భుజించాను. నిరంతరం మంత్రసాధన, ధ్యానం, యోగం. నా దీక్ష, పట్టుదల చూసి గురువు ప్రచండ అఘోరా అనేక రహస్యవిద్యలు బోధించాడు.

అవి సాధనచేసి సాధించుకోవడంలోనే సగం వయసు దాటిపోయింది. ఐహిక సుఖాలమీద వ్యామోహం అంతరించింది.

ఇప్పుడు నా వయసు డెబ్భై అయిదు. ఇంతకాలం జనారణ్యంలోకి రాకుండా క్రూరమృగాలకు నిలయమైన అరణ్యవాసంలోనే ఉండిపోయాను.

గతంలో మరిడి సోమయ్యతో పరిచయం ఉంది. ఆ పరిచయంతో క్రితం సారి వాడు అస్సాం వచ్చినప్పుడు నన్ను కలసి తనవద్దకు వచ్చి కొంతకాలం ఉండమని బ్రతిమాలాడు.

గురువుగా నన్ను గౌరవిస్తున్నాడన్న అభిమానంతో నేను వాడితో నీలోదరికి వాడి నివాసానికి వచ్చున్నాను. అగ్నివేశాచార్యునితో విరోధం ఉంది అంటే కావచ్చు

అనుకున్నాను. చాలా విషయాలు ఆలస్యంగా నాకు తెలిశాయి. వాడు వరస పరాభవాలతో బాధపడుతుంటే నేను జాలిపడ్డాను.

మహిషశక్తిని వశం చేసుకోమని నేనే సలహా ఇచ్చాను. కాని ఆ దూర్తుడు చివరకు నన్నే మహిషుడికి బలిచ్చి ఆ క్షుద్రశక్తుని వశపర్చుకున్నాడు. నా యోగశక్తితో తిరిగి పునర్జీవితుడనయ్యాను.

గురుస్థానంలోని నన్నే బలిపెట్టిన ఆ దూర్తుడిమీద అసహ్యం వేసింది. శపించి శిక్షించాలనుకున్నాను. కాని అలాచేసి నా ఆత్మశక్తిని దుర్వినియోగం చేయటం ఇష్టంలేక వాడ్ని వదిలివచ్చాను.

వాడ్ని సంతృప్తిపర్చడం కోసం మీ మునిమనవడు చరక్, మిత్రవింద, శుశ్రుతలను అంతం చేయాలని అస్త్రాన్ని ప్రయోగించిన మందబుద్ధిని.

ఆత్మవిమర్శ చేసుకున్నాక జ్ఞానోదయమైంది. నిస్స్వార్థంతో ధర్మాన్ని సుస్థిరం చేయాలని లోకకళ్యాణం అవసరమని భావిస్తున్న మిమ్మల్ని ఆశ్రయించి నా పాపాలకు పరిహారం పొందాలని మీవద్దకు వచ్చాను ఆచార్యా. నేను నేర్చిన విద్యలమీద ఆన. ఆ రుద్రుడి మీద ఆన. ఇక ఎన్నడూ ధర్మాన్ని తప్పి చరించను. నను నమ్మండి" అంటూ జరిగింది వివరిస్తుంటే ఆసక్తిగా విన్నాడు అగ్ని వేశాచార్యుడు.

"నీ మాటలు నమ్మతగ్గవిగానే ఉన్నవి అఘోరా. కాని నిన్ను ఉండమని గాని, వెళ్ళపొమ్మనిగాని ఇప్పుడే చెప్పలేను. వాళ్ళు ముగ్గురూ వస్తే వాళ్ళ అభిప్రాయం కూడా తెలుసుకుందాం.

మాంత్రికుడు మరిడి సోమయ్య మొదటి నుండి నన్ను, మా సంకల్పాన్ని, ప్రయత్నాల్ని అడ్డుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

నీ మూలంగా వాడికిపుడు మహిషశక్తి వశమైంది. ఏ క్షణంలోనయినా వాడు ఆ శక్తిని మామీదకు ప్రయోగించే అవకాశం ఉంది. చూద్దాం" అన్నాడు.

"ఆచార్యా, మరొక్క విషయం మీకు మనవి చేయాలి" అన్నాడు అఘోరా.

"ఏమా విషయం?"

"ఇంతవరకు మీ దృష్టికి రాని అజ్ఞాత శత్రువు మీకు వేరొకడున్నాడు" అఘోరా మాటలు అగ్నివేశాచార్యునిలో ఆసక్తిని రేకెత్తించాయి. ఇంతవరకు మరిడి సోమయ్య మాత్రమే శత్రువని తెలుసు. ఈ అజ్ఞాత శత్రువు ఎవడు?

"ఎవడా శత్రువు?" ముందుకు వంగి ఆశ్చర్యపోతూ అడిగాడు అగ్ని వేశాచార్యుడు.

"ఆచార్యా, ఇది నేను మారానని బుజువు చేసుకోవడానికో లేక మీ మెప్పుకోసమో చెప్తున్న మాటలు కాదు. మీ సత్సంకల్పం నెరవేరి ధర్మసంస్థాపన జరగాలని ఆశించి చెప్తున్నాను.

ఆ శత్రువు కేంద్రమంత్రి, భువనేశ్వర్‌కి చెందిన ఎం.పి. శంభులింగ మహాపాత్రో" అఘోరా మాటలతో అగ్నివేశాచార్యుడు మరింత అచ్చెరువొందాడు. వాడి ముఖం కూడా ఎప్పుడూ చూసిన గుర్తులేదు. వాడికి తనతో వైరం ఏమిటి? అదే అడిగాడు.

"అఘోరా, వాడెవడో కూడా నాకు తెలీదు. వాడికి మాతో విరోధం ఏమిటి?"

"విరోధం కాదు ఆచార్యా. దురాశ. చరక్ తెచ్చే వస్తువుల్ని సొంతం చేసుకుని విదేశీమార్కెట్లో కోట్లాది డబ్బు సంపాదించాలని వాడు అవకాశం కోసం కాచుకునున్నాడు" అంటూ మరిడి సోమయ్యతో శంభులింగ మహాపాత్రోకి గల సంబంధం గురించి, వాళ్ళిద్దరి మధ్యన సంబంధాలు బెడిసిన సంగతి అంతా వివరించాడు అఘోరా. ఈ సంభాషణ జరుగుతుండగానే, అప్పన్న వెళ్ళి పిలచుకురావటంతో చరక్, మిత్రవింద, శుశ్రుతలు అక్కడికి చేరుకున్నారు.

ఆ ముగ్గుర్నీ చూడగానే– లేచి నిలబడ్డాడు అఘోరా. చరక్ చాలా కోపంగా ఉన్నాడు.

అయితే– వచ్చీరావటమే మిత్రవింద, ఆమెతో బాటు శుశ్రుత ఇరువురూ ఆశీర్వదించమంటూ అఘోరాకు పాదాభివందనం చేశారు.

ఇంతటి ఉన్నతమైన సంస్కారాన్ని ఊహించలేదు అఘోరా. అతని కళ్ళలో నీరు సుడి తిరిగింది.

"ఆహా! ఏమి వినయసంపత్తి. ఎంత గొప్ప సంస్కారం. మీ వంటి ఉత్తములకు హాని తలపెట్టానే నా పాపానికి నిష్కృతి ఉందా... లేవండి తల్లులారా.

మీ సత్సంకల్పం నెరవేరాలని, ఇష్టకామ్యార్థసిద్ధి కలగాలని ఆశీర్వదిస్తున్నాను" అంటూ యువతులిద్దర్నీ మనసారా ఆశీర్వదించాడు అఘోరా. చరక్‌కి ఇదంతా నచ్చలేదు.

"ఏమిటి మీరు చేస్తున్న పని? మనల్ని దారుణంగా అంతం చేయాలని చూసిన వాడు. ఆయనకి పాదాభివందనం చేస్తారా!" అనరిచాడు.

మిత్రవింద మృదువుగా నవ్వింది. "ప్రియుడా, అఘోరా ఎవరనుకొంటివి. ఆయన అసాధారణమనిషి. మహా మంత్రవేత్త, ఆపైన పెద్దవాడు.

శత్రువా, మిత్రుడా అని కాదు. విద్వత్తు ఎక్కడున్నా గౌరవించి ఆశీస్సులు పొందడం, అతిథిని సత్కరించడం మన మర్యాద. రమ్ము.

నీవును ఈ మహానీయుని ఆశీస్సులు గైకొనుము" అంది.

మిత్రవింద మాటలు అఘోరాకు కనువిప్పు కలిగించినట్టయింది. తనకు తనే సిగ్గుపడేలా చేసింది. బాధగా చరక్‌ను చూశాడు–

"చరక్. నీకు నామీద కోపం కలగడం సహజం. కాని చేసినతప్పు తెలుసుకుని మారిపోయాను. మిమ్మల్ని క్షమాభిక్ష అర్థించడానికొచ్చాను.

యువకుడివి. ఆవేశం తగ్గించి నన్ను నమ్ము. మీరంతా నన్ను క్షమించాలి.

ఇకనుంచి నా వలన మీకు ఉపకారమే గాని అపకారం ఎన్నటికీ జరగదు" అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ ఉన్నట్టుండి ఆగిపోయాడు.

సూదూరంలో నుండి– అతడి చెవులకు వినబడుతోంది– ఎనుబోతు రంకె ఒకటి. వింటూనే ఉలికిపడి– అగ్నివేశాచార్యుని వంక చూశాడు.

కొట్టొచ్చినట్టు కన్పిస్తున్న అఘోరా ముఖంలోని ఆందోళనను వెంటనే పసిగట్టాడు అగ్నివేశాచార్యుడు. "అఘోరా... ఏమైంది?" అనడిగాడు.

"మీ సందేహం నిజమైంది ఆచార్యా. మరిడి సోమయ్య మహిషశక్తిని ప్రయోగించాడు. మహిషుడి రంకె వినబడుతోంది. వాడు వచ్చేస్తున్నాడు. వాడి రంకెలు వినబడుతున్నాయి" అన్నాడు అఘోరా.

"రానిమ్ము అఘోరా. ఈ భవంతి అష్టదిగ్బంధనంలో ఉంది. ఏ దుష్టశక్తి లోన ప్రవేశించలేదు" అన్నాడు ప్రశాంతంగా అగ్నివేశాచార్యుడు.

"ఆచార్యా, పొరబడుతున్నారు. మహిషశక్తి మృగమూ కాదు మనిషి కాదు. అది దున్నపోతు తల కలిగిన అసురశక్తి. అష్టదిగ్బంధనం వాడ్ని ఆపలేదు. అదో... వచ్చేస్తున్నాడు" అని అరుస్తూ తన మంత్రదండం అందుకొని వేగంగా మిత్రవిందకు కుడిపక్కకు దూకాడు.

అదే సమయంలో– ఈసారి అందరికీ వినబడేలా– భవంతి మారుమ్రోగేలా– కర్ణభేరీలు బ్రద్దలయ్యేంత కర్కశంగా– ఎనుబోతు రంకెతో భవంతి మారుమ్రోగింది. వింటూనే అదిరిపడి లేచి నిలబడ్డాడు అగ్నివేశాచార్యుడు.

చూస్తూండగానే హాలు మధ్యభాగంలో ప్రత్యక్షమయ్యాడు మహిషుడు. విభ్రమంతో ఆ విచిత్ర భయానక రూపాన్ని చూస్తున్నారంతా.

సూదుల్లా వంపు తిరిగిన పెద్దకొమ్ములతో దున్నపోతు తల కలిగి శరీరమంతా నల్లని రోమాలతో కూడిన బలిష్టమైన శరీరం, పొడవుగా కత్తుల్లా పెరిగిన చేతిగోళ్ళు, కనుగుడ్లు ఎర్రగా నిప్పుకణికల్లా జ్వలిస్తున్నట్లున్నాయి.

తలుపు చెక్కలాంటి విశాలమైన ఛాతీ ఉక్కుస్తంభాల్లాంటి కాళ్ళు, ఎర్రటి వస్త్రాలు ధరించిన ఆ భీకరాకారుడ్ని చూడగానే నౌకరు అప్పన్న భయంతో వణికిపోతూ దూరంగా పరుగెత్తి ఒక చెక్కబీరువా వెనుక దాక్కున్నాడు.

శుశ్రుత కూడా భయంతో చరక్ చేతిని గట్టిగా పట్టుకుంది.

మిత్రవింద గంభీరముద్ర దాల్చి మహిషుడ్ని తీక్షణంగా చూడసాగింది. అంతలో– మరోసారి మోర చాపి– దారుణంగా రంకెవేశాడు మహిషుడు.

కర్ణకఠోరంగా పిడుగులు వర్షిస్తున్నట్టుందా రంకె. అంతటి పురాతన భవనం కూడా పునాదులతో సహా ఆ శబ్దానికి గజగజ వణికింది.

ఆ రంకె వింటూనే శుశ్రుత తెలివి తప్పి దబ్బున కిందపడిపోయింది. అదే సమయంలో ఒక్కో అడుగే వేస్తూ ముందుకు కదిలాడు మహిషుడు.

వాడి చూపులు చరక్‌మీద తప్ప వేరెవరిమీదా లేవు. చరక్‌ను అంతం చేయడం కోసమే మరిడి సోమయ్య మహిషశక్తిని ప్రయోగించాడని అటు అగ్ని వేశాచార్యుడు ఇటు అఘోరా కూడా గ్రహించారు. మిత్రవిందకూ చరక్ ప్రమాదంలో ఉన్నాడని అర్థమైపోయింది.

"ప్రియుడా. ఈ దుష్టశక్తి నిన్ను అంతం చేయాలని వచ్చింది. నేను దీన్ని నిలువరిస్తాను. నా వెనుకకు రమ్ము త్వరగా" అరిచి పిలిచింది మిత్రవింద.

బుగ్గలు తట్టి పిలిచినా శుశ్రూతకు స్పృహరాక పోవడంతో చరక్ పూర్తిగా యుక్తాయుక్తాలు మర్చిపోయాడు. క్రోధావేశంలో ముందువెనుకలు ఆలోచించ లేదు. చేతికందిన పొడవాటి కత్తితో మహిషుడి మీదికి దూసుకెళ్ళాడు.

అయితే అప్రమత్తంగా వున్న మిత్రవింద– "వలదు ప్రియుడా. పోవలదు" అంటూ అతడి చేయిపట్టి వెనక్కిలాగి తను అతడికి అడ్డంగా వచ్చేసింది.

అప్పటికే అయిదడుగుల సమీపంలోకి వచ్చేసిన ఆ దుష్టశక్తి చరక్ కోసం చేతులు చాపింది.

అదే సమయంలో మిత్రవింద తన తీక్షణ వీక్షణాలను వాడిమీదకు ప్రసరించింది అంతే–

ఒక్కసారిగా మహిషుని చుట్టూ భగ్గున మంటలు ఎగిసి, వాడు ఎగిరి పదడుగుల దూరంలో పడ్డాడు. పడిలేస్తూనే విచిత్రంగా మంటల్ని ఎక్కడికక్కడ దులిపేసుకుని రెట్టించిన కోపంతో తిరిగి చరక్‌వైపు కదిలాడు. చరక్‌ని వెనక్కి వెనక్కి నెడుతూ వెనక్కి నడుస్తోంది మిత్రవింద. మరోసారి కనుమూసి ధ్యానించగానే ఆమెచేతిలో ఒక త్రిశూలం ప్రత్యక్షమైంది.

అదే సమయంలో ఇటునుండి అగ్నివేశాచార్యుడు అరిచాడు. "అఘోరా. ఈ మృగాన్ని నాశనం చేయడం అసాధ్యం. దీన్ని తరిమికొట్టాలంటే నారసింహాస్త్రం శరణ్యం. ఇటునుండి నేను నారసింహాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాను. అటునుండి సింహాస్త్రాన్ని ప్రయోగించు. త్వరగా" అంటూ– అంతే.

ఏకాలంలో నారసింహాస్త్రం, సింహాస్త్రం, త్రిశూలం మూడు వైపులనుండి దూసుకెళ్ళి మహిషశక్తిని తాకాయి. అగ్నివేశాచార్యుడు తన మెడలోని రుద్రాక్షల్ని తెంచి వాటితోనే నారసింహాస్త్రాన్ని ప్రయోగించాడు. ఒక్కో రుద్రాక్ష ఒక్కో నారసింహంగా కన్పిస్తూ మహిషుడి దేహాన్ని తలోచోట తుపాకి బుల్లెట్లలా తాకాయి.

అదే సమయంలో అఘోరా ప్రయోగించిన సింహాస్త్రం సింహరూపంలో మీదకు దూకి వాడి పంజాలతో ఎనుబోతు ముఖాన్ని తాకింది. ఇటు మిత్రవింద

ప్రయోగించిన త్రిశూలం సూటిగా పోయి గుండెల్ని తాకింది. ఏకకాలంలో జరిగిన ఈ ముప్పేటదాడితో మహిషుడు భయంకరంగా అరుస్తూ సుడిగాలికి లేచిన తాటాకులా ఎగిరి గింగిరాలు తిరుగుతూ పోయి ముఖద్వారాన్ని గుద్దు కున్నాడు.

అతని తాకిడికి బలమైన ముఖద్వారం తలుపులు రెండూ భళ్ళున తునా తునకలుగా పగిలి ముక్కలు చెక్కలు కాగా, మహిషుడు పోర్టికోలో పడ్డాడు. పడినవాడు పడినట్టే బాధాపూరితమైన రంకెలు వేస్తూ అదృశ్యమయిపోయాడు.

మరికొంత సేపు వాడి రంకెలు వినబడుతూ క్రమంగా దూరమై ఆగిపోయాయి. అంతటితో తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ– శుశ్రుత వంక చూశారంతా.

*　　*　　*　　*　　*

నీలోదరి కొండగుట్ట మీద – మాంత్రికుడు మరిడి సోమయ్య ఈ రోజు మహాఖుషీగా ఉన్నాడు. శిష్యులందర్నీ చాలా ఉత్సాహంగా పలకరిస్తున్నాడు. ఈ సంతోషానికి కారణం ఏమిటో మాత్రం మొదట ఎవరికీ అర్థం కాలేదు. "శిష్యులారా. ఇవాళ మీ అందరికీ పండగ రోజురా. నేటితో నాకు... ఈ ప్రపంచానికే శత్రువు–

వాడి పీడ వదిలిపోతోంది. శ్రీకృష్ణుడు నరకుడ్ని చంపగా దీపావళిపండగ వచ్చింది. చాముండీదేవి మహిషాసురుడ్ని చంపగా విజయదశమి పండగొచ్చింది.

ఈనాడు చరక్ అనేవాడి మరణంతో మనందరికీ పండగ వచ్చినట్టే" అనరిచాడు ఆనందాతిశయంతో మరిడి సోమయ్య.

"గురువుగారూ... నరకుడు, మహిషాసురుడు దుర్మార్గులు గాబట్టి వాళ్ళని అంతం చేయడంతో పండగలొచ్చాయి. కాని చరక్ మంచివాడే గదా. మంచి వాళ్ళను చంపినా పండగలొస్తాయా?" ఒక శిష్యుడు అమాయకంగా ప్రశ్నించాడు.

"ఓరి మూర్ఖశిష్యా. మనలాంటి చెడ్డవాళ్ళను చంపగా మంచి వాళ్ళకు పండగ. అలాగే మంచివాళ్ళను చంపితే మనలాంటి చెడ్డవాళ్ళకి పండగ. కలిధర్మం నాశనం చేయాలని చూస్తున్న ఆ చరక్‌ను చంపిరమ్మని మహిషుణ్ణి ప్రయోగించాను. ఈపాటికి పని పూర్తి చేసుకుని శవాన్ని భుజం మీద వేసుకుని పైశాచిక నృత్యంతో

కదంతొక్కుతూ వస్తుంటాడు. వాడిశవాన్ని మనం చూడబోతున్నాం. కాబట్టి మీ అందరికీ ఈ రోజు స్వేచ్ఛనిస్తున్నాను. తినండి. తాగండి"

అక్కడే ఉన్న మృణాళుడు, విళంబి గురువుగారి మాటలు విని ముఖ ముఖాలు చూసుకున్నారు.

ఆ ఇద్దరిపక్కనే వున్న మరో శిష్యుడు గంగారాం సందేహంతో– "ఏరా మృణాళా. మహిషుడు నిజంగానే చరక్‌ను చంపుతాడంటావా.

చరక్ సాధారణ యువకుడే కావచ్చు కాని అతన్ని అజేయమైన రెండు శక్తులు ఎప్పుడూ కాపాడుతున్నాయి గదా" అనడిగాడు.

"ఆ రెండు శక్తులు మిత్రవింద, అగ్నివేశాచార్యుడు. అంతేగా. అరే గంగారాం. నాకు తెలిసి గురువుగారు ఇప్పటివరకు చేసిన ప్రయత్నాల్లో అన్నీ అపజయాలేగాని ఒక్క విజయమన్నాఉందా?" అన్నాడు మృణాళుడు.

"అవును. ఇదీ విఫలమవుతుందని నా నమ్మకం. ఆ మిత్రవింద యోగశక్తిని జయించడం అసాధ్యం" అన్నాడు విళంబి.

"ఆ అగ్నివేశాచార్యుడు? ఆయన మాత్రం తక్కువా. ఈపాటికి మహిషుణ్ణి భస్మం చేసుంటాడు" అన్నాడు మృణాళుడు.

"అరే... ఏమిరా మీలో మీరు గుసగుసలాడు కుంటున్నారు? చరక్‌ను చంపటం మీకు సంతోషం కాదా?" ముగ్గుర్నీ దూరం నుంచి చూసి అడిగాడు మరిడి సోమయ్య.

"మాకు సంతోషమే గురువుగారూ. కాదంటే మహిషుడు వెళ్ళిన పని ఇంకా పూర్తయివుంటుందా లేదా అని చర్చించుకుంటున్నాం. అంతే" అంటూ బదులిచ్చాడు గంగారాం.

"గురుదేవా, ఎందుకయినా మంచిది. ఒకసారి అంజనం వేసి చూసి అక్కడి పరిస్థితి ఏమిటో గమనించండి" అంటూ సలహా ఇచ్చాడు విళంబి.

"ఏమిరా. సందేహప్రాణి... మహిషుడు వెళ్ళడం పని పూర్తిగాకపోవడమా. చూస్తూండండి. విజయంతో తిరిగివస్తుంటాడు మహిషుడు" అన్నాడు కొండంత విశ్వాసంతో మరిడి సోమయ్య.

సరిగ్గా ఇదే సమయంలో– దూరం నుంచే మహిషుడి బాధాపూరిత ఆర్తనాదం బిగ్గరగా వినవచ్చింది. పిడుగులు వర్షిస్తున్నట్టు విన్పించే మహిషుడి రంకెలు ఇప్పుడు దీనాలాపనలుగా వినవస్తున్నాయి. ఆలోచించే లోపలే మరిడి సోమయ్య సమీపంలో ప్రత్యక్షమయ్యాడు మహిషుడు. ఒంటి నిండా గాయాలతో తూలుతూ వచ్చి మోకాళ్ళమీద కూలబడిపోయాడు.

ఆ అసురశక్తిని చూసి అదిరిపడ్డారంతా. వెళ్ళిన పని అయిందో లేదో తెలీక కళవళపడుతూ– "మహిషా... ఈ గాయాలేమిటి? చరక్ అంతమయ్యాడా లేదా?" అనడిగాడు.

మహిషుడు కొమ్ములు విదిలించి– మరిడి సోమయ్యను తీక్షణంగా చూశాడు. "ఓరీ మూర్ఖమానవా. నన్ను ఆ చరక్ నామధేయుని పైకి ప్రయోగించి నా ప్రాణం మీదికి తెచ్చినావు గదా. మహాశక్తిమంతుడనగు నాకా ఈ దుర్గతి" అనరిచాడు.

"మహిషా... ఇంతకీ ఆ చరక్...." నసిగాడు మరిడి సోమయ్య.

"వాడు నిక్షేపముగనున్నాడు రా. వాడిని సమీపించపనశక్తుడనైతిని. ఒకరు కాదు ఇరువురు కాదు. ఆ చరక్‌నకు మూవురు రక్షణకవచంలా ఉన్నారు"

"మూవురా... ఇరువురే గదా?"

"నాకు నీవు బలిచ్చిన అఘోరా పునర్జీవితుడై ఇప్పుడు వారి చెంతనున్నాడు. ఆ మూవురూ ముప్పెటదాడితో నన్నీ దురవస్థపాలు చేశారు. ఇక నీ వశమున ఉండజాలను. వెళ్ళిపోతున్నాను...."

అంతటి మహిషుడే క్షతగాత్రుడై తనను వదిలి వెళ్ళిపోతాననగానే మరిడి సోమయ్యకు ముచ్చెమటలు పోశాయి. గుండె జారిపోయినట్టయింది.

అఘోరా ప్రత్యర్థుల పంచనచేరాడు. ఇప్పుడు మహిషశక్తి కూడా చేజారితే తన పరిస్థితి ఏమిటి?

"మహిషా... ఇప్పుడు నా కర్తవ్యమేమిటి? వాళ్ళని ఏమీ చేయలేనా? ఆ అగ్నివేశుని సంకల్పం నెరవేరకుండా నాశనం చేయు మార్గమేమి?"

"నరుడా... నీవుగాని మరే ఇతర క్షుద్రశక్తిగాని వారిని ఏమీ చేయలేదు. వెళ్ళేముందు నీకో సముచిత సలహా నొసంగిపోయెద. తన కలిధర్మము

నశించుటకు కలిపురుషుడు అంగీకరింపడు. నీవు చేయగలిగినది ఏదైనా ఉంటే అది కలిపురుషుని ప్రసన్నం చేసుకొని పరిస్థితిని జెప్పి కలిని వారిపైకి ప్రేరేపించు. మిగిలింది తనే చూసుకుంటాడు"

"కలిపురుషుని ఎలా ప్రసన్నం చేసుకోగలను?"

"మహా మంత్రగాడివి. నీకు తెలియదా? తెలియకున్న తెలిసిన మంత్ర వేత్తలను సమావేశపరచి సలహా గైకొనుము. నేను కోలుకొనుటకు చాలా కాలం అగును. వెడలిపోవుచున్నాను" అంటూనే ఒక్కసారిగా అదృశ్యమయ్యాడు మహిషుడు. దూరంలో ఎక్కడి నుండో కొద్దిసేపటికి ఎనుబోతు రంకె వినవచ్చింది. మహిషుడు వెడలిపోయినా– చివరిగా అతనిచ్చిన సలహా మరిడి సోమయ్యకు నచ్చింది. గతములో అఘోరా కూడా ఇదే సలహాచెప్పున్నాడు. సమావేశానికి ఎవరెవరిని ఆహ్వానించాలా అని ఆలోచిస్తూ లోపలికి వెళ్ళిపోయాడు మరిడి సోమయ్య.

శిష్యులు మౌనంగా ఉండిపోయారు.

*　　*　　*　　*　　*

శుశ్రుతకు ఇంకా స్పృహారాలేదు. చరక్ ఆందోళన చెందుతున్నాడు.

మహిషుణ్ణిగా గాయపర్చి తరిమికొట్టడంతో ఇప్పుడు ఎస్టేట్ భవంతిలో పెద్ద తుపాను వచ్చి వెలిసిన వాతావరణం నెలకొంది. అతి భీకరమైన ఆ విచిత్ర రూపాన్ని ఇంకా ఎవరూ మర్చిపోలేకపోతున్నారు.

విరిగి ముక్కలైన ముఖద్వారం తలుపులు మహిషుడు వెళ్ళిపోయిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. అంతవరకూ లోపల దాగిన అప్పన్న బయటికి వచ్చాడు నెమ్మదిగా. వాడి గుండెలు ఇంకా కుదుటపడలేదు.

శుశ్రుతకు ఇంక స్పృహ రాకపోవటం కాస్త కంగారుపెట్టింది అందర్నీ. కాని చరక్ ఆమె ముఖాన నీరుచిలికి బుగ్గలు తట్టి కొంచెం పరిచర్యలు చేయగానే నెమ్మదిగా స్పృహలోకి వస్తూ లేచి కూర్చుంది. "ఏమైంది? ఆ వింతమృగం వెళ్ళిపోయిందా?" అంది చట్టునలేచి కూర్చుంటూ.

"అది వెళ్ళి చాలా సేపయింది. పిరికిదానివి. నువ్వే తెలివితప్పి పడిపోయి మమ్మల్ని కంగారుపెట్టేశావ్" అన్నాడు చరక్ నవ్వుతూ.

"నీకు ఏం కాలేదు గదా?" గాభరానుండి బయటపడుతూ అడిగింది శుశ్రుత.

"చూస్తున్నావ్‌గా. నిక్షేపంగా ఉన్నాను. మిత్రా. దీన్ని లోనకు తీసుకెళ్ళి వేడిపాలు గాని కాఫీగాని ఇవ్వు. కాస్త తేరుకుంటుంది. రామాచారి కూతురు మరీ ఇంత భయస్తురాలని అనుకోలేదు" అన్నాడు కావాలానే ఉడికిస్తూ చరక్.

"నేనేమీ పిరికి దాన్ని కాదు. భయపడలేదు.

ఆ వింతమృగాన్ని ఎప్పుడూ చూళ్ళేదు. అందుకే తెలివి తప్పాను" అంది రోషంగా.

"అవును. మా అక్కని ఏమన్నా అంటే ఊరుకోను. నీలా ముందువెనకలు చూడకుండా కత్తి పుచ్చుకుని యుద్ధానికేమీ వెళ్ళలేదుగా. ఆ మృగం చేతికి దొరికుంటే నీ సంగతి తెలిసేది" అంటూ శుశ్రుతను వెనకేసుకొచ్చింది మిత్రవింద.

"సరిసరి. ఏమనుకున్నా మీ ఇద్దరూ ఒకటేనని అర్థమైంది. ఇక మీతో వాదించలేను" అంటూ చేతులు ఎత్తేశాడు చరక్. అంతా నవ్వుకున్నారు.

"చరక్, అఘోరా మనతో బాటు ఇక్కడే ఉంటాడు. నీ అభిప్రాయం ఏమిటి? అమ్మా మిత్రవిందా, నువ్వు కూడా చెప్పాలి" అనడిగాడు ఉన్నట్టుండి అగ్నివేశాచార్యుడు.

"జేజిగారూ మీ నిర్ణయానికి తిరుగుంటుందా! మేం కాదనగలమా. మీ నిర్ణయాలెపుడూ ఖచ్చితంగా ఉంటాయని మాకు తెలుసు. మా అభ్యంతరం ఏముంటుంది" అన్నాడు చరక్.

"అవును జేజితాతయ్యా. చరక్ మాటే నా మాటాను" అంది మిత్రవింద.

చరక్, అఘోరా ముందుకెళ్ళి వినమ్రంగా పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నాడు.

"కోపంలో ఏదో మాట్లాడేశాను. నన్ను క్షమించండి. మీరు కూడా ఇక్కడే ఉండాలి" అన్నాడు.

చరక్, మిత్రవింద, శుశ్రుతలు లోనకు వెళ్ళిపోగానే అఘోరా, అగ్ని వేశాచార్యుని వంక కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

"ఆచార్యా! మీకు నా ధన్యవాదాలు. తెలిసోతెలీకో ఆశ్రిత పక్షపాతంతోనో నేను గతంలో చేసిన పాపాలను కడిగేసుకోవడానికి నాకో అవకాశం ఇచ్చారు ఇది చాలు. మీరు తలపెట్టిన మహాకార్యమగు ధర్మ సంస్థాపనలో భాగం పంచుకుని కృతార్థుడనవుతాను" అంటూ నమస్కరించాడు అఘోరా.

అప్పటికప్పుడు అఘోరా కోసం ఒక ప్రశాంతమైన గది కేటాయించ బడింది.

మిత్రవింద, శ్రుశ్రుతలతో మరో మూడు రోజులు ఎస్టేట్‌లోనే గడపాలను కున్నాడు చరక్. కాని మరునాడే మున్నలూరివారి అగ్రహారం నుంచి దేవమ్మగారు ఫోన్ చేసింది.

చరక్ అత్తమామలైన కావేరి, రామాచారి ఇరువురూ కూతుర్ని, అల్లుడిని చూడ్డానికి హైదరాబాద్ నుంచి వచ్చున్నారట. వెంటనే బయలుదేరి రమ్మని సమాచారం. తల్లి దండ్రులొచ్చారని తెలిసిన శుశ్రుత చాలా ఆనందించింది.

ఈ విషయం తెలీగానే మరునాడు ఉదయమే మిత్రవింద, శుశ్రుతలను తీసుకుని అగ్రహారానికి వెళ్ళిపోయాడు చరక్.

వెళ్ళేముందు మిత్రవిందకు చాలా జాగ్రత్తలు చెప్పాడు అగ్నివేశాచార్యుడు. అలాగే ఎందుకైనా మంచిదని మిత్రవింద వెంటరాకుండా ఒంటరిగా తిరిగొద్దనీ చరక్‌ను హెచ్చరించాడు.

ఆ విధంగా చరక్ ఎస్టేట్ భవంతి నుంచి వెళ్ళిపోయిన రెండో రోజు పిల్లా గోవిందపాత్రుడు ఆయన కొడుకు పిల్లా శివరామ ముకుందపాత్రుడు ఇరువురూ ఎస్టేట్ భవంతికి వచ్చారు. వారికి అఘోరాను పరిచయం చేశాడు అగ్నివేశాచార్యుడు.

"ఈ సారైనా కొంతకాలం నాతో ఇక్కడే ఉండేలా వచ్చారా లేక ఊరికి వెళ్ళిరావాలా... ఎందుకంటే మనకి ఎంతో సమయం లేదు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు ఆరంభం కానున్నాయి.

ఇద్దరు స్థపతుల్ని ద్వారక పంపించి ఉన్నాను. ద్వారకాధీష్ ఆలయ నమూనాలతో వాళ్ళు త్వరలో తిరిగి రానున్నారు. మీ భుజస్కంధాల మీద చాలా కార్యభారం మోపనున్నాను" అన్నాడు.

"ఆచార్యా... మీరు ఫోన్‌లో చెప్పినప్పుడే విషయం మాకు అర్థమైంది. మీరు నిశ్చింతగా ఉండండి. మేం వచ్చేశాంగా" అంటూ భరోసా ఇచ్చాడు పిల్లా గోవింద పాత్రుడు. ద్వారక వెళ్ళిన బృందం తిరిగి రావటంకోసం ఎదురు చూస్తున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఈలోపల–

*　　*　　*　　*　　*

మున్నలూరివారి అగ్రహారం. శుశ్రుత తల్లి దండ్రులైన కావేరి, రామాచారి దంపతులు కూతుర్ని, అల్లుడ్ని చూడ్డంకోసం ఆ రోజు ఉదయమే హైదరాబాద్ నుంచి వచ్చున్నారు.

దేవమ్మగారు వారికి ఏ లోటూ లేకుండా మర్యాదలు జరిపించి చరక్, శుశ్రుతలు ఉంటున్న ఇంటి తాళాలు తీయించి వారిని అక్కడ ఉంచింది.

చరక్‌కి ఫోన్ చేసి అత్తమామలు వచ్చిన విషయం చెప్పింది. దేవమ్మగారికి చాలా టెన్షన్‌గా ఉంది. రామాచారి దంపతులకు ఇక్కడి విషయాలేవీ ఇంత వరకు తెలీదు. మిత్రవింద గురించి అస్సలు తెలీదు. మిత్రవింద చరక్‌కు కాబోయే రెండో భార్య.

మిత్రవింద తనకు సవతి కావడం శుశ్రుతకు సమ్మతమైనా రామాచారి దంపతులు అంగీకరించే అవకాశం లేదు. ఏ తల్లిదండ్రులూ తమ కూతురికి సవతి వస్తుందంటే అంగీకరించరు. ఈ విషయంలో చరక్ ఎలా సమర్థించు కుంటాడో తెలీదుగాని రభస జరిగే అవకాశం ఉందని ఆమె భయం.

అందుకే మిత్రవింద గురించి వారికి ముందే తెలీటం మంచిది కాదన్న ఉద్దేశంతో తను చెప్పలేదు. ఎవరినీ చెప్పకుండా కట్టడి చేసింది.

రామాచారి దంపతులూ విశేషాలేమిటని ఎవరినీ అడగలేదు. చక్కగా భోజనం చేసి విశ్రాంతి తీసుకుని సంతోషంగా ఉన్నారు. అక్కడ కోరుకొండ నుండి బయలుదేరిన చరక్, శుశ్రుత, మిత్రవిందల కారు మధ్యాహ్నం వేళకి మున్నలూరివారి అగ్రహారం చేరుకుంది. కారు సౌండ్ విని అటు దేవమ్మగారు, ఇటు రామాచారి దంపతులూ బయటికొచ్చారు.

మిత్రవిందను చూడగానే రామాచారి దంపతుల భావాలు ఎలా ఉంటాయోనని దేవమ్మగారు కంగారుపడుతూ చూస్తోంది.

కారు దిగుతున్న ముగ్గుర్నీ రామాచారి దంపతులు చూస్తున్నారు. వారి ముఖంలో సంతోషం తొణికిసలాడుతోంది. మిత్రవింద గురించి వారి ముఖాల్లో ఎలాంటి ఆశ్చర్యంగాని, సందేహంగాని కన్పించకపోవడం దేవమ్మగారిని ఆశ్చర్యపరిచింది.

అటు చరక్ కూడా మిత్రవిందను అత్తమామలకు ఎలా పరిచయం చేయాలాని తనలో తను అతలా కుతలమైపోతున్నాడు. కాదంటే ఆ విషయం శుశ్రుత చూసుకుంటుందనే ధైర్యం ఉంది అతడికి.

తల్లిదండ్రుల్ని చూడగానే ఆనందంతో కారు దిగి వారి వద్దకు పరుగెత్తింది శుశ్రుత. కాని రామాచారి దంపతులు కూతుర్నిగాని, అల్లుడ్ని గాని చూడ్డంలేదు. ఆనందాతిశయంతో మిత్రవిందను చూస్తున్నారు. అంతేకాదు నేరుగా మిత్రవింద వైపు అడుగులేశారు.

ఈలోపల మిత్రవింద ముందుకొచ్చి ఇద్దరికీ పాదాభివందనం చేసింది. "శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు. లే తల్లీ" అంటూ పుణ్యదంపతులిద్దరూ మిత్రవిందను ఆశీర్వదిస్తుంటే అటు దేవమ్మగారు, ఇటు శుశ్రుత, చరక్‌లు కూడా తెల్లబోయారు. ఇది ఏమి వింతో, ఇది ఏమి మాయో అర్థం కాలేదు ఎవరికీ.

శుశ్రుత, చరక్ వంక చూసింది. కావేరి, మిత్రవింద భుజాలు పట్టిలేపింది. "మిత్రా. నీకోసమే పనిగట్టుకునొచ్చాం తల్లీ. శుశ్రుత కోసమైతే ఇప్పుడే వచ్చేవాళ్ళం కాదు" అన్నాడు నవ్వుతూ రామాచారి.

"అవునమ్మా. నీకు మాటిచ్చాం గదా. అందుకే వచ్చాం" అంది కావేరి.

ఇదంతా చూస్తున్న శుశ్రుత, చరక్‌లకు పిచ్చెక్కిపోతున్నట్టుంది. అసలు పరిచయమే లేని మిత్రవిందను వాళ్ళకి ఎలా పరిచయం చేయాలి. ఎలా నచ్చ చెప్పాలని తాము మల్లగుల్లాలు పడిపోతుంటే వీళ్ళేమిటి ఎంతో పరిచయస్తుల్లా ఇలా మాట్లాడేసుకుంటున్నారు? ఏం జరిగి ఉంటుంది? అర్థంగాని పొడుపుకథలా ఉంది పరిస్థితి.

ఇక లాభంలేదని శుశ్రుత కోపంగా చూస్తూ– "మీరు నాకోసం కాదుగా. అక్క మిత్రవింద కోసం వచ్చారు. ఐతే దాంతోనే మాట్లాడండి" అంటూ అలకతో లోనకు పోబోయింది.

కావేరి చిరునవ్వుతో కూతురి చేయి పట్టుకుని ఆపింది. "ఎందుకే అంత కోపం? మొగుడు రానంత వరకు చరక్ చరక్ అంటూ కలవరిస్తుంటే నీ పోరుపడలేక ఇక్కడికి తెచ్చి వదిలేశాం. మొగుడు వచ్చాక మాకు ఎన్నిసార్లు ఫోన్లు చేసుంటావ్. మేమసలు గుర్తున్నామా?" అంది. తల్లి మాటలకు వెంటనే బదులు చెప్పలేకపోయింది శుశ్రుత.

నిజమే, ఇటు భర్త ప్రేమ, అటు మిత్రవింద సోదరి వాత్సల్యం మధ్యన తన తల్లి దండ్రుల గురించి శ్రద్ధ తగ్గినమాట నిజం.

ముందులా తరచూ ఫోన్లుచేసి యోగక్షేమాలు అడగడంలేదు. అందుకే వీళ్ళకి తనమీద కోపం వచ్చుండాలి కాని. మిత్రవింద వీళ్ళకి ఎలా తెలుసు?

కూతురి అవస్థచూసి నవ్వుతూ కావేరి ప్రేమగా జుత్తు నిమిరింది. "పిచ్చి తల్లి. నీ మీద మాకు కోపం లేదమ్మా. ఆడపిల్ల మెట్టినింట సుఖసంతోషాలతో ఉంటే అంతకుమించిన ఆనందం తల్లిదండ్రులకు ఏముంటుంది? ఇక మిత్రవింద మాకెలా తెలుసని మీరు ఆశ్చర్యపోవడం సహజం. నిజానికి మాకు కూడా తెలియదు. మూడు రోజుల క్రితం తను హైదరాబాద్‌లో మన ఇంటికొచ్చింది" అంది కావేరి.

షాక్ తిన్నట్టయిపోయారు చరక్, శుశ్రుతలు. "అదేమిటి? అక్క మాతో ఇక్కడే ఉంది. మనింటికి రావడం ఏమిటి? అడ్రసు ఎలా తెలుసు? నేన్నమ్మను" అంది శుశ్రుత.

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. తను ఇక్కడే ఉందిగా అడగండి" అన్నాడు రామాచారి.

"మిత్రా... నువ్వు వెళ్ళిన మాట నిజమా!" మిత్రవిందను అడిగాడు చరక్.

అవుననన్నట్టు తలూపింది మిత్రవింద.

"శుశ్రుతా. మూడురోజుల క్రితం రాత్రి పదకొండు గంటలకి మీ నాన్నగారికి గుండెపోటు వచ్చింది. అక్కడ ఉంటున్నది మేమిద్దరం. నాకు ఏం

చేయాలో తెలీలేదు. బాధతో ఈయన విలవిల్లాడిపోతున్నాడు. ఆ టైమ్‌లో ఆసుపత్రికి ఎలా తీసుకెళ్ళాలో అర్ధంగాక భయంతో పక్కింటివాళ్ళని సాయం అడుగుదామని తలుపు తీశాను.

ఎదురుగా దేవకన్యలా గుమ్మంలో నిలబడుందీ అమ్మాయి.

నన్ను అమ్మా అని పిలిచింది. "ఏం భయం లేదు నాన్నగారికి ఏమీ కాదు రండి" అని ధైర్యంచెప్పి లోనకొచ్చింది. ఒక గ్లాసు మజ్జిగ ఇమ్మంది.

ఇచ్చాను. ఆ గ్లాసును అభిమంత్రించి తాగమని ఇచ్చింది. ఆ మజ్జిగ తాగినవెంటనే నొప్పి చేత్తో తీసేసినట్టు కోలుకుని వెంటనే లేచి కూర్చున్నాడమ్మా మీ నాన్న. ఆయన ఆనందంతో దేవతలా బావించి కాళ్ళకు దండం పెట్టబోతుంటే వారించింది.

తండ్రి కూతురి పాదాలకు నమస్కరించకూడదు అంది. మాకు అర్ధం కాలేదు. ఆ తర్వాత మా ఇద్దర్నీ కూర్చోబెట్టి జరిగిదంతా మాకు వివరించింది.

దాంతో మాకు అర్ధమైపోయింది. మా రెండో కూతురు మిత్రవింద అని" అంటూ జరిగింది వివరించింది కావేరి.

"అవునమ్మా. ఇకనుంచి మిత్రవింద కూడా మా కూతురే. అమ్మా మిత్రా... నీ పుట్టింటి లాంఛనాలన్నీ మేం తీరుస్తాం తల్లీ. ఇదిగో అల్లుడూ... ఇంకోసారి నీ కాళ్ళు కడిగి మా రెండోకూతుర్ని కూడా నీకిచ్చి కన్యాదానం చేయాల్సిన యోగం మాకుందయ్యా" అన్నాడు నవ్వుతూ రామాచారి.

"అవును. ఈ పుత్తడిబొమ్మ, ద్వారాకాసుందరి మా కూతురు గావటం మా అదృష్టం" అంటూ కావేరి, మిత్రవింద చేయందుకుని శుశ్రుత చేతిలో ఉంచింది. "మీరిద్దరూ ఎప్పుడూ ఇలాగే ఒద్దికగా ఉండాలి. ఇక నుంచి మీరిద్దరూ మాకు రెండు కళ్ళు" అంది.

జరిగిందంతా చూస్తున్న దేవమ్మ గారికి విషయం కావేరి దంపతులకు ముందే తెలుసని తెలీటంతో గుండెలపై నుంచి పెద్దభారం తొలగిపోయినట్టయి తేలిగ్గా శ్వాస తీసుకుంది.

ఇటు చరక్ కూడా ఇక ఈ విషయంలో కలత పడాల్సింది లేదని తేలిపోవడంతో నెమ్మదిగా ఊపిరి తీసుకున్నాడు. మిత్రవింద మూడురోజుల క్రితం హైదరాబాద్ వెళ్ళిందంటే తాము ఎస్టేట్ భవంతిలో ఉన్న సమయం.

అంతా నిద్రపోయాక రాత్రి సమయంలో తన ఆత్మాగమనశక్తితో రామాచారి గారి ఇంటికి వెళ్ళుంటుంది. సమస్యను మిత్రవింద తనే పరిష్కరించింది. ఇక ఆలోచించాల్సిన పనిలేదు. "మావయ్యా. అందరం బయటే మాట్లాడుకుంటున్నాం. లోనకు పదండి" అంటూ ముందుగా ఇంటిలోకి దారితీశాడు చరక్. అతన్ని అనుసరించి రామాచారి ఆ వెనకే శుశ్రుత, మిత్ర విందలతో కావేరి లోనకు నడిచారు. దేవమ్మగారు మాత్రం వెనుతిరిగి ఇంటివైపు వెళ్ళిపోయింది.

*　　*　　*　　*　　*

ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు– ఎస్టేట్ భవంతికి వచ్చాడు జర్నలిస్టు భీష్మనారాయణ.

అప్పటికింకా అగ్నివేశాచార్యుడు పూజలో ఉన్నాడు. డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడు, డ్రైవరు కాశీ మూలంగా వచ్చినవాడు జర్నలిస్టని గతంలో ఓసారి ఆచార్యుని కలిశాడని తెలుసుకుని భీష్మనారాయణని హాల్లో వెయిట్ చేయమన్నాడు. సుమారు నలభై నిముషాలు వెయిట్ చేశాక, అప్పటికి తన పూజ ముగించుకుని స్వల్పంగా అల్పాహారం తీసుకుని హాల్లోకి వచ్చాడు అగ్నివేశాచార్యుడు.

ఆయన్ని చూడగానే ఎంతో వినయంగా లేచి నమస్కరించాడు భీష్మనారాయణ. అతడ్ని చూడగానే "నువ్వా... ఏమిటి పొద్దుటే ఇటు వచ్చావ్. మళ్ళీ ఇంటర్వ్యూ కావాలని అదనీ ఏమీ విసిగించవు గదా" అన్నాడు అగ్నివేశాచార్యుడు నవ్వుతూ.

"అయ్యో. ఎంతమాట. అలాంటిదేమీ లేదు స్వామీ. కాని ఒక విశేషం ఉంది. అది తెలుసుకోవాలనే వచ్చాను" అన్నాడు భీష్మనారాయణ.

"కూర్చో... ఏమిటా విశేషం?" సోఫాలో ఆసీనుడవుతూ అడిగాడు.

"ఇవాళ దినపత్రికలు చూశారా?" తను కూడా ఎదురుగా సోఫాలో కూర్చుని అడిగాడు భీష్మనారాయణ. సోఫాలమధ్య టీపాయ్ మీద ఇవాళ్టి పత్రికలన్నీ మడత విప్పకుండా వచ్చినవి వచ్చినట్టు అలాగే ఉండటం గమనించాడు అగ్నివేశాచార్యుడు.

తగిన కారణం లేకుండా భీష్మనారాయణ పత్రికల ప్రస్తావన తీసుకురాడని అగ్నివేశాచార్యుడికి తెలుసు.

"ఇంకా చూడలేదయ్యా. ఇకమీదటే చూడాలి. స్పెషల్ న్యూస్ ఏదన్నా ఉందా?" అనడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఉంది స్వామీ. అందుకే తమ దర్శనార్థం వచ్చాను" అన్నాడు భీష్మ నారాయణ.

"ఏమిటది?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"తెలుగులో ఒకేఒక ప్రముఖ దినపత్రిక ఈ వార్తను కవర్ చేస్తూ ప్రచురించింది. చాలా ఆసక్తికరమైన వార్త. చెప్పుకోతగ్గ విశేషం. ఇందులో మీ పేరు ప్రస్తావనకు రావటం" అన్నాడు భీష్మనారాయణ.

"నా పేరా...."

"అవును స్వామీ. మీ పేరు"

"ఎందుకు? ఏదన్నా ఆయుర్వేద వైద్యుల సదస్సు లాంటిదేమన్నా జరిగిందా లేక...."

"జరిగింది ఆయుర్వేద సదస్సు కాదు స్వామీ. మాంత్రికుల సదస్సు" చెప్పాడు జర్నలిస్టు భీష్మనారాయణ.

"మాంత్రికుల సదస్సా...." నమ్మలేనట్టు అడిగాడు అగ్నివేశాచార్యుని కళ్ళ ముందు మాంత్రికుడు మరిడి సోమయ్య మెదిలాడు.

"భీష్మనారాయణా... ఇలా ముక్కలు చెక్కలుగా కాదుగాని అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మీరే ఓసారి చదవండి స్వామీ. అంతా అర్థమవుతుంది" అంటూ తమ చేత్తోతెచ్చిన తెలుగు దినపత్రికను విప్పి ఆచార్యుని ముందుంచాడు భీష్మనారాయణ.

ఫ్రంట్ పేజీలోనే దిగువన రైట్ కార్నర్‌లో ఉందావార్త. "మరో ధర్మసంస్థాపన జరగనుందా!" అనే హెడ్డింగ్‌తో ఇవ్వబడిన వార్త.

హెడ్డింగ్ చూడగానే అగ్నివేశాచార్యుడు నొసలు విరిచాడు. అయితే వార్తను పూర్తిగా చదవకుండానే పేపరు మడిచి పక్కనుంచాడు. "నేను తీరిగ్గా తర్వాత చదువుతా గాని వార్త సారాంశం ఏమిటో చెప్పు" అంటూ భీష్మనారాయణని చూశాడు.

"స్వామి! మీకు ఒరిస్సాలోని జాజ్‌పూర్ తెలుసునా?" అడిగాడు భీష్మ నారాయణ.

"తెలుసు"

"జాజ్‌పూర్ పరిసరాలు మాంత్రికవిద్యలకు, తాంత్రిక విద్యలకు ప్రసిద్ధి అని కూడా మీకు తెలిసే ఉండాలి. జాజ్‌పూర్ సమీపారణ్యంలో రెండురోజుల క్రితం మాంత్రికుల సదస్సు ఒకటి రహస్యంగా జరిగింది. ఈ సదస్సుకు మహా మాంత్రికులనదగ్గ జాజ్‌పూర్ పరిసర ప్రాంతాల్లోని సుమారు నూట ఏభైమంది మంత్రవాదులు హాజరయ్యారు.

ఈ సదస్సును ఏర్పాటుచేసి వారందరినీ ఆహ్వానించినవాడు మరిడి సోమయ్యనే మాంత్రికుడు" అంటూ క్షణకాలం చెప్పడం ఆపాడు భీష్మనారాయణ. ఆసక్తిగా వింటున్నాడు అగ్నివేశాచార్యుడు.

ఇదే సమయంలో డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు, ఆయన కొడుకు శివరామపాత్రుడు కూడా అక్కడికొచ్చి మరో సోఫాలో కూర్చుని ఆసక్తిగా వినసాగారు. అగ్నివేశాచార్యుడు తన ముఖంలో ఏ భావం ప్రతిఫలించకుండా జాగ్రత్తపడుతూ–

"తర్వాత ఏమైంది?" అనడిగాడు.

"ఈ మేటర్‌ను రిపోర్ట్‌చేసింది ఉదయ్ అనే జాజ్‌పూర్‌కు చెందిన జర్నలిస్టు. అతను నాకు పరిచయస్థుడే. ఉదయం పేపర్ చూడగానే ఉదయమే అతనికి ఫోన్ చేశాను. ఈ మేటర్ సేకరించింది తనేనని చెప్పాడు. ఈ సదస్సు గురించి తెలిసి ఎంతో రిస్క్ తీసుకుని అక్కడికెళ్ళి న్యూస్ కవర్ చేశాడు"

"మాంత్రికుల సదస్సులో నా పేరు ఎందుకొచ్చిందట?" అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ధర్మసంస్థాపన జరపబోయేది ప్రపంచంలోనే శతాధికవృద్ధుడయిన అగ్ని వేశాచార్యుడు అంటూ మాంత్రికుడు మరిడి సోమయ్య మీ పేరు చెప్పాడట. అదే జరిగితే కలిధర్మం నశిస్తుందని.

పాపులు, దుర్మార్గులు అధర్మపరులు అవినీతిని ఆచరించేవాళ్ళు అంతా మట్టికొట్టుకుపోతారు. చీమలు రాలినట్టు మరణిస్తారు. భయంకర వినాశనం సంభవిస్తుంది అంటూ చెప్పాట్ట"

"సదస్సులో నా ఒక్కడి పేరే చెప్పాడా లేక వేరే ఎవరి పేర్లయినా చెప్పాడా?"

"పేపర్ న్యూస్‌లో మీ పేరు మాత్రమే ఉంది స్వామీ. ఇంకెవరి పేరూ లేదు. మీరు నా సమీపంలోనే ఉన్నారనగానే ఈ వార్తమీద మీ స్పందన ఏమిటో తెలుసుకుని ఫోన్ చేయమని ఉదయ్ రిక్వెస్ట్ చేశాడు.

చెప్పండి స్వామీ. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా మీరీ ఎస్టేట్ భవనంలో ప్రశాంతంగా కూర్చున్నప్పటికీ మీ శక్తి సామర్థ్యాలేమిటో ఆ రోజు స్వయంగా చూశాను. దూసుకొచ్చిన అగ్గిని అరచేత పట్టి తిప్పికొట్టి మీ మునిమనవడిని, ఆ యువతులిద్దర్నీ కారుతో సహా కాపాడారు.

ఎప్పుడో ద్వాపరయుగాంతంలో కురుక్షేత్రయుద్ధం నడిపి ధర్మ సంస్థాపన చేశాడు అవతారమూర్తి శ్రీకృష్ణుడు. నేటి లోకం పోకడ చూస్తుంటే నిజంగానే మరో ధర్మసంస్థాపన అవసరం అన్పిస్తుంది.

కాని అది సాధ్యమా? మాంత్రికుడు మరిడి సోమయ్య చెప్పినట్టు మీరు మరో ధర్మసంస్థాపన చేయబోతున్నారా?" అంటూ జర్నలిస్టు భీష్మనారాయణ అడుగుతుంటే–

ఆ మాటల్ని ఆసక్తిగా విన్నాడు అగ్నివేశాచార్యుడు. తలతిప్పి పిల్లా గోవిందపాత్రుడు, శివరామ ముకుందపాత్రులు వంక చూశాడు. తండ్రీ కొడుకు లిద్దరూ చిరునవ్వులు చిందిస్తున్నారు.

అగ్నివేశాచార్యుడు అవునని గాని కాదనిగాని చెప్పకపోవడంతో మరింత పట్టుదలగా– "చెప్పండి స్వామీ. మీ మౌనం అంగీకారంగా భావింపవచ్చా? మీరు ధర్మసంస్థాపన చేయబోతున్నారా?" అంటూ పునఃప్రశ్నించాడు భీష్మ నారాయణ.

"భీష్మా! నీకు ఎలా చెప్పాలి, ఏం చెప్పాలి అర్థం గావడంలేదయ్యా. ఎక్కడో ఎవరో నా గురించి ఏదో చెప్పారు. అది అవునా, కాదాని నన్ను సమాధానం చెప్పమంటావ్? ఏం చెప్పను?

ఇపుడూ ఒక చెట్టు చిటారుకొమ్మన ఒక నల్లటి పక్షి వాలింది. దాన్ని చూసిన పిల్లలు కొందరు అది కాకి అని, మరికొందరు కాదు కాదు కోకిల అని వాదులాడుకోసాగారు. కాకి, కోకిల రెండూ నల్లగానే ఉంటాయి. ఆ పక్షి కూసినప్పుడు గదా అది కాకా, కోకిలా తెలిసేది. కూత పెట్టకుండానే అది ఎగిరిపోతే ఏమీ చెప్పలేం.

అలాగే ఏదయినా జరగాలి. అప్పుడు జరిగిందని చెప్పుకోవాలి. ఒంటరి వాణ్ణి. వృద్ధుణ్ణి. నా వల్ల ఎమవుతుందని ధర్మసంస్థాపన చేయగలను?

ఐనా సందర్భం వచ్చింది గాబట్టి ఒక విషయం చెప్పుకుందాం. అప్పుడెప్పుడో పందొమ్మిది వందల తొంభై దశకంలో అదేదో ప్లానెట్ ఎక్స్ అనే అదృశ్య గ్రహం భూమిని ఢీకొని అపార జననష్టం సంభవిస్తుందని ప్రచారం జరిగింది. కాని జరగలేదే...

అలాగే క్రీస్తుశకం రెండు వేల సంవత్సరంతో కలియుగాంతం అంటూ మరో ప్రచారం జరిగింది. ప్రజలు భయపడ్డారు. రెండు వేల సంవత్సరం వచ్చింది వెళ్ళింది. కాని ఈ భూమికి ఏమీ జరగలేదు. కలియుగాంతమూ కాలేదు.

ఇక రెండువేల పన్నెండు డిశంబరు ఇరవై ఒకటో తారీకు. మాయా నాగరికత వారి లాంగ్ క్యాలెండర్ ప్రకారం ఆ రోజు భయంకరమైన భూకంపాలు, సునామీలు ఏర్పడి ఈ భూమి రెండు వంతులు నీటమునిగి ఒక వంతు మిగులు తుందని అపార జననష్టం సంభవిస్తుందని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం జరిగింది. కానీ ఇదీ జరగలేదు.

జర్నలిస్టువి. ఈ విషయాలేవీ నీకు తెలీనివికావు. కాబట్టి నేనేదో ధర్మ సంస్థాపన చేయబోతున్నానని లోకాన్ని ఉద్ధరించబోతున్నానని అనుకోనక్కరలేదు. కాని ఒక్కటి మాత్రం చెప్పగలను.

త్వరలోనే మరో ధర్మసంస్థాపన జరుగుతుందన్నది నా నమ్మకం కూడా. కాని మాంత్రికుడు మరిడి సోమయ్య నా పేరు ఎందుకు చెప్పాడో తెలీదుగాని నేనయితే ఈ విషయంలో అశక్తుడ్ని. నేను ఏమీ చేయడంలేదు" అంటూ ముగించాడు అగ్నివేశాచార్యుడు.

అగ్నివేశాచార్యుని మాటలు చాలా ఆచితూచి మాట్లాడినట్టున్నాయి. కర్ర విరక్కుండా పాము చావకుండా మధ్యే మార్గంగా ఉంది ఆయన సమాధానం. జర్నలిస్టు భీష్మనారాయణకి స్పష్టంగా ఏమీ అర్థంకాలేదు.

కాని ధర్మసంస్థాపన జరుగుతుంది అని అగ్నివేశాచార్యుడు చెప్పడమే ఒక ప్లస్ పాయింట్ అన్పించింది.

"స్వామీ. మీ నమ్మకం కూడా అదే గాబట్టి. నేను ఈ విషయాన్ని రిపోర్ట్‌గా రాసుకోవచ్చా?" అనడిగాడు భీష్మనారాయణ.

"ఏం రాస్తావ్? అగ్నివేశాచార్యుడు ధర్మసంస్థాపన చేయబోతున్నాడని రాస్తావా?" అని అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"లేదు స్వామీ. ధర్మసంస్థాపన జరగనుందని, మీరూ నమ్ముతున్న విషయాన్ని రాస్తాను"

"సరి. అంతవరకే రాయి. ఇంతకీ మాంత్రికులంతా సదస్సులో ఏ నిర్ణయం తీసుకున్నారో చెప్పలేదు"

"ధర్మసంస్థాపనను అడ్డుకోవడం కోసం కలిపురుషుణ్ణి ప్రసన్నం చేసుకుని ఆయన సాయం తీసుకోవడానికి పక్షం దినాలు మహాయాగం ఒకటి జరప నిశ్చయించారట" చెప్పాడు భీష్మనారాయణ.

"కలిపురుషుడు– మహాయాగం. ఇదేదో విచిత్రంగా ఉంది. కలి అవసరం ఏమొచ్చింది వాళ్ళకి?" ఏమీ తెలీనట్టు అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"స్వామీ. జరుగుతోంది కలియుగం. దీనికి అధిపతి కలి. ఇప్పుడు కలిధర్మం నడుస్తోంది. మానవుల్ని భ్రష్టుపట్టించి అధర్మాన్ని అరాచకాల్ని ప్రోత్సహించడం ఆయన పని...." చెప్పాడు భీష్మనారాయణ.

"అంటే నీకూ ఈ విషయాలమీద నమ్మకం ఉందన్నమాట" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"నేను హైందవుణ్ణి స్వామీ. నమ్మకుండా ఎలా ఉంటాను. తన కలిధర్మానికి భంగం ఏర్పడితే కలి ఊరుకోడు గాబట్టి ధర్మసంస్థాపనను అడ్డుకోవడానికి ఆ కలిపురుషుడినే ప్రేరేపించడం వాళ్ళ ఉద్దేశం" అన్నాడు భీష్మనారాయణ.

"బాగుంది భీష్మనారాయణా. చాలా బాగుంది. మొత్తానికి కలిధర్మాన్ని రక్షించాలని మాంత్రికులంతా కంకణం కట్టుకున్నారు. చూద్దాం ఏం జరుగుతుందో. దీని గురించి మనం ఎక్కువ ఆలోచించడం కూడా అనవసరం. కాని నన్ను రచ్చకీడ్వకుండా నీకుతోచింది పత్రికల్లో రాసుకో. అంతవరకే"

అగ్నివేశాచార్యునికి కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్లిపోయాడు భీష్మనారాయణ.

"ఆచార్యా. మీరు చెప్పినమాటల్ని అతను పూర్తిగా నమ్మినట్టు లేదు" అన్నాడు డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడు.

"నమ్మకపోవచ్చు. కాని మన విషయంలో యధార్థం ఏం చెప్పినా దానికి చిలవలు, పలవలు కల్పించి రాసేస్తారీ పత్రికలవాళ్ళు. అందుకే నేను నిజం చెప్పలేదు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"కాని ఇప్పుడే ఈ విషయాలు పత్రికలకెక్కడం మంచిది కాదనుకుంటాను" అన్నాడు శివరామ ముకుందపాత్రుడు.

"ఇది మన తప్పుకాదు ముకుందా. మనప్రత్యర్థి మరిడి సోమయ్య తప్పు.

ఇక తనవల్ల ఏమీ కాదని అర్థంకాగానే కలి గురించి యాగం తలపెట్టి ఉంటాడు. వాడికి కలి ప్రసన్నమయ్యేలోపు మన పనులు పూర్తయితే బాగుంటుంది. చూద్దాం. ఇంతకీ అఘోరా ఎక్కడ? ఇంకా గదిలోంచి బయటకు రాలేదా?"

"ఆయన ధ్యానం ఇంకా పూర్తికాలేదు ఆచార్యా" బదులిచ్చాడు గోవిందపాత్రుడు.

"ద్వారక వెళ్ళిన స్థపతులు ఎప్పుడు తిరిగొస్తున్నారు ఆచార్యా?" ఉన్నట్టుండి అడిగాడు పాత్రుడు.

"వాళ్ళంతా తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఒకటి రెండురోజుల్లో ఇక్కడ వుంటారు" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మీకో విషయం చెప్పాలి ఆచార్యా. మీరు తల పెట్టిన ధర్మసంస్థాపన పెద్ద ఇష్యూ అయ్యేలా ఉంది. తెలుగులో ఈ ఒక్క దినపత్రికలోనే మాంత్రికుల సదస్సు గురించి వార్త వచ్చింది.

కాని అక్కడ ఒరిస్సాలో ఒరియా పత్రికల్లో ఈ వార్త ప్రముఖంగా వచ్చిందట. నా మిత్రుడు ఒకడు బరంపురం నుంచి ఫోన్ చేసి ఇంతక్రితమే నాతో మాట్లాడాడు" అన్నాడు గోవిందపాత్రుడు.

అంతలో అఘోరా కూడా హాల్లోకి రావడంతో అంతా చర్చలో మునిగి పోయారు.

*　　*　　*　　*　　*

నీలోదరి కొండగుట్ట నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని దట్టమయిన అడవిలోని మైదాన ప్రాంతంలో కలిపురుషుని కోసం మహా క్షుద్రయాగాన్ని ఆరంభించాడు మాంత్రికుడు మరిడి సోమయ్య.

ఒకరు కాదు ఇద్దరు కాదు నూట ఏభైమంది మాంత్రికశ్రేష్ఠులు పాల్గొన్న యాగం అది.

అందరూ నల్లని దుస్తులు ధరించారు. అతి పెద్దదైన హోమగుండం రగల్చబడింది.

ముందుగా నల్లని మేకలను, నల్లని దున్నలను బలి ఇచ్చి యాగం ఆరంభించారు. కలిపురుషుని విగ్రహానికి ధూపదీప నైవేద్యాలు బలి కార్యక్రమాలు ముగించిన తర్వాత మాంత్రికులంతా అగ్నిగుండం చుట్టూ కూర్చుని నిష్ఠతో మంత్రోచ్ఛాటన చేస్తూ యాగాన్ని కొనసాగించసాగారు.

పక్షంరోజులు దివారాత్రులు సాగాల్సిన యాగం. మరిడి సోమయ్య శిష్యులు ఆహూతుల్లో ఎవరికీ ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నారు.

యాగం కొనసాగుతూనే ఉంది.

* * * * *

తెల్లవారుఝాము. అగ్నివేశాచార్యుడు గాఢ నిద్రలో ఉన్నాడు. నిద్రలోనే ఒక అద్భుతమైన కల. కట్టెదుట నల్లరాతితో మలిచిన అతిసుందరమగు ద్వారకాధీశుని విగ్రహం సాక్షాత్కరించింది.

ఆ విగ్రహాన్ని దర్శించగానే అగ్నివేశాచార్యుడు నిలువునా పులకించి పోతూ–

"తండ్రీ గోపాలా... ద్వారకాధీశా. మాధవా మధుసూదనా నా యందు కరుణించి దర్శనమిచ్చావా!" అంటూ వినమ్రుడై నమస్కరించాడు.

"అగ్నివేశా..." అంటూ ద్వారకాధీశుని శాంత గంభీరస్వరం అగ్ని వేశాచార్యుని చెవులకు సోకింది.

"స్వామీ!" ఉద్విగ్నభరితుడై దిక్కులు చూస్తూ పిలిచాడు అగ్నివేశాచార్యుడు.

"నా పలుకులాలకింపుము అగ్నివేశా" అంటూ తిరిగి స్వామి మధురస్వరం విన్పించింది.

"నీ కోరిక తీర్చుటకే నేను ద్వారకాపురినుండి కోరుకొండకు తరలి వస్తున్నాను.

వేల సంవత్సరాలుగా గోమతీ తోయములందు జలసమాధి స్థితిలో వున్న నేను, నీ కొరకు లేచి తరలి వచ్చుచున్నాను. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక నన్ను పునఃప్రతిష్ఠింపవచ్చును.

ముందుగా నాకో చిన్న నీడ ఏర్పరచవలె. ఆ వెంటనే చరక్, మిత్రవిందలకు నా సన్నిధిలో వివాహము జరిపించవలె. వివాహానంతరమే చరక్‌ను ద్వారక పంపించవలె. శుభం జరుగుగాక..."

స్వామి పలుకులు అంతవరకే విన్పించాయి. కన్నీళ్ళతో "స్వామీ... ద్వారకాధీశా గోపాలా" కలలోనే దిక్కులు చూస్తూ పెద్దగా అరుస్తున్నాడు అగ్నివేశాచార్యుడు. అలా అరుస్తుండగానే దిగ్గున మెలుకువ వచ్చేసింది. అంతే అదిరిపడి లేచి కూర్చున్నాడు.

జరిగిందంతా కలని-అప్పటిగ్గాని అర్థంకాలేదాయనకు. టైమ్ చూశాడు.

తెల్లవారుజాము నాలుగుగంటలు దాటింది సమయం. వేకువన వచ్చే కలలు నిజమవుతాయంటారు. ఈ కలకు అర్థం ఏమిటి? తీవ్రంగా ఆలోచిస్తూ బెడ్ దిగాడు అగ్నివేశాచార్యుడు. కొద్దిగా మంచినీరు తాగి ముఖం కడుక్కున్నాడు.

అప్పటిగ్గాని ఆయన మనసు స్థిమితపడలేదు. తిరిగి అదే ఆలోచన. ఈ కలకు అర్థం ఏమిటి?

ద్వారకలోని హరిమందిర్‌లో ద్వారకాధీశుడు నిత్యం పూజలందుకుంటూనే ఉన్నాడు గదా. మరి జలసమాధి స్థితినుంచి లేచివస్తున్నానంటూ స్వామి పలికిన మాటలకు అర్థం ఏమిటి?

కోరుకొండకు తరలివస్తున్నానంటూ స్పష్టంగా చెప్పాడే. ఎలా వస్తున్నాడు. ఎప్పుడు వస్తున్నాడు? ఇక్కడ ఇంకా స్వామి విగ్రహం తయారుకాలేదు. ద్వారక వెళ్ళిన స్థపతులు తిరిగి రాలేదు.

చరక్‌ను ద్వారక పంపించి తిరిగివచ్చాక ఆలయ నిర్మాణం తర్వాతనే ఇక్కడ తొలివివాహం చరక్, మిత్రవిందలది కావాలని తను ఆశించాడు. కాని ముందే వివాహం జరిపించి పిమ్మట చరక్‌ను ద్వారక పంపమని స్వామి ఆనతి.

ఏం చేయాలి? "గిరిధారీ, మురారీ, యదునందనా. ఏమిటయ్యా ఇలా ఆనతిచ్చావ్. నాకేం తోచడం లేదే" అనుకుంటూ భవంతిలోంచి బయటికొచ్చి చల్లగాలిలో ఆరుబయట అటూ ఇటూ తిరగనారంభించాడు అగ్నివేశాచార్యుడు.

ఆలోచనల మధ్య ఎంత సమయం గడిచిందో తెలీదు. అంతలో - రోడ్డు ఎగువన ఎక్కడినుంచో లౌడ్ స్పీకర్లో కొందరు భక్తులు పాడుతున్న భజనశబ్దం వినవచ్చింది. తప్పెట్లు తాళాలతో ముక్తకంఠంతో పాడుతున్నారు. ఒడలు మరచి తన్మయులై పాడుతున్నారు.

భక్తిభావం తొణికిసలాడుతోంది.

క్రమంగా ఆ శబ్దం దగ్గర కాసాగింది.

ప్రశాంత చిత్తుడై ఆ భజన వింటూ అలా నిలబడిపోయాడు అగ్నివేశా చార్యుడు.

గోపాలా - గోవిందా,
గోకులతిలకా - శ్రీకృష్ణా,
ద్వారకాధీశా శ్రీకృష్ణా
ద్వారకనాథా శ్రీకృష్ణా
గిరిధరమురారి శ్రీకృష్ణా
యదుకులనందన శ్రీకృష్ణా
రాధేశ్యామ్ శ్రీకృష్ణా
యశోదతనయా శ్రీకృష్ణా
కాళియమర్దన శ్రీకృష్ణా
రుక్మిణివల్లభ వాసుదేవా
జై శ్రీ ద్వారకాధీశునికీ జై
జై శ్రీ వాసుదేవ, ద్వారకాధిపతికీ జై
జై జై శ్రీ శ్రీకృష్ణమహారాజ్‌కీ జై

భజన పూర్తవుతుండగానే చాలా సమీపంలోకి వచ్చేసిందా శబ్దం. ఏదో వాహనంలోంచి పాడుతున్నట్టుంది. ఆ ప్రభాతవేకువవేళ ఆ భజన వింటుంటే మనసు అలౌకిక తీరాలకు వెళ్ళిపోతున్నట్టుంది.

తనువు ఆనందంతో పులకిస్తోంది. అది కూడా కాదు. వాళ్ళంతా ద్వారకా ధీశుని భజనచేయడం ఆశ్చర్యంగా వుంది. అదేమిటో చూడాలని అలా గేటు వైపు అడుగులు సారిస్తూండగానే మినీ బస్‌ఒకటి హెడ్‌లైట్ల కాంతిలో మలుపు తిరిగి లోనకు వచ్చేసింది.

వచ్చే ఆ బస్సు ఎవరిదో కాదని, ద్వారక వెళ్ళిన స్థపతులు తిరిగివస్తున్నారని అప్పటిగ్గాని అగ్నివేశాచార్యునికి అర్థం కాలేదు.

కాని అర్థంగానిది ఒకటే. వీళ్ళంతా ఇంతగా ద్వారకాధీశుని భక్తులుగా ఎలా మారిపోయారు?

దారి పొడవునా ఇలా భజన చేస్తూనే వస్తున్నారా? బస్‌కి లౌడ్‌స్పీకర్ సెట్ చేసుకుని మరీ ఆనందడోలాహలంతో వస్తున్నారే... ఆలోచిస్తూ అక్కడే ఆగిపోయాడు అగ్నివేశాచార్యుడు.

ఆయనకు అతి సమీపంలోకి వచ్చి ఆగింది బస్సు. డోర్ తెరుచుకోగానే ముందుగా శంకరనారాయణ స్థపతి, ఆయన వెనకే పెరుమాళ్ స్థపతి బస్ దిగారు. ఇద్దరూ కాషాయలుంగీ కట్టుకుని, కాషాయతుండు భుజం మీద వేసుకున్నారు. వాళ్ళేకాదు.

వారి శిష్యులూ కాషాయ లుంగీలే ధరించారు. వారిలో ఈ మార్పేమిటో అర్థంగాక అలా చూస్తూండిపోయాడు అగ్నివేశాచార్యుడు.

బస్ దిగుతూనే అగ్నివేశాచార్యునికి వినమ్రంగా నమస్కరించారు స్థపతులు ఇద్దరూ.

"ఏమిటయ్యా ఇది? ద్వారక వెళ్ళగానే మీలో ఇంత మార్పేమిటి?

సడెన్‌గా ద్వారకాధీశుని భక్తులుగా మారిపోయారు. ఏం జరిగింది?" అనడిగాడు నవ్వుతూ అగ్నివేశాచార్యుడు.

అప్పటికి తెలతెలవారుతోంది. కోరుకొండవీధుల్లో జనసంచారం ఆరంభమైంది.

"ఏం చెప్పను ఆచార్యా. ఊహించని విషయాలే జరిగాయి" అన్నాడు శంకర నారాయణ స్థపతి.

"చెబితే మీరే ఆశ్చర్యపోదురు" అన్నాడు పెరుమాళ్ స్థపతి.

ఈలోపల మైక్ సెట్ ఆఫ్‌చేసి శిష్యులు ఆరుగురూ కూడా బస్ దిగి వచ్చారు. అది అద్దెబస్సు. అయినా కూడా బస్సు డ్రైవరు, క్లీనర్లు కూడా కాషాయదుస్తుల్లోకి మారిపోయారు.

"అంత విశేషం ఉందా? అయితే రండి లోపల కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ వెనుతిరిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఒక్క నిముషం ఆచార్యా. మనం కాస్సేపు ఇక్కడే మాట్లాడుకోవడం మంచిదనుకుంటాను" అన్నాడు శంకరనారాయణ స్థపతి.

"సరి. విశేషాలు ఏమిటో చెప్పండి. ఇంతకీ వెళ్ళిన పని ఏమైంది?" అని ఆగి తిరిగి చూస్తూ అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఆచార్యా! ఈ ఆలయనిర్మాణ భారాన్ని మీరు మా భుజాలమీద ఉంచటం ఇది మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

నిజంగా మా అదృష్టం. మేం ద్వారక వెళ్ళాం. ద్వారకాధీశుని ఆలయాన్ని దర్శించాం. ఆలయ నిర్మాణానికి అవసరమైన కొలతలతో స్కెచ్‌లు తయారు చేసుకున్నాం.

పోతే ద్వారకాధీశుని విగ్రహం మలచాలంటే సరైన కొలతలు కావాలి. దీనికోసం ఆలయ అర్చకులతోను, అధికారులతోను మాట్లాడాం.

వాళ్ళు అందుకు ఒప్పుకోలేదు. గుజరాత్ ప్రభుత్వం నుండి అక్కడి దేవాదాయ శాఖనుండి అనుమతి తెచ్చుకుంటేనే సాధ్యపడుతుందన్నారు.

అది చాలా లాంగ్ ప్రాసెస్. వెంటనే జరిగే పనికాదాయె" అంతవరకు చెప్పి ఆగాడు శంకరనారాయణ స్థపతి.

"అవును ఆచార్యా. గుజరాత్ గవర్నమెంట్ చాలా స్ట్రిక్టు. బ్రతిమాలు కున్నా లాభం లేకపోయె" అన్నాడు పెరుమాళ్ స్థపతి.

"తర్వాత ఏమైంది?" కుతూహలంగా అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"ఏం చేయాలో మాకు అర్థంకాలేదు. సుమారుగా కొలతలు ఊహించుకుని స్వామిని తయారుచేసుకోవడమొక్కటే మార్గం. అలా చేయడం మాకు ఇష్టం లేదు. మూడు రోజులు ఇదే చింతమాకు. ఆ రాత్రి ఇదే విషయం మీద చర్చించుకుని భారాన్ని స్వామిమీద ఉంచి నిద్రపోయాం. ఆ రోజు తెల్లవారుజామున నాకు కల వచ్చింది" అన్నాడు శంకర నారాయణ స్థపతి.

"కలా...." విభ్రాంతుడై అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"అవును. కలే...."

"ఇంతకీ ఏం జరిగిందయ్యా. స్వామిని కలలో చూసి ఇలా భక్తులుగా మారిపోయారా!" సందేహంగా అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"లేదు ఆచార్యా. జరిగింది వినండి. అర్ధరాత్రి దాటిన తర్వాత నాకో విచిత్రమైన కల వచ్చింది. కలలో ద్వారకాధీశుని విగ్రహం కన్పించింది.

స్వామి మాటలు విన్పించాయి. "నా విగ్రహం గురించి చింత దేనికి. వెంటనే నా ఆలయానికి రండి. మెట్లు దిగి గోమతీనదిలో వెదకండి. నేను

దొరుకుతాను. ఇప్పుడే వెళ్ళండి... అంటూ ఆనతిచ్చాడు స్వామి. ఆ వెంటనే మెలకువ వచ్చేసింది"

"ఈ కలకు అర్థం ఏమిటో ఏం చేయాలో నాకయితే బోధపడలేదు. అంతలో పెరుమాళ్ స్థపతి కంగారుగా లేచి నా వద్దకొచ్చాడు. విచిత్రం ఏమంటే తనకీ అదే కల రావడం. ఇద్దరినీ స్వామి ఆదేశించాడంటే ఏదో కారణం ఉంటుందనిపించింది. వెంటనే కొబ్బరికాయలు, పూలు, కొత్త వస్త్రం తీసుకుని శిష్యులతో సహా మేమంతా గోమతీ నదీతీరానికి వెళ్ళాం.

వణికించే చలిని కూడా లెక్కచేయకుండా నదిలో దిగి గాలించడం ఆరంభించాం. కొంత సేపటికి బురదలో కూరుకుపోయిన స్థితిలో ఒక విగ్రహం లభించింది. అంతా సాయంపట్టి విగ్రహాన్ని మెట్లవద్దకు తెచ్చాం.

చక్కగా బురదను కడిగి మెట్లమీద నిలబెట్టి చూశాం. ఆహా! ఎక్కడా చెక్కు చెదరకుండా కనువిందు చేస్తున్న నల్లరాతిసొగసైన ద్వారకాధీశుని విగ్రహం.

వెంటనే స్వామికి పసుపుకుంకుమలిచ్చి కొబ్బరి కాయలు కొట్టి హారతిచ్చాం. కొత్తవస్త్రాన్ని స్వామికి చుట్టి ఎవరూ చూడకముందే లాడ్జి వద్దకు మోసుకొచ్చేశాం. విగ్రహం బయటపడిన విషయం స్థానికులకుగాని, పోలీసులకు గాని, దేవాదాయశాఖ వారికిగాని, పురాతత్త్వ శాఖకు గాని ఎవరికి తెలిసినా పడిన శ్రమ వృధా అయిపోతుందని తెలుసు. విగ్రహాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు. అందుకని ఎవరికీ కనబడకుండా విగ్రహాన్ని బస్సు లగేజీ ఛాంబర్‌లోకి నెట్టి అడ్డంగా సామాన్లు ఉంచేశాం. ఇక మిగిలిన రాత్రి నిద్రపోలేదు.

తెలతెలవారుతుండగానే లాడ్జి ఖాళీచేసి బయటికి వచ్చేశాం. అంతటి స్వామి మావెంట వస్తుంటే నిరాడంబరంగా రావడం మాకు ఇష్టంలేక పోయింది.

ఉదయం ద్వారకలోనే కాఫీ టిఫిన్లు చేసి ఒక మైక్‌సెట్ కొని బస్‌లో బిగించాం. అందరం కాషాయ దుస్తులు ధరించి ఆ స్వామిని పూజలు, భజనలు చేస్తూ చిన్మయానందంతో నిరపాయంగా ఇక్కడికి చేరుకోగలిగాం" అంటూ జరిగిందంతా వివరించాడు శంకరనారాయణ స్థపతి.

ఆ మాటలు విన్న అగ్నివేశాచార్యుడు పులకించిపోయాడు. కలలో తనతో ఆ స్వామి చెప్పిన మాటలకు అర్థం ఏమిటో ఇప్పుడు తెలిసింది.

"ఆహా మీ జీవితాలు ధన్యమయ్యాయి. ఆ స్వామి కరుణ పొందటం కన్నా అదృష్టం ఏముంటుంది. ఎక్కడ స్వామి... నాకు చూపించండి. వెంటనే చూడాలి" అన్నాడు ఆత్రంగా.

బస్సు డ్రైవర్ లగేజీ ఛాంబర్ డోర్ తెరిచాడు. అందులోని లగేజీ అంతా బయటపెట్టగానే లోనే నూతనవస్త్రం చుట్టబడిన ఆరడుగుల పైగా ఎత్తున్న ద్వారకాధీశుని విగ్రహం కన్పించింది.

విగ్రహాన్ని సాయంపట్టి ఇవతలకు తెచ్చారు. విగ్రహం కళ్ళకు గంతలు కట్టారు. నిగనిగ మెరిసిపోతున్న నల్లరాతి విగ్రహం.

అగ్నివేశాచార్యుడు భక్తిపారవశ్యంతో విగ్రహం పాదాలకు నమస్కరించాడు.

ఈలోపల భవంతి లోపలినుంచి అఘోరా, పిల్లా గోవింద పాత్రుడు, శివరామ ముకుందపాత్రుడు అంతా లేచి బయటకువచ్చారు. నౌకరు అప్పన్న, డ్రైవర్ కాశీ ఇంకా ఎస్టేట్ నౌకర్లు కొందరు వచ్చారు. అంతా భక్తితో స్వామికి నమస్కరించారు.

"అయ్యా. నాదో సందేహం" అన్నాడు అప్పన్న.

"ఏమిట్రా నీ సందేహం?" అడిగాడు శంకరనారాయణ స్థపతి.

"ఏం లేదండి. స్వామి కళ్ళకు అలా గంతలు కట్టారెందుకు?" అడిగాడు అప్పన్న.

"కారణం ఉందిరా. మేం దేవీదేవతల విగ్రహాలు ఏం తయారుచేసినా కనురెప్పలు మూసే ఉంచుతాం. ప్రాణప్రతిష్ఠ చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించాకే కనులు తెరుస్తాం. ప్రాణ ప్రతిష్ఠ చేయకుండా విగ్రహం చూడటం క్షేమం కాదు. అరిష్టం. ఈ ద్వారకాధీశుని విగ్రహం కనులు తెరిచే ఉన్నాయి.

అంటే గతంలో ఎందరో భక్తుల పూజలందుకొన్న స్వామి. ప్రస్తుతం ప్రతిష్ఠాపన చేయకుండా స్వామి చూడటం క్షేమం కాదని గంతలు కట్టాం. ప్రతిష్ఠించగానే తీసేస్తాం" అంటూ వివరించాడు.

"ఏదో రాసుంది. అదేమిటో మాకు అర్థంకాలేదు" అంటూ విగ్రహం పాదాల కింద పీఠాన్ని చూపించాడు పెరుమాళ్ స్థపతి.

"అవును ఆచార్యా. ఈ విగ్రహం ఎప్పటిదో ఏమన్నా సమాచారం తెలుస్తుందేమో చూడండి" అంటూ టార్చిలైటు పీఠంమీదకు ఫోకస్ చేశాడు శంకరనారాయణ.

"నాకు సరిగా కనబడదుగాని గోవిందా! అదేమిటో ఓసారి చదివిచెప్పు" అన్నాడు అగ్నివేశాచార్యుడు. డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు ముందుకొచ్చి పరిశీలించాడు. దేవనాగరి అక్షరాల్లో రెండు లైన్లు చెక్కబడుంది. మొదటి పైవరస లైను "భగవాన్ ద్వారకాధీశ్" అని వుంది. దిగువన రెండో లైను "వజ్రనాభ ప్రతిష్ఠితం" అని వుంది. ఇదే విషయాన్ని చెప్పాడు.

విని తల ఊపాడు అగ్నివేశాచార్యుడు. "ఇప్పుడు నాకంతా అర్థమైంది" అన్నాడు.

"మాకు అర్థంకాలేదు ఆచార్యా. ఈ విగ్రహం ఎప్పటిది?" అనడిగాడు అఘోరా.

"స్వామి కలలో నాతో చెప్పిందానికి సరిపోయింది. వేల సంవత్సరాల క్రితం నాటిదీ విగ్రహం.

శ్రీకృష్ణులవారి మునిమనవడు వజ్రనాభుడు తీరంమీద ద్వారకను పునర్నిర్మించి ద్వారకాధీశుని ఆలయాన్ని కట్టించాడు. తొలినాటి ఆ ఆలయంలో ప్రతిష్ఠింపబడి ద్వారకావాసుల పూజలందుకొన్న స్వామి ఈ విగ్రహం. ఎక్కడో చదివిన గుర్తు.

ఆ తొలి ఆలయం మూడు వందల సంవత్సరాలకు శిధిలస్థితికి చేరుకొంది. ఈలోపల ద్వారక మీద శత్రురాజుల దాడులు జరిగి ఆలయం గురించి ఎవరూ పట్టించుకోలేదు.

శత్రువులే ఆలయాన్ని ధ్వంసం చేశారో, లేక శత్రువులకు భయపడి అర్చకులే ఈ స్వామిని గోమతీనదిలో నిమజ్జనం చేసుండాలి. లేదా అరాచక పరిస్థితుల్లో దుండగులు విగ్రహాన్ని నదిలో పారేసి ఉండాలి. అప్పటినుండీ స్వామి జలసమాధి స్థితిలో వేల సంవత్సరాలు గోమతీ నదిలోనే ఉండి పోయాడు.

ఈలోపల ద్వారకాధీశుని ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ స్వామి అగుపించకపోవడంతో తిరిగి విగ్రహాన్ని తయారుచేయించి ప్రతిష్ఠించడం జరిగింది. ఇప్పుడు ద్వారకలో పూజలందుకొంటున్న విగ్రహం తర్వాత తయారు చేసింది. ఇది మొదట ద్వారకాధీశుని ఆలయంలోని విగ్రహం" అంటూ వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"ఆహా స్వామీ... ఆ గోపాలుడే మీవద్దకు తరలి వచ్చాడు. ధూంధాంగా విగ్రహానికి పూజలు జరిపించాలి. మేళతాళాలు ఏర్పాటుచేయాలి. మన ఎస్టేట్ ఒక యాత్రాస్థలం కావాలి" అనరిచాడు ఉత్సాహంగా డ్రైవర్ కాశీ.

"ఓరి ఓరి. ఆగరా. ఇప్పుడే అవేమీ జరక్కూడదు. విగ్రహాన్ని ప్రతిష్ఠించే వరకు ఈ విషయం బయటకు తెలీకూడదు. ఎల్లుండి శుభముహూర్తం ఉంది.

ఈలోపల స్వామిని కొలువుంచడానికి, ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ఒక చిన్నమందిరం ఏర్పాటు చేయాలి. ఇవాళే పని మొదలుపెట్టాలి.

ముందీ స్వామిని లోనకు తీసుకురండి. అవతల తెల్లవారబోతోంది. భవంతిలోకి తీసుకురండి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

అంతా సాయంపట్టి విగ్రహాన్ని – భవంతిలోని ఒక ప్రత్యేకమైన గదిలోకి చేర్చారు.

* * * * *

మున్నలూరి వారి అగ్రహారంలో ఉన్న చరక్‌కి ఆ రోజు సాయంకాలం సడెన్‌గా జేజి తాతగారి నుంచి ఫోన్ వచ్చింది. "ఏరా అక్కడంతా ఎలా ఉన్నారు? నీ అత్తమామలు ఏమంటున్నారు?" క్యాజువల్‌గా అడిగాడు అగ్నివేశాచార్యుడు.

"అంతా బాగానే ఉన్నారు జేజిగారు. అత్తమామలు మిత్రవిందను కూడా తమ సొంతకూతురులా చూసుకుంటున్నారు...." అన్నాడు చరక్.

"మంచిది. ఇప్పుడు నేను చెప్పేది జాగ్రత్తగా విను. రేపు ఉదయమే నానమ్మ దేవమ్మతో సహా మీరంతా ఎస్టేట్ భవంతికి బయలుదేరి రావాలి...."

అగ్నివేశాచార్యుని మాటలు విని– చరక్ కాస్త కంగారుపడ్డాడు. ఏమైంది? ఉన్నట్టుండి బయలుదేరి రమ్మంటున్నారు? ఆరోగ్యం బాగానే ఉందా?

"ఏమిటి జేజిగారు. మీ ఆరోగ్యం బాగానే ఉంది గదా?" అనడిగాడు చరక్.

"నా ఆరోగ్యానికేమిరా భేషుగ్గా ఉన్నాను"

"మరయితే అకస్మాత్తుగా అందర్నీ రమ్మనడంలో విశేషం ఏమిటి?"

"చాలా విశేషాలున్నాయి. ఫోన్‌లో చెప్పడం కుదరదు. రెండు కారణాలు మాత్రం చెప్తాను. ఎల్లుండి ఉదయం ద్వారకాధీశుని విగ్రహప్రతిష్ఠాపన జరపాలి. జరిపిన మరునాడే ఆయన సన్నిధిలో నీకు, మిత్రవిందకు వివాహం. నీకు, శుశ్రుతకు చాలా గ్రాండ్‌గా వివాహం జరిపించాం.

కాని ఇప్పుడంత సమయం లేదుగాబట్టి సింపుల్‌గానే ముగిద్దాం. మిగిలిన విషయాలు తర్వాత...."

"కాని జేజిగారు...."

"ఇంకేం మాట్లాడకు. మనకు ఆట్టే సమయం లేదు. నువ్వు ద్వారక బయలుదేరాల్సిన రోజు కూడా అవతల దగ్గరపడుతోంది. ముందు చెప్పింది చెయ్యి. నీ అత్తమామలతో సహా అంతా రావాలి.

మన బంధువుల్లో కూడా ముఖ్యుల్ని పిలుచుకురండి. రేపు ఉదయం మీరు బయలుదేరుతున్నారు" అంటూ లైన్ కట్‌చేశాడు అగ్నివేశాచార్యుడు.

చరక్‌కి పిచ్చెక్కినట్టుంది. ఏమీ అర్థంగాక కాస్సేపు అలా ఫోన్ వంక చూస్తూండిపోయాడు. నిజానికి ఎస్టేట్ వద్ద విశేషాలేమీ చరక్‌కు తెలీదు. అందుకే ఇంతగా ఆశ్చర్యపోతున్నాడు.

అయితే నిన్న సాయంకాలం మాటల సందర్భంలో మిత్రవింద ఒక మాటంది "ప్రియుడా. మన వివాహఘడియలు సమీపిస్తున్నాయి" అని ఆమె ఏదో తమాషాకి అలా పలికిందనుకున్నాడు.

అంటే... మిత్రవింద ఎస్టేట్ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసు కుంటూనే ఉందన్నమాట.

ద్వారక వెళ్ళివచ్చాక తమ వివాహం జరిపిస్తామన్న జేజితాతగారు వివాహం తర్వాతే తనను ద్వారక పంపించేలా మనసు మార్చుకోవడానికి కారణం ఏమిటి? ఐనా అక్కడ ఆలయనిర్మాణానికి ఇంకా శంకుస్థాపనే జరగలేదు. విగ్రహ

ప్రతిష్ఠాపన ఏమిటి? విషయం ఏమిటో మిత్రవిందను అడిగి తెలుసుకోవాలి అనుకుంటూండగా తనే అక్కడికొచ్చింది.

"మిత్రా... ఎస్టేట్‌లో ఏం జరుగుతోంది? నీకు తెలుసుంటుంది. జేజి గారు ఇప్పుడే ఫోన్ చేశారు. రేపు ఉదయం అందర్నీ బయలుదేరి రమ్మంటున్నారు. విగ్రహప్రతిష్ఠాపనట. ఆ వెంటనే మన వివాహమట. నాకేమీ అర్థంగావటం లేదు" అనడిగాడు.

మిత్రవింద ఉత్సాహంగా నవ్వింది "ప్రియుడా. ఎలాగూ రేపు ఎస్టేట్‌కు వెళుతున్నాం గదా. తొందరేల?" అంది గడుసుగా.

"అంతేగాని నువ్వు చెప్పవన్నమాట?"

"ఊహు. చెప్పనే చెప్పను"

"సరి. నువ్వు చెప్పనంతవరకు నీతో మాట్లాడను"

"సమస్య ఏమున్నది? నీవు మాట్లాడకున్ననేమి? నేను మాట్లాడతానుగా" అంది మిత్రవింద.

"ఓసి తెలుగు నేర్చుకుని నన్నే తికమకపెట్టేస్తున్నావే. శుశ్రుత ఎక్కడ?"

"ఇక్కడ... ఏమిటి గొడవపడుతున్నారు మీరిద్దరూ?" అంటూ వచ్చింది శుశ్రుత.

"గొడవ కాదు. ఏ విషయం చెప్పనంటోంది. జేజితాతగారు ఫోన్ చేశారు. రేపే మనందర్నీ కోరుకొండ బయలుదేరి రమ్మంటున్నారు" అంటూ అగ్ని వేశాచార్యుడు చెప్పిన విషయాలు శుశ్రుతతో చెప్పాడు చరక్.

"అయితే ఇది సంతోషించాల్సిన విషయమే గదా. అక్కతో గొడవ దేనికీ. పదక్కా. ఈ విషయం అమ్మమ్మతో చెప్పాలి ముఖ్యమైనవాళ్ళని పిలవాలి. చాలా పనులు ఉన్నాయి" అంటూ మిత్రవిందను తనతో తీసుకెళ్ళిపోయింది శుశ్రుత.

ముందుగా ఈ విషయం నానమ్మ దేవమ్మతో చెప్పటానికి వెళ్తున్నారని గ్రహించాడు. ఇంతలో మామ రామాచారి బయటికొచ్చాడు "ఏమిటయ్యా అల్లుడూ గొడవపడుతున్నారు?" అంటూ.

అగ్నివేశాచార్యుడు చెప్పిన విషయాలనే ఆయనతో చెప్పాడు చరక్. వింటూనే భార్య కావేరిని పిలిచి చెప్పాడాయన. అంతేకాదు, వెంటనే తన కొడుకు నీలకంఠాచారికి ఫోన్‌చేశాడు. ఎక్కడో మెదక్‌జిల్లాలో పూజారిగా ఉంటున్నాడతను.

ఉన్నపళంగా సకుటుంబంగా బయలుదేరి తెల్లవారేసరికి మున్నలూరి వారి అగ్రహారంలో ఉండాలని ఆర్డర్‌వేసేశాడు. ఇక ఆ సాయంకాలానికే మున్నలూరి వారి అగ్రహారంలో హడావుడి మొదలైంది.

మరునాడు ఉదయానికి ఒక బస్ ఏర్పాటుచేశాడు చరక్. తండ్రి నుంచి ఫోన్ రాగానే అటు నీలకంఠాచారి భార్య, ఇద్దరు పిల్లలతో చెప్పినట్టుగానే మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు మున్నలూరివారి అగ్రహారం వచ్చి చేరుకున్నాడు.

ఉదయం తొమ్మిదిగంటలకు ముందుగా తమ కారులో చరక్, మిత్రవింద, శుశ్రుతలు, దేవమ్మగారు, కావేరి, రామాచారి బలుదేరారు. వారి వెనకే బంధువర్గాన్ని కూడా ఎక్కించుకుని బస్సు బయలుదేరింది.

డబ్బు... డబ్బు... డబ్బు...

ఈ రోజు లోకం డబ్బు చుట్టూ తిరుగుతోంది. తను కనిపెట్టిన కాగితం నోట్లకి తనే దాసుడైపోయాడు మనిషి. కుటుంబపోషణకి ధనార్జన చేయాల్సిందే. కష్టేఫలి అన్నారు. తిని కూర్చుంటే కొండలయినా తరిగిపోతాయి.

అయితే కష్టపడి సంపాదించిన ధనానికి అయాచితంగా వచ్చే ధనానికి తేడా ఉంది. అయాచితంగా అంటే... ఎలా వస్తుంది డబ్బు? అక్రమార్జనకు అలవాటుపడితే వస్తుంది.

ధర్మం తప్పి నీతిని, న్యాయాన్ని తుంగలో తొక్కి అడ్డదారి పడితే వస్తుంది. లంచాలు మరిగితే వస్తుంది. పాపపుణ్యాల్ని పట్టించుకోకుండా దుర్మార్గంలోవెళ్తే డబ్బు వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజు జరుగుతున్నదదే. ముఖ్యంగా భారతావనిలో ధనదాహం నానాటికీ పెరిగిపోతోంది.

లక్షాధికారి కోటీశ్వరుడవ్వాలని, కోటీశ్వరుడు వేలకోట్లు సంపాదించాలని తపించిపోతూ ప్రజాక్షేమాన్ని, దేశసౌభాగ్యాన్ని పట్టించుకోకుండా అవకాశం ఉన్న

ప్రతి ఒక్కడూ వక్రమార్గంలో ఎడాపెడా దోచేస్తున్నారు. వీరి ధనదాహం సామాన్యుడిని నలిపేస్తోంది.

ధరలు చుక్కలు చూస్తున్నాయి. నెలంతా కష్టపడినా చేతిలో రూపాయి మిగలని దీనస్థితికి నెట్టేస్తోంది. దేవుడున్నాడాని దిక్కులుచూసే దౌర్భాగ్యస్థితి దాపురిస్తోంది. ఈ పరిస్థితుల్లో– ఆ రోజు ఉదయం దినపత్రికల్లో వచ్చిన రెండు వార్తలు సంచలనం సృష్టించాయి. ఏ నలుగురు కలిసినా ఇదే విషయం చర్చకొస్తోంది.

అందులో మొదటిది "ధర్మసంస్థాపన జరుగుతుందంటున్న శ్రీ అగ్ని వేశాచార్యుడు" హెడ్డింగుతో భీష్మనారాయణ అందించిన వార్తాకథనం.

రెండోది "ధర్మసంస్థాపనను ఆపడానికి ఒరిస్సాలో మహామాంత్రికుల మహాయాగం" హెడ్డింగ్‌తో మరో వార్త. ఇవి రెండూ ఒకేసారి రావడంతో మొదటిదాన్ని రెండో వార్త బలపరుస్తున్నట్టయింది.

ఆ పైన అగ్నివేశాచార్యుల అభిప్రాయం కూడా అనుకూలంగానే ఉండటంతో త్వరలో ఏదో జరుగుతుంది– ఏదో జరగబోతోంది అనే నమ్మకం అనేకమందిలో బలపడసాగింది.

ఆ రోజు ఉదయమే అగ్నివేశాచార్యునికి మొదటి ఫోను ముఖ్యమంత్రి నుంచి వచ్చింది.

ఫోన్ లిఫ్ట్‌చేసి "చెప్పండి ముఖ్యమంత్రిగారూ. ఉదయమే ఫోన్ చేశారు. ఏదో విశేషమే ఉండాలి" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మీరింకా ఈ రోజు దినపత్రిక చూసినట్టు లేదు. త్వరలో ధర్మసంస్థాపన జరుగుతుందని మీరు నమ్ముతున్నట్టు వార్త. ఈ ధర్మసంస్థాపన అనేమాటే కాస్త గందరగోళం చేస్తోంది. అక్కడెక్కడో మాంత్రికులు దీన్ని అడ్డుకోవడానికి కలి పురుషుని కోసం మహాయాగమే చేస్తున్నారు. ఏమీ. అర్థంగావటంలేదు.

కాస్త వివరిస్తారని మీకు ఫోన్‌చేశాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"క్షమించాలి. నమ్ముతున్నానని చెప్పాను తప్ప నిజానికి ఏం జరగనుందో నాకూ తెలీదు. కాని ధర్మ సంస్థాపన జరిగితే కలిప్రభావం తగ్గుతుంది.

దుష్టులు, దుర్మార్గులు, అక్రమార్కులు, అవినీతి పరులు ఒక్కరేమిటి, ధర్మం తప్పిన పాపులంతా అకాలమరణం పాలవుతారు.

అంతవరకే చెప్పగలను. చూద్దాం. ఏం జరుగుతుందో... సెలవు" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లైన్ కట్‌చేశాడు అగ్నివేశాచార్యుడు.

అయితే ఈ ఫోన్ల గొడవ సి.ఎమ్.తో ఆగలేదు. వరసగా మంత్రులో, పారిశ్రామికవేత్తలో ప్రముఖులో ఎవరో ఒకరు ఫోన్ చేస్తూండటంతో ఆ బాధ పడలేక ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశాడు అగ్ని వేశాచార్యుడు.

తను చూస్తే చాలా బిజీగా వున్న సమయం ఇది. రేపే ద్వారకాధీష్ విగ్రహ ప్రతిష్ఠాపన జరగాలి. ఇందుకోసం ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన నాలుగు ఎకరాల స్థలంలో వాయవ్యమూలన తోటని ఆనుకుని ఒక పెద్ద రేకులషెడ్ నిర్మాణం జరుగుతోంది.

ఆగమేఘాలమీద పనులు జరుగుతున్నాయి. షెడ్డు మధ్యభాగంలో స్వామిని ప్రతిష్ఠించడానికి పీఠం ఏర్పాటుచేస్తున్నారు. ఈ లోపల డైరెక్ట్‌గా అగ్నివేశాచార్యుని కలసి మాట్లాడాలని కొందరు స్థానికులు ప్రయత్నించడం ఆరంభించారు.

"ఆచార్యా... ఏమిటి కాస్త చిరాకులో ఉన్నట్టున్నారు?" పరిస్థితి గమనించిన అఘోరా, అగ్నివేశాచార్యుణ్ణి పలకరించాడు.

"తప్పుచేశాను అఘోరా... ఆ జర్నలిస్టు భీష్మనారాయణకు నా పేరు రాసుకోమని అనుమతిచ్చి తప్పుచేశాను. ఇప్పుడు చూడు సి.ఎమ్.నుంచి ఫోన్, హోంమినిస్టర్ నుండి ఫోన్. ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తే కొందరు నేరుగా ఇక్కడికే వస్తున్నారు.

లాభం లేదు. అరే అప్పన్నా. ఇలారా. నువ్వు, కాశీ ఇద్దరూ మరికొందర్ని తీసుకుని గేటు బయట కాపువేయండి. నన్ను కలవాలని ఎవరు వచ్చినా ఇప్పుడు వీలుకాదని వెనక్కి పంపించేయండి. వెళ్ళండి" అంటూ ఆర్డర్ వేశాడు.

దాంతో అప్పన్న, కాశీకోసం పరుగు తీశాడు.

సరిగ్గా ఇదే సమయానికి- మున్నలూరివారి అగ్రహారం నుంచి బయలుదేరిన చరక్ కారు ముందుగా వచ్చి చేరుకుంది. ఆ వెనకే బస్సు వచ్చింది. దాంతో మరింత హడావుడి సంతరించుకుందక్కడ.

వచ్చిన బంధువర్గం అందరికీ తగిన వసతి ఏర్పాటు చేయబడింది. వచ్చిన వారిలో ఒక్క చరక్, శుశ్రుత, మిత్రవిందలకు తప్ప మిగిలినవారిలో ఏ ఒక్కరికీ ఈ ఎస్టేట్ గురించి తెలీదు. దేవమ్మగారికే ఇంత వరకు తెలీదంటే అగ్ని వేశాచార్యుడు దీన్ని ఎంత రహస్యంగా ఉంచాడో అర్థం చేసుకోవచ్చు. అలాంటిది ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది.

ద్వారకాధీష్ విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయారంతా. విగ్రహం దొరికిన విధం తెలుసుకుని భక్తితో పులకించిపోయారు. మిత్రవింద స్వామి పాదాల చెంతనే చాలాసేపు కూర్చుని ప్రార్థించింది. రామాచారి ఆయన కొడుకు నీలకంఠాచారి ఇరువుర్నీ ప్రత్యేకంగా పిలిచి చెప్పాడు అగ్నివేశాచార్యుడు.

"రామాచారీ. ఇక్కడ ద్వారకాధీష్ ఆలయనిర్మాణం ఆరంభం కానుంది. ఇకనుంచి మీ తండ్రీ కొడుకులు ఎక్కడో ఉండటం కాదు. ఇక్కడే ఉండాలి. రేపటి నుంచి స్వామికి నిత్యపూజలు నిర్వహించాల్సిన బాధ్యత మీదే" అన్నాడు.

"అలాగే స్వామీ. మీ మాటను శిరసావహిస్తాం" అన్నాడు సంతోషంగా రామాచారి.

మొదట ఆ రోజు సాయంకాలం ద్వారకాధీష్ విగ్రహాన్ని ధూంధాంగా కోరుకొండ పురవీధుల్లో ఊరేగిద్దాం అనుకున్నారంతా.

కాని అందువలన సమస్య ఎదురుకావచ్చనే ఉద్దేశంతో వద్దన్నాడు అగ్ని వేశాచార్యుడు. మరునాడు విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన సరంజామా అంతా చీకటిపడేలోపే ఎస్టేట్‌లోకి వచ్చేసింది.

ఏ విధమైన ఆర్భాటంగాని, ప్రకటనలు గానిలేవు. స్థానికులు ఏదో గుడి కట్టబోతున్నారని అనుకోవడమేగాని అసలు విషయం వాళ్ళకీ తెలీదు.

పోతే విగ్రహ ప్రతిష్ఠాపన ఎవరి చేతులమీదుగా జరగాలి అనే విషయం ప్రధానంగా చర్చకువచ్చింది. పుణ్యదంపతుల చేతులమీదుగా జరిపించవలసి ఉంటుంది. కాబట్టి చరక్, శుశ్రుతలే ప్రతిష్ఠించడం బాగుంటుందని నిశ్చయించారు.

* * * * *

మరునాడు వేకువజామునుంచే ఎస్టేట్‌లో హడావుడి మొదలయింది. ఫెళ్ళున మేళతాళాలు, భజంత్రీల ఘోష ఆరంభమైంది.

వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు ఆరంభించారు. ద్వారకాధీష్ విగ్రహాన్ని భవంతినుంచి బయటకి తీసుకొచ్చారు. పవిత్రస్నానం చేయించి నూతన వస్త్రాలు చుట్టారు.

వేదమంత్రాల మధ్య చరక్, శుశ్రుతల చేతుల మీదుగా రేకులషెడ్‌లోని పీఠం మీద ద్వారకాధీష్‌ను నిలబెట్టి ప్రాణప్రతిష్ఠ గావించారు.

పిదప స్వామి కళ్ళగంతులు విప్పి నెయ్యాభిషేకం, తేనాభిషేకం, పాలాభిషేకం, మొదలైన అభిషేకాలన్నీ చేసి పట్టువస్త్రాలు చుట్టి గజమాలతో స్వామిని అలంకరించగానే ఆ స్వామి అందాన్ని చూడ్డానికి రెండు కళ్ళు చాలలేదు.

ఆ విధంగా ప్రతిష్ఠాపన జరిగిన అనంతరం తొలికొబ్బరికాయ అగ్ని వేశాచార్యుడు, మలి కొబ్బరికాయ దేవమ్మగారు తర్వాత మిత్రవింద కొట్టారు. ఇక ఆ తర్వాత ఆహూతులంతా కొట్టిన కొబ్బరికాయల మోత ఆ ప్రాంతంలో ప్రతిధ్వనించింది.

"ద్వారకాధీష్ ప్రభువుకీ జై" అనే జయఘోషతో ఆ ప్రాంతం మారుమోగింది.

తూర్పున సూర్యోదయం అయ్యేసరికి ద్వారకాధీష్ గురించి కోరుకొండ వీధుల్లో తెలిసిపోయింది.

పురప్రజలు గుంపులు గుంపులుగా స్వామి దర్శనార్థం తరలిరానారంభించారు.

ఎస్టేట్ భవంతికి ఇంతకాలం కరెంట్ సౌకర్యం లేదు. అగ్ని వేశాచార్యుడు కావాలనే అక్కడ ఆముదం దీపాలనే వినియోగిస్తూ వచ్చాడు. కాని ఇప్పుడు తప్పనిసరి. ఎస్టేట్‌లోకి కరెంట్ తీసుకోకపోతే ద్వారకాధీష్ వద్ద దీపాలకు ఇబ్బంది.

అలాగే ఆలయ నిర్మాణం సమయంలో కూడా కరెంట్ అవసరం ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే కరెంట్‌కోసం అప్లయ్ చేయించాడు ఆయన... ఆగమేఘాల మీద పనులు సాగాయి.

విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన సాయంకాలానికే ఎస్టేట్ భవంతితోబాటు ఆవరణలో విద్యుత్కాంతులు జిగేల్‌మన్నాయి. ద్వారకాధీష్ మందిరంగా వున్న షెడ్డు ప్రాంతంలోనూ విద్యుద్దీపాలు మెరిశాయి.

ఈ లోపల విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిపోయింది గాబట్టి ఇక మూడో రోజున శుభముహూర్తంలో మిత్రవింద, చరక్‌ల వివాహం జరగాలి. ఆ రోజు రాత్రి పదకొండు పదినిముషాలకు ముహూర్తం.

విగ్రహ ప్రతిష్ఠాపనకు వచ్చిన బంధువర్గమంతా వివాహం జరిగేవరకు ఆగిపోయారు. వివాహానికి ఏర్పాట్లు నిరాడంబరంగా అయినా ఘనంగా జరిగాయి. మిత్రవింద తల్లిదండ్రులుగా బాధ్యత తీసుకున్న రామాచారి దంపతులు పుట్టింటి లాంఛనాల్లో మిత్రవిందకు ఏ లోటు లేకుండా జరిపించారు.

శుశ్రుత స్వయంగా మిత్రవిందను వధువుగా అలంకరించింది. రామాచారి దంపతులు చరక్ కాళ్ళు కడిగి మిత్రవిందను కన్యాదానం చేశారు.

సరిగ్గా ముహూర్తం సమయంలో... మిత్రవింద శిరస్సున జీలకర్ర, బెల్లం ఉంచిన చరక్ ఆమెమెడలో మూడుముళ్ళు వేశాడు.

దేవకన్యలా మెరిసిపోతోంది మిత్రవింద.

ఆ విధంగా వివాహం జరిగి మిత్రవింద, చరక్ రెండో భార్య అయింది. పెద్దల పాదాలకు నమస్కరించి అందరి ఆశీస్సులు తీసుకున్నారు. ద్వారకాధీష్ పాదాలకు నమస్కరించి ప్రార్థించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన, అలాగే తన మునిమనవడి వివాహ సందర్భంగా నాలుగవ రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు కూడా గొప్ప అన్నదాన కార్యక్రమం జరిపించాడు అగ్నివేశాచార్యుడు.

నూతన దంపతులకు ఎస్టేట్ భవంతిలోనే శోభనం జరిపించాలను కున్నాడు అగ్నివేశాచార్యుడు. కాని దేవమ్మగారు, కావేరి, శుశ్రుతలు ఒప్పుకోలేదు.

మున్నలూరివారి అగ్రహారం తమ ఇంటనే జరగాలని పట్టుబట్టారు. దాంతో ఆయన అంగీకరించక తప్పలేదు. నూతన దంపతుల్ని తీసుకుని అంతా మున్నలూరివారి అగ్రహారం బయలుదేరారు.

అగ్నివేశాచార్యుడు చరక్‌ను పక్కకు పిలిచాడు. "నాయనా! ఆ స్వామి కరుణతో ఇంతవరకు అంతా సంతృప్తికరంగా జరిగింది. ఇక ముఖ్యమైన ఘట్టం ముందుంది– నువ్వు ద్వారక వెళ్ళిరావడం.

మనకి వారంరోజులే ఆ ముహూర్తానికి వ్యవధి ఉంది. కాబట్టి మన ఇంట మూడు రాత్రులు గడిపి నాలుగో రోజున నీ భార్యలిద్దర్నీ తీసుకుని ఇక్కడికి వచ్చెయ్యి. ఇక్కడ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మనం రంపచోడవరం అడవుల్లోకి వెళ్ళిపోవాలి. గుర్తుంచుకో" అంటూ హెచ్చరించాడు.

"అలాగే జేజిగారు. నాలుగవ రోజు వచ్చేస్తాం...." అంటూ మాట ఇచ్చాడు చరక్. ఇక్కడ ద్వారకాధీష్‌కి నిత్యపూజలు జరపాలిగాబట్టి నీలకంఠాచారి ఎస్టేట్ వద్ద ఆగిపోయాడు. రామాచారి దంపతులు నూతన దంపతుల వెంట వెళ్ళారు.

వారి వాహనాలు అన్నీ వెళ్ళిపోయిన తరువాత అగ్నివేశాచార్యుడు అందరినీ భవంతిలోని హాల్లో సమావేశపరిచాడు.

అఘోరా, డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు, ముకుందపాత్రుడు, శంకర నారాయణ స్థపతి, పెరుమాళ్ స్థపతి, నీలకంఠాచారి అంతా స్థిమితంగా కూర్చుని అగ్నివేశాచార్యుడు ఏం చెబుతాడా అని ఆత్రంగా ఎదురుచూడసాగారు.

అగ్నివేశాచార్యుడు ఓసారి అందర్నీ చూసి గొంతు సవరించుకున్నాడు–

"మీరంతా నేను ఏం చెబుతానా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నారని నాకు తెలుసు. నా మనసులోని భావాల్ని మీతో పంచుకోవాలనే ముఖ్యంగా మీ అందరినీ రమ్మన్నాను. నాకు చాలా ఆనందంగా ఉంది. చాలా తృప్తిగానూ, సంతోషంగానూ ఉంది.

సుదీర్ఘమైన నా జీవన యాత్రలో చివరి మజిలీకి దగ్గరలో ఉన్నాను. ఆ స్వామి ఎప్పుడు పిలిస్తే అప్పుడు నేను అనంతయాత్రకు సిద్ధంగా ఉండాలి కదా...." అంటూ క్షణం ఆగాడు అగ్నివేశాచార్యుడు.

"అంతమాట అనకండి ఆచార్యా. మీరు ఇంకా కొంతకాలం మా మధ్యనే ఉండాలి" అన్నాడు వెంటనే పాత్రుడు.

"అది మన చేతుల్లో ఉందా! లేదే" అని అంటూ నవ్వాడు అగ్ని వేశాచార్యుడు.

"పిలుపు వస్తే వెళ్ళిపోవాలి. తప్పదుగదా... నేనూ కొన్ని అనుకున్నా, ఆలయనిర్మాణం పూర్తిచేసి చరక్, మిత్రవిందల వివాహం జరిపించాలనుకున్నాను. కాని ఆ ద్వారకాధీశుడు త్వర త్వరగా పనులను కానిచ్చి నన్ను తొందర చేస్తూంటే సందేహించాల్సి వస్తోంది. ఆలయానికన్నా ముందే ఆ కన్నయ్య మీ వెంట నావద్దకు తరలివచ్చి కొలువయ్యాడు. వెంటనే చరక్, మిత్రవిందల పెళ్ళి జరిపించమన్నాడు. జరిపించాం.

ఇక ఇక్కడ మనకు మిగిలివున్న కార్యక్రమం ఆలయ నిర్మాణం, మహా శిల్పాచార్యులయిన స్థపతులారా, ఇక మిగిలింది మీ చేతుల్లో ఉంది. ఆలయ నిర్మాణం పనులు వేగిరం జరగాలి.

నేటికి అయిదో రోజున ఆలయ శంకుస్థాపనకు దివ్యమయిన రోజు. చరక్ తన భార్యలిద్దరితో తిరిగి రాగానే ఆలయానికి శంకుస్థాపన చేయించాలి.

మీరు డబ్బుకోసం ఆలోచించవద్దు... ఎందరు శిల్పులను పిలుస్తారో మీ ఇష్టం. రాళ్ళను ఇక్కడకు తెచ్చి మలుస్తారా లేక అవి ఉన్నచోటే మలిచి ఇక్కడకు తరలించి అనుసంధానం చేస్తారా... అదంతా మీ నిర్ణయానికి వదిలేస్తున్నాను.

స్వామికి నిత్యపూజాదికాలు రామాచారి, నీలకంఠాచారి చూసుకుంటారు. ముఖ్యమైన విషయం ఏమంటే ఆలయ శంకుస్థాపన తరువాత మేమంతా వేరేచోటుకి వెళ్ళిరావలసివుంది.

మేము ఇక్కడ లేమనుకోకుండా పనులు ఆగకుండా చూసుకోవలసిన బాధ్యత మీదే. అంతా స్వామికరుణ. ఇంతకుముందే చెప్పాను గదా.

జీవనయాత్ర చివరి మజిలీలో ఉన్నానని, ఆలయాన్ని చూడగలనో లేదో తెలీదు. కాని చూడ్డానికి ద్వారకలోని ఆలయాన్ని తెచ్చి ఇక్కడ ఉంచారా అన్నంత చక్కగా ఆలయ నిర్మాణం జరగాలి" అంటూ వివరించాడు అగ్నివేశాచార్యుడు.

"మీరలా అనకూడదు ఆచార్యా. మీరు ఆలయాన్ని చూస్తారు. సాధ్యమైనంత త్వరలో ముగిస్తాం" అంటూ భరోసా ఇచ్చాడు పెరుమాళ్ స్థపతి.

* * * * *

మున్నలూరి వారి అగ్రహారం.

చరక్ నివసిస్తున్న గృహం. రాత్రి పదకొండు గంటల సమయం, అది చరక్, మిత్రవిందలకు శోభనం రాత్రి. స్వయంగా సవతికి సింగారించిన శుశ్రుత, మరికొందరు యువతులు ముహూర్త సమయంలో కిలకిలా నవ్వుల మధ్య మిత్రవిందను పాలగ్లాసుతో లోనకు పంపించి తలుపులు మూశారు.

గదిలో మల్లెలు, గులాబీలతో సుందరంగా అలంకరించిన పాన్పుమీద కూర్చున్న చరక్ చిరునవ్వుతో లేచి దగ్గరకు వచ్చాడు. పాలగ్లాసు అందుకుని పక్కనుంచి ఆమె మేలిముసుగు తొలగించాడు.

సౌందర్య దేవతలా మెరిసిపోతున్న మిత్రవిందను క్షణకాలం కన్నార్పకుండా అలాగే చూశాడు.

నునుసిగ్గుతో నేలచూపులు చూస్తోంది మిత్రవింద. చుబుకం ఎత్తి కళ్ళలోకి చూశాడు. అంతే– గువ్వపిట్టలా అతని కౌగిట ఒదిగిపోయింది. గాఢమయిన కౌగిలి బంధంలో ఆమె అధరాలను ముద్దాడాడు. గదిలో మల్లెల సువాసనలు అగరువాసనలు గుబాళించి మత్తెక్కిస్తున్నాయి. పరవశంతో పులకిస్తున్నారిద్దరూ.

"కొత్తగా చూస్తున్నావేమిటి?" అని కొంటెగా అడిగింది మిత్రవింద.

"అంతా కొత్తగా వుంది" అన్నాడు పాలగ్లాసు అందుకుని సగం తాగి మిత్రవిందకిస్తూ మిగిలిన పాలు తనుతాగి గ్లాసు టేబిల్‌మీద ఉంచింది. "నీకు కొత్తేమి? నాకుగదా కొత్త" అంది గడుసుగా.

"శుశ్రుతకు, నీకూ మధ్య దాపరికములుండవా?"

"లేకేమి? చాలా ఉన్నవి?"

"ఏమిటవి?"

"నీ జాణతనములు"

"ఆహాc. ఇంకేమి?"

ఇద్దరూ పాన్పుమీద కూర్చున్నారు. ఉన్నట్టుండి కన్నీళ్ళు పెట్టుకుంటూ– చరక్ గుండెలమీద వాలిపోయింది మిత్రవింద.

"మిత్రా. ఆనందసమయంలో ఈ కన్నీరేల? మాతాపితలు గుర్తొచ్చారా?" ప్రేమగా జుట్టు నిమురుతూ అడిగాడు.

అవుననన్నట్టు తలూపింది మిత్రవింద.

"ఆనాడు ద్వారకలో మనకు నిశ్చితార్థం అయ్యాక అనుకున్న ముహూర్తానికి మన వివాహం జరిగుంటే మావాళ్ళు, మీ వాళ్ళు చూసి ఆనందించే వారుగదా.

చతురా... విధి మనతో ఇంతగా దాగుడుమూత లాడినదేమి? ఈ క్షణం కోసం వేలసంవత్సరాల నిరీక్షణ గదా. చివరికి నేటికి నీ ఇల్లాలిని కాగలిగితిని" అంటూ ప్రేమగా అతడ్ని ముద్దాడింది.

ఆమె కన్నీరు తుడిచాడు చరక్. "నీ కంట కన్నీరు చూసి తట్టుకునే శక్తి నాకు లేదు మిత్రా. ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. త్వరలో ద్వారక వెళతాను గదా. అక్కడ మనవారి యోగక్షేమాలు తెలుసుకుని వచ్చి నీకు చెబుతాను" అన్నాడు.

"బహుశా నీవు వారిని కలుసుకునే అవకాశం లేకపోవచ్చును. తమ్ముడు ధాత కనిపిస్తే అడిగానని చెప్పు. మనం క్షేమంగా ఉన్నామని చెప్పు. సంతోషిస్తాడు" అంది మిత్రవింద.

ఇంతలో బయటినుంచి శుశ్రుత గొంతు విన్పించింది- "ఏమిటి? తెల్లవార్లూ మాటలేనా? పనులు ఏమీలేవా?" అంటూ.

అంతే... సీమటపాకాయలు పేలినట్టు- యువతులు నవ్వులు వినిపించాయి. మిత్రవింద దిగ్గునలేచి- "అక్కా, మీరింకా ఇక్కడే ఉన్నారా?... అయితే నేను బయటకు వచ్చేస్తున్నాను" అంది.

"శోభనం పెళ్ళికూతురు బయటకు రాకూడదమ్మా. మేం వెళ్ళిపోతున్నాంలే" అంటూ ఓ ముత్తయిదువ గొంతు వినిపించింది. చరక్, మిత్రవిందను దగ్గరకు తీసుకుని లైట్ ఆర్పాడు.

* * * * *

మాంత్రికుల క్షుద్ర మహాయాగం ఆరంభమై ఏడోరోజుకు చేరుకుంది. నిలువెత్తున నల్లని కలిపురుషుని విగ్రహం భీతిగొలిపేలా ఉంది. అక్కడ రోజూ

జంతుబలి జరుగుతోంది. పగలు రాత్రీ అని భేదం లేక ఏకదీక్షగా కొనసాగిస్తున్నారు.

అగ్ని గుండంలో నిప్పులు ఎగిసిపడుతున్నాయి. సాంబ్రాణి ధూప వాసనలు పరిసర ప్రాంతమంతటా కూడా వ్యాపిస్తోంది. ముక్తకంఠంతో మంత్రోచ్చాటనలు చేస్తున్నారు.

కలిదేవతాయ నమః

కలియుగాధిపాయ నమః

శ్యామవర్ణాయ నమః

వక్రదృష్ట్యాయ నమః

ధర్మభ్రష్టాయ నమః

నీలాంబరధారియే నమః

ఘోర రూపాయ నమః

వృక వాహనాయ నమః

వృకోదరాయ నమః

నిరంతరంగా మంత్రపఠనం కొనసాగుతూనే వుంది. జాజ్‌పూర్‌కు దూరంగా అడవి మధ్యలో కొనసాగుతున్న ఈ యాగం గురించి తెలిసినా ఎవరూ ఆ సమీపంలోకి పోవడానికో యాగాన్ని తిలకించడానికో సాహసించడంలేదు.

పొరబాటున ఎవరన్నా తెలీక అటువచ్చినా మాంత్రికుల శిష్యులు వారిని దూరంనుంచే వెనక్కి పంపించేస్తున్నారు. జరుగుతోంది కలిపురుషుని కోసం సాగుతున్న క్షుద్రయాగం. దాన్ని జరుపుతున్నది ఉద్ధండులైన ప్రముఖ మంత్ర వాదులు. అక్కడుండి పై విషయాలన్నీ చూస్తున్నది మాంత్రికుల శిష్యులు.

కాబట్టి వారిని సమీపిస్తే ఏం చేస్తారోననే భయంతో ఎవరూ అటు పోవడంలేదు. కాస్త గుండె ధైర్యంగల మీడియా రిపోర్టర్లు మాత్రం తెగించి చెట్టుపుట్టల్ని చాటుచేసుకొని వెళ్ళి ఫోటోలు తీసుకువస్తున్నారు.

యాగ నిర్వహణ భారాన్ని వహిస్తున్న మరిడి సోమయ్య కలిప్రసన్నుడై ప్రత్యక్షమయ్యే క్షణాలకోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు.

మాంత్రికులు ఎవరూ నోరువిప్పకపోయినా చిలువలు పలవలుగా రోజుకో కథనం, యాగం గురించి పత్రికల్లో ప్రచురితమవుతూనే ఉంది. దేశ ప్రజల్లో ఉత్కంఠత రేకెత్తిస్తూనేవుంది. ధర్మాన్ని సమర్ధించే వారిలో ఇపుడిపుడే చైతన్యం ఆరంభమైంది.

దేశం బాగుపడాలన్నా... సామాన్యుడు కూడా సుఖంగా బ్రతకాలన్నా ధర్మసంస్థాపన జరగాల్సిందే. దీన్ని అడ్డుకోవడానికి ఆ మాంత్రికులు ఎవరు అంటూ బహిరంగంగానే విమర్శించడం ఆరంభించారు.

మీడియావాళ్ళకు ఇదో న్యూస్‌ఫీడ్ ఐటమయింది. దినపత్రికల్లో రోజుకో కథనం వస్తోంది. టీవీవాళ్ళు మీరు ధర్మసంస్థాపనను సమర్ధిస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా అంటూ ఎస్సెమ్మెస్ కాంటెస్ట్ నిర్వహిస్తే సమర్ధించేవారికన్నా వ్యతిరేకించేవారి ఓటింగ్ శాతమే అధికంగా ఉండటం ఇక్కడ గమనార్హం.

ఇక సిటీల్లోను, చిన్నపట్టణాల్లోకూడా ఈ విషయం మీద చర్చలు, సెమినార్‌లు జరగడం మొదలైంది. ఈ గోల చూసిన కొందరు "ఎందుకొచ్చిన గొడవరా బాబు. ఇదేం జరిగే వ్యవహారం కాదు, చివరకు తుస్ మంటుంది" అంటూ పెదవి విరుస్తున్నారు.

ఇలా ఉండగా, ప్రజల్ని భయపెట్టేవిధంగా, కొన్ని దుశ్శకునాలు పొడచూపటం ఆరంభమైంది. ఎన్నడూ లేని విధంగా ఊళ్ళ బయట పొలిమేరల్లో తెల్లకాకులు చేరి గోలచేయడం కనబడుతోంది.

పట్టపగలు భీకరంగా అరుస్తూ గుడ్లగూబలు సంచరించసాగాయి. ఊర కుక్కలన్నీ వీధిమొగలో చేరి ఆకాశం వంక చూస్తూ దీనంగా అరవసాగాయి. నక్కలు రాత్రిళ్ళు ఊరిబయట గుంపుగూడి సామూహికంగా ఏడుస్తున్నట్టు ఊళలు పెట్టసాగాయి.

రోజూ సంధ్యాసమయంలో పశ్చిమాకాశం ఎర్రగా నెత్తురు ముద్దలా కన్పించసాగింది. ఇవన్నీ చూస్తున్న కొందరు వృద్ధులు "దేశంలో పాపం కొండలా పెరిగిపోయింది. ఏ ఉపద్రవం రానుందో ఏమిటో" అని గొణగసాగారు. ఐతే బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా కలి మహాయాగం అక్కడ నిరంతరంగా సాగిపోతూనే ఉంది. ఇక్కడ అగ్నివేశాచార్యుడూ తన ప్రయత్నాల్లో తను ఉన్నాడు.

* * * * *

చెప్పినట్టుగానే మూడు రాత్రులు మున్నలూరి వారి అగ్రహారంలో శోభనం పెళ్ళికొడుకుగా ఉన్న చరక్ నాలుగో రోజున దేవమ్మగారి ఆశీస్సులు తీసుకుని తన ఇద్దరు భార్యలతోపాటు మామగారు రామాచారి దంపతులను వెంటబెట్టుకుని కోరుకొండకు చేరుకున్నాడు.

ఆ మరుసటిరోజు ఉదయమే సకలలాంఛనాలతో ద్వారకాధీష్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ శుభకార్యాన్ని, చరక్, మిత్రవింద‌ల చేతుల మీదుగా జరిపించాడు అగ్నివేశాచార్యుడు.

ఈ కార్యక్రమం కూడా ముగిసిన మూడోరోజున స్థపతులయిన శంకరనారాయణ, పెరుమాళ్ ఇరువురికీ చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి బాధ్యతలు అప్పగించాడు. అలాగే రామాచారి తండ్రీ కొడుకులిద్దరికీ స్వామి పూజాదికాలు బాధ్యతలను అప్పగించాడు.

ఆ ఉదయం చాలాసేపు ద్వారకాధీష్ విగ్రహం ముందే కూర్చుని ప్రత్యేక పూజలు జరిపించి చాలా సేపు స్వామిని ధ్యానించాడు అగ్నివేశాచార్యుడు.

మధ్యాహ్నం భోజనాలు కాగానే అంతా ప్రయాణానికి సిద్ధమయ్యారు. అగ్నివేశాచార్యునివెంట చరక్, మిత్రవింద, శుశ్రుతలు, డాక్టర్ పిల్లాగోవింద పాత్రుడు, ముకుందపాత్రుడు, అఘోరా, నౌకరు అప్పన్నలు బయలుదేరారు. ఇంకా ఎప్పుడూ వచ్చే వంటవాళ్ళు, పనివాళ్ళు రేషన్‌తోసహా వంటసామగ్రితో డ్రైవర్ కాశీ జీప్‌లో బయలుదేరారు.

కారులో చరక్‌తోబాటు మిత్రవింద, శుశ్రుతలు అగ్నివేశాచార్యుడు బయలుదేరగా, జీప్‌లో ముకుందపాత్రుడు డ్రైవింగ్ తీసుకోగా అందులో అఘోరా, పిల్లా గోవిందపాత్రుడు, నౌకరు అప్పన్న బయలుదేరారు. పొద్దు పడమర వాలు తుండగా వాహనాలు అన్నీ కోరుకొండ వదిలాయి.

* * * * *

జిర్నలిస్టు భీష్మనారాయణకు ముందునుంచీ ఒక అనుమానం ఉంది. నిజంగానే అగ్నివేశాచార్యుడు ఏదో చేయబోతున్నాడనే నమ్మకం. అది చాలా నిగూఢంగా ఉంచబడిందనీ గ్రహించాడు.

అగ్నివేశాచార్యునికి తనమీద కోపం రాకుండా ద్వారకాధీష్ విగ్రహ ప్రతిష్ఠాపన గురించి, చరక్, మిత్రవిందల వివాహం గురించీ అలాగే ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన గురించి ఫోటోలతోసహా న్యూస్‌పేపర్లకు పంపించి బాగానే కవర్ చేశాడు.

అలాగే ఎస్టేట్ మీద ఓ కన్నేసి ఉంచాడు. ఎప్పుడైతే వాహనాలన్నీ కోరుకొండ వదిలి బయలుదేరాయో అప్పుడే అతని అనుమానం మరింత స్థిరపడింది.

అదేమిటో ఎక్కడికి వెళుతున్నారో తెలుసుకోవాలనే కుతూహలం అతడ్ని నిలవనీయలేదు. దాంతో ముందు వెళుతున్న వాహనాల్లో ఎవరికీ అనుమానం రాకుండా దూరంగా అనుసరిస్తూ క్రమంగా తనూ బైక్‌మీద రంపచోడవరం అడవుల్లో ప్రవేశించాడు.

ఈలోపల చెప్పుకోతగ్గ మరో ముఖ్యవిషయం ఏమంటే ఒరిస్సా ఎమ్.పి. శంభులింగ మహాపాత్రో మనుషులు ముగ్గురు అటు మున్నలూరివారి అగ్రహారంలో ఒకడు, కోరుకొండ ఎస్టేట్ సమీపాల్లో ఒకడు, మూడోవాడు అడవుల్లో అగ్నివేశాచార్యుని స్థావరం ప్రాంతంలోను కాపువేసి వున్నారు.

మున్నలూరివారి అగ్రహారంలో ఉన్నవాడు చరక్ తిరిగి బయలుదేరడం చూసి కారును ఫాలో అవుతూ కోరుకొండ వచ్చి తమ మనిషిని కలుసుకున్నాడు.

అగ్నివేశాచార్యుడు మూడు వాహనాల్లో బయలుదేరి వెళ్ళడం చూడగానే ఈ విషయాన్ని ఫోన్‌ద్వారా శంభులింగ మహాపాత్రోకి ఉప్పందించి ఆ వెనకే తామిద్దరూ బైక్‌మీద అనుసరించడం ఆరంభించారు.

అగ్నివేశాచార్యుడు మరికొందరు అడవిలోకి బయల్దేరారన్న వార్త వినగానే ఎమ్.పి. శంభులింగ మహాపాత్రో ఆనందంతో పొంగిపోయాడు.

"ఈ క్షణంకోసమే గదరా ఇంతకాలం ఎదురుచూస్తోంది. బయలుదేరండి" అంటూ పాతికమంది మారణాయుధాలు ధరించిన తన అనుచరులను వెంటేసుకుని రెండు వ్యాన్‌లలో భువనేశ్వర్ నుండి కోరుకొండకు బయలుదేరాడు.

* * * * *

జాజ్‌పూర్, అటవీప్రాంతం.

మాంత్రికులు నిర్వహిస్తున్న కలిపురుషుని క్షుద్రయాగం పదమూడో రోజుకు చేరుకుంది. యాగపరిసమాప్తికి ఇక రెండు రోజులే సమయముంది. అతిభీకరంగా సాగుతోంది మహాయాగం.

కలిపురుషుని విగ్రహం రోజు రోజుకూ భయానకంగా మారుతోంది. మరిడి సోమయ్య ఏకదీక్షగా ఉంటూ యాగాన్ని నిర్విఘ్నంగా కొనసాగింప జేస్తున్నాడు. యాగాగ్నులు ఉవ్వెత్తున ప్రజ్వరిల్లి ఎగసి పడుతున్నాయి. యాగ శాలను చుట్టి అదృశ్యశక్తులు ఏవో పరిభ్రమిస్తున్నాయి. వింత వింత శబ్దాలు, తోడేళ్ళ అరుపులు వినవస్తున్నాయి.

ఏ క్షణంలోనైనా కలిపురుషుడు ప్రసన్నంకావచ్చన్న ఆనందంతో రెట్టించిన ఉత్సాహంతో యాగ నిర్వహణలో మునిగిపోయారు మాంత్రికశ్రేష్ఠులంతా.

*　　*　　*　　*　　*

అగ్నివేశాచార్యుని స్థావరం. ఆచార్యుని బృందం వచ్చి చేరిందని తెలీగానే పులి కొండయ్యకూడా అక్కడికి వచ్చేశాడు. వచ్చినవారిలో ఆ ప్రాంతం అఘోరాకి శుశ్రుతలకు మాత్రం పరిచయం లేదు.

మిగిలిన అందరికీ తెలిసిందే. యథావిధిగా ఎవరి పనులు వారు చేసుకు పోతున్నారు. స్వయంగా తనే కాలనాళిక మందసాన్ని పొడివస్త్రంతో తుడిచి గది శుభ్రం చేయించి మణిభద్రయక్షుడికి చరక్‌చేత పూజాదికాలు నిర్వహింపజేశాడు అగ్నివేశాచార్యుడు. వారంతా ఇక్కడికి చేరుకొని మూడో రోజు.

మరునాడుదయమే ద్వారకకు చరక్ ప్రయాణం. ఆ రాత్రి తన పూజా మందిరంలోకి చరక్‌ను ఒంటరిగా పిలిపించుకుని ఎదురుగా కూర్చుండబెట్టు కున్నాడు. "నాయనా చరక్. ఇప్పుడు నీవు ద్వారకకు వెళ్ళబోయేకాలం... ద్వారక మునిగిపోవడానికి ముందు రోజు. అంతేగదా?" ప్రశాంతచిత్తంతో అడిగాడు.

"అవును జేజితాతగారూ... మరునాడు ఉదయానికి ద్వారక మునిగి పోతుందనగా దానికి ముందురోజు ఉదయం నేను ద్వారకలో ఉంటాను" అన్నాడు చరక్.

"మొదటిసారి వెళ్ళినప్పటికీ ఇప్పుడు నీవు రెండో సారి వెళుతున్నప్పటికీ మధ్య ఎన్ని సంవత్సరాల ఎడం ఉందో గమనించావా? కురుక్షేత్ర సంగ్రామానికి పదేళ్ళముందు కాలంలో తొలిసారిగా ద్వారక వెళ్ళావు. కురుక్షేత్రం తర్వాత ముప్పై ఆరేళ్ళకు కలియుగం ఆరంభమైంది.

అంటే రెండూ కలపగా నలభై ఆరేళ్ళ తరువాత కాలానికి నువ్వు మలివిడతగా ద్వారక వెళుతున్నావు. ఈ నలభై ఆరేళ్ళ కాలంలో ఇటు చతుర్‌గా నీ గతజన్మ తల్లిదండ్రులు, సోదరులు వారిలో ఎందరు వున్నారో, ఎందరు పోయారో తెలీదు.

అలాగే నీ మామగారి ఇంటి పరిస్థితీ తెలీదు. ఉన్న వారూ వృద్ధులై వుంటారు. కాబట్టి ద్వారకలో అడుగుపెట్టాక నువ్వు గత అనుబంధాలగురించి ఆలోచించడమో, వెదకటమో చేయకుండా వెళ్ళిన పని త్వరగా ముగించుకు నొస్తావని ఆశిస్తున్నా. ఏమంటావ్?"

"అలాగే జేజిగారు. ఎవరన్నా ఎదురుపడితే పలకరిస్తానుగాని నేనుగా ఎవరి కోసం వెళ్ళను. సరేనా...?" అంటూ మాట ఇచ్చాడు చరక్.

"మనకు కావలసిన వస్తువులు నాలుగూ గుర్తున్నాయి గదా. శమంతకమణి, శ్రీకృష్ణులవారి కిరీటంతో నెమలిపింఛం, పాంచజన్య శంఖం, మురళి, ఈ నాలుగు లేదా వాటిలో కొన్నయినా సంపాదించి తిరిగిరావాలి. ముఖ్యంగా పాంచజన్యం చాలా ముఖ్యం సుమా" అలాగే అన్నట్టు తల ఊపాడు చరక్.

"ఏదో సందేహిస్తున్నట్టుగా ఉన్నావ్. ఏమిటది అడుగు" అడిగాడు అగ్ని వేశాచార్యుడు.

"ఏంలేదు జేజిగారు. గతంలో నేను ద్వారక వెళ్ళినప్పుడు ఇక్కడ మనకు ఇంతగా శత్రువులు లేరు. ఇప్పుడు చాలామంది ఉన్నారు. నేను తిరిగివచ్చేవరకు మీరంతా జాగ్రత్తగా ఉండాలి. ధర్మసంస్థాపనకు నడుం బిగించిన మీ దీక్షకు ఎలాంటి భంగం రాకూడదు. అదే నా బాధ" మనసులో మాట చెప్పాడు చరక్.

"శత్రువులు మనల్నేం చేస్తార్రా. నువ్వు తిరిగిరా. వాళ్ళందరి పని పడదాం. మా గురించి చింతపడక" అంటూ మునిమనవడి భుజం తట్టాడు అగ్ని

వేశాచార్యుడు. మరునాడు ప్రభాతవేళ. స్థావరంలో హడావుడి మొదలైంది. చరక్ శుచిగా స్నానాదికాలు ముగించుకుని పూజ నిర్వర్తించాడు.

ప్రయాణ ఘడియలు సమీపిస్తున్నాయి. చరక్ ఇప్పటి దుస్తులు ధరించ లేదు. తను ద్వారక నుంచి వచ్చేప్పుడు ధరించిన సిల్కుపంచె అంగీ ధరించి తలకు తుండు చుట్టుకున్నాడు. ఖర్చులకవసరం ఉంటాయని అగ్నివేశాచార్యుడు ద్వారక బంగారునాణేలు కొన్నిటిని జేబులో పోశాడు.

ముందుగా అగ్నివేశాచార్యుని పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నాడు చరక్. తర్వాత అఘోరా, పిల్లా గోవిందపాత్రుడు, ముకుందపాత్రుల ఆశీస్సులు తీసుకున్నాడు.

మిత్రవింద, శుశ్రుతలు ఇరువురూ భర్తకు వీరతిలకం దిద్దారు.

"మిత్రా... జేజితాతయ్య జాగ్రత్త. శుశ్రుతా మీరెవరూ స్థావరం వదిలి బయటకు పోవద్దు. నేను ఈ సారి చాలా త్వరగా తిరిగివచ్చేస్తాను" అంటూ అందరికీ జాగ్రత్తలు చెప్పాడు చరక్.

అగ్నివేశాచార్యుడు గ్లాస్‌డోమ్ పైకిలేపాడు. చరక్ అందరివద్దా వీడ్కోలు తీసుకుని కాలనాళిక మందసంలో పడుకున్నాడు. మందసం మూయబడింది.

చరక్ కళ్ళు మూసుకుని మణిభద్రయక్షుని తలుచుకున్నాడు. "ఓ త్రికాల సంచారీ మణిభద్రయక్షా. కరుణించి నన్ను ద్వారకాపురి నీట మునిగే రోజుకి ముందురోజు ఉదయానికి నన్ను ద్వారకానగరానికి చేర్చు" అంటూ ప్రార్థించాడు.

అంతే– బయట ప్రేక్షకుల్లా నిలబడి చూస్తున్నారంతా. చరక్ ఆత్మ జ్యోతిరూపంలో నిజశరీరాన్ని వదిలి గ్లాస్ డోమ్ పైకి చేరి పారదర్శకంగా పూర్తి ఆకారం సంతరించుకుంది. అలా అలా గాల్లో తేలుతున్నట్టు నడుస్తూ వెనకగోడకు బిగించి ఉన్న నిలువెత్తు అద్దంలో ప్రవేశించి అదృశ్యమైంది.

కాస్సేపు అద్దంలో రంగులు ఆరిపోయి తిరిగి యథాప్రకారం ఎరుపు నీలిరంగు జిలుగులు ప్రకాశించనారంభించాయి. గ్లాస్‌డోమ్‌లో చరక్ భౌతిక శరీరం– గాఢనిద్రలో ఉన్నట్టు ఉంది.

ఇదంతా చూస్తూ గాఢంగా నిట్టూర్చారంతా. శుశ్రుత, మిత్రవిందను కౌగిలించుకుని కన్నీళ్ళుపెట్టుకుంది. చరక్‌కు విజయం చేకూర్చమని ద్వారకాధీష్‌ను ప్రార్థిస్తూ అక్కడే కూర్చుండిపోయాడు అగ్నివేశాచార్యుడు. మిత్రవింద, శుశ్రుతకు వెన్నుతట్టి ధైర్యం చెప్పింది.

*　　*　　*　　*　　*

మబ్బులేని ఆకాశంలో– ఉన్నట్టుండి రెప్పపాటులో మెరిసిందో పెద్ద మెరుపు. పిడుగులశబ్దంతో దిక్కులు పిక్కటిల్లాయి. తటిల్లత నేరుగా వచ్చి కలిపురుషుని విగ్రహాన్ని తాకి ముక్కలు చెక్కలు చేసింది.

క్షణకాలం ఏం జరుగుతోందీ అర్థంకాలేదు ఎవరికీ. పూజ నిర్వహిస్తున్న మాంత్రికులలో కొందరు భయపడి దూరంగా పరుగులు తీశారు.

ఇంతలో– పగిలిన విగ్రహం స్థానంలో– వికారరూపుడైన కలిపురుషుడు ప్రత్యక్షమయ్యాడు. ఎనిమిదడుగుల ఎత్తు, కారునలుపు, బక్కపల్చని దేహం, నల్లని వస్త్రాలు ధరించాడు.

మెడలో చిరుగంటలు మోగుతున్నాయి. చేతిలోని ఇనుపరేకుల్ని కర్ణ కఠోరంగా మోగిస్తున్నాడు. ఆయన్ని చుట్టి తోడేళ్ళగుంపు మోరలు చాపి చెవులు చిల్లులు పడేలా ఊళలు వేస్తున్నాయి.

ఎర్రని కనుగుడ్లు, చింపిరిజుత్తు, పొడవాటి ముక్కు కలిగి క్రూరమైన చూపులు ప్రసరిస్తున్నాడు.

ఆ విధంగా ఆర్భాటంగా కట్టెదుట సాక్షాత్కరించిన కలిపురుషునిగాంచి–

"ఆహా! స్వామీ కలిపురుషా... కలియుగాధిపా... ధర్మాన్ని భ్రష్టుపట్టించే శక్తిమంతా... పాహిమాం పాహిమాం" అంటూ కలిపురుషునికి సాష్టాంగ నమస్కారం చేశాడు మరిడి సోమయ్య.

ఈ లోపల భయపడి పరుగులెత్తిన వారితోసహా మాంత్రికులంతా ముందు కొచ్చి "పాహిమాం కలిపురుషా పాహిమాం" అంటూ నమస్కరించారు.

కాస్సేపు అందర్నీ పరికించిన కలిదేవుడు ఇనుపరేకుల్ని మోగించడం ఆపాడు. ఆయన చేతిసైగతో తోడేళ్ళ గుంపు నిశ్శబ్దమైపోయింది.

"నరుడా లేవరా. నీవును, వీరందరును నిర్వహించిన యాగమునకు సంతుష్టుడనై మీకు దర్శనమిచ్చితి. ఏమి మీ కోరిక" వికృతమైన స్వరముతో అడిగాడు కలిపురుషుడు.

"యుగాధిపా... మాకంటూ ఏ కోరికా లేదు" వినమ్రుడై పలికాడు మరిడి సోమయ్య.

కలిపురుషుడు విచిత్రంగా చూశాడు. "మరి ఏల నా దర్శనము నాశించినారు?" ప్రశ్నించాడు.

"కలిధర్మము అధర్మము. అలాంటి కలిధర్మము నశించనుందని తెలిసి భయమంది తమ శరణుకోరి ఈ మహాయాగమొనరించినాము" చెప్పాడు.

"ఏమిరా నరుడా. కలిధర్మము నశించుటయా, అసంభవము" అంటూ ఫెళ్ళున నవ్వాడు కలి.

"ఇది నవ్వులాటకు సమయం కాదు యుగాధిపా. తమ కరుణాకటాక్షమున మీ యుగపాలనలో మాలాంటి మాంత్రికులు, మోసగాళ్ళు, మాయలోళ్ళు, లంచగొండి ప్రభుత్వోద్యోగులు, దొంగస్వామీజీలు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, దోషులు, ద్రోహులు, దుర్మార్గులు.

అవినీతిపరులు, అక్రమార్జనపరులు, ధర్మం తప్పిన దగాకోర్లు ఒకరేమిటి వారు వీరనక అరాచకాలు సృష్టించే వేర్పాటువాదులు, విదేశీశక్తులు, మత పిచ్చోళ్ళు అంతా క్షేమంగా సుఖసంతోషాలతో ఉన్నారు. సాధుసజ్జనుల్ని అమాయక ప్రజల్ని పీడించుకుతింటున్నారు.

దేశంలో ధర్మం గతి తప్పి చక్కగా పెడదారిన పోతున్నారంతా. మద్యం మత్తులో వివేకం మరిచి హాయిగా తిరుగుతున్నారు.

ఇంత చక్కగా ఉన్న ఈ కాలాన్ని మార్చడానికి ధర్మసంస్థాపన చేయ సమకట్టాడు శతాధిక వృద్ధుడయిన ఆ అగ్నివేశాచార్యుడు. తన మునిమనవడు చరక్‌ను అలవాటి ద్వారకకు పంపించి శ్రీకృష్ణుడి వస్తువుల్ని రప్పించబోతున్నాడు...."

మరిడి సోమయ్య మాటలు వింటూ అరమూత కళ్ళతో అవలోకిస్తున్న కలిపురుషుడు– "ఇక చాలురా నరుడా. నాకు అర్థమైనది. నీ మాటలు

యదార్థములే. మా కలిధర్మమునకు విఘాతమేర్పడిన ఉపేక్షింపజాల. ఇక మీరు నిశ్చింతగా ఉండండి.

నా యుగమందు ఈ ధర్మసంస్థాపన ఎటుల జరుగునో చూచెద. అడ్డుకొని నిలువరించెద. ధర్మ సంస్థాపన... హి...హి... హి...." అంటూ భీకరంగా నవ్వుతూ అంతా చూస్తూండగానే అదృశ్యమయ్యాడు కలిపురుషుడు.

మాంత్రికులంతా తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు. ముఖ్యంగా మరిడి సోమయ్యకిప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఎవరివల్ల గాకపోయినా కలిపురుషుని వలన అవుతుంది. కలిని ప్రేరేపించి వదలడంతో తన కర్తవ్యం ముగిసింది. ఇక ఏం జరగనుందో చూడాలంటే స్వయంగా రంపచోడవరం అడవులకు వెళ్ళాల్సిందే అనుకున్నాడు తృప్తిగా.

*　　*　　*　　*　　*

చరక్ ఆత్మ కాలనాళికలో– గతానికి ప్రయాణం చేస్తోంది. వేల సంవత్సరాల కాలం వెనక్కి– కాంతివేగంలో ప్రయాణం చేస్తోంది. చిమ్మచీకటి... ఎటు చూసినా ఏమీ కనబడని గాఢాంధకారం. తొలిసారి ద్వారక వెళ్ళినప్పుడు ఈ చీకటి అతన్ని కాస్త భయపెట్టింది.

ఇపుడా భయంలేదు. తన వెంట చీకటిలో చీకటిగా కలసిపోతూ మణి భద్రయక్షుడు తనను ద్వారకాపురి వైపు తీసుకుపోతున్నాడని తెలుసు. క్షణాలు గడిచిపోతున్నాయి. కాలంలో దూసుకుపోతున్నాడు.

చివరికి ఎప్పటికో దూరంగా మిణుకు మిణుకు మంటూ ఆ చిమ్మచీకట్లలో వెలుగురేఖ ఒకటి గోచరించింది. ఆ రేఖ క్రమంగా పెద్దదవుతూ దగ్గర కాసాగింది. మజిలీ దగ్గరపడిందని గ్రహించాడు చరక్. ఉన్నట్టుండి ఒక్కసారిగా వెలుగులోకి వచ్చేశాడు.

అంతే ఎక్కడికో జారిపోతున్న అనుభూతి ఏర్పడింది. తర్వాత ఏం జరిగిందో చరక్‌కు తెలీదు. కళ్ళు తెరిచేసరికి ద్వారక నగరశివార్లలోని ఒక ఉపవనంలో పొదలమాటున పడున్నాడు. అలా ఎంతసేపు ఉన్నాడో తెలీదుగాని కళ్ళు తెరిచేసరికి సూర్యోదయమవుతోంది. లేచి దుస్తులు దులుపుకుని– పొదల చాటునుంచి ఇవతలికివచ్చాడు. చుట్టూ చూశాడు.

దరిదాపుల్లో ఎవరూ కన్పించలేదు. అంతదూరంలోనే ద్వారకనగరంలోకి వెళ్ళే రాచబాట కన్పిస్తోంది. వడివడిగా నడుస్తూ రహదారిని చేరుకున్నాడు.

అప్పటిగ్గాని తను ఎక్కడ వుందీ చరక్‌కు అర్థం కాలేదు. ఎదురుగా రహదారి అవతల రావివృక్షం దాని చుట్టూ తిన్నె. తను ఆనాడు సాధుపుంగవుడు శివయోగిని కలుసుకున్నచోటు.

ఇక్కడ ఉండగానే మిత్రవింద తన రథములో వెదుకులాడుతూ తన కోసం ఇక్కడకు వచ్చింది. గతం స్మృతిపథంలో మెదులుతుండగా నడక ఆరంభించాడు.

ద్వారకను పరివేష్టించి ఉన్న రాతిగోడలు ఏడింట, ఇప్పుడు తను మూడు నాలుగు వాకిళ్ళ మధ్య ప్రాంతంలో ఉన్నాడు. పరిసరాల్ని గమనిస్తూ సాగుతున్న చరక్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఆనాటి ద్వారకకూ నేటికీ ఎంత తేడా వుంది. బాట పొడవునా హడావుడిగా తిరిగే రథాలుగాని, వాహనాలుగాని, బాటసారులు గాని లేరు.

పంటపొలాలన్నీ బీడు బారాయి.

అనేకవృక్షాలు కూలిపోయాయి. ఆలమందలు బీడుబారిన చేలలో తిరుగుతున్నాయి.

ఆలోచిస్తూ నడుస్తున్న చరక్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. తూలి ముందుకు పడబోయి నిలదొక్కుకున్నాడు. భూమి కొన్ని సెకండ్లపాటు ప్రకంపించటమే అందుక్కారణం. భూమి అదురుతోంది. తను గమనించలేదుగాని సముద్ర అలలహోరు చాలా పెద్దగా వినవస్తోంది.

సందేహనివృత్తికోసం సమీపంలోని ఒక వృక్షశాఖల్లోకి ఎక్కి దీవిని పరికించాడు. అక్కడికి దక్షిణ సముద్రం స్పష్టంగా కన్పిస్తోంది. కెరటాలు నాలుగు నుంచి ఐదుమీటర్ల ఎత్తున తీరానికి ఎగసివస్తున్నాయి. చరక్ సందేహం తీరింది. తెల్లారితే రేపు ఉదయానికి ద్వారక ఉండదు. నీట మునిగిపోతుంది.

తను కోరినట్టే ముందురోజు ఉదయానికి తనను ద్వారక చేర్చాడు మణిభద్రయక్షుడు. ద్వారకలో పరిస్థితులు బాగాలేవని తెలీటంతో వర్తకులుగాని, సందర్శకులుగాని, బంధువర్గాలుగాని ఎవరూ రాకపోకలు సాగించడంలేదు.

సైనిక శకటాలుగాని ఆశ్వికులుగాని ఎవరన్నా వస్తున్నారేమోనని దారి పొడవునా చూసుకుంటూనే నడుస్తున్నాడు చరక్. ఒకటి రెండు వాహనాలు ఎదురయ్యాయి గాని వెనుకనుంచి ఎవరూ వస్తున్న జాడలేదు. రాచబాట బొగులు బొగులుమంటోంది.

క్రమంగా నాలుగో వాకిలి అయిదో వాకిలి కూడా దాటాడు. జనసంచారం లోకి క్రమంగా అడుగుపెడుతున్నాడు. ఎదురుపడుతున్న ద్వారకవాసులు ఎవరి ముఖంలోనూ సంతోషం కన్పించడంలేదు.

దిగులుగా బెంగగా కన్పిస్తున్నారు. భయాందోళనలతో ఉన్నారు. అప్పటికే భయమందిన కొందరు ద్వారకను వదిలివెళ్ళిపోయారు. చాలా గృహాలు తాళాలు బిగించి కన్పిస్తున్నాయి.

ఒకటి రెండు కాదు... నలభై ఆరు సంవత్సరాలు గతించిన కాలం తర్వాత తిరిగి తను ద్వారక వచ్చాడు. అప్పటి పిల్లలంతా పెద్దవాళ్ళయి ఉంటారు. పెద్దవాళ్ళు వృద్ధులయి ఉంటారు.

అందుకే ఎదురవుతున్నవాళ్ళలో ఒక్కటీ తెలిసిన ముఖం కన్పించడం లేదు. క్రమంగా ద్వారక నడిబొడ్డున అంగడి వీధులవైపు చేరుకున్నాడు.

ఏ దుకాణం చూసినా మూసివుంది. జనంతో కళకళలాడే ఆ వీధులు ఇప్పుడు బోసిపోయి కన్పిస్తున్నాయి. అయితే మిగిలిన ప్రాంతమంతటా జనం తిరుగాడుతున్నారు. ఏం జరగనుందోననే భయాందోళనలు వారి ముఖాల్లో కన్పిస్తున్నాయి.

ఒకచోటకు రాగానే అక్కడి భవంతి అరుగుల్ని చూసి కొద్దిక్షణాలు ఆగిపోయాడు.

ఆ రోజు ధాత తనను గుర్తుపట్టి వెంటపడుతుంటే తప్పించుకొని పారిపోయి వచ్చి ఇదే అరుగుమీద కూర్చున్నాడు. అప్పటికింకా తన గతజన్మ గుర్తురాలేదు. తనిక్కడ ఉండగానే అందమైన రెండు గుర్రాలు పూన్చిన బంగారురథం వచ్చి ఆగింది. రథచోధకురాలు త్రిజట కళ్ళముందు మెదిలింది.

మేలిముసుగులో దేవకన్యలా మెరిసిపోతూ రథం దిగిన మిత్రవిందను తొలిసారిగా ఇక్కడే చూశాడు. తన చేయిపట్టి రథం ఎక్కించుకుని తీసుకెళ్ళింది. ఆ మధురసంఘటన గుర్తు రాగానే చరక్ పెదవులమీద మందహాసం విరిసింది.

ఎంతయినా గతజన్మలో తన తల్లిదండ్రులు, బంధువులు వున్న నగరం. ఓసారిఇంటికెళ్ళి చూసి రావాలనిపించింది. వడివడిగా అటు నడక సాగించాడు. తమ భవంతిని సమీపిస్తూనే షాక్‌తో కొయ్యబారిపోయాడు. అతిసుందరమైన తమ భవంతి ఇప్పుడు పాడుపడి కన్పిస్తోంది.

భవంతి వెనుక ఆయుర్వేదమందులు తయారు చేసే రెల్లుగడ్డి కప్పుతో ఉండే చావడి కుప్పకూలిపోయి వుంది. భవంతి గేటు తాళంపెట్టి ఉంది.

స్థాణువై చూస్తున్న చరక్‌ను గమనించి అటుగా వస్తున్న ఒక మధ్య వయస్కుడు ఆగాడు. "ఎవరు బాబూ నీవు. ఏమి అలా జూచుచున్నావు?" అంటూ దేవనాగరిభాషలో అడిగాడు.

"అయ్యా. ఇది వల్లభాచార్యులనే వైద్యులవారి గృహము కదూ?" అంటూ తనూ దేవనాగరిలోనే అడిగాడు చరక్.

"అవును. అయిననూ వీరు గతించి చాలాకాలమైనదే. వారి సతీమణి కూడా కాలధర్మం చెందినారు. కొడుకుల్లో కొందరు సింహదేశమున, కొందరు మరేదో దేశమున స్థిరపడిరట. కొద్దిరోజులు క్రితము వరకు వారి పెద్ద కుమారుడు ఇచటనే నివసించాడు. తర్వాత ఇల్లు తాళం పెట్టి తీరమున ప్రభాసయందు స్థిరపడినారు. ఇప్పుడిచట ఎవరును లేరు. అందుచేత కొంప పాడుపడినది" అంటూ వెళ్ళిపోయాడాయన.

తల్లిదండ్రులు గతించారని తెలీగానే– అప్రయత్నంగా చరక్ కళ్ళలో నీళ్ళుతిరిగాయి. బాధను దిగమింగుతూ అక్కడి నుండి రాజవీధిలోనే ఉన్న తన మామగారు శివదేవగుప్తుని గృహంవైపు వెళ్ళాడు. వారి గృహం అప్పటిలాగే చెక్కుచెదరకుండా ఉందిగాని లోపలివారెవరూ తనకు పరిచయస్థులుగా తోచ లేదు. వల్లభాచార్యుడుగాని, వారి కొడుకుల జాడగాని లేదు.

ఆఖరివాడు తనకు తమ్ముడయిన ధాత అంటే మిత్రవిందకు ఎంతో ఇష్టం. బహుశ వాడీపాటికి అరవై సంవత్సరాలు దాటిన వృద్ధుడయివుండాలి.

తన పిచ్చిగాని వాళ్ళని చూసినా తనిప్పుడు గుర్తుపట్టగలడా. ఆ భవంతితో తనకు మామూలు అనుబంధం కాదు. మిత్రవిందతో గడిపిన మధురక్షణాలు గుర్తొస్తున్నాయి. ఆ రోజు మిత్రవిందను తీసుకుని ఇక్కడినుంచే తిరిగి కలియుగంలోకి బయలుదేరి వెళ్ళాడు. ఆనాడు శివయోగి కూర్చున్న వృక్షం ఇప్పుడు లేదు. అవును. తన అశ్వం కళ్యాణి.

తన అశ్వాన్ని ఇక్కడే అశ్వశాలలో వదిలేశాడు. ఏమైందో ఏమిటో. ఇప్పుడా అశ్వశాల కన్పించడంలేదు. చరక్ కనులు తిరిగి చెమ్మగిల్లాయి. బహుశా ఇలా బాధపడాల్సి ఉంటుందనే జేజి తాతగారు తనను ఎవరింటికీ వెళ్ళిచూడవద్దని హెచ్చరించారు.

దారిన పోతున్న ఒక వ్యక్తిని ఆపి విచారించగా శివదేవగుప్తులవారు, వారి సతీమణి కూడా చాలాకాలం కిందటే కాలం చేశారని ప్రస్తుతం ఆ ఇంట్లో ఆయన మనవలు ఇద్దరు తమ కుటుంబాలతో నివసిస్తున్నట్టు తెలిసింది. ధాత గురించిగాని మిగిలినవాళ్ళ వివరాలు గాని తెలీలేదు. వేదనాభరిత హృదయంతో అక్కడి నుంచి కదిలాడు చరక్.

పదడుగులు వేశాడో లేదో అంతలో "అరే చతురా, నువ్వేనా?" అంటూ బరువైన చేయి ఒకటి భుజంపట్టి ఆపింది. తిరిగి చూశాడు చరక్. ఎదురుగా ఉన్నదెవరో కాదు, వసంతయ్య, మిత్రవింద మేనమామ.

*　　*　　*　　*　　*

ప్రస్తుతకాలం. రంపచోడవరం అటవీప్రాంతం. పగటి సమయం. ఆ రోజు అగ్నివేశాచార్యుని బృందాన్ని ఫాలో చేస్తూ అడవిలోకి వచ్చిన జర్నలిస్టు భీష్మనారాయణ ఆ రోజే అగ్నివేశాచార్యుని స్థావరాన్ని గమనించాడు.

అగ్నివేశాచార్యుడు మూలికలకోసం అడవిలో సంచరిస్తూంటాడని విన్నాడుగాని తమకోసం ఇలాంటి ఒక రహస్య ప్రాంతం ఏర్పాటుచేసుకొని వచ్చిపోతూంటాడని వినలేదు. వాళ్ళంతా అక్కడ ఏం చేస్తున్నారు, ఏం జరుగుతోంది ఏమీ తెలీదు.

అలాగని లోనకు వెళ్ళి అగ్నివేశాచార్యుని కలవటానికి ధైర్యం చాల్లేదు. ఇలాంటి చోట తనను చూస్తే కోప్పడే అవకాశం ఎక్కువ. మహావ్యక్తి. ఆయనతో

జాగ్రత్తగా ఉండాలి. రాత్రికి కోరుకొండ ఇంటికి వెళ్ళిపోయి ఉదయం బయలుదేరి వస్తూ మూడురోజులు స్థావర పరిసరప్రాంతం అడవిలోనే సంచరిస్తూ విషయం తెలీకపోతుందాని ఆశతో ఎదురుచూడసాగాడు.

ఇలా ఉండగా మూడోరోజున శంభులింగ మహాపాత్రో మనుషులు ముగ్గురూ అతన్ని ఆపారు. వాళ్ళతో భీష్మనారాయణకి గత పరిచయం లేదు. కాని వాళ్ళలో ఒకడు నవ్వుతూ "హలో జర్నలిస్టుగారూ. మీరిలా ఎన్నిరోజులు ఈ ప్రాంతాల్లో చక్కర్లు కొట్టినా లోపల ఏం జరుగుతోందీ నీకు తెలీదు" అన్నాడు నవ్వుతూ.

"నేను నీకు తెలుసా?" అడిగాడు భీష్మనారాయణ.

"ఈ మధ్య కోరుకొండలోనే ఉంటున్నాగా. నువ్వు జర్నలిస్టువని తెలుసు" చెప్పాడు వాడు.

"ఇంతకీ మీరెవరు?"

"ఒరిస్సా శంభులింగ మహాపాత్రో మనుషులం"

"ఆయనకు ఇక్కడ ఏం పని?" అమాయకంగా అడిగాడు జర్నలిస్టు భీష్మనారాయణ.

అతనికేమీ అర్థంగావడంలేదు.

"కారణం ఉంది. అగ్నివేశాచార్యుడి స్థావరంలో ఏం జరుగుతోంది, ఏం జరగబోతోంది అనిగదా నీ సందేహం. నీకు తెలీనిది తెలుసుకోవలసింది సానా వుంది"

"ఏమిటది?"

"అదేమిటో మేం చెప్పేకన్నా మా సార్ శంభులింగ మహాపాత్రో వివరిస్తేనే నీకు అర్థమవుతుంది. ఇక్కడికి సమీపంలోనే మా క్యాంప్ ఉంది. మాతోరా!"

ఆ విధంగా ముగ్గురి వెంట క్యాంప్‌లోకి వెళ్ళిన భీష్మనారాయణ అక్కడ శంభులింగ మహాపాత్రోను కలుసుకున్నాడు.

శంభులింగమహాపాత్రో ఏదీ దాచలేదు. మందు కొట్టిన ఉత్సాహంలో అంతా చెప్పేశాడు. కాని– ద్వారక వెళ్ళిన చరక్ ఏం తేబోతున్నాడో చెప్పాడు గాని తాము అంతా వాటిని దోచుకుపోడానికి మరణాయుధాలతో వచ్చామన్న సంగతి మాత్రం చెప్పలేదు. అగ్నివేశాచార్యుడు, చరక్ తెచ్చే వస్తువులతో ధర్మ సంస్థాపన ఎలాచేస్తాడో చూడాలన్న కుతూహలంతో మాత్రమే వచ్చినట్టు,

ఇలాంటి వాటిమీద తనకు నమ్మకం లేనట్టు చెప్పాడు. భీష్మనారాయణకి అంతా అర్థమైపోయింది. ఆశ్చర్యంతో తలమునకలైపోతున్నాడు. కాలనాళిక మందసం గురించి తెలిసిపోయింది.

మిత్రవింద అలనాటి ద్వారకాపురి యువతియనీ శ్రీకృష్ణులవారి కాలంలో యువతి అనీ తెలిసిపోయింది. వినడానికిదంతా ఏదో– అభూత కల్పనలా ఉందిగాని కళ్ళముందు జరుగుతున్న వాస్తవాన్ని నమ్మకుండా ఉండేదెలా! అంతేకాదు శంభులింగమహాపాత్రో మీద తనకు సదభిప్రాయం లేదు. ముఖ్యవిషయాలేవో కొన్ని దాస్తున్నాడనిపించింది.

క్యాంప్ నుండి బయటికొచ్చాక తననక్కడికి తీసుకెళ్ళిన ముగ్గురిలో ఇద్దరు వెంట వస్తూ "మీకు మరో విశేషం కూడా చూపిస్తాం పద" అన్నాడు.

తన బైక్‌మీద వాళ్ళ బైక్‌ని ఫాలో చేశాడు భీష్మనారాయణ. ఉత్తరంగా రెండు కిలోమీటర్ల దూరం వెళ్ళాక బైక్‌లు ఆపి అక్కడ్నుంచి కాలినడకన ఫర్లాంగు దూరం ముందుకెళ్ళాక కాస్తదూరంలోని మరోక్యాంప్‌ని భీష్మనారాయణకి చూపించారు వాళ్ళు.

అక్కడ కొద్దిపాటి మైదానప్రాంతంలో సుమారు ఎనిమిది గుడారాలు కన్పిస్తున్నాయి.

అటుచూస్తూనే మరోసారి విభ్రాంతికి గురయ్యాడు భీష్మనారాయణ. కారణం ఏమంటే అవన్నీ నలుపు రంగు గుడారాలు. అక్కడున్నవాళ్ళు అంతా గడ్డంమీసాలు పెరిగి నలుపురంగు దుస్తులు ధరించిన మహామాంత్రికులు, వాళ్ళ శిష్యులూను.

భీష్మనారాయణకి అర్థమైపోయింది. వాళ్ళంతా ఒరిస్సాలోని జాజ్‌పూర్ ప్రాంతం నుంచి తరలివచ్చిన మాంత్రికుల బృందం అని. తన అనుమానం నిజమైతే వీళ్ళంతా మాంత్రికుడు మరిడి సోమయ్య వెంట వచ్చుండాలి. తను అతన్ని చూడలేదు.

"మరిడి సోమయ్య ఎక్కడున్నాడు వాళ్ళలో" నిశితంగా వాళ్ళని గమనిస్తూ అడిగాడు.

"అదో. ఆ చెట్టు కింద నిలబడి నలుగురు శిష్యులతో మాట్లాడుతున్నాడే వాడే మరిడి సోమయ్య" అంటూ చూపించాడు ఒకడు.

శంభులింగ మహాపాత్రోను ఫోటో తీసుకున్నట్టే తన కెమేరాని జూమ్ చేసి క్లోజ్‌గా మరిడి సోమయ్యను మూడు ఫోటోలు తీసుకున్నాడు. "వీళ్ళంతా ఇక్కడికి ఎందుకొచ్చారు?" సందేహ నివృత్తికోసం అడిగాడు.

"ఎందుకేమిటి? ఇంకా అర్థంకాలేదా... అగ్నివేశాచార్యుడు తలపెట్టిన ధర్మసంస్థాపనను అడ్డుకోవడానికి. వీళ్ళ పిచ్చిగాని అలాంటిదేమీ జరగదని మా సార్ చెప్పినా వినరే... అందుకే మరిడి సోమయ్యమీద మా బాస్‌కి కోపం" చెప్పాడు ఒకడు.

వీళ్ళు నిజాలు బయటపెట్టడంలేదని గ్రహించగలిగాడు భీష్మ నారాయణ. విచిత్రం ఏమంటే ఈ రెండు క్యాంప్‌లు కూడా అగ్నివేశాచార్యుని స్థావరానికి కిలోమీటరు దూరంలోనే ఉన్నాయి.

కోటను ముట్టడించడానికొచ్చిన శత్రుశిబిరాల్లా స్థావరానికి దక్షిణ భాగంలో ఒకరు. ఉత్తర భాగంలో ఒకరు మకాం వేసి కూర్చున్నారంటే ఇది సాధారణ విషయం కాదు. ఖచ్చితంగా వీళ్ళంతా స్థావరం మీద దాడిచేయటానికే వచ్చుండాలి.

కాలనాళిక మందసం, చరక్ రెండోసారి ద్వారక వెళ్తున్నాడు– మిత్ర వింద అలనాటి ద్వారకవాసిని, తిరిగి తిరిగి ఇవే విషయాలు భీష్మనారాయణ బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. ఇంతకీ ఈ శత్రుశిబిరాల గురించి అగ్ని వేశాచార్యునికి తెలిసుంటుందా?

తెలిసే ఉంటుంది. సందేహం లేదు.

"సరి. ఇక మీరు వెళ్ళిపొండి. మీ బాస్‌ను కలిసినట్టే నేనోసారి అలా క్యాంప్‌లోకి వెళ్ళి మరిడి సోమయ్యను కూడా కలిసి మాట్లాడి వెళ్తాను" అంటూ ముందుకు పోబోయాడు భీష్మనారాయణ.

వెంటనే అతని ప్రయత్నాన్ని ఆపారు వాళ్ళిద్దరూ. "హలో! మా సార్‌ని కలిసినంత ఈజీ కాదు అతన్ని కలవడం. మరిడి సోమయ్యంటే ఎవరనుకుంటున్నావు. మహా మాంత్రికుడు. మమ్మల్నే ఓసారి కోపంలో అడవి గొర్రెలుగా మార్చేశాడు.

ఇప్పుడు నువ్వెళ్తే ఏ ఎలుగ్గొడ్డుగానో మార్చేస్తాడు. బతికినంతకాలం ఈ అడవిలోనే తిరగాలి. ఎందుకు చెప్తున్నామో అర్థం చేసుకుని వెనక్కి వచ్చెయ్" అంటూ భీష్మనారాయణని హెచ్చరించారు.

వాళ్ళ మాటలతో ఆలోచనలో పడిపోయాడు భీష్మనారాయణ.

జర్నలిస్ట్ అంటే రిస్క్ తీసుకోవాల్సిందే. కాని వృధాగా ప్రాణంమీదికి తెచ్చుకోకూడదు. పైగా అక్కడున్నది కేవలం మరిడి సోమయ్య ఒక్కడే కాదు, చాలామంది మంత్రగాళ్ళు ఉన్నారు.

చాలా విషయాలు ఇక్కడే తెలిసిపోయాయి గాబట్టి ఇంకా ఆ క్యాంప్‌లోకి వెళ్ళి మంత్రగాళ్ళను కలవడం, రిస్క్ తీసుకోవడం మంచిది కాదనిపించింది. వెంటనే ఆ ఆలోచనని విరమించుకుని వెనుతిరిగాడు.

*　　*　　*　　*　　*

అగ్నివేశాచార్యుని స్థావరం.

ఆ సమయంలో అగ్నివేశాచార్యుడు– తన పూజామందిరంలో పూజలో ఉన్నాడు. అంతలో తనవద్దకు ఒంటరిగా వస్తున్న మిత్రవిందను ఆశ్చర్యంగా చూశాడు డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు.

"ఏమిటి తల్లీ ఇలా వచ్చావ్? ఏమన్నా కావాలా?" అనడిగాడు వాత్సల్యంగా.

"నాకేమియు వలదు బాబాయ్" అంది సమాధానంగా మిత్రవింద.

"జేజి తాతగారి కోసమా?"

"మీ కోసమే వచ్చితి. ఒక పని చేయగలరా?"

"చెప్పు తల్లీ ఏం చేయాలి?"

"ద్వారకాధీశుని ముందు నూట ఎనిమిదిమంది ఋత్విక్కులతో జేజి తాతగారిపేరు మీద గొప్ప హోమం చేయించాలి"

ఆ మాట వింటూనే – నమ్మలేనట్టు చూశాడు. మిత్రవింద అసాధారణ యువతి. ఆ విషయం తనకు తెలుసు. అకస్మాత్తుగా ఇలా హోమం నిర్వహించాలని అడగటానికి కారణం ఏమిటి?

అలాంటిదేమన్నా ఉంటే తన భర్త చరక్ క్షేమంగా తిరిగిరావాలని కోరుతూ చరక్ పేరన అర్చనలు, హోమాలు జరిపిస్తే అర్ధం ఉందిగాని మహాత్ముడు, సర్వం తెలిసినవాడు, శక్తిమంతుడు అయిన అగ్నివేశాచార్యుని పేర జరిపించాల నటంలో కారణం ఏమిటి? ఏదన్నా విపరీతం ముంచుకు రానుందా.

"ఏమైంది తల్లీ. ఆచార్యునికేమీ కాదు గదా?" ఆందోళన నిండిన స్వరంతో ప్రశ్నించాడు డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు.

"అలాంటి దేమీ లేదు బాబాయ్. కేవలం ముందు జాగ్రత్తకోసమే ఈ యాగం జరిపించడం అవసరమనిపిస్తోంది" అంది మిత్రవింద.

కాని ఆ మాటలు గోవిందపాత్రునికి సందేహ నివృత్తిని చేయలేక పోయాయి.

అలాగని ఇంకేమీ అడగలేదు ఆయన.

''సరి తల్లీ. అలాగే ఏర్పాటుచేయిస్తాను. హోమం ఎప్పుడు ఆరంభించాలి?" అనడిగాడు.

"ఈ రోజు చీకటిపడేలోపు ఆరంభంకావాలి. నేనీ ఏర్పాటు చేసినట్టు జేజితాతకు తెలీకూడదు. అలాగే హోమం చరక్ తిరిగివచ్చేవరకు పగలు రాత్రి నిరంతరాయంగా సాగాలి. చాలా ఘనంగా సాగాలి"

"చాలమ్మా, అర్ధమైంది ఇప్పుడే అక్కడున్న రామాచారికి నీలకంఠాచారికి ఫోన్‌చేస్తాను. ఇంకా కోరుకొండలోని నా మిత్రులు, వేదపండితులకు ఫోన్ చేస్తాను. ఎట్టి పరిస్థితిలోనూ చీకటిపడగానే హోమం ఆరంభమవుతుంది. సరేనా?"

"కృతజ్ఞురాలిని బాబాయ్. త్వరగా ఏర్పాట్లు జరిగిపోవాలి" అంటూ మరోసారి హెచ్చరించి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది మిత్రవింద. వెంటనే శాటిలైట్ ఫోన్ అందుకున్నాడు పిల్లా గోవిందపాత్రుడు.

* * * * *

అలనాటి ద్వారకాపురిలో భుజంమీద బరువుగా చేయిపడగానే గిరుక్కున తిరిగి చూసిన చరక్‌కు ఎదురుగా కన్పించాడు వసంతయ్య.

వసంతయ్య మిత్రవిందకు మేనమామ మాత్రమే కాదు, శ్రీకృష్ణులవారికి ఆంతరంగిక చెలికాడు. బలరామప్రభువుల ఆస్థాన విదూషకుడు.

వయసు వ్యత్యాసం చూడకుండా తనంటే ఎల్లప్పుడూ వాత్సల్యం చూసే అభిమానహితుడు.

ఆ రోజు వసంతయ్య హడావుడి చేయడంవల్లనే మిత్రవిందను తనతో ద్వాపరం నుండి కలియుగంలోకి తీసుకుపోగలిగాడు.

అటువంటి వసంతయ్యను చూడగానే– ఆప్రయత్నంగా చరక్ కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

ఎంతలో ఎంత మార్పు! వసంతయ్యకు ఇప్పుడు వయసైపోయింది. తెల్లగా, బొద్దుగా ఉండే ఆయన దేహం వడలి సగానికి సగం చిక్కిపోయాడు.

తేజోమయంగా నవ్వులు కురిపించే ఆ నవ్వుల రేడు ముఖంలో ఒకప్పటి కళ ఇప్పుడు లేదు. ముఖం నిండా దిగులు, బెంగ గూడుకట్టుకొనున్నాయి.

కళ్ళు గుంటలు పడ్డాయి. జుత్తు ముగ్గుబుట్టలా తెల్లబడిపోయింది. ఒకనాడు వసంతయ్యను చూడగానే నవ్వొచ్చేది. తన చతురోక్తులతో ఎదుటి వాళ్ళను పొట్టచెక్కలయ్యేలా నవ్వించే గొప్ప విదూషకుడు. ఇప్పుడు పుట్టెడు దుఃఖంలో దీనంగా కన్పిస్తున్నాడు.

అందుకు కారణాలను చరక్ ఊహించుకోగలడు. తన కలికాలం లెక్కన నాలుగు మాసాల క్రితమే చరక్ తొలిసారి ద్వారక వచ్చి అంతా చూసి, మిత్రవిందను తనతో తీసుకెళ్ళాడు.

ఇప్పుడు నాలుగు మాసాల తర్వాత రెండోసారి తను ద్వారకవచ్చేసరికి ఇక్కడ నలభై ఆరు సంవత్సరాలు గతించిపోయాయి.

ఇది తక్కువకాలం ఏమీ కాదు. అయితే తను ఎప్పటిలాగే ఉన్నాడు. వసంతయ్య ముసలాడైపోయాడు, అదే తేడా.

కన్నీళ్ళతో ఇరువురూ– ఒకరినొకరు కాస్సేపు అలా చూసుకుంటూ ఉండిపోయారు.

"ఏమి ఈ వైపరీత్యము బాబాయ్" వసంతయ్య చేతుల్ని పట్టుకుంటూ బాధగా అడిగాడు.

"పండుటాకు పచ్చిగా ఎలా ఉంటుంది? వయసైనదిగదా... ఆ పైన ఇప్పుడు ద్వారకలో పరిస్థితులు బాగులేవు. మా సంగతి అటులుంచుము చతురా.

నీవిచటికేల వచ్చితివి? ఎప్పుడు వచ్చితివి?" కన్నీళ్ళు పైతుండుతో తుడుచుకుంటూ అడిగాడు వసంతయ్య.

"ఈ ఉదయమే వచ్చితి"

"మిత్రవింద. నా మేనకోడలు క్షేమమా? మీ వివాహమైనదా? పిల్లలు ఎంతమంది?"

"వివాహమైనది బాబాయ్. సంతానం కలగలేదు. మేం సంతోషముగ ఉన్నాము" అన్నాడు చరక్.

"అరరే... మీకింతవరకు సంతులేదని వినుటకు బాధగా వున్నది చతురా. అంతా దైవేచ్ఛ" అన్నాడు బాధగా వసంతయ్య.

వసంతయ్య బాధపడ్డంలో అర్థం ఉంది. ఆయన దృష్టిలో తమ వివాహం జరిగి నలభై ఆరేళ్ళు గతించాయి. కాని వాస్తవానికి మిత్రవిందకు తనకు వివాహమై ఇంకా నెల తిరగలేదు.

కాలం చేసే మాయాజాలం ఎంత విచిత్రంగా ఉంది! ఈ విచిత్రాలను తనకు కాలనాళిక మందసం ద్వారా అందించిన జేజితాతగారి రుణాన్ని ఏవిధంగా తీర్చుకోగలడు?

"చతురా, మీరు ఏదేశమున నివసించుచున్నారు?" అడిగాడు వసంతయ్య.

"అటు దక్షిణంగా మహాదధి తీరమున గల ఆంధ్రదేశమున నివసిస్తున్నాం బాబాయ్"

"కాని చతురా. ఇదేమి ఆశ్చర్యము. ఇదేమి విచిత్రము. నీ వయసింకను పాతికేళ్ళయువకుని వలె స్థిరముగా యున్నదే. ఇదెటుల సంభవము?" అచ్చెరువున తలమునకలవుతూ ప్రశ్నించాడు వసంతయ్య. ఈ ప్రశ్న తప్పకవస్తుందని చరక్‌కు తెలుసు. కాదంటే కాస్త ఆలస్యంగా వచ్చింది–

"ఇందులో ఆశ్చర్యమేమున్నది బాబాయ్. మా తండ్రిగారు ఆయుర్వేదమున ఘనవైద్యులని మీకు తెలియదా? ఆ పైన నేనును వైద్యుడనని నీవెరుంగవా! కాయకల్పమను ఓషధి ప్రభావమున నా వయసిటుల స్థంభించినది.

నేనొక్కడినే కాదు సుమా. మిత్రవిందయు నేటికీ రెండు పదులు మించని వయసున స్థిరమగు యవ్వన ఆరోగ్యములు కలిగియున్నది" అంటూ సందేహ నివృత్తి చేశాడు చరక్.

అబద్ధమైనా అతికినట్టుంది. వసంతయ్య సంతృప్తి చెందాడు. కాని ఆ వెంటనే మరొక్క ప్రశ్న అడిగాడు. "ద్వారకలో పరిస్థితులు బాగలేవు గదా. ఇచటకేల వచ్చినావు చతురా... ఏమైనది?"

"బాబాయ్. దిగువన మరాఠా దేశమున రత్నగిరి వరకు వ్యాపార నిమిత్తమై వచ్చియున్నాను. ఎలాగూ ఇంత తొలవు రావడమైనది గదా. ఒకపరి అందరినీ జూచి యోగక్షేమములరసిపోదలచివచ్చితి.

కాని... ద్వారక ఇటులున్నదేమి? ప్రజలు భీతిజెంది కడు దుఃఖమున కన్పట్టుచున్నారు. సముద్రకెరటములు బీభత్సముగా నున్నవి. భూమి అదురు చున్నది. ఏమి జరుగుచున్నదిచట?"

చతుర్ ప్రశ్నలకు బదులు చెప్పకుండా "మనం ఇలా దారిలో నిలువబడి కుశలములరయుట సముచితంగాదు. భోజనము వేళయైనది.

గృహమునకేగుదము రమ్ము" అంటూ పిలిచాడు వసంతయ్య. చరక్ అభ్యంతరము చెప్పాడు గాని– వసంతయ్య వదల్లేదు. ఇరవై నిముషాలు నడిచి– వసంతయ్య నివాసగృహానికి చేరుకున్నారు. ఇల్లు బోసిపోయి కనబడుతోంది. ప్రస్తుతం ఆ ఇంట వృద్ధులయిన వసంతయ్య దంపతులిద్దరే నివసిస్తున్నారు. కొడుకులు, కూతుళ్ళు అందరికీ ఎప్పుడో పెళ్ళిళ్ళయిపోయి మనవలు, ముదిమనవలు కూడా ఉన్నారట. వాళ్ళు అంతా బయట తలోచోట స్థిరపడ్డారు. ద్వారక వదిలి తమ వద్దకు వచ్చేయమని గొడవచేస్తున్నారట. కాని శ్రీకృష్ణులవారినీ, ద్వారకనూ వదిలిపోలేక వీళ్ళిద్దరూ ఇక్కడే ఉండిపోయారు.

వసంతయ్య భార్య చతుర్‌ని గుర్తుపట్టి ఎంతో అభిమానంగా పరామర్శించి క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంది.

వసంతయ్యతోబాటు భోజనం చేశాడు చతుర్.

భోజనానంతరం తీరిగ్గా కూర్చున్నప్పుడు మరోసారి ద్వారకలోని పరిస్థితుల ప్రస్తావన వచ్చింది.

మరోసారి బాధగా కన్నీరు బొటబొటా కార్చాడు వసంతయ్య. "ఏం చెప్పను చతురా. గతవారము దినములుగా ద్వారకయందు అనేక విపరీతములు ఘటిల్లినవి. ఇదంతయు యుగసంధినందు కలిప్రభావమా లేక ప్రారబ్ధమా తెలియకున్నది.

గాంధారి శాపము ఫలించి యాదవకుల క్షయము జరిగిపోయినది. నేడు నగరమున స్త్రీ బాలవృద్ధులు కొందరు యువకులు, ఇతర కులములవారే మిగిలియున్నారు. బలరామకృష్ణుల జాడ తెలియక అలమటిస్తున్నాము.

పరిస్థితులు జూడ ద్వారకను సముద్రుడు కబళించునను సందియము పొడజూపుచున్నది. హస్తిన నుండి మూడు దినముల క్రితము పార్థుడు వచ్చి కొందరు సైనికులను వెంటనిడుకొని బలరామకృష్ణుల జాడ అరయవెడలి యున్నాడు.

ఇంతదనుక మరలి రాడాయె. నామాట వినుము చతురా. నీ విచట క్షణమైనను నిలువక్షేమము గాదు. వెంటనే ద్వారక వదలిపొమ్ము.

మీరయినను క్షేమమున ఉండవలె. బయలుదేరుము" అన్నాడు వసంతయ్య.

చరక్ చిన్నగా నవ్వాడు. "బాబాయ్... నా కోరిక యొకటి తీరనేలేదు సుమా" అన్నాడు.

"ఏమా కోరిక? అదియును ఈ క్లిష్టసమయమున!" అడిగాడు వసంతయ్య.

"శ్రీకృష్ణులవారి శమంతకమణి, నెమలిపింఛము, తోడ కిరీటము, పాంచజన్య శంఖం, అలాగే వారి పిల్లనగ్రోవి. ఈసారి వాటిని తప్పక దర్శింప నెంచి ఎంతో ఆశతో వచ్చితి.

ఏమి ఫలము? ఈసారియు నా కోరిక నెరవేరకున్నది. నా అదృష్టమింతి యేయను కొందును.

శ్రీకృష్ణులవారు వాటిని ధరించియే వెడలియుందురు" అంటూ నిరాశగా నిట్టూర్చాడు చరక్.

"లేదు చతురా" అన్నాడు వెంటనే వసంతయ్య.

"నా ప్రభువు ఆ దినమున అవేమియు ధరింపలేదు. అలంకరణ గావించుకొనలేదు. పెను విషాదమున ఉన్నటుల ఓరకింజెప్పకయే స్వయముగ రథము నడుపుతూ కోటను వదిలివెడలినారు. నన్ను గూడా పలకరించలేదు.

ప్రస్తుతము నీవు జూడ కుతూహలపడు ఆభరణములన్నియు శ్రీకృష్ణుల వారి అంతఃపురమునందే భద్రముగ యుండును. కాని ఈ క్లిష్టసమయమున నిన్నటకు దోడ్కొనిపోయి జూపించుట, ప్రభువు శయన మందిరము జొచ్చుట యుక్తముగాదు.

అయినను ఆనాడు నేను వాటిని చిత్రించి ఇచ్చిన వస్త్రమున్నది గదా! ఉన్నదా?"

"ఉంది బాబాయ్. భద్రముగా యున్నది"

"మంచిది చతురా. ఇక ఎలాంటి ఆలోచనలు లేక వేగిరము ద్వారకను వదిలి వెడలిపొమ్ము. మా అదృష్టం ఎటులున్నదో అటులనే జరుగును. మీరయినా సుఖముగా ఉండవలె. బయలుదేరుము" అంటూ తొందరచేశాడు వసంతయ్య.

అప్పటికి పొద్దు పడమర వాలుతోంది. మాటల సందర్భముగా తనకు కావలసిన సమాచారం సేకరించుకోగలిగాడు చరక్. తనకు కావలసిన వస్తువులు నాలుగూ శ్రీకృష్ణులవారి శయనమందిరమందే ఉన్నవి. ఇది చాలు.

"ఈ దినము శుక్రవారము. అమావాస్య. ద్వారక యందు దుశ్శకునములు పొడజూపుచున్నవి. ఆకాశము మేఘావృతమవుతున్నది. రాత్రికి ఏమి జరుగునో తెలియకున్నది. తక్షణమే ద్వారక వదిలి క్షేమముగా వెళ్ళిపొమ్ము" చరక్ బయలుదేర గానే చివరి సారిగా హెచ్చరించాడు వసంతయ్య. అభిమానంతో వసంతయ్యను కౌగిలించుకొని వదిలాడు చరక్.

ఆయన ధర్మపత్నివద్ద సెలవు తీసుకొని వీధిలోకొచ్చాడు.

వీధి మొగవరకు చరక్‌ను సాగనంపి వెనక్కి వెళ్ళిపోయాడు వసంతయ్య. ఆకాశం వంక చూశాడు చరక్. వసంతయ్య చెప్పింది నిజమే.

ఉత్తరదిశగా కారుమబ్బులు మూసుకొస్తున్నాయి. అప్పటికే చెదురు మదురుగా గగనవీధిలో సంచరిస్తున్న మేఘాలు సూర్యుడితో దాగుడుమూత లాడుతున్నాయి. ఈదురుగాలులు ఆరంభించాయి. అప్పుడప్పుడు భూమి చిన్నగా అదురుతూనే వుంది.

పట్టపగటివేళ తనిపుడు కోటలో ప్రవేశించలేడు. రాత్రివరకు కాలక్షేపం చేయక తప్పదు.

వసంతయ్య హెచ్చరిక ప్రకారం తను ద్వారకను వదిలిపోలేదు గదా. వచ్చిన పనిగాకుండా వెళ్ళలేదు. ఆలోచిస్తూ ద్వారకాపురి వీధుల్లో సంచరిస్తున్నాడు చరక్. ఇన్నేళ్ళలోనూ ద్వారకాపురిలో పెద్దగా మార్పేమీ లేదు. అతిసుందరమగు అనేక అంతస్థుల భవనాలు, పేటలు అలాగే ఉన్నాయి.

ఏవో కొన్ని భవంతులు శిధిలమై కన్పిస్తున్నాయి. ద్వారకలోని కోట బురుజుల మీద భవంతులపైన తాపడం చేసిన మణిమయ రత్నఖచితమగు సువర్ణరేకుల కాంతులు బంగారు ఇటుకలు ధగధగాయమానంగా పగటిపూట మబ్బులు సూర్యుణ్ణి మూయగానే కనువిందు చేస్తూ ప్రకాశిస్తున్నాయి.

రాచవీధిలో ద్వారకసైనికులు అశ్వాలమీద సంచరిస్తున్నారు. వీధుల్లో పురజనుల సంచారం తక్కువగా ఉంది. ఒకప్పుడు నగరవీధుల్లో శరవేగంతో పరుగులు తీసే జోడుగుర్రాల రధాల జాడ నేడు కన్పించడంలేదు. స్వర్గాన్ని ఆ వైకుంఠపురాన్ని తలపించే ద్వారకాపురి అలాగే ఉన్నప్పటికీ నాటి కళాకాంతులు నేడు లేవు. ఎక్కడ చూసినా విషాదం, భయం గూడుకట్టుకుని ఉంది.

ప్రజలు భయం గుప్పిట్లో కాలక్షేపం చేస్తూ బలరామకృష్ణుల రాకకోసం ఎదురుచూస్తున్నారు. నగరంలో ఒకప్పటి పటిష్టమైన గస్తీ ఏర్పాట్లు ఇప్పుడు లేవు. చరక్ నగరాన్ని, అక్కడి పరిస్థితుల్ని గమనిస్తూ నేరుగా ఒక ఉద్యానవనం చేరుకున్నాడు.

అది తన మామగారు శివదేవగుప్తులవారికి చెందిన ఉద్యానవనం. ఆ రోజు మిత్రవింద తనను రధం ఎక్కించుకొని తీసుకొచ్చింది ఇక్కడికే. పాపం రధచోదకురాలు త్రిజట ఇప్పుడు ఎలా ఉందోఏమిటో. ఆమె కూడా వృద్ధురాలయి వుంటుంది.

ఉద్యానవనం ఆలనాపాలనా లేక పాడయింది. అనేక వృక్షాలు ఎండి పోయాయి. నాడు కనువిందు చేసిన పూలమొక్కలు, లతలు నేడు లేవు.

చాలాచోట్ల పిచ్చిమొక్కలు పెరిగాయి. కాని ఉద్యానవనం లోపల తటాకము దాని చెంతనే మణిమండపంగా పిలువబడే చలువరాతి మండపం అలాగే ఉన్నాయి. మండపమంతా ధూళి ధూసరితో నిండివుంది. ఒకవేళ

మిత్రవింద తనతో వచ్చి ఉంటే ఈ పరిస్థితులు చూసి ఎంతో దుఃఖించి వుండేది. ఈ మణిమండపంలో ఎన్నో సంధ్యా సమయాలు మిత్రవిందతో గడిపిన తీపి జ్ఞాపకాలు ఉక్కిరిబిక్కిరి చేస్తూండగా మండపం మెట్లమీద కాస్సేపు కూర్చున్నాడు చరక్.

తర్వాత మండపంలో తిన్నె ఒకటి శుభ్రం చేసుకుని పడుకున్నాడు. తిరిగి తిరిగి అలసిపోయిన చరక్‌ను చల్లటి ఈదురుగాలులు సేదతీరుస్తుండగా కాస్సేపటికే అతను గాఢనిద్రలోకి జారిపోయాడు.

*　　*　　*　　*　　*

కోరుకొండ... అగ్నివేశాచార్యుని ఎస్టేట్. ద్వారకాధీష్ మందిరం. ఉదయం డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడి నుంచి ఫోన్ రాగానే రామాచారి వెంటనే రంగంలోకి దిగాడు. ద్వారకాధీశుని చెంత పూజాదికాల బాధ్యతను కొడుకు నీలకంఠాచారికి అప్పగించి హోమం నిర్వహించటానికి అవసరమైన ఏర్పాట్లలో మునిగిపోయాడు.

ఫోన్లమీద చకచకా పనులు జరిగిపోసాగాయి. ఈలోపల హోమం ఏర్పాట్ల గురించి తెలీగానే అటు మున్నలూరి అగ్రహారం నుంచి రామాచారి భార్య కావేరి, దేవమ్మగారు టాక్సీలో మధ్యాహ్నానికి కోరుకొండ వచ్చేశారు.

అప్పటికే ద్వారకాధీశుని ఎదురుగా– షామియానా పందిళ్ళు వెలిశాయి. అటు ఆలయనిర్మాణానికి సంబంధించి కొలతలు తీసి మార్కింగ్ చేసి పనిలో ఉన్న శంకరనారాయణ స్థపతి, పెరుమాళ్ స్థపతి వారి శిష్యులు తాత్కాలికంగా పని నిలిపి హోమానికి ఏర్పాట్లలో తామూ భాగం పంచుకోనారంభించారు.

అతిరథమహారథులనదగ్గ వేదపండితులు ఋత్విక్కులు వచ్చి చేరుకోనారం భించారు. మరోపక్క వంటశాల ఏర్పాట్లు జరిగిపోతున్నాయి.

కావలసిన సంభారాలన్నీ వచ్చి చేరుతున్నాయి. ఆగమేఘాలమీద సాగి పోయాయి ఏర్పాట్లు. ఋత్విక్కులు నూట ఎనిమిదిమందయినా, హోమం ఎన్ని రోజులు సాగుతుందో తెలీదు గాబట్టి షిఫ్టుల్లో నిర్వహించడానికి మరో ఏభైమంది వచ్చారు.

యాగనిర్వహణలో ఎంతో అనుభవం కలిగిన గురువు అయిన సదాశివ శాస్త్రిగారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరగసాగాయి.

సరిగ్గా సూర్యుడు అస్తమిస్తున్నవేళ– ద్వారకాధీష్‌కు అగ్నివేశాచార్యుని పేరు మీద మహాకుంకుమార్చన ఆరంభించబడింది.

అదే సమయంలో యాగశాలలో హోమగుండంలో పవిత్రహోమాగ్నులు రగల్చబడ్డాయి.

మైక్‌సెట్లో నూటెనిమిది మంది ఋత్విక్కుల వేదమంత్రఘోష కోరుకొండ వీధుల్లో మారుమోగుతూండగా ఏవిధమయిన ఆర్భాటం లేకుండా ఏ విధమయిన ప్రచారం లేకుండా అగ్నివేశాచార్యుని పేర ఆయుర్ వృద్ధికి ఒక మహాహోమం అక్కడ ప్రారంభమైంది.

చీకటిపడేసరికి హోమాగ్ని చూసి ద్వారకాధీష్‌ను దర్శింపవచ్చిన భక్తజనంతో మరోసారి ఆ ప్రాంతం అంతా కిటకిటలాడింది. హోమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది.

*　　*　　*　　*　　*

ద్వారకాపురి. ఉపవనంలోని మణిమండపం. గాఢనిద్రలో ఉన్న చరక్‌కి ఏదో పీడకల.

అల్ల కల్లోలంగా వున్న సముద్రంలో పడి తను శరవేగంగా ఈదుకొంటూ పోతున్నాడు. సముద్రజలాల్లో సంచరించే భయంకరమైన రాతి మొసలి ఒకటి గుహలాంటి తన నోరు తెరిచి తనను వెంబడించి పట్టుకోవడానికి వస్తోంది.

దాని నోటికి తను చిక్కితే ప్రాణాలతో సముద్రం నుంచి బయటపడలేడు. దాన్నుంచి తప్పించుకోవడం కష్టంలా ఉంది.

హోరున వర్షం. చీకటిపడబోతోంది. సముద్ర జలాలు శరీరాన్ని గడ్డకట్టించేంత చలిపుట్టిస్తున్నాయి. కెరటాలు ఉవ్వెత్తున లేచి తనను విసిరికొడుతున్నాయి.

అయినాసరే, ఆశ వదులుకోలేదు చరక్. తన ప్రయత్నాన్ని విరమించలేదు. ఆ మకరం నుండి రక్షించుకోవడానికి– శక్తినంతా ఉపయోగించి తీరంవైపు వేగంగా వెళ్ళిపోతున్నాడు. అది కూడా మరింత పట్టుదలగా తనను సమీపిస్తోంది. కనుచూపు దూరంలో ఎక్కడా తీరం కనిపించడంలేదు. ఆ విపరీత పరిస్థితిలో

తనను రక్షింపగలవాడు ఆ ద్వారకాధీశుడే అన్పించింది "హే కృష్ణా... ముకుందా... మురారీ... ద్వారకాధీశా... ఈ మొసలి బారినుంచి కాపాడు. గోవిందా... గోకుల కృష్ణా" బలంగా ఈదుతూనే బిగ్గరగా కృష్ణపరమాత్మను తలుచుకుంటున్నాడు చరక్. అంతలో కల చెదిరింది. సముద్రఘోష ఆగిపోయింది.

"ధుం... ధుం" మంటూ భేరీనాదం ఒకటి వినవచ్చింది. అంతే ఉలికిపడి లేచి కూర్చున్నాడు చరక్. కొద్ది క్షణాలవరకు ఏం జరిగింది, తను ఎక్కడున్నాడు ఏదీ గుర్తురాలేదు. శరీరం స్వేదంతో నిండి వుంది. గుండెదడ ఇంకా అలాగే ఉంది.

క్రమంగా మూడు నిముషాలకు గాని చరక్ మామూలు స్థితికి రాలేక పోయాడు. ఏమిటీ కల? ఎందుకిలా వచ్చింది? ఈ కలకి అర్థం ఏమిటి? తను కల్లోల సముద్రంలో ఎలా ఉన్నాడు? ఆ మొసలి ఏమి తనను తరుముకురావడం ఏమిటి?

ప్రాణభయంతో తను రక్షింపమని ఆ గోవిందుని ప్రార్థించటం ఏమిటి! ఇంతా జరిగినా తను ఆ మొసలికి చిక్కనూ లేదు. తీరం ఎక్కనూలేదు. కల చెదిరిపోయింది. ఇది శుభసూచకం అనుకోవాలా అశుభ సూచకం అనుకోవాలా?

ఇంతకీ తనకి ఎలా మెలుకువ వచ్చింది? పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనేక ప్రశ్నలను పక్కకు తోసి తిన్నెదిగాడు చరక్. తను ఆలోచిస్తూ కూర్చునే సమయం కాదిది. చాలాసేపు నిద్రపోయాడు.

అటు చూస్తే మబ్బులచాటున సూర్యుడస్తమించబోతున్నాడు. తూర్పు నుంచి చీకట్లు ముసురుకొస్తున్నాయి. ఉత్తరం దిక్కున కనబడిన నల్లటిమబ్బులు కదలకుండా అలాగే నిలబడున్నాయి. రాత్రికి తప్పకుండా వర్షం పడే సూచన లున్నాయి.

తిరిగి నగారా శబ్దం విన్పించటంతో తనకు ఎలా మెలుకువ వచ్చిందో అర్థమైంది చరక్‌కి. పక్కవీధిలో ఏదో చాటింపు వేస్తున్నట్టున్నారు. అంతేకాదు. నగర వీధులనుంచి కలకలం వినవస్తోంది.

ఏం జరుగుతోంది! వెంటనే మడుగునీటిలో ముఖం కడుక్కుని పైతుండుతో తుడుచుకుంటూ ఆ ఉపవనం నుండి వేగంగా పక్కవీధిలోకెళ్ళాడు చరక్.

అక్కడ వీధిమొగలో ఇద్దరు రాజభటులు నిలబడున్నారు. ఎత్తు అరుగుమీద నిలబడిన ఆ భటుల్లో ఒకడి మెడనుండి చిన్న పరిమాణంలోని భేరీ వుంది. రెండు కర్రముక్కలతో దాన్ని వాయిస్తున్నాడు. జనం చేరగానే భేరీనాదం ఆగింది. రెండో భటుడు ప్రకటన చదవటం ఆరంభించాడు.

ప్రజలు రాజప్రకటన ఏమిటో తెలుసుకునేందుకు ఆత్రంగా పెద్ద గుంపు చేరి ఎదురుచూస్తున్నారు. దేవనాగరిభాషలోని ఆ ప్రకటన సారాంశం క్రింది విధంగా వుంది. "ఇందుమూలంగా సమస్త ద్వారకాపుర జనులకు తెలియ జేయునది ఏమనగా–

మన బలరామ శ్రీకృష్ణ ప్రభువులను వెదకుచూ వెళ్ళిన అర్జునులవారు కొంతసేపటి క్రితం నగరానికి తిరిగివచ్చియున్నారు. మన ప్రభువులు బలరామ, శ్రీకృష్ణులు ఇరువురును ప్రభాసతీర్థమందు క్షేమముగా యున్నారట. భయపడాల్సింది లేదు.

కాని రేపు సూర్యోదయమునకు మన ప్రియమైన ఈ ద్వారకాపురం నీట మునిగిపోనుందట.

కావున సమస్త ద్వారకావాసులు కావలసినవి తీసుకొని రాత్రికి రాత్రి నగరాన్ని ఖాశీచేసి ప్రధాన తీరంపైకి వెళ్ళిపోవలసిందిగా బలరామశ్రీకృష్ణ ప్రభువుల వారి ఆదేశం. కావున ఆలస్యం చేయకుండా ప్రజలంతా తమ ఇళ్ళు, వాకిళ్ళు వదిలి బయలుదేరి ప్రాణరక్షణ చేసుకోవాలి.

త్వరగా బయలుదేరవలసిందిగా ప్రభువుల హెచ్చరిక హో...." ఈ వార్త ద్వారకా వాసులకు పిడుగుపాటులా తోచింది. ఆ ప్రకటనలో ఒక శుభవార్త, ఒక అశుభవార్త కాగా, బలరామకృష్ణులు క్షేమంగా ప్రభాసతీర్థలో ఉన్నారనుట శుభవార్త. కాని ఈ శుభవార్త సత్యం కాదని అక్కడున్నవారిలో చరక్‌కి మాత్రమే తెలుసు.

* * * * *

బలరామ ప్రభువులు శ్రీకృష్ణ ప్రభువులు అవతారం చాలించి భౌతిక శరీరాలను విడిచిపెట్టి ఇది ఆరో రోజు.

కాని వారు ఇక లేరు అని తెలిస్తే ప్రజలు చావుకైనా సిద్ధమేగాని నగరాన్ని వదలమంటారన్న ఉద్దేశంతో పార్థుడలా అబద్ధం చెప్పక తప్పలేదు. అయితే ఆ ప్రకటన– ద్వారకవాసులమీద ప్రతికూల ప్రభావం చూపించింది.

ఒక్కసారిగా అనేకమంది ఎలుగెత్తి అరిచారు. వారి మాటలు సాధారణ భాషలో "విడువము... ప్రాణములు పోయినను మా ద్వారకను వదిలి పోజాలము. మా బలరామ ప్రభువులు ఎక్కడ? మా దేవుడు, అధినాయకుడు, మా ద్వారకా ధీశుడు మా శ్రీకృష్ణప్రభువు ఎక్కడ?" అని కొందరు–

"వారు ముందే ద్వారకని ఎందుకు వదిలేసి వెళ్ళిపోయారు? మమ్మల్ని దిక్కులేని పక్షుల్నిజేసి అనాథలుగా వదిలేసి వెళ్ళిపోయారే" అంటూ కొందరు గొల్లున ఏడుస్తున్నారు.

శోకంతో వెక్కివెక్కి పడుతున్నారు మరికొందరు.

"మేము బలరామ ప్రభువుల్ని, శ్రీకృష్ణులవారినీ చూడాలి. వారు వచ్చి చెప్పాలి. లేదంటే ద్వారకతో బాటే మేమంతా జలసమాధి అవుతాంగాని ఇక్కడి నుంచి కదలము" అని కొందరు అరుస్తున్నారు. ప్రజలను ఎలా సముదాయించాలో ఎలా నచ్చచెప్పాలో రాజభటులకు అర్థంకాలేదు.

ఇంతలో– "అర్జునులవారు... పార్థుడు... గాండీవి ఇటేవస్తున్నారు" అంటూ ఒక దిశలోని జనంలో ఒక్కసారిగా కలకలంరేగింది. అర్జునుడు వస్తున్నాడని తెలీగానే చరక్ ఆసక్తిగా అటు చూడనారంభించాడు.

బహుశా అర్జునుడు నగరానికి రాగానే నగరమంతటా అందర్నీ ఖాళీ చేయమని చాటింపు జరిపిస్తుండాలి. అన్నిచోట్లా ఇదేలా పరిస్థితి ఉండివుంటుంది. దాంతో స్వయంగా ఆ కిరీటి నగర సంచారం చేసి పురజనులకు నచ్చచెప్తున్నట్టున్నాడు.

అప్పటికే చీకట్లు ముసురుకొస్తున్నాయి. ఇళ్ళలో ఆముదం దీపాలు వెలిగిస్తున్నారు. వీధుల్లో కాగడాలు వెలిగించబడుతున్నాయి. కొద్దిసేపటికి అర్జునుడు చరక్ దృష్టి పథంలోకి వచ్చాడు.

పాలకన్నా తెల్లటి బలిష్టమైన ధవళాశ్వం మీద వస్తున్నాడు. కదంతొక్కుతూ వస్తున్న ఆ అశ్వం వెనక కొందరు ఆశ్వికులయిన రాజభటులు అనుసరించి

వస్తున్నారు. కొందరు పౌరులు కూడా ఆ అశ్వాలను అనుసరించి పరుగు లెత్తుకొస్తున్నారు.

క్రమంగా వారంతా దగ్గరవుతున్నారు. గుర్రాల గిట్టలనుంచి ఎగసిన ధూళి మబ్బులా వ్యాపిస్తోంది. చరక్ కన్నార్పటం మర్చిపోయి– అర్జునుడ్ని చూస్తున్నాడు.

గతజన్మలో చతురునిగా కూడా తను పాండవుల్లో ఎవరినీ చూసిన గుర్తులేదు. స్వయంగా ఇప్పుడు పాండవ మధ్యముణ్ణి చూడటం అంటే ఇది ఏ జన్మ అదృష్టం అనుకోవాలి. పులకాంకితుడై కిరీటిని చూస్తున్నాడు. నరనారాయణులు గాండీవి శ్రీకృష్ణులు.

నరుడిగా అతిరథమహారథుడైన ఫల్గుణుడు తన జీవితకాలంలో సాధించిన విజయాలు ఒకటా రెండా. పది నామములు బిరుదుగా కలిగిన విజయునికి ఇప్పుడు వయసయింది. అయినప్పటికీ కోరమీసం తెల్లగా మెరుస్తోంది. శిరస్సున మణిమయ రత్నశోభిత మగు మకుటం ఉంది. మెడలో రత్నహారాలు అలంక రింపబడి వున్నాయి.

బంగారు జరీ అంచుతోకూడిన తెల్లని సిల్కుపంచె కట్టి ఆకుపచ్చని అంగీ ధరించాడు. పద్దెనిమిది అడుగులకు తగ్గని ఆజానుబాహుడే సవ్యసాచి.

ఎడమభుజాన గాండీవం, ధనస్సు వేలాడగా కుడిభుజాన వీపున అక్షయతూణీరం, అంబులపొది వుంది. ఇంకా మణిమయ రత్నఖచితమగు ఒరలో నడుముకు పొడవాటి ఖడ్గం వేలాడుతోంది. ఆహా ఏమా దివ్వసుందరరూపం!

కురుక్షేత్ర సంగ్రామంలో కృష్ణపరమాత్మ ప్రవచించిన భగవద్గీతకు ప్రథమశ్రోత ఈ ధనుంజయుడు. ఆ మహాయుద్ధంలో బావ శ్రీకృష్ణుని నేతృత్వంలో లక్షలాదిమంది శత్రువుల్ని తన అస్త్రశస్త్రాలతో దునుమాడిన మహావీరుడీ అర్జునుడు.

అర్జునుడికి ద్వారకతో గల అనుబంధం మాటలలో వర్ణింపలేనిది. ఒకనాడు తీర్థయాత్రలు చేస్తూ దొంగ సాధువులా ద్వారకలో తిష్టవేసి సుభద్ర మనసుదోచిన ప్రేమికుడు. నాగకన్య ఉలూచితో ప్రేమాయణం నెరపి బభ్రువాహనుడికి జన్మనిచ్చినవాడు.

అంతేనా పురుషద్వేషి అయిన మలయాళ దేశరాణి ప్రమీలాదేవిని తన ప్రణయాంబుధిలో ఓలలాడించి వివాహం చేసుకున్న ప్రణయమూర్తి. వీటన్నిటికీ మించి పంచభర్తృక అయిన పాంచాలి ద్రౌపదీదేవికీ అతిఇష్టుడైన శృంగార పురుషుడు. మత్స్యయంత్రాన్ని కొట్టి ఆమెను గెలుచుకున్నది పార్థుడే గదా.

సమీపిస్తున్న అర్జునులవారిని చూస్తున్న చరక్ మస్తిష్కంలో చకచకా కదిలిపోతున్నాయి అర్జునుని జీవితంలోని ప్రధానఘట్టాలు.

అర్జునుడు వస్తున్నాడని తెలీగానే ఆ మూడు వీధుల కూడలిలో ప్రజలు మరింత గుంపు చేరిపోయారు. కిరీటిని చూడగానే దుఃఖం ఆపుకోలేక కొందరు పెద్దగానే రోధిస్తున్నారు.

కొందరు "మేం ద్వారకను వదిలిపోము, చావయినా, బతుకయినా ఇక్కడే. మా కన్నయ్యవచ్చి చెబితేనే మేం నగరాన్ని ఖాళీచేస్తాం" అనరుస్తున్నారు.

పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. జనసందోహంలో తోపులాట కూడా ఆరంభమైంది. అయితే ఎంత రణగొణధ్వనిగా ఉన్నప్పటికీ అర్జునుడు చేతులు ఎత్తి వారించగానే ఒక్కసారిగా అంతా నిశ్శబ్దమైపోయారు.

అర్జునుడి అశ్వం నిలబడినచోటే కదంతొక్కుతోంది. కళ్ళాలుబిగించి ఉంచాడు పార్థుడు.

ఇప్పుడిప్పుడే కాటుకలాంటి నల్లటి చీకట్లు ద్వారకమీద వ్యాపిస్తున్నాయి. కిందచూస్తే ఆగి ఆగి భూమి అదురుతోంది. మృత్యుఘడియలు ముంచుకొస్తున్నాయనే సంకేతాలు అందరికీ అర్థమవుతూనే వున్నాయి. కాని శ్రీకృష్ణులవారి ద్వారకనే ధైర్యం ఎక్కడో మిణుకు మిణుకుమంటోంది.

ద్వారకవాసుల్ని చూస్తూ–

గొంతు సవరించుకున్నాడు అర్జునుడు. దేవనాగరి భాషలో అనర్గళంగా సాగిన ఆయన పలుకులు ప్రస్తుతభాషలో ఇలా ఉంది.

"ఓ ప్రియమైన ద్వారకాపురి వాసులారా. నా ఆత్మీయ యాదవులారా యదుకుల శ్రేష్ఠులారా, గాంధారీ మాత శాపవశాన జరిగిన యాదవ కుల క్షయము నందు ఆత్మీయుల్ని కోల్పోయిన యాదవులందరికీ నా తరపున మా

పాండవు లందరి తరపున ముందుగా మా ప్రగాఢసంతాపములు సానుభూతిని తెలియ జేస్తున్నాను" అన్నాడు.

ఆ మాటలు వినగానే- తమ కుటుంబాల్లో వ్యక్తుల్ని కోల్పోయిన యాదవులు దుఃఖం ఆపుకోలేక ఒక్కసారిగా గొల్లుమన్నారు. కాసేపు ఆ ప్రాంతం శోక సముద్రమైపోయింది.

ప్రేక్షకుడిలా ఒకపక్క నిలబడి చూస్తున్నాడు చరక్. పురప్రజల బాధలు, కష్టాలు చూస్తుంటే తన గుండెల్ని ఎవరో పట్టి పిండుతున్నంత బాధ. అప్రయత్నంగా కళ్ళవెంట బొటబొటా కన్నీరు వస్తోంది. తన ఆత్మీయులూ ద్వారకలో ఉన్నారు.

కాని తనెవరో ఇప్పుడు చాలా మందికి తెలియదు. కాబట్టి బాధ సహజం. పులిమీద పుట్రలా ఇప్పుడు నగరాన్ని వదిలిపోవాల్సిన పరిస్థితి చూస్తుంటే ఎంతటి కష్టం వారికి.

అర్జునులవారు చేతులెత్తి వారించగానే తిరిగి ఆ ప్రాంతం నిశ్శబ్దమై పోయింది. చీమచిటుక్కుమన్నా వినబడేంత నిశ్శబ్దం. కొందరు కాగడాలు వెలిగించి తెచ్చారు. ఆ వెలుగులో అశ్వంమీది అర్జునుడిని అంతా స్పష్టంగా చూస్తున్నారు.

"ఓ ద్వారకవాసులారా! ఇచటి పరిస్థితులు మాకు హస్తినకు ఆలస్యముగా తెలిసినవి. వెనువెంటనే అగ్రజులు ధర్మరాజా వారి ఆదేశానుసారము నేను బయలుదేరివచ్చినాను. మీకు తెలుసు. మూడుదినాలుగా దారుకావనమందు బలరామకృష్ణులకోసం గాలించితిని. చివరకు వారి జాడ తెలిసినది.

ముఖ్యమైన పనిమీద వెడలిన బావలిరువురును ప్రస్తుతము ప్రభాస తీర్థమందు విశ్రాంతిగైకొనుచు క్షేమమున వున్నారు.

ఆ దేవదేవుడు శ్రీకృష్ణులవారి ఆనతిమీద మీ అందరి క్షేమంకోరి తిరిగి వచ్చితి. రేపు సూర్యోదయముతో ద్వారక నీట మునుగుట నిక్కము. నగరమును వదిలి అందరూ బయటకు రావలసిందిగా మీ దైవం ద్వారకాధీశుడైన ఆ శ్రీకృష్ణుల వారి ఆనతి.

మీ కష్టములు నాకు తెలుసు. ఓ యాదవులారా, నగరవాసులయిన ఇతర కులస్థులారా, మీ క్షేమం కోసం ఆలోచించండి. మీ బిడ్డల భవిష్యత్తు

కోసం ఆలోచించండి. బతికివుంటే తిరిగి ఆస్తులు సంపాదించుకోవచ్చు. మనకి ఎంతో సమయము లేదు. రాత్రికి రాత్రి నగరాన్ని వదిలిపోవాలి.

ఇప్పటికే సైనికులు నగర శివార్లలోని ఆలమందల్ని రాతిబాట దిశగా మళ్ళిస్తున్నారు.

ఓ ప్రజలారా, ఎవరూ ఇచట ఉండకూడదు. అందరం వెళ్ళిపోతున్నాం. అచట శ్రీకృష్ణులవారి కుటుంబాలు ప్రయాణసన్నాహంలో ఉన్నాయి. కొందరు ఇప్పటికే రాచనగరు ఖాళీచేశారు.

అచట మీ రాకకోసం ప్రభాసతీర్థమందు మీ ప్రభువు కృష్ణపరమాత్మ ఎదురుచూస్తున్నారు. నా మాట వినండి. వెంటనే బయలుదేరండి. ఇది బలరామ ప్రభువుల ఆనతి లేవండి" అంటూ హెచ్చరించి అర్జునుడు అశ్వాన్ని అదలించాడు అంతే.

అశ్వం ధూళిరేపుతూ వీధి ఎగువకు పరుగుతీసింది. సైనికులు అనుసరించారు. అర్జునుడి మాటలు ప్రజలమీద మంత్రంలా పనిచేశాయి. ప్రయాణసన్నాహాల కోసం ఎవరికివారు తమ ఇళ్ళవైపు పరుగులు ఆరంభించారు.

అంతటి అర్జునుడికే ఈ క్లిష్టసమయంలో ద్వారక ప్రజలకు చైతన్య పరచడానికి అబద్ధం చెప్పక తప్పలేదని గ్రహించి చరక్ బాధపడ్డాడు.

ఇదంతా కాలమహిమగాక ఏమిటి? బలరామకృష్ణులు గతించిన సంగతి తెలిస్తే ఆ దుఃఖంలో ఎవరూ ద్వారకను వదిలిరారు గాబట్టి వారి క్షేమంకోరి ఆబద్ధం చెప్పక తప్పలేదు.

నగరం నలుమూలలనుండి ప్రజల హడావుడి, అరుపులు, కేకలు వినబడు తున్నాయి. చరక్ అక్కడి నుండి కోటవద్దకుపోయే రాజబాటను చేరుకుని ముందుకు నడక ఆరంభించాడు.

దారి పొడవునా ఏ ఇంట చూసినా దుఃఖం. ఏ గృహమును జూచినా శోకం. బాధాతప్త హృదయాలతో ఎవరికివారు తమ ప్రియమైన ఇళ్ళవాకిళ్ళను వదిలి ప్రయాణసన్నాహంలో వున్నారు.

ఇళ్ళముందు ఎడ్లబండ్లు గుర్రంబండ్లు నిలిపి వాటిలోకి ముఖ్యమైన వస్తువులు, దుస్తులమూటలు, బంగారం ఆభరణాల పేటికలు, బంగారు ఇటుకలు, వెండిదిమ్మలను, సువర్ణనాణాల మూటలను చేరుస్తున్నారు.

స్త్రీపురుషులు, పిల్లలు అంతా హడావుడిగా వున్నారు. సామాన్య కుటుంబాల్లో అయితే ముఖ్యంగా రైతులు, చేతివృత్తులవారు ఎడ్లబండ్లతో బాటు కావడి తట్టల్లోవస్తువుల్ని నింపి వాటిమీద పెంపుడు జంతువులయిన కోళ్ళనికట్టి కుక్కల్ని వెంటబెట్టుకుని దివిటీలు చేతబట్టి వీధుల్లో సాగిపోతున్నారు.

నిజంగా ఆ రాత్రి– ద్వారకవాసుల పాలిట– ఒక కాళరాత్రి– ఆ కాలంలో నిప్పు తయారుచేసుకోవడం ఒక యాగంలాంటిది.

అందుకే ప్రతిఇంటా నిత్యాగ్నుల్ని రగిల్చి ఉంచుకునేవారు. ఇప్పుడు ప్రయాణంలో దివిటీలు వెలిగించుకోవాలన్నా ఇతర అవసరాలకు అగ్గిమంట ఉండాలి గాబట్టి పెద్ద పెద్ద ముంతల్లో బొగ్గునిప్పును ప్రతివారూ వెంటతెచ్చు కుంటున్నారు.

క్రమంగా ప్రయాణానికి సిద్ధమైన ఒక్కోకుటుంబం తమ గృహాన్ని వదల్లేక విడిచిపెట్టి ప్రధాన రాజమార్గం వెంట వలసదారి పట్టింది.

ద్వారకవాసుల కష్టాలు చూసి ఆకాశం కూడా కన్నీరు విడుస్తోందా అన్నట్టు చినుకుచినుకుగా వర్షం జల్లులూ ఆరంభించాయి.

ఆకాశం పూర్తిగా కారుమబ్బులతోనిండి పెద్ద వానపడే సూచనలు కన్పిస్తున్నాయి.

ఈదురుగాలులకు దివిటీలు, కాగడాలు గప్పున ఆరిపోతుంటే చీకట్లలోనే కళ్ళు చించుకొని చూస్తూ ముందుకు కదులుతున్నారు.

నగర రెండో వాకిలివద్ద నిలబడిన చరక్, కాందిశీకులై కాగడాల వెలుగులో వలసబాట పట్టిన పురజనుల్ని బారులు తీరి సాగుతున్న వారి వాహనాల్ని చాలాసేపు చూశాడు.

ద్వారకాపురి మహానగరం. ఇది ఖాళీ అవ్వాలంటే అర్ధరాత్రి లోపల అయ్యే పనిగాదు.

వరసగా వస్తూనే వున్నాయి వాహనాలు. పేద, గొప్ప భేదం లేదు. అంతా మౌనంగా రోధిస్తూ వదల్లేక వదల్లేక తమ నగరాన్ని వదిలిపోతున్నారు.

వలసలు ఇవాళ యాదవులకు కొత్త కాదు. ఒకప్పుడు జరాసంధుని బాధపడలేక మధురానగరాన్ని వదిలి శ్రీకృష్ణుని వెంట దారుకావనానికి వలస

వచ్చారు. కాని నేడు తమవెంట శ్రీకృష్ణులవారు లేరు. ఎటు వెళ్ళాలి ఎక్కడ స్థిరపడాలి అనే ఆలోచన లేదు. ప్రజలంతా ఆత్మరక్షణ కోసం ముందు ప్రధాన భూభాగం మీదికి వెళ్ళిపోవాలన్న హడావుడిలోనే ఉన్నారు.

సుమారుగా అర్ధరాత్రి సమయం వరకు వలసపోతున్న యాదవ కుటుంబాల్ని చూస్తూ అక్కడే నిలబడ్డాడు చరక్. కనుచూపు మేర ఎటుచూసినా కాగడాలు కన్పిస్తున్నాయి. ఇంతవరకు వర్షం ఉధృతం గాకపోవడం అదృష్టం.

తనకు అనుకూలమైన సమయం కోసం ఎదురు చూస్తున్న చరక్ అర్ధరాత్రి దాటగానే చీకట్లమాటున కోటగుమ్మం దాటి లోనకు వెళ్ళాడు.

కోటలోగాని, రాచనగరు, అటు అంతఃపురాల్లోగాని హడావుడింకా సద్దుమణగలేదు. సైనికులు హడావుడిగా పరుగులు తీస్తున్నారు.

వరుసలు తీరిన అనేక బండ్లు, రధాలలోకి బంగారు ఇటుకలు, వెండి దిమ్మలు, బంగారు ఆభరణాలను మూటలకొద్ది–

మణిమాణిక్యాదులు, సువర్ణనాణెములు చేర్చబడుతున్నాయి. అవన్నీ శ్రీకృష్ణులవారి అష్టభార్యలకు చెందిన వాహనాలు కాగా బలరాములవారి కుటుంబానికి చెందిన వాహనాలు అంతకుముందే సైనికులగస్తీతో ముందుగా బయలుదేరాయట. అంతఃపురాలు, రాచనగరులోని స్త్రీ బాలవృద్ధులంతా అప్పటికే రధాలెక్కి ముందుకు సాగిపోయారు.

ఇపుడీ అపారమైన సంపదను బండ్లకు ఎత్తుతూండగా సైనికుల్ని ఎవరు పర్యవేక్షిస్తున్నారో తెలీదు. అలాగని ఇవి కదిలేవరకు తను ఆగటంకూడా సాధ్యం కాదు. సమయం ముంచుకొస్తోంది. ఇప్పుడు తన ముందున్న ప్రతిక్షణం అత్యంత విలువైనది. జాప్యంలేకుండా లోనకు వెళ్ళిపోవడం మంచిది.

ఇక వెనకాముందూ ఆలోచించలేదు చరక్. చీకట్లలోనే కోటగుమ్మం దాటి లోనకు వెళ్ళిపోయాడు.

లోన తిరుగుతున్న కొందరు రాజభటులో, నౌకర్లో అర్ధంకాలేదుగాని ఎవరి హడావుడిలో వాళ్ళున్నందున ఎవరినీ ఎవరూ పట్టించుకునే పరిస్థితి అక్కడ లేదు. అక్కడక్కడా గోడలకు తగిలించిన దివిటీలను అలాగే వదిలి బయటికెళ్ళి పోతున్నారు ఆందోళనగా.

చరక్ ఒక దివిటీ అందుకుని కోటలోంచి మెట్లదారిన పైకిపోతూ అంతఃపుర మందిరాలుండే దిశగా సాగిపోయాడు.

కోటమొత్తం పూర్తిగా నిర్మానుష్యమైపోయింది.

అందమైన మందిరాలన్నీ బోసిపోయి కన్పిస్తున్నాయి. సాయంత్రంవేళ వెలిగించిన గాజుబుడ్లలోని ఆముదందీపాలు అక్కడక్కడా ప్రకాశవంతంగా వెలుగులు నింపుతున్నాయి.

గతజన్మలో చతుర్‌గా వున్నప్పుడు ఈ కోటలు పేటలు తిరిగిన అనుభవం వుంది చరక్‌కు. అవి గుర్తుచేసుకుంటూ చాలా సేపటికి అతను శ్రీకృష్ణులవారి శయనమందిరానికి చేరుకున్నాడు. దీపకాంతులతో విశాలమైన ఆ సువర్ణ సుందర మందిరం అతిమనోహరంగా, ప్రశాంతంగా ఉంది.

చేతిలోని దివిటీని గోడకు గుచ్చాడు. లోన అడుగు పెడుతూనే– భక్తి పారవశ్యంతో పులకించిపోతూ– శ్రీకృష్ణులవారిని తలచుకుని– వారు శయనించే హంసతూలికాతల్పానికి సాష్టాంగనమస్కారం చేశాడు చరక్. సువర్ణ మణిమయ కాంతులతో మెరిసిపోతోంది హంసతూలికాతల్పం.

ఎటుచూసినా పట్టుపరదాలు వేలాడుతూ రత్నఖచితమగు అలంకార వస్తువులు కనువిందు చేస్తున్నాయి. తల్పం పక్కనే గుండ్రటి బంగారుపళ్ళెరంలో అనేకరకాల పండ్లు నోరూరిస్తున్నాయి వాటిని చూడగానే చరక్‌కి ఆకలి గుర్తొచ్చింది.

వాటినే ప్రసాదంగా భావించి కొన్ని ఫలాలు ఆరగించాడు. గవాక్షం చెంతకెళ్ళి బయటకు తొంగిచూశాడు. ఆఖరి శకటంకూడా కోటవాకిలి దాటి వెళ్ళిపోతోంది. ఆకాశంలో మరింత దట్టంగా నల్లని మబ్బులు అలుముకున్నాయి.

ఉరుములు మెరుపులతో ఆకాశం బీభత్సంగా ఉంది. మెరుపుల కాంతిలో నగరం దాని పరిసరాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

దూరంగా నాలుగో ప్రహరీ వాకిలి దాటుతున్న వాహనాలను కొన్నిటిని చూశాడు.

వెంటనే వెనుతిరిగి– ఇక తను సంపాదించాల్సిన వస్తువులకోసం అన్వేషణ ఆరంభించాడు.

శ్రీకృష్ణులవారి మందిరం సువిశాలమైనది. ఆ శయనమందిరాన్ని ఆనుకొని మరికొన్ని గదులు ఉన్నాయి. మొత్తం చకచకా తిరిగి వెదికాడు.

ఎక్కడా తనకు కావలసిన బంగారు పేటిక జాడలేదు. ప్రతిచోటా ఎన్నో చెక్క నగిషీలతో కూడిన బీరువాలు, పెద్దపెద్ద మందసాలు, దుస్తులు ఉంచే అల్మారాల వంటివి ఎన్నో ఉన్నాయి.

అక్కడి పరిస్థితి చూస్తుంటే ఎవరూ శ్రీకృష్ణులవారి మందిరాన్ని గురించి పట్టించుకున్నట్టు లేదు. ఎవరి హడావుడిలో వారుండి పట్టించుకోలేదా లేక పవిత్రమైన ఈ మందిరాన్నిలాగే వదిలేయాలని వదిలేశారా అర్థంకాలేదుగాని ఎవరూ అటుగా రాలేదు.

తను చేసిన పొరబాటు ఏమిటో చరక్‌కి ఇప్పుడు అర్థమైంది. వసంతయ్యను కలిసినప్పుడు ఆ స్వర్ణపేటిక ఉండేచోటు అడిగి తెలుసుకోవాల్సింది.

అడిగితే అనుమానం వస్తుందన్న భయంతో అడగలేకపోయాడు. ఇప్పుడేమిటి దారి? అవతల కాలాతీతమవుతోంది.

పట్టువదలని విక్రమార్కుడిలా చరక్ తిరిగి తిరిగి మందిరమంతా గాలిస్తూనే వున్నాడు. పెద్దపెద్ద బోషాణాలు, మందసాలు, బీరువాలు, ప్రతి ఒక్కటి తెరిచి చూశాడు.

అమూల్యమైన వస్తువులు, సంపద ఎంతో ఉందక్కడ. కాని తనకు కావలసినది జాడ తెలీటంలేదు.

ఒకటికాదు రెండుకాదు. మూడు గంటల సమయం వెదుకులాడినా ప్రయోజనం లేకపోవడంతో చరక్‌లో ఆత్రుత పెరిగిపోయింది.

బయట తెల్లవారుజాము అయిపోయింది. మబ్బులు, హోరున వానలో తెలియటంలేదుగాని తెల్లవారటానికి ఎంతో సేపులేదు. ద్వారక నుంచి అంతా ఖాళీచేసి వెళ్ళిపోయారో ఇంకా ఎవరన్నా మిగిలారో తెలీదు.

ఇప్పుడేమిటి దారి? తను ఓడిపోయినట్టేనా? జేజితాతగారికిచ్చిన మాట నిలుపుకోలేని అసమర్థుడయ్యాడే ఏ ముఖం పెట్టుకుని రిక్తహస్తాలతో వెనక్కి వెళ్ళగలడు? ద్వారకతోబాటు జలసమాధి గావటం తప్ప తనకు మరోదారి లేదు.

మనసు వేదనతో నిండిపోయింది. కళ్ళముందు శుశ్రుత, మిత్రవిందలు మెదులుతున్నారు.

ఏమీ చేయలేని అసమర్థునిగా ఉండిపోవలసిదేనా... మనోవేదనతో హంస తూలికా తల్పం సమీపంలోని ఒక ఆసనంమీద కూలబడిపోయాడు.

చివరి ప్రయత్నంగా మనసు లగ్నంచేసి ప్రశాంతంగా ఆలోచించాడు.

శ్రీకృష్ణులవారు శమంతకమణి, కిరీటం, పాంచజన్య శంఖం, మురళి వీటిని ఉంచే బంగారు పేటికను దూరంగానో పక్కమందిరాల్లోనో ఉంచే అవకాశం లేదు. తన తల్పానికి సమీపంలోనే చేతికి అందేలా ఉంచాలి. అదే నిజమైతే ఇక్కడే ఏదో రహస్య అరగాని కిటుకుగాని ఉండాలి. ఏమిటది? ఎక్కడ?

ఈసారి చరక్ ప్రయత్నం వృధాకాలేదు. హంసతూలికాతల్పం పక్కన పండ్లు, ఫలహారాలు ఉంచే గుండ్రని చెక్క నగిషీలు బంగారు తాపడాలతో కూడిన పెద్ద టీపాయ్‌లాంటిది ఉందిగదా. వచ్చిన వెంటనే దానిపైన బంగారు పళ్ళెరం నుంచి కొన్ని పండ్లు కూడా తీసుకుతిన్నాడు చరక్.

దాన్ని పరిశీలించగా మధ్యలో ఒక తలుపు కనబడింది. దాన్ని తెరవగానే లోన బంగారు పేటిక... దాన్ని బయటకు తీసి తెరిచి చూశాడు.

లోన తనకు అవసరమైన నాలుగు వస్తువులు కనువిందు చేస్తూ కన్పించాయి. అవి దొరికిన ఆనందంలో ఆ స్వర్ణపేటికకు భక్తితో నమస్కరించాడు చరక్. "తండ్రీ ద్వారకాధీశా... కరుణించావా... ధన్యుడ్ని ప్రభూ" అంటూ ప్రార్థించాడు.

ఆ తర్వాత ఇక ఆలస్యం చేయలేదు చరక్. సుమారు రెండడుగుల పైగా పొడవు, అంతే వెడల్పు, రెండడుగుల ఎత్తు వుండే ఆ స్వర్ణపేటికను మూసి అలాగే పట్టుకుని తిరుగుప్రయాణమయ్యాడు.

స్వర్ణపేటికతో ఉత్సాహంగా కదిలాడు చరక్. శ్రీకృష్ణులవారి అంతఃపుర మందిరం వదిలి వడివడిగా నడుస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వచ్చిన కార్యం నెరవేరింది. ఇక మిగిలింది ద్వారకనుంచి బయటపడి తీరంమీదికి క్షేమంగా చేరుకోవడం.

చేరుకోగలడా! సూర్యోదయంలోపు ద్వారక మునిగిపోకముందే– తను క్షేమంగా తీరం మీద ఉండగలడా! అంత సమయముందా! ఓ పక్క భూమి

అదరడం అంతకంతకూ పెరుగుతూపోతోంది. ఆధునిక శాస్త్రవిజ్ఞానభాషలో చెప్పాలంటే రెక్టర్ స్కేల్‌పై 7 లేదా 8 దాటినట్టుగా తోస్తోంది.

మరోపక్క సముద్రపుహోరు అంతకంతకు రెట్టింపవుతోంది. ద్వారకాపురి చుట్టూ ఉన్న సముద్ర గర్భంలోంచి భీకరమైన శబ్దాలువస్తున్నాయి. పరిస్థితి ఉద్వేగంగా ఉంది.

ఉద్రిక్తతకు లోనైన చరక్ ఇక్కడే మరో తప్పు చేశాడు. నగరాన్ని ఖాళీచేసి యాదవులు, పురప్రజలు అంతా వెళ్ళిపోయారుగాబట్టి తనుకూడా వెళ్ళిపోవాలనే ఆలోచనలో ఉన్నాడుగాని, ఇక్కడే మణిభద్రయక్షుని తలచుకొని కలియుగంలోకి వెళ్ళిపోవచ్చన్న సంగతే మర్చిపోయాడు.

ఆలోచనల మధ్య అంతఃపురాలు దాటి అంతస్థులు దిగుతూ వర్షంలో మెట్లమీదకు వచ్చేశాడు.

తడిసివున్న చలువరాతి మెట్లమీద అనుకోకుండా చరక్ కాలుజారి తూలి పడిపోయాడు. దాంతో స్వర్ణపేటిక ఊహించని విధంగా కిందపడి మెట్లమీద తెరుచుకుంది.

అంతే... పేటికలోని శమంతకమణి హారం ముందుగా మెట్లపక్కనుంచి జారి చీకట్లలో దిగువన ఎక్కడో పడిపోయింది. దానివెనకే శ్రీకృష్ణులవారి మణిమయ స్వర్ణకిరీటం కూడా దొర్లుకుంటూపోయింది.

చరక్ చేయిచాపి పట్టుకోబోతే కిరీటంలోని నెమలిపింఛం మాత్రం చేతికి అందింది. కిరీటం కూడా మెట్లపక్కగా జారిపడి చాలా దిగువన ఎక్కడినుంచో అదిరిపడిన శబ్దం పెద్దగా వినవచ్చింది. నెమలిపింఛాన్ని పేటికలో వేసి మూసి అక్కడే మెట్లమీద బాధతో కూర్చుండిపోయాడు చరక్. ఎందుకు ఇలా జరిగిందో అర్థంగావటం లేదు. తన తొందరపాటు తెచ్చిన అనర్థం ఇది.

రోజుకు పది బారువాల బంగారాన్నిచ్చే సూర్యప్రసాదితమైన శమంతక మణిహారం. దీన్ని తీసుకెళ్ళగలిగితే భారతదేశం బంగారుదేశమయ్యేది. ప్రపంచంలో అగ్రదేశంగా ధనిక దేశంగా నిలిచేది.

ఇప్పుడు ఆ అదృష్టం కూడా చేజారిపోయింది. కిరీటమూ దక్కలేదు. తన తొందరపాటే ఈ అనర్థానికి కారణం. తొందరపాటు కాదు... భయోద్వేగమే ప్రధాన కారణం.

ఇప్పటివరకూ లేని భయం ఇప్పుడెందుకు తనలో ప్రవేశించింది? ముంచుకురాబోతున్న ప్రళయమా? తనవాళ్ళకు తను దూరమైపోతాడేమోననే స్వార్థంతో కూడుకున్న ఆలోచనల సమాహారమా?

ఇవేమీకాదు అనుకుంటే హ్యూమన్ గాడ్ శ్రీకృష్ణుడు ఇకలేరనే వేదనా? ఆలోచనల్లోంచి క్షణాల్లోనే తేరుకున్నాడు.

అప్పటివరకు వర్షంలో తడుస్తూ అలాగే మెట్లమీద ఒంటరిగా ఉండిపోయాడు. అంతలోనే మనసు రాయిచేసుకున్నాడు. జరిగిందానిగురించి బాధపడి ప్రయోజనంలేదు. తనకింతవరకే ప్రాప్తం. అంతా ఆ ద్వారకాధీశుని అనుగ్రహం.

అంతేకాదు. ఇలా స్వర్ణపేటికను వెంటతీసుకెళ్ళడం చాలా కష్టము, క్లిష్టమైన కార్యం. చరక్‌లేచి స్వర్ణపేటికతో తిరిగి మెట్లెక్కి సమీపంలోని ఒక అంతఃపురంలోకి వెళ్ళాడు. అక్కడ ఒక పట్టువస్త్రాన్ని తీసుకుని స్వర్ణపేటికలోని పాంచజన్యశంఖం, మురళి, నెమలి పింఛాలను ఆ పట్టువస్త్రంలో చుట్టాడు.

ఒక దళసరి గుడ్డ సంచిని వెదకి తెచ్చుకుని ఆ పట్టువస్త్రాన్ని సంచిలో వేసుకుని భుజానికి తగిలించుకున్నాడు. ఈ పని ముందే చేసివుంటే అనవసరంగా శమంతకమణి, కిరీటాన్ని కోల్పోయివుండేవాడు కాదు. స్వర్ణపేటికను అక్కడే వదిలి తిరుగు ప్రయాణమయ్యాడు.

ఈసారి ఏ కష్టం లేకుండా చకచకా మెట్లు దిగిపోతూ కాస్సేపటికి కోట గుమ్మం దాటి వాకిలివరకు వచ్చేశాడు. ఇప్పుడు భూమి అదరడం అధికరించడం స్పష్టంగా తెలుస్తోంది.

గాలివాటున సముద్ర అలలహోరు చెవులు చిల్లులుపడేలా వినవస్తోంది. ఎటుచూసినా నిర్మానుష్యమైన నగర గృహాలలో ఆముదం దీపాలు మాత్రం మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నాయి.

కాళ్ళకింద నీరు ప్రవహిస్తోంది. అది వర్షంనీరా సముద్రజలాలా అర్థం గావటంలేదు. ఆకాశం ఉరుములు, మెరుపులతో ప్రళయకాలాన్ని గుర్తుచేస్తోంది. కుంభవృష్టిగా మొదలైంది వాన. ఈదురుగాలుల తాకిడి అధికరించి శరీరం జల్లుమంటోంది.

మెరుపుల కాంతిలో కనుచూపు మేరలో ఎక్కడా జనసంచారం లేదు. ఆఖరి కుటుంబాలు నగరాన్ని వదిలి ఎంతసేపైందో తెలీదు. తూర్పు దిక్కు చూస్తుంటే తెల్లవారడానికి ఎంతో సమయం లేదనిపిస్తోంది.

తను పరుగెత్తినా తెల్లారేలోపు వెళ్ళిపోగలడా లేదా సందేహమే అయినప్పటికీ ప్రయత్నం మానకూడదు గాబట్టి అక్కడి నుండి వాననీటిలో తపతప అడుగులు వేస్తూ ముందుకు పరుగెత్తి మండపాన్ని సమీపించాడు.

ఆ మండపాన్ని చూడగానే క్రితంసారి ద్వారక వచ్చినప్పుడు ఇదే మండపం నుండి శ్రీకృష్ణులవారి ప్రసంగాన్ని విన్నాడు. ఇదేచోట వసంతోత్సవంలో గోపికలతో కోలాటమాడిన శ్రీకృష్ణ ప్రభువుని చూశాడు. ఎంతలో ఎంత మార్పు. విధిని ఆ దైవం కూడా తప్పించుకోలేదేమో. చరక్ కనులవెంట బొటబొటా పొంగుతున్న కన్నీరు వాననీటిలో కలిసిపోతోంది.

ఒక్కక్షణం అక్కడ ఆగి ముందుకు పోబోతుండగా సమీపంలో ఎక్కడో అశ్వం సకిలించిన శబ్దం ఒకటి బిగ్గరగా విన్పించింది.

ఈ సమయంలో ఇక్కడ అశ్వమా... ఎత్తిన పాదాన్ని ఎత్తినట్టే దించి కళ్ళు చికిలించి చుట్టూ చూశాడు. కొద్దిక్షణాల్లోనే వర్షంలో తడుస్తూ మండపాన్ని సమీపిస్తూ కనిపించిందో గుర్రం. దాన్ని చూడగానే చరక్ హృదయస్పందన ఒక్కసారిగా హెచ్చింది.

ఇది అలనాటి తన నేస్తం తన అశ్వం కళ్యాణికాదు గదా! అదిప్పుడు ముసలిదైపోయి ఆలనాపాలనా చూసేవాళ్ళు లేక అనాధలా నగరంలో తిరుగుతోందని విన్నాడు. తన నగర సంచారంలో పగటిపూట ఎక్కడా అది కనబడలేదు. సందేహనివృత్తికోసం ఒకప్పటి తన అలవాటైన ఈలను బిగ్గరగా వేశాడు.

అంతే. ఆ ఈల చెవులబడిన మరుక్షణం ఆనందంతో కదంతొక్కుతూ చరక్ ముందుకు దూసుకొచ్చేసిందా కాలాశ్వం. చరక్ సందేహం తీరిపోయింది. అది తన అశ్వమే. కళ్యాణి అది వస్తూనే యజమానిని చూస్తూ ఆనందంతో అతడి చేతులను ముఖాన్ని తాకింది.

దాని ప్రేమను చూస్తూ వుంటే చరక్‌కి దుఃఖం ఆగలేదు.దాని మెడను కౌగిలించుకొని ముద్దాడుతూ చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు చరక్.

"నన్ను క్షమించు... కళ్యాణి. నిన్ను అనాధలా ద్వారకలో వదిలేసి, నా దారిన వెళ్ళిపోయిన పాపిని. ఈ దుర్మార్గుడిని క్షమిస్తావా" అంటూ వేడుకున్నాడు.

అశ్వానికి ఏమర్ధమయిందోగాని ఉత్సాహంగా ముందు కాళ్ళులేపి పెద్దగా సకిలించింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే అశ్వానికి జీను కళ్ళాలు అలాగే ఉన్నాయి. వీటితోనే ఇంతకాలం ఇది సంచరిస్తోందా! ఏమో ఆలోచించే సమయం లేదు. "కళ్యాణీ, తెల్లవారితే నగరం మునిగిపోబోతోంది. నువ్విక్కడ ఉండటం క్షేమంకాదు. వెళ్ళిపోదాం పద... తెల్లవారేలోపలే మనం తీరానికి వెళ్ళిపోవాలి పద" అంటూ చెంగున ఎగిరి గుర్రం మీద కూచుని కళ్ళాలు అందుకున్నాడు.

అంతే... ఒక్కసారిగా నాలుగు కాళ్ళమీద దౌడు ఆరంభించింది కళ్యాణి. గాఢాంధకారం. కనులు చించుకున్నా ఏదీ కన్పించని చిక్కటి కారుచీకటి. మెరుపుల కాంతులే చరక్‌కు దారిచూపిస్తున్నాయి. ప్రధాన రాజమార్గం గుండా కళ్యాణి శక్తిమేరకు వేగంగా పరుగుతీస్తోంది. క్రమంగా నగరాన్ని పరివేష్టించి వున్న ప్రాకారాల వాకిళ్ళు ఒక్కటొక్కటిగా వెనక్కుపోతున్నాయి. అదే సమయంలో తూర్పు గగనాన మబ్బులమీద పల్చటి కాంతులిచ్చుకొంటూ ఉదయకాలాన్ని సూచింప నారంభించాయి.

సరిగ్గా అప్పటికి నగర వాకిళ్ళన్నీ దాటి క్రమంగా మొదటి ప్రాకార వాకిలిని చేరుకున్నాడు చరక్. అశ్వాన్నాపకుండా రాతిబాటమీదకు దూకిస్తూ ఎగువకు దృష్టి సారించాడు. తూరుపు తెలతెలవారుతోంది.

సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలతాకిడికి అప్పటికే రాతిబాట అక్కడక్కడా కొంతమేర కొట్టుకుపోగా కొన్నిచోట్ల బీటలు వారింది. బాట ఎగువన తీరంలో సముద్ర నారాయణుని ఆలయ శిఖరాన్ని చూడగలుగుతున్నాడు.

తీరం మీద తన ధవళాశ్వం మీద అటూ ఇటూ తిరుగుతూ వచ్చినవాళ్ళని వచ్చినట్టు తీరం మీద సురక్షితమైన ఎగువ ప్రాంతానికి పంపించేస్తున్నాడు అర్జునుడు. ఎగువ ప్రాంతమంటే అది తీరానికి కిలోమీటరు దూరం ఎగువన ఎత్తైన ప్రాంతం.

తను తొలిసారి ద్వారక వచ్చినప్పుడు సరిగ్గా ఎక్కడ నిలబడి ద్వారక అందాలను వీక్షించాడో ఆ ప్రాంతం. ఇప్పుడక్కడ జనసందోహం కన్పిస్తోంది.

నగరవాసులంతా తమ వాహనాలు వెంటతెచ్చుకున్న సొత్తుతో దుఃఖితులయి ద్వారక ఉన్న దీవిని చూస్తూ నిలబడున్నారు. చివరిగా వస్తున్న బృందాన్ని అప్పుడే తీరంమీదకు పోతూండటం గమనించాడు చరక్. ఇక ఎంతో సమయం లేదని అర్థమైపోతోంది. ఏ క్షణంలోనైనా ద్వారక మునిగిపోవచ్చు.

అశ్వాన్ని మరింతగా అదలిస్తున్నాడు. శక్తినంతా కూడదీసుకుని వాయు వేగంతో పరుగుతీస్తోందా అశ్వం. అంతలో ఒక రాక్షస అల బలంగా తాకటంతో రాతిబాట కొన్ని గజాలమేర ఒక్కసారిగా కొట్టుకుపోయింది. అయితే కళ్యాణి తన నాలుగు కాళ్ళమీద లేచి ఆ దూరాన్ని సునాయాసంగా అధిగమించి అవతలి బాటవెంట తిరిగి దౌడు ఆరంభించింది.

తిరిగిచూసిన చరక్‌కి అప్పటికే తను వచ్చినబాట మొత్తం సముద్రంలోకి కృంగిపోవటం కన్పించింది. ద్వారకకు మార్గం శాశ్వతంగా మూసుకుపోయింది చూస్తుండగానే... తీరంమీది జనసందోహం తనను గమనించినట్టున్నారు. త్వరగా వచ్చేయమంటూ బిగ్గరగా కేకలేస్తున్నారు. హోరున వర్షంలో నిలువునా తడుస్తున్నా తమ ప్రాణానికి ప్రాణమైన ద్వారకను చివరిసారిగా చూసి వేడి నిట్టూర్పులు విడుస్తూ నిలబడున్నారంతా.

అశ్వం కళ్యాణి శక్తివంచనలేకుండా శరవేగంతో తీరంవైపు దూసుకు వచ్చేసింది. చాలా దగ్గరగా వచ్చేసింది. ఇంతలో ఒక రాకాసి అల నేరుగా అశ్వం దిశగా ఎగసివచ్చింది.

అది అంత బలంగా తాకిందంటే దాని తాకిడికి బాటచివరి నాలుగు గజాల దూరం ఒక్కసారిగా కుప్పకూలిపోగా అశ్వం నీటిలోకి జారిపోయింది.

గుర్రంమీది చరక్ ఎగిరి తీరం వంచన రాళ్ళను పట్టుకుని గాల్లో వేలాడు తుండిపోయాడు. తలతిప్పి చూస్తూ "కళ్యాణీ!" అంటూ బాధగా అరిచాడు.

అశ్వం ఎటుకొట్టుకుపోయిందో దాని జాడలేదు. చరక్ మనసు బాధతో విలవిల్లాడింది.

"నిన్ను దక్కించుకోలేకపోయిన అభాగ్యుడిని కళ్యాణీ. నీ విశ్వాసం మర్చిపోలేనిది. నన్ను క్షమించు!" అనరిచాడు. అంతేకాదు, కనుచూపు దూరంలో కల్లోల సముద్రమే కన్పిస్తోంది. ఇటు దూరంగా ఓడరేవులోని ఓడలు తలో దిశగా కొట్టుకుపోతున్నాయి. ఎగువన ద్వారక దీవిలో కదలిక కన్పిస్తోంది.

తూర్పున మబ్బులు తొలగి సూర్యోదయమవుతోంది. అదే క్షణంలో దీవి కృంగిపోతూండగా ద్వారకాపురి అక్కడి అందమైన భవంతులు, కోటలు, పేటలు అన్నీ కృంగిపోనారంభించాయి చూస్తూండగానే.

ద్వారకవీధుల్లో సముద్రజలాలు సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్నాయి. తీరం మీదున్న ద్వారక వాసులు హాహాకారాలు చేస్తున్నారు. వారి ఏడుపులు, రోదనలు చరక్ చెవులను సోకుతున్నాయి.

రాళ్ళను పట్టుకు వేలాడుతూ పైకి ఎక్కడానికి చేసిన అతడి ప్రయత్నం ఫలించకపోగా ఇంతలో తాటిచెట్టు ప్రమాణంలోని ఒక రాక్షస అల సూటిగా తీరానికి తనవైపే రావడం చూసి అదిరిపడ్డాడు చరక్. అప్పుడు గాని తన కర్తవ్యం గుర్తురాలేదు. ఇక్కడ తనకింకేంపని? వచ్చిన పనైపోయింది. వెళ్ళిపోవచ్చుగా.

ప్రమాదం మీదపడకముందే వెళ్ళిపోవాలి. ఆ విపత్కర పరిస్థితిలో తక్షణం కళ్ళుమూసుకుని మణిభద్రయక్షుని తలుచుకున్నాడు. "ఓ త్రికాల సంచారా మణిభద్రా! ఇక నాకిక్కడ పనిలేదు. తక్షణం నన్ను నా నిజశరీరానికి చేర్చు" అని వేడుకున్నాడు.

అంతే– వేడుకున్న మరుక్షణం అక్కడ రాళ్ళంచుని పట్టుకుని వేలాడుతున్న చరక్ అదృశ్యంకావటం అదే సమయంలో రాక్షస అల తీరాన్ని తాకటం అలవెంట లేచిన ఒక భయంకరమైన రాతి మొసలి కూడా అక్కడికి చేరటం అంతా ఏక కాలంలో జరిగిపోయాయి.

ఆ రాతి మొసలి ఎవరో కాదు. చరక్‌ను అంతం చేయతలపెట్టిన కలి పురుషుడు. కన్ను మూసి తెరిచేలోపు ఇపుడు చరక్ ఆత్మ యధాప్రకారం కారుచీకట్లలో తిరుగు ప్రయాణంలో ఉంది. అతని చెవులకు వెనకనుండి సముద్ర హోరు తరుముకొస్తున్నట్టు వినబడుతూనే ఉంది.

* * * * *

రంపచోడవరం అడవులు...

పగటి సమయం... మరిడి సోమయ్య ఇతర మాంత్రిక మహాశయులు విడిదిచేసిన క్యాంపు ప్రశాంతంగా ఉంది. కొందరు క్షుద్రపూజల్లో మునిగుండగా

కొందరు తిని తాగుతూ కబుర్లలో మునిగివున్నారు. వాళ్ళ శిష్యశ్రేణులు చాలా హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఆ క్యాంప్‌కు కొంత దూరంలో ఒక శాలివృక్షఛాయలో మరిడి సోమయ్య ముఖ్య శిష్యులు అయిన విళంబి, మృణాళుడు ఇద్దరూ ఒక రాతి తిన్నెమీద చాలా ప్రశాంతంగా కూర్చుని వున్నారు.

మరిడి సోమయ్య అప్పటికింకా తన గుడారంలోంచి బయటకు రాలేదు. "ఏంట్రూ విళంబీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" చాలాసేపటిగా అతడ్నే గమనిస్తున్న మృణాళుడు ఇక ఉండబట్టలేక అడిగాడు.

తలవిదిలించి నిర్లిప్తంగా చూశాడు విళంబి. "నాకు ఎందుకో ఇది సరి కాదనిపిస్తోందిరా" అన్నాడు తదేకంగా క్యాంప్‌లోకే చూస్తూ.

మృణాళుడికి అర్థంకాలేదు. "ఇప్పుడేది సరికాదు అంటావ్?" అని వెంటనే అడిగాడు.

"ఇదే గురువుగారు వీళ్ళనందర్నీ గొర్రెల మందలా వెంటేసుకుని ఇక్కడికి రావటం. ఇలా క్యాంప్ వేసుకుని నిరీక్షించడం. ఇదంతా సరికాదనిపిస్తోంది"

"మనమనుకుంటే సరిపోయిందా? గురువుగారూ అనుకోవాలిగదా"

"నాకు తెలీక అడుగుతాను. మనకి ఇక్కడ ఏం పనిరా? ఏం సాధించాలని గురువుగారి ఉద్దేశ్యం? ఇంతకాలం ఏమీ చేయలేకపోయిన మనంగాని, వచ్చిన ఆ మాంత్రికవర్యులుగాని ఏమన్నా సాధించగలమన్న నమ్మకం ఉందా?"

"లేదు విళంబీ. ఏం చేయలేం. ఆ సంగతి నాకూ తెలుసు. ఒకరు, ఇద్దరు కాదు. ముగ్గురు శక్తిమంతులు. అగ్నివేశాచార్యుడు, ఆ ద్వారకాసుందరి మిత్రవింద, అఘోరా.

ముగ్గురూ ఉండగా చరక్‌ను ఏం చేయలేం. ధర్మసంస్థాపననీ ఆపలేం. అఘోరాను దూరం చేసుకోవడం గురువుగారు చేసిన అతి పెద్దతప్పు. ఆ ముగ్గురి ధాటికి అంతటి మహిషుడే చిత్తయి వెళ్ళిపోయాడు. అయితే మనం ఎందుకు వచ్చామంటే తగిన కారణం ఉంది.

మనం ఏమీచేయలేమని, మన ప్రయత్నాలన్నీ విఫలమయినాకేగదా గురుడు మహాయాగంతో కలిపురుషుని ప్రసన్నం చేసుకుని వాళ్ళపైకి పురికొల్పాడు?

ఇది చివరి ప్రయత్నంకాబట్టి కలి ఏం చేయబోతున్నాడు "అగ్ని వేశాచార్యుడు తలపెట్టిన ధర్మసంస్థాపనని ఎలా భగ్నం చేస్తాడు"

ఆ విశేషాలు చూడ్డంకోసమే ప్రధానంగా మనం ఇక్కడికి వచ్చాం. మరోపక్క ద్వారకనుంచి చరక్ తెచ్చే అమూల్యమైన వస్తువుల్ని గద్దలా తన్నుకు పోవాలని ఆ శంభులింగ మహాపాత్రో కూడా మరాణాయుధాలతో తన మనుషుల్ని వెంటబెట్టుకు వచ్చి ఇక్కడ కాచుకునున్నాడు.

చూద్దాం క్షుద్ర, దైవప్రయత్నం ముందు మానవ ప్రయత్నం గెలుస్తుందా ఓడుతుందా. నా సందేహం నిజమైతే ఈ పాటికి కలిపురుషుడు ద్వారకలోనే చరక్‌ను చంపేసివుంటాడు. చరక్ తిరిగివచ్చే అవకాశం లేదు" అంటూ వివరించాడు మృణాళుడు. ఈ విశ్లేషణ విళంబికి నచ్చలేదు.

"అది ఎలా సంభవం...? కలియుగాధిపతి కలి, ద్వాపరయుగంలోకి ఎలా ప్రవేశిస్తాడు?" అంటూ సందేహం వెలిబుచ్చాడు విళంబి.

"ఓరిపిచ్చోడా!" అంటూ నవ్వాడు మృణాళుడు.

"కలియుగంలోని మానవుడు చరక్. వాడే ద్వాపయుగంనాటి ద్వారకకు వెళ్ళిరాగాలేనిది క్షుద్రదేవుడయిన కలి వెళ్ళిరాలేడా? దేవుళ్ళకి అసాధ్యాలు ఉండవు" అన్నాడు.

"అంతేనంటావా? సరి చూద్దాం. నాకెందుకో చరక్ క్షేమంగా తిరిగొస్తా డనిపిస్తోంది" అన్నాడు విళంబి.

ఇంతలో మరో శిష్యుడు వచ్చి గురువుగారు పిలుస్తున్నారు అని చెప్పడంతో వాళ్ళ సంభాషణ అంతటితో ఆగిపోయింది. ఇద్దరూ రాతి తిన్నె దిగి గూడారాలవైపుగా వెళ్ళిపోయారు. మరికొద్ది సేపటికే మాంత్రికులు అంతా అగ్ని వేశాచార్యుని స్థావరంవైపు గుంపుగా బయలుదేరారు.

* * * * *

జర్నలిస్టు భీష్మనారాయణ. ప్రస్తుతం అతనికి రంపచోడవరం అడవులు తప్ప మరో వ్యాపకం అంటూ లేకుండాపోయింది.

రాత్రికి కోరుకొండ ఇంటికెళ్ళిపోయి ఉదయమే తిరిగి అడవిలోకి వచ్చేస్తున్నాడు. అతను చాలా విషయాలు సేకరించగలిగినా అగ్నివేశాచార్యుని

మీద గౌరవంతో మొత్తం సమాచారాన్నింకా పత్రికలకు పంపించలేదు. ఇబ్బంది కల్గించని విశేషాలవరకే పంపించాడు.

ఇంతవరకు స్థావరం లోపలికి వెళ్ళి అగ్నివేశాచార్యుని కలుసుకునే ప్రయత్నం చేయలేదు.

ఈ పరిస్థితుల్లో నిన్న శంభులింగ మహాపాత్రోను కలవటంతో అనేక సందేహాలకు సమాధానాలు లభించాయి. ముఖ్యంగా ధర్మసంస్థాపనకు నడుం బిగించింది వేరెవెరో కాదు. మరిడి సోమయ్య మాంత్రికుల సదస్సులో చెప్పింది నిజం.

అగ్నివేశాచార్యుడి సంకల్పమే ధర్మసంస్థాపన. తన మునిమనవడు అయిన చరక్ ద్వారా సాధించాలని చూస్తున్నాడు. వాళ్ళంతా అందుకే అడవిలోకి స్థావరానికి వచ్చారు. శంభులింగ మహాపాత్రో మాటలు మొదట నమ్మలేక పోయాడు.

కాలంలో వెనక్కి వెళ్ళి నాటి ద్వారకాపురి చేరటం ఏమిటి అభూతకల్పనను కున్నాడు. కాని మిత్రవిందను చూసివున్నాడు గాబట్టి నమ్మకతప్పలేదు. అదే నిజమైతే కాలనాళిక మందసంద్వారా చరక్ ఆ కాలానికి వెళ్ళిపోయి ప్రస్తుతం నాటి ద్వారకలో ఉండాలి.

అయితే ఎప్పుడు తిరిగివస్తున్నాడు? ఏం జరగబోతోంది? అసలా కాలనాళిక మందసం అనేది ఎలా ఉంటుంది అనే సందేహాలు భీష్మనారాయణను ప్రశాంతంగా ఉండనీయటంలేదు.

అందుచేత ఈ రోజు ధైర్యంచేసి అగ్నివేశాచార్యుని కలిసే ఉద్దేశంతో తన బైక్‌ను అడవిలో నేరుగా స్థావరం దిశగా పోనిచ్చాడు. అతను వెళ్ళే సరికి ఏదో పనిమీద బైటికొస్తున్న డ్రైవరు కాశీ, అప్పన్నలు ఎదురయ్యారు. భీష్మ నారాయణ వాళ్ళకి తెలుసు.

ఆ మధ్య ఎస్టేట్ భవంతికి వచ్చినప్పుడు చూశారు. కాని ఇక్కడ కలవటానికి ఆచార్యుడు ఏమంటాడో తెలీదు. భీష్మనారాయణ అభ్యర్థనమేరకు అప్పన్న లోనకు వెళ్ళి కాస్సేపటికి తిరిగివచ్చాడు.

"మీ అదృష్టం సార్... మిమ్మల్ని తీసుకురమ్మన్నారు రండి" అంటూ భీష్మనారాయణని లోనకు తీసుకునివెళ్ళాడు అప్పన్న.

"ఏంటోయ్ భీష్మనారాయణా! నిజంగా నువ్వు భీష్ముడిలాంటివాడివే సుమా... అడవిలో కొచ్చినా నన్నొదలవా?" అని అంటూ అగ్నివేశాచార్యుడు అడుగుతూంటే–

"ఎంత మాట స్వామీ. మీ ముందు నేను ఎంత. అల్పుడ్ని. నన్ను ఆశీర్వదించండి" అని వస్తూనే వినమ్రుడై పాదాభివందనం చేశాడు భీష్మ నారాయణ.

"లే నాయనా. ఈ నీ వినయవిధేయతలే నీపట్ల నాకు వాత్సల్యం కలిగిస్తున్నాయి. రా. అలా కూర్చో" అని అంటూ ఒక సోఫాలో తను కూర్చుని ఎదురుగా సోఫా చూపించాడు అగ్నివేశాచార్యుడు.

ఆ సమయంలో తన పూజామందిరం బయట హాల్లోనే ఉన్నాడాయన. మిగిలిన అందరూ తలోచోట ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

* * * * *

స్థిమితంగా కూర్చున్నాక భీష్మనారాయణని చూస్తూ– "ఊరకే రారు పత్రికలవాళ్ళని... ఏమిటబ్బాయ్ విశేషం. నన్ను వెదుక్కొంటూ అడవిలోకొచ్చావ్?" అని ప్రశించాడు అగ్నివేశాచార్యుడు.

నిజానికి అగ్నివేశాచార్యుని సముఖానికి ధైర్యంగా రావటం వచ్చేశాడుగాని ఎలా ఆరంభించాలో తెలీక మనసులోనే మల్లగుల్లాలు పడుతున్నాడు భీష్మ నారాయణ. అగ్నివేశాచార్యుని ప్రశ్న అతడి మార్గాన్ని సుగమం చేసినట్టయింది.

"కారణం ఉంది స్వామీ. మీరు నన్ను క్షమించాలి. నేను అడవిలోకి రావడం ఇదే మొదటిసారి కాదు. ఆ రోజు మీరంతా వాహనాల్లో బయలుదేరి రావడం చూసి మిమ్మల్ని అనుసరిస్తూ ఇక్కడికి వచ్చాను" అంటూ ఆరంభించి జరిగిందంతా అగ్నివేశాచార్యునికి వివరించాడు భీష్మ నారాయణ.

ఎంతో ఆసక్తిగా విన్నాడు అగ్నివేశాచార్యుడు.

"స్వామీ! మాంత్రికుడు మరిడి సోమయ్య సుమారు ఏభైమంది మాంత్రికులు, వారి శిష్యులతో కూడిన బృందంతో తరలివచ్చి ఇక్కడికి వాయవ్య దిక్కులో క్యాంప్ వేసి ఉన్నాడు.

అలాగే ఒరిస్సాకు చెందిన ఎమ్.పి. శంభులింగ మహాపాత్రో పాతికమంది కరడుగట్టిన గూండాలతో వచ్చి ఇక్కడికి నైరుతిదిక్కుగా కిలోమీటరు దూరంలో క్యాంప్‌వేసి ఉన్నాడు.

వాళ్ళ దగ్గర మారణాయుధాలే కాదు, రివాల్వర్లు మెషిన్ గన్లు కూడా ఉన్నాయని సందేహం.

నాకు తెలీని చాలా విషయాలను శంభులింగ మహాపాత్రో నాతో చెప్పాడు. శంభులింగ మహాపాత్రో ధర్మసంస్థాపనను నమ్మడం లేదు.

మరిడి సోమయ్య విశ్వసిస్తున్నాడు. దుష్టులయిన వీళ్ళందరి మూలంగా మీకే హాని జరుగుతుందోనన్న భయం నన్ను రాత్రంతా నిద్రకు దూరంచేసింది.

స్వామీ. మీరు చూస్తే మీ స్థావరంలో ప్రశాంతంగా ఉన్నారు. బయటి ప్రమాదకర పరిస్థితులు మీకు తెలుసా?" అనడిగాడు.

"తెలుసు" అన్నాడు చిన్నగా అగ్నివేశాచార్యుడు.

"తెలిసికూడా వాళ్ళనలా ఎందుకొదిలేశారు స్వామీ. వాళ్ళనుంచి ఏ సమస్యలూ రావా? వాళ్ళనుంచి ఎలాంటి ప్రమాదం ఉండదా?" ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు భీష్మనారాయణ.

"ప్రారబ్ధకర్మ. ఆ కర్మఫలాలు వారి వారి భవిష్యత్తును నిర్దేశిస్తాయి నాయనా. మన చేతుల్లో ఏముంది? దీపాన్ని చుట్టిన శలభాలు ఆ దీపం వేడికి మాడిపోతాయి. కాని దీపం నిలిచేవుంటుంది. ఒక్కోసారి శలభాల తాకిడికి దీపం కూడా ఆరిపోతుంది. జీవితాలూ అంతే. ఎవరి స్వార్థం వారిది. ఎవరి కోరికలు వారివి. అవి తమను ఎక్కడికి తీసుకుపోతున్నాయో వాళ్ళకే తెలీదు.

ధర్మం తప్పిన వారి గతి అధోగతేనని వారికి తెలీదు. మనమెందుకు ఆందోళన చెందాలి? అంతా ఆ ద్వారకాధీశుడే చూసుకుంటాడు" అంటూ తన దైన శైలిలో బదులిచ్చాడు అగ్నివేశాచార్యుడు.

లోతుగా ఆలోచిస్తే– ఆయన మాటల్లో భీష్మనారాయణకి అనేక అర్థాలు గోచరిస్తున్నాయి. "స్వామీ! ధర్మసంస్థాపన జరగాలని ఆశిస్తోంది, అందుకు నడుం బిగించి కృషిచేస్తోంది మీరేనని నాకిప్పుడు అర్థమైపోయింది.

ప్రస్తుత సమాజపోకడ మారాలని ఆశించే వాళ్ళలో నేనూ ఒకడ్ని. ధర్మ సంస్థాపన వలన మనుషులు మారతారంటారా? తమ అవినీతిని, అక్రమాలను, అధర్మాలను వదిలి ధర్మమార్గంలోకి వస్తారంటారా?" అమాయకంగా ప్రశ్నించాడు భీష్మనారాయణ.

ఆ ప్రశ్న విని చిన్నగా నవ్వాడు అగ్నివేశాచార్యుడు. "మారతారని నువ్వనుకుంటున్నావా? అసంభవం. ఒక్కసారి నరమాంసభక్షణకు అలవాటుపడిన పెద్ద పులి ఇక రోజూ మనుషుల్ని వేటాడి చంపి తింటూనే వుంటుంది.

డబ్బు సంపాదన... అదే మార్గాల్లో సంపాదించినా సరే... అలాగే ఈనాటి ఎమ్.ఎల్.ఏ.లు, ఎం.పీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, గుత్తేదార్లు, పారిశ్రామికవేత్తలు,

లంచగొండి ఉద్యోగస్తులు డబ్బు, అధికారం రుచి మరిగాక తమ అలవాటెందుకు మార్చుకుంటారు? వాళ్ళను శిక్షించి మనుషుల్ని రక్షించడం తప్ప మరో మార్గం లేదు.

మానవసమాజానికి పట్టిన చీడపురుగులు వీళ్ళు. వాళ్ళు మారరు. మార్చలేం. వాళ్ళకి మరణమే గతి.

ధర్మసంస్థాపనంటే ధర్మాన్ని నిలబెట్టడం కోసం అధర్మాన్ని అంతం చేయడం. దుష్టులు, దుర్మార్గులు అంతా అంతమైపోతారు. వారి వినాశనంతో పుడమికి పాపభాగం తగ్గుతుంది. ధర్మవర్ధనులైన పుణ్యాత్ములు సుఖశాంతులతో జీవిస్తారు" అంటూ వివరించాడు.

ఆ వివరణ వింటుంటే ఎందుకో– భీష్మనారాయణ వెన్ను జలదరించింది.

అగ్నివేశాచార్యుల మాటలు యదార్ధమైతే ఊళ్ళకు ఊళ్ళు సగం జనాభా అంతరించిపోతారు.

భయంకర విలయం తప్పదు. కాని అదెలా సంభవం? ఈ ధర్మ సంస్థాపన ఎలా జరుగుతుంది? ఎలా అనే ప్రశ్నను అలా గొంతులోనే మింగేశాడు భీష్మనారాయణ.

ఇంకా లోతుగా తరచి అడిగి తెలుసుకోవడానికి ధైర్యం చాల్లేదు. కాని మరో ముఖ్యమైన విషయం గుర్తొచ్చి అగ్నివేశాచార్యుని వంక చూశాడు.

"స్వామీ దేశంలో అనేకచోట్ల దుశ్శకునాలు పొడచూపి జనంలో భీతి కలిగిస్తున్నాయి.

ఊళ్ళ బయట తెల్లకాకులు కారాడుతున్నాయని, పట్టపగలే గుడ్లగూబలు సంచరిస్తున్నాయని, పట్టపగలే కుక్కలు ఆకాశం వంక చూసి ఏడుస్తున్నాయని ఇలా అనేక విపరీతాలను గూర్చి రోజూ పేపర్లలో వార్తలు చూస్తున్నాము.

మీరు తలపెట్టిన ధర్మసంస్థాపనకు, వీటికి ఏదైనా సంబంధం ఉందంటారా?" అనడిగాడు.

పెదవి విరిచాడు అగ్నివేశాచార్యుడు. "ఏవైనా విపరీతాలు, ఘోరాలు జరిగే ముందు సహజత్వానికి భిన్నంగా కొన్ని సూచనలు కన్పించడం సహజం. కాని వాటికి నేను తలపెట్టిన ధర్మసంస్థాపనకి సంబంధం ఉందోలేదో నేను ఇప్పుడే చెప్పలేను" అన్నాడు.

"స్వామీ! మీ సంకల్పం గొప్పది. మీ ఆశయం గొప్పది. మీ కృషి అనితర సాధ్యం. ఈ దేశక్షేమాన్ని ప్రపంచ క్షేమాన్ని కోరే మీరు ఈ విషయాలను ఇంకా దాచిపెట్టి వుంచటం మంచిదంటారా? మీ ధర్మసంస్థాపన లక్ష్యాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్ళాలిగదా. ముందే హెచ్చరిస్తే భయపడి కొందరయినా దుర్మార్గులు మారి సన్మార్గులు కావచ్చుగదా.

ధర్మం తప్పినవారు తిరిగి ధర్మాన్ని అనుసరింపవచ్చుగదా. ఆ పైన ప్రజల్లో మార్పు కోరే ధర్మవర్తనులయిన సజ్జనుల సపోర్ట్ మనకుంటుంది. మీరు పర్మిషనివ్వండి స్వామీ. పత్రికాముఖంగా మీ ఆశయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత నాది. ఏమంటారు?"

భీష్మనారాయణ ప్రతిపాదన వింటూ– కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని– దీర్ఘంగా ఆలోచించాడు అగ్నివేశాచార్యుడు. చివరకు కళ్ళు తెరిచి భీష్మనారాయణని చూస్తూ– "నువ్వు చెప్పింది బాగానే వుంది భీష్మా. కాని ఇప్పుడు కాదు. ఇవాళకి సరిగా అయిదో రోజునుండి నువ్వా పనిలో ఉండు.

అలా చేస్తానంటేనే అనుమతిస్తాను. ఈలోపల నా ప్రయత్నం ఏమేర సఫలమైందో కూడా మాకు తెలుస్తుంది" అన్నాడు అగ్నివేశాచార్యుడు.

"మీరు ఎలా చెప్తే అలాగే చేస్తాను స్వామీ. అనుమతించారు ధన్యుడ్ని. నాదో చిన్న కోరిక"

"అడుగు. ఏమిటది?"

"ఒక్కసారి కాలనాళిక మందసాన్ని దర్శించే అదృష్టాన్ని ప్రసాదించండి. పరవాలేదనుకుంటే ఒక్క ఫోటో తీసుకుంటాను.

ఐదు రోజుల తర్వాతే ఆ ఫోటోని బయటపెడతాను. నన్ను నమ్మండి."

భీష్మనారాయణ కోరిక విని ఒక్కక్షణం తటపటాయించినప్పటికీ చివరకు అంగీకరిస్తూ లేచి– "నాతోరా" అంటూ కాలనాళిక మందసం ఉన్న హాలు చివరిగది వైపు దారితీశాడు అగ్నివేశాచార్యుడు.

అతన్ని అనుసరించాడు భీష్మనారాయణ.

కాలనాళిక మందసం పక్కనే– దిగాలుగా నిలబడుంది శుశ్రుత. గ్లాస్‌డోమ్ లోపల నిద్రపోతున్నట్టు పడుకునున్న తన భర్త చరక్ వంకే చూస్తూ మాటిమాటికీ చెమరిస్తున్న కళ్ళు తుడుచుకొంటూ తనలో తను బాధపడుతోంది. ఆ విశాలమైన గదిలో శుశ్రుత, మిత్రవిందలతోబాటు అఘోరా, డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు, శివరామ ముకుంద పాత్రుడు అంతా అక్కడే ఉన్నారు.

సుశ్రుత దుఃఖం చూస్తుంటే అందరికీ బాధగానే ఉంది. చిన్నవయసు. భర్తకోసం బెంగటిల్లి బాధపడ్డంలో ఆశ్చర్యం లేదు.

పక్కనే మిత్రవింద ఉంది గాబట్టి పెద్దలెవరూ శుశ్రుతను ఓదార్చే ప్రయత్నం చేయడంలేదు.

"అక్కా! ఎందుకే బాధపడతావ్. చరక్ క్షేమంగా వస్తాడు. నువ్విలా బాధపడటం అనవసరం కదూ" అంటూ పక్కకొచ్చి శుశ్రుతను ఓదార్చింది మిత్రవింద.

"అది కాదక్కా! ఎప్పుడూ హుషారుగా తిరిగేవాడు ఇలా చలనం లేకుండా పడుంటే చూళ్ళేకపోతున్నాను" అంది రుద్ధకంఠంతో శుశ్రుత.

"అందుకని ఇలా బాధపడతావా! నీకు తెలుసా? ద్వారక నుంచి చరక్ వెంట వచ్చినప్పుడు ఇదే మందసం నుండి తనతోబాటు నేనూ బయటికొచ్చాను. కంగారుపడాల్సిందో, బాధపడాల్సిందో ఏమీ లేదు. ఇప్పుడో కాస్సేపటికో చరక్ తిరిగొచ్చే సమయమైంది. రా, కళ్ళు తుడుచుకో" అంటూ శుశ్రుతను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్ళింది మిత్రవింద.

సరిగ్గా ఇదే సమయంలో అగ్నివేశాచార్యుడు, జర్నలిస్టు భీష్మనారాయణను వెంటబెట్టుకుని ఆ గదిలోకొచ్చాడు. అక్కడంతా ముభావంగా ఉండటం గమనించి "ఏమైంది?" అనడిగాడు.

"ఏం లేదు ఆచార్యా... పాపం శుశ్రుతకి కొత్తగదా. చరక్‌ని చూసి బాధపడుతోంది" అన్నాడు నవ్వుతూ డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడు.

అగ్నివేశాచార్యుడు మందహాసంతో దగ్గరకెళ్ళి శుశ్రుత తల నిమిరి వాత్సల్యంగా కళ్ళలోకి చూశాడు. "పిచ్చితల్లీ. ఎందుకే బాధపడతావ్. నీ భర్త అజేయుడు. క్షేమంగా తిరిగివస్తాడు. సంతోషించాల్సిన సమయం. విచారించ కూడదు.

మేమంతా ఉండగా నీకెందుకు భయం. అమ్మా మిత్రా... కాస్సేపు శుశ్రుతని అలా బయటతిప్పి తీసుకురా. కాస్త తేరుకుంటుంది" అన్నాడు.

"వద్దు జేజి తాతయ్యా. నేను బాగానే ఉన్నాను. ఇక్కడే ఉంటాం" అంది కళ్ళు తుడుచుకుంటూ శుశ్రుత. అగ్నివేశాచార్యుడు, భీష్మనారాయణని దగ్గరకు పిలిచాడు. కాలనాళిక మందసాన్ని అది పనిచేసే విధానాన్ని క్లుప్తంగా వివరించాడు.

మందసంలోని చరక్ శరీరాన్ని చూసి భీష్మనారాయణ విభ్రాంతి చెందాడు. చరక్ ఆత్మ ప్రస్తుతం ద్వారకలో సంచరిస్తుంటుందని ఊహించుకొంటూ అగ్ని వేశాచార్యుని అనుమతితో కాలనాళిక మందసాన్ని, దాని వెనుక గోడకు బిగించబడి ఎరుపు, నీలిరంగు కాంతులు ప్రసరిస్తున్న పెద్ద అద్దాన్ని ఫోటోలు తీసుకున్నాడు. అలాగే మందసంలో నిద్రపోతున్నట్టున్న చరక్‌నూ ఫోటోలు తీసుకున్నాడు.

అగ్నివేశాచార్యుడు అఘోరాలు సోఫాలో కూర్చున్నారు. మిగిలిన అందరూ నిలబడే వున్నారు. భీష్మనారాయణ తన పని ముగించుకొని అగ్నివేశాచార్యుని ముందుకొచ్చి ఏదో చెప్పబోయాడు. అప్పుడు... సరిగ్గా అప్పుడు జరిగిందా అద్భుతం. "వచ్చేస్తున్నారు. చరక్ సార్ వచ్చేస్తున్నారు" అనరిచాడు, అప్పుడే లోనకొచ్చిన అప్పన్న.

అప్రయత్నంగా అందరిదృష్టి–

కాలనాళిక మందసం వెనుక అద్దంమీద పడింది... ఆ అద్దంలోంచి చరక్ ఆత్మ బయటికొస్తోంది.

అందరూ స్పష్టంగా చూడగలుగుతున్నారు.

తెల్లగా గాజులా మెరిసిపోతున్న చరక్ ఆత్మ అద్దంలోంచి బయటికొచ్చి మందసం మీదకు రావటం విభ్రాంతి చెందుతూ చూశారంతా.

ఆ ఆత్మ భుజాన ఒక గుడ్డసంచి వేలాడుతోంది. మందసం పైనుండి జారిన ఆత్మ లోపల నిద్రావస్థలో ఉన్నట్టున్న చరక్ భౌతిక శరీరం మీద నిలువునా పడుకొని అదృశ్యమైంది.

ఆ వెనకే చరక్‌లో చిన్న కదలిక. ద్వారకనుంచి తెచ్చిన గుడ్డసంచి ఇపుడతని భుజాన ఉంది.

అందరి దృష్టీ ఇటు కాలనాళిక మందసం మీద ఉండగా మిత్రవింద మాత్రం ఆందోళన నిండిన మనసుతో అద్దంవంక చూస్తోంది. ఏదో విపరీతం జరగబోతోందని ఆమె మనసు హెచ్చరిస్తోంది.

అదే సమయంలో– చరక్ తిరిగివచ్చినందుకు అగ్నివేశాచార్యుడు సంతోషంగా చూస్తున్నాడు. పక్కన అఘోరా దృష్టీ అటే ఉంది.

ఇక భీష్మనారాయణ అయితే తను చూస్తోంది కలో నిజమో తెలీనంత చిత్తభ్రాంతితో కన్నార్పడం మర్చిపోయాడు. చరక్ కదలడం చూడగానే శుశ్రుత అమితానందంతో మందసం వద్దకు పోబోయింది.

కాని మిత్రవింద చటుక్కున శుశ్రుత చేయిపట్టి ఆపింది.

ఆందోళన నిండిన గొంతుతో– "జేజి తాతయ్యా. ప్రమాదం ముంచుకొస్తోంది. జాగ్రత్తగా ఉండండి" అని పెద్దగా అరుస్తూ శుశ్రుతను పక్కకు లాక్కుపోయింది.

అదిరిపడి చూశారంతా.

ప్రమాదం ఎటునుంచి వస్తోందో ఎవరికీ అర్థం గాలేదు. మందసంలోని చరక్ అప్పుడే నెమ్మదిగా లేచి కూర్చుంటున్నాడు. ఇంతలోనే ముంచుకొచ్చేసిందా ప్రమాదం. కాలనాళిక వెనక గోడకు ఉన్న పెద్ద అద్దం ఒక్కసారిగా కిరకిరలాడింది.

అంతే భళ్ళున పగిలి ముక్కలు చెక్కలై పగిలిపోగా ఉప్పెనలా కొన్ని వందల గేలన్ల సముద్రజలం ఒక్క సారిగా అద్దం ఉన్న స్థానంలోంచి బయటకు దూకింది. ఎంతవేగంగా అంటే ఆ నీటి ఉధృతిలో గదిలోని అందరూ తడిసి ముద్దయిపోయారు.

అది కూడా కాదు. ఆ జలాలతోబాటే భయంకరంగా నోరుతెరచి బయటకు దూకిన రాతిమొసలిని చూసి అదిరిపడ్డారు. భయంతో కొయ్యబారి పోయారు. ఆ మొసలి, నీటితోబాటు ఎగసివచ్చి నేరుగా కాలనాళిక మందసం మీద పడింది.

దాని బరువుకి మందసం పగిలిపోయి లోపలి చరక్ నీటిలోపడి కొట్టుకెళ్ళి గోడను గుద్దుకున్నాడు. మందసాన్ని ధ్వంసం చేసిన రాతి మొసలి తలతిప్పగానే దాని కంటికి అగ్నివేశాచార్యుడు కన్పించాడు. ఆ మహనీయుని చూడగానే– మొసలికళ్ళు క్రోధంతో మరింత ఎర్రబారాయి.

ఎక్కడివాళ్ళక్కడ నిలబడి భయభ్రాంతులై నల్లటి ఆ క్రూరమకరాన్ని చూస్తున్నారు.

అసలు చరక్ వెనకే ఆ నీటి ప్రవాహం ఎలావచ్చింది. దాంతోబాటు ఈ మొసలి ఎలా వచ్చింది ఏమీ అర్థం గాక పిచ్చిపట్టినట్టు చూస్తున్నారంతా.

అగ్నివేశాచార్యుడైతే కాలనాళిక మందసాన్ని బాధాతప్త హృదయంతో చూస్తున్నాడు. అనేక సంవత్సరాల తన కృషి ఆ కాలనాళిక మందసం.

కళ్ళముందే ధ్వంసమైపోయింది. అక్కడున్నవాళ్ళలో ఆ నీరు ఎక్కడిదో తెలిసిన వాళ్ళు ముగ్గురే ముగ్గురు. ఒకడు చరక్, రెండోది మిత్రవింద, మూడో వ్యక్తి అగ్నివేశాచార్యుడు.

అలనాటి ద్వారకవద్ద పశ్చిమ సముద్రమైన రత్నాకరదధీ జలాలవి. అవి ఎలా చరక్‌ను అనుసరించి వచ్చాయో ఆ జలాల వెంట ఈ మొసలి ఎలా వచ్చిందో అంతటి అగ్నివేశాచార్యునికే అర్థంగాక చేష్టలుదక్కి చూస్తున్నాడు.

అవతల పగిలిన మందసంలోంచి కొట్టుకెళ్ళి గోడకు గుద్దుకున్న చరక్‌కి తలకి బలమైన గాయం తగిలి కొద్దిసేపు ఏం జరుగుతోందీ అర్థంగాని పరిస్థితిలో ఉండిపోయాడు. అంతా క్షణాలమీద జరిగిపోయిన సంఘటనలు.

కొద్దిక్షణాలు పగిలిన మందసంమీద ఆగిన ఆ రాతిమొసలి ఉన్నట్టుండి కదిలింది. ఒక్కసారిగా గాల్లోకి ఎగిరింది. గుహవంటి తన నోరు తెరిచి అగ్ని వేశాచార్యుని మీదికి రాసాగింది. ప్రమాదాన్ని అగ్ని వేశాచార్యుని కన్నా ముందే

పసిగట్టి "జేజితాతయ్యా, తప్పుకోండి" అనరిచింది మిత్రవింద. ఈలోపల– అఘోరా పరిస్థితి గ్రహించి తన మంత్రదండాన్ని కుడిచేతపట్టుకుని కుప్పించి గాల్లోకి ఎగురుతూ "జై రుద్రనాథా" అని బిగ్గరగా అరిచాడు. అగ్నివేశాచార్యుని తలను నోటచిక్కించుకోబోతున్న మొసలినోటికి అడ్డంపడ్డాడు. నోటికి చిక్కిన అఘోరాని కసిగా అదుముతూ నేలమీదపడిన మొసలి అంతటితో వదలకుండా గిరుక్కున తిరిగి తన తోకను లేపి అగ్నివేశాచార్యుని తలమీద మోదింది. బలమైన ఆ దెబ్బ తగలగానే "హే ద్వారకాధీశా ప్రభూ" అంటూ బిగ్గరగా అరిచి స్పృహ తప్పాడు అగ్నివేశాచార్యుడు.

సమీపంలోని భీష్మనారాయణ పరుగు పరుగున వచ్చి ఆయన్ని పొదివి పట్టుకొని పక్కకు తీసుకెళ్ళి సోఫాలో పడుకోబెట్టాడు.

ఒక్కసారిగా బీభత్సమైపోయిందా ప్రాంతం. అగ్ని వేశాచార్యుడు కూలిపోవడంతో పెద్దగా అరిచారంతా. ఇంతలో మిత్రవింద ఎర్రబడిన కళ్ళతో మొసలివంక చూసింది. మొసలి నోటచిక్కి విలవిల్లాడుతున్నాడు అఘోరా.

అగ్నివేశాచార్యుని కాపాడ్డంకోసం తన ప్రాణం అడ్డం వేశాడాయన. మొసలి తన నోటిని బిగించి అటూ ఇటూ గింజుతూ మిత్రవింద వంక చూసింది. ఇక ఉపేక్షించలేక పోయింది మిత్రవింద.

మొసలి రూపంలో వచ్చింది కలిపురుషుడని ఆమెకర్థమైపోయింది. యుగాధిపతి అనే గౌరవంతో ఉపేక్షించిన ఫలితం ఊహించని దారుణాలకు కారణమైంది. ఒక్కసారి తన కనులు మూసి– తెరిచి చూసింది మొసలి వంక. అంతే– ఒక్కసారి మొసలి శరీరం మీద భగ్గున ఎగశాయి మంటలు.

మంటలు ఉధృతికి అదిరిపడి నోట ఉన్న అఘోరా శరీరాన్ని అవతలికి విదిల్చికొట్టి నేలమీద పొర్లిగింతలు పెట్టింది మొసలి. అయినా మంటలు ఆరకపోగా అవి తన శరీరాన్ని కాల్చేస్తుండగా బాధతో ఆక్రందనలు చేస్తూ మొసలి అదృశ్యమై ఆ స్థానంలో కలిపురుషుడు ప్రత్యక్షమయ్యాడు.

"అమ్మా... మిత్రవిందా... తప్పయిపోయింది. క్షమించు తల్లీ. ఈ మంటల బారినుండి నన్ను కాపాడు" అనరిచాడు. మిత్రవింద ఎర్రబడిన కళ్ళతో ఉరిమిచూసింది.

"కలిపురుషా! యుగాధిపతివని విర్రవీగుతూ అధికార దుర్వినియోగం చేశావు. భక్త సజ్జనులను, ధర్మపరులను బాధించావు. ఇక్కడి వరకు వచ్చి బీభత్సం సృష్టించావు. నీ తప్పులు క్షమింపరానివి అయిననూ నిన్ను ఇంతటితో విడిచి పెడుతున్నాను" అంటూ కుడిచేయి గాలిలోకి లేపింది.

అంతే–కలిపురుషుని చుట్టివున్న పెనుమంటలు క్షణంలో అదృశ్యమయ్యాయి. కాని కలి ఒంటినిండా కాలిన గాయాలు కన్పిస్తున్నాయి.

ఆ బాధను ఓదార్చుకొంటూ– "ఈ గాయాల బాధ తాళజాలకున్నాను. వీటిని పోగొట్టి ఉపశమనం కలిగించు" అని వేడుకున్నాడు.

"అసాధ్యము" అంది మిత్రవింద.

"నేటినుండి వేయి సంవత్సరములవరకు నీకా గాయముల బాధ తప్పదు. ధర్మసంస్థాపన జరిగిన ప్రతిసారీ నీ అధర్మాన్ని, అవినీతిని తిరిగి పెంచుకునే ప్రయత్నాలు చేయాలిగాని ఇలా ధర్మాత్ములు, పుణ్యాత్ముల ఉసురు తీయాలని చూడకూడదు.

నీ అరాచకానికిదే శిక్ష. రానున్న వేయి సంవత్సరాల కాలమంతా ఈ కాలిన గాయాలతో నన్ను తలచుకొని బాధపడుతూ ఉండు. పొమ్ము" అంది.

మిత్రవింద మాటలు కొరడా ఝళిపించినట్టు ఆ గదిలో మారుమోగాయి. అంతటి కలిపురుషుడే మిత్రవింద ముందు ఏమీ చేయలేని అశక్తుడై తలవంచుకొని అదృశ్యమయ్యాడు.

కొందరింతే తాము చెడిందే గాకుండా ఇతరుల్ని చెడగొడుతుంటారు. తనవల్ల ఏమీకాదని మరిడి సోమయ్య మహాయాగం చేసి కలిపురుషుని ప్రేరేపించిన ఫలితం, ఇప్పుడా కలిపురుషునికే శాపమైంది.

ఈలోపల– మొసలి నోటినుండి బయటపడిన కొద్దిక్షణాలలోనే తన యోగశక్తితో తిరిగి పునర్జీవితుడయ్యాడు అఘోరా. నిజానికి ఆ విపత్కర పరిస్థితిలో అఘోరా అడ్డుపడకపోతే అగ్నివేశాచార్యుడు ఆ క్షణంలోనే మొసలి రూపంలోని కలికి బలైయుండేవాడు. లేచి తన మంత్రదండం అందుకొని అగ్నివేశాచార్యుని ముందుకొచ్చాడు అఘోరా.

ప్రవాహంలా దూసుకొచ్చిన సముద్రజలమంతా అప్పుడే ఆ గదిలోంచి బయటికి వెళ్ళిపోయింది. కాని అందుకు సాక్ష్యంగా అక్కడున్నవారంతా తడి

దుస్తుల్లో అలాగే ఉన్నారు. శుశ్రుత పరుగునవెళ్ళి చరక్ చేయి అందుకుని లేపింది. అతటి నుదుట గాయమై రక్తం చెమరుస్తుంటే తన పైట చెంగు చించి కట్టుకట్టింది.

* * * * *

లేచి వడివడిగా జేజితాతవద్దకొచ్చాడు చరక్. ఆయన మూసిన కన్ను తెరవడంలేదు. ఎంత పిలిచినా స్పృహలోకి రావడంలేదు.

అందరూ ఆందోళనచెందుతున్నారు. ఇదంతా చూస్తున్న డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడికి మిత్రవింద, జేజితాతగారి పేరుమీద ద్వారకాధీష్ ముందు హోమం జరిపించమని ఎందుకు చెప్పిందో ఇప్పుడర్థమైంది. మిత్రవింద వంక చూశాడు. ఆమె బాధగా అగ్నివేశాచార్యుని చూస్తూ నిలబడుంది.

చరక్‌కి జరిగిందంతా చూస్తుంటే చాలా బాధగా ఉంది. కలిపురుషుడు తనను ద్వారకవద్దే అంతం చేయాలని చూశాడుగాని ద్వారకాధీశుని దయవలన ప్రమాదం తప్పి నిరపాయంగా ఇక్కడికి చేరుకోగలిగాడు. కాని కాలనాళిక మందసం ధ్వంసంగావటంతో ఇక శాశ్వతంగా ద్వారకాపురికి మార్గం మూసుకు పోయింది.

దాని నిర్మాణానికి జేజి తాతగారు పడిన తపన, శ్రమ తలుచుకొంటే బాధగా ఉంది.

మామూలుగా అయితే కలిపురుషుని అంతు చూసుండేవాడాయన. కాని ఎప్పుడైతే కాలనాళిక మందసం ధ్వంసమైందో అది చూసి ఆయన వేదనాభరితుడై చేష్టలు దక్కివుండగా మొసలి దాడికి గురయ్యాడు.

"జేజిగారూ, కళ్ళు తెరవండి. వేటికోసం మీరింత కాలం తపించారో వాటిని తీసుకొచ్చాను జేజితాతయ్యా. ధర్మసంస్థాపన చేయాలి. కళ్ళు తెరవండి" భుజాన ఉన్న చేతిసంచిని తీసి చూపిస్తూ అగ్నివేశాచార్యుని పక్కన కూర్చుని దుఃఖిస్తున్న చరక్‌ను చూస్తుంటే అందరికీ బాధ కలిగింది.

ఎవరు మాత్రం అతడ్ని ఓదార్చగలరు. మరోపక్క శుశ్రుత కన్నీళ్ళతో వెక్కి వెక్కిపడుతూ జేజితాతకు స్పృహ రావటానికి సేవలు చేస్తోంది. అఘోరా ముందు కొచ్చి చరక్ భుజం మీద చేయి వేశాడు. "నాయనా చరక్. ఆచార్యులవారు కోమాలోకి వెళ్ళిపోయారని నాకు సందేహంగా ఉంది. అమ్మా మిత్రవిందా, నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగాడు.

"భయపడాల్సిందేమీ లేదనుకుంటాను, అక్కడ ద్వారకాధీశుని ముందు తాతగారిపేరిట హోమం నిర్విఘ్నంగా సాగుతోంది. మనం వెంటనే ఈ చోటు ఖాళీ చేసి ఎస్టేట్‌కి వెళ్ళిపోదాం. ద్వారకాధీశుడే అంతా చూసుకుంటాడు" అంది మిత్రవింద.

* * * * *

సరిగ్గా ఇదే సమయంలో అక్కడికి– శంభులింగ మహాపాత్రో అతడి అనుచరులు రంగ ప్రవేశం చేశారు. అగ్నివేశాచార్యుడు ఉలుకుపలుకు లేకుండా పడి ఉండటంతో ఆ హడావుడిలో ఉన్నందున శత్రువులు లోనకొచ్చే వరకూ ఎవరూ వాళ్ళని గమనించలేకపోయారు. వచ్చినవాళ్ళ చేతుల్లో మెషిన్‌గన్లు, రివాల్వర్లు ఉన్నాయి.

"హలో సరిగ్గా సరైన టైముకే వచ్చినట్టున్నాను. నాక్కావలసిందిచ్చేస్తే మా దారిన మేం వెళ్ళిపోతాం. త్వరగా ఇచ్చేస్తే మంచిది" అన్నాడు శంభులింగ మహాపాత్రో, అతడి చేతిలో రివాల్వరు నిగనిగలాడుతూ చరక్‌వైపు గురిపెట్టి ఉంది.

ఈ కొత్తమలుపు ఏమిటో అర్థంకాగ షాక్ తిన్నారంతా. "ఎవరు నువ్వు? ఎక్కడికొచ్చి ఏం మాట్లాడుతున్నావో అర్థమవుతోందా?" ముందుకొస్తూ విసుగ్గా అడిగాడు డాక్టర్ పిల్లా గోవిందపాత్రుడు.

"నాకర్థమవుతోంది డాక్టర్‌గారూ. మీకే నేను అర్థంగావటంలేదు. నేనెవరో మీకన్నా మీతో చేతులు కలిపిన అఘోరాకి బాగా తెలుసు. ఇంకా ఇక్కడున్న జర్నలిస్టు భీష్మనారాయణకి తెలుసు. చెప్పింది విని వెంటనే ద్వారక నుంచి చరక్ తెచ్చిన వస్తువుల్ని నా అధీనం చేయండి.

లేదంటే మీరంతా ఛస్తారు. మా ఆయుధాలకి దయాదాక్షిణ్యాలు ఉండవు" అంటూ వికటంగా నవ్వాడు శంభులింగ మహాపాత్రో.

ఆ మాటలు వింటూ– కోపంగా ముందుకొచ్చాడు అఘోరా. "శంభులింగ మహాపాత్రో. నిప్పుతో చెలగాటమాడుతున్నావ్. నా గురించి తెలిసీ సాహసిస్తున్నావ్. ప్రాణాలు దక్కాలంటే వెంటనే మీ దారిన వెళ్ళిపోండి" అంటూ హెచ్చరించాడు.

"ఏంటి? బెదిరిస్తున్నావా?" అంటూ పెద్దగా నవ్వాడు శంభులింగ మహాపాత్రో.

ఈలోపల చరక్ దగ్గరకు పిలిచి తన భుజానున్న సంచి తీసి మిత్రవింద కిచ్చాడు. "మిత్రా నా మనసు బాగాలేదు. వాళ్ళ సంగతేమిటో చూడు" అన్నాడు చరక్.

మిత్రవింద సంచి తెరిచిచూసింది. లోన పట్టువస్త్రంలో చుట్టిన పాంచజన్య శంఖం, మురళి, శిఖిపింఛం భద్రంగా ఉన్నాయి. సందేహం వచ్చి చరక్ వంక చూసింది మిత్రవింద.

"అలా చూడకు... శమంతకమణి, కన్నయ్య కిరీటాలను చేజార్చుకున్న అభాగ్యుణ్ణి, మనకివే ప్రాప్తం" అన్నాడు బాధగా చరక్.

"ఇందుకోసం బాధపడాల్సిన పనేముంది. ఇవి చాలవా?" అంటూ వెనుతిరిగింది మిత్రవింద.

"ఇదిగో ద్వారక అమ్మాయ్. చరక్ తెచ్చినవన్నీ ఆ సంచిలోనే ఉన్నట్టున్నాయి. ఆ సంచి ఇలా ఇచ్చెయ్. వెళ్ళిపోతాం. త్వరగా" అనరిచాడు మహాపాత్రో.

మిత్రవింద కోపంగా చూసింది. "ఏరా... మీకు బతకాలని లేదా?" అడిగింది మిత్రవింద.

"ఎందుకు లేదూ? బతకడానికి డబ్బు కావాలి తల్లీ. ఆ డబ్బు కోసమే ఈ పాట్లు. అనవసరంగా మిమ్మల్ని చంపిన పాపం నాకక్కర్లేదు. ఆ సంచి ఇచ్చెయ్ చెప్తున్నాను" అన్నాడు మహాపాత్రో.

"ఇవేమిటో నీకు తెలుసా? పవిత్రమైన ఈ వస్తువుల్ని తాకే అర్హత నీలాంటి పాపికి ఉందనుకుంటున్నావా?" అడిగింది మిత్రవింద.

"ఊరుకోవమ్మా. పాపం లేదు, పుణ్యంలేదు. అంతా డబ్బే ముఖ్యం"

"అలాగా. ఈ శంఖం ఊదితే మీరంతా ఛస్తారని తెలుసా?" అడిగింది మిత్రవింద.

"ఏదీ. శంఖు ఊదితే ఛస్తారా. బెదిరిస్తున్నావా. ఊదు చూస్తాను"

ఈ సంభాషణ జరుగుతుండగానే అటునుంచి అప్పుడే మరిడి సోమయ్య, వాడి మాంత్రిక సహచరుల బృందం గుంపుగా లోనకొస్తూ కన్పించారు.

ఇక ఆలస్యం చేయలేదు మిత్రవింద. సంచిలోంచి పాలకన్నా తెల్లనిది స్వర్ణనగిషీలు, రత్నమాణిక్యాలు పొదిగిన పాంచజన్యశంఖాన్ని బయటికి తీసింది.

ఒక్కసారి మనసారా ద్వారకాధీశుని స్మరించుకొని శంఖాన్ని నోటివద్ద ఉంచి పూరించింది.

ఆ శంఖం నుండి మొదట పెనుతుపానులాంటి శబ్దం ఆరంభమై ఆ వెంటనే చెవులు చిల్లులు పడేంతగా శంఖనాదం వెలువడి దిక్కులు పిక్కటిల్ల జేసింది. అంతే– ఆ శంఖనాదం విన్న తక్షణమే ముందుగా గుండెచేత్తో పట్టుకుని కుప్పకూలిపోయాడు శంభులింగ మహాపాత్రో. తర్వాత ఒక్కరొక్కరుగా అతడి మనుషులూ నెత్తురు కక్కుకొంటూ విరుచుకుపడి ప్రాణాలు వదలసాగారు. మిత్ర విందు శంఖం పూరిస్తూనే వుంది. లోనకి వస్తున్న మాంత్రిక బృందంలో మరిడి సోమయ్య, మరికొందరు నడుస్తూనే ప్రాణాలు వదిలి విరుచుకుపడిపోయారు. పరిస్థితి చూడగానే చెవులు మూసుకొంటూ మిగిలిన వాళ్ళు వెనుతిరిగి కకావికలై బయటకు పరుగులు తీశారు. పరుగులు తీస్తూనే ఒక్కొక్కరే కుప్పకూలిపోయారు.

రెండే రెండు నిముషాలు. ముగిసిపోయిందంతా. దుర్మార్గులు, స్వార్థపరులు క్షణాలమీద నాశనమైపోయారు. ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన భీష్మనారాయణ తనూ భక్తితో ద్వారకాధీశుని స్మరించుకున్నాడు. దుష్టశిక్షణ జరిగి పోయిందక్కడ.

కాని స్థావరంలో ఆవరించుకున్న విషాదం తొలగిపోలేదు. అగ్ని వేశాచార్యుడి పరిస్థితి ఎవరికీ అర్థం కాలేదు. డాక్టర్ పిల్లా గోవింద పాత్రుడూ ఒక డాక్టర్‌గా తన ప్రయత్నం తను చేశాడు.

అయినా అగ్నివేశాచార్యుని పరిస్థితిలో మార్పులేదు. వెంటనే బయలు దేరడం మంచిదనిపించింది అందరికీ. ఆ స్థావరంలో ఇక తమకు పనిలేదు. అవసరమైన సామాను అంతా వాహనాల్లోకి సర్దేశారు.

అగ్నివేశాచార్యుని కారులోకి చేర్చారు. మిత్రవింద, శుశ్రుత, అఘోరాలతో ముందుగా చరక్ కారులో బయలుదేరగా మిగిలిన వాహనాలు ఆ కారును అనుసరించాయి.

జర్నలిస్ట్ భీష్మనారాయణ చివరిగా తన బైక్ స్టార్ట్ చేశాడు. నిర్మానుష్యమైన స్థావరంలో ఎంతో ఆర్భాటంగా వచ్చిన శంభులింగ మహాపాత్రో, మరిడి సోమయ్యలు వాళ్ళ మనుషుల శవాలు మాత్రం మిగిలాయి. ఆశ్చర్యకరమైన

విషయమేమంటే వాహనాల్లో ప్రయాణిస్తున్న చరక్ బృందానికి, మరిడి సోమయ్య శిష్యులతో బాటు మరికొందరు దూరంగా పారిపోతూ కన్పించడం.

* * * * *

ఎస్టేట్ భవంతి.

ద్వారకాధీష్ మందిరం. అక్కడ హోమం నిర్విఘ్నంగా కొనసాగుతూనే వుంది. రంపచోడవరం అడవులనుంచి తిరిగిరాగానే అగ్నివేశాచార్యుని జాగ్రత్తగా తీసుకెళ్ళి మందిరంలోని ద్వారకాధీష్ ముందు పరుండజేశారు.

ఆయన పరిస్థితి చూడగానే ఎస్టేట్‌లో విషాదం అలుముకుంది. అగ్నివేశాచార్యుని కోడలు దేవమ్మగారి దుఃఖానికి అంతులేదు. ఓ పక్క హోమం సాగుతూండగానే ఇటు రామాచారి, ఆయన కొడుకు నీలకంఠాచారి ఇరువురూ ద్వారకాధీష్‌కు ప్రత్యేకపూజలు ఆరంభించారు అగ్నివేశాచార్యుని క్షేమం కోసం.

అయినా, మూడు రోజులు అగ్నివేశాచార్యుని పరిస్థితిలో మార్పులేదు. ఈ లోపల భీష్మనారాయణ హెచ్చరిక అంటూ పత్రికల్లో ఇచ్చిన తొలి ప్రకటన ఆంధ్రరాష్ట్రం ఒక్కసారిగా ఉలికిపడేలా చేసింది.

ఆ ప్రకటన ఇలా ఉంది. "హెచ్చరిక : దేశంలోని ధర్మం తప్పిన దగాకోరులు, డబ్బే లోకం అనుకునే దురాశాపరులు, భారతదేశపు ప్రజలు పన్నుల రూపంలో కట్టే డబ్బుని ఎంతో వృధా చేస్తూ మరెంతో దిగమింగే నీచ రాజకీయ నాయకులు, పాపకార్యాలతో ప్రజల్ని పీడించే దుర్మార్గులు, వారు వీరనిగాక న్యాయధర్మాలు పాటించని వారందరికీ హెచ్చరిక."

"ఓ పాపాత్ములారా కళ్ళు తెరవండి. ఇకనయినా మీ పద్ధతి మార్చుకొని ధర్మాన్ని పాటించండి. అక్రమార్జనను, అవినీతి సంపాదనను పేదసాదలకు పంచి పెట్టి ధర్మమార్గానికి వెంటనే రండి. రక్షింపబడతారు. లేదంటే ఇక మీ కాలం మూడినట్టే. దేశంలో ధర్మ సంస్థాపన ఆరంభమైంది.

అది మీ వరకు రాకముందే మారిపోండి. లేదంటే త్వరలోనే మీకు మరణం తప్పదు. కుక్క చావుతప్పదు. ధర్మదేవత. ధర్మదేవత పేరుమీద వెలువడిన ఈ హెచ్చరిక దేశంలో పెద్ద దుమారం లేపింది. నమ్మే వాళ్ళు నమ్ముతున్నారు.

నమ్మనివాళ్ళు కొట్టి పారేస్తున్నారు. ఇదిలా ఉండగా– ఇక్కడ ద్వారకాధీష్‌కు చేస్తున్న పూజలు ఫలించి మూడో రోజున కోమానుండి బయటపడి చిన్నగా కళ్ళు తెరిచాడు అగ్నివేశాచార్యుడు. చరక్, మిత్రవిందలు ఆయన్ని లేపి కూర్చో బెట్టారు. శుశ్రుత అందించిన పాలు తాగాడు.

ఆయన కోలుకున్నాడని అంతా సంతోషించారు. కాని ఆయన పరిస్థితి దీపం ఆరిపోయేముందు వెలుగు లాంటిదని మిత్రవిందకే తెలుసు.

అగ్నివేశాచార్యుని కోరికమీద ఆయన్ని మందిరం నుంచి ఎస్టేట్ భవంతికి చేర్చారు.

చరక్ ఉత్సాహంగా తను తెచ్చిన వస్తువుల్ని అగ్ని వేశాచార్యునికి చూపించాడు. ఆయన కోమాలోకి వెళ్ళాక జరిగిందంతా వివరించాడు.

అగ్నివేశాచార్యుడు కృష్ణపరమాత్మ శిఖిపించాన్ని, మురళిని, పాంచజన్య శంఖాన్ని భక్తితో కళ్ళకద్దుకొని వాటిని తిరిగి చరక్‌కి ఇచ్చాడు. మిత్రవిందని దగ్గరకు పిలిచాడు. శుశ్రుత పక్కనే ఉంది.

"నాయనా చరక్. నేను పోయినా నా ఆశయాన్ని సాధించడానికి మీరున్నారు. ఇంతకన్నా నాకేం కావాలి. ఈ శిఖిపించాన్ని దర్శించినవారికి ఏవిధమైన గ్రహపీడలు, ఈతిబాధలు ఉండవు. ద్వారకాధీశునికి నా పేర ఒక మణిమయరత్న కిరీటం చేయించి ఆ కిరీటంలో ఈ నెమలి పించాన్ని ఉంచి ద్వారకాధీశునికి సమర్పించండి.

ఇక ఈ శంఖం మహిమ ఏమిటో ఇప్పటికే మీకు అర్థమైంది. ఈ మురళి... ఈ పిల్లనగ్రోవినాదం వినబడినంతమేర గోసంపద వృద్ధి అవుతుంది. గోవులు ఉన్నచోట సకల సంపదలూ ఉంటాయి.

నాయనా చరక్. మన ఊరు బాగుంటే చాలదు మన రాష్ట్రం బాగుండాలి. కాబట్టి నీవు ఈ శంఖం, మురళి తీసుకుని ఒక సంవత్సరం పాటు దేశసంచారం చేయాలి. ఆ పైన ప్రపంచయాత్ర చేయాలి.

శంఖ నాదంతో అధర్మాన్ని రూపుమాపి తిరిగి ధర్మాన్ని నెలకొల్పాలి. నీకు రక్షణగా మిత్రవింద, అఘోరాలు నీవెంట ఉంటారు.

శుశ్రుత ఆధ్వర్యంలో మిగిలినవాళ్ళు ఇక్కడ ఆలయనిర్మాణం పనులు చూసుకుంటారు"

"జేజిగారూ... ఇప్పుడీ అప్పగింతలు అవసరమా... ముందు మీ ఆరోగ్యం చక్కబడనీయండి" అంటూ

అగ్నివేశాచార్యుని మాటలకు అడ్డువచ్చాడు చరక్. అగ్నివేశాచార్యుడు పేలవంగా నవ్వాడు.

"పిచ్చోడా. పండుటాకు ఎప్పుడో ఒకప్పుడు రాలిపోక తప్పదుగదా. పండుటాకులాంటివాణ్ణి. రాలిపోతే ఆశ్చర్యం ఏముంది?" అన్నాడు.

ఆ మాటలకు జేజితాత చేతులందుకుని పసివాడిలా ఏడ్చేశాడు చరక్. "మీరలా అనకండి జేజితాతగారూ. మేం తట్టుకోలేం" అన్నాడు.

ప్రేమగా మునిమనవడి జుత్తు నిమిరాడు అగ్నివేశాచార్యుడు. "ఏరా... నేను చనిపోతానని బాధగా ఉందా? బాధ ఎందుకురా. మళ్ళీ ఎప్పుడో మన వంశంలోనే పుడతాను. చావుపుట్టుకలు సహజమేగదా. సుదీర్ఘమైన నా జీవన యాత్రలో చివరిమజిలీలో చివరిఘట్టంలో ఉన్నాను.

ఈ జీవనయాత్ర ముగించుకొని ఆ స్వామిని చేరటానికి అనంతయాత్రకు సిద్ధం కావాలి.

అమ్మా మిత్రవిందా. మా తల్లి. ద్వారకనుంచి మా కోసం వచ్చిన దేవతవు. ఏదీ ఆ మురళి...

మన ప్రభువు ఆ ద్వారకాధీశుని వేణువు అందుకుని ఒక్కసారి మోహనరాగం ఆలపించు. ఆ స్వామికి ఎంతో ప్రియమైన రాగం మోహనరాగం" అంటూ కళ్ళు మూసుకున్నాడు అగ్నివేశాచార్యుడు.

మిత్రవింద వేణువు అందుకుంది.

ఆ కృష్ణమూర్తి తన పెదవులుంచి పవిత్రమైన తన వేళ్ళతో వాయించిన మురళి ఇప్పుడు మిత్రవింద మూలంగా ఆ మూగబోయిన వేణువు తిరిగి అద్భుతంగా మోహనరాగం ఆలపించసాగింది.

అంతా తన్మయులై వినసాగారు.

*　　*　　*　　*　　*

అగ్నివేశాచార్యుడు ఆనందంతో పులకించి ఆ మురళీనాదం వింటూ మూసిన కళ్ళు తెరవలేదు. మిత్రవింద వాయిస్తున్న వేణుగానం ఆగిపోయింది. కాని అగ్నివేశాచార్యుని కనులు విచ్చుకోలేదు.

వేణునాదం వింటున్న తన్మయంలోనే ఆ మహనీయుడు తనువు చాలించి తన అనంతయాత్రకు వెళ్ళిపోయాడు. అంతే... ఒక్కసారిగా పెను విషాదం అలుముకుందక్కడ.

అగ్నివేశాచార్యుని మరణంతో ఆధ్యాత్మిక ఆయుర్వేద ప్రపంచం ఒక ధృవతారను కోల్పోయినట్టయిందని పత్రికలు తమ సంతాపంలో శ్లాఘించాయి.

తాతగారి మరణవార్త వినగానే అమెరికానుంచి చరక్ తల్లిదండ్రులు బయలుదేరి ఇండియా వచ్చేశారు. అగ్నివేశాచార్యుని భౌతికకాయాన్ని మున్నలూరి వారి అగ్రహారం తీసుకెళ్ళి అక్కడే అంతిమ సంస్కారాలు, కార్యక్రమాలు అన్నీ ఎంతో ఘనంగా జరిపించారు. ఆ పనులన్నీ ముగిశాక చరక్ ఇక తాతగారి ఆశయాన్ని సాధించడానికి ధర్మసంస్థాపనకి నడుం బిగించాడు.

ఒక శుభముహూర్తంలో ప్రత్యేకమైన బస్సులో చరక్, మిత్రవింద, అఘోరాలు బయలుదేరారు. ఊరూరాతిరిగి శంఖం ఊదుతుంటే దుష్టులు, దుర్మార్గులు ఎక్కడికక్కడ రాలిపోసాగారు.

చరక్ యాత్రను అడ్డుకోవాలని స్వార్థపరులు చేసే ప్రయత్నాల్ని మిత్రవింద, అఘోరాలు ఎక్కడికక్కడ భగ్నంచేస్తూ యాత్రను జయప్రదం చేయసాగారు. శుశ్రుతతోబాటు దేవమ్మగారు కూడా ఇప్పుడు ఎస్టేట్ భవంతికి వచ్చి అక్కడి గుడిపనులు పర్యవేక్షింపసాగారు.

ఇప్పుడు అందరికీ ఆవిడే పెద్ద దిక్కు.

చరక్ ధర్మసంస్థాపన అలా అలా సాగిపోతూనే ఉంది. ఆ విశేషాల్ని జర్నలిస్ట్ భీష్మనారాయణ ఎప్పటికప్పుడు పత్రికలను కవర్ చేస్తున్నాడు.

మీడియాలో ఈ ధర్మ సంస్థాపన ఒక ముఖ్యాంశమైపోయింది. దేశంలోనే కాదు దేశం బయటా చరక్‌కి అభిమానుల సంఖ్య నానాటికి పెరిగిపోసాగింది. చరక్ ధర్మ సంస్థాపన యాత్ర అలా కొనసాగుతూనే ఉంది.

యాత్ర ముగిసేనాటికి ప్రపంచజనాభా పది శాతానికి తరిగిపోయి ఒక నూతన ప్రపంచం, ఒక ధర్మ లోకం ఏర్పడుతుందని ఆశిద్దాం.

-: అయిపోయింది :-

Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com